Y:4515mN 7899
35H0.13
Grihalakshmi

Y:4515mN
35H0.13

7899

SHRI JAGADGURU VISHWARADHYA JNANAMANDIR
(LIBRARY)
JANGAMAWADIMATH, VARANASI

Please return this volume on or before the date last stamped
Overdue volume will be charged 1/- per day.

REGD. NO. M-2357
1ST MARCH 1940



VOL. 13
NO. 1

సినిమా నటీమణులు

ఏమి చెప్పెదరు

"ఫిలింలో ఆక్టు చేయునపుడు, అలసట వచ్చినట్లయితే నేను తేనీరు తప్పక త్రాగెదను" అని హిందూదేశపు గొప్ప ఫిలింస్టారు కానన్ దేవి చెప్పుచున్నారు. తేనీరు త్రాగే విషయమునుబట్టి కానన్ దేవి మిస్ జోన్ క్రాఫోర్డు ఒకేమాదిరిగానున్నారు. అయితే జోన్ క్రాఫోర్డు ఫిలింలోగాకుండ బయటకూడ తేనీరు త్రాగును. మీరు కానన్ దేవినైన లేక జోన్ క్రాఫోర్డునైన, మెచ్చుకున్న వాళ్ల అందమునకు కారణమైన తేనీరును మాత్రము మరవకుడు.

నటీమణులందరు మెచ్చుకొనునది హిందూదేశపు టీ

ఇండియన్ టీ మార్కెట్ ఎక్స్‌పాన్షన్ బోర్డువారిచే ప్రకటింపబడినది

IK 130

గృహలక్ష్మి

స్త్రీల సచిత్ర మాసపత్రిక

సంపాదకుడు
డాక్టరు కె. యస్. కేసరి.

GRIHALAKSHMI

LADIES' TELUGU MONTHLY

మార్చి 1940

సంపుటము ౧౩ సంచిక ౧

SRI JAGADGURU VISHWARADHYA
JNANA SIMHASAN JNANAMANDIR
LIBRARY
Jangamawadi Math, Varanasi
Acc. No. 7899

గృహలక్ష్మి

Y:4515mN
35H0.13

సాలుచందా మొదలగునవి

ఈసచిత్రమాసపత్రిక సాలుచందా రు. 3. అర్ధ సంవత్సరపుచందా రు. 1-8-0 అంతకుతక్కువకాలపరిమితికి చందాపద్ధతి లేదు. విడికాపీ రు. 0-4-0 అణాలు. చందాదారులు ఏమాసమునుండియైన ప్రారంభము చేయవచ్చును. విడికాపీలు వలయువారు వానివిలువ మేరకు తపాలబిళ్లలు పంపవలయును. వీ. పీ. పద్ధతి వ్యయమూలకము. బర్మాకు రేట్లు ప్రత్యేకము.

ప్రకటనలు

ముఖ్యముగా స్త్రీలకందీయవలసినవస్తువులనుగూర్చి ప్రకటించుట కీపత్రిక ఎంతయు అనువైనది. ప్రకటన ఛార్జీలు ప్రతిమాసము ముందుగానే చెల్లింపవలయును. కాలుపుటకు తక్కువయైన ప్రకటనలు చేకొనజాలము. రేట్లకొఱకు వ్రాయునది.

ఏజెంట్లు

వేఱొకపుటయందు మాకు ఏజెన్సీలుగలతావులు ప్రకటింపబడినవి. ఇతరతావులయందు మాకు ఏజెంట్లు కావలయును. వివరములకువ్రాయునది.

వ్యాసములువ్రాయువారికి

వ్యాసముల ముఖ్యాశయము స్త్రీ జనాభ్యుదయమై యుండవలెను. అవి సంగ్రహముగ నున్న శీఘ్ర ప్రచురణకు వీలగును. ఒకేప్రక్క సిరాతో స్పష్టముగ తప్పులులేక వ్రాయవలెను. భాష గ్రాంథికముగాని, వ్యావహారికముగాని కావచ్చును; రెండును కలిపి వ్రాసిన అంగీకరింపబడవు. వ్యాసముల ప్రకటించుటలో సంపాదకులకు సర్వహక్కులు గలవు. ప్రకటింప నంగీకరింపబడినపుడు మాత్రము రచయితల కట్లు తెలుపబడును. ప్రచురింపబడని వ్యాసములకు తపాలా బిళ్లలు పంపిన వాపసు చేయబడును. విమర్శనార్థము పంపు గ్రంథములు రెండుప్రతులు పంపవలెను. రిప్లై కార్డు వ్రాసిననే బదులివ్వబడును.

సంచికలుచేరనిచో

సంచికలుచేరనిచో ఆయామాసములందు వెంటనే మాకు తెలుపవలయును. ప్రతిమాసము 7-వ తేదీతరువాత చేరలేదనివ్రాయుచో తిరుగకాపీలుపంపజాలము. చిరునామామార్పును తెలుపకుండుటచే కాపీలుచేరనివారికిని తిరుగ పంపజాలము. సంచికలు చేరనివారు తమతమ పోస్టాఫీసులలో కంప్లెయింటును చేయునది.

చిరునామామార్పు

చిరునామాయందు మార్పుఉండుచో 1-వ తేదికి 10 దినములుముందుగనే తెలుపవలయును. ఇట్లు తెలుపనిచో కాపీలు తిరుగ పంపజాలము.

చందాముగిసిన

చందా ముగిసినతోడనే ఆవిషయము వారికి ఆయామాసములయందు తెలుపబడును. ఈ సూచన చూచి తమచందాధనమునుపంపి గృహలక్ష్మిని యథారీతిని పోషింప చందాదారులను ప్రార్థింతుము. చందాదారులుగనుండ ఇష్టములేనిచో ఆసంగతి వెంటనే తెలుపగలరు. మనియార్డరుపంపుటగాని, చందాదారులుగనుండ ఇచ్ఛగింపమని లేఖాముఖమున తెలుపుటగాని చేయనిచో తరువాతసంచిక వీ. పీ. గా పంపగలము.

ముఖ్యమైన గమనింపు

చందాదారులుగ చేర్చుకొనుమని వ్రాయు ఉత్తరములు, బ్యాంకుచెక్కులు, మనియార్డర్లు, పోస్టలు ఆర్డర్లు, గృహలక్ష్మికిసంబంధించిన ఇతరమైన యావత్తు ఉత్తరములు డాక్టరు కే. యన్. కేసరి, ఎడిటరు గృహలక్ష్మి, రాయపేట, మదరాసు అను చిరునామాకే వ్రాయవలయునుగాని ఇతరవ్యక్తుల పేర ఎంత మాత్రము పంపకూడదు.


SUMANGALI
a B.N. REDDI - RAMNOTH - SEKAR PRODN.
a VAUHINI PICTURE
DISTRIBUTED by VAUHINI
STORY & SCREENPLAY. RAMNOTH
SONGS & DIALOGUE. RAGHAVACHARI
DIRECTION . . . B.N. REDDI
MUSIC DIRECTION. . NAGIAH
ART DIRECTION . . . SEKAR
[STUDIO: NEWTONE]
పూర్వాచార నిబద్ధమై నడచుకొను
సంఘమునకును అంతరాత్మకు వశుడై
వర్తించు మానవునకును వైరము...
నికృష్టమగు యదార్థములకును
ఉత్కృష్టమగు ఆదర్శములకును
పరస్పర సంఘర్షణము.
సుమంగళి
SEKAR

విషయసూచిక

1. స్వవిషయము 1
2. ఆశీస్సు—శ్రీ వాజపేయయాజుల రామసుబ్బారాయుడుగారు ... 4
3. శ్రీమతి చేబ్రోలు సరస్వతీదేవిగారు—శ్రీ కే. యన్. కేసరిగారు ... 7
4. గృహలక్ష్మి జయంతి మహోత్సవము 9
5. స్త్రీలు – భారతదేశము—శ్రీమతి పొణకా కనకమ్మగారు ... 17
6. నీతిసామెతలు—శ్రీమతి కోటదుర్గ సోమిదేవమ్మగారు... ... 20
7. ప్రేమ, భక్తి, జ్ఞానప్రసన్న పారిజాత ప్రసూనములు—శ్రీయుత ...
విం. అ. సూర్యనారాయణగారు 21
8. లలిత శపథం—శ్రీమతి దుగ్గిరాల వెంకటసుబ్బమ్మగారు ... 25
9. జీవయాత్రకుఁ దగిన నెచ్చెలివి నీవ—శ్రీమతి వాజపేయయాజుల మహాలక్ష్మిగారు 28
10. కళాకలాపము—కవితాకళ-శ్రీయుత గోనెల నరసింగరావుగారు ఎం.ఏ.బి.యల్. 29
11. ఆశీస్సు—శ్రీయుత కవికుమార మునగపాటి విశ్వనాధశాస్త్రిగారు ... 32
12. ఆశీస్సు—శ్రీయుత నండూరి ఈశ్వరంగారు 33
13. వివేకానందుని దృష్టిలో భవిష్యన్నారీ సమాజము ... ...
శ్రీయుత స్వామి పూర్ణానందగారు 34
14. ప్రబోధము—శ్రీమతి ఇనుగంటి సరస్వతీదేవిగారు 40
15. Messages and good wishes to 'Grihalakshmi' (ఆశీస్సు - సందేశములు) 41
16. సందేశము - సందేహము—శ్రీమతి రాజకుమారిగారు ఎం.ఏ. (క్యాంటబ్) 43
17. సమాధానము—శ్రీయుత గోనెల నరసింగరావుగారు ఎం.ఏ. బి.యల్ 44
18. ఆశీస్సు సందేశములు 48
19. భక్తి—శ్రీమతి ఆచంట సత్యవతమ్మగారు 50
20. ద్రవ్యనిర్మాణం—"వసంత" 51
21. శ్రీ రమణగురు స్తవము—శ్రీమతి పొణకా కనకమ్మగారు ... 55
22. శ్రీ రమణలీల 56
23. గృహలక్ష్మి జయంతి మహోత్సవము—శ్రీమతి చేబ్రోలు సరస్వతీదేవి కృతజ్ఞత 57
24. ఆశీస్సులు, అభినందనములు 65
25. సంపాదకీయములు 66
26. గృహలక్ష్మి జయంతి మహోత్సవము (ఆశీస్సులు) 69

త్రివర్ణ చిత్రములు :

'కవికలహంసి' శ్రీమతి చేబ్రోలు సరస్వతీదేవిగారు

గృహలక్ష్మి

స్వర్ణకంకణము

1940



'కవికలహంసి'

శ్రీమతి చేబ్రోలు సరస్వతీదేవిగారు

'కవికోకిల'

శ్రీమతి వి. రాధామణిగారు

గృహలక్ష్మీ జయంతి మహోత్సవము

1940

అధ్యక్షురాలు

శ్రీమతి గుమ్మిడిదల దుర్గాబాయమ్మగారు

గృహలక్ష్మీ స్వర్ణకంకణ గృహీత



'కవికలహంసి'

శ్రీమతి చేబ్రోలు సరస్వతీదేవిగారు

వైస్ ప్రెసిడెంటు, స్నేహలతాకవితాసంఘం, జటప్రోలు సంస్థానం.

సీ. సంగీతసాహిత్య సత్ప్రౌఢిమిఱఁగా దిక్కులఁ గడువన్నెకెక్కెనెవఁడు
నత్యంతభక్తితో నలరామచరితంబు గృతులల్లి యెవ్వండు కీర్తిఁగాంచె
సచ్చిదానందనిశ్చలచిత్తుఁడై గ్రాలి యెవ్వాడు ధరవీడి యేగెదివికి
యతిరాజ దాసవిఖ్యాత నామమెవండు గాంచెనో వాని శ్రీగర్భమందుఁ

గీ. బుట్టి సత్కీర్తివడసిన పుణ్యశాలి
సుగుణరత్నాకరుని బరిశుద్ధచరితు
భవ్యధీశాలి రాజగోపాలవరునిఁ
కరముఁబట్టితి సంతోషకలితనైతి.

సీ. దయమిఱ నెవ్వాఁడు దాతృత్వఖనియయి గణనీయమైన విఖ్యాతిఁగాంచె
సకలవిద్యలునేర్చి సభలలో నెవ్వాఁడు చతురత్వమునుజూపి ప్రతిభఁజెందె
గీతామృతముఁద్రావి కృతకృత్యతనుజెంది యెవ్వాడు జ్ఞానియై యేపుమీఱె
సౌభాగ్యగాంభీర్య సౌశీల్యవితతిచే నెవ్వాఁడు ధన్యుఁడై నివ్వటిల్లె

గీ. నట్టి శ్రీ రాజగోపాల న్యాయవాది
కతని కులసతి లక్ష్మ్యంబ యనఘచరిత
గర్భమందునఁ బుట్టితి ఘనతమిఱ
ధర 'సరస్వతి' యనుపేరఁ బరగుదాన.

—సరస్వతీ రామాయణము.



స్వ వి ష య ము

శా. నీ పద్యావళు లాలకించు చెవులున్ నిన్నాడు వాక్యంబులున్
నీపేరం బనిసేయు హస్తయుగముల్ నీమూర్తిపైఁ జూపులున్
నీపాదంబులపొంత మ్రొక్కు శిరముల్ నీసేవపైఁ జిత్తముల్
నీపై బుద్ధులు మాకునిమ్ము కరుణన్ నీరేజపత్రేక్షణా.

మ. హరికిం బట్టపుదేవి పున్నెముల ప్రోవర్థంపుఁ బెన్నిక్క చం
దురు తోఁబుట్టువు భారతీగిరిసుతల్ దోనాడు పూఁబోఁడి దా
మరలందుండెడి ముద్దరాలు జగముల్ మన్నించు నిల్లాలు భా
సురతన్ లేములువాపుతల్లి సిరియిచ్చున్ నిత్యకల్యాణముల్.

(శ్రీమదాంధ్రభాగవతము)

కనదంభోజనిభాస్యయై, కుసుమకోమలగాత్రయై, కల్యాణకళాస్వరూపిణియై కమనీయగుణ సంపద్విలసిత చారునేత్రయై, నవ్యయావనసురూపయై చెన్నొందు "గృహలక్ష్మి", ముగ్ధత్వమాధుర్యధుర్యమగు మురిపెపు దరహాసచంద్రికలతో సొంపునింపు నీ సంచికతో పదమూడవ సంవత్సరములో ప్రవేశించుచున్నది.

చిరుతప్రాయపు చక్కటులనుచాటుచు, చిన్నారిపొన్నారిచేష్టలను స్ఫురింపజేయుచు శైశవములో, ముద్దులు మూటగట్టు సుద్దులను సుదతుల కొసంగినది. పలువేడుకులతో గూడిన బాల్యంపువేషభాషల సౌరభ్యమును భామినీప్రపంచములో ప్రకాశింపజేసినది. ఇప్పుడీమె పడుచుప్రాయపు పోకడలతో భావగర్భిత భాషావిభూషణముల ప్రసరింప జేయుచు, పండితప్రవరుల ప్రస్తుతిసేసలను బడయగల్గుచు, స్వాతంత్ర్యాభిలాషాప్రపూరిత సమ్మోదసంభరితచిత్తయై యొప్పుచున్నది.

భాషాపరిచయప్రభూతమగు పడుచుదనపుబింకములను పొడసూపుచు, సిగ్గును సూచించుచు చిరునవ్వులొలయు సుందరవదనమును సారస్వతారాధకులకు జూపుచున్నది. సహజసౌందర్యగరిమకు ప్రత్యక్షనిదర్శనమగు సర్వాంగసౌష్టవమును సందీపింపజేయ గలుగుచున్నది. ఈ పత్రికాలలామ, తన నింతదనుక ప్రేమతో నాదరించి, ప్రశస్తమగు వ్యాసములతోడను పద్యరచనలతోడను పెంపువహింపజేసిన పెద్దలందరకును, పాఠక లోకమునకును కృతజ్ఞతా పూర్వకమగు అభివందనము లర్పించుచున్నది.

ఆంధ్రమహిళారత్నముల కనుంగుసోదరియై ఆంధ్రమహిళాభ్యున్నతి కొరకు సేవా సాధనమై యొప్పుచున్న "గృహలక్ష్మి" సుస్థిరముగ నిలిచియుండి, సత్కీర్తిగాంచ గల్గుటకు స్త్రీ పురుషులెల్లరి సాహాయ్యమును, ఆంధ్రులందరి ఆదరాభిమానములను అధికముగ నభిలషించుట సహజమేయగును.

మాతృభాషామాధుర్యమును ముదితల కెరింగించుచు, స్త్రీల సాంఘికాభివృద్ధికి వలయు సాధనములను తెలియపరచుచు, గృహపరిశ్రమలను ప్రోత్సాహించుచు, జాతీయ భావములను, దేశసేవాతత్పరతను స్త్రీలలో ప్రబోధించుచు, ఉవిదల ఉన్నత విద్యాపరిశ్రమ కుత్సాహపూరితమగు నుద్బోధ గావించుచు, స్త్రీ స్వాతంత్ర్యోద్యమమునకు చేదోడుగ సేవజేయుచు, సంసారజీవితసుఖమును సుదతులకు సమకూర్పగల సద్విద్యాదర్శములను ప్రచారమొనరించుచు, పండ్రెండేండ్లనుండి పాటుపడుచున్న "గృహలక్ష్మి" తన పురోభివృద్ధికై ప్రజాభిమానమును, గృహలక్ష్ముల ప్రేమాతిరేకమును కాంక్షించుచున్నది.

అశాంతియుతమగు ప్రపంచవాతావరణములో, అననుకూలములగు ఆర్థికపరిస్థితులలో నిట్టి పత్రికానిర్వహణము నవిచ్ఛిన్నముగ సాగింపగల్గు టెంతయు కష్టసాధ్యమనుట సర్వజనవిదితమగు విషయమైయున్నది.

లాభనష్టముల నిసుమంతయు సరకుగొనక, స్త్రీల శ్రేయస్సునే పరమావధిగ భావించి, స్త్రీల యభివృద్ధికిని, తద్వారా యావత్సంఘముయొక్క క్షేమమునకును, స్వార్థ

రాహిత్య భావములతో నింతవరకును ప్రజాసేవను, భాషాసేవను చేయగల్గిన "గృహలక్ష్మి" తన భావిభాగ్యోన్నతికై విశేషపాఠకవర్గమును, అభిమానుల అధికాదరమును, చందాదారుల హెచ్చుసంఖ్యను ఆశించుట అందరును అనుమతింపదగిన అభిమతమేయగును.

పండ్రెండవ సంవత్సర ప్రారంభమునుండియు లలితకళారాధన యందధికోత్సాహమును వెల్లడించుచున్న నీ పత్రికాకన్యక, జీవితానందకరములగు కళలయొక్కయు, గృహవిద్యలయొక్కయు పరిశ్రమాభివృద్ధిని గోరుచున్నది.

లలితకళలలో ఘనతగాంచిన లలితాంగుల నీ కన్యకామణి కడుప్రేమతో నాహ్వానించి ఘనముగ సత్కరించుచున్నది. కవితాకళాధురీణలగు కాంతారత్నముల గ్రంథరచనలను గౌరవించుచున్నది. విజ్ఞానకాంతులను వనితాలోకములో వెదజల్లెడు విదుషీమణులను సువర్ణకంకణములతో బహూకరించుచున్నది.

ఇట్లు స్త్రీ విద్యావ్యాప్తి కెంతయు చేయూత నిచ్చుచు, నిచ్చలు స్త్రీ యుద్యమమునకు తోడ్పడుచున్న ఈ పత్రికాలలామమును ప్రత్యేకాభిమానముతో స్త్రీ లెల్లరును, స్త్రీ విద్యాభిమానులందరును ప్రోత్సాహింపవలసిన బాధ్యతయైయున్నది.

ఆంధ్ర సోదరీమణులందరి ఆదరముతో, ఈ పత్రికారత్నము ఆంధ్ర పత్రికాసారస్వత ప్రపంచములో ప్రత్యేకార్హతనుబడయగల్గు భాగ్యమునకై నిరీక్షించుచున్నది.

భారతాంబ ప్రశస్తప్రపంచప్రఖ్యాతిని ఖండాంతరముల వ్యాపింపజేయుచున్న భారతరమణీమణుల ఆదర్శములను బ్రస్తుతించుచు, ఆంధ్రమాత కధిక యశస్సు నొడగూర్పగల మహిళారత్నములు స్త్రీజనోద్ధరణమునకు చేయుచున్న సేవను శ్లాఘించుచు, స్త్రీల సౌభాగ్యమునకును, సాంఘికజీవితములో సర్వతోముఖాభివృద్ధికిని, అమితోత్సాహముతో పాటుపడ దీక్షనుబూనిన ఈ పత్రికాకుమారిని అభిమానులందరును చిరాయురభివృద్ధితో చెలువొంద నాశీర్వదింప వేడుచున్నాము.

ఆంధ్రరాష్ట్రి మతిత్వరలో నమరునట్లును, తత్సౌధాంతర్భాగమున అతివల ఘనత నుద్దీపింపగల విద్యుద్దీపమువలె ఈ పత్రిక వెలయునట్లును అనుగ్రహింప శ్రీసర్వేశ్వరుని ప్రార్థించుచున్నాము.

ఆశీస్సు

(ఈ దిగువ ఆశీస్సు పద్యములు "గృహలక్ష్మి" జయంత్యుత్సవమునాడు సభలో శ్రీ స్నేహలతా కవితా సంఘాధ్యక్షులగు శ్రీ వాజపేయయాజుల రామసుబ్బారాయుడు బి. యె. బి. ఇడి. గారిచే చదువబడినవి.)

మ. పదమూడేడులు రాకమున్నె యిల భాస్వత్కీర్తి నార్జించుచున్
ముదితల్ నేర్వఁగలట్టి తత్త్వగుణముల్ బోధించు భావోన్నతుల్
ముదమారన్ బ్రకటించి మించితివి సంపూర్ణాయురారోగ్యముల్
గుదురై నెక్కొనుఁగాత నీకు గృహలక్ష్మల్ నిన్ను సేవింపఁగన్.

ఉ. మంచి సతీత్వ తత్త్వమును మానితబుద్ధియు సత్యధర్మముల్
గాంచఁదలంచియున్న గృహలక్ష్ముల కెల్లను మార్గదర్శివై
యంచిత తత్త్వబోధన లనంతముగాఁ బ్రకటించి ధాత్రిలో
మించిన నీకుఁ జేకుఱుత మేల్శుభముల్ చిరకీర్తిసంపదల్.

మ. సరసాలంకృతి సొంపునింపెడు వచశ్చాతుర్యమా నీయెడన్
స్థిరమై వెల్గుచునుండెఁ దావక యశోద్దీప్తుల్ బిసాళింపఁగాఁ
బురుషవ్రాతములైన నీదు గుణముల్ బూజించి వర్ణించువై
ఖరి నొప్పారుచునుండు నీకు శుభమెక్కాలమ్మగున్ బుత్రికా!

సీ. నడపించుచున్నావు నారీశిరోరత్నముల కనువగు మార్గములను గొన్ని
చూపించుచున్నావు సుదతుల కనువగు నడవడులన్నపో కడలుగొన్ని
కురిపించుచున్నావు విరివిగా స్త్రీవిద్య కనువగు మంచి వాక్యములు గొన్ని
బోధించుచున్నావు ముదితల కభివృద్ధిగాంచుట కనువగు కళలఁ గొన్ని

గీ. గడచెఁ బండ్రెండు వర్షముల్ గణనకెక్కు రీతి నిన్ను నీగుణము వర్ణింపఁదరమె?
స్త్రీలపాలిఁట కీవయే దేవివమ్మ వరలుమా గృహలక్ష్మి! వైభవమెసంగ.

మ. లలితాంధ్ర ప్రథమాన సత్కవివచోలావణ్యముల్ జూపి, స
త్కళలెల్లన్ బ్రకటించి లోకమున విఖ్యాతిన్ విడంబించి నీ
తలపుల్ సాధ్వుల కెల్ల మేలొసఁగు తత్త్వంబంచుఁ బేర్గాంచితీ
విల నింకేమి కొఱంతనీకు గృహలక్ష్మి! కాంచుమభ్యున్నతిన్.

గీ. చిలుప చిలుపని తేనియ లొలుకుపలుకు లెలమిఁ బలుకుచు ముద్దులఁ గులికిగులికి
సాటివారలు బులకింపఁ జాటినావు విమలయశమును గృహలక్ష్మి! పృథ్విలోన.

‘కవికోకిల’

శ్రీమతి వి. రాధామణిగారు

తమిళసాహిత్యసేవకు గృహలక్ష్మి స్వర్ణకంకణముతో బహూకరింపబడిరి.

ఉ. బాలికవయ్యు బల్ సుకృతభాగ్యమనంతముగాఁగఁ గాంచి నీ
శీలము గొప్పదంచుఁ బరిశీలనఁ జేయఁగఁ గీర్తిఁగాంచి, యె
వ్వేళ మెలంగుచుంటివల పెద్దలకున్ దలలోని నాల్కవై
మేలగు నాఁడునాఁడు వినుమీ! పలుమాటలికేల పుత్రికా!

గీ. నవ్య విజ్ఞాన బీజాళి నారువోసి యింటనింటను మొలకలెత్తించినావు
భారతక్షేత్రముననాటి పంటవలఁతి నలరఁజేయుమ గృహలక్ష్మి! ఫలసమృద్ధి.

ఉ. దీవనలేల నీకు కవిధీవరులెందఱో నీకతమ్మునన్
శ్రీ విలసిల్లు మార్గమును జేకొనఁగల్గి రనేకులంచు మో
దావహమైన వ్యాసము లనంతముగాఁగ రచించుచుండ నీ
పావనధర్మమే విజయభాగ్యములందఁగఁ జేయు నెల్లెడన్.

మ. ప్రతివర్షంబునఁ పైఁడికంకణము స్త్రీ రత్నాళిలో సత్కళా
వతికిన్ ధన్యయశఃప్రసూనముల దిగ్భామా శిరోరత్న సం
గతిఁ గూర్పంగల తల్లికిన్ విమల విజ్ఞానాతి ధన్యాత్మకున్
మతిమంతుల్ వొగడంగ నిచ్చెదవు నీ మర్యాద సామాన్యమే?

ఉ. కేసరి రత్నగర్భమునఁ గీర్తిగడింపఁగఁ జాలు పుత్రివై
భాసిలు రీతిఁబుట్టితి శుభప్రతిభన్ గనులగ్నమందునన్
నీసరిఁ జెప్పఁగాఁదగిన నేర్పరులందునఁ గానరాదు కై
లాసనివాసుఁ డిచ్చు గృహలక్ష్మి! మహోదయమొందు భాగ్యముల్.

ఉ. నీవొనరించునట్టి కమనీయరసాన్విత పాకపుష్టి ధా
త్రీవలయంబునందుఁ గలదే? రుచిఁజూడని జ్ఞానికోటి బల్
చేవఁగలట్టి వ్యాసములచే నలరారెడు సుప్రతిష్టయే
శ్రీ విభవంబు నీకమరఁజేయుత మో గృహలక్ష్మి పుత్రికా!

మ. ఇహలోకానఁబరంబునన్ బతికి సాహిత్యంబు జేకూర్పఁగా
గృహిణీరత్నమయంచు ధర్మవిదులా కీర్తింతు రేటేటికిన్
బహుమార్గంబుల కామినీగణములన్ బాగోగులన్ దిద్దఁగా
గృహలక్ష్మి! నియమంబుఁ బట్టితివి నిన్ గీర్తింప నేవారికా.

ఉ. 'కేసరి' తండ్రిగాఁగ బుధకేసరులెందఱో యీ జగాన ని
న్నేసరిఁజెప్పఁగాఁదగును నీకని చెప్పెడి కీర్తికాంతిచే

వాసియు వన్నెఁగాంచితివి; భారతదేశమునాఁడు నాఁటికిన్
భాసిలు నీపథమ్మునఁ బ్రవర్తిలుచో గృహలక్ష్మి పత్రికా!

శా. ఆయుర్భాగ్యముఁగాంచి వర్ధిలుచు నిత్యైశ్వర్యముల్ గాంచుమా
శ్రేయోదాయకమైన భవ్యగుణముల్ జేకూరు మార్గంబు, వి
ద్యాయోగమ్మున బోధసేయు సతివీవంచున్ నిరూపింపఁగాఁ
జేయన్ బూనుమనేకసత్కృతులు వాక్శ్రీలీల లేపారఁగన్.

సీ. విశ్వకల్యాణపవిత్రత నార్జించి గణనకెక్కితివి మంగళము నీకు
తన్వంగి బానిసతనమువో పతికను రాగమిచ్చితివి భద్రంబు నీకు
ముదితలెల్లరుఁ గళాపూర్ణలుఁగా శేముషీభాగ్యమొసఁగితి శివము నీకు
తెలుఁగుబాసకుఁ జిత్తమలరించి యూడిగాల్ సలిపితి శ్రేయసంబు నీకు

గీ. సకల శుభములఁ గంటి భావుకము నీకు
పండితాదృతిఁ గంటి భవ్యంబు నీకు
జగతిఁ జల్లఁగమనియుండుము గృహలక్ష్మి
పత్రికారాజమా! నూఱు వత్సరములు.

శ్రీమతి చేబ్రోలు సరస్వతీదేవిగారు

(ఈ విషయము "గృహలక్ష్మి" పత్రికా సంపాదకులగు శ్రీ డాక్టరు కే. యన్. కేసరిగారిచే "గృహలక్ష్మి" జయంత్యుత్సవమునాడు సభవారి కెరింగింపబడినది.)

ఈ కవయిత్రి జన్మించిన స్థానము నీలగిరి. చల్లని ప్రదేశమునఁబుట్టి చల్లని ప్రదేశమునఁ బెఱిఁగి చల్లనిగాలులను బీల్చుకొనుచుఁ గ్రమక్రమముగ విద్యలయం దారితేరిన నారీరత్నము-ఆంగ్లమునఁ బ్రవేశ పరీక్షయందు త్తీర్ణురాలయ్యె. గీర్వాణమున దక్షిణకాశి యనంబరగు కాంచీపురమున శ్రీమాన్ కంథాడై కృష్ణమాచార్యులగారివద్ద పంచకావ్యములు, నాటకాలంకారములు చదివి పాండిత్యము సంపాదించిన విదుషీమణి. ఆయుర్వేద సార్వభౌముండగు పండిత గోపాలాచార్యులగారివద్ద రెండు సంవత్సరములు వైద్య విద్యయందు కృషిసల్పె. హిందీలో రాష్ట్రభాషాపరీక్షలో కృతార్థతఁగాంచె. ఈనాఁడు పరీక్షలు ప్యాసగుట యొక లెక్కలోనిదికాదు. పరీక్షార్థమై కేవలము పఠనీయగ్రంథములు మాత్రమే చదివి యెట్లో జయపత్రమును గాంచిన వారిలో నీయమచేరదు. హిందీ గీర్వాణగ్రంథములు యాలిపిలోనే యనర్గళముగఁజదివి యెట్టి గ్రంథమైనను సులభముగ సారమెఱుంగుటయేకాక యితరులకు బోధింపఁగల సమర్థతగాంచిన విజ్ఞానమీ ధన్యచరిత్ర సంపాదించె. పురుషులమాట యటుండ, స్త్రీలలో నింతటి బుద్ధిపాటవముగాంచిన వారలరుదు. బుద్ధి సూక్ష్మతలోఁ బలువురుండవచ్చునుగాని యిన్ని విద్యలలో నారితేరిన వారలు బొత్తిగా తక్కువయని చెప్పుట సాహసవాక్యముగాదు. ఇంక జ్యోతిషవిద్య కరతలామలకముగఁ జెప్పగల నిపుణురాలు. సాముద్రికమందును నేర్పుగలదు. విశేషించి చక్కని కవయిత్రి. శ్రీ జటప్రోలు సంస్థాన రాజగురువులును, స్నేహలతాకవితా సంఘాధ్యక్షులునునగు వాజపేయయాజుల రామసుబ్బారాయఁడుగారు వీరి కవితాగురువు. వీరు రచించిన గ్రంథములు పతివ్రతాశతకము, శ్రీ సరస్వతీశతకము, ఆత్మోపదేశము, సత్యనారాయణవ్రతకల్పము, సరస్వతీరామాయణము. సరస్వతీరామాయణము ఉత్తర కాండముతో సహా 1200 పద్యములతో నలరారుచున్నది. చెన్నపురి విశ్వవిద్యాలయము వారిచేఁబఠనీయ గ్రంథముగ నెన్నుకొనఁబడి సాహిత్యలోకమునఁ గీర్తి నార్జించిన గ్రంథమిది. రామసుబ్బారాయఁడుగారిచే రచింపఁబడు 'మిత్రలేఖల'చేఁ బ్రోత్సహింపఁబడి శ్రీశ్రీ మీర్జాపురరాణీగారి యంతఃపుర బాలికామణులకు విద్యాబుద్ధులు గఱపుచు రెండు సంవత్సరములలో వ్రాయఁబడిన కావ్యమిది. శ్రీ మీర్జాపురరాణీగారే యీ కావ్యమును బ్రకటించి, వీరి కృషిఫలవంతముజేసి ప్రోత్సయించుట యటుండ, ఆంధ్ర సారస్వతలోకమున కిట్టి చక్కని కృతిఁనందఁజేసిన పుణ్యమునుగూడ నార్జించిరని చెప్పవచ్చు. సర్వకళా

ప్రవీణులగు విద్యావారిధి కాశీ కృష్ణాచార్యులవారి యభిప్రాయమిట నుదాహరించిన నీ కవయిత్రి కవితానైపుణ్య మిట్టిదని చెప్పనక్కఱలేదని మా ఆశయము.

చ. కలరు కవిత్వమల్లఁగల కాంతలు కొందరు ధారుణీస్థలిన్
గలిగిననేమి వారి కవనంబులఁగొన్నిఁటి వింటిఁగాని యీ
చిలుకలపల్కు టల్లికలచే నలరారుచుఁ బూలతేనె చు
క్కలఁగురియించు మేలయిన కైత సరస్వతి! నీకచెల్లెదుగా.

ఉ. పోలికలేని మేలయిన పోకలఁబోయెడు నీకవిత్వ పుం
జాలు సుధారసాలనఁగఁ జాలుఁబదాలిఁక జాజిపూలనం
జాలును సొమ్ములన్న సహజాలు వరాల సరాలసేలు, చే
బ్రోలు సరస్వతమ్మ నినుఁబోలిన మొల్లయె పోలెడుంజుమీ.

క. కృతితెన్గట శ్రీరాముని
కథయఁట, విషయంబు దాని కవయిత్రి సర
స్వతియఁట, పద్యములు నహి
ప్రతియఁట, నీ భాగ్యమేమి రామాయణమా!

ఈ సాధ్వీమణిపుట్టినవంశము మెట్టినవంశము విద్వద్వంశమె. ఈమె తండ్రిగారు నీలగిరి లోనే సుప్రసిద్ధ న్యాయవాదులై కీర్తిగాంచిన మహారాజశ్రీ కీ॥ శే॥ రాజగోపాలనాయుడు గారు. ఈమె భర్తగారగు మహారాజశ్రీ చేబ్రోలు రాజగోపాలంగారు ఆంగ్ల విద్యాపారం గతులు. చక్రవర్తి. జ్యోతిష వేదాంతశాస్త్రములు వీరి అభిమానవిద్యలు. అందులో వీరికిఁగల జ్ఞానమపారము. వీరి ఆచారమా 'దయాసత్యశౌచ' కర్మనిష్ఠాగరిష్ఠులని లోకనుతిఁగాంచిన సాంప్రదాయము. సార్థకనామధేయమునుగాంచిన సరస్వతీదేవిగారి బహుభాషావైశద్యమును దిలకించుచో "ముదితల్ నేర్వఁగరాని విద్యగలదే ముద్దార నేర్పించినన్"అను చిలకమర్తి కోకిల వాక్యధ్వని స్ఫురణకు రాకమానదు. ఇంతటి కీర్తికి స్థానమై యలరారుచున్న శ్రీ సరస్వతీదేవిగారికి యీ సంవత్సరము గృహలక్ష్మీకంకణము సమర్పింపఁబడుటకు నేను నిర్ణయించితిని గనుక పాఠక మహాశయులకును ముఖ్యముగా గృహలక్ష్మి పత్రికాభిలాషులగు గృహలక్ష్ములకును దెలియఁబరచుచున్నాను. శ్రీ సరస్వతీ దేవిగారీ కంకణమును ధరించి స్త్రీ విద్యావ్యాప్తికై, స్త్రీ సంఘాభివృద్ధికై, యనువగు కావ్యములను రచించుచు, నుపన్యాసవేదికలఁ దన్మార్గమును వెల్లడించుచు, పత్రికాద్వార మున బోధించుచు, భారతదేశ సౌభాగ్య భాగ్యోన్నతికై సేవజేసి కీర్తి నార్జించుఁగాక యని ఆశీర్వదించుచున్నాను.

గృహలక్ష్మి జయంతి మహోత్సవము

ఈ మహోత్సవము ఈ నెల 1-వ తేదీ శుక్రవారం సాయంకాలం 4½ గంటలకు సరిగా ప్రారంభమైనది. పురప్రముఖులును గృహలక్ష్మి పత్రికాభిమానులును స్త్రీ పురుషులనేకమంది విచ్చేసిరి. ఉత్సవమునకు వచ్చినవారందరును చందనతాంబూలాది సత్కారములచే గౌరవింపబడిరి. శ్రీమతులు గుమ్మిడిదల దుర్గాబాయి, చేబ్రోలు సరస్వతీదేవి, వి. రాధామణిగార్లు పుష్పమాలాలంకృతులైన పిమ్మట స్త్రీల సమూహముయొక్క ఛాయాచిత్రము తీయబడెను. తరువాత శ్రీ కుమారి సరోజినీదేవి, అవ్వాయిహోమ్ బాలికలచే గావింపబడిన ప్రార్థనతో సభ ప్రారంభింపబడెను. ప్రార్థనానంతరము సభకు అధ్యక్షురాలుగ నెన్నుకొనబడిన శ్రీమతి గుమ్మిడిదల దుర్గాబాయి బి. యే.(ఆనర్సు)గారు, గృహలక్ష్మి స్వర్ణకంకణ గృహీతలుగ నిర్ణయింపబడిన శ్రీమతులు చేబ్రోలు సరస్వతీదేవిగారును, వి. రాధామణిగారును సభాపీఠిక నలంకరించిరి. సభాధ్యక్షురాలిని సభకెఱుకపరచుచు శ్రీ ఏడిద కామేశ్వరరావుగారు, అధ్యక్షురాలి విద్యాధిక్యతను, దేశసేవా విశేషమును, ఉన్నతాదర్శ ప్రేరితమగు సంఘసేవాతత్పరతను, అసమానధీచాతుర్య ధైర్యస్థైర్యాది సద్గుణగణమును సవిస్తరముగ ప్రశంసించిరి. పిమ్మట శ్రీ విం. అ. సూర్యనారాయణగారు "గృహలక్ష్మి" పదమూడవ జన్మదినోత్సవ సందర్భమున ఈ పత్రికా కుమారి పురోభివృద్ధిని, విజయమును దీర్ఘాయువును గోరుచు అభిమానులును విద్యాధికులును అగు స్త్రీ పురుషులు పంపిన సందేశములను సభవారియెదుట చదివిరి.

తదుపరి శ్రీ "గృహలక్ష్మి" పత్రికాధిపతులును, సంపాదకమహాశయులును అగు శ్రీ డాక్టరు కేసరిగారు కంకణగృహీతలలో నొకరగు శ్రీమతి చేబ్రోలు సర్వతీదేవిగారిని సభవారి కెరింగించిరి. శ్రీమతి అంబుజమ్మాల్ గారు తమిళ కంకణగృహీతయగు శ్రీమతి వి. రాధామణిగారిని సభవారికి తెలియజేసిరి.

తదనంతరము శ్రీమతి కవితిలక కాంచనపల్లి కనకాంబగారు శ్రీమతి సరస్వతీదేవీకృత రామాయణ గ్రంథప్రాశస్త్యమును సోదాహరణముగ విశదీకరించుచు 'కవికలహంసి'అను బిరుదమును, శ్రీమతి వి. రాధామణిగారి 'ప్రసన్న కుమారి' నాటకములోని రచనాకౌశలమును, సంగీతనైపుణ్యమును వివరించుచు, ప్రవీణశబ్దము నకువ్యుత్పత్తి వీణా వాయిద్యమునందలి నైపుణ్యముగ నిరూపించుచు సంగీతసాహిత్య మాధుర్యములను వెలయించు 'కవికోకిల' బిరుదమును, సభవారి తరఫున ప్రదానము గావించిరి.

బిరుదప్రదానమైన పిమ్మట శ్రీ డాక్టరు కేసరిగారు ఇరువురు విదుషీమణులను 'గృహలక్ష్మి' పాఠకుల తరఫున స్వర్ణకంకణబహూకరణముచే సత్కరించిరి. కంకణగృహీతలు సందర్భమునకు సరియగునటుల శ్రీ కేసరిగారియెడ తమ కృతజ్ఞతను గౌరవపురస్సరముగ వెల్లడించిరి.

కార్యక్రమము ననుసరించి పిమ్మట ఉపన్యాసములు జరిగెను. తొలుదొల్త 'గృహలక్ష్మి' పత్రికకు చిరపరిచితులును, సుప్రసిద్ధ వ్యాసరచయితులును, కవితాకళోపాసకులును అగు శ్రీ గోనెల నరసింగరావు ఎం.ఏ. బి.యల్. గారు గృహలక్ష్మిపత్రిక యొక్క ఘనత నుగ్గడించుచు భావగర్భితమగు భాషాచాతుర్యముతోగూడిన గంభీరోపన్యాస మొనంగిరి. వారి తరునాత తమిళ గృహలక్ష్మిపత్రికా సంపాదకులగు శ్రీ యస్. కృష్ణన్ బి.యే. (ఆనర్సు)గారుపన్యసించిరి.

సభామధ్యమునుండి కరతాళధ్వనులు చెలరేగ శ్రీమతి గుమ్మిడిదల దుర్గాబాయి గారు భారతదేశస్వాతంత్ర్య సంపాదనకు స్త్రీలే యర్హులనియు, అట్టి స్త్రీలు విద్యాధికులై యుండు టెంతయు అవసరమనియు, అట్టి విద్యాధిక్యతను సారస్వతసేవావిశేషముచే వెల్లడింపవలెననియు ఉన్నతభావోద్రేకపూరితమగు గంభీరోపన్యాసమును గావించి, సభవారిని ఆనందాబ్ధి నోలలాడించిరి.

అధ్యక్షోపన్యాసానంతరము శ్రీ పండిత దోమా వేంకటస్వామిగుప్తగారు కంకణ బహూకరణోత్సవ కర్తలగు శ్రీ కేసరిగారి సత్కీర్తిని కొనియాడుచు, కంకణశబ్దములోని యర్థమును బహుచమత్కృతితో వివరించుచు ఆశువుగా సభలో పద్యమును జదివిరి.

తరువాత ఆంధ్రసారస్వతశేముషీ సంపన్నులగు శ్రీ ఆదిపూడి సోమనాథరాయకవి వరేణ్యులు స్త్రీత్వములోని ఘనతయు, మాతృత్వములోని మహిమయు ఏ దేశములో పూజింపబడునో అట్టి దేశము మహోన్నతదశ నొందగలదని వీనులవిం దొనర్చు నుపన్యాసమును గావించిరి. తరువాత మద్రాసు శాసనసభాధ్యక్షులును ఆంధ్రమహాసభాధ్యక్షులును అగు శ్రీయుత బులుసు సాంబమూర్తిగారు దేశపరిస్థితులను కూలంకషముగ దెల్పుచు దేశసౌభాగ్యమునకు స్వాతంత్ర్యమే ముఖ్యాధారమనియు, అట్టి స్వాతంత్ర్యమును విదుషీమణులే సంపాదింప సమర్థులనియు అట్టి వైదుష్యమున కాటపట్టైన 'గృహలక్ష్మి' పట్టిని స్త్రీలోకమున కర్పించి, స్త్రీ విద్యా సత్కారగౌరవముల గావించుచున్న శ్రీ కేసరిగారి వితరణ వైభవము నఖండముగ ప్రస్తుతించుచు నుపన్యసించిరి.

ఉపన్యాసములు ముగిసినతోడనే 'కవికోకిల' వి. రాధామణిగారు తమ వీణాగాన సుధాధారారస ప్రవాహములో సభ్యుల ముంచితేల్చి, శ్రీ కేసరిగారు కంకణబహూకరణ సమయమందు సరస్వతీశబ్ద వ్యాఖ్యానవివరణ మొనర్చుచు ప్రసాదించిన "వీణా సహిత సరస్వతి"యను ప్రత్యేక బిరుదమును సార్థకపరచిరి. ఆమె సోదరియగు శ్రీ కుమారి విమల తన వేణుగాన నైపుణ్యమును ప్రదర్శించి శ్రీ కేసరిగారిచే బహుమానింపబడిన బంగారు పతకమునకు పాత్రురాలైనది. కడపట సభాధ్యక్షురాలికిని, ఉపన్యాసకులకును, ఆశీస్సులనంపినవారికిని సభవారికిని గృహలక్ష్మి కృతజ్ఞతాపూర్వకవందనము లర్పించుట తోడనె శ్రీమతులు టి. యస్. ఆర్. రుక్మిణిఅమ్మాళ్, బెంగుళూరు నాగరత్నమ్మగార్ల మంగళముతో, శ్రీ కేసరిగారికి జయజయ ధ్వానములతో సభ శుభప్రదముగ ముగిసినది.

శ్రీయుత ఏడిద కామేశ్వరరావుగారి స్వాగతోపన్యాసము

సోదరీ సోదరులారా!

ఈవేళ గృహలక్ష్మి పుట్టినరోజు. ఈ పుట్టినరోజు పండుగను జరుపుకొని, ఆ ఆనందాన్ని అనుభవించడానికి మన మిక్కడ సమావేశమవడం నేడు శుభదినం.

ఈ గృహలక్ష్మి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని గృహలక్ష్మి జనకులైన డాక్టరు కేసరిగారు, సాహిత్యకళయందారితేరిన ఇరువురు విదుషీమణులను సభారంగాన్ని పూజించి, గృహలక్ష్మి స్వర్ణకంకణాలతో సమ్మానించడానికి పూనుకొనడంచేత వారి సహజ దాన వీరత్వాన్ని చాటుకొనడమే కాకుండా, ఇట్టి మహత్కార్యానికి వారు మార్గదర్శకులౌతున్నారు. ఇందుకు ఆంధ్ర, తమిళ మహిళాలోకమేకాక భారతమహిళా ప్రపంచం ఏవత్తూ సర్వదా కృతజ్ఞులై వుంటారు.

నేడు మన సమావేశానికి అధ్యక్షురాలైన శ్రీమతి గుమ్మిడిదల దుర్గాబాయమ్మగారికి, శ్రీమతి చేబ్రోలు సరస్వతీదేవిగారికి, శ్రీమతి వి. రాధామణిగారికి మీ అందరి తరపున స్వాగతాన్నిస్తూ, అధ్యక్షురాలిని సభకెరుకపరచడానికి నాకీ అవకాశాన్ని కలగజేసిన శ్రీ డాక్టరు కేసరిగారికి నేనెంతయు కృతజ్ఞుణ్ణి.

శ్రీమతి గుమ్మిడిదల దుర్గాబాయమ్మగారిని గురించి నేనిప్పుడు చెప్పబోవడం, అందులోనూ చెన్నపురి పౌరులకి తెలియబరచడం, చంద్రుణ్ణి దీపపుకళికతో చూపించినట్లుంటుంది. అయినా, శ్రీ దుర్గాబాయమ్మగారివంటి ఆదర్శవ్యక్తిని గురించి చెప్పుకోవడం ఆ ఆదర్శానికి ఒకవన్నె కూర్చడమన్నమాట.

దుర్గాబాయమ్మ దేశసేవాపరాయణ, త్యాగశీల. విద్యావైదుష్యములోను, సాంఘికసేవాతత్పరతలోను వన్నెకెక్కినమిన్న. పువ్వు పుట్టినప్పటినుంచి సువాసన బయలుదేరునట్లుగా యీమె సాంఘిక దేశసేవాభావాలు చిన్నప్పటినుంచి యీమెలోంచి వెల్లివిరిశాయి. కాకినాడలో యీమెచే స్థాపింపబడిన హిందీపాఠశాల యీమె సాంఘికసేవాసక్తికి ఒక ప్రబలనిదర్శనం. పదిమంది పిల్లలను పోగుచేసి, స్వంతఖర్చుతో ప్రారంభించిన ఆ పాఠశాల వందలకొలది బాలబాలికలను ఆకర్షించింది. పురప్రముఖులందరు సెభాసని మెచ్చుకున్నారు. అప్పటికి యీమెకు 15 ఏళ్లే వయస్సంటే దుర్గాబాయమ్మగారి సాంఘిక సేవాసక్తి అర్థమౌతుంది.

ప్రాథమికవిద్య అయినా పూర్తికాకపోయినప్పటికి, స్వయంకృషిమీద తెలుగు, ఇంగ్లీషు, హిందీ మొదలైనవన్నీ నేర్చుకుంది. దరిదాపు 20 ఏళ్లు వచ్చేవరకు ఆ హిందీ పాఠశాలను నిర్వహిస్తూ, అందరికీ హిందీని ఎంతో నైపుణ్యంతో బోధిస్తూ, స్వవిద్యాభివృద్ధికి నిరంతరకృషిచేస్తూ, చెన్నరాజధానిలో హిందీప్రచారాన్ని సాగించి మహాత్ముని ఆశీర్వచనలకి పాత్రమైనదంటే యీమె నిర్మాణకార్యదీక్ష విదితమౌతుంది.

ఈమె దేశసేవాశక్తి, సాంఘికసేవాభిలాష, నిర్మాణకార్యదీక్షానిపుణత ఒకఎత్తు, యీమె త్యాగధైర్యస్థైర్యాలు ఒకఎత్తు—

1930 లో మద్రాసు సముద్రతీరాన్ని నాటి ఉప్పు సత్యాగ్రహసమరంలోని యీమె దుర్గావతారం భారతదేశ స్వాతంత్ర సమరచరిత్రలో మరపురాని ఒక మహత్తరాధ్యాయము. ఏ వార్తాపత్రికచూచినా, ఏ ఉపన్యాసవేదికమీద విన్నా యీ దుర్గా మహాశక్తి ప్రశంసలే. నాటి సన్నివేశం ప్రభుత్వాన్నికూడా ఒకవూపు వూపిందంటే దుర్గాబాయమ్మగారి త్యాగధైర్యాలు విశదమౌతాయి.

అన్నిటికంటె ఆశ్చర్యకరమైన విషయం—యీమె విద్యాపరిశ్రమ. మొన్న మొన్నటి వరకు ఇంగ్లీషుభాషాజ్ఞానము ఏమీలేకపోయినా, హిందూ విశ్వవిద్యాలయపు ప్రవేశపరీక్షకు కట్టి, ఆరుమాసముల వ్యవధిలో పరిశ్రమచేసి, రెండవతరగతిలో ఉత్తీర్ణురాలై ఉపకారవేతనాన్ని పొందిన యీమె పట్టుదల, నిశితబుద్ధి, విస్మయాన్ని కలిగిస్తాయి. కాశీ హిందూ విశ్వవిద్యాలయంలో ఇంటర్మీడియేటు పరీక్షయందు త్తీర్ణురాలై ఆంధ్ర విశ్వవిద్యాలయంలో రాజకీయము ప్రధానంగా బి. యే. ఆనర్సుపట్టాన్ని సంపాదించి అనేక బంగారుపతకాలను బహుమానంగా బడసి, నేడు మద్రాసు లాకాలేజిలో చదువుచున్నదీమె. త్వరలో న్యాయవాదినిగా యీమె బుద్ధిచాతుర్యసౌరభము ప్రపంచంలో వ్యాపింపబోతూవుంది.

ప్రస్తుతం లాకళాశాలలో చదువుతూ, ఆంధ్రమహాసభ—స్త్రీలశాఖ విషయంలో యీమె చేస్తూన్న కృషి అందరికి తెలిసియేవుంది. దీనికి మద్రాసాంధ్రమహాశయులు సర్వదా కృతజ్ఞులైవుంటారు.

దుర్గాబాయమ్మ ఆదర్శయువతి. నేటి క్లిష్టపరిస్థితులలో నిలకడలేక సంచరిస్తూన్న యువతీలోకానికి యీమె ఒక ఆశాజ్యోతి. దుర్గాబాయమ్మ ఎక్కడవున్నా అక్కడ చైతన్యం ఉద్భవిస్తుంది. యువతీయువకుల్లో కార్యదీక్షను ఇనుమడింపజేసి, వారికి మార్గదర్శినియై, ఎట్టి కష్టభూయిష్ఠమైన కార్యాన్నైనా ఎదుర్కొని ముందుకు చొరుచుకొనిపోయే వాడిమెదడుగల దుర్గాబాయమ్మ పౌరుషేయముగల ఒక శక్తిస్వరూపిణి.

ఆంధ్రాంగ్ల హిందీసాహిత్యాల్లో ప్రతిభావంతమైన ప్రవేశం, సంగీత నాట్యకళాది లలితకళల్లో చక్కని నేర్పు, బీరుపోని నిర్మాణ కార్యదీక్షానిపుణత, నిస్తేజమైపడివున్న ప్రజానీకంలో అగ్నిని రగుల్కొల్పగల ధీరవాక్చాతుర్యంగల దుర్గాబాయమ్మ మూర్తీభవించిన ఆదర్శ ఆంధ్రయువతి.

ఇటువంటి దుర్గాబాయమ్మ నేడు మన సమావేశానికి అధ్యక్షత వహించడం కేవలం మన భాగ్యము.

నేడు యీ సభారంగాన్ని ఒక చిత్రమైన సన్నివేశం సమకూరింది—

గృహలక్ష్మీ జయంతి మహోత్సవము



సభకు విచ్చేసిన స్త్రీ పురుషులు

గృహలక్ష్మి జయంతి మహోత్సవము



అధ్యక్షులు, కంకణగృహీతలు, తదితర విదుషీమణులు.

గృహలక్ష్మీ జయంతి మహోత్సవము

కవులు భావవీధుల్లో విహరిస్తూ దేశకల్యాణానికి పనికివచ్చే వస్తుసముదాయాన్ని సేకరించుకొని, కావ్యరూపంగా మధించి, కార్యరూపందాల్చడానికి అనుగుణ్యంగావుండేటట్లు చిత్రించి ప్రజానీకానికి అందిస్తారు. దేశసేవాదురంధరులైన త్యాగశీలురు వాటిని కార్య రూపాన్ని పెట్టి విశ్వమానవ కల్యాణానికి తోడ్పడతారు.

ఇందొకరు చెప్పేవారు, రెండోవారు చేసేవారు. ఈ చెప్పుచేతలకి సాంత్యంగ ఇక్కడ లభ్యమైంది. శ్రీమతి చేబ్రోలు సరస్వతీదేవి శ్రీమతి వి. రాధామణిగార్లు మానవా భ్యుదయానికి దోహదమునిచ్చే ఉద్గ్రంథాలను చిత్రిస్తారు. చెప్పనూగలదు, చెప్పినదానికి పదిరెట్లు చేయనూగలదు, యోధురాలు దుర్గాబాయమ్మగారు.

ఇటువంటి ఉత్తమశక్తులు రెండు యీ సభావేదిక నలంకరించడంచేత బంగారానికి తావి అబ్బినట్లుంది.

పుట్టినదాదిగా సాంఘిక దేశసేవలే పరమావధిగా పెట్టుకుని, వాటికి తనజీవితాన్ని అంకితంచేసిన 'శ్రీ గృహలక్ష్మి' జయంతి మహోత్సవంలో, ఇరువురు సాహిత్యసేవా పరాయణలను 'గృహలక్ష్మి స్వర్ణకంకణాల'తో శ్రీ కేసరిగారు సన్మానిస్తూన్న యిట్టి మహాసభకు, దేశసాంఘిక ఔన్నత్యంకొరకు పాటుపడుతూవున్న ఇరువురు కవితామతల్లు లను ఇరువైపులాధరించి దేశకల్యాణ సాధాగ్రగామికాబోతూవున్న దుర్గాబాయమ్మగారి ఆధ్వర్యాన్ని యీమహాసభను దిగ్విజయంగాజరుపకోరుతూ యింతటితో విరమిస్తున్నాను.

శ్రీమతి గుమ్మిడిదల దుర్గాబాయమ్మగారి అధ్యక్షోపన్యాసము

డాక్టరు కేసరిగారూ, సోదర సోదరీమణులారా!

నన్ను అధ్యక్షురాల్ని చేసినందుకు మీకు నా ధన్యవాదాలు. ఇది సామాన్యమైన సభకాదు. మన రాష్ట్రానికి చెందిన విదుషీమణులను సన్మానించడానికి సమావేశమైన మహత్తరమైనసభ. నావైదుష్యం, నా సోదరీసేవాపరాయణత్వం యెలావున్నా-ముఖ్యంగా కేసరిగారికి నాయందుగల ఆదరాభిమానాలు నాకీగౌరవం ప్రాప్తించడానికి కారణం అని తలుస్తాను. మొట్టమొదట ఆంధ్రసోదరీమణుల తరఫున గృహలక్ష్మిద్వారా, డా. కేసరిగారు స్త్రీ జనోద్యమానికి చేస్తూన్న అమూల్యమైన సహాయానికి కృతజ్ఞత తెలుపుతున్నాను. స్త్రీలు వెనుకబడి ఉండటమే సంఘమందలి చెడుగులకి మూలమని వీరు చక్కగా గ్రహించారు. భారతమహిళాదర్శాలని చాటించడానికి గృహలక్ష్మిని లేవనెత్తారు. కష్టనష్టాలు గణించకుండా పత్రికను నిర్విఘ్నంగా కొనసాగిస్తున్నారు.

సంఘం ఉన్నతికి, సాంఘికుల వీరారాధనకి అవినాభావసంబంధముంటుంది. తన మహామహుల్ని గుర్తించి, గౌరవించడం సంఘం ముఖ్యధర్మం. ఈ ఉత్సవం చాలా ఆవశ్యకమైంది. నేడు మనం ఇక్కడ గొప్ప కవయిత్రులను సన్మానించి మన విధ్యుక్తధర్మాన్ని నెరవేర్చటానికి కలుసుకున్నాం.

ఇలాంటి సన్మానోత్సవాలు మనకి అనూచానంగా వస్తూన్నవే. కృష్ణదేవరాయల కాలంలో కంకణబహూకరణం, కవిపూజ సామాన్యమైన విషయంగా మనం ఎరుగుదుము. మొన్న మొన్నటివరకు మహారాజులు, జమీందారులు, పండితులు, కవులు మొదలైన వారిని యథోచితంగా సత్కరిస్తూరావడం చూశాం. కాని స్త్రీలలో విద్యాప్రవీణలగు వారికి సత్కారగౌరవములు చేయు ఆచారము అంతగా కానరాదు. ఇప్పుడు విదుషీమణులను స్త్రీ విద్యాభిమానులగు శ్రీ కేసరిగారు స్వర్ణకంకణబహూకరణములచే గౌరవించుట ప్రశంసనీయమైన నూతన మర్యాద. కాలం దొర్లిపోతోంది. ఇవి ప్రజాయత్త పరిపాలనా దినాలు. హక్కులు గుర్తింపగలిగిన ప్రజాసామాన్యం బాధ్యతలుకూడా వహించాలి. నాగరకత హెచ్చినకొద్దీ, నాజూకుతనం బలిసి, సత్సాంప్రదాయాలు మూలపడిపోతూండడం శోచనీయం. సంఘానికి తలమానికాలనదగిన కళాశాలుల్ని కీర్తించడం మనవిధి. ఇది చాలా పవిత్రమైన కార్యం.

శ్రీమతి చేబ్రోలు సరస్వతీదేవిగారు ఈనాటిమొల్ల. ఆమె మిక్కిలి సంస్తవనీయురాలు. ఆంధ్ర సారస్వతానికి, ఆంధ్రదేశానికి ఆమెచేసినసేవ మరువరానిది. కవిలాగే 'జర్నలిస్టు'కూడా సంఘానికి వెలుగుదారి నిస్తాడు. కవి భావనాలోకంలో విహరిస్తాడు; ఆదర్శాలందిస్తాడు. జర్నలిస్టుకి మామూలు ప్రపంచంతో నిరంతరసంబంధం. అంతేతేడా. ఇద్దరూ అపురూపమైన సంఘసేవా తత్పరులే. సరస్వతీదేవిగారు మంచి 'జర్నలిస్టులు' కూడా. ఆమె ఉన్నలోపాలు సరిగా తెలుసుకుని, సంఘాన్ని చాకచక్యంతో మరమ్మతు చేయగల సమర్థురాలు. సంఘం అరాజకమైన తొందరలోపడి తొక్కులాడే వేళల్లో ఆగి, తాపీగా ఆలోచించమని చెబుతారు; నిశ్చలంగా, నిర్జీవంగా పడిఉన్నప్పుడు తట్టి మేలుకొలిపి, హుషారుచేస్తారు. జర్నలిస్టయిన సరస్వతిగారు మన నేస్తం, మంత్రి, మార్గదర్శిని అవుతున్నారు.

అసలు ఈ జర్నలిజానికి ఎవరెక్కువ తగుదురు ? స్త్రీ. మగవాడెప్పుడూ కాదు. నిత్యజీవన సంరంభంలోనే మగవాని జీవితం కడతేరుతోంది. ఇంక జర్నలిస్టుకి కావలసిన నిమితమైన విచారణ, నిస్వార్థమైన ఆలోచన, నిశితమైన విషయపరిశీలన_వీటికి మొక్కువ పెట్టిపుట్టింది స్త్రీ. మగవాడు సహజంగా యేవో హడావిళ్లతో ఉక్కిరిబిక్కిరి అవుతూంటాడు. జీవితంఅంతా ఒకపందెంవేసిన పరుగులా ఉంటుంది అతగానికి. స్త్రీకి మాతృత్వం జన్మహక్కు; ప్రకృతిసిద్ధం. సంఘం ఒకపెద్ద సంసారంలా కనిపిస్తుంది ఆమెకి. తనుకన్న పిల్లల్ని ఎంత నిర్మలమైన ప్రేమతో పెంచగలుగుతుందో, సంఘం యావత్తూ అంతపదిలంగా చూసుకుంటుంది. సరస్వతి, రాధామణిగార్లు ఈ భావం బాగా అవగాహన చేసుకుంటారనుకుంటాను. జర్నలిస్టు భాషకోసం బాధపడనక్కరలేదు. భావాలుఉన్నచోట భాష ఎవరికోసం వస్తుంది ? పొట్టకోస్తే అక్షరంముక్కలేని గొడ్లకాపర్లు పసందైనపాటలు పాడతారు పాటలుకట్టి. నీలమైన ఆకాశం, పచ్చనిబయళ్లు, నున్నని కొండలు, మేసేపసులు-ఇవి

పాటకజనాన్ని కవుల్నీ, గాయకుల్నీ చెయ్యడంలేదు? జర్నలిస్టు పసులకావర్లకి తీసిపోయాడా? ప్రస్తుతసంఘాన్ని ఒకసారి సింహావలోకనం-చెయ్యండి. స్త్రీ లెంత దౌర్భాగ్యస్థితిలో ఉన్నారు? పాశ్చాత్యదేశాలన్నీ 'కొత్త ప్రపంచం, కొత్త ప్రపంచం'అని ఉద్ఘోషిస్తున్నాయే-వాట్లకి యెన్నో కొత్త ప్రపంచాలు పుట్టింతరువాత కూడా మనం ఇంకా ఎక్కడ ఉన్నాం? ఆదేశాల్లో ఏ పద్నాలుగో శతాబ్దంలోనో ఉన్న సంఘస్థితికూడా లేదే మనలో-ఇప్పటికీ స్త్రీకి తనశరీరంమీద తనకి హక్కులేదు. స్వతంత్రజీవనంలేదు_వ్యక్తిత్వం లేదు. ఇక ఆమె బాగుపడ్డానికి ఆమె నిరక్షరాస్యత అడ్డువస్తోంది. మన సంఘంలో ఎంత మార్పు చెయ్యాలి? ఎంతో నిర్మూలించాలి. ఎంతో పునరుద్ధరించాలి.

సంఘం దిద్దుబాటుకి నాటకరచన అతిముఖ్యమైన సాధనం. రాధామణిగారు నాటకాలుకూడా రాస్తారని విన్నాను. ఎంత అదృష్టవంతులు! ఆమె తన నాటకరచనా సామర్థ్యంతోటి వాళ్ల బాగుకీ, సంఘం ఉన్నతికీ ఉపయోగిస్తారని నా ఆశయం. మొన్నటి గృహలక్ష్మిలో వారు వీణతోఉన్న Photo ఒకటి చూడ్డం తటస్థించింది. ఆమె సంగీత విద్వాంసురాలుకూడా అన్నమాట! 'మాధుర్యం, కాంతి'-ఔన్నత్యానికి మూలకందా లన్నాడు (Matthew Arnold) రాధామణిగార్లో ఈ రెండు సమకూడినాయి.

మనోవికాసానికీ, ఉత్కృష్టజీవనానికీ ఉన్నతవిద్య అవసరం. ఉన్నతవిద్యఅంటే కేవలం డిగ్రీలుఅనే నాఅభిప్రాయంకాదు. ఎంతపెద్ద చదువుచదువుకున్నా మగవానితో దెబ్బలాటకి దూకే ఆడది విద్యావంతురాలు కాజాలదు. కేవలం తన సంసారం-తనపిల్లలు, తన భర్త-తన నగలు, తనశరీరం చూసుకునే మనిషీ విద్యావంతురాలుకాదు. స్త్రీలో, ఉన్నత విద్యని ఉత్కృష్టపరిణామానికి ఉపయోగించుకో నేర్చిన స్త్రీలో మానవసేవకోసం మంచి ఉత్సాహం చూస్తాం. మానవసేవ, సంఘోద్ధరణ-సంఘంలో వైకల్యం నిర్మూలించి, సౌందర్యానికి జీవంపోయడం_ఇదే స్త్రీకి ఉచితవికాసం, ఆమెలోని తేజస్సూ, మాధుర్యమూను. ఇట్టి స్త్రీలు ఉన్నప్పుడే సంఘపునర్నిర్మాణం సమకూడుతుంది.

ఈ ఉన్నతవిద్య ఎలా సందర్భపడుతుంది? విద్య మేధస్సుకి వికాసం కల్పించేది. ఆత్మవికాసంతోడి మేధస్సువికాసం-ఉన్నతవిద్య, ఆత్మ, మేధస్సు ఇవి వేరువస్తువులైనప్పటికీ వీటికి పరస్పరం సంబంధముంది. అభివృద్ధివిషయికంగా, అవి ఒకదానిపైనొకటి ఆధారపడి ఉన్నాయి. పాఠశాల మేధస్సును తరిఫీదు చెయ్యడానికి; గృహమూ, సంఘమూ ఆత్మను రూపందించడానికి-వ్యక్తికి సహాయపడుతున్నాయి. కాని సంఘాన్ని నడపడానికి ఒకవ్యక్తి కావాలి. జర్నలిస్టు, కవయిత్రి అయిన మన సరస్వతీదేవిగారు సంఘమార్గదర్శిని అవుతున్నారు. కవులు తమ విధిని చక్కగా నెరవేరుస్తారు. కాని మనం చెయ్యవలసినదేమిటి? అంతభారం వారికే వదలి, చల్లగా కూర్చుంటామా? ఊహూ. మనం చూసుకోవలసిన అవసరమైన పనులు ఉన్నాయి. సంఘనాయకుల్ని నేర్పుతో అనుసరించడానికి ఘన

అమ్మాయిలకి తగిన విద్యనేర్పించాలి—నేను పద్ధతులకోసం పోట్లాడను. స్త్రీలకు ప్రత్యేక విద్యాసౌకర్యాలు హెచ్చుచెయ్యడానికి ధనం చాలదని ప్రభుత్వం అంటూన్నపుడు, ఎదిగిన పిల్లల్ని బడికిపోనీయకుండా సంప్రదాయం ఆటంకపరుస్తూన్నపుడు, కుటుంబపరిస్థితులు అనుకూలంగాలేనప్పుడు_మనకు కావలిసింది, అనధికార ప్రయత్నం. ఏవిధంగా? శారదానికేతనంవంటి ప్రయివేటు విద్యాశాలలు ఉన్నవికదా! స్త్రీలకు ఎక్కువ అలాటివి మనం లేవతియ్యాలి. అంతేకాదు. ఆర్గనైజేషన్ అత్యవసరం. దీనికి డాక్టరు కేసరివంటి మహోదారులు పూనుకోవాలి. రాష్ట్రంలో వివిధసంఘములను కట్టుదిట్టంగా నడిపించడానికి— మదరాసులో ఒక కేంద్రసంస్థను నిర్మించాలి. గుంటూరు శారదానికేతనం, నెల్లూరు స్త్రీవిద్యాలయం, ఏలూరు జాతీయవిద్యాలయం, బందరు జాతీయకళాశాల, రాజమండ్రి జాతీయవిద్యాలయం మొదలైనవాటిని దగ్గరికి తీసుకురావాలి. పాఠ్యాలు నియమించడానికి, పరీక్షలు జరిపించడానికి ఒక ఎక్స్పర్టుకమిటీ ఏర్పడాలి. ఆంధ్రమద్రాసు విశ్వవిద్యాలయాల్లో స్త్రీలకుండే ఇబ్బందులు తొలగించి, ఈవిధంగా ఇంకో విశ్వవిద్యాలయం తయారుకావాలి. అది సమగ్ర జాతీయవిద్య కాలవాలం. అది నారీశిరోమణులు బయల్దేరడాని కాస్కారం.

కాని సంఘంయొక్క నిజస్థితిని చూడకుండా మనం కళ్లుమూసుకోలేం. అనేకమంది స్త్రీలకి ఈ విద్యావ్యాసంగానికి చిక్కులుండవచ్చును. వారికి ముఖ్యమైన మనశ్శాంతి లేకపోవచ్చు. మెదడుపని సాగడానికి వీలులేని ఇతరకష్టాలుండవచ్చు. అటువంటి వీరి సౌకర్యంకోసం-మనం వృత్తివిద్యలేర్పాటుచేసి, ఆ సంబంధమైన శిక్షణ అందుబాటులో ఉండేటట్టు చెయ్యడం అవశ్యకర్తవ్యం. వీరి కావిధంగా కొంత ధనసంపాదనకి వీలుకలిగి, భర్తతో పాటు తామూ సంసారపు ఖర్చుకు సాయపడవచ్చును.

తరవాత, కేసరిగారికి నాదొక మనవి; వారు Compositor-Courses ఆరంభించి, అవసరంగాను, ఉత్సాహంగాను—ఉన్న స్త్రీలకి తమ ముద్రాలయంలో ఉద్యోగాలు కల్పించి హెచ్చరించవలసిందిగా నా కోరిక. జర్నలిజంలో స్త్రీలే ఎక్కువరాణిస్తారని నేను ముందే చెప్పాను. ఆంధ్రవనితల్లో అద్భుతమైన జర్నలిస్టులు బయల్దేరడానికి మిక్కిలి దోహదమవుతుందని నా నమ్మకం.

ఈవేళ ఇక్కడ కలసికొని, మనలో ఇద్దరు మహిళారత్నాల్ని గౌరవించి, మన విధాయకాన్ని నెరవేర్చుకున్నందుకు నాకు చాలా ఆనందంగా ఉంది. ఏటేట మన మిట్టి సత్కారసభలకి సందర్భపడి, దివ్యంగా గడపాలని నా కోరిక. సర్వవిధాల తమ చేయూతనిస్తూ స్త్రీజనోద్యమానికి తోడుపడవలసిందిగా డాక్టరు కేసరివంటి ఉదారులను, సోదర సోదరీమణులను అపేక్షిస్తున్నాను. మనం ఈవేళ మననంచేసుకున్న ఆశయాలు త్వరలో ఫలోన్ముఖాలై-స్త్రీజన సర్వతోముఖవికాసం, సంఘపునరుజ్జీవనం సిద్ధిస్తాయని ఆశపడుతున్నాను.

స్త్రీలు - భారతదేశము

శ్రీమతి పొణకా కనకమ్మగారు

(రేడియో ఉపన్యాసము)

భారతదేశములో స్త్రీల స్థానము ఎంత ఉత్కృష్టమైన ఉన్నతశిఖరాన్ని అధిష్టించినది ఆదర్శనీయులైన పూర్వపు స్త్రీలను స్మరించుకుంటె గ్రహించగలుగుతాము. స్త్రీలశక్తి, ప్రతిభ, విజ్ఞానము, గణ్యత, ప్రతియుగములోను అత్యంతముగా ప్రకాశిస్తూవచ్చినవి. స్త్రీని, మాతృస్వరూపముగా ప్రేమించి సేవించడము ఈదేశములోనే పుట్టినదంటె స్త్రీ ఎంతగొప్పగా ఆరాధింపబడినదో తెలుస్తుంది. ఇందుకు మనము ఎంతైనా గర్వపడతాము. స్త్రీ గృహలక్ష్మియై ప్రతి హక్కులోను భాగస్వామినియయినది. స్త్రీ ఎంత ఆధిక్యతపొందినదో అంత యోగ్యతచూపినది. కాని స్త్రీల ప్రతిష్ఠ నానాటికి క్షీణమై మరుగుపడిపోతూ వచ్చినది. గృహిణిత్వాన్ని ఒక రాణిగా పరిపాలించే హక్కు, అధికారము, శక్తిపోయి తుదకు ఒక పనిముట్టుగా తయారైనది. మనము ఎవరో ఏమిచెయ్యాలో తెలుసుకునే శక్తికూడ సన్నగిల్లిపోయినది. కొంతమంది ఐశ్వర్యముతో పెద్ద సౌధాల్లో సుఖపడవచ్చు. కొంతమంది చదువుకున్నవాళ్లు వేదికలమీద గౌరవింపబడవచ్చు. కాని, స్త్రీయొక్క స్వత్వాన్ని చెప్పగలిగేది అదిమాత్రమేకాదు.

హిందూదేశముయొక్క ఆదర్శదైవము త్యాగమూర్తియైన పరమశివుడు. పార్వతి అర్ధనారీశ్వరి ఆ రాజేశ్వరి వెండికొండమీద విశ్వమును పాలించినది. ఆ జగజ్జనని శివునితో చేతులుకలిపి బిక్షమెత్తినది. ఆ పరాశక్తి స్మశానవాటికలో తాండవకేళీ సల్పినది. భారతస్త్రీ సమాన స్వత్వానికి ఇంతకంటె నిదర్శనము ఏమికావాలి ?

భారతస్త్రీలలో ఈ స్వత్వము ఎంతవరకు ఉచ్ఛస్థితిలో నిలువగలిగినదో కొంత పూర్వాపరాలు పరామర్శించుదాము.

సీత

వివేకానంద చెప్పినట్లు భారతదేశములో ఒక్క మనిషియున్నా వానినోట సీత స్మరింపబడుతూ వుంటుంది. సీత హైందవనారీ స్వరూపము. హిందూదేశముయొక్క ధర్మము, లక్ష్యము అంతా ఆ రెండక్షరాల్లో యిమిడివున్నది. ఆదేవి లోకానికి పవిత్రమైన మాతృస్థానమును ప్రసాదించినది. ఆమె ఎంత లావణ్యమయియో అంత సౌందర్యహృదయము. సీతాదేవి నిర్మలజీవితము, త్యాగముతో నిండినది. ఆసహనము సాటిలేనిది. ఆమె శీలము, లోకపూజ్యమైనది. ఆమె మహాసాధ్వి. ఆమె సతీధర్మం ఎంత పరమోత్తమముగా పాలించుకోగలిగినదో ఆత్మగౌరవమును అంత అమోఘముగా నిలుపుకొనగలిగినది. ఆమె క్షమాస్వరూపిణియైన భూదేవి కూర్మిబిడ్డ.

పతి ప్రాణయైన సీత. మహావైభవముతో యువరాజ్ఞీత్వానికి సంసిద్ధమై సీత ఒక్కమారుగా అన్ని వదలివేసి భర్తతో అడవులపాలై అష్టకష్టాలుపడినది. అగ్నిపరీక్షలకు నిల్చినది. సత్యముకోసము ఎంత త్యాగమైనా చేసినది. ప్రాణాధికుడైన పతికికూడా దూరమైపోయినది. కాని, ఆత్మగౌరవమునుమాత్రము విడువలేదు.

పవిత్రమైన తన వ్యక్తిత్వాన్ని గ్రహించలేని రామరాజ్యానికి ఒక ధిక్కారముతో స్వస్తిచెప్పి విశాలమైన మాతృగర్భములో లీనమైపోయినది. ప్రేమతోనిండిన ఆ హృదయములోనుండి చిరునవ్వు వెన్నెలలు చల్లని శాంతినిస్తూ త్యాగమును ఎట్లు ప్రదర్శించినదో ఆభిజాత్యపూర్ణమైన ఆధీమాకూడ అట్లే ధీరత్వమును వెల్లడిస్తున్నది. ఆసత్తా స్మరించుకుంటేనే మనకెక్కడలేని జీవశక్తి కలుగుతుంది. ఆదేవి అశోకవనములో కృశిస్తూ ఉన్నప్పుడేకాదు. ఋషిపల్లెలో విడిచిపెట్టబడినప్పుడుకూడా శ్రీరాముడికోసమే పరితపించినది. ఆ ఓర్పు అద్భుతము; అయితే ఆమె ఎంతకష్టమునైన సహిస్తుందికాని పరాభవాన్ని భరించలేదు. ఎంత త్యాగమునైన చేస్తుందికాని అపజయాన్ని సహించదు. అశ్వమేధములో రామసేనలపైకి కొడుకులను యుద్ధానికి పంపేటప్పుడు ఆ తల్లి ఆశీర్వాదము, ఆ వీరపత్ని సందేశము; ఏ భారతస్త్రీ హృదయము ఉప్పొంగదు.

రాధ

రాధ ప్రేమస్వరూపము; సర్వము అర్పణచేసి తన్మయముగా ఆరాధించడము రాధ సొమ్ము. ఆభక్తికి, ప్రేమకు భిన్నములేదు. దివ్యమైన ఆ ప్రేమతత్త్వము బాహ్యదృష్టికి అందేదికాదు. అది పరతత్త్వాన్ని గ్రహించి పరిపూర్ణమైనది. ఆమె ప్రేమకు హద్దులేదు. ఆ ప్రేమవాహిని కట్టలుత్రెంపుకుని భగవంతుని మధురమూర్తిని ఆనంద లీలాతరంగాలలో ముంచియెత్తినది. ఆ కల్యాణగుణుని హృదయకమలము ఆనందముతో విరిసి స్వాగతమిచ్చినది. ఆమె ప్రేమఫలితాన్ని కోరినదికాదు. అసలు ఆమెకు ప్రపంచములో ఇంకో వస్తువులేదు. అంతా ఈశ్వరస్వరూపమే. లోకాన్ని ముగ్ధముచేసే మనోహరమైన ఆ నిర్మలప్రేమకు పతికూడ పరవశుడైపోయినాడు. ఆ ప్రేమగానములో రాళ్లుకూడా చెమ్మగిల్లినవి. ఆమెకు ఇతరచింత లేకపోవడమేకాదు. ఆలక్ష్యమేలేదు. లోకము తన్ను దూషించినా భూషించినా లెక్కచేయలేదు. ఆత్మతన్మయములో లోకమే తెలియలేదు. అర్ధాంగియైన ఈశ్వరిగాని; విష్ణు హృదయమును అధిష్టించిన లక్ష్మిగాని; బ్రహ్మవాణిని స్వాధీనముచేసుకొన్న సరస్వతిగాని; భగవత్స్వరూపములో కొంతమాత్రమే ఆక్రమించారేమోగాని రాధ సర్వస్వము అర్పించి సర్వము తానే అయిపోయినది. కవులు, గాయకులు, నిరంతరము ఆ ప్రేమదైవతమును మనోహరముగా మధుర గానముచేస్తూ భజిస్తున్నారు.

ద్రౌపది

ద్రౌపది భారతదేశముయొక్క క్షాత్రధర్మాన్ని ప్రతిష్టించిన తేజశ్శాలిని. ఆమె విద్యావివేకములు, రాజనీతి, న్యాయదక్షత, కార్యదీక్ష, ప్రతిజ్ఞానిర్వహణము చాకచక్యముతో ప్రదర్శించిన ధీరసాధ్వి. ధర్మా ధర్మములను నిర్వచించి చెప్పగలిగిన ప్రతిభాశాలి. పరాభవాగ్నిని విజయరక్తముతోగాని చల్లార్చనని జడ ముడి వీడ్చి శపథముపట్టిన ద్రౌపది శక్తిస్వరూపము మన కళ్లల్లో విహరిస్తూ పులకలెత్తిస్తుంది. ఆమె పాండ వులతో అడవులకు పోతూ, ప్రజలకు చెప్పిన మాటలు ప్రతి అణువులోను ఉజ్జ్వలమై ప్రతిధ్వనించినవి. ఆమె ఎంత రాజసాంగనో అంత క్షమాశీల కూడాను. ప్రతిక్రియలోకూడ ఆమె దయ మంజులకాంతితో ప్రకాశిస్తుంది. అశ్వద్ధామ శిరోమణిని శిక్షాశుల్కముగా స్వీకరించేటప్పుడు చూపిన జాలి ఎంత ఉదాత్త మైనది? కౌరవులతో రాయబారములు జరిపేటప్పుడు, ఆ దేవి చెప్పిన మాటల్లో, ఎంత ఔచిత్యముతో ధర్మము, రాజనీతి, ధీరత్వము చూపినది. జూదములో ధర్మరాజు తన్నుకూడా ఓడిపోయినాడని విన్నప్పుడు వేసిన ప్రశ్నలోని న్యాయవివేచన ఆమె బుద్ధికౌశల్యాన్ని వెల్లడిస్తవి. ఆమె సౌశీల్యము రాజకార్య ధురంధ

రత్వాన్ని మించినది. అరణ్యములో సత్య అడిగిన సందేహాలకు యిచ్చిన జవాబులో ఆమె పాతివ్రత్యము, సేవాధర్మము, భక్తిప్రేమలు విశదమౌతవి.

రాణీ సంయుక్త

వైదిక, పౌరాణిక యుగాలతో, చారిత్రక నారీమణులుకూడ భారతజాతి దివ్యప్రతిభను హిమాలయ శిఖరాలమీద శాశ్వతకీర్తితో ప్రతిష్టింపగలిగినారు. హిందూదేశము పరాధీనమయ్యే సంధికాలములో ఒక దివ్యజ్యోతి ప్రజ్వలించి ధృవతారవలె నిల్చిపోయినది. ఆమె రాణీ సంయుక్త. హిందూదేశంలో కడపటి చక్రవర్తి అయిన పృధ్వీరాజును వరించి, కన్నతండ్రికి విరోధియై, భర్తతోపాటు స్వతంత్రము రక్షించుకోవడానికి నడుముగట్టినది. సంయుక్త నూతన సామ్రాజ్ఞి, క్రొత్త పెండ్లికూతురు, మధుపర్కాలతో మాతృదేశము కోసము హృదయరక్తాన్ని అర్ఘ్యమిచ్చినది.

దేశాన్ని పరులపాలు చేయవద్దని తండ్రిని ప్రార్థించినది. పృధ్వీరాజు గొప్పతనము శ్లాఘించినది. తన హృదయము విప్పి వేడికొన్నది. చేతులార అవివేకముతో చేసే పనియొక్క ఫలితము ఈ జాతిని చిరకాలము నిస్తేజము చేసివేస్తుందని పరితపించినది కాని లాభము కలుగలేదు. సంయుక్త ఈ లోకమును విడిచి సుమారు వెయ్యేళ్లు అయినది. కాని, ఆమె కీర్తికాయము లోకములో సుస్థిరముగా వెలుగులుజిమ్ముతూ, నిలిచియే ఉన్నది.

రుద్రమదేవి

రుద్రమదేవి తెలుగురాణి. రాజ్యముచేసిన రాణి. తెలుగుగడ్డ, శత్రువుల దండయాత్రల్లో శిథిలమై పోవడానికి ముందు ఓరుగల్లు సింహాసనము కాకతీయ రుద్రమ్మకు పసిడిపూలతో పట్టముగట్టినది. రుద్రమ్మ శక్తి, యుక్తి, సవ్యసాచిత్వము సాధించినది. ప్రజాపరిపాలనలో రుద్రమదేవి మిక్కిలి నేర్పరి. ఆమె కాలములో రాజ్యము సకలసంపదలతో హాయిగా తులతూగినది. తరుణవయస్సులోనే కీర్తిప్రతిష్ఠలతో సామ్రాజ్యమును పాలించి దివంగతుడైన గణపతిదేవుడు రుద్రమదేవి భర్త. దుర్భరమైన వైధవ్యదుఃఖాన్ని కాలకూటము వలె ఒకప్రక్క నిల్పి, కర్తవ్యపరాయణ అయినది రుద్రమదేవి. భారతభూమిలో రాజ్యముచేసిన స్త్రీలలో రుద్రమదేవి ప్రముఖస్థానాన్ని పొందినది. రాజ్యాంగాన్ని సమర్ధతతో నిర్వహించి, ఆంధ్రవైభవానికి యశోమాలికలు కూర్చినవారిలో రుద్రమదేవి ఒకతె. కాకతీయ సామ్రాజ్యానికి ఆ రాణి తిలకమువంటిది.

మాంచాల

మాంచాల పలనాటి వీరబాల. లావణ్యఖనియైన ఆ తరుణి ముగ్ధసౌందర్యము వికసింపకముందే బాలచంద్రుడు చెప్పుడుమాటలు విని తిరస్కరించినాడు. మనోహరుని ప్రణయావేశాలకు తీయని కలలు కంటున్న మాంచాల సుకుమారహృదయము ఒక్క నిట్టూర్పుతో నీరకాసె బిగించినది. ఆ ధర్మము పాలించడానికి బ్రహ్మచర్యము స్వీకరించినది. తండ్రిచేసే మహాయుద్ధంలో దుమకడానికి పొంగుతున్న బాలుని హృదయరక్తము పైకుబికింది. తల్లిని ఆజ్ఞ కోరినాడు కొడుకు యుద్ధానికి. పుత్రమోహము బంధిస్తున్నను తప్పించుకోలేక ధర్మపత్ని అనుజ్ఞలేకుండా పోవడము వీరధర్మముకాదు, చెప్పిరమ్మన్నది అమ్మ. పూర్తిగా తిరస్కృతయైన మాంచాల సదనానికి విచ్చేసినాడు బాలచంద్రుడు. ఆనందముతో, వెల్లివిరిసిన హృదయముతో ఎదుర్కొని,

ప్రేమాంజలితో పూలుపరిసినది; మోకరించి ఆ లేత పాదాలమీద జగన్మోహనమైన ఆ సౌందర్యముచూచి ముగ్ధుడైపోయినాడు బాలుడు. విశ్వమే మరచిపోయినాడు. బాలచంద్రుని వాంఛ మాంచాల తెలుసుకున్నది. పవిత్రమైన ధర్మాన్ని పాలించబోతూ వచ్చిన ప్రాణేశ్వరుడు వ్యామోహములో చిక్కుకుంటున్నాడని గ్రహించినది. ప్రేమానురాగాలు తొణుకులాడే మందహాసముతో వీరఖడ్గము చేతికిచ్చినది. దేశానికి, ధర్మానికి, సర్వము త్యాగముచేసి, ఆహుతి కావలసిన కర్తవ్యము పురికొల్పి, అమోఘమైన సౌశీల్యాన్ని కాపాడుకున్నది.

దూరమైపోయిన దాంపత్యసుఖము తలవనితలంపుగా అనురాగబంధముతో పైనవైచుకొనిపోయే అపూర్వతరుణములో సర్వము మరచి వివశులయిపోయే సన్నివేశములో నిశ్చలముగా ఆమె చూపిన ఆత్మ నిగ్రహము అత్యంత శ్లాఘాపాత్రము.

వెంకమాంబ

వెంకమాంబ విదుషి, కవయిత్రి, భక్తురాలు, యోగిని, జ్ఞాని. ప్రేమామృత స్రవంతులలో ప్రియుడైన కృష్ణదేవుని దివ్యగీతాలు కీర్తించిన మధురభక్తి వెంకమాంబది. (ఆమె శైలి అనర్గళము; ఆ కవితాధార పాటలు పద్యాల్లో తియ్యని తేనెసోనల నూరిస్తూ వివశులచేస్తుంది.) అధ్యాత్మ తత్త్వాన్ని పారము ముట్ట మధించి, ఆత్మానందముతో వేదాంతవీధులలో విహరించినది యోగిని వెంకమాంబ. పురుషులకుమాత్రమే స్వాధీనములనుకొనే వివిధ యోగసాధనాలు తీవ్రముగా అనుష్టించినది. ప్రాచీనకాలములో జ్ఞానయోగినులైన మైత్రేయి మొదలగువారివలెనే వెంకమాంబకూడా ఆత్మసాక్షాత్కారాన్ని పొంది తరించినది.

భారత నారీమణులు సతీధర్మము, శౌర్యసాహసాలు, విద్య, మేధాకౌశలము మున్నగువానిలోనే గాక, ధర్మదీక్షపూని మతప్రచారము చెయ్యడములోకూడ ముందంజవేశారు. అశోకచక్రవర్తి కొమార్తె బుద్ధదేవుని అహింసాసిద్ధాంతాన్ని అయిదువందల శిష్యులతో సింహళము, చైనా, జపానువరకూ ధర్మబోధ చేస్తూ ప్రచారము సల్పినది. అనేకమైన మతద్వేషాలు, మూఢాచారాలు, హిందూమతాన్ని గట్టిగా బంధించిన దినాల్లో ప్రేమామృతాన్ని స్వేచ్ఛగా ప్రవహించిన బుద్ధదేవుని అహింసా సందేశానికి ముగ్ధురాలై, రాజపుత్రి పరివ్రాజక అయిపోయినది.

నీతిసామెతలు

అన్నరసముకన్న ఆదరణరసము మేలు. ఆడితప్పరాదు, పలికి బొంకరాదు.
ఇంటిదొంగను యీశ్వరుడును పట్టలేడు. ఈతచెట్టుక్రింద పాలుత్రాగినను కల్లే అంటారు.
ఉద్యోగము పురుషలక్షణము. ఊరికంతావకదోవ వురిపికట్టకు ఒకదోవ
ఋణశేషము, వ్రణశేషము, శత్రుశేషము వుంచగూడదు. ఎరుక పిడికెడిధనము.
ఐశ్వర్యానికి అంతములేదు. ఒక అబద్ధము కప్పడానికి వెయ్యి అబద్ధములు కావలెను.
ఓరిస్తే ఓరుగల్లు పట్టణమవుతుంది. ఔషధానమ్ అనపధ్యానమ్ చెల్లు, రోగముపై పెచ్చు

—శ్రీమతి కోటదుర్గ సోమిదేవమ్మగారు.

ప్రేమ, భక్తి, జ్ఞానప్రసన్న పారిజాత ప్రసూనములు

శ్రీయుత వి. అ. సూర్యనారాయణగారు

'Serene will be our days and bright
And happy will our nature be
When love is an unerring light'
(*Wordsworth*).

Sweeter than anything sweet is the art of love; greater than anything great is the art of giving it (love) up.

మానవజీవితములో ప్రేమసుధామాధుర్యమును గ్రోలుటకంటె నెక్కుడు ప్రీతికరమగు ఆనందానుభవములేదు. అట్లనే భక్తి పులకితమగు తన్మయత్వము నొందుట కంటె నుత్తమమగు ఆంతరంగికానందములేదు. ఆనందతరంగముల నోలలాడించు ప్రేమాతి రేకసుఖమును, ప్రేమపాశ సంబద్ధసంసారమును, బుద్ధునివలె పరిత్యజించుటకంటె ఘనమగు పరమార్ధము పృథ్విలోలేదు.

ప్రేమపారవశ్యమే మానవత్వముయొక్క సంపూర్ణసౌందర్యప్రభావమని చెప్ప దగును. గోపికలు శ్రీకృష్ణునెడ బ్రసరించిన ప్రేమమాధుర్యములో, స్త్రీ పురుషుల అన్యోన్యానురాగములో నిండి నిబిడీకృతమైన మానవదివ్యత్వస్వరూపములు పూర్తిగ ప్రత్యక్షమొనరింపబడినవి. భక్తిపారవశ్యముచే భగవంతుని సాక్షాత్కారము చేసికొనగల్గుటేకాక పరమాత్మని సేవలనుగూడ బడయగల్గిన సతీసక్కుబాయి సుచరిత్రములో స్త్రీ వ్యక్తిలో గల దివ్యత్వము తేజరిల్లెను.

భక్తియొక్క పరిపక్వదశయే జ్ఞానజ్యోతియొక్క దివ్యప్రకాశమైయున్నది. ప్రేమ, పవిత్రతను బొందినపుడు భక్తిగ మార్పుజెందును. భక్తియను బంగారము వైరాగ్యమను అగ్నిలో శుద్ధిజెంది జ్ఞానమను మేలిమియై ఘనతగాంచును.

ప్రేమ ప్రధానముగ నైంద్రికానుభవము. అహంకారములోగూడిన ఆనందాన్వేషణము ప్రేమయొక్క సహజస్వభావము. భక్తి నిరహంకారభావముతోగూడిన ఆంతరంగికానుభవము. జ్ఞానము కేవలము ఆత్మానుభవము. ఆత్మజ్ఞానములో, సర్వభూతములతో నైక్యభావమేర్పడును. ప్రేమయొక్క సంపూర్ణత్వము భక్తియొక్క ప్రథమ సందర్శనము. ప్రేమ అను క్షీరములలోనుండి భక్తి అను మీగడ తయారగును.

స్త్రీ పురుషుల ప్రేమపవిత్రతకు శ్రీ సీతారాముల దాంపత్యమునకు మించిన దృష్టాంతములేదు. ప్రేమయొక్క పరిపూర్ణత్వమునకును భక్తియొక్క పారవశ్యమునకును శ్రీ రాధామాధవుల దివ్యలీలలను మించిన మంచి నిదర్శనములేదు. భక్తియొక్క ప్రభావమునకు, జ్ఞానముయొక్క ఘనతకు, ప్రభంజనపుత్రుడును, ప్రహ్లాదకుమారుడును ప్రశస్త ప్రత్యక్ష ప్రమాణములుగ పురాణములు బోధించుచున్నవి.

మహాపురాణములలో మహినుతికెక్కిన మూడింటిలోను మహాభారతము శిక్షణ గ్రంథము. అందుచేతనే అది బాల్యములో చదువవగిన సద్గ్రంథమని పెద్దలు చెప్పుదురు. ఇందు ప్రపంచ ధర్మములన్నియు ఇతిహాసరూపమున వెల్లడింపబడినవి.

శ్రీమద్రామాయణము అనుభవగ్రంథమగుటచే యౌవనదశలో పఠింపదగినది. శ్రీ సీతారాముల ఆదర్శ దాంపత్య ధర్మములను బాగుగ మననముచేసికొని స్త్రీ పురుషులెల్లరును ఆ పురాణదంపతుల పవిత్రజీవితముల ననుసరింప పాటుపడుటకంటె మానవజీవితములో మహితధర్మము లేదు.

శ్రీమద్భాగవతము భక్తిజ్ఞానవైరాగ్య ప్రబోధకమైన ఆధ్యాత్మిక గ్రంథము. ఈ యుత్తమపురాణము కేవలము భక్తిసుధాస్వాదన మత్తచిత్తులగు సుజనులకు కలకండవలె తియ్యనై కంఠమునంటియుండు మాధుర్యముతో నిండియుండును.

శ్రీ మహాభారతము షడ్రసోపేతమైన విందుభోజనమువంటిది. శ్రీ మద్రామాయణము, ప్రశస్తమైన గోధుమపిండిని తీయని గోక్షీరములతో కలిపి, కమ్మని ఘృతమునందు చేర్చి, మధురమగు ఖండశర్కరతో మిళితముచేసి, అందు మనోహరమగు భావములను ద్రాక్షపండ్లను, కమనీయమగు భాషాపరిమళద్రవ్యములను మిశ్రితమొనర్చి, చక్కగ తయారుచేసిన పిండివంటకము (శ్రీ సీతారామాంజనేయ ప్రసాదము)మాదిరి నుండును. ఈ భక్ష్య పదార్థమును భుజించిన భక్తులకు మోక్షమును ఐహికసుఖమును తప్పక సిద్ధించును.

ప్రేమానుభవమునందు, తనవారు, పెరవారు, అను భేదభావములకు తావున్నది. ప్రేమ స్వాభిమానముతో గూడిన సౌహార్ద్రరసమును ప్రవహింపజేయును. భక్తి ప్రతి జీవియందును భగవత్స్వరూప ప్రతిబింబమునే పొడగాంచుచుండును. ఆత్మానందము నందరిలో నన్వేషించుచుండును. జ్ఞానము అఖిలజీవులలో ఆత్మస్వరూపమునే అవలోకించుచుండును.

"ఆత్మవత్సర్వభూతాని యఃపశ్యతిసపండితః" అనునట్లు విశ్వప్రేమమహిమను వెల్లడింపగల జ్ఞానమే నిజమైన బుద్ధిపరిపక్వప్రాభవము. ప్రేమ భాసురమగు మధురభావముల

నుండి భక్తిపుష్పము వికసించి, బుద్ధిపరిమళమును ప్రసరింపజేసి, త్రికరణశుద్ధితో గూడిన చిత్తశాంతిని సందీపింపజేసి, ఆత్మజ్ఞానానందమును అన్నియెడలను చిందుచుండును.

'Love is the highest moral law' అని ఆంగ్లకవి కోకిలమగు షెల్లీ (Shelley) సుజ్ఞాని చెప్పినటుల ప్రేమకుమించిన నైతికధర్మ మిలలోలేదు. భక్తికిమించిన పరమధర్మము లేదు. దయకుమించిన దివ్యగుణములేదు. సత్యమునకుమించిన జ్ఞానసంపదలేదు. ఆత్మజ్ఞానమునకంటె అధికైశ్వర్యము అవనిలో నుండబోదు. తన్నుదాదెలిసిన సర్వము నెరుంగగలుగును. ప్రేమ కాంతిపుంజమునుండి భక్తి ప్రకాశమును, భక్తి ప్రకాశిత బుద్ధివైభవము నుండి దివ్యజ్ఞాన తేజస్సును సంభవమగుచున్నవి.

ప్రేమతత్త్వమును పరిపూర్ణముగ ననుభవముచే నవగాహనమొనరించికొని, ప్రేమ ప్రభావమును ప్రపంచమునకు చాటిన ప్రఖ్యాత పాశ్చాత్య కవిశ్రేష్ఠుడగు బ్రౌనింగు మహనీయుడు ప్రేమయే జ్ఞానమునకు ప్రధాన హేతువని చెప్పియున్నాడు.

"So let us say, not since we know we love.
But rather since we love, we know enough"

పై వాక్యములో బ్రౌనింగుకవి మానవప్రేమకు జ్ఞానముకారణము కాదనియు జ్ఞానమునకుమాత్రము ప్రేమకారణమనియు ప్రస్ఫుటమొనరించియున్నాడు. ఈవాక్యములోని భావము నాధారముజేసికొని ఒకపెద్దవ్యాఖ్యాన గ్రంథమును వ్రాయవచ్చును.

ప్రేమ, హృదయపారిశుద్ధ్యమును, భక్తి ఆంతరంగికపవిత్రతను, జ్ఞానము చిత్తసంశుద్ధిని, చిత్తశుద్ధి, పూర్ణప్రజ్ఞను గలుగజేయుచున్నవి. 'Self - reverence, self - knowledge, self - control, these (three) lead life to sovereign power' అని ఆంగ్లకవి పుంగవుడగు టెన్నిజన్ (Tennyson) మహాశయుడు చెప్పియున్నాడు. ఆత్మగౌరవము, ఆత్మజ్ఞానము, ఆత్మనిగ్రహము, ఈ త్రిగుణసాధనము, త్రైలోక్యాధిపత్యమును, అతులిత శక్తివైభవమును, శాశ్వతానంద సామ్రాజ్య సార్వభౌమపదమును ప్రసాదింపగలవనుట అతిశయోక్తికానేరదు.

ప్రేమ ప్రతిఫలము నపేక్షించును. ప్రేమించిన పదార్థమును హృదయములోనిడుకొని, ఆనందముననుభవింప నభిలషించును. ప్రేమపరవశుడు స్వార్థపరత్వముతోగూడిన భావములను ప్రేమయొక్క సంపూర్ణ సాఫల్యమునకై ఆవేశమను అగ్నిలో ఆహుతినేసి తత్త్యాగయజ్ఞఫలితమగు శాంతానందప్రసాదమును భుజింప నాకాంక్షించును.

భక్తి, భగవత్పాదారవిందసేవా సంజనిత దివ్యమకరందబిందు సందోహమును తప్ప నితరమును గోరదు. భక్తియొక్క మాహాత్మ్యమే జ్ఞానముయొక్క సహజతేజము. ప్రేమ

ఆశాప్రపూరిత ఆనందమును, భక్తి ఆశాపాశ పరిచ్ఛేదన ప్రసాదితమగు భగవదనుగ్రహమును, జ్ఞానము సర్వసంగపరిత్యాగ సహితమగు తాదాత్మ్యము (ఆత్మతో నైక్యము నొందుట)ను అనుభవింపగోరును.

ప్రేమ స్వర్గమునుదాటి, భక్తి శాంతిసౌధాగ్రము నెక్కి, జ్ఞాననిలయములో వెలుగొందు నిశ్చలతత్వపదవిని స్వాధీనము జేసికొనిన పిదప మోక్షసామ్రాజ్య సింహాసనము నధిష్ఠింపగల భాగ్య మొదవును. శ్రీ బుద్ధదేవుడు సిద్ధిజేసికొనిన నిర్వాణమే ఆత్మజ్ఞానానందానుభవముయొక్క అంత్యావస్థ.

విశ్వప్రేమమయుడై విలసిల్లి, భక్తిరసప్రపూర్ణుడై భాసిల్లి, జ్ఞానతేజోనిధియై మానవజన్మఘనత నుద్దీపింపజేసి, వైరాగ్యప్రజ్ఞావైభవోపేతుడై వేదాంతసత్యస్వరూపమును వెలయించి, ప్రపంచమతసామరస్యమును నిత్యజీవితానుభవములచే ప్రత్యక్షమొనరించి, అవతారపురుషుడై భువినుద్భవించి, భారతమాత దివ్యమతిమాహాత్మ్యమును ప్రపంచమునకు వెల్లడించి, భారతీయులెల్లరిచే భగవత్స్వరూపముగ భావింపబడి పూజింపబడుచున్న శ్రీ రామకృష్ణపరమహంసదేవుని దివ్యసుందరమూర్తి నొకపరి ధ్యానించుచో ప్రేమ, భక్తి, జ్ఞానప్రసన్న పారిజాత ప్రసూనములు భావప్రపంచములో ననంతములై ప్రకాశించును.

శ్రీమద్భాగవతములో, బమ్మెరపోతరాజు, ప్రహ్లాదచరిత్రలో పొంగిపొరలజేసిన భక్తిజ్ఞానవైరాగ్య ప్రవాహతరంగములలో, శ్రీ సచ్చిదానందబ్రహ్మస్వరూప సాక్షాత్కారమునకు సాధనమైన పరమార్థము నీ దిగువ నుదాహరింపబడిన పద్యములో ప్రపంచమునకు బయల్పరచినాడు. ఈ పద్యమందలి దివ్యసత్యము నెదలో దలంచి, తన్మయత్వమును జెందుటయే జీవిత పరమార్థము. దివ్యజ్ఞాన సారస్వతసారమగు నీ పద్యరత్నమును ప్రేమారధకులును, భక్తిమార్గానుచరణాసక్తులును, జ్ఞానతత్వవిచార నిమగ్నులును బాగుగ పరిశీలించిన సర్వార్థసిద్ధికరమగు సత్యము తేటపడగలదు.

సీ. 'నీ గృహాంగణభూమి నిటలంబుమోవంగ, మోదించి నిత్యంబు మ్రొక్కఁడేని
నీ మంగళస్తవనికరవర్ణంబులు పలుమాఱు నాలుకఁ బలుకఁడేని
నీయధీనములుగా నిఖిలకృత్యంబులుఁ, బ్రియభావమున సమర్పింపఁడేని
నీపదాంబుజముల నిర్మలహృదయుఁడై, చింతించి మక్కువఁ జిక్కఁడేని
నిన్నుఁ జెవులార వినఁడేని నీకు సేవ, సేయరాఁడేని బ్రహ్మంబుఁ జెందఁగలఁడె
యోగియైనఁ దపోవ్రతయోగియైన, వేదియైన మహాతత్త్వ వేదియైన'

లలిత శపథం

శ్రీమతి దుగ్గిరాల వెంకటసుబ్బమ్మగారు

రాజ్యంవద్దనుంచి సమాధానంకోసం ఉవ్విళ్లూరుతూంది లలితం. నిజంగా రాజ్యమంటే చిన్నతనంనుంచి లక్ష్యమున్నూ, నమ్మకమున్నూ, ఉండేది. ఆటపాటల్లోకూడా మంచి "జోస్తీగా" వుండేవాళ్లు. ఒకటే మనస్సు. ఒకటేమాట. ఆట్లాజరిగింది చాలాకాలం. ఐనా ఆడపిల్లలకు యెంతకాలం జరుగుతుంది పుట్టింట. వయస్సున రెండుసంవత్సరాలు పెద్ద. లలితకన్నా రాజ్యం. ఆవారముందే కాపురానికి వెళ్లింది. ఇంటిదగ్గిర యిల్లు కావడంచేత యెంతో చమత్కారంగా వుండేవాళ్లు యిద్దరున్నూ. రాజ్యంచెప్పేమాటలకు యెంతో విలువ చూపించేది. వాళ్ల జీవితాల్లో "యెడమొహం," "పెడమొహం," గల ఘట్టాలు యెప్పుడూ జరగలా. అందుకనే వాళ్ల స్నేహలత పత్రజలంచేత శుష్కించకుండా మనోవృక్షాల్లో అల్లిబిల్లిగానల్లుకుంది.

లలిత ప్లీడరుగారిపిల్ల 1. ఇప్పటికి 18 యేండ్లుంటాయి. కాపురానికి వచ్చినప్పటినుంచి సతీపతులకు శృతికలవలా. "గాల"ని "ధూళ"ని యెన్నో వైద్యాలు చేయించారు. విసుగెట్టింది. అంటే తొలుచూరి బిడ్డ వడంచేత, ప్లీడరుగారు యెత్తెత్తుబంగారంగా పెంచి ఇష్టంవచ్చినట్లు స్వాతంత్ర్యమిచ్చాడు చిన్నతనంలో. ఆ రోజుల్లో అలవడ్డ నాగరికతా బీజాలు నేడు సతీపతులమధ్య విషబీజాలుగా మారినై.

లలిత భర్తపేరు సుందరం. సుందారానికి తల్లివగైరా అంతావున్నారు. తండ్రి చిన్నతనంలోపోయాడు. కాని గంపంతబలగంవుంది. పూర్వీకులు సంపాదించిన అగ్రహారాలవల్ల జీవనాధారం.

నాలుగుమూడు భాషల్లో వ్రాయను, చదువను, తెలుసును. కాని స్వభావసిద్ధమైన అలంకారాదులకే వాని హృదయపీఠంలో చోటుంది. ఆకారణంచేతనే, లలిత వేషభాషలంటే అసహ్యం అనిపించింది. తన మార్గాన్ని నిరోధించడంచేత లలితకున్నూ అంతే. మొదట్లో లలితపట్ల అనేకవిధాల అనుకున్నా, తర్వాత గ్రహించుకున్నారు పెడమూర్ఖతనమని గృహంలోనివారు.

ఒకరోజు విచారంతో ఆలోచించడం ప్రారంభించింది లలిత. యేమేమో ఉద్దేశాలు తట్టినై. యీ విషయమంతా రాజ్యానికి తెలియజేసి తదభిప్రాయంగా వెళుదామని నిశ్చయించుకుంది......అప్పటికి వారం రోజులైంది ఉత్తరంవ్రాసి. సమాధానంరాలా. ఆదుర్దాపడింది. క్రిందటిరోజున తపాలాలోవచ్చిన వుత్తరాన్ని తీరెల్లాచదివి మళ్లాడ్రాయిరుమీద పెట్టేడు చెక్కుచెదరకుండా సుందరం. యేదోవిచారంతో గదిలోకెళ్లి తిరగడంలోకమ్మ కంటబడింది లలితకు. బ్రహ్మానంద పడ్డది. గది తలుపులు గట్టిగాబిగించి మనస్సున చదవడం మొదలెట్టింది.

ప్రియమైన సోదరీ!...

నీవువ్రాసి పుత్తెంచిన వుత్తరమందినది. సంగతులు తెలుసుకొంటిని. శుష్కించిన చిన్ననాటి స్నేహపాదపమునకు, పత్రగంగోదక మిచ్చి మరింత పుష్టినిచ్చు నీలేఖిని ప్రశంసాపాత్రము. కమ్మ చదువునంతసేపును నీవు

సమీపముననున్నట్లే భావించితిని. మనము గొబ్బిళ్ల పండువరోజులలో తోటిబాలికలకన్న ముందులేచి ప్రాతఃకాలమున "గుమ్మడిపూలకును, ఆవుపేడకును," పాతగలాడు నాటిదినములు నా మనోవీధి నొక్కసారి గోచరించెను. తల్లిదండ్రుల ప్రేమచే మృదుహస్తములలో మెలగు స్వాతంత్ర్యపు-బాలికలుగానున్న దినములు కదా మిక్కిలి పవిత్రములైనవి. సాంసారిక సుఖదుఃఖములకులోనుగాక అపరపరబ్రహ్మమూర్తులో యనభాసిల్లు శిశువులజీవితము ధన్యము చెల్లీ!

మీ సతీపతుల మధ్యనున్న యీ కలహనాటకము విషాదాంతముగా మారకుండునట్లు జాగరూకతతో వర్తింపుము. భవసాగరమున భార్యాభర్తలిరువురు ప్రయాణీకులు. జీవితములే నౌకలు. ధర్మార్థకామ మోక్షములు తీరములు. ప్రయాణమున ననుభవించు కష్టసుఖములకు నిరువురునూ సమానభాగస్వాములే యగుదురు. అనుక్షణమును వివాదలకు తావిచ్చినచో గమ్యస్థానమును చేరక విఫలమనోరథులగుదురు. ఇంతకు పాశ్చాత్య వ్యామోహములచే సంక్రమించిన ఆచారములు మనల బద్ధులచేసినవి. నేటి నాగరిక భామినులనేకాక పూర్వాచారముల ననుష్ఠించు శ్రోత్రియకుటుంబ వృక్షములకు సహితము యీ చీడపురుగు తప్పినదికాదు. కాని యేది యెట్లున్నను భర్తనుల్లఘించి వారి మనస్సు నసంతృప్తిపడునట్లు పెంకెపట్టుదలతో పెనగులాడు నీ సాహసము పరిహాసమునకు నావాసము. చేతులార చేసుకొను నీయకృత్యమును దైవికమనియు, కర్మయనియు, వాకొందువు. అది పట్టి తెలివితక్కువయని చెప్పుదును. నాపై విసుగుకొనక ప్రశాంతముగా నాలోచించిన నీకే బోధయగును. అదిగాక భర్తకసహ్యముగాతోచు ననాగరికత లెవరికి? పతియేగతియని కదా, చంద్రమతి, దమయంతి, సావిత్రిమొదలగు సతీమతల్లులు తమతమ భర్తలతో అష్టకష్టములకులోనై సర్వసౌఖ్యములకు నూరులైరి. వారివలె కాంతారములకు నేగకయే ఇంటనుండి మహామహిమను సంపాదింపకల్గుదువే! అడకువతో పతిమాటలనేల యంగీకరింపవు? నీ నాధుడు చెప్పునట్లునడచిన నీకుగల్గుకష్టమేమి? వారు పూర్వాచార పరాయణులు. బూటకపు నాజూకన్న సుతలాంవారికి నచ్చదు. చూడగా మీ దాంపత్యము "కళాపూర్ణోదయములోని శాలీన సుగాత్రులకధ" జ్ఞాపకము తెచ్చుచున్నది.

బుజాలవఱకును తమ్మకాయలవలె వ్రేళ్లాడు ఆ "లోలాకుల" తీసినమాత్రమున లోపమేమి? మంగళప్రదమై వివాహవేళ అగ్నియెదుట ప్రమాణపూర్వకముగా మెడనుకట్టిన నల్లపూసలు మోటుగానుండినవని మెడనుండి తీయుటకు నెట్లు సాహసించితివి? "భూషణములు పుట్టినప్పుడు లేవుకదా. పెరిగినప్పుడేల" యని ప్రశ్నింతువు. యెంత వేదాంతము కలిగినది? నీవు ధరించెడి చీరె పుట్టినప్పుడే మొలకు చుట్టబడివుండెనా? భారసాలరోజుననే జుట్టుముడికి పిన్నీసులచే బంధనమేర్పడెనా? లలితా! మెట్టెలు, పాదాభరణములు, ముక్కుపుడకలు, నొష్టకుంకుమ సహితము విసర్జించిన నీకొదవు లాభమేమి? అమంగళసూచకమే కాని నాజూకు కానేరదే! యెన్నడునూ పతివ్రతయైన కాంత వీటిని యేమరక రక్షించుచుండును. ఒకరేది ప్రారంభింతురో దానిని విమర్శింపకే వారి మతమును సులువుగా గొర్రె దాటుడువలె అనుకరింతుము. అది మనలోనున్న గొప్ప పొరపాటు. యేవి మనమనుష్ఠించిన ప్రమాదములు కానేరవో, యేవి సంఘమును, మానవ జీవితాశయములను భగ్నమొనర్ప యత్నింపవో, అవి పరిశీలనారూపమున ననుష్టించుట శ్రేయోదాయకము. భర్తకు శుభముగోరు యే పడతి, నాధుని సంపూర్ణారోగ్యమునుగోరు యే సత్సతి, పతి జీవించియుండగనే, వారి సాక్షాత్కారమున కంఠమున తాళివినాగా శరీరమునందుగల సర్వాభరణాదులదీసి, దీపపు శెమ్మెవోలె.

మోడుగా నుండుటకు నిశ్చయించును? పాశ్చాత్య నారీమణుల నాగరికతా వ్యామోహముచే సమ్మోహితులమై, యెంతయో పూర్వజ్ఞానశూన్యులమై, ప్రతిభ దఱిగియుంటిమి. చెల్లీ! మోచేతులవఱకును నీపతి చెప్పినట్లు రవికల కుట్టించుకొనకూడదా. నీకా చంకలవఱకనే పంతమెందుకు? నీకొఱకు నిత్యము తెచ్చు పూలను కొప్పునందు తుఱుముటకు నాజూకు కాదని ఆ నల్లటి వాడిదేరిన ఇనుపమొద్దు సూదుల గ్రుచ్చుకొనుట చూడ యెంతయో విషాదకరము. మొదట నిన్నా సినిమాలకు తీసుకొని త్రిప్పిన ఫలితము నాథుని కట్టికుడుపుచున్నది. మన పూర్వీకులు ఆరోగ్యపద్ధతులతో జతపఱచి కొన్ని సదాచారముల నెలకొల్పిరి. వాటిని నిస్సారముగా నీనాడు చూచి తత్ఫలితముల ననుభవింపుచుంటిమి. మోమును మిసమిసలాడు పసుపుచే తోముకొనుటకన్నను తెల్లటి విభూదివోలెనుండుదాని నద్దుటచే వచ్చిన అందమునకు విలువ నిర్ణయింపరానిదికదా! నా లలితా! నీవే తగిన శిక్షణను నేర్వనప్పుడు నీ సంతానమును నెట్లు తీర్చి దిద్దకలవు. సాంసారిక తాపత్రయములలో బడి దివారాత్రములు తిరుగాడు నీ పతి జీవితమున "శాంతి" యనునదెక్కడిది? నాథుని సంతృప్తిపఱచలేని నీవు గృహమున గల నాప్తుల తలలోని నాల్కవలె మెలగనేర్తువా? నీ ప్రవర్తన మెచ్చదగనిది. ఇదిమొదలు నామాట నంగీకరించిననే నీ కష్టసుఖములను దెల్పుము. తేకున్న......మగవారలు స్వాతంత్ర్యజీవులు. మన కెన్నటికిని స్వతంత్రతలేదు. స్వతంత్రముగా మనమున్న ఒకరందురనికాదు. అది మానవతులకు తగనిపని. మనము గృహలక్ష్ములుకాని, పురలక్ష్ములము కాముకదా. సమాన ప్రతిపత్తిని కలిగింపజేయలేదని పురుషులపై నిందమోపుటసభ్యము. మనలోపమును సవరించుకొనికదా యితరుల విమర్శించుట. మరొకప్పుడు యీ విషయమై నీయెదుట తెల్పెద. ఆ మూలాగ్రముగా విసుగుచెందక చదువుము. నీకు సంపూర్ణముగా నచ్చిననే నా భావముతో నేకీభవింపుము. నా తోచినమాటలివి. ఇంతయును స్నేహముచే వ్రాయవలసివచ్చెను. మీబావ బజారునుంచి వచ్చే సమయమయింది......సెలవు."

స్వర్ణపురి,
9—11—1939.

నీ సోదరి,
రాజ్యం.

కాస్త కాస్త చొప్పున ఉత్తరమంతా పూర్తిగా చదువుకుంది. చేతులు వణుకుతున్నై. త్రాగిన కాఫీ నీళ్లన్నీ కళ్లల్లోంచి కారుతున్నది. లోకమంతా అంధకారంగా తోచింది. అవ్యక్తానికి చింతించుకుంది. పతిని లక్ష్యపెట్టక అశాశ్వతమైన యీ శరీర సౌందర్యమునకు యెంతటి ఘోరమైన కలతను, కళంకరహితమైన యీ కాపురానికి కల్పించితినని వగచింది. అన్నపానాదులకు నలజడిలేక—పూర్ణారోగ్యము కలిగి చదువుకున్న పతి లభ్యమైనను అనుభవించు యోగ్యత నోచుకొనని నా జీవితమెంత నికృష్టమైందని అనుకున్నది. నిలువుటద్దములో ప్రతిఫలించిన తనరూపు చూచుటకు పెద్ద తప్పుగా తోచింది. స్వరూపములో "వితంతువులకునూ, తనకునూ భేదమేచట" యని వితర్కించి నిట్టూర్పువిడిచింది. తనకెదురుగా వాకిలిపై వ్రేళ్లాడుతున్న భర్త పఠాన్ని చేతబట్టుకుని వక్షస్థలానికి గట్టిగా నద్దుకుంటూ, మనస్సులో యేదో సంకల్పించి నిశ్చలచిత్తంతోటి ప్రమాణంచేసుకొంది లలిత...

జీవయాత్రకుఁ దగిన నెచ్చెలివి నీవ.

చ. నెలకొకసారి మాదటిని నిండుకళల్ వికసింపఁజేసి, స
ల్లలితములైన వాక్యములఁదన్పుచుఁ గన్పడుచుందువీవు నీ
వలన సతీత్వ తత్త్వగుణవైఖరి యిట్టిదటన్నమాట నె
చ్చెలులనుగూడి సంస్మరణఁ జేసికొనందగు భాగ్యమబ్బెడిన్.

సీ. ప్రతినెలకొకసారి రానుంటివన్నచో నాత్మలో నుల్లాసమంకురించు
వచ్చినయంతనే నెచ్చెలులంగూడి మించువేడుక నిన్గౌగిలించుకొనుచు
మనలఁ బోషించెడు మాతయే యిదియంచు నీ గుణమింత వర్ణించుకొనుచు
తిరిగి నీవిటకేగు దెంచెడుదాకనీ చెయ్వులే నిత్యంబుఁ జెప్పికొనుచు

గీ. నింటపనులైనమాని నిన్నింత మెచ్చి
కొనుచు విమలవిజ్ఞాన సద్గుణములెల్లఁ
బట్టుబడునంచు నిన్నెప్డు వదలకుండఁ
దలఁచుచుందునో గృహలక్ష్మి తల్లికాన!

సీ నీవల్లనేగదా నిజులధర్మంబులు నిరతంబు భక్తిగానేర్చుచుంట
నీవల్లనేగదా నీకైన స్త్రీధర్మ మత్యంతశ్రద్ధతో నరయుచుంట
నీవల్లనేగదా నీతిబోధకమగు వ్యాసాళిఁ బఠియించుభాగ్యముంట
నీవల్లనేగదా నిశ్చలతత్త్వంబు సాధింపఁగాఁజాలుశక్తిఁగనుట

గీ. ఇట్టినీతికి భూతికి నెల్లయెడల
నాలవాలమై వికసించి యలరుచున్న
నీకు గృహలక్ష్మి పత్రికా! నిత్యశుభము
కల్గుఁగావుత లోకవిఖ్యాతి మీఱ.

గీ. వసుధనెచ్చెలు లెందఱోవచ్చి పోవు
చుందు రేకాని నీవలె నొక్కరైన
జ్ఞానబీజంబు నాలోననాటినారె?
జీవయాత్రకుఁ దగిన నెచ్చెలివి నీవ.

—శ్రీ వాజపేయయాజుల మహాలక్ష్మి.



శ్రీయుత కేసరిగారు స్వర్ణకంకణములను బహూకరించుట

గృహలక్ష్మీ జయంతి మహోత్సవము

కవితిలక శ్రీమతి కాంచనపల్లి కనకాంబగారిచే స్వర్ణకంకణగ్రహీతలకు బిరుదప్రదానము

కళాకలాపము

కవితాకళ

శ్రీయుత గోనెల నరసింగ రావుగారు ఎం. ఏ. బి. యల్.

కవితాకళలోనిఘనతను కనులకు గట్టురీతి నొప్పుచు కమనీయమగు భావములతో మనోహరమగు నుపమానములతో వచనరచనా కౌశలముతో నీవ్యాసరాజము విలసిల్లుచున్నది. (గృ॥ సం॥)

గృహలక్ష్మి “కళాకలాప”మున కేదే నొకకళకు సంబంధించిన వ్యాసమును వ్రాయుమని శ్రీసంపాదకులుకోరినారు. నాకు కవితాకళారాధన ప్రియమైనట్లన్యములుకావు. కాక, “కళాకలాప” మను పేరులోనే కవితాకళ తళుక్కుమనుచున్నది.

లలితకళలలో నగ్రతాంబూలము నకర్హమైనది కవితాకళయేనను లోకమ్మందన మున్నది. ఏకళనుపాసించు వారాకళయే నన్నిట నుత్తమమైన దనుకొనుట నైసర్గికము. శిల్పులు శిల్పకళను, చిత్రలేఖకులు చిత్రకళను గాయకులు సంగీతకళను, నటకులు నాట్యకళను, కవికుమారులు కవితాకళను నలౌకికప్రేమతో పూజింతురు. కావున భక్త్యాదరములను బురస్కరించుకొని యేశాఖకుఁజెందిన వారాశాఖకే ప్రధానస్థానమిచ్చుచుందురు. ఇది సర్వసాధారణముగఁ నందఱకుఁ దెలిసినవిషయమే. కాని న్యాయసమ్మతముగఁ మాట్లాడవలసివచ్చినపుడు మాత్రము, సాహిత్యకళదే తొలిపలుకు.

‘కవితాకళ’ యన నొక్కకావ్యములకు సంబంధించిన కళావిశేషమే యనుకొనరాదు. అనఁగా నొక్క పద్యరచనములోనే మెఱసిపోవుచున్నదనుట కుంఛితభావము. జాళువాకైఁతలో, నమృతవాక్కులో, దేనెలొల్కుమాటలో, జిలిబిలిపాటలో, కవితాకళ చెమర్చిపోవుచున్నది. తుదకు పాపని ‘అత్తలో’, బాలుని ‘అమ్మలో’, మారాముమాటలో, గారాబుపాటలో, పిల్లల ‘ఓనామఃలో’, ‘కా’ గుణింతములో, చెల్లాయి ‘చెమ్మచెక్కలో’ బాబాయి దసరా పదాలలో, నమ్మాయి సరిగమలలో, ‘పిల్లారి’ గీతములలో, నబ్బాయి ‘కాకి’ కథలో, నీతిపద్యములలో, కన్యక ‘త్యాగరాజ’ కృతులలో, యువకుని ‘జాతీయ’ గీతాలలో కవితాకళ పుక్కిలింతలై పోవుచున్నది. యువతీయువకుల యమాయకపు మాటలందు, ప్రేయసీప్రియుల మకరందవచనములందు, స్త్రీ పురుషుల ప్రౌఢసంభాషణలందు, కవితాకళ కులికిపోవుచున్నది. ఆనందములో పొటమరించి, ప్రణయములో పులక

రించి, సంసారములో కౌఁగిలించి, జ్ఞానములో 'కునికి, నిద్రించి, లేచి', పోవుచున్నది కవితాకళ. చిక్కనపాట్టకు పీయూషమిచ్చి, ముదురుగుండెకు నవనీతమిచ్చి, సోలినకన్నులకు నవ్వువెన్నెలలిచ్చి యాదరించుచున్నది కవితాకళ.

ఇంతయేల, కవికి కవితాకళ ప్రకృతిలో మొగముఁజూపును. కవి, కళాదృష్టితో ప్రకృతి దెసఁ గన్నులుగదలించును. కవితాకళ ప్రసన్నవదనముతో, తీయనిహృదయముతో మందహాసచంద్రికలతో స్వాగతమొసంగుచుండును. కవికళామయప్రకృతిలో లీనమై పోవును. మేఘశకలాలలో నేడువన్నెలుజూచి, మందపవనములో మురళీరవమునాని, స్వాతిజల్లులలో ముత్యాలుదోచి, పున్నఁపువెన్నెలలో మంచుముసుఁగులుత్రోసి, కలికి 'కోహినూరు'లో కరుణారసముఁగ్రోలి, కెంపెక్కినకన్నులలో ప్రేమరహస్యాలునాటి, విరుల వలపులలో తేలి, గిరులశిఖరాలనేలి, తీవెపరదాలఁదాఁగి, కేకిసుందరి చెంతకేఁగి, మించు చాన పొంతనాగి, మురిసిపోయి, తొణికిపోయి కవితాకళ కవిహృదయములో కరఁగి పోవుచున్నది. "మంచునవ్వు"లతో నంబరమునకుమొలచు "చందమామబుడుత"ను "కుముదముతేనెతో నెదురుకొని" కావించుపూజకునిక్కి, "కన్నెగాడ్పు"ల విన్నాణపుఁ బన్నాగములకుఁజొక్కి, "పుష్పితనికుంజవిలాసి"నికి దక్కి, యానందకంధిని మునిఁగి తేఁలిపోవుచున్నది. "గర్భిణీమేఘము"లలో "పిల్లనెలగాని"లో "గాడ్పుబిడ్డ"లలో "పూగుత్తిసొమ్ము"లలో, "చిగురాకులకోక"లలో కవితాకళనిండి యంచులు దాఁటి పోవుచున్నది. సాంధ్యచిత్రకారుని వర్ణచయములో వెలసిపోయి, గండుకోయిల మరంద స్వాదుగీతాలలో మెలసిపోయి, పూఁదేనె కాలువలలోకలసిపోయి, సాఁగిపోవుచున్నది.

కళామయప్రకృతినిఁ జూచిఁజూచి కవిపొంగి నింగినందుకొనును. ఆచిదానందములో తన్మయత్వముఁజెంది యావేశముతోఁ గలమునందుకొని, దివ్యభావములను జిత్రించి, చిక్కని సుధామధురవాక్కులతో గులికించి, యన్నిరంగుల రత్నాలంకారములతో శృంగారించి, హృదయముతోఁబల్కరించి కవితాకన్యను విశాలప్రపంచమునకుఁ గానుకనిచ్చును. "విశ్వ మోహన కవితామధూళిమవియన్నదు"లలో కళాభిజ్ఞులను ముంచితేల్చును.

ఇంతటి మాహాత్మ్యము, ప్రజ్ఞాధురంధరత్వము, అజరామరత్వముఁ గవి కెట్లబ్బెను? కవితాకళ నారాధించుటచేతనే; కవితాకళలో దివ్యశక్తియుండుటచేతనే; కవితాకళ సజీవమైనదగుటచేతనే; కవి పండిపోయిన యశస్సు; పండిపోయిన రేయెండ; పండిపోయిన నవ్వు దొంతర. కవితాకళకు రూపము కవి; కవికి జీవము కవితాకళ. "కలమునఁ గీర్తిశేషులకుఁ గాయములీయ సమర్థులైన బ్రహ్మలు కవిరాజు"లని మిత్రులు జాషువకవిగారు లోకమునకుఁ జాటినారు. (పైని కామాలలోనున్న మాటలన్నియు వీరి ప్రయోగములే.

ఈ కవీంద్రసోదరుని కలముచిందు మరంద బిందువులను నాశక్తికొలఁది వేఱొకవ్యాసములో చవిచూపించెదను) కవితాకళ, ఇట్టి "బ్రహ్మ"లకుఁబుట్టినిల్లు కావుననే లలితకళలలో కవితాకళ లెస్సయనుచున్నాను. "కలానాం ప్రవరం చిత్ర"మని కొందఱి యభిప్రాయము. కాని "కలానాం ప్రవరం, కావ్య"మని మార్చుకున్న నందచందముగా నుండును.

ఇంత విపులముగ వ్రాయుటలో నాయుద్దేశ్యమేమనఁగా, కవితాకళ, పద్యకావ్యములోనే గాక, వచనకావ్యములోను, వాడుభాషలోను, నాడుమాటలోను, పాడుపాటలోను, దనగళముకు సవరించుకొనుచున్నదని నిరూపించుటకే. ఉదాహరణకొకటి రెండు పరిశీలింతము. "వేదాంతసత్యము, శాశ్వతమై, అగోచరమై, అఖండమై, అద్వితీయమై, అనంతమై, అచ్యుతమై, అనిర్వచనీయమై, అనుభవైకవేద్యమై, సర్వశాస్త్రప్రజ్ఞానాతీతమై, స్వచ్ఛమై, నిత్యమై, నిర్మలమై, నిరామయమై, శోభిల్లుచున్న జ్ఞానజ్యోతి" (శ్రీ విం. అ. సూర్యనారాయణగారు). చూడుఁడు. పై వాక్యములో కవితాకళ యెట్లుచిందుచున్నదో కవి తన మధురభావములను హృదయముతో మొలాముచేసిచేసి, యున్నతుఁడై యుదారుఁడై, యుద్రేకపూరితుఁడై, విజృంభించి పాడుకొనుచుండును. అయ్యది పద్యముగనో గద్యముగనో పదముగనో, పాదముగనో, మాటగనో, పాటగనో కవినోట వెలువడు చుండును. అదియే కవితామృతము. అందులోనే కవితాకళ యద్భుతముగఁ గజ్జెఁగదలించు చుండును. దివ్యత్వమును కంఠమెత్తి జాటుకొనుచుండును. అమందానంద మొసంగు చుండును. కాఁబట్టి పై నుదహరించిన శ్రీ సూర్యనారాయణగారి వచనములో కవితాకళ జాలువారుచున్నదనుట కరతలామలకము. ఈ యువకవి మృదుకరసరసిజమెంత యమృత సంభరితమో మీరే యూహింపుఁడు.

కనుక కవితాకళను పోషించుటయన నొక్క పద్యకావ్యరచనమే యనుకొనుట దురభిప్రాయము. కవితాకళను సంపూర్ణముగ నవగాహన మొనరించుకొనుటకు ముఖ్యావయవము 'చెవి'. శ్రవణానందముగ నున్నది హృదయమును గదలించును. భావోద్రేకమును గలిగించును. ఆత్మపారవశ్యము నొందించును. ఆ దివ్యశక్తియే కవితాకళ. అది యేరూపముననైన నుండవచ్చును. కర్ణరసాయనముగ, కర్ణామృతముగ, కర్ణపేయముగనున్న చాలును. ఉదాహరణకు "సుబ్బలక్ష్మికిఁ జెలిమిటి సుజనహితుఁడు" "ఉభయభాషా ప్రవీణాంక ఊట్లవెంక" యన్న పద్యపాదములను జూడుఁడు. ఇవి ఛందోబద్ధకవితా నియమములతోనున్నవి కావున కవిత్వమనిపించుకొనుచున్నవి. కాని వీనిలో మనమింతవఱకు చర్చించుకొని నిర్ణయించుకొన్న యాదర్శకవితాకళ యెక్కడ. ఇట్టి పద్యము లెన్ని చదువుకొన్నను హృదయసంచలన ముండదు. నూత్నభావములు రేకెత్తవు. ఆత్మానంద మసలేలేదు. ఇందు కవితాకళ నిర్వీర్యమై, నిర్విణ్ణమై, నిస్తేజమైపోయినది.

"పురుషునిలో జ్ఞానమభివృద్ధియైనప్పుడే అతనిలోనున్న దివ్యత్వము తేజరిల్లగలదు. ఆ దివ్యశక్తి బుద్ధిరూపమున ప్రకాశించును. బుద్ధి ప్రాభవమునకు ప్రేమప్రకాశము తోడైన పరిపూర్ణమానవత్వము ప్రత్యక్షమగును. పరిపూర్ణ మానవత్వమే భగవంతునియొక్క సగుణ స్వరూప సౌందర్యము." (డిసెంబరు 'గృహలక్ష్మి' ప్రథమ సంపాదకీయవ్యాసములోని) పై వాక్యములను జదువుకొన్నప్పుడు హృదయము పండిపోవుచున్నది; ఆనందముతో నిండిపోవుచున్నది. ఇది కవితాకళ. మచ్చునకు మఱొక్కటి, "గడ్డిమొలచెన్ పులిచాటల గద్దెమీఁద." (శ్రీ జాషువకవి) ఈ చిన్నమాటలోని పసందును మీ చెవికందించి, మీ హృదయమున కప్పగించి, మీ రానందించుటయే లెస్స యని భావించితిని. సామాన్యుఁడను నేను దీని విలువ చెప్ప నసమర్థుఁడను. చిలువరాయఁడు వేయినాలుక లుపయోగింపవలసి వచ్చునేమో. కలము యితర ప్రసంగములకు లాగుచున్నది. వ్యాసముకూడ పెద్దదేయైనది. కాఁబట్టి మఱి సెలవు.

ఆశీస్సు

శా. శ్రీలంగూర్చు గజాస్యమందున లసత్సిందూర మింపొందఁగా
కేలన్ దివ్యము లాయుధంబులు తగన్ క్రేవన్ మహాభక్తి జే
జేలెల్లన్ వినుతింప విఘ్నతతులన్ జెండాడి కాపాడు తం
డ్రీ! లంబోదర! బ్రోవుమయ్య 'గృహలక్ష్మి' పత్రికా పుత్రికన్.

మ. సిరితోఁబుట్టువుగాఁగ వాణి శుభములే్సకూర్ప నేవేళలన్
గిరిజాకన్యయు రక్షసేయ ఘనుఁడున్ కీర్తిప్రదుండైన కే
సరి నిన్బెంచెడి కన్నతండ్రి పతితల్ సాధ్వీమణుల్ బాంధవుల్
కొరతల్గల్గునె యెందునేనియును నీకున్ సర్వశ్రేయోన్నతిన్
చిరసౌభాగ్యము లందుమమ్మ 'గృహలక్ష్మి' చెల్లి! కళ్యాణివై.

సీ. చిత్రాలఁ జిలికించు చెల్లి! కమలాబాయి రమ్యమౌ నవ్య చిత్రాలతోడ
కవిరాణి సీతాంబ కని తీర్చిదిద్దిన ఆణిముత్యాల పద్యాలతోడ
మాన్య! శ్రీ వరలక్ష్మమాంబ శారదలేఖ లింపునింపు కథల సొంపుతోడ
బాలికారత్నాల పాలిపెన్నిధివంచు సోదరీమణుల సంస్తుతులతోడ

గీ. వెలుగుచున్నావు వీధివీధులను పసుపు
కుంకుమనుదాల్చి సంతోష కుసుమములను
విరియజిమ్ముచు నిగనిగల్ మెరయ రాజ్య
లక్ష్మి 'గృహలక్ష్మి' దీర్ఘాయురస్తు నీకు.

—శ్రీ కవికుమార మునగపాటి విశ్వనాథశాస్త్రి.

ఆశీస్సు

ఓరసభావక్రమ మధురోజ్వలగేయ సుధాస్రవంతినీ!
ఓరమణీయ జీవన మయూఖవిలాసిత లోకమోహినీ!
ఓరుచిరాద్య ధర్మసుమహోద్యమ యత్నిత విశ్వబోధినీ!
ఓరసికాగ్రగణ్యత మహోదయినీ! గృహలక్ష్మిదేవినీ!

తెనుగు పడందలందుతరి తీపుల పుప్పొడివాకనించి, కా
మినులకు బుద్ధివైభవసమీక్షిత ధర్మపథంబుజూపి, జీ
వన సుకుమారమాధురుల వారల మాతృమయస్వరూప శో
భనలకు వింతయందములు బాటిలగా రుచియింతువీవగా!

అలసటలేక నెల్లపు దయాచితమై ప్రవహించు వాహినీ
సలిలమవీవు; తెన్గుధర సర్వలతాతరుగుల్మసాంద్ర శో
భలదనరారు దివ్యవనవాటిక; పూజవరాంద్రులేమ;—లీ
జః ము సుమప్రపూర్ణలకు సారమొసంగు ప్రఫుల్లవాంఛలన్.

విశ్వసౌందర్యమాధురీ విలసనమ్మ,
శాశ్వతౌన్నత్యప్రణయ విశాలహృదయ;
మమలినోత్సాహావర్త నాహ్లాదగరిమ
కలిగి భాసిల్లుమా! చిరకాల మిట్లు.

నీమధుస్మేరమే నిల్వనీడగాగ
నీవచస్సుధయే ధర్మనియతిగాగ
నాంధ్రమహిళాభ్యుదయమెల్ల నలరుగాక
దేవి! గృహలక్ష్మి! మను! చిరంజీవినివయి.

—శ్రీ సండూరి ఈశ్వరం.

వివేకానందుని దృష్టిలో భవిష్యన్నారీ సమాజము

శ్రీ స్వామి పూర్ణానందగారు

(సోదరి నివేదిత)

కైవర్తకులోద్భవయును, ధనాఢ్యయును, అగు రాణీ రాసమణి దక్షిణేశ్వర మందిరమును నిర్మించెను; క్రీ. శ. ౧౮౫౬ లో శ్రీ రామకృష్ణుడు పూజారియై అట నివసింపదొడగెను.

ఈ ఘటనాద్వయము వివేకానందస్వామి మనస్సున మిక్కుటముగ బనిచేసినవి—వీటి ప్రభావ పరిచయమును సంపూర్ణముగ ఆయనకూడ గ్రహించియుండడు. ఆయన గురుదేవుని శిష్యమండలి ఏ *ధర్మాందోళనమున కంగీభూతమైయుండెనో, ఒకమాదిరిగ దానిమూలమున నున్నది. నిమ్నశ్రేణికిజెందిన ఒక రమణి లౌకికభావమున జెప్పబూనిన, దక్షిణేశ్వర మందిరములేకున్న రామకృష్ణుని అభ్యుదయమయ్యెడిదికాదు; శ్రీ రామకృష్ణుడు లేకున్న వివేకానందుడుండెడువాడుకాడు; ఆయనలేకున్న పాశ్చాత్యదేశముల ధర్మప్రచారమయ్యెడిదికాదు. పందొమ్మిదవ శతాబ్ద మధ్యభాగమున కలకత్తాకు కొన్నిమైళ్లదూరమున, కాళీమందిర నిర్మాణముపైననే, ఈ ఘటనాపరంపరలు ఆధారపడియున్నవి. అదియు మరల ఒకానొక ధనాఢ్యయును నీచ వంశోద్భవయును నగు రమణియొక్క భక్తియొక్క ఫలము.

మా ఆచార్యదేవుడు తానంతర్గతుడైయున్న సంఘముయొక్క జీవనవ్రతము స్త్రీజాతి, నిమ్నశ్రేణుల ఔన్నత్య సాధనమేయని తలపోసెడువాడు. ఖేత్రీరాజుతో కొన్నిమాటల జెప్పగోరి ఆయన ఫోనోగ్రాపు ముందు అమెరికాలో నిలబడినప్పుడు, ఈ విషయము దానియంతట అదే ఆయన మనస్సున స్ఫురించెను. విదేశముల తన్నాయన మృత్యువునకు పూర్వముకంటె సమీపస్థుడనని ఎంచినప్పుడు, దగ్గర గురుభ్రాతలేకున్న, ఈ చింత ఆయన మనస్సు నావరించుకొనెడిది; సమీపముననున్న శిష్యునితో నుడువుచుండెడివాడు. "స్త్రీజాతియొక్కయు, నిమ్నశ్రేణులయొక్కయు ఉన్నతిని సాధించుట-ఇదియే మా మూల మంత్రమని ఎన్నడును మరవకుము".

కాని, ఈ వాక్యములు పక్షపాతమును ప్రదర్శించుటలేదు. సన్యాసి, జీవితమును కేవలము సాక్షిస్వరూపుడై వీక్షించుచుండును, అందేపక్షమును అవలంబింపడు. చాల సాంప్రదాయములు, ఆయన వాటిలో జేరిన అధినేతగా పరిగణింపబడగలడని ప్రస్తావమొనర్చినవి. వాటికాయన ఒగ్గుదల చూపలేదు. స్త్రీజాతి, నిమ్నశ్రేణి కేవలము విద్యను బడయనిమ్ము, - వారి భవిష్యత్తునుగుఱించిన ప్రశ్నలనన్నింటిని వారే మీమాంసించుకొందురు—ఆయన స్వాతంత్ర్యమనిన ఇదియేయని తలచెడువాడు. మఱియు, ఈ విషయమునే ఆజీవితము అందఱికిని జెప్ప యత్నించెడువాడు. తన అభిజ్ఞత ననుసరించి ఆయన ఈ విద్యాస్వరూపమును గ్రహించినది. ఇంతవరకు దాని అతిసామాన్యాంశమే నిరూపితమైనది. వ్యక్తిస్వాతంత్ర్యమనిన ఆయనకపరిమితమైన శ్రద్ధయుండినను, 'పునర్వివాహమున వ్రతభంగ' మొనర్చుట నాయన ఏవగించెడువాడు. ఆయన హృదయపూర్వకముగ నిశ్లెంచి, నుడువుచుండెడివాడు. 'ఇంకేమైన సరే గానిమ్ము, ఇది కాకుండునుగాక'.

* ఈ వ్యాసమున 'ధర్మ' శబ్దము మతము, Religion లకు ప్రత్యుత వాడబడినది. —అను.

వైధవ్యసూచకమగు శ్వేతవసన మీాయనకడ సర్వవిధముల పవిత్రతే, సత్యముల చిహ్నముగనుండెడిది. కనుక, ఈ విషయములపై లక్ష్యముంచని శిక్షాప్రణాలిని ఆయన స్వాభావికముగ విద్యయని పరిగణింపకుండెను. చపలమతి, విలాసిని, జాతీయతాభ్రష్ట అగు నారికి శతసంఖ్యాకముగ బాహ్య పరిపాట్యమున్నను, ఆయన దృష్టిలో విదుషికాదు, పైపెచ్చు పతిత. పక్షాంతరమున ఆధునికభావాపన్న యగు రమణి, ప్రాచీనకాల సులభమగు సంపూర్ణనిర్భరతను, పరమభక్తినిబూని, భర్తయొక్క జీవనసంగినియై, శ్వశుర గృహపరివారమున ప్రాచీన నిష్ఠనునిల్పిన ఆమెను ఆయన 'ఆదర్శ హిందూపత్ని'గ భావించెడు వాడు. వాస్తవ సన్యాసమువలె యదార్థ నారీ జీవనముగూడ, కేవలము ఆర్భాటమొనర్చి పైకి జూపవలసినది కాదు. ఏ స్త్రీశిక్ష నారీజనోచితములగు సహజగుణ సమూహముల ప్రచార మొనర్పదో, అయ్యది స్త్రీవిద్యా-పదవాచ్యము కాజాలదు.

భావి ఆదర్శ రమణియొక్క గుణావలి ఆభాసదైవాత్తు ఎచ్చటనైన దొరకగలదేమోయను ఆశతో ఆయన సర్వదా ఔత్సుక్యమును వహించియుండెడివాడు. 'ఒకింత వ్యక్తిస్వాతంత్ర్యముయొక్క వికాసము తప్పక అగును, దాని వెనువెంట, వయస్సు వచ్చినపిదప వివాహమైన తన కనుకూలుండగు పతిని గ్రహించుట జరుగును—ఈ రెండును తప్పని సరి' అని ఆయన తలచెడువాడు. బహుశః, తక్కిన అన్ని ఉపాయముల కంటె ఇదియే బాల్య వైధవ్యజనితములగు సమస్యలనన్నిటిని చక్కపరుపజాలును. బాల్యవివాహ-ఆచారము యొక్క ఉత్పత్తి సమాజమొకప్పుడు దానిని ఏరి కోరితెచ్చుకొనుటలోనే ఉన్నదనిగూడ గుర్తుంచుకొన వలయును. ఆలస్యముగ వివాహమైన ఉద్భవించు దోషముల పరిహరింప, ఈ ఉపాయము గ్రహింపబడెను.

భవిష్యన్నారి పూర్వపు ధ్యానశక్తిని సంపూర్ణముగ కోలుపోవునని ఆయన ఒకింతయు ఎంచజాలకుండెను. స్త్రీల కాధునిక విజ్ఞానమును నేర్పవలెను. కాని ప్రాచీన ధర్మభావమును మొదలంట త్రుంచివైచికాదు. సహజ శరీరమున బయటికి ఏవిధాన మెంతతక్కువ మార్పును గొనిరాగలదో, అయ్యదియే ఆదర్శ-శిక్షయని ఆయన స్పష్టముగ గ్రహించెను. అది కాలక్రమమున ప్రత్యేక నారియు, ప్రాచీన భారతేనారీ సమాజముయొక్క మహిమనంతటిని వికసింపజేయగలట్లును ఉండవలెను.

పూర్వపు, ప్రతిజ్వలంతే ఆదర్శము స్వతంత్రముగ నిజప్రభావమును విస్తరించెను. రాజపుత్రుల ఇతి హాసము, ఆ నారీ సంఘముయొక్క ఆదర్శము, తేజము, సాహసములతో నిండియున్నది. కాని, ఈ అత్యుష్ణ ద్రవధాతువును, నూతనమగు అచ్చున బోయవలసియున్నది. భారతదేశమున జన్మించిన స్త్రీలందరిలోను రాణీ అహల్యాబాయి శ్రేష్ఠురాలు. దేశమునందంతటట ఒనర్చిన లోకహితకార్యముల గాంచి, భారతీయ—సాధు విట్లు భావించుట స్వాభావికము. అయినను, భవిష్యన్నారి మహత్వము సరిగ అట్లే ఉండదు; దానినిగూడ అతిక్రమించిపోవును. రాబోవు యుగమున, స్త్రీ హృదయమున వీరోచితమగు దృఢసంకల్పము జననీసులభ మగు హృదయములయొక్క సమావేశముండును. పవిత్రశాంతి, స్వాధీనతల కాధారభూతయగు సావిత్రి ఏ వైదిక అగ్నిహోత్రాది పరిసరస్థితులనుండి ఉద్భవించినదో, అయ్యదియే ఆదర్శస్థితి. కాని భవిష్యన్నారికి దీనితో మలయమారుతముయొక్క కోమలతా మాధుర్యముల వికాసమును జూపింపవలసియున్నది.

నారికి అధికతరమగు యోగ్యతను జూపింపవలసియున్నది, తక్కువైన వీలుపడదు. ఆయన పరికల్పించు కొనిన విధవాశ్రమము లేక బాలికావిద్యాలయము లేక కాలేజీలో, పెద్దపెద్ద పచ్చికబయళ్లు ఉండును. అచ్చట

వసించువారు వ్యాయామము, ఉద్యానకృషి, పశురక్షణముల ప్రతిదినము తప్పని సరిగ జేయుచుండవలెను' అని ఆయన నుడివెడువాడు. సంసారాశ్రమముకంటె సన్యాసాశ్రమమున ఏ ఉత్తమ ఆదర్శముయొక్క వికాసమధికముగ కనంబడుచున్నదో, దానియందాయనకు ప్రబలానురాగము. ధర్మమే ఈ నూతనవిధములగు ఆశ్రమములకు వెన్నెముకఅగును. దీని నాశ్రయించియే అవి పుష్టినందును. ఇందున్నవారందరును, శీతకాలము గడచినతోడనే తీర్థయాత్రలకు బయలుదేరి ఆరునెలలు హిమాలయముల పాతాదికము నభ్యసింతురు. ఇట్లు, సృష్టింపబడునారులు ధర్మ-రాజ్యమున బాషీ-బాజుక్కు'*లవలె నిలబడుదురు; వారే నారీసమస్యల సమాధానమొనర్తురు. వారి కింకొక ఇల్లుండదు; వారు పనిచెయ్యుచోటే వారిల్లు; ధర్మబంధనగాక వారికి వేరొక బంధనముండదు. గురువు, స్వదేశము, జనసామాన్యము-ఈ మూడింటగాక మరి వేటియందు ప్రీతియుండదు. ఆయన కల్పన ఇంచుమించుగ ఇట్లుండెను. కొందఱు శిక్షకురాండ్ర అవసరము మిక్కుటమైనట్లు ఆయన గ్రహించెను; వారి నిట్లే సంగ్రహింపదలచెను. శక్తిఅను ఒక్కగుణముయొక్క వికాసమునే ఆయన స్త్రీ పురుషులందరిలో జూడదలంచెను. కాని, శక్తియననేమి? అను విషయము నాయన అత్యంతకఠోరముగ విచారించెడువాడు. తన్నుదా ప్రకటించుకొనుట, లేక భావోచ్ఛ్వాసము—ఈ రెంటిలో దేనిని బ్రశంసించెడువాడుకాదు. ప్రశాంతత, మాధుర్యము, నిష్ఠలకాదర్శములగు ప్రాచీనకాలచరిత్రల ఆయనమనస్సు అత్యంత విముగ్ధమయ్యెను; అది బాహ్యాడంబరముల నాకర్షింపబడెడిదికాదు. వర్తమానయుగమున భారతము, చింతాజ్ఞానముల సంపాదించిన ఔన్నత్యమున స్త్రీ పురుషులకు సమానాధికారము. సత్యమున లింగవిచారములేదు. ఆత్మ, మనస్సులపై శరీరబంధనమును దృఢమొనర్పగోరు, సాంఘికరాష్ట్రనీతుల ఆయన ఇసుమంతయు సహింపజాలకుండెను. ఏ రమణి ఎంతగొప్పగాగోరిన అంతగ శీలము, మనస్సులనుండెడి, రమణీజన సులభమగు దౌర్బల్యమును అతిక్రమింపవలసియున్నది. భవిష్యత్తున అధిక సంఖ్యాకులగు స్త్రీలు ఇట్టి ఔన్నత్యమునంది ప్రశంసార్హులగుదురని ఆశింపవచ్చును.

స్వాభావికముగనే ఆయన విధవలలోనుండి ప్రప్రథమమున ఇట్టి శిక్షయిత్రుల గ్రహింపనగునని తలపోసెడివాడు. వీరు పాశ్చాత్యదేశమునందలి మఠాధికారిణులవలె నయ్యెదరు. కాని, ఇతరవిషయముల వలెనే, ఆయన ఈ విషయమునుగూడ మరెట్టి సంకల్పమును ఒనర్పలేదు. ఆయన కేవలము ఉచ్చరించినది; "లెమ్ము! లెమ్ము! సంకల్పములన్నియు భవిష్యత్తున వాటియంతట అవియే పరిపుష్టములై, కార్యములుగ మారును." ఇవి అయన పల్కులే. అయినను, ఉపకరణము లరుదెంచిన - ఎటనుండి అయినను సరే - వాటిని సాదరముగ గ్రహించెడువాడు. ప్రతిరమణియు సహజమును, సబలమును నగు చరిత్ర, మేధాసహాయ్యములతో సత్యపథమునుండి తన్ను మహాదాదర్శముయొక్క యంత్రముగ ఒనగూర్పకొనజాలకుండుటకాయన, వెదకియు కారణము నొక్కదానినిగూడ కాంచెడువాడు కాడు. అసత్కార్మల

---

*Bashi Bazouks:— వీరు ఖలీఫాల అంగరక్షకులుగ నుండెడువారు. చాలకాలమువఱకు టర్కీసైన్యమున వివిధదేశములనుండి పసికూనల దొంగిలించి తెచ్చి, ముసల్మానుల నొనర్చి, పెంచి పెద్దచేసి జేర్చుకొను ఆచారముండెడిది. దీనిమూలమున, వారికి ధర్మమున అత్యంతానురాగము జనించెడిది; దేశము, రాజు వీటి సేవయనుబంధమే వారిని ఒకట బంధించియుంచెడిది. యూరప్‌యొక్క ఇతిహాసమున వారి క్రౌర్యము, సాహసము, బలములు ప్రసిద్ధినిగన్నవి. నెపోలియన్ వీరినడంచెను.



కేసరి

ద్రాక్షారిష్టము

దేహబలమునకు - పుష్టికి

సేవించిన ఉరఃక్షతము, క్షయ
రోగము, దగ్గు, ఉబ్బసము,
కంఠరోగము నశించుటయేకాక
దేహమునకుబలము పుష్టికలుగును

కేసరికుటీరం - మద్రాసు

కేసరి

లోహారిష్ఠం

నంజులకు

ఈ లోహద్రావకము లోహములుగల ఓషధీ ద్రవ్యములతో తయారుచేయబడినది. దీనివలన వాపు (నంజు), పాండు, కామిల జబ్బులు కుదిరి శరీరమునకు శుద్ధరక్తము పెట్టును. శరీరమందుండు చెడ్డనీరును పీల్చివేయును.

మరియు మేహజ్వరము, దగ్గు, నోట రక్తము పడుట, ఉబ్బసము, క్షయము వీటిని కుదుర్చుటయేగాక పరిణామశూలనుగూడ నమ్మకముగ నివారించగలదు.

కేసరి

దశమూలరిష్ఠ

విష, బాలింత జ్వరములు, హృద్రోగములు, వాతవ్యాధులు, త్రిదోష వికారములవలన కలుగు జబ్బులను త్వరితముగ నివర్తించును.

కేసరి కుటీరం - మద్రాసు

భారమున మనస్సు పీడింపబడిన, దానిని సరళతవలన సరియొనర్చుకొననగును. నారీ ఉన్నతియన ఉత్సాహితు డగు గ్రంథకారుడు ఒకడు 'స్వాధీనభావమున ఉచ్చ ఆదర్శములనన్నిటిని అనుసరింపవలెను' అని లిఖించెను. స్వామిజీకూడ స్వాతంత్ర్యమనిన భయపడెడువాడు కాడు, భారతీయ నారీజాతిని సందేహించెడువాడు కాడు. కాని ఆయన ఏ స్వాధీనతయొక్క వికాసమును సంకల్పించెనో అది, ఆందోళన, పెడబొబ్బలు, ప్రాచీనరీతుల భంగించుటవలన సాధింపబడునది కాదు. అది పరోక్షభావముగ, నీరవముగ లోనుండి దాని యంతట అదియే సాధితమవవలెను. ప్రథమమున నారీసమాజమున నున్న ఆదర్శముల నతశిరమున గ్రహింప వలెను. గుణోన్నతినిబట్టి వారు జాతీయజీవనమందలి విశిష్ట నిర్దేశములను, సుయోగములను అధికముగ గుర్తింప గలుగుదురు. ఈ కర్తవ్యములనన్నింటిని పాలించి, ఈ సుయోగములనన్నిటిని సంపూర్ణముగ గ్రహించి, వారు మునుపటికంటె ఎక్కుడుగ భారతీయ భావాత్మకలయ్యెదరు ; ప్రాచీన భారతము స్వప్నమునగూడ భావింపని ఉన్నతియొక్క ఉచ్చశిఖరముల నధిరోహింతురు.

* * * *

వివేకానందుని దృష్టిలో సన్యాసియొక్క వ్రతములన్నియు వెలలేనివిగ నుండెను. వాస్తవిక సన్యాసుల వలె, ఆయనగూడ వివాహము తత్సంశ్లిష్ట విషయముల నన్నింటిని మహాపాపముగ పరిగణించెడువాడు......

కాని, ఆయన నారియనిన భయపడెడువాడు కాడు, ప్రలోభన యనిన భయంపడెడువాడు అని గుర్తించుకొనుట ముఖ్యము. పృథివియందు సర్వత్ర ఆయనకు నారితో సంబంధమొదగూరెను. వారాయన శిష్యులు, కార్యసహాయ్యకలు, మిత్రులు, ఆటంజట్లు. పరివ్రాజక జీవనమున ఆయన వీరితో భారతీయ మర్యాదననుసరించి మెలగెడివాడు ; ఎట్టి సంబంధమును ఉంచుకొనెడువాడు కాడు....ఆయన స్త్రీలయందు క్షుద్రతా దౌర్బల్యములకు మారు, మహత్వము చరిత్రబలములనే అన్వేషించెడువాడు. ఆయన అమెరికాలో స్త్రీలు నౌకలను నడుపుట, ఈదుట, నానావిధములగు ఆటలనాడుట గాంచినాడు, కాని, పురుషులకంటె అన్యముగ ఎప్పుడును వారిని మనస్సున భావింపలేదు. అందువలన ఆయన మిక్కుటముగ ఆనందము నందెడు వాడు. ఇట్లు, వారినుండి బహిఃప్రకాశమునందు ఆదర్శమునే ఆయన పూజించెడువాడు.

సన్యాసి విషయమై ఆయన విశేషముగ జెప్పెడిది: సన్యాసి తన్ను పురుషునిగగాని స్త్రీగగాని భావించుకొనగూడదు ; అతడీ రెండింటికి ఆవల లింగభేదమును స్ఫురింపజేయు శిష్టాచారములేక మరేదైనను ఆయన అత్యంతముగ గర్హించెడువాడు. పాశ్చాత్యుల Chivalry (స్త్రీ-సౌజన్యబోధకము) అనిన ఆయన తలపులో స్త్రీల నవమానించుటయే. కొందఱు గ్రంథకారులు స్త్రీలకు ఒకమాదిరి విద్య అబ్బిన చాలందురు ; సంపూర్ణముగ అవసరములేదని వారి తలపు. కాని, స్వామిజీ ఈ అభిప్రాయమును అత్యంతనీచముగను, హేయముగను గాంచెడువాడు. మానవుని అంతరాత్మ కోరునది స్వాధీనత - మన శరీరముయొక్క రీతి ఈ స్వాధీనతపై బంధనములనన్నిటిని బలవంతముగ తెచ్చిపెట్టినది. స్త్రీ పురుషులందరును దీనిని అతిక్రమింప యత్నింపవలెను.

ఆదర్శ-పత్ని అవవలెననిన, పతియందు ఎదుగు తగ్గులులేని ఉజ్వలనిష్ఠయే కావలెనని, ఆయన ప్రాచ్యులవలె తలపోసెడువాడు....ఆయన ఎప్పుడు సంఘ-ఆదర్శములను తూలనాడలేదు. క్రీ.శ. ౧౮౯౯లో ఇంగ్లండునకు పోవుచు ఓడదిగుటకు ముందు ఆయన నాతో, 'పాశ్చాత్య-సమాజ ఆదర్శములను వాటినెన్నడును

పరిత్యజింపనట్లు, మరల గ్రహింతునుగాక' అని నుడివెను. యూరప్ లేక అమెరికాలో వివాహితలు అవివాహితలకంటె తక్కుడు సమ్మానమును ఆయనకడనుండి పొందెడివారు కారు. ఈ సముద్రప్రయాణమున, కొందఱు పాదరీలు వారు దుర్భిక్షాసమయమున అరవస్త్రీలనుండి కొన్న వెండిమురుగులను (వివాహ-కట్నము) జూపించుచుండిరి. సంభాషణలలో 'ప్రాచ్య పాశ్చాత్య స్త్రీలందరుగూడ, వివాహ-ముద్రికలను మూఢ ఆచారమున దీయ నిచ్చగింపరు' అను విషయము వచ్చెను. దానిని వినుటతోడనే స్వామీజీ ఖేదముతో 'దానిని మీరు మూఢాచారము అనుచున్నారా? దానివెనుక, సతీత్వముయొక్క మహదాదర్శమున్నది. మీరు గాంచజాలకున్నారా?' అని నుడివెను.

ఆధ్యాత్మిక-స్వాతంత్ర్యమునందలి వివాహమెంతగ తోడ్పడగలదు - అను విషయము ననుసరించియే ఆయన దానియొక్క గుణాగుణముల విచారించెడువాడు. ప్రసంగక్రమమున ఆయన ఒకరోజున ఇట్లొప్పుకొనెను; 'వివాహము నతిక్రమింపజేసుకొను వివాహమన, నాకేమియు అభ్యంతరములేదు.' ఆయన గురుదేవునియొక్కయు, గురుభ్రాతయగు యోగానందునియొక్కయు, శిష్యుడగు స్వరూపానందునియొక్కయు వివాహములే, ఆయన దృష్టిలో ఆదర్శవివాహములు....

...... ఆయన సన్న్యాసిసంఘమును, ఆచార్యుని పశ్చాద్వర్తియగు సైన్యదళముగ భావించెడువాడు; ఏ ఆచార్యుని శిష్యులందరును గృహస్థులు సంసారులో ఆయనకు సైన్యములేదు, అనికూడ నుడువుచుండెడువాడు.... అయినను వివాహముగూడ చాలమందికి ఒక మార్గమని ఆయన జొత్తిగ గ్రహింపలేదనికాదు. ఆయన ఒకానొక వృద్ధదంపతులనుగుఱించి చెప్పిన కథను నేనెన్నడును మరువజాలను: ఏబదిఏండ్లు వారొకచోట నివసించి దరిద్రనివాస-ద్వారమున (Work-House) విడివడిరి. ప్రథమదినావసానమున వృద్ధుడు 'మేరీ! నిద్రించుటకు బూర్వము నిన్నొకసారి గాంచి, చుంబింపజాలనా? నేను గత ఏబదిఏండ్లనుండి ఇట్లొనర్చుచుంటినే?' ఈ మహోన్నతభావమును బరికించుచు స్వామీజీ వ్యగ్రుడై, 'ఒక్కసారి భావించిజూడుము! ఒక్కసారి లక్షించి చూడుము! ఇట్టి సంయమయు, నిష్ఠలే యుక్తి!' ఈ ఇద్దరి పక్షమున వివాహమే ప్రశస్తపథము.

'ఇచ్ఛలేకున్న, వివాహమొనర్చుకొనకుండుట స్త్రీలకు స్వాభావికముగ ఒసంగదగిన స్వాతంత్ర్యము' అని ఆయన పలుమారులు దృఢముగ చెప్పియుండెను. ఒక బాలికయందు ధర్మజీవనానురాగము పదిరెండేండ్లు నిండకమునుపే పొడజూపెను. ఆపె వివాహము బారినుండి తప్పించుకొన స్వామీజీ సహాయ్యము నర్థించెను. ఆయన, ఆబిడ్డ ఇంటివారికి నానావిధముల తెలియజెప్పి, సాయమొనరింపగలిగెను.... ఇట్టి మహోన్నత మనస్కులకు వివాహమొనర్చుట అత్యంత గర్హితకృత్యమని ఆయన తలంపు.

విధవల సతీత్వమను స్తంభముపైననే సామాజిక అనుష్ఠానములన్నియు నిర్భరపడియున్నవని ఆయన చెప్పెడువాడు. ఈ విషయమున స్త్రీలకువలెనే పురుషులకుంగూడ మహోన్నతాదర్శముండవలెననిగూడ ఆయన ఘోషించియుండెను. ప్రాచీనార్యులమధ్య చిరాచరితమగు ఒక ఆచారముండెను—వివాహకాలమున అగ్ని స్థాపింపబడెడిది; భార్యాభర్త లిర్వురును దానిని ప్రాతఃస్సంధ్యల నుపాసించెడువారు. ఈ అనుష్ఠానమున దెలియవచ్చెడిదేమన, భార్యాభర్త లిర్వుర ఆదర్శము, భారము సమానము. మహర్షి వాల్మీకి మహాకావ్యమున రామచంద్రుని ప్రతి సీతయొక్క అవిచలిత నిష్ఠ వర్ణింపబడినట్లే, సీత ప్రతి రామచంద్రుని అవిచలిత నిష్ఠగూడ వర్ణితము.

వివేకానందుని దృష్టిలో భవిష్యన్నారీ సమాజము

పృథివియందు సర్వత్ర వివాహవిషయమున నున్న సామాజిక సమస్యలన్నియు స్వామిజీకి అవిదితములు కావు. పాశ్చాత్యదేశమున ఉపన్యసించుచు సవిస్మయముగ, 'ఈ గయ్యాళులందరు - వీరినుండి సహించు, క్షమించు ప్రభృతి శబ్దములు సంపూర్ణముగ విలుప్తములు.' 'వివాహబంధమును అక్షుణ్ణముగ నుంచిన భవిష్య జ్జాతికి విశ్వాసఘాతకతాకరముగ నుండుపట్ల, భార్యాభర్త లిర్వురకు వివాహవిచ్ఛేదమే గొప్పదనము, సాహసము' అని నుడువుటకుగూడ ఆయన సంకోచింపలేదు. ఆయన, ప్రాచ్య పాశ్చాత్యములు రెండును పరస్పర-ఆదర్శముల ఆదానగ్రహణపూర్వకముగ నవత్వమునందుట అవసరమని సర్వదా నిరూపించెడు వాడు. ఎట్టి సాంఘిక నియమమును ఆయన ముందువెనుక లాలోచింపకుండ దూషించెడువాడు కాడు. ఆయా ఆచారములు ఒకానొక దురాచారమును రూపుమాపుటకై ఉద్భవించియుండుననియు, తత్సమా లోచకులు ఏకదేశత్వదోషమున దానిని గ్రహింపజాలకున్నారనియు వచించెడువాడు. కాని, గడియారము యొక్క 'ఊగులాడు బిళ్ల' ఒకవైపునకు ఒరిగిన ఆయన తత్క్షణమే దానిని గ్రహింపగలిగియుండెను.

భారతవర్షమున వివాహము వధూవరుల ఇష్టము ననుసరింపక, పెద్దల వ్యవస్థ ననుసరించియుండునను విషయమును ప్రసంగించుచు ఆయన ఇట్లు పల్కెను. 'ఆహా! ఈ దేశమున ఎట్టి కష్టము, బాధ ఘటిల్లినది. దాని అవసరము ఒకింత అన్నిసమయముల నుండెను. కాని, ఇప్పుడు యూరోపియనులుకూడ వారి రీతినీతుల జూపించి, కష్టమును మరింత పెంపొందించిరి. ఇప్పుడు సమాజము గ్రహించినది వేరొక దారికూడ ఉన్నదని.'

ఒకానొక యూరోపియన్‌తో ఆయన ఇట్లు పల్కెను: 'మేము మాతృభావమును పెంపొందించితిమి, మీరు భార్యా భావమును; నేతలచునది పరస్పరగ్రహణమున ఉభయులకు లాభము చేకూరగలదని.'

తర్వాత ఆయన స్వప్నకథ; ఆయన ఓడలో దానిని మాకిట్లు వర్ణించి చెప్పెను: 'స్వప్నమున నేను ఇరువురు వ్యక్తులు వాదించుచుండుట వింటిని—వారు ప్రాచ్య పాశ్చాత్య వివాహాదర్శములనుగురించి ఆలోచించుచుండిరి. చివరకు వారొనర్చిన సిద్ధాంతమియ్యది: రెంటను ఉన్న కొన్ని విషయములు ఇప్పుడు గూడ జగత్తునకు హితకరములగుటవలన అపరిత్యాజ్యములు.' ఈ దృఢవిశ్వాసముండుటవలననే—ఆయన ప్రాచ్య పాశ్చాత్య సమాజాదర్శముల మధ్యనున్న ప్రభేదమును విశేషముగ జూడ అంత సమయమును వెచ్చ బెట్టెడువాడు.

వ్యాసకర్తల కొకమనవి

వ్యాసములును కథలును నాలుగైదు పేజీలకు మించియుండిన వెంటనే ప్రచురింపబడుటకు అవకాశముండదు. ఎంత క్లుప్తముగ నున్న అంత యాదరమునకు పాత్రములగునని గమనింప కోరుచున్నాము.

సంపాదకుడు.

ప్రబోధము

గీ. పెండ్లికాఁగ నత్తింటికి వెడలవలయుఁ బుట్టినిల్లన్న భ్రాంతిని నెట్టివైచి
యెన్నికష్టంబులున్నను నెన్నఁదగిన సౌఖ్య మత్తింటనేకదా జరుగునెపుడు.

గీ. పడఁతి పుట్టుకతోడనే పరునిసొత్తు నీటముంచినఁ బాలముంచినను ప్రాణ
కాంతుఁడే దైవమంచు నెక్కాలమొంచి యతని మెప్పించి మెప్పొందనగు సతికి.

గీ. అత్తమామ లెంచఁగఁ గఠినాత్ములైన మించు వేడుక భర్త ప్రేమించెనేని
పుట్టినింటాసకై లోనఁ బొంగఁబోక కష్టమెంతైన భరియింపఁగలదు కాంత.

ఉ. అల్లుఁడు వచ్చునంచునె దనత్తయు మామయు సంతసంబులోఁ
బెల్లుగఁ దాల్చుచుందు రటుపిమ్మట వచ్చిన యంతలోన బల్
ప్రల్లదవాక్యముల్ పలికి రాపిడి సేతురు తప్పులెన్నుచుఁ
జెల్లునె యత్తయింట నివసించుట పెక్కుదినంబు లేరికిన్.

గీ. అరయఁ బుట్టింటఁ బంచభక్ష్యపరమాన్న మారగించుటకంటె సౌఖ్యంబెసంగు
నబల కొక్కకబళమైన నత్తగారి గృహమునందు స్వాతంత్ర్యమై యొనయుఁగాన.

గీ. పుట్టినిల్లన్నమాత్రానఁ బొంగరాదు
ప్రేమ మెంతఁగా నటనున్న నేమియగును?
గౌరవంబించుకైనను గానరాదు
స్వేచ్ఛ నలుసైనలేక జీవింపఁదగునె?

గీ. అత్తమాటల కెప్డెదురాడనేర్చి
భర్త యానతికెప్డు మార్వలుకనేర్చి
పుట్టినింటికేగిన నేమి పొసఁగఁగలదు
పుట్టిపెరిగినచోటనే ముట్టిపడును?

గీ. పుట్టినింటికిఁ బతితోడఁ బోయినపుడె
గౌరవోన్నతులెన్నైనఁ గలుఁగఁగలవు
సాధ్వికప్పుడె ముద్దుముచ్చటలుదీఱు
నట్లుగాకున్న నేరీతి హర్షమొదవు.

—శ్రీ ఇనుగంటి సరస్వతీదేవి.

Messages and good wishes to 'Grihalakshmi'

From

K. SITARAMA SASTRI, M.A.,

To

The Proprietor,

"GRIHALAKSHMI" MADRAS.

Sir,

The success of any endeavour depends, to a considerable extent, on the ideals with which it works. Much ink has been split on the controversy whether an ideal be an accomplished fact but, 'Grihalakshmi' has demonstrated more than once, to the world that its achievement is in perfect harmony with its ideal.

The ideal of Indian womanhood as set up and developed by a succession of able and talented editors of 'Grihalakshmi' has become a model to be followed by politicians, statesmen and social reformers and a light to enlighten men of letters. The present editor has been taking great pains not only in maintaining her original position and rank but also in making her occupy the foremost place among the magazines of India.

I wish him every success and hope to see the day when Grihalakshmi will be published in all the languages of India.

MADRAS,
7—2—1940.

Yours sincerely,
(Sd.) K. SITARAMA SASTRY.

'గృహలక్ష్మి' పత్రికాధిపతులకు శ్రీ కే. సీతారామశాస్త్రి ఎం. ఏ. గారు
పంపిన హిత సందేశార్థము

ఏ కార్యముయొక్కయు విజయము చాలవరకు ఆ ప్రయత్నముయొక్క సదాదర్శములపై నాధారపడియుండును. ఆదర్శము అనుభవయదార్థమగునా కాదా యను వివాదాంశముపై వెలువడిన తీవ్రవాదరచన లెన్నియోగలవు. ఆదర్శమును అనుభవానందముతో సమన్వయింపగల శక్తిని 'గృహలక్ష్మి' చాల పర్యాయములు ప్రపంచమునకు ప్రత్యక్షమొనరించినది. 'గృహలక్ష్మి' పత్రికయందు, ప్రతిభావంతులై, పేరెన్నికగన్న సంపాదకవర్గముచే ప్రతిష్ఠితములై, పెంపొందింపబడిన స్త్రీధర్మాదర్శములు, రాజకీయవేత్తలకును, రాజధర్మప్రవీణులకును, సంఘసంస్కర్తలకును మంచి మార్గదర్శకములై యొప్పుటేకాక నీపత్రిక విద్యాసంపన్నులకుగూడ విజ్ఞానదీపికయై విలసిల్లుచున్నది.

ప్రస్తుత సంపాదక కార్యనిర్వాహకుని పటుదీక్షాపరిశ్రమాసక్తిచే నీపత్రికయొక్క పూర్వపు పేరుప్రతిష్ఠలు పెంపొందింపబడుటేకాక, భారతదేశపు పత్రికలలో 'గృహలక్ష్మి'కి ప్రత్యేకప్రాముఖ్యతను పొందజేయుటకుగూడ ప్రయత్నమొనరింపబడుచున్నది. ఈయన సత్ప్రయత్నములు జయప్రదమగునట్లభిలషించుచు, 'గృహలక్ష్మి' హిందూదేశములోగల యన్నిభాషలలోను వెలువడు సుదినమున నుత్సాహముతో నిరీక్షించుచున్నాను.

From

MISS RAJKUMARI VARADARAJULU M. A., (Cantab)

Dear Editor,

I have read with great pleasure your article on బుద్ధిప్రభుత్వము—ప్రేమపెత్తనము and the two appreciations that followed it. The one written by Sri Gonela Narasinga Rao is undoubtedly of high order giving at the same time the true colour to your article. To my knowledge I have been reading his articles for about three years and what little Telugu I know is due to such eminent contributors as Mr. Gonela Narasinga Rao, Kanuparthi Varalakshmamma, V.A. Suryanarayana, A. Satyavathamma and last but not least K. Sugunamani.

Your Magazine, I am glad to say, has been maintained in a high literary standard all along and more so for the last one year. It is no exaggeration if I say that the Editorial articles of these ten months are eminently superb.

I have got some doubts about certain points in the appreciation written by Mr. Narasinga Rao which I hope to be enlightened by an elaborate explanation on the part of the critic. Since there is no other means to get at Mr. Narasinga Rao except through your Journal I should doubtless get my doubts cleared only through the columns of your "Griha-lakshmi." I request you, therefore, to publish the accompanying small article in your March issue so that Mr. Narasinga Rao may understand my doubts and comply with my request for clarification of implied ideas. I do not mean to criticise a very eminent Telugu scholar of the calibre of Mr. Narasinga Rao but nevertheless I sincerely feel that I should know some what more elaborately than what is already there. So please assure Mr. Narasinga Rao that my request for explanation does not arise out of anything other than enthusiasm-pure and simple-to grasp fully the connotation and denotation of some of the terms that he has used. I am really at a loss to understand and hence this letter.

I wish every success to your esteemed Journal.

MADRAS,
6—2—1940.

Sincerely yours,
Dear Editor,
(Sd.) A. RAJKUMARI.

సందేశము - సందేహము

శ్రీ రాజకుమారిగారు ఎం. ఏ. (క్యాంటబ్)

బుద్ధి ప్రభుత్వము – ప్రేమపెత్తనము అను (మీ సంపాదకీయ) వ్యాసమును, అందుపై వ్రాయబడిన రెండు విమర్శనావ్యాసములను అమితానందముతో చదివితిని. శ్రీ గోనెల నరసింగరావుగారు వ్రాసిన విమర్శనావ్యాసమెంతయు ప్రతిభావంతమై మీ వ్యాసమున కధిక శోభ నొడగూర్చెను. ఆయన వ్యాసములను సుమారు మూడుసంవత్సరములనుండి చూచుచుంటిని. నాకు గల కించతు తెలుగు భాషాజ్ఞానము ఉత్తమ వ్యాస రచయితలగు శ్రీ గోనెల నరసింగరావు, శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మ, శ్రీ విం. అ. సూర్యనారాయణ, శ్రీమతి ఆచంట సత్యవతమ్మ, శ్రీమతి కే. సుగుమణి గార్లు 'గృహలక్ష్మి'లో వ్రాసిన వ్యాసములను చదువుటవలన గలిగినది. మీ పత్రిక మొదటినుండియు ఉన్నతాదర్శముల నుద్దీపించు భాషాసేవచేయుచు నీ సంవత్సరములో నధిక ఘనతతో వెలయుచున్నదని చెప్పుట కెంతయు సంతసించుచున్నాను. గత పదిమాసములలో 'గృహలక్ష్మి'లో ప్రచురింపబడిన సంపాదకీయవ్యాసము లత్యుత్తమప్రతిభతో వెలయుచున్నవనుట అతిశయోక్తి కాదు.

శ్రీ గోనెల నరసింగరావుగారి విమర్శనావ్యాసమును చదివినమీదట నాకు కొన్ని సందేహములు కల్గినవి. ఆ సందేహములకు సదుత్తరములను మీ పత్రికద్వారా పొందగోరి వాటి నిందుతో పంపుచున్నాను. వాటిని మీరు మార్చి 'గృహలక్ష్మి'లోనే ప్రచురించి, శ్రీ నరసింగరావుగారి కందజేసి వారి వ్యాసము నందలి భావగర్భితములగు విషయములను వారు విశదీకరించుట కవకాశమొసంగ నభిలషించుచున్నాను. తెలుగుభాషలో ప్రశస్త పాండిత్యముగల శ్రీ నరసింగరావుగారిని ఈ నా సందేహములకు సమాధానమొసంగ గోరుట వారి విమర్శనావ్యాసమునందలి గుణదోషములను పరిశీలింప నుద్దేశించికాదు. ఆ వ్యాసములో ప్రయోగింపబడిన ప్రత్యేకపదములు నాకు బాగుగ బోధపడనందున అందలి యర్థమును విపులముగ తెలిసికొన నుత్సాహించుటచే నీ జాబును తమకు వ్రాసితిని. పేరెన్నికగన్న మీ పత్రిక జయముతో వర్ధిల్లుగాక!

బుద్ధిప్రభుత్వము - ప్రేమపెత్తనము అనే వ్యాసాన్ని చూచాను. శ్రీగోనెల నరసింగరావుగారు ఈవిమర్శను చాలాకూలంకషంగా వ్రాశారు. ఇది డిశంబరుసంచికలో సంపాదకులు వ్రాసిన వ్యాసములోని విషయాల్ని బాగాబోధపర్చింది. కాని నాకుయీ విమర్శ చదివినతరువాత అక్కడక్కడకొన్ని కొత్తసందేహాలుకలిగాయి. ఆసందేహాల్ని తీర్చుకుందామని వ్రాస్తున్నాను. "పసినిసుంగులయెడ ప్రేమ ముద్దు" యిందులో ముద్దుకు ఒక సంస్కృతపదము దొరకలేదా? "స్త్రీకి వివేకహీనమైనబుద్ధి యున్నప్పుడుగాని పురుషునకు ప్రేమహీనమైన బుద్ధియున్నప్పుడుగాని" అంటే వీటి అర్థమేమిటి? వివేకహీనమైనప్రేమ పేరేమిటి? ప్రేమహీనమైనబుద్ధి పేరేమిటి? బుద్ధిప్రేమలు కలసియున్నప్పుడు దానిపేరేమి?

బుద్ధికి ప్రేమకు అవినాభావసంబంధమని చదువుకున్న వాళ్లంటారు. ఇందులో సత్యములేదా? ప్రేమలేకుండా బుద్ధివుంటుందా? బుద్ధిలేకుండా ప్రేమవుంటుందా? డిశంబరు సంచికలో సంపాదకులువ్రాసిన వ్యాసములో "బుద్ధి పర్వతమువంటిది. ప్రేమ సముద్రమువంటిది. ప్రేమఅను క్షీరసాగరములో బుద్ధిఅను మేరుపర్వతము తేలుచుండును. బుద్ధి సూర్యునివంటిది. అనగా జ్ఞానమను వెలుగుతో వెలయుచుండుశక్తి ప్రకాశము. ప్రేమ చంద్రునివంటిది, ఆనందమను ఆహ్లాదకరమగుకాంతితో నిండియుండును" దీని అర్థమేమి?

శ్రీ రాజకుమారిగారి సందేహములకు మా కోరికపైన సత్వరమే జవాబువ్రాసి త్వరలో మాకందజేసిన శ్రీ నరసింగరావుగారి కెంతయు కృతజ్ఞులము. (గృ॥ సం॥)

సమాధానము

శ్రీయుత గోనెల నరసింగరావుగారు ఎం. ఏ. బి. యల్.

శ్రీ కుమారి రాజకుమారిగారి సందేహములను శ్రద్ధతోఁ జదివితిని. అందలి ప్రశ్నలకుఁ దగు రీతి సమాధానము లీయవలసినదని నన్నుఁ గోరుటచేత నా శక్తిఁగొలఁది వ్రాయఁ గడంగుచున్నాను. ఈ చిన్నవ్యాసము నామె చదువుకొన్నమీఁద సందేహనివృత్తి కావచ్చునని తలంచుచున్నాను. ఆమె శంకలకీ ప్రత్యుత్తరము వంకలుతీర్చినఁ జాలును. నేను ధన్యుఁడననుకొందును. ఉత్తమోత్తముఁడ ననుకొందును. ఆంధ్రనారీమణులలో నొక్క విదుషీమణియైన నా వ్యాసమునుఁ జదివి యందలి విషయమును సమగ్రముగఁ గ్రహించి, సందేహము లున్నయెడలఁ బ్రశ్నల వెలయించి, సమాధానము వాంఛించినందుల కమందానందమొందఁగల్గుదును.

‘ముద్ద’నే తెలుఁగుపదమునకుఁ మనమిదివఱకు జెప్పుకున్న సందర్భమునకు సరియైన సంస్కృతపదము లేదనియేఁ జెప్పవచ్చును. ‘చుంబన’ మనఁగ ముద్దని యర్థమువచ్చును. ఈచుంబన మొక్క పసినిసుఁగులయెడఁ జూపెడు హార్దవిశేషమే యని నొక్కి చెప్పఁగలమా ? లేదు. వాత్సల్యములో, ప్రణయములో, భక్తి మార్దవములోకూడ నీ ‘చుంబ’నము నెదుర్కొనవలసి వచ్చుచుండును. కాక, ‘చుంబ’న మనునది ప్రేమయొక్క బాహ్యచిహ్నము. తెలుఁగుభాషలో ‘ముద్ద’నునది పసిపాపలయెడఁ గనుపఱచు ప్రేమయొక్క యంతర జ్యోతి. కావున ‘చుంబన’ మను సంస్కృతపదము ‘ముద్ద’ను తెలుఁగుపదమునకు సరియైనది కాఁజాలదు. ఇఁక ‘ప్రేమ’ యను పదమును ప్రీతి, ప్రియము, ప్రియత్వము, ప్రీతము, ప్రీత, హార్దము యిత్యాది నామములతోఁ బిలుచుకొనవచ్చును. కాని యీ పదములలో నొక్కటైనను ముక్తసరిగ ‘ముద్ద’ను పదమునకు సరిపోవుటలేదు. కాఁబట్టి తెలుఁగుపదమును వాడితిని. కాక, తేఁటతెల్లముగనున్న తెలుఁగుపదమును వదలుకొని సరియైన యర్థమునకు దూరస్థమైన సంస్కృతపదము నేరుకొనుటకొఱకు శ్రమించుట నవసరమని తలఁచి, ‘ముద్ద’ను తెలుఁగుపదమును ముద్దుముద్దుగ నచ్చట ముచ్చటగఁ జెప్పితిని. అయినను సంస్కృతపదమే కావలసినచో ‘ప్రియ’ మనుకొనవచ్చును.

‘స్త్రీకి వివేకహీనమైన ప్రేమ యున్నప్పుడుగాని పురుషునకు ప్రేమహీనమైన బుద్ధి యున్నప్పుడుగాని’ యన్న వాక్యము నర్థముచేసుకొనుటకు ముందు ‘బుద్ధి’ ‘ప్రేమ’ యను ప్రవృత్తులు మానవతత్వములో నిమిడియున్న రెండు ప్రత్యేక గుణవిశేషములని గ్రహింపవలసియున్నది. ‘బుద్ధికి’, ‘ప్రేమకు’ భేదమున్నది. బుద్ధి మానవుని శిరముతో సంబంధించియున్నది; ప్రేమహృదయముతో సంబంధించియున్నది. శిరము పని శిరస్సును హృదయము పని మనస్సును జేసుకొనుచుండును. ఉదాహరణకు:-బక్కచిక్కిన పేదవాని దిక్కుమాలిన తనమునకుఁ గన్నులు చెమ్మగిల్లును. తరువాత బుద్ధి నిర్ణయించును. (ఆ పేదవాని యాకఁటిచిచ్చుఁ దీర్చుట కొక కాణియో లేక యర్థణాయో వాని కొసఁగుట యనుకొనుఁడు.) ఈ సందర్భమునఁ గన్నులకుఁ జెమ్మఁ గలిగించుట ‘గుండె’ పని. ఏలన హృదయము ప్రేమస్థానము గనుక. తదనంతరముపకారమొసరించుటకొక నిశ్చయమునకు రప్పించుట ‘తల’ పని ఏలన శిరస్సు బుద్ధిస్థానము గనుక. కావున గుండెతోఁ గరఁగి బుద్ధితో సిద్ధసంకల్పుఁడగును. అనఁగ హృదయమును శిరమును వేర్వేరు ప్రవృత్తులతోఁ గూడినవని గ్రహింపవలెను.

ఇఁక 'వివేకహీనమైన ప్రేమ' యనఁగఁ బైనిఁ జేర్కొన్న ద్విగుణములలో నొక్క 'ప్రేమ'కే యగ్రస్థాన మీయవలసివచ్చును. అచ్చట బుద్ధివికాసము లేకపోవచ్చును. ఒకవేళ యున్నను నయ్యది వెలవెల బారుచుండును. అనఁగ ప్రేమకే ప్రాధాన్యమీయవలసివచ్చును గనుక, బుద్ధిసూక్ష్మత యంతగ నుండదు గనుక 'వివేకహీనమైన ప్రేమ' యని వ్రాసుకొంటిని. ఆ ప్రేమ కేవలము బేలతనమును బ్రకటించుచుండును. అందులో బుద్ధిప్రాభవమంతగఁ గన్పట్టదు. ఈ సందర్భములో ప్రేమ యను ప్రవృత్తికే విశేష ప్రాముఖ్య మీయవలయును. ఈవిధముగ నవగాహన మొనరించుకొనుటయే లెస్స. అంతియకాని వివేకహీనమైన ప్రేమ యన్న బుద్ధిమాలిన ప్రేమయనిగాని, యవకతవక ప్రేమయనిగాని యర్ధము చేసుకొనఁగూడదు. అటులనే 'ప్రేమహీనమైన' బుద్ధి యన్నప్పుడు బుద్ధికి ప్రధానస్థానమీయవలసియుండును. అనఁగ నిచ్చట బుద్ధి సముజ్వలముగఁ బ్రకాశించుచుండును. ప్రేమ యంతగఁ గాన్పించదు. ఈ పరిస్థితిలో బుద్ధి విశేషముగను, ప్రేమ కొలఁదిగనో లేక హుళక్కిగనో నుండును. కావున బుద్ధికే నత్యున్నతస్థాన మీయవలసియుండును. అంతియె కాని 'ప్రేమహీనమైన' బుద్ధియన్న పనికిమాలిన బుద్ధియనిగాని, యల్లరచిల్లర బుద్ధియనిగాని యనుకొనరాదు.

అట్టియెడ 'వివేకహీనమైన ప్రేమ' యనఁగఁ బై చర్చను బురస్కరించుకొని మాట్లాడ నుంకించినప్పుడొక్క ప్రేమకే ప్రాధాన్యమొసంగవలసివచ్చును గావున, వివేకమచ్చోటఁ దత్సమానముగ వికసింపలేదు గావున, బేలతనమనిగాని, యమాయకత్వమనిగాని, మోహమనిగాని వ్యవహరింపవచ్చును. అటులనే 'ప్రేమహీనమైన బుద్ధి' యనఁగ నొక్కబుద్ధికే యచ్చోట ప్రాముఖ్యమీయవలసివచ్చును గనుక, ప్రేమ యను దైవీ ప్రవృత్తి తేజోహీనమయినదని యూహించి 'బుద్ధి' యనిగాని, మేధ, మనీషా, శేముషీ, ధీ, ప్రజ్ఞ, ధిషణా, మతి, మున్నగు నామములతోఁగాని వ్యవహరింపవచ్చును. తెలుఁగుభాషలో నద్దానిని 'తెలి'వని పిలువవచ్చును.

తరువాత ప్రశ్న 'బుద్ధి, ప్రేమలు కలసియున్నప్పుడు దాని పేరే'మని. ఈ ప్రశ్నకు సరియైన సమాధానమిచ్చుటకే నేనింత విస్తరించి వ్రాసినది. ఒక్క ప్రేమ మాత్రమే యున్న నయ్యది బేలతనమనిగాని, యమాయకత్వమనిగాని, మోహమనిగాని యనిపించుకొనుచున్నదని యిదివఱకే యనుకొనియుంటిమి కదా. ఉ॥ 'ఆమె బేల' 'ఆయన యమాయకుఁ'డని వ్యవహరించినప్పుడంత యుత్సాహవంతముగ నుండదు. ఏలనన నా వ్యక్తిలో ప్రేమ దివ్యముగఁ బ్రవహించుచున్నను తెలివితేఁటలు లేవేమో యన్న సందేహము కలుగును. ఆవిధముగనే యొక్క బుద్ధికుశలతయే యున్న నయ్యది 'శేముషి' యనిపించుకొనుచున్నది. ఉ॥ 'అతఁడు మేధావి', 'అశేష ప్రజ్ఞావిశేషముఁ గలవాఁడు' యన్నప్పుడు కుశాగ్రబుద్ధిఁ గలవాఁడని గ్రహింపవలసియున్నను ప్రేమ రుధిరము గడ్డకట్టిన 'మనీషఁ' గలవాఁడేమో యన్న సంశయము తలసూపుచుండును. కావున ప్రేమతోఁగూడిన బుద్ధి యన్నప్పుడు, బుద్ధితోఁగూడిన ప్రేమ యన్నప్పుడు 'విజ్ఞాన' మని వ్యవహరింపవలసియుండును. ఈ రెండు ప్రవృత్తులే వ్యక్తియందుఁ గనుగొందుమో యాతఁడే విజ్ఞుఁడు. విజ్ఞానమెచ్చట నుండునో యచ్చటనే పరిపూర్ణ మానవత్వము ప్రత్యక్షమగుచుండును. అట్టి సంపూర్ణ మానవత్వమే, 'సత్యం, శివం, సుంద'రమని గ్రహింపవలసియున్నది.

'బుద్ధి'కి 'ప్రేమ'కు నవినాభావసంబంధమున్నది లేనిది, యట్టి సంబంధమున్న నెచ్చటనున్నది, లేనిచో నెచ్చట లేకపోయినది పై వాక్యములను బూర్తిగ యర్థముచేసుకున్నయెడల తామే నిర్ణయించుకొనఁ గలరని నమ్ముచున్నాను. కాని 'బుద్ధి' 'ప్రేమ' యనునవి రెండు ప్రత్యేక ప్రవృత్తులన్న చిన్న మాటను

విస్మరింపఁగూడదు. ఈ రెండు ప్రవృత్తు లైక్యమైననాఁడే విజ్ఞానముద్భవించును. అట్టి విబుధుఁడే విజ్ఞుఁడు. అట్టి విజ్ఞుఁడు హృదయమార్దవముతో శేముషీవిభవముతో వెలిఁగెడు పుణ్యమూర్తియని గ్రహింపవలెను. అట్టి విజ్ఞాన జ్యోతిర్మయమూర్తి శ్రీరామకృష్ణుఁడనుఁడు. అట్టివారే వేఱొకఁడనుఁడు. అట్లయిన నిఁక 'బుద్ధి'కి, 'ప్రేమ'కు నవినాభావ సంబంధమున్నట్లేకదా. కాని యట్టి యవినాభావసంబంధమొక్క విజ్ఞానవంతునిలోనే జూడనగునని తలంచవలెను. మనుష్యులలో నీ రెండు ప్రవృత్తులే గోరంత కలసియున్నను వారిని విజ్ఞానవంతులని వ్యవహరించుచుందుము. వారి యా విజ్ఞానలేశమును లోకములో ప్రస్తుతము 'లౌక్య' మన్న పేరుతో 'చలామణి' యగుచున్నది. అట్టిదానిని విజ్ఞానలేశమనుఁడు లేక లౌక్యమనుఁడు. అందలి యదార్థమును గ్రహించినఁ జాలును.

'ప్రేమలేకుండా బుద్ధియుంటుందా? బుద్ధిలేకుండా ప్రేమయుంటుందా' యన్న ప్రశ్నకు పైనిచెప్పినదే సరియైన సమాధానము. ప్రేమలేకుండ బుద్ధియుండవచ్చును. ఉ॥ రకరకముల మారణయంత్రములను దనధీశక్తిచేఁ దయారుచేయు బుద్ధిమంతుఁడు. ఆ హృదయములో ప్రేమలేదనియేఁ జెప్పవచ్చును. ఒకవేళనే గోరంత యున్నను నయ్యది కొండంతబుద్ధిచే నణఁగఁద్రొక్కఁబడి దానిసహజ కోమలత్వమునుఁ గోల్పోవును; ప్రత్యేకవ్యక్తిత్వమును మఱచిపోవును. ఆవిధముగనే బుద్ధిలేకుండ ప్రేమ యుండవచ్చును. ఉ॥ మాతృప్రేమచేఁగన్నబిడ్డల కజీర్ణముచేయునంతవఱకు నవివేకపు 'తిండి'చే వారి పొట్టల నిండించు వెఱ్ఱితల్లి. ఇచ్చట నా మాతృదేవికేవిధమైన బుద్ధిలేదని యూహింపవచ్చునా? కాదు. ఇచ్చట సామాన్యమైన బుద్ధియున్నను నయ్యదసమానమైన మాతృప్రేమకు లొంగి భంగపడిపోయినదని గ్రహించవలెను.

ఇఁక డిశంబరు సంచికలో శ్రీ సంపాదకులు వ్రాసిన "బుద్ధి పర్వతమువంటిది ప్రేమ సముద్రమువంటిది ప్రేమ అను క్షీరసాగరములో బుద్ధి అను మేరుపర్వతము తేలుచుండును. బుద్ధి సూర్యునివంటిది అనగా జ్ఞానమను వెలుగుతో వెలయుచుండు శక్తి శక్తిప్రకాశము. ప్రేమ చంద్రునివంటిది. ఆనందమను ఆహ్లాదకరమగు కాంతితో నిండియుండును" అను వాక్యమునందలి అర్థమేమి?

పైవాక్యమును వ్యాఖ్యానముచేయక విడచినందులకు నేను నిజముగఁ జింతిల్లుచున్నాను. 'ప్రమాదోధీమతామపి' యని కదా యార్యోక్తి. బుద్ధిమంతులకే ప్రమాదములు తటస్థించుట సహజమైనప్పుడు నావంటిసామాన్యునివిషయము వేఱుగ నుడువనక్కఱలేదు. ఇప్పుడవకాశము గలుగుటచే నాకు తోఁచినరీతి వ్రాసెదను.

బుద్ధి పర్వతమువంటిదనుటలో సందేహమిసుమంతయునులేదు. ఏలననఁగ బుద్ధి పర్వతమువలె నచంచలమైనదగుటచేతనే. పరిపక్వముఁజెందిన బుద్ధి స్థిరత్వములో పర్వతసదృశమే! "కలంచునే సతులమాయల్ ధీరచిత్తంబులన్" అల్లసానివాని యప్పటిమాట. ఇచ్చట ధీరశబ్దమునకు 'బుద్ధి'యనికదా యర్థముఁ జెప్పుకొనవలయును. అట్టి బుద్ధిమంతులు సతులమాయలకు చలింపరనియేకదా భావము. కాఁబట్టి బుద్ధిని పర్వతముతో నుపమించుటయేమేలు. ఉ॥ బుద్ధుఁడు తన పైదలియందలి ప్రణయమును, తొలిచూలి కాన్పునందలి ముద్దును మఱచి, నిర్వాణపదము నందుకొనుట కెకాయెకి నర్థరాత్రమున నేకాకియై పాదచారియై నిశ్చలుఁడై పయనించిన యెకిమీడు. ఇది ధీరత్వము. అటులనే నర్థరాత్రమున పండు రేయెండలో హాయిగఁ బవ్వళించి నిండుజవ్వనముచే నిగనిగ మెఱసిపోవు నిజకాంతచే హృదయము పండిపోవునట్లు శుశ్రూషఁ జేయించుకొనుచు నామెను మఱచి, పరమాత్మతోఁ దనయాత్మ నైక్యముఁజేసి తన్మయుఁడై యాత్మపారవశ్యము ననుభవించి

నిశ్చలసమాధినిఁ బ్రవేశించి యసమాన ప్రజ్ఞాధురంధరత్వముచే దుర్నిరీక్ష్యముగఁ బ్రకాశించిన విజ్ఞానమూర్తి, శ్రీరామకృష్ణుఁడు. ఇది ధీరత్వము. అశోకుని ప్రజ్ఞావిశేషము శ్రీ హర్షునిధిషణామాహాత్మ్యము, రామతీర్థుని ధీచాతుర్యము, వివేకానందుని యసమాన శేముషీవిభవము, తిలక్ మహాశయుని బుద్ధి విశారదత్వము ధీరత్వమున కుపమానములు. భూధరమువలె నచంచలమైనదగుటచేతనే బుద్ధిని శ్రీ సంపాదకులు పర్వతముతో నుపమించిరి.

ఇఁక ప్రేమ సముద్రమువంటిదే. ఏలన ప్రేమకు వైశాల్యముహెచ్చు. సముద్రతరంగములవలె ప్రేమ పొంగి పొరలుచుండును. జలాధికముచే నేపిల్లగాలి దుడుకుఁదనమునకైనను సముద్రతరంగము లల్లకల్లోలమగుచుండు టెల్లరకు విశదమే. అట్టియెడ తుపాను చెలరేఁగినప్పుడుగాని పున్నమచంద్రునిఁ జూచినప్పుడుగాని, భూమి కంపించినప్పుడుగాని నిఁక నా సంద్రములో నుద్భవించిన నుత్తుంగతరంగముల నరికట్ట నెవరికి సాధ్యమగును. అటులనే ప్రేమతరంగములుకూడ నేకొలఁది గిరురింతకైన నల్లకల్లోలమగుచుండుననిన, నిఁక హృదయములో ప్రణయము రేకెత్తినప్పుడుగాని, ప్రేయసుని ముఖచంద్రదర్శన భాగ్య మబ్బినప్పుడుగాని, సంసారములో ప్రణయకోపము నభినయించినప్పుడుగాని, ప్రేమతరంగము లుత్తుంగములై నిరోధింప నలవికానివై యుండుననుట కరతలామలకము కదా ! ప్రేమ సముద్రమువలె నగాధమైనది. అందలి కెరటములు పైకెగయుచుఁ గ్రిందఁబడి యగాధ జలధిలో భ్రమించుచుండును. ఉ॥ శైశవావస్థలోఁ దలిదండ్రులయందలి భక్తి యౌవనములోఁ బ్రియునిమీఁద ప్రణయముగ, కౌమారములో నిజసంతానముమీఁద వాత్సల్యముగ వార్ధక్యములోఁ బరమాత్మ దేవునిమీఁద దివ్యప్రేమగఁ బ్రవహించుచుండును. కనుకనే ప్రేమ, ప్రవాహముతో నుద్దియని పెద్దలందరు. సకల ప్రవాహముల కాశ్రయము సముద్రము. ప్రేమ పుక్కిలింతలైనపు డద్దానిని సముద్రముతోఁ బోల్చుటయే సమంజసము. కనుకనే శ్రీ సంపాదకులు ప్రేమను సముద్రముతో నుపమించిరి.

ఇఁక మేరుపర్వతము, శ్రేష్ఠవాచకము; క్షీరసముద్రమునునట్లే—అనఁగ, పర్వతములలో మేరువు శ్రేష్ఠమైనది గనుక నట్టి మేరుపర్వతముతో ధీరత్వము నుపమించుట. అట్లే సాగరములలో క్షీరసాగర ముత్కృష్ఠమైనది గనుక నట్టి పాలసంద్రముతో ప్రేమ నుపమించిరని గ్రహించవలెను. తేఁలుచుండుననుట కేవలము భావము లుక్కిరిబిక్కిరియై తొట్రుబాటుతో నొకదాని నింకొకటి ముందుకుఁ ద్రోయుచుండుటవలన వ్రాసినమాటయే గాని యచ్చట తేలుట యన నీటిలో నొకవలె తేలుటఁగాదని గ్రహించవలెను. బుద్ధి పర్వతమువలె సమున్నతము.

బుద్ధి సూర్యునివంటిదే. ఏలనన బుద్ధిలోఁ బ్రకాశమానమున్నది గనుక ప్రకాశించు గుణమెందుండిన నందు కొంత తైక్ష్ణ్యము నిశితత్వము సహజముగ నుండును. ఉ॥ ఇనబింబము. కనుకనే బుద్ధిని సూర్యునితోఁ బోల్చి యుండవచ్చును. ఇఁక ప్రేమ చంద్రునివంటిదే. కారణము హృదయమే ప్రేమకునికిపట్టు గనుక. హృదయము మృదుమధురముగ నుండునని వ్రాయుట చర్వితచర్వణము. ఇచ్చట బుద్ధిలోవలె తైక్ష్ణ్యముండదు. వాఁడియుండదు. చల్లని చంద్రికలను బ్రసరించుటయే దానికి సహజలక్షణము నిసర్గవర్తనమునైయున్నది. నిండు చంద్రుఁడేవిధమున మనసు కాహ్లాదమునిచ్చునో యట్లే ప్రేమమానసోల్లాస మొసంగును. కనుకనే సితద్యుతితోఁ బ్రేమను పోల్చియుందురు.

From,

Mr. GRANDHI VENKATARAMAIAH, B.A., B.L.,

To,

The Proprietor,

"GRIHALAKSHMI" MADRAS.

Sir,

The success and popularity of any Magazine or Journal depends not upon the matter in so many pages but upon the quality and manner in which it represents the ideals of humanity and the spirit of the Age. Undoubtedly its success will be enhanced by the proper and intelligent selection and publication by its Editor of such articles which inculcate the truths of humanity for the uplift and enlightenment of society at large.

'Grihalakshmi' is the only Telugu Ladies' 'Magazine' which has given a definite shape to the "*Ideals of Womanhood*" and consequently attained popularity throughout India, especially in Andhra Desa. In connection with the 13th birthday celebration of "Grihalakshmi" I wish the journal a long life and success to the present Editor whose services to Telugu Language in general and to "Grihalakshmi" in particular are invaluable.

I once again wish for the wide circulation of this Magazine which is of immense use for elevation of Womanhood in India.

MADRAS,
14th Feb. 1940.

Yours sincerely,
(Sd.) GRANDHI VENKATARAMAIAH.

'గృహలక్ష్మి' 13-వ జన్మదినోత్సవ సందర్భమున శ్రీ గ్రంధి వెంకటరామయ్య బి. యే. బి. యల్. గారి ఆశీస్సు సందేశము

కాలోచితముగ ప్రజాహృదయమునందు ప్రజ్వలించు భావపుంజమును బాగుగ వెలయించుచు, మానవజీవితాదర్శములను మనోరంజకముగ నే పత్రిక చిత్రింపగలుగునో అయ్యది జయమును ప్రజాభిమానమును బడయగలదు; కాని పెక్కు పుటలను మిక్కుటముగ తుక్కువిషయములతో నింపుటచే నిక్కువమగు మక్కువను ప్రజాహృదయములో నే పత్రికయు నెక్కొనజేయజాలదు.

మానవహృదయములో మెరయుచుండు సత్యార్ధములను సందీపింపజేసి, సాంఘికాభివృద్ధికి సహాయపడగల విజ్ఞానవికాసమునొసంగు వ్యాసములను కుశాగ్రబుద్ధితో సంపాదకు డెంచుకొని నయ్యవి ప్రచురించినపుడే పత్రిక ప్రజావిశ్వాసమును వశపరచుకొని, విజయముతో వర్ధిల్లగలదు.

స్త్రీధర్మాదర్శములకు రూపరేఖావిలాసములేర్పరచిన స్త్రీల పత్రిక 'గృహలక్ష్మి' యొక్కటియే గావున నియ్యది హిందూదేశమంతటిలోను, ముఖ్యముగ నాంధ్రావనిలో నధిక పేరుప్రతిష్ఠలను పొందగల్గినది.

'గృహలక్ష్మి' 13-వ జన్మదినోత్సవ సందర్భమున నీ పత్రికాకుమారి యొక్క చిరాయురభివృద్ధిని కోరుచు, ప్రస్తుత సంపాదకోద్యోగిచే ఆంధ్రభాషకును, ప్రత్యేకముగ 'గృహలక్ష్మి' పత్రికకును ఒనరింపబడుచున్న అమూల్యసేవల నభినందించుచున్నాను. భారతరమణీమణుల యభ్యున్నతి కెంతయు తోడ్పడుచున్న ఈ పత్రికయొక్క విశేషవ్యాప్తిత్వము నెక్కుడుగ నభిలషించుచున్నాను.- (ప్రక్కపుటయందలి ఆంగ్లములోని జాబున కనువాదము.)

Matru Mandali, Mysore.

PEDDADA KAMESWARAMMA GARU, B.A.,

"We have been regularly getting 'Grihalakshmi' and it is responsible for creating a taste for learning telugu among a number of Canarese Ladies. So indirectly the Journal is rendering a great service to Telugu."

"మీ గృహలక్ష్మి పత్రిక కన్నడ స్త్రీలలోగూడ తెలుగు భాషయందభిరుచినిగలిగించి ఆంధ్రభాషా వ్యాప్తి కపారమగు సేవ నొనరించుచున్నది." (శ్రీ పెద్దాడ కామేశ్వరమ్మ బి.ఏ.)

భక్తి

పాయనిభక్తిచేఁ బలుబాధలనుజెంది ప్రహ్లాదుఁడతులిత పదముఁజెందె
సకలకష్టములోర్చి సక్కుభక్తినిఁగాదె సాయుజ్యసౌఖ్యంబు సరగఁబొందె
నిశ్చలభక్తిఁగా నిలతపస్సొనరించి ధృవకుమారుఁడుఘన ధృవక్షితొందె
సతతనారాయణ స్మరణంబుననుగాదె నారదుండమరమాన్యై చెలంగె

మహాదేవునందలి మహితభక్తిచేగాదె అలమృకండునిసూనుఁ డాయువందె
శ్రీరామకీర్తనల్ జెలువొందగీర్తించి త్యాగరాజయ్యెను భాగవతుఁడు
రామనామజపంబు నీమంబుగనుజేసి వాల్మీకితొలిజన్మ వదలిపోయె
శ్రీకృష్ణదర్శన సేవానురక్తిచే విదురార్జునాక్రూర విమలయశులు

గోపగోపికద్రౌపది గొప్పసతులు
ఘనకుచేలాదిభక్తులు మనమునందు
కృష్ణపరమాత్మభక్తిని కుదురుపరచి
పూజ్యులై ముక్తులైభువిఁ బుణ్యులైరి.

ఎన్నివిద్యలనేర్చివే రెన్నివిన్న
ఫలితమిసుమంతలేదిల భక్తిలేక
తర్కవేదాంత తత్వముల్ తరచిచూడ
కాలయాపనలౌగాని కనరుముక్తి.

కమలగర్భునిఁగన్న కాంచనాంబరుసేవ మానకసేయుడీ మనుజులార!
ఆగమవేద్యుని నతభక్తిపూజలు మానకసేయుడీ మనుజులార!
శరణాగతత్సర శౌరినామభజన మానకసేయుడీ మనుజులార!
దినకరువంశాబ్ధి ఘనరత్నుకీర్తనల్ మానకసేయుఁడీ మనుజులార!

రామశ్రీరామ రఘురామ రామయనుచు
రంగశ్రీరంగ పండరీ రంగయనుచు
కృష్ణ శ్రీకృష్ణ రాధికా కృష్ణ యనుచు
మానకనుచింత సేయుడీ మనుజులార!

—శ్రీ ఆచంట సత్యవతమ్మ

ద్రవ్యనిర్మాణం

"వసంత"

●

ఎంతోముచ్చటపడి మొన్ననేకొన్నానండీ, ముద్దులుమూటకట్టుతున్న గ్లాసు, నిష్కారణంగా పగులకొట్టేరు!

నీవు గ్లాసుఇస్తున్నావుకాని అది పగిలిపోతుంది సుమా అని ముందుగాచెప్పనే చెప్పను. నేనేదో పరిహాసంచేస్తున్నట్లు భావించావు.

మరుగుచున్న వేడినీరు గాజుగ్లాసులో పోసినప్పుడు అది బద్దలయితే బాగుందికాని, మధ్యాహ్నం మీరు తెచ్చిన ఆచల్లనినీరు—

కాదు. అదినీరుకాదు. మనంపీల్చేగాలినే అతిచల్లగా చేసినపుడు ఆవి రీనీరుగా మారినట్లు అది ద్రవంగామారుతుంది. ద్రవించినగాలి కాబట్టి దానిని 'ద్రవపవనం' అంటారు.

అదే ఆద్రవపవనం పోసినంతమాత్రాన్న గ్లాసు ఎలా పగులుతుందనుకొంటానండీ?

వేడినీరుపోస్తే గాజుపాత్ర ఎందుకుభిన్నమగునో అక్కడ కింక తెలసినట్లు!

ఎన్నోసార్లు ఉడుకునీరు వేక్యూమ్‌ఫ్లాస్కులో పోసి బద్దలుకొట్టేను కదండీ!

అయితే అవెందుకు పగులుచున్నవో తెలిసిందా? ద్రవపవనంకూడా సులభంగా లభ్యమైతే మరికొన్నిఫ్లాస్కులు ముక్కలు చేయడానికిమాత్రం అర్హత లేదూ?

ఆమాత్రంజ్ఞానముంటే ఇన్నిమాటలు మీచేత అనిపించుకొంటానండీ? ఆమాత్రం జ్ఞానమున్నా, ఈపుట్టుక లేకపోయినా మీవలెనే హాయిగా ఉద్యోగంచేసి జీవనోపాయం చూసికొనేదాన్ని.

ఉద్యోగంకొఱకే జ్ఞానార్జనమన్నభావం పిశాచమట్లు ఆవహించి, మనలనుపిప్పిచేసి రసహీనులనుగాచేస్తున్నది. సుఖజీవనానికి, ఆత్మశాంతికి, జన్మతరింపచేసికొనుటకు జ్ఞానం అత్యంతావశ్యకమన్న సత్యం మనము మరచిపోతున్నాము. మానసికవికాసం స్త్రీపురుషుల కందరకు సదృశంగాకావలసినదే. 'విద్యాహీనానశోభంతే నిర్గంధా ఇవకింశుకాః' అని ఎంతరసవత్తరంగా అన్నారోచూడు.

మమ్మల్ని నిర్గంధకుసుమములుగా తయారుచేసినదిమీరే కదండీ! బడికిపంపి చదువునేర్పిస్తే మేముకాదన్నామా, రాదన్నామా? 'ముదితల్ నేర్వఁగరాని విద్యకలదే ముద్దార నేర్పించినన్?'

SRI JAGADGURU VISHWARADHYA
JNANA SIMHASAN JNANAMANDIR
LIBRARY
Jangamawadi Math, Varanasi
Acc. No. 7899

నీవాదమూహింపలేకపోలేదు అయితే, కళాశాలకుపోయి నేర్చుకొన్నదే విద్యకాని యోగ్యమైనగృహలక్ష్మివలె గృహకృత్యములు నిర్వర్తించుకొనుచు, ఇంట్లోచదువుకొన్నది సార్థకంకాదనా ? నేటివిద్యా విధానమెంతమాత్రము జ్ఞానప్రదాయకము కాదు. ఉదరపోషణకు నాలుగురూకలు లభింపచేయుటకన్న నేటివిద్యకు వేరొకప్రయోజనములేదు. పట్టభద్రులైనవారుకూడ కళాశాలవిడిచి ప్రాపంచకరంగంలో ప్రవేశించినతరువాతనే యథార్థమగు మానసికవికాసము పొందుచున్నట్లు గ్రహిస్తున్నారు. దానికేమి మీకాఅవకాశంలేకపోయిందికదా అని ఊరుకోనకుండా ఇంట్లోనేకాస్త కృషిచేసికోరాదు ?

ఇంట్లోకృషా ? అదిఅసాధ్యమనలేనుగాని, ఇంట్లో విద్యాభ్యాసం సరళంగా ఎలాగు కొనసాగుతుందండీ ?

విద్యాభ్యాసంగాదు, మీరుచేయవలసినది జ్ఞానార్జనము. దానికై బడిలో పద్ధతిప్రకారం ఏర్పాటుగా పాఠాలుచదివినట్లు మీరుచదువనక్కరలేదు. జీవయాత్రలో దినదినం పుంఖానుపుంఖాలుగా వాటిల్లుచుండు విషయాలను అవకాశమైనపుడల్లా విమర్శనాదృష్టితో సమీక్షించి వాటివైజ్ఞానిక వివక్షకనుగొన ప్రయత్నిస్తేచాలును; ముక్కాకలుతీరిన పండితులుకాగలరు. ఎంతస్వల్పవిషయమైనా మహత్తరసత్యములు బుద్ధిగోచరము చేయవచ్చును. సామాన్యసంఘట్టనాలలో అసామాన్యఆదేశాలు కనుగొనగలజ్ఞానమే సత్యమైనజ్ఞానము. ఎంతస్వల్పవిషయమైనా మన మేధృక్పథంలో పరిశీలింతుమో తదనుగుణ్యంగా మనకందలి విశిష్టార్థములు ద్యోతించుచుండును.

చెట్టు పట్టుతప్పి భూపతనమొందుచున్న పరిణతఫలంగాంచిన న్యూటను (Newton) ప్రధానమును సార్వత్రికమును అగు గురుత్వాకర్షణ సూత్రంకనుగొన్నాడని ప్రతీతి. ఆరముగ్గినపండ్లు అనాదిగచెట్లనుండి రాలుచుండుటలేదూ ? వాటినెందరుచూడలేదు ? అట్టి పతనఫలదృశ్యము న్యూటనుకొక్కనికే ఆగొప్పసూత్ర రహస్యమును వెల్లడించుటేల ? సలసలమరుగుతున్న నీటిపాత్రపై పెట్టినమూత ఆవిరివిరివికిగెంతుట ప్రాచీనమానవులు చూడలేదూ ? ఆస్వల్పవిషయం ఆవిరియంత్ర నిర్మాణభావమును జేమ్సువాట్ (Watt) హృదయమందే ఉత్పన్నంచేయనేల ? ఒకటేకారణము. ధీమంతులు చూచినవిషయాలను సామాన్యులవలె చూచినట్లేమరచిపోక అట్లవిసంభవించుటకు కారణమేమైఉండునో వితర్కింపపూనుకొన్నారు. తత్ఫలితంగా గొప్పసిద్ధాంతాలుకనుగొన్నారు; వాటిని నిత్యవ్యవహారంలోప్రయోగించి జనోపయోగమగు యంత్రాలునిర్మించి జీవితసౌఖ్యం పెంపొందించేరు.

ఏమైతేనేమి మేముబడిలో విద్యాభ్యాసంచేయుట మీకురుచించదు !



తన్ను తాను మరచి తన్మయత్వం చెందిన మీర—శ్రీకృష్ణుడు ఆమె బాహువల్లి కల్లో బంధింపబడి యేస్థితిలో వున్నాడో......

నవ్యకళావారి, మీరాబాయిలోని సన్నివేశం

కుమారి వి. కమల

గృహలక్ష్మి జయంతి మహోత్సవ సందర్భమున వేణుగాన ప్రదర్శనమొనర్చి సభ్యుల నానందింపజేసి శ్రీ కే. యన్. కేసరిగారిచే బంగారుపతకముచే బహూకరింపబడినది.

రుచించకేమిా ? అమ్మాయినిబడికిపంపుటలేదూ ? జ్ఞానార్జనం ఇంట్లో నే చేయు విధానంకూడకలదని చెప్పేను. ఇప్పుడునీవు కళాశాలకుపోయి చదువుటకష్టంగదా! నీవంటి వారెందరో ఆసక్తిపరులున్నారు. విద్యాపఠనం అసాధ్యమని అట్టేఉండకుండా వారు నిత్య జీవితంలో జ్ఞానంసంపాదించు మార్గంగలదనిసూచించేను.

అయితే, ఈ 'పగిలినగ్లాసు ' విషయంగాతీసికొని దీనివిజ్ఞానంచెప్పగలరా ?

తప్పక. అతివేడిద్రవంగాని, ఎంతోచల్లనిద్రవంగాని పోస్తే గాజుపాత్ర పగులుతుంది. కానిరాగి, వెండి, బంగారము మొదలగు లోహపాత్రలు ముక్కలుకావుకదా ? దానికి కారణం పాత్రయొక్క ద్రవ్యంలోనుంది. వేడిమికాని, చల్లదనంగాని లోహములలో త్వరగా ప్రవహిస్తవి. వెండికప్పులో వేడికాఫీపోయగానే లోనుండిపైభాగానికి ఆవేడివెంటనే వ్యాపిస్తుంది. గాజు, మట్టిపాత్రలతో అట్లుకాదు. ఎంతవేడికాఫీ గాజుకప్పులోపోసినా కప్పును పెదవితోతాకగలము. అంత వేడిమిపైకిరాలేదు. వేడిమికి అవిమంచివాహకములు కావు. లోభాగంకాఫీఅంత వేడిగానున్నప్పటికి, పైభాగం ఒక్కింతవెచ్చగామాత్రమే ఉంటుంది.

వేడిమికి పదార్థాలు పరిమాణంలో సాధారణంగా పెరుగుతవి. ఉడుకు నీరుపోసిన గాజు గ్లాసుయొక్క అంతర్భాగం ఆ హెచ్చు వేడిమికి అధికంగా ఉరడిస్తుంది; తక్కువ వేడిమిగల బహిర్భాగం తక్కువగానే పెరుగుతుంది. ఒక దళసరిగల గాజులో విశాలమైన ఒకభాగం అధికంగా పెరగడం, దాని ఎదుటిభాగం స్వల్పంగా పెరగడం కారణంగా ఆగాజు పాత్ర పగులువేసి ముక్కలౌతుంది. ఇట్టి విషమావస్థ తటస్థంగాని లోహపాత్రలకు అట్టి ప్రమాదంలేదు.

ఈ సంగతి పూర్వమే చెప్పిఉంటే అరడజను ఫ్లాస్కులదాకా బ్రద్దలుచేసేవాన్ని కాదుకదండీ! ఉపయోగకరమైన ఇట్టి విషయాలు మాకుగా మేమర్థించి నేర్చుకొనకుండుట మాపొరపాటే; కాని, మీా అంతటమీారే అధ్యాపకత్వంవహించి నేర్పకపోవుట మీాది మరీ పొరపాటు .. గాలి నీరేవిధంగా అయినదండీ ?

నీరంటే త్రాగేనీరుకాదు. వాయువుగాఉన్నగాలి ద్రవం అయింది. నీరుఘనీభవించి మంచు అగుచున్నదికదా. అట్లే గాలి ద్రవిస్తుంది.

అంటే ?

విశ్వంలోనున్న ద్రవ్యమంతా మూడురూపములలోనుంది. ఘనరూపము-రాయి, మంచుగడ్డ: ద్రవరూపము-పాదరసము, నీరు; వాయురూపము-గాలి, ఆవిరి; ఏ పదార్థమైనను

ఒక కాలమందు ఏ రూపంలో నుండగలవో నిర్ణయించేవి రెండు విశేషణములు: తాపక్రమం (Temperature) పీడనంలేక ఒత్తిడి (Pressure) అందులో తాపక్రమం ప్రధానమైనది. ఘనరూపంలోనున్న పదార్థాన్ని ఉష్ణీకరించిన కొద్దీ సామాన్యంగా అది తొలుత ద్రవించి తరువాత వాయువుగా మారుతుంది. మంచు సామాన్యతాపక్రమంలో గడ్డవలె ఉండ లేదు. ద్రవించి నీరు అగును. అందుచేతనే నీరు పుష్కలంగా లభిస్తున్నది. నెయ్యి, మైనం మొదలగు పదార్థాలు కొలదివేడిమికే ద్రవిస్తవి. శీతకాలంలో వడ్డిస్తూండగానే నెయ్యి గడ్డకట్టుట మన కనుభవమే. సీసం, అల్యూమినియం, వెండి మొదలగు లోహములు కొన్ని వందల అంశలతాపక్రమాన్ని కాని ద్రవించవు. ద్రవములు వాయువగుటకు అంతకధిక వేడిమి కావలెను. నీరు 100 డిగ్రీలకే మరుగుతుంది. పాదరసం 350 డిగ్రీలకు ద్రవించిన లోహములు 2000 డిగ్రీలపై బడితేగాని వాయువుకావు.

పదార్థాలలో అవస్థాభేదములను వేడిమి ఎట్లు కలిగించగలదండీ ?

ఆ సంబంధం తెలిసికొనుటకు ద్రవ్యంయొక్క లక్షణాలతో, ద్రవ్య నిర్మాణంతో కొద్దిగా పరిచయంజేసికోవాలి. జగత్తులోనున్న ద్రవ్యమంతా 92 మూల పదార్థాలతో ఏర్పడుచున్నదని వైజ్ఞానికులు కనుగొన్నారు. భూమిలోనేకాదు, గ్రహాలలోకాదు, నక్షత్రాలలోకాదు, యంత్రసాహాయ్యంతో దృగ్గోచరమైన ద్రవ్యసముచ్చయమంతటిలోను 92 మూలపదార్థాలను మించిన వేరొక మూలపదార్థం ఇంతవరకు బయల్పడలేదు. వీటి సమ్మేళనముతోనే తదితర యోగములు (Compounds) ఏర్పడుచున్నవి. ఇక వీటి లక్షణాలు సంగ్రహంగా విచారిద్దాము.

ఏ రూపంలోనున్నా ద్రవ్యానికి భారం (Weight) పరిమాణం (Volume) ఉండి తీరుతవి. ఘన పదార్థాలకి నియతాకారం ఉన్నది. ఎంత ఒత్తిడికైనా అవి సంకోచించవు. వాటి పరిమాణంమారదు. ద్రవములకు నియతాకారంలేదు. ఏపాత్రలోనుంటే దాని ఆకారమే వహిస్తవి. పాత్రలో పరిమాణంమారదు. కాని, ఘనపదార్థములంత ఒత్తిడి భరించలేవు. వాయువులకు ఆకారమూలేదు, పరిమాణమూలేదు. కొంతవాయువు ఎంత పరిమాణంగల ఆవరణములోనైనా పూర్తిగా వ్యాపించి స్థలమంతా ఆక్రమిస్తవి. ఒత్తిడి నేమాత్రము భరించలేవు.

ద్రవములు వాటిమట్టం కనుగొనునని సిద్ధాంతము. ద్రవానికి ప్రవహించేగుణము, గాలికి వీచేగుణము, శక్తికి ప్రసరించేగుణము స్వతస్సిద్ధము. వాటికి నియమం, పద్ధతిలేక పోలేదు. మెరక ప్రదేశంనుండి మట్టపు ప్రదేశానికే ద్రవంపారుతుంది. అతిపీడన స్థలంనుండి స్వల్పపీడన స్థలానికే వాయువు వీస్తుంది.

శ్రీ రమణ గురు స్తవము

నిరుపమ, నిస్సంగ, నిష్క్రియా, నంత
నిష్కళంక, విమల, నిర్వికార, ఘన
నిత్య, నిరంజన, నిర్వికల్ప, పర
బ్రహ్మమే-తాస్వరూపమ్మవతరించి
నట్టి శ్రీ జగద్గురుఁడా ! ప్రణామమ్ము !

౨

ఆకాశసదృశ, సత్యము, నిరాలంబ
మమలము, నిశ్శబ్ద, మత్యుచ్ఛ, మఖిల
మతిపూర్ణ మాద్యంతమానరహితము
పూజ్య మార్యావర్తమున మహాఋషులు
పొంది తరించిన పూతమౌపదము
స్థిరము, జ్ఞాతృ, జ్ఞ, జ్ఞేయశూన్యమగు
శుద్ధ బ్రహ్మజ్ఞానజ్యోతి ! మదీయ
సద్గురుమూర్తికి ! సతము నమోస్తు !

౩

సంతతనిశ్చల సహజసమాధి
నిష్ఠాగరిష్ఠులై, నిత్యముక్తులయి
భౌతికవాసనల్ వాసి సతంబు
ఆత్మోపరతులై, దయామయులునయి
సన్న్యాసమదిలోక సంగ్రహార్థముగ
భవదాశ్రితుల నెల్ల భవసాగరమును
తరియింపఁబూను శుద్ధజ్ఞానమూర్తి !
సద్గురుస్వామి ! నమస్కారము ! ప్రభు !

౪

ఎన్నిజన్మములుపోయెనో ! యగణ్యతను,
నేటికి మీపాద నీరజ దివ్య
సేవా పరమభాగ్యసిద్ధి నందితిని,
చిరకృత సుకృతవిశేషముచేత
ఈజన్మ, మీదేహ, మీసేవ యింక
ఈ సర్వమును భవదీయకైంకర్య
మున వినియోగించి నను, ధన్యుఁజేయ
ప్రార్థింతు గురుదేవ ! ప్రాంజలినగుచు.

౫

ఎవని కరుణచేత నేగె సజ్ఞాన,
మెవని సన్నిధి ప్రసాదించెను ముక్తి,
ఎవ్వాని సహచర్య మీభవబంధ
తాపత్రయములూడ్చి దరిజూపి బ్రోచె,
ఎవని ధ్యానామృతార్ణవ వీచి గంటి
నిత్య చిన్మయమహా నిర్వాణ పీఠి
ఏవాని పాదాబ్జ సేవానిరస్త
పరమభాగ్యమున జీవన్ముక్తిపదము
నందునా సచ్చిదానందరస ప
రబ్రహ్మమునకు మహానుభావునకు
నాపూజ్య రమణదేవా ! ప్రణామమ్ము !

౬

దివ్యసంపదలైన దీనత్వమైన
మహనీయమైన సామాన్యమేయైన
సంసృతిజిక్కిన జ్ఞానినైమనిన
నాకేల లక్ష్యమ్ము ! నాకన్యమేల !
ప్రభు ! భవత్సేవాపరత్వమ్ముగాక !

౭

దరిఁజేర్చినావో ! ఏకరుణావిభూతి
విడువకుమయ్యా ! ఏవేళలఁగాని
అవ్యాజ కృపఁబూని యాదరింపుమ్మ

అన్యథానాస్తి శరణ్యంత్వమేవ,
మాంపాహి సర్వము, మమదేవదేవ!

౮

అంతులేనట్టి మాయాకల్పిత బహు
జన్మ, జరా, మృత్యు, సంసార, క్లేశ
తాపజాలమునుండి కాపాడి మనిచి
ఆత్మసందర్శన మందిచ్చినట్టి
పరమపావనమూర్తి! భవదీయ దివ్య
పాదసేవికనయివరగి తత్పాద
జలజ పరాగలేశము సదా శిరము
నను(దాల్చు భాగ్యమ్మున ననుగ్రహించు
భవవిదారణ గురువర్య! నమోస్తు!

ఏమహాపుణ్యమో, ఏయోగబలమొ,
ఏవరమహిమమో ఏమిభాగ్యమ్మొ,
ఇనుమయస్కాంతమ్ము నెనసినకరణి
నీపాదములఁజేరి నేధన్యనైతి!

౧౦

అసమానదుర్లభ మవ్యయానంద
బ్రహ్మ సాక్షాత్కారపదము ప్రాప్తించి
ఎదితెలిసినలేదో! ఇకనన్యమెరుగ
నట్టి సజ్ఞానము నతికృప నొసఁగి
సర్వోత్తమగతి ప్రసాదించి బ్రోచు
మా జగత్పూజ్య దేవా ప్రణామమ్ము!

—శ్రీ పొణకా కనకమ్మ.

శ్రీ రమణలీల (షష్టిపూర్త్యుత్సవోపహారము)

రచయిత :-కృష్ణకాండిన్యుఁడు, ప్రచురణకర్త :- శ్రీ నిరంజనానందస్వామి. సర్వాధికారి, శ్రీ రమణాశ్రమము, తిరువణ్ణామలై. వెల :-రూ 1-8-0. ఇందులో 500 పేజీలును వివిధపటములును గలవు.

మూర్తీభవించిన ఆత్మవిజ్ఞానమేయనబరగి శ్రీ సచ్చిదానందపరబ్రహ్మ సాక్షాత్కారమును చేసికొని సిద్ధపురుషులలో సుప్రసిద్ధుడై భువి విలసిల్లుచు సంతత శ్రీ అరుణాచలేశ్వర సాన్నిధ్యశాంతిసుఖాస్పదుడై, ఆశ్రితులకాధ్యాత్మికజ్ఞానప్రదుడై అక్షీణమోక్షలక్ష్మీసింహాసనారూఢుడై అవధూతలకు నాదర్శమార్గదర్శకుడై అంచిత అవతారమూర్తి వైభవోపేతుడై, జీవన్ముక్తులలో నగ్రగణ్యుడై దివ్యమహిమతో తేజరిల్లుచున్న శ్రీ రమణమహర్షి భారత ఋషిపుంగవులలో ప్రఖ్యాతపురుషుడైన పుణ్యస్వరూపుడనుటకు సందియములేదు.

శ్రీ రమణమహర్షి తపోధనసంపదను వెలయించుచున్న నీ సద్గ్రంథములో (1) మానుషలీలాఖండము (2) యోగలీలాఖండము (3) అచలతాండవఖండము (4) ఆశ్రమవాసఖండము (5) వర్ణనాఖండము (6) అవతార ఖండమునను, ఆరుభాగములున్నవి.

ఈ యారుఖండములను వివిధప్రకరణములుగ విభజింపబడినవి. శ్రీ మహర్షి యొక్క జీవితము నామూలాగ్రముగ దెల్పుచు, నందలి అద్భుత లీలలను జ్ఞానప్రబోధకములగు విషయములతో, సవిస్తరముగ వ్రాసి ఈ గ్రంథకుసుమహారమును శ్రీ రమణచిద్విలాససార్వభౌమునకు షష్టిపూర్తిమహోత్సవ కానుకగ సమర్పించిన గ్రంథకర్తజీవితమెంతయు ధన్యవంతము. ఈ పుస్తకముచుత గ్రంథమాలలో నొక దివ్యకుసుమము. (గృ॥ స॥)

గృహలక్ష్మీ స్వర్ణకంకణ గ్రహీతలు

శ్రీమతి

కనుపర్తి వరలక్ష్మమ్మగారు

1934

శ్రీమతి

చిల్కపాటి సీతాంబగారు

1935

కవితిలక, కవితావిశారద

శ్రీమతి

కాంచనపల్లి కనకాంబగారు

1936

గృహలక్ష్మి స్వర్ణకంకణ గృహీతలు

శ్రీమతి
కవితిలక పులవర్తి కమలావతీదేవిగారు
1937

చిత్రకళావిశారద
శ్రీమతి
రత్నాల కమలాబాయిగారు
1939

సతి
శ్రీమతి బాలాంత్రపు శేషమ్మగారు
1939

గృహలక్ష్మీ జయంతి మహోత్సవము

కవితిలక, కవితావిశారద, విద్వాన్ శ్రీమతి కాంచనపల్లి కనకాంబగారి

గృహలక్ష్మి స్వర్ణకంకణ ప్రదానోపన్యాసము

సతీమతల్లులకు, సభాసదులకు, సభాధ్యక్షపదవి నలంకరించిన దుర్గాంబగారికి నతులు నుతులు సమర్పింతు. గృహలక్ష్మికి జయంబగు. గృహలక్ష్మి కంకణ విరాజితులగు నారీమణులకు విజయంబగు. సంగీతసాహిత్యములు రెండును స్త్రీలపాలిటివే! స్త్రీలు పురుషులు గూడ తల్లులచేతఁ బెంచఁబడువారలే కదా! యోగక్షేమములు విచారించవలసినవారు తండ్రులైనను "అడ్డాలనాటినుండి గడ్డాలువచ్చువరకు" చంటిపిల్లల ప్రాయమునుండి జవరాండ్రగువఱకు స్త్రీ పురుషు లిరువురుగూడ తల్లులచేతఁ బెంచఁబడి, సద్గుణములు, సద్బుద్ధులు, సచ్ఛీలములుగలవారగుచున్నారు. కావున స్త్రీరత్నములు జాతినిర్మాణమున గొప్ప బాధ్యతగలవారగుచున్నారు. జాతికి మూలమగు స్త్రీ పురుషుల కుత్పత్తిస్థానము గృహమగుటచే గృహము పవిత్రముగా నుండవలయును. ఆ గృహమున లక్ష్మి గృహిణి. లక్ష్మి అత్తగారయి సంగీతసాహిత్యములుగల సరస్వతిఁ గోడలి నేలుకొనవలసిన యధికారము కలదిగా నుండవలయును.

గృహలక్ష్మికి, భర్త, అత్తమామలు, గురువులు, పూజ్యులు. శిశువులు, నతిథులు, నభ్యాగతులు, భిక్షుకులు, సన్యాసులు, పేదసాదలు, పోష్యులు. సంగీతసాహిత్యములుపాస్యములు. శీలమలంకారము. ఆచారము ప్రథమధర్మము. సంప్రదాయము రక్షణీయము.

గృహలక్ష్మి కాంధ్రభాష ద్రవిడభాషయు స్వభాషలు; చెన్నపురి, రాజధాని. రాష్ట్రవిభజనలో తగాదాలుండుగాక. వారు, చెన్నపట్టణమే మాదికాదన్నచో తంజావూరు వరకు మేమడుగవలసినవారమగుదుమని యాంధ్రులందురు.

తిరుపతి వేంకటేశ్వరున కరవము నేర్పింప ద్రావిడులు పట్టుబట్టినచో, వేంకటేశ్వరునకుఁ, బూరి జగన్నాథునకుగూడ తెలుగు జెప్పఁ దెలుగువారు కడంగుదురు. ఆ తగాదాలు, పాలుపంపులు, నవెట్లున్నను సన్నిహితులమగుటఁజేసి సంప్రదాయమొకటియగుటచే, సంగీతమొకటియగుటచే, దేశభాష యెట్లున్నను సంస్కృతమొక్కటి, కళలొక్కటియగుటచే, వేదశాస్త్రములొక్కటియగుటచే, విద్యాదృష్టితో నాంధ్ర ద్రావిడులకు సంపూర్ణ సానుభూతియు, సౌహార్దము నుండవలసియున్నదని మా 'గృహలక్ష్మి' ప్రతిపాదించుచున్నది.

ఉ. వేదము శాస్త్రముల్ గళలు వేత్తలు తీర్థము సంస్కృతంబు ని
మ్మేదినికిన్ సమంబగుట మేలగు ద్రావిడు లాంధ్రులేకమై
వేదికఁగూడి సత్కళలవృద్ధికినై కృషిసల్పుడేటికీ
భేదము వాదముల్ శ్వపచవృత్తికి నైమది ఖేదమక్కటా!

ఉ. వాదము భేదముల్ మఱచి పండితులెల్లరు గర్మభూమిలో
మోదముతో స్వధర్మమును ముఖ్యముగా నిడికొంచు మించి ని
ష్ఖేదపదంబు గాంచుటయె కీర్తికరంబగు. మున్ను పెద్దలా
మాదిరి భారతావనికి మంగళముల్ సమకూర్చి రన్నిటన్.

కేసరిగారికి మాకు సింహపురము (నెల్లూరు) స్వస్థలము. చెన్నపురము వ్యవహార స్థానమగుటచే కేసరిగారి గృహలక్ష్మి మందిరమున నింటి యాడపడుచుదనము వహించి సతీమణులకు సజ్జనులకు స్వాగతంబొసంగు నధికారము సహజముగా గలిగియున్నాను. అది నా భాగ్యమని సంతసింతును.

ఆంధ్ర ద్రావిడసంబంధము చిరకాలమునుండి వచ్చుచున్నది. "మృచ్ఛలిగే హేంద్రిర ద్రావిడీ పరిచితిన్ జెండాడు చందంబునన్" గృహలక్ష్మి ద్రవిడాంగనలతో గలిసి బంతులాడుకొనుచున్నట్లు కృష్ణరాయలు వర్ణించినాడు.

"పసుపాడి పాగడపుపాదంబొప్ప చెంగల్వడిగ్గియనీరచ్ఛ్యుతమజ్జనార్థముకటిం గీలించి దివ్యప్రబంధయుగాస్యల్ ద్రవిడాంగనల్ నడుతురుద్యానంబులో త్రోవలన్" అని తన యాముక్తమాల్యదలో రాయలు ద్రవిడాంగనల భక్తిప్రపత్తులను వర్ణించినాఁడు. "కంచి యఱవతలసమాస్త్రఖడ్గలతల"ని శ్రీనాథుఁడు ద్రవిడాంగనల శృంగారమును వర్ణించినాఁడు.

శతాధిక గ్రంథకర్త-తపస్వి కలియుగవశిష్ఠుండని ప్రసిద్ధివహించిన యప్పయ్య దీక్షితులు "ఆంధ్రత్వమాంధ్రభాషాచ ప్రాభాకర పరిశ్రమః। ప్రాయేణయాజుషీశాఖా నాల్పస్య తపసః ఫలమ్॥" అనెను. ఆంధ్రుఁడై పుట్టుట నాంధ్రభాష నేర్చియుండుట పూర్వజన్మమున మహత్తరమగు తపస్సువలననే లభించును గాని సామాన్యముగా లభింపవని యనినాఁడు.

మా గృహలక్ష్మి ద్రావిడాంధ్రములందు సమముగాఁ బ్రచారముసలుపుటయు, ద్రవిడాంధ్ర విదుషీమణుల సమముగా గౌరవించుటయు నుభయులకు నుండవలసిన స్నేహసంబంధ బాంధవము నిరూపించుచున్నది. ఇరుగుపొరుగు కాపురములైనపుడు సరిహద్దు లొండొరులు దాటిన సవరించుకొనవలసివచ్చునే గాని లేనిచో కార్యములయందు, ఖడ్గములయందు, నిచ్చి పుచ్చుకొనుటయందు, విందులయందు, వినోదములయందు బొందిపొసగుట కలదుగదా!

జయంతిసందర్భమున శ్రీమతి రాధామణిగారికొక స్వర్ణకంకణము-శ్రీమతి చేబ్రోలు సరస్వతీదేవిగారికొక స్వర్ణకంకణము గృహలక్ష్మి యొసంగుట పరమానందకరము. అరవమున జక్కని సాహిత్యముకలిగి గ్రంథములు వ్యాసములు వ్రాయుటకాక సంగీతమున యథార్థముగాఁ బ్రవీణురాలై తనకు, వినువారికిఁ దత్కాలమున బ్రహ్మానందము గలుగఁ

జేయజాలు కవయిత్రీమణి కవికోకిల రాధామణి సమ్మానమునొందుట యెంతయుఁ దగి యున్నది. గుణమెఱిగి గౌరవించుటయు పిలిచి పెద్దఁజేసి గౌరవించుటయునివి కృతయుగ లక్షణములని చెప్పుదురు. ఆ లక్షణములు సహజముగా మన కేసరిగారియందే కానిపించు చున్నవి.

గీ. కోటదుర్గంబు దుర్గాంబకోట సభకు వాణులకు వీణలకు మణిస్వర్ణములకు
నర్చయును బ్రోవుగలుగుట యబ్బురంబె లక్ష్మి గృహలక్ష్మిగానాంధ్రులనుభజింప.

క. భూసురుఁడు వైద్యవిద్యాభాసురుఁడు త్రిలింగభూమి ఫలభూతుం డ
గ్రేసరుఁడు దానముల నీ కేసరి కీసరికి సాటికిన్ గలరె యొరుల్.

క. భాషా యోషామణికిన్ భూషలు సమకూర్పఁజాలు నుతచరితలనున్
భూషల నర్పించుట సంతోషము కేసరికి బుధనుతుఁ డతఁడగుగదా.

క. సల్లలితశైలి మల్లెలొ మొల్లలొయను నీదు పద్దెములె పూవులుగాఁ
గొల్లగఁ గొలిచితి సీతావల్లభు సుజనాళిమెచ్చ వాసనహెచ్చన్.

ఉ. భూసురసేవ నీకు సురభూజముగా ఫలియించెఁ గావ్యముల్
చేసితి సత్కవుల్ వినుతిజేసిరిఁకన్ దొరసానిబిడ్డలే
డాసిరి శిష్యురాండ్రుగ దృఢంబగు నీపతిభక్తి నీకు నీ
వేసరి, యున్నె సద్గుణము లిక్కలి నొక్కెడనో సరస్వతీ.

చ. కవికులమందు సత్పదము గాంచి సరస్వతి వాహనంబవై,
భువి కవికోకిలోత్తమగు పుణ్యచరిత్రము తేటతెల్లునన్
జవులొదవన్ రచించి, కవిచంద్రుల చంద్రిక లీనమాచు 'స
త్కవి కలహంసి'వన్ బిరుదుగాంచితి మించితిగా సరస్వతీ.

మ. గృహిణీ ధర్మములాచరించుటను గీర్తిం జెందినావీవు మా
గృహలక్ష్మిన్ నడిపింప సాయపడ నెంతేయొప్పుఁ, గావ్యంబుచే
గృహలక్ష్మి బహుమానమందితివి నీవృత్తంబు సామర్థ్యమున్
స్పృహణీయంబులు నాంధ్రభామినులకున్ మేల్బంతివో కాంతరో!

క. కవికోకిల రాధామణి సువర్ణకంకణముతోడ శోభవహించున్
జవులొదవఁ గవితఁజెప్పుచు బ్రవీణయై పాటఁబాడ రాల్గరగంగన్.

శ్రీమతి చేబ్రోలు సరస్వతీదేవిగారి ఉపన్యాసము

సోదరీమణులారా! గృహలక్ష్మీమణులార!

శ్లో॥ ఈశ్వరః సర్వభూతానాం హృద్దేశేర్జున తిష్ఠతి ।
భ్రామయన్ సర్వభూతాని యంత్రారూఢానిమాయయా ॥

అను గీతాప్రమాణవాక్యమనుసరించి సకల చరాచర వస్తుజాలంబుల కంతర్యామియై జంత్రగాడు బొమ్మల నాడించురీతిగా సర్వభూతంబులలోఁ గారణభూతుండయి వెలుంగు స్వతంత్ర స్వప్రకాశ సత్యసుఖస్వరూపమైన జగన్నాటకసూత్రధారుఁడు ఈవిశాల విశ్వమును లీలావినోదార్థమై యాడించుచున్నాడు. ఆ సచ్చిదానందస్వరూపుఁడగు పరమాత్ముని యనుగ్రహము లేనిచోఁ గార్యరూపులగు మానవులొక గడ్డిపోచనైనఁ గదల్పలేరుగదా! అట్టి నిగ్రహానుగ్రహదక్షుండగు పరమేశ్వరునకిట్టి మహోత్సవసమయమున భక్తిపూర్వక నమస్కారములొసంగుట నా విధి.

"నిరాశ్రయాః నశోభంతే పండితా వనితాలతాః" అనిగదా ఋషివాక్కు.

బాల్యమున మా తండ్రిగారు చక్కని విద్యనేర్పించి కొంత పాండిత్యము గలుగఁజేసిరి. వివాహానంతరము దానిని పెంచి నానాఁటికి వృద్ధిగావించి మెఱుగులుదిద్ది నాకిట్టి సదవకాశమొసంగుచు విద్యాపోషకత్వమున కెన్నెన్నియో మార్గములను జూపుచు వారి కలవడిన యపారమగు ఆంగ్ల జ్యోతిషవిద్యలయందు నన్నును బ్రవీణఁ జేయుచు స్వయం గురువై, భర్తయై, దైవమై నన్ను కనిపెట్టుచున్న నా భర్తగారీసత్కారమునకు బ్రథమ ప్రధానపాత్రులు. అట్టి పూజ్యుండగు నా భర్తగారికి నా హృదయపూర్వక సాష్టాంగ నమస్కృతంబులు. నాకు విద్యాగురువులనేకులుండినను, సంస్కృత జ్ఞానాభివృద్ధికిఁ దగినంత దోహదమిచ్చి, చక్కని సాహిత్యజ్ఞాన మలవడఁజేసి కావ్యనాటకాలంకార గ్రంథసారమెఱుంగఁ గాఁగల సద్బోధలఁ గావించిన శ్రీమాన్ కంధాడై కృష్ణమాచార్యగురువర్యులకు నా ప్రథమవందనము.

నా కవిత్వ ప్రారంభమునకును అభివృద్ధికిని హేతువు శ్రీ జటప్రోలు సంస్థానాధీశ్వరియగు శ్రీ సురభి వేంకటరత్నమాంబికాధర్మ కల్పవల్లీమతల్లిగారు. వారి అనుగ్రహశ్రీ విశేషముననే వారి సంస్థాన విద్వాంసులగు బ్రహ్మశ్రీ వాజపేయయాజుల రామసుబ్బారాయఁడుగారివద్ద కవితాకళ నభ్యసించుటయేకాక వారు స్థాపించిన స్నేహలతా కవితాసంఘమున కుపాధ్యక్షురాలనై వారి నిరంతర మిత్రశిక్షకా ప్రోత్సాహముననే సరస్వతీరామాయణాది కృతులను రచింపఁగలిగితిని. కావున శ్రీ మహారాజ్ఞీ మతల్లిగారికిని, రామసుబ్బారాయ గురువర్యులకును నా భక్తిపూర్వక నమస్కారములు.

తత్సంస్థానాధీశ్వరి పుత్రికారత్నమై, చదువుల సరస్వతియై, చక్కని కవయిత్రియై యొప్పారుచున్న శ్రీ ఇనుగంటి రాజ్ఞీ సరస్వతీదేవిగారి కటాక్ష శ్రీలకుఁగూడఁ బాత్రురాల నగుటచే వారికిని నా హృదయపూర్వకాభి నందనములు.

శ్రీ వేంకటగిరి సంస్థానముననున్న సమయమునఁ గన్నతల్లికన్న మిన్నఁగఁగాచి గురుపదమిచ్చి పోషించిన శ్రీ సౌభాగ్యవతి ఇనుగంటి రాజ్యలక్ష్మమ్మగారి ప్రేమ, ఆజన్మాంతము మఱువరానిది. ఆవల వారి పుత్రికామణియగు శ్రీ సౌభాగ్యవతి శ్రీ మీర్జాపుర రాణి భూదేవమ్మగారి యంతఃపుర బాలికలకు విద్యగఱపుచు రమారమి పండ్రెండు సంవత్సరములు వారి సత్కృపాదోహదమున సకల సౌకర్యములఁ గాంచి, సరస్వతీ రామాయణమును సాహిత్యలోకమున కందఁజేయు భాగ్యమునుగూడఁ గాంచుటంజేసి ధర్మస్వరూపులగు శ్రీ భూదేవమ్మగారి నేసమయాననైనను దలఁచుకొనుచు నా సంపూర్ణ కృతజ్ఞతను వెల్లడించుకొనుచునే యుందును.

ఆ యీ భాగ్యవిశేషముననే నేటిసభలో నిలుచు సుకృతమునుగాంచఁ గల్గితిని. నేటి యీ గృహలక్ష్మీ కంకణసన్మానమునకు ముఖ్యకారణము, లలితకళోపాసకులును, ధన్వంతరీయంశ సంభూతులును, స్త్రీవిద్యావిజ్ఞానప్రబోధ దీక్షావ్రతులునునగు డాక్టర్ శ్రీయుత కేసరిగారి యవ్యాజవాత్సల్యాతి రేఖయేగాని వేఱొండుగాదు. ఆమహాశయునకు ఆకళాపరిపూర్ణ నిధానమూర్తికి నా అభివందనములు.

నేటిమన సభ కగ్రాసనాధిపత్యము వహించియున్న శ్రీమతి గుమ్మిడిదల దుర్గాబాయమ్మగారి దేశసేవాధురంధరత్వము, స్వార్థత్యాగము, కార్యనిర్వహణదీక్ష, విద్యాప్రాభవము ప్రస్తుతింపఁదగినది. స్త్రీజనోద్ధరణమునకును ఆంధ్రరాష్ట్ర స్వాతంత్ర సౌభాగ్యమునకు వీరు సర్వశక్తులుధారబోసి పూర్ణోత్సాహముతో కృషిసల్పుటయేగాక ప్రతివనితారత్నమును తనవలెనే త్యాగమూర్తియై సర్వతోముఖ ప్రజ్ఞతో నిరాడంబరముగా కృషిసలుపవలయునని ఆశించియున్నారు. కావుననే సారస్వత సేవలో తొలిమెట్టులోనున్న నన్ను గొప్పగాపొగడి జర్నలిజంలోకూడ నారితేరినదాననని ప్రోత్సాహించి శక్తికి మించిన భారము నాపై మోపియున్నారు. ఇది వీరిసదాశయము. కానిండు; దీనికి డాక్టర్ శ్రీయుత కేసరిగారును నాకు సదవకాశముగల్పించి పోషించుచున్నారు. ఇట్టి నిశ్చలసేవా పరాయణుల యాశీర్వచనములు వ్యర్థములగునా? వీరి యుద్యమము సఫలీకృతముగావించి సేవజేయుటకై నాకు శక్తి సామర్థ్యములఁ బ్రసాదింపఁ బరమేశ్వరుని వేడుచున్నాను.

"విద్వానేవవిజానాతి విద్వజ్జనపరిశ్రమం" అను వాక్యానుసారముగ శ్రీ తిరుమల శ్రీనివాస త్రిలింగమహా విద్యాపీఠమునకు ధర్మాధికారిణియై, కవి సార్వభౌములకు సత్కారము జేయఁజాలిన మనసోదరీమణి కవితిలక, కవితావిశారద, కాంచనపల్లి

కనకమ్మగారు జీవయాత్రాది మహాప్రబంధముల రచించినవారు గావున సరస్వతీరామాయణము నామూలాగ్రముగాఁజదివి సారముగ్రహించి అందులో నుత్తరకాండమును 1938 సం॥ Madras University లో పఠనీయగ్రంథముగఁ బెట్టించి వారికి నాయందుగల యాదరాతిశయముల వెలిబుచ్చిరి. అంతయేగాక నేఁడీసభ కేతెంచి సరస్వతీరామాయణములో నచ్చటచ్చట కొన్నిపద్యములను విమర్శించి సభవారి కాహ్లాదము గలుగఁజేయుటయేగాక నాపై కూర్మిపెంపున 'కవికలహంసి'యను బిరుదమునుకూడ ప్రసాదించి ధన్యఁ గావించినందులకు వీరికి నాహృదయపూర్వక కృతజ్ఞత వెల్లడించుచున్నాను.

ఈసభ నలంకరించిన నాసోదరీమణులందఱును విజ్ఞానధన్యలే. కావున నేను క్రొత్తఁజేసి చెప్పఁదగిన విశేషధర్మమేమియులేదు. నేఁడు నన్నొకపెద్దఁజేసి గౌరవించిన నాతోడి సోదరీమణులకు నావందనములు. ఒక్కొక్కరికొక్కొక్కకళ యందభిరుచియు నభిమానమును గలుగుట నైజము. అందుచే మనమందఱమును నొకరికొకరు'గృహలక్ష్మి' కటాక్షమున నెలకొకసారి ప్రతికారూపమునఁ జూచుకొనుచు, డాక్టరు కేసరిగారి అనుగ్రహమున వత్సరమున కొకసారి కలిసికొనుచు వివిధములగు మనభావములను నేకముజేసి యేకాకారమును గల్పించి, యేకీభవించుచు, భాషాభివృద్ధికిని, మన సంఘాభివృద్ధికిని, దాన మనదేశ సౌభాగ్యవర్ధనమునకును ననువగుమార్గములను వెదకిగొనుచు-తనువుగాంచిన ఫలమును భాషాసేవచే నందు ముఖ్యముగ మనయున్నతాభివృద్ధి కాదర్శకమగు గృహలక్ష్మి సేవచే యాత్మవిజ్ఞానసిద్ధినిఁగాంచు తత్వగ్రంథములం జదివికొనుచు, రచించుచు,

> "Getting and spending we lay waste our powers
> Little we see in Nature that is Ours"

అను Wordsworth మహాంగ్లకవిచెప్పిన వేదవాక్యమనుక్షణము సంస్మరించుకొనుచు, ప్రకృతిలోఁబుట్టి, ప్రకృతిలోఁబెఱిఁగి, ప్రకృతిలో లీనముగానున్న మనము ప్రకృతి సాభాగ్య తత్వమించుకైనను నెఱుంగకున్న జన్మమేరీతి సార్థకముగాఁగలదని చింతించుచు, పవిత్రవంతముగ జేయఁజాలు జీవయాత్ర నభిలషించుటయే మనముఖ్య కర్తవ్యమని నా ఆశయము. వేయేల? జీవయాత్ర నీవిధముగ సాగించుకోగలిగిన వారి జన్మయే జన్మ:

> "Banish evil words and strife
> Keep thy heart a temple holy
> Love the lovely and the lowly
> Thus shall eachday be a jewel
> Stung upon thy thread of life."

నిశ్చలత్వము, విశ్వమానవప్రేమ, దయాసత్యశౌచ నిష్ఠాగరిష్ఠత్వము, మానవులకు పెట్టనిభూషణంబులు. అవిగాంచిన వారిబ్రతుకే బ్రతుకు. అవిగాంచినవారికి సకలార్థంబుల రచేతనుండు. అన్నిసుగుణసంపదలతో నలరారుచున్న మన గృహలక్ష్మి యొకటే నేఁడు

మనకండ్లకు ప్రత్యక్షముగాఁ గనఁబడుచున్నది. కావున కవితారూపమున నా ఆశయములను గానముజేసి గృహలక్ష్మికి కాన్క బెట్టి విరతు.

మ. పదిరెండేడులు నిండినిండకయ శ్రీభాషావధూటీకృపన్
గుదురై నేర్చితివమ్మ సర్వకళలన్ గూలంకషప్రజ్ఞతో
మదిలో నెక్కొను ప్రేమతత్వములచే మర్యాద పాటింపుచున్
సుదతీ లోకకళాప్రబోధమునకై శోభింతు క్రొంగ్రొత్తగన్

మ. తలక్రిందయ్యెను గాలమిప్డుఁ దగువిద్యల్ నేర్వమింజేసి కాం
తలు ; సత్కీర్తి కొలంతయయ్యె సహజస్థైర్యంబు ధైర్యంబులున్
వెలితిన్ జెందెనటంచు నీవెఱిఁగి సద్విద్యావిధానంబులో
సులభోపాయము జూపినావుగద నీ సుజ్ఞానమే పాటిదో !

క. గురువరు నాదేశంబటు
శిరమున ధరియింతు నీదు చిఱుకథలు మనో
హరములు ; బాలికలెంతో
మురిపెముతోఁ జదువుచుంద్రు ముద్దలరారన్.

ఉ. కొందఱు గద్యమే చదువఁ గోర్కెవహింతురు పండితాళిలోఁ
గొందఱు పద్యసారములఁ గ్రోలి సుఖింతురు; నైజమేకదా !
యందఱి యాశయంబులకు నర్మిలి సమ్మతిఁగూర్చి రెంటిలో
సుందరమైన పోకడలఁ జూపుదువెప్పుడు నూతనంబుగన్.

ఆ. వె. పుత్త్రికొక్కబుద్ధి పుట్టును ధరలోన
జిహ్వకొక్కరుచియుఁ జెలగుచుండు
సర్వజనుల కోర్కె సఫలంబుజేయఁగా
వివిధభావసరణి వెడలుదీవు.

ఉ. కేసరి ముద్దుబిడ్డ ! కవికేసరులెందఱొ నీదుపుష్టికై
వ్యాసములిచ్చుచుండ ననవద్య సువిద్యలకెల్ల రాణివై
వాసియు వన్నెయుంబడసి వారిజనేత్రలచేతి చిల్కవై
భాసిలుచుంటివిప్పటికి వర్ధిలుమమ్మ చిరాయురున్నతిన్ !

క. ధాత్రింగల సుచరిత్రల చిత్రంబులు నీకువింత చెలువము గూర్పన్
నేత్రోత్సవదాయకమై మిత్రులకున్ మేలుఁజేసి మించితివమ్మా !

ఉ. కేసరి కూర్మిబిడ్డవయి కీర్తిగడించుట లొక్కయెత్తు, శ్రీ
కేసరి నామధేయమును గీర్తనసేయఁగ వాడవాడలన్
మాసము దాటకుండఁ జని భామలకెల్లను దెల్గుభాసలో
నాస జనింపఁజేతువు దయానిధివాచు శుభప్రదాయినీ !

మ. గృహలక్ష్మీ! గయికొమ్ము నాదు వినతుల్ గీర్తింతు నిన్నెప్పుడున్
మహితంబైన సువర్ణకంకణము నా నామాక్షర శ్రీలతోఁ
రహిఁగల్పించెడు దాని నాకరమునన్ రాణింపఁగాఁ జేసితీ
వహహా! నెచ్చెలివన్న నీకెతగు సుమ్మా! మిత్రచింతామణీ!

ఉ. శాంత సమత్వ తత్వములు సత్యనిరూఢియు దైవభక్తియున్
జింతలఁజిక్కు మానవుల సేమముగోరి కృపార్ద్ర దృష్టితో
వంతలబాపిబ్రోచుట స్వభావము కేసరి! నీకిలన్ యశో
వంతుఁడవీవ; వ్రేల్మడచువారలు నీయెడలేరు చూడఁగన్!

క. వనితల విద్యోన్నతికై మనమున స్వార్థంబువీడి మానవసేవా
ప్రణవోపాసనఁజేయుచు ఘనయశమార్జించినట్టి ఘనుడవు కావా?

సీ. ఏకుటీరము శాంతి కాకరంబైయుండు వనితకు సతత విహారభువన
మేకుటీరము బుధానీకసంవాసమా వనితకు దోబూచులాడు సదన
మేకుటీరము విద్యకిచ్చు ప్రధానంబు వనితకుఁ గైసేయు వేశ్మమరయ
నేకుటీరముపేరు లోకవిశ్రుతమయ్యె వనితకు మరబొమ్మలాటగీము

గీ. చెలఁగి భారతి యెచ్చోట చిందులాడు నెచటఁ గేసరి సత్కృపాదృష్టియెసఁగు
నట్టి నిలయంబు నీకాటపట్టుగాఁగ వర్షశతములు జీవించి వరలుమమ్మ!

క. జయజయ గృహలక్ష్మి సఖి!
జయజయ లలితాంధ్ర మధుర సారస్వతమా!
జయజయ లలనారత్నమ!
జయజయ విద్యాప్రబోధ! జయకల్యాణీ!

జ్వర పరిశోధననుండి తెలుపబడిన విషయము

స్వస్థతజెందుటకు ఆహారము ముఖ్యముగా తోడ్పడును. మానవులకు జ్వరమునుండి గలుగు ఫలితమునుగురించి డాక్టర్లు కొన్ని విషయములను వెల్లడించినారు. ఉష్ణము హెచ్చుట, కంటిమీద తీక్ష్ణమైన తలనొప్పి, ప్రారంభమున కొంచెము చలివేసి తరువాత దేహము వణకునట్లుచేయుట, ఇవే జ్వరలక్షణములు. దీనికి కారణము జ్వరమునందలి విషము నరములలో, మాంసకండరములలో అతివేగముగా ప్రాకుటచేత, అందువల్ల జ్వరపీడితుడు మిక్కిలి అలసి నిర్బలుడగును.

కడుపు బలహీనముగానుండుటచే, సాధారణ ఆహారముకూడా జీర్ణమగుటకు కష్టముగానున్నప్పుడు, అలసిన అవయవములకు బలమును తిరిగి చేకూర్చుటెట్లు అనునదే గొప్పవిషయము. హార్లిక్స్ చాలకాలము ఉపయోగింపబడి, ఇది తగుమైన ఆహారమనియు, జీర్ణశక్తికి ఏలాటి హాని కలుగజేయదనియు, సత్తువ నిచ్చునదియు రుజువుపరుపబడినది. ఇది రోగమునుండి తేర్గడజెందుకాలమును తగ్గించును. ఈదేశమందలి గొప్ప ఆస్పత్రులలో సెల్లజ్వరబాధితులకు ఈ ఆహారమును ఇచ్చుటకు ఏర్పాటుచేసినారు.

శ్రీకృష్ణభగవానుడు "మురళి నింకొకసారి వాయింపుమయ్యా"
నవ్యకళావారి మీరాబాయ్‌లో విని ఆనందించండి.

శివాలయ బాలిక – కాత్యాయని

గుంటూరు బ్రాడీపేటలోని శివాలయములో నెలల వయసుగల ఈ బాలిక శారదానికేతనమువారు స్వాధీన పరచుకోవలసినదని చీటివ్రాసి విడువబడినది. బ్రాహ్మణ బాలికట. భారద్వాజస గోత్రమట. ఈమెను శ్రీ కే. యన్. కేసరిగారు సం॥ నకు రూ 100 లిచ్చి పోషించుచున్నారు.

Congratulatory messages to " Grihalakshmi "

"Let me on the 13th birthday of your journal express my hearty congratulations for the yeoman services rendered by the journal to the Andhra Desa, particularly to our womenfolk....................I recommend this magazine with great pleasure as an ornament that should adorn every house."

V. A. B. SASTRI, B.A., L.L.B.

"There is little exaggeration if I say that "Grihalakshmi" as a journal is unique and has justly carved out for itself a niche in the temple of fame. As a regular reader I have found it not merely of absorbing interest but profoundly instructive to every reader..............By its inherent merits it has become almost indispensable for every Indian household and no wonder if in the light of its wide popularity it has successfully enlisted the interests of its readers even in parts where the predominant language happens to be Canarese.

I wish every success to the journal."

Y. R. P. GOUD, M.A.

'గృహలక్ష్మి' పత్రికాభిమానుల ఆశీస్సందేశ వాక్యములు

"ఆంధ్రదేశమునకంతకు, ముఖ్యముగా ఆంధ్రమహిళామండలికి అపారమగు సేవనుచేసిన 'గృహలక్ష్మి' యొక్క పదమూడవ జన్మదినోత్సవ సందర్భమున నీ పత్రికయొక్క ఘనతనెంతయు నభినందించుచున్నాను. ఈ పత్రిక ప్రతి ఆంధ్రగృహమునందును ఓక అలంకారముగ నలరారునని అమితోత్సాహముతో నాశించుచున్నాను."

వి. ఎ. బి. శాస్త్రి, బి. యే. ఎల్. ఎల్. బి.

"యశోవైభవాలయములో విశేషశోభతో వెలయుచున్న 'గృహలక్ష్మి' పాఠకులకెల్లరకును బహుప్రమోదముతోఁగూడిన జ్ఞానప్రబోధమును గావించుచున్నదనుట అతిశయోక్తికాదు.
స్వభావసిద్ధమగు సుగుణసంపదతోఁ నొప్పుచున్న ఈ పత్రిక ప్రజాదరముతో ప్రబలవిజయమునొందుచు, కన్నడము మాతృభాషగనున్న ప్రదేశములలోఁగూడ తెలుగుభాషావిజ్ఞానమును వ్యాపింపజేయుచున్నది.
ఈ పత్రిక సర్వవిధముల విజయవంతమై వర్ధిల్లుగాక!"

వై. ఆర్. పి. గౌడ్ యం. ఏ.

సంపాదకీయములు

ఏ కాంత సాన్నిధ్యసౌఖ్యము ఏకాంత శాంతిసౌఖ్యమున కెనవచ్చును ?

ఏ సాధ్వీమణియొక్క సహజసుందరరూపము వల్కల ధారణముచే సయితము చెలువున మించునో, ఏ సతీమణియొక్క సచ్ఛీలసంపద సంఘములో పవిత్రభావప్రసూనములను వెదజల్లజాలునో, ఏ మానినీమణియొక్క మంజులాలపములు శ్రోతల మానసములను చూఱగొనగల్గునో, ఏ సుందరీరత్నముయొక్క చూపు మనోరమ చల్లని సౌమ్యదృష్టిని బ్రసరింపజేయునో, ఏ సుదతి, జీవితములో సొంపునింపు లలితకళారాధన మహిమచే సంసారమునకు శోభ నొడగూర్చునో, ఏ మానవతి తన మృదుమధురభావములచే చేతోమోదమును ఆంతరంగికానందమును ప్రసాదింపగల్గునో, ఏకాంత నిజకాంతుని సంసారజీవితములో తరింపజేయునో, ఆకాంత శాంతిస్వరూపిణి యనబరగును. ఆయమ జగద్వందితమై మాతృదేవతమై, ప్రకృతివైభవమును తన వ్యక్తిలో ప్రత్యక్షమొనరించును.

ఏకాంతమునే యెల్లపుడన్వేషింప నభిలషించుచు, ప్రకృతివైభవముతో నైక్యము నెందగోరుచు, ఆత్మానందము నెల్లవేళల ననుభవింప నుత్సాహించు యోగీంద్ర హృత్పుటములలో గననగు ఏకాంత శాంతిసౌఖ్యమున కెనవచ్చు ప్రశాంతభావప్రకాశమును పైన పేర్కొనబడిన సల్లక్షణములతో గూడిన పడతియొక్క దివ్యసందర్శనభాగ్యముచే గల్గును.

ఇట్టి యుత్తమసతి నెందైన జూడగలమా ? ప్రస్తుతప్రపంచములో నట్టి దివ్యాదర్శములను ప్రత్యక్షముగ గనుట సందేహము. కాని దుస్సాధ్యముకాదు. పూర్వులు మానవకోటియొక్క పురోభివృద్ధికై పురాణములలో నట్టి దివ్యసుందరీరత్నముల చరిత్రలను లోకమునకు ప్రసాదించియున్నారు.

పురాణమహిమార్ణవములో పుట్టి, ప్రపంచప్రఖ్యాత ధర్మవిలసితమగు హిందూమతభువనములో పెరిగి, పుణ్యావంతమగు భారతమాత హృదయపీఠికపై తేజరిల్లి, ఆదర్శనారీశిరోరత్నమై, ఆచంద్రతారార్క విలసితమగు సత్కీర్తివైభవమును విస్తరింపజేసిన శ్రీ సీతామహాదేవి యిందులకు దివ్యదృష్టాంతమై చిదాకాశమున వెల్గుచున్నది.

'రామునివంటి శూరుడు లేడు, సీతవంటి సతిలేదు' అన్న సామెతను చిన్నపుడు ప్రాథమిక విద్యాతరగతి గ్రంథములలో నందరును సామాన్యముగ జదివియేయుందురు.

కాని శ్రీ వివేకానందస్వామి చెప్పినటుల రామునివంటి శూరులును, దివ్యపురుషులును ధరలో జన్మింపవచ్చును. సీతవంటి సతిమాత్రము భువిలో మరి పుట్టబోదు.

అట్టియెడ సీతవంటి సాధ్వీమతల్లిని జూచు భాగ్యమెట్లొదవును? శ్రీమద్రామాయణ మును పఠించి సీతామాతనుగూర్చిన వర్ణనములన్నిటిని చిత్తమున జేర్చికొని, ఊహ యను కలమును (కుంచను) చేబూని భావము లనురంగులతో హృదయఫలకముపై చిత్రించు కొనగల్గుచో శ్రీ సీతామహాలక్ష్మియొక్క దివ్యశుభాకారమును సాక్షాత్కరింపజేసికొన గల్గుదుము.

ఆ పావనమూర్తియొక్క దివ్యచిత్రమును జూచు మనోనేత్రమునకు జ్ఞానోదయ మగును. ఏకాంతమునందు ధ్యానమహిమచే, శ్రీ సచ్చిదానంద బ్రహ్మముయొక్క దివ్య స్వరూపమును సందర్శించి, సంయమీంద్రు లేదివ్యశాంతిసౌఖ్యము ననుభవింపగల్గు చున్నారో అట్టి శాంతిసుఖమును శ్రీ సీతాసతీమణియొక్క మంగళస్వరూపమును సాక్షా త్కరింపజేసికొనిన సంసారులును అనుభవింపగలుగుదురనుటకు సందియములేదు.

ఏకాంతములోనున్న ఆనందానుభవము ఏ కాంత సందర్శనభాగ్యముచే లభించునో ఆకాంతయే శ్రీ సీతామహాలక్ష్మి. మోహప్రపంచము కనిపెంచిన కాంతాకనకములలో నీ దివ్యదృశ్యములు గోచరింపవు. కాని జ్ఞానకాంతాసాంగత్యముచే, యోగవిభూతి మహిమనుపొంది భౌతికప్రపంచమును కనక ముక్తికాంతా సాన్నిధ్యములో ఆ ఏకాంత సాంగత్యసాధనసత్ఫలితమగు శాశ్వతశాంతి సౌఖ్యమును సంపూర్ణముగ ననుభవింపనగును.

సంఘములో స్త్రీలకు పురుషులతో సమానత్వ మేర్పడవలెను.

స్వర్గీయ డాక్టరు యు. అభయాంబల్ స్మారక చిహ్నముగ నేర్పాటుచేయబడిన ఉపన్యాసములలో రెండవదియు కడపటిదియునగు ఉపన్యాసమును గా॥ యస్. శ్రీనివాస శాస్త్రిగారు గత జనవరి 31-వ తేదీని మైసూరులో నొసంగియుండిరి. ఉపన్యాసకులు ఉవిదలకు సంఘములో సమానగౌరవ సభ్యత్వములుండవలెనని వ్రాకుచ్చుచు వారి యభివృద్ధికై వలయు వివిధహక్కులను గూర్చి విపులముగ దెల్పిరి.

వారి ఉపన్యాసములోని ముఖ్యసారాంశ మొక్క వాక్యములో చక్కగ దెలుప బడినది. "Better harmony and peace could be established in Indian homes if man and woman had learnt to regard each other as equals and honoured companions, as sharers of each other's confidences and ruling over their family affairs in common" భార్యాభర్తలన్యోన్యప్రేమను వెల్లడించుకొనుచు, సమాన గౌరవభావములతో చెలంగుచు, సంసార విషయములను సమానబాధ్యతలతో నిర్వ

హించుచో శాంతియు సుఖమును సంపూర్ణముగ ననుభవింపగలుగుదురనుటలో నెంతయు సత్యమున్నది.

వనితలను వంటఇంటి కుందేళ్లనుజేసి, వారికి స్వేచ్ఛయనునది సర్వవిషయముల లోను నిరాకరించి, పడకటింటి భామలుగ పరిగణించి, భోగములకే వారిని బ్రహ్మపుడమిలో పుట్టించెనని భావించి, సంతానమునుగనుటయే వారిజీవిత పరమావధియని సిద్ధాంతీకరించి, వారి శారీరకమానసిక, ఆధ్యాత్మికాభివృద్ధి నవరోధించి, కీలుబొమ్మలవలె వారిని గణనచేసి, స్వార్థపరాయణులై, భోగలాలసులై, పలువిధముల వారిని పీడింపబాల్పడుచున్న పురుషుల దౌర్జన్యము సంపూర్తిగ నశించినకాని సంఘముయొక్క క్షేమమును, మానవజాతియొక్క పురోభివృద్ధియు సమకూరవు.

స్త్రీ పురుషులలో ఒకరు హెచ్చని కాని ఒకరు హీనమని కాని సృష్టిలో భేదము లేర్పడియుండలేదు. పురాణములలోని స్త్రీ పురుషుల జీవితాదర్శములలో నట్టి యంతరము లెంతమాత్రమును గోచరింపవు.

సంఘములో కాలక్రమమున గలిగిన పలుమార్పులచే నిట్టి క్షీణదశ సంప్రాప్తించినది. విద్యాబుద్ధులు విపరీతములై పరిణమించుటచే స్వజాతి గౌరవమర్యాదలు సమసిపోయినవి. స్త్రీలు విద్యాపరిశ్రమకుబూని, పురుషుల అహంభావము నడంచినగాని సంఘములో సమానత్వమేర్పడదు. పురుషులు బుద్ధిని విడనాడుటచేతను, స్త్రీలు పవిత్రప్రేమాదర్శములను బాయుటచేతను ఉభయులును పతితులై, అన్యోన్యానురాగమును విడనాడి, దురభిమానముతో త్రుళ్లిపడుచు, పరస్పరసంఘర్షణమునకు పాల్పడి, సంఘమునకును దేశమునకును చేటును గూర్చుచున్నారు.

ఆదర్శములడుగంటుటచే, అహంకారమధికమై, స్వార్థపరత్వముప్రబలి, స్వధర్మములను, స్వగౌరవమర్యాదలను అతిక్రమించి యెవరి యిచ్చవచ్చినరీతిని వారు నడచుచు సంఘముయొక్క కట్లుబాట్లను త్రెంచుకొనుచు, స్వేచ్ఛతో సంచరింపజూచుటచే, సంసారబాధ్యతలు క్షీణించి, భిన్నభావములు చెలరేగిపోయి తుదకు శాసననిర్మాణముచే సంఘమును చక్కజేయవలసిన హీనస్థితిగతులుకూడ ఏర్పడియుండు టెంతయుశోచనీయము.

మతవిజ్ఞానము దేశములో ఎప్పుడు క్షీణించినదో అప్పుడే సంఘముయొక్క క్షేమమునకు హాని వాటిల్లినది. స్త్రీ పురుషులు సమానగౌరవప్రపత్తులతో మెలగుటకై మానవజాత్యభివృద్ధి కాధారభూతములును మూలసూత్రములును అగు మతవిజ్ఞానాదర్శములు పునరుద్ధరింపబడవలెను.

Edited by Dr. K. N. Kesari, Printed and Published by Dr. S. Seshagiri Rao, at the Lodhra Press, 15, Westcott Road, Royapettah, Madras.

గృహలక్ష్మి జయంతి మహోత్సవము

శ్రీ గోనెల నరసింగరావు యం.ఏ. బి.యల్. గారి ఉపన్యాసము

అధ్యక్షురాలా, సోదరీ సోదరులారా!

నేడు చాల సుదినము. 'గృహలక్ష్మి' బాలకు పన్నెండేండ్లు శుభప్రదముగ, ముదావహముగఁ గడచినవని నిరూపించుదినము. ముద్దులుగేరు 'గృహలక్ష్మి' నేడు నునుసిగ్గుదొంతరలతో, మందహాసచంద్రికలతో, సుందరవదనారవిందముతోఁ గడకన్నుల మ్రొక్కులతో, నూత్నయౌవన మర్యాదలతోఁ గనుల కింపునింపు సుదినము. చిఱుగజ్జెల మ్రోతలకుఁ జిందులుత్రొక్కు 'గృహలక్ష్మి' బాల నేడు మురళిరవళించి యాంధ్ర జాతీయ రక్తనాళములు పులకరించునట్లు దివ్యగానము చేసుకొను చానమైనది. మాటలందు, పాటలందు, తెలివితేటలందు, మృదులత్వము, మధురత్వము, మంజులత్వ మలవరించుకొనుచున్నది. దేశసేవ, సంఘసేవ, భాషాసేవ, కళాసేవ, విశేషించి స్వీయ జాతీయసేవ, నిరుపమధృతితో, నిర్మలమతితో నిర్భరానందముతోఁ జేసుకొనుచున్నది. ముగ్ధయయ్యు నాంధ్రత్వము, యమలత్వము, యమృతత్వము, యఖండత్వము, యద్వితీయత్వము, యనురాగతత్వము, యలౌకికమైన ప్రేమతత్వము, యనూనమైనసతీత్వము, యసమానమైన మాతృత్వముఁబెంపొందించు ముద్దుముచ్చటలాడుకొనుచున్నది. మూఁడు పదియేఁడుల జీవికింతటి ప్రజ్ఞ, యింతటి విజ్ఞాన మెట్లలవడినది? సుధాభావప్రపంచములో సదా విహరించు శ్రీ కేసరిగారి వలననేయని సమాధాన మీయవలసియున్నది. వారి హృదయౌన్నత్యము, యౌదార్యము, యౌచిత్యము వారి యనుఁగుంగూతురగు 'గృహలక్ష్మి' వారసత్వపుహక్కుగఁ దెచ్చుకొన్నది; సందేహము లేదు.

ఇఁక నీ 'గృహలక్ష్మి' కన్య నింతవఱకు ముద్దులాడి, ముచ్చటచెప్పి, మురిపెము గూర్చిన ముదితలలో ముఖ్యులు శ్రీమతులు, కనుపర్తి వరలక్ష్మమ్మ, కవితిలక కాంచనపల్లి కనకాంబ, చిలకపాటి సీతాంబ, బాలాంత్రపు శేషమ్మ, దివాకర్ల శారదామణి, ఆచంట సత్యవతమ్మ, గంటి కృష్ణవేణమ్మ, కామరాజు మైత్రేయి, తెలికిచర్ల వసుంధరాదేవి, డి. అనసూయాదేవి, కె. సుగుణమణి, పాకల రాజామణెమ్మ, అడపా సుగుణమణి, సామవేదుల చిరంజీవమ్మ, వట్టి శేషాంబ, సి. వి. రమణమ్మ మొదలగువారు. వివిధ చిత్రములతో 'గృహలక్ష్మి' కలికిదేహము నలంకరించి తెలుఁగుఁదనమును, కలా కమ్మఁదనమును దశదిశలను వెలిగించి, యాంధ్రావనిని బులకరింపఁజేసిన శ్రీ రత్నాల కమలాబాయి గృహలక్ష్మికొక చక్కని యక్క; పెట్టనినగ; కట్టనికోట.

ఇట్టి విదుషీమణు లనుక్షణము, 'గృహలక్ష్మి'ని తీయనిదృక్కులతో పాయని యనురక్తితో నాదరించుటవలన, గృహలక్ష్మి చక్కని దేశాభిమానముతో, చిక్కని

యాంధ్రజాతీయతతో నున్నత భాషాజ్ఞానముతో, నుజ్జ్వల కళాకాంతులతో, నుత్తమ సతీత్వ గౌరవముతో, మాతృత్వ మర్యాదలతో, నీతివంతముగ నియమబద్ధముగ, నిజ పోషణ గావించుకొనుచున్నందున నేఁడు మనయందఱి యభిమానములనుఁ జూఱఁగొని, యభినందనముల నందుకొని కనులకు విందై, చెవులకు పసందై యలరారుచున్నది.

ఇట్టి యాదర్శ పత్రికాపుత్రికయైన 'గృహలక్ష్మి' కీశ్వరుఁడు బ్రహ్మాయు వొసంగి యాశీర్వదించునుగాక!

ఆశీస్సు

ప్రత్యేకపత్రికా ప్రచురణగోరెడి పొలతులు ముదమంద బుట్టినావు
గద్యపద్యాత్మక గంభీరరచనల తీయనిభావాలు తెలిపినావు
సహజసుందరములౌ సత్కళాప్రతిభలు సొంపునింపులు గుల్క జూపినావు
విద్యావతులనెంచి విభవాన బంగారుకడియాలు కేలను దొడిగినావు
పదియురెండేళ్ళల చిఱుత ప్రాయముననె
మోదమొనగూర్చె స్తుత్యమే నీదుచరిత
మేలు 'గృహలక్ష్మి' యిటులనే మెలగిసతము
జన్మవాసరములు పెక్కు జరుపుకొనుము

—శ్రీ కనుపర్తి వరలక్ష్మమ్మ.

శ్రీమతి చేబ్రోలు సరస్వతీదేవీ ప్రశంస

చ. లలితపదార్థభావ రసలాలితమై రమణీయ సత్కథా
విలసితమై, సమంచిత నవీనపదోన్నత శైలియుక్తమై,
యలరి సరస్వతీ రచితమై, వనితాజన కీర్తిగూర్చు రీ
తుల తులకించు రామకథతో సరివచ్చునె యన్యకావ్యముల్.

ఉ. శైలి పదాలు భావము రసంబు కథారచనావిధానముల్
చాలగ తీర్చిదిద్ది సరసంబుగ రామచరిత్ర వ్రాసి యాం
ధ్రాళికి మేలుజేసిన మహామహిమాన్విత పుణ్యమూర్తి చే
బ్రోలు సరస్వతీ వనితబోల్కవయిత్రులు ధాత్రిగల్గిరే.

ఉ. తీయని తేటమాటల గుదించిరసంబులు సోనలూర రా
మాయణమ వ్యయార్థమయమై యలరార సదా సరస్వతీ
తోయములం జరించు నవతోయజనేత్ర సరస్వతీసతిన్
బాయని కూర్మినోముత నపారదయన్భగవంతుడెప్పుడున్.

గృహలక్ష్మీ జయంతి మహోత్సవము

క. మొల్లవలె రామచరితము
సల్లలితవు భక్తిvrవాసి సజ్జననుతులన్
గొల్లగ గాంచితి వభినవ
మొల్లా నినుసత్కరింప మోదముగలిగెన్.

గీ. ఆంధ్రజనయిత్రి గునమునందలరునట్టి
విదుషిరత్నాల మాలకు వెలుగుదెచ్చు
మేటి రత్నంబ వీవంచు జాటవచ్చు
నిఖిలసాహిత్యరచనల నిపుణవగుట.

—శ్రీ దేశిరాజు భారతీదేవి.

అనుమోదము

చ. అరసితి త్వత్ప్రబంధము సహాయనిపించె కవిత్వధోరణీ
గరిమ మనోజ్ఞభావముల కల్పనయున్ రసపోషణంబు పా
మరులకుగూడ నర్థమగు మంజుపదగ్రథనంబు నాకు సం
బరమొనరించె నీకొసగవచ్చు; సువర్ణపుకంకణంబికన్.

ఉ. శ్రీలు జెలంగునట్టి రఘుసింహునిగాథ; ననూన శేముషీ
లీల; రచించినావు మృదురీతి ప్రబంధముగా సెబాసు! చే
బ్రోలు సరస్వతమ్మ! యికబొమ్ము సువర్ణపుకంకణంబు నీ
కేల ధరించు మిందులకు 'కిమ్మని' ప్రశ్నయొనర్పడెవ్వడున్.

ఉ. రాయలు దాటిపోయె నవురా! యతడున్న భవత్ప్రణీత రా
మాయణ సత్ప్రబంధమునకమ్మ! సరస్వతి! యగ్రహార మే
దో! యొకటిచ్చియుండు ఫలమున్నె గతించినదానినెన్న గా
నీ! యిపుడియ్యబోవు తపనీయపు కంకణమందు తగ్గునే?

శా. 'కే. యస్. కేసరి బాబ'టన్న గృహలక్ష్మీపత్రికా స్థాపకుం
డాయుర్వేదవిశారదుండు వర 'లోధ్రా'భిఖ్య దివ్యౌషధ
ధ్యేయుం డాంధ్రసహోదరీ కవనసందేశ ప్రహృష్టాత్ముడ
మ్మా! యీలాటి సుహృద్వరేణ్యునకు జేయంజెల్లు కార్తజ్ఞమున్.

శ్లో. జీయాత్ సరస్వతీదేవీ మంగళా శాసనైస్సతాం
యస్యై 'కేసరిణా' దత్తం కానకం కంకణంనవం.

—శ్రీ గుదిమెళ్ళ రామానుజాచార్యులు.

శ్రీ సరస్వతీ ప్రశంస

రమ్యమై యొప్పునట్టి శ్రీ-రామచరిత
కబ్బమొనరించి యెనలేని ఘనతగాంచ
సార్థమాపేరుదగె సరస్వతివనంగ
ధరణి బంగారమునకబ్బు తావియటుల.

ఉ. మొల్ల రచించె రామకథ ముద్దులుమూటలుగట్ట, ధోరణిన్
మొల్లముగాగ నీవిపుడమోఘ వచోరచనాచమత్కృతిన్
సల్లలితాంధ్రకావ్యముగ సల్పియశమ్ము భృశమ్ముగామహిన్
గొల్లగ గొంటివమ్మ! కయికొమ్మభినందనముల్ సరస్వతీ!

సీ. ఆంధ్రభారతకర్త నతిప్రీతి మన్నించె
రాజరాజనరేంద్ర రాజమౌళి
తెలుగు సత్కవుల నెంతేప్రియమ్మునగాంచి
పటుప్రాభవముగూర్చె వాసిరెడ్డి
వసుచరిత్రాది దివ్యప్రబంధముల కా
శ్రయమిచ్చె శ్రీ కృష్ణరాయవిభుడు
రహి నలంకారశాస్త్రముల సత్కృతుల సం
భావించె నరసభూపాలుడెలమి
అట్టివారలకుద్దియై ఆంధ్రసుకవి
కల్పభూజంబనాపేర్మి గాంచునట్టి
ఘనుడు కేసరి మన్నించి గారవింప
రహిమనోజ్ఞ సువర్ణ విభ్రాజితవయి
వరలు మాంధ్రసరస్వతీ చిరతరముగ.

—శ్రీ చిలకపాటి సీతాంబ.

గురువాక్యము

ఉ. కమ్మరి మొల్లమేల్ సొగసుగుల్కెడు శ్రీరఘురామగాథ స
ర్వమ్మును వ్రాసినందులకు బ్రాప్తములయ్యె యశోలతాంతముల్.
సమ్మదమొప్పరీతి సరసంబగుభక్కిని నీవుగూడ గా
వ్యమ్మున నేడు కాండలును వ్రాసితివట్టులె శ్రీ సరస్వతీ.

గీ. పేరుమోసినవారిలోఁ బెద్దవారు
గూడ నీరామచరితంబుఁ గోర్కెఁదీఱఁ
గొంచెమోగొప్పయో పఠియించినార
లన్నవేఱుగా నీకీర్తి నెన్ననేల?

గీ. నిన్నుఁబోలిన శిష్యురాలున్నయెడల
గురువునకువచ్చు సత్కీర్తినరయవశమె?
రెండువంశమ్ములకుఁగూడ నిండుకీర్తి
ధనముఁగూర్చితి నీవంటితనయగలదె?

ఉ. నేటికి సార్థకంబులయె నీవిలనోచిన నోములన్ని; యీ
నాటికి నీప్రభావము ఘనంబని కేసరి మెచ్చికొంచు బా
హాటముగాఁగఁ గంకణము నందెడుభాగ్యముగూడ నిచ్చె నిం
కేటికిఁ బెక్కుమాట లభివృద్ధికి నీ 'గృహలక్ష్మి' యుండఁగన్.

చ. గురుని ఋణంబుదీర్చితి వహంతితభక్తికి మెచ్చుకొంటి నీ
పరమపతివ్రతా సుగుణభాసితధర్మము స్త్రీకులంబునం
దొరవడియౌనటుల్ దనరుచుండె నికేమియు లోటులేదు శ్రీ
హరి కరుణావిశేషమున నందుదువీవు చిరాయురర్థముల్.

—వాజపేయయాజుల రామసుబ్బారాయఁడు.

అభినందనాశీర్వాదములు

క. శ్రీరామాయణమాదిగ భూరికృతుల్ పెక్కు లాంధ్రమునఁ గూరిచి స
ద్గౌరవ భాగ్యముఁగను సతి నారీమండలికి భూషణంబనరాదే?

క. ఘనకవితానైపుణిచేఁ దననామము సార్థకమగు ధన్యచరిత్రన్
మన చేబ్రోలు సరస్వతిఁ గొనియాడఁగలండె యెంత కోవిదుఁడైనన్.

ఉ. కోడలిపేరుదాల్చెనని కొంచెము మచ్చరమేనిలేక లో
వీడక యబ్బురంబయిన ప్రేమమతో సిరిపెంచుచున్న పూఁ
బోఁడిని సుబ్బరాయకవిపుంగవ పూజ్యుని శిష్యురాలి నే
పోడిమి సత్కరించినను బోలకయున్నె రసజ్ఞులౌనరన్.

క. 'ఘోషా' యను శృంఖలచే యోషామణి బద్ధఁజేయ కురువిద్యాధ్యక్షన్
భాషాసేవికఁజేయు మనీషియ లోకోపకార నియతుండనఁగన్.

క. గృహలక్ష్మి కంకణమగు 'గృహలక్ష్మి'కిఁ బోషకుఁడగు 'కేసరి'చేతన్
గృహలక్ష్మి కంకణముఁగను గృహలక్ష్మి 'సరస్వతి'కగు నెల్లశుభంబుల్.

—శ్రీ జనమంచి సీతారామస్వామి.

మ. నినుఁ జేబ్రోలు సరస్వతీసతిని వాణీరూపిణిన్ లోకమా
న్యను రామాయణ గద్యపద్యరచనా నైపుణ్యనున్ స్వర్ణకం
కణ సత్కారమునన్ సపర్యసలుపంగా నెంచె ధన్యాత్మయై
మనుఁగాతన్ గృహలక్ష్మి పత్రిక సతీ మర్యాదకున్ స్థానమై.

సీ. అభ్యసించితి సంస్కృతాంగ్లాదివిద్యలు కవితస్వారస్య సంగ్రహము జేసి
బోధించితివి రాజపుంగవ సంతానమునకు విద్యలనెల్ల మూటఁగట్టి
రచియించితివి కావ్యరత్నంబు రామాయణంబు కావ్యజ్ఞులానందమొంద
నిలిపితి వైజయంతినిఁగావ్య కన్యకాప్రాణమా జటప్రోలురాజ్యమందు

గీ. మహితలోకోన్నతత్వసంపాదకంబు
కవిజనాదరయుతహేమ కంకణంబు
గాంచితివి నేఁడు గృహలక్ష్మి కరుణఁజేసి
సాధుసాధు సరస్వతీ! జయమునీకు.

సీ. జటప్రోలురాజ్య రక్షాదక్ష వేంకటరత్నమాంబా కృపారసముబడసి
మిర్జాపురీప్రజా మేదురాదరమాను భూదేవి కరుణ నభ్యుదయమొంది
సురభి లక్ష్మారాయ సోదరీమణి రాజ్యలక్ష్మి కటాక్షలాలనముగాంచి
ఇనుగంటి వంశపావని సరస్వతి దొరసాని చందనచర్చ సలుపఁజెలఁగి

గీ. పద్మనాయక కొలము పావనముజేయ
వలఁతిఁ జేబ్రోలు శ్రీ సరస్వతిని స్వర్ణ
కంకణాలంకృతన్ జేయఁ గలిగితీవు
ఏమి గృహలక్ష్మిపత్రికా నీమహంబు?

మ. దెసలన్ బూవులుపూయఁ గీర్తిలత యుత్తేజంబు పుణ్యాంగనా
రసదృక్కోణములన్ నటింప సుజనుల్ రాపొమ్మనన్ సాటివా
రిసమీపంబున నున్నతిన్ గనుము ధాత్రిన్ బత్రికా! ముద్దు లిం
పెసఁగన్ గూర్చుచు నాఁడునాఁటికిని సాదృశ్యంబ దృశ్యంబుగన్.

మ. సరి 'లోధ్రా' సవకల్పకంబు సుదతీ సారస్వరూపంబు బా
పురె లక్ష్మీపద పత్రికాకలన మామోదంబు లోకోన్నతి
స్థిరతాధాయక శక్తియుక్తులకు ధాత్రిన్ సాటివారేరి? శే
సరి! వైద్యాగ్రణి! కొమ్ము మామక నమస్కారంబుతోరంబుగన్.

సీ. స్వాంతమందున నెంత సంతోష మొందునో
మనుమసిద్ధి త్వదుద్యమంబుగనిన
నుల్లమందున నెంత నుబ్బిపోవునో?
కృష్ణరాయలు నీ చరిత్రంబు వినిన
చేతమందున నెంత ప్రీతిఁజెందునో? యాప్ర
తాపరుద్రుఁడు నీదు తలఁపు వినిన

గృహలక్ష్మీ జయంతి మహోత్సవము

గీ. నిండు పదుమూడు వర్షాలు నిండకున్న
సుభయభాషా సరస్వతి నుద్ధరించె
నీదు పుత్రిక 'గృహలక్ష్మి' లేదుసాటి
కొల్లఁగొనుమయ్య కేసరీ! గొనములెల్ల.

—విద్వాన్ శ్రీ కేశవపంతుల వేంకటనరసింహశాస్త్రి.

ఉ. జాలుగఁదే నెసోనలొగిజాల్కొన రామకథా ప్రబంధముక్
చాలురుపండితుల్ దనియు భంగిరచించి సువర్ణకంకణ
శ్రీలసఁదానకంబయిన చేతికి సార్థకతఁ ఘటించెఁ జే
బ్రోలు సరస్వతమ్మ! యికఁబొందదె మాగృహలక్ష్మి మన్ననల్.

సీ. ఈమెసుండీకవిత్వేందిరా పరిచర్యతనియకసల్పిన ధన్యురాలు
ఈమెసుండీ రఘురామచారిత్రంబు నొప్పారఁగూర్చిన యోగ్యురాలు
ఈమెసుండీ యాంగ్లహిందీత్రిలింగ భాషలనేర్పుబడసిన సరసురాలు
ఈమెసుండీ కవితామండలీమండప స్తంభమైన విద్వాంసురాలు

గీ. రాణివాసంబువిడువని రమణిగాన
మూర్తితోమీకుఁ బరిచయంబునుబొనర్తు
ఈమె మనయాంధ్రకేసరీ కృతసువర్ణ
కంకణముదాల్పనున్న విఖ్యాతురాలు.

ఉ. అంకిలిలేని ధారచెలువారఁగనీయమ స్వర్ణకింకిణీ
కంకణఘల్ ఘలారవము గ్రాలఁగదక్షిణ హస్తమెత్తి ముం
దింకరచించుఁగాత పరమేశ్వరతుంగజటాటవీసరత్
కంకణసంకులాభ్రనదిఁగాదను భంగిఁగవిత్వపద్ధతుల్.

గీ. బాల్యమాది సరస్వతీపాదయుగము
నర్చనముజేసికొన్న పుణ్యమునఁజేసి
శ్రీ సరస్వతి విక్రమ సింహనగర
కేసరీదత్త కంకణోద్భాసియయ్యె.

మ. గృహలక్ష్మీమణులార! నేఁడు గృహలక్ష్మీ నిత్యసౌభాగ్య ధు
ర్వహుఁడాకేసరి స్వర్ణకంకణముచే భాసిల్లఁగాఁజేసె నే
మహిళారత్నము నాసరస్వతికి రామస్వామిచారిత్ర ధు
ర్వహకాశీకుసుమ ప్రదానమున సౌభాగ్యంబు గాంక్షింపరే.

—శ్రీ శేషాద్రిరమణకవులు, శతావధానులు.

శ్లో. శ్రీ చేబ్రోల్ కులసమారామవాసంత్యా నామతోర్థతః
సరస్వత్యా మహాకావ్యం జీయాదా చంద్రతారకం.

మ. చిరసత్కీర్తి నిధానుఁడైన గృహలక్ష్మీపత్రికాస్వామి కే
సరి నీ యోగ్యతయెంచి కంకణముతో సత్కారముఁ జేయుటే
సరి! స్త్రీలోకము గారవించెనని భాషాసేవలన్ జేసెనం
చరుసంబొందితి దొడ్డవాఁడతఁడటం చానందమున్ దెల్పితిన్.

ఉ. కేసరి సత్కరింపగమకించియొసంగిన కంకణంబు నీ
కేసరి! యాంధ్రభాష చిలుపెంతయునొంద రసంబుతగ్గ నీ
కే, సరిచూచి కావ్యము రచించితి! కీరితియెల్లఁదక్క నీ
కే! సరివారిలో గణనకెక్కితివీవు సరస్వతీసతీ.

ఉ. మొల్లపు మల్లెగుత్తులటు ముద్దగు పద్యచయంబుచేర్చి యా
మొల్ల రచించె దొడ్డకృతి ముందు శతాబ్దమునందు; నీవునున్
మొల్లలు జాజులోయన మనోహరశబ్దములొప్పఁ గావ్యముల్
మొల్లమిఁగూర్చి మేటియశమున్ గయికొంటి సరస్వతీసతీ.

మ. మురువౌ మువ్వల ముద్దుబంగరు కలమ్మున్ బట్టి సత్కావ్యముల్
మెఱయన్ నీవు రచించువేళ గృహలక్ష్మీస్వామి యర్పించు భా
స్వరజాంబూనద కంకణంబది 'ఝుణంఝ్ఝాణం ఝుణా' మోఘ మం
జురవంబుల్ మనయాంధ్రభూమి వెలయించున్ గాత నీచేతులన్.

గీ. పుత్రపౌత్రులతోడఁ గాపురము పూల
తోటవలె సంపదలఁ దులఁదూగుఁగాక!
గురుఁడు రామసుబ్బారావు కొఱఁతలేక
యాత్మ గృహలక్ష్మితో సౌఖ్యమందుఁగాక!

—కవిసింహ శ్రీ డి. రాజశేఖర శతావధాని.

చ. సిరి యిలు కెంపునింపరససింధుర మాగృహలక్ష్మి శారదా
కరకరకంకణావళుల కాంతులనిత్యము గారవింపకే
సరిబుధలోకసన్నుత విశాలయశోదధి కేసరీంద్రుకే
సరి యలజానకీరమణు సత్కృతికెందు సరస్వతేతగున్.

ఉ. శారద శారదా భ్రవిరజాసమకేతనమైత్రి శాంతి పా
లేరనుకూలవాతగతులేలెడి చంద్రకలాచ్ఛపోతమం
దోరగ సాగిపోయి తరియూచినమేరకు దాటిపోయినీ
కీరితికిన్నెరన్నిలుపు కిన్నెరలన్గని పొంగిపోయితిన్.

విద్వాన్ శ్రీ సరిపల్లె విశ్వనాథశాస్త్రి ఎం.ఏ.

శ్లో. శ్రీ మద్రాజమహేంద్ర పత్తనగతో మల్లాదివంశోద్భవో
విప్రఃకోపి కవిప్రియోగణపతిర్నామ్నా విశమ్యాదరాత్
తుభ్యంసంప్రతిదీయమానమథ సంతృప్తః స్వయంకంకణం
శ్రీ చేబ్రోలు సరస్వతీతి కరవాయాశిఃపరం శ్రేయసే.

శ్లో. శ్రీ రామాయణగుంభనోదితయశశ్శ్వేతీకృతాశాంతరాం
శ్రీ చేబ్రోలు సరస్వతీం కవిమణీం శ్రీ నూజివీడుస్థితాం
మచ్ఛిష్యస్యచ సుబ్బరాయవిబుధ స్యాంతేవసంతీంహరిః
పాయాచ్ఛ్రీగృహలక్ష్మి కంకణవతీంశ్రేయోభిరాయుష్మతీం.

—శ్రీ మల్లాది గణపతిశాస్త్రి.

క. కేసరియన నిజముగనర కేసరియేయనుచు నిన్నుఁగీర్తింపంగా
భాసిల్లుము ధారుణినీ చేసెడు సత్కృషిఫలంబు జెందెదురీతిన్.

క. అతిలోకము వైదేహీ పతిచరితమువ్రాసినట్టి భాగ్యవతి సర
స్వతికీ యుత్సవమున సమ్మతిఁ గంకణమొసఁగనీకు మాన్యతగాదే?

క. ధన్యవుగా గృహలక్ష్మి ! మాన్యుఁడుకేసరి సతంబుమన్నింపనసా
మాన్యపథంబునఁ దరుణుల ధన్యలుగాఁజేయు మార్గదర్శినివగుటన్.

—శ్రీ గంధం వేంకటనరసింహాచార్యులు.

చ. సిరికిరవైన యీ తెనుఁగుసీమను మొల్ల రచించె మున్ను నేఁ
డరయ సరస్వతీసతి నయంబుగఁగూర్చెఁ దెనుంగుబాసలో
సరసముగా రఘూద్వహుని సచ్చరితంబు బుధుల్ నుతింపఁగా
గరితలపాండితీగరిమ గారవమొప్ప నుతింపఁజెల్లదే?

శా. అమ్మా ! యాంధ్రకవిత్వధీగరిమ నిత్యంబిమ్మలన్ సత్కవుల్
సమ్మోదింపఁగ రాఘవేశ్వరుకథన్ సంస్తోత్రపాత్రంబుగా
నిమ్మాడ్కిన్ రచియింప నీకెతగు నిన్నేరీతి వర్ణింతుఁ గై
కొమ్మా ! కొమ్మలమిన్న ! కంకణము నీకుంగూర్చెఁ గల్యాణముల్.

క. పలుకుం దొయ్యలిసత్కృప లలిత వచోరచనఁగలవిలాసినివగుటన్
బలుకులజెలిపేరను నినుఁబిలుచుట యనితలఁతు మదినిఁ బెంపునఁదల్లీ!

—డాక్టరు ద్వి భాష్యం సత్యనారాయణ.

సీ. చేబ్రోలువంశాన జెటప్రోలు రాజ్యమున్ జేరియే సతిగాంచె భూరియశము
తనపేరుసార్థకమును జేయనేసతి శారదపైవ్రాసె శతకమొకటి
ఆధ్యాత్మికంబుగ నాత్మోపదేశంబు నేసతీతిలకంబు వ్రాసిమించె
స్నేహలతాఖ్యమై చెన్నొందుసుకవితా సంఘానకేసతి సభ్యురాలు

గీ. కొల్లపురిఁజేరి సంఘసద్గురునియాన రామచరితంబువ్రాసెనేరామ జగతి
నా సరస్వతీదేవికిఁ గేసరి గృహలక్ష్మి కంకణమిప్పుడలంకరించె.

చ. సరసకవిత్వమారసిన సారసలోచన లెంద రెందరో
వరసుకృతంపుమార్గమునఁబ్రాకట కీర్తిగడించిరందులో
సురుచిరమొల్ల కీడగుచు సుందరమా రఘురాముగాథ నాం
ధ్రరచనలందమర్చిన సరస్వతి చూడఁగృతార్థురాలుగా.

మ. పలుచందంబుల సాహితీగరిమముఁ బ్రాచీనఫక్కిన్ నిజా
త్తులకున్ లేఖలలోనిమిడ్చి పరితృప్తుండై సఖుల్ వ్రాయు లే
ఖలలోఁబద్యములున్న సంతసమునన్ గైకోలు గావింపఁగాఁ
దలఁతున్ స్నేహలతాకవిత్వసమితిన్ స్థాపించు సుబ్రాయనిన్.

క. అట్టి గురుమూర్తికడఁదా నిట్టలమగు శ్రద్ధతోడ నేరిచి యెంతేన్
బట్టుగఁ గూర్చుచుఁగవనము పట్టెన్ గంకణముగురుని ప్రజ్ఞన్ జాటన్.

మ. మహిళాలోకము నుద్ధరింతునని సన్మానంబులన్ బత్రికన్
మహనీయుండెవఁడిద్ధరిత్రిపయిసంభావించి యేటేట నీ
గృహలక్ష్మి బహుమానకంకణము నీఁగేరించె నా కేసరిన్
సుహృదోఘంబుల దీవనల్ సిరులఁదేల్చున్ నిత్యసౌఖ్యంబునన్.

—శ్రీ డాక్టరు పి. టి. జగన్నాధరావు.

లక్ష్మీ శారదా నవరత్నహారము

చ. ప్రవిమలభక్తి యుక్తమయి భాసురభావమనోజ్ఞ పాకమై
కవిజనమోదసంభరిత గణ్యమునై మృదుశబ్దజాలమై
భువినలరించు వాగ్విభవభూషిత నీదు 'సరస్వతీ' కృతి
స్తవము సరస్వతీసతినిఁ దద్దయు నృత్యమొనర్పఁ జేయదే!

చ. గురుతర భావపూరితము గోవిద సంచయ విస్మయంబునై
సరసకవిత్వ తత్వరససాగరమై పరమార్థ బోధమై
సురుచిర దివ్యవైఖరుల శోభిలు నీదగు 'నాత్మబోధ' యి
ద్ధరణిని మెప్పుఁగాంచెఁ గవితావనితా వినుతాత్మభూషయై.

మ. కవితామాధురిఁ జిల్కుచున్ విబుధలోకవ్రాత సంస్తుత్యమై
నవనీతాంచితభావసంపదలతో నవ్యాగమప్రౌఢితో
భువనానందకరమ్మునై వరలుతన్ బుణ్యానుసంధాత్రియై
రవిచంద్రాదులువెల్గునందను కనీ 'రామాయణం' బీభువిన్.

గృహలక్ష్మీ జయంతి మహోత్సవము

గీ. సరసకవిసంచ యాలాప చతురిమంబు
పలుకు జవరాలి వాఙ్మయ కలకలంబు
విమల విద్వదలంకార విలసితంబు
వర్ష వర్షము నీవిచ్చు వైజయంతి.

సీ. సలువుచుందువుగదా పలుకుఁ దొయ్యలిసేవ మహిళామణులభాగ్య మహిమఁదెలుపఁ
గూర్చుచుందువుగదా కోమలాకృతులెన్నొ కమనీయ కావ్యశృంగార మెసఁగఁ
బ్రకటించెదవుగదా పండితుల్ మెచ్చఁగాఁ బ్రతివర్షమునునీదు వైజయంతి
జరుపుచుందువుగదా సహధర్మచరణంబు కులసతీ ధర్మంబు వెలయుచుండ

గీ. సాహితీకన్యకన్ బెంచు సాధ్వివీవ
ధర్మమార్గంబునన్ బొల్చు తరుణివీవ
ధీవిశాల సరస్వతీ దేవివీవ
స్వర్ణకంకణమొందఁగా జాణవీవ.

చ. మృదుమధురంపుశబ్ద రసమిశ్రిత శైలిఁజెలంగి వాక్సతీ
హృదయసమాగతాచ్ఛతర హృద్యము భావసమన్వితంబునై
ముదమునవల్లకీరవము మ్రోగినభంగిని మ్రోగి బాపు రే
సదమలరీతిఁ దెల్పుఁగద చక్కని నీ కవితావిలాసముల్.

చ. చిరసౌభాగ్యచిరాయువుల్ గలిగి సుశ్రీలన్ విరాజిల్లు మా
యరయన్ శారదవైజయంతివన నుద్యల్లీల నెవ్వేళలన్
జిరకీర్తిన్ బ్రకటింపఁగల్గు గృహలక్ష్మీ కంకణంబందు ము
ర్వరఁ జేఁబ్రోలు సరస్వతీసతి! జయధ్వానంబులేపారఁగన్.

చ. సరససుబోధ తత్త్వమయి సజ్జన సన్నుతికిన్ నిధానమై
పరమపథంబునై మహిత భావసమన్వితమార్గదర్శమై
దొరలి ప్రమోదమై పలుకుఁ దొయ్యలిచేతికి భూషణంబునై
ధరనుతిఁగాంచు నీదు కవితావ్రతతీమణియెల్లకాలమున్.

ఉ. కోమలభావయుక్తపదగుంభన కోవిదశాణవౌట హృ
త్సీమ దృఢావబద్ధ సరసీరుహసంభవు రాణివౌట వా
గ్గ్రామకృపానులబ్ధ కవిరంజకమంజులవాణివౌట శ్రీ
రామకటాక్షభాగ్యము తిరంబుగ సాయువునిచ్చి ప్రోచుతన్.

—శ్రీమతి గిడుగు లక్ష్మీకాంతం.

నవరత్నమాలిక

శ్లో. శ్రీ మన్మహానంద రసాయయాసారామాయణీరమ్య కథావ్యథాయితీం
మానవీమానవ మాననీయాం సరస్వతీంపాతు సరస్వతీత్వాం.

ఉ. శ్రీ మహనీయవైభవవిశిష్ట కళాకవితావితానసా
రామృతరామతారక కథామలకోమల కామలీకమై
కామితవస్తు సంఘటనకారణమై భవతారణైకతే
జోమయకావ్యరత్న పరిశుద్ధ సమృద్ధికి స్వర్ణకంకణ
శ్రీ మహితద్యుతుల్ దొరకె స్వీకృతహస్తవణీకృతంబులై.

సీ. భ్రమరహితాకార పద్మగర్భముబోలి భ్రమరహితాకార ఫణితిమెరయ
ముక్తాస్పదంబైన ముదితాస్తనముభాతి ముక్తాస్పదంబైనముద మొసంగ
చింతాకలాసంగ శ్రీ మహేశ్వరిరీతి చింతాకళాసంగ శ్రీ తలిర్ప
నవకోటి గుణశుభోన్నతధనుర్ద్యుతిభంగి నవకోటి గుణశుభోన్నతివహింప

గీ. రాముఁడాత్మ కథాసుధారసముఁగ్రోలి మెచ్చిపైడిచేకట్లు మీకిచ్చుటెంత?
కుశలవసుతాస్తిమున్న చేకూర్చినట్లె కుశల వసుతాప్తి మీకుఁ జేకూర్చుఁగాత.

గీ. కోట నరకేసరీంద్రుఁడు నాటినట్టి యాంధ్రవిదుషీమణీ గౌరవార్థహేమ
కంకణమిదినీకరము నలంకరించె నౌర! మనగృహలక్ష్మి కటాక్షమమ్మ.

చ. వనితలు విద్యనేర్చికొని భారతసారతపఃఫలంబులై
కనుపడకింటిలో నివురుగప్పిన నిప్పులఁబోలిడాగి నా
రనుచుఁదదీయ కీర్తులు బయల్పడఁగా గృహలక్ష్మి కంకణం
బు నొసఁగనియ్యదే తెలుఁగుభూమికి "నోబెలుప్రైజు" తల్లిరో.

మ. చికిలింబెళ్కునిగారపుంమెరుగువాసిన్ రాసిగాపోసి పై
డికి వేసారకబొమ్మఁ గట్టఁగలమోడిన్ జూపి మిన్నంటునం
తకుఁ ద్రోపాడుచు సంజఁబర్వులిడు జల్తార్వన్నె త్రొమ్మబ్బుటం
చుకుగుల్కుల్ గరపించుమీపలుకు లిచ్చోచ్చెనందెఁ బెండేరమున్.

చ. గుణములతాణమై సుకవికోటికి ముద్దులమూటయైరుచుల్
తొణికిసలాడుకైతఁదులదూచితివమ్మరో! రామసుబ్బరా
మ్మణిగురుఁడిచ్చు దీవనలమానితవై యపరంజిరత్న కం
కణమిఁకమీదటన్ గొలదికాలములోఁ దమకందుఁగావుతన్.

క. చరితార్థమై రసాలఫ
లరసాస్పదమగుచుఁ గల్పలతికాకృతితో
పరిమళమునద్దెసలనిడి
తిరముగవర్ధిలు సరస్వతీహారికృపచేన్.

THY WORTH

ACROSTIC—SARASWATI

Say then! wherefore except in spring
All 'Kokils' tongue—tad cease to sing?
Rustling chorus the trees keep on
And drop their flutes in cold season.
See there! The trembling Starry team
Will never maintain a steady stream
Albeit! thy pen of glowing birth
Thwarts them—This Jewel's dazzling mirth
In golden tongues proclaims thy worth.

—శ్రీ అచ్యుతుని వేంకటాచలపతిరావు.

సీ. రామాయణంబు నీ నామాంకితముఁజేసి ఘనతఁగాంచినకావ్య కర్త్రివగుట
కవిరాజ కవిసింహ కవిసార్వభౌముల కింపుఁగూర్చినకవ యిత్రివగుట
సౌభాగ్యలక్ష్మి సుసంతానలక్ష్మి విజ్ఞానలక్ష్ములఁగల్గు చానవగుట
వినయసౌశీల్య వివేకసన్మార్గమే లక్షణలక్షిత లలనవగుట

గీ. నరయ గృహలక్ష్మి నీకు జోహారులిచ్చి
స్వాగతమొసంగె ఘనతరాప్యాయమెసఁగ
హైమకంకణ మిడఁగనట్లగుట నీదు
ప్రతిభఁ జెప్పంగఁదరమె? సరస్వతమ్మ.

మ. కవితన్ గ్రాంధికపద్ధతిన్ నడుపఁగాఁ గష్టించి సుబ్రాయ స
త్కవిదీక్షన్ వహియించి సంఘమును సంస్థాపించె నైజామునం
దు, వదాన్యంబగు కొల్లపూర్నగరమందున్ గీర్తి పెంపొందఁగాఁ
గవులన్ బ్రోచెడి రత్నమాంబిక కటాక్ష శ్రీలఁ బోషింపఁగన్.

గీ. అట్టి సంఘంబునందుపాధ్యక్షురాల
వీవు నాకును సభ్యత్వ మింతయుండె
స్వర్ణకంకణ బహుమాన భాగ్యమబ్బె
నీకటంచన మురిపెంబు నాకుఁగాదె?

సీ. సకలాంధ్ర సజ్జనుల్ సన్నుతింపఁగ నేఁడు సాటిబోటులమీరఁ జాలినావు
రసవత్తరంబుగ రాముగాథరచించి మేటికీరితిఁగాంచి మించితీవు
స్వకృతపద్యములెంత సారవంతములైన గర్వరేఖనొకింత గాంచవీవు
తియ్యని పల్కుల నెయ్యంబుఁ జిల్కుచు బుధజనాశీస్సులఁ బొందితీవు

గీ. దేశికుండగు సుబ్రాయ దీవనలను
విరివిగాఁ గాంచినందుకీవిధముగాఁగ
కీర్తి నార్జించి గురుకాంక్ష పూర్తిసేయ
జేకొనుమ కంకణము యశ శ్రీ జెలంగ.

—శ్రీ కందాళై సంపత్కుమారాచార్యులు.

క. కేసరి బహుమానము నీ కేసరియని చెప్పవచ్చుఁ బృథ్వీస్థలిలో
స్త్రీసంఘమిట్లు నీచే వాసిలఁగల నేర్పుకూర్పుఁ బడయుటకతనన్.

—శ్రీ యం. రామకృష్ణారావు.
Personal Secretary, Jetprole.

క. గృహలక్ష్మి సంపాదకు బహుమతిగా నీవు నొక్క బంగరు కడియం
బహహా పడయుదటంచని బహుదినములకీసువార్త పడె శ్రవణములన్.

క. బిడ్డ! సరస్వతి! యిది చెవిపడ్డది మన్మనముపోయి ప్రమదాంబుధిలో
పడ్డది; యెన్నాళ్లులకును నొడ్డెక్కదు నేనిఁకేమి యొనరుపవలయున్.

మ. మదియోజించియె వ్రాయనేనెదియొ యిమ్మాడ్కిన్ విచారించి వ్రా
యుదమేదో భవదంఘ్రిఁ గేసరి స్వకీయోద్యోగ ముద్యోగమై
పొదలం గంకణభూషఁదొడ్గు సమయంబున్ గూర్చియన్నన్ గుణా
స్పద! యీ రీతిఘటిల్లెనేమి యిఁక నేవ్రాయన్ దలంపూనుదున్?

క. రామాయణ రమణీయత భూమిన్ బ్రాకటయు రసిక పురుషవ్రజముల్
నీ మృదు కవితామాధురి వేమాఱుం జుట్టికాన్క పెట్టఁగడంగెన్.

ఉ. కావున నొక్క కేసరియె కాదొక పైడికడెంబె కాదు నీ
కీవిధమెల్లరున్ సరసులిత్తురు సొత్తుల నో సరస్వతీ
దేవి! సరస్వతింబలె నుతింతురు నీ కవితారసంబె యీ
భూవలయంబునందగును బోయిఁక స్తవ్యము పూరుషాళికిన్.

క. గృహలక్ష్మి సంపాదకుఁ డహరీశుఁడు యమునఁబోలె నా గృహలక్ష్మి
సహితముగా విహితముగా నహరహమున్ బ్రోవఁగలఁడి కాత్మజ! మనుమా!

ఆ. వె. సతిని లక్ష్మినట్ల సుతనిన్ సరస్వతి రామసుబ్బరాయఁ డోము గురుఁడు
ఇరువురకును మీకు నిక్కట్టులే లేవు పో, యిఁకన్ సరస్వతీ! యిటంటి.

క. నీ పోష్యవర్గమందలిదై పరఁగెడిఁ గాన నింక నా గృహలక్ష్మిన్
రేపులు మాపులు గనుచును నీ పితృపాదుండు ముదము నింపెడుగాతన్.

—శ్రీ జానపాటి పట్టాభిరామశాస్త్రిగారు.
ఎడిటర్, అభినవసరస్వతి.

గృహలక్ష్మీ జయంతి మహోత్సవము

శా. శ్రీ మద్వాణి పరిగ్రహించె గృహలక్ష్మీ కంకణంబుల్ యశ
శ్రీమత్కేసరి ప్రాజ్యమాధనముచే శ్రీమత్త్రిలింగక్షమా
రామారత్నము మొల్లయల్లినటులే రామాయణంబల్లి యు
ద్దామఖ్యాతి సరస్వతమ్మ గొనె యాంధ్రబ్రాహ్మీ వాగ్దేవియై

గీ. రామకథ వ్రాసియున్న కారణముచేత నాంధ్రకవితా సరస్వతి యనుబిరుదము
రమణులందుఁ జేబ్రోలు సరస్వతమ్మ పడయవలెనని సత్కవిపలుకరాదే!

గీ. ధారుణీంద్రుల సతులహృత్పద్మములను మధురకవితాభిమానపు మందిరముల
చేసి కవిపోషకత్వంబు స్త్రీలకు నిడు తెలుఁగుతల్లి సరస్వతీదేవియగుత.

—శ్రీ డా. ధూపాటి వేంకటసుబ్రహ్మణ్య సోమయాజులు.

స్వర్ణ కంకణ మహోత్సవాభినందన పంచరత్నములు

ఉ. శ్రీవిభుఁజెప్ప నుత్తమచరిత్రల నెంతయు నగ్రగణ్యమై
పావనమైన రామకథ బండితవర్యులు మెచ్చునట్లు భా
షావనితాప్రసాదమున శాశ్వతకీర్తి కలాపముల్ ప్రమో
దావహమై దిశాంతములనందగ ధన్యతగాంచితక్కరో.

సీ. అతులితభక్తి నచ్యుతు పదాబ్జమ్ముల నాత్మ నేమఱకుండునట్టి ఘనుఁడు
ఉరుగుణోన్నతకీర్తి నిరవద్య శేముషీ నిధిమనజనకుఁ డెవ్విధినితాంత
ప్రియమారఁగా ముద్దు బేర సరస్వతి యని బిల్వ జాలెనాఁడది యమోఘ
మగురీతిదగి నేర్పుమయి సార్థకాభిధానముఁదాల్చి మేల్గాంచినావు బుధులు

గీ. మేలుమేలని వినుతింప మెఱసిమించి
ఆంధ్రభాషామతల్లి నత్యాదరమున
సేవజేసెడి భాగ్య సంసిద్ధియొదవ
గంటివెంతయు భవతారకమ్ము గంటి.

ఉ. ధారుణి సత్కవీంద్రజనతా హృదయాంబుజ నవ్యసీమఁదా
గోరి యలంకరించిన సుకోవిదవందిత నాంధ్రదేవతన్
ఆరయ భావబంధురసమంచిత సూక్తి సుధాసుమంబులన్
వారక గొల్చికొంటివనవద్యయశః ఫలమార్య సమ్మతిన్.

క. ఆతతసారస్వత విఖ్యాతపు సేవన్ బుధాళిక ప్రతిమంబౌ
కౌతుకముగూర్చి కాంచన కౌతుకమందితివి కవులు గణుతింపంగన్.

శా. ఆనందంబు ఘటిల్లె నెల్లరకు నేత్రామోద మొప్పారగా
నీనాఁడిట్టి మహోత్సవంబు దమితో నీక్షింప నీకున్ కృపన్
శ్రీనాథుండసమాన వైభవ శుభశ్రేణుల్ సదారోగ్య స
న్మానౌన్నత్యములన్ చిరాయువు నితాంతమ్ముం బ్రసాదించుతన్.

—శ్రీ విద్వాన్ ఆకుల గౌరీదేవి.

ఆశీస్సు

సీ. ఆంధ్రలోకమున కత్యానందమెసగంగ రాణించి పత్రికా - రాజ్ఞివగుచు
గృహలక్ష్మికిని సాటి - గృహలక్ష్మియే యని గృహిణులెల్లరు గేహ - గేహములను
వేనోళ్లవినుతింప - వింతవింతల బలు విషయచయమ్ముల - విందొనర్చి
కనక కంకణములు - కనకంపుపతకముల్ బలుయోగ్యతాపత్ర - ములు బిరుదులు

గీ. బుధులకర్పించి బహుమాన పూర్వకముగ సదమలమ్మగు కీర్తి సం - పదలు మెఱయ
వినుతికెక్కిన నీదు పే - ర్మిని వచింప దరమె జగదేకవిశ్రుత ! ధన్యచరిత !

ఉ. ఇంపుదలిర్పఁ దేనియల నీసడఁగింపగఁ జాలుమాటలన్
సొంపగు నీతులున్ కళలశోభిలు చిత్రతతుల్ ధురీణతా
సంపదనింపఁగాఁ దగిరసజ్ఞులు మెచ్చెడి సత్కవిత్వపుం
బెంపనవద్యవైద్యవిధి బెద్దలు పిన్నలు మెచ్చునట్లుగా.

క. లలితకళా విజ్ఞానము సులలిత సాహిత్యగరిమ శోభిల్లెడి మం
జుల సంగీతవిధానము బలువింతల విషయచయముఁ బాకపుకళయున్.

గీ. దేశదేశపువార్తలు దెలియజేసి కటికిచీఁకటిలో దీప కళికవోలె
భవమునడఁగించు సద్గురు వరునిమాడ్కి వెలుఁగుచున్నావు వెలఁదుల వెడఁగుమాన్ప.

ఉ. మానితకీర్తి 'కేసరి' కుమారికవై మఱి భాగ్యరాశివై
మానవతీమణుల్ మది నమందవికాసమునంద వారికిన్
మానక నీ హితంబధిక మాత్రమగణ్యము నద్వితీయమున్
మానిని ! మాధవుండఖిల మంగళముల్మహి నీకొసంగుతన్

గీ. పూతచారిత్ర ! నీకీర్తి భువిసమస్త దిక్కులకుఁ బ్రాఁకె నోడక నింక దివికిఁ
దివిరియెగబ్రాఁక నున్నది తీవ్రగతినిఁ దేజరిల్ల సరస్వతీదేవి పత్రి
కాధికారత్వమును దాల్చు కారణమున బళిర ! నీ భాగ్యమేమని పలుకవచ్చు
నమ్మ గృహలక్ష్మి ! యిమ్మెయి నెమ్మితోడ వరుస మా దీవెనలనంది - వఱలుమమ్మ
ధరను మేల్గాంచి యాచంద్ర - తారకముగ.

—శ్రీ విద్వాన్ ఆకుల గౌరీదేవి.

సువర్ణ కంకణ దానాభినందనము

గీత మాలిక

రాల్చెఁగంకణమాంధ్ర సరస్వతియని; కంకణ ఝణత్కృతులవ్రాసెఁ గబ్బములు స
రస్వతమ; యాఁగెనాంధ్ర సరస్వతికనుఁ దోయిఁగంకణమున్ జ్యోత్స్నగాయసాఁగె
మఱి సరస్వతి చేఁబ్రోలివరుస మెఱయ కేసరి ప్రదత్తము దిగంతకీర్తిదాయి
ధర్మకంకణం బొగివన్నె వాసిఁగాంచె "కేసరీ ! కీర్తి యిద్దినీకేసరీ" యని
ఆంధ్ర మహిళాంధ్ర భారతీ వ్యాసలత్వ మత్తగజ కేసరీ ! యని మహితులెన్న

—శ్రీ దోమా వేంకటస్వామిగుప్త



పి. కోదండరాం పిళ్లే

(లేటు పి. యస్. పొన్నుస్వామిపిళ్లేవారి కుమారులు)

1854-వ సంవత్సరమున స్థాపితము.

ఉత్తమతరగతి కర్రసామగ్రుల నిర్మాతలు

(పి. యస్. పొన్నుస్వామిపిళ్లే భవనములు)

మీ భవనమును అలంకరించుటకును దానిని ఆకర్షణీయముగ చేయుటకును మీకు కర్రసామగ్రులు కావలయును.

త్వరగా చేసియిత్తుము. నమ్మకమైన పనితనము.

కర్రసామగ్రులను కొనుటకుపూర్వము మాలో సంప్రదింపుడు. పురాతనమైన ప్రఖ్యాతిగల కంపెనీ.

39 & 44, ఎస్ప్లనేడ్ వెస్టు — మదరాసు.

శాస్త్రి హోటలు

ఆరోగ్యభాగ్యమునిచ్చు ఆహారములకు

అల్పాహారములకు పుట్టినిల్లు.

వీర్యబలమునిచ్చు మధురపదార్థములు, చలిదేశమునకు అనుకూలమైన శయ్యాగృహములు, దంపతులకు తగిన యేర్పాటులు.

శాస్త్రి హోటలు

89 చిక్ పేట — బెంగుళూరు సిటీ.

మీ అచ్చుపనులయందు

మీకు కావలసినది అందమగు కూర్పులా? లేక చిన్నపనియైనను బాగుగ చేయుటయా? లేక సకాలమునకు ముద్రించి యిచ్చుటయా? మీ అవసరము లేవియైనను, మీ అచ్చుపనులను మేము చక్కగ చేయగలమని మీ అనుభవమే తెలియజేయగలదు. ఒకమారు పరీక్షింపుడు!

లోధ్ర ముద్రణాలయము,

రాయపేట :: మద్రాసు

ప్రసవకాలమును దెలుపు పట్టిక.

సాధారణముగ స్త్రీలు గర్భము ధరించిన 280 దినములకు ప్రసవించెదరు. కడపటి బహిష్ఠయైన మొదటిదినము మొదలు లెక్క పెట్టుకొనవలయును. క్రిందకనుబరచిన పట్టిక మొదటిపంక్తి జనవరి 1-వ తారీఖున గర్భము ధరించినయెడల రెండవపంక్తి అక్టోబరు 8-వ తారీఖున ప్రసవించెదరు.

జనవరి	1	2	3	4	5	6	7	8	9	10	11	12	13	14	15	16	17	18	19	20	21	22	23	24	25	26	27	28	29	30	31	జనవరి
అక్టోబరు	8	9	10	11	12	13	14	15	16	17	18	19	20	21	22	23	24	25	26	27	28	29	30	31	1	2	3	4	5	6	7	నవంబరు
ఫిబ్రవరి	1	2	3	4	5	6	7	8	9	10	11	12	13	14	15	16	17	18	19	20	21	22	23	24	25	26	27	28				ఫిబ్రవరి
నవంబరు	8	9	10	11	12	13	14	15	16	17	18	19	20	21	22	23	24	25	26	27	28	29	30	1	2	3	4	5				డిసెంబరు
మార్చి	1	2	3	4	5	6	7	8	9	10	11	12	13	14	15	16	17	18	19	20	21	22	23	24	25	26	27	28	29	30	31	మార్చి
డిసెంబరు	6	7	8	9	10	11	12	13	14	15	16	17	18	19	20	21	22	23	24	25	26	27	28	29	33	31	1	2	3	4	5	జనవరి
ఏప్రెల్	1	2	3	4	5	6	7	8	9	10	11	12	13	14	15	16	17	18	19	20	21	22	23	24	25	26	27	28	29	30		ఏప్రెలు
జనవరి	6	7	8	9	10	11	12	13	14	15	16	17	18	19	20	21	22	23	24	25	26	27	28	29	30	31	1	2	3	4		ఫిబ్రవరి
మే	1	2	3	4	5	6	7	8	9	10	11	12	13	14	15	16	17	18	19	20	21	22	23	24	25	26	27	28	29	30	31	మే
ఫిబ్రవరి	5	6	7	8	9	10	11	12	13	14	15	16	17	18	19	20	21	22	23	24	25	26	27	28	1	2	3	4	5	6	7	మార్చి
జూన్	1	2	3	4	5	6	7	8	9	10	11	12	13	14	15	16	17	18	19	20	21	22	23	24	25	26	27	28	29	30		జూన్
మార్చి	8	9	10	11	12	13	14	15	16	17	18	19	20	21	22	23	24	25	26	27	28	29	30	31	1	2	3	4	5	6		ఏప్రెలు
జూలై	1	2	3	4	5	6	7	8	9	10	11	12	13	14	15	16	17	18	19	20	21	22	23	24	25	26	27	28	29	30	31	జూలై
ఏప్రెల్	7	8	9	10	11	12	13	14	15	16	17	18	19	20	21	22	23	24	25	26	27	23	29	30	1	2	3	4	5	6	7	మే
ఆగస్టు	1	2	3	4	5	6	7	8	9	10	11	12	13	14	15	16	17	18	19	20	21	22	23	24	25	26	27	28	29	30	31	ఆగస్టు
మే	8	9	10	11	12	13	14	15	16	17	18	19	20	21	22	23	24	25	26	27	28	29	30	31	1	2	3	4	5	6	7	జూన్
సెప్టెంబరు	1	2	3	4	5	6	7	8	9	10	11	12	13	14	15	16	17	18	19	20	21	22	23	24	25	26	27	28	29	30		సెప్టెంబరు
జూన్	8	9	10	11	12	13	14	15	16	17	18	19	20	21	22	23	24	25	26	27	28	29	30	1	2	3	4	5	6	7		జూలై
అక్టోబరు	1	2	3	4	5	6	7	8	9	10	11	12	13	14	15	16	17	18	19	20	21	22	23	24	25	26	27	28	29	30	31	అక్టోబరు
జూలై	8	9	10	11	12	13	14	15	16	17	18	19	20	21	22	23	24	25	26	27	28	29	30	31	1	2	3	4	5	6	7	ఆగస్టు
నవంబరు	1	2	3	4	5	6	7	8	9	10	11	12	13	14	15	16	17	18	19	20	21	22	23	24	25	26	27	28	29	30		నవంబరు
ఆగస్టు	8	9	10	11	12	13	14	15	16	17	18	19	20	21	22	23	24	25	26	27	28	29	30	31	1	2	3	4	5	6		సెప్టెంబరు
డిసెంబరు	1	2	3	4	5	6	7	8	9	10	11	12	13	14	15	16	17	18	19	20	21	22	23	24	25	26	27	28	29	30	31	డిసెంబరు
సెప్టెంబరు	7	8	9	10	11	12	13	14	15	16	17	18	19	20	21	22	23	24	25	26	27	28	29	30	1	2	3	4	5	6	7	అక్టోబరు

ప్రమాది - విక్రమనామ సంవత్సర — ఫాల్గుణ - చైత్రమాసములు

1940-వ సంll ఏప్రిల్ నెల

1	సో	న 13-27 ఉషా 30-27 రా11-7
2	మం	ద 18-1 శ్ర 36-46 రా16-34 ఏకాదశీ తిథి
3	బు	ఏ 23-39 ధని 43-59 అతిథి సర్వైకాదశి
4	గు	ద్వా 30-1 శత 51-39 ది 4-17 ద్వాదశి తిథి
5	శు	త్ర 36-39 పూభా 59-32 ది 9-45 ప్రదోషం శివరాత్రి
6	శ	చశి 43-10 ఉభా 60-0 ది 26-38
7	ఆ	● 49-16 ఉభా 7-8 రా10-10 అమావాస్య
8	సో	ప్ర 54-46 రే 14-22 యుగాది చైత్రశుద్ధం వేదవ్యాసర్
9	మం	ద్వి 59-30 అశ్వి 20-54 ది 9-49 రా6-35
10	బు	తృ 60-0 భర 26-33 తృతీయా తిథి త్రిదినస్పృక
11	గు	తృ 3-1 కృ 31-9 శే 3-51 కృత్తికా చతుర్థి తిథి [పంచమి
12	శు	చ 5-24 రో 34-31 ది 13-23 రా 18-19 మేషేరవిః 54-12 పంచమితిథి వసంత
13	శ	పం 6-33 మృ 36-32 షష్ఠ్యతిథి శీర్కాళి తిరుములప్పాలు
14	ఆ	ష 6-12 అరు 37-8 శే 1-45 సప్తమితిథి షష్టీవ్రతం [గరుడన్
15	సో	న 4-24 పున 36-18 ది 6-43 రా24-47 శ్రీరంగం-కంచి-శ్రీరామనవమి తిరువళ్లూర్
16	మం	అ 1-7 న 56-25 పుష్య 34-3 శ్రీరామనవమి, అవమా, కవీంద్రర్
17	బు	ద 50-28 అశ్లే 30-28 ది 4-8 మఠ శ్రీరామనవమి
18	గు	ఏ 43-28 మఖ 25-38 శే 1-43 రా12-45 సర్వ-జీవహార-ఏకాదశి
19	శు	ద్వా 35-39 పుబ్బ 19-59 రా5-13
20	శ	త్ర 27-16 ఉత్త 13-42 రా1-30 వృషభాయనం 13-27 శనిప్రదోషం త్రయోదశితిథి
21	ఆ	చశి 18-44 హస్త 7-12 ది 25-5 తిథిద్వయం చిత్రాపౌర్ణమా
22	సో	○ 10-32 చిత్త 0-52 స్వా 55-2 ది 13-30 ప్రథమతిథి కంచి చిత్రాపౌర్ణమి
23	మం	ప్ర 2-51 ద్వి 56-9 విశా 50-6 ది 7-53 అవమా, చైత్ర బహుళం
24	బు	తృ 50-44 అనూ 46-27 శే 3-29 నాగీచర్.
25	గు	చ 46-56 జ్యే 44-23 శే 3-58 సంకటచతుర్థి
26	శు	పం 44-58 మూల 44-10 ది 4-19 రా9-8
27	శ	ష 45-2 పూషా 45-55 ది 8-52 శ్రీపెరుంబూదూర్ రథం
28	ఆ	స 47-3 ఉషా 49-34 ది 7-5
29	సో	అ 50-51 శ్ర 54-53 ది 0-27
30	మం	న 56-0 ధని 60-0 ది 6-0

విషయసూచిక

1. విష్ణుప్రియ—కవికలహంసి శ్రీమతి చేబ్రోలు సరస్వతీదేవిగారు ... 85
2. స్త్రీలు - జర్నలిజం— ,, ,, ... 86
3. కృతజ్ఞత— ,, ,, ... 89
4. పుష్ప విశేషములు—శ్రీమతి వేదుల లక్ష్మీసోదెమ్మగారు ... 90
5. స్త్రీ ధర్మం—మహాత్మాగాంధి 92
6. మా గృహిణి—శ్రీమతి వట్టి శేషాంబగారు 93
7. దాంపత్యము—శ్రీయుత జానకీరాంగారు 99
8. కర్ణుడు—శ్రీయుతఆకుండి వెంకటేశ్వరరావుగారు 101
9. స్త్రీ స్వాతంత్ర్యము-కవితిలక, కవితావిశారద, శ్రీమతి కాంచనపల్లి కనకమ్మగారు 105
10. ఉగాదికానుక—శ్రీయుత అయ్యగారి విశ్వేశ్వరరావుగారు ... 106
11. నా జీవితము—'సత్యంవద' 107
12. అభినందనము—శ్రీయుత మద్దాలి ఉమామహేశ్వరరావుగారు ... 109
13. మధుమాధవులు—శ్రీమతి సి. హేమలతాదేవిగారు 110
14. వీరాబాయి ప్రబోధము—శ్రీయుత గోనెల నరసింగరావుగారు ఎం.ఏ. బి.యల్ 112
15. మంగళసూత్రము—జీవనప్రభాత్ (నవకళాసమితి) 114
16. వత్సరాది—శ్రీమతి పి. వి. సీతామహాలక్ష్మిగారు 116
17. కళాకలాపము సంగీతము—శ్రీమతి బి. విజయలక్ష్మిగారు ... 117
18. రాష్ట్రప్రబోధము—శ్రీమతి దేశిరాజు భారతీదేవిగారు ... 119
19. త్యాగం—శ్రీయుత మద్దాల తాతాజీరావుగారు 120
20. లక్ష్మీ సూక్తి గీతావళి—శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మగారు ... 121
21. స్త్రీకి ఎట్టివిద్య అవసరము—శ్రీమతి చుండూరి రమాదేవిగారు ... 122
22. అభినందనము—శ్రీయుత వీరుభొట్ల సూర్యనారాయణగారు ... 123
23. ప్రేమ—శ్రీయుత డి. రామావతారంగారు 124
24. పెట్టుడుపేరు—శ్రీమతి నిడుమర్తి నరసమాంబగారు 125
25. భాగవతసేవ—శ్రీయుత గంధం నరసింహాచార్యులుగారు ... 126
26. రాఘవా!—శ్రీయుత పిల్లలమఱ్ఱి కృష్ణమూర్తిగారు 127
27. లాటరీ—శ్రీయుత పి. వి. రామచంద్రమూర్తిగారు బి.ఎ. ... 128

28. అభినందనము—శ్రీయుత విద్వాన్ కాశి వ్యాసాచార్యులుగారు ... 132
29. భాగ్యం—శ్రీయుత ఎ.వి. చంద్రమౌళిగారు 133
30. పుష్పచయము—శ్రీమతి సి. హెచ్. చంద్రమతిగారు... ... 137
31. నూతన సంవత్సరాశీర్వచనము—శ్రీయుత కృత్తివెంటి వెంకటసుబ్బారావుగారు 139
32. అభినందనము—శ్రీమతి వాజపేయయాజుల మహాలక్ష్మిగారు ... ,,
33. దీవెన—శ్రీయుత అద్దంకి సీతారామయ్యగారు ... ... ,,
34. చిత్రకళావిశారద సి.యస్. వెంకటరావుగారి అస్తమయము ... 140
35. ఆపద శీలసంపద కథిక బలప్రదము—శ్రీయుత వి. అ. సూర్యనారాయణగారు 141
36. హిందూవివాహము—శ్రీయుత సాదలి రామస్వామిగారు బి.యే., బి.యల్. 144
37. సంపాదకీయములు 145

త్రివర్ణ చిత్రములు: చిత్రకారుడు - శ్రీ రామ్‌గారు.

విష్ణుప్రియ



టి. సి. ఎన్. గోల్డెన్ మెటల్ నగలే

స్త్రీల కన్నివిధాలా అలంకారానికి తగినవి.

2 సంవత్సరములు గ్యారంటీ

కాంతిలోను, వన్నెలోను బంగారుగాజుల కేమాత్రము

తీసిపోవు. నలుపెక్కవు.

పెద్దసైజుగాజులు 2 అంగుళములనుండి పైబడినవి జత 1-కి	రూ. 3 0 0
మధ్యసైజుగాజులు 1¾ నుండి 2 అంగుళములకులోగా జత 1-కి	రూ. 2 8 0
చిన్నసైజుగాజులు 1¾ అంగుళములకు లోబడినవి జత 1-కి	రూ. 2 0 0
వి. పి. ఖర్చులు 1 జత మొదలు 6 జతలవరకు	రూ. 0 8 0

మా చక్కని బొమ్మల క్యాటలాగు ఉచితము.

గాజులకు ఆర్డరుచేయువారు తాము వుపయోగించెడు గాజులలో చుట్టుకొలతను సిరాతో మార్కుచేసి పంపవలయును. లేక అడ్డుకొలత పంపవలయును.

N. B. మీరు వ్రాయు ఆర్డరు జాబులయందు "గృహలక్ష్మి" పత్రికపేరు నుదహరించిన మా ధరలమీద రూపాయకు 1 అణావంతున తగ్గించబడును.

టి. సి. నాగలింగప్ప అండ్ కో.,
280, వాల్‌టాక్సురోడ్, పి. టి. మద్రాసు.

ఏజంట్లు:—
గుప్తా అండ్ కో., కె. వి. రమణమూర్తి, తెనాలి.
మెయిన్‌రోడ్, కాకినాడ. ఎస్.ఎస్. గుప్తగారు, జనరల్ ఏజంటు.

ఎనామెల్ బోర్డులు

మీ
వ్యాపారమును
వృద్ధిచేయును

శాశ్వతము

శోభావంతమైనవి

మద్రాస్ ఎనామెల్ వర్క్సు లిమిటెడ్
6 క్లైడన్‌హామ్సు రోడ్డు మదరాసు.

డోంగ్రేగారి
బాలామృతము

బిడ్డలకు
బలవర్ధకమైన
ఆదర్శ ఔషధము



విష్ణుప్రియ

క. జయజయ గృహలక్ష్మీ సఖి ! జయజయ లలితాంధ్ర మధుర సారస్వతమా !
జయజయ లలనారత్నమ ! జయజయ విద్యాప్రబోధ ! జయకల్యాణీ !

విష్ణుప్రియ

ఉ. ప్రేమరసాలవాల ! సుమపేశల చంపక చారుదేహ ! నీ
మోము సుధానిధిం గనెడు బుణ్యము నాకిక యున్నదో ? కటా !
పామరజన్మమెత్తి పలుబాధలఁ జిక్కిన మందభాగ్యను
ద్దామ విషాదవీచికల తాకునఁ గృశియింపఁజేసితే !

గీ. నీ వియోగానల జ్వాల నేవిధంబు
సైచి దినముల వేగింతు ? జాలిఁదొఱంగి
ప్రణయసూత్రముఁ దెగఁగోయఁ బ్రాణమెట్టు
లాడెనో దేవ ! కరుణారసాంతరంగ !

కవికలహంసి, చేబ్రోలు సరస్వతీదేవి.
సహాయ సంపాదకురాలు.

స్త్రీలు - జర్నలిజం

"జర్నలిస్టుకి కావలసిన స్థిమితమైన విచారణ, నిస్వార్థమైన ఆలోచన, నిశితమైన విషయపరిశీలన—వీటికి యెక్కువ పెట్టిపుట్టింది స్త్రీ—......"

శ్రీమతి గుమ్మిడిదల దుర్గాబాయిగారు బి. ఏ. (ఆనర్సు.)

మానవహృదయములోఁ దాండవించు భావతరంగములను గ్రహించి మనోహరముగఁ జిత్రింపఁగలిగి, మానవజీవిత పరమార్థమును జక్కఁగఁ బ్రతిఫలింపఁ జేయఁగల శక్తిఁ గాంచినవాఁడే నిజమైన జర్నలిస్టు. అంతటి సమర్థత్వమును గాంచుటకు విద్యయే ప్రధానము. విద్యయనఁగా నీనాఁడు విశ్వవిద్యాలయములయందు నియోగింపఁబడిన పలు విధములగు తరగతులలో నొక్కొక్క రొక్కొక్కదానియందుఁ బట్టమునందుటమాత్రములోనే పూర్తియగునట్టి విద్యకాదు. సారస్వత కళలన్నిటియందును జాలవఱకుఁ దగినంత జ్ఞానముండవలె. ప్రపంచ తత్త్వపరిశోధనమంతయు జర్నలిస్టు చూపులో నిమిడియుండవలె. వార్తాపత్రికలను ధారాళముగ నడిపించుటలోనే జర్నలిస్టు యాశయము తీరెనదని తలంచరాదు. విశ్వమునంతయు నొక్కచోటికిఁ జేర్చి పత్రికాపాఠకులకు సర్వవిషయములను నరచేతి నిమ్మపండువలె సులభముగా నవగాహనమగురీతిఁ దెలియఁజెప్పనంతటి నేర్పు కూర్పును గాంచవలె. అనగా నంతటిలోకజ్ఞతఁ గాంచినవాఁడై యుండవలె. అదియే విద్య, అట్టివాఁడే జర్నలిస్టు. అట్టి ప్రతిభగలవాని విద్యయే విద్య.

ఇతనిని కవితోఁ బోల్చినఁ బోల్చవచ్చుఁగాని కవిమహాశయుఁడు స్వాతంత్ర్యసామ్రాజ్యచక్రవర్తి. అతనికి నిబంధనలేదు, హద్దులేదు. అతఁడాడినది యాట. పాడినది పాట. జర్నలిస్టున కటువంటి యాటలు సాగవు. ఇంచుక తెలివిగలవాఁడై గడుసరియై, ధీరగుణాఢ్యుడైన సాగకనుపోవు. విషయములను గ్రహించి యందలి యథార్థతత్త్వమును దాచక లోకమును వంచింపక, నేర్పుకొలఁది తద్విషయములను వర్ణించి లోకమునకొక నీతిపాఠముగాఁ బ్రతిమానవుని హృదయమునందు హత్తుకొనురీతిఁ బ్రకటింపఁగాఁజాలిన సునిశితమగు కలమును గాంచినవాఁడై యుండువాఁడే జర్నలిస్టు. వాఁడే కవియునగును. జర్నలిజమునకుఁ దోడు కవిత్వముగూడ ప్రాకృత భాగ్యఫలంబుగా లభించెనా యిఁక నట్టివాని మేధాశక్తియు నట్టి ధీబలంబునకుం దగిన భావగాంభీర్యమును దానికనువగు భాషయును, దానిని జిత్రకారునివలెఁ జిత్రించుటలోఁగల నైపుణ్యమును బ్రత్యేకించి యిట్టిదట్టిదని చెప్పనక్కరలేకుండగనే యెదుటనున్న అద్దమునఁ బ్రతిఫలించు ముఖమువలె సర్వమును గోచరించెడిని.

జర్నలిస్టునకు ముఖ్యముగానుండఁదగిన గుణము ధీరత్వము. జంకును గొంకునులేక నదురును బెదురునులేక యప్రియమగు విషయమును జెప్పవలసివచ్చినను చివరకది లోకోపకారకమై బహుజనసమ్మతమైయుండునట్లు చెప్పఁగలవాఁడొక ధీరగుణాఢ్యుండగు జర్నలిస్టు ఒకఁడే.

జర్నలిస్టు నియమబద్ధుడు. సత్యమును మీరిపోఁజాలడు. ఒక్కొక్కప్పుడు స్వేచ్ఛావర్తియై తిరుగుటకును వీలుండదు. మఱియు దేశసేవ, సంఘసేవ, అను రెండుచక్రములపై రెండుకాళ్లిడి జీవయాత్రను బత్రికాముఖమున సాగించుకొనవలసినవాఁడు. నిక్కముగా నితఁడు సర్వసంఘ శ్రేయోభిలాషియై కాలానుగుణ్యముగాఁ బ్రజాహృదయభావములను దడవికొనుచు లోటుపాటులను గమనించి నడకలోఁ గుంటకరాజమార్గములను జూపుచుండవలెను. ఇంటినిజూచి యిల్లాలినిఁ జూడవలెనన్నట్లు జర్నలునుజూచి జర్నలిస్టును జూడు మనుట యొప్పు.

ఛాయాపటమును దీయువానికి జర్నలిస్టుకు భేదమావంతయులేదని చెప్పవచ్చు. సర్వకాల సర్వావస్థలయందును జర్నలిస్టు ప్రపంచమంతయు వేయికన్నులతోఁ జూచుటయేకాక చూచినదానిని నచ్చుగ్రుద్దినటుల మరలఁ జిత్రించి ప్రజాలోకమునకుఁ ద్వరలో నందింపఁగల సమర్థుఁడు. కవి నిరంతరము భావనాప్రపంచములో విహరించుచుఁ బ్రకృతి కల్యాణవైభవములో మునిఁగి బ్రహ్మానందమంది మైమఱచునట్లు జర్నలిస్టు బాహ్యప్రపంచములోఁ దిరుగాడుచు విశ్వనాటకరంగమునఁగల ప్రతి యంకములోని సారమాస్వాదించుచుండును.

జర్నలిస్టునకుగల స్థానము బాధ్యత చాలగొప్పదని చెప్పియుంటినిగదా. అతనికిగల దృష్టియు సర్వభూతసమత్వమై, ధీబలసంపదతోఁగూడినదై, పరమార్థచింతనగలదై, సంఘోద్ధరణమునకు మూలకందంబై, వేయేల! యతి పవిత్రవంతముగనుండవలె. ఇతని దృష్టి మహాయోగి దృష్టివలెనుండవలె. జాతిమత వర్ణవివక్షలతో నతనికి సంబంధములేదు. ప్రపంచమంతయు సింహావలోకనముజేయుటయే యతనిపని. పట్టణములలో జరుగు వ్యవహారములపై నొకసారి, పల్లెలలోనుండు శాంతిసౌఖ్య జీవితములయందొకసారి, వివిధములగు ప్రపంచపరివర్తనములపై నొకసారి యతని దృష్టి ప్రసరించుచుండును.

ఇతడు శతసహస్రావధానులవలె మేధాశక్తిగలవాఁడై యెటకేగినను నెందున్నను నేసమయాననైనను గనఁబడిన దృశ్యములనన్నింటిని యొక్కమారు తన హృత్ఫలకమునఁ జిత్రించుకొనఁగలిగిన చిత్రకారుఁడీ జర్నలిస్టు. నాటక సినీమారంగములలోఁగల కళలుగాని, చివరకు కూరగాయల బాజారులలో వెలునడు దృశ్యములుగాని యొక్కసారి విద్యుచ్ఛక్తివలెఁ దనలో గ్రహించుకొని చక్కని సాదృశ్యములతో బోధపడునట్లు

యథార్థతత్వమును బ్రదర్శింపఁగల ప్రతిభావంతుఁడు జర్నలిస్టు. ఇట్టివానిని సర్వజ్ఞుఁడనినను నతిశయోక్తి కాఁజాలదు.

ఇట్టి మహోన్నతపదవికి స్త్రీ లర్హులా? కారా? కాకపోవుట యెట్లు? ముదితలు నేర్వఁగరాని కళలేదనిగదా మేటిసిద్ధాంతము. సూక్ష్మబుద్ధిచేఁ బురుషులకన్నఁ ద్వరగనేర్చుకొని సర్వకళలం దారితేరగలవారు స్త్రీలే. స్త్రీబుద్ధి మిక్కిలి చుఱుకుగలది. లలితకళలన్నియు నిజముగ వారి సొమ్ములేకదా? పురుషునికన్న మిన్నఁగ బాటుపడగల స్వభావము, పట్టుదల, దీక్ష, కార్యరంగమున స్త్రీలయందే యెక్కుడుగఁ గాన్పించుచున్నచో నొక్క 'జర్నలు'ను నడిపించుకోఁగలుగు విషయములో స్త్రీల సామర్థ్యమునుగూర్చి శంకింపం బనిలేదు. "స్త్రీణాం ద్విగుణమాహారం బుద్ధిశ్చాపి చతుర్గుణం సాహసం షడ్గుణంచైవ" యను వాక్యసరణి ననుసరించియు, "కీర్తిః శ్రీర్వాక్చ నారీణాం స్మృతిర్మేధాధృతిః క్షమా" అను గీతావాక్య సిద్ధాంతమనుసరించియు స్త్రీలు సహజముగ పురుషులకంటె బుద్ధిప్రాభవమున నెక్కుడని తెలియుచున్నది. తెలియుటయే కాదు, అంగీకరింపఁదగిన విషయమై తనరారుచున్నది.

స్త్రీ ప్రేమమూర్తి. ఇది స్త్రీ నేర్చుకొనినదికాదు. నేర్చుకొనిన వచ్చునదియుఁగాదు. విద్యాసమస్యల నవలీలగ నెట్టజాలినవారు సహజముగ స్త్రీరత్నంబులే. విశేషించి స్త్రీసంఘోద్ధరణమునకై పాటుపడు పత్రికలకు స్త్రీలే జర్నలిస్టులుగ నుండుటమంచిది. అప్పుడే స్త్రీ జనాభ్యుదయమునకు వలయు సాధనములన్నియు నెరవేరును. స్త్రీ సంఘాభివృద్ధికను వగు మార్గములన్నియు జర్నలిస్టు స్త్రీయైనచోఁ గలుగు నవకాశము నిర్వాహణత్వము ప్రత్యేకించి చెప్పనేటికి? అప్పుడే స్త్రీల మనోభిప్రాయములను జక్కఁగా గుర్తించి వారికాంక్షలను నెరవేర్చుటకుఁ దగినవసతు లేర్పడును.

నేఁడు మనదేశములో స్త్రీలలోకూడ మంచివక్తలు కవులు, కథారచయితలు, వ్యాసరచయితలున్నారు గాని వారిసంఖ్య చాలతక్కువ. కాలమతిశీఘ్రముగా మార్పుఁజెందుచున్నది. ప్రపంచమంతయు నాగరీకమై పెక్కువిషయములలో నూతనవికాసము జెందుచుండఁగా మనము వెనుకఁబడియుండుటకు వీలులేదు. దేశసౌభాగ్యము మనకు కాంక్షణీయముగదా! అది లేనినాఁడు శాంతిసౌఖ్యము లెక్కడిది? అట్టి సౌభాగ్యము విద్యావతులగు స్త్రీరత్నములపై నాధారపడియున్నది. మాతృస్థానముల నధిష్టించినవారందరును విద్యావతులై యుండుటరుదు. విద్యాభిలాషయుండినను నవకాశములేనివా రసంఖ్యాకులున్నారు. వారందరికి సులభముగా లౌకిక, నైతిక, ఆర్థిక, రాజకీయవిషయములలో నవసరమైనంతవఱకు ప్రబోధము గావించుట మిక్కిలి యవసరము. దేశకాలపరిస్థితులను

బట్టి ఇట్టి కార్యములు సక్రమముగా నిర్వహించుటకు స్త్రీసంఘములేగాక, పత్రికారాజములును ముఖ్యములు. పత్రికలద్వారా విషయములను వివిధప్రదేశములలోనుండే స్త్రీలకు గూడ బోధించుట కవకాశము గలుగుచున్నది. కావున స్త్రీలే ఈ పత్రికా సంపాదకత్వము వహించి, విదుషీమణులచేత వివిధవిషయముల నుద్బోధించు వ్యాసముల వ్రాయించి ప్రకటించుట యత్యావసరము. శిశుసంరక్షణ, ఆరోగ్యము, గృహపరిశ్రమ, దేశసేవ, సంఘసేవ, మొదలగు విషయముల నన్నింటిని స్త్రీలోకమున కందఁజేయుటకు పత్రికలే ముఖ్యాధారములు.

భారతదేశపు నారీరత్నములు నిర్వహింపఁజాలని పదవులులేవని ఘంటాపథంబుగఁ జెప్పుటలో సత్యదూరములేదు. కార్యనిర్వహణమునకు ముందంజవేయునది ముమ్మాటికి స్త్రీగణమే.

కవికలహంసి, చేబ్రోలు సరస్వతీదేవి.
సహాయ సంపాదకురాలు.

కృతజ్ఞత

శ్రీయుత డాక్టరు కేసరిగారు గృహలక్ష్మీ జయంత్యుత్సవసమయమున స్వర్ణకంకణముచే నన్ను బహూకరించుతటి యాంధ్రదేశమునుండి పలువురు పండితులు, కవులు, మిత్రులు, కవయిత్రులు సహృదయాభినందనాశీర్వాదములెన్నియో నన్నుఁగూర్చి వ్రాసి పంపియుండిరి. సరస్వతీరామాయణమును సాంధ్రసారస్వతపాఠక లోకమున కందఁజేయ భాగ్యముగాంచిన నాఁడిట్లే పండిత కవుల యాశీర్వాదములకును, బత్రికల ప్రోత్సాహమునకును బాత్రురాలనైతి. నాటిప్రేమ నేఁడును నాపైఁజూపిన మహామహులందఱకును నా సంపూర్ణకృతజ్ఞతను వెల్లడించుచున్నాను. సాహిత్యసేవ యొకరిచేఁ జేయఁబడునదికాదు. కార్యనిర్వహణమునకు బలువురవాక్సహాయ మపేక్షణీయము. కావున నా సోదరసోదరీమణుల నెల్లరను దగినంత చేదోడౌసంగవలసినదిగాఁ బ్రార్థించుచుందును.

కవికలహంసి, చేబ్రోలు సరస్వతీదేవి.
సహాయ సంపాదకురాలు.
(వైస్ ప్రెసిడెంటు స్నేహలతాకవితాసంఘము.)

పుష్ప విశేషములు

శ్రీమతి వేదుల లక్ష్మీనరసమ్మగారు

[దేవతాయోగ్యములగు పుష్పవిశేషములు, వాటి లక్షణములు, ధారణగుణగణములు.]

శ్లో. కేశక్లేదశిరోరుజాం మలిన సంతాపం విషాదం హరే।
దుర్గంధస్య వినాశనం భృశతరం స్వేదోద సంహారకం।
చక్షుష్యం రతివర్ధనం సుఖకరం సంపద్యశోవర్ధనం।
పుష్పాణాం పరిధారణంచ కధితం కాంతామనోరంజనం ||

తా. సువాసనగల పుష్పములు కేశక్లేద, శిరోరోగ, మాలిన్య, సంతాపదుఃఖములను హరించును. దుర్గంధమును బోగొట్టును. స్వేదదోషమును అడచును. నేత్రములకు హితము, రతివర్ధనము, సుఖకరము సంపత్కీర్తుల స్ఫురింపచేయును. కాంతామనోరంజనము గావున పుష్పధారణ మావశ్యకము.

శ్లో. యామార్ధం జాజిపుష్పం వహతి పరిమళం కౌటజం యామమాత్రం।
చాంపేయం చోత్పలంచ త్రిదినమపితథాకేతకీ పంచరాత్రం।
మల్లీ పుష్పం ద్వియామం శతదళకుసుమం తత్త్రిరాత్రం ప్రసిద్ధం।
వాసంత్యాయూధికాయా సుమమపి ఘటికా పుష్పభోగ ప్రమాణం ||

తా. జాజిపువ్వువాసన అరజాము, గిరిమల్లివాసన ఒకజాము, సంపెంగలు, నల్లకలువలు వీటి పరిమళము మూడు దినములు, మొగలిపువ్వుల సౌరభ మైదుదినములు, మల్లెపుష్పముల వాసన రెండుజాములు, పద్మముల వాసన మూడుదినములు, బండి గురివిందపుష్ప మొకగడియ, ఇటులన్నిటికి ననుభవముచే తెలియవలెను.

శ్లో. జాతీత్రిదోషాన్ సకలాంగదాహాన్హరే త్సగంధాతిశయామనోజ్ఞా।
సభాగ్యకాంతాజనమోహనీయా నివారయంతీ నయనోద్ధరోగాన్ !
నవమాలికాప్రసూనం వాతామయహారి హృద్యమత్యుష్ణం।
పైత్యప్రకోపతీక్ష్ణం యామార్ధస్థాయిసౌరభ స్ఫురణం ||

తా. జాజిపుష్పము త్రిదోషహరము. సకల శరీరతాపమణచును. గంధాతిశయముచే మనోహరముగా నుండును. సౌభాగ్యకరము. కాంతాజనమోహనీయము. నేత్రరోగముల నివారించును. విరజాజియను పుష్పము వాతము పోగొట్టును. మనోహరి. పైత్యప్రకోపముచే మిక్కిలి తీక్ష్ణముచేయును. దీని పరిమళము అరజాముండును.

శ్లో. కేతక్యాః కుసుమం నిహంతిపవనం శ్లేష్మాణ మున్మీలితం।
గంధం తద్వితనోతికోపమధికం పైత్యస్య సంసేవనాత్।
కాంతానాం హృదయారవింద సుఖదా సూర్యాంశు తుల్యప్రభా।
కందర్పోత్సవకేళికంద మతులం భూపైస్సదాసేవ్యతే।
కఫవాతామయశమనం స్నిగ్ధం శిరోరోగ కండుఘ్నం।
దీపితగంధస్ఫురణం యామంశుభకారి కేతకీకుసుమం ||

తా. మొగలిపువ్వు వాతశ్లేష్మముల నడచును. దీని పరిమళమనుభవించుటవలన పైత్యమధికమగును. కాంతాజన మనోరంజనము. సూర్యుని కిరణసదృశమగు ప్రభగలది. మదనకదన కేళీకందము గావున రాజులచే నందముగ సేవించబడును. మరియును కఫరోగ, శిరోరోగ, కండూరోగ నివారణము.

శ్లో. నాత్యుష్ణగంధం సుఖమాతనోతి దృష్టిప్రసాదం వితనోతి శీఘ్రం।
శిరోభ్రమంహంతి శరీరజాడ్యం ధృతిం విధత్తే శతపత్రపుష్పం॥

తా. తామరపువ్వు తక్కువయిన ఉష్ణగంధము గలిగియుండును. సుఖమొనర్చి దృష్టిప్రసాదము కలిగించును. శిరోభ్రమయు, శరీరతాపముల నడచి ధైర్యము, స్థైర్యము కలిగించును.

శ్లో. వీర్యంచోష్ణం మల్లికాయాః ప్రసూనం బల్యం హృద్యం దృష్టి పుష్టింకరోతి।
భూయో భూయో సేవ్యమానం ప్రశస్తం నేత్రారోగ్యం రంజయేత్కేశజాలం॥

తా. మల్లెపువ్వు వీర్యవృద్ధికరము, ఉష్ణము, బలకరము, హృదయానందదాయకము, దృష్టికి పుష్టినిజేయును. మాటిమాటికిన్నీ ఈ పుష్పముల ధరించిన కేశములను రంజింపజేయును. కంటికారోగ్యమిచ్చును.

శ్లో. పాటల్యాఃకుసుమం మనోమలహరం పానీయదోషాపహం।
తృష్ణాదాహవినాశనం సుఖకరం శ్రేయస్కరం కాంతిదం।
శ్లేష్మాణం తనుతే విశిష్టమతిభిస్సంసేవ్యతే సర్వదా।
పైత్యస్యోన్నతినాశనం సురభిళంస్త్రీ సేవ్యమేతత్సదా॥
ఘనరస ఘనదోషహరం తృష్ణాదాహాస్రపిత్తరోగహరం।
స్నిగ్ధంచశీతంహృష్యం సతతోద్గంధి పాటలీపుష్పమ్॥

తా. పాటలీప్రసూనముచిత్త మాలిన్యమును, పానీయదోషములను, దాహమును పోగొట్టును. సుఖమును, తేజమును, కాంతిని కలుగజేయును. శ్లేష్మమునడచును. పైత్యోద్రేకము కలుగజేయును. బుధిమంతు లగువారిచే నీకుసుమము ధరించబడుచుండును. సౌరభముగలదిగాన స్త్రీలవశ్యము ధరించదగినది.

శ్లో. చంపకప్రసవమిష్ట సుగంధం భూసురామరమహీపతియోగ్యం।
వాతపైత్యశమనంఖలు వృష్యం స్వర్ణవర్ణమపిమట్పదఘాతి.

తా. సంపెంగపువ్వు ఇష్టమగు సుగంధముగలిగి దేవతలకు, బ్రాహ్మణులకు, రాజులకును యోగ్యము. వాత, పైత్యముల బోగొట్టును. బలకరమైనది. బంగారువంటి రంగుగలది. తుమ్మెదలజంపును. ఎనిమిది జాములు యోగ్యమగు పరిమళముగలిగియుండును.

శ్లో. సౌగంధికంహిమం స్వాదుతిక్తంనేత్ర ప్రసాదనం।
సుగంధం శ్రీకరం హృద్యంవాతఘ్నం దాహనాశనం॥

తా. కొంచెమెరుపు, తెలుపును గలిగియుండు కలువకు సౌగంధికమందురు. ఇయ్యది చలువచేయును. స్వాదు చేదైయుండును. నేత్రములకు మనోహరమైనది. సుగంధము లక్ష్మీకరమైనది. హృదయానందకరము. దాహమును, వాతమును అణచును.

(సశేషము)

గృహిణిగానుండుటే స్త్రీ ధర్మం

మహాత్మగాంధి

స్త్రీలోనున్న పిచ్చగుణములను నశింపజేయు మార్గమును దెలుపవలయునని ఒక స్త్రీ మహాత్ముని కోరగా వారీక్రింది వ్యాసమును హరిజన్‌పత్రికలో వ్రాసిరి.

స్త్రీ తన గృహిణీధర్మమును వదలిబెట్టి తుపాకి బూనవలయునని కోరుట స్త్రీ పురుషుల కిద్దరికిని నిందితార్హమైనది. ఆలోచించిచూడగా స్త్రీ పురుషులిద్దరు సమానులే. ఇద్దరిలోనున్న ఆత్మ ఒకటే? మనోభావములొకటే, జీవితమొకటే పరస్పరసహాయములేక నిద్దరును జీవయాత్ర సాగింపలేరు.

పురుషుడు తనకంటే స్త్రీ తక్కువయను అభిప్రాయములో పెంపబడి స్వేచ్ఛాధికారమును వహించుచున్నాడు. మన ఋషులుమాత్రం స్త్రీకి ఉన్నతస్థాన మొసంగిరి. కాని ఇద్దరు సమానులైనను కొన్నిధర్మములలో వారికి భేదములేకపోలేదు. ముఖ్యముగా శిశుపోషణ స్త్రీ ప్రత్యేకధర్మము. దానినివీడి పురుషునితో పాటు, గుఱ్ఱపుస్వారి, ఆయుధధారణము మొదలగు విరుద్ధప్రవృత్తులలో పాల్గొనుట యుభయులకు గర్హితాంశములే. స్త్రీ తన ధర్మమును వీడుటచే పతితురాలగును. పురుషుడు స్త్రీ ధర్మమును వీడుమనుటచే పాపియగును. ఆయుధములుబూని తన యింటిని సంరక్షించుటలో స్త్రీ కెంతధైర్యమసరమో ఇంటిని మంచి పరిస్థితిలో నుంచుకొనుటకు నంతధైర్యమవసరమైనదే. స్త్రీ పురుషులు విజ్ఞానవిచక్షణలందు సమానమైనను కార్యరంగములయందు వేర్వేరని అంగీకరించకతప్పదు.

స్త్రీ ప్రేమమూర్తి. త్యాగశీల. అహింసా స్వరూపిణి. మాతృదేవత. ఈ స్థానమును ఆక్రమింపగల శక్తిగలవారెవరు? నవమాసములు మోసి ప్రాణాంతకమైన ప్రసవవేదనకోర్చి పుత్రోదయము కాగానే తన ప్రేమరసార్ద్రదృష్టులతో నా శిశువున కభయప్రదానమొసంగి, సర్వస్వము ధారవోయునదెవరు? పురుషుని కామానల పర్జన్యమనిమాత్రమెంచక, మాతృదేవతగ, మౌనముద్రవహించిన నాయకమణిగను స్త్రీ భావించవలయును. అప్పుడే ఆమె సమర వాతావరణములోబడి శాంత్యమృతమునకై తహతహలాడు ప్రపంచమునకు శాంతిమార్గము నుపదేశింపగలదు. ఆమె సత్యాగ్రహ నాయకత్వము వహింపగలదు. దీని కక్షరజ్ఞాన మక్కరలేదు. త్యాగము, ధైర్యము, విశ్వాసము, శ్రద్ధ ఇవి ముఖ్యముగా నుండవలెను.

కొన్ని సంవత్సరములక్రింద పూనాలో సాసాను ఆసుపత్రిలో నేను జబ్బుగా నుండినప్పుడు నన్ను సంరక్షించిన ఒక దాది నాకీ క్రింది విషయము జెప్పినది.

ఒక స్త్రీ తన గర్భములోనున్న శిశువు మరణించునని మత్తుమందు తీసుకొనుట మాని దురంత బాధ నోర్చి శస్త్రచికిత్స కియ్యకొనినదట. ఆమెకు తన శిశువునందు గల ప్రేమ వర్ణనాతీతము గదా! ఆ బిడ్డను దక్కించుకొనుటకామె ఎంత కష్టమునైనా భరించినది. స్త్రీలలో నెందరో అటువంటి ధీరగుణాఢ్యులు గలరు.

ఆ ధీర రమణీమణిమాట జ్ఞాపకము వచ్చినప్పుడు స్త్రీ భాగ్యవిశేష మెంతటిదా యని నే ననుకొనువాడను. స్త్రీ పురుషజన్మకై యాశించునట్లు పురుషుడు స్త్రీజన్మ నపేక్షించవలసినదే గాని ఇది గొంతెమ్మ కోరిక. మనమేజన్మ మెత్తినను ప్రకృతిధర్మమును నెఱవేర్చుచు సార్థకము జేసుకొనెదముగాక!

'మా గృహిణి'

శ్రీమతి వట్టి శేషాంబగారు

'రాజ్యం!'

'ఆ!'

'ఏమి చేస్తున్నావు?'

'నూలు వడుకుతున్నాను' అంటూ కారపుబూంది మంచినీళ్లుతెచ్చి మేజామీద పెట్టింది రాజ్యలక్ష్మి నవ్వుతూ. నీలంపన్నె ఖద్దరుచీర, కాఫీకలరులతలతో విరిసిన ఖద్దరుజాకెట్టు, ముఖమున అరుణరేఖలుతీర్చి దిద్దిన కుంకుమబొట్టు అయిదవమాసం గర్భము మారాజ్యంకు వింత చెలువునిచ్చాయి. ఆమె సర్వాంగసౌష్ట వాన్ని విలోకిస్తూ అడిగాను—

'అయితే మా కాఫీటీలకిక నీళ్లు వదులుకోవలసినదేనా! రాజ్యం!'అని.

'అకారణంగా వదలివేయమనలేదే?'

'ఏదో తేలిగ్గా జీర్ణించేది. సరదాగా ఇదో అల్పాహారవిందు. దీనిని నిషేధంచేయకపోతేం లెద్దూ!'

'నేను రోజూ చెప్పడంలేదండీ! ఇది ముదిరిపోయిందని. మానవులను కాఫీటీలు గత ప్రాణులను చేసినవి. ఉత్సాహంగా వుంటుంది. వీటినిగురించి అట్టే పీకులాడకు.'

'తాత్కాలిక ఉత్సాహమేగాని దానిఫోర్సుకాస్తా తగ్గిపోయినతరువాత దానికి రెండింతలు నీర్సము. పాశ్చాత్యులది మిక్కిలి శీతలదేశమగుటచేత వేడివేడి కాఫీ త్రాగకపోయిన వారి పరిస్థితి బహుదుర్భరముగా నుండును. మనదేశమో వేడిదేశము. మజ్జిగే మన శీతోష్ణపరిస్థితులకు మంచిది.'

'కాఫీ టీ త్రాగుడు కూడదని మద్య నిషేధకచట్టమువలె శాసనముగాని ప్యాసుచేయిస్తారేమిటి మీ స్త్రీలు'అని నవ్వుతూ అడిగాను.

'మా స్త్రీలు అంటే మీకు హేళనగావున్నది. ఉన్నత విద్యాధికులు, వీనివల్ల సాధకబాధకములు తెలిసిన విమర్శకులు, మీరే యీమాత్రం త్యాగంచేయకపోతే ఏమీ తెలియని మూఢులు, విద్యాలేశం తెలియని ఖలులు మద్యం త్రాగుతారంటే ఆశ్చర్యమేమి?'

'ఎంతదెబ్బ తీశావ్!' రాజ్యం! మా విద్యాధికులమీద.

రాజ్యం విరగబడి నవ్వుతూ 'పాశ్చాత్యులనుండి అంటించుకున్న అంటురోగం ఇది మా స్త్రీలే వదలించాలి.' అంది. ప్రేమతో చెంపనిమురుతూ అన్నాను. 'ఇక మానివేస్తానులే' అని.

మాట్లాడుతూ కాళీచేసిన కారపుబూంది ప్లేటు తీసుకుపోతూ నేడు సుదినము. నా సాధనఫలించిన దని కాబోలు ఆమె నోటినుండి వెలువడినట్లుగా వినిపించినది.

౨

మా రాజ్యం పల్లెటూరిపిల్ల. ఆమెకు దేశాభిమానం మెండు. ప్రతివాక్కు, ప్రతిచేత దేశభక్తిపూరితమై యుండును. సహజసుందరి. సోమరితనం గిట్టదు. చక్కని సుగుణశీలము, గృహపరికరములు, ఇతర ఖర్చులు క్లుప్తపరచి కుటుంబాభివృద్ధికి పాటుపడుటయందు మా రాజ్యంను చెప్పి మరియొకరిని చెప్పవలెను.

ఆమెకు ఇదే తొలిసారికాన్పు. నేను నా జీవితంలో విచారం ఎరుగకుండా రాజ్యంతో ప్రణయ రాజ్యంలో విద్యారాజ్యంలో రాజ్యంచేసేవాడికి ఇది పెద్ద ఆఘాతంలా అడ్డు తగిలినది.

నాడు మా మామగారు మా రాజ్యంను పుట్టింటికి తీసికెళ్లుటకు వచ్చినారు. మా తల్లిదండ్రుల అను మతితో రాజ్యంను ప్రయాణముచేసినాము. వీధిలో జట్కా నిలబడినది. సామానువగయరా మా మామగారు బండిలో సర్దుతుండిరి. మందగమనమున నాతో చెప్పుటకు వచ్చినది. ఆమె ముఖములో మునపటిసంతోషం శూన్యం. పిరికిగా భయముతో బిక్కమొగముతో నా మంచంప్రక్క నిలబడినది.

'ఏం రాజ్యం ప్రయాణమయినదా ?' అని అడిగాను. రాజ్యం సిగ్గుతో తల వంచేసుకుంది.

'మాట్లాడవేమి ? రాజ్యం ?' అని మెలికపడిన లోలకు సవరిస్తూ అడిగాను.

'ఈ విచిత్ర ప్రాసాదపట్టణ విహారవీధులలో మరచిపోక త్వరత్వరగా రండి.' అని మెల్లిగా చెప్పినది.

'లేదు రాజ్యం నీవు మరపుకూడా వచ్చెదవా ?'

'మరల మీ పదపద్మముల సేవచేయ భాగ్యమబ్బునా ?'

'భయపడకు రాజ్యం మీయక్క సుశీల సుఖంగా ప్రసవించలేదూ ?'

గడ్డము పైకెత్తిచూచితిని. ఆమెకళ్లలో నీటిబింధువులు కనబడ్డాయి. నా కంతకుముందే ధైర్యము సడలిపోయినది. నాకు రాజ్యంముఖం చూడగానే కళ్లనుండి నీళ్లువచ్చినవి. నన్నునే నిందించుకుంటూ రాజ్యంను దగ్గరకు తీసుకుని భయములేదని ఊరార్చితిని. కొంతవడికి దైవనిర్ణయము ఎటులనున్నదో అని అస్పష్టముగా పలికినది.

రాజ్యంను రైలుఎక్కించి వారంగోజులలో వస్తానని చెప్పి ఇంటికి వచ్చితిని. ఇల్లు స్మశానవాటికకంటే అన్యాయంగా వున్నది. ఇల్లాలులేని ఇల్లు ఇల్లుకాదని అప్పుడు అనుకున్నాను. నిద్రలోకూడా అదే ధ్వని.

3

రాజ్యం ఆరోగ్యం ఎప్పటికప్పుడే ఉత్తరములద్వారా తెలుసుకొనేవాడిని. ఆమె నియమ నిగ్రహములు నాకే ఆశ్చర్యం గొల్పేవి. గర్భము నిలిచినప్పటినుండీ బహు తేలికపదార్థములనే భుజించేది. పండ్లు పాలు ఎక్కువగా వాడేది. బ్రహ్మచర్యదీక్షకూడా వహించినది. గర్భవతులు గమనించవలసిన విధులన్నియు తెలుసుకొనేది. చదివేది.

అది మూడుగంటలవేళ. ఆఫీసుగదిలో పత్రిక చూసుకుంటున్నాను. ఎవరో కృష్ణన్‌గారూ! కృష్ణన్ గారూ! అని పిలచినట్లయినది. అవతలికివెళ్లి చూడగా పోష్టుజవాన్ ఉత్తరము అందించినాడు. పై అడ్రసు చూచే రాజ్యం వ్రాసిందని తెలుసుకొని ఆతురతగా విప్పిచూచితిని. అందిట్లుండెను,

' మా గృ హి ణి '

సువార్త

నేను నిన్న 3 గంటలవేళ సుఖముగా ప్రసవించితిని. ఆడశిశువు గలిగినది. ఆరోగ్యముగానే యున్నాము. మీరు జాగ్రత్తగా నుండుడు. మన అల్లుని కట్నపురూపాయల విషయమై ఆలోచింపుడు. మా నాన్నగారి టరము అయినది. ఇక మీ టరము ప్రారంభమయినది. శ్రద్ధతీసుకొనుడు. మీరు ఒకసారి వచ్చి వెళ్లవలెను.

ఇట్లు,

రాజ్యలక్ష్మి.

ఉత్తరము చదివి ఆనందచకితుడనయితిని. రాజ్యం బ్రతికి బయటబడినది. భగవంతునకు అనేక కృతజ్ఞతాసూచకములైన నమస్కారములు చేసితిని. నా పెండ్లికి కట్నము 3 వేలు ఇచ్చినారు. ఇతర లాంఛనములు వేయిరూప్యములకు పైగా కోపగించే పుచ్చుకున్నాను. దానితోబాటు అత్తవారు బోల్తాకొట్టారు. ఈ విషయాలు రాజ్యం నాతో చెబుతూండేది. కాని నేనంత లక్ష్యపెట్టేవాడిని గాను. దానికి ఎత్తిపొడుపు రాజ్యం కట్నం ప్రోగుచేయడని పురిట్లోనే వ్రాసింది. ఆ మాటకు నవ్వాపుకోలేక అమాయకంగా నవ్వాను. ఉత్తరం పదేపదే చదువుకున్నాను. ఎన్నిసార్లుచదివినా తృప్తిలేదు.

౮

నేను మా యత్తవారింటికి ప్రయాణమై వెళ్లినాను. వీధిలోనే మా బావమరది మురళి బావా అక్కకి మగపిల్లవాడు పుట్టినాడని కేకలువేశాడు. నాకు ఆశ్చర్యమయినది మురళి కేకలువిని కాబోలు మా అత్తగారు నీళ్లు ఎదురుగుండా తెచ్చి కొడుకుపుట్టాడు బాబు అని మహదానందంతో అంది. రాజ్యం వ్రాసిన ఉత్తరం మాటేమిటని నే తెల్లబోయాను.

మీ మామగారు ఉత్తరం వ్రాస్తుంటే వారించి అమ్మాయే ఓపికతెచ్చుకుని వ్రాసింది. ఏమివ్రాసిందో! ఏమిటో! కోపగించుకోకు నాయనా! అని మా అత్తగారు మెల్లిగా చెప్పింది.

అప్పటికి నీళ్లు అయిపోయినవి. 2, 3 రోజులకు నెలవెళ్లిపోతుంది గాబోలును. రాజ్యం బాలింత ముసుగుతో మోమున చిరునవ్వువెలయ నడుంకట్టు సవరించుకుంటూ సర్వజనవంద్యుడు, భారతవీరుడు మన బేబీ అని నాకందించినది. రాజ్యం వ్రాసినట్లుగా ఆడపిల్లకాదు మగపిల్లవాడు. నేనవ్వాపుకోలేక పోయినాను.

'అంత సంతోషంగావుంది. కట్నపుసంచులు మావేననా ?'

'లేదు సంస్కర్తవు నీవుండగా మాకెలాగగును.'

'నేను మీ కడ్డువచ్చితినా ? మీబిడ్డ కడ్డగుటకు.'

'అదికాదు. మా యమ్మ నీయంత జ్ఞానవతికాదు. అందుచేతనే మేమిలా తయారయినాము. నీవో విజ్ఞానవతివి. మా యమ్మ తయారుచేసినట్లు తయారుచేసెదవా ?'

రాజ్యం బేబీని ఆనందపారవశ్యంతో ముద్దిడుకుంటూంటే ఇలా అనుకొనేవాడిని ఆ తన్మయతచూచి.

గురుత్రయమున తల్లికే ప్రధానస్థానమొసంగబడినది. అందరిలో నామెయే పరమగురువు. ఆదిగురువు. శిశువు గర్భస్థమైననాటినుండియు భగవానునిచే గురువుగ నిర్ణయింపబడినది. ఆమె యొసగు శిక్షణ ఏ విద్యా విద్యాలయమును, ఏ గురుకులవాసమును ఒసంగజాలదు. బాలునుయ్యేలలో పరుండబెట్టి యూచును. మృదు మధురస్వరములలో నామె పాడు జోలపాటలలో, ఎత్తిముద్దాడునపుడామె వదనసీమనుండి ప్రవహించు ప్రేమతరంగములలో, మాటలు నేర్పుటలో, చేష్టలు గరపుటలో ఆమె ప్రదర్శించు చాతుర్యమున శిశుపోషణ మున ఆమె గనబరచు ఉల్లాసమున ఎంతటి విద్యాశిక్షణమున్నదో వర్ణింప నలవిగాదు. అందువలననే మన ప్రాచీనులు గురుత్రయమున తల్లికి ప్రధానస్థానమొసంగిరి.

మా రాజ్యం ఇప్పుడు కేవలం ప్రేమమయమూర్తిగా మారిపోయినది. ఆహా! మాతృప్రేమ వర్ణింప నలవిగాదు గదా?

బేబీని నావద్దకు తీసుకువచ్చి 'ఏమండీ! ఎవరిపోలికలు ఎక్కువగా వున్నాయి' అని అడిగేది. వాడి బుద్ధిసౌందర్యంమాత్రం గాంధీ జవహరులాలును బోల్చి చెప్పి సంతోషించేది.

భారతనాయకమణే గాకుండా ప్రపంచ నాయకశిరోమణిగా తయారుచేయవలెననే ఆశయముండేది రాజ్యంకు. నిజంగా ఆమె ఇచ్చేవి పాలుకావు. పాలరూపేణ మాతృదేశభక్తి నూరిపోయుచున్నది. ఆమె ముద్దిడుట ముద్దిడుటకాదు. ముద్దిడుటద్వారా ఈశ్వరభక్తి తెల్పుచున్నది. చూపేది వాత్సల్యతకాదు వాత్సల్యత ద్వారా సర్వమానవ సౌభ్రాతృత్వము నిరూపించుచున్నది. బేబీయందు చూపే ఓపిక ఓపికకాదు. స్వార్థత్యాగము నిరూపించుచున్నది. బేబీకి చెప్పేవి మాటలుకావు. మహాపురుషుల ఆదర్శచరిత్ర బోధించు చున్నది.

౫

బాల్యములో విచక్షణశక్తి తక్కువగానుండి అనుకరణశక్తి ఎక్కువగానుండును. కాబట్టి తన్నుతాను డిసిప్లిన్ చేసుకొనలేని తల్లి తన బిడ్డలను డిసిప్లిన్‌లో పెట్టలేదు. బిడ్డలను సర్వవిధముల చిన్ననాటినుండియు నియమపటిష్ఠులనుగ జాగరూకులుగ జేయుటకు మాతృవాత్సల్యముతో విధించు డిసిప్లిన్ కాని, కేవలం రెజిమెం టేషనువంటి శాసనపూర్వకమైన మిలిటరిజముకాదు.

నేర్పింపవలసిన విషయములలో బిడ్డలకు సచ్ఛీలము, శౌచము ముఖ్యముగా చెప్పవలెను. శరీరము బట్టలు పరిశుభ్రముగా నుంచుకొనుటయు, నిత్యచర్యలు నియమానుసారముగా చేయుటయు, ఆరోగ్యానంద ములు గలిగించును. భావిజీవితమునకు ఇవియే పునాదియగును. అని బేబీనిగురించి చెప్పుతూ ఇట్టి ఉత్తమ విషయములు ఎన్నో నాతో ఏకరువు పెట్టేది.

అనుభవజ్ఞులైన డాక్టర్ల అభిప్రాయములు ఎక్కువగా తీసుకొనేది. శిశుపోషణనుగూర్చి చదివే పుస్త ములు పత్రికలు లెఖ్ఖలేవు.

మా బేబీ క్రమముగా వాక్యరచన జిలిబిలిగా చేయుచున్నాడు. ఆ భాష నాకేమీ అర్థమయేదికాదు. మా రాజ్యంమాత్రం వాడితో పసిభాషలోనే మాట్లాడేది. నే తెల్లబోయేవాడిని అర్థంకాక.

బేబీ ప్రతివస్తువు పరిశోధన నెపంమీద నానాహంగామా చేసేవాడు.

శ్రీ సరస్వతీ గాననిలయం తిరువల్లిక్కేణి

విద్యార్థినుల కోలాట ప్రదర్శనము

సరస్వతీ గాననిలయం సంగీతకళాభివృద్ధికై విశేషసేవ చేయుచున్నది. దీనిని స్థాపించినది శ్రీమతి కె. లలిత (వేణుగానము చేయుచున్నారు) హార్మోనియం వాయించువారు శ్రీమతి సరస్వతి. సహోపాధ్యాయిని.

శ్రీ సరస్వతీ గాననిలయం తిరువల్లిక్కేణి

విద్యార్థినుల నృత్య ప్రదర్శనము

ఉపాధ్యాయినిలు శ్రీమతి కె. లలితగారు, శ్రీమతి సరస్వతియు నిరుప్రక్కల నిలచియున్నారు.

' మా గృ హి ణి '

అది సాయంసమయము. రాజ్యం పెరట్లోకూర్చుని గృహలక్ష్మి చదువుచున్నది. నేను బేబీని ఎత్తుకుని చల్లగాలికి అటూ ఇటూ తిరుగుతున్నాను. బేబీ ప్రకృతిదృశ్యములు చూచి కేకలువేసి ఆడియాడి పేచీకి ప్రారంభించాడు.

'ఏం బాబూ !' అని లాలనచేసి అడిగాను.

'మాతిపూ ! మాతిపూ !' అని దక్షిణవేపు చూపిస్తూ చంకదిగిపోతున్నాడు. నాకేమీ అర్థంకాలేదు. ఎన్నిసార్లు అడిగినా అదేమాట.

నా తికమకలు చూసి రాజ్యం నవ్వుతూంది.

'ఏమిటి రాజ్యం !' అని అడిగాను.

'మాలతీపూలట. వీడి దృష్టిపథంలోకి మళ్లీ మాలతీపూలు ప్రవేశించాయి. అదిగో దిగిపోతున్నాడు' అంటూ బేబీని నడిపించుకొని మాలతీపొదవద్దకు తీసుకువెళ్లింది. బేబీ వాడి పసితనపు చపలత మానకుండా మాలతీపొద ధ్వంసంచేసేస్తున్నాడు.

'అయ్యో ! అయ్యో ! మాలతీ తీగలు తెంపేస్తున్నాడు. ఇలా తీసుకురా రాజ్యం' అని ఖంగారుతో అంటున్నాను. రాజ్యంమాత్రం వాడిని ఏమీ అనలేదు. తను వంగి మాలతీ తీగలను వాసనచూడడం ప్రారంభించిది. మా బేబీ ఆంజనేయులుకువలె ధ్వంసంచేసేవాడల్లా పోయి తానుకూడా వాసనచూడడం ప్రారభించాడు. ప్రతి చెట్టువద్దకు పోయి రాజ్యం ఈవిధంగానే చేసింది. బేబీకూడా చెట్లను అతిసున్నితంగా చుంబనంచేయడం ప్రారంభించాడు. నేచకితుణ్ణయినాను. రాజ్యం సమయానుకూలతకు శిశుపోషణాసక్తికి.

౽

'బేబీ !'

....

'వరేయ్ !'

....

'నేతిగిన్నె ఎవరు తన్నేశారూ !'

....

మా బేబీ తల్లికేకలువిని వచ్చి నావళ్లోబడ్డాడు. నేనప్పుడే సంగతంతా గ్రహించాను.

రాజ్యం మావద్దకువచ్చి బేబీని ప్రశ్నించింది. 'పారబోశావా' అని.

బేబీ నామెడ గట్టిగా కౌగలించుకున్నాడు.

బేబీని రక్షించదలచి మా బేబీ పారబోయలేదని అబద్ధమాడి భయము తీర్చబోయాను.

రాజ్యం నావంక చురచురచూచి ఒక నవ్వునవ్వింది నా అమాయకత్వానికి. బేబీనిచేరి 'బాబూ' అంటూ లాలనచేసి ఎత్తుకుని 'నేతిగిన్నె ఎవరుతన్నేశారు చెప్పునాన్నా' అని బుజ్జగించి అడిగింది. వాడిభయం పోలేదు.

'నిజం చెప్పడానికి భయమేమి బాబూ! రాత్రిచెప్పిన కథలో ఆపిల్లవాడు దొంగలకు జేబులోనున్న రూపాయలు అబద్ధమాడకుండా చెప్పలేదు బేబీ!'

వెంటనే మా బేబీ కిలకిలనవ్వుతూ 'నేనే తన్నేశానమ్మా' అని చెప్పినాడు.

బేబీ సత్యం చెప్పినందుకు రాజ్యం సంతోషించి 'సత్యమేచెప్పు బాబూ!' అని బుజ్జగించి ఒక నారింజ తొన బహుమానంగా ఇచ్చి తిరిగి తనపనిలో లీనమయినది.

రాజ్యం సత్యంచెప్పించడంయొక్క చాతుర్యంచూచి నే చకితుణ్ణయినాను. ఇంకొక తల్లయితే బాదేసి వాడి జీవితంలో ఇక ఎన్నడూ సత్యంచెప్పకుండా చేసును అని అప్పుడు అనుకున్నా!

అప్పటినుండీ మా బేబీ ఎంతప్రమాదమైననూ సత్యమేచెబుతాడు. ఒక సత్యమేగాదు వాడు అన్నివిధాలా ఆదర్శప్రాయుడుగానేయున్నాడు.

మా పెరట్లో మొక్కలకన్నిటికీ రాజ్యం బేబీ నీళ్లుపోసేవారు. నౌఖరుపోస్తాడు పిల్లవాణ్ణి ఏంకష్టపెట్టి స్తావు, అని అనేవాడిని. వెంటనే విక్టోరియామహారాణి బిడ్డలయొక్క పెంపకంశిక్షణ ఏకరువుపెట్టేది. ఇప్పటి యువకులు శరీరకష్టమునకు ఇష్టపడకపోవుటచేత సోమరితనం బలిసియున్నది. అందుచేత శరీరపరిశ్రమ నిరాడంబరజీవితము చిన్నప్పటినుండియు బిడ్డలకు నేర్పాలి. పనిచేస్తే తప్పు అనేపంథాలో తయారుచేయగూడదు అని చెప్పేది. బేబీ నియమబద్ధత, సుగుణశీలము, దేశభక్తి నన్ను ముగ్ధుణ్ణిచేసేవి. నిండా అయిదు సంపత్సరములు లేవు.

బేబీ కథలంటే చెవికోసుకుంటాడు. రాజ్యం ఎప్పుడూ సుప్రసిద్ధనాయకులచరిత్రలు చెబుతూండేది. రాజ్యం కథలుచెబుతూంటే నే చిన్నప్పుడు చదివినచరిత్రలో మహారాష్ట్రవీరుడు శివాజీజనని జీజీబాయి జ్ఞాపకంవచ్చేది. గాంధీకథ వాడికి కరతలామలకమే.

మా బేబీని చూచీ చూడ్డంతోడనే ఎవరైనాసరే 'ముందుముందు చాలా అభివృద్ధికి వస్తాడు' అని చెబుతారు.

స్త్రీలు గృహలక్ష్ములు. ఇంటియందు అధికారము, నిరంకుశము, పిల్లలనుపెంచుట, వారికి విద్యాబుద్ధులు గరపుట, ఆహారనిర్మాణము, గృహారామపాలనము, గృహ నవుఖరులమీద యధికారము, కుటుంబమునకు కావలసిన దుస్తులు, నిర్మాణము మొదలగు సమస్తవిషయములు స్త్రీలచేతియందే గలవు. దేశీయభాగ్యోదయమునకు కారణమగు ఖద్దరుధారణము, జాతీయధర్మపరిపాలన, వీరమాతృత్వము స్త్రీలయందు మూర్తీభవింపవలెను. భర్తను, బిడ్డలను సన్మార్గమునబెట్టుటకు స్త్రీలకు శక్తిసామర్థ్యములు గలవు. ఖడ్గతిక్కనయుదంతము మనమెరుంగనిదా? కాదు. యుద్ధమున వెన్నిచ్చి పారివచ్చిన ఖడ్గతిక్కనకు అతని భార్యాతల్లులు స్నానమునకు నీరు పసుపుయుండలునుంచి నులకమంచము అడ్డుపెట్టగా తిక్కన విచారించుచుండ వారలు, 'ముగురాడవారమైతిమి. వగపేటికి జలకమాడవచ్చినవేళన్' అని దోనాడి తిరిగి యుద్ధమునకు పురికొల్పిపంప లేదా? దేశభావిభాగ్యోదయము స్త్రీలపై నాధారపడియున్నదనుటకు సందియములేదు.

మా బేబీ అభివృద్ధికి నా దురభ్యాసముల దిద్దుబాటుకి 'మా గృహిణి' చాతుర్యమంటే ఎవరైనా ఆక్షేపణచేస్తారా?

దాంపత్యము

శ్రీ జానకీరాంగారు

హిందూమతమునందు వివాహమొక సంస్కారము. అది తీరినపిదప స్త్రీ పురుషులు దంపతులని వ్యవహరింపబడెదరు. దాంపత్య బంధ మేర్పడిన పిమ్మట వారలేకశరీరు లగుదురు. దంపతులు సంసారశకటమునకు రెండు చక్రములు. ధర్మమను బరువును ఆ బండియందిడి, ప్రేమయను మార్గమున, శాంతి సంతోషములనెడి నెద్దులబూన్చి వారు లాగుకొనిపోవుచుందురు. అందువలననే సమస్తాశ్రమములకన్న గృహస్తాశ్రమము సర్వ శ్రేష్ఠమనబడుచున్నది. ప్రపంచమందలి యుత్పత్తి, వృద్ధి, యతిశయములకీ యాశ్రమము క్షేత్రమైయున్నది. స్వర్గమునందుండు దేవతలుగూడ గృహస్తాశ్రమ స్వీకారమున కభిల షించుచుందురు. అయితే ఇట్టి ఆనందదాయకమగు గృహస్తాశ్రమము అకళంకమగు దాంపత్యమునందే ఒడిదుడుకులు లేకుండ సాగుచుండును. దానియందే స్వర్గీయానందము లభించును. ఎన్ని భయంకర విఘాతములు గల్గినను ఆ దంపతులు స్థైర్యమువహించి యానందమున వాటిని యెదుర్కొని విజయమునందుచుందురు. కాని నేటికాలమున ప్రపంచసాగరమునందు వేసారి వెదకిచూచిన ఏకొద్దిమందియో యిట్టి సుఖమయ జీవితము గడుపు దంపతులు కాననగుచున్నారు. తక్కుంగలవారు తమ దౌర్భాగ్యములకొఱకై దుఃఖించుచు యమయాతనల ననుభవించుచున్నారు. ఈ వేదనాప్రపూర్ణమగు జీవితములకు మూలకందకము అననుకూల వివాహములు !!

సుఖదాంపత్య వృక్షమును నాశనముచేయుటకీ వికట వివాహములు వేరుపురుగులై యున్నవి. బయటకుమాత్రమీ వివాహసంస్కారము శాస్త్రోక్తముగ జరుగుచున్నది. కాని లోలోపల అన్యసంస్కారములకుంబలె పవిత్రమగు నీ సంస్కారముగూడ నిర్జీవమై పోవుచున్నది.

హిందువులయందు వివాహబంధనము ఆజన్మ బంధనమైయున్నది. ఒకసారి యిందు బంధింపబడువారు మరల దానిని త్రెంచుకొనజాలరు. అందువలన నిట్టి పవిత్రబంధమునకు పూర్వము స్త్రీ పురుషుల యోగ్యతలు, మనోభావములు, స్వభావములు, రూపసంపదలు, వయసులు, సరిజూచుకొనుట శ్రేయస్కరము. కాని యధికముగ నేమి జరుగుచున్నది? ధనగ్రహణపారీణులై కొందఱు తమ పాలపాపలను కాటికి కాళ్లు చాచుకొను వృద్ధుల కంటగట్టుచున్నారు. కొందఱు దగ్గరసంబంధము లాలోచించి వయోభేదముల సరకు

గానక పండ్లుమొలవక పూర్వమే పెండ్లిండ్లుచేయుచున్నారు. వేరు కొందఱు మేడిపండు వంటి పై యాకారములకు భ్రమసి తమ బాలబాలికలకు తెగనికత్తులతో గొంతుకోయుచున్నారు. ఇక వరుఁడు తెల్లనివాఁడైన వధువు నల్లనిది. కన్య మేలిమిబంగారు ఛాయమైన కుబ్జవాఁడు కాటుకనలుపు. యువకుఁడు బి.ఏ. అయిన యువతి నిరక్షరకుక్షి. యువతి బి.ఏ. అయిన యువకుఁడు మెట్రిక్యులేషన్ మూఁడుదండయాత్రలు. భర్త నవనాగరికుఁడైన, భార్య పూర్వాచార పరాయణ. భార్య పాశ్చాత్య వేషాచారియైన భర్త పల్లెటూరి రైతు. మగవాఁడు సంఘసంస్కర్తయైన ఆడుది మూఢాచారవర్తిని. ఆడుది సంస్కారిణియైన మగవాఁడు సనాతనమూర్తి. స్త్రీ ఆరోగ్యవతియైన పురుషుఁడు రోగగ్రస్థుఁడు. పురుషుఁడు బలసంపన్నుఁడైన స్త్రీ వ్యాధిభూయిష్ఠ—ఇంక నెన్నియో వ్యతిరేకము లీ వధూవరులయందున్నవి. అట్టిచో దాంపత్యపదమున కున్నతస్థానమెట్లు లభింపగలదు?

ప్రస్తుత వివాహములందలి సర్వాధికారములు అభిభావుకులయందున్నవి. వారలు తమ యిచ్చవచ్చినరీతిని జరుపవలసినదే కాని వరుఁడైన లేక వధువుయైన తమ యభీష్టములదెల్ప నర్హులుగారు! తుదకు పల్లెత్తి యొకమాటకూడ నాడవలనుపడదు. సాహసించి యెవరేని యాడిరేని, పలువుర యాగ్రహమునకు నోనాడికలకు గుఱియైపోవుదురు. ఆ యభిభావుకుల యెదుట నా కన్యావరులు యజ్ఞపశువులై వివాహవేదికలకు బలియగుచుందురు. దంపతుల భవిష్యజ్జీవన సూత్రములు పండితవర్యుల పంచాగములందు నల్లిబిల్లిగ జిక్కుకొనియుండును. ఆ చిక్కుల విడదీసి యా సూత్రముల సరిగావించుట కేరును బ్రయత్నింపరు. వివాహకర్తలు ఏదియో యొకవిధమున తమ కర్తవ్యభారమును దించుకొని చులకన గావించుకొనియెదరు కాని కలకాలము బ్రదుకవలసిన బ్రతుకులయందలి బాగోగులు లేశమాత్రమును గమనింపరు. అట్టియెడ వర్తమానకాలమున పవిత్రవంతమగు దాంపత్యపదము ప్రజలయం దేరీతిని యుచ్ఛస్థితి బొందగలదు?

కావున భావిభారత భాగ్యోన్నతి గోరు ప్రతిజీవియు, దన కర్తవ్యమును బాగుగ నధ్యయనము గావించుకొని, విషమ వివాహములకు దావునీయక, బాల్యవివాహముల బూర్తిగ విరమించి, దాంపత్య వృక్షమునకు నుదారభావ దోహదములచే బెంపొందించి, పుష్పఫలవంతముగాజేయ సంసిద్ధులైయుండవలెను.

కర్ణుఁడు

శ్రీ ఆకుండి వెంకటేశ్వరరావుగారు

భారతములోని కర్ణుఁడు దుష్టుఁడనియు, శకుని, దుర్యోధన, దుశ్శాసనులతో కలిపి దుష్టచతుష్టయమనియు వర్ణించుట లోకసామాన్యమైయున్నది. ఇట్టి యభిప్రాయము కేవల విమర్శనాదృష్టి లోపమైన సత్యవిరుద్ధమని తోచుచున్నది.

ఎవ్వనినైన 'దుష్టుఁడు' అని పేర్కొనుట కాతని జన్మప్రకారముగాని, స్వాభావికగుణంబులుగాని, సంభాషణాదులుగాని, కారణభూతములైయుండవలయును. కాని కర్ణుని జీవితమంతయు జక్కగ పరిశీలించినచో నాతనియందేవిధమైన దుష్టత్వమును గాన్పింపదు. జన్మప్రకారంబును, వంశమునుబట్టి దుష్టుఁడందుమా; మహోత్కృష్టమై, యసమాన యశోవంతమైన భరతవంశమునందు, లోకబాంధవుడగు సూర్యభగవానుని వరప్రసాదంబున కుంతీదేవియందు సహజ కవచకుండల భూషితుఁడై, నిరుపమాన తేజోమూర్తియై జన్మించిన కర్ణుఁడెన్నటికిని దుష్టవంశజాతుఁడు కాడనియు, మరియు దేవాంశసంభూతుఁడనియు తెలియుచున్నది. సూతవంశజుఁడనియు, సూతనందనుఁడనియు పేర్కొనబడిననూ, యందలి నిజానిజంబు లెల్లరెఱింగినదే! కనుక జన్మ, వంశప్రకారంబునుబట్టి కర్ణుఁడు దుష్టుఁడు కాడనియే నిర్ధారణచేయవచ్చును.

స్వాభావికగుణంబులబట్టియైనను, కర్ణుని దుష్టుఁడనియు, దుష్టచతుష్టయములో నొకడనియు ననుట కడుంగడు సాహసమనియే భావింపవచ్చును. కనుక నాతనిస్వభావమెట్టిదో కొంచెమాలోచింపవలయును.... ఇంద్రుఁడు బ్రాహ్మణవేషధారియై, కర్ణుని కవచకుండలంబు లపహరింప దలంచుటెఱింగిన సూర్యుఁడు బ్రాహ్మణవేషధారియై కర్ణునియొద్దకుం బోయి యింద్రుని వంచనప్రకారం బెఱుంగ జెప్పి, కవచకుండలమహిమ:

చ॥ "అమృతమయంబు సువ్వె సుగుణాకర యమ్మహనీయవస్తు యు
గ్మము నివి యుండునేని త్రిజగంబులయందు నశేషశత్రులో
కమునకు నీవు వధ్యుఁడవుగావు నిరంతరమైన సాంద్రమో
దమున నెలింగెదీవు విహితంబుగ జెప్పితి మోసపోకుమీ."

అని వివర్ణించి, యట్టి కవచకుండలంబుల నింద్రునకీ వలదని బోధించెను. దానికి కర్ణుఁడు సూర్యభగవానునితో జెప్పిన సమాధానము జూడుడు.

ఉ॥ "భూసురకోటి వేడుటయు బోడిగ బ్రాణములైన నీగి నా
బాసది నేశ! లోకమున బ్రస్ఫుటమింతయు నట్లుగావునన్
వాసవుడట్టె నన్నడుగవచ్చు బ్రియంపడి, నాకు నొక్క బ్రా
తేసురలోకవందిత! మదిం కవచంబును కుండలంబులున్."

కం॥ "జగముల నెల్లనునిండిన బొగడిత కడు వెలితిసేసి పొల్లగ్గొడలికై
తగవే జన్మవ్రతమిటు దిగవిడువగ నేడు నాకు ద్రిభువనదీపా."

అనియు, తనకు శరణాగతరక్షణమును, దీనపోషణయు నిత్యవ్రతములనియు, 'కీర్తితో మెలగంగ జావువచ్చె

సేనియు జత్తు' ననియు, నఖండ మహిమాస్పదుఁడగు నాఖండలుఁడు వేడవచ్చిన, 'తదీయకీర్తియ సుస్థిరుండిందుం ద్రిలోకీ సమున్నతమై యొప్పు' ననియు ప్రత్యుత్తరమొసంగి, తుదకు తత్కవచకుండలముల నింద్రునకు దానమొసంగుటయు నెల్లరెఱింగినవిషయమే! దీనినింబట్టి కర్ణుఁడు మహాదానధర్మతత్పరుండనియు, ఆశ్రిత రక్షణాసక్తియుక్తుండనియు, బ్రాహ్మణ పూజాతత్పరుండనియు తెల్లమగుచున్నది. కర్ణుఁడు దుష్టుడే యైనచో, తనకు రానున్న వంచనక్రమంబెఱింగి కోపించుటయే గాక, వంచకుండైన బ్రాహ్మణవేషధారియగు నింద్రుని శిక్షించియే యుండును. అట్లొనర్పకుండుటే కర్ణుని సజ్జనత్వమునకు నిదర్శనమగుచున్నది.

మరియు నాతడు ప్రభు భక్తిపరాయణుండనియు, ప్రభు కల్యాణమునకై నిజప్రాణములనైన నర్పింప సాహసించిన నిజమగు మిత్రుఁడనియు కర్ణుని చర్యలే చెప్పుచున్నవి. తొలుదొల్తనుండియు కర్ణుఁడు దుర్యోధను నాశ్రయించి, యాతని దయాప్రసాదములచేతనే జీవించి, ప్రభునకై ప్రాణములర్పించెను. దుర్యోధనుఁ డాతని యస్త్రవిద్యానైపుణ్యమును, బాహుబలము నెఱింగి, కర్ణునత్యాదరముగ జూచి యాతని తన ముఖ్యస్నేహితునిగా నొనర్చుకొని యంగరాజ్యాభిషిక్తునిఁజేసి గౌరవించెను. కావున కర్ణుఁడు దుర్యోధనునకు సామంతుఁడు గాని స్వతంత్రుఁడు గాడు. అట్టియెడ కర్ణుఁడెప్పుడును ప్రభువైన దుర్యోధన మానసానుకూలవర్తనుఁడై యుండవలయునే గాని స్వతంత్రించుటకు వీలులేదు. కనుక ప్రభు భక్తిపరాయణుండై సర్వవిధముల దుర్యోధనున కనుకూలవర్తనుఁడై తన సర్వస్వమును దుర్యోధనునకై యర్పించుట కర్ణుని విధి. కనుకనే స్వబలంబును బాగు నెరింగిన కర్ణుఁడు యుద్ధవిషయంబులందుగూడ ప్రభువగు దుర్యోధనునకు ధైర్యోత్సాహములు కలిగించి పురికొల్పెను. అదియునుగాక కర్ణునకు, అర్జునునోడించి కీర్తిగడింప నెక్కుడుత్సాహముండుటచేత నెల్లప్పుడు నర్జునునితోడి యుద్ధంబున కెదురుచూచుచుండెడివాఁడు. దుర్యోధనుడొనర్చునది యధర్మమని కర్ణుఁడెఱింగియు నేమిచేయగలఁడు? అన్యాయమని యెఱింగిన భీష్మ, ద్రోణులేమిచేయగలిగిరి? కాని భీష్మాదులట్లుగాక కర్ణుఁడు నిష్కలుషితబుద్ధియై, తన నిజశక్తిసామర్థ్యంబుల ధారవోసి, ధర్మయుద్ధమొనర్చి, కృష్ణుని, జిష్ణుని గూడ వెరపొందజేసి, కడకు కృష్ణుని మాయోపాయముచే వీరస్వర్గమలంకరించిన శూరశిఖామణి. కర్ణుని పరాజయమునకై భీష్ముండును, కృష్ణుండునుగూడ చమత్కారమగు నుపాయముల బన్నిరి. వీరిరువురునుగూడ నైకి యుభయపక్షములకు శ్రేయోభిలాషులైనట్లగుపడియు లోన నెప్పుడును కర్ణుని పరాజయమునే కోరుచుండిరి.

యుద్ధమునకు పూర్వము, కర్ణుని శక్తిసామర్థ్యంబు లెఱింగిన కృష్ణుఁడు, తన సహజ వాక్యశక్తి నుపయోగించి, కర్ణుని రహస్యంబుగ బిలచి, యతని రహస్య జన్మప్రకారమెఱింగించుట, కర్ణుని మనమును వికలత్వమొందించి, యుద్ధమునందశక్తునిజేయుటకేగాని, నిజముగ కర్ణుని పాండవులపక్షమునకు ద్రిప్పుటకు కాదు. అట్టి యతని యుక్తియు సఫలత్వమునొందుట, కర్ణార్జునుల యుద్ధక్రమంబునుబట్టి యూహింపవచ్చును. భీష్ముండును నిట్టి యుపాయమునే బన్నినట్లు స్పష్టము. లేనిచో, అంతకాలమును రహస్యముగ నుంచిన కర్ణుని జన్మప్రకారమును, కర్ణుడు యుద్ధంబునకు ప్రవేశించునప్పుడే యేల చెప్పవలయును? అదియుఁగాక శ్రీ కృష్ణుఁడు కర్ణునకు లంచముగూడ జవిజూపెను. రాయబారమునుండి తిరిగి పోవుచు కర్ణునిఁ బిలచి.

సీ॥ "..ధర్మతనయు
డాదిగాగల తమ్ములందఱు సాచేత నెఱేఁగి నీయడుగులకెరగి సకల
ఆ॥ పుత్ర మిత్ర బంధు భూరిసేనాసమన్వితముగాగ గొలిచినిన్ను రాజ్య
భారవహనమునకు బట్టంబుగట్టు నుజ్వలుడవగుదురమ్మ వారికడకు."

అని యనేకవిధంబుల కపటంబుగ బల్కినను కర్ణుఁడు లోబడెనా? దుష్టుఁడైనచో తత్క్షణము సామ్రాజ్యాభిలాషియై కృష్ణుని వచనంబుల కొడఁబడియేయుండును. కాని కర్ణుఁడు తానంతయు నెఱుంగుదుననియు,

ఉ॥ "సూతసుతుండు వీడనక సూనుల తమ్ములకంటె నాకు సం
ప్రీతియొనర్చి తేజమును బెంపును నాదెస నాడు నాటికి
మైత్రి తనరార నన్ను దనయంతటి మానిసి జేసియుండునే
నేతగ వేదియా కురుకులేశ్వరు బాయుదు ముట్టవచ్చినన్."

క॥ "నను నయ్యర్జునునకు నెదురని పెద్దయు నమ్మియుండు నక్కట దుర్యో
ధనుఁడా నమ్మకవమ్ముగ జనునే పాండవులగలయ జననా కనఘా!"

యనియు సమాధానమొసంగి తన నిశ్చితాభిప్రాయమెఱింగించెను. మరియు కర్ణుఁడు గీ॥ "ధర్మతనయుండు తాను నాతమ్ముఁడగుటయెఱింగెనేనియు సామ్రాజ్యమేల బూనునట్టి ధార్మికుఁడాధిపత్యంబు సేయవలదె శాశ్వతమైయుండ వసుధకెల్ల" అని కృష్ణునకు వచించి తమ సంభాషణాక్రమమును రహస్యముగా నుంచ ప్రార్థించెను. ఈ వచనంబులందే కృష్ణుని పన్నాగమంతయు నెరవేరినట్లు తెలియుచున్నది. దీనినిబట్టి ధర్మతనయుని ధర్మతత్పరతయు, నాతని సామర్థ్యమును కర్ణుఁడెఱుంగుననియు, నెఱింగియు వారి పక్షమవలంబింపకుండుటకు కర్ణునావేసించిన ప్రభు భక్తిపరాయణత్వమును, ధర్మబుద్ధియే కారణములని స్పష్టపడుచున్నది. మరియు భీష్ముఁడు శరతల్పగతుండై యుండగ, కర్ణుఁడాతనికి బ్రణమిల్లి,

ఉ॥ "వారు మహాబలుల్ హరియు వారికి బ్రాపుగలండు వారలం
బోర జయింపరామియును బుద్ధినెఱుంగుదునైన గౌరవ
క్ష్మారమణుండు సేయు తగు మన్ననలెల్లదలంచి చూచినన్
భూరివివేక! యేవిడిచిపోవుట ధర్మమె వీరకర్మమే."

శా॥ "దైవాధీనము సర్వమున్ మనమతిందప్పింపగా వచ్చునే
నీవింకన్ ననునొండు వల్కక వరానీకంబుపై బంపుమ
త్సేవాధర్మము నిర్వహించెద బలోత్సేకంబు లోకంబు సం
భావింపన్ విహరించెదన్ మురరిపుం బార్థుం దలంకించెదన్."

అని సవినయముగా బల్కిన వాటినిబట్టి, కర్ణుని ధర్మాధర్మగ్రహణంబును, బలాబల తారతమ్య పరిశీలనయు, మీదుమిక్కిలి హరి నెదుర్కొన సమకట్టు ధైర్యసాహససంపత్తియు సుబోధమగుచున్నవి. అదియునుగాక పై సంభాషణాక్రమమునుబట్టి పెద్దలందు కర్ణునికి గల భక్తి నమ్రత్వములుగూడ తెలియుచున్నవి. కనుక నెన్ని విధుల నాలోచించినను కర్ణునియందు స్వామిభక్తియు, ధర్మాధర్మ విచక్షణతయు, శౌర్యధైర్యములును, ఆర్యపూజ మొదలగు సద్గుణములే గన్పట్టుచున్నవి గాని, దుష్టునకుండవలసిన గుణములేమియు గాన్పించుటలేదు.

బాషణంబులందున నెందైన దుష్టత్వమున్నదేమో యాలోచింతము. కపట ద్యూతానంతరము, ద్రౌపదిని సభకీడ్చుకొని వచ్చినపుడు కర్ణునిపల్కులాకించుక దుష్టములని యూహింపవలసియున్నవే కాని, దీర్ఘముగ పరిశీలించినచో నవి దుష్టములు కావనియు సమంజసములేయనియు తెలియగలదు. సేవాధర్మపరుండైనవా

డెల్లప్పుడును సమయానుసరణంబుగ ప్రభున కానంద మొనగూర్చి తత్కృప సంపాదించుటకై పలుభంగుల ప్రయత్నించుట నైజమైయున్నది. దుర్యోధనుని మానసమునకు ప్రతికూలముగానున్న వికర్ణుని ధర్మ నిర్ణయమును కర్ణుఁడు ప్రత్యాఖ్యాన మొనర్చుట, దుర్యోధనుని మానసమునకు ప్రీతి యొనర్చుటకొరకేగాని, యందలి ధర్మాధర్మము లెఱుంగక కాదు. వికర్ణుని నధిక్షేపించుటయు సమంజసమే. ఏలనన సకలాగమ వేదులును, నిఖిలధర్మాధర్మ పారంగతులునైన, భీష్మ, ద్రోణ, విదురాదులున్న సభయందు, వారు పలుక సందేహించు విషయమునుగూర్చి వారలకంటె పిన్నవాడొకఁడు ఖండితముగ నుపన్యసించుట, పెద్దలందరను ధిక్కరించుట గాని మర్యాద లక్షణమగునా? మరియు కర్ణుఁడుపల్కిన 'బంధకి' మొదలగునవి ద్రౌపదియొక్క బహుభర్తృకత్వమునకు కారణమును, ఆమె జన్మవిశేషములు నెఱింగిన భీష్మాది మహాత్ములచేమాత్రము పరుషములుగ గ్రహింపబడును గాని, యా రహస్యములెఱుంగని కర్ణాదుల మానసంబుల కవి ధర్మములేయగును. అంతేకమున్నెప్పుడును బహు భర్తృకలగు పతివ్రతలకు పట్టకుండుటచేతను, ద్రౌపది దుర్యోధనునిచే గెల్వబడిన దాసురాలైయుండుటచేతను, అట్లు దాసురాండ్రైన బహు భర్తృకలగు బంధకులను రాజ సభాంతరంగములందున వినోదలీలలకు నియమించెడి యాచార మాకాలంబున నుండుటచేతను, కర్ణుఁడట్లు పలికియుండుట న్యాయమేయగును.

మరియు భీష్ముఁడు కర్ణునర్ధరథుఁడని నిందించినపుడు

గీ. "సురనదీపుత్ర వినునాకు జూడనర్ధ
రథుడవగుదీవులావు బీరంబునరయ"

చ. "హితుఁడని నమ్మగాదగునె యీతని........."

ఉ. "దుర్జనుఁడైన శాంతనవు దోర్బలమేటికి........"

అని యెదిర్చి పల్కుటయు ధర్మమే. ఎట్టి మహాత్ముఁడైనను ప్రభు గౌరవాదరములకు పాత్రుఁడైన కర్ణుని, నిండు సభామధ్యమున నవమానించినపుడు, పౌరుషవంతుఁడును, వీరాగ్రేసరుఁడును నగు కర్ణుఁడెట్లు సహింపగలఁడు? కనుక నిట్టి తృణీకారము లింక నెందైననున్నను నవి తాత్కాలికావమానోద్భూతములును, వీరావేశభాషితములునే కాని, భీష్మాదులందుగల నిజమగు తృణీకారభావముచే గాదని, వ. "గాంగేయ కుంభసంభవులంతటి వారలు రిత్తసావుసత్తురే" సీ. "ద్రోణుఁడు బహుదివ్యబాణదీప్తుఁడు భుజాబలశాలి శౌర్యసంపన్నహృదయు దక్షిణ విక్రముఁడతి రథశ్రేష్ఠుఁడు"అని యనేకప్రకారంబులచే భూషించుటచే స్పష్టమగును.

దుర్యోధనుఁడొనర్చు కార్యములన్నియు ధర్మములైనను, యధర్మములైనను, కర్ణుఁడందు పాల్గొనుట, దుర్యోధనుని యందుగల ప్రభుభక్తిచేతను, సేవాధర్మ విధిప్రకారము చేతనేగాని, యందలి నిర్దుష్టత్వమేమియు గాన్పింపదు. ధృతరాష్ట్రాజ్ఞానువర్తియై, కపటద్యూతమునకు ధర్మరాజాదుల దోడ్కొనివచ్చుటకు విదురుఁడేగు టెంతటి దౌష్ట్యమో, దుర్యోధనుని కుట్రలందు కర్ణుని ప్రవేశమును నట్టిదియే.

కావున నేవిధమునుబట్టి జూచినను కర్ణునియందు దుష్టగుణంబులేవియు గాన్పింపకపోవుటయేగాక యాతని ధర్మకర్మలును, వీరకర్మలును, ప్రభుపరాయణత్వమును, బుధ పూజయు మొదలగు సుగుణములే గానవచ్చుచున్నవి. దీన పోషణాసక్తియు, ధర్మగుణానురక్తియు, శస్త్రాస్త్రయుక్తియు, మహాత్ములందు భక్తియు, ప్రభుగుణానువర్తనాశక్తియు, గాక సత్పురుషుండగు క్షత్రియునకుండవలసిన ధర్మములేవి? ఇట్టి సకలసద్గుణరాసియగు కర్ణుఁడు దుష్టచతుష్టయములో నొకఁడగునా?

స్త్రీ స్వాతంత్ర్యము

కవితిలక, కవితావిశారద, శ్రీమతి కాంచనపల్లి కనకమ్మగారు

క. స్వాతంత్ర్యంబన నెయ్యది ఖ్యాతిగ బురుషులును స్త్రీలు గాంక్షింతురు ము
న్నే తెలుగు దాని కిపుడెది భూతలమునఁ గలిగె వివరముగ రూపింతున్.

గీ. స్వపదమారయ బ్రహ్మవాచకమటంచు తత్త్వవేత్తలు పల్క స్వాతంత్ర్యమనఁగ
బ్రహ్మభావంబహో దానిఁ బడయువారు ధర స్వతంత్రులనఁగఁ జెప్పఁదగినవారు.

గీ. బమ్మ బొమ్మలఁజేయంగవలసె కలువఱేఁడు, తమ్ములఱేఁడును రేలు పవలు
వేళతప్పక వినువీధి వెడలవలసె బన్నములు పదిపడి హరి బడలవలసె.

గీ. ఆయవారంపు పునుక దిగంబరంబు పాపపేరులు సామేనఁ బడతిఁదాల్చి
కొండకోనల బూచులపిండుతోడ నుండవలసెనుగాదె మృత్యుంజయుండు.

గీ. కర్మతంత్రంబునందు జగంబుదగుల నెవనికున్నది స్వాతంత్ర్యమించుకేని
నలుఁడు రాముఁడు వసుదేవనందనుండు తాము తమవారుఁ జింతలఁ దగులుకొనరె.

గీ భరతఖండంబునందునఁ బ్రజలుబక్క జిక్కియుండంగ నిట్లుండిరొక్కొ యితర
దేశములను స్వతంత్రులై లేశమేని కొఱతలేకుండ నున్నారొకో యరయఁగ.

గీ. సీత ద్రోవది దమయంతి శీలవతులు నరయ సులభయుమీర వెంగమ్మ నేయి
పాలుద్రావిరే పండిరే పూలలోన నింతులెంతటివారయ్య నేమిగారు.

గీ. వేదశాస్త్రిల నమ్మచు విభులఁగొలిచి భారతాంగనలిట్టులఁ బడిరె చెడిరె
యత్తమామల గురువుల నరయకుంట లాతిసీమల నతుల విభూతిగనిరె.

గీ. అతిథి యభ్యాగతియును గృహంబు గురువులనక దిరిగెడివారు భాగ్యంబుగనిరె
సతులు పతిదైవతంబులు సచ్చరిత్ర లిలనుజెడిపోయిరే పెరలెలమిఁగనిరె.

గీ. ఎవరిధర్మంబు వారికి నెక్కుడగుట నొకరి కృత్యంబు లొకరుచేయుటయుఁ దగదు
చిన్నబుద్ధులు మనవౌట శ్రేయమెదియొ హేయమెద్దియొ వేదంబులే వచించె.

గీ. వేదశాస్త్రిల గురువుల వెట్టివాండ్రు నమ్మినారను! వానిఁబోనాడి యాడి
స్వైరమార్గంబులందుఁ బాచ్చాత్యులేమి వారుకున్నారొ తగదె నేఁడారయంగ.

గీ. ఎవరిలోపంబు వారికే యెఱుగరాదు పరులు దెలిపినయందాక గురులు వేద
ములునెఱిగి కాదొకొ ధర్మములు వచించు నాదిమధ్యాంతముల జనుండరయఁగలఁడె!

గీ. లాభమనిచేసి నష్టంబులను గణించి మాను మానవుడు పశుసమానుడనిరి
శంకరులు మున్ను సూత్రభాష్యమున బుధుఁడు ధర్మమనిచేయు మాను నధర్మమనుచు.

గీ. పుణ్యమని దుర్ఘటంబులు పూనిచేసి రఘమని త్యజించిరెట్టి మోహములనేని
పాపమని పుణ్యమని భగవంతుఁడనుచు బ్రతికి తరియించి గూర్చిరి భద్రమిలకు.

గీ. వేదమనుమాటలేనట్టి వెంగలులకు పాపమనుమాటలేనట్టి పామరులకు
దేవుఁడనుమాటలేనట్టి తెంపరులకు నాచరింపంగరాని కృత్యంబుకలదె!

గీ. అర్థకామంబులకునై యహంకరించి గ్రామసింహంబులట్లు సంగ్రామములొగి
సలుపుచున్నారలకట! పాశ్చాత్యులిప్డు డార్థరక్షణకై చేయ రాహవములు.

గీ. ధర్మమన్నదిలేనిచో ధరణి హద్దుపద్దులెటులుండు నెవనికి బలముకలుగు
నర్థకామంబులాతఁడే యనుభవించు నియమములుపోవఁ జెడునుబో నీతిజాతి.

గీ. ధీరులై కూల్చుచున్నారు దేవళముల జందెములదీయుచున్నారు సాహసమున
కాపురముమాని విడివిడిగా జరింతు రడ్డములుద్రోసి కుడిచెదరన్నికూళ్లు.

గీ. దేవుఁడొనరించునవి కొన్ని తెలివిమాలి మనము కావించునవి కొన్ని మనలఁజెఱుచు
శాసనంబులు గొన్నింటి సాహసంబులన్ని చెఱుపంగ మర్యాదలన్నియుఁజెడె.

గీ. సహగమనముల సల్పిరి సన్యసించి నియమమున నింటగాలంబు నెట్టిరబల
లయ్యు పతిదైవతములు గార్హస్త్యవిధుల నిర్వహించిరి ధర్మంబు నిలిపినారు.

గీ. ఎఱిఁగిచెప్పిన నామాట లింతులార వీనులొగ్గుచు వినుఁడల్ల వేదవిహిత
మార్గమునకన్న లేదింకమార్గమొందు సంసృతినిదాఁటి సుఖియింప సతులకెందు.

గీ. శంకరులజేసి భర్తల శక్తులైరి అమ్మవై ప్రోచిరందఱ కన్నమిడుచు
సంప్రదాయంబు పోషింత్రు సతులుమున్ను నేఁడికెటుపోవుచున్నారొ యాఁడువారు.

ఉగాదికానుక

శ్రీయుత అయ్యగారి విశ్వేశ్వరరావుగారు

చిట్టి గృహలక్ష్మి! తొలగును చింతలెల్ల! వచ్చెవిక్రమ! శుభముల నిచ్చునమ్మ!
వ్యాసభూషల ధరియింపవమ్మ! లెమ్మ! ఆంధ్రవీధిని విహరించి హర్షమిమ్మ!
కెందలిరాకుల నందమ్ముగాదాల్చు వనలక్ష్మి నీరాకగనెడువేళ!
చిగురు జొంపమ్ముల చిన్మయంబుగమెక్కు కోయిలల్ స్వాగత మీయువేళ!
దాస్యసంద్రమ్మున తానమాడుజనులు నీమేళ్లనరయుచు నెగడువేళ!
యుద్ధవార్తల భీతినుత్సాహమందని బేలలునీజాడ వెదకువేళ!
రమ్మ! విక్రమవర్షమా! తెమ్మ శుభము! జయపరంపర భారతజాతికిమ్మ!
మాదు గృహలక్ష్మి సేమానమసలనిమ్ము! శాంతిభద్రతలిమ్ము! నుతింతు సుమ్ము!

నా జీవితము

'సత్యంవద'

'ఈలోకంలో పురుషులకూ స్త్రీలకూ తేడాలేదు. ఒకరినొకరు బాధించుకోనడంలేదు. అంతా సహకారం, ప్రేమా—జీవితమంతా స్పర్ధలు లేకుండాపోతోవుంటుంది. నువ్వు కొత్తగా వచ్చినట్టున్నా, విక్కడకు' అంది. ఆమెమాటలు వినేటప్పటికి ఒకవిధమైన ఆనందంవచ్చి ఆమెను ఆలింగనంచేసుకొన్నాను.

●

స్థావరజంగమ ప్రకృతి సన్నిభమైన యీ ప్రపంచంలో జీవాణువులన్నీ రెండురకములైన ప్రకృతులు కలవి. స్త్రీ ప్రకృతి, పురుష ప్రకృతి. సృష్టికి ఆధారభూతములైన ఈ రెండు ప్రకృతులలో ఒక ప్రకృతిని నేను... నేను స్త్రీని.

ఆ రోజుల్లో మా నాన్నగారు శాకుంతల నాటకం చదువుతూ 'ప్రియంవద' అనే పేరుచూచి, నాకు 'సత్యంవద' అని పేరుపెట్టారు. ఇప్పుడు నాకు పందొమ్మిదేండ్లు నిండాయి. స్త్రీనయి పుట్టడంచేత, నాకీ వయస్సునకప్పుడే సంభవించిన దురవస్థలు సంఘంయెదుట పెట్టడం నా విధి......

ఆ పెండ్లిపీటలమీద కూర్చోడానికి ముందు జరిగిన కులాసాజీవితము ఒక విహంగజీవితంవలె తారాగగనంలో స్వేచ్ఛగా విహరించింది. పెళ్లి అయినప్పటినుంచీ నాకు తెలియని ఒకానొక చెరలో పడ్డాను. అది సుఖప్రదమైన చెర అని పుస్తకాలలో ఉద్ఘాటింపబడినా, నాకుమాత్రం ఆ సౌఖ్యమేమిటో గోచరించలేదు, ఊహించనూ లేను.

ఆనాడు ఒకాయన నా మెడలో బంగారపు గొలుసూ, శంఖాలతావళమూ వేస్తే, నగలెరగని నా సువర్ణకాంతుల శరీరం నిగనిగ లెక్కువై ఊర్వశీరూపమును నాకు ప్రసాదించినది. ఆ నూతనవస్త్రాల్లో నా దేహసౌష్టవము నవోదయ మేఘాకాశంలోని మెరుపుకళలవలె తళతళలు విరిసింది. అంతటితోసరి—నాగళసీమయందు కనకహారములు విసరిన యా దివ్యపురుషుడెవరో నేనాసమయంలో నెరుగను. తరువాత ఒక యేడాదికి తెలిసినది, ఆ దివ్యపురుషుని దివ్యచరిత్రం—

ఆయన ఒక భూస్వామిట, కుబేరుడట. ఆయన సదా వెలయాండ్రతో విటగృహాల్లో కేళీవినోదములతో నిరంతరమూ జీవితమును తెనుపుతూవుంటాడట—

ఇవన్నీ వ్రాస్తోవుంటే నాకొక వెర్రినవ్వు వస్తుంది. ఆహా,—ఆయన ఈ రెండోపెండ్లి యెందుకు చేసుకోవాలి? నా గొంతుక యిట్లా యెందుకు కత్తిరించాలి? ఈ దౌర్బల్యమైన సంఘం అతనిచేత నా మెడకు,—నా అవ్యక్తదశలో—వేయించిన మూడు ముళ్లూ, మూడు ఉరిత్రాటి ముళ్లై నా కంఠపు ముడిని బిగించేశాయి. మొగ్గలోనే శుష్కించిపోయిన నా జీవితం, మాధుర్య పరిమళాలను వెదజల్లవలసిన

యీ నా యవ్వనవయస్సులో మోడైపోయింది. మృదులమై, స్వాదువై పల్లవించే నాహృదయం యింతలోనే ఈ నిశీథంలో, శ్మశానవాటికల్లో, తలలు విరబోసుకొని ఎందుచేత తాండవించవలసివచ్చింది.

నా ఆవేదనలో అసలు కథ వ్రాయడం మరిచిపోతున్నాను—ఆ ధనవంతుడైన నా భర్త నన్ను—మొదటిభార్య చచ్చిపోయినమీదట—భార్యగా స్వీకరించాడు (నా తండ్రి యనుజ్ఞమీద.) ఆయనకున్న అప్పులు మా నాన్నకు అంతగా తెలియవు కాని, ఆయనకున్న జారత్వగుణము తెలుసును.

పునస్సంధానమైనతర్వాత అత్తవారియింటికి తీసికొనిపోబడ్డాను—అది ఒక చక్కని మేడ—అది తాకట్టులో ఉన్నట్లు యిటీవల తెలియవచ్చింది—మా పడకలు మొదటి పదిరోజులూ చక్కని పడకగదిలోనే జరిగినవి తరువాత కొన్నిరోజులపాటు ఆయన ఎక్కడికో వెళ్లి రాలేదు—ఎక్కడకు వెళ్లారు? చెబుతా—

నావంటి యింకొక స్త్రీ ప్రకృతివద్దకు—ధనమునకు తన దేహమూ, మానమూ అమ్మకొన్న వెలయాలి వద్దకు—

రోజులు గడిచినవి - వారములు గడిచినవి - నెలలూ గడిచినవి - ఇంటిజాడలేదాయనకు - క్రొత్త కోడలును కనుక యింట్లో ఏదో క్రొత్తగా కాలక్షేపం చేస్తున్నాను. కూర్చుంటే నించోలేని, నించుంటే కూర్చోలేని మా అత్తగారొకావిడ వుంది. మా ఆయనకు అప్పలెక్కువ అగుటచేత కోమటికూడా సరుకులు పద్దుమీద యివ్వడానికి నిరాకరించాడు మాదగ్గర డబ్బేదీ? మా ఆడబడుచు భర్త .. ఒక సామాన్య కుటుంబీకుడు - తన పేరుమీద కోమటింటినుంచి ఉప్పూ, మిరపకాయలూ, బియ్యం వగైరాలు తెప్పించియిస్తేనే కాని గత్యంతరం లేకపోయేది. యీ విషయాలనుగురించి, నా జీవద్భర్తకు కొన్నాళ్లు ఉత్తరాలు వ్రాసేదాన్ని. ఎన్ని ఉత్తరాలు వ్రాస్తే ఏమి ప్రయోజనము?. తరువాత మూడునెలలకు ఒకసారి వచ్చారు. ఈ అభాగిని జ్ఞాపకంవచ్చికాదు - తల్లిమొర వినడానికీకాదు - అని తరువాత తరువాత తెలియవచ్చింది నాకు—

ఆయనయొక్క అప్సరః ప్రణయినికి ధనమనే ప్రేమ నిరంతరంచూపిస్తోవుంటేనే కాని కబరీచ్యుత పుష్పమాలా సౌరభంకూడా ఆయనకు దక్కనియ్యదట. ఆయన ఆస్తిఅంతా అమ్మివేసి ఆమెకొక చక్కని మేడ కట్టించారు - అయినా ఇది వారికొక శాశ్వతబంధంకాదట - ఈ విషయం తెలుసుకుని నేను చాలా ఆనందించాను - కాని విచారంకూడా కలిగింది—ఒక స్త్రీ తన దేహాన్నీ, మనస్సునూ, ఎల్లాగ సర్వనాశనం చేసుకుంటూందో అని పెద్ద విచారం నాకు - ఆరోగ్యము మొదటికే నష్టంకదా - మొన్ననే భారతిలో "మరతుమన్న మరపురాదు" అనే కథనుకూడా చదివాను. ఈ కులటల జీవితాల్ని తలుచుకుని ఖేదపడ్డాను.

సరే వచ్చారు. ఆముఖం రుసరుసలాడుతూవుంటుంది నన్ను చూశాటప్పటికి. తల్లితో మానం. నాలోనూ యించుమించు అంతే - భోజనమ యాకవాక్ట్లో మడత మంచంమీద పడుకున్నారు. మందువాలో చీర కొంగు పరుచుకుని గాలి చప్పుడుకు అదరిపడుతూ, దీపపుకాంతిలో చీకటిపొగలు చూస్తూ వెర్రి ఆలోచనలతో మేలుకొని పడుకున్నాను. ఎప్పుడు పట్టిందోకునుకు - ఎరగను - వీధిలో తాళాలచప్పుడూ, పాటలూ వినవచ్చాయి. అప్పుడే తెల్లవారగట్ల అయిందనుకుని లేద్దామనుకుంటూనే మళ్లీ రెప్పవాల్చాను ఒక చక్కని కల—'నేనొక క్రొత్త ప్రపంచంలో ఉన్నాను. అక్కడ అందరూ స్త్రీలే. ఒకావిడమాత్రం కుర్చీలో కూర్చుంది. ఒకావిడ నించుని మాట్లాడుతోంది. అక్కడున్న అందరికళ్లల్లోనూ, ముఖంలోనూ జీవకళలుట్టి

పడుతున్నాయి. చక్కని ఆరోగ్యములైన శరీరాలు - నవ్వుముఖాలతో ఆమె చెప్పేమాటలు వింటున్నారు. ఏదో దేశసేవనుగురించి మాట్లాడుతోంది ఆమె. వాళ్లనిచూచి వీళ్లందరికీ భర్త లెక్కడున్నారో అనుకున్నాను. ఒకామె నన్నుచూచి - 'ఏంచెల్లాయీ అల్లాచూస్తావు' అంది. 'ఏమిటీ లోకం అన్నాను'—'ఈ లోకంలో పురుషులకూ స్త్రీలకూ తేడాలేదు. ఒకరినొకరు బాధించుకోనడంలేదు. అంతా సహకారం, ప్రేమా - జీవితమంతా స్పర్థలులేకుండా పోతోవుంటుంది. నువ్వు కొత్తగా వచ్చినట్టున్నావిక్కడకు' అంది. ఆమెమాటలు వినేటప్పటికి ఒకవిధమైన ఆనందంవచ్చి ఆమెను ఆలింగనం చేసుకొన్నాను. ఇంతలో మా అత్తగారి కేక వినబడి ఉలికిపడిలేచాను. చేతులు నేలను గట్టిగా అదుముకుని ఉన్నాయి.

ఆయనకు చెంబూనీళ్లు యిచ్చాను. కలలోని ఆనందం నన్నావరించుకు నేవుంది. ఆ స్వప్నంలోనే ఎందుకు ఉండకపోయానా అనిపించింది. నాకు శక్యమా? మరునాడుకూడా మేము-దంపతులము-మాట్లాడుకోలేదు. మూడవనాడు ఆయనంతట ఆయనే నవ్వుతో మాట్లాడారు. మహాపురుషుల నవ్వులో అర్థం వుండక పోదు. ఆనవ్వునన్ను దీనాతిదీనంచేసి వదలిపెట్టిందీ ప్రపంచంలో.

ఈమాటా, ఆమాటా చెప్పి నీకు మెడలో పుస్తెలతాడుచేయిస్తానంటూ కంసాలిని రప్పించి, నా మెడలో అదివరకున్న మూడున్నరకాసులబంగారం నా యెదుటనే అతనిచేతుల్లోపెట్టి వస్తువుపురమాయించారు. ఈ తెలివితక్కువ స్త్రీకి నగలంటే ఎంత ఆనందమో - స్వర్గలోకంలో ఉన్నట్లే అనిపించింది. తెల్లవారగట్ల వచ్చిన కలలు వృథాగాపోవు అనుకున్నాను. అటుతరువాత మరునాటిసాయంత్రం నాకొక ఐదు రూపాయలనోటిచ్చి, రాజమండ్రి వెడుతున్నాననిచెప్పి ఆయన ఎక్కడికో వెళ్లిపోయారు.

ఇంక నాలుగురోజులకు పుస్తెలతాడు అయిందేమో అని కంసాలికి కబురుచేశాను. తయారయిందిట కాని వారువస్తే కాని విడుదల చెయ్యడట. కబురుచేద్దామంటే ఎక్కడున్నారో-ఏమంటారో-స్వతంత్రురాలను కాదాయెను.

కొన్నిరోజులకు మనిషి వాడిచేతికి ఉత్తరమొకటియిచ్చి కంసాలికి కబురుచేశారట. ఏమని? ఆ పుస్తెలతాడు వానిచేతికిమ్మని. ఇంకేంగతిరా దేవుడా? డబ్బు తినివున్న కంసాలి ఆయన కాగితాన్ని తిరస్కరించలేకపోయాడు. ఈ సమయంలో నా హృదయం ఎల్లావుంటుందో సోదరీమణులకే తెలవాలి.

అయినకాటికి ఆస్తిఅంతా పాడుచేసె, యిల్లు తణఖాపెట్టె, తినడానికి కూడూ కట్టుకోడానికి గుడ్డా లేవు. బిచ్చమెత్తుకునైనా బ్రదుకుదామంటే భర్త దగ్గరలేని సువాసినిని సంఘం బహిష్కరిస్తుంది. నానా మాటలూ అంటుంది. ఈసడిస్తుంది. సంఘం వట్టిరాయి. దానికి హృదయం శూన్యం. ఇట్టి సంఘం నాకు బహిష్కృతం. యీ సంఘంయొక్క హృదయపాషాణం కరిగిపోవడానికి నాలాంటివాళ్ల అశ్రుకణాలు ఎన్ని కావాలో...!

అభినందనము

శ్రీయుత మద్దాలి ఉమామహేశ్వరరావుగారు

గృహలక్ష్మీకృత కంకణ బహూకృతికి నెల్లందగిన పడంతివి నీవే
గృహలక్ష్మివనిన నీవే సహనమొసంగెడు పలుకుల చానవు నగుటన్.

మధుమాధవులు

శ్రీమతి, సి. హేమలతా దేవిగారు

పాపము మాధవరావు తల్లితండ్రులు చిన్ననాటనే చనిపోయిరి. తల్లితండ్రులు చనిపోయినప్పటినుంచి మాధవుడు అతని మేనమామగు రంగారావుగారి యింటివద్ద పెరుగుతున్నాడు. రంగారావుగారు గొప్ప ఆస్తిగలవాడు. విద్యావంతుడు. విశ్వాసపాత్రుడు. దానధర్మములయందు ఓర్పుగలవాడు. ఆయనకి ఒక్క కన్యారత్నము వున్నది. ఆమెపేరు మధురం. పురుషసంతానములేని కారణముచేత మాధవునికూడా ప్రేమతో చూచుచున్నాడు. రంగారావుగారు అంటే వూరందరకు చాలా యిష్టం. ఆయన భార్య అంటే అసహనం. ఆవిడ పట్టినపట్టే చెల్లాలి గాని బ్రహ్మదేముడు చెప్పినా వినిపించుకోని రకం. రంగారావుగారు మాధవునకు ఏ లోటు లేకుండా ప్రతి విషయములోను తన మధురమును పోషించుచున్నట్లుగానే అతనినికూడా పోషించుచున్నాడు. మాధవుడు అంటేకూడా వూళ్ళోవాళ్ళకు ప్రేమాంకురములు బయలుదేరినాయి. మధు మాధవులకు సరియైన జత కుదిరినది. ఇద్దరకూ యౌవనాంకురములు బయలుదేరుతున్నవి. వీరి అందము వీరి జత చూచి వూరంతా సంతసించేవారు. మాధవునకు ఏమియు లేకపోయినప్పటికి మేనల్లుడియైన గాఢ ప్రేమచేత వీరిద్దరకు తప్పక వివాహము చేయవలెనని రంగారావుగారు సంతోషపడుతుండేవారు. మధు మాధవుల వివాహము అంటే రంగారావుగారి భార్య అగు శేషమ్మగారికి ఏమాత్రం ఇష్టంలేదు.

మధు మాధవుల వివాహం అంటే ఆమెకు ఎందుకు ఇష్టంలేదంటే మాధవునకు చదువు వున్నప్పటికి ఏమియు ఆస్తిలేదని. మాధవునకు ఏలాగైనను మధురమును చేసుకొందామనే గొప్ప వూహ. మధురముకు మాధవుని తప్ప ఇతరులను పెండ్లాడగూడదని ఇద్దరు కంకణము కట్టుకున్నారు. రంగారావుగారికికూడా మధు మాధవుల వివాహము అంటే అమిత ఇష్టం. శేషమ్మగారికిమాత్రం అమిత అయిష్టం, ఏమిచేస్తారు ?

ఇట్లా కొంతకాలం జరిగింది. మధు మాధవుల దురదృష్టముచేత రంగారావుగారు హఠాత్తుగా చనిపోయారు. శేషమ్మగారి దుఃఖముకు హద్దులేదు. మధు మాధవులు రంగారావుగారి అకాలమరణమునకు దుఃఖసముద్రములో మునిగిపోయిరి. మధు మాధవులకు కల్పతరువు పోవుటచే వారిని బెంగ ఆవరించింది. మాధవుడు చదువు నిమిత్తం బొంబాయి వెళ్లిపోయినాడు. మధురముకు ఏమున్నది ? తన తండ్రి పరలోకగతుడు అవడమే కాకుండా ఎప్పుడు విడవని తన ప్రేమ బావకూడా దూరము వెళ్లిపోయినాడు. దుఃఖమునకు హద్దు లేదు. పాపము మాధవునకు చదువుయందు అభిలాష వున్నప్పటికి మతి అంతయు

మధురముమీా దేవుంది. ఏమిచేస్తాడు ? మాధవుడు బొంబాయిలో వున్నంతకాలం మధుర ముకు అనుదినము ఉత్తరములు వచ్చుచునేయుండేవి.

ఇంతలో క్రిష్టమస్ శలవలు యిచ్చినారు. మాధవుడు యింటికివచ్చినాడు. ప్రతి దినము మధుమాధవులిద్దరు కలసిమెలగుచుండేవారు. శేషమ్మగారు మధురమును నిందిం చని ఘడియలేదు. ఎట్లాగో మధుమాధవులకు 15 దినములు పదిహేనుఘడియలలా గడచిపోయినవి. ఇద్దరు ఆరోజులను దూషించినారు. అయినను ఏమిలాభము. మాధ వుడు తిరిగి బొంబాయి ప్రవేశించినాడు. శేషమ్మగారు మధురమును మాధవునకు యిచ్చి వివాహముచేయుటకు ఇష్టములేక మరియొక సంబంధముచూచి వివాహముచేసినారు. పాపము మధురము తన తండ్రిలేని హేతువుచేత తనకు అయిష్ట సంబంధము అయినది కదా అని విచారించుచుండెడిది. ఆమె మనస్సులో విచారాంకురములు నాటుకుపోయినవి. మాధవునకు ఈమె వివాహము సంగతి తెలిసి, బ్రహ్మచారిత్వము ధరించడమా ? మధుర ముతో ప్రాణములను విడనడమా ? ఈ విచారముతో ఒక్కొక్కదినము ఒక్కొక్క సంవత్సరముక్రింద గడుపుచువచ్చినాడు. ఇంతలో పరీక్షాదినములు వచ్చినవి. పరీక్ష పేపరు వ్రాసినాడు. వేసంగిశలవులు యిచ్చినారు.

మాధవుడు మెయిలులో బయలుదేరి ఇంటికివచ్చినాడు. మధుమాధవులకు వళ్లు తెలియదు. కొంతసేపు గాఢాలింగనముచే మైమరచిరి. ఇద్దరికి తెలివివచ్చి సంచరించు చున్నారు. శేషమ్మగారి శరీరములో క్రోధానలము ప్రవేశించింది. ఏమిచేయగలదు? ప్రేమబంధముకు ఎవరు అడ్డువెళ్లగలరు ? రాత్రి 7 ఘంటలు అయినది. శేషమ్మగారు మధుమాధవులు భోజనంచేసిరి. ఎవరిగదులలో వారు ప్రవేశించిరి. మధుమాధవులకు ఏమితోచును ? ఇద్దరకు నిద్రపట్టుటలేదు. గడియారము పదిఘంటలు కొట్టినది. మధు రము మాధవునిగదిలో ప్రవేశించినది. మధుమాధవులు ఎవరికోర్కెలు వారు వెలిబుచ్చు కొనిరి. ఇద్దరు లేచినారు.

గృహమువిడిచి పయనమైనారు. ఎక్కడికి వెళ్లుచున్నారో వారికే తెలియదు. ఇంతలో కృష్ణానది కనుపించినది. ఒడ్డున యిసుకతిన్నెయందు మాధవునిఒడిలో మధురం. అశ్రుబిందులు ప్రవహించుచున్నవి. ఇద్దరు దుఃఖసముద్రములో మునిగిపోయారు. క్షణ కాలములో ఇద్దరకు స్పృహవచ్చిలేచారు. చంద్ర కాంతులచేత తన ఆనందమును తెలియ జేయుచూ పెద్ద తరంగములతో మహాతల్లియగు కృష్ణవేణి అతివేగముగా ప్రవహించు చున్నది. మధుమాధవులు తమ దుఃఖమును తెలియజేయుచూ అశ్రుతరంగములతో నదీ ప్రవాహములో లీనమైపోయారు.

వీరాబాయి ప్రబోధము

శ్రీ గోనెల నరసింగరావుగారు, ఎం. ఏ. బి. యల్.

ఉదయసింహరాణా చిత్తూరు ప్రభువు. ఆతని యర్ధాంగి వీరాబాయి. అగ్బరు మొగలాయి చక్రవర్తి. రాజ్యతృష్ణకలవాఁడు. కావున రాణాను రణరంగమునఁ బరాజితునిఁ గావించి 'ఖైదు'లో నుంచెను. రసపుత్రులు కర్తవ్యము నెఱుంగక భీతచిత్తులై మిన్నకుండిరి. ఆ సమయమందు వీరపత్నియైన వీరాబాయి వీరపురుషోచిత వేషముఁ దాల్చి యుద్ధభూమికిఁ బయనింప సంసిద్ధురాలై రక్తము తుకతుకలాడునట్లు రసపుత్రవీరుల నుద్దేశించి పల్కిన ధీరవాక్యాలు :

ఓ రసపుత్ర చమూపతులారా! చిత్తూరు రాజ్యలక్ష్మీ శుంభ
ద్గౌరవరక్షణదీక్షా, పారయశోవిసరులార! పటుధృతులారా!!

ఈ నిశివేళ మీకుఁ దగునే? యిటులీయెడ నింతగా నుదా
సీనతఁబూన; శ్రీ యుదయసింహమహీశ్వరుఁ డగ్బరు క్షమా
జానికి నంగమానెడల, శత్రువధోద్యమ ముజ్జగించి, మీ
మానిత వంశగౌరవము మ్రగ్గఁ జేతురె, సిగ్గుమాలిరే?

ధైర్యస్థైర్యములిట్లు పోనడఁచి, చింతాక్రాంత త్వన్మందుటల్
శౌర్యంబే? రసపుత్రవంశ యశమస్తంగామిత న్బొందునే?
ఆర్యావర్తము నేఁటితో మొగలరాజ్యాధీనమైపోవునే?
కార్యాకార్య విచక్షణప్రవణులుత్కంపంబు మీకేటికిన్?

పగఱకు వెన్నుఁజూపుటది పౌరుషమౌనె? చితూరు సీమలోఁ
దిగులను మాటమున్నకలదే? ప్రభుసింహుఁడు బందిఖానలోఁ
నెగులును బొందుచున్నపుడు నెమ్మది నెమ్మనమందు నిల్చునే?
తెగువవహించి వైరులవధింపుఁడు, శాంతివిధింపుఁడాపయిన్.

క్రోధము రోషమున్విడి దిగుల్పడనేల? చితూరు రాజ్యల
క్ష్మీ ధవు నింక నెట్లయిన మ్లేచ్ఛుల బంధమునందునుండి స్వే
చ్ఛాధృతినొందఁజేయుటయె సత్వరకార్యము; దీక్షబూనుఁడీ:
యోధులు కారె మీరు? భయమొందిన మృత్యువు మిమ్ము వీడునే?

ఎవరి సాయంబుగోరి నిరీక్షసేతు రాత్మవిశ్వాసమెల్లఁ బోనాడి మీరు
మానధనులయ్యు దేహాభిమానులగుట కంటె గాజులు తొడిగించుకొంటలెస్స.



తీరికవేళ

చిత్రము. జ. సీ. రా. శర్మ.

జె. సి. కమలాబాయి నెల్లూరు

యీ బాలిక, తన కోకిలగానము 'సరస్వతీ స్టోర్సువారి' ఓడియన్ రికార్డులద్వారా వినిపించి, త్వరలో ఆంధ్రుల ఆనందాబ్ధి నోలలాడింపగలదు.



అనాధబాలురకు స్నానము చేయించుట

రెడ్ క్రాస్ సొసయిటీవారిచే స్థాపింపబడిన శిశుసంరక్షణశాల

కె. అశ్వద్ధమ్మ మహిళాసమాజము కర్నూలు.



అనాధబాలురకు గంజిపాలు డిస్ట్రిబ్యూటు చేయుట

రెడ్ క్రాస్ సొసయిటీవారిచే స్థాపింపబడిన శిశుసంరక్షణశాల

కె. అశ్వద్ధమ్మ మహిళాసమాజం కర్నూలు.

కైదులోనున్న రాణాప్రతాపస్త్రీ నిలుపఁ గైదు వూనఁగవలయునో జోదులార !
ఐదువను నేనె సంసిద్ధనైదురంబుకై దుముక నేఁడు మీకు శౌర్యంబులేదె?

ఘోర పరాభవాగ్ని పయికొన్నది, దానవశింప నెంతురో,
వీరవిహార విస్ఫురణఁ బేరును బెంపు గడించుకొందురో
శూరవరేణ్యులార ! యొక చొప్పుఁ దలంపుఁడు ; పాడినిల్పఁగా
వేఱు విచారమేల ? రణవీథికిఁ దూకుఁడు, నూఁకుఁడెల్లరన్.

అదనిదె లెండు లెండు రణమాడఁగ నగ్బరు చక్రవర్తి దు
ర్మదమునడంప నిర్భర పరాక్రమఘాటి ; సిశోదయాన్వయా
భ్యుదయము చెంగలింపఁగ సముద్ధతిఁ జూపుఁడు ; ఖడ్గపాణులై
కదలుఁడు ' జేహరా ' యని యకంపనులై విజిగీష పెంపునన్.

వారువమెక్కి కత్తిఁగొని భండనభూమి విరోధి సైన్యము
న్మారి మసంగు నాకు నభిమానముతో విజయప్రమోదము
ల్నారెకుఁ గూర్పుఁడీ మిగుల సాహసమూనుఁడి ; రాజ్యలక్ష్మితో
భూరమణున్ స్వతంత్రతను బొందఁగఁజేసి కళంకుఁ దీర్చెదన్.

మీ గృహలక్ష్ముల న్సతులమీద సజాతిని సంస్మరించి, రా
ణా గృహలక్ష్మి మీకొసఁగునా డెపుబోధము నాలకించి, మీ
మీ గృహమేధి ధర్మముల మేలునెఱింగి ప్రసిద్ధికెక్కుఁడీ
మీ గృహిణుల్విజేతలగు మిమ్మలరింపఁగ నెల్ల ప్రొద్దులన్.

రసపుత్ర జోదులీ యులుములు రణభేరులలో విన్నారు. వీరాబాయి కండ్ల మెఱుపులు చిమ్మచీఁకటిలో చూచారు. క్షత్రియవీరుల ప్రతిష్ఠాజ్యోతి చల్లాఱిపోలేదు ; శౌర్యరస మింకిపోలేదు ; ధైర్యమింకా జంకిపోలేదు. వీరాబాయి పోటరితనమునకు, కత్తిపోటు మాటలకు, జంకెన వాఁడిచూపులకు, రాజపుత్త్రియోధులు వీరావేశముతో విజృంభించి ముదురుకత్తుల నందుకున్నారు. మొగలు సైన్యములఁ జొచ్చి దండిమగలై, సింగపుఁ గొదమలై, మార్తాండాత్త తేజస్వులై, చిందులుత్రొక్కారు ; వీరవిహారము సల్పారు ; శత్రుసేనల చిత్రవధ చేసారు. రణమును గెలిపించుకొని, రాణాను విడిపించుకొని, రాజ్యరమను పాలించుకున్నారు. ఇది కట్టుకథ కాదు ; స్వకపోలకల్పితముకాదు ; కాని మాటసలేకాదు ; నాకలమసత్యవాదికాదు ; అనుమానమక్కరలేదు ; ఇందతిశయోక్తిలేదు ; ఇది వింత చరిత్రమే ; ఉపమింపరాని సత్యమే ; చరిత్రప్రసిద్ధమే. అహా ప్రతిభ ; పౌరుషము ; పటుదీక్ష ; అట్టి దివ్యమహిమ, సోదరీ ! ఏదీ ? ఇప్పుడేది ? నీలో నేదీ ?

మంగళసూత్రము

జీవనప్రభాత్ (నవకళాసమితి)

నిశ్చలంగా శిలాప్రతిమవలె కూర్చుండివున్న పతిని సమీపించింది 'కాంత'.

'ఇదిగో ఇలాచూడండి—'

యోగసమాధిలోవున్న 'మూర్తి' కళ్లుతెరచాడు. ప్రసన్నవదనంతో తనయెదుట నిలబడివున్న ఆ దే మూర్తిని చూచాడు...అతని శరీరం పులకరించసాగింది. భావశూన్యంగా ఆమె తేజోమయ నయనాలలోకి చూడసాగాడు.

'ఈ పసుపుకొమ్ము నా మెడలోకట్టి—నా మంగళసూత్రాలు తీసుకువెళ్లండి.'

చిరునవ్వు ఆమె ముఖంలో తాండవిస్తోంది, కాని ఆమె మాటలలో గొప్ప ఆవేదన స్ఫురిస్తోంది.

'ఆఁ—ఏమిటీ?' అతని కఠినహృదయం అతనికి తెలియకుండానే మెత్తగా మాట్లాడింది.

'మీ చేతులతో మీరే ఈ పసుపుకొమ్ము నాగళసూత్రంగా కట్టి, నా మంగళసూత్రాలు తీసు వెళ్లండి...అవి తప్పితే వేరులేవు!'

ఆమాటలంటూంటే—ఒక దేవత తన అనంత త్యాగరూపాన్ని చూపడానికి స్వర్గధామమునుండి దిగి వచ్చిందా—అనిపిస్తోంది. మూర్తి లేచినిలుచుని ఆమెను సమీపించాడు. ఆమె నిశ్చలంగా, చిరునవ్వుతో—అతని కండ్లలోనికి చూస్తోంది. ఆ చూపులు అతన్ని కలచివేశాయి. ఆమె మెడదాకా వెళ్లిన అతనిచేతులు—వెనక్కు జంకాయి...అతని కళ్లనీళ్లు తిరిగాయి—

'అయ్యో! కాంతా!...నీ త్యాగానికి హద్దులేదా? ఇంకా ఆ మంగళసూత్రాలు—ఆ మిగిలిన రెండు సూత్రాలుకూడా—తీసుగువెళ్లిపోనా?...నీ నగలన్నీ వొలుచుగువెళ్లాను—ఇంకా ఎంతని నాకోసం త్యాగం చేస్తావు కాంతా?'

'మీకోసం సర్వమూ త్యాగంచేస్తా—ఈ శరీరమూ, ఈ జీవమూ,—అన్నీ మీవే అయినప్పుడు ఈ వస్తువులుమాత్రం నావనా?—'

అతని కళ్ళ జలజల నీళ్లు కారుతున్నాయి...ఆమెలో వున్న మహత్తరశక్తి అతనికి కనపడసాగింది. ఆమె ముఖంలోని పవిత్రజ్యోతి ప్రకాశించసాగింది...అతనొక్కసారి వెలుగులోని కీడ్వాబడ్డాడు—

ఆమె దేవత; తను రాక్షసుడు. ఆమె దయామయ, కోమలహృదయం; తను కర్కశపాషాణం. ఆమె త్యాగమూర్తి; తను స్వార్థపరుడు. ఆమె అమరస్త్రీ; తను కేవల మానవుడు!...ఆమె పాదాలదగ్గ నిలుచుని ప్రార్థించుకునే యందుకుకూడా తగడు. అతని నిజస్వరూపం బయలుపడసాగింది...ఆవేశంలో అన్నాడు, 'కాంతా! అంతపని చెయ్యలేను...నా యీ చేతులతో కట్టిన సూత్రం ఈ చేతులతోనే విప్ప లేను...అయ్యో! నే క్రూరుణ్ణి—నిన్ను హింసపెట్టాను...'—వాపోవసాగాడు.

'కాంతా! నీ మెడలో నే సూత్రం కడతం నిన్ను దుఃఖపెట్టడానికే కాబోలు—నన్ను కట్టుకు ఏంసుఖమనుభవించావు? నన్నెందుకు కట్టుకున్నావు? అయ్యో! నీకు నా సంబంధమేనా తప్పిపోలేదు... ఈపాటికి ఎంత సుఖం అనుభవిస్తోవుండేదానివో కదా—'

కాంత పతి నోటిదగ్గర చెయ్యిపెట్టింది. 'ఆ మాటలు తలపెట్టకండి—ఇంక అనవని ఒట్టుపెట్టుకోనండి...మీతోటి కష్టాలే అయినా నాకు వేయిసుఖాలు!'

ఆమె తన మెడలోవున్న మంగళసూత్రాలు తీసి అతని చేతిలో పెట్టింది—'ఇంతకంటే—ఈ దీనురాలు—ఇవ్వలేదు...'

అతని శరీరం గజగజ వణకిపోయింది. ఆ నగను ముట్టుకోనడంతోటే అతనిహృదయంలో ఒకవిధమయిన బాధ బయలుదేరింది. అతని పూర్వపు చర్యలన్నీ స్మృతికి రాసాగేయి—

* * * *

కాంతకి అనేక సంబంధాలు వచ్చేయి. ఎందరో గొప్పగొప్పవారు ఆమె చేతిని యాచించారు. కాని ఆమె మూర్తిని కోరుకుంది—మూర్తి ఆమెకోసం ఒకప్పుడు తపస్సుచేసినవాడే—ఇద్దరికీ వివాహం జరిగింది.

గురుసాక్షిగా, పితృసాక్షిగా, అగ్నిసాక్షిగా—ఆత్మసాక్షిగా...ఆమె గళసీమలో మంగళసూత్రము కట్టి—ఆమెను అర్ధాంగిగా స్వీకరించాడు.

వేదమంత్రాలతో అనేక శపథాలు చేసేడు—ఆమెను సుఖపెడతాననీ, ఆమెను ఏక్షణంలోనూ విడువననీ, కష్టసుఖాలలో ఆమెకు తోడునీడ అవుతాననీ...ఇంకా ఏవేవో అనేక బాసలుచేసి ఆమెను తన గృహలక్ష్మిగా తెచ్చుకున్నాడు...

ఆ బాసలన్నీ యేమయినట్లు? ఒక్కక్షణం ఆమెను సుఖపెట్టలేదు—ఒక్కసారయినా ఆమెను ప్రేమతో పిలువలేదు—

ఈరోజున తను నానాబాధలూ పడుతున్నాడు—భౌతికంగా నైతికంగా తను భగ్నహృదయుడయ్యేడు. ఈ క్షణంవరకూ ఆమె తన ధర్మపత్ని అన్న విషయం మరచిపోయాడు. తన దురభ్యాసాలన్నిటికీ ధనమవసరమైనప్పుడు ఆమె పీకమీద కూర్చునేవాడు......తను చేసిన అన్యాయాలకన్నిటికీ ఆమె చేసిన ప్రతిక్రియ—?

తన శరీరంమీదనున్న వస్తువులన్నీ ఇచ్చింది—తన జీవితమంతా త్యాగంచేసింది...ఒక్కమాటేనా మాట్లాడకుండా! ఎందుకు? తను ప్రేమించిన భర్త సుఖంకోసం?

అంత ఎక్కువగా ప్రేమించిన ఆమె ప్రేమను—నిర్లక్ష్యంగా చూచాడు—త్రోసిపారవేశాడు.

అన్నివిధాలా ఆమెను అన్యాయంచేసాడు;—ఆమెను మోసపుచ్చాడు; దుఃఖపెట్టాడు; పీడించి పిప్పి చేసాడు!...అంతటితో వూరుకోక ఈరోజున మంగళసూత్రానికని వచ్చాడు—

తను తిండిలేక బాధపడుతున్నాడు; ఆమె ఉపవాసాలతో గడపుతోంది...తిరిగి తన దురభ్యాసాలకు ఆమెను పీడించవచ్చాడు నేడు!

* * * *

అతనిలోవున్న అగ్నిలాంటి గుణం ఒక్కసారి కంపించిపోయింది. ఆమె నయనాల తేజస్సుచేత హిమవంతమయింది...తను ఇప్పుడనుభవిస్తున్న దరిద్రబాధను మరిచిపోయాడు—అతడు దరిద్రుడుకాడు. అతని భార్య ఒక మహాలక్ష్మి!...ఇంతలోనూ అతనిచేతిలోవున్న మంగళసూత్రాలు కనపడ్డాయి. అతను విపరీతంగా కంపించి వాపోవసాగాడు—దుఃఖం పొంగిపొరలి రాసాగింది.

తను మహాపరాధంచేస్తున్నాడు—తనభార్యను పసుపుకొమ్ముతో వదలుతున్నాడు. తనుండికూడా ఆమెను అనాథనుచేస్తున్నాడు—తనచేత్తో కట్టిన సూత్రాన్ని తానే తీసివేస్తున్నాడు...

'కాంతా! ఇంతపనిచెయ్యలేను—అయ్యో నీగుణం తెలిసికోలేని మూర్ఖుణ్ని...అన్నివిధాలా చెడి పోయేను—ఈ సూత్రం అమ్మవొద్దు—నే దరిద్రుణ్నికాను...'

'నిజమే! మనమనస్సులు పవిత్రంగావున్నంతకాలమూ మనం దరిద్రులంకాము. కాని ఇప్పుడు దుఃఖించకండి...ఈ మంగళసూత్రాలు తీసుకెళ్లి అమ్మెయ్యండి—'

'కాంతా! ఇంకా నాకళ్లు మూసుకుపోయే వున్నాయనుకుంటున్నావా? కాదు—మంగళసూత్రాలమ్మేనే అంతటి నిర్భాగ్యుణ్నికాను. ఇదివరకు అంతకంటే అధమాధముణ్నయినా—ఇప్పుడుమాత్రం కాను...అయ్యో చూస్తూ చూస్తూ నిన్ను నాచేతులతోనే గంగలో దింపలేను—' అని విలపించసాగాడు.

ఆమె భర్తకన్నీరు తుడువసాగింది. 'ఎప్పుడూ మనం కష్టాలే అనుభవిస్తామా? ఎప్పుడూ అంధకారంలోనే వుంటామా?...ఇది ఒక చిన్నెమాత్రమే. ఈ బంగారు వాటికంటే పవిత్రమయినది ఈ పసుపుకొమ్ము. ఇది నామెడలోవుంటే చాలు. మన ప్రేమసూత్రమే నా మంగళసూత్రము—'

'అయ్యో కాంతా! నన్ను కట్టుకొనటంతోటే నువ్వు వేదాంతమార్గం ప్రవేసించావు...నాతోపాటు దుఃఖాలనుకూడా కట్టుకున్నావు...ఇంక నిన్ను వదల్లేను...నన్ను రక్షించుకో! నీమీద నాకు హక్కులేదు—ఈ సూత్రాలు మళ్లీ నీమెడలో వేసుకో—కాదు. నా అంత నేనే వేస్తాను—' అంటూ భార్యమెడలో ఆ మంగళసూత్రాలు వేశాడు. 'కాంతా! ఇంతవరకూ నీప్రేమ తెలుసుకోలేకపోయాను. నువ్వు దేవతవు నన్ను వెలుగులోనికి నడిపించు. నా తప్పులకి నన్ను శిక్షించు—'

'మిమ్మల్నా? నేనా శిక్షించేదాన్ని?! అయితే ఇంక నన్ను వదలి వెళ్లకండి. నా నిజమంగళసూత్రాన్ని నామెడలోనుంచి వేరుచేయకండి...మీరే నా మంగళసూత్రం...'

'కాంతా! దరిద్రుణ్ని—దుర్మార్గుణ్ని—హింసకుణ్ని—'

'ఎన్నైనా—ఎవరైనా—మీరే నా మంగళసూత్రం—'

వత్సరాది

శ్రీమతి పి. వి. సీతామహాలక్ష్మిగారు

సీ. ఒకవంక సింగారమొలికించ జడనిండ వేప్పూవ్వు గుదియులై విరిసియుండ
శేతనావేపాకు లిందందునల్లిన చీరగట్టిననేర్పు చిందులాడ
కీరసంతతియొక్క క్రేంకారమెల్లను చిరుగజ్జలై శోభ జెలగుచుండ
ముత్యాలవర్షంబు మున్ముందు నీరాక దెల్పుచు మోదంబు గొల్పుచుండ
గీ. నీదునాట్య సరణికిల నేర్పుమీర నింతులెల్లరు ముగ్గులనింపుచుండ
నౌర! యేతెంచితీ నాటికైన నొక్కనాడె యుండెదంచును పల్కలాడరాదె.
ఉ. ఎందునలేదు మోదమిలనింతియు చెంతను లేనిచో మనం
బెందునసౌఖ్య నెంత తను బీరముజూపదలంచిరన్ మదిన్;
కాదనువారులేరు కలికాలమటంచు దలంచకమ్మరో
చెందుముసంత సంబికను జేరుము లక్ష్మివి మమ్ము బ్రోవగన్

కళాకలాపము

సంగీతము

శ్రీమతి బి. విజయలక్ష్మిగారు

చతుష్షష్ఠికళలలో లలితకళలని చెప్పబడు నాల్గింటిలోను సంగీతమొకటి. సంగీతంలోని మోహకత, పారవశ్యత మిగిలిన దేనికినిలేదు. పామరులకును ఆనందమిచ్చి పశువులకును పారవశ్యత గూర్చజాలునది సంగీతమే. శ్రీ కృష్ణుని మురళీగానరసంచేత పశువులన్నీ మైమరచిపోయెడివి. అట్టియెడ మానవులకది ఎంత అనిర్వచనీయానందము గూర్చునో చెప్పనక్కరలేదుగదా. త్యాగయ్యగారి కీర్తనలు దక్షిణదేశమున వినని వారు లేరు విని ఆనందించనివారు లేరు. 'శిశుర్వేత్తి పశుర్వేత్తి వేత్తిగాన రసంఫణిః' అన్నట్లు సమస్త జీవరాసులు యీ మహదానందముగూర్చు సంగీతముచే మోహితములైపోవును. ఎంత ఏడ్చుచున్నను శిశువు గానాలాపమాకర్ణించినంత ఆ ఏడ్పు మరచుచున్నాడు సర్పములుగూడ ఆ నాగస్వరమున చిందులుద్రొక్కు గానములయొక్క ఆరోహణ అవరోహణములచే మైమరచి ఆడుచుండును, ఆలాపనయొక్క లేతస్వరములు గాలిలో కలసి పెద్దవై - మేఘమాలికదాటి నక్షత్రములలో లీనమైపోవుచుండును. ఆ సంగీతములోని మార్దవము, హాయి, మాధుర్యము ఇట్టిదని చెప్పలేకున్నను ప్రతిజీవియు ఆనందించుచుండుననుట నిజము.

సంగీత మాధుర్య సుధావర్షముచే మ్రోడులు చిగుర్చుననియు, పాషాణములు ద్రవించుననియు చెప్పుదురు. ఏమి అంతటి మహత్తు సంగీతంలో ఉన్నదా అను విషయమునకు యీ క్రింది ఉదాహరణము జవాబు.

అవి అక్బరు పాదుషా పాలించు రోజులు. అతని సమయంలో లలితకళలు వృద్ధిలోనికి వచ్చినవి. చిత్రలేఖనము, సంగీతము చక్రవర్తికి అత్యంత ప్రియమైన విషయాలు. అప్పటిలో సంగీతంలో అఖండఖ్యాతిని సంపాదించిన 'తాన్‌సేను' అతని ఆస్థానములో వుండేవాడు. తాన్‌సేనుయొక్క గాననైపుణ్యమునకు అక్బరు ఆశ్చర్యపోతూ వుండేవాడు. ఇంతటి శక్తి, సర్వసమ్మోహనవిద్య సామాన్యులకు లభిస్తుందా అనుకొనేవాడు. అతనిలో ఒక దైవశక్తి, గంధర్వాంశ ఉన్నదని అతను తలచేవాడు. యీ భావంతోనే ఒకనాడు ప్రశ్నించాడు, 'తాన్‌సేను ఇట్టి మహత్తరశక్తి నీకెల్లా లభ్యమయింది? ఇది ఎవరివలన నీకు ప్రాప్తించింది'?

తాన్‌సేను చిరునవ్వు నవ్వాడు పాదుషాయొక్క ప్రశ్న అతనికి ఏదో ఒక క్రొత్తసంగతి జ్ఞాపకంచేసింది. అతను అన్నాడు.

'ప్రభూ! నా పాటలో విశేష మేమీ లేకపోయినను నాయందుండే ప్రభువువారి వాత్సల్యాం ఇల్లా అనిపించింది. నేనొక అణువును. సామాన్యుడను. మా గురువుయొక్క అసాధారణ ప్రజ్ఞ మీరు చూచియుండలేదు. చూచియే యున్నచో...

చక్రవర్తికి మరీ కుతూహలం హెచ్చింది.

'తాన్‌సేను! చెప్పావుకాదు ఇన్నాళ్లనుండి. ఎక్కడ ఉన్నారు నీ గురువులు. ఒకసారి రప్పిద్దాం—'

'కాదు ప్రభూ! ఆయన సర్వత్యాగి. జనాకీర్ణమైన యీ పట్టణాలలోకి ఆయన రారు.'

'లే అయితే - మనం ఇద్దరం వెళ్ళుదాము ఎట్లయినా విని తీరాలి'

చక్రవర్తి యథోచితముగ అలంకరించుకొని తాన్‌సేనుతో బయలుదేరాడు. ఆ గురువు ఉండే ప్రదేశం శాంతి, సౌఖ్యములకు ఆటపట్టు. అతినిశ్శబ్దంగావున్న ఆ ఆశ్రమంలోకి వెళ్లి గురువుకు నమస్కరించారు. కుశలప్రశ్నానంతరం, చక్రవర్తి తనదగ్గరవున్న రత్నాలహారం గురువు పాదాలవద్ద భక్తిభావంతో అర్పించాడు. వచ్చిన కారణం చెప్పవలసినదిగా తాన్‌సేనునకు సంజ్ఞచేసాడు.

కాళ్ళవద్ద ఉంచిన రత్నహారాన్ని మెల్లిగా పైకితీశాడు గురువు. చిన్న చితారువాయిస్తూ రాగాలాపన మొదలుపెట్టాడు.

ఏమి ఆశ్చర్యం. తాన్‌సేనుకు ఆనందబాష్పాలు జలజల ప్రవహించిపోతున్నాయి. ఇంక అక్బరునకు చైతన్యమేలేదు. మత్తుతో మైమరచినట్లు బాహ్యస్మృతిలేకుండా వున్నాడు.

ఆ అడవిలోవున్న లేళ్లుదుప్పులు ఆ మహాత్ముని సంగీతానికి తిండి మేతమానేసి అతనిచుట్టూ చేరాయి వందలు వేలు. ఓహో! ఏమి అతనినైపుణ్యము. పశుహృదయాన్నికూడా తెలుసుకొని ద్రవింపజేయు సామర్థ్యం. ఓహో! పాట ముగించే ముందు, అక్బరు తనకు బహుమతిచేసిన రత్నహారం ఒక లేడిపిల్ల మెడలో తగిలించాడు గురువు.

పాట ముగిసింది. ప్రకృతి మళ్లీ చైతన్యంలోకి వచ్చింది. అక్బరు తేరుకున్నాడు. ఆశ్చర్యపోయాడు. తన అమూల్య రత్నహారం అక్కడలేదు. ఏమిచేసాడా అని ఆందోళితచిత్తుడయ్యాడు. అతని మోముపై విషాదరేఖలు చూపట్టాయి.

గురువు పరేంగితజ్ఞుడు. అక్బరు విచారం గ్రహించాడు. అన్నాడు చిరునవ్వుతో—

'బిడ్డా నీ అమూల్యహారం నీవు మళ్లీ కోరుచున్నావా? నీ వాంఛ యీడేరుగాక.'

అంతే ఇంకేమీ మాట్లాడలేదు గురువు. అక్బరు జవాబునకైన ఎదురుచూడలేదు. మరి ఏమిచేశాడు!

మళ్లా చితారు పుచ్చుకున్నాడు. రాగాలాపన మొదలుపెట్టాడు. గమ్యస్థానములోకి ఇంకా చేరలేదు పాపం లేళ్లు. మళ్లీ ఆ రాగంవాళ్లను మంత్రశక్తిలా వెనక నడకమీద లాక్కొనివచ్చినది ఆశ్రమంలోకి.

గురువు లేడిపిల్ల మెడలోనుండి రత్నహారం గైకొన్నాడు. యీ సంగతి పాపం అక్బరు ఎరుగడు ఎరుగడు. చైతన్యం ఉంటేగదా ఎరుగుటకు? స్పృహలు వచ్చాయి జంగమస్థావరానికి. స్థిరచిత్తుడయ్యాడు అగ్బరు. రత్నహారం అతని కాళ్లవద్ద పడివుంది. క్షమాదానం యాచించాలనుకొన్నాడు అగ్బరు. కాని ఏదీ అక్కడ ఆ గురువు? అదృశ్యుడయ్యాడు.

ఆ లోకోత్తర గాననైపుణ్యం చెవులార విన్న అక్బరు ఆ జన్మాంతం మరచిపోవలేకపోయాడు. మరల ఒకటి రెండు సార్లు తానసేనుతో అన్నాడుగూడ. 'నీ గురువులవద్దకు వెళ్లాలని వుంది.' అని.

కాని తానసేను తీసుకొనివెళ్లలేదు. ఆ గురువు దృష్టిలో అగ్బరు చక్రవర్తి కాడుగదా.

'గురువునకు తగిన శిష్యుడు' అని సభలో పలుసార్లు అన్నాడు చక్రవర్తి తానసేనునిగూర్చి ప్రసంగించ వచ్చినప్పుడు—

తానసేను వ్రాసిన 'రాగమాల' అతని మహిమను అందులోని ఔన్నత్యముచూపు గ్రంథరాజము.

రాష్ట్రప్రబోధము

ఆంధ్రరాష్ట్రము వేరుచేయగ
నాంధ్రయువతులు దీక్షబూని
కార్యశూరత జూపగావలె
కాంతలో నేడు.

ఇరువదేడు వత్సరంబులు
యిట్టెగడచి పోయెజూడగ
నాంధ్రదేశము వేరుచేసెడు
యాశలడుగంటెక్.

ఆదరంబున యాంధ్రమాతను
సోదరీ కనువిచ్చిచూడుము
దీనతను కృశియించుచును యే
తీరు నున్నాదో.

భారతావని బానిసత్వము
బాపగోరిన యాంధ్ర స్త్రీలు
ధైర్యమున తామెంతసేసిరి
కార్యనిర్వహణం

పూని మీరొక దీక్షతోడ
మానితంబగు నాత్మశక్తిని
తేజరిల్లగ సేవచేసి
తెండు రాష్ట్రంబు.

ఆంధ్రమాతను ముదముగూర్పగ
నాంధ్రభాషను ప్రతిభగల్గగ
నాంధ్రజాతికి సర్వహక్కులు
అమరజేయంగా.

శాంతిసమరమునందు నాంధ్ర
కాంతలెల్లరు దేశసేవను
యెట్టి తెగువను బూనినారో
యట్టి త్యాగముతో.

తెలుగుదేశపు తెరవలందరు
తెగువబూని తెలుగు రాష్ట్రము
విభజనము సల్పంగగోరుడు
విమలహృదయముతో.

తోటివారల జూచివారి
సాటిగా తాముండగోరి
యాంధ్రులూ తామనుసరించుట
యమితహేయంబౌ.

పూర్వపాంధ్ర ప్రతిభగాంచుము
యుర్విలో గల రాష్ట్రములలో
మేటికీర్తిని గన్నతల్లి
సాటిదేశంబు.

నూత్నమార్గముగాంచి సత్వర
యత్నముల్ సేయంగబూనుట
యాంధ్రదేశమునందు బుట్టిన
యతివధర్మంబు.

కాలయాపన చేయనేలను
చాలకాలమునుండి మాతను
భారమైన అరవపొత్తును
బాపుమీవేళ.

వ్యాసములలో దెల్పినను యుప
న్యాసములతో జెప్పిజూచిన
కాసువీసంబేని లాభము
గలుగబోదికను.

కలపు వ్రాతలు గట్టిపెట్టి
కార్యరంగమునందు దూకుము
కలపువ్రాతలు దాల్పవలెను
కార్యరూపంబు.

శక్తిరూపిణులైన స్త్రీల
శక్తి విజృంభింపజేసిన
కాని కార్యముగలదె జూడగ
బూను దీక్షలను.

దేశిరాజు భారతీదేవి.

త్యాగం

శ్రీయుత మద్దాల తాతాజీరావుగారు

మొగలాయిచక్రవర్తి బేబరు మేవాడు సంస్థానంమీదికి దండెత్తివచ్చాడు సంస్థానం అంతా అల్లకల్లోలంగాను, భీభత్సంగానువుంది. తమ మాతృదేశ స్వాతంత్రానికై ప్రజలంతా యుద్ధరంగానికి దుముకుతున్నారు. వీరవనితలందరు వీరపూజలుచేసి ఖడ్గములతో తమ భర్తల హస్తాల్ని అలంకరిస్తున్నారు. యుద్ధరంగమున మరణించిన యోధుల ధర్మపత్నులందరు స్వర్గమందున్న తమ భర్తల సహచర్యమునకై సహగమనమాచరిస్తున్నారు. మేవాడు సంస్థానాధిపతి సంగ్రామసింహుడు రణరంగమున మరణించాడు. మహారాణి తన దాసియగు పన్నాను పిలించింది. 'పన్నా! మహారాజుగారి మరణానంతరం సహగమనంచేయడం నావిధి. కాని, మేవాడు సింహాసనమునకు వారసుడైన నాచిట్టితండ్రి ఉదయసింహుని కాపాడెదనని నీవు వాగ్దత్తమొనర్చినగాని నేను శాంతిహృదయముతో సహగమన మాచరింపజాలను.' రాజసేవాధురీణయగు పన్నా మేవాడు రాజవంశరక్షణాభారము వహించి రాణికి మాట యిచ్చింది.

సంగ్రామ సింహుని మరణం మేవాడు సైనికులనందరినీ నిరుత్సాహపరచింది. నాయకుడు లేని సైన్యం చెల్లాచెదరైపోయింది. కాని మేవాడు ప్రజల అదృష్టవశాత్తు బనవీరయోధుడు చెల్లాచెదరైన సైన్యాన్ని సమకూర్చి, వారిలో సమరోత్సాహాన్ని రగుల్కొలిపి భీభత్సమైన సమరంజరిపించాడు. మొగలాయి చక్రవర్తి అపజయమంది పారిపోయాడు. సంస్థానప్రజలందరూ విజయోత్సవాలను జరిపారు. శుభముహూర్తమున ఉదయసింహుడు మేవాడు సింహాసనమునకు పట్టాభిషిక్తుడైనాడు. మహారాజు బాలుడగుటచే, రాజకార్యముల యథావిధిగ నిర్వహించుటకు బనవీరుడు నియమింపబడ్డాడు. రాజభక్తి పరాయణుడగు బనవీరుడు చాకచక్యముతో రాజకార్యముల నిర్వహిస్తూవచ్చాడు.

సర్వశక్తివంతమగు కాలము బనవీరునియందు కూడ మార్పును తెచ్చింది ఉదయసింహునిశ్రేయస్సు తప్ప మరొకటెరుంగని బనవీరుని హృదయంలో విషజ్వాలలు బయలుదేరాయి. స్వార్థత్యాగియగు బనవీరుడు స్వార్థపరుడయ్యాడు. మేవాడు సంస్థానమునకు మహారాజనిపించుకొనవలెనని వాంఛకలిగింది. ఎవ్వని శ్రేయస్సుకై సర్వత్యాగమొనర్ప సమకట్టాడో, యెవని రక్షణార్థమై కత్తిచేతపట్టి 'యశోమృత్యువ' అని పోరాడేడో అట్టి ఉదయసింహుని చంపతలపెట్టాడు.

సూక్ష్మగ్రాహియగు పన్నా బనవీరుని దురాలోచనను పసికట్టింది. బనవీరుడు రాత్రిసమయమున రాకుమారుని చూచు నెపంబున వచ్చి స్వహస్తములతో ఉదయసింహుని చంపనున్నాడని తెలిసికొంది. ఏ రాజవంశమును రక్షింప తను సర్వత్యాగమొనర్ప సమకట్టినదో, ఏరా కుమారుని కాపాడెదనని వాగ్దత్తమొనర్చినదో ఆ ఉదయసింహుని కాపాడ సమయమేతెంచినది. ధీరవనితయగు పన్నా యీ విషమస్థితిలో నిరుత్సాహపడలేదు. ఎంతటి త్యాగమైననొనర్చి ఉదయసింహుని కాపాడ నిశ్చయించింది.

రాత్రిసమయం మేవాడు రాజమందిరం నిశ్శబ్దంగావుంది. పురప్రజలంతా నిద్రాదేవి కౌగిలిలో విశ్రమిస్తున్నారు. రాజమందిరంలో పన్నా ఒక్కతెమాత్రం ఆలోచనానిమగ్నయై మెలకువగవుంది. ఇంతలో బనవీరుడు రాజమందిరం ప్రవేశించాడు. పన్నా అతనికి స్వాగతమిచ్చింది. "మహారాజు కుశలమా? యేమి చేయుచున్నా"డని యెంతో ఆదరంగా అడిగాడు బనవీరుడు "కుశలమే, అదిగో ఆమందిరమున నిద్రించు

చున్నాడో’’ని రాజమందిరమున నిద్రించుచున్న బాలుని చూపింది. బనవీరుడా మందిరముజొచ్చి నిద్రించుచున్న బాలుని హృదయకుహరమున తన నిశిత కరవాలముంజొనిపి రాజమందిరమును వీడి వెళ్లిపోయాడు. అతని వెనువెంటనే పన్నా ఒకబాలు నెత్తుకొని రాజమందిరమును వీడి అంధకారమున అదృశ్యమైంది. ఆకాశమున నక్షత్రములు మినుకుమినుకుమంటున్నాయి. రాజమందిరమున నిశ్శబ్దంతాండవం చేస్తోంది.

బనవీరుని నిశితకరవాలమునకు ఉదయసింహుడు బలియైనాడా?... లేదు... మరి, బనవీరునిచే చంపబడిన ఆబాలకుడెవడు?... ఉదయసింహుని సమవయస్కుడగు పన్నా యేకైక కుమారుడు.

అహో! పన్నాత్యాగశక్తి అమోఘము. కడుపుతీపును జయించిన ఆపె ప్రభుభక్తి పరాయణత యెంతటిదోగదా! హీనజాతిగ చూడబడుదాసికుల మందుకూడ మహత్తరాదర్శములకై స్వార్థత్యాగ మొనర్చు ధీరకాంతలుగలరనుటకు పన్నాయే నిదర్శనం.

లక్ష్మీ సూక్తి గీతావళి

సర్వలోకైక రక్షక స్వామియైన విశ్వమూర్తికి నతిఁజేసి వినయ ఫణితి
శుద్ధమును లోకహితమునౌ సూనృతముల విన్నవించెద నొక కొన్ని వినుము లక్ష్మి.
ఆట వెలదుల మఱి తేట గీతికలనె వ్రాసియిచ్చితినని త్రోసి చనకు
పండు చిన్నదైన పసకేమి లోపంబు గుణము చూచికాదె కొనుట లక్ష్మి.
అనుభవంబుకొలది ననువైన నీతుల భద్రపఱచియుంటి భవ్యరీతి
సారమెఱిగి వీని సంగ్రహించితివేని నీతి భరితవగుట నిజము లక్ష్మి.

దేవుడు

నిఖిలలోకంబులేలెడి నేతయెవడొ సర్వజీవుల కాశ్రయస్థానమెవడొ
తారతమ్యంబులెఱుగని తండ్రి యెవడొ యతనికొనరింపు భక్తితో నతులు లక్ష్మి.
పాపపుంజాళి భంజించు పరముఁడతఁడు దొడ్డత్రోవను జూపెడి దొరయతండు
భద్రసుఖముల గూర్చెడి భవ్యుఁడతఁడు అతని నమ్మిచరింపుము సతము లక్ష్మి.
నమ్మికొల్చెడి జనముల నెమ్మనముల నెలమి వసియించు బరమేశు నిండు భక్తి
సర్వ కృత్యంబులందును సాక్షిజేసి లెస్స వర్తింప భవబాధ లేదు లక్ష్మి.
సర్వమయుడు స్వామి సర్వమాతనిరూపు సకల మతనియాజ్ఞ సాగిపోవు
అతని యాజ్ఞమీర నలవిగాదెరికి నెఱిగియుండుమిద్ది యెపుడు లక్ష్మి.
విడుతురెల్ల జనులు విడుతురు బంధువుల్ విడుతురాప్తులైన విహితజనులు
విడువరానివాడు విడువకుండెడివాడు దేవుఁడొకఁడె సుమ్ము తెలియు లక్ష్మి.
కష్టచయముచుట్టి కారించు సమయాన బ్రాపులేక మనసు పరితపింప
నండయగుచు నిల్చి యభయమిచ్చెడివాడు దేవుడొకడె సుమ్ము తెలియు లక్ష్మి.

కనుపర్తి వరలక్ష్మమ్మ.

స్త్రీకి ఎట్టివిద్య అవసరము

శ్రీమతి చుండూరి రమాదేవిగా

స్త్రీవిద్య, స్త్రీ స్వాతంత్ర్యము, ఎక్కడచూచినా యీ విషయములే, ఏప్రతి సోదరసోదరీమణిన్ విన్ననూ ఈ వాక్యములే. ఇప్పుడు స్త్రీసమస్య ప్రపంచాన్ని కలచేస్తూంది. భారతనారీమణులు ఇప్పు మేల్కొని, తమబాధ్యతను గుర్తెరిగి, తమ ఔన్నత్యమునకై, ఆందోళన సలుపుతున్నారు. కాని దీనిక ఫలితమేమియు కనపడటంలేదు. స్త్రీలోకమున నిరక్షరాస్యత ప్రబలివుంది. దానిని, నిర్మూలించుటకు ఆందోళన చాలదు. తీవ్రప్రచారం చెయ్యాలి. ప్రతి గ్రామమును, ప్రతి పల్లెయను దిరిగి విద్యా శూన్యతయు గల నష్టములను ప్రబోధంచెయ్యాలి. పల్లెటిదిక్కులందు అవిద్య తీవ్రముగాయున్నది. అచ్చటి జనులు కుమారులను సైతెము, విద్యాహీనులను చేస్తున్నారంటే స్త్రీలకు విద్య ఎట్లా అబ్బుతుంది? ఏ కొద్దిమంది విద్యాభిలాషకలిగి, తమ బాలికలను, చదివింతమన్ననూ, తగిన సదుపాయాలులేవు. ప్రస్తుతము స్త్రీలకొ బడుచున్న విద్య వారికి అవసరముగాని, శ్రేయోదాయకముగాని కానేరదు. ప్రభుత్వమువారు ప్రతిగ్రామ ననూ, స్త్రీ ప్రత్యేక పాఠశాలలు స్థాపించి అందు చిత్రలేఖనము, గానము, రాట్నపరిశ్రమ, గృహాలం ణము, మొదలగు గృహిణీ ధర్మముల కనుకూలమైన విద్యలను ప్రవేశపెట్టి, అర్హతగల యుపాధ్యాయిను నియమించవలెను. అర్హతగల యుపాధ్యాయినుల శిక్షణనొందిన బాలికలు, అణకువ, సహనము, భక్తిశ్రద్ధ కలిగి, తమ భావిజీవితమును సౌఖ్యవంతముగ జేసికొనగలుగుదురు.

విద్యయనిన, ఆంగ్లభాషయనియే కొందరి విశ్వాసము. అందువలననే కొంతమంది తమ బిడ్డలను ఫోర్తుఫారమువరకో చదివించి, మా కుమార్తెలు విద్యావతులని మురుస్తూవుంటారు. అట్లు చదివిన బాలిక ఇటు ఆంధ్రభాషకూ, అటు ఆంగ్లభాషకూ, చెడి (రెంటికి జెడిన రేవడి)వలె తయారవుతున్నారు. ఇ అధికముగా చదివినా, స్కూలుఫైనలు ప్యాసుచేసి నిలిపివేస్తున్నారు. సామాన్య గృహస్థులు అంతకన్న నెక్కువగా చదివించుటకు సమర్థతగలిగియుండరుగదా? అటువంటప్పుడు ఆవిద్యవలన లాభమేమిటి? అ వారికి గృహకృత్యములయందా నేర్పుకలగదు. మాతృభాష అంటే అసలేరాదు. నేర్చిన ఆంగ్లమైనా ఉపయోగముండదు. ఇక మిగిలినదేమిటి? ధనవ్యయము, గృహకృత్యములందు ఆరితేరియుండకపోవుట వంట, శిశురక్షణ మొదలైనవాటియందు విముఖత.

స్త్రీలకు మాతృభాషయైన, ఆంధ్రమున అరజ్ఞానముకలిగి, భారత భాగవతాది సద్గ్రంథములను చక్కగా చదివి, అవగాహనచేసికొన శక్తికలిగివుంటే చాలును. పవిత్రమైన మన మాతృభాషను విడచి, అన్యభాష కోసం పరుగెత్తడం అవివేకము. పైన చెప్పబడిన చిత్రలేఖనము, గానము మొదలైనవాటివలన మానసికాన దము కలుగును. రాట్నపరిశ్రమవలన కలుగు ఫలితము ప్రతివారికి తెలిసియేవుంది.

ఇవియేగాక, శిశుపోషణ పాకశాస్త్రము, స్త్రీలు బాగుగా నేర్చియుండాలి.

ఇవిగాక అనుదినము, జాతీయ వార్తాపత్రికలను తెప్పించుకొని, చదువుకొంటూ వుండాలి. ప్రపం జ్ఞానము సంపాదించడానికి యింతకన్న ముఖ్యసాధనములేదు. ఇంటనుండియే అమితమగు జ్ఞానోపార్జన చే వచ్చును. పత్రికా పఠనమువలన ప్రపంచమున ఏమూల నేమి జరుగుతూవున్నదో చక్కగా గ్రహించవచ్చును.

గృహమునకు అధిదేవత స్త్రీ, సంసారచక్రమును నిర్విచారముగా త్రిప్పకలుగునది ఆ దేవీమూర్తియే సంసారమును ఒడిదుడుకులులేక ప్రశాంతముగా నడపకలుగుటకు నారీమణులకు విద్య మిక్కిలి యవసరము విద్యావతియైన స్త్రీరక్షణక్రిందనున్న గృహము సర్వాలంకారశోభితమై, శాంతిదేవతావాసమై వి జిల్లుతూవుంటుంది. ఇటువంటి ఉత్తమ విద్యలందుమాత్రమే స్త్రీలు కృషిచేసిన మన సంఘం సర్వతోముఖాన అభివృద్ధి చెందుతుంది.

అభినందనము

ఉ. మొల్లరచించె నెట్టి పరిపూతము రామకథామృతంబులో
నల్లనఁ దేల్చి యాంధ్రభువి నప్పటికిప్పుడుఁ దెల్గుఁదోఁటలో
మొల్లవొ మల్లిమొగ్గవొ గుబుల్కొనఁ జేసితి రామకావ్య సం
ఫుల్లసుధల్ గొనన్ భ్రమరముల్ బలె మ్రోయఁగ శ్రీ సరస్వతీ.

సీ. తనగురుత్వము ఫలించినతోసమున సుబ్బరాయలుమింటికో రాయిడింప
తనమహాకృతికిఁ బాత్రంబైన కవయిత్రి కదయుని దాతకంకణమునొసఁగఁ
దనలలితాంగి సత్కారంబుఁ గొనఁగాంచి ప్రతిభుండు గోపాలరావు మరియ
నీ తెన్గు పల్కుపందిటపూయు కబ్బంపు పూలేరి సతులు కొప్పులధరింప

గీ. నాంధ్రలోకము నిరతంబు నభినుతింప
కేసరీ స్వర్ణకటకకింకిణులు మొరయఁ
దెలుఁగుఁదోఁటఁబికాంగనా పొలుపుమెరయ
శ్రీ సరస్వతి! విహరింపు చెలఁగసొంపు.

సీ. సాహిత్యకుంకుమ సారెలంపింపంగ గృహలక్ష్మి కిన్నియోగించిమున్నె
ఆయురారోగ్యంబు లభివృద్ధి పొనరింప లోధ్రామృతంబు నాలోనఁ బంచి
ఆంధ్రసాహిత్యకల్యాణగీతుల నాలపించు తల్లుల సత్కరించుచుండి
పూసంతభేదంబు బుద్ధినుంపక భళి కార్యాలయోద్యోగ గరిమ నెంచి

గీ. ఇద్ధ మహిళాప్రపంచమ భ్యుద్ధరింప
నీవు గావించుచున్న సంసేవనమున
ఋణపడిరి తెల్గువారిది యెఱుఁగవీవు
కేసరీ! ధన్యుఁడవునీకుఁ గేలుమోడ్తు.

గీ. చిరతరంబగు సుబ్రాయ గురుఋణంబు
కొంత కాదంతయును దీర్చికొంటివేమొ?
తెనుఁగు పొలములకీర్తి చందనపుఁబంప
చితుకపండింది యతనికిచ్చిన కతమున.

వీరుభొట్ల సూర్యనారాయణ.

ప్రేమ

శ్రీయుత డి. రామావతారంగారు

ప్రేమ! ప్రేమ!! ప్రేమ!!! ఆహా! ప్రేమ యందెంత రుచియున్నది! ఎం సౌఖ్యమున్నది! ఎంతటి ఆనందముకలదు! స్వర్గ సోపానములకు దారి జూపునది 'ప్రేమ' కదా! అజ్ఞానాంధకారమునబడి జీవిత పరమావధి నెఱుంగక సిలుగులబొందు మా నకు ప్రేమ జ్యోతియేకదా ఆధారము సంసారసాగరంబునబడి కొట్టుకొనుచు దా తెన్నుల గానకుండు మానవుని సచ్చిదానందమూర్తియగు భగవానునంక స్థలమ గూర్చుండబెట్టునది ప్రేమయేకదా! సారములేని సంసారము భార్యాభర్తలందుద్భవిం నిష్కల్మష ప్రేమవలననేకదా తిరుగ సారవంతమగుచున్నది.

సృష్టికిమూలము ప్రేమ. మానవునిజీవన క్రమమునకు గారణము ప్రేమ. క్రూ వన్యమృగంబులు తమతమ నిర్ణీతస్థానములవదలి మానవులపై నొక్కపెట్టుగాబడి మానవుడేమగును? కాని అట్లెన్నడైన జరిగినదా? లేదే. మానవుడుపుట్టి కనులుతెర టకు బూర్వమే నతని భావిజీవితమున కవసరమగు పదార్థములను భగవంతుడు ప్రే వలననేకదా సృజించినాడు.

ఇంతటి మహత్తర ప్రభావ సమన్వితమైన ప్రేమను మానవులలవరచుకొనవలెను అనగా మానవుడు ప్రేమించుటను నేర్చుకొనవలెను. పెద్దలయెడ మర్యాద, బంధువు మీదప్రీతి, పరిజనులపైదయ, భార్యయందనురాగము, దీనులయెడ దాక్షిణ్యము ఇవన్నియు ప్రేమ స్వరూపములే. కాని ఇందలి ప్రేమ పరిపూర్తివహింపలేదు. సృష్టి యందలి సకల జంతుసంతతిపైగల నిర్మలప్రేమయే దీని పరిపూర్ణావస్థ.

ప్రేమించుటను నేర్చుకొనుటతోడనే మానవుడా ప్రేమకు లక్ష్యముగోరును అశాశ్వతములగు నైహికములకు దన ప్రేమను లక్ష్యభూతమొనర్పక నిత్యమై, సత్యమై వెలుగొందు పరమేశ్వరుని దిశకు దాని బ్రసరింపజేయును. అంతటితో నతనిజీవితమం నూత్నశకము ప్రారంభమగును; అతనిలో భక్తి మొలకలెత్తును. భక్తియేకదా భగవ తుని వశపర్చుకొనుట కేకైక సులభసాధనము. ఇందులకు రామకృష్ణ డేమనినాడు! "కోతిపిల్లవలెగాక మానవుడు పిల్లిపిల్లవలె నుండుటయే మేలు". ఇందలి భావమేమి! జ్ఞాని యగుటకన్న మానవుడు భక్తుడగుటయే మేలు.

సోదరులారా! ఇప్పటికైన ప్రేమయొక్క ఆవశ్యకతను గమనించితిరా? ప్రేమయే కదా భక్తికి మూలము. భక్తివలననేకదా పరమార్థమును సాధింపవచ్చును. కా మనము భక్తులముకావలెనన్న దొలుదొల్త ప్రేమించుటను నేర్చుకొందము ప్రేమదేవత పాసింతము. ఆమె సాక్షాత్కారము బొంది భక్తిలో బ్రవేశించి, భక్తులమై, భక్తిలో లీనమగుదుము గాక!

పెట్టుడు పేరు

శ్రీమతి నిడమర్తి సరసమాంబ

మా యుపాధ్యాయుఁడుగారు చాల ముసలివారు. ముసలివారికి సహజములైన కోపము, చిరాకు, ఆయనకు హెచ్చు. బడిలో నేదియో యొక మిషపెట్టి చీటికి, మాటికి బడిపిల్లలఁ దిట్టుచు, కొట్టుచు, మధ్య మధ్య కునుకుచు కాలము వెళ్ళఁబుచ్చుచుండెను. ఒక్కొక్కప్పుడు ఏ కుఱ్ఱవానికో పాఠముఁ జదువుమని చెప్పి కుర్చీలో చిన్న నిద్రఁ దీయుచుండును. బాలుర యల్లరివల్ల నాతనికి మెలకువ వచ్చినతోడనె చీకాకుపడుచు నందరిని వరుసపెట్టి చావఁ గొట్టుచుండును. పాఠములు చదువకున్న నతఁడేమియు ననువాఁడుకాడు కాని యల్లరిచేసినమాత్ర మాతఁడుగ్రుఁడగును. ఎట్టి బెత్తమైన నాతని చేతులలో నొక నెలదినములలోపున నాశన మగును. పిల్లలందఱికి నతనియెడల నమితమైన భయము.

దీనికితోడు మా తరగతిలో ముగ్గురు బాలికలు చదువుచుండిరి. వారిని వెక్కిరించియు, వారిపై కాగితపు బంతులఁ విసరియు, సిరాను జల్లియు, పుస్తకముల నపహరించియు వారినేడ్పించి బాలురు వినోదించుట మానకుండిరి. ఉపాధ్యాయుని బెత్తమునకు పని కలుగుచునే యుండెను.

బడిలో నందరికన్న నే నమాయకుఁడనగుటచే వీలగునపుడెల్ల గడుసరి బాలురు వారి యపరాధముల నాపై మోపి చల్లగ తప్పించుకొనుచుండిరి. ఉపాధ్యాయుఁడుగారు నన్ను 'మెత్తనిదొంగ' యని శిక్షించుచుండెడివారు. నేనేమియుఁ జేయలేకుండుటచే నుపాధ్యాయు నీలోకమునుండి శీఘ్రముగఁ దీసికొనిపొమ్మని దేవుని ప్రార్థించుచుండెడివాఁడను.

మా తరగతి బాలికలలో 'మీనాక్షి' యొకతె. ఆమె మాయూరి మేజస్ట్రీటుగారి కుమార్తె. నల్లగ, మిక్కిలి పొడవుగ నుండును. మెడ పొడవుగను, వికృతముగను యుండును. దైవమీయని యందముఁ దెచ్చి పెట్టుకొనుటకై యామె చేయని ప్రయత్నముండదు. ఆమెను తఱచుబాలుర గేలిచేయుచుందురు.

ఒకనాడుదయమున బడివేళకుఁ గొంచెము ముందుగ మా తరగతిహాలులో బాలురందరు సమావేశమై, కేకలతోడను, నవ్వులతోడను, పరిహాసములతోడను, పాటలతోడను గదిగోడలను ప్రతిధ్వనింపఁజేయుచుండిరి. గంట మ్రోగినతోడనె యంతయు నిశ్శబ్దమాయెను 'టిక్', 'టక్' మని జోడుల శబ్దమాయెను. ఎవరి స్థానములకు వారు పోయి, యుపాధ్యాయునికై ఎదురుఁజూచుచుండిరి. దొరసాని జోడుఁ దొడగికొని యతి యొయ్యారముగ నడుచుచు, మీనాక్షి లోపలకు వచ్చుచుండెను. అందరి దృష్టు లామెపైఁబడెను. ఆమె పెద్ద పెద్ద నీలిపువ్వులుఁ గల తెల్లని సిల్కుచీరఁ గట్టినది. కండ్లకు సులోచనముల దగిల్చినది. ఒక కొంటె కుఱ్ఱవాఁడు 'సినీమాతార' యనెను. అందరు నవ్విరి; యింకొకఁడు 'అప్సరస' యనెను; మరల నవ్విరి. కాని తెలివిఁ గల బాలుఁడొకడు 'జిరాఫీ' యనినతోడనే హాస్యములతోడను, కరతాళధ్వనులతోడను, గదియంతయు గగ్గోలయ్యెను. అందరాతనియుక్తికి మెచ్చుకొనిరి. ఇంతలో నుపాధ్యాయుని రాకచే నంతయుఁ జల్లారెను.

నాటినుండియు మీనాక్షికి "జిరాఫీ" యెగతాళిపేరాయెను. కొన్నాళ్లకు మీనాక్షికి "జిరాఫీ" యను నామము పరిపాటాయెను. ఆమె యసలుపేరు నందఱు మరువఁజొచ్చిరి. "జిరాఫీ"యనినఁగాని చాలమంది యామెను గుర్తింపఁజాలకుండిరి. మీనాక్షికిది దుర్భరముగనుండెను. ఒకనాడామె తండ్రితోఁ

నిది యెల్లఁజెప్పియేడ్చెను. మరునాడు మేజస్ట్రేటుగారు బడికివచ్చి ప్రధానోపాధ్యాయునితో నిదియెల్లఁజెప్పి “ఇట్టి దురాచారమును మాన్పింపలేకున్న నీవీపదవికెట్లు తగుదువు? నీకండ్లయెదుట బాలురిట్టిదుండగము చేయుచుండ నీవెట్లూరకుంటివి” అని నిష్ఠురములాడిపోయెను.

ప్రధానోపాధ్యాయుఁడు వెంటనే యుపాధ్యాయులనందరిని బిలపించి, వారికీసంగతులఁదెల్పి ఈ విషయమై తగిన శ్రద్ధతీసికొనుఁడని మందలించెను. అటుతరువాత ‘ఏ తరగతివిద్యార్థి యామె నవమానపరచినను, యాతరగతి యుపాధ్యాయునిపై గట్టిచర్య తీసికొనఁబడును’ అని బెదరించెను.

మా యుపాధ్యాయుఁడు తిరిగివచ్చి, మాకొక పెద్ద యుపన్యాసమిచ్చిరి. ‘ఇకముందు ఎవరినోటినుండి యైననుసరియే, ‘జిరాఫీ’యను శబ్దమువచ్చినయెడల వానిని హతమార్తును. ‘జిరాఫీ’యేమిటి? మీతలకాయ ‘మీనాక్షి’యనుటకు నోరునొప్పియా? ఇదిగో నందరువినుడు. ఆఖరుసారి తెలియఁజేయుచున్నాను. ఇటుపైన నెవఁడైనను, “మీనాక్షి”యనకుండ “జిరాఫీ”యన్నాఁడా, చచ్చినాడన్నమాటే! వీపుతోక్క వొల్చివేయుదును. హుఁ! జాగ్రత!’ అని హుంకరించెను.

మధ్యాహ్నము జాగ్రఫీపాఠము కొంచెముచెప్పి, ఉపాధ్యాయుడు విసుగుగనుండుటచే నన్ను నిలువఁబడి పాఠము గట్టిగఁజదువుమనిఁజెప్పి పుస్తకమును క్రిందఁబారవైచి, కాళ్లు మేజాపైఁజాచుకొని కుర్చీలోఁ జారఁబడెను. నా దురదృష్టమును నిందించుకొనుచు నేను పాఠముఁజదువ నారంభించితిని. ఉపాధ్యాయుఁడుగారు చిన్నకునుకుఁదీయుచుండిరి. నేఁజదువుచు, ‘ఇచ్చట జిరాఫీయను పొడుగు మెడఁగల వింత మృగము గాననగును.’ అనువాక్యము కడకువచ్చితిని. నా కుపాధ్యాయుని హెచ్చరిక తటాలున జ్ఞాపకమువచ్చెను. కొంత జంకుపుట్టినది. బాలురందరు నావైపుఁ జూడసాగిరి. నేను కొంచమాలోచించి, యుపాధ్యాయుని హెచ్చరిక ననుసరించి, ‘ఇచ్చట ‘మీనాక్షి’ యను పొడుగు మెడఁగల వింత మృగము.........’ అని వాక్యము పూర్తిగ చదువకమునుపె, త్రుళ్లిపడి యుపాధ్యాయుఁడు లేచి బెత్తమందుకొని సింహమువలె గర్జించుచు నాపైకురికిరి. మరుక్షణము నాపై దెబ్బలవర్షము కురియుచుండెను. నే నేడ్చుచు ‘అయ్యా! నేచేసిన తప్పేమి? మీయాజ్ఞానుసారమే చేసితిని.’ అంటిని. ‘పొగరుబోతా! నాతో నీకుహాస్యములటరా’ యనియాయాసముతో వగర్చుచు మఱింత గట్టిగఁగొట్టెను.

ఆరాత్రి మఱింత భక్తితో దేవునిప్రార్థించితిని.

భాగవత సేవ

సీ. సంసార గంభీర సాగరంబుఁ దరింప ఘనమైన నావ భాగవత సేవ
బహుజన్మ సంచిత పంకంబు సడలింప గంగాభి భావ భాగవతసేవ
అజ్ఞానతామిస్రమడగింపఁగా జ్ఞాన నవదీప భావ భాగవతసేవ
నిరయభీతినిఁబాపి హరిపదంబును జేర్పఁ గలరాచ త్రోవ భాగవతసేవ
గీ. సతతసజ్జనబృంద సంగతికిఁ గ్రేవ కమలనాభాశ్రయానందకర ప్రభావ
మోక్షకల్ప ద్రుమంబెక్క మొదటితీవ భువనరక్షా ప్రభావ భాగవతసేవ.

గంధం నరసింహాచార్యులు

రాఘవా!

ఉ॥ బుట్టెడు భూతిబూసికొని పొల్పుగదానము లెన్నిసల్పినన్
వట్టిశ్రమేసుమీ, యరయ పాపవితానమడంగ బోదు, జే
పట్టదు మోక్షలక్ష్మియును, పాయక నీపదపంకజంబులన్
గట్టిగ బట్టివేడగనె గాంతుము ముక్తిఫలంబు రాఘవా॥

ఆపదకాలమందు నిను నాత్మవిశుద్ధిగ పెక్కుసారులున్
ఆపదబాంధవా! దురితహారణ! శ్రీధవ! విశ్వవంద్య! నా
పాపము లన్నియున్ మరచి పాలనసేయుమటంచు వేడగన్
తాపముమాని గాతువుగదా యిల భక్తులనీవు రాఘవా॥

క్రూరులు దానవాధములు గొల్లునయేడ్వగ మౌనిశ్రేష్ఠులన్
కారుణికోత్తమా! మిగుల కష్టముపెట్టగ నుగ్రమూర్తివై
వారిని రూపుమాపితివి పౌరుషమొప్పగ కార్ముకాహతిన్
దీరెను వారిబాధలిల దిక్కులు సంతసమొందె రాఘవా॥

వారణరాజు మాయకరి బాధల నోర్వగలేక అమ్మయో!
తారకనామ గావుమని ధర్మము దప్పక పెక్కుభంగులన్
దీరుగనిన్ను వేడగనె దీనజనావళిరక్షకా! త్రుటిన్
పేరునులేక నామకరి పీచమడంచితి వీవు రాఘవా॥

శాపవశంబునన్ పరమ సాధ్విశిలాకృతి నయ్యహల్యనో!
పాపవిదూర! నీవిమల పాదరజంబున నాతిజేసి, సం
తాపము బాపినాడవని తారకనామము నెల్లవేళలన్
యోపిన భక్తితో స్మరణ నుల్లమునందున జేతు రాఘవా॥

మున్నొకరాక్షసాధముడు ముద్దగు హేమకురంగరూపుడై
పన్నెను మాయలన్ దురితభంజన! చిక్కులు నిన్ను బెట్టగన్
ఖిన్నుడవీవుగాక, వడికేలను బాణముబూని వాని నా
పన్నునిజేసి గూల్చితివి పౌరుషమొప్పగ దొల్లి రాఘవా॥

పిల్లలమఱ్ఱి కృష్ణమూర్తి.

లాటరీ

శ్రీయుత పి. వి. రామచంద్రమూర్తిగారు బి. ఏ.

(రేడియో ఉపన్యాసము)

కామాక్షి: ఏమిటినాన్నా వెతుకుతున్నావ్ ?

విశ్వనాథం: అయిదురూపాయిల నోటమ్మా. ఈ డ్రాయర్లో పెట్టేను !

కా: ఏమిటీ ! 5 రూపాయిలు నోటా ! మొన్న దీపావళికి పట్టుపరికిణీ కుట్టించమంటే రాగిదమ్మిడీకూడా లేదన్నావ్. 5 రూపాయిలు పెట్టుకునే అబద్ధమాడావన్నమాట. పోనీలే.

విశ్వ: అదికాదమ్మా, నేతివాడిబాకీ తీర్చడంకోసం ప్రత్యేకంగా ఆనోటు దాచా. అలా కేటాయింపుగా ఉంచకపోతే ఐదుగాదు 5 వందలకి సరిపడేఖర్చుంది... సరే ఇంతకీ నోటేమయింది ?

కా: ఏమయిందా ? నీవు లేదని అబద్ధం చెప్పినందుకు, అలాగే లేకుండాపోయింది !

విశ్వ: అబ్బ ! ఏదిపట్టుకుంటే అదేనే నీకు... ఆనోటు పోయిందీ తెలీదు, ఉన్నదీ తెలీదు... ఒ.రేయ్ పెద్దబ్బాయి, ఈ డ్రాయర్లో నోటుపెట్టేను, మీరెవళ్లైనా చూశారా ?

రాఘవరావు: ఏమిటండీ, ఫైవ్‌రూపీ నోటేనా ?

విశ్వ: ఔను.

రాఘు: ఇప్పుడేంచెబుతుందో అమ్మ ! పిచ్చి ఆలోచనలకిపోయి డబ్బు తగలెయ్యకమ్మా అని చెబితే వింది కాదు ?

విశ్వ: తగలెయ్యడమేమిటి ? మళ్లీ తగరపుతప్పేలా ఏమైనా కొందేమిటి ?

రాఘు: అలాగైతే నయమే !

విశ్వ: మరేంచేసినట్లు ?

రాఘు: ఆవిణ్ణే అడగండి. నేను చెవికిల్లుగట్టి పోరేను వద్దని. పోనీ నాన్నగారితో సలహాచేసి కానీ చెయ్యొద్దన్నా. వినందే.

కాంతమ్మ: (ప్రవేసించి) ఏమిట్రా అది ? నామీద ఏవో నేరాలు చెబుతున్నావ్ ?

రాఘు: ఆ 5 రూపాయిల సొమ్ము ఎలా తగులడిందని నాన్నగారడుగుతున్నారు.

కాంత: (కొంచెం చిరాకుతో) తగలెయ్యడమేమిట్రా తెలివితక్కువవాజమ్మా ! అలాంటి అవాచ్యం మాటలు నోటమ్మట రాకూడదు.

విశ్వ: (కొంచెం విసుగుతో) సరేనో ! మరేంచేశావో చెప్పరాదూ ?

కాంత: ఏమిటండీ నేనేదో పాడుచేసినట్లు నిలదీసి అడుగుతున్నారు ! ఆ సొమ్ము సద్వినియోగమే ఐంది.

విశ్వ: అంటే ?

కాంత: ఈవేళ శుక్రవారం మహాలక్ష్మికి భక్తితో పూచ్చేసి, ధనప్రాప్తి కలగాలని కోరుకుంటూ...

విశ్వ: సరి! ఆ 5 రూపాయిలూ చిట్టిశాస్త్రుల్లుకి దక్షిణగా ముట్టచెప్పినట్టున్నావ్.

కామాక్షి: (మెల్లిగా) కాదునాన్నా, లాటరీలో వేసింది.

విశ్వ: (నిర్ఘాంతపోయి) లాటరీలోనే! 5 రూపాయిలూనా?

రాఘు: ఆహా! నిస్సంకోచంగా!

విశ్వ: ఇదేమిటే? మనకి లాటరీ ఎందుకే? కష్టపడి సంపాదించుకుంటూన్న డబ్బుతో తృప్తిపడక, లాటరీలో అప్పనంగా డబ్బొచ్చిపడాలన్న దురాశపట్టుకుందేమిటి?

కాంత: దురాశేమిటండీ! డబ్బుచేదామిటి? అదృష్టం బాగుండి ఏ పాతిక వేలో వస్తే, హాయిగాఉండొచ్చు.

విశ్వ: (హేళనగా) పాతిక వేలే! చాలా!

కాంత: ఎందుకండీ ఆ వెటకారం? పెసరట్ల బుచ్చిలింగానికి లక్షరూపాయిలు రాలేదూ! ఆమాత్రం చెయ్యక పోయామా మనం?

విశ్వ: (చిరాకుతో) చాల్లే! 'తెలివితక్కువపనిచేశాం'! అని అఘోరించక, ఇంకా సమర్థించుకుంటున్నావ్. ఇంతకీ తప్పంతా నాది! సొమ్ము పెట్టిలోపెట్టి తాళంవేసుకోక, 'ఎవళ్లిష్టమొచ్చినట్లు వాళ్లు తగ లెయ్యండి' ని డ్రాయర్లోపెట్టి పోవడమేమిటి?

కాంత: (చిన్నబుచ్చుకుని) నేను జన్మానికల్లా శివరాత్రని ఒక్కమాటు ధైర్యంచేసి మీడబ్బు ముట్టుకున్నందుకు, మీ యిష్టంవచ్చినట్లు మాట్లంటున్నారు. అనండి ఎన్ని అనాలో! ఇంతకీ ఆడదాన్నని నోరుమూసు కూరుకోక ఇంత స్వతంత్రించడమేమిటి నేను!

(అంతా నిశ్శబ్దం)

కా: అదుగో చిన్నన్నయ్యొస్తున్నాడు.

ఆనందరావు: (ప్రవేశించి) ఏమిట్రా! అంతా ఓచోటచేరి ధ్యానంచేస్తున్నారు?

కా: (కొంచెం రహస్యంగా) చిన్నన్నయ్యోయ్! అమ్మేమో లాటరీలో 5 రూపాయిలేసిందని నాన్న కోప్పడ్డాడు.

ఆనం: I see! (అందరిముఖాలూ Study చేసి) అమ్మా, లాటరీలో ఎందుకేశావే?

విశ్వ: ఎందుకేమిటీ? ఒక్కమాటుగా పాతిక వేలొచ్చి పడతాయని!

ఆనం: (సీరియస్‌గా) అయిదయిదులు ఇరువై ఐదు. రూపాయిపెట్టుబడికి 5 వేలు రాబడన్నమాట! ఇంకనే! ఫస్టుక్లాస్ ఇన్వెస్టుమెంటూ! 'డబ్బొస్తే అంతా సుఖపడొచ్చు' అనే ఉద్దేశంతో లాటరీవేసింది గనక ఆవిడ ఉద్దేశంకూడా బోనాఫైడీయే! ఇంక అమ్మమీద కేసేముంది నాన్నా!

విశ్వ: (చిఱునవ్వుతో) అమాంతంగా ఆ పాతిక వేలూ ఒక్కమాటొచ్చిపడితే దాన్ని ఏవిధంగా ఖర్చుపెట్టడం అని ఆలోచిస్తున్నాకాని, కేసేమిటి?

ఆనం: ఎలా ఖర్చుపెట్టడం అనే విషయంకూడా ఇప్పుడే సెటుల్ చేసుకోడం మంచిది. ఈవేళ చేసుకోగల పని ఇంకోప్పటికి పోస్టుపోన్ చెయ్యడమెందుకు?... ఏమోయ్, అన్నయ్యా, నీకేమైనా సొమ్ము కావలసుంటుందా?

రాఘు: రెడీగా ప్లానున్నవాణ్ణి నేనే. మొన్న మా ప్రొప్రయిటరుకీ నాకూ మాటామాటవచ్చి 'ఉద్యోగా రాజీనామా ఇచ్చేద్దామా' అన్నంత చిరాకేసుకొచ్చింది. మనకే డబ్బుంటే స్వతంత్రంగా బిజి స్టార్టు చేసుకొని ఒకడికి ప్రాధేయపడక్కర్లేకుండా ఉండొచ్చు అనుకున్నా. మనకు సొమ్ము విధానండుందీ అంటే ఆమరుక్షణమే వెళ్లి, ప్రొప్రయిటరుతో 'నువ్వెంత చేసు నీఉద్యోగం ఎంతచ్చే మోహంమీద నాలుగూదులిపేసి చక్కావస్తా.

ఆనం: భేష్! అప్పుడు 'రావ్ బ్రదర్సు - కెమిస్టుసు అండ్ డ్రగ్గిస్ట్సు' అని బ్రహ్మాండమైన బోర్డు తయా చేయించి, వాడి షాపుకెదురుగుండానే నీ షాపుకూడా పెట్టి వాడి బిజినస్సంతా నువ్వే వేసుకోవచ్చు ఒక చిన్న కారుకూడా కొను. అయితే మొదట పెట్టుబడికి ఏమాత్రం కావలసుంటుంది.

రాఘు: అంతా పోగుచేస్తే ఏడెనిమిదివేలకంటె ఎక్కువవదు.

విశ్వ: సరే తొమ్మిదివేలనుకుందాం. ... ఆనందం! నీ స్కీమేమిట్రా.

ఆనం: (చులాగ్గా) ఈ ఆనర్సు పూర్తిఅయే అవడంతో డైరక్టుగా ఇంగ్లండు వెళ్లిపోవడం. I.C.S. అపియరవడం. సెలక్టయి టుప్‌టాప్‌గా చక్కారావడం.

రాఘు: ఇంటిపేరు పేరుక్రిందా, పేరు ఇంటిపేరుక్రిందా తారుమారుచేసి, A. గుంటముక్కల I. C. S. వ్యవహరింపబడడం.

ఆనం: పేరు అంత పొడుగుంటే బాగుండదు. అంతేకాకుండా కేవలం వైదికంగా ఉందది. A. G. ముఖల్ I. C. S. అంటే సొంపుగా ఉంటుంది.

విశ్వ: రైట్! నీ I. C. S. కి ఓ 10 వేలు పడుతుందనుకుంటా.

ఆనం: ఆ. ఎలాగో మేనేజ్ చెయ్యొచ్చు.

విశ్వ: అమ్మడూ! నీక్కూడా ఏమికావాలో చెప్పెయ్యి, ఆనక మళ్లీ చెప్పకుండా.

కామా: (ఆలోచించి, ఆలోచించి) నాకా? నాకో గొలుసు చేయించు నాన్నా!

కాంత: ఓసి వెట్టిమొహమా! ఇంతేటే. అన్నలిద్దరూ తండ్రి సంపాదించిన ఆస్తికి మళ్లే తలోపదేసి పంచుకుంటూంటే, నీకొక్క గొలుసేటే కావలసింది?

రాఘు: పోనీ అమ్మా, చెల్లికి తెలియకపోతే దానికేంకావాలో నువ్వాలోచించి చెప్పరాదూ?

కాంత: ఏంకావాలేమిటి? బోలెడంత ఖర్చుంది. దానికి మంచి సంబంధం చెయ్యాలంటే తగినకట్నం లాంఛనాలన్నీ జరపాలి. నగలనీ, నాణేలనేకాకుండా, ముద్దుముచ్చట్లన్నీ జరగాలి. అప్పుడు సొమ్ముకోసం తడుముకోడంకంటె, ఇప్పుడే ఓ 5 వేలైనా బ్యాంకులో వెయ్యడం మంచిది.

ఆనం: Good Idea! సరేకాని, అమ్మా, నీకేంకావాలో చెప్పేవు కాదు.

కాంత: నాకా నాయనా, తండ్రీ కొడుకులూ చేరి అయిందానికీ కానిదానికీ చివాట్లెట్టకుండా ఉంటే చాలు. నాకింకేమీ అక్కర్లేదు.

కామా: నాన్నోయ్, అమ్మకేంగావాలో చెప్పనా!

కాంత: ఏంకావాలో నీతో చెప్పించానేమిటి?

కామా: ఇంజనీరుగారి పెళ్లాం నిన్ను చేయించుకోమని చెప్పలేదూ ?

కాంత: ఊహూ! అన్నీ వినొచ్చి, నిన్నిక్కడ చెప్పమన్నారు కాబోలు! ఇంజనీరుగారి భార్యకేం, ఆవిడ తొంభై చేయించుకోమంటుంది. మనకు తాహతుండొద్దూ.

విశ్వ: తాహతు లేకపోవడమేమిటే పాతికవేలొస్తోంటే! ఏమిచేయించుకోమన్నారో చెప్పు.

కాంత: ఊహు!

కామా: రవ్వలదుద్దులు నాన్నా!

విశ్వ: అలా చెప్పవేం ఇంకనే!? అహ్హహ్హహ్హ. [అంతా నవ్వుతారు.]

విశ్వ: భేష్! చవట 5 రూపాయిలు పోతే పోయాయి కాని చక్కటి తలపులు పుట్టేయిమీ అందరికీ!— అయితే ఆనందం! మొత్తం లెక్కచూడు రాఘవకి తొమ్మిదివేలు, నీకు 10, అక్కడికి 19 వేలయాయి, చెల్లికి 5 వేలు, ఇంకో వెయ్యి మిగుల్తుంది.

ఆనం: ఆ వెయ్యీ అమ్మ రవల్దుద్దులికి సరిపోతుంది.

విశ్వ: (నవ్వుతో) అయితే ఆఖరుకి పాతికవేలొచ్చినా నాకేమీ మిగలదన్నమాట!

రాఘ: మిగలకేం?

విశ్వ: ఏదీ! ఏంమిగిలింది?

రాఘ: నేతివాడి అప్పు! [అందరూ నవ్వుతారు.]

పదిలక్షలకు పైగా చలిజ్వరముచే మృతినొందుచున్నారు

డాక్టర్లు హిందూదేశపు ఈ ఉపద్రవమును ఎదుర్కొని పోరాడుచున్నారు.

ఆహారపుసంశయము పరిష్కరించబడినది. హిందూదేశములో ప్రతిసంవత్సరము చలిజ్వరము (మలేరియా)చే 10లక్షలకు పైగా జనులు మృతులగుచున్నారని సర్కారువారిచే అంచనగా వేయబడినది. అన్నికారణములవల్ల కలుగు మరణసంఖ్యలో 100 కి 16వంతున ఎక్కువైనది. జ్వరమువచ్చినపుడు గమనించదగు విషయములలో ఆహారమొకటి. జ్వరమునిలచిన తరువాత కూడ జీర్ణశక్తిచాలవరకు క్షీణించుటచే ఆహారమును తలచినంతనే అసహ్యము పుట్టించును. అయినను జ్వరపువిషముచే శక్తిహీనమైన నరస్నాయువులకు తప్పక శక్తినికూర్చవలయును. దీనికితగు ఆహారము హార్లిక్సని డాక్టర్లు గ్రహించియున్నారు. కొలకొలది రోగులకు దీనినిచ్చి పరీక్షించగా ఎటువంటి నిర్బలులైనను దీనిని జీర్ణించుకొనగలరని తెలుపబడినది. ఇది వందకు వంద పుష్టినిచ్చునదిగాన స్నాయువులలోపోయి దేహమంతటికిని బలమును చేకూర్చును. రోగులకు హార్లిక్సే తగుమైన ఆహారమని డాక్టర్లు దీనినే సిఫారసుచేసి యున్నారు.

అభినందనము

శ్లో. శ్రీ ధీ హ్రీ స్సముద్యోగ భోగమోగార్థ సిద్ధయః
ప్రాప్యంతే ప్రాణిభిర్యస్మాత్ బ్రహ్మ, త, చ్ఛ్రియసేఽస్తుతే.

శా. నాచేతంబున వాక్కునన్ గృతినిలీన శ్రీకమై నిల్చిమ
ద్వాచారంభమ మోఘమున్ సరససంభావ్యంబు దివ్యత్సుధా
ప్రాచుర్యంబగురీతి దిద్దికొని హర్షంబందు వాగ్దేవి మా
శ్రీ చేబ్రోలు సరస్వతీ సతిని సంప్రీతిన్ గటాక్షించుతన్.

సీ. నిర్వ్యాజ కరుణవాణీదేవి తనపైఁడి యూఁటలూ రెడికలం బొసఁగుఁగాత!
గృహలక్ష్మి రత్నస్థగి త కంకణమునుంకు విడిమెచ్చితాఁ జేతఁ దొడుగుఁగాత!
జగదేకమాత యీశ్వరి చెక్కు సెడని కుంకుముబొట్టు నొసటఁ గీల్కొలుపుఁగాత!
నుతమహావ్రత యరుంధతి దీవెనలుపాడి యెఱనీరుదీసి మేలిడెడుఁ గాత!

గీ. సరస కేసరి యిడు బహూకరణ సన్మ
హూర్తమున నీకు సత్యామరోక్తి కలన
నో సరస్వతి! చేబ్రోలుయోగ్య వంశ
రాజగోపాలరమణి! సద్గ్రంథ కర్త్రి!

చతుర్వేది అమరేశ్వరశాస్త్రి

గీ. అక్షరబ్రహ్మ రూపార్చనాను రక్త
వగుచుఁ జతురాన నావాప్తి నలరునీకు
ఓ సరస్వతి! ఈ కంకణోపహార మెంత?
అదికంకణ సమమై యొసఁగుఁగాదె?

గీ. "అత్తకోడండ్ర కెన్న జలాగ్ని మైత్రి"
యనెడు మాటను మఱపించి వినుతసుకృతి
తతుల గృహలక్ష్మిఁ దన్పి తద్దత్త కంక
ణము సరస్వతి! కొంటి; జనంబు మెచ్చె.

విద్వాన్ కాశి వ్యాసాచార్యులు

భాగ్యం

1. శుభత

శ్రీయుత ఎ. వి. చంద్రమౌళిగారు

o

(సుందరి ప్రవేశము)

సుందరి: పిన్నీ, మీ సూరి లేచిందా - ఊఁ - మీ సూరి లేచిందిలే.

పిన్నీ: ఇంకా లేవలేదమ్మ. ఆ మిద్దిలో పండుకుంది లేపు.

సుం: సూరీ, సూరి లేవవే, ఒసేవ్, ఓ మొద్దా, నిన్నే లే. ఎండొచ్చింది. దీనికి కళ్లంటుగున్నాయోయ్ దుఁర్రొచ్చి 'హహహ'. (నవ్వును)

సూ: బో, తీసుకుపోతా బూచాణ్ణి, బో, బో.

సుం: ఆఁ దడిపిస్తోందయ్యా, ఒరేయ్ రామిగా యిలా రారా, నీకు గమ్మత్తు చూపిస్తాను.

సూ: రామిగాణ్ణికూడా తీసుకుపోతా.

రా: తీసుకుబోతావేం, మా నాన్నని తీసుగొస్తా నాపడంగా. ఏమే సుందరీ.

సుం: ఓ తాయిలంగారికి కళ్లంటుగున్నాయోయ్ 'గుడ్డీ గుడ్డీ గుబ్బబ్బండీ గడ్డీకావాలా, గుడ్డీ గుడ్డీ గుబ్బబ్బండీ గడ్డీకావాలా, ఆ గడ్డీకావాలా, గడ్డీకావలా.'

సూ: ఉండండి మా అమ్మతోచెప్తాను మీపని. (పిన్నిదగ్గరకుపోవును)

సుం: చెప్పి, చెప్పి బంగారపుచైను చేయించు.

రా: సుందరీ మనంకూడా వెడదామా.

సుం: ఊఁ వాళ్లమ్మతో యేంచెబుతుందో అక్కడే దాక్కుని విందాం. (పరుగెత్తుదురు)

(సూరి, పిన్ని)

సూ: అమ్మోయ్ మరేం వాళ్ల సుందిన్ని, రామిగాడూ వచ్చి నేనేం గుఁర్రాన్నిట, గుడ్డిదాన్నిట, కోతినిట యింకా యెన్నో అన్నారే.

సుం, రా: అమ్మయ్యో అబద్ధాలు, ఆడపిల్లలుడతారు. పిన్నీ, మరేం, కోతీ అనలేదు యేమీ అనలేదు. ఉట్టిదీ ఏంరా రామిగా యింకా కావలిస్తే రామిగాణ్ణి అడుగు.

రా: అవును నిజమే, పాపం, సుందరి, ఏమీ అనలేదు పాపం.

పి: (నవ్వి) బాగానే ఉంది. పిల్లి కెలక సాక్ష్యం. సూరీ, చూడవే వాళ్ల డాక్టరుగారి సుందరినీ, రామచంద్రాన్ని; ముద్దొస్తూన్నారు. పొద్దున్నేలేచి మొగంకడుక్కున్నారు. తలదువ్వుకున్నారు. కలకల్లాడుతూ బొట్టెట్టుకున్నారు. నీవు మల్లేనానేమిటి.

సూ: నేకడుక్కోను మొగం. ఎందుకామిటి, మరీ, వాళ్లు దుఁర్రొచ్చి అండవేం.

పి: నువ్వు ఆలస్యంగా తొమ్మిదిగంటలకి లేచి, బద్ధకంగానూ, నిద్రమత్తుగానూ, జోగుతూను ఓగంటసేపుంటే అనరు మరీ. నువ్వుకూడా యెంచక్కనంగా, పొద్దున్నే వాళ్లకంటే ముందులేస్తే నువ్వే వాళ్లని దుఁర్రొచ్చి అనచ్చును. పొద్దెక్కిలేస్తేనే అబద్ధకం, మత్తూ అదీని. చప్పున మొగంకడుక్కో.

సూ: అమ్మా మరీ, వాళ్లకిమాత్రం ఒక్కొక్కప్పుడు కళ్లంటుగోవేమిటే.

పి: అంటుగోకేమే, నిన్నరాత్రి నీకు జలుబుచేసిందికదూ, పైగా సినీమాకి తీసికెళ్లమని యేడ్చి పడుక్కున్నావు అంచేత కళ్లంటుగున్నాయి.

సూ: అమ్మా యీవేళ సినీమాకెళ్లొద్దులే.

సుం: ఈవేళేం పిన్నీ నేనూ మా చెల్లి, మా నాన్నగారూ.

రా: నేనో.

సుం: నువ్వూను—రామిగాడూ, అంతా సినిమాకెడదాం

పి: మా సూర్యకాంతాన్నికూడా తీసికెడతారా, చప్పున మొహంకడుక్కుంటుంది.

సుం: ఓ.

పి: కడుక్కోకపోతే తీసికెళ్లరుకాదూ.

రా: ఉఁ హు ఉఁ

సుం: కడుక్కోకపోతే సినీమాలు బాగా కనిపించవుట. కళ్లమీద కురుపులేస్తాయిట. మా నాన్నగారు చెప్పారు.

పి: అవును డాక్టరుగారి పిల్లవుకాదూ నీకన్నీ తెలుసును. కళ్లు శుభ్రంగా కడుక్కోకపోతే అసహ్యం. పైగా కంటిమీద కురుపులు, కంట్లో పువ్వులు, కళ్లకలక అన్నీ వస్తాయి. అందుకునే పొద్దున్నే లేవడంతోటే కళ్లు మొహం పళ్లు శుభ్రంగా కడుక్కోవాలి.

రా: పిన్నీ మా అన్నయ్య పళ్లు బాగాలేవని బళ్లో డాక్టరుగారు మొన్న ఉత్తరం రాశారు. మా నాన్నగారు వాణ్ణి కేకలేశారు. నా పళ్లుచూడు పిన్నీ.

పి: అబ్బో నీపళ్లు ఫస్టు.

సుం: అయితే నా పళ్లమీదకొస్తాయేవిట్రా నీవి, రామిగా! నేను బ్రష్షుపెట్టి గంటసేపు తోముకుంటాను తెల్లగాఉంటాయి నావి చూసుగో.

పి: సూరప్పుడూ పళ్లు శుభ్రంగా తోముకుంటున్నావా లేకపోతే వాళ్ల సుందరి ఆక్షేపిస్తుంది సుమా.

సూ: అమ్మా నాకు బ్రష్షులేదే. నాన్నగారెప్పుడూ చేదువి, వేపపుల్లలు కొంటారే. నాకు విషం అవి. రామ రామ, ఓ రెండు బ్రష్షులు కొనిపెట్టుగోరాదావిటే నాన్నగారు.

పి: అసలు వేపపుల్లలే మంచివిట. పళ్లల్లో యేవేనా విషపురుగులుంటే ఆ చేదుకి చచ్చిపోతాయిట. పైగా పుల్లలు నమలుతే పళ్లకు బలం. వేపపుల్లతో తోముకుంటే పిప్పిపళ్లన్నమాటే ఉండవు.

సుం: పిన్నీ మొన్న నేం, వాళ్ల గగ్గకి పిప్పిపన్ను పోటొచ్చిందిట. వాళ్ల నాన్న మా ఆస్పత్రికి తీసుకొచ్చారు. అబ్బ, యేడుపు, గోలెత్తేశాడు.

పి: అవునమ్మా పిప్పిపన్ను—

సుం: పిన్నీ, ఉండు పిన్నీ, ఆ పన్నులాగేసి మా నాన్నగారు తీసి చూపించారు. నల్లగా డొలకలా ఉంది అబ్బ ఉః, డోకొచ్చింది.

పి: పళ్లు శుభ్రంగా తోముకోకపోతే అదుగో అలాగే అవుతుంది. పైగా మాట్లాడుతూంటే నోరు దుర్వాస నొచ్చి అసహ్యించుగుంటారు అందరూను. ఏమే సూరీ యింకా అయిందా లేదా. నేనప్పుడే నీళ్లు కాచాను. కూర తరిగాను. చల్లచేశాను. ఇంకా నీకు తెమలలేదూ. రా, రా, తలదువ్వుకోవేమిటి.

సూ: నే దువ్వుకోను. నే నాడుకుంటాను వెళ్లి.

పి: ఆ, ఆడుకుంటావు, ఎవరాణ్ణిస్తారు నిన్ను, తల దువ్వుకోకపోతేను వాళ్ళ సుందరిని చూడు. రిబ్బనెట్టు గుంది, పువ్వులెట్టుగుంది, నీక్కూడా పెడతా, రా మరి, చప్పున రా.

సూ: ఏదీ రిబ్బను.

పి: ఇదిగో, రా, 'దుక్కు దుక్కు పేను, కుక్కతాను పేను, పాపిడిమీదకి దొంగాళ్ళొచ్చారు పారిపాకే పేను' చూశావా పేలెన్నొచ్చాయోను. ఎప్పుడు తలదువ్వుకోమన్నా యిదేగారంకదా మామ్మ. హుఁ. తలంతా పుచ్చిపోయింది.

సుం: పిన్నీ నా చేతిలో పెట్టవు. తలదువ్వుకోకపోతే కురుపులేస్తాయిట మా అమ్మ చెప్పింది.

పి: మా అమ్మాయి యెప్పుడో దువ్వుకుంటూంటుంది. ఉండండ్రా సుందరి, మా అమ్మాయి ఒంటిమీద నీళ్లోసుగొస్తుంది, ఆడుకుందురుగాని.

సూ: అమ్మ, సబ్బేదీ నాకు సబ్బు కావాలేవ్.

పి: నీకన్నీ కావాలి. పెంకితనంచేస్తే దెబ్బలుకూడా కావాలి.

సూ: అవి మా రామిగాడికి. వాణ్ణి పదిదెబ్బలు కొట్టుకో నాకేం భయంలేదు.

పి: ఆఁ, (అంతా నవ్వుతారు.)

సుం: మా గుండుభాయి, యెప్పుడూ స్నానంచేస్తాడు. నీకు మల్లే ఒంటిమీద నీళ్లోసుగోడు.

రా: అయింది, మాచాగా అయింది.

సూ: చూడవే అమ్మ, వీళ్లు స్నానంచెయ్యమంటున్నారు.

పి: రామిగాడిది గుండుకదూ అంచేత వాడు రోజూ స్నానంచేసినా యేమీ యిబ్బందిలేదు. మరి ఆడపిల్లలికి అంత జుట్టుతోటి రోజూ స్నానంచేస్తే జలుబుచెయ్యదూ. రెండు మూడు రోజులకి ఓమాటు స్నానం, వారానికోమాటు తలంటు యిది ఆడపిల్లలికి. రోజూ స్నానం వారానికోమాటు తలంటూ యిది మొగపిల్లలకి.

సుం: పిన్నీ నేను నిన్ననే తలంటుగున్నాను.

రా: నేనూ అంటుగున్నాను. మా అమ్మ ఊ, తలంతా మొత్తేసింది. నాకు నెప్పెట్టింది కూడాను. నాకొద్దంటే మానదు. 'తలలోకి నూని దిగుతుంది, తెలివి యెక్కువవుతుంది' అంటుంది. నాకప్పుడే ఓ న మా లొచ్చాశాయే అంటే వినదూ.

పి: అవునురా, తలంటుగున్నప్పుడు శుభ్రంగా నూనె పట్టించుగుని మర్దనం చేసుగోవాలి. చేసుగుంటే నూనె ఒంట్లోకి దిగి ఒళ్లు నిగనిగలాడుతూ ఉంటుంది. తలకి పట్టించుకుని మర్దనం చేసుగుంటే బుద్ధి యెక్కువవుతుంది, చెవిలో వేసుగుంటే చెవిలో ఉన్న గులివి యివతలకొచ్చేసి, చెవిపోటు, చెవిలో కురుపులు

అవీ లేకుండా శుభ్రంగాఉంటుంది. చెవిలో నూనెవేసుగోకపోతే చెముడు పడుతుంది. మీ కన్నింటికీ ఒకటే గోల, ఒకటే గోల యేపనైనా తిన్నగా చెయ్యనిస్తారా యేమన్నానా.

సుం: నేను మా నాన్నగారూను కలిసే స్నానంచేస్తాం యెప్పుడూను. నేను శుభ్రంగా ఒళ్లు తోముకుంటేగాని మా నాన్నగారూరుకోరు. ఊఁ. మా నాన్నగారిదగ్గర తువ్వాలుంది. దానితోటి గట్టిగా నొక్కి తోము కుంటారు. ఒళ్ళంతా యెర్రబడిపోతుంది.

పి: అవును. నీళ్లోసుగున్నప్పుడల్లా ఒళ్లు శుభ్రంగా తోముకుంటూంటే కురుపులెయ్యవు. చిడుంపట్టదు. సుఖంగా ఆరోగ్యంగా ఉంటుంది. సూరాలు! నీళ్లోసుగున్నావా, తుడుచుగో, తుడుచుగో; చప్పున; నానుతూ నించుంటే జలుబుచేస్తుంది.

సుం, రా: పిన్నీ మేం వెడతాం. వాళ్ళ లక్ష్మీ, సుబ్బిగాడూ, వాళ్లు మా యింటికి ఒచ్చేస్తారు యీపాటికి. మా అమ్మ కేకలేస్తుంది.

పి: ఉండండమ్మా సూర్యకాంతానికిమాడా అయిపోయింది. మీకు బిస్కట్లు అవీ పెడతాను. ఆడుకుందురుగాని.

రా: అయితే ఉందామే సుందరి.

పి: సూరీ పరికిణీ తెచ్చుగో.

సూ: ఇవిగో తొడుక్కుంటున్నా.

పి: అవికావే మొద్దా. కుళ్లుబట్టలు కనిపించడంలేదుటే. అసహ్యం. గదిలో చాకలితెచ్చినవి ఉన్నాయి అవి తొడుక్కోవే.

సూ: నావి చూడు పిన్నీ యెలావున్నాయో, కుళ్లుబట్టలు కట్టుగుంటే కురుపులెయ్యవూ.

పి: అవును. మా సూరికేంతెలియదమ్మ మొద్దు.

సూ: అమ్మా యివిగో తెల్ల పరికిణీ తెల్ల చొక్కా తొడుక్కున్నాను.

పి: ఆఁ అదిగో అలా తొడుక్కోవాలి. చూడండి యీమాటు మా సూరే మాణిక్యం; యెలా ఉందోను. ఎప్పుడూ అలా శుభ్రమయిన బట్టలే కట్టుకోవేం అమ్మా! పాలల్లో అన్నం తోడెట్టాను. తిని ఆడుకుందు కడతావా.

సూ: ఊఁ.

సుం: నేను కాఫీ తాగాను పిన్నీ, నేను రోజూ కాఫీయే తాగుతాను.

పి: ఇప్పుడే కాఫీలు మొదలెట్టారు గాని, అసలు పొద్దున్నే పాలల్లో తోడెట్టిన అన్నమే బలం. మా సూరప్పకి సాయం ఉండండి. ఇప్పుడే తిని వచ్చేస్తుంది. (అన్నంతిని సూరి వచ్చును.)

అందరు : పిల్లల్లారా రండోయ్ - బిస్కట్లు తెండోయ్
ఆడుకుందుకి రండోయ్ - అరటిపళ్లు తెండోయ్
పిలవంగానే రండోయ్ - పిప్పిరమెంట్లు తెండోయ్
చప్పుచప్పున రండోయ్ - చాక్లెట్లు తెండోయ్
పరుగెత్తుకుని రండోయ్ - పాలు బెల్లం తెండోయ్.

పుష్పచయము

నా స్వల్పబుద్ధికి మన స్త్రీలకు గలవి రెండే గొప్ప లోపములు కన్పించుచున్నవి.

1. విద్య, 2. ధనలోపము. ఈ రెండు లోపములు మనకు తీరిననాడు గాని దేశమున్నతిచెందజాలదు. వీటిని సంపాదించు విషయములో మనము పెద్దపెద్ద సమస్యల నెదుర్కొనవలసివచ్చుచున్నది. విద్యార్జనకు ధనము కావలెను. ధనార్జనకు విద్య కావలెను. ఒకదానితో రెండవది సంపాదింపవలెను. ఇవి పురుషులతోపాటు సమానముగా మనకు గావలెనని మనము కోరుచో వారితోపాటు సమానబాధ్యత అన్నివిషయములయందు మనము వహించవలసియున్నది. స్త్రీ పురుషులు సంసారశకటమునకు చక్రముల వంటివారని మన పెద్దలు చెప్పుచుందురు. విద్యావంతుడు విద్యావిహీనయగు భార్యయు కలిగిన సంసారశకటముకూడ నడువజాలదు.

ప్రస్తుతము ప్రపంచమంతను కల్లోలపరచుచున్న యుద్ధసందర్భములో మన దేశస్థితినిగురించి మనము కొంచము తెలిసికొనవలసియున్నది. స్వరాజ్యసంపాదనకై కాంగ్రెస్ నాయకులు పడు అష్టకష్టములు మనమెరింగినవే. వారు ఉభయ దేశక్షేమములుకోరి బ్రిటిషు ప్రభుత్వమువారిని ఈ క్రిందివిధమున కోరియున్నారు. 'హిందూదేశమును ఇప్పటినుండియు స్వతంత్రరాజ్యముగా భావించి దీనివలన కావలసిన సహాయమంతయు తీసుకొని యుద్ధానంతరము మాకు సంపూర్ణస్వరాజ్యమివ్వవలెనని' న్యాయసమ్మతమైన ఈ కోరిక బ్రిటిషు ప్రభుత్వము మనలో మనకు ఐకమత్యములేదను నెపముతో నిరాకరించినారు. ఈ జాతి మతవైషమ్యములు మనల నెంతవరకు క్రిందికి దిగద్రొక్కినవో మనకర్థము కాదు. మనదేశమునకు స్వతంత్రత పోగొట్టుట కివియే కారణములని చరిత్రలవలనకూడ తెలియుచున్నది. 'పోరు నష్టము పొందు లాభము' యీ పొందు గలిగించుట మనచేతిలోని పని. మనమందరము భగవంతుని బిడ్డలమని స్త్రీజాతి పురుషజాతి అని రెండే జాతులున్నవని మనము భావించి ఆచరణలో పెట్టగలిగితిమేని మరునాడే మన కోరికలు తీరివుండెడివి. పురుషులకంటే మనమే ఈ కార్యము చేయగలవారము గావున అగ్రజాతి, నిమ్నజాతి, బ్రాహ్మణాబ్రాహ్మణ, హిందూ మహమ్మదీయ తగవుల రూపుమాపుటకు మనము ప్రయత్నించవలెను. మన సహాయము లేకపోవుటచేతనే అస్పృశ్యతానిర్మూలమంత కష్టమగుచున్నదని నానమ్మిక. పురుషులుగూడ ఇటువంటి సంస్కరణలు జయప్రదముగా నెరవేరకుండుటకు మనమే కారకులమని సాకుచెప్పుచున్నారు. గావున మనమివి నిర్మూలింప పాటుపడవలెను.

ఈ చిన్న పెద్ద కారణములన్నియు చేరి మనల స్వరాజ్యమునకెట్లు దూరుల జేయుచున్నవో అట్లే పాతికేండ్లనుండి ప్రయత్నించిననూ ఆంధ్రరాష్ట్రము మామడదూరమునేయుండి అందరాని పండైనది. మనరాష్ట్రమునకున్న రాష్ట్రాదాయముతో మన అవిద్య పారద్రోలుకొనుటకు ఎక్కువ అవకాశముండును గావున ప్రతి యువతియు తన పతిసుతులను రాష్ట్రసంపాదనకు ప్రోత్సహించుచూ తాముగూడ అవసరమైన పాటుపడుటకు సంసిద్ధురాలుగా నుండవలెనని కోరుచున్నాను. దేశసేవ కార్యక్రమమునందు ధనము నర్పించుటలో ముందంజవేసియుండు ఈ ఆంధ్రదేశము తన్నుతాను రక్షించుకొనుటకు ధనము లోపముగల్గియుండజాలదని నేను నమ్ముచూ త్వరలో సోదరీమణులందరూ ప్రతి గ్రామ

పట్టణములయందు వందలకొలది సభ్యులనుజేర్చి సంఘములు యేర్పాటుచేసి దేశసేవికదళములు
చేయుదురని నేను కోరుచున్నాను.

గృహములో పరిపాలన, దేశములో ప్రజాపాలనకును, పరస్పర సన్నిహిత సంబంధమున్నది.
యజమానులు విద్యావంతులు తెలివైనవారు అయిన వారి బిడ్డలు బంధుమిత్రులు వారి ననుసరి
ఇప్పుడు మనకు కొన్ని ప్రజాసంస్థలున్నవి కాని అవి మనము కోరినంత ఫలితమిచ్చుటలేదు. అవి
పార్టీలకు కట్టుబడి న్యాయముగా సంచరించలేకున్నవి. యీ పార్టీల భేదభావము పోవలెను.
పురుషులలో అటువంటి మార్పు తేవలెను. పూర్వకాలపు స్త్రీలు రణరంగమునకు తమ
పుత్రులను ఎటువంటి హృదయములతో పంపెడివారో మనముకూడ మనవారిలో దుర్బలత్వము
మాపి కార్యశూరులుగా జేయవలెను. నిర్బంధోచిత ప్రాథమిక బాలబాలికల యేకవిద్యాలయ
విరివిగా స్థాపించునట్లు మనము ప్రభుత్వమును కోరి కార్యసిద్ధులము కావలెను. ప్రతి విద్యావతియు
యిరుగుపొరుగు విద్యలేని స్త్రీల నిరువురినైన విద్యావతులుగా చేయుటకు శపథము తీసుకొనవలెను
బిడ్డలనందరను విద్యావంతులుగా జేయవలెను. స్త్రీ సమాజముల ద్వారా ఈ లోపము తీర్చ
ప్రయత్నించవలెను.

ఆచారమని పేరుపెట్టి వేలకొలది కట్నములు గుమ్మరించి అల్లుళ్లను గొనితెచ్చుకొనుచున్న తల్లిదండ్రు
కొంచమాలోచించి, ఆ ఆస్థి అమ్మాయి పేరనే యుంచి ఆమె జీవితము దేహియని ఒకరిని ఆశ్రయ
కుండ గడుచునట్లు యేర్పాటుచేసినచో మనస్థితి ఇంతకంటె ఎన్నోరెట్లు బాగుగానుండును
దండ్రులు కట్నములిచ్చుట పుచ్చుకొనుట మానివేసి యేకగర్భజనితులయెడ ఆడ మొగ
చేయుచున్న యీ ఆస్తి పంపకము అన్యాయమును మాని, న్యాయముగా, ఆడపిల్లలకు మొగ
గూడ ఆస్తి పంచి ఇవ్వవలెను. ఒకరిద్దరు దంపతులీ యాచారము కార్యరూపమున బెట్టిరేని
గూడ వారి ననుసరింతురు. బొంబాయిలో కన్యాశుల్కము, వరశుల్కములను, దినవారపు
అయిదువందలకు మించి చేయువారు నేరస్థులని బిల్లు ప్యాసుచెసియున్నారు. బిల్లు అవసరము
మనలో మనము ఇది సవరించుకొనవలసిన విషయము. ఈ దురాచారము ఎన్నికొంపలో
చున్నది. దీని నిర్మూలము మనచేతిలోని పనియే మనము వారసత్వపుహక్కు కలిగించు
విడువక ప్రయత్నించవలెను. మనకు సౌఖ్యము గలిగించునని మనము బాగుపడవలెనని
కొందరు మహానుభావులు మనకొరకై యెన్నియో కష్టములుపడి శాసనరూపమున తెచ్చిన
మార్పులను మనమెంత నిరుపయోగము చేయుచున్నామో తలచిన నాకు సిగ్గూ, విచారము
చున్నది. నూరేండ్లనాడు రాజా రామమోహనరాయలు దేశక్షేమము స్త్రీజాతి క్షేమముకోరి
వితంతూద్వాహశాసనము నాటి మూర్ఖపుప్రజలెంత యడ్డిగో శారదాశాసనము నేడు మనము
నట్లే నిష్ప్రయోజనము చేసివేయుచున్నాము. మనమేలు మనము గుర్తించకున్న ఎవరేమిచేయు
శాసనములైనను ప్రజాసమ్మతి లేనియెడల వృథాయగును గావున శాసనములు చేయించుటకు
తెలివైనవారాపనులు ఆచరణరూపమున నుంచుట యొప్పు. ఇప్పటికే కాలాతీతమైనది. గావున
ఎక్కువచెప్పి మిమ్ముల విసిగించదలచలేదు. కాని ఇందు నేనుచెప్పిన విషయములు సోదరీమణు
చించి స్త్రీజాతి నుద్ధరింప గట్టి ప్రయత్నములు చేయవలెనని మరల ప్రార్థించుచూ ఈ సభను
భించుచున్నాను.

—సి. హెచ్. చంద్రమతి.

నూతన సంవత్సరాశీర్వచనము

క. విక్రమ సంపద్విభవ మవక్రసుధీ గౌరవము శుభస్థితి వనితా
చక్రము నెగడుత, 'గృహలక్ష్మి' క్రమ శీలాభివృద్ధి మెరయుత సతమున్.

కృత్తివెంటి వెంకటసుబ్బారావు.

అభినందనము

ఉ. ఉత్తమరాలవీవు ప్రియసూక్తి ఘటింతువు భక్తిపెంపుచున్
జిత్తమునందు నెల్లపుడు శ్రీహరిపూజలు సేయుదానవై
మెత్తదనంబు సన్మతియు మేలుగఁ దాల్చుచునుండి జీవికా
వృత్తమునందుఁ గీర్తిగడియించితి వెంతయు నో సఖిమణీ.

ఉ. నీవు సరస్వతీసతివి నిన్నెదఁ బూజలొనర్పఁ నున్నచో
భావితమైన భావములు పైకుబుకన్ దెరువేది ? కాన మో
దావహ చిత్తమున్ బడసినంతట నిన్నెదనెంచినంతఁ బ
ద్యావళివ్రాయు భాగ్యమును నందితి నిక్కము సెప్పితో సఖీ.

గీ. స్వర్ణకంకణ శ్రీ సరస్వతివిగాన
చెప్పనేటికి నీకొప్పు గొప్పతనము ?
వరలు భాగ్యసౌభాగ్య వైభవమదెల్ల
నీకు; గృహలక్ష్మి శుభదృష్టి నెగడుచుంట.

వాజపేయయాజుల మహాలక్ష్మి.

దీవెన

సీ. జనియించితివి శుభ్ర చారిత్రుఁడైనట్టి కేసరి సారసావాసమందు
కన్యవైతివి దివ్యకామినీ సందోహ కరపల్లవంబుల గతులనల్లి
నగ్నికవైతివి నవయౌవనోద్భూత కవితావిలాస పెన్కాలిమిగలిగి
తరుణివైతివి నిజాంధ్రాభిమానులఁగూడి రాష్ట్రోద్యమమునకు రండియనుచు
భళిరె! నినుగన్న తల్లియే భాగ్యలక్ష్మి
కలిత కవితాప్రసూన శృంగారలక్ష్మి
విశ్వకల్యాణ సంధాన విజయలక్ష్మి
జయమిదే 'గృహలక్ష్మి' విజ్ఞానలక్ష్మి.

అద్దంకి సీతారామయ్య.
పెదకొత్తపల్లి శారదా గ్రంథాలయము.

చిత్రకళావిశారద సి. యస్. వెంకటరావుగారి అస్తమయము

రాయలసీమలో అసమానచిత్రకళోపాసకుడై చిత్రకళానైపుణ్యము నాంధ్రద్రావిడ దేశములందును వ్యాపింపజేయగలిగిన అద్భుతచిత్రములను వ్రాసిన సుప్రసిద్ధ చిత్రకళాశిరోమణియగు సి.యస్. వెంకటరావుగారిని అకాలమృత్యువు తన పొట్టబెట్టుకొనెను. ఈఘోరవార్త రాయలసీమ చిత్రకళారాధనుల నందరినేగాక ఆంధ్రద్రావిడదేశముల కళాభిమానులను సయితము దుఃఖసాగరమున ముంచి వేసెను. వెంకటరావుగారు పెనుగొండ హైస్కూలులో చిత్రకళాధ్యాపకులుగా కొంతకాలము పనిజేయుచుండిరి. వారు విద్యానగర చిత్రకళాసంస్థను స్థాపించి పెక్కుమంది యువకులకు చిత్రకళను నేర్పుచుండిరన వారి కళాసేవయు, విశాల దృష్టియు విస్పష్టమగుచున్నది. తన్మయత్వముగలిగించు వారియొక్క చిత్రములు రాయలసీమలోనేగాక తదితర ప్రాంతములలోను ముఖ్యముగ మద్రాసులోని అనేక ప్రదర్శనములలో బహుమానములబడసినవి. వారి జీవకళ లుట్టి పడుచిత్రముల లోని మాధుర్యము, ఆనందము, సహజస్వరూపము, నిరుపమానమైనది. రావుగారు చిత్రించిన చిత్తరువులను తిలకించినచో వారికిగల భావగంభీరత, విశాలదృష్టి, కళాప్రౌఢిమ, నిరాడంబర సహజసౌందర్యము విశదము కాకపోదు. వారువ్రాసిన ద్వైతాద్వైత ప్రేమ తత్త్వము, ఊలూచి, కాకాసురుడు, గౌతమి, మొదలగు చిత్రములలో పురాణములందు వర్ణింపబడిన సమయభావములు కన్నుల గట్టి నట్లుండును.

సహజసుందరమై, మాధుర్యముట్టిపడుచు, నేత్రానందకరంబులైన మన రావుగారి వివిధ చిత్రములచే ముద్దుల మూటగట్టుచు నయనపర్వము గావించుచున్న మా గృహలక్ష్మి ఇప్పుడొక యమూల్యాభరణమును గోల్పోయినది. వెంకటరావుగారి మరణముచే వారు స్థాపించిన విద్యానగర సంస్థకు తీరనిలోటు సంభవించినది. వారి కుటుంబమునకును, వారి శిష్యబృందమునకును మా హృదయపూర్వక సానుభూతిని దెల్పుచున్నాము.

పరమేశ్వరుడు వారియాత్మకు శాంతిని ప్రసాదించుగాత!

ఆపద శీలసంపద కధిక బలప్రదము

శ్రీయుత విం. అ. సూర్యనారాయణగారు

" Sweet are the uses of adversity ;
which, like the toad, ugly and venomous,
Wears yet a precious jewel in his head ; "

(*Shakespeare*).

" The virtue of prosperity
Is temperence ; the virtue
Of adversity is fortitude "

(*Francis Bacon*).

ప్రాణముదీయు విషమును తలయందు ధరించిన ఫణి శిరమునసుండు మణి యెట్లు ఘనమగు విలువను గౌరవమును గాంచగల్గుచున్నదో, అట్లనే ఆపదయను దుఃఖమయమగు అనుభవములో అమితానందము నొసంగగల ఐశ్వర్యముగూడ నిమిడియున్నది.

ఐశ్వర్యములో మితభోగమును ఆపదలోతాల్మి (స్థైర్యముతోగూడిన సహనశక్తి)యు సత్పురుష లక్షణములు - ఆపదశీలమునకు ఒఱపురాయివంటిది.

మానవజీవితము ధన్యవంతమగుటకు శీలసంపద ఘనమగు కారణమైయున్నదని ప్రపంచప్రఖ్యాతిబొందిన స్త్రీ పురుషుల జీవితములందలి విషాదఘట్టములను చక్కగ పరిశీలించినచో బాగుగ బోధపడగలదు. శ్రీ సీతారాములు ఆదర్శదంపతులుగ నవనిలో పూజింపబడుటకు ప్రధానహేతువేమి ? ఆ పుణ్యదంపతులు పదునాల్గేండ్లు ఘోరారణ్యములలో గడపిన తాపసజీవితమహిమాతిశయమే యని నిరూపింపవచ్చును.

పాండవులు పడిన పలువెతల ఫలితముగగాదే ధర్మయుద్ధమందు జయమును శ్రీకృష్ణభగవానుని అనుగ్రహమును వారికి ప్రాప్తించి వారిజీవితము లాదర్శప్రాయములైనవి ! సత్యవాక్యపరిపాలనమునకై సకలమహీసామ్రాజ్యమును త్యాగమొనరించి, సతీసుతులను సయితము విక్రయించి, కాటికాపరినిగొల్చిన హరిశ్చంద్రచక్రవర్తి జీవితము దివ్యాదర్శముగ తన హృదయమునెంతయు నాకర్షించియుండెనని గాంధీమహాత్ముడు స్వీయచరిత్రలో వెల్లడించియుండెను. కారణము సత్యహరిశ్చంద్రుని శీలప్రభావము.

సావిత్రి, దమయంతి, ద్రౌపది, గాంధారిమొదలగు పతివ్రతారత్నముల శీలసంపద ఆపదలమూలమునగదా అధికశోభతో వెలింగెను. అంతయేల ఈనాడు ఆదర్శచిత్రములని ప్రజలచే పరిగణింపబడుచున్న 'గృహలక్ష్మి' 'వందేమాతరమ్', సతీసక్కుబాయి, మొదలగు చలనచిత్రములలో స్త్రీవ్యక్తిలో నిండి నిబిడీకృతమైన శీలసంపద చూపఱుల హృదయము

లను చూఱగొనగల్గుటకు కారణము ఆ కథలలో ప్రదర్శింపబడిన వివిధవిషాదఘట్టములలో కథానాయికలు విజయవంతముగ నెదుర్కొనిన కష్టపరంపరలుగదా !

దేశనాయకులలో నగ్రగణ్యులుగ నెన్నబడిన లోకమాన్య బాలగంగాధరతిలక్, లాలా లజపతిరాయ్, మహాత్మాగాంధీ మున్నగు మహనీయులు ఆపదయం దధికోత్సాహ శక్తిసంపదతో తమ శీలతేజము నుద్దీపించియుండిరి. కారాగారవాస ఫలితముగగదా గంగాధరతిలకుమహాశయుడు ఘనమగు గీతాశాస్త్రవ్యాఖ్యానగ్రంథమును వ్రాయగల్గియుండెను! నిరుపేదల నుద్ధరించుటకు విపత్పరంపరలను ధీరచిత్తముతో నహింసాదీక్షాపరతంత్రతతో నెదుర్కొనుచు మహాత్ముడు తన దివ్యశీలతేజోమహిమను ప్రపంచమునకు ప్రత్యక్ష మొనరించుచున్నాడు.

ఆపద శీలమునకు ఒఱపురాయివంటిది. ఆపద అను రాయిపైని శీలమను కత్తి పదనెక్కి వాడియై, ప్రతిభావంతమగును. మెరుపురాతిపై గీచిన బంగారముయొక్క బాగోగులెట్లు బయల్పడునో ఆపదలోబడినపుడు మానవుని శీలములోగల సహజశక్తి కాంతులు తేటపడును. మహావైభవముతో గూడియున్నపుడును సకలైశ్వర్యములతో తులతూగునపుడును మానవుని శీలము బాగుగ ప్రకాశింపనేరదు.

ప్రాణముదీయు విషమును తలయందు ధరించిన ఫణి శిరముననుండు మణి యెట్లు ఘనమగు విలువను గౌరవమును గాంచగల్గుచున్నదో, అట్లనే ఆపదయను దుఃఖమయమగు అనుభవములో అమితానందము నొసంగగల ఐశ్వర్యముగూడ నిమిడియున్నది. ఇందులకు తపోధనులై, శాశ్వత శాంతిపదవినందగలిగిన దివ్యపురుషుల జీవితములే గొప్ప నిదర్శనములు. శిలువపై చిత్రహింస గావింపబడిన ఏసుక్రీస్తు శాశ్వతప్రభువై దివ్యతేజస్సుతో వెలుగొందుటలేదా ?

'Prosperity doth best discover vice, but adversity doth best discover virtue' అని పాశ్చాత్య పండితప్రముఖుడగు ఫ్రాన్సిస్ బేకన్ (Francis Bacon) చెప్పియున్నాడు. ఐశ్వర్యములో మానవునియందున్న అవగుణములును, దారిద్ర్యములో సుగుణములును బయల్పడుననుటలో నెంతయు సత్యమున్నదికాని దరిద్రుడై సుగుణవంతుడుగను, ధనికుడై దుర్గుణుడుగను మారునని ప్రతిమానవునిమెడలను చెప్పదగిన న్యాయముకాదు. అష్టైశ్వర్యములలోనుండి మహాగుణవంతులై, మేధాసంపన్నులై, లోకహితమొనర్చిన మహనీయులెందరులేరు ?

దరిద్రులై, జ్ఞానతేజోవిహీనులై పాపములకు పాల్పడి పతితులైన మానవులెందరు లేరు ? ఇందుచే తేటపడు విషయమేమన, మంచిగాని, చెడ్డగాని, మానవుడు బాధల

లోబడి పలువిధముల పీడింపబడునపుడే బాగుగ వెల్లడియగును. అట్లని మంచియు చెడ్డయు ఆపదల మూలముననే అభివృద్ధిజెందునని యర్థముకాదు. ధీరత్వము, శాంతము, ఔదార్యము, సహనశక్తి, సత్యానురక్తి, దయ, మొదలగు ధర్మములు ఆపదకాలము లందు అధికశోభతో నలరారును. అనగా ఈ సల్లక్షణములతో జన్మించిన జనులలో నివి ఆపదలందు మరింత ఘనతనుగాంచి మానవత్వములోగల దివ్యత్వమును ప్రకాశింపజేయును.

ఆపదలందు గదా అతివలు తమ శీలములోగల అనంతశక్తి వైభవమును ప్రత్యక్ష మొనరింపగలిగిరి. పురాణములలో ప్రపంచమునకు వెల్లడింపబడిన పతివ్రతల చరిత్రములు ఆపదచే నధిక శోభతో తేజరిల్లిన దివ్యశీల సంపదకు గొప్ప దృష్టాంతములు.

రాజ్య భ్రష్టతనొందిన కాంతునితో కాంతారమధ్యమున కడగండ్లకు గురియై ఆకటిబాధచే అల్లాడు అబలయగు దమయంతీసాధ్వీమణిలోగల శీలప్రభావము పతి పజ్జనుండు పర్యంతము బయల్పడలేదు. నాథుడు ఒంటరిగ నామె నడవిలో విడచినపుడు క్రూరకిరాతుడు కామోద్రేకముచే నామెను బలాత్కరింప బొల్పడినపుడు ఆమె తన పాతివ్రత్యమహిమచే నా దురాత్ముని శపించి భస్మీభూతుని గావించెను. శీలమునకు హాని వాటిల్లనున్న సమయమున గదా ఆమె తన దివ్యశీల ప్రభావమును స్వానుభవముచే తెలిసికొనగల్గెను.

తాను త్రికరణశుద్ధితో ప్రేమించి, వరించినభర్తను, ప్రారబ్ధవశమున భాగ్యవిహీనుడై తల్లిదండ్రులతోగూడ నడవుల నిడుమలబడుచున్న సత్యవంతుని, దీర్ఘాయుష్మంతునిగను, సకలైశ్వర్యసంపన్నునిగను చేయగల్గిన సావిత్రి తన పాతివ్రత్యమాహాత్మ్యమును పతి, ప్రాణవిగతుడై యమునిపాశముచే గొనిపోబడినపుడుగదా ప్రదర్శింపగల్గినది. శీల మహిమచే ధర్మదేవతను సయితము వినమ్రునిచేసికొని, వరములబొందగలిగిన సావిత్రి సుచరిత్రము, సతీత్వములోగలఘనత, ఆపదలచే నధికశక్తివంతమై, అద్భుతమగు ఆత్మ విశ్వాసమును పెంపొందింపగలదనుటకు దివ్యదృష్టాంతము.

ఈ సందర్భమున రెండుచక్కని వృత్తాంతములు జ్ఞప్తికి వచ్చుచున్నవి. కొలది సంవత్సరముల క్రిందట రాజమండ్రీలో ఒకయిల్లాలు, అర్ధరాత్రమున నిద్రావశులైయున్న తన పతికిని బిడ్డలకును ఒక త్రాచుపామువలన హాని వాటిల్లనున్న సమయమున, వారలను రక్షించుటకై ఆ సర్పమును ధైర్యముతో బట్టుకొని వారి నాపదనుండి తప్పించి, తన ప్రాణములను త్యజించెను. ఆ సతియొక్క స్వార్థత్యాగసహితమగు శీలసంపద సత్కీర్తితో శాశ్వతముగ నిలలో నిలిచియున్నది. ఆపద ఆ అతివనుసురులగొని ఆమెకు అమరత్వ మును ప్రసాదించెననుట అతిశయోక్తికానేరదు.

శ్రీ ఓంకార స్వాములవారిచే స్థాపింపబడిన శాంత్యాశ్రమములో నేతదాశ్రమోపా ధ్యక్షురాలైన శ్రీ సోదరి సుశీలాదేవి, ఒక సందర్భమున తనలోని దివ్యప్రేమ ప్రభావ మును ప్రదర్శించియుండెను. ఆమె అతిప్రేమతో పెంచుచుండిన కుక్క నొక చిరుతపులి ఒక నడిరేయిచంప నుంకించుచుండగా నావనితారత్న మాసవ్వడిని గ్రహించి, వెంటనే యచ్చటకువచ్చి యా చిరుతపులి నాల్గుకాళ్లను ధైర్యసాహసములతో బట్టుకొని యా క్రూరజంతువును గిరగిరత్రిప్పి కొన్నిగజముల దూరము విసరివైచెను. ఆమె అద్భుతశక్తి ధాటికి హడలొంది యా చిరుతపులి పలాయనమై ప్రాణములను దక్కించుకొనెను. ఆ కుక్కకు గలిగిన ఆపద నవలోకించి ఆవేశప్రపూరిత హృదయయైగదా ఆమానినీమణి తన ప్రేమయొక్క దివ్యబల ప్రాభవమును ప్రదర్శించి ఆశక్తిని స్వానుభవముచే తెలిసికొన గలిగిది.

ఇట్టి దృష్టాంతము లెన్నియేని చూపవచ్చును. ఆపదలో మానవవ్యక్తిలోగల దివ్యత్వము శీలమను విద్యుచ్ఛక్తిరూపమున వెలుగొందును. ఆపదలో శీలముపదనొంది బాగుగ ప్రకాశించును. కాని ప్రేమప్రభావముతో గూడిన బుద్ధిబలమున్నపుడే శీలమను దివ్యశక్తి శోభించును. ఆపదలో ధైర్యము, అచంచలమగు సహనశక్తి, అచ్యుతమగు శాంతివైభవము, ఆత్మనిగ్రహముచే గలుగు ఆత్మజ్ఞానసంపద, అధికముగ అలరారును.

హిందూవివాహము

సీ. ఒకమారె భయసంతసోద్రేక మొనఁగూర్చు నూత్నానుభవ తటిద్ద్యుతిస్రవంతి!
సృష్టి విచిత్ర, విస్తీర్ణ జగన్మిథ్యలను, పారఁద్రోలు కళాస్రవంతి!
సత్ప్రేమ, మానవ సహజస్వభావంబులను, తంత్రులను మీటునట్టి వీణె!
గార్హస్థ్య ధర్మనిర్వహణంబు, హరిఁజేర మంత్రసాధనయంత్ర తంత్రశక్తి!

గీ. వేదశాస్త్రోక్త నిర్మితవిధి, యపార
సార, సంసారసాగర తరణనౌక
భవ్య హిందూవివాహంబు! ప్రాకటముగ
బ్రహ్మముడియంద్రు విడదీయబడని దీని!

శ్రీ సాదలి రామస్వామి బి.యే., బి.యల్.

సంపాదకీయములు

శిశుపోషణ ధర్మములను బోధించుట స్త్రీల ఉన్నతవిద్యలో ప్రధానముగ పరిగణింపబడవలెను

స్త్రీ పురుషుల జీవితములు ఉన్నతాదర్శములకొరకై వినియోగింపగలుగుటకు స్త్రీలు విద్యాపరిశ్రమ కెక్కువగ పాటుపడ నవసరమైయున్నది. ఈ విషయమునుగూర్చియే లాహోరులోని ఫతేహ్‌చంద్ స్త్రీ కళాశాలలోని విద్యార్థినులకు బహుమతులను ప్రసాదించు సందర్భములో పంజాబు విశ్వవిద్యాలయోపాధ్యక్షులగు మియాన్ అఫ్‌జల్ హుస్సేనుగారొసంగిన హితప్రసంగములో హెచ్చరిక గావించుచు నిటుల తెలిపియుండిరి. "Acquiring knowledge should not be the only main object of education. We must strive for higher ideals in life particularly in the education of girls." కేవలము జ్ఞానసముపార్జనమే విద్యయొక్క ముఖ్యాశయముగ నుండరాదనియు, ఉన్నతాదర్శములకై జీవితములో పాటుపడుట అత్యావసరమనియు, అందు ప్రధానముగ బాలికావిద్యాభివృద్ధికై ప్రత్యేక కృషి సలుపవలసియున్నదనియు బోధించియుండిరి. ఈ విషయము స్త్రీ విద్యాభిమానులెల్లరును దృష్టిపథమునందిడుకొనదగినది.

బాల్యదశలో ప్రాథమిక విద్యాభ్యాసమునందు జీవితమునకు సంబంధించిన సర్వ విషయములయొక్కయు సామాన్యజ్ఞానమును ముక్తసరిగ బాలురకువలెనే బాలికలకు గూడ బోధింపవలెను.

ఉన్నతపాఠశాలలో బడయువిద్య స్త్రీ పురుషుల ప్రత్యేక బాధ్యతలకు చెందిన విషయములను ప్రధానముగ బోధించునదిగనుండవలెను. ఆపైని యువకులును, యువతులును వారివారి అభిరుచి కనుగుణమగు విద్యయందు ప్రత్యేకపరిశ్రమను జేయవలెను.

ముఖ్యముగ యుక్తవయసువచ్చిన స్త్రీలకు శిశుపోషణావిధానములను చక్కగ దెల్పుటకువిద్యావిధానములో (Mother-craft) సత్సంతానమును పొంది, శిశువులను చక్కని పద్ధతులలో పెంచుటకు సహాయపడు విషయములకు ప్రాధాన్యత నొసంగవలెను.

యువతులకు శిశువుల ఆరోగ్యమును పెంపొందింపజేయుటకు తోడ్పడు పద్ధతులు బాగుగ బోధింపబడవలెను. Physical care of children and the psychology (theoretical and practical) of children. శిశుసంరక్షణము, శిశుమానసిక తత్త్వవిజ్ఞా

నము, ఈ రెండువిషయములును స్త్రీ విద్యావిధానములో ప్రత్యేకప్రాముఖ్యము గలవిగనున్నవి.

తల్లులు తమ సంతానమును సర్వవిధముల చక్కగ తయారుచేయగల జ్ఞానము సంపాదించుకొనుట సంసారజీవిత సుఖమునకేకాక, సాంఘికాభివృద్ధికిని, దేశక్షేమము కును కూడ అత్యంతావసరమైయున్నది.

మానవజీవితము ఆనందకరముగనుండవలెనన్న కళావిజ్ఞాన మవసరము

'The teaching of art as a subject in the curriculum is as important for girls as for boys

కళాపరిశ్రమ స్త్రీ పురుషులెల్లరును సాధింపదగిన సద్విద్యాదర్శమైయున్నది. క కాంతులులేని ముఖములను చూచినపుడు రోతపుట్టును. అట్లనే కళావిహీనమైన గృహ ధర్మములును, సంసారజీవితమునందు శోభ జెందవు.

ఆనందములేని గృహములో దారిద్ర్యము తాండవమాడుచుండును. కన్నులపండు సేయు గృహాలంకరణమును, మనసున కాహ్లాదమునొసంగు ఆదర్శములతోగూడిన జీవిత విధానమును సౌఖ్యప్రదమైన సిరిసంపదలను గలుగజేయును.

మురికిగుడ్డలతో, చింపిరితలతో, పీడనుగొల్పు పాడుముఖముతో భర్తను సేవించు పడతి భాగ్యము నెట్లభివృద్ధిజేయగలదు? అతివయొడగూర్చు ఆనందమే మగవాని ఐశ్వర్యమును అదృష్టమును ప్రసాదించును. చీకాకుతో రుసరుసలాడుచు, చిందరవందర బారవేసిన పదార్థములను చిలుముపట్టి చమురుతో కమురుకంపునుగొట్టు పాత్రలలో ప్రాలుమాలిన బుద్ధితో పచనముచేసి విస్తరపై నొక్కుమ్మడిగదెచ్చి పడవైచిన భోజనము నోటికి హితముగబోవునా?

వంటపనులలోగూడ కంటికింపునుగొల్పు కళలేదా? ఇక పడకటింటివిషయములలో కళకాంతులులేనిచో ముచ్చటయెక్కడిది? బిడ్డలను పెంచుటలో కళావిజ్ఞానరహితమైన పద్ధతులేయేర్పడిన వారెట్లు ఆదర్శజీవితములను అనుభవింపగల్గుదురు?

పురుషులకంటె స్త్రీలకే కళాపరిశ్రమ అత్యవసరము

'Art especially music, has too long been considered in India as fit only for girls on the threshold of matrimony and even then more as a Short term advertisement and a concession to fashion than a lasting accomplishment acquired for the sake of its intruisic value.'

స్త్రీలకు సంగీతశాస్త్ర ప్రవేశమును వరాన్వేషణ ప్రయత్నములను సాగించుటకు ముందు ప్రారంభింతురు. అమ్మాయి కొంచెము హార్మోనియమును వాయించగల్గుచున్నదని వెల్లడించిన మంచివరుడు లభించగలడను ఆశయేగాని, ఆ సంగీతములో ఆనందమును అను

జీవితములో అనుభవించి, భర్తకును, సంతానమునకును హాయినిగూర్చి, సంసారములో తరింపగల్గు భాగ్య మొదవుననను భావములేలేని తలిదండ్రుల నెందరనో చూచుచున్నాము.

భుక్తిముక్తి ప్రదాయకమై, ఐహికానందమునకు మూలకందమై, ఆముష్మిక సుఖమునకు తోడ్పడగల సంగీతమును పెండ్లికొడుకుని గూర్చుకొనుటకేనా స్త్రీ లభ్యసింపవలసినది ? ఈ కళాపరిశ్రమ ఇతరులకొరకా ? ఇంతులు ఈవిద్యా గంధలేశముచే మరింత పరిమళమును వరమధుపములకు ప్రసాదింపగలరనుట వట్టిమాట.

కాని హార్మోనియమునో, పిడేలునో కొంచెము ఆడింపగలిగిన, అమ్మాయి విద్యాచాకచక్యము బాగుగ అందరికిని విదితమగుననను వెఱ్ఱి భ్రమజెందు అజ్ఞానపు అమ్మలెందరోయున్నారు. ఆ సంగీత 'చకచకలకు' అచ్చెరువొంది ఆమె చెలిమికై ఆశించి అచ్చరలకొరకు అమరులరుదెంచు తెఱంగునవచ్చి ఆవలలోబడే వెఱ్ఱిఅబ్బాయిలును ఉన్నారు. ఆర్భాటములకొరకు కాయాసపడుటయే కాని అసలు (ఆత్మకు) ఆనందమునొసంగగల సంగీత విద్యాసాధనమును చేయ నుత్సాహించు స్త్రీలు అరుదుగనున్నారు.

అందరును చేయుచున్నపనిని "వేళం వెఱ్ఱి" (fashion) ని మనమేల చేయరాదను అపూహాలు సంఘములో పోయినగాని సత్యములగు భావములును సహజమగు విద్యాసక్తియును వనితల కబ్బవు. స్వభావసిద్ధముగ కళారాధనయం దభిరుచికలిగినపుడే అందలి ఆనందము ననుభవింపవలెనను అభిలాష అధికముగనేర్పడును.

అందుచే స్త్రీలు కళాపరిశ్రమను, ముఖ్యముగ సంగీతశాస్త్రాభ్యాసమును, సద్వ్యాదర్శముగ భావించి, అందలి ఘనతను బాగుగ గనుగొని, అందు ఔన్నత్యమునొందుటకై పాటుపడవలెను. సుదతులకు సంగీతకళాచాతుర్యమే సహజవిద్యాసౌందర్యము. కళాపరిశ్రమయే కాంతలకు మహాభాగ్యము. లలితకళలను స్త్రీ పాఠశాలలలో నిర్బంధముగ నేర్పవలెను. పాఠశాలలలో బడసిన కళావిజ్ఞానము పాకశాలలలోను, భోజనమందిరములోను, పడకటింటిలోను, పూజాగృహములోను పరిపక్వము గాంచవలెను.

యుక్తవయసువచ్చిన స్త్రీలకు సహవిద్య (Co-education) యుక్తముకాదను తీర్మానము

త్రివేండ్రంలో సమావేశమైన అఖిలభారత మహిళామండలియొక్క తిరువాన్కూరు శాఖాసంఘమువారు ఆ శాసనసభలో శ్రీమతి టి. నారాయణమ్మగారిచే ప్రవేశపెట్టబడనున్న కట్నముల నిషేధపుచట్టమును కేంద్రశాసనసభలో శ్రీమతి సుబ్బరాయన్ సతిగారిచే ప్రవేశపెట్టబడనున్న బహుభార్యా నిరోధచట్టమును బలపరచుచు తీర్మానముల గావించిరి.

డాక్టరు దేశముఖ్ గారిచే ప్రవేశపెట్టబడిన విడాకులచట్టము కేంద్రశాసనసభ తిరస్కరింపబడుట కీ సభవారు సంతాపమును వెలిబుచ్చుచు, హిందూస్త్రీలకు నివాస మనోవృత్తి, మొదలగు హక్కులనుగూర్చి అవసరమగు శాసనసౌకర్యములను చక్క నాలోచించుటకై ఎనిమిదిమంది సభ్యులతోగూడిన ఒక కమిటీని ఏర్పాటుచేయుట నిశ్చయించిరి.

యుక్తవయసువచ్చిన స్త్రీలు పురుషులకొరకేర్పరుపబడిన విద్యాలయముల వారితోగూడ విద్య నభ్యసించుట యువతుల సతీత్వధర్మములకు హానికరముగ వ మించునని భావించి, వారికి హూణభాషలోను, మాతృభాషలోను విద్య నభ్యసించుట చాలినన్ని ఉన్నతపాఠశాలలను సంస్థానములో స్థాపించుటకై ఈ సభవారు ప్రభుత్వ వారిని కోరియుండిరి.

శ్రీమతి నారాయణమ్మ (యం. ఎల్. ఏ.) గారు ఆహ్వాన ఉపన్యాసములో భార మహిళామండలికి చేసిన తిరువాన్కూరు సంఘమువారి సేవను కొనియాడుచు శ్రీ మహ రాణీ సేతు పార్వతీబాయిగారు స్త్రీజనోద్ధరణ విషయములో చూపియుండిన ఆదరము ఉత్సాహమును మిక్కిలి సంస్తుతించిరి. నాటి సమావేశమున కధ్యక్షతవహించిన ఆబ్రహా వర్సీస్ సతీమణిగారు స్త్రీల హక్కుల విషయములో దేశమం దితరభాగములకంటె తిరు వాన్కూరు సంస్థానము చాల యభివృద్ధితో నొప్పుచున్నదనియు, మతాచారములలో సాంఘిక విషయములలోను పురాతనమునుండి ఆచరణలోనున్న నిమ్నోన్నతములను తొ గించుటలోను, హరిజనులకు దేవాలయప్రవేశపు హక్కుల గల్పించుటలోను, తిరువా న్కూరు సంస్థానము ముందంజవేసినదనియు తెల్పుచు స్త్రీల సంపూర్ణస్వాతంత్ర్యము సమకూరుటకు వారు స్వయముగ తమ జీవితమును సంపాదించుకొనుటకు సహాయపడగ వృత్తివిద్యల యభివృద్ధియు, ఆర్థికస్వాతంత్ర్యమును అత్యవసరమని హెచ్చరిక గావించి

వ్యాసకర్తల కొకమనవి

వ్యాసములును కథలును రెండుమూడు పేజీలకు మించియుండిన వెంటనే ప్రచురింపబడుటకు అవకాశముండదు. ఎంత క్లుప్తముగ నున్న అంత యాదరమునకు పాత్రములగునని గమనింప కోరుచున్నాము.

సంపాదకుడు.

Edited by Dr. K. N. Kesari, Printed and Published by Dr. S. Seshagiri Rao, at the Lodhra Press, 15, Westcott Road, Royapettah, Madras.

నవ్యకళా ఫిలిమ్స్‌వారి మీరాబాయిలో

మీరా - మిస్. చెలం.

విషయసూచిక

1. బాష్పాకులిత	శ్రీ సరస్వతీ రామాయణము	201
2. ఆంధ్రదేశ సంచారము	శ్రీయుత ఏడిద కామేశ్వరరావు	204
3. శారదలేఖ	శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మ	205
4. అబలలము కాము	శ్రీమతి వక్కలంక రామాబాయి	208
5. సీతాపతి వధ	శ్రీమతి లోకనిండి సత్యవతీబాయి	209
6. మహిళా-మహత్తు	శ్రీమతి వల్లభనేని రంగాదేవి	215
7. మానవుని దివ్యత్వము	శ్రీ వంక వెంకటరామకృష్ణారావు	216
8. మనిషేనా?	శ్రీ కాళ్లకూరి దయానిధిరావు	220
8. ఏం చెయ్యడం...?	శ్రీమతి పులిపాక బాలాత్రిపుర సుందరమ్మ	221
9. నాడు - నేడు	శ్రీ చివుకుల ఆదినారాయణ	224
10. కళాకలాపము-సహజకళల సామర్థ్యం	శ్రీ గరిమెళ్ల సూర్యనారాయణమూర్తి	225
11. మంత్రసాని	శ్రీ గజపతిరాయవర్మ ...	227
12. ఆంధ్రశిల్పి	శ్రీ తుమ్మల సీతారామమూర్తి చౌదరి	230
13. మా ప్రణయ సంసారం	'జీవనప్రభాత్'	231
14. భావతరంగిణి	... ...	236
15. తాపక్రమం	"వసంత"	237
16. స్థైర్యము	శ్రీమతి గంటి కృష్ణవేణమ్మ...	241
17. గానకళ	శ్రీ గాలిపెంచల నరసింహారావు	242
18. పాకకళ	... ...	245
19. బాల భాగ్యోదయము-'కోమటియుక్తి'	రేడియో మామ కథ ...	247
20. గ్రంథసమీక్ష	... ...	248
21. పత్రికాపరిచయం	... ...	"
22. చలనచిత్రాలు	... ...	249
23. 'నేటి సినిమాప్రపంచాన చోటులేదు'	శ్రీ వారణాసి వేంకటేశ్వరులు	250
24. పుష్పచయము	... ...	251
25. సంపాదకీయములు	... ...	252

త్రివర్ణచిత్రము : చిత్రకారుడు, శ్రీ ఎ. ఆర్. దీనన్

'బాష్పాకులిత'



బాష్పాకులిత

జయజయ గృహలక్ష్మి సఖి! జయజయ లలితాంధ్ర మధుర సారస్వతమా!
జయజయ లలనారత్నమ! జయజయ విద్యాప్రబోధ! జయకల్యాణీ!

భాష్పాకులిత

సీ. తేరెక్కి దశదిశల్ తిరుగాడు బలగుణమాన్యుండు ధన్యుండు మామగారు
సకలారిషడ్వర్గజయశీలుఁ డనఘుఁడు ప్రేమవారాశి నాప్రియజనకుఁడు
పక్షపాతము లేక రక్షఃకులం బెల్లఁ బట్టి కూల్చినమహాబలుఁడు విభుఁడు
మేఘనాదునిఁ జంపి మేదిని విఖ్యాతి వడసి వర్ధిల్లెడువాఁడు మఱఁది

గీ. కోటిబలగంబు లుండియు మాటకైనఁ
దోడు లేదాయె సక్కటా! తుట్టతుదకు
నడవిపాలైతి నీగర్భమందుఁ బుట్టి
యిన్నియగచాట్ల కైతినే కన్నతల్లి!

వ॥ అని పరిపరివిధంబులఁ బరితపించుచుండ దీనాలాపంబు లాలకించి
మునిబాలురు కొందఱు వాల్మీకిమహర్షికిం దెలుప నాతండు వచ్చి...

—సరస్వతీ రామాయణము.

గృహలక్ష్మి పత్రికాప్రతినిధి

ఆంధ్రదేశ సంచారము

"గృహలక్ష్మి - అఖిలాంధ్రమహిళామణుల ఏకైకపత్రిక. మహిళామణుల మనోవాంఛితాల ప్రత్యేక వ్యక్తిత్వానికి, గృహలక్ష్మి పత్రిక దర్పణములా ప్రతిబింబించిననాడే, స్త్రీ సంఘం సర్వతో ముఖంగా బలిష్ఠవంతమౌతుంది. అందువల్ల ఈ పత్రికాభివృద్ధిమీదనే ఆంధ్రమహిళామణుల అభ్యుదయ మాధారపడివుంది. కనుక గృహలక్ష్మి పత్రికాభివృద్ధికి, చందాదారులుగా చేరి, ఆంధ్రమహిళామణు సంపూర్ణ సహకారాన్నియ్యడం వారి ముఖ్యధర్మం."

—ఇది గృహలక్ష్మి సందేశం. ఇదే గృహలక్ష్మి జన్మదినోత్సవంనాటి సమావేశంలో గృహలక్ష్మి పత్రికాధిపతులైన డా॥ కేసరిగారు సభకు విచ్చేసిన పెద్దలకు విన్నవించుకున్నదిని.—

స్త్రీజనాభ్యుదయకరమైన ఈ సందేశాన్ని, ఆంధ్రమహాశయులకు, మహిళామణులకు, ఇంటింటి అందజెయ్యడానికి గత మార్చి 15 వ తేదీని గృహలక్ష్మి ప్రతినిధిగా ఆంధ్రదేశ సంచారం బయలుదేరాను.

పత్రికాభివృద్ధియే ప్రధానంగా పెట్టుకుని, డబ్బుఖర్చుకు ఏవిధంగానూ లక్ష్యపెట్టక, శ్రీ కేస గారు ఎంత మహదాశయంతో నన్ను పంపారో, అట్టి వుత్సాహంతోనే ప్రచారం కావించాను. కాని ఆంధ్ర మహాశయులలో సహకారం సన్నగిల్లడం కొంతవరకు విచారాన్ని కలగజేస్తూవుంది.

ముఖ్యంగా, సూళూరుపేట, నాయుడుపేట, గూడూరు, వెంకటగిరి, కాళహస్తి, నెల్లూరు, కావలి ఒంగోలు, చీరాల, బాపట్ల, తెనాలి, రేపల్లి, గుంటూరు, నరసారావుపేట, బెజవాడ, మచిలీపట్నం గుడివాడ, ఆకివీడు, భీమవరం, పాలకొల్లు, నరసాపురం, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్ల కోట, కాకినాడ, పిఠాపురం, తుని, అనకాపల్లి, విశాఖపట్నం మొదలైన పట్టణాలలోని ప్రముఖుల సందర్శించాను—

గృహలక్ష్మి పత్రికను వృద్ధిచేయడానికి, ముఖ్యంగా పత్రికను నూటికి నూరుపాళ్లూ స్త్రీ పత్రికగా చేయడానికి, అందుమూలంగా ఆంధ్రదేశానికి విజ్ఞానప్రదాయినిగా నడపడానికి వారివారిని దర్శించి సలహాలను కోరాను.

ప్రజాసముదాయముయొక్క భిన్నభిన్న రుచులను మెప్పిస్తూ, అందరి ఆమోదాన్ని పొందడ ఏ పత్రికకైనా కష్టసాధ్యమే. ఇటువంటి భిన్నాభిప్రాయమే గృహలక్ష్మి పత్రికవిషయంలోకూడా వుండడమ ఆశ్చర్యంకాదు.

కాని, పాఠకలోకంయొక్క అభిరుచులను, తదితరులయొక్క అభిప్రాయాలను అనుసరించి నడుస్తూ పత్రికాశయాన్ని బహుముఖాలుగా ప్రజ్వరిల్లజేసినపుడు ఆ పత్రికయొక్క జన్మసార్థకమౌతుంది. ఇట్టివారి ప్రోత్సాహదమిస్తూ, పత్రికవిషయంలో వారివారికి తోచిన సలహాలను వారువారు ఇచ్చారు. ఇందుకు గృహలక్ష్మి సర్వదా కృతజ్ఞురాలు.

ఇంతకు పూర్వమువలె బాలబాలికలకు సంబంధించిన విషయాలు చేర్చవలసినదని, పాతపాటలు పల్లెపాటలు, సాంఘికసమస్యలమీది అభిప్రాయాలు, రాజకీయసంబంధమైన ముఖ్యవిషయాలు, మంచికథలు కళలమీద ప్రముఖుల వ్యాసాలు, మొదలైనవి ప్రకటిస్తే పత్రిక ఇంకా బాగుండి ఆసక్తి హెచ్చుతుంది సలహాలిచ్చారు.

ఇందు కొన్ని విషయాలలో గృహలక్ష్మి ఇదివరకునుంచి తీవ్రకృషి చేస్తూనేవుంది. ఇక మిగిలిన విషయాలలోకూడా ద్విగుణీకృతోత్సాహంతో పాటుపడడానికి, పాఠకలోకంలో ఆసక్తిని ఇనుమడింప జేయడానికి ఏవిధంగానూ వెనుదియ్యదు; సర్వదా సంసిద్ధంగానే వుంటుంది.—

ఇక పత్రికనుగురించి వ్యతిరేకాభిప్రాయాలలో ముఖ్యమైనది: 'గృహలక్ష్మి' పత్రికలో తీవ్ర వాదుల తరగతికి చెందినవారికి స్థానంలేదని. ఈ విమర్శకు సమాధానంగా, గృహలక్ష్మి తన ఆశయాన్ని పత్రికాముఖాన ఇదివరకే వెల్లడిచేసింది—

“పొరపొచ్చములులేని స్త్రీ పురుష సమానైక్యతను, జాతిద్వేషాలను ప్రోత్సహింపని భావాలను, సంఘ విచ్ఛిన్నానికి దోహదమిచ్చే సాంఘికదురాచారాలను నిర్మూలించడానికి, స్త్రీజనోచితమైన విద్యను వృద్ధిచేయడానికి, మొదలైన సర్వతోముఖమైన స్త్రీజనాభ్యుదయానికి తోడ్పడు భావాలకే చోటిస్తుంది. ఇవి గాక తాత్కాలికంగా స్త్రీ సంఘానికి మేలుచేసినా, కాలక్రమాన్ని సంఘానికి హానిచేయువానిగా పరిణమించు ఎటువంటి తీవ్రతరవాదానికాని, భావానికిగాని గృహలక్ష్మి తగిన ప్రోత్సాహాన్ని యివ్వలేదు.”ఇది సత్యమే—కాని ఒక విషయంమాత్రం చేసింది. ఈలాటి తీవ్రభావాలకికూడా గృహలక్ష్మి చోటిచ్చింది. చోటిచ్చి, ఆ భావాలమీద ప్రజాభిప్రాయాన్ని ప్రకటించింది. ప్రకటించి, అధికసంఖ్యాకుల అభిప్రాయానికి చేయూతనిచ్చింది. భిన్నాభిప్రాయాలను పరామర్శించి, నిగ్గును తేల్చి, ఆ భావాన్ని ప్రజలకందిచ్చింది గృహలక్ష్మి. ఇది సర్వజనసమ్మతమైన కార్యాచరణమే కదా?—

ఈ సదాశయంతో గృహలక్ష్మి ఇంతకాలంనుంచీ చేసిన పరిశ్రమకు ఫలితంగా ఆంధ్రదేశంలో కొంతమంది రచయిత్రిలను, రచయితలను సృష్టించింది. వీరేకాక ఇతరులను తయారుచేయడానికి సర్వదా కృషిచేస్తూనే వుంది. ఇక ఉన్నలోపాలను సవరించుకుని, ప్రముఖ రచనలను ప్రకటిస్తూ, క్రొత్త రచనలను ప్రోత్సాహిన్నిస్తూ, సంచారంలో సేకరింపబడ్డ సలహాలను క్రమేపీ చేరుస్తూ, పాఠకలోకంయొక్క అభిరుచులకు అనుగుణ్యంగా వెలువడడానికి సిద్ధంగానేవుంది. ఇందుకే యీసంచారమూ, ప్రముఖులతో పరిచయమూను.

కాని గృహలక్ష్మియొక్క ఈ అకుంఠిత దీక్షాబద్ధమైన సేవకు తగిన ఉత్సాహ ప్రోత్సాహాలు ప్రజానీకంనుండి, పత్రికకు ప్రాప్తించకపోవడం నిరుత్సాహాన్ని కలగజేస్తూవుంది. ఆర్థికంగా తగిన బలం లేకపోతే పత్రిక నడక కుంటుపడుతుందనే విషయం అందరికీ తెలిసివున్నదే. ఈ విషయంలో ఆంధ్రమహాశయులవద్దనుండి తగిన సహకారంలేక మన పత్రికలు క్రుంగిపోతున్నాయి. పత్రికలను పోషించడం అంటే చందాదార్లుగా చేరి చేయూతనివ్వడం, ఆంధ్రులలో తక్కువలో తక్కువ. ప్రజలలో పత్రికలను చదవడంలో వున్నంత ఆసక్తి పత్రికలనుకొని చదవడంలో కనపడదు. ఆర్థికమాంద్యంలో పత్రికలుకొనడం కష్టం అనుకుందుకైనా, పత్రికల ఖరీదులు అంత అందుబాటులో వుండకుండాలేవు. ఇక పత్రికలను కొనడంలో యీ 'లోభత్వం' మనవారిలో ఇంత అచంచలంగా ఎందువల్ల గడ్డకట్టుకుపోయిందో తెలుసుకోవడం దుస్సాధ్యంగానే వుంది.

“గృహలక్ష్మి మంచి ఉత్తమతరగతికి చెందిన పత్రిక. పత్రిక చేస్తూవున్న సేవ అపారం. పత్రిక 'Get-up' అదీ గులాబీపువ్వులా ముచ్చటగా వుంటుంది. ఇటువంటి ప్రత్యేకత ఇంకొకపత్రికకు రావడం కష్టం...” అంటూ మెచ్చుకున్న 'ఆఫీసరు' గారినే చందాదారుగా చేరమని కోరేసరికి, ఆయనకు అన్ని విధములైన ఆర్థికచిక్కులు ఈ మూడురూపాయల చందాతోటి ఎక్కువైపోతాయి. ఇటువంటి ప్రవృత్తి ప్రబలంగా వున్నప్పుడు మన పత్రికలు, పత్రికలతోపాటు ప్రజలు అభివృద్ధిస్థానాల న్నాక్రమించటం లేదనుకోవడంలో అర్థంలేదు.

ఈ ఆదరణాలేశంతోనే ఏదో ఆకారాలు కాపాడుకుంటూ, సర్వవిధములా ప్రజాభిరుచులకు ప్రదీపనమును గూరుస్తూ, పత్రికలు బైటకువచ్చి ప్రజాసేవ చేస్తూవున్నాయి. అంతలో యీ యుద్ధం మళ్లీ

వచ్చిపడ్డది. ఈ పశుబలతీవ్రతకి ప్రాణికోటితోపాటు వారికి కావలసిన సర్వవస్తు సముదాయమంతా ఆహుతి అయిపోతోంది. దానితో మానవునికి కావలసిన నిత్యావసరాలు కరువైపోతున్నాయి.

ముఖ్యంగా వార్తాపత్రికలకు సంబంధమున్నంతవరకు - కాగితం - పత్రికలకు ప్రాణమే యిది, కరువైపోయింది. ఒకరూపాయ కాగితం నాలుగురూపాయిలైపోయింది. ఈ అపారమైన ఖరీదుగల కాగితమైనా సరిగ్గా తగినంత దొరక్కుండావుంది.

అర్థబలంలేక బక్కచిక్కివున్న పత్రికాసంస్థలకిది, మూలిగే నక్కమీద తాటిపండు పడ్డట్లయింది. అయినప్పటికి, పుటలు తగ్గించియో, తక్కువరకపు కాగితము ఉపయోగించియో పత్రికలను ఆపకుండా నిలుపుకు రావడాన్నిచూస్తే, వ్యక్తుల ఉదారబుద్ధి, మహదాశయాలే కారణం. ఇటువంటి సమయంలో ప్రజానీకం, ముఖ్యంగా ఆంధ్రమహిళాలోకం సర్వవిధములా చేయూతనిచ్చి పత్రికను నిలబెట్టుకోవాలి. వ్యక్తులు ఉదారబుద్ధితో ముందుకువచ్చి సహకారాన్ని చూపకపోతే మనపత్రికల భవిష్యత్తు అంధకారంలోనే వుంటుంది.

నేటి నాగరిక ప్రపంచంలో పత్రికలు అత్యుత్తమమైన స్థానాన్ని ఆక్రమించుకుని వున్నాయి. ప్రజానీకానికి విజ్ఞానదృష్టులను ప్రసాదిస్తూ ప్రపంచంతో నిత్యసంబంధం కలుగజేస్తూవున్నాయి. దైనిక జీవనంలో పత్రికలు చదవడం అనివార్యంగావుంది పత్రికలను ఒకరోజు చూడకపోతే ఒకసంవత్సరం వెనుకబడిపోయి వుండేటంత వేగంతో కాలం పరిగెడుతూవుంది. ఈవేగంతో సమానంగా పరిగెడుతూ కాలం వెళ్లబుచ్చవలసిన పరిస్థితి ఏర్పడిపోయింది. ఇటువంటి సమయంలో పత్రికల ప్రముఖస్థానం, వాటిని చదవవలసిన ఆవశ్యకత, వాటిని పోషించవలసిన బాధ్యత మరీ ఎక్కువవుతూవుంది.

ప్రజాభిప్రాయాన్ని దివ్వెతో చూపిస్తూ, దానిని ప్రపంచంలో చాటుతూ ప్రజానీకానికి పత్రికలు చేస్తూవున్న సేవ అమూల్యం. మనిషికి కన్ను, ముక్కు, నోరు మొదలైన అవయవాలవలెనే ప్రజాసంఘమనే వ్యక్తికి పత్రికలలాపనిచేసి, ప్రత్యేక వ్యక్తిత్వాన్నికలుగజేసి సభ్యతాప్రపంచంలో ప్రథమస్థానాన్ని కలగజేస్తాయి. పత్రికలెంత అభివృద్ధిస్థానంలోవుంటే ఆదేశంఅంత అగ్రస్థానంలో వుంటుంది. దీనికి తార్కాణం వంగదేశం.

అటువంటి అభ్యున్నతిని మనం పొందటానికి, ముఖ్యంగా మన పత్రికలను మనంపోషించి విజ్ఞానాన్ని సంపాదించి, వాటిద్వారా ఉన్నతస్థానంలోకి రావాలి. ఆంధ్రదేశం ఈ విషయంలో చాలా వెనుకనే వుండిపోవడం, మనకు చాలా లజ్జాకరమైన విషయం.

ఇక గృహలక్ష్మి పత్రిక గత 12 సంవత్సరాలుగా మహదాంధ్రమహిళాలోకానికి, అఖిలాంధ్ర దేశానికి బీరువోని సేవచేస్తూవున్నా ఇటువంటిలోపం తీరకపోవడం కేవలం సిగ్గుచేటైనవిషయం కాని వేరుకాదు. కాన ప్రజలు పత్రికకు సర్వవిధముల సహకారాన్ని చూపడం ధర్మం.

ప్రచారం ద్వారా ప్రజాభిప్రాయాన్ని, సలహాలను సేకరించుకొని, పత్రికను ప్రజానీకంయొక్క అభిరుచులకు ప్రదీపనము గూర్చులాగున చేయడంలో శక్తివంచనలేక పాటుపడడానికి 'గృహలక్ష్మి' సర్వసిద్ధంగానే వుంది.—

ఇకనైనా యీ మహత్కార్యాచరణకి ఆంధ్రమహిళామణులు, మహాశయులు సర్వతోముఖంగా తమతమ సహకారాన్ని అందజేస్తారని ఆశిస్తున్నాము.—

— ఏడిద కామేశ్వరరావు
'గృహలక్ష్మి' ప్రతినిధి.

శారదలేఖ

> హిందూ మహమ్మదీయు లీదేశమున వస్త్రములోని పడుగు పేకలవలె కలిసియున్న మాట వాస్తవము. వస్త్రమునందలి యేవైపుదారములు దూసినను వస్త్రముయొక్క రూపమెట్లు విచ్ఛిన్నమగునో అటులనే హిందూ మహమ్మదీయులలో నెవరిని విడదీసినను భారతదేశ స్వరూపమును విరూపమగును.

సౌభాగ్యవతి కల్పలతకు,

నెచ్చెలీ! భరతవర్షమనియు, భరతఖండమనియు, విఖ్యాతనామమువహించి యుగయుగములనుండియు నొక్కటే గడ్డగనున్న మన హిందూస్థానమునకు ఎన్నిముప్పులు వచ్చినవి! ఆస్తిపాస్తులపంపకములో నధిక భాగమునకై పోరాడు అన్నదమ్ము లెందరైన నుందురుగాని మాతృగర్భమును రెండుముక్కలుగజీల్చి పంచుకొను మందభాగ్యులెందరైన నుందురా? మన భారతదేశమున నానాటికి ప్రబలమగుచున్న మతవర్ణశాఖా వివాదముల వైఖరిచూడ నాచందముగనేయున్నది. ఈ వివాదముల యుద్ధతి చూచినకొలది భరతవర్షాభ్యుదయమునకు వేరుబుర్వై పరదేశీయ పాలనమునకు హేతుభూతమై మన భారతీయుల సర్వనాశ మొనర్చిన అనైకమత్యము ఈనాటికిని మనలను వీడలేదుగదాయని విచారమగుచున్నది.

మన ఆర్యావర్త మీనాటిదా! ఎంత ప్రాచీనమైనది? ఈ పుణ్యభూమి జీవితము వేల సంఖ్యలపై లెక్కింపవలసినదేగాని దశాబ్దములు, శతాబ్దములు చాలవుగదా! ఎన్నిమతములిందు జనించినవి! ఎన్ని పరమతము లిందు వ్యాప్తిగాంచినవి! ఎన్ని మతకలహములను, ఎన్ని సాంఘికవిప్లవములను, ఎన్ని సాంప్రదాయ సంఘర్షణలను కనులగాంచినదీ ఆర్యభూమి! హిందువుల చేయిజారి ఒక్కొక్కప్పుడు ఒక్కొక్క భిన్నమతస్థుడు రాజై తన మతసంఘ సాంప్రదాయముల నీ భరతవర్షముపై వ్యాపింపజేయునాడైన నీదేశమును ముక్కలు ముక్కలు తెగగొట్టి మతములబట్టి విభజించియుండలేదే? బాబరు, హుమాయూను, అక్బరు, జహాంగీరు, షాజహాను మున్నగు మొగలాయి చక్రవర్తులు పాలించునాడేమి; తుదకు మతపక్షపాతియని పేరొందిన ఔరంగజేబు పాలించునాడేమి తన మహమ్మదీయ మతవ్యాప్తికై ప్రాకులాడుటేగాని యీ భరతవర్షమును మతములబట్టి విభజించి దేశజననిని వికారాకారగ జేయుటకు సాహసించియుండలేదే! నేడు జిన్నాప్రభృతులకీ యాగడంపు తలంపేలగల్గెనో! దురూహ్యముగా నున్నదిగదా.

హిందువులు వేఱట మహమ్మదీయులు వేఱట! మతసంఘ సాంప్రదాయములలో నేమి వేషభాషా వ్యవహారములలో నేమి ఉభయులకు పొత్తేలేదట. అందువలన నీ భారతదేశమును హిందూ రాజ్యమనియు మహమ్మదీయ రాజ్యమనియు రెండుగ విభజింపవలెనట. ఎంత విపరీతమగు కోరికయిది! ఎన్ని శతాబ్దముల నుండి హిందూమహమ్మదీయు లీదేశమున కలసిమెలసియుండలేదు? ఇందువలన వీరికిదివరలో జరిగిన అపకార మేమి? నేడు వాటిల్లనున్న ప్రమాదమేమి? ఏమియులేదు. నిజమునకు హిందూమహమ్మదీయు లింతకాలము

నుండియు కలసియుండుటచే గల్గిన నష్టమిసుమంతయు మున్మాటికిని లేదుగాని, యికముందు రెండుఖండముల విభజించుటచే గల్గునష్టము మాత్రము అపారమని చెప్పకతప్పదు.

ఏలనన ? ఇచట హిందూ మహమ్మదీయులను ద్వివిధమతస్థులేగాక పారశీకులు, సిక్కులు, క్రైస్త లాదిగాగల యితరమతములవారును చాలమందిగలరు. ఒకమతమువారు విడిపోయి తమదేశమును ప్రత్యేకము నేర్పరచుకొనినపుడు తదితరమతములవారికిని అట్టి వాంఛగలుగుట సహజము. అప్పుడు క్రైస్తవులు సిక్కు మున్నగువారును తమ భాగమును తమకీయవలసినదని పోరాడవచ్చును. అప్పుడీ ఆర్యావర్తమును రెం ఖండములుగా గాక నాలుగైదు ఖండములుగా విభజింపవలసివచ్చును. ఇంతటితో నీవిభాగసమస్య పరిష్కా మైన మేలే. కాని యీ మతములలో నెన్నియో శాఖలున్నవి. వారిలో వారికి సుతరాముపడ మహమ్మదీయ మతమునవలంబించిన షియాసున్నీ తెగలవారు తమలోతమకు పడక నిరంతరమెట్లు పోరాడుచు తలలు బ్రద్దలుకొట్టుకొని రక్తప్రవాహములు చేసికొనుచున్నదియు నిత్యము పత్రికలలో చదువుచు యున్నాము. ఉత్తరహిందూస్థానమున నీ వివాదములుజరుగుచుండ మనమేల మిన్నకుండవలయునని కాబో మన దక్షిణ హిందూదేశమున తమిళనాడులో ఆర్యులు వేరనియు ద్రావిడులు వేరనియు వారునువీరు నెప్పుడును కలిసియుండలేదనియు, కాన నీదేశము ఆర్యద్రావిడఖండములుగా విభజింపవలయుననియు నొ వాదము బయలువెడలినది. కనుక మతములనుబట్టి విభజించుటయే జరిగినచో శాఖలనుబట్టియు నార్యద్రావి భేదములనుబట్టియు విభాగించుట అనివార్యమగును. అప్పుడు హిందూదేశమనునదియే లేకుండపోవు అంతర్వైమనస్యములు వృద్ధియగును. ఐకమత్యము ఊరుపేరులేకుండ నశించును. మహాత్ముడు మున్నగు మహా నాయకులు చేయుచున్న స్వరాజ్య సంపాదనాయత్నములు విఫలములగును. పరదేశీయపాలన మిప్పటికం సుస్థిరమై యీ భరతఖండవాసులనెల్లర అవిచ్ఛిన్న దాస్యమున బంధించివైచును. కావున 'పాకిస్థానము'ని చె బడుచున్న యీ దేశ విభాగవిధానము గర్హింపదగినదిగాని ఆమోదింప దగినదిగాదు.

ఇంతకును తాము ప్రత్యేకజాతివారమనియు, తమకు ప్రత్యేకదేశ మేర్పడవలయుననియు నింత నలజడిచేయుచున్న యీ మహమ్మదీయు లేతురుష్కదేశమునుండివచ్చిరి ? వీరిలో ముక్కాలు మువ్వీసము పూర్వమొకప్పుడు హిందువులైయుండి కారణాంతరములచే మహమ్మదీయమతమును స్వీకరించినవారేగా పక్కా మహమ్మదీయులు కానేకారు. తుదకు ముస్లిము లీగను మహమ్మదీయ సంఘము నేర్పరచి యీ ఆందోళన సాగించుచున్న జిన్నాగూడ హిందూసంతతి వాడేననియు, పంజాబు ప్రధాని సికందర్ హయత్ ఖాను క్షత్రియవంశము వాడనియు దృష్టాంతరములు చూపుచున్నారు. ఇదియే నిజమైన హిందూమహమ్మ దీయులెల్ల రొక్క తల్లిబిడ్డలేయని స్పష్టమగుచున్నదిగదా. మన పురాణేతిహాసాదులలో మ్లేచ్ఛులనియు యవనులనియు వర్ణింపబడిన వీరు తమ సంతతివారైనట్టును, తమ ఆజ్ఞాధిక్కరణంబు సేయుటచే పాతిత్య కర్మభ్రష్టులనుగా శపించినట్టును విశ్వామిత్రాది మహర్షులచే చెప్పబడినది గాని అన్యులుగా తెలుపబడలేదు.

శ్రీమతి సరోజినీనాయుడు చెప్పినట్టుగా హిందూమహమ్మదీయు లీదేశమున వస్త్రములో పడుగుపేకలవలె కలిసియున్న మాట వాస్తవము. వస్త్రమునందలి యేవైపుదారములు దూసినను వస్త్ర యొక్క రూపమెట్లు విచ్ఛిన్నమగునో అటులనే హిందూ మహమ్మదీయులలో నెవరిని విడదీసినను భారత స్వరూపమును విరూపమగును. కాన మాతృదేశాభిమానులైన వారెవరు గాని యీ ప్రత్యేక విభాగము కో రాని కోరిక, చేయరానిపని, తలపరాని తలంపు. మహమ్మదీయు లీ దేశమునకు అరేబియానుండి క్రీ.

712లో సింధురాష్ట్రము పైదాడి సాగింపవచ్చినను, నాటనుండియు వారు హిందువులతో కలసి మెలసి యేకోదరులచందమున నున్నారు. వారికిని వీరికిని సంబంధ బాంధవ్యములుకూడ కలిసినవి. హిందువులతోడి సంబంధమునకై అక్బరు మొదలైన చక్రవర్తులు చేసిన కృషి చరిత్రప్రసిద్ధము. హిందువులతోనేగాక హిందూ దేవతలతోగూడ మహమ్మదీయులకు సంబంధమున్నది. తిరుపతి, శ్రీరంగము ఆదిగాగల క్షేత్రములతో మహమ్మదీయులకుగల సంబంధములందఱెఱింగినవి. నవాబుకూతురగు బీబీ నాంచారు హిందువులదేవుడైన రంగనాయకస్వామిని ప్రేమించి వరించి పతిగాజేసికొనిన వృత్తము చరిత్ర ప్రసిద్ధిగదా! ఆ పుణ్యక్షేత్రము యొక్క నామము మఱచితినిగాని తిరునల్వేలి జిల్లాలోనొక హిందూదేవాలయమునకు మహమ్మదీయుడు పూజారిగా నున్నాడు. అచ్చటి దేవార్చనకు వినియోగించునూనె సమస్త వ్యాధి పీడానివారకరమని హిందువులు భావింతురు. మహమ్మదీయులకు నృసింహస్వామి యిష్టదైవమనియు, ప్రతివత్సరము వారా స్వామికి గోప్యముగా పూజా పురస్కారములు చేసెదరనియు వింటిని. ఇది యెంతవఱకు నిజమో నాకు తెలియదుగాని మన భద్రాద్రిరాముడు ప్రతివత్సరము శ్రీ హైద్రాబాదు నవాబుగారంపిన తలంబ్రాలతోగాని కల్యాణ మహోత్సవము జరుపుకొనడను వృత్తాంతము మనమెల్లర మెఱిగినదేగదా. మహమ్మదీయులు హిందువుల దేవతలను పూజించినట్లే హిందువులు మహమ్మదీయ పీర్లకు మ్రొక్కుబడులు చెల్లించుటయు, మహమ్మదీయ సాధువులైన మస్తాను మొదలగువారి సమాధులను పూజించుటయు, ప్రాణాచారములు ఇడుటయు, వారి నామధేయములను తమబిడ్డలకు పెట్టుకొనుటయు అనాదిగాజరుగుచున్న ఆచారము.

విశాలమగు దేశములో భిన్నమతములును భిన్నకులములును ఉండుట సహజము. భోజన ప్రతి భోజనములందును, సంబంధ బాంధవ్యముల పట్లను అవి అవిలంఘ్యనీయములుగానే యుండవచ్చును. చిరకాలమునుండివచ్చు నాచారములనొక్కమారుగా తుడిచివేయుటకు సాధ్యము కాకపోవచ్చును. అంత మాత్రముచేత దేశవ్యవహారములలో వానికి జోడుకలిపి విభజనమార్గమును బట్టుట దేశద్రోహము గాక మఱేమి ?

నేడు ఆంగ్లదేశమున జూడుము! దేశమునకు యుద్ధోపద్రవము రాగానే భిన్నభిన్న పక్షములకు జెంది నిరంతరము పోరాడుకొనువారెల్ల రొక్క మంత్రివర్గముగాజేరి దేశరక్షణ కెట్లు పూనుకొనిరో! ఆహా! ఐక మత్యమన నిట్లుగదా యుండవలయును! దేశాభిమానమనిన నిట్లుగదా యుండవలయును!

మనము హిందువులముగాము, మహమ్మదీయులముగాము, క్రైస్తవులముగాము, ఈ భారతదేశమున జన్మించితిమిగాన భారతీయులము; కాన యీ భారతవర్షాభ్యుదయమునకై శక్తి వంచనలేక పాటుబడుట భారతీయులవిధి; తద్భిన్నముగ వర్తించుట వివేకహీనము.

కల్పలతా! ఇప్పటున భారతీయమహిళామణులెల్లరు మతైక్యమునకును,సంఘైక్యమునకును పాటుబడు నవసరమెంతేనిగలదు. అఖిలభారతమహిళాసభ యీ ఆదర్శముతోనే నడచుచుండుట సంతోషకరమగు విషయము. అయినను అంతటితో తృప్తినందక సామాన్య సామాజికవ్యవహారములందును నితరమతస్థులతో సంబంధము కలుగజేసికొని వారి సమావేశములకు వీరును వీరి సమావేశములకు వారును బోవుచు మతైక్యము నకై పాటుబడుట మన స్త్రీలెల్లరి ధర్మమైయున్నది.

తమ పరిపాలనను సుస్థిరమొనర్చుకొనుటకై మతమునకు మతమునకుమధ్యను, తెగకు తెగకుమధ్యను విభేదములు గల్పించి పరస్పర వైషమ్యములు పెంపొందజేయుట చిరకాలమునుండియు మన ప్రభుత్వమువారు

అవలబించుచున్న నీతిగా ఉన్నది. ఆదినుండియు వారీ విభేదనవిధానమువల్లనే రాజ్యమును సంపాదించి పా
చున్నారు. ఈ విషయము చక్కగా నెఱిగియుండియు, ఇందువలన గలుగు దేశానర్థకము గుర్తించియు స్వ
పరులు కొందఱు వారికి లోబడి ప్రజలలో కలవరము గల్గించి వానికి దోహదము చేయుచున్నారు. వి
నకు విద్యాధికులలోనే నీ విభేదవ్యాధి వ్యాప్తమైయున్నది గాని జనసామాన్యములో నీ పొరపులు లే
పీర్ల పండుగరాగనే చూడుము,అది మహమ్మదీయుల పండువనుతలంపే జనులలో నుండదు. మహమ్మదీయు
పాటు హిందువులును పులివేషములువేసి ఉల్లాసముతో వ్యవహరింతురు. కాన యీ విభేదములు స్వ
కల్పితములుగాని సహజములుగావు. వీనిని నిర్మూలించుటే ప్రతివారును నిపుడు చేయవలసినపని. మ
ములచేతనే దేశమల్లకల్లోలమగుచుండ, కులసభలును, శాఖాసభలునుగూడ వీనికితోడై దేశములో వైషమ్య
లను పెంచుచున్నవి. వీనిలో విద్యాధికలైన మన స్త్రీలును పాల్గొనుచుండుట మఱింత సంతాపకర
నున్నది. నేను మున్నొకప్పుడు జెప్పినట్టుగా ఆయుధ నిర్మాణమున్నన్నాళ్లు యుద్ధభయము తప్పదన్నట్టు
మతవర్ణశాఖా సభలున్నన్నాళ్లు విభేదముల దురదృష్టమును తప్పదు. ఈ కులసభల నామోదించువారు కొ
పేరు సంపాదించుకొని తమ అధికృతను పెంపుచేసికొనవచ్చును. కాని దేశమునకు మాత్రము వీరు
చేసినవారు కాజాలరు. అఖిలభారత కల్యాణమే ఆదర్శముగా నుంచుకొనుట దేశక్షేమాభిలాషుల ధర్మ
నా దృఢాభిప్రాయము. యథాశక్తి మనమందులకే పాటుబడుటకు భగవానుడు మనకు శక్తియు
ప్రసాదించుగాక !

భావపురి
౧—౬—౪౦

మిత్రురాలు,
శారద.

❀ అబలలము కాము ❀

శ్రీమతి వక్కలంక రామా

అబలలము కాము తేజమ్ము నందినట్టి గృహిణులము మేము ; మగవారి కూర్మిఁబడయ
లలితకళలను వ్యాపింప లాస్యగతిని కంకణముఁదాల్చు మమునేలు కన్నతల్లి.

బలము నగయగనున్నది భారతాంబ, కన్యవలె మాతవలె భూమి కష్టపడుచు
దేశసేవను నిరతంబు దేలువారమమ్మ, భారతమాతరో, యక్కజముగ.

లక్ష్మిగూర్పను బలుభంగి లలితకళల నెన్నొ, మాఇంట వృద్ధిగా నేర్పఱచుచు,
నుండువారము, పురుషుల నూర్జితమతి ద్రిప్పి కావంగరావమ్మ దేశమాత.

లలితమూర్తుల మేమన్చు లాలనమున బురుషశ్రేష్ఠులు మమునింటఁ బూడ్చుచుంద్రు,
కాని, యరయంగ నేరరు కార్యదీక్ష కులము మన మన్ననుడి, దానిఁ గూల్చుమమ్మ.
ముదముఁ గూర్తుము పతులకు ముద్దుచేత లెలమిఁ గొల్చెదు సేవకై యెదురు చనుద
మమ్మరో, దేశసేవను యనవరతము నుండునట్టుల భామల మన్పు తల్లి.
కాలగతి యాంధ్రరాష్ట్రంబు కాంచునటుల నాంధ్రస్త్రీలను దీవించి, యాదరించి
నిలుపగదమ్మ, మగువల నిద్రఁబాపి భారతాంబరో, మాదగు బాధ్యతఁగని.
ముగుదలకుఁ బ్రీతి, కార్యంపు ముందుజేత సోదరావళి కలవడ, సొంపుదీర
దీవనల నిచ్చి మమునేలు దేశమాత సకలకల్యాణ గుణవతీ, శాంతమూర్తి !

శ్రీ పాలపర్తి సుభద్ర

ఈమె ధవళేశ్వరగ్రామవాసులగు శ్రీ పులుగుర్త దుర్గాప్రసాదరావుగారి కుమార్తె. ఆ గ్రామ బోర్డు హిందూ బాలికా పాఠశాలలో ఆరవ తరగతియం దుత్తీర్ణురాలైనది. పాఠశాల వార్షికోత్సవ సమయమున 'మేవాడ్ పతన్' అను హిందీ నాటకమున గోవిందసింహుని పాత్రధరించి మొదటి బహుమానమును బడసినది. వయస్సు 12 సంవత్సరములు.

శ్రీమతి గంటి కృష్ణవేణమ్మగారు

బొంబాయి పురమున నుండు ఈమె నాసిక స్త్రీ మండలిలో ఏప్రిల్ నెల 8-వ తేదీని 'స్త్రీ సంఘములు - వాని యుపయోగమును గూర్చియు, స్త్రీవిద్య - వాని యావశ్యకత' నుగూర్చియు మిగుల రసవంతముగా మహారాష్ట్రభాషలో ఉపన్యసించిరి. వీరి అమూల్యోపన్యాసము పలువురు ప్రముఖుల ప్రశంసలకు పాత్రమైనది.



రాజమండ్రి మహిళాగానకళాపరిషత్తు

శ్రీమతి బత్తుల కామాక్షమ్మ, సి. హెచ్. చంద్రమతిగార్లిందుగలరు.

ఆంధ్ర సోదరీసమాజము - హైదరాబాదు

శ్రీమతి నడింపల్లి సుందరమ్మ గారికి సమాజసభ్యులు వీడ్కోలొసంగిన సందర్భమున తీసిన ఛాయాచిత్రము.

సీతాపతి వధ

—శ్రీమతి—
లోకనిండి
సత్యవతీ
బాయి

తా నపేక్షించినది పరాయత్తమై పోవడంతో అతనిలోని అసూయ హాలాహలమైపోయింది.

ఆ హాలాహలానికి సీతాపతిని ఆహుతి చేసివేద్దామను కున్నాడు రామారావు, కాని...

ఈర్ష్యాహృదయుడికి కార్యాచరణలో మన్నూమిన్నూ కన పడదూ...?

దీర్ఘాలోచనా నిమగ్నుడైన రామారావొక్కసారి తనగది నలువైపులా దృష్టినిసారించాడు. ప్రతి వస్తువూ యథాప్రకారంగానేవుంది. తాను వ్రాలివున్న ఆ యీజీచెయిర్... ఆ రామపుకుర్చీ తక్కిన ఆ రెండు చిన్నకుర్చీలూ, మూలను ఒక వ్రాతబల్లా, దానిమీద చక్కని ఖద్దరు అద్దకపుగుడ్డా, ఆ చిన్న అలమారూ, దాన్నిండా చక్కని నవలలూ, కిటికీలోంచి వస్తూన్న ఆ చల్లని పిల్లగాలీ అన్నీ పూర్వపుమోస్తరుగానే వున్నవి.

ఈ వాతావరణములోనేగదూ తానంత చీకాకులేకుండా, నిదానముగా సీతాపతిని చంపే ప్లాను తయారుచేశాడు. తన ప్రణాళికప్రకారము చూస్తే విజయము తప్పక చేకూరుతుందన్న దృఢవిశ్వాసము కలుగుతోంది. అసలు ఆటలోని మొదటెత్తు అప్పుడే వేశేశాడుగా! అనవసరమైన గడబిడలేకుండా ఎంతో ఏర్పాటుతో, గాఢాలోచనాఫలితమైన తన ప్లానుప్రకారము హత్య, కాదు—సీతాపతి చావు—తటాలున, పొరబాటున జరిగిపోయిందన్నట్లు నెరవేరి తీరాలి.

థర్మాఫ్లాస్కులోని స్ట్రాంగుకాఫీని కప్పులోపోసుకు, మెల్లమెల్లగా త్రాగుతూ రామారావు చిరునవ్వు నవ్వుకున్నాడొకసారి.

ఎంతటి నూతిలోని గుండులాంటి మనిషితాను. ఎన్నడూ పైకి తేలలేదుగదా అతని కడుపులోని ఈసు. హృదయాంతరాళంలో దాచివుంచాడు క్రోధమంతాను. తానింతకుపూర్వమే క్లబ్బునుంచివస్తూ దిగబెట్టిన ఆ స్నేహితుని ప్రాణాలు తీసివేయాలన్నంత పగవున్నదని ఎవ్వరికీ తెలియదు—ప్రపంచంలో ఒక్క భగవంతునికి దప్ప, తనమనసుకి తప్ప, ఆఖరికి కమలకుకూడ తెలియదు. ఎంతటి బుద్ధిహీనుడా సీతాపతి! రేపు ప్రాణముతీస్తూవుంటే ఒక్కసారి గ్రహించుకొని తెల్లబోతాడు కాబోలు. అసలు మొన్న అతడు వేటకి గంగవరముపోతానని చెప్పిననాటినుండి పగతీర్చుకుందామన్న ఆశ తనని వూపివేస్తూవుంది. రేపు ఏదో పొరబాటువలన హత్య జరుగకపోయినప్పటికీ తనకడుపులోని హత్యాలోచన ఎవరికీ తేటపడదు. అదే తన ప్లానులోని చమత్కారము.

ఈ కేసులో ప్రపంచానికి హత్యని అసలు తెలిస్తేగా పోలీసులు వుద్దేశాన్ని వెదక వూనుకుంటారు? సీతాపతి చావు హత్యని తెలవనిస్తాడా తాను? సీతాపతికి ఏదో కర్మం కాలి, గ్రహచారం చాలక ఆకస్మికముగా సంభవించిన అత్యంత ఘోరసంఘటనమని తోచాలి లోకానికి. వెనుకటికొకసారి యిదే గంగవరముమేడలో పిస్తోలు శుభ్రముచేస్తూ సీతాపతి పులినోటికందరాయై మృత్యువు తప్పించుకోలా? అప్పుడు తానక్కడ వుండలే?

ఆలాగే యిది ఇంకొక పొరబాటు. ఈసారి ప్రాణమేపోయిందనుకొంటూరు బంగళాలో. ఒక్కణ్ణి చూచి రామారావన్నా దగ్గరుంటే లండనులో చదివిన గొప్పడాక్టరు గనుక వెనుకటికి వలెనే వెం వైద్యసహాయంచేసి మిత్రుని ప్రాణము కాపాడినాడు అని అందరూ అనుకుంటారు. ఎంతటి భీభత్స చిటికాలములో జరిగిపోయింది అని ప్రజలు అనుకుంటూవుంటే తాను గ్రుడ్లనీళ్లు గ్రు కుక్కుకోవద్దూ! స్వయంగా తాను మిత్రుని యంత్యక్రియలకుగా అన్నియేర్పాట్లు చేయాలి. సీతాపతి భా గొల్లుమంటే తానుకూడ నిస్పృహుడై కన్నీరు కార్చాలి. ఆమె దుఃఖసముద్రములో తాను చేయూ తోచవద్దూ!

... ...

సీతాపతి నడుమ రాకపోతే కమల తనభార్య అయ్యేదికాదూ! తనపెండ్లికెన్ని రాయభారా తన మేనమామ పంపలే. ముందు ఒప్పుకోకపోయినా కమల తండ్రి చావుబ్రతుకులమీదవుండి బిడ్డను గు గింజలూ పోసి మరణించాలని ఒప్పుకోలా! ఇంతలో అప్పుడే లండనునుండి తిరిగివచ్చి డబ్బుకాశ కట్నము తీసుకోకుండా కమల చక్కదనానికి వ్యామోహపడి చటుక్కున ఆమెను పెండ్లిచేసుకున్నా సీతాపతి. ఈ సీతాపతే భూమిమీదలేకుండావుంటే ఆస్తిపాస్తులతో, కట్నంకానుకలతో కమల డా రామారావుగారి భార్యయై విలసిల్లేదిగా! అన్నా! ఎంత దుర్మార్గుడు! తనకనుకున్న సంబంధానికి మనసారవలచి పెండ్లాడనున్న పిల్లకి అడ్డము వస్తాడుగా! రెడ్లల్లో చదువుకున్నపిల్ల ఒక్కతనేగదూ పోటీ చేసుకున్నాడు...

ఈ ఆలోచనా బిగువుచేత రామారావు కణతలపైని నరాలుబ్బి ఆతని మానసికోద్వేగా చూపిస్తూవున్నాయి. చిరుచెమ్మటలు ముత్యాలసరములాగు నుదుటిపై నిల్చినవి.

సీతాపతిని చంపాలన్న ఉద్దేశము కమలపెండ్లినాడు, ముసిముసినగవులతో ఆమె తలంబ్రా వరునిమీద పోస్తూంటే కలిగింది! ఏమిటో! ఎలక్ట్రిక్కుతీగ తగిలితే ఎంతబాధకల్గుతుందో అంతఆవేదన తనకు. అసలీ సీతాపతన్నవాడే భూమిమీదలేకపోతే - ఈనాడే పెండ్లియగునా? అని స్పృహ ఇప్పటికయినా ఏమంత మించిపోయింది, ఈరోజుల్లో పునర్వివాహాలు అపురూపముకాదుకదా! కమల పెండ్లాడినాసరే, లేకపోయినాసరే, కమల సీతాపతికి సౌఖ్యమివ్వకూడదు. అంతేకావాలి తనకు. లగ్న 'చంపేద్దామా' అన్నంతకోపమువచ్చింది కాని ఆనాడింత తీవ్రమైన ఆలోచనకలుగలేదు తనకు.

ఆనాటినుండీ ఏవో పిచ్చిపిచ్చి ప్లానులువేయడమూ అవి అంతరించిపోవడమూ ఇలాజరుగుతో కాని అన్నియాలోచనల పరిణామము ఒకటే 'సీతాపతివధ.' అర్ధరాత్రివేళ మెలకువవస్తే కమల జ్ఞాప కొచ్చి యిన్నేండ్లుగా ఆపివుంచి, దాచివుంచినప్రేమ వెల్లువరాగా ఎంతవేదనపడేవాడు తాను! ఆ కమలఏంచేస్తుందోగదా అని యనుకొని సీతాపతికౌగిట్లో నిద్రపోతూన్నట్లు మనోదృశ్యాన్నికాంచి కమలపెనిమిటిని చంపాలని తీర్మానించుకుని మరీ నిద్రపోయేవాడు.

అసలేమిజరిగిందంటే, శుక్రవారమునాడు సీతాపతి రామారావుని తనయింటికి భోజ రమ్మన్నాడు. ఏడాదిక్రితమారోజునే వాండ్ల పెండ్లైనరోజని ఎదో ఈవొక్కమిత్రుణ్ణీ ఆ దం భోజనానికిపిల్చారు. భోజనాలప్పుడేవో కబుర్లుచెప్పుకుంటూ, 'వికారాబాదు బంగళా జర్మనుపద్ధతిమీ కట్టించాను. పనిమొదలుపెట్టిననాటినుండి మీ అమ్మ ఖాయలాకి లక్షసార్లు మా యింటిమీదుగా తా

వెళ్లావుకాని ఒక్కసారీ కారునిలిపి బంగళాచూడకపోతివి. రేపు శనివారము వెడుతున్నాను రాకూడదురా? అన్నాడు సీతాపతి.

భోజనానంతరము మళ్లీ రెండుగంటలు లోకాభిరామాయణమైన తరువాత రామారావులేచాడు. సీతాపతి 'రేపు వస్తావుగా' అన్నాడు. 'సరే' నని తలవూపి తనకారుఎక్కి, సిగరెట్టు ముట్టించుకొని బర్రున వెళ్లిపోయాడు రామారావు.

రామారావు యింటికివెళ్లి బట్టలుమార్చి దీర్ఘాలోచనలో పడ్డాడు. తీరా యిన్నాళ్లు ఎదురుచూచి తనమనస్సులో హత్తుకొనివున్న సీతాపతి హత్యాసమయం వచ్చేసరికి ఏమిటో 'తుదకేమవుతుందో' అన్న చిన్నభయము తనకుతెలియకుండానే తన హృదయంలో పనిచేస్తోంది నిద్రపట్టకపోతే లేచి తన పడకకుర్చీలో కూర్చుని టైము చూస్తే రేపీవేళకంతా ముగించి తాను తాండూరు వాయువేగముతో సమీపిస్తూ వుండాలి కదూ!

ఆ వికారాబాదు బంగళా, కూలకొట్టి మళ్లాకట్టించుటకు పూర్వము ఒకనాడు తనకు తలనెప్పి బ్రద్దలు చేస్తూందంటే సీతాపతి బలవంతపెట్టి దూరప్రయాణంకు తీసుకువెళ్లి, ఇంతదూరమువచ్చాక యింటి దగ్గరే నాలుగునిమిషాలు విశ్రమిద్దామని అక్కడకు లాక్కుపోయాడు. అప్పుడు కమల కూడావుంది వెంబడి. ఆ దృశ్యము జ్ఞాపకానికివచ్చింది. భార్యను ప్రక్కన కూచోపెట్టుకొని తన్ను వెనకకూలేశాడు వెధవ!

తీరా బంగాళా తాళముతీసి 'డ్రాయింగురూము' లోని పెద్దటేబుల్ లైటు వెలిగించేప్పటికి 'అబ్బ దెయ్యాలకొంపలా వుంది ఎవరికీ తెలియకుండా హత్యకూడా చేయవచ్చు' అంది కమల. 'రేపు విప్పి కట్టించి, రేడియో ఒకటి, ఎలక్ట్రిక్ దీపాలుపెట్టితే ఎలావుంటుందో చూడు' అన్నాడు సీతాపతి. కమల రిమార్కు జ్ఞాపకముచేసుకుని ఒక చిరునవ్వు నవ్వుకున్నాడు రామారావు 'హత్య జరుగవచ్చు ఎవరికీ తెలీకుండా' అదీమాట. సీతాపతి కర్మను సీతాపతి భార్యనోటినుంచే శకునం పలికించాడు దేవుడు.

నిదానముగా ఆలోచన మళ్లీ మొదలుపెట్టాడు. మెట్టుమెట్టు హత్యావిధానాన్ని లెక్కింప మొదలు పెట్టాడు. ఎక్కడా తనప్లానులో పొల్లు కనబడలేదు. మొదటిమెట్టు వెంటనే తానులేచి తన గ్యారేజీలోంచి తన రెండోకారును మొన్న వారంరోజులక్రింద కొన్న క్రొత్తకారును తీసి సడిలేకుండా వికారాబాదురోడ్డు ఎక్కించి సీతాపతి బంగాళానుదాటి మిషనుస్కూలు ప్రహరీవెనకవున్న కూలిపోతూన్న చిన్నయింటిలో దాచి తాను శంకరపల్లివరకు నడిచిపోయి అక్కడ బొంబాయినుంచి వస్తూన్న మెయిలు ఎక్కి తిన్నగా తెల్లవారేసరికి హైద్రాబాదువచ్చి దిగడము.

ఈసారి ఏంచెయ్యాలంటే సోంపల్లిస్టేషనులో దిగక సరాసరి హైదరాబాదు టిక్కట్టు తీసికోక సికింద్రాబాదుకు తీసుకుని ప్రొద్దుట 6-30 కు అక్కడ దిగి, తాను సీతాపతియింట్లో భోజనంచేస్తుండగా రెండుసార్లు వచ్చిన టెలిఫోనువార్త ప్రకారము, వాకరుటౌనులో మొదల్యారుగారింటికి నడచివెళ్లి, రోగిని చూచుకొని యింజెక్షనుయిచ్చి (మందులపెట్టి తప్పక తీసుకుపోవాలి అని జ్ఞాపముచేసుకుంటూ) వాళ్ల కారులో హైద్రాబాదువచ్చేసి, ఆనాడు ఆసుపత్రిలో పనిచూచుకొని, తను అమ్మదలచుకున్న పాతకార్లో వికారాబాదు బైలుదేరాలి, ఆస్పత్రినుండే.

ఇక రెండో మెట్టు మత్తును గలిగించే పొడి సిద్ధముచేసుకొనడం. చప్పునలేచి రామారావు తన మందుల పెట్టి తెరిచి మత్తుమందుతీసి ఒక పొట్లముకట్టి తన మనీపర్సులోపల భద్రముగాపెట్టి జేబులో పెట్టుకున్నాడు.

ఇక మూడో మెట్టు. ఇనుపపెట్టి తెరిచి తళతళ మెరుస్తూన్న క్రొత్త పిస్తోలు తెరిచి మందు దట్టముగా కూరాడు.

ఇంతలో గడియారము 12 కొట్టింది. ఆలోచన ముగించి చప్పునలేచి నిశ్శబ్దముగా దుస్తులు కోవడము మొదలుపెట్టాడు. తాను ఎన్నడూ వేసుకునే షేర్వాణీ, పైజామార్చి దోవతికట్టి, నైహ్రూ తొడిగి ఉత్తరీయము కప్పుకున్నాడు. జేబులో వస్తువులన్నీ జాగ్రత్తచేసుకొని, గ్యారేజీదగ్గరకు నడిచిపో తన క్రొత్తకారును ఎక్కి బంగాళాముందుకు వచ్చాడు. అతని అదృష్టానికి ఆనాడు తనయింట్లోని బో జ్వరమువచ్చి వాడు పనికిరాలేదు. వంటవాడు, చోక్రాతల్లికి పరిచర్యచేయడానికి తాండూరులో వున్నా గేటుకి తాళమువేసి 45 మైళ్ల స్పీడుమీద 1½ లో వికారాబాదుచేరి, మిషనుకాంపౌండును సమీపించి వెనుకనున్న పాతబడి సగము పడిపోయిన చిన్న ఇంటిలోకి కారునిపోనిచ్చి, తానుదిగి మందులపెట్టె చే పట్టుకుని, టార్చిలైటు సహాయాన్ని ముండ్లకంపలూ కంచెలూ దాటుకొంటూ శంకరపల్లిస్టేషనువైపు జొచ్చాడు. ఎంతదూరము నడిచినా ఏ స్టేషనురాదు. విసుగుతో 'కార్లోవస్తే యింతదూరమనిపించేది కా యింతదూరముందా శంకరపల్లి ? నాప్లానులో ఈ వివరాలు ఎందుకురాలేదో' అనుకుంటూ నడుస్తున్నా తెల్లవారిపోవడము మొదలుపెట్టింది. కాకులు కాకా అని కూస్తున్నవి. పొలానికి జొన్నరొట్టెలు కట్టు గొంగళ్లు కప్పుకొనిపోతూన్న యిద్దరుముగ్గురు రైతులెదురుపడ్డారు. తనస్కీములో యీ వివరాలు ఎందుకా చించలేదు? అనుకుంటూ 'శంకరపల్లి ఎంతదూరముందయ్యా' అని ప్రశ్నించాడొకణ్ణి. వాడు రామారా బట్టలుచూచి ఎవరో పెద్దదొర అని భయంతో నక్కుచూ 'దొరా యింకా 4 కోసులుంది' అని చూపులు చూస్తూ జవాబిచ్చాడు. 'O damn 8 miles more' అని ఇంగ్లీషులో సణుగుకుంటూ ' యింకేదన్న స్టేషనుందా?' అన్నాడు. 'అవునుదొరా చిట్టిగడ్డవుంది'. 'అక్కడబొంబాయిబండి నిలుస్తుందా' అని తిరిగి ప్రశ్నించాడు. 'ముత్తైమంతసేపు నిలుస్తుంది.' అన్నాడు. సరే అని సమీపములో కనపడేయు సిగ్నలు చిట్టిగడ్డవని తీర్మానించుకుని కాపువానికి రెండణాలు యివ్వపోయి వాడు దానివలన తనముఖ ప్రశ్నలూ, వైఖరీ జ్ఞాపకముంచుకుంటాడేమో! ఎందుకులే అని అనుకుని యింతలో సిగ్నలువాలడము స్టేషనువేపు పరుగెత్తాడు. సికింద్రాబాదుస్టేషనులో దిగి, అక్కడనుంచి వాకరుటౌనులో రోగిని పరీక్షి కారు త్రోవలో చెడిపోతే అక్కడే బంట్రోతును కుర్చోపెట్టి రోడ్డుమీద వదలివచ్చానని చెప్పి, మొదలి గారు బలవంతముచేస్తే దంతధావనముచేసికొని కాఫీ ఫలహారము తీసుకొని, వాండ్లకార్లో హైదరా తనయిల్లు చేరాడు. అక్కడ బోయివాడు తనురాకకు బైటకూర్చుని వున్నాడు. స్నానాద్యవశిష్టాలు తీర్చు రామారావు సొంతకార్లో ఆస్పత్రికి పనికిపోయాడు. సాయంత్రము 5 గంటలకు సరాసరి అక్కడను వికారాబాధుకు ప్రయాణమయ్యాడు. తనమనసులో 'తనప్లానులోలేని వివరాలు—ఒకవేళ కమల వస్తుందేమో ! రానియ్యి ఈ ఒక్కనాటికి హత్య నిల్చిపోతుంది' అని అనుకుంటా నిదానముగా మా వేగంలో సీతాపతి కారుకొఅకు చూస్తూపోయాడు.

... ...

ఇంతకుముందు సాయంత్రము సీతాపతి వేటకొఅకు కావలసిన సామానులన్నీ తీసుకుని రా భోజనము టిఫిను పెట్టిలోపెట్టి భార్యయిస్తే రాముడికికూడా కట్టావా లేదా? అని విచారించి కా నాలుగు గంటలకే బైలుదేరుటచేత త్వరగా చేరాడు. త్రోవలో ఎక్కడా రామారావతనికి అగుపడ ఇంతలో రామారావు కారు హారను వినపడగా ఎంతో ప్రేమ కండ్లల్లో చూపుతూ పాపము సీతా రామారావు కారుదగ్గరకువెళ్లి తీసుకువచ్చాడు. 'ఇంతాలస్యమెందుకయిందిరా' అంటే 4 గంటలకు 5 గం పఱకు పిచ్చినక్క పొలాల్లో చాలామందిని కరిచిందట. వాండ్లను తీసుకువచ్చి పడవేశారు ఆస్పత్రిలో,

special injections యిచ్చి బైలుదేరేసరికి పొద్దుపోయిందన్నాడు రామారావు. అతనికేమిటో యిన్నాళ్లు వుంచిన అసూయ వెల్లువగా వచ్చి తలను దిమ్మగా చేస్తూంది. సీతాపతితో మాట్లాడుటకే మనసురావడము లేదు. ఎప్పుడు పిస్తోలుతో కాల్చి పారేద్దామా అని వుంది. 'ఇల్లు చూపించోయి, నేనింకా తాండూరు పోవాలి' అన్నాడు. 'పోవచ్చులే. రేడియోలో యివ్వాళ మంచి ప్రోగ్రాము వుంది. గాంధిగారి ఉపన్యాసము వినిపిస్తారట. కమల నీకూడా భోజనము కట్టింది. భోంచేసుకుని వెడుతువుగాని లే' అన్నాడు సీతాపతి.

రా : భోజనము కమలే కట్టిందా. నీవు కట్టమంటే కట్టిందా!

సీ : లేదురా? తానే కట్టింది అని చెప్పి యిల్లు చూద్దాము అని లేచాడు. హాల్లోకివెళ్లి ప్రక్కనున్న తలుపు తెరవబోతే తాళమువేసివుంది. 'ఉండు తాళముచెవి తెస్తాను' అని బైట వసారాలో ఒక బోర్డుకున్న హుక్కులకన్నీ వ్రేల్లాడగట్టివున్న చోటికి వెళ్లాడు. ఇంతలో చప్పున హాల్లో రౌండుటేబిలు మీదున్న టిఫినుబాక్సు, మంచినీళ్ల సీసా, థర్మాఫ్లాస్కు చూచి, థర్మాఫ్లాస్కును తెరిచి జేబులో వున్న పర్సులోని మత్తుమందుపొట్లము విప్పి కాఫీలోకి పోసేసి సీసా తలక్రిందులుగా 2 సార్లు కదిలించి మూతేసిపెట్టేసాడు. ముందు అమర్చిన కప్పులో కొంచెము కాఫీ పోసుకున్నాడు చల్లారాక తాను తాగడానికి. ఇంతలో సీతాపతి తాళముచెవి తీసుకువచ్చాడు. కాఫీ త్రాగుతూవున్న రామారావును చూచి 'ఔనోయి నేనూ తాగాలి' అని కాఫీ పోసుకుని తాగుతూ 'ఏమిటో చిరుచేదుగా వుంది కాఫీ' అన్నాడు. 'స్ట్రాంగు కాఫీ, థర్మాఫ్లాస్కులో పోస్తే అల్లాగే వుంటుంది. పై తేట నేను తాగాను, అడుగు మడ్డి గనుక మరీ చేదుగా వుంద'న్నాడు. 'ఐనా నాకేదో వాసనవచ్చింది, నాలుక తిమ్మిరనిపించిందికూడ'అని తాళము యిదేనా అన్నాడు.

సీతాపతి లేచి నడువబోయి నాకేమో తలతిరుగుతుందోయి అని సోఫాలో జేరగిలబడి కళ్లు మూసుకున్నాడు. అయ్యో, ఏమయిందీ అని నాడిచూస్తూ తాను దగ్గర కూర్చున్నాడు. కొంచెంసేపటికి సీతాపతికి బాగా నిద్ర పట్టిపోయింది.

... ...

రామారావు ఒక్కసారి సీతాపతివేపు చూచాడు. అతను బాగా గాఢనిద్రలో వున్నట్లు గుర్తు పెట్టుటవల్ల తెలిసింది. గప్పున షేర్వాణీ జేబులోనున్న రివాల్వరుతీసి కాల్చపోయాడు యిదే సమయంగదా అని. గాఢనిద్రా మైకముతో సోఫాలో జేరగిలబడివున్న స్నేహితుని ముఖముచూస్తే యింత సుఖముగా నిద్రలోనే ప్రాణాలుపోతే తాను తన్నెందుకు చంపాడో సీతాపతి కెలాతెలుస్తుంది? ఫలాని కారణముకొఱకు ప్రాణాలివ్వవలసివస్తూందని సీతాపతికి తెలియవద్దూ! తాను పగతీర్చుకోవద్దూ! సీతాపతి కండ్లల్లో భీతీ, దైన్యమూ తాను చూడవద్దూ! పరమమిత్రుడనుకున్నవాని పాము పగ అర్థమయి సీతాపతి ఒక్కసారి మతి విభ్రమాన్ని అనుభవించవద్దూ!

చప్పున ఈ ఆలోచన రావడముతోనే, లేచి వసారాలోకిపోయి దండెమును త్రెంపి ఆ త్రాటిని తెచ్చి సీతాపతి కాళ్లూ చేతులూ కట్టివేసి, అతని కడుపుమీదగా త్రాడుతిప్పి సోఫాకే గట్టిగా కట్టివేశాడు. రామారావుకీ పనులన్నీ చేస్తూంటే ఏమిటో శీతలము కమ్మి చిఱుచెమటలు పోస్తున్నాయి. కాళ్లు వణకుచున్నాయి. చేతులు వంకరలు పోతున్నాయి. ఇట్టి చిహ్నలు హంతకునికి కలుగునని అతని ప్లానులో లేదే!

ఇంతలో కనురెప్ప లల్లార్చి నలుదిక్కులు సగము మైకముతో చూస్తున్నాడు ఏమీ పాలుపోక సీతాపతి. కొంతసేపటికి దృష్టి రామారావుమీద పడి, అతన్ని గుర్తుపట్టి, 'ఎక్కడున్నాము, ఏమైంది' అని ప్రశ్నించాడు. రామారావు 'ఏమీలేదు. నేనే నీకు మత్తుమందిచ్చాను. అద్భుతంగా పనిచేసింది కదూ!'

సీ: (మత్తు వదలక చేతులు చాపబోయి నిమీలితనేత్రాల్తో) నన్నెందుకు కట్టేశారు?

రా: నిన్ను చంపడానికి ముందు నీతో. కొన్ని ముఖ్యవిషయాలు చెప్పాలని ఈలా జాగ్రత్తపడ్డాను.

అదెందుకో యిప్పుడే తెలుస్తుంది. (పండ్లు పటపట కొరుకుతూ) ఇన్నాళ్లకు నాచేతికి చిక్కావురా? అని ఒక్క వెగటునవ్వు నవ్వాడు.

అతని కండ్లల్లోని ఆక్రోధమూ అసూయా చూచేసరికి పూర్తిగా తన నిస్సహాయస్థితి అర్థమైంది సీతాపతికి. తననట్లా కట్టివేసి ఆ పిచ్చిపిచ్చి మాటలు మాట్లాడడము తప్పుకుండా ఏ పాటో రామారావుకు పిచ్చెత్తింది అనుకున్నాడు.

రా: నాకు తెలివి తప్పిందనుకోకు. ఈ దినమున్నంత బుద్ధి తీక్ష్ణత నాకేనాడూ ఉండలేదు. ఏండ్లకొలదీ, మన బాల్యంనుంచీ నీమీద పెరిగిన ఈర్ష్యయొక్క సహజ పరిణామమే ఈ దిన మీపని చేయించుచున్నది. అసలు—విను అన్నిటికంటే ముఖ్యము—నేను చేసుకోవాలన్న పిల్లను దానిసంబంధమని చెప్పి తప్పించి నీవు చేసుకోవడముతో నిన్ను తప్పక చంపాలని తీర్మానము చేసుకున్నా.

సీతాపతికంతా అర్థమైపోయింది. నిశ్శబ్దముగా దిక్కులుచూస్తూ కూర్చున్నాడు. ముఖమువిూద అగుపడకపోయినా మనసులో భయము పుట్టింది. రామారావు మత్తుడుకాడు. అపాయమును కల్గించ పూనుకొన్న అసూయాగ్రహపరుడు.

సీతాపతి నుదుటిమీదనరాలు చిక్కి బాగా అగపడుతున్నయి. చేతిబంధాలు వదులు చేసుకోవడానికి అటుయిటూకదుల్తూ కాళ్లూ చేతులూ కదలిస్తూ అవస్థపడుతున్న వాడల్లా యిక ఆశలేదు అంత్యము సమీపిస్తూవుందని, తలవెనక్కివాల్చి జుగుప్సతో స్నేహితుణ్ణిచూస్తూ దైవాన్ని ప్రార్థిస్తున్నాడు మనస్సులో తనకు జాతకంలో 31ఏట గండమన్నా రిదేకాబోలనుకుంటూ. రామారావుచూపులో ఈర్ష్య క్రోధము ఘనీభవించినట్లగుపడుచున్నవి.' ఇదిగోచూడు ఈపిస్తోలు చూశావా? ఈనాగడ్డముక్రింద ఎలా పెట్టానో అలానీగడ్డముక్రింద కంఠానికి సూటిగాగురిపెట్టి ఈమీటను లాగితే ఈ నాప్రాణముకాస్తాపోతుంది ఆలాగే నీకంఠానికి గురిపెట్టి కాల్చేస్తాను.' చేతిలోవున్నపిస్తోలు తనగడ్డముక్రింద తనకంఠానికి సూటిగా గురిపెట్టి మాట్లాడుతూవున్నాడు.

హాల్లోంచి 'హల్లో' అన్న ఎవరిదోపరాయవాండ్ల కంఠస్వరము బిగ్గరగావినపడ్డది. త్రుళ్లిపడ్డాడు రామారావు. మళ్లీ అంతానిశ్శబ్దము 'హల్లో మహాత్మగాంధిగారు అమెరికాలో యిచ్చిన ఉపన్యాసంవినండి' అని రేడియోలో పిలుపుప్రారంభం అయినతరువాత అరగంటవరకు బాపూజీయిచ్చిన ఉపన్యాసం వినేవారెవ్వరూ అచ్చట లేకపోయారు. ఆ నిశ్శబ్దముగావుండే ఆ పెద్దహాల్లో "There is an indefinable mysterious power that exists" అన్న ధోరణిలో గాంధిగారిలెక్చరు అద్భుతంగా వినపడుతోంది.

'హల్లో' అని వినపడ్డప్పుడు గభీమని ఉలిక్కిపడడములో రామారావు గడ్డముక్రింద పిస్తోలు గురిపెట్టి పట్టుకొనివుండుటచేత బొటనవ్రేలు మీటలోవుండుటచేతను, తత్కాలున పిస్తోలుపేలి పూరుకుంది. అసలు మందుదట్టముగా కూర్చిన పిస్తోలుకూడ. జన్మలో, ఎన్నడు మూర్ఛిల్లలేదు సీతాపతి, మొదటిసారి కొయ్యబారిపోయాడు. అసలు రామారావు దుస్తులనుపట్టి ఫలానామనిషని పోలీసు తర్వాత తేల్చారు.

మహిళా - మహత్తు!

శ్రీమతి వల్లభనేని రంగాదేవి

దేశియసంఘం
ముస్లింసంఘం
అద్వైతసంఘం
మహిళాసంఘపు
చీలికలా!

*

హిందూస్త్రీసభ
ముస్లిమ్ స్త్రీలీగ్
కాంగ్రెస్ స్త్రీసభ
మహిళాసంఘము
లో లేవే!

*

కోటూ పంట్లాం
బూటుతో నిలబడు
పాంచలదేశపు
పురుషుండూ!

*

బిల్లాగోచీ
విడికుచ్చిళ్లూ
లాల్చీవాడే
బెంగాలీ!

గడ్డంమీసం
బారుగబెంచీ
శౌర్యపుగుర్తను
సిక్కూలూ!

*

మీసంలేకనె
రోషంజూపుచు
రష్యాయనునా
సామ్యవాది!

*

బండగుడ్డలూ
ధర్మవాదనా
పిలకజుట్టులే
గాంధేయులు!

*

యూ. పీ. - సీ. పీ.
బెంగాల్ - బాంబే
ఆంధ్రా - అరవా
మహిళల్డ్రస్సా
చీరాచొక్కే!

గాంధీ యిజమును
కమ్యూ నిజమును
యే యిజమును - స్త్రీ
ప్రేమించిన యా
కేశబంధమే!

*

చిత్తం స్థిమితం
లేకనె పురుషులు
ఛిన్నా భిన్నం
బగుచుండ్రీ!

*

చీలికలేనీ
స్థిరముగ నున్నా
భారతమహిళా
సంఘమె మాకా
దర్శంబూ!

*

పడతుల కలయిక
నారులనేస్తము
మహిళల మైత్రీ
దైవశక్తులా
సంఘటనంబే!

• మానవుని దివ్యత్వము •

-శ్రీ-

వంక వెంకటరామకృష్ణారావు

> మహాసముద్రమందొక బిందువువలె మానవకోటియందొక సాధారణ మానవునివలె జన్మించిన 'గాంధిజీ' బుద్ధాది మహామహుల శ్రేణికి చెందిన లోకోత్తర మహాపురుషుడగు 'మహాత్ముడు' ఎట్లు కాగలిగెను...?

దివ్యత్వమును గుర్తించుట యననేమి? మానవుడు తన్ను సృజించి ప్రోచు పరమాత్ముని దివ్యత్వ కొంత తనలోన నున్నదనియు, తన్ను దేవునియందలి నిశ్చలభక్తినుండి యేవిధమగు నడ్డంకులును బాధలు వ్యాధులును మరలింపజాలవనియు, తనకు బరమాత్మునితోగల సంబంధము త్రెంపరానిదనియు నిశ్చయిం యా నిశ్చయప్రకారముగ మనోవాక్కాయకర్మముల ప్రవర్తించుటయే. ఇదియే మహాపురుషుల లక్షణ ఎప్పుడిట్టి నిశ్చయమతనికి కలుగునో యప్పుడే యాతని జీవితము సురక్షితమును సుఖసమన్వితమును నగు ఆ నిముసముననే యతని నదివఱకు బాధించుచున్న భయము పటాపంచలగును, సంశయములు చల్లా దుఃఖములు తొలగును. అతనియందంతవఱకు నణగియున్న సహజశక్తులు విజృంభించి యతనిని సు జేసి సర్వవిధముల నాతనికి తోడ్పడును. మానవసంఘము ఆతని నపూర్వునిగ నెన్న జేయును. అ సౌఖ్యమనుభవించుట తనకు జన్మహక్కని నమ్మను. ఆ హక్కు నేదియు తొలగించలేదని నిశ్చయిం తన ధర్మకార్యవిజయమునకు అడ్డుండదనియు నుండరాదనియు నెఱుంగును. ధర్మముకొఱకు పనిచేయున నాకపజయమును దైవమెన్నడును కలిగించడను మనోనిశ్చయమతనికి కలుగును. ఈ దృఢమనస్కత, ధ కార్యాసక్తి, సౌజన్యము, దైవభక్తి, దైవానుగ్రహపాత్రత అతనిని క్రమముగ మహోన్నతపదవికి గొం ఇట్టివాని జీవితము కష్టరహితమనియు నితనికి ప్రజలు వశ్యులగుదురనియు ననుటలో వింతయేమున్న ఈ పై వాక్యముల యాదార్థ్యమును ఈ క్రింది యుదాహరణము విశదపఱచును. గాంధీమహాత్ముడు లోకో పురుషుడెట్లయినాడు? బుద్ధాది మహాపురుషులవంటివాడెట్లయినాడు? అఖిలభారతవర్షమునకు నల్లారు బిడ్డడెట్లయినాడు? ప్రపంచ మహాపురుషులలో ప్రథమగణ్యుడెట్లయినాడు? ఇంతేల? మహాత్ముడెట్ల నాడు? తనయందలి దివ్యత్వము నాయన గుర్తించుటవలననే. తాను చేయు ప్రతికార్యమున నాయన విజ డగుటకు కారణమేమి? ధర్మముకొఱకే, దాని సంస్థాపనమునకే తాను పాటుపడుచుంటినని తెలిసి యుండుటయే. మన దేశస్థులందఱును గాంధీజీవలె తమ దివ్యత్వమును గుర్తించి, యంతఃకలహములు యా మహాపురుషు ననుసరించి యాయనవలెనే ధర్మముకొఱకు పాటుబడినచో స్వరాజ్యమువచ్చుట కాలము పట్టియుండదు.

ప్రపంచయుద్ధము తప్పుట కుపాయమేమని గాంధీజీని పలువురడుగుచుందురు. ఆయన చిఱునవ్వు (చక్రవర్తియైనను ఆ విలక్షణమగు చిఱునవ్వునకు లొంగును) విశ్వమానవప్రేమయే సాధనమని

'కత్తి తీసికొనివచ్చిన శత్రువునకు హృదయపూర్వకముగ శిరసొగ్గి దేశభక్తుడవై మరణింపుము; ఒకవేళ నీ శాంతబుద్ధి కాతడు సిగ్గుపడి పరివర్తనమొందవచ్చును; అలెగ్జాండరు బలప్రదర్శనముతో నొనర్చిన ప్రపంచ విజయయాత్రకంటె నొక్క నిశాంతబుద్ధిచే జయించుట యెక్కువ.' ఈవిధముగా నాయన చెప్పెను. పాశ్చాత్యులకు (ఒక్కొక్కప్పుడు మనలో చాలమందికి) ఈ పలుకులు పిచ్చివని తోచును. వారు 'మీ రీవిధముగ చెప్పెదరేమి? మా దేశమున యుద్ధనిరోధమునకు బాంబులు, విమానములు సాధనములని యందురేమి? యుద్ధపరికరములు లేనిచో శత్రువుల దాడినుండి యెట్లు మీరు తప్పించుకొనగలరు?' అని యడుగుదురు. వారికి గాంధీజీ 'యుద్ధపరికరములు యుద్ధభయమును హెచ్చించును గాని శాంతినీయవు. వాటినెందులకు నిర్మింతురు? యుద్ధము వచ్చుననియే కాదా. అందుచే మీరు యుద్ధమునకు సుముఖులే యైయుంటిరని తెలియునుగదా. అట్టిచో మీరు విశ్వమానవప్రేమ లేనివారన్నమాట. అట్టిచో మీరు శాంతికై యాశించి యెంత ప్రయత్నించినను మీకది లభింపదని తెలిసికొనుడు. మా లక్ష్యమే వేఱు. మా దృష్టిలో ప్రపంచమున యుద్ధములనునవి తుచ్ఛమానవులు కల్పించినవి కాని, దైవనిర్ణితములు కావు. కాన మా కవి యెంతమాత్రమును భయము కలిగించవు. వానితో మాకు నిమిత్తములేదు. ఎన్నటికైనను ప్రపంచమున యుద్ధములు నామరూపము లేక నశించవలెనని శాంతపద్ధతివలననే గాని దౌర్జన్యపద్ధతివలన కాదు' అని విశదపఱచును.

ఎప్పుడొకడు తనయందలి దివ్యత్వమును గుర్తించునో యా నిముసమునుండి యతనికి అదృష్టము దురదృష్టము సుఖము, కష్టము, మంచి చెడుగు అను భేదబుద్ధి నశించి యాతని బుద్ధి సంతతము అదృష్టము, సుఖము, మంచి మొదలగువానిమీదనే కేంద్రీకరింపబడును. మానవుడు కష్టముల ననుభవించుట దైవనిర్ధితము కాదనియు, సుఖానుభవమునకే సృజింపబడియెననియు నమ్మకమేర్పడును. అట్టి యాతడు అన్నివిషయములను తన కనుకూలము చేసికొనగలడు. దుఃఖమునైన సుఖముగ మార్చు శక్తి యతనికుండును. భయసంశయము లాతని దరిజేరజాలవు. తాను దివ్యత్వము కలవాడననియు, తన్ను సృజించిన దేవునకు వేఱుకాదనియు, దేవుడు తనరూపముననే నుండుననియు, దేవుడెట్లు సుఖమయజీవితమును గడపునో యటులే యతని యంశమగు తాను సుఖముగ జీవింతుననియు నాతడు నమ్మును. దివ్యత్వమును గుర్తించిననే కాని యీ నమ్మకమేర్పడదు. ఆతడు తాను దైవమువలెనే యజరామరుడనని నమ్మును. (ఆత్మయే యజరామరమైనదని యాతడెఱిగి, తుచ్ఛశరీరముపై గల మమకారమును వదలును) ప్రపంచమంతయు నొక్కటియే యను సామాన్య మానవులకు దుర్లభమైన నమ్మక మతనికి కలిగి, యతనిని విశ్వమానవసేవకై ప్రేరేపించును. ఆతని దైవభక్తి యతిశయించును. మోక్షలాభమున కీయచింతితమగు భక్తియే వ్యర్థతర్కములకంటె వేయిరెట్లు మేలని దైవభక్తులందురు. దేవుడు వేయేండ్లు వివిధవిధములుగ తపమొనర్చినవానికి ప్రత్యక్షము కాకుండుటయు, వెట్టిగొల్లల చేతిలోని కీలుబొమ్మయై వారి కామితము నీడేర్చుచుండుటయు పై విషయమును స్పష్టపఱచును. ప్రకృతమేమన దైవానుగ్రహమును భక్తియే కాని జ్ఞానమీయజాలదు.

దివ్యత్వమునుగుర్తించి జీవించు మహాపురుషుని మానసము నిశ్చలమై నిండుకుండనుబోలియుండును. ప్రపంచయాత్రయందలి యెన్నికుదుపులైనను సరియే యాతని మానసఘటమునందలి యాత్మబలజలమునుగాని భక్తి జలమునుగాని యొక్క బిందువునైనను నొలుకునట్లు చేయజాలవు. తుచ్ఛమానవుల తృణీకరించి బాధించు తుచ్ఛబాధలీ దివ్యపురుషుని నీడనైన స్పృశించ భయమునొందుచుండును. జన్మాంతరమను నదేయుండిన నిట్టి యదృష్ట మెన్నిజన్మములకో గాని మానవునకు కలుగదు. జన్మాంతరమనునది లేనిచో నిట్టి ప్రభావము కలిగిన

మహాపురుషులు దేవుని ప్రియసుతులనుటకేమైన సందేహమా? ప్రపంచ మహాపురుషులందు ప్రథమస్థానలంకరించు గాంధీమహాత్మునికిగల శక్తి యిదియే. ఆయన గొప్పతనమునకుగల కారణము దైవమందాగల యచలితభక్తియు, దేవుని కాయనయందలి ప్రేమయే! గాంధీజీ చెప్పినది వేదవాక్యమగుట కి హేతువు. తర్కము వలదు; దైవభక్తినవలంబింపుడనియేకదా యాయన యసహాయోద్యమముయొక్క మూ 'నాయనలారా! తర్కము వలదు, వలదు, ముమ్మాటికిని వలదు. తర్కమువలన జ్ఞానము హెచ్చున ప్రజలు జ్ఞానము హెచ్చుకొలది గర్వాంధులగుచున్నారు. నూతన మారణయంత్రములను సృష్టించుచున్నా అసంఖ్యాకులగు మానవులను మాడ్చివైచుచున్నారు. దేవునను గ్రహమునకు దూరులగుచున్నారు. నాయనలారా! మానవసంఘమునకు పరమశత్రువు -వారి సమస్తకష్టములకు మూలకారణమగు తర్క వదలి భక్తి నవలంభించిన మంచిది. శాంతినే యాశించుడు శాంతికొఱకే ప్రయత్నింపుడు. ప్ర మంతయునొక్కటేయని నమ్ముడు. సోదరమానవులను హింసించుట దేవుని కభిమతముకాదని యెఱు మీయందలి దివ్యత్వమును కన్నులుతెఱచి చూడుడు. ఇక ప్రపంచమున యుద్ధములుండవు.' ఇదియే మహాత్ముని యాశయము. ఇంతగ నాయన ఘోషించుచున్నను ఒక్కరును వినరే! ఆహా! కలి మిరు గదా! ఇప్పుడు ఆ లోకోత్తరపురుషునిమాటల వినువాడెవడు? కానిండు కానిండు, ముందున్న ముసళ్ళపండుగ!

వివేకానంద స్వాములవారు 'అసాధారణ బలప్రదర్శనముకంటె యలౌకిక సహనప్రదర్శ వేయిరెట్లుగొప్పద'ని చాటిరి. పైకీవాక్యమెంత యసంబద్ధముగ కానబడినను, లోతుగచూచిన నింత యదార్థ ప్రతిపాదికమగు వాక్యములేదని చిన్నపిల్లవానికిగూడ దెలియును. మనము ఊంచిపుచ్చికొని వే కొక చపేటమీయగలము. అట్టిచో దెబ్బతినినవాడు బలవంతుడైయుండినను తిరిగికొట్టక యాయాఘా ఓర్పుతో సహించిన నతడేమహాపురుషుడు. అతడే తనయందలి దివ్యత్వమును గుర్తించినవాడు, అతడే దే ప్రియసుతుడు, అతడే ధన్యజీవి. దెబ్బకొట్టుటకంటె యోర్చుట కష్టముకాదా! అందులకే స్వాము శాంతమేగొప్పదని చాటిరి. దెబ్బనుకొట్టువారు నూటికి తొంబది తొమ్మండుగురుండిన దెబ్బనోర్చి సహించియుండు వాడొక్కడుండునేమో! దెబ్బను కొట్టుట యేమంతఘనము? పిల్లవానిచేతికొక 'య దస్తా' నిచ్చిన గామావంటి భీమబలుని బుఱ్ఱ బ్రద్దలుకొట్టలేడా? దెబ్బను భరించుటలోననే యున్నది మానవుని యలౌకికమగుదివ్యత్వము! ఒక చెంపనుగొట్ట వేఱొకచెంప నొగ్గుమనుటలో ఏసు యంతరార్థమిదియేకదా! ఈ దివ్యపురుషులకు దెబ్బనుతినినది తాము కాదనియు, తమశరీరమనియు న ముండును. అదియే వారివిలక్షణమగు ననితరసాధ్యమగు నోరిమికి కారణము. దెబ్బను తిన్నవాడు ఏడ్చి తిరిగి కొట్టదలచినను, కొట్టినవాడును కొట్టబడినవాడును పశుప్రాయులే; నీచమానవులే; దివ్యత్వ గుర్తించనివారే; దైవానుగ్రహమునకు దూరులే. ఇట్టిచో ప్రపంచమందలి యందఱును దమ దివ్యత్వ గుర్తించినచో ఒకనిని వేఱొకడు కొట్టుటయేల సంభవించును? అందఱును విశ్వమానవప్రేమ కలిగి విశ్వమానవకళ్యాణమునకు పాటుపడుదురుకదా; ఇది గాంధీమహాత్ముని బోధయందలి యాథార్థ్య తెలుపుటలేదా! మానవుని తుచ్ఛైహిక సంఘర్షణలాతని నీచపశుబలమును తెలుపును. మానవుని ధర్మా చరణాసక్తి, ముఖ్యముగ నాతని శాంతమనస్కత యాతనిపవిత్రాత్మ బలమును, దివ్యత్వమును దెలుపును.

విశ్వమానవప్రేమయే, విశ్వమానవ కళ్యాణమే యీతని యాశయములు. నీచమానవుల కా ప్రకాశము కలుగజేయుటయే యీతని జీవితలక్ష్యము. దైవచింతనమే యీతని దైనందినకృత్యము.

ఇతనికి శత్రువులెవరుందురు? బలప్రదర్శనమునగాదు భక్తిప్రదర్శనముననే యీతడు పరులను లోబఱచుకొనును. దౌర్జన్యము నితడు తలపడు. కాననే యీతడెవ్వరినైనను తనకు శాశ్వతముగ వశ్యులగునట్లు చేయగలడు. భక్తివలన నితడు ప్రజానీకముయొక్క ప్రేమ నయాచితముగ జూఱగొనును. 'నాయనలారా! నేను దైవభక్తితో జీవించుచున్నాను. పాపకార్య విముఖుడనైయుంటిని. ధర్మకార్యాచరణమే నాయాశయము. కాన దైవానుగ్రహమునకు పాత్రుడనైతిని. నాజీవితము సుఖమయమైయున్నది. నేనిట్లు సుఖించుచుండ మీరు దుఃఖజీవులుగనుండుట నాకసహ్యమగుచున్నది. కాన నాయనలారా! పుణ్యజీవితముల బ్రారంభింపుడు. పాపజీవితముల బరిసమాప్తినొందింపుడు. అట్టిచో దేవుడు మిమ్ములననుగ్రహించును. లేనిచో మీగతి యింతియే'అని యీతడనవరతము నెలుగెత్తి సోదరమానవులకు చాటిచెప్పును. ఎవ్వడీవాక్యములను విని యట్లాచరించునో వాని కాత్మప్రకాశము కలిగినదన్నమాటయే. అతడు దివ్యత్వమును గుర్తించెనన్నమాటయే. ఈతని కాతడా నిముసముననే శిష్యుడై శాశ్వతముగ లోబడి యేదిచెప్పిననది వేదవాక్యముగ పరిగణించును. మానవులందిట్టి యభిలషింపదగిన తీవ్రపరివర్తనమును కలిగించుట సాత్వికప్రదర్శనమునకే సాధ్యమగుగాని సత్త్వప్రదర్శనమునకుకాదు. మహాపురుషుల కితరులను పరివర్తన మొనర్చుటయనునది యొకగొప్ప లక్షణము. ఎన్నిజన్మములకోగాని మానవులకిది లభ్యముకాదు. ఎప్పుడీలక్షణము పొడసూపి విజృంభించునో యప్పుడే యాతడు మహాపురుషునిగ పరిగణింపబడును. లోకమాయనకు జోహారొనర్చును. ఆతనియాజ్ఞ శిరసావహించును.

మానవుడు క్రమక్రమముగ నీక్రిందిదశలనుగడచి, మహాపురుష పదవినొందును. ప్రథమమున విశ్వమానవ దుఃఖములనుజూడ నతనికి జాలికలుగును. వెంటనే విశ్వమానవప్రేమ జనించును. విశ్వమానవకళ్యాణమునకై పాటుపడ ప్రబలమగు ననివార్యమగు కోరికకలుగును. అంతనాతడు తన చిన్నగృహమున గుడుగుడుగుంచముల నాడుటమాని వివేకమునొంది, తోడి మానవులకు దోడ్పడుటకై ప్రపంచమను పెద్దగృహమును ప్రవేశించును. అతడదివఱకు తన్నుబాధించు చిక్కుల నీమహోద్యమ సాఫల్యమునకై ప్రయత్నించుటలో మఱచును. వెంటనే ద్విగుణీకృతోత్సాహుడగును. విశ్వప్రపంచమున తనయొక్కని స్వల్పములగు కష్టములు సహారాయెడారియందు ఒక్కయిసుక రేణువెట్లో యట్లని తెలిసికొనును. ఇదియే మహాపురుషపదవి నందుటలో మిక్కిలి కష్టమగుఘట్టము. దీనిని తన యపూర్వత్యాగ ప్రదర్శనమున నతడు గడచును.

ఈతడు కంటి వీక్షణమాత్రముననే పెద్ద సైన్యములను సిద్ధముచేయగలడు. అంతలోననే మాయము చేయగలడు. అద్భుతములు, అలౌకికములు, అమానుషములు, కేవలము దైవలీలలు అని యనబడు కృత్యముల నొనర్ప సమర్థుడగును. దేవునిప్రియసుతున కసాధ్యమెందుండును? కొన్నినాళ్లలో యీతని యందితరులు దేవునే గాంచగలరు. ఇతనిని జనులు పువ్వులలోబెట్టి పూజింతురు. ఇతనికొక్క కష్టముకలిగిన సహించరు. అందఱునేకమై యా నిముసముననే యాతని కష్టమును నివారింతురు. ఇతడు ప్రజానీకముయొక్క ముద్దుబిడ్డ; ప్రజలదైవము; ప్రజోద్ధారణమునకై దేవునిచే నియమితుడగు దూత. దేవునను గ్రహమునకే పాత్రుడైన యితనిని సామాన్యమానవులు ప్రేమించి గౌరవించుటలో వింతయేమున్నది? ఈ పై జెప్పిన వాక్యములనన్నింటిని మన గాంధీమహాత్మున కన్వయించుకొనినవారికి వీనియందలి యదార్థ్యము సులభముగ నెఱుకపడగలదు.

మనిషేనా?

శ్రీ

కాళ్లకూరి

దయానిధి రావు

లక్ష్మి నీళ్లుకారుతూన్న తడిబట్టలతో, ఒణుకుతోన్న ఒళ్లు
తెచ్చిన నీళ్లబిందె దించుకుంటోంది.

ఆ దృశ్యంమాత్రం చూచి శంకరం భరించలేకపోయాడు.

'కాలవకి వెళ్లావేమిటి?' అన్నాడు శంకరం మండుతూ
చూపులతో.

'అవునండి వెళ్లాను. శుభ్రంగా తలతడుపుకుని, నీళ్లుపోసుకొని..

ఇంకా లక్ష్మి పూర్తిచెయ్యకముందే శంకరం అందుకున్నా
'నీకు బుద్ధివుందా లేదా. ఎన్నిఏళ్లువస్తే ఏంకార్యం? తలనొ
ఒళ్లునొప్పులూ, అరికాళ్లుపోట్లూ అనుకుంటూ రాత్రి కం
కునుకులేకుండా మూలిగావు. కొంచం వేడికూడా తగిలిందా
ఆ నీళ్లలోపడ్డ ఎలకలా తయారుకాకపోతేనేం...కొంచెం
బట్టలుకట్టుకుని వంటచెయ్యకూడదూ?'

'ఛా, దరిద్రం, ఊరుకోండి...'

'నీకు తోచదు, చెబితే తెలియదు. అనుభవించు ఎవరికి కావా

ఆపూటకి ఎల్లాగో వంటచేసి పెట్టింది. సాయంత్రం అయేటప్ప
ఒళ్లు తెలియని జ్వరం, నిప్పులా కాగుతూన్న శరీరంతో లక్ష్మి
రగ్గుకప్పుకు పడుకుంది.

'భేష్! జ్వరంకూడా వచ్చిందీ. ఇంకేంపనివుంది మనకి? మం
సీసాలు తోలవడం, ఆస్పత్రులు చుట్టూ తిరగడమూ'

'మనకి చేసేవాళ్లెవరు? అమ్మ అన్నయ్యదగ్గరుంది. రమ్మని వ్రా
నేమిటి? ఏముంది, రేపు ఉత్తరంముక్క వ్రాసి పారవేస్తే ఎల్లుం
అందుతుంది. అవతల ఎల్లుండి ఏవేళకో ఆవేళకి వచ్చిపడుతుం

'వ్రాయండిబాబూ, మీయిష్టం...'

'మహాతల్లివి! జన్మంతా ఒక్కలాగ వెడుతోంది. నీకంటె
అలంకరించి ఆబట్టల షాపుల్లోపెట్టే స్త్రీ విగ్రహాలు మేలు.'

మౌనమే ఒకపెద్ద "డిఫెన్సు" అనుకుంది కాబోలు లక్ష్మి
మాట్లాడలేదు. కొంచెంసేపాగి 'డాక్టరుగారిని తీసుకువద్దురూ
అంది లక్ష్మి నీరసపుగొంతుకతో. 'ఊఁ' అని విసుగుకుంటూ
శంకరం వెళ్లిపోయాడు.

తర్వాత సంగతి—అనుకున్నరోజుకే అమ్మవచ్చింది. ఒకనెలదా
లక్ష్మి మంచం దిగలేదు...

కొవ్వూరు మహిళాసమాజపు తృతీయ వార్షికోత్సవ సమయమున
"శ్రీ కృష్ణతులాభారమును" ప్రదర్శించిన బాలికలు.

'ఉపన్యాస కోకిల'
కీ॥ శే॥ అనుమర్లపూడి స్వరాజ్యలక్ష్మీదేవి
బెజవాడ.

శ్రీ బీగం అమీరుద్దీను సాహేబాగారు

మదరాసు విశ్వవిద్యాలయ సెనేటుకు మెంబరుగా ఎన్నుకొనబడిరి. ఇట్టి స్థానము నాక్రమించుటకు వీరే ప్రథములు.

తగిన వరుడు కోసం తగినకట్నం ఇవ్వాలి;
తగినకట్నం ఇవ్వడానికి తాహతు చాలనప్పుడు

ఏం చెయ్యడం...?

'కట్నపుసొమ్ము కాలకూటవిషం...వరవిక్రయం నరమాంసవిక్రయం...'

'తెలిసివున్న తప్పే' ఇది సంఘానికి...

ఈ పొరపాటు అలవాటై పోవడంవల్ల సంసారాలు క్రుంగి పోతున్నాయి; నిస్పృహ, దైన్యంతో అల్లాడి పోతున్నాయి.

ఇకనైనా సంఘం ఆత్మపరీక్ష చేసుకుంటుందా?

శ్రీమతి
పులిపాక బాలాత్రిపుర సుందరమ్మగారు

"సీతా! యేంచేస్తున్నావు?" అన్నాడు రామారావు నిద్రలేచివచ్చి క్రింది హాల్లో కుర్చీలో కూర్చుని. 'కాఫీ తీసుకువస్తున్నాను' అని కాఫీకెటిలు, కప్పు సాసరుతో సహావచ్చి రామారావుదగ్గిర బల్లమీద పెట్టి అక్కడేఉన్న కుర్చీని దగ్గిరగాలాక్కుని తానుకూడా కూర్చుని కాఫీ చల్లార్చియిస్తూ,

'మీరువెళ్లిన పనులేమైనా అయినాయా?' అన్నది సీత నెమ్మదిగా.

'వెళ్లంగానే కావటానికి ఇవ్వేం బజారువస్తువులా? ఆఫీసుపనులా? ఒకరూపాయి ఇచ్చేచోట ఇంకొకరూపాయిఇస్తే పూర్తికావటానికి? చేసుకురావటానికినీ? ఇది అల్లుడితో సంబంధించినపని. తిరిగితిరిగి వేసారిపోయాను. కాని మనకందుబాటులో వున్నది ఒక్కటీ నాకు కనపడలేదు యేంచెయ్యను? యింకా కొన్నిచోట్లు ఉన్నాయంటే నా స్నేహితులిద్దరితో చెప్పివచ్చాను మనకందుబాటులోగల సంబంధముకు వ్రాయమని. అయినా మీ రాధాకృష్ణయ్యగారి కొడుక్కు చేసుగుంటారేమొ కనుక్కుందామా?' అన్నాడు రామారావు.

'యెందుకు చేసుకుంటారు? ఆయన జిల్లాజడ్జీ చేస్తున్నాడు. పిల్లవాడు ఐ. సి. యస్. చదువుతున్నాడు. మనమిచ్చె కొద్ది కట్నానికి వాళ్లుమాత్రం చేసుగుంటారూ?' అన్నది సీత విస్తుపోతూ.

'నీకు దగ్గిరబంధువుగదా? చేసుగోకూడదూ? ఆయనకున్నడబ్బు చాలక యింకా పిల్లవాడిమీద డబ్బు తీసుకోవాలా?'

'యిప్పుడడిగేవాళ్లంతా డబ్బులేనివాళ్లా? యెక్కువడబ్బున్నవాళ్లే యెక్కువ డబ్బడుగుతారు.'

'చుట్టరికమన్నా చూస్తాడేమొ అడిగిచూద్దాం.'

'అడిగి కాదనిపించుకోటమే గాని వాళ్లెందుకు చేసుకుంటారు?'

'అయినా అడిగిచూస్తే దారియెల్లావస్తుందో.'

'మనకు తెలిసినదారికి యింతఆలోచనెందుకు? మా తమ్ముడికియ్యరాదు? చిన్నవాడు చే... కుంటున్నాడు, కట్నంలేకుండా చేసుకుంటాడు.'

'ఆమాట నాముందు తలపెట్టవద్దు. ఏమున్నదనియ్యమంటావు నీ తమ్ముడికి? ఆస్తీ అంతా... అన్నగారే పూర్తిచేశాడు. వీడేంతింటాడు? మనమ్మాయివెళ్లి యేంతింటుంది? చచ్చు స్కూలు... వాడికి యెల్లాయివ్వను?'

'యిప్పుడేకదా చుట్టరికమన్నా చూడకూడదా అన్నారు. నాకు నాతమ్ముడు పరాయివాడా?'

'అయితేమాత్రం చూస్తూ చూస్తూ గొంతుకోయమంటావా?' మీ భాగ్యవంతుల అన్నకొడు... చేసుకోనూవద్దు, నీతమ్ముడు శుద్ధమొద్దుకు నేనివ్వనూ వొద్దు, అని రివ్వునలేచి క్లబ్బుకెళ్లా... రామారావు. సీతలేచి యింటిపనుల్లో నిమగ్నరాలైంది.

... ...

సీతారామారావులది చాలా అనుకూలదాంపత్యం. సీత పుట్టింటివారిని ఏమన్నాఅంటేమా... కొంచకోపం వస్తుంది సీతకు. అందుకని కదిలించి ఏదయినా ఒకమాట అని తమాషా చూస్తూవుంటా... రామారావు. రామారావు తెలివికలవాడు, బుద్ధిమంతుడు. ఇతనికి చిన్నతనంలోనే తండ్రిచనిపోయినప్ప... తల్లి చెప్పుచేతల్లోవుండి పెద్దచదువు చదువుకొని ఉద్యోగంచేస్తున్నాడు. ఇప్పటికీ తల్లిమాట జవదాట... భార్యనుకూడా చాలా అనురాగంగా చూస్తాడు.

నెలకు నాలుగువందలు సంపాదించుకొంటున్నాడు. పిత్రార్జితపు ఆస్తిమీదకూడా కొం... ఆదాయం వస్తుంది. అయినప్పటికీ యిప్పుడు పెండ్లిఈడు వచ్చినదే పెద్దపిల్ల. యింకా యిద్దరు ఆడపి... యిద్దరుమగపిల్లలు చిన్నవాళ్లున్నారు. ఎక్కడన్నా కొంచెం అన్నవస్త్రాలకి లోపంలేకుండా చదువుకుంటు... కుర్రవాడికిచ్చి పెండ్లిచేయాలని ఉన్నది రామారావుకు. తాను కోరే సంబంధము తన ఆస్తిఅంతా యిచ్చి... వచ్చేటట్లులేదు. తనకు తెలిసిన ఊళ్లువెళ్లి ఆలోచిస్తున్నాడు. యెక్కడా నచ్చటములేదు. నచ్చినచో... కుదరటములేదు. క్లబ్బుకువెళ్లినా తోచక ఆరున్నరకే యింటికొచ్చాడు రామారావు. రామారావు త... పూర్వాచారపరాయణురాలు. మనుమరాలిపెండ్లి చేయలేదనీ పెద్దదైతే కులంలో వెలైపోతామనీ, ... ములో అమర్యాదవస్తుందనీ కొడుకును రోజూ తొందరపెడుతూనే ఉన్నది. క్లబ్బునుంచివచ్చి ఒంకొ... కండువా తగిలిస్తున్నాడు రామారావు.

దక్షిణపుదొడ్లో పువ్వులచెట్లక్రింద ఉన్నరాతి తిన్నెమీద రామారావుతల్లి మనుమలను ... రాంద్రను కూర్చోపెట్టుకుని వెన్నెలలో ఆడిస్తూ, వాళ్లకు పిచ్చుకమ్మ కాకమ్మకథలుచెపుతూ ఆనందిస్తూ... రామారావు మామూలుప్రకారం దక్షణపుదొడ్లోకివెళ్లి తల్లిదగ్గిర కూర్చున్నాడు. కుమారునిచూచి మెల్లి... అతను ఈ పదిరోజులుగా సంబంధాల విషయంలో తిరిగిన భోగట్టా అంత అడిగింది. రామారావుతల్లికి అ... చెప్పాడు. సంబంధాలు ఎక్కడా కుదరకపోవడంనుంచి, కళ్లవెంట నీళ్లెట్టుకుంటూ, తాను బ్రతికివుం... మనమరాలిపెళ్లి చూడడం నోచుకోలేదేమోనని, కొడుకు ఆవిషయంలో తగినంత శ్రద్ధగా పనిచేయటం... రామారావును వేధించింది. రామారావు తిరిగితిరిగివచ్చి ప్రాణం విసిగిపోయివున్నాడు. ఇంటికివచ్చేసరి... పోరు అతన్ని మరీబాధపెట్టింది. అంచేత కొంచెం కోపంగా సమాధానం చెప్పాడు తల్లికి. ఈ కేకలు... మేడమీద పడుకుని 'గృహలక్ష్మి' చదువుకుంటున్న సీత చప్పున దిగివచ్చి అన్నది,

ఏం చెయ్యడం...?

'ఏమిటి యివ్వాళ అత్తగారితో కోపంగా మాట్లాడుతున్నారు? పూర్వాచారం ప్రకారం చప్పున పెండ్లిచేస్తే కులధర్మముగా ఉంటుందనీ, పెద్దది గనుక ఎప్పుడు చచ్చిపోతానో చూద్దామనీ అంటారు గాని ఆమెకుమాత్రం అమ్మాయి సుఖపడాలని ఉండదా?'

'నాకుమాత్రం ఆమెయందు భక్తిలేదా? ఈ విషయములో నన్ను ఎక్కువగా కదిలిస్తే కోప మొస్తున్నది, నా మనస్సు చాలా చీకాకుగా ఉన్నది.'

'సరే లేవండి. యివ్వాళ వెంకమ్మగారు ఉల్లిపాయ పప్పుపులుసు, దొండకాయకూరా చేశింది. అవి తింటే చీకాకు పోతుంది.' అని చిన్న నవ్వు నవ్వింది సీత.

'చాల్లే నీమాటలు నువ్వూను, నేనిప్పుడు లేవను' అని కూర్చున్నవాడల్లా పడుకున్నాడు తిన్నెమీద

'పాపం హరికథకెళుతుందిట వెంకమ్మగారు. లేవండి, ఎప్పుడు అడగదు యివ్వాళ ఏకాదశి అని వెళతానన్నది. అంచేత వంట చప్పున ముగించుకుని కనిపెట్టుకుని కూర్చుంది.'

'అయితే లేస్తా తువ్వాలియ్యి' అని లేచాడు రామారావు. అందరులేచి యింట్లోకెళ్లారు.

... ...

ఉదయం తొమ్మిదిగంటలైంది. కాఫీత్రాగి హాల్లో వాలుకుర్చీలో పడుకుని పైకిచూస్తూ ఆలోచిస్తున్నాడు రామారావు. ఇంతలో పోష్టుబంట్రోతు వచ్చి, ఒక కవరు రెండు కార్డులు యిచ్చి వెళ్లాడు. అవి చూచేసరికి ప్రాణం లేచివచ్చినట్లు చప్పున అందుకుని చూచాడు. ఒక కార్డు అత్తవారి ఊరునుంచి వచ్చింది; పిల్లకు సంబంధం కుదిరిందా? లగ్నాలు పెట్టుకున్నారా? అని. రెండవది ఒదినెగారి కొమార్తెకు పెండ్లనీ, వచ్చే మనుష్యులులేక శుభలేఖ వ్రాశామని తప్పక అందరూ రావలసిందనీ వచ్చాయి. పోష్టుబంట్రోతు ఉత్తరములు యివ్వడం చూచింది సీత. తానుకూడా వచ్చి అక్కడే కూర్చున్నది గోడకు చేరబడి ఏంచదువుతారో విందామని. ఆ కార్డులు రెండూ విసిరి ఆమెమీద పడేసి, కవరువిప్పాడు రామారావు. దానిలో సంగతులు ఈవిధంగా ఉన్నాయి....

"నీవు చెప్పినప్రకారం ఆలోచించినాను. వంగోలులో మాడపాటివారి సంబంధం ఉన్నది. వారి బేరం మాగాణి తప్ప డబ్బు అవుసరములేదట. ఆ బేరం మనకు కుదిరేటట్లులేదు. మామిడాలవారి కట్నమంతా బంగారం తూచి యివ్వవలెనట, వెండిరూపాయలు వారికి అచ్చిరావట. పిల్లవాడు నీపొడుగు ఉంటాడు. యల్. యం. పీ. చదువుతున్నాడు. అప్పగింతల బట్టలు వారికీ, వారితోవచ్చిన చాకలివాడితో సహా అందరికి పట్టువి తప్ప నూలువి ముట్టుకోరట. ఆస్తి ఏమిలేదు. ఈ షరతులు నీకు యిష్టమైతే అభ్యంతరములేకుండా వప్పుకుంటారు. అద్దంకిలో ఒక సంబంధం ఉన్నది. బేరంచేశాను. ఒకటి తొమ్మిదివేలకు తగ్గరట బాగా భూస్థితి ఉన్నది. స్కూలుఫైనలు తప్పి, ఈ సంవత్సరం కరిణీకపు లెక్కలు నేర్చుకుంటున్నాడు. ఒక్కడే, పిల్లవాడు, ఇతని మేనమామ కరణమట, ఆయనకు బిడ్డలు లేనందువ ఆయన తదనంతర కరిణీకం ఇతనికి వచ్చేటట్లు ప్రయత్నము చేస్తారట. యిది వారి స్థితి. తొమ్మిదివేలకు ఒప్పుకుంటే మీ కర్చులతో వచ్చి పెండ్లి చేసుకుంటారుట, కనుక తెలియబరచాను. మీ కష్టసుఖాలు మీరాలోచించుకుని ఏదో వొక నిర్ణయానికి వస్తారని తలుస్తాను. క్షేమం తెలియపరుచు."

రామారావు ఒక్కదీర్ఘ నిశ్వాసవిడిచి,

'సీతా! వింటున్నావుకదా? కాలపరిస్థితులు. ఈ కట్నాల సంస్కారం మీ ఆడవాళ్లల్లో కలగాలి, గాని మగవాళ్లేంచేస్తారు?' అన్నాడు రామారావు.

'ఆడవాళ్లేంచేస్తారు? సంస్కారం?'

'ఆడవాళ్లవల్ల కలిగిన కట్నముల దురాచారము ఆడవాళ్లే సంస్కారంచెయ్యాలి.'

'ఆడవాళ్లేం చేశారు కట్నముల కోసము.?'

'చేసేదంతా ఆడవాళ్లే. మనబ్బాయికి యెంతకట్నమిస్తే మనకంత గొప్పనీ; కట్నంకొద్దీ విద్యా రాళ్లను, ఆడపడుచులను అంతపెద్ద పీటలువేసి గౌరవిస్తారనీ దురాశ మీకు. మాదేముంది? ఉంటే పట్టు లేకపోతే కొల్లాయి మేము సిద్ధం. మీమాదిరిగా నగలు చీరలు కట్టుకుని ఒకచోట నుంచోటము, ఒకరు తీసికెళ్లి పెద్దపీటలు వెయ్యటము, ఆ వేసిన పీటకు ఏ వంకరన్నా ఉంటే అలిగిరావడము, ఏమున్నది మా ఏ పందిట్లోనో రెండు మెతుకులు తినివస్తాం' అంటూ కుర్చీలోంచి లేచాడు రామారావు.

ఆ వుత్తరాలు అతనికంత నిరాశ కలగజేస్తాయని అనుకోలేదు. ఈ కట్నాల దురాశ స్త్రీ పు భేదంలేకుండా, విద్యావిహీనుల్లోనే కాక విద్యావంతుల్లోకూడా బాగా ఘనీభవించి వుండడాన్ని చూ అతనికి ఏంచెయ్యాలో అర్థమైందికాదు. అలా అర్థంలేకుండా చావిట్లో ఏదో ఆలోచిస్తూ పచారీలు చేస్తూ వున్నాడు. మధ్యమధ్య 'ఇప్పుడేంచెయ్యాలి...' అని అనుకుంటూ. సీత ఏవేవోచెబుతోంది గాని ఆమాట అతనిచెవిలో పడటంలేదు. పచారీచేస్తూ గదిలోకివెళ్లి పైమీద కండువావేసుకొని ఎక్కడికో వెళ్లిపోయా రామారావు. సీత 'రామచంద్రా! ఇప్పుడేంచెయ్యడం? ఈసమస్య పరిష్కారం కావడానికి ఏవైనా వుందా...' అని వేడినిట్టూర్పు విడుస్తూ గదిలోకి వెళ్లింది ఎంతో దీనంగా అడుగు లేస్తూ...

నాడు - నేడు

పగర చెండాడగా పసిబాలచంద్రుని ఆహవరంగాని కనిపినావు
తిరిగి వచ్చిన తిక్కద్విజవీరు పురిగొల్పి పరిపంథి హతమార్ప బంపినావు
పెండ్లిపీటలనున్న వెంగళరాయుని రణరంగమునకు-మరల్చినావు
శాసనోల్లంఘన సమరమ్మునకు నెందరెందరనో వెడలించినావు
ఆంధ్ర వీరత్వమెల్లెడ నలముకొనగ మునిగిపోనున్న స్వాతంత్ర్యమునకు నాడు
వలదు యుద్ధాలు వలదు, పోవలదటంచు బోధసేయుము స్వాతంత్ర్యమునకె నేడు

బాసల కాసజెంది మును భారతయోధులు నుగ్గునూచగా
గోసిరి శత్రుశీర్షము లకుంఠితదీక్ష స్వతంత్రసిద్ధికై
మోసముజెంది నాడు; మరి పోలదటంచును నేడు శాంతిసిం
హాసనమెక్కి చాటుము సహాయ నిరాకరణమ్ము సోదరీ!

నలువదికోట్ల భారతజనమ్ము స్వతంత్రముగోరి కట్టిదె
బ్బలకు తుపాకిగుండ్లకును బాల్పడిరక్కట నాడు, నేడు నా
బలగమె వైరివీరుల తుపాకులకుం దలలొగ్గి నిల్చుటే
వలసిన కార్యమంచు మనపాలకవర్గము గోరు సోదరీ!

—శ్రీ చివుకుల ఆదినారా

కళాకలాపము

సహజకళల సామర్థ్యం

శ్రీ గరిమెళ్ల సూర్యనారాయణమూర్తి

చతుఃషష్టికళలంటూ ప్రాపంచకస్థితిని అరువదినాలుగు ముక్కలుగా విభజించి వాటి వాటి ప్రత్యేకనైజములకు సరిపోయే ప్రత్యేకమైన పేర్లుపెట్టి, కళాస్వరూపాన్ని ఉపాసిస్తూండేవారు మనపూర్వులు. కాని, వీటిలో కొన్నికళలు కాలగర్భంలో కలిసిపోయాయి నామరూపాల్లేకుండా. మరికొన్నికళలు పేరుకుమాత్రం ఉన్నాయి గాని, వాటి స్వరూపలక్షణాలు నశించిపోయాయి. మరికొన్ని, విదేశాలతో సంబంధబాంధవ్యాలు కలుపుకొని, వికృతరూపాల్నిపొంది విశేషావస్థలను ప్రకటిస్తున్నాయి. ఇక నృత్యం, గీతం, చిత్రలేఖనం, మొదలైన, లలితకళలు, నవీననాగరికతలో నలిగిపోతూ కృత్రిమపద్ధతుల మీద, పోతపాలవల్ల పెరిగిన పసిబిడ్డలా పెరుగుతున్నాయి నిస్తేజంగా—

వర్తమాన నాగరికప్రపంచంలో ఎన్నో సదుపాయాలు సృష్టించుకునేందుకు వీలున్నప్పటికి సహజకళలకు స్వస్తిజెప్పి, భావరహితమైన బాటగుండా యంత్రాలవలే, కళారాధనంచేస్తున్నామనుకోవడంలో అర్థంలేదు. సర్వలలితకళా ప్రపూర్ణయై, కళాలక్ష్మి బంగారుపంటలతో భారతభూమి వెల్లివిరిసిందంటే, దానికి మూలకారణం సహజకళాభివృద్ధియే. ప్రకృతిలోపుట్టి, ప్రకృతియే ఆధారంగా ప్రకృతిలో పెరుగుతూ, ప్రకృతిలో లీనమయ్యేదే సహజకళ. ఇట్లు సహజకళకుండే సామర్థ్యం, జీవం, కృత్రిమపద్ధతులమీద నేటి నాగరిక ప్రపంచంలో పెరిగేమనం లలితకళలనుకుంటున్న వాటిలో కనపడదు.

నిజం తెలుసుకుంటే ఎవరినైతే అనాగరికులూ అడవిజాతివారూ అని మనం అంటున్నామో, అట్టికోయలు మొదలయిన జాతులలో ఉండే కళోపాసన మనకు కరువైపోయింది.

ముఖ్యంగా ఆచారవ్యవహారాల ప్రకారం వారి పర్వదినాల్లో భగవత్ప్రీతికి, ఆత్మసంతోషానికి, వారుకావించే నృత్యం వర్ణనాతీతము.

నీలమేఘవర్ణాలతో మేఘమండలంలో లీనమైపోయే పర్వతాలు, పర్వతాల్ని అంటిపెట్టుకొని వాట్ని ధిక్కరిస్తూ ఫలపుష్పసముదాయంతో నీలాకాశంలో తలలూపుతూన్న వృక్షాలు, వృక్షము లెడ చాటున కిష్టపడక మధ్య ఖాళీప్రదేశములు కలిపికొంటూ వృక్షాగ్రాల్ని కౌగలించుకొంటూ విరియబూసిన మాలతీలతలు, అచ్చటచ్చట పాలపొంగులతో మాధుర్యమైన గలగలధ్వనులతో కొండవాలుల్లోంచి జాలువారే సెలయేళ్లు, సెలయేళ్లశృతులను మేళవిస్తూ లతాపత్రాదులచే లయనువేయిస్తూ ప్రకృతిని ఆలింగనంచేసుకొంటూ, పరుగులెత్తే కమ్మని పూలతావులతో కూడిన మలయమారుతము, ఈ మలయమారుతంలో మత్తెక్కి, ఆకాశంలో విశ్వవిహారంచేసే పక్షిసముదాయం—ప్రకృతికాంత తన నిజస్వరూపాన్నిదాల్చి విహరించే అటువంటిచోట సోదర జీవకోటిలో తామూఒకరై కోయలు నాట్యంచేస్తూంటే ఆ మాధుర్యదృశ్యం మనలను వళ్లు మైమరిపించి నాకలోకానికి తీసుకుపోతుంది.

వారి నాట్యాలంకరణముకూడా ప్రకృతిచే ప్రసాదింపబడ్డ సహజ వస్తువులతోటే—ముఖ్యంగా నాట్యసమయమున శ్రమగలుగకుండా నడుములకు కాసికోకలు, (అనగా దట్టీగుడ్డలు) కంఠములకు గురివింద

పేరులు, శరీరమంతకి మంచిసువాసనలిచ్చి శ్రమచెంద నివ్వకుండావుండే చందనపూత, గొప్పకస్తూరి పించు పారిజాతకుసుమచందనతిలకము, శిరోజాల్లో శిఖిపించాలు, మొదలైనవాటితో అలంకృతులై పిల్లనగ్రోవులు, గీర్వాణము, నాగస్వరము, రమ్ఢోల్లు, మొదలగు వాద్యాలతోటి పురుషులను విధములా అనుసరిస్తూ వక్షస్థలాన్ని ఒకగుడ్డతో అడ్డుకట్టుకుని నడుమునుండి పాదాలవరకు వ్రేలాడే కుచ్చిళ్ళ కట్టిన వేరొకపావడ, చేతులతో జయూస కంచెలు పట్టుకుని వాటివల్ల వింతవింత శబ్దములు కలగ నాట్యాదేవిని మూడుమూర్తులా ఉపాసిస్తూ ఉన్నప్పుడు అదృశ్యము మరి మరపురాదు.

మధ్యమధ్య మధురమధువును గ్రోలుతూ ఒకరి బాహువల్లికల్లో ఒకరుచేరి నాట్యగతులలో నప్పుడు ప్రకృతితాండవం చేస్తున్నట్టుంటుంది.

పిల్లనగ్రోవుల పిల్ల స్వరాలు, నాగస్వరం మొదలైన వాటియొక్క నాదాలు, రాంఢోల్లయొ ఝుంఝూరవాలు, నీలి కంఠాలలోని మెత్తని కంఠస్వరాలు, భావోద్రేకమైన గీతాలతో నాట్యం ఉ జరుగుచున్నప్పుడు సర్వం ఓంకారంలో లీనమౌతున్నట్టుంటుంది.

వారి నాట్యంలోకూడా హస్త విన్యాసాలు, నేత్రచలనాలు, పాదములగతులు, లెక్క కట్టుదిట్టంలో వుండడం, సహజంగా పుట్టివచ్చిన భావోద్రేకంలో వెల్లువల్లా ప్రవహించే ఆ కళాస్వరూ సాక్షాత్కరించి నేటి మననాట్య సాంప్రదాయాలని ధిక్కరిస్తూవుంటుంది.

అటువంటి సహజకళ అంటే ప్రకృతిదగ్గర శిశ్రూషచేసి నేర్చుకున్నట్టున్న వారి భావగుంఫ నాట్యకళ వారికి, మానవజీవికి కావలసిన వివిధఐశ్వర్యాలను సమకూర్చి పెడుతుంది.

ముఖ్యంగా ఆరోగ్యైశ్వర్యాన్ని ప్రసాదిస్తుంది. నాట్యలక్ష్మిని చేపట్టినవారికి ఎ వుండవలసిన శరీరం అక్కడ వుంటుంది.

అవయవపోషణ అసాధారణంగా ఏర్పడుతుంది. చక్కనికాంతి, వాడియైన మేధస్సు, సింహ సమకూరుతుంది; ఇదీ సహజకళ ప్రసాదించే మహాభాగ్యము—అందుకే వారు నూరు సంవత్సరాలు చింతా లేకుండా జీవిస్తారు....ప్రకృతిసహజంగా మన హృదయంలో రేకెత్తిన భావాలను మనం చం కృత్రిమపద్ధతులను హృదయానందంకోసం సృష్టించుకుంటున్నాము.

లేగదూడ కడుపునిండా పాలుత్రాగి చిలిపిగంతులు వేస్తుంది; కాస్త మలయమారుతం వేస్తే నె తోకలెత్తుకొని నాట్యం అరంభిస్తాయి. చంటిపిల్లలు చిదానందంతో ప్రకృతినిచూచి ఆడుకుంటా అప్పుడు వారి కళ్లూ, పళ్లేకాదు, వళ్లంతా భావపూరితంగా మాట్లాడుతూనే వున్నట్టుంటుంది. "Dance is Divine" అన్నారు. ఇటువంటి ఆనందాలకోసం సహజంగా మనంలోంచి పుట్టి వ్రేళ్ళ వాటిని 'మోటు' అనే భావంతో ఎక్కడివక్కడ అణిచిపెట్టి, కృత్రిమంగా సృష్టించుకోవడంకోసం నా అవస్థలపాలౌతున్నాము.

ఈ అవస్థలు అవస్థల్లాగానే నిలిచిపోతున్నాయి అంతులేకుండా. అథవా ఒకవేళ ఫలించినా క్షణభంగురమే అవుతూవుంది. ఎంతశ్రమించినా కించజ్ఞితమైన మానవనిర్మితం, ఎక్కడో వరప్రసాదు వారికి తప్ప, ఎప్పటికైనా అస్థిరమే, క్షణభంగురమే—

సహజకళలను తెలుసుకొని, నేటి పాశ్చాత్య వ్యామోహంలో పడిపోకుండా, మనది వెగటుగా చేసుకోకుండా, వాటిని ఉపాసించిననాడే ఆదర్శమైన జాతినిర్మాణం అవుతుంది.

ఇటువంటి సహజకళలను సాగనంపి, కృత్రిమకళల్లో కొట్టు మిట్టాడుతున్న నేటి నాగరకప్రపం యొక్క గమ్యస్థానం గాఢాంధకారంలోనే వుంది...వుంటుందికూడాను.

మంత్రసాని

శిశుక్షేమం : దేశసౌభాగ్యం

● శ్రీ గజపతిరాయవర్మ

మంత్రసాని అనగానే కులం తక్కువదని అభిప్రాయం. కాకులమూకలో మంత్రసానితనానికి మర్యాదెక్కడ?

బిడ్డకు తల్లిపాలు శ్రేష్ఠతరాహారం. రెండవపక్షం ఆవుపాలు. అదీ లేనప్పుడు వుండనేవుంది మేక.

ఆల్జీబ్రా జామెట్రీలతో చదువులు ఆపివేయక నిత్యజీవితానికి ఉపకరించే ప్రత్యేక విద్యలు నేర్పాలి.

※ ※ ※

నేటి నాగరిక సుఖాపేక్షాల్లో ఆరోగ్యానికి స్థానం ఉన్నట్లగుపడదు. మానవులు యంత్రాలై పోతున్నారు. యంత్రాలకు ఆయిల్సూ అవీ అవసరమైనట్లే మానవులకు చీటికి మాటికి డాక్టర్లు, మందులూ అవసరమవుతున్నాయి. మందులు మింగడంకూడా ఒకమోజు, 'ఫ్యాషన్'గా మారుతుంది. 'మందులేకుంటే మరిజీవించం' అనేట్లుగాఉంది.

ఈనాటి స్త్రీలలో ఎక్కువగా నాగరికతా నవీనపోకడలతో. పెద్దచదువులు చదివినా ఆరోగ్యం గుర్తించేవారూ, జీవనసంగ్రామంలో దానికవసరమయే ప్రాధాన్యం గుర్తించిన వారూ, సంసారం ఒడుదుడుకు లేకుండా నిత్యానందంగా నిర్వహించుకోగల్గిన వారిసంఖ్య అత్యల్పం. కారణం? శరీరశాస్త్ర పరిచయం తెలియకో, చదువుల్లో ఉన్నదోషమో, నాగరికతలోఉండే మోజులో, పిల్లల్ని పెంచడం, సంసారం సాగించుకోడం తెలియకనో ఎవరికివారే నిర్ణయించుకోవాలి. బియ్యేలవడంవరకూ—ఎందుకు స్కూలుఫైనలు దాటేప్పటికి కొంకెటింగు ఎక్స్పర్ట్సు కావచ్చునుకాని కాఫీ ఉప్మాలు చేయడంతప్ప గృహకృత్యాలు, కనీసం భర్తలతృప్తి పరుపగల్గేవాళ్లు తక్కువైపోతున్నారు. విద్య, స్వాతంత్ర్యం అనుకుంటూ స్త్రీలే మోసపోతున్నారు.

సంతానోత్పత్తికైనా, సుఖాలకైనా ప్రతీవిషయంలోనూ స్త్రీ పురుషుల కన్యోన్యసహకారం సహజంగా విధాయకమైనది. సాధారణంగా సంతానాపేక్ష స్త్రీలందరికీ ఉంటుంది. అయితే ఉత్పత్తి ఉత్తమంగా చేసుకోగలశక్తి ఆవిడ మెదడులోనూ, వొంటిలోనూ వుండనప్పుడు శిశుసంరక్షణ తృప్తికరంగా ఉండాలంటే ఎలాజరుగుతుంది? దాంతో వ్యయ ప్రయాసలు, మొక్కుబడులు, డాక్టరు ఫీజులు, అధిక అకాల మరణాలతోనూ పరిస్థితులు విషమిస్తుంటాయి.

కనుకున్నంత మాత్రంలో తల్లులంతా తమ సంతానాల్ని కాపాడుకోగలరనుట ఎక్కడోగాని ఉండదు. ఇలాంటి వారందరికీ ప్రబోధించాలనే మాతా శిశుసంరక్షణాలయాలు. బిడ్డనడవడం నేర్చాక ఎలాగైనా కూడదీసుకోవచ్చును. కాని గర్భంధరించినదిమొదలు ప్రసవించి ప్రాకేవరకూ పిండ, శిశుపోషణల్లో తల్లి చాలాజాగ్రత్తగా ఉండాలి. గర్భధారణ, వాంతులనాటి నుండే ముమ్మందు కావలసిన కార్యక్రమాలూహించుకుని ఎలానిర్వహించుకోవాలో తెలుసుకోవాలి. అవసరమైతే మంత్రసానులను తప్పక పిలిపించుకోవాలి.

'మంత్రసాని' అనగానే కులం తక్కువదని చాలమంది అభిప్రాయం. హిందువులు వివిధ వర్ణా సకేశ బ్రాహ్మణ వితంతువులతోసహా సంతులేని నిత్యకన్యలుకూడా ఉన్నారు. ఈ ఉద్యో సాంప్రదాయ గౌరవాలున్న వార్లట్టే రాకపోడాని కారణం సాంఘికంగాఉన్నలోపం. అదిగాక ఉ విషయంలో ఎంతదూరమైనా వెళ్లిచేయగలసాహసం అరవలు తప్పితే, క్రైస్తవులు మినహా ఉండరేమో! అదిగాక ఈవృత్తిలో ఉన్నా ఆటంకాలు, ఉద్యోగ ప్రదాతలనడత ఉత్సాహం వారినీ రానీయవు. అందులో శీలం చాలావిలువైనదనేవారికి స్థానమేలేదు. ఇంతా ప్రయాస మంత్రసాని అనగానే మర్యాదా, పరపతీకాదు-గౌరవం? 'డిగ్నిటీ ఆఫ్ లేబర్' తెలియనివారికి అమా ఈవృత్తి మరీ నీచంగా ఉంటుంది.

ఏనాడు మొదలైందో ఈమురికి సంఘానికి-ఎవడైతే శక్తివంచనలేకుండా శ్రమించి సేవచే వానికి గౌరవంలేదు. తిండిపెట్టేరైతు మనకు పల్లెటూరిపంద. భోగం, సపర్య, శుభాశుభకార్యల్లో విధాలుగా ఉపకరిస్తూన్న వృత్తులవాళ్లని చూడండి. గుడ్డలుతకడం, కాళ్లుపట్టడం మొదలు కా పట్టేచాకలి; మాటలో పరుగెత్తు కొచ్చేమంగలి; వీరు వారనక జాతిమతకుల ధనికనిర్ధనికాది తారత లేక సంఘానికెంతో చాకిరీచేసే పాకీవాళ్లు-ఇలా ఎంతమందో మనం పొందుతున్నా మేలైనా ఆలో కుండా కుక్క పందులకన్నా హీనాతి హీనంగా పరిగణించడం పరిపాటై పోయింది. ఇలాంటి మూకలో మంత్రసాని తనానికి మర్యాదెక్కడ్నుంచి వస్తుంది?

ప్రచారంలో, ప్రబోధంలో, పరిచర్యలో మంత్రసాని ఎంతకష్టపడినా, డబ్బుకు చేసింది ఊరికేచేసిందా అని పెదవి విరవడం చాలాసులువు. కాని ఆపని చెయమనండి చూదాం. వా వెగటుగా చూస్తూనే సమయాన్నిబట్టి వాళ్ల కాళ్లా వ్రేళ్లాపడ్డం, కట్నాలు కాన్కలని లంచాలు ఇవన్నీ తినమరిగేవాళ్లూ ఉచితంగా పనిచేయనియమితులైనా అందుకుజీతం పుచ్చుకుంటున్నా— కొచ్చింది మొదలు కట్నాల బేరాల్లోనే ఉంటున్నారీ మంత్రసానులు.

డబ్బ్బాదస్కం యిచ్చి సంస్థలు పోషిస్తున్నా వ్యక్తుల ఉదార ఉత్సాహ ఉదాసీన మంత్రసానులు మాతాశిశు సంరక్షణాలయాలూ పనిజేస్తుంటాయి. 'జీతం పుచ్చుకుంటున్నాం కాట అయిందనిపిస్తున్నాం' అనేవారు ఎక్కువగా ఉన్నారంటే కాదనలేము. అయితే ఒకటి. ఏసంస్థ అయినా ఉద్యమంఅయినా సరే సంపూర్ణంగా సవ్యంగా కొనసాగాలంటే 'ప్రజోపకారానికి, మా పరమావధి చేసుకుంటున్నాం' అన్నట్లు పరీక్షలిచ్చి, సిపార్సులతో పదవులకని ప్రయాసపడి ఉద్యో కొచ్చేవారికన్నా; స్వయంపోషణా అందుకుతగిన ఆస్తీ గుణగణాలుండి ఇతరులిచ్చే జీతాలమీదనే ఆధా వారీ ప్రజాహిత కార్యాల్లో పనిచేయగలరు. 'మంత్రసానితనం' కూడా అంతే. ఈనాడు సంఘాలుపుట్టి లేకుండా చస్తున్నాయంటే కారణం గౌరవోద్యోగాలే. ఉత్సాహంఉన్న గౌరవోద్యోగులకు కేవ పై ఆధారపడనివారిని చూచి తగిన గౌరవవేతనం యిస్తుంటే కొంతైనాపని జరుగుతుంది. కాని ఏ ఉద్య అయినా పరీక్షలయి పనిచేసే జీతాలవాళ్లు సంతృప్తికరంగా పనిచేయలేరు. ఆలా మానవసేవ శరణ్య కున్నా వారికదే ఉద్యమంలో మగ్నులై యుంటారు. జీతాలమీద మతవ్యాప్తిమూటకట్టుకు క్రిస్టియన్స్ మిషనరీ వాళ్లీసందర్భంలో చాలా సేవజేస్తున్నారు. డబ్బుపుచ్చుకుంటేనేం మంచిగా క్రైస్తవ సన్యాసినులూ వాళ్లూ ఎక్కువగా ఈ పనులు నిర్వర్తిస్తుంటారు. మతదృష్టిని వాళ్లను దూరం

గర్భిణులకు మాదీఫలరసాయనము, గర్భరక్షక



మాదీఫల రసాయనము

ఇది ముదిరిన మాదీఫలముల రసముతో తయారు చేయబడినది. గర్భిణి స్త్రీలకు కలుగు వాంతులకు (వేవిళ్లు) యిది సంజీవివంటిది. తల తిరుగుడు, వాంతులు, అరోచకము, అజీర్ణము, మలబద్ధకము, నిద్రలేమి మొదలగు జబ్బులకు వజ్రాయుధము. జ్వరవేగమును తగ్గించుటలో యీ రసాయనము పేరుపొందినది.

ఇది తేనెవలెయుండి నోటికి రుచిగను యింపుగను నుండును.

3 ఔన్సుల బుడ్డి వెల 0 12 0

గర్భరక్షక

ఈ 'గర్భరక్షక' సేవించిన గర్భస్రావము, అకాలప్రసవము, అప్పుడప్పుడు కడుపునొప్పి, నడుమునొప్పి, రక్తహీనము, శరీరమందు నీరు చేరుట, బలహీనము, అలసట, ఆయాసము, అజీర్తి, మలబద్ధకము మొదలగు జబ్బులు రాకుండుటయే గాక ప్రసవించువరకును శరీరము మంచి ఆరోగ్యస్థితి గలిగియుండి నిండుమాసములు గర్భముధరించి సుఖముగ ప్రసవించెదరు.

బుడ్డి 1.కి రు. 2 0 0



KESARI'S

SREEPHALADI PANAKAM

This compound Syrup of Sriphala, Dadima and Mangusthan, etc., cures Chronic Dysentery, Diarrhœa, Apthæ, Intestinal Ulceration and Low Fever, etc.

Directions for use:—2 to 4 teaspoonsful every 4 hours with equal quantity of water. *Diet*:— Light liquid food is recommended.

Price Re. 1.

KESARI KUTEERAM, MADRAS

శ్రీఫలాదిపానకం

మేహజబ్బుల వల్లను యితర కారణములవల్లను గర్భమందును నోటిలోను పుండై వాంతులు, నీళ్లవిరేచనములు, నిక్కాక కలిగియుందురు. చిరకాల గర్భస్రవణమువల్ల చీముగాని, నెత్తురులోకలిసిన చీముగాని మలమునకలిసి పడుచుండును. వీర్లకు ఈ శ్రీఫలాదిపానకము అద్భుతముగ పనిచేయును.

మరియు గ్రహణి జబ్బులు, అతిసారము, కడుపునొప్పితోకూడిన జిగటవిరేచనములు_వీటిని యీ ఔషధము నమ్మకముగ కుదుర్చును.

3 ఔన్సుల బుడ్డి 1 కి రు. 1 0 0

కేసరికుటీరం - మద్రాసు

తెలుగుజిల్లాలకు ఏజంట్లు:

శ్రీ శీతారాం జనరల్ స్టోర్సు, బెజవాడ.

మనం అంటరానివాళ్లనే వాళ్లతో వాళ్లకు సంపర్కం ఎక్కువకాబట్టి ఆ మందునీళ్లయినా ప్రాణాలు పోతున్నా అంటని శ్రోత్రియులు అనేకులున్నారు.

ప్రసవవేదన, శిశుమరణ దుర్బలదేహాల సంఖ్య తగ్గాలంటే అదో వైద్యం అనుకోడానక్కర్లేకుండా గర్భిణి గృహకృత్యాలు స్వయంగా చేసుకుంటేచాలు. దేహానికీ మానసికంగానూ అట్టే ఆయాసంకల్గకుండా జాగ్రతపడుతుండాలి. పురిటికనీ పుట్టింటికనీ దూరప్రయాణాలు అందు వాహనయోగం ఏ మంత మంచిపని కాదు. మామూలుగా ఉండేస్నానం, పద్ధతుల్లో మార్పు అక్కర్లేదు. తినాలని, బుద్ధిపుట్టిందనీ, సూడిదలనీ అడ్డమైనతిళ్లూ తినకూడదు. అసలలాంటి కోర్కెలు పెంచుకోకుండా ఉండడం మంచిది. పరిశుభ్రమైన నీరూ, గాలీ, పుష్టికరమైన ఆహారం, శుచీ అవసరం. మానసికోద్రేకాలకు అందులో సినిమాలు (ఈరోజుల్లో దోచుకుపోతున్నాయి.) చూడ్డం, నరాలకు పని చెప్పడం, బుర్ర వేడెక్కించుకోడం ఏమాత్రం సరిపడదు. నిత్యానందంగా ఉండాలి. ఉన్నతాశయాలు ఉవ్విళ్లూరాలి. మలమూత్ర విసర్జనలు సక్రమంగా నిరాటంకంగా ఉండాలి. ఖర్మంచాలక కారణాంతరాల గర్భందాల్చి బహిష్ఠఅయినా, ప్రసవవేదన ప్రారంభించినా ఇరవైనాల్గు ఘంటల్లో డాక్టర్ల సంప్రదించాలి.

ప్రసవానంతరంనుంచీ మరీ జాగ్రతగా ఉండాలి. అందులో శిశుపోషణ, గమనీయ అహారం, అంటువ్యాధులూ అవీ ఉంటేమో తప్ప బిడ్డకు తల్లిపాలకుమించిన శ్రేష్ఠతరాహారం మరొకటిలేదు.

తల్లిపాలకున్న ప్రాశస్త్యగౌరవాల గురించి కథలేఉన్నాయి.

ఒక గ్రీకుప్రభువు కిద్దరుకొడుకులు. రాజ్యార్హత పెద్దవాడికే కాని తల్లిపాలతో పెరగనందున రెండోవాడికి పట్టంకట్టేరు. ఇలాంటిదే వెనుక 'భారతి'లో 'రాచపీనుగు తోడులేకుండా వెళ్లదు' అనే కథ. పెద్దవాడు దాసీదాని పాలతో పెరగడంవల్ల పౌరుషప్రదర్శనంలో పడిపోయాడు. తల్లిపాలుత్రాగడంవల్ల వచ్చేగౌరవం సుగుణాలెన్నో కథలేకాదు. నిజంగా జరిగినాయి, జరుగుతున్నాయి.

ఇలా ఇతరుల పాలుపట్టవలసిన గ్రహచారాన్ని ఏమనాలి? తల్లిలో అనారోగ్యాదులు విస్తరించి పాలుపడకపోవడం—ఇంకాఆశ్చర్యం, ఇటీవలి నవనాగరికతా నారీమణుల ప్రవర్తనలు—కొందరు తల్లులు యవ్వన సౌందర్యం దిగజారి పోతుందనీ, కన్న పిల్లలకు కాస్నిపాలీయడానికి ఆత్మవంచన చేసుకుంటున్నట్లు వింటున్నాము.

ప్రతీ శిశువుకూ తల్లిపాలు త్రాగడం, ప్రపంచంలో అందరూ గాలి పీల్చడానికెంత హక్కుఉందో అలాంటి జన్మహక్కువుంది. కాని మన దౌర్భాగ్యంకొద్దీ పైకారణాలవల్ల లక్షలకొద్దీ పాలడబ్బాల దిగుమతీ_ ఇతర స్త్రీల పాలివ్వడం, ఆ శిశువులు గుణసత్వవిహీనులై వ్యాధిపీడితులై మరణసంఖ్యను హెచ్చించడం, ప్రారంభంలో ప్రస్తావితులైన వాటివంటి యువతులు నిర్వీర్యులయి, జాతి జీవచ్ఛవాలుగా నిలవడం జరుగుతుంది.

అసలు తల్లికి పాలు పడకపోతే చికిత్సచేయించడం, ఔషధసేవన అవసరం. అంతకూ చాలనప్పుడే ఆరోగ్యమైన యితరుల పాలీయడం_కాని ఈ రోజుల్లో ఆరోగ్యంగా వ్యాధుల్లేకుండాఉండే వారత్యల్పంగా ఉన్నారూ అంటే పరాయిబిడ్డలకు పాలీయడానికేతల్లి వప్పుకుంటుంది. సాంప్రదాయమైనావిడ ఏనూటికో కోటికో పాలెక్కువై ఇతరుల బిడ్డల కిస్తుందేమో. డబ్బిచ్చి పట్టించడం సులువే పాటకపుజాతి స్త్రీల పాలు. అలా ధనమాసించి కన్నపిల్లలక్కూడా యివ్వకుండా పట్టేవారు చాలామంది పైసాయిచ్చి పాలిమ్మనే వారి పశివాని సాంప్రదాయానికీ, స్థితిగతి గుణగణాల్లో సాధారణంగా విభిన్నంగా ఉంటారు. అందులో శిశువు ధాదిపాలతోపాటు దాని గుణగణాలు, మంచిచెడ్డలూ గ్రహిస్తాడనే నమ్మదగిన వాదం ఉంది. అలాంటప్పు

డీనాడు తల్లిపాలు లేకుంటే పోతపాలు పోయక తప్పదు. పోతపాలంటే ఏ ఆవుపాల్లోనో కొం
చల్లారిన నీరూ,వెన్నా కలకండా కలిపితే—తల్లి తప్పితే పోయదగినవి. అవుపాలు అందుబాటులో లే
అదీ కరువైనా—ఉండనే ఉంది అయిదురూపాయల్లో వచ్చే మేక.

కొందరు పాలుపోయడం సీసాలద్వారా కాడచెంబులు ద్వారా చేస్తుంటారు. కాడలో
వదల్చడం అసాధ్యం; అంత పట్టింపుగా పరిశీలించరు. ఈ రెండు సాధనాల్లోనూ అనారోగ్యకరమూ
కరాలైన పద్ధతులున్నాయి. ప్రత్యేకంగా సశాస్త్రీయపద్ధతులు తయారైనా, ఎప్పటికప్పుడు
వేన్నీళ్లతో బ్రష్‌చేస్తూ, కుదిలించి కడగడం శుభ్రంగా పాలుపోస్తుండడం చాలా అవుసరం.

సాధారణంగా పిల్లలెందుకేడుస్తారో ఎవరం గుర్తించలేము. వాళ్లు ఏడవకుండా ఉండాలి
మానూ పాలీయకూడదు. రబ్బరు పీక, పాలసీసా మూతి, మూతికి తగిలించిఉంచడం తగనిపని. ఈ
యెందుకు డబ్బాపాల్లేవా అని సులువుగా భావిస్తారు. కాని బాగా ఆలోచిస్తే అంతకన్నా వృథా ధన
ఇంకోటిలేదు. ప్రకటనలుచూసి పసివాళ్లను పాడుజేయడం తప్ప పాలడబ్బాల లాభం ఏమీలేదు.
మన డబ్బుతో పరాయీవాళ్ల ఖజానాలు నింపడం. ఈ రకం శిశుపోషణకు కొందరు తండ్రుల నెలజీతా
చాలవు. అలవాటయిందంటే పిల్లలకని పెద్దవాళ్లు ఏకాదశీ వ్రతాలు చెయ్యాల్సొస్తుందీ డబ్బాలు కొ

ఒకాయనకు ముప్ఫయిరూపాయల జీతం, బీడీ ఖర్చు, అరకప్పు టీ ఇదీ ఆయన ఖర్చు.
రూపాయలు యింటద్దె. చాకలి మంగళ్లు మూడురూపాయలు. ఆయనకు బ్రూక్ బ్రాండ్ డబ్బా, అ
గ్లాక్సోడబ్బా అలవాటు. జీతం అందిన మరుసటివారంనుంచీ అన్నీ అప్పులే,పస్తులే. పాలడబ్బాలకయే
పశుసంరక్షణచేస్తే సంతానం బలకరంగా ఉంటుంది. నల్గురికి జీవనోపాధీ కల్పించినవారవుతారు.

సంవత్సరం దాటిందనగానే శిశుపోషణలో కష్టంలేదనుకుంటారు. కాని పన్నెండు
సంవత్సరాలవరకూ పసివానికని జరిగిన పోషణ, జీవనం, బోధన, పాఠం యివే, వీటినిబట్టే వాని భవిష్య

దేశగౌరవానికీ, జాతిప్రతిభ నిలపడానికీ అన్నిటికీ ఆరోగ్యం అనేది ప్రాతిపదిక. అదెరిగి
అమ్మా బాబూలైనా ఆల్జీబ్రా జామెట్రీలతో పిల్లల చదువులు పూర్తిచేయించక నిత్యజీవితానికి సంబం
విషయాల్లో విద్యనేర్చే విధానం చూడాలి. అంతకన్నా మానవజీవితానికవసరమయే విషయాలు-ప్రాథమి
కూడా విద్యావిధానాలు మారే సూత్రం చూడాలి. ప్రాథమిక విద్యావిధానంలో, మంత్రసానితనం,
క్షేమం, దేశసౌభాగ్యం మొదలైన విషయాలనుగురించి ప్రతిబాలికకు కొంతవరకు నేర్పించేవిధానం అమ
పెట్టాలి.

౦ ఆంధ్రశిల్పి ౦

శ్రీ తుమ్మల సీతారామమూర్తి

లాలిత్యలక్ష్మి విలాసరంగంబు నిల్పితి వజంతాచిత్రలేఖనమున
సవరించితివి శైవభువనంబు నెల్లొరాకొండను మైనంపుటుండఁ జేసి
విఠ్ఠలప్రభునికో వెలకంబములచేతఁ బలికింపఁ గంటి సప్తస్వరములు
ఒలికించి తౌర తిర్మలనాథునగరులో వెలలేనిసభ్యతా విలసనములు
భగవదన్వేషణార్థమ్ము పాటువడినయుత్తమతపస్వివై కళాయోగి వైన
నీకు ఋణపడె రసలుబ్ధలోక మెల్లనాంధ్రశిల్పీ! చిరంజీవి వయ్య! నీవు.

మా ప్రణయ సంసారం

● జీవనప్రభాత్

ఇది అనుసరణీయం,
ఆదర్శవంతం
అవగలిగితే...?

- - - - - - - - - - - - -

'ఆళ్ఇంట్లో జీవితమంటే నాకు రోత జనించింది. పాపం, బావ తలవంచుకుని ఒక్క మాటేనా ఆడేవాడుగాదు. అతని జీవితాన్ని పాడుచేసిన దాన్ని నేనేమోనని ఒక్కొక్కప్పుడు భయపడేదాన్ని. అతని జీవితం సుఖవంతం చెయ్యాలని నిశ్చయించుకున్నాను.

- - - - రాధ.'

నా పుట్టినింటినుంచి నేనూ బావా జెట్టాపట్టాలు వేసుగుని వెళ్లిపోయేమంటే కారణం లేకపోలేదు. అన్నివిధాలా బిడ్డ సౌఖ్యం కోసం పాటుపడేది తల్లే అయినప్పటికీ, ఒక్కొక్క సమయంలో తన బిడ్డని అధోగతిపాలుచేసేదికూడా తల్లే......

మా సంసారకథకు ముందు మా ప్రణయకథ—చాలా వింతగా వుంటుంది......నాకు పందొమ్మిది సంవత్సరాలూ ఈమధ్యనే వెళ్లినాయి. బావకు ఇరవై ఒకటోయేడు గడుస్తోంది—.

నా మేనత్తకొడుకు కేశవం చిన్ననాటనే తల్లిని కోల్పోయేడు. అప్పటినుంచీ మా యింట్లోనే పెరిగేడు. అతనితండ్రి రెండో పెళ్లి చేసుకుని ఎక్కడో సంసారం చేసుకుంటున్నాడు. అయనకీ కేశవానికీ సంబంధం తీరిపోయినట్లే కనబడుతుంది. అందుచేత అన్ని విధాలా బావకి మా నాన్నే దిక్కయ్యేడు.

మేమిద్దరమూ చిన్నప్పటినుంచీ ఒకేకంచంలో తినీ ఒకే మంచంమీద పడుకునీ పెరిగేం. ఒక్కరోజుకూడా ఒకర్ని విడిచి ఒకరం వుండలేదు. అటువంటప్పుడు మా యిద్దరికీ ఒకరిమీద ఒకరికి అభిమానమూ, దానిమీద అనురాగమూ పుట్టుగురావడంలో ఆశ్చర్యంలేదు.

అప్పటికి నాకు పదిహేనేళ్లు. సంబంధాలువచ్చి పడిపోతున్నాయి.

నేను బావనే బాగా ప్రేమించేననీ, నన్ను ఇంకొకరికి పెళ్లిచెయ్యడం న్యాయంకాదనీ మా నాన్నకి తెలుసు. కాని అంత చిన్నవాడికి నా అంత పెద్దదాన్నిచ్చి ఎలాగ పెళ్లిచేస్తారు? ఏసంబంధం వచ్చినా పనికిరాదంటున్నాను.—నామాట తోసెయ్యడానికి చిన్నపిల్లనీ చితకపిల్లనీకాదు—బాగా జ్ఞానంవచ్చిన దాన్ని మరి!...అప్పటికప్పుడే మా అమ్మ కోపం మితిమీరిపోతోంది—వివాహం విషయం నా యిష్టం మీదనే ఆధారపడివుండడం మూలాన్ని బావకి నన్నిచ్చి పెళ్లిచెయ్యక తప్పిందిగాదు.

* * *

మా అక్కయ్య పిల్లలతో ఒకసారివచ్చి వెళ్లింది. అదిమొదలు మా అమ్మ సాధింపులకి. మా అక్కయ్య మొగుడుకూడా నిరుద్యోగంలోనే పనిచేస్తున్నాడు. అయినా వారికి కొంత ఆస్తి వుంది కాబట్టి ఇంత తింటున్నారు. మరి మాకు నిజానికి ఏమీ లేవుకా—. మా నాన్న చదివిస్తేనే ఏదేనా వుంది. అందులోనూ బావ ఈ సంవత్సరం చదువు మానివేసేడుకదా—మా అమ్మ ఈ లోకువ దొరకపుచ్చుకుంది.

సణుగుడల్లాపోయి తిట్లలోకీ—ఉపన్యాసాలలోకీ మారిపోయింది. కొందరి ఆడవాళ్ళలో వున్న ఈ గుణానికి నాకే ఆశ్చర్యం అసహ్యమూ వస్తుంది. ఏమీ తగినంత కారణంకూడా వుండక్కర్లేదు—అదేమిటోగాని!

ఇంకెందుకూ—క్లుప్తంగా చెపుతాను. ఆ యింట్లో జీవితమంటే నాకే రోత జనించింది. అంటే నాకే అసహ్యంవేసింది. బావ పాపం తలవంచుగుని ఒక్కమాటేనా అనేవాడుకాదు. బావని నాకు జాలివేసేది. అతని జీవితాన్ని పాడుచేసినదాన్ని నేనేమోనని ఒకొక్కసారి భయపడేదాన్ని.

అతని జీవితం ఎలాగైనా సుఖవంతంచెయ్యాలని ఒకరోజున నిశ్చయించుకున్నాను.

ఒకరోజున అమ్మకీ నాకూ వాగ్యుద్ధం జరిగింది. అమ్మని గట్టిగా ఎదిరించేను. అనవలసిన మాటలూ అనేశాను.

'ఎల్లకాలమూ మిమ్మల్ని మేపగలమా తల్లీ? నీమొగుడూ నువ్వూ తీరుబడిగా కూర్చునితింటూ చాకిరీకి నేనూ, సంపాదనకి ఆయనా ఉన్నారుకాదూ!' అంటూ సాగదీసుకుంది.

ఆ మాటలు నాకు సూదుల్లా గుచ్చుగున్నాయి. 'ఇక్కడ ఈ దిక్కుమాలిన కూడు తినేకంటే! మెత్తుగుని బతిగితే మేలు—నీకూ నాకూ తీరిపోయింది. ఇంకొక్క క్షణం నీ యింట్లో వుండను' అ మేడమీదకు వెళ్లిపోయేను.

మా సామాన్లు క్లుప్తంగా మూటగట్టేను. నిజానికి అందులో ఒక్క పూచీపుల్లకూడా మాదిగా అరగంటలో సిద్ధపడిపోయేను. నాన్న నన్ను సమీపించేడు. నా కళ్ళల్లోవున్న దృఢనిశ్చయం పరికించి ఏమీ అనలేకపోయేడు. నన్ను రహస్యంగా పిలిచి నూరురూపాయల నోటు నా చేతిలో పెట్టేడు. 'ఏ అవసరమయితే వుత్తరంవ్రాయి తల్లీ' అన్నాడు.

ఇంతట్లోనూ బావ వచ్చేడు. సంగతులు విని ఆశ్చర్యపోయేడు. బండీ తీసుగురమ్మని—లో కాళ్ళకి పసుపురాసుగున్నా, బొట్టుపెట్టుగున్నా. అమ్మ కాళ్ళకి నమస్కరించబోయేను—నన్నుచూసి నిశ్చేష్టురాలయి నిల్చుండిపోయింది.

అమ్మతోటి వెడుతున్నానని చెప్పేను. అమ్మ ఏమీ మాట్లాడలేదు. నాన్న కళ్ళనీళ్ళతో ధానం చెప్పేడు. బండీలో కూర్చునేసరికి—అదేమిటో అంతవరకూ అంత ధైర్యంగావున్న నాకు కళ్లనీళ్లు తిరిగేయి.

నేపుట్టి పెరిగిన యిల్లు—బావతో ఆడుకుని సరదాగా తిరిగిన యిల్లు—ఇంతవరకూ యిల్లు దూరమయిపోతూంటే—నాకు దుఃఖం పొంగిపొంగి వచ్చింది—

'రాధా! ఎక్కడికి వెడదాం?' అన్నాడు బావ.

'ఏలూరు. ఆవూళ్లో నా స్నేహితులు కొందరున్నారు.'

* * *

పవరుపేటలో ఒక చిన్నవాటా అద్దెకు తీసుగుని మా సంసారం ప్రారంభించేము. ముందు వలసిన విషయాన్నిగురించి రాత్రింపగళ్లు ఆలోచిస్తూ వుండేవాళ్లం.

బావ పగలస్తమానం ఉద్యోగాన్వేషణలో తిరిగేవాడు. కనపడిన ఖాళీలకల్లా దరఖాస్తులు వాడు. ఉద్యోగంకోసం పడవలసిన బాధలు ఇప్పుడిప్పుడు మాకు తెలియసాగేయి.

మొదటి రెండు నెలలూ మాకు నిర్విచారంగా గడిచేయి. మాకు ముందుగతి ఏమీ ఎక్కడా బావకి ఉద్యోగం దొరకలేదు. దొరికే సూచనలుకూడా లేవు. నలుగురికి ప్రైవేటు బతుకుదామన్నా వాటికీ గిరాకీగానే వున్నది. అయితే మా గతేంకాను? నాదగ్గరున్న వస్తువులన్నీ నప్పటికీ ఒక సంవత్సరం, సంవత్సరన్నరకంటే ఎక్కువ బతకలేం—అదేనా అతి కష్టంమీద.

నేను చదువుకున్న దాన్నవడంచేత సులువుగా చాలామంది స్త్రీలతో పరిచయం చేసుకున్నాను. అప్పుడప్పుడు ఒకరిద్దరి ఇండ్లకికూడా వెడుతూవుండేదాన్ని. ఒక స్నేహితురాలు, రమణమ్మ—ఒకరోజున, ఏదో సందర్భాన్ని—'నిన్నను మునసబుగారి పెళ్లాం తన కూతురికి సంగీతం చెప్పిస్తానంది. ఈమధ్యని మన ఆడవాళ్లల్లో సంగీతం పిచ్చి బాగానే బయలుదేరింది సుమ్మా' అంది.

'అయితే ఏం చెప్పిస్తుంది—ఫిడేలా? వీణా?'

'వీణే కాబోలు!'

*　　　*　　　*

నాలుగుమాసాలు తిరిగేసరికి నాకు పాతికరూపాయల గ్రాసం ఏర్పడ్డది. ఈలోపున బంగారం అమ్ముకునే మేం జీవిస్తున్నాం గుట్టుగా.

నేను సంగీతానికి వప్పుగున్న ఇళ్లు పెద్దపెద్ద ఉద్యోగస్తులవి. ఆవూరి మహిళాసమాజంలో నాకు మంచి పలుకుబడి వచ్చింది. పెద్దపెద్దవారంతా స్నేహితులయ్యేరు. అన్నీ బాగానేవున్నాయి, కాని బావకి వుద్యోగం దొరికే సాధనమాత్రం నాకు స్ఫురించేదికాదు!

మాకు ఈపాటి ఆదాయం వస్తూవుంటే మా జీవనం నిర్విచారంగా వెడుతుంది. కాని నేను బాగా కష్టపడవలసివస్తుంది. నా భర్త సుఖంకోసమనీ, నా సుఖంకోసమనీ—కష్టపడడం నాకూ సంతోషమే!

ఇంతలోనూ ఒక వింతమబ్బు మా సంసారాన్ని ముంచుకుపోయింది.

తెల్లవారేసరికి లేచి గృహకృత్యాలు నిర్వర్తించుగుని ఏడూ ఎనిమిదిగంటలయ్యేసరికి బయలుదేరే దాన్ని. ఇద్దరికి పాఠాలుచెప్పి తిరిగి వచ్చేసరికి పదకొండుగంటలయ్యేది. అప్పుడిద్దరమూ భోజనంచేసేవాళ్లం. రెండూ రెండున్నరకి మళ్లీ బయలుదేరి మిగిలిన మూడుచోట్లా పాఠాలుచెప్పి వచ్చేసరికి చీకటిపడేది. ఒక్కొక్కరోజున బాగా రాత్రికూడా అయ్యేది.

*　　　*　　　*

'రాధా! నే తింటూ కూర్చోడం—నువ్వు అన్నివిధాలా అలసిపోతూ వుండడం...' అన్నాడు. ఆరోజున నేను చాలా ఆలస్యంగా వచ్చేను. పొయ్యి రాజక నానాఅవస్థ పడుతున్నాను.

ఏంసమాధానం చెప్పాలో నాకు తోచలేదు. అలాగ అనవద్దని దీనంగా చూసేను. నేచెప్పవలసిన విషయం నా కళ్లే బావతో చెప్పేయి.

'నిన్ను కష్టపెట్టే నిర్భాగ్యుణ్నయిపోయేను రాధా!'

అతనికళ్లలోని నీళ్లు నా హృదయాన్ని కలచివేసేయి. బావహృదయం కష్టపడడం నేను చూడలేను. 'నేనేమీ కష్టపడడంలేదు. ఒకవేళ నేమానినా, ఈ కష్టం నువ్వుపడవలసిందే కద? ఇది కష్టంకాదు నాయిష్టం!'

*　　　*　　　*

ఆనాటితో తెలిసింది. బావనిజంగా సుఖపడడంలేదనీ, మనస్సులో చాలా బాధపడుతున్నాడనీ, నాసంపాదన మొదలెట్టినదగ్గర్నుంచీ అతనిలో కలిగిన మార్పుని ఆనాడు గ్రహించగలిగేను.

నిజమే సంపాదించి ఇంకొకర్ని పోషించవలసినవాడు...తనే ఇంకొకరిచేత పోషింపబడేటప్పుడు—అందులో తనభార్యచేత పోషింపబడేటప్పుడు? ఎంతతగ్గిపోతాడో, అది వూహాతీతం!

బావచేసిన ప్రయత్నాలన్నీ వృథాలయ్యాయి. ఆఖరికి కోమటి గుమస్తాగిరియేనా దొరకలేదు. ఇంకప్రయత్నమంటేనే అతనికి విసుగువచ్చింది. రాత్రింబగళ్లు ఇల్లుకదిలేవాడుకాడు. ఏదో పెద్దజబ్బుచేసి

తీసుకున్నవాడిమాదిరి మారిపోయేడు. ఎప్పుడూ పడకకుర్చీలో ఆలాగకూర్చుని ఏదో ఆలోచిస్తూవుండ... మాటవరసకి ఒక్క-సారైనా ఈవలకి వచ్చేవాడుకాదు.

బావలో ఈమార్పు నన్ను మరీ మరీ, కలచివేసింది.

* * *

ఆరోజున మాక్లబ్బు వార్షికోత్సవం. నేను చాలా పెంద్రాళేనే వెళ్లవలసివచ్చింది. తిరిగి... టప్పటికి రాత్రి తొమ్మిదిగంటలయింది. బావని రమ్మని ఎంతేనా ప్రార్థించుకున్నాను. కాని—!

వీధితలుపు జేర్లానే వేసివుంది. లోనప్రవేసించేసరికి బావ పడకకుర్చీలో పడుకొనివున్నాడు. ... ఆలస్యమయిందని అనుకుంటూ వంటయింట్లోకివెళ్లేను. ఆశ్చర్యం—వంటతయారయి సిద్ధంగావుం... శరీరంమీద వెయ్యితేళ్లు పాకినట్లయింది. నెమ్మదిగా బావదగ్గిరకి వెళ్లేను.

'అన్నం—?' నాలో అదొకవిధమైన బాధ బయలుదేరింది.

'అవును! నువ్వురావడం ఆలస్యమవుతుందికదా అని—నేనే వండేను!' అన్నాడు చిరునవ్వు...

నాకంఠం కీచుబోయింది. 'ఆలస్యమయితే మాత్రం?... ఇదేమిటి?—అన్యాయంకా... నేవుండగా నేనా?' నాకు దుఃఖమొస్తోంది.

'ఇంతట్లో ఏం మునిగిపోయింది రాధా? నేవండితే ఏంతప్పు? ఇంతరాత్రి అయినతర్వాత... చేతులు కాల్చుకోనడంమాత్రం బాగుందా?'

నాముఖం జేవురించింది...'నా కదంతా పనికిరాదు. ఇక్కడ్నించి—పోనీ—ఎప్పు... కదల్నులే. నువ్వుమాత్రం గిన్నెలు ముట్టుగునీయండుకు వీల్లేదు.' నా దుఃఖం ఆపుకున్నాను. ... రాత్రయ్యేది—ఏమిటయ్యేది—నేనే వండుతాను. తెలిసిందా?? నీచేతికి గిన్నెలు రావడమేమిటి?'

బావముఖం వేరువైపుకు తిప్పుకున్నాడు. అతనిముఖం తీక్ష్ణమయ్యింది...'ఆలాగయితే క... కూర్చుని తినడం నాకిష్టంలేదు సుమ్మా—' అన్నాడు.

బావమాటలు వింటోంటే నాకుదుఃఖం పొంగి పొంగి వచ్చింది. అతనిచేతులుపట్టుకుని ప్రా... పడ్డాను—'బావా! ఆలావాగ్దానంచెయ్యి. నాచేతులో చెయ్యివేసిచెప్పు—' అన్నాను.

'నీకు ఇది ఏమాత్రమూ న్యాయంకాదు రాధా—' అంటూ బావలేచి నిలుచున్నా... ఆమాటలు నన్ను శూలాలలాగ బాధింపజొచ్చేయి.........

కొంతసేపటికి మాయిద్దరిముఖాలూ గంభీరతదాల్చేయి. భోజనానికి కూర్చున్నాం. ... మెతుకేనా ఇద్దరమూకొరకలేదు. ఇద్దరిహృదయాలు కల్లోలంగా వున్నాయి.........

* * *

ఆతరవాత రోజల్లా ఇద్దరమూ ఆలోచనలతో గడిపేం. ఏ ఆఖాయిత్యమూ జరిగినట్లేలే... అన్నీ అప్పుడేమరచిపోయేం. ఆలోచించి ఆలోచించి ఆఖరికి ఒకపద్ధతికి వచ్చేం.

ఇదివరకటి మాసంగతి బాగా ఎరిగున్నది మునసబుగారి భార్య. ఆమెను కలుసుకున్నా... వుద్దేశ్యం తెలిపేను. ఆమె మహాబాగంది. సంపూర్ణంగా సహాయం చేస్తానంది.

ప్రొద్దున ఏడుగంటలయ్యేసరికి మాయింటికి ఆరుగురు విద్యార్థినులు వస్తారు. ఈ ఆ... ఆతర్వాత పదిమందయ్యేరు.

ఏడునుంచి ఎనిమిదింటివరకూ వారికి సంగీతం నేర్పుతాను. ఆతర్వాత గృహకృత్యాల... లీనమౌతాను. అప్పుడు బావ వాళ్లకి ఇంగ్లీషూ, తెలుగూ, లెక్కలూ నేర్పుతాడు. మధ్యాహ్నం... రెండుగంటలు నేనూ రెండుగంటలుబావా చదువూ సంగీతమూ నేర్పుతాము.

మా ప్రణయ సంసారం

ఈవిధంగా మాసంసారంలో ఒకపాఠశాల నడపజొచ్చేము. ఇందువల్ల నేనూ బావా సమంగా తాపత్రయం పడుతున్నాము. ఇంకోసంగతి—పని నాకూ తేలికయింది. విద్యార్థినులకీ లాభదాయకమయింది. ఇదివరకు నాకిచ్చేజీతానికే వారికి చదువూ సంగీతమూకూడా వస్తున్నాయి.

తర్వాత తర్వాత అనేకమంది తమ పిల్లలని పంపుతామనేవారు కాని నేను వప్పుకునేదాన్నికాను. తిన్నగా మనకివచ్చినది చెప్పవలెనంటే పదిమందేఎక్కువ. అంతకంటే ఎక్కువైనప్పుడు చదువుసాగదు. పూర్వం 'నలందా' 'తక్షశిలా' విశ్వవిద్యాలయాలలో పదిమంది విద్యార్థుల కొకొక్కక్క ఉపాధ్యాయుడు చొప్పున పదివేలమంది ఉపాధ్యాయులుండేవారట!

మా జీవితంలో ఆదర్శరమణిని ఒక్కతెను తయారు చెయ్యగలిగి తేచాలు.

◆ ◆ ◆

మా ప్రణయసంసారకథ అంతమయినట్లే—కాని ఒక్కవింత సంఘట్టన ఆతర్వాత జరిగింది. అదిచెప్పి ముగిస్తామ. ఒకరోజున మేమిద్దరమూ సాయంత్రం కబుర్లుచెప్పకుంటున్నాం. ఒకవుత్తరం వచ్చింది. యడ్రస్సు మానాన్నదస్తూరీతోవుంది.

ఆవుత్తరంలో వున్న ముఖ్యసంగతులివి— '...మీరిద్దరూ వెళ్లినతరవాత అమ్మ స్వభావం పూర్తిగా మారిపోయింది....ఇప్పటికి రెండునెలలనుంచి అమ్మ మంచంమీదనుంచి లేవడంలేదు. ఎందుకు అంత అలాగఅయిపోయిందో వూహించుకొనలేకపోయేం—కాని—మొన్నటినుంచి అమ్మస్థితి మరీ అన్యాయంగావుంది. 'అమ్మాయిని పొమ్మన్నాను—అదెంత కష్టపడుతోందో—రాధని ఒక్కసారిపిలవండి. రాధ చేత్తో ఒక్కగుక్కెడేనా నీళ్లుపోస్తేనేగాని ఈజీవివెళ్లదు' అంటూ ఆరంభించింది.

మీరు ఏలూరులోవున్నట్లు మేము చూచాయగా తెలుసుగున్నాం—కాని, మీ సరయిన యడ్రస్సు తెలియక—ఈ రెండుగోజులూ ఆలస్యమయ్యింది.' ఉత్తరం చదువుతోంటే నాకళ్లనీళ్లు తిరిగేయి...

ఇద్దరం వెంటనేలేచి నిలబడ్డాము. నాతల్లి ప్రేమహృదయంలో ఇద్దరంతిరిగి ప్రవేసించగలిగేం. ఆమె ప్రేమమందిరంలో మాప్రణయ సంసారం ఇంక నిశ్చింతగా నడవగలదు—నిశ్చయం!

ఇప్పుడు ఇద్దరమూ అమ్మనిచూడ్డానికి వెడుతున్నాం.—

జ్వరపీడితులకు నూతన నమ్మకము

ప్రఖ్యాతిగాంచిన ఆహారపానీయపు మూలమున పత్యపు సంశయము తొలగించబడినది.
కేవలము నిశ్శక్తులగుట జ్వరముయొక్క ఫలితము. పోగొట్టుకొన్న శక్తిని తిరిగి సంపాదించ లేమని తలతురు. ఈ అశక్తత ఒక్క బలహీనతవల్లనే కాదనియు, వీనికి విషమే కారణ మనియు డాక్టర్లు చెప్పుదురు.

జ్వరపు విషము రక్తములో కలసి అతివేగముగా నరమాంస కండరములలో ప్రవేశించి వాటిని నీరసముగాజేయును. స్వల్పదినములలో జీర్ణశక్తి తగ్గుటచే ఏ ఘనపదార్థమును తీసుకొనలేరు. సత్తువనిచ్చు ఆహారమును తీసికొనునట్లు రోగిని ప్రోత్సహించిన ఈ జ్వరబాధను చాలవరకు తగ్గించవచ్చును. శక్తి విహీనమైన దేహమునకు, తిరిగి శక్తిని చేకూర్చుటకు కావలసిన సత్తువ నిచ్చు పదార్థము హార్లిక్సునందున్నది. ఇది జీర్ణశక్తికి ఎలాటిహాని కలుగజేయదు. తేర్గడకాలము తగ్గించును. సులభముగా జీర్ణమగును గనుక చాలమట్టుకు అన్ని ఆస్పత్రులయందు జ్వరబాధితు లకు ఇచ్చు ఏర్పాటు చేసినారు.

H. 462 A.

భావతరంగిణి

"ఒకవైపునుంచి గొడ్డలిపెట్టు, ఇంకొకవైపునుంచి కత్తిపోటు, మరొక దిక్కునుంచి లాఠీ చుట్టునూ, సర్వత్ర తిట్లు తన్నులు, వీటన్నిటిమధ్య శాంతముగా ప్రేమభావముతో నేనుండి, ఇతరులున్న అట్లే వుండవలసినదని కోరుతూ, చిట్ట చివరకు ప్రసన్నవదనముతో, చిరునగవు పెదవులపై తొలుకాడు స్థితిలో నేను మరణించగలిగినయడల అప్పుడు నా అహింస నిర్దుష్టమనీ, యదార్థమనీ చెప్పవీలగును. అవకాశము కొరకే నేను తపించుచున్నాను. అట్టి అవకాశమునే అన్వేషించు చుండవలసినదిగా కాం గ్రెసువాదులను హెచ్చరించుచున్నాను."

—మహాత్మ గా

◆ ◆ ◆

"శాంతి సంపాదనమే స్త్రీల విధి. కులాలనడుమ శాంతి, దేశాలనడుమ శాంతి, స్త్రీలు పూ నిదే ప్రపంచంలో శాంతి సుస్థిరంకాదు. పురుషులు విఫలులైన యీచోటకూడా స్త్రీలు నెగ్గగలరు; ఏ స్త్రీలు జాతిని వెలయించే మాతృమూర్తులు."

—సరోజినీదే

◆ ◆ ◆

"ప్రస్తుతం మనదేశంలో, ముఖ్యంగా మన స్త్రీ సముదాయంలో పారమార్థిక చింత అనేది క తోను డంబంతోను కూడుకున్నదిగా ఉంటున్నది. పుణ్యాపేక్ష చేతనే స్త్రీలీ మాయావాగురులలో చి కుంటున్నారు; భ్రష్టలౌతున్నారు. గురుశుశ్రూషలు శృంగార రసప్రకరణాలుగాను, భజనతంతులు క్రీడలుగాను పరిణమిస్తున్నాయి. ఏమితప్పుచేసినా భగవంతుణ్ణి స్మరిస్తూవుంటే చాలునను దురభిప్రా స్త్రీలను తప్పుత్రోవపట్టిస్తున్నది. ఏ భగవద్గీతాదివేదాంత గ్రంథాలనుజూపి నేడు గురువులు స్త్రీ వంచిస్తున్నారో, ఆగ్రంథములలో భక్తిజ్ఞానవైరాగ్య లక్షణాలు అతి నీతిబద్ధమైనవిగా చెప్పబడియున్న నటనలతో కాలక్షేపంచేయడమే మంచిపద్ధతని చెప్పలేదు. స్త్రీలీ విషయాలను చక్కగా తెలుసుకో యీ మాయా కలాపంతో మోహితులవడం ఉచితంగాదు."

—కనుపర్తి వరలక్ష్మ

(బెజవాడ యువతీ ప్రార్థన సమాజవార్షికోత్సవ అధ్యక్షోపన్యాసం

◆ ◆ ◆

"ఈకాలములో కళాశాలలలో విద్యనేర్చుట అందఱకును వీలైన విషయముకాదు. బాలురతోకలిసి చదువుటలో కుట్టు, సంగీతము మొదలగునవి నేర్చుట యసంభవము. సంస్కృతమైనను వరకు చదివినచో, సంస్కృతవిద్యార్థులు ఏరెండుమూడు కావ్యములో నేర్చుకొనెదరుకాని యంత నెక్కువ సంస్కృతము వారికిరాదు. సంస్కృతమందును, తెలుగునందును, ప్రత్యేకకృషి చేయదలచు అందును బాలికలకు, కళాశాలలో నవకాశముతే లేవు. అందువలన ప్రత్యేక సంస్కృతపాఠశాల స్థాపి దేశభాష లభివృద్ధియై, పురాతన సంస్కృతభాష పునరుద్ధరింపబడు నిమిత్తము, బాలురకుగూడ నిట్టి శాలలు స్థాపింప బడవలసిన సమయమిది."

—మల్లిపూడి లీలావతిచెల్లయ్యా

(శ్రీ కాకినాడ విద్యార్థినీ సమాజపు వార్షికోత్సవం

వాహినివారి ‘సుమంగళి’లో

మిస్. కుమారి.

బందరు లేడీ ఆంప్థిల్ ట్రైనింగుస్కూలు వార్షికోత్సవము



విద్యార్థినులు ప్రదర్శించిన 'రంగూన్ రాడి'లో నొకదృశ్యము.



'కింగ్ జాన్' అను ఇంగ్లీషునాటకములో నొక దృశ్యము.

తాపక్రమం

"వసంత"

అది వేసవి. ఎండవేడిమికి శోషిల్లి, నిద్రించి లేచుసరికి 4 గంటలయింది. స్వరాజ్యమైదానంలో ఒక ప్రసిద్ధ దేశనాయకుడు 4½ గంటలకు ఉపన్యసిస్తాడను కరపత్రం అప్పుడే చూచి, ఎండ మండుకు పోతూన్నా వెళ్లక తప్పదని దుస్తులు వేసికొంటున్నాను. పడమరనున్న చిన్న మేఘం కొంపమునిగినట్లు ఆకాశ మంతా చరచర అల్లుకుంటూంది. ఒక్కక్షణంలో ఆ మేఘం ఎఱ్ఱవారింది; గాలి ఝూంకారంతో రేగింది, దుమారం భీభత్సంగా పైకెగిరి మిన్నుముట్టుతూంది. వరండాలోనున్న పుస్తకాలు, బట్టలు భద్రపరుద్దామని గృహిణి వచ్చింది. ఇంతలో గాలి తగ్గి గోలీలంత వడగండ్లు టపటప కురియ నారంభించాయి. 'వడగండ్ల వాన' అని పిల్లలు ఉత్సాహంతో కేకలు వేస్తూ పరుగుపరుగున డాబామీదికివచ్చి వడగండ్ల నేరుకొంటు న్నారు. కొంతసేపటికి వడగండ్లు ఆగిపోగా ధారాపాతంగా చల్లనివాన కురియ ప్రారంభించింది.

'ఏమండీ నీటి ఆవిరే మేఘాలని అంటారుకదా, ఆకాశంనుండి ఈ వడగండ్లు ఎలా ఊడి పడ్డాయండీ?'

'వడగండ్లంటే ఏమిటని నీ అభిప్రాయం?'

'మంచుముక్కలే కదండీ! ఆ చల్లదనం ఓర్చుకోలేక చెయ్యి, నోరూ 'కాలిపోతున్నాయి' అంటూ పిల్లలు ఎలా ఏరుకొని తిన్నారో చూడలేదండీ?'

'అయితే అవి ఎట్లేర్పడ్డాయో, ఎక్కడనుండి ఊడిపడ్డాయో నీవే చెప్పగలగాలి. అసలు వర్షం ఎట్లు పడుతూందో ఎరుగుదువా?'

'ఆకాశంలో మేఘరూపంలోనున్న నీటి ఆవిరి చల్లబడి, ద్రవించి, వర్షంగా పడుతుందని ఇదివరకు చెప్పేరు కదండీ?'

'ఆ నీరు ఆకాశంలో నుండగానే ఇంకా చల్లబడితే?'

'ఘనీభవించి మంచు అయిపోతుంది.'

'ఆ మంచుముక్కలే క్రిందపడినప్పుడు 'వడగండ్లవాన' అంటాము.'

'అయితే, ఎప్పుడోగాని సామాన్యంగా వడగండ్లు కురియవేమండీ?'

'మేఘంలోనున్న ఆవిరి ఆకాశంలో పైకి పోయిపోయి, ఆ ఎత్తున చల్లగాలుల తాకుడికి నీరుగా ద్రవిస్తుంది. నీరుకాగానే గాలికన్న బరువెక్కుతుంది. అంత, తన బరువుచేతనే క్రిందపడుతుంది. ఆ జలం క్రిందపడులోపున ఘనీభవించేటట్లు 0 డిగ్రీకన్న తాపక్రమం తగ్గుట అరుదు. 0 డిగ్రీపై నున్న తాపక్రమంలో నీరు ద్రవస్థితిలోనే ఉంటుంది. కాబట్టి సాధారణంగా నీటివానే కురుస్తుంది. కాని, ఇట్టి వేసవికాలంలో మిక్కుటమైన వేడిమికి గాలి త్వరగా వేడెక్కి తేలికయి పైకి లేచినప్పుడు, ధూళిరేణువులు వాతావరణంలో

అధికంగా నున్నప్పుడు దట్టమైన మేఘాలు ఏర్పడుతాయి. అవి చల్లబడి, వర్షబిందువులయి తుపా వాయువేగంచేత పైపైకి ఎత్తుకొనిపోబడుతాయి. ఆ ఊర్ధ్వగమనంలో ఘనీభవించి మంచుముక్కలౌ అప్లేర్పడిన చిన్న హిమబిందువులు క్రిందకు కొంతజారి, నీటిని కొద్దిగా సంపాదించి, ఆ తుపాను అల్లకల్లోలంలో తిరిగి పైకెగసి ఘనీభవిస్తూ పరిమాణంలో పెరుగుతాయి. ఆ సమ్మర్దంలో అప్పు రెండేసి కలిసి సుమారు 4 అంగుళాలు ఉరువుగల వడగల్లు అవుతుంటాయి. అందుచేత వాన పడు వర్షబిందువులు ఘనీభవించునంత చల్లదనానికి స్వాధీనమయినప్పుడే వడగండ్లవాన కురుస్తుంది. అది సంభవింపనేరదు. ఇట్లు, వేసవిలోనే సాధారణంగా వడగండ్లవాన కురియుటకు హెచ్చుగా అవకాశ ఈ నాటకమంతట్లో నాయకత్వంవహించి వర్షస్వభావం నిర్ణయించేది తాపక్రమం. 100 డిగ్రీలకన్న తాపక్రమంలోనున్న ఆవిరి అకస్మాత్తుగా 0 డిగ్రీలకు పడిపోయినప్పుడే కదా వడగండ్లు ఏర్పడుతా లేనప్పుడు సామాన్యవర్షమే. వేడిచేత ద్రవ్యంయొక్క అవస్థలలో కలుగు మార్పులు నేనిదివరకు చె జ్ఞాపకమున్నాయా?'

'ఆహా, వేడిచేసినకొద్దీ ఘనపదార్థం ద్రవంగా మారుతుందని, ద్రవం వాయువుగా మారుతు చెప్పినదేనా? వాయువు నింకా వేడిచేస్తే ఏమవుతుందండీ?'

'తాపక్రమం హెచ్చగుతుంది. తాపక్రమానికిమాత్రం ఒక విశేషముంది. ఏదోవిధంగా ప యొక్క తాపక్రమం ఎంతవరకైనా హెచ్చుచేయవచ్చును గాని, మితిలేకుండా మన ఇష్టానుసారము త తగ్గించలేము. పదార్థాన్ని వేడిచేసినప్పుడు తాపక్రమం అధికమై, చల్లార్చినప్పుడు తాపక్రమం తగ్గుతుంది అట్టి సందర్భంలో పదార్థమందలి వేడిమిని పూర్తిగా తీసివేయుటకన్న తక్కువగా దానిని చల్లా సాధ్యంకాదు. అనగా వేడిమి తీసివేయగా తుదకాపదార్థం నిరుష్ణస్థితికి వచ్చును. అట్టి స్థితిలో దాని తా క్రమం కేవలం శూన్యం. ఆ తాపక్రమాన్ని 'పరమశూన్యం' (absolute zero) అన్నారు. నీరు ఘనీభ తాపక్రమం 0 డిగ్రీలు అంటారు. ఆ 'సున్న' పరమశూన్యంగాదు. తాపక్రమం కొలుచుటకు అనేకమా లున్నాయి. అందు 'సెంటిగ్రేడ్' అనే మానంలో నీరు ఆవిరి అయే తాపక్రమాన్ని 100 డిగ్రీలు అని ఘనీభవించు తాపక్రమాన్ని 0 డిగ్రీలు అని నిర్దేశించి ఈ రెండిటికి గల అంతరాన్ని 100 సమానభా చేసేరు. ఈ మానంలో 0 డిగ్రీలుకన్న తక్కువ తాపక్రమాన్ని ఋణసంజ్ఞతో సూచిస్తారు. 0 డిగ్రీ సుమారు 40 డిగ్రీలు తక్కువ తాపక్రమమందు పాదరసం ఘనీభవిస్తుంది. సంప్రదాయప్రకారం ఆవిషయ 'పాదరసం ఘనీభవించు తాపక్రమం - 40 డిగ్రీల సెం.' అంటారు. పరమశూన్యం ఈ మానంప్రకారం 273 డిగ్రీల సెం. అంతకన్న తక్కువ తాపక్రమం జగత్తులో ఎక్కడాలేదని చెప్పవచ్చును.'

'ఎందుచేత?'

'అంతకు తక్కువగా పదార్థాన్ని చల్లార్చలేమని. పదార్థంలో ఉష్ణశక్తి ఉందిగదా. ఆ ఉష్ణ మూలంగా దానికి తాపక్రమం కలుగుతుంది. ఉష్ణం హెచ్చినప్పుడు తగ్గినప్పుడు క్రమంగా తాప హెచ్చడం తగ్గడం జరుగుతుంది. 0 డిగ్రీల సెం. తాపక్రమంవద్ద 1 ఘ|| అం|| పరిమాణంగల వాయువును విచారిస్తే దాన్ని వేడిచేసినప్పుడు తాపక్రమం తోపాటు పరిమాణంకూడ పెరుగుతుందని ఎరుగుదుము. తాపక్రమం 1 డిగ్రీ సెం. అధికమయ్యేటట్లు వేడిచేస్తే దాని పరిమాణం 1/273 ఘ|| అం|| పెరుగు తాపక్రమం 10 డిగ్రీల సెం. అధికమయినప్పుడు పరిమాణం 10/273 ఘ|| అం|| అధికమౌతుంది. శాస్త్ర

273 డిగ్రీలు సెం. హెచ్చయినప్పుడు పరిమాణం 273/273 లేక 1 ఘ॥ అం॥ హెచ్చవుతుంది. ఆ వాయువులో ఉష్ణశక్తి ఉన్నట్లు ఒక సంచిలో దమ్మిడీలున్నాయనుకొందాము. ఆ వాయువుని వేడిచేసి ఉష్ణశక్తిని చేర్చినప్పుడుకదా తాపక్రమం హెచ్చగుట! 1 డిగ్రీ సెం. తాపక్రమం పెరిగినప్పుడు సంచిలో ఒకదమ్మిడీ పడవేసినట్లు భావించుకొందము. ఇట్లు వాయువుని 10 డిగ్రీల సెం. వరకు వేడిచేస్తే సంచిలో 10 దమ్మిడీలు, 273 డిగ్రీల సెం. వరకు వేడిచేస్తే సంచిలో 273 దమ్మిడీలు పడవేసినట్లు, ఇట్లు, డబ్బిచ్చే దాతలెవరైనా ఉంటే ఎంతధనమైనా సంచీలో వేస్తూఉండవచ్చును; అభ్యంతరం లేదుకదా? ఆవిధంగానే పదార్థాన్ని ఎంతైనా వేడిచేసి తాపక్రమం వృద్ధిచేయవచ్చును.

పై విధానానికి వ్యతిరేకంగా ఆ ఘ॥ అం॥ పరిమాణంగల వాయువుని చల్లార్చడం మొదలుపెట్టినప్పుడు దానిలోనున్న ఉష్ణశక్తి క్రమక్రమంగా పైకిపోతుంది; దాని తాపక్రమం తగ్గుతుంది, పరిమాణం కృశిస్తుంది. 1 డిగ్రీ సెం. తాపక్రమం తగ్గినప్పుడు పరిమాణం 1/273 ఘ॥ అం॥ తగ్గుతుంది; డబ్బుల సంచిలో 1 దమ్మిడీ తరిగినట్లు. ఇట్లు ఒక్కొక్క అంశం తాపక్రమం తగ్గినప్పుడు ఒక్కొక్క దమ్మిడీవంతున సంచీలో నుండి తీసివేస్తూ ఉండాలి. సంచిలోనున్న ధనం నియతమైనది. దమ్మిడీ దమ్మిడీ చొప్పునైనా తీసివేస్తూన్నప్పుడు కొంతసేపటికి సంచి ఖాళీకాక తప్పదు. 273 మార్లు తీసివేయడానికి తగినంత ధనమున్నదని తెలిసింది. అట్లే, వాయువులోనున్న ఉష్ణశక్తికూడా నియతమే. దాని తాపక్రమం ఒక్కొక్క అంశంవంతున తగ్గేటట్లు ఉష్ణశక్తిని కొద్దికొద్దిగా దానినుండి తీసివేస్తూంటే కొంతసేపటికి ఉష్ణశక్తి అంతా పైకిపోతుంది. అప్పుడా పదార్థం నిరుష్ణస్థితికి వస్తుంది. ఆ స్థితిలోని తాపక్రమమే పరమశూన్యం. అందుకనే అంతకు తక్కువ తాపక్రమం జగత్తులో ఉండుటకు వీలులేదనడం.'

'నిరుష్ణస్థితిఅంటే ఉష్ణమేమీ లేనట్టిస్థితి కదండీ? అయినప్పుడు ఉష్ణంలేక పోవచ్చునుగాని అంతకన్న చల్లనిస్థితి 'శీతలస్థితి' ఉండరాదూ? అప్పుడు తాపక్రమం పరమశూన్యంకన్న తక్కువగా ఉండవచ్చునే.'

'ఉష్ణం, శీతలం; వేడి, చలువ అనునవి సాపేక్షపదాలు. వేసవికాలంలో ట్రంకుపెట్టె వేడిగా ఉంటుంది. బీరువాదానంత వేడిగాఉండదు. మంచుముక్క పట్టుకొన్న చేతిమీద నూతి నీరుపోస్తే ఆనీరు వేడిగాఉన్నట్లనిపిస్తుంది. వేడికాఫీగ్లాసు పట్టుకొన్న చేతిమీద ఆనీరే పోసినప్పుడు అది చల్లగా ఉన్నట్లు తోస్తుంది. మన అవస్థాభేదాలనుబట్టి నాకు వేడిగా ఉన్నది నీకు చల్లగా పరిణమించవచ్చును. కాని, పదార్థాలకు వాటి అణువుల నిరంతర సంక్షోభమే వేడిగా పరిణమిస్తుందని, పదార్థాలను వేడిచేసినప్పుడు ఈసంక్షోభం తగ్గుతూఉంటుంది; మహావేగంతో పరుగిడు అణువులస్పందం, వేగం తగ్గుతుంది. తగ్గితగ్గి తుదకు చరమావస్థలో నిస్పందంగా కదలికలేకుండా ఊరుకొంటాయి. అంతకన్న జడత్వం ఊహించుకొనలేము; సాధ్యమూకాదు. ఆ అవస్థలో పదార్థమందుగల ఉష్ణం శూన్యము. అందుకే అది నిరుష్ణస్థితి అయింది; అప్పటి తాపక్రమం పరమ శూన్యం అయింది. ఈ పరమశూన్యం డిగ్రీగాభావించి తాపక్రమాన్నికొలిచే 'పరమమానం' **Absolute scale** ఒకటి ఉంది. ఆమానంలో నీరుఘనీభంచు తాపక్రమాన్ని—అనగా డిగ్రీ సెం.—273 ప. అని నిర్వచించాలి. మంచు తాపక్రమంకన్న తక్కువ తాపక్రమం మనకు నిత్యజీవితంలో సామాన్యంగా జతపడదు. కాని, అతి తక్కువైన మంద తాపక్రమాలలో ద్రవ్యంయొక్క నటన ఆత్యద్భుతంగా ఉంటుంది. ఆనాడు ద్రవపవనం తెచ్చేను జ్ఞాపకముందా?"

'లేకేమి? అది పోసికదూ చక్కని గ్లాసు ముక్కలు చేసేరు? నిష్కారణంగా పిప్పిఅయిపోయి కదండీ!'

'గ్లాసుపోతే పోయింది కాని దానివల్ల నీవు సంగ్రహించిన విజ్ఞానం సామాన్యమైనదా? కేమి. వాయురూపంలో నున్న గాలి—193 సెం. వద్ద ద్రవిస్తుంది. పరమమానంలో ఆతాపక్రమం 80 డి అంతకన్న తక్కువ తాపక్రమంలో ద్రవంగా ఉన్న గాలి-193డిగ్రీ సెం. వద్ద మరుగుతుంది-నీరు 100డి వద్ద మరిగినట్లు. ఎట్టిరంగు లేకుండా స్వచ్ఛమైన నీటివలెనున్న ద్రవపవనం క్రిందపోయగా ఎంత రంగా గెంతులువేసింది?'

'అదేనండీ! నేలను తాకితే పాపమేమో అన్నట్లు ఒక్కొక్కచుక్క తుప్పునగెంతుచూ పోయిందండీ. ఎందుచేతనో?'

'ఎర్రగా కాలుతూన్న పెనంమీద నీటిచుక్కలు వేస్తే గెంతవు? భూమియొక్క తాప సుమారు 30 డిగ్రీల సెం., ద్రవపవనానిది—193 డిగ్రీల సెం. 200 డిగ్రీల సెం. పైగా వ్యత్యాసం గ చేత ఆద్రవం వాయువుగా మారిపోడానికి ఉబుకుతూ ఉంటుంది. నీరు మరిగినకన్న ఎక్కువ త్వరలో ఆద్రవంమరిగి, కుతకుతఉడికి, గాలిగా మారిపోతుంది. ఆ ఉద్వేగానికి అమిత తాపక్రమమే

'ఆద్రవపవనంలో పడవేసిన పచ్చిద్రాక్షపండ్లు, పచ్చిమిరపకాయలు, కమలాతొనలు తెల్లగానూ, గట్టిగానూ ఎలా అయిపోయేయండీ? ఎంత ఆశ్చర్యం! సుత్తితో మొత్తితేనే కాని పండు ముక్కలుకాలేదు; పైగా రాయిని కొట్టినట్లు బొంగుబొంగునశబ్దం!'

'పదార్థం చల్లారిన కొద్దీ అణువులవేగం తగ్గిపోతుంది కదూ. అవి అతి దగ్గర దగ్గరగా బడుతాయి. వాటి సంఘీభావం అపారంగా వృద్ధిఅవుతుంది. సుత్తిదెబ్బతోగాని విడగొట్టబడవంటే లేదు. అంతేకాదు వాటి లక్షణాలు ఎంతో మారిపోతాయి. రాగి, వెండి మొదలగు ధాతువులలో విద్యుచ్ఛక్తి ప్రవహిస్తుంది. అవి మంచి వాహకములే కాని, విద్యుత్ప్రవాహాన్ని కొంతవరకు ప్రతిరోధి వాటి తాపక్రమం తగ్గినప్పుడు ప్రతిరోధంకూడ తగ్గుతుంది......ద్రవపవనం ఎంత ఉపయోగ ఎరుగుదువా? మునుపు కొండలు, బండలు బ్రద్దలుచేయడానికి 'డైనమైటు'అనే మందు ఉపయోగించే ఇప్పుడది అక్కరలేదు. ద్రవపవనం వాడితేచాలు. దూదిపిండుని ద్రవపవనంలో ముంచి ముట్టిస్తే ఏమయి

'అగ్ని తగులడమే తడవుగా మచ్చుకొక్కరేణువైనాలేకుండ భస్మీభూతం అయిపోయింది. దెబ్బతగిలిందేమో అని భయంవేసింది.?

'దానికి కారణం ఎరుగుదువా? గాలిలో పరిమాణరీత్యా 4 పాళ్లు నత్రజని 1 పాలు (ప్రాణవాయువు)గలవు. ద్రవపవనంయొక్క తాపక్రమం-193 డిగ్రీల సెం. ద్రవనత్రజని తాపక్రమం-19 సెం. ద్రవఆమ్లజనిది—183 డిగ్రీ సెం. అగుట ద్రవపవనంలో సుమారుగా అంతా ఆమ్లజనే ఉం ఆమ్లజని గొప్ప దాహధారకము. ద్రవ్యంమండి భస్మం కావడానికి ఎంతైనా దోహదంచేసేది గాలిలో 5 కి 1 పాలు ఆమ్లజని ఉండబట్టి ఏది ముట్టించినా మండుతూంది. ఇక, ఉన్నదంతా అయితే చెప్పనక్కరలేదు. డైనమైటుపయోగించినప్పుడు ఒక్కొక్కప్పుడది తక్షణమే కాలేదికాదు లేదు కదా అని పనివాండ్రు దగ్గరగా వెళ్లేసరికి హఠాత్తుకాపేలి జీవనష్టం కలిగేది. ద్రవపవన

అపాయం, ప్రమాదంలేదు. అంటుకొంటే వెంటనే అంటుకొని పేలడం, లేకుంటే వాయువై హరించిపోవడం. జనక్షేమానికి విజ్ఞానం ప్రసాదించిన అనేక సాధనాలలో ఇది ఒకటి. అయితేనేమి, ముఖ్యంగా ఈయుద్ధంతో విజ్ఞానం అత్యంత నిరసనకు గురిఅయిపోయింది.'

'మీ సంభాషణలన్నీ నాకు స్వప్నప్రాయంగా ఉంటాయి. మీతో మాట్లాడినప్పుడల్లా విజ్ఞానం యొక్క గొప్పతనం, ఉపయోగం, సుఖజీవనానికి అవసరమే. చెవులలో గింగురుమంటూ ఉంటాయి. మా క్లబ్బులోనైతేనేమి, ఇతరులతో ప్రసంగించినప్పుడైతేనేమి విజ్ఞానంయొక్క దౌర్జన్యం, రాక్షసత్వం, జీవులకది చేస్తూన్న ద్రోహముతప్ప వేరు స్ఫురించవు. నాకంతా అగమ్యగోచరంగా ఉంటుంది; మతిపోతుంది.... ...వేళ ఎంతయిందండీ?'

'అయిదున్నర.'

'అయ్యో, పిల్లలభోజనాలీవేళ ప్రొద్దుపోతాయి. ఈ వానమూలాన ఎంతసేపు కూర్చుండిపోయాను' అంటూ వెళ్లిపోయింది.

• స్థైర్యము •

శ్రీమతి గంటి కృష్ణవేణమ్మ

సంగరరంగమా? రిపుల సంగడమా మదిధైర్యమూనగా
బంగరు మేడలోపలను ప్రౌఢయు, నొంటరి సుందరాంగియా
అంగన కామబాణవివశాంగి దనంతటదానె పైకొనన్
భంగములేని వార్ధియటు బాపురె! యుండగ నీకు జెల్లెపో.

ఎలజవ్వనంపు తీయతలఁపున వలపులు దొంతరలై గిలిగింతపెట్ట
క్రొంగొత్త బెళుకు జూడ్కుల ప్రౌఢతనపు నీడలు తెలిగన్నుల వెలికిదోప
ముసిముసి నవ్వుల నెసగువెన్నెలలోన కెమ్మోవి పగడంపు కెంపుదనర
మిసిమించు మైజిగి పసిఁడిచాయలు క్రొత్తజిలుగు దువ్వలువపై నలముకొనగ
రాచఠీకఁపు వయ్యారము గోచరింప కడుముదంబున వచ్చిన కాంతతళుకు
చేతలన్నియు నీముందు జెదరిపోయె హృదయస్థైర్యమునకు నీకు నీవెసాటి.

ధర్మమార్గానువర్తివి, ధైర్యమూని సత్యపథమున నిలిచి విశాలయశము
గాంచితివి; దానతనకళంకంబువాసి చలివెలుంగు వంగడము ప్రశస్తిగాంచె.

ధనమును ప్రాణము తృణముగ ననఘాశీలంబుగావ నర్పించి యశం
బునునారవి తారకముగ నొనరించిన నీదు త్యాగముత్తమము గదా.

తనుగని వేడిమాట పినతల్లి వచింప ధ్రువుండు వన్నెకె
క్కెను పినతల్లి యీర్ష్యనులికింపగ రాముడు కీర్తిగాంచె నా
యనువున బిన్నతల్లి విషయంబున నీకు ప్రశస్తివచ్చె నెం
దును సుగుణంబులన్నియును దోషులచేతనె వన్నెకెక్కెడిన్.

ధర్మమునకయి ప్రాణమే ధారవోసికొన్న, నీ పవిత్రచరిత్ర విన్నజనుఁడు
భళిర! సారంగధరయని బలికి, మెచ్చి ప్రీతి ధన్యవాదంబు లర్పింపకున్న.

సంగీతోపాధ్యాయ
శ్రీ గాలి పెంచల నరసింహాచార్య
మ్యూజిక్ డైరెక్టర్.

బేగడరాగము — ఆదితాళము

ఆరోహణ: సగరిగమపదనీదపస	,, - కా. చ. ,, శు. అం. చ. ,,
అవరోహణ: సనిదప మగరిస	స ని ద ప మ గ రి స

వక్రమ సంపూర్ణము

29-వ మేళకర్తయగు "ధీరశంకరాభరణము" యందు జన్యము

ప్రేలికి నాలుగుఅక్షరముల చొప్పున ఘాతనుండి క్రిందికాలము మూడుఅక్షరములు త్రోసి పాడుకొనవలయు

పల్లవి: నీనామ భజనా నందాబ్ధి మునిగీ
నిను జేరగోరే ధన్యుండెవండో॥ నీనామ

అనుపల్లవి: ఏనాటికైనా వెతదీర్తువనుచు
యెన్నోన్నోగతుల నినువేడుచుంటి నీనామ

చరణము: మానుషంబువీడి మహినినరులగూడి
హీనుండనైతి ఇతమెరుంగలేక
దీనుండనై నిన్నే దలచుచుంటి
దానవాంతకానన్ దరిజేర్చుమంటి॥ నీనామ

పల్లవి.	:	గామాపాదాపా	దరినీ-,, దా	పామా-,, పా
; ; ;		నీఈనాఆమా	భజనా-,, నం	ందా-,, బ్ధి
గరీసా,	:	గామాపాదాపా	దరి సగరి స. నీ	,, దప-మాపా
మునిగీ,	:	నీఈనాఆమా	భజ నఅఅఅ నం	,, దఅ-అబ్ధి
గరీసా,	:	సరిసనిదా ,, పా	సా,సా,నిస	గరిగమదపమప
మునిగి,	:	నిఇనుఉజే ,, రా	గో,రే,ధఅ	అఅన్యుం౦౦౦డెవ
గరీసా,	:	సగరిసనిసదాపా	సా,సా,నిస	గరిమపదపసని
వండో,	:	నిఇనుఉజెఏఏరా	గో,రే,ధఅ	అఅన్యుం౦౦౦డెవ
దపమగరిస	:	} నీనామభజనా॥		
వండొఒఒ	:			

అనుపల్లవి.	: గామాపాదాపా	సా,సా,నిస	గరిగా-,, మప
; ; ;	: ఏఏనాఅటి	కై,నా,వెఎ	తఅదీ-,, రుఉ
గమరీసా	: మపదప సనిదపరీ	సా,సా,సగ	రీగా-గమపా
వఅనుచు	: ఏఎఎఎనఅఅఅటి	కై,నా,వెఎ	తదీ-ఇఇర్తు
గమరీసా	: ససగాగమపదపా	రిరిసా ,, మప	దపపద-నీదప
వఅనుచు	: ఎఎఏన్నెఎఎఎన్నొ	గతులా ,, నిఇ	నుఉవెఎ ఏడుఉ
మపగరిసా	: ససగాగమపదపా	గమరీ ,, సా	,నీ,-దపమప
చుంంంటీ	: ఏఎఏన్నెఎఎఎన్నొ	గతులా ,, ని	,ను,-వెఎడు
గమరీసా	: } నీనామభజనా॥		
చుంంటీ	:		
చరణము.	: పాగామా ,, మా	దపదా ,, మద	పాపమగామా
; ; ;	: మానుషం ,, బు	విఇడీ ,, మహి	నీనఅరూలా
రీ,గా,	: మగమాపా ,, మా	దపదా ,, మప	దపనీదపమప
గూ,డీ,	: మఅనుషం ,, బు	విఇడీ ,, మహీ	నిఇనరుఉలఅ
మా,గరిగ	: గమదామా ,, పా	మపగరి-సాసని	పాపమగామా
గూ,డిఇఇ	: హిఇఈనుం ,, డ	సైఇఇఇ తీఇత	మెరుంంగా
పా,పా,	: గమదాపదనీదప	మపగరిసా సని	దపసని-గరిగమ
తే,కా,	: హిఇఈనుండఅ	సైఇఇఇతీ ఇతే	మెఏరుంంగఅ
పా,పా,	: గామాపాదాపా	సా,సా,నిస	గరిగామాపా
తే,కా,	: దీఈనుండ	సై,నీ,న్నెఎ	ఎఎదలాచు
గమరీసా	: మపదపసనిదపరీ	సా,సా,సగ	రీగా-గమపా
చుంంటీ	: దీఇఇఇనుంంండ	సై,నీ,న్నెఎ	ఏద-లఅచూ
గమరీసా	: ససగాగమపదపా	రిరిసా ,, మా	మాపద-నీదప
చుంంటి	: దఅనావఅఅఅంత	కఅనన్ ,, ద	రిజెఎఏర్చుఉ
మపగరిసా	: ససగాగమపదపా	గమరీ ,, సా	నీదపమాపా
మంంంటీ	: దఅనావఅఅఅంత	కఅనన్ ,, ద	రీజెఎఏర్చు
గమరీసా	: } నీనామభజనా॥		
మంంటీ	:		

చిట్టస్వరము.

	: గామపదపనీదప	సాసా నిసగరి	గామాగరిసరి
; ; ;	నీదపదపసాగమపదాపరిస	,సపద నీదప	మా,గరిరిసా
,దపమగరి	:	(నీనామభజనా నందాబ్ధిమునిగీ)	

హోటల్ బృందావన్

ఆధునిక పద్ధతులపై నెలకొల్పబడి, భోజనమునకు, నివాసమునకు యోగ్యమైన వసతులు, నిర్మల వాతావరణముగల శాకాహారములతో కూడిన బ్రాహ్మణుల హోటలు. రేస్‌కోర్సుకు రెండునిమిషములలో పోవచ్చును. స్టేషనునుండి 5 నిమిషములలో రావచ్చును.

శృంగారముగా అలంకరింపబడిన గాలివచ్చు సువిశాలమగు గదులు, ఆధునిక ఆరోగ్య పరికరములు, గ్యారేజిలు, టెన్నిస్‌కోర్టు, కుటీరములు, విశాలమైన తోట, అనుకూలమైన చల్లని వాతావరణము మొదలైన సౌకర్యములన్నియు కలిగియున్నది.

హోటల్ బృందావన్

కుమారా. పార్కుకు ఎదుట

హై గ్రౌండ్సు — బెంగుళూరు.

"నిస్సందేహముగ నేను
సౌఖ్యముగనున్నాను… లక్సు నాదుస్తులను
మెత్తగ జేయును!"

చన్నీరును, ఒక లక్సు
ప్యాకెట్టు మాత్రమే నీకు
కావలెను.

చన్నీటిలో లక్సు నురుగును ధారాళముగ చేయుము, ఈ నురుగు వస్త్రములో బాగుగ చొచ్చునట్లు నురుగులో వస్త్రమును మునికి పోవునంతవఱకు రుద్దుము. పిదప ఈ వస్త్రమును మూడు తడవలు వెచ్చెరు నీటిలో బాగుగ కుదిలించి జాడించి తీయుము. పిండకుము. బాగుగ అదిమి వస్త్రములోని తడిని పోనివ్వుము. నీడలో ఎండ పెట్టుము.



బిళ్ళ సబ్బులతో నుతుకుటయు, మోటుగనుతుకుటయు దుస్తులను గ్రుచ్చునట్లును ముడుచుకొనునట్లును చేయును. గనుక బిడ్డ కోపముతో ఏడ్చుట వింతకాదు! లక్సు ఆ దుస్తులను మెత్తగను ఉండవలసిన రీతిగనుండువట్లును చేయును. రంగును పోనివ్వక ప్రకాశముగనుండునట్లు చేయును. చాల సన్నటి గుడ్డలుకూడ చెడవు.

లక్స్

త్వరితముగ పని చేయును! వాడుట
సులభము! సౌఖ్యము!
ఇండియాలో అప్పటమైన ప్రత్యక్షవగపు
నూనెలతోనే తయారగును.

కొంత లక్సును వేడి నీటిలో కరగనిమ్ము దీనిలో తలరుద్దుకొన్న, వెండ్రుకల బాగుగ శుభ్రపరచి నురుగు చేయును.

లక్సు తల రుద్దు
కొనుటకు చాల
మంచిది

LX. 4-97—TL LEVER BROTHERS (INDIA) LIMITED

ఎనామెల్ బోర్డులు

మీ
వ్యాపారమును
వృద్ధిచేయును

శాశ్వతము
శోభావంతము

మద్రాస్ ఎనామెల్ వర్క్సు లిమిటెడ్
65 సైడన్‌హామ్సు రోడ్డు మదరాసు.



డోంగ్రేగరి
బాలామృతము

బిడ్డలకు
బలవర్ధకమైన
ఆదర్శ ఔషధము



పాఠకులకు బహుమానము

గోధుమ ధాన్యముతో తయారుచేయదగిన, గోధుమఅన్నము, చపాటి, పూరి, ఉప్పుపిండి, గోధుమరవ పకోడి, గోధుమరవ హల్వా మొదలగు పలు విధములైన పదార్థములను తయారుచేయు పద్ధతులు ప్రకటింపదలచినాము. ఈ పదార్థములు మంచి అనుభవజ్ఞానముతో ఎవరు ఎక్కువగా వ్రాసి పంపుదురో వారికి బహుమతి యొసంగబడును.

ప్రతి పదార్థము సరియైన తూనికలతో, కొలతలతో యుండవలయును. చేయు పద్ధతి విపులముగా యుండవలయును.

ఈ విషయములు ప్రతినెల 15-వ తేదీ లోపుగా మా కార్యస్థానమునకు చేరవలయును. కాన పాఠకులను గమనింపకోరుచున్నాము.

'ఈవేళ అన్నంలోకి ఏం చేసుకుందాం ?'

—ఇదిఒక పెద్దసమస్య అయిపోతూవుంటుంది ప్రతిఇంటిలోనూను. ఈ సమస్య పరిష్కారంకోసం ఒకగంట వృథాగా కాలయాపన కావడమూ, దానిమీద ఏదోఒక నిర్ణయానికివచ్చి, ఏదోఒకటి ఆహారంలోకి అమర్చుకోవడమూ జరుగుతూ వుంటుంది. ఇది నిత్యకృత్యాల్లో బీదసాద అనే బేధంలేకుండా ప్రతి గృహంలోనూ చర్చింపబడే విషయమే. ఏదోవకటి చేసుకుని తినడంవల్ల శరీరారోగ్యంచెడి అనేకబాధలకు లోనాతున్నాము కూడాను.

అయితే మానవుల ఆరోగ్యవ్యవస్థలనుబట్టి వారికి కావలసిన పదార్థాలు ఆయాకాలాలకు తగినట్లుగా ప్రకృతి ప్రసాదిస్తూనేవుంటుంది. వాటిని సరియైనరీతుల్లో చేసుకుంటే ఆరోగ్యం పదును తప్పకుండా కాలానికి సరితూగుతాను. ఈ దృష్టితోనే పూర్వులు వీటిని ఆచారమనుపేర మన ఆహారానికి ముడివేశారు.

ఇక యీ ఆచారాలు దేశకాలవ్యవస్థలనుబట్టి కూడా మారూతూవుంటాయి. అందుచేత అందరికిని ఒకే వకమాదిరిగా భోజనపదార్థాలు కుదుర్చుకోవడం కష్టంగావుంటుంది_దేశాచార పరిస్థితులు సమన్వయం చేసుకోనంత వరకూను.

ఈ అభిప్రాయంతో 'గృహలక్ష్మి—పాకకళ' శాఖలో ఒక మాసమునకు తగిన ఒక పట్టిక త
చేసి ప్రచురింపదలచాము. ఆ పట్టికలోని పదార్థాలు ఇంచుమించుగా ఆంధ్రదేశంలో అందరికి సరిపోవ
వుండాలి. పట్టికలోని పదార్థాలు ఏ ప్రదేశంలో వారు తయారుచేసుకున్నా ఆయా సీతోష్ణస్థితులను
దేశకాల పాత్రతనుబట్టీ శరీరారోగ్యానికి సరిపడేవిగా వుండాలి.

కనుక ముందుగా జూలై మాసమునకు—అ నెలలో మనకు లభ్యమయ్యే వస్తువులతో మనం
పదార్థాలు చేసుకొనేందుకు ఆయా జిల్లావాసులగు సోదర సోదరీమణులు వారివారికి సరిపోయే పదార్థ
వ్రాసి పంపినట్టయిన వాటిని సమన్వయంచేసి ఒక పట్టిక తయారుచేసి 'జూలై' మొదటి తేదీకి వె
గృహలక్ష్మి పట్టికలో ప్రకటిస్తాము.

ఇందువల్ల తేలికగా ప్రతిరోజు వంటకాలు తయారుచేసుకొనడం, అవి మన శరీరారోగ్యా
తూగడం మొదలైన ప్రయోజనాలు మనకి సమకూరుతాయి. కనుక సోదర సోదరీమణులు ఈ విషయ
వహిస్తారని ఆశిస్తున్నాము. ఈ విషయాలు జూన్ 20 వ తేదీలోగా మా కార్యస్థానానికి చేర్చగలరని
కోరుతున్నాము.

(ప్రక్క—పేజీ తరువాయి)

మరి కొంతసేపు నిద్రలో వున్నట్లుగా నటించి తన తలదగ్గర వున్న యినుపపెట్టెమీద చేయి
గభాలున లేచి 'అమ్మో, బాబో తేలుకుట్టింది' అని కేకలు వేశాడు. ఆ అరుపువిని భా
కూడా కేకలు వేసింది. యీ గొడవవిని యిరుగుపొరుగువారు అందరూ ఒక్కమా
వచ్చి గుమ్మముదగ్గర నిలచి తలుపుగొట్టారు. కోమటి భార్య తలుపుతీయగానే అం
లోపలికివచ్చి అన్నిమందులూ తెచ్చి కోమటిచేతికి వేసి ఎలావుందని అడగేరు, "అ
బాబోయ్! వేలుమీద బాధ చంకలోకంటా ఎక్కిపోయింది బాబోయ్" అంటూ గ
అరిచాడు. వాళ్లు మళ్లీ మందులు, మంత్రాలు వేసి ఎల్లావుందన్నారు. చేయి
అప్పుడు ఆ షాహుకారు అందరితోను 'అమ్మయ్య! చంకలోంచి బాధ దిగింది
4 గురు మాత్రము ఆమిద్దె దిగలేద'ని పైకి చూపించాడు. అపుడు అందరూ ఆ దొంగ
దింపి పోలీసులకు వప్పజెప్పి ఆ కోమటి యుక్తికి మెచ్చుకొని ఎవరుదారిని
వెళ్లిపోయారు. కథకంచికి వెళ్లింది మనం ఇంటికివచ్చాము."



బాల భాగ్యోదయము

రేడియో మామ కథ

‘కోమటి యుక్తి’

ఒక కోమటి తనయింట్లో దొంగతనంచెయ్యడానికి వచ్చిన దొంగల్ని ఎల్లా పట్టి యిచ్చాడో చూచారా? వినండి ఎంత చమత్కారంగా వుంటుందో......

“ఒక వూళ్లో ఒక కోమటి వున్నాడు. అతడు ప్రతిరోజూ దుకాణంమీద కూర్చుని యేదైన సరకుకోసం వచ్చినవాళ్లకు తక్కువతూచి యిస్తూ, కాని మారకం చెళ్ళని మారని రూపాయలను తీసుకొని అవి యితరులకు తోసివేస్తూ చాలడబ్బు గడించేడు ఆ డబ్బంతా దాచుకొనేందుకు ఒక యినుపపెట్టె కొని, అందులో పెట్టి, అది తన తలదగ్గర పెట్టుకొని చూచి సంతోషించుకొంటూవుండేవాడు. రాత్రి తెల్లవార్లు తనకు నిద్రవస్తే తనభార్య, ఆమెకు నిద్రవస్తే తానూ మేలుకొని పెట్టిని కాపలాకాస్తూ వుండేవారు. అతనిభార్య అతనికి తగినదే దొరికింది. కానీ కూరకొనమంటే దమ్మిడీదికొని రెండు పూటలకి సరిపెట్టేది.

ఒకరోజున అతడు భోజనంచేసి తన మంచంమీద వెల్లకిల పడుకొని ఏదో మరునాటి విషయాలు ఆలోచించుకొంటూ మిద్దెవంక చూచాడు. ఆ మిద్దెపైన 4 గురు దొంగలు చేత కత్తులుపట్టుకుని, నల్లని బట్టలతో కనిపించారు. కేకలుపెడితే తనమీద ఆ కత్తులు గిరవాటేస్తారేమో, వూరుకొంటే ధనం, ప్రాణంకూడా పోతుందేమో అని ఒక ఆలోచన ఆలోచించి కొంతసేపు యేమీ ఎరుగనివాడిలా నిశ్శబ్దంగా వుండి,

(తరువాయి ప్రక్క పేజీలో)

గ్రంథ సమీక్ష

వైద్య విప్లవం

కర్త: శ్రీ అడుసుమిల్లి వెంకటకృష్ణారావుగారు, చంద్రాల, అంగలూరుపోస్టు. వెల 8 అణా

ప్రజానీకంలో సర్వాంగసౌష్టవం వృద్ధిపొందాలంటే వైద్యవిధానంలోకూడా (విప్లవం) వ రావాలని ప్రోత్సహించే గ్రంథమిది. ముఖ్యంగా ప్రకృతి వైద్యసిద్ధాంతములయొక్క ప్రాశస్త్యమును టిస్తూ, టీకాల విధానాన్ని ఖండిస్తూ, దీనిలో అనుభవసిద్ధమైన విషయాలు చాలా వున్నాయి.

ప్రస్తుతం మనదేశంలోనుంచి వస్త్రముల తర్వాత మందులకుగాను పాశ్చాత్యఖండాలకి అమిత డబ్బు పోతోంది. తెల్ల ఏనుగైన యీ పాశ్చాత్య వైద్యవిధానాన్ని అవతలపెట్టి, ప్రకృతివైద్యంవల్ల మా జాతికి చేకూరిన మహత్తరశక్తిని మనం పూర్తిగా వినియోగించుకోగలిగిననాడు మనదేశంలో నేటి ఘో దారిద్ర్యం బీద మరణాలు నిర్మూలమౌతాయి. ఇట్టి ఉత్తమ సందేశాన్ని చాటుతోంది యీ చిన్నపుస్త

రాజ్ఞి చిన్నమ్మారావుగారి జీవితప్రశంస

కర్త: శ్రీ వాజపేయయాజుల రామసుబ్బారాయుడుగారు, బి. ఎ., జటప్రోలు సంస్థానము.

ఉత్తమసతి, దొడ్డఇల్లాలు అయిన శ్రీ రాణి చిన్నమ్మారావుగారి జీవితవిశేషాలను అతిశయో గాని కల్పనలుగాని లేక, చక్కని మృదుమధుర శైలిలో వ్రాయబడినది. గ్రంథము శ్రీ రాణిగారి నుద్దేశిం దైనను ఆదర్శనారీమణికి గావలసిన చక్కని హితోక్తులనిందు చేర్చినారు కవిగారు.

నక్షత్రమాలిక

కర్త: శ్రీ వి. యన్. వెంకటనారాయణగారు, సుబేదారుపేట, నెల్లూరు. వెల నాలుగణా

దైనందిన జీవితకథనంలోని వివిధ సమస్యలను కథారూపంగా చర్చించబడ్డాయి ఇందులో.

రచనావిధానంలో కొంచెం నీరసమైన హాస్యరసం ఎక్కువవడంవల్ల ఉద్దేశం చితికిపోయిం రచన కొంచెం సంస్కరించుకుంటె భావాలకి మంచి కాంతి కలిగేది—గ్రంథకర్తగారు ఇకముందు విషయం శ్రద్ధతీసుకుంటే వీరి రచనలకు మంచి భవిష్యత్తువుంది.

పత్రికా పరిచయం

చిత్రాంగి

సచిత్రమాసపత్రిక. సంపాదకులు: శ్రీ యస్. జి. ఆచార్యగారు, 39 ఆండర్‌సన్ వీధి, జార్జిటౌ మద్రాసు. సాలుచందా ఒకరూపాయి: విడిపత్రిక ఒకఅణా.

ఇదివరకు ప్రజాబంధు మాసపత్రిక యీ నూతన నామంతో వెలువడుతోంది. పేరు క్రొత్తదనం పాటు పాత ప్రజాబంధులోని విషయ సముశ్చయానికి కొత్తదనమూ, తీయందనమూకూడా అధికమయ్యాయి.

రకరకాల శీర్షికలతోటి, వివిధమైన వ్యంగ్యరచనలతోటి చిత్రాంగి కుసుమ కోమలాంగివలె ప్రౌఢలావుంది. ప్రత్యేకవ్యక్తిత్వంగల వివిధమైన శీర్షికల నివ్వటంలో ఆచార్యగారిది అందెవేసినచేయి. కేవలం 'శీర్షికాచార్యులే'—ఈ విషయం ఈ 'చిత్రాంగి'లో ప్రత్యేకతనొంది సార్థకరూపం దాల్చింది.

చలనచిత్రాలు

వసంతసేన

ప్రాచీన కవివరేణ్యులలో ఒకడైన శూద్రకమహాకవిచే సంస్కృతంలో రచింపబడిన 'వసంతసేన' లేక 'మృచ్ఛకటిక', నేటికి తెలుగులోకూడా చిత్రరూపం దాల్చబోతోంది. ఈ సుప్రశిద్దనాటకమును వారువీరు తీయబోతున్నారని అనుకోవడమేకాని ఇంతవరకు రూఢివార్తలు తెలియడంలేదు. చలనచిత్రకళా పరిశ్రమలో విశేషమైన అనుభవాన్ని సంపాదించిన శ్రీ గాలి వెంకటేశ్వరరావుగారి ఆధ్వర్యాన్ని వసుంధరా ఫిలిమ్సు లిమిటెడ్ అను ఒక కంపెనీ రిజస్టరయ్యింది. ఆ కంపెనీవారి నూతన చిత్రమేయిది. శ్రీ గాలి వెంకటేశ్వరరావుగారు దర్శకత్వం వహిస్తారు. సుప్రసిద్ధ చిత్రకారులైన శ్రీ టి. వి. యస్. శర్మగారు ఆర్టుడైరెక్షనును, శ్రీ విశ్వనాధ సత్యనారాయణగారు రచనను స్వీకరిస్తారని తెలుస్తోంది. జూన్ మొదటివారంలో పని ప్రారంభిస్తారట. ప్రస్తుతం కథకుకావలసిన హంగామా, పాత్రలకు ఆకాలంనాటి దుస్తులు వగైరావిషయం పరిశోధనలు చేస్తున్నారు.

ఇల్లాలు

షూటింగు చాలా చురుగ్గా జరుగుతోంది. సిద్ధహస్తులైన శ్రీ రామబ్రహ్మంగారు ఈ చిత్రాన్ని తీర్చి దిద్దుతున్నారు. కాంచనమాల, లక్ష్మీరాజ్యం ప్రధానభూమికలు నిర్వహిస్తున్నారు. త్వరలో విడుదలఔతుంది.

మీరాబాయి

నవ్యకళాఫిలిమ్సువారి ప్రథమ చిత్రమిది. సుప్రసిద్ధ సంగీతదర్శకులైన శ్రీ భీమవరపు నరసింహారావుగారి దర్శకత్వాన్ని అత్యుత్తమంగా తయారౌతోంది. మృదుమధురమైన సంగీతం, హృదయరంజకమైన కళాపాటవంతోటి ఆంధ్రుల నానందింపజేయడానికి త్వరలో పూర్తిఔతుంది.

కళాలక్ష్మికి బంగారు పంట — వాహినివారి

సుమంగళి

ఆంధ్రుల కళాకౌశలానికి ఒక ప్రబలనిదర్శనమై, ఆంధ్రులకుకూడా చలనచిత్రకళా పరిశ్రమలో ఒక అమోఘమైన స్థానం వున్నది అని నిరూపించి ఆ స్థానాన్ని నిర్మిస్తూవుంది వాహినివారి సుమంగళి. కళాపాటవంలో, ఛాయాచిత్ర, శబ్దగ్రహణాలలో, కథాసంవిధానంలో సున్నితమై, సువిశాలమై సొబగుదేరింది.

ప్రధానంగా మనలను ఆకర్షించేది దీనిలోని ఫోటోగ్రఫీ. ఆ కెమెరా యొక్క వన్నెచిన్నెల పరుగులే చిత్రానికి రూపురేఖలను దిద్ది వెలుగువెన్నెలలను సమకూర్చి, జీవంపోశాయి. తరువాత చిత్రంలో ఉపయోగింపబడిన భాష. ఎక్కడా ఎగుడుదిగుడులులేక, మృదుమధురంగా, భావపూరితమై నడచిన ఆపదములయొక్క పొందిక, సొబగు చిత్రానికి కాంతినిచ్చాయి.

"శ్రీ సర్వదా సుమంగళియే."—ఇది యీ చిత్రం ఎలుగెత్తి చాటిచెప్పేది. ఈ విషయాన్ని అన్ని సన్నివేశాల్లోనూ అచ్చుగుద్దినట్లుగా చిత్రించారు నిర్మాతలు. నేటి మనసంఘంలోవున్న అవకతవకలు, ముఖ్యంగా వితంతువుల దుర్భరజీవనాన్ని కన్నులకుకట్టినట్లు చూపించబడింది, దీనిలోని 'అభాగిని' అంతర్నాటకంలో. ఈ నాటకం కేవలం ఈ చిత్రానికి ప్రాణం.

ఇక నటులలో ఎవరిపాత్రను వారు చక్కగా నిర్వహించి చిత్రంయొక్క విజయానికి తోడ్పడ్డా 'పార్వతి' పాత్రను ధరించిన 'మాలతి' ఆ మూలాంతం చిత్రాన్ని పాలించింది. అసలు ఆ పాత్ర చిన్నపి చలాకీతనం, పల్లెటూరి ముగ్ధత్వం, స్త్రీకుండే మృదుత్వం, ప్రాణాలనుకూడా ధారబోసే త్యాగం మొద సద్గుణపుంజాల నన్నిటిని కలిపి ముద్దగాచేసి సృష్టించారు. ఆ పాత్రను హృదయరంజకంగా నిర్వహి 'మాలతి' తనకు గొప్ప భవిష్యత్తును నిర్మించుకుంది. వితంతుపాత్రను (సరస్వతి) కుమారి కడు చాకచక్యం పోషించి ప్రథమశ్రేణికి చెందిన నటీమణులలో ఒక స్థానాన్ని సంపాదించుకుంది.

కథ పెద్దదిగాక తగుమాత్రంగా వుండడంవల్ల, అదీ సడలిపోకుండా ఒకే ఒక బాటలో నడవ వల్ల చిత్రంయొక్క ఆశయం బహుముఖాల ప్రకాశించి ప్రతిధ్వనులనీనుతోంది. వందేమాతరంకంటె విషయం దీనిలో ఒకవిశిష్టత కలగజేసింది. బావివద్ద భామల ప్రసంగాలు, పిచ్చయ్య వెర్రిచేష్టలు మొద సున్నితమైన హాస్యప్రకరణలతోటి, 'ప్రేమమయమీ జగము' 'వస్తాడే బావ' మొదలైన ఆకర్షణీయమై పాటలతోటి చిత్రం చక్కగా తయారై ఉత్తమతరగతికిచెందిన కళాసౌరభాన్ని వెదజల్లుతోంది.

నిర్మాతలైన శ్రీ బి. యన్. రెడ్డి, రామనాథన్, శేఖర్, సముద్రాల రాఘవాచార్యులుగా వందేమాతరంతో వారికళాకౌశలాన్ని చూపించి, 'సుమంగళి'తో దానికి ద్విగుణీకృతమైన కాంతినిగూ దక్షిణహిందూదేశఫిలిం నిర్మాతలలో ఒకవిశిష్టమైన స్థానాన్ని సంపాదించారు.

ప్రొడ్యూసర్లే టెక్నీషియన్లుగా వుండడంవల్ల, 'కళ' సర్వవిధముల సంస్కృతిజెంది, సానబెట్టి వజ్రంలా ప్రకాశిస్తుంది. దీనికి తార్కాణమైన 'ప్రభాత్' వారి వలెనే వీరూ కృషిచేసిననాడు, వాహి వారి పేరు అజరామరమౌతుందనడంలో అతిశయోక్తిలేదు.

ఇటువంటి కళాకుటుంబమే సుమంగళికి పుట్టింటివారు. ఇక యీ కళామూర్తియైన సుమం ఆంధ్రుల ఆశీర్వాదాలను బహుళంగా అందుకుంటుంది.

నేటి సినిమా ప్రపంచాన చోటులేదు

క్రమభావ పరీమళ కావ్యకుసుమ హారముల్ కవితా లలితాంగి కొసఁగు
మధుర మధురార్థక కవికుమార ! నీకు నేఁటి సినిమాప్రపంచాన చోటులేదు.
నాట్యనిపుణత్వ విధిచేత నవ్యభవ్య హావభావ ప్రకటన మర్యాదచేత
తనరఁదగిన నూత్న నటరత్నంబ ! నీకు నేఁటి సినిమాప్రపంచాన చోటులేదు.
సరస సంగీత మాధురీ భరిత లలిత జంత్రవాద్య స్వనమ్ముచే సకలజన మ
నోహర మొనర్చు వీణా వినోది ! నీకు నేఁటి సినిమాప్రపంచాన చోటులేదు.
రుచిరసౌందర్య రేఖా స్వరూపమలరి లలితకళలందు నైపుణి గలిగియుండి, భారత పతివ్రతా
ధర్మపథమునందు, పదము ద్రిప్పకుండిన మానవతిరో ! నీకునేఁటి సినిమాప్రపంచాన చోటులేదు.
ప్రకృతిరమణీయ శోభావిరాజమాన దృశ్య తతులార ! కృత్రిమాకృతికి పాలు
బడక, సహజసౌందర్య రూపమున మీకు నేఁటి సినిమాప్రపంచాన చోటులేదు.

—శ్రీ వారణాసి వేంకటేశ్వరులు

పుష్ప చయము * * *

వీరగున్నమ్మాపురం

ఇటీవల విశాఖపట్నంజిల్లాకు చేరిన మందసా సంస్థానంలో ప్రజలమీద కాల్పులు ప్రయోగింపబడ్డాయి. ఆ ఘోర సంఘటనలో కొంతమంది మరణించారు. వారిలో 'గున్నమ్మ' అనే ఆవిడకూడా వుంది. అప్పుడు మందసా ప్రజలు ఆమె స్మారకచిహ్నంగా 'గుడారిరాజామణిపురం' అనే వూరు యొక్క పేరు మార్చి 'వీరగున్నమ్మాపురం' అని నూతన నామకరణంచేసి ఆమెకీర్తి చిరస్థాయి చేశారు.

మహాత్ముని శిలాప్రతిమ

శ్రీ దర్భాంగా మహారాజావారు మహాత్ముని అర్ధాకృతిప్రతిమను, అనగా తలనుండి రొమ్మువరకు చేసిన ప్రతిమ, వైసురాయిగారికి బహూకరించారు, ఆ ప్రతిమను ఉచితమైన స్థానంలో వారు పెట్టేపూచీమీద. వైసురాయిగారు దానిని అత్యానందంతో స్వీకరించారు. ఆ ప్రతిమ 'క్లేర్ షెరిడన్' అనే ఒక పాశ్చాత్య మహిళామణిచే తయారుచేయబడింది.

లేడీ టైపిస్టులు

మదరాసు గవర్నమెంటువారు స్త్రీలనుకూడా టైపిస్టులుగాను, టెలిఫోన్ గుమాస్తాలుగాను తీసుకోవడానికి నిశ్చయించారు. ప్రస్తుతం ఈ ఉద్యోగాలు మదరాసులోనే ఏర్పాటుచేయబడుతవి. ఈ ఉద్యోగాలు పెళ్లికానివాళ్లకి, బిడ్డలులేని వితంతువులకుమాత్రమే యివ్వబడుతవి. కాని వీరి పనిపాటలలో తృప్తిపడితే, క్రమంగా అన్ని జిల్లాలలోకి వీరిని పాకిస్తారు.

తులసి ప్రభావము

ప్రతిదినమూ తులసిదళములు కొన్ని నములడంవల్ల సంతతజ్వరము, అంటుజ్వరము, ముఖ్యంగా మలేరియా దరిజేరవు. మలేరియాకు, మిరియాలతో తులసిఆకును బాగా మర్దనచేసి నీళ్లలోకలిపి పుచ్చుకోవాలి.

తులసిఆకు కషాయంతో పాలు పంచదారకలిపి సేవిస్తే జలుబు, దగ్గు నయమవుతాయి. కఫము హరిస్తుంది.

నిమ్మరసముతో తులసి ఆకురసముకలిపి పూస్తే గజ్జి, తీట, ముఖముమీద నల్లమచ్చలను తొలగించి చక్కని సౌందర్యాన్నిస్తుంది. మేహవ్రణములు, గడ్డలు, రాచకురుపులు వీటికి తులసిగింజలనూనె అద్భుతముగా పనిచేస్తుంది.

తులసివేరు అరగదీసి ఆగంధముతో వెన్నకలిపి పాముకాటు వేసినచోట పట్టిస్తే విషమును హరించి ప్రాణాపాయాన్ని తొలగిస్తుంది.

తులసియొక్క ఆకు, వేరు, బోదెగింజలు అన్నియు ఔషధములకు మిక్కిలి ఉపయోగపడతాయి. కేవలం దైవాంశ సంభూతురాలు తులసి అనేకాళ మానవులకు తన ఆకులువేళ్లతో కూడా సర్వస్వం ఔషధ ప్రక్రియలకుగా ఉపకరించే త్యాగస్వరూపిణి కూడాను.

సంపాదకీయములు

అఖిలభారత కాంగ్రెసు సంఘము - స్త్రీలశాఖ

అఖిలభారత కాంగ్రెసు సంఘమునందు స్త్రీలశాఖ నొకదానిని ప్రత్యేకించి, ఆశాఖకు శ్రీమ సుచితా కృపాలినిగారిని కార్యదర్శినిగ నియమించుటయు, ముందుగా 1918 సంవత్సరమునుండి కాంగ్రెసు కార్యక్రమమందు పాల్గొని దేశసేవచేసిన మహిళామణుల చరిత్రను సేకరించి గ్రంథరూపమున ప్రచురించుట కగు ప్రశ్నావళిని తయారుచేసి రాష్ట్రకాంగ్రెసు సంఘములకుపంపి పని ప్రారంభించుటయు ఎంతయు అభినందింపదగినది.

అసలు ఈ స్త్రీశాఖ కాంగ్రెసునందు ఎన్నడో విభాగింపబడియుండవలసినది. కాని అట్లు జరుగ లేదు. ప్రస్తుత భారతక్లిష్ట పరిస్థితులలో స్త్రీలు నెరవేర్చవలసిన కార్య భారమును గుర్తించి స్త్రీలశాఖ ప్రత్యేకించుట మిక్కిలి సమంజసముగ నున్నది.

స్త్రీలకై అఖిలభారత మహిళాసంఘ మొకటి యున్నది; ప్రతి సంవత్సరము ఒకచోట కలసికొని కొన్ని తీర్మానములను మాత్రము గావించుచున్నది. కాని ఏ విధమైన కార్యక్రమమునులేక, కాంగ్రెసు మహాసంస్థవలె దేశవ్యాప్తమును కాక, స్త్రీజనమునకు సహితము పూర్తిగ నుపకారి కాలేక నిర్జీవముగ నే యున్నది.

కాంగ్రెసు ఇప్పుడు తలపెట్టిన ఈ స్త్రీలశాఖయొక్క ప్రధానోద్దేశము రాజకీయమైనను, సాంఘిక ముగ గూడ చక్కనిపని జరుగగలదు. ప్రజానీకమందు రాజకీయ చైతన్యము కావలెననిన, దానికి సాంఘి కోన్నతి ప్రాతిపదిక. కాన సాంఘికముగ కృషి, రాజకీయముగ ప్రబోధము ఒకదానివెంబడి ఒకటి జరుగ వలయును.

ఇట్లు జరిగిన కాంగ్రెసు నిర్మాణ కార్యక్రమము బాగుగ వ్యాప్తిజెంది సంస్థ ఇంకను బలవంతు కాగలదు. ముఖ్యముగ నూలువడుకుట, సత్యాహింసలను త్రికరణశుద్ధిగ పాటించుట మొదలగునవి లక్ష్య అవలంభించవలెనను నిబంధన. కాంగ్రెసు సూత్రములందున్నను, వాటిని ఆచరణయందు పెట్టువారు నూటి ఒకరిద్దరైనను నేటి కాంగ్రెసు వారియందు గానరారు. అందువలన నిర్మాణకార్యక్రమము కుంటుపడి నే బీరకాయలవంటి కాంగ్రెసు గోత్రీకులు తయారగుటవలన సంస్థ హేళనకుపాత్రమగుచున్నది.

కాంగ్రెసు సంస్థ మలినదూరమై స్వచ్ఛముగ నుండవలెననిన నిర్మాణకార్యక్రమము కొనసా వలెను. నూలువడకుట, గ్రామ, కుటీర పరిశ్రమలను పునరుద్ధరించి పనిచేయుట మొదలగు నిర్మాణకా క్రమమును స్త్రీలశాఖ చేపట్టి పనిచేసిన కాంగ్రెసు బలము ఇంకను వృద్ధికాగలదు. సాంఘిక వ్యవస్థ చక్కబరచుట, నిరక్షరాస్యతను నిర్మూలించుట, ప్రజానీకమునందు ప్రబోధము గావించుట మొదల

కార్యములు స్త్రీలు విజయవంతముగ నెరవేర్చగలరు—ఇంటనుండియే కాంగ్రెసుసంఘముల ఆధ్వర్యమున స్వరాజ్య సౌధమునకు సోపానములను గట్టగలరు.

ఇప్పుడీ స్త్రీలశాఖవారు తలపెట్టిన గ్రంథ ప్రచురణమునకు వెంటనే రాష్ట్ర, జిల్లా, తాలూకా, ఫిర్కా, గ్రామసంఘములు నిర్మాణముకావలెను. ఇప్పుడున్న స్త్రీ సమాజములతోను, సంఘములతోను చేతులు కలిపి తీవ్ర కార్యక్రమమునందు నిమగ్నులై కృషిసల్పిన రాబోవు పోరాటమునకు అనతికాలములో సిద్ధము కాగలము.

ఉపాధ్యాయినులు - వ్యాయామము

అహమ్మదాబాదు మునిసిపాలిటీ ప్రత్యేకముగా శరీరవ్యాయామ పాఠశాలనుపెట్టి అందులో నుత్తీర్ణులైన మునిసిపలు ఉపాధ్యాయులకు డిప్లొమాలిచ్చు సందర్భమున, మునిసిపలు ప్రెసిడెంటు యం. సి. షా గారు తమ ప్రైమరీ స్కూళ్ల ఉపాధ్యాయులు 13 వందలమందికి వ్యాయామశిక్షణ ఇవ్వవలయునని దెలిపిరి. వీరి యుద్దేశ మెంతయు శ్లాఘాపాత్రము. ఇది ఉపాధ్యాయులకుమాత్రమే కాక, ఉపాధ్యాయినులకుకూడ ఇట్టి శిక్షణావకాశము గలిగించుట ముఖ్యావసరము.

ఇప్పటి ప్రాథమిక విద్యావిధానము బాలబాలికల కేమాత్ర ముపయోగకారిగ లేదనియు, దానికి వలసిన చర్య ప్రభుత్వమువారును తీసుకొనుటలేదను విషయమును యెవరెరుంగరు? ఉపాధ్యాయులలోనే విద్యా విధానము సంతృప్తికరముగా లేదనిన ఇక విద్యార్థులమాట చెప్పవలయునా?

వారమునకు ఒకటి రెండుమార్లు పిల్లలచే చేయించు డ్రిల్లువలన వారికెంత శరీర పరిశ్రమ గలుగునో ఊహింపలేకున్నాము.

సామాన్యముగా పిల్లలకు ఆటపాటలయందే విజ్ఞానమతిసులభముగా నలవడును. దీనికి దృష్టాంతము కాన్వెంటు స్కూళ్లలో చదువుకొను బాలబాలికలే. అచ్చటనుండు వినోదక్రీడలు, ఆటపాటలచే నాకర్షింప బడి 4, 5 సం॥ పిల్లలుకూడ ఎంతో ఉత్సాహముతోను, కుతూహలముతోను చికాకులేక బడికి వెళ్లుచుందురు. కావున మన ఆంధ్రదేశములో ప్రతి మునిసిపాలిటీవారును శరీరవ్యాయామ పాఠశాలలను స్థాపించి, ప్రాథమికోపాధ్యాయులతోపాటు ఉపాధ్యాయినులకును తగినశిక్షణ నొసంగి డిప్లొమాలిచ్చి ప్రోత్సాహపరచిన అచిరకాలములోనే భారతభాగ్యోదయమునకు కావలసిన విద్యార్థులు, విద్యార్థినులు తప్పక తయారగుదురు.

ఇట్టి ప్రయత్న మిప్పటి కెంతోకాలమునుండియో ఆశింపబడుచున్నప్పటికిని వినిపించుకొనువారు లేక అరణ్యరోదనమై యున్నది. ఇకనైన నిద్రమేల్కాంచి అహమ్మదాబాదు మునిసిపాలిటీవారిని అనుకరించి ఈ కార్యమునకు గడంగుదురని ఆశించుచున్నాము.

గోకులం హరిజనవాడ

మైలాపూరు గోకులం హరిజనవాడ, శ్రీమతి విజయలక్ష్మిగారి ఆధ్వర్యమున నవీనసంస్కరణముల బొందుచుండు టెంతయు ముదావహము. ఇచ్చట సుమారు యాభై కుటుంబములున్నవి. అందులో పెక్కురు రిక్షావాండ్లు. వారికి మితవ్యయము, సదాచారము, మద్యపాన నిషేధము, శుభ్రత, గృహపరిశ్రమలు మున్నగు నవి బోధింపబడుచున్నవి. హరిజనులలో సాధారణముగా 150 రూపాయలు లేనిదే ఒక వివాహము జరుగదు.

దానివలన ఋణము లెక్కువయి నానాచిక్కులకు లోబడి కుటుంబములు కూలిపోవుచున్నవి. ఈ దురవస్థ నరికట్టి, 15 రూపాయలలోనే మంగళసూత్రము, వివాహానంతరము విందులు మొదలగునవి జరిపించుకొనుటకు ఏర్పాటుచేసి అప్పుల బారినుండి రక్షించుయత్నే మీ సంఘము చేయుచున్నది.

ముఖ్యముగా వీరిచే చేయించబడు కుటీరపరిశ్రమలు— తేనెటీగలను పెంచుట, నూలు వడుకుట, బట్ట నేయుట, కాగితపు పరిశ్రమ, చాపలల్లుట, పట్టులీయుట. ఇచ్చట శిక్షణబొందిన కొందరు విద్యార్థులు చిత్తూరు జిల్లాకు చేరిన కడయం, చెంగల్పట్టుకు చేరిన కారనపుదుచ్చేరి, అడయారువద్ద మేట్టుచ్చేరి మొదలగు స్థలములలో నున్న హరిజనసంఘములను నిర్వహించుచున్నారు.

హరిజనసేవకసంఘమునకు చేరిన కాంచీపురశాఖలోకూడ ఒకరిద్దరు నియమింపబడియున్నారు. కారనపుదుచ్చేరిలో నున్న హరిజనసంఘమునకు వ్యవసాయశాఖ నొకటి ఏర్పాటుచేయ ప్రయత్నములు జరుగుచున్నవి. ప్రభుత్వమువారు దీనికై 135 ఎకరముల బంజరు భూములు ఇచ్చుటకు నిర్ణయించియున్నారు తెలియుచున్నది.

గోకులం హరిజనవాడవంటి ఆశ్రమములు ప్రతి పట్టణములోను, ప్రతి గ్రామములోను స్థాపించి దీనజనోద్ధరణమునకై కృషిసలుపవలయును. కుటీర పరిశ్రమలగు వడ్రంగము, కమ్మరము, మట్టి పరిశ్రమ, దంపుడుబియ్యము, మొదలగు చేతిపనులనుకూడ చేర్చవలయును. మరియు ఆశ్రమముచుట్టున్న ఖాళీస్థలములో ఆకుకూరలు, కాయకూరలు, పూలతోటలను పెంచి అనుభవముగలవారిచే సుచితములగు పరిశోధనలు చేయించి లోటుపాటుల దొలగించి చక్కపరచుచుండవలయును. స్వయంపోషక విధానము కిదియొక మార్గము.

ఇట్టి ఆశ్రమములు ప్రత్యేకవ్యక్తులవల్లను, సంస్థలవల్లను నెలకొల్పబడి స్థానిక సంస్థలచే ప్రతి సంవత్సరము కొంత గ్రాంటుతో పోషింపబడిన అయ్యవి నిరపాయముగ కొనసాగి సంఘసేవ చెయ్యగలవు.

Edited by Dr. K. N. Kesari, Printed and Published by Dr. S. Seshagiri Rao, at the Lodhra Press, 15, Westcott Road, Royapettah, Madras.

REGD. No.
M-2357

1ST JULY
1940

గృహలక్ష్మి



GRIHALAKSHMI

PRICE AS. 4.

VOL. 13

No. 5

KING OF TONICS

నరములకు తరుగని బలమునీయగల వరము

అమృత

స్త్రీ గృహము లేకుండా జీవించగలదా?

దీనికి జబాబును, నీతివిదూరుడైన ఒకనికి వివాహము గావింపబడి, తన జీవితమును తాను జీవించుటకు ప్రయత్నించిన శ్రీమతి బి. ఎ. వద్ద గ్రహించండి.

తర్వాత ఆమె రతన్ యం. ఎ. ను కలుసుకొన్నది. అతడు ప్రపంచంలో అత్యంత సత్యసంధతతో ప్రవర్తించడంవల్ల, అతడీప్రపంచంలో పనికిరాక విరసుడై పోయాడు.

వీరి చరిత్ర సహజ హృదయవిదారకముగా చిత్రింపబడినది.

న్యూ థియేటర్సువారి 1940-వ సం॥పు గొప్ప సామాజిక చిత్రమైన

జిందగి

(జీవితము)

ప్రజల అభిమాన తారలు

సైగల్, జమున, పహారి, నెమో.

డైరెక్టరు, ఫోటోగ్రఫీ: పి. సి. బారువా.

సంగీతము: పంకజ మల్లిక్.

> 'జిందగీ' యొక్క పూర్తి కథ భాగమంతయు తెలుగు, తమిళములలో హాలువద్ద అమ్మబడును. వెల: ఒక అణా.

21—6—'40 నుండి ప్రారంభము.

స్టార్ లో

దినమునకు మూడు ఆటలు.

Released thru:

THE CALCUTTA FILM EXCHANGE,

BOMBAY : MADRAS : CALCUTTA

ఆకర్షణీయమగు తలవెంట్రుకలు కాంతిరాహిత్యమిక లేదు!



కళావిహీనమైన కేశములతో నుండనేల? ఇప్పుడే క్యాస్టరాల్ను వాడి తలవెంట్రుకలను మనోహరముగ శోభిలజేసికొనుడు. పరిశుద్ధమైన కేస్టరాల్ జుట్టుకు ఎట్టి హానినిచేయక, ఎంత తరుచుగ వాడిన, అంత గుణము నిచ్చును.

'క్యాస్టరాల్'

'ఆముదము'

with Vitamin **'F'**



విషయసూచిక

1. 'మదయంతి'—కవికలహంసి, చేబ్రోలు సరస్వతీదేవి ... 255
2. స్త్రీ వాఙ్మయము— " " ... 256
3. భజన సమాజాలు - స్త్రీజన కర్తవ్యం—శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మ 259
4. ఆంధ్రీ!—శ్రీమతి ఎ. మీనాక్షి ... 262
5. ప్రతిఫలము—శ్రీమతి సుభద్రాదేవి ... 263
6. విరహిణి—శ్రీమతి జ. సుభద్రాదేవి ... 266
7. సర్వోదయము - సామ్యవాదము—శ్రీమతి వల్లభనేని రంగాదేవి ... 260
8. విభీషణ ప్రబోధము—శ్రీ గంధం నరసింహాచార్యులు ... 278
9. శుచి—శ్రీమతి అవధానం సీతాలక్ష్మి ... 271
10. సిగ్గు—'మణి' ... 274
11. వింతవింతల ప్రపంచం ... 276
12. దేవదాసి—శ్రీమతి దేవులపల్లి వెంకటరత్నమ్మ ... 277
13. భరతధాత్రి - పరాశక్తి—శ్రీ కల్లూరి వెంకట సుబ్రహ్మణ్య దీక్షితులు 278
14. కన్నీటి కెరటాలు—శ్రీమతి వక్కలంక రామాబాయి ... 279
15. కళాకలాపము - సంగీత సామర్థ్యం—'మణి' ... 281
16. ప్రేమ—శ్రీ ఆమండి వెంకటేశ్వరరావు ... 282
17. దేశభక్తి—శ్రీమతి గంటి కృష్ణవేణమ్మ ... 284
18. భావతరంగిణి ... 285
19. పల్లెటూళ్ల సాంఘికదుస్థితి—శ్రీ ఆదిలక్ష్మి వేంకటరత్న సోదరీలు ... 286
20. లాంజ్ సూటు—శ్రీమతి పి. ఎన్. ప్రకాశమ్మ ... 287
21. గానకళ—శ్రీ గాలి పెంచలనరసింహారావు ... 291
22. ఖద్దరు : స్త్రీలు—'సత్యంవద' ... 293
23. కర్షకా!—శ్రీమతి ఈడ్పుగంటి పుష్పావతి ... 294
24. సనాథా? అనాథా?—శ్రీ బండి రామారావు ... 295
25. స్త్రీలు — రైలుప్రయాణము—శ్రీ సూర్యదేవర సంజీవరాయణం ... 297
26. 'నేటి నాతో నింక మాటాడవేమి?'—శ్రీ వేదవల్లి తాయారమ్మ 298
27. బాల భాగ్యోదయము—శ్రీమతి అంకాల సత్యవతమ్మ ... 299
28. పాత పాటలు—శ్రీ శ్రీనివాసాచార్య ... 300
29. గ్రంథ సమీక్ష ... 301
30. పత్రికా పరిచయం ... 302
31. పాకకళ ... 303
32. పుష్పచయము ... 304
33. సంపాదకీయములు ... 305

వర్ణచిత్రము: 'మదయంతి'

C. M. V. Sherman

భవభూతి
మాలతీమాధవం

'అందాల పాలవెల్లి'
కుమారి పుష్పవల్లి
మాలతి — తల్లి.

మంత్రికొమార్తె
సుదయంతి



జయజయ గృహలక్ష్మి సఖి! జయజయ లలితాంధ్ర మధుర సారస్వతమా!
జయజయ లలనారత్నమ! జయజయ విద్యాప్రబోధ! జయకల్యాణీ!

మదయంతి

గీ. మాలతీ మాధవంబునఁ మార్పులేక నాటిసిద్ధాంతముల నెల్ల పాటవమున
నచ్చుగ్రుద్దిన భవభూతి యాశయంబు చిత్రితంబయ్యె మదయంతి పాత్రయందు.

ఉ. పువ్వులబోలు నంగములు పొల్పెసలారఁగ రాగమాలికల్
నవ్వులవెన్నలై నవవిలాసము దోఁపఁగ మందయానయై
క్రొవ్విరిగంధి దానచటకుం జనిమెర్లె మదయంతి మాలతీ
పువ్వులఁగోయు వ్యాజమునబూని మరందునిఁ జూచు వేడ్కతోఁ.

గీ. సరసఁబెరిఁగిన పూపొద చాటునుండి స్వాధుమధురోక్తు లెన్నియో సంభ్రమమున
వరలదొడిగెను భావనాభరితమగుచు ప్రకృతిసహజంబకాదె! యీప్రణయరసము.

—కవికలహంసి, చేబ్రోలు సరస్వతీదేవి.

స్త్రీ వాఙ్మయము

సచ్చిదానంద స్వరూపుడైన పరమాత్మ ప్రపంచసృష్టి సంకల్పించిన నాడే స్త్రీ యున్నతస్థానము వహించినది. సర్వసృష్టికి ప్రకృతియే మూలము. ప్రకృతియే ఆదిజనని. సత్వరజస్తమోగుణ నిర్ణయ విధానము ననుసరించి సరస్వతి, లక్ష్మి, పార్వతి యను వేర్వేరు నామరూప మాత్రభేదములతో నా ముగురమ్మల మూలపుటమ్మ 'చాల పెద్దమ్మ' వెలయుచున్నది. సకల కళాజ్ఞాన స్వరూపిణికి సరస్వతియనియు, శౌర్య, స్థైర్య, గాంభీర్య, సాహసాది శక్తి స్వరూపిణికి అంబికయనియు నిర్ణీత నామధేయములు వాడుకలో నున్నవి.

సకల సస్యసంపదయు, మణిరత్న సంపత్తియు నిచ్చు భూదేవియు స్త్రీ స్వరూపిణియే. కదా అనంతకోటి సంఖ్యాకములగు జీవరాసులకెల్ల నాధారభూతమును, ప్రాణభూతమునునగు గంగాప్రవాహ మున్నగు పావనజీవ నదీమతల్లులకును స్త్రీవాచక మొసంగబడియున్నది. కోరిన కోర్కెలనిచ్చు కామధేను స్త్రీ రూపధారిణియే, భగవతావతార స్వరూపోచ్చారణ సమయమందును సీతారాములనియు, పార్వతీ పరమేశ్వరులనియు, లక్ష్మీ నారాయణులనియు స్త్రీ నామములే ముందుగ చేర్కొనబడుచున్నవి. ఇంతటి గల మాహాత్మ్య మెట్టిదో!

ఈ ప్రకృతి స్వరూపిణియే లలిత, పరదేవతా, దుర్గ, కాళిమున్నగు సహస్ర నామములతో గొనియాడ బడుచున్నది. ఈ జగజ్జననిని నవరాత్రులలో సత్యమెఱింగిన మహానుభావులు, ఆత్మబలసిద్ధికై, మోక్ష ప్రాప్తికై పూజించికొనియాడుచుందురు. సామాన్యజనులు ఐహిక సుఖముగోరి యర్చించుచుందురు. ఈ శక్తియే వేదమాతయగు గాయత్రీదేవి. ఉపనయన మహోత్సవ సమయమందు బ్రహ్మచారులు గాయత్రీమంత్ర మున్ స్వీకరించి ద్విజత్వసిద్ధియు, వేదాధ్యయనాధికారమును బొందెదరు. అనగా వేదాభ్యాసమునకును విద్యాభ్యాసమునకును ఇదియే తొలిమెట్టు. పురుషులకువలెనే స్త్రీలును ఉపనయన సంస్కారమును వ్యక్తిగత జీవనవృద్ధికిని, జాతీయ జీవనవృద్ధికిని ప్రధానమైన బ్రహ్మచర్య మనుష్ఠించి సంపూర్ణ జీవనమునకు దగిన ప్రజ్ఞా విశేషమును వడసియుండిరి. అది స్వర్ణయుగము. అప్పటి స్త్రీలు పరిపూర్ణ విద్యావతులై స్వాతంత్ర్య మలను, స్వాతంత్ర్యమును నిలబెట్టిరి. కొందరు వాఙ్మయ నిర్మాణమునకై తమ పవిత్రజీవితమంతయు ధారవోసి విజ్ఞాన లోకమునకు మార్గదర్శకులై బుక్కులలో సయితము తమ ప్రతిభావిశేషమును ప్రతిష్ఠింపజేసిరి. ఆనాటి స్త్రీ వాఙ్మయమెట్టి యుత్తమస్థానమును వహించియుండెనో వేరుగ చెప్పవలయునా?

దీనినిబట్టియే భారతదేశము ధార్మిక సంపదయందు పొందిన యౌన్నత్యమును గుఱించి ఇప్పటికిని స్వదేశస్థులేగాక విదేశస్థులు సహితము ప్రశంసా పూర్వముగ ముచ్చటించుచున్నారు. భారతీయులు ఆధ్యాత్మిక జీవనమునకే అధిక ప్రాముఖ్యతనిచ్చి ధర్మతత్పరులై యున్నను ప్రాపంచికైశ్వర్యములందు ఉచ్చస్థితి యందుండిరి. ఇట్టియున్నత దశకు మూలకారణము స్త్రీ స్వరూపమేయనుట యతిశయోక్తి కాదు.

కాలవాహిని చర చర సాగిపోవుచుండగా మానవులలో నాచార వ్యవహారములు ఎప్పటి కప్పుడు మారిపోవుచుండునుగదా! అట్టిచో వాఙ్మయ ప్రపంచమున నారీరత్నములకున్న స్థానము క్రమ క్రమముగ క్షీణించి నామమాత్రావశిష్టమయ్యెను. మరల ఆతుకూరి మొల్ల, తరిగొండ వెంకమాంబ, ముద్దుపళని మొదలగు కవయిత్రీమణుల శంఖారావములు జెలరేగువరకును స్త్రీ వాఙ్మయమెట్టి పరిణామమునొంది యుండెనో ఇదమిద్ధమని నిర్ణయింపబడి యున్నట్లు ఆధారములుగానరావు. ఇందులకు ప్రధానకారణము భారతసామ్రాజ్య సౌభాగ్యమును గోలుపోయి పరదేశీయుల పాలనలో బడియుండుటయే.

నవయుగవాతావరణమున భారతీయులు పాశ్చాత్య వ్యామోహమున మునింగి యుండుటచే పరంపరగావచ్చు వేదవిద్యాభ్యాస మడుగంటుటయు, తపశ్శక్తులు నశించుటయు, ఆధ్యాత్మిక చింత సన్నగిల్లుటయు, సంస్కృతభాషా పరిచయ మతి విరళమగుటయు, సంభవించి మన పవిత్రధర్మములు చెడి మనకింత యధోగతి పట్టినది. మన పవిత్రధర్మమును పునరుద్ధరించు సమయమిప్పుడా సన్నమైయున్నది. మనమొకప్పుడందిన యున్నతినే పరమాశయముగా నెంచి దానినందుటకై శక్తివంచనలేక ప్రయత్నింప వలయును.

స్త్రీలు అబలలుకారనియు, సర్వకళా నిపుణులనియు, ధీరగుణాఢ్యలనియు విశేషించి లలిత కళలన్నియు స్త్రీల సొమ్ములనియు, ఎట్టికష్టసమస్య వచ్చినను వెనుకంజవేయరనియు లోకమంగీకరించిన విషయమే. నాడు నాటికి ప్రపంచ నాగరికతాభివృద్ధి ననుసరించి నేటి సతీమతల్లులు విద్యాభివృద్ధి కలిగియున్నారనుట నిర్వివాదాంశము.

సుమారు 20 ఏండ్ల నాటి స్త్రీలకును నేటి స్త్రీలకును చాలా వ్యత్యాసమున్నది. సంఘసంస్కరణ మనినను, రాచకీయమనినను నాటి స్త్రీలు భయకంపితులగువారు. నేడో? ముందంజవేయుచున్నారు. ముదిముచ్చట్లు, పుక్కిటి పురాణములతో ప్రొద్దు పుచ్చక నేడాంధ్రవనితలు చక్కని పద్యములను, రసవంతములగు గద్యములను వ్రాసి వన్నెకెక్కుచున్నారు. సంఘసేవయందును పురుషులకంటె స్త్రీలు పనిచేయగలవారున్నారు. సాహితీ సేవయందును పురుషులకెందును దీసిపోక దీక్షవహించి పాటుపడుచున్నారు. కాని రచనయందును వాఙ్మయ సేవయందును పేరుగాంచి, సాహితీరంగమున నగ్రస్థానముల నధిష్ఠింప గోరువారు లెక్కకుమిక్కిలి తక్కువనియే చెప్పవచ్చును. ఆంధ్రదేశోద్యాన వనవాటికలో ఆంధ్రవాఙ్మయా రామములో స్వేచ్ఛగ సంచరించుచు భారతదేశ సౌభాగ్యమున కనువగు మార్గములెన్నియో పురుషులతోబాటు స్త్రీలును కనిబెట్టుచున్నారు. అందులో చరచర ముందున కడుగులువేయు, కనుపర్తి, కాంచనపల్లి, గుడిపూడి మున్నగు సోదరీమణులు పేర్కొనదగినవారు.

కాలపరిస్థితులును, దేశపరిస్థితులును, చిరసంప్రదాయములును కలిసి ఆదర్శ చరిత్రమును ప్రజ్వలింపజేయును. ప్రాచీన భారత సారస్వతమును పరిశీలించితిమేని ధర్మశాస్త్రములందు నిరూపింపబడిన ఆదర్శ స్త్రీ లక్షణము లెన్నేని గోచరించును.

ప్రస్తుత స్వాతంత్ర్య యుగమున మనమట్టి ఆదర్శ స్త్రీచారిత్రమును నిలబెట్టవలయుననిన గృహధర్మ, సంఘధర్మ, జాతిధర్మములను నిర్వహించుటకు నాధారమైన విద్య స్త్రీలకవసరము. అన్ని నాగరికతలు గృహమున బుట్టునవియే. భావబంధురమైన గృహధర్మమందున్నతి కావలెననిన సోదరీమణులందరు మాతృభాషకే ప్రాధాన్యమిచ్చి సారస్వతసేవికలై వివిధాంగణము లందగ్రస్థానములను నలంకరించ ప్రయత్నించవలెను. భారతమహత్వమును పునరుద్ధరింపగల యాశయములు, ఆదర్శములు, మాతృభాషయందును దానికి ప్రియసఖియగు సంస్కృతమునందును గోచరించును, గాని అన్యభాషలందుగాదు. మాతృప్రేమధారలు తల్లిపాలలో నుండియే గురియునుగాని పోతపాలలోగాదు.

"జననీజన్మ భూమిశ్చ స్వర్గాదపిగరీయసీ" అను పవిత్రవాక్కుల ననుసరించి స్వదేశ గౌరవమును, స్వదేశాచారసాంప్రదాయములను నిలుపుకొనవలయును. దేశకాల పరిస్థితుల గమనించి, పరిపాలకులనరసి, వ్యవహారదక్షతకొఱకు పరభాషయు, పరవాఙ్మయమును యభ్యసించి అందలి జ్ఞానము సంపాదింపవలయును. వివేకదృష్టితో నందలి గుణాగుణములను గమనించి సారము గ్రహించుట శ్రేయస్కరము.

హృదయ గర్భమందలి స్వతంత్రశక్తిని, సహజమైన ప్రజ్ఞను, ప్రతిభను వెలువరింపజేయుట
విద్యయొక్క ప్రధానోద్దేశము ? వనితాజనమునకు సహజాలంకారమగు దయాసత్యశౌచశాంత వాత్స
సద్గుణజాలములు సందీపింపజేయు విద్యకే ప్రాముఖ్యతనిచ్చి భావిభారత కల్యాణమునకు పునాదివేయవల
పరవాఙ్మయ సంచరణమునందుమునిగి నవనాగరికతా వ్యామోహమున కొట్టుకొనక, స్త్రీలు తమ కర్తవ్య
జ్ఞప్తియందుంచుకొని ప్రస్తుత క్లిష్ట పరిస్థితులలో, ప్రపంచభావి నాటకరంగములో మన భారతదేశము
బోవు పాత్రానుగుణ్యముగ మన జాతీయవిద్యా సౌధమును నిర్మింపవలయును. మాతృభూమిని ప్రేమించు
ఆ ప్రేమలోనే ఆనందమనుభవించుట ప్రతి మహిళామణికిని నిసర్గలక్షణము గావలెను. దీనికి లలితకళా
జాతీయ విద్యాభ్యసనము, మూలసూత్రములు.

నేటి స్త్రీ విద్య మన పవిత్ర ధర్మముల నుద్బోధించునది కాదనుట తేటతెల్లము. ఈ మార్గ
నడుగులు వేయువారు, నేర్వవలసినవిద్య, నడువవలసిన మార్గము, చేయవలసిన కర్తవ్యము అవలంభింప
విధానమెఱుంగక సందిగ్ధావస్థయందుబడి యొక్కొక్కసమయమున కళంకమునుకూడ దెచ్చుకొనుచున్నా
కావున నేటి సభ్యతయందలి విడ్డూరముల విలోకించి, సోమరితనమును, విచ్చలవిడినడవడియు అరిష్టదాయ
లనియెంచి భారతప్రాచీన సభ్యతనే గమ్యస్థానముగా గైకొని దానికివలయు విజ్ఞానమును, వాఙ్మయ
సంపాదింప ప్రతియువతీమణియు ప్రయత్నించవలయును.

జాతీయతకును వాఙ్మయమునకును అవినాభావ సంబంధమెల్లకాలములోను నుండక తప్పదు.
లించి చూచితిమేని ప్రస్థుతయుగమున నేటివరకును స్త్రీవాఙ్మయ మిట్టిదని సృజించు పుణ్యమునకు నోచుకొన
తొక్కు కవితలును, ఖండకావ్యములును వెలువడినంత మాత్రముననే సంపూర్ణ వాఙ్మయము కాజా
రచనయందును సాహితీలక్షణమందును సిద్ధహస్తులైన సోదరీమణులుండియు . స్త్రీలకు సంబంధి
వాఙ్మయముగాని స్త్రీలచే నిర్మింపబడిన వాఙ్మయముగాని కాగడాలతో వెదకినను కానరాకపోవుట
నీయము. భావిభారత సారస్వతసేవకులు ఈ లోపమును గ్రహించి నిస్పృహజెందవలసినదేనా?
దురదృష్టము! స్వాతంత్ర్య యుగవాతావరణములలోనుండి, ఉత్తమాశయముల కుబలాటపడుచున్న
మికనైనా కనులువిప్పి కర్తవ్యము గ్రహించి స్త్రీ వాఙ్మయ నిర్మాణమునకై దీక్ష బూనవలదా?

—కవికలహంసి, చేబ్రోలు సరస్వతీ

భజన సమాజాలు - స్త్రీజన కర్తవ్యం

శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మ

జాతినిత్యం, మానవజీవితం అనిత్యం గనుక, మన జాత్యభ్యుదయం నిమిత్తం మనవంతు సేవాధర్మం మనం నిర్వర్తించాలె. స్త్రీ విశ్వకుటుంబినియై గృహంతో బాటు దేశసముద్ధరణానికి కూడా తోడ్పడాలి. 18 కోట్ల భారత మహిళామణులు అజ్ఞానతమస్సులో ఉన్నన్నాళ్లు భారతదేశానికి విముక్తి లేదు; కల్యాణం లేదు.

మనదేశంలో స్త్రీ సమాజాలే చాలాతక్కువ. అందులో ప్రార్థనాసమాజాలనబడేవి రెండుమూడు కన్న అధికంగా లేవు. అయితే రత్నంయొక్క విలువ సంఖ్యనుబట్టీ ఉండదు, పరిమాణాన్నిబట్టీ ఉండదు. వాని ప్రాశస్త్యాన్నిబట్టే ఉంటుంది. ప్రార్థన అనగానే అది భగవత్పరమైన సంస్థ అని స్ఫురిస్తుంది. ప్రార్థన మానవుని సర్వవిధాలా పునీతమొనర్చి భగవత్సాహచర్యం గల్గించే దివ్యసాధన. పవిత్రమైన కృష్ణవేణీ జలావగాహనంచేస్తే దేహమాలిన్యమే నివర్తికావచ్చును. ప్రార్థనచేస్తే మనోవాక్కర్మంబులు మూడింటా మానవులు పరిశుద్ధులౌతారు. ఇనుము అయస్కాంతం దెసకు ఆకర్షితమైనట్లు ప్రార్థనాశీలి చిత్తం భగవంతుని దెసకు ఆకర్షితమౌతుంది. ఎవరైతే భగవత్ప్రార్థనను అనుదినవ్రతంగా పెట్టుకొంటారో వారికి భగవత్సాన్నిధ్యం సులభమౌతుంది. ప్రార్థన నటనావినోదం గాదు. వాగాడంబరం గాదు. మనోవిలాసం గాదు. దైహికవాచిక మానసికదోషములనెల్ల వారించి ఏకాగ్రచిత్తం కలుగజేసి పరమాత్మానుసంధానం ప్రాప్తింపజేసేదే ప్రార్థన. ప్రార్థనాశీలికి సర్వవిషయములందును భగవదర్పితబుద్ధి యేర్పడడం, కష్టసుఖాది ద్వంద్వములయందు సాక్షిమాత్రుడుగా ఉండటం, నిష్కామకర్మయోగి కావడం స్వభావమౌతుంది. ప్రార్థనవల్ల యెట్టి ఆధ్యాత్మికబలం యేర్పడేది, యెట్టి మహత్తర కార్యనిర్వహణాశక్తి సమకూడేదీ, ఎట్టి జగద్వశీకరణ సామర్థ్యం కలిగేది, నేడు మహాత్మాగాంధీగారివల్ల మనము తెలుసుకుంటూనే ఉన్నాము. మానావమానముల క్లేశము, జయాపజయముల వేదన, కలిమిలేముల రాపిడి, దూషణభూషణల కలత, తారతమ్యముల వ్యత్యస్తములేక వీనికన్నిటికి అతీతుడై ఆతడింతటి జగద్వంద్యమగు మానవసేవచేయుటకు ఆయన నిరంతర ప్రార్థనాశీలతయే కారణము. శ్రీ మహాత్మా గాంధీగారు తమ స్వీయచరిత్రలో ప్రార్థననుగురించి యిట్లు వ్రాశారు.

'స్తుతియు, ఉపాసనయు, ప్రార్థనయు, ఇవి గ్రుడ్డినమ్మకములు కావు, అవి పానభోజనస్థాన గమనములకంటె అధిక సత్యములు.' ఇవియు సత్యములు, మిగిలినవి అసత్యములన్నచో అతిశయోక్తి కాజాలదు.

ఈ ఉపాసన, ఈ ప్రార్థన, వాణీవైభవముకాదు. దీనికి కావలచి నాలుక కాదు, హృదయము. కావున భక్తిని నించి హృదయమును నిర్మలము చేసికొంటిమేని, మనమూ అనంతమున కెగురగలము. ప్రార్థనకు జిహ్వతో

బెజవాడ యువతీ ప్రార్థనా సమాజం 26 వ వార్షికోత్సవ అధ్యక్షోపన్యాసము నుండి కొన్ని ముఖ్యమైన భాగములు.

పనిలేదు. అది స్వభావముచేతనే అద్భుతవస్తువు. వికారరూపములగు మలములను అనగా కామాదులను చేయుటలో హృదయపూర్వకమైన ఉపాసన ఉత్తమసాధనమని చెప్పుటకు నేను సందేహింపను. ఆ ఉపాసన అతి వినతితో అతి నమ్రతతో పొంది పొసగియుండవలయును.

ప్రార్థనయందు గల మహత్తరశక్తి మహాత్మునకేగాక ప్రార్థనాశీలురకెల్ల యిటులనే అనుభవమైయే యున్నది. ప్రార్థన అంటే భగవంతుని వేడుకొంటూ ముక్కుమూసుకొని కూర్చోడంగాదు. కరచరణాద్యవయవ సంఘటిత కాయము మనకు భగవంతునిచే ప్రసాదింపబడ్డది, నిర్వ్యాపారతచే జడమొనర్చడానికి గాదు. ఫలాఫలములయెడ నిర్విచారులై లోకసేవ చేయడమే ప్రార్థనాశీలుర ధర్మం. ఏ మహనీయుని సందేశముచే ప్రబోధితమై ఈ ప్రార్థనాసమాజాలేర్పడ్డవో ఆ మహనీయ రాజా రామమోహనరాయల దివ్యజీవితమే యిందుకు తార్కాణం. రాజకీయంగా, సాంఘికంగా, నైతికంగా, ఆధ్యాత్మికంగా ఆయన చేసిన మహత్సేవాఫలితమే మన యీ స్త్రీ సమావేశాదులని చెప్పినను చెప్పవచ్చును. దయార్ద్రహృదయుడైన ఆ మహనీయుడు చేసిన మహత్తరకృషివల్ల నేగదా సహగమన దురాచారం మనదేశంలో నిర్మూలమై అసంఖ్యాక భారత నారీమణులు బలవన్మరణం పాలయ్యే దురదృష్టం తప్పింది. ఈ ప్రాణదాతయొక్క లోకోత్తర సేవతో యేది తుల్యమాతుంది? సేవలోనే జన్మయొక్క సార్థకత యున్నది. ఉదార బ్రాహ్మమతంయొక్క మూలసూత్రాలైన ఈశ్వరపితృత్వము మానవసౌభ్రాతృత్వము సేవవల్లనే సఫలీకృతం కాగలవు.

ఏపెట్టె తాళం తీయవలెనన్నా, తాళపుచెవి కావలసినట్లుగా ఏపనిచేయవలెనన్నా విద్యకావలె. మానవులకు విద్యయే దివ్యాలంకారము. 'విద్యావిహీనః పశుః' అను భర్తృహరి సుభాషితం సుప్రసిద్ధమేగదా. మానవులకు జీవితవికాసానికి విద్యయే మూలాధారం. అయితే విద్యయొక్క పరమార్థం జ్ఞానార్జనగాని ద్రవ్యార్జనగాదు. విద్య ద్రవ్యసంపాదనమాత్ర ప్రయోజనకరమే అని భావించువారు చదువుకున్నా నప్పటికీ వారి అవిద్యాతమస్సు విచ్చలేదనే చెప్పాలె. స్త్రీయొక్క జీవితం సేవాప్రధానమైనది. గృహిణీధర్మమంతా భగవత్సేవ, భర్తృసేవ, శిశుసేవ, అత్తమామల సేవ, బంధుసేవ, అతిథి అభ్యాగతిసేవ, వ్యాధిగ్రస్తసేవ, ఆదిగాగల సేవలతో నిండియున్నది. ఏ స్త్రీయొక్క విద్యావికాసం గృహిణులకు నిర్దిష్టమైన యీ ధర్మ నిర్వహణానికి సహాయకరమాతుందో అదియే స్త్రీల కుచితమైన విద్య అని చెప్పవలె. అంతేగాక వర్తమాన భారతదేశ పరిస్థితులనుబట్టి స్త్రీ సేవారంగము యింతకంటె విశాలమొనర్చుకొనవలసియున్నది. ప్రాచీన భారతదేశము స్వతంత్రపరిపాలనా సౌభాగ్య విరాజితమై ఉన్ననాడు భారత స్త్రీ కార్యక్షేత్రము గృహముమాత్రమే అయిఉండెను, గృహసీమదాటి ఆమె అవతలికిపోవలసిన పని కలుగలేదు. నేటి పరిస్థితులు అట్టివి కావు. నేటికాలపు స్త్రీలకు చదువులేదు. ఆర్థికవసతి లేదు. మతసాంఘికహక్కులు లేవు. దేశము పరదేశీయపరిపాలనా పీడితమై బానిసత్వం అనుభవిస్తున్నది. ఈ సమయములో స్త్రీలు వంటయింటియందే మసుగడ వెళ్లబోస్తూ ఉండినచో ఈ దేశం యెప్పటికీ అభివృద్ధిచెందజాలదు. జాతినిత్యం, వ్యక్తి జీవితం అనిత్యం గనుక, మన జాత్యభ్యుదయంనిమిత్తం మనవంతు సేవాధర్మం మనం నిర్వర్తించాలె. స్త్రీలు కుటుంబినులై గృహంతోబాటు దేశసముద్ధరణానికిగూడా తోడ్పడాలె. 18 కోట్ల భారతమహిళామణులు అజ్ఞానతమస్సులో ఉన్నన్నాళ్లు భారతదేశానికి విముక్తిలేదు; కల్యాణంలేదు.

నీతియుతమైన నడవడి లేకపోతే విద్యసేర్చే ప్రయోజనంలేదు. నీతియుతమైన ప్రవర్తనా, స్వార్థవిరహితమైన ప్రేమా యీ రెండే ముక్తిమార్గాలు. యావత్ప్రపంచం చుట్టివచ్చినప్పటికీ పొగబండి

పట్టాలనువీసమైనా యెట్లా అతిక్రమించదో, ఆవిధంగానే మానవులుగూడా యే కార్యక్షేత్రాన పనిచేసినా నీతిధర్మాలను సుంతైనా అతిక్రమించగూడదు. పట్టాతప్పితే రైలు యెట్లా బోల్తాపడిపోతుందో నీతిధర్మాలను అతిక్రమించితే మానవజీవితంగూడా అట్లా బోల్తాపడిపోతుంది.

ఐహికమనీ పారమార్థికమనీ విభజనచేసుకొని ఐహికంలో యెట్లాఉంటేనేమి పారమార్థికంగా నడిపితే చాలుననేది కొందరి పంథా. ఇంట్లో కోడలికి అన్నంపెట్టక, నీళ్లుపోయక రాచిరంపాన పెట్టుతూ పైకి భగవద్గీత చేతులతో పట్టుకొని రుద్రాక్షలపేర్లు పెద్దవిధరించి జపంజేస్తూవుండే అత్తగారూ; యింటివద్ద దేవపూజా పితృతర్పణాలు, బ్రాహ్మణ సమారాధనలూ కోలాహలంగా చేస్తూ కచ్చేరీలో నిర్దాక్షిణ్యంగా లంచాలులాగే ఉద్యోగస్థుడూ; ఉదయం సాయంత్రం దేవాలయానికి నిష్టగాపోయి నమస్కారాలుచేస్తూ బడిలో కాపీచేయటానికి ప్రయత్నించే విద్యార్థీ—ఇటువంటివారంతా యీ పంథాలోనివారే. ఇటువంటివారు బాహ్యానికి యెందుకైనా మంచిదని నమస్కారాలు చెల్లిస్తున్నా భగవంతుని సర్వమయత్వము, సర్వాంతర్యామిత్వము వీరికి బోధపడలేదన్నమాట. ఇందువల్ల ఆత్మవంచనా పరవంచనా గాకుండా దైవవంచనగూడా చేస్తున్నారు. తీర్థానికి తీర్థం ప్రసాదానికి ప్రసాదం అనే నడవడి చాలా అనర్థకమైంది. దీనివల్ల యెప్పటికీ ఆత్మోన్నతిలేదు. నిజానికి పారమార్థిక చింతకంటె ఐహికజీవితంలో నిష్ఠగా నడవటమే కష్టమైనపని. ఫలితంగూడా దీనివల్లనే ఉన్నది. పూర్వం జనకాది మహారాజులేమి, ప్రస్తుతం మహాత్ముడు మొదలైన మహానుభావులేమి ఐహికజీవితంలో జూపిన నిష్ఠాపరత్వంవల్లనే కీర్తిశోభితులైనారు.

ప్రస్తుతం మనదేశంలో ముఖ్యంగా మన స్త్రీ సముదాయంలో పారమార్థిక చింత అనేది కపటంతోను డంబంతోను కూడుకున్నదిగా ఉంటున్నది. పుణ్యాపేక్షచేతనే స్త్రీలీ మాయావాగురులలో జిక్కుకుంటున్నారు. భ్రష్టలౌతున్నారు. గురుశుశ్రూషలు శృంగారరసప్రకరణాలుగాను, భజనతంతులు విలాసక్రీడలుగాను పరిణమిస్తున్నాయి. ఏమితప్పలుచేసినా భగవంతుణ్ణి స్మరిస్తూవుంటే చాలునను దురభిప్రాయం స్త్రీలను తప్పుత్రోవ పట్టిస్తున్నది. ఏ భగవద్గీతాది వేదాంతగ్రంథాలనుజూపి నేడు గురువులు స్త్రీలను వంచిస్తున్నారో, ఆ గ్రంథములలో భక్తిజ్ఞానవైరాగ్య లక్షణాలు అతినీతిబద్ధమైనవిగా చెప్పబడియున్నవి గాని, నటనలతో కాలక్షేపంచేయడమే మంచిపద్ధతని చెప్పలేదు. స్త్రీలావిషయాలను చక్కగా తెలుసుకోకుండ యీ మాయాకలాపంతో మోహితులవడం ఉచితంకాదు.

మన స్త్రీ సంఘం బాగుపడలెనంటే యీ దొంగగురువుల దాడినుండి తప్పుకోవాలె. మహాత్ములమీద భ్రాంతులు పోగొట్టుకోవాలె. ఒకవేళ యేగురువువద్దనైనా నైవేద్యంపెట్టిన పాలువెన్నలు సగానికి సగం తగ్గింపజేసే సత్తా, మట్టిని కుంకుమజేసే సత్తా, ఒళ్లుదులిపితే విభూతిరాల్చే సత్తా, భూమిపైనుండి మూడడుగులు లేచే సత్తా, అరచేతిలో హారతీకర్పూరం వెలిగించే సత్తా ఉన్నప్పటికీ అవి ఒక గారడీవాని ఇంద్రజాలమహిమకంటె యెక్కువదికాదని తెలుసుకోవాలె. భక్తినెపాన, భగవంతునినెపాన మన అమాయక స్త్రీ సంఘంపై కాషాయవస్త్రాలు, బవిరిగడ్డాలు, విభూతిరేఖలు, రుద్రాక్షపేర్లు, నామసప్తాహాలు చేస్తున్న అత్యాచార ప్రక్రియలను వివేకయుతులైన స్త్రీలు యెదుర్కోవాలె. మనకు నూరు ధర్మోపదేశాలుచేసి, తనకు వ్రేళ్ల ఉంగరాలు, తనభార్యకు కంఠహారములు అర్థించే గురువు యేమాత్రపు వేదాంతో విచారించాలె. స్త్రీలు గురువుయొక్క నైతికనిష్టను తెలుసుకోకుండా వానిమాటలచే వంచితులు కాకూడదు. మోక్షం ఆడంబరాలలో లేదు; ముమ్మాటికీ లేదు.

అనేకవిధాలుగా శిథిలమై పునర్నిర్మాణం కోరుతున్న మన భారతదేశానికి మన స్త్రీలు కుంటేనేగాని సఫలంకాదు. నిర్వ్యాపారంగా ఉండటంగాని స్వార్థలాభంతో తృప్తిపొందడంగాని మానవలక్షణం గాదు. మతంలో స్త్రీకి తావులేదు. సాంఘికాల్లో స్త్రీ శృంఖలాబద్ధ. ఆర్థికంగా స్త్రీ పేద. సారస్వతంగా స్త్రీకి అధమస్థానం. కళాపరిశ్రమల్లో స్త్రీ యేనాడో వెనుకబడిపోయింది. లుగా స్త్రీ తనకు స్థానం సంపాదించుకోవలెనంటే అన్నివిధాల అఖండకృషి చేయాలె. స్త్రీ లోకంలో ప్రబోధం కలిగించాలె. పూజ్యమైన తన జన్మహక్కైన మాతృస్థానాన్ని అన్నిటికీ మాతృక చేసుకోవాలె; ప్రస్తుత స్త్రీల కర్తవ్యం.

• ఆంధ్రీ •

శ్రీకళాకలితమై అలరారియున్న పూ
లోకవిఖ్యాతమై ర్వాంధ్ర సౌభాగ్యమ్మ
పునరుద్ధరింపగాఁ బూనుమమ్మా!
నీదు
మనమునను దలపోయ మఱువకమ్మా!!

రుద్రమ్మనాటియా మంగమ్మనాటియా
భద్రపరిపాలనము సంగరప్రజ్ఞయును
జ్ఞప్తికిం దెచ్చుకొన సాగుమమ్మా!
ఆంధ్ర
దీప్తికాంతివ్యాప్తి తెల్పుమమ్మా!!

అబలత్వమునుమాని అస్వతంత్రతఁ ద్రోసి
సబలత్వమునుబూని ఆంధ్రత్వమును నిల్ప
ధీరపౌరుషములం దేరికొనుమా!
ఆంధ్రి!
వీరనారీమణివి వేగఁగమ్మా!!

—శ్రీ ఎ.

★ ప్రతిఫలము

● శ్రీమతి సుభద్రాదేవి

విషాదకరమైన ప్రణయావేగం, అంధమైన అహమిక ఈ కథకు ఇతివృత్తం.

ప్రేమ కాని, కామం కాని దానంతటది ఒక ధర్మంకాబోదు—మనిషి నీతిబద్ధుడు గనకనూ, తన కాంక్షలకి వ్యతిరేకంగా న్యాయమూ, పుణ్యమూ అనే ప్రమాణాలకి కట్టుబడిపోవచ్చు కనుకనూను.

ప్రణయానికి కావలసిన ప్రయోజనాలకీ అతని నైతికాత్మకీ సరిపడకపోతే అతని వ్యక్తి రెండు విరుద్ధభాగాలుగా భేదిల్లుతుంది.

అందగాడైన పరదేశికి అదే సంభవించింది......శ్యామ ప్రేమైకజీవనం మానవజాతి ఉద్దేశంలో పెద్ద తప్పు....

'రాజుగారి ఖజానాలో దొంగతనం! దొంగను తేలేకపోతే నీ తల!' ఆవిధంగా రాజాజ్ఞ పహరావాళ్ల నాయకుడికి వెళ్లింది. రాజాజ్ఞకు భయపడి, పహరావాళ్లు దొంగకోసం ప్రతి వీధీ, ప్రతి ఇల్లూ గాలించారు. పట్టణద్వార మవతల, పాడుపడిపోయిన ఆలయంలో కాశీలో గుర్రాలను అమ్మకుందామనివచ్చి, తన సర్వస్వం బందిపోటులు కొల్లకొట్టడం చేత, దుఃఖపూరిత హృదయంతో ఇంటికిపోతూన్న తక్షశిల వర్తకుడు వజ్రసేనుని, వాళ్లుచూచారు. అతణ్ణి దొంగకిందకట్టి ఇనుపగొలుసు వేసి పహరానాయకుడు జైలువైపు లాక్కొనిపోతున్నాడు.

ఆ సమయంలో అందకత్తె, వేశ్య శ్యామ కిటికీప్రక్కన కూర్చొని క్రిందజరిగే దృశ్యాలనుచూచి ఆనందిస్తూ, కాలం వెళ్లపుచ్చుతూవుంది. హఠాచ్చలనంతో తన పరిచారికను పిలిచి 'ఎంతచక్కనివాడు—దేవతలకు రాజైన ఆ దేవేంద్రుని సహితము ప్రతిఘటింప తగ్గవాడు! అయ్యో! సాధారణ దోషికిలా ఎందుకు సంకెళ్లేశారు? చెలీ, ఆ నాయకునివద్దకెళ్లి నాపేరుమీదుగా తన బందీతో ఈ ప్రదేశాన్ని పావనంచేయమని వేడుకో' అంది.

అందకత్తె శ్యామవద్దనుండి పిలుపురావటంతోనే కాముకుడైన నాయకుని హృదయంలో ఆనందం పరవళ్లుత్రొక్కింది. తక్షణం బందీని వెనకేసుకొని శ్యామదగ్గరకు పరుగెత్తాడు. 'ఎప్పుడూ ఎరుగని ఈ అనుగ్రహం నీ స్తుతిపాఠకునిమీద ఎందుకు కల్గింది? రాజుగారి పనిమీద పోయేందుకు అనుజ్ఞనియ్యి' అని నవ్వుతూ నాయకుడన్నాడు. శ్యామ 'నా సర్వస్వం తీసుకో. అన్యాయంగా గోషిగా పరిగణింపబడే ఆ నిర్దోషిని వదిలివేయి' అని ప్రాధేయపడింది. 'ఎంతో కష్టమైన కోర్కె—నేను తీర్చకూడదు. రాజు ఉగ్రుడైనాడు. మరి అతనికోపాన్ని ఎవరిరక్తంతోనైన చల్లార్చాలి' అని నాయకుడు సమాధానమిచ్చాడు. శ్యామ అతనిచేతులు పట్టుకుని 'పోనీ, యీ పథికుణ్ణి ఇంకో రెండురాత్రులైనా బ్రతకనీ' అని దీనంగా అడిగింది. 'అంతవరకు తప్పకుండా నా వీలవుతుంది' అని చెప్తూ బందీని తీసికొనిపోయాడు.

రెండవనాటిరాత్రి కాగడా పట్టుకొనివచ్చిన ఓ స్త్రీని లోపల ప్రవేశపెట్టేందుకు, జైలుకొట్టు హఠాత్తుగ తెరువబడింది. ఓమూలని ప్రార్థనాదీక్షలో తన జీవితానికి స్వస్తిచెప్పే ప్రభాతంకోసం ఎదురు

చూస్తూ బరువైన సంకెళ్లలో వజ్రసేనుడున్నాడు. ఆమె కనుసైగ చేయటంతోనే ఫహరావాడు శృంఖల విముక్తుణ్ణిచేశాడు. ఆశ్చర్యచకితుడైన పరదేశి స్ఫటిలపద్మంలాగ సుకుమారంగా, కాంతివంతంగా వున్న చక్కని శ్యామ ముఖాన్ని తన కెదురుగుండా చూచాడు. పూర్తిగా చకితుడై, ఎవరు నీవు? ఈ వానికి ప్రాణవాయువులా వచ్చావు. నేనెట్లా తెలిసికోనేది నిన్ను? క్రూరమైన ఈ పట్టణంలో స్వరూపిణిలుకూడా వున్నారా?'

'నేను దయగల్గినదాన్నా!' జైలుఖానానంతనూ భయంతో నింపుతూ వెకిలిగా ఒళ్లుతెలియకుండా నవ్వింది. నవ్వుతూ, ఏడుస్తూ 'ఈ జైలుఖానాలో నాగుండె ఉన్నంతకఠినంగా ఒక్క రాయైనాలేదు!' ఏడ్చింది. అట్లా అంటూ అతనిచెయ్యి పట్టుకొని జైలు గోడలవతలికి తీసుకొనివచ్చింది.

*   *   *

వరుణానదీ తీరానికి దూరంగా తూర్పువైపున్న అడవిపైని ప్రభాతం స్ఫుటిలమౌతూంది! పడవ లంగరువేసి ఉంది. అతణ్ణి పడవమీదికి తీసికొనివెడుతూ 'రా, పరదేశీ! ఒకే ప్రవాహంమీద కులకేమీ లక్ష్యం చేయకుండగ తేలిపోదాము. నా జీవితేశునిగా నిన్ను తీసుకోనీ' అని శ్యామ అతనితో ఊదింది. పడవ నడవటం ప్రారంభించింది. నది కిరుప్రక్కలనుండీ పిట్టల ఆనందకూజితాలు వినవస్తు గుండెకు ఆమె ముఖాన్ని హత్తుకుంటూ 'నీవు చెప్పు, ఎంతమూల్యం ఇచ్చావు నా స్వేచ్ఛ కొసేందుకు పూర్తిగా వినాలని ఉంది ప్రియతమా! ఈ క్షుభితుడెంతవరకూ ఋణస్థుడో తెలుసుకోవాలని ఉంది!' వజ్రసేనుడు అడిగాడు. అతని వక్షంలో ఇంకా ఇరుకుతూ 'అది అట్లా ఉండనిద్దూ' అని శ్యామ గుస మాటలు పలికింది. బలమైన గాలివేగంతో విసురుగాపోయే ప్రవాహంమీద పడవ జోరుగాపోతూ మధ్యాహ్నమైంది.

పండినధాన్యపు పరిమళభారంతో వెచ్చ వెచ్చని విసురుగాలి శ్యామ ముఖంమీది ముసుగు తొలగించింది. హఠాత్తుగా, మోహజ్వాల వజ్రసేనుని తనువుపై ప్రాకింది. బొంగురుపోయిన గొంతుతో 'నాకు స్వేచ్ఛ చేకూర్చావు. నన్ను ఎప్పటికీ సేవకునిగా చేయటానికే సుమా. నేను జీవించగల్గితే నీకు నా జీవితంలో ఈ నీ ఋణము తీర్చుకోగలనా! నాకు స్వేచ్ఛ ఎట్లాసంపాదించావో మాత్రం చెప్పు' అని తడబడే మాటలతో అన్నాడు. తిరిగి ముసుగు సద్దుకుంటూ 'అది అట్లా ఉండనిద్దూ' అని గ నెమ్మదిగా అంది.

*   *   *

ప్రశాంతంగా బంగారుచాయల తెరచాపలు తెరుచుకున్నై. కాంతి నౌక పారమైన పడమటి క్రిందకు నడుస్తూండగ, ప్రియులనౌకను మలయమారుతం క్రలతోకట్టిన తీరానికి జేర్చింది. నెల అస్తమిస్తున్నాడు. గ్రుడ్డివెల్తురు నీడలు, మిడతల పాటలతోపాటు కదులుతున్నై. పైరుచువ్వలు తంతువులులా వణుకుతున్నై.

దక్షిణపుగాలి ఆమె వేడినిట్టూర్పులతో కలిసిపోతూంటే శ్యామ దీపం ఆర్పేసి తన భుజానికానుకొని కూర్చుంది. ఏదో వింతైన గూడులాగ సువాసనలీనే ఆమె వంకివంకీలకురులు వక్షాన్ని కప్పివేసినై. 'ప్రియా! నీకోసం నేను చేసింది నిజంగా చాలా కష్టమైంది. అది నీకు అంత కన్నాకష్టమైంది. నేనుచెప్పే రెండుమాటలు నీవు వినటంతోనే ఆ కష్టాన్ని మరపింపచేస్తాయి.

సమై నా ప్రేమకోసమై ప్రాకులాడుతూన్న నవవయస్కుడు, ఉత్తీయుడు, నన్ను సంతోషపెట్టేందుకు నీశిక్ష ననుభవించాడు. నీగురించి నాజీవితంలో ఎప్పుడూచేయని అధమమైన నేరంచేశాను. అది నా ఉజ్జ్వలమైన ఆనందం' అని శ్యామ బరువుగా చెప్పింది.

జీర్ణించిపోతూన్న చంద్రుడు మాయమయ్యాడు. లెక్కింపరాని పక్షుల నిద్రతోపాటు అడవిలోని చెట్లు మూగవోయి నుంచుని ఉన్నాయి. శ్యామ నడుమును చుట్టుకొన్నచేయి నెమ్మదిగా జారిపోయింది. భరింపరాని ఎడబాటుప్రియుల మధ్య ఆవరించింది. శిలావిగ్రహంలా నిశ్చలంగా వజ్రసేనుడు కూర్చొన్నాడు. శ్యామ అతనికాళ్లమీదపడి విచ్ఛిన్నమైపోయిన లతలాగ అక్కడే పడిఉంది. నీలిరంగులాఉన్న నది మీద అంధకారం గాఢంగా అల్లుకుంది. హఠాత్తుగా వజ్రసేనుని మోకాళ్లను తనకున్నబలంతో పట్టుకుని 'ప్రియా! నన్ను క్షమించవూ! నేను విధికృతంచేత చేసిన నేరానికి పరమేశ్వరుడు క్రూరమైన ప్రతిఫలం నాకు కల్గ చేయనీ! నీవుమాత్రం నీకోసం చేసినదానికి క్షమించు' అని శ్యామ అశ్రువులురాల్చని పెద్ద ఏడ్పు ఏడ్చింది. తన పాదాలను విదిలించుకుని తీక్షణంగా శ్యామవైపు చూస్తూ 'నా ఈ ప్రాణాన్ని రక్షించవలసిన అవసరం నీకు ఏం కల్గింది? ఎప్పటికీ నా ఊపిరి నీ నేరంతో కొన్నావనే జ్ఞప్తిచేత మలినమవుతుంది. మర్యాదహీను రాలా! నీ అవమానానికి ఋణమైన ఈ జీవితం శాపహతి నొందాలి' అని వజ్రసేనుడంటూ విడిపించుకుని, అడుగడుక్కీ ఎండాకుల్ని కదలిస్తూ ఎంతో చీకటిగాఉండే అటవీ గర్భంలోకి మాయమైపోయాడు. చలనం లేని గాలిమీద మత్తెక్కించే చెట్లఆకుల పరిమళం ప్రేళ్లాడుతూంది. ఆవరించిన విషాదంలో లెక్కలేని కొమ్మలు పెద్దవిగా భయంకరరూపాలు దాల్చాయి. ఆ దట్టమైన వనలతా శృంఖలాలు త్యజించిన మోస్తరుగ చేతులను చాచుకొని ఉన్నాయి. అలసిపోయిన బాటసారి బడలికతో నేలమీదికి ఒరిగాడు.

నీడలాగ ఒకపిశాచరూపం అతని దగ్గరగానుంచుంది. నెమ్మదిగా చీకట్లో దీర్ఘమైన కష్టమిచ్చే దారిలో అతని అడుగుల్లో ప్రేళ్లాడుతూందామె. ఆమె కోమలపాదాలు రక్తసిక్తమైనై. గుప్పిళ్లువిసురుతూ 'నన్ను వక్కణ్ణీ ఉండనీయవా?' అని కోపంగా గర్జించాడు. తన కౌగిలింతలతోటి, జారిపోతూన్న కుంతలాల తోటి, తన త్వరితచుంబనాలతోటి, వేడి నిట్టూర్పులతోటి ఒక ప్రవాహంలాగ విరుచుకుపడి అతని శరీరాన్ని ముంచి, ఆమె అతన్ని మెరుపుకన్న వేగంతో పట్టుకుంది. ఆవేశంలో మాటరాక 'ఎప్పుడూ నిన్ను వదలలేను. ఎందుచేతనంటే నేను పాపంచేశాను. మరి నీ దగ్గిరనుంచే నా అంతిమ ప్రతిఫలమో, దండనో పొందాలి' అని ఆయాసంగా ఉచ్చరించ కల్గింది.

జరుగబోయే ఘోరకృత్యం సూచిస్తూ గ్రుడ్డివెన్నెలైనాలేని విషాదావరణంలోఉన్న చెట్లను మూగ చేసిన ఆ అంధ పూర్వస్మృతి ఏమిటి! ఆమె కంఠం నొక్కేముందు అంతిమ విషాదవిజ్ఞానం బరువైన చప్పుడుతో ఒక ఆకృతి నేలమీద దొర్లింది.

ఉదయారుణకాంతి తళుకులతో పుణ్యగంగఒడ్డునవున్న దేవాలయ గోపురంమీది త్రిశూలాన్ని మలాముచేస్తూంటే వజ్రసేనుడు అడవినుండి తిరిగి వెనక్కిదారిపట్టాడు. గాజుపారిన పిచ్చికళ్లతో ఆరోజంతా ఏ లక్ష్యంలేకుండా తిరిగాడు. మధ్యాహ్నం సూర్యుడు తన మంటకొరడాతో ఈచంపా ఆచంపా వాయించాడు. దాహంచేత అతని గొంతుక ఎండిపోయింది. కాని దగ్గరఉన్న నదిలోని ఒక నీటిబొట్టైనా ముట్టలేదు. జ్వరంచేత దహించుకుపోతూన్న శరీరంతో మునిమాపువేళ ప్రియులు లంగరువేసి, వదలివేసిన

పడవదగ్గరకు మంటవైపు చిమ్మట ఎట్లా పరుగెడుతుందో అట్లాగ వజ్రసేనుడు పరుగెత్తాడు. అతని గ్ర ఒకకడియం కనుపించింది. తనగుండెకు హత్తుకున్నాడు. దాని మువ్వలచప్పుడు శతశరాలు కోసినట్టు పించింది. ఒకవైపున ఆమె నీలివర్ణపుదుస్తులుప్రోగుగా పడివున్నై. ఆమె సున్నిత అవయవాల నిలిచి సువాసనను తీరని ఆతురతతో ఆఘ్రాణిస్తూ తనముఖాన్ని దుస్తులముడతలలో దాచుకున్నాడు.

ఇసుకతిన్నెపైని ఒక నీడ చెట్లమధ్య పిశాచంలాగ కనుపించింది. 'నా దగ్గరకు వచ్చేయ్, ప్రేమమయీ!'అని వజ్రసేను డేడ్చాడు.

'ఇక్కడున్నా, నాప్రభూ!'అని అంటూ శ్యామ అతనిపాదాలమీద వ్రాలింది. 'క్షమిం నన్ను. అయ్యో! నీ జాలిచూపే హస్తాలు నా బరువైన ఊపిరిని ఆర్పివేయలేకుండగ ఉన్నాయి' వజ్రసే ఆమెముఖం కేసి వెఱ్ఱిగా చూడడం మొదలెట్టాడు. సాష్టాంగా కృతిలోవున్న ఆమెను తన చేతుల పోగునా ఎత్తుకుందామనుకున్నాడు. కాని పులకరంవచ్చి అతన్ని సమాధ్యవస్థనుండి లేపివేసింది. అత తోసేస్తూ 'మళ్లాఎందుకు తిరిగి వచ్చావు?' అని గర్జించాడు. కడియాన్ని అవతలికి విసిరేశాడు. రగుల్తు నిప్పులాగున్న ఆ నీలిదుస్తుల్ని తన్నాడు. తనరెండు కళ్లనీ మూసుకుని, మరొకవైపు ముఖంత్రిప్పి 'పో! నన్నొక్కణ్ణీ వదిలేయి' అని కేకవేశాడు. శ్యామ అవనతవదనయై కొంచెంసేపు అక్కడనే నుంచు తర్వాతవంగి, తనునుదిటిని క్రిందకు ఆజ్ఞా బద్ధురాలుగా దించింది. నదివడ్డు దిగిపోతూ, విపినాంధకారం నడిచిపోయింది. ఐహిక లోకానికి పనికిరాక ఒకరి ప్రశాంతతను కొంచెంసేపు కలవరపరచే స్వప్నంపా ఆమె గభీరరజని ఆలింగనంలో మాయమైపోయింది...

(రవీంద్రుని ఆంగ్లకథకు అనువా

విరహిణి

చూపులే తూపులై
చూరగొన్నవి మనసు
తడబడుచు నీదరికి
తరలివచ్చితి గాదె!

హేమంత నిశిపోలె
నెమ్మకున్నది యెడద
చరణస్పర్శాశ్లేష
రైన కరుణింపుమా!

మనికి మరిపించేటి
మధుర భాషణముతో
పలుకరించుట కైన
ప్రాణేశ; తగనా!

ఏకతమ కూరుచుని
'ఏకతార' ను మీట
పూర్వాను భవమేలొ
కెక్కరించునెడంద

ఆకాశ మొకతీరు
మొయిలుహొయ లొందగనె
చెమ్మి నెమ్మనముతో
నీకొరకె పలవింతు.

నీపాద పూజకై
నే పూవులనుకోయ
నీ మధురమూర్తియే
నిత్య సన్నిధానమే!

గాలిలో కదలాడు
గానమాధురి గ్రోలి
నీ జాడలరయనే
నిటునటుల పరువెడుదు!

నీనామ మననమున
నీశ్వాస నేర్చితిని
నీప్రేమ వరముచే
నీకరమె కోరితిని!

—శ్రీమతి
జ. సుభద్రాదేవి



సన్‌లైట్ సబ్బును వాడుటకు ఆరంభించి నప్పటినుండి
నీషర్టు చాల ఎక్కువ తెల్లగ నుంటున్నది.

సన్‌లైట్ సోపును వాడుటకు ఆరంభించినందున నాకు చాల సంతోషము. సాధారణమైన బీడు సోపుల వెల తక్కువగా ఉండవచ్చును కాని అవి నా పైకమును నిలువపెట్టుటకు తోడ్పడవు. ఎందుకనిన సన్‌లైట్ సోపు ఇచ్చునట్లు మిగిలిన సోపులు అంత శుభ్రపఱచు నురుగు నిచ్చుట లేదు. నురుగే గుడ్డలను శుభ్రపఱచునట్టిది. సన్‌లైట్ సోపు మంచి గుణముగల ఈ నురుగును ఎక్కువగ ఇచ్చుటచే పైకము ఎక్కువ సెలవగుట లేదు. ఒక్కొక్కరు మన దుస్తులన్నియు చాల శుభ్రముగాను, క్రొత్తవిగాను ఉన్నవని చెప్పెదరు.
మఱియు, సన్‌లైట్ వస్త్రములకు ఇంపైన వాసనను ఇచ్చుచున్నది.

సరియైన సన్‌లైట్
సోపు ఇట్టి అట్ట
పెట్టెలలో అమ్మబడును.



S. 17·50 TL

LEVER BROTHERS (INDIA) LIMITED

★ సర్వోదయము – సామ్యవాదము ★

—శ్రీమతి—

వల్లభనేని రంగాదేవి

విశ్వమానవ కల్యాణానికి 'అహింస' ఆచరణీయమంటాడు...ఉజ్వలమైన రాజ కీయ, నైతికజీవనానికి దీన్ని ప్రాతిపది కను చేశాడు...దీనివల్ల 'సర్వోదయం' సిద్ధిస్తుందంటాడు—గాంధిజీ.

అయితే దీని అంతరార్థం ఏమిటి?

మానవసంఘములో వ్యాపించియున్న అశాంతిని, హాహాకారాన్నీ రూపుమాపాలంటే ? ఉపాయాలు; ఒకటి సామ్యవాదము, రెండు సర్వోదయము. సామ్యవాదమనగా కమ్యూనిజ వైజ్ఞానికముగాను, శాస్త్రీయముగాను రూపమిచ్చినది కాల్ మార్క్స్. దాని యాదర్శము వర్గ సంఘస్థాపన. - సర్వోదయశబ్దముయొక్క జన్మదాత, దాని ప్రచారకుడూ మన ముసలితాత గాంధిమహా సర్వమానవోన్నతి, సర్వమానవ సమత్వము దీని ఆదర్శము. వర్గరహిత సంఘకల్పన మూలమందు స వాద సిద్ధాంతము పనిచేయుచున్నది. ఒకరికొకరు కష్టములు సమకూర్చుకొనుట, యొకరినొకరు కష్టపె యొకరి వున్నతిజూచి మరొకరు యోర్వలేకుండుట మొదలగు భావాలు సంఘములో ఉండకూడదు. వైష మానవులంతా ఒకేవర్గమునందుండాలి. అదే మానవజాతియై వెలయాలి. సంపదలందు వ్యక్తిగత యధి ముండగనే పరస్పర ద్వేషాలు, పాలితపాలక యభిప్రాయాలు జనించి పెరుగుతాయి. కాబట్టి సంఘ నుండి, సంపదమీదనుండి, అనగా యుత్పత్తిసాధనాలమీదనుండి వ్యక్తిగత యధికారము తొలగిం అనునదే సామ్యవాదముయొక్క ముఖ్యసిద్ధాంతము. అట్టి సంఘమెటుల నిర్మితమౌతుంది? దీనికి సమా మేమి చెపుతారంటే, మొట్టమొదట యేవిధంగానైనా రాజనైతిక యధికారం సంపాదించాలి. ప్ర నియంతృత్వం యేర్పరచి, పిమ్మట దానిబలంతో ఆదర్శసంఘాన్ని యేర్పరచాలి. రాజనైతిక అధి పొందుటకు, మనకు హింసాత్మక బలంతప్ప వేరేవుపాయం లేదు; గత్యంతరమూ లేదు. అని సామ్యవా లంటారు.

సర్వోదయ ఆదర్శముకూడా యిదే. సంఘములో దౌర్జన్యం, అశాంతీ ఉండకూడదనే దాని విధులలో భేదమున్నది. మహాత్ముని దృఢాభిప్రాయంకూడా యేవిధమైన అశాంతినీ సంఘ వుంచకూడదనేదే. కాని, మన వ్యక్తిగత సాంఘికజీవితంలో అహింసకు సర్వప్రథమ సర్వోన్నత యివ్వాలి అని. హింస అంటే యితరులను అణచి, వారిని యేపనినైనా చేయుటకు బలాత్కరిం మొదలగు కృత్యములు. అహింస అంటే యితరుల ఆత్మలను తన సత్ప్రవర్తనవల్లనూ, సద్భావములో ప్రేమతోనూ సందర్భానుసారంగా, స్వయంగా కష్టాలు సహించియైనా జయించి, తన కనుకూలంగా కొనుట. యేదో యొక హింసాశ్రయములేకుండా యెవరూ యెవరినీ పీడించజాలరు. పీడించడం న్యాయంగా, ధర్మంగా యొకవస్తువును పొందుటకు అధికారం లేనప్పటికీ దానిని మాయ, మోసం, మొదలగు జిత్తులద్వారా తన యధికారము క్రిందకు లాగుకొనుటే. నిజంగా, న్యాయంగా, స్వ

మీాదే వుంటే యేవస్తువు మనకు దక్కదో అందుకు కొంచెము దుశ్శీలముతోనూ, గుప్తంగానూ, అప్రత్యక్ష మార్గావలంబనముతోనూ సంచరించాల్సి వస్తున్నది. దీనినే పీడించడం అంటారు. యిందులోనే హింస నిబిడీకృతమై యున్నది. ఇందువల్లనే గాంధిజీ యేమంటాడంటే, 'పీడించుట అనేదాన్ని నాశనముజేసేముందు, హింస అనుదాన్ని రూపుమాపండి. అంటే యేరూపములోనైనా సరే, సూక్ష్మరూపంలో కానీయండి, స్థూలరూపములో కానీయండి, హింసకుమాత్రం ఆశ్రయమివ్వకుడు' అంటాడు. గాంధిజీ యీ వుద్దేశ్యం బాగుంది. సామ్యవాదువలె ఆదర్శ సంఘరచనకుముందు, రాజనైతికబలం అవుసరం అనేదికూడా అక్కర్లేదు; రాజనైతిక బలమందునుకూడా హింసవుంటుంది గనుక. పైగా రాజనైతిక ఒత్తిడిలేకుండా, యే కార్యము సాఫల్యమగునో అదిచాలా శుద్ధముగాను, యెక్కువకాలము మన్నేదిగాను అయివుంటుంది. దాని రాజనైతిక యాదర్శం రామరాజ్యం. అంటే అంతా మంచిదనుకొనేది. అది పైనుండి అదమాయించే నియంతృత్వమును యిచ్చగించదు. దానివల్ల మానవస్వతంత్ర వికాసంకలుగదు.

సామ్యవాదులు జెప్పేదేమంటే ముందు సంఘటితహింసద్వారా, రాజనైతిక అధికారం సంపాదించి, తదుపరి దానిద్వారా సంఘములో హింసావృత్తి అనేదాన్ని రూపుమాపాలి అని. ఆలోచించి చూస్తే, హింసాబలముతో సురక్షితముగనున్న రాజ్యమును స్వాధీనం చేసుకోవాలంటే, అంతకన్నా హెట్టింపు హింసాబలమును సంపాదించాలి; స్థిరపరచాలి. అదీగాక, యిరుగు పొరుగు రాష్ట్రాలు ఆక్రమించుకొనకుండా కాపాడుకోవడానికి ఆస్థిరపడ్డ హింసాబలమునుపోషించాలి; ఖాయపరచాలి. అహింసద్వారా రాష్ట్రోద్ధరణ జరిగినప్పటికీ, విశ్వాసంలేకపోతే మాత్రం మనంకూడా హింసాబలమును విడనాడజాలము. యిరుగు పొరుగు దేశాల్లో విశ్వాసం సంపాదించలేము. తత్ఫలితముగా దీర్ఘ కాలపర్యంతము హింసాబలాశ్రయమునుండి విముక్తి పొందజాలము.

హింస అహింసకన్నా శ్రేష్ఠమైనటిన్నీ, హింస అహింసకన్నా నైతికంగా యోగ్యమైనదనిన్నీ, అందరకూ తెలుసును. కాని హింసాబలముతో నేడు నెరవేరుచున్నపనులన్నీ అహింసద్వారా నెరవేరుతవా? అహింస హింసకన్నా కార్యానుకూలమైనదా? వ్యవహారయోగ్యమైనదా? అన్న సందేహం కలుగుచున్నది. దీనికి మహాత్ముని జవాబేమంటే 'కాకున్నప్పటికీ హింస పనికిరాదు'. అంటే_అహింసావలంబనలోనే పనులు నెరవేరతవి, అత్యల్పకాలములోనూ, మరింతబాగుగాను. అయినప్పటికీ హింసాబలముతో నెరవేరుతున్నంతవేగంగా, అహింసాబలముతో నెరవేరుతున్నట్లు కాన్పించవు. కాని ఒకపర్యాయము అహింసా విజయము ప్రారంభమైనదంటే, సత్ప్రవర్తనతో అహింసాపథమున నడచినంతకాలము పరాజయమనేది కాన్పించదు అని ఆయనవిశ్వాసం. కాని యిది నిజం. అహింసాత్మకమైన సంగ్రామవిధానం యిప్పుడే వ్యాపించక పోవుటచేతను యేండ్లతరబడీ అభ్యాసమందున్న హింసాత్మకయుద్ధం శాస్త్రంగా తయారైవున్నది. క్రమేపి, మనం అహింసాత్మక బలప్రయోగం అభ్యాసంచేస్తూవుంటే దాని శాస్త్రంకూడా దానంతటదే తయారవుతుంది. మనం దీనిమీాద ఆలోచించినకొద్దీ, అవగాహనచేసుకున్నకొద్దీ, దివ్యభవిష్యకాంతులు దృగ్గోచరమవుతవి. మనబుద్ధి నిజంగా అహింసా శ్రేష్ఠత్వమును గ్రహించిననాడు, అందు నిత్యనూతన ఆశ్చర్యానుభవములుగాక మానవు. అనుభవములోనికివచ్చిన కొద్దీ దృఢత్వ మేర్పడుతుంది. అహింసా సాధన కదంతొక్కితే వచ్చేదికాదు. చిత్తవృత్తిని నిర్మలంగానూ, నిస్స్వార్థంగానూ, నిరభిమానంగాను, రాగద్వేష రహితంగానూ వుంచాలి. యిందులోనే అమోఘమైనబల ముత్పన్నమవుతుంది. దాని ప్రయోగపథమున గూడా ప్రకాశం జ్వాలాయమానంగా వుంటుంది. మహాత్ముడు యేపుస్తకమూచదివి మనకు అహింసా యుద్ధ పద్ధతులు నేర్పుటలేదు. ఆయనచిత్తమును అహింసామయముగ జేసుకున్నాడు. ఇందువల్ల ఆయనకామార్గము తొందరగా దృష్టి గోచరమగుచున్నది. మనముకూడా అహింసావలంబులమై యితరులకు చోరవనిస్తూన్నప్పుడు గాంధీయులమైపోదుము. అప్పుడే, ఆనాడే, అహింసాశాస్త్రము నిర్మాణమగును.

హింసాత్మక, అహింసాత్మక బలాలపై ఆధారపడ్డ మానవుల ప్రతిష్ఠల్లో పెద్దభేద కాన్పిస్తున్నది. ఒకనికి మానవప్రకృతికి మూలకందమైన సత్ప్రవృత్తిమీద విశ్వాసంవుంటే, రెండవవాని శ్వాసము. విశ్వాసమున్నట్టివ్యక్తి నిరాశాసమయాల్లోకూడా హృదయస్థమైన దానిమీదనే యాధారప కర్తవ్యపథమును దప్పకపోవును. యెదటివాని హృదయము మారినటుల చివరకుగాంచును. యిప్పటి శత్రువుగాడు; మిత్రుడగును. యెందుచేతనంటే వాని పోట్లాట, వ్యక్తితోగాక అతని అవగుణాలతో కుప్రవృత్తులతోనూ గనుక. కాబట్టి అతను ఆమూలాగ్రంగా వ్యక్తియొక్క నాశనంకోరడు. అత యొక్క గుణాలను, శక్తులనుకూడా నాశనం చేయడమంటే సంఘాన్ని ద్రోహము చేయడమున్నూ, క్రూ హింసించుటాను. దీనికి వ్యతిరేకంగా మానవుడు ముఖ్యంగా 'స్వార్థి' అని అనుకుంటే అహింసామ మును యెలాగు ర్తిస్తాడు? దాని వుపయోగానుభవములు యెలా పొందగలుగుతాడు? కమ్యూనిష్టుల, గా వాదుల విశ్వాసాల్లోయున్న అంతరమిదియే. గాంధివాది మానవప్రకృతికి మూలకందమైన సత్ప్రవృ నమ్ముతాడు. కమ్యూనిష్టుల అనుభవాలకూ, అవలోకనలకూ, హద్దు, పరిమితి, అనేదివుంటే గాంధీవా యొక్క మూలమునందున్న యాధ్యాత్మికతత్వమూ, వేలకొలదీ వత్సరములనుండి క్రియారూపంగా జరుగు వచ్చిన ఫలితమూ, నిండువిశ్వాసమూ, పూర్వాపరజ్ఞానమూ, వాళ్లకే గోచరమవుతుంది.

అహింసా విజయాధారం చిత్తవృత్తిలోవుంది. హింసావిజయాధారం శరీరంమీదవుంది. చిత్త యొక్క సామ్రాజ్యంలో ప్రవేశించిపోతూన్నకొద్దీ అహింసా చమత్కారాలు, బలాలు, అనుభవము వస్తవి. కాని ఆచిత్తాన్ని మనమెరసి సరియైన మార్గమునబెట్టాలి.

మొట్టమొదట అహింసాతత్వాన్ని ప్రపంచమందు క్రియారూపమున బెట్టగల్గినది గాంధిమహాత్ము దానిలో యఖండవిజయంపొంది ప్రపంచమందు ఆంతరంగిక బాహ్యాపోరాటాలను రూపుమాపుటకు హిం తీసిపోదని ఋజువుపరచినది కూడా మహాత్ముడే.

కమ్యూనిష్టుల, సోషలిష్టుల, ఆత్మల్లోగనుక అహింసాతత్వముయొక్క విరోధరాహిత్య సిద్ధా పడితే 'సర్వోదయము—సామ్యవాదము' అను విభేదము ఎవరి మనస్సుల్లోనూ ఉత్పన్నముకాదు. 'సామ్యవాదము' అను పదమునకు బదులు 'సర్వోదయము' అను పదమే సార్థకమవుతుంది; భావాత్మక కూడా వుంటుంది.

విభీషణప్రబోధము

గీ. పుడమిఁగల జీవులను గడగడవడంకఁ జేయఁజాలుదు ననియింతఁ జేసితీవు
రాముఁడు నరుఁడటంచు నిరాకరింపఁ బూనితి భగవదంశ సంభూతుఁడతఁడు.

క. సురలును విద్యాధర కిన్నరులును మునిపుంగవులును నరులుఙ్ బొగడఙ్
హరి దశరథసూనుండై దురితాత్ములఁ జంపఁబుట్టె దోర్బలయుతుఁడై.

గీ. ఇలనుగల క్షత్రియులను ముయ్యేడుమార్లు వెదకిచంపిన యట్టి యా విప్రవరుని
నధిక తేజునిఁ బరశురామావతారు భంగపఱచెను రాముఁడవ్వార్త వినవో?

గీ. పరసతినిఁ దల్లిగాఁజూచి వరలవలయు ప్రజల బిడ్డలవోలెఁ గాపాడవలయు
బుధుల దర్శించినపుడు శేల్మోడ్పవలయు సకల సౌఖ్యంబులందె భూజానికబ్బు.

గీ. కానసీతను భూజాతఁగమలనేత్ర రాఘవునికొసఁగి యతనిఁ బ్రాపుఁగనుము
హితముసెప్పఁగ నాకేఁడెంత యనుచు నలుగవలదేను నీమేలు నభిలషింతు.

—శ్రీ గంథం నరసింహాచార్య



ప్రభల సుందరీబాయి   వల్లూరి శ్యామలాదేవి   దేవరకొండ సీతాబాయి

బొంబాయి ఆంధ్రమహాసభ మహిళాశాఖా సభ్యురాండ్రు.

౮-వ వార్షికోత్సవ సందర్భమున ఆటలపోటీలు జయప్రదముగా జరిగినవి. కేరమ్సు సింగిల్సులో ప్రథమ బహుమతి శ్రీమతి ప్రభల సుందరీబాయి గారికిని, ద్వితీయ బహుమతి వల్లూరి శ్యామలాదేవి గారికిని యొసంగబడినవి. షటుల్ కాక్ సింగిల్సులో శ్రీమతి వల్లూరి శ్యామలాదేవిగారికిని ద్వితీయ బహుమతి శ్రీమతి దేవరకొండ సీతాబాయి గార్లకు నొసంగబడెను.

కాకినాడ స్త్రీ విద్యార్థినీ సమాజముయొక్క 26-వ వార్షికోత్సవము

సమాజ కార్యదర్శిని శ్రీమతి వేమగంటి పాపాయమ్మగారు, సమావేశమునకు అధ్యక్షతవహించిన శ్రీమతి మల్లిపూడి లీలావతీ చెల్లయాంబగారు (తూర్పుగోదావరి జిల్లాబోర్డు అధ్యక్షులు శ్రీ మల్లిపూడి పళ్లంరాజుగారి సతీమణి) ప్రథమ వస్తుప్రదర్శన ప్రారంభోత్సవమును జరిపిన శ్రీమతి వేదాంతం కమలాదేవిగారును వరుసగా మధ్యను కూర్చొనియున్నారు.

శుచి

(ఏకాంకిక)

– శ్రీమతి –

అవధానం సీతాలక్ష్మి

క్రీ. పూ. మూడవ శతాబ్దం.

శ్రావస్తిక సమీపంలో ఒక పెద్ద అడవి; బోధి వృక్షచ్ఛాయల్లో పచ్చిక బయలు; సంజకెంజాయలో రత్నకంబళంవలె ముద్దులుకురుస్తూంది; పచ్చగా లేతిము త్తైదువువలె ప్రకృతి కళకళలాడుతూంది; ఆకాశంలో అక్కడక్కడ మేఘాలు దట్టంగా క్రమ్ముకొన్నవి; అంతా ప్రశాంతం.

పద్మాసనం వేసికొని, కృష్ణాజినంపైన కూర్చుంది భిక్కుని శుచి; ఎడమచేతిప్రక్క ఒక కమండలం; కుడిచేతిప్రక్క ఒక యోగదండం; కాళ్లదగ్గరే ఒక సెలయేరు పారుతూంది; పంచమస్వరంతో కోయిల మంగళారతి పాడుతూంది.

భిక్కు గౌరాంగుడు ఒక కర్ణికారం కోసి ముద్దుపెట్టుకున్నాడు; సంతోషం పట్టలేక ఆమ్మను కౌగిలించుకున్నాడు.

[సూర్యుడస్తమిస్తున్నాడు]

గౌరాంగుడు (ఉన్నట్లుండి):-శుచీ! అదిగో! చూడు! అంతా మాసిపోయింది! అయ్యో! ఇంక కనబడదూ?

(శుచి ధ్యానంలోవుంది. గౌరాంగుడు ఆమెదగ్గరకు పరుగెత్తుతాడు)

శుచీ! చీకటి! అబ్బా! చిమ్మచీకటి! గ్రుడ్డివాణ్ణే! చూడు! అంతాపోయింది!

(కళ్లుతెరిచింది; ముసిముసినవ్వులతో అస్తమించే సూర్యుణ్ణి చూచింది శుచి)

గురుదేవా! సాష్టాంగములు!

గౌరాంగుడు:-శుచీ!

శుచి:-ఔను. బుద్ధభగవానుని చూచినట్లే వుందికదూ?

[సూర్యునికి నమస్కరిస్తుంది.]

గౌరాంగుడు:-చచ్చిపోతూన్నాడు పాపం! వాణ్ణి చూస్తే నాకు జాలి కలుగుతూంది. శుచీ! వృద్ధిక్షయాలు ఒక్క మానవునికే అనుకున్నాను.

శుచి (ఆకాశంవైపు చూస్తూ):-అక్కడ చూడు! ఎంత భీభత్సంగా వుందో!

[ఉరుము వినబడుతుంది.]

గౌరాంగుడు:-అంత పిటికివాణ్ణి కాదులే!

శుచి:-అంటే?

గౌరాంగుడు:-అయ్యో! జగజ్జ్యోతి ఆరిపోతూందే!

శుచి:-హుం! పిటికివానివి కాదుకదూ? మరి ఎందుకాకన్నీరు! ప్రొద్దు క్రుంకుతూందనేనా?

గౌరాంగుడు:-ఎప్పుడూ పగలే కావాలి! ఎంత ప్రకాశం! ఎంత సుందరం! ఆహా! స్వర్గమే!

శుచి:-అడుగుతప్పిన నృత్యాన్ని ఎవరు చూస్తారు?

గౌరాంగుడు:-ఆం! అయితే ఇది నాట్యభంగిమమేనా?

శుచి:-కాక? ప్రకృతితాండవం.

గౌరాంగుడు:-అయ్యో! కాదు శుచీ! ప్రళయతాండవం! చూడు! పద్మిని ఎంతగాఏడుస్తూందో! వాడివాడి వరుగైపోయిందే!

శుచి:-అక్కడ! కలువ వెన్నెల చల్లుతూందే! కనబడలేదూ?

గౌరాంగుడు:-సూర్యుడు లేకుంటే నేను బ్రదుకనే లేను!

శుచి:-మునిమాపు కమ్మ వెలుగులేదూ?

గౌరాంగుడు:-అదంటే నాకు అసహ్యం.

శుచి:-ఎందుకూ?

గౌరాంగుడు:-భగ్నజీవి వికృతాట్టహాసంవలె వుంది!

శుచి:-అలాఅనకు. దానిసౌందర్యం దానిది. ఎప్పుడూ సూర్యుడే వుంటే విసుగనిపించదూ? జీవితమంతా ఒక్కటే వెన్నెలరేయి అయితే, ఆ మనుష్యునికి చిత్రవధ అన్నమాటే! సృష్టిలోని ప్రతివస్తువునూ నిష్పాక్షికంగా ప్రేమించాలి.

గౌరాంగుడు:-ఏమిటో!

శుచి:-సమదృష్టి లేకుంటే కళ్లు పురుగుపట్టిపోతవి. కాస్త కళ్లు తెరు.

గౌరాంగుడు:-నన్ను ప్రేమించవూ?

శుచి:-అన్నా! నీవు నా బహిఃప్రాణం.

గౌరాంగుడు:-'అ-న్నా'—(అదరిపడ్డాడు; ఊరకే బాధపడుతున్నాడు) శుచీ! నన్ను అలా ఎప్పుడూ పిలువకు.

శుచి:-ఏమి?

గౌరాంగుడు:-మనము అన్నా చెల్లెలు కాలేము.

శుచి:-ఏమిటీ!

గౌరాంగుడు:-ఏమిటో చెప్పలేను. కాని సత్య మెక్కడ పోతుంది?

శుచి (తనలో):-పాపం! బలహీనుడు! ఆ ప్రళయ సంక్షోభం భరించలేడు.

[పిడుగుపడుతుంది; ఆకాశమంతా ఊగిపోయినట్లుంటుంది.]

గౌరాంగుడు:-శుచీ!

శుచి:-అన్నా! శుచి ఎప్పటికీ నీ చెల్లెలే!

గౌరాంగుడు:-ఊఁహు. కానేకాదు.

శుచి:-ఏమీ?

గౌరాంగుడు:-నేనుమాత్రం అలా పిలవను.

శుచి:-ఎందుకన్నా?

గౌరాంగుడు:-శుచీ! హృదయానికీ కళ్లున్నవి

శుచి:-ఎక్కడ?

గౌరాంగుడు:-మాటలే!

శుచి:-అన్నా! నన్ను చెల్లీ అని పిలువవూ? నా అదృష్టంలేదూ! అంత అర్హతలేదూ!

గౌరాంగుడు:-ఏమిటో నాకేతెలియదు. నా యాన్నడుగు, చెప్పుతుంది.

శుచి:-చెప్పవూ?

గౌరాంగుడు:-ఊఁహు.

శుచి:-సరేకదూ?

గౌరాంగుడు:-అబ్బా! నాబాధ నీకప్పుడే అర్థ నన్నూరకే అలయింపకు శుచీ!

శుచి:-అన్నా! నిజంచెప్పు. చెప్పేదంతా నీవు చే వున్నావా?

గౌరాంగుడు:-అనుకుంటూ.

శుచి:-మఱి ఇప్పుడు నన్ను నిలువునా కోసేస్ న్నావే! అహింసాధర్మంపైన ఎన్ని గంభీ న్యాసములిచ్చావో జ్ఞాపకముందా?

గౌరాంగుడు:-శుచీ! నేను బ్రహ్మరాక్షసుడను

శుచి:-అబ్బే! ఎవరన్నారు? శుచీదేవి స రాక్షసుడెలా అవుతాడు? స్వర్గాన్నే స రింపగల మహాత్ముడే! (ఆదుర్దాగా) అన్న ఎందుకూ? ఏమి చెప్పవూ?

గౌరాంగుడు:-'అన్నా'! అబ్బా! శుచీ! వి ఎవరు నీ అన్న? అయ్యో! నీ ప్రేమమూ 'అన్నా' అని పిలుస్తావే! (వాడిపోయిన చంపకం తీసికొంటాడు.) శుచీ! ఏదీ! సారి నవ్వు. ఇది కళ్ళుతెరుస్తుంది. హృ అంకితమిస్తుంది.

శుచి:-ఎవరికి?

గౌరాంగుడు:-నీకు! తనకు నూత్నయౌవనం దించిన తేజశ్శక్తికి!

శుచి:-అన్నా! ఎంత వెఱ్రివాడివి!

గౌరాంగుడు:-అనురాగపూతమైన నీ అపాంగావలోకనంకోసం ఏండ్లకొద్దీ తపిస్తున్నాను.

శుచి:-తాపమే!

గౌరాంగుడు:-కాదు, తపస్సు. శుచీ! నీ దాసుణ్ణి. దగ్గరతీయవూ? అబ్బా! నీ హృదయం వజ్రమే! శుచీ! శుచీ!!

(ఆమెకాళ్లు పట్టుకోబోతాడు; తత్క్షణం ఆమె అతన్ని లేవనెత్తుతుంది.)

శుచి:-విచ్చీ విచ్చని ముగ్ధపుష్పాన్ని ఎప్పుడయినా చూచినావా?

గౌరాంగుడు:-ఒక్కసారికాదు. గాలికివిగిరే కుచ్చెళ్లు సవరించుకోకుండా, వచ్చీరాని నగ్నగీతికలతో, భాగీరథీ తీరంలో నళిని అళికుమారునితో దాగుడుమూతలాడుతుంది. ఎన్నోసార్లు చూచాను.

శుచి:-అప్పుడు నీమనస్సు ఎలావుంటుంది?

గౌరాంగుడు:-కోసి ముద్దుపెట్టుకుంటాను. శుచీ! సౌందర్య మెందుకు? అనుభవించుటకు కాదూ?

శుచి:-అన్నా! నిత్యాన్నే ప్రేమించు. నిత్యాన్నే అన్వేషించు. కన్నులకగపడేదే క్షణికం. విరికన్నెలనుచూచి మురిసిపోతావే! గాలి కౌగిటిలో చిక్కినప్పుడు ఆ ఒయ్యారమంతా ఏదీ? దుమ్ములో కలసిపోయింది. తళుక్కున మెఱసి క్షణంలో సౌదామిని శూన్యంలో చేరుకుంది. వింత వింత రంగులతో వెలిగే ఇంద్రధనుస్సు ఒక్కసారి తెలుపులోకలిసిపోయింది. ఏదీ ఇప్పుడా సౌందర్యమంతా? శాశ్వతమనుకొని నీ జీవితమంతా ఒలకపోసుకున్నావు.

గౌరాంగుడు:-ప్రేమలేనిదీ ప్రాణంలేదు. ఆ జీవి చచ్చినా ఎవరూ ఏడ్వరు. నక్కలుకూడా వాని ఎముకలు ముట్టవు. గద్దలుకూడా వానిమాంస మాశించవు. శుచీ! నిన్నే ప్రేమిస్తాను. నీవే నా భాగ్యలక్ష్మివి.

శుచి:-మానవునిలో వట్టిప్రేమ కాదు. ఈశ్వరత్వం సాధించాలని జిజ్ఞాసకూడావుంది. కాని ప్రేమకూ కామానికీ భేదమే లేదా? ఒకటి ఆత్మకు సంబంధించింది! ఇంకొకటి శరీరాన్నే ఆశ్రయించుకుంది. ఒకటి పశువులోపుట్టి విజృంభిస్తుంది. అదే కామం. ఇంకొకటి అమృతంవలె దేవునిలో ఊరుతుంది. మనుష్యునిలో దేవుడూ, పశువూ ఇద్దరూఉన్నారు. ఎవరిని ఆరాధించాలో వాడే తెలుసుకోవాలి. అందుకే వానికి మెదడుంది. అదే లేకుండేవానికీ తిర్యగ్జంతులకూ భేదమేలేదు. కొండంతశరీరం ఏనుగుకూ వుంది. పొదలవంటి వెంద్రుకలు ఎలుగుకూవున్నవి. అమ్మవంటిచూపు గ్రద్దకూవుంది. మానవుడంటే ఇంతేనా? ఛీ! సిగ్గు!

గౌరాంగుడు (దీనంగా):-శుచీ! హత్య!

శుచి:-హత్య! జీవకారుణ్యమే మనకు ముక్తిపథం! అందులో అన్ననే చంపుతానా! అయ్యో! సత్యం చెప్పితే హత్య అంటావే! అన్నా! నన్ను కామిస్తున్నావు. కాని నా ఆత్మ మాత్రం నిన్ను అన్నగా పూజిస్తుంది. నాశరీరం కోరుతున్నావా? తీసికో! కాని నీ కామతుష్టికోసం నా ఆత్మశుద్ధి బలిపెట్టను. అయ్యో! కేవలం బాహ్యరూపానికే పరవశుడయ్యావే! అది దగ్గరలేకుంటే గుండెపగిలి చావవూ? క్షణంలో తనుద్యుతి మాసిపోతుంది. అదే అనశ్వరమని ఆత్మను కాళ్ళక్రిందరాచి పారేస్తావా? పీతాంబరం పైన కప్పినంతమాత్రాన పీనుగును ముద్దుపెట్టుకుంటామా? కళ్ళల్లోని విద్యుజ్జోతి ఆరిపోయింది; శరీరం త్రుప్పపట్టి పేలికలు పేలికలుగా రాలిపోయింది. ఇంక దేనిని ప్రేమిస్తావు? పిచ్చివాడా! మెఱుపు మాయమైతే ఏడుస్తావు! ఇదేనా నిర్వాణసాధనం?

[మబ్బు ముసుగులోనుంచి చంద్రుడు తొంగి చూస్తున్నాడు.]

గౌరాంగుడు:-ప్రకృతికీ ఆత్మవుందా? ఎక్కడ? చెప్పు! శుచీ ఆరాధిస్తాను.

శుచి:-నీలోనే నిద్రపోతుంది ఒక చైతన్యమూర్తి. దానిని ముందు మేలుకొలుపు. పిమ్మట ప్రకృతి ఆత్మను కనుక్కో. తలచుకున్నంతలోనే కనబడుతుందా? తగిన పరిశోధనకావాలి! తగిన సంస్కారంకావాలి!

గౌరాంగుడు (ఏం గొణుగుతూన్నాడో తనకే తెలియదు):-'ఓం మణి పద్మేహం!'

[ఆకాశం నిర్మలంగా పాలబుగ్గల పసిపాప చిఱునవ్వువలె వుంది; చంద్రుడు నిరాఘాటంగా రాజ్యమేలుతున్నాడు.]

గౌరాంగుడు:-చెల్లీ! పాపిని.

శుచి:-అన్నా! అలానొప్పిపడకు. పాపివా! కాదులే! పశ్చాత్తప్త హృదయంలో పాపం పటాపంచలయిపోతుంది. నీకూ మెదడూ, హృదయమూ, జీవితమూ ఉన్నవి. మంచిచెడ్డలు తెలుసుకోగలవు. ఆర్తులనుచూచి 'అయ్యో' అని అనుతాపం చూపగలవు. సాంఘిక పునస్సృష్టికి సాధ్యమైనంతవరకూ పోరాడగలవు. అనుభవంపైన జ్ఞానివి కాగలవు.

గౌరాంగుడు:-చెల్లీ!

శుచి:-అన్నా!

గౌరాంగుడు:-త్రోవ.

శుచి:-ఏదీ?

గౌరాంగుడు:-సత్యమే!

శుచి:-చీకటి కదూ?

గౌరాంగుడు:-ఆ! అవును.

శుచి:-జ్ఞానజ్యోతి వెలిగించు.

గౌరాంగుడు:-అడవి మృగములే!

శుచి:-ప్రేమాస్త్రము లేదూ?

గౌరాంగుడు:-పరమావధి?

శుచి:-పరమపదము.

గౌరాంగుడు:-ఇంక పోదామా?

శుచి, గౌరాంగుడు ముక్తకంఠంతో

"బుద్ధోసు సుద్ధోకరుణా మహణ్ణో
యొచ్చాంత సుద్ధబ్బర ఞాణలోచనో
లోకస్సపాపూ పకిలే సఘాటకో
వందామి బుద్ధం అహామాద రేణతం"।

సిగ్గు

'మణి'

సిగ్గు సిగ్గంటారు
సిగ్గు తగదంటారు
సిగ్గె సింగారమని
ప్రచురించునా పెద్ద!

చెలియ చేతులుపట్టి
చెమ్మ చెక్కాడంగ
పాదసవ్వడి వినగ
సిగ్గు తెరలోదూరి
అట్టె నిలబడియున్న
నన్నుచూడకె పెద్ద
లజ్జ తొందరపెట్ట
లోని కొక్కటె పరుగు!

పెద్ద పరుగిడినంత
పైడిపావడపలుకు
పెద్ద పలికినదంటె
మేన్మిసిమికదలాడ
పూలవాసన లీను!

అడుగడుగునకు కూడ
అనుగు లజ్జాదేవి
అడుగులో నడుగేసి
లయతాళమును వేయ
తలపునకు వచ్చు
నా జయదేవ కవిరాజ
దేవి పద్మావతి.

నిండుజాబిలి మోము
దోబూచు లాడంగ
జారు ముంగురు సరుల
నెడత్రోసి తొలగించి
చిరుగజ్జె స్వనముతో
స్వర్ణ సౌభాగ్యమో
సోయగమ్మును చూపి
సుధజిల్కు పలుకోలుకు!

పెదవి విరుపులో కూడ
లలిత హాసమె వెలుగు
ఊర్పులెగసే హృదికి
అమృతసేచన మాను!


IMPORTANT TO MOTHERS
WOODWARD'S CELEBRATED
GRIPE WATER
ఉడ్వర్డ్స్ గ్రైప్ వాటర్
బిడ్డలకు వేసవి రాత్రుల
యందు మంచి నిద్ర నిచ్చును
WOODWARD'S
GRIPE WATER
keeps baby well
1-WW107-111 —TL
W. WOODWARD LTD. LONDON. ENGLAND.

వింత వింతల ప్రపంచం

అమెరికా యునైటెడ్ స్టేట్సులో జార్జి పెటియన్ అనే ఒక సైన్సు ప్రొఫెసర్ వున్నాడు. వా మానవజాతికి చాలా సన్నిహితమైనది గదా, పుట్టినప్పటినుంచి తరిఫేదులో తేడావుంటే ఏమైనా వుంటుందేమో చూద్దామని, ఒకకోతికి పిల్ల పుట్టీపుట్టడంతోటే ఇంటికి తీసుకువచ్చి పెంచడం మొదలె ఆకోతిపిల్ల పుట్టినతర్వాత తల్లిపాలు ఎరగదు. ఇప్పుడది చాలా పెద్దదయింది. ఆప్రొఫెసరు ఇంట్లో దానిదే. సాయంకాలమవగానే ఎలక్ట్రిక్ లైట్లు వేస్తుంది. మళ్లీ అందరు పడుకున్నతర్వాత లైట్లు పడుకుంటుంది. ప్రొఫెసర్ ఇంటికిరాగానే చేతిలోని బేగ్ మొదలైనవి అందుకుని వాటివాటి స్థా పెడుతుంది. డబ్బు మొదలైనవి ఇనప్పెట్టిలోపెట్టి భద్రపరుస్తుంది. కాఫీకాచి ఇస్తుంది. ప్రొ చూడటానికి ఎవరైనావస్తే 'విజిటింగ్ కార్డు' పుచ్చుకుని ప్రొఫెసర్‌కుచూపి వారిని తీసుకువస్తుంది. పక్కలువేస్తుంది. బూట్లు తుడుస్తుంది. ఒకటేమిటి ఒక బంట్రోతుపిల్లవాడు చెయ్యగలిగిన పనినంతా అయితే మాటలాడలేదు. 'అమ్మా' 'అయ్యా'అని మాత్రం అంటుంది అంతే. ఇదే కాబోలు వల్ల స్వభావం మారుతుందంటారు !

♦ ♦ ♦

ఏప్రల్ 20-వ తేదీని హిట్లరుకు 51-వ జన్మదినోత్సవం జరిగింది. అప్పుడు అనేకమంది బహుమతులు గుమ్మరించారు. వాటిలో లోహంతో తయారుకాబడిన గాంధిమహాత్ముడిబొమ్మ, నాథ్ టాగూరుబొమ్మ, జవహార్ పండితుడు, సరోజినీనాయుడు, తిలక్, గోక్లేగార్ల బొమ్మలుకూడా వాటిని ప్రత్యేకంగా హిట్లరు స్వీకరించి భద్రపరచాడు. హిట్లరు ఎంత రాక్షసుడైనా, మానవత్వంవుంది.

♦ ♦ ♦

'తలక్రిందులు మనిషి'అని పేరుపొందిన ఏలిస్ జెన్ మేక్ హెన్రీ అనే న్యూయార్కు-వనిత తన 15-వ ఏట వివాహం చేసుకుంది. గుండె వుండవలసినచోట కడుపు, కడుపు వుండవలసినచో కాయివుండడంవల్ల ఆమె కాపేరువచ్చింది. అది ఒక శస్త్రచికిత్సవల్ల బాగుపడిందిట.

♦ ♦ ♦

కొలంబియాలో డాక్టరు హెంప్‌మన్ అనే ఆయన రోడ్డుమీద పోతూవుండగా ఒక కా పడ్డాడు. తక్షణంలేచి కారుడ్రైవరు రెండుకాళ్లూపట్టుకుని, 'రోడ్డుమీదనడుస్తూ మీకారుకు నందుకు క్షమించండి'అని ప్రార్థించాడు. అహింసా పద్ధతిని బాగా అర్థంచేసుకుని వుంటాడతడు. యిలాగే అయితే ప్రపంచంలో శాంతి త్వరలో ఏర్పడకపోతుందా ?

♦ ♦ ♦

ఒక సినీమాలో ఎక్‌స్ట్రాలుగా వేషం వెయ్యడానికి 900 మంది స్త్రీలు కావలసివచ్చి ప్రకటించారు హాలివుడ్ అధికారులు. దానికి 7,000 అర్జీలువచ్చాయట—ప్రపంచంలోకెల్లా మైనదని అనుకుంటూవున్న అమెరికాలోకూడా నిరుద్యోగులు ఎంత ప్రబలంగావున్నారో !

★ దేవదాసి

—శ్రీమతి—
దేవులపల్లి
వెంకటరత్నమ్మ

దేవుని దాసియైన దేవదాసి నీచవృత్తికి నిలయమై పోయింది...

పాతివ్రత్యానికి పేరొందిన భారత స్త్రీ యీ దేవదాసీని ఎంతమాత్రమూ ఆమోదింపజాలదు...

కళలు ఎప్పటికి వారికాణాచి కావచ్చు, కాని 'ప్రస్తుతపు దేవదాసి' పూర్తిగా సంస్కరింపబడాలి ★

క్రీస్తుశకము 5-వ శతాబ్దము తరువాత హిందూదేశములో గొప్పగొప్ప దేవాలయములు నిర్మింపబడి దైవసన్నిధిని గానము చేయటానికి, నాట్యమాడడానికి గౌరవకుటుంబములనుండి తల్లితండ్రులచే కొందరు కన్యలు సమర్పింపబడేవారు. వారు 'దేవదాసీలు' అని పిలువబడి దేవాలయములో నివసిస్తూ నాట్యము, గానము చేస్తూ దేవునికి ప్రీతి గొలుపుతుండేవారు. తంజావూరు, జేజూరి, ఉజ్జయిని, కాశీ, మొదలైన దేవాలయాలలో వీరు పవిత్రజీవులై నిష్కామముగా దైవప్రీతికి గానముచేసేవారు. వీరికి దేవుని విగ్రహముతోగాని, పవిత్ర వృక్షముతోగాని నామకార్థము పెండ్లిజరిగేది.

కాలముమారి నాగరికతమారి దేవదాసీలు మారేరు. ప్రభుత్వంవారిని దేవాలయంలోంచి తరిమి వేసినది. హిందూసంఘములో యీ దేవదాసీలు 'గణికలు-నాయకిలు వేశ్యలు' అని పిలువబడే ఒకశాఖగా తయారయ్యారు. పెండ్లిండ్లలోను, విందులలోను, సంతోషసమయాలలోను వీరు గానంచేస్తూ సభికులకు సంతోషాన్ని చేకూరుస్తున్నారు. పూర్వము ఒకప్పుడు పవిత్రజీవులై గానకళోపాసకులై నాట్యకళానిధులైన దేవదాసీలు యిప్పుడు వ్యభిచారమే వృత్తిగా, మాంసము త్రాగుడు ఆహారములుగా, రోగములే ఆభరణములుగా, పాపకార్యాలే కర్తవ్యములుగా యెంచి హిందూసంఘానికి, హిందూ స్త్రీత్వానికి అగౌరవము ఆపాదిస్తూన్నారు. నాడు మత, దైవ, ఆధ్యాత్మిక, సంబంధమైన గానరసముతో ప్రజలకు దైవచింత నేర్పే దేవదాసీలు నేడు జావళీలతో, సరసాలతో, తళుకుబెళుకులతో యువకులను ఆకర్షించి ధనంగుంజుకుని శరీరం పాడుచేసే పిశాచగణంగా మారేరు. పూర్వం దేవాలయంలో ధూప సువాసనలమధ్య దైవసాన్నిధ్యాన్ని, మోక్షమార్గాలాలోచించేవారు యిప్పుడు కుత్రలుపన్నుతూ హత్యామార్గాలాలోచిస్తూ, పొగచుట్టా, బ్రాంది మొదలగు దుర్వ్యాసన సామగ్రులతోనున్న విటులకు హాయిగొల్పుతున్నారు.

వీరికి తరుణోపాయములేదా? జీవనోపాధి మరొకవిధముగా దొరకదా? వివాహసంబంధమయిన సౌఖ్యము మరొకలాగున చేకూరదా? ప్రభుత్వము వీరిని దండిస్తూంది. వూరి వెలుపలకి పొమ్మంటూంది. యింతేగాని యీ వృత్తిమానినట్లైతే తిండిపెట్టుతాననదు. సంఘములో గౌరవస్థానమిస్తాననదు. ఉచితముగా విద్య నేర్పుతాననదు!!

గత్యంతరము లేక కులహీనులని పేరుపడిన వీరు తప్పు మార్గాలను అనుగమిస్తున్నారు గా నీచజీవితము వారికిమాత్రము యిష్టమా? వారిలో నూటికి తొంభైమంది తల్లి ఆజ్ఞాపిస్తే "దైవమా కులములో పుట్టించేవు? యీ నీచవృత్తి ఏలాగు అవలంభించడం? ఎప్పటికైన మాజాతికి తరుణో లేదా!" యని యేడ్చి విధిలేక ప్రాణపోషణర్థమైన తిండికోసం కాని పనులు చేస్తూన్నారు.

వీరికొకటే తరుణోపాయము. దానికి ప్రభుత్వసహాయ మవసరము. ప్రభుత్వం వీరికి నొసగి, క్రొత్త పంథాలను తీసుకొనివస్తే, భారతదేశసౌభాగ్యాన్ని వీరు ఎన్నోవిధాల చేకూరు వృత్తి మాన్పించి వైద్యవిద్య వీరికి నేర్పితే, అసంఖ్యాలైన ప్రసూతి మరణాలు, శిశుమరణాలు, స్త్రీ హిందూదేశములో రూపుమాసి, స్త్రీలకు నూతనశక్తి చేకూర్చి, సౌభాగ్యప్రదాతలౌతారు. ఉపాధ్యాయినులుగ తయారుచేస్తే దేశములో నిరక్షరాస్యతను నిర్మూలముచేసి, బాలబాలికలకు విద్య సులభముగనొసగి, రాబోవుతరముల హిందూజనులను అతిజ్ఞానయుక్తులుగా జేస్తారు. కొందరకు నేర్పితే ప్రాచీనభారత కళాఖ్యాతిని పునరుద్ధరిస్తారు. కొంతకాలానికి వీరికి సంఘములో గౌర దొరుకుతుంది. హిందూదేశాన్నికి దాస్యము తొలగిస్తారు. ప్రజలను తరిపింపజేస్తారు, భారతమాత తుడుస్తారు. వీరికి తరుణోపాయము ప్రభుత్వముచేతులలో నున్నది. దేశసేవకు, మానవసేవకు, సిద్ధము వీరికి విధిఅనుకూలించి, ప్రభుత్యసహాయము లభించేటట్లు చేయకపోతుందా? మనదేశము వీరిసహాయ నిత్యకల్యాణముతో విరాజిల్లకపోతుందా!!

భరతధాత్రి - పరాశక్తి

గాంగసీమంత సంఘటిత సస్యశ్యామ వనరాజి వాల్జడవన్నెగాగ
నీహార గిరిరేఖ నిర్యదిందుచ్ఛాయ దళుకొత్తు జాజిపూదండగాగ
లలితకళావాస కలిత కాశ్మీరంబు ఫాలుపైన పాపట బొట్టుగాగ
నర్మదా పులిన సాంద్రతమాల వనవాటి ఘటితేంద్ర నీలమేఖలముగాగ
కన్యాకుమార్యగ్ర కమనీయ పదసీమ డంబైన పాదపీఠంబుగాగ

సేతువది నీదు చరణ మంజీరమైన
నీభరతధాత్రి నీవుగా కెవ్వరమ్మ!
ఏము నీ బిడ్డలముగాక యెవరమమ్మ!
అంబ! సుగుణకదంబ! హేరంబజనని!

—విద్వాన్ శ్రీ కల్లూరి వెంకట సుబ్రహ్మణ్య దీక్షి



నవ్యకళావారి 'మీరాభాయి'లో

మీరాబాయి మిస్. చలం

శ్రీమతి సరోజనీదేవి

తిరునల్వేలి మండల రాజకీయ మహాసభ
ప్రారంభోపన్యాసము నిచ్చి, తమి
రాష్ట్రమంతయు సంచారముచేసి
సేవకై ప్రజల నుద్బోధించిరి.

'చూపు నిలకడ'

కన్నీటి కెరటాలు

కన్నీటి కెరటాలు కలతగూర్చెనె తల్లి,
పన్నీటి స్నానాన పరిఢవిల్లెడు మాత,
ఆంధ్రగృహిణులసేవ కంగలార్చితె, యంబ
నీ యాంధ్రభూమిలో నిలిచిపొక్కె తల్లి
కన్నీరువీడుమమ్మా,
ఆంధ్రిలో, కలకాలముండుమమ్మా.

★ ★

కన్నీటి కెరటాలఁ గలిగిపోయెను ప్రాత
కనకంపుమణులెన్నొ కాలగర్భమ్ములో
మున్నీటిబాధలను మునిగి నశియించెగా
మునుపునిలిచిన నారి మోదమదియెల్లా
రాణి రుద్రమవోలు రాణులిలనేరీ
కవయిత్రి మొల్లాంబ ఘనతభువినేదీ
ఆంధ్రమాతా; శోకమణచుకోతల్లీ
ఆంధ్ర స్త్రీలకు కార్యమరయుమో తల్లీ
కన్నీరువీడుమమ్మా
ఆంధ్రిలో, కలకాలముండుమమ్మా.

★ ★

కన్నీటి కెరటాలు కడలివలె పొంగేయి,
వెన్నెల విహారాలు విరమింపబడ్డాయి
తొల్లి ఆంధ్రిని వీరతోయజాక్షులతోనె
చల్లగా కాలంబు జరిగిపోలేదే ?
నాటిరోజులకొఱకు నలతేలనమ్మా
కన్నీరమున్నీరుగా నేడ్వకమ్మా
ఆంధ్రమాతా, మమ్ము నరయుమో కొమ్మా
నీ యాంధ్రభూమిలో నిలిచిపొక్కె తల్లి
కన్నీరు వీడుమమ్మా
ఆంధ్రిలో, కలకాలముండుమమ్మా.

—శ్రీమతి వక్కలంక రామాబాయి.

మలేరియా
అంటువ్యాధి

ఇంతకుపూర్వము మలేరియా అంటువ్యాధి ప్రబలినపుడు హార్లిక్సు ధారాళముగా ఉపయోగింపబడెను. దీనినుండి మితిలేని తృప్తి, గుణము కలిగినది. రోగులు ఆహారవిషయము ముఖ్యముగా గమనించవలసినది. జ్వరపు విషము నరస్నాయువులలో ప్రవేశించి రోగిని నిశ్శక్తునిగా జేయును. కడుపు బలహీనముగా నుండుటచే ఏ ఘన ఆహారమును సహించదు. ఇట్టి సందర్భమున హార్లిక్సు యోగ్యమైన ఆహారమని డాక్టర్లు గ్రహించినారు. ఇది జీర్ణకోశమునకు ఏలాటి హాని కలుగజేయదు. ఇది వందకువంద పుష్టినిచ్చునది గాన, కోల్పోయిన శక్తి సామర్థ్యమును త్వరలో చేకూర్చును. జ్వరమునుండి రక్షణ పొందుటకు ప్రతియింటను హార్లిక్సు తప్పక యుండవలసినది.

కంఠాభరణము

గృహలక్ష్మియందు ప్రకటింపబడిన మనోహర త్రివర్ణ చిత్రపటములందు 46 పటములను ప్రత్యేకముగ కేర్చి రచి యొక్కొక్క చిత్తరువునుగూర్చి వివిధవిషయములలో వాడుకభావయందు హృదయరంజకముగ వ్రాయబడినది. ఇందలి రసవంతమగురచన, మనోజ్ఞమగు చిత్తరువులు, ఎల్లర నాకర్షించు విషయములు గలవు.

వెల రు. 2 0 0

గృహలక్ష్మీ కార్యాలయము,
రాయపేట, మదరాసు

సరస్వతీ రామాయణము

కొల్లాపుర స్నేహలతాకవితా సంఘోపాధ్యక్షురాలైన
శ్రీమతి చేబ్రోలు సరస్వతీదేవి
విరచితము.

గంగాస్రవంతివలె శైలి సరసమై, సౌలభ్యమై, మధురమై, మనోజ్ఞమై పద్య పద్యమునందును మకరందము చిందుచుండును. భక్తిరసప్రధానమై, శాంత శృంగార కరుణారస భావభూయిష్ఠమై, ఆంధ్రసాహిత్యమునకొక సరసభూషణ మీసరస్వతీ రామాయణము.

ఆంధ్రదేశమందు పండితపామరులచే ప్రశంసింపబడినది.

వెల ఒకరూపాయి మాత్రమే

ప్రతులకు : పోస్టేజి ప్రత్యేకము (అ. 2.)

శ్రీమతి చేబ్రోలు సరస్వతీదేవి
గృహలక్ష్మీ కార్యాలయము,
రాయపేట : : మదరాసు

ఫోన్ 8461 :

హాఫ్‌టోన్ బ్లాకులు
లైన్ బ్లాకులు

జింకుతోకానీ రాగితోకానీ
తయారుచేయుటకు

ఉక్కు మొహర్లు, రబ్బర్ స్టాంపులు
లాంటరన్ స్లైడ్సు.

NEWTON & CO.,
Fine Art Engravers
80, Wallajah Road, Mount Road, Mad.

చక్కని పనితనము, శీఘ్రముగా పనిచేయుట
చౌకధరలు మాలక్ష్యము.

కేసరి
కర్పూరాంజనము

సర్వవిధములైన నొప్పులకు

తలనొప్పులకు, కీళ్లనొప్పులకు, పురుగుకాటుకు, రొమ్మునడిశె ముకు జలుబుకు దివ్యాంజనము. నొప్పితీవ్రతనుబట్టి రోజుకు 3, 4, సారులు వాడవచ్చును.

బుడ్డి 1 కి-8 అణాలు

కేసరికుటీరం — మద్రాసు

కళాకలాపము

సంగీత సామర్థ్యం

కమలకు:—

నిజమే! నా హృదయంలో ప్రక్కదారులలో పరవళ్లు త్రొక్కుతూఉండే ఈ ప్రపంచాన్నంతా ఒక్కమారు ఊగించివేయాలని ఉబలాట పడే భయంకర తుపాను రేగుతూఉన్న మాటమటుకు నిజమే! కాని నీల అనుకుంటూఉన్నట్టు దానికి కారణం సంఘం, అనాథరాలనైన నామీద చూపిన దయా దాక్షిణ్యాలు, న్యాయం ఎరుగని క్రూరమైన చూపులుమటుకు కాదు. "మార్పు, మార్పు" అని ఏనాటినుండో నాగుండెల్లో ఒకహోరు, ఒకరొద ప్రతిధ్వనిస్తూఉంది. ఆరొదే యీనాటి ఈ సంస్కరణాభిలాష, భావి విప్లవగీత అని ఏనాడో గ్రహింప గలిగేను నేను.

అయినా, ఎందుకు అలా విరుచుకుపడుతుంది నీల నామీద? పాషాణ హృదయాల్నికూడా ద్రవీభూతం చేయగలిగిన సంగీతాన్ని హూణవిద్య నభ్యసించే తన పిల్లలకు నేర్పమని అన్నిసార్లు ప్రాధేయపడి బ్రతిమలాడేననేనా? ఆమెనుచూచి, ఆమె పిల్లలనుచూచి నేనెంత జాలిపడుచున్నానో ఆమెకేం తెలుసు. తనకు తెలియని కారణంచేత మాతృమూర్తి తన చిరుపాపలను హృదయ వికసనానికి అనువైన కళలకు దూరం చేసి, నాశనంచేసివేస్తూఉంటే కళ్ళారాచూచి ప్రాధేయపడి బ్రతిమలాడకుండా ఎలా ఉండగలను? కోపం ఎందుకు? కావలిసింది ప్రశాంతతతో కూడిన ఆలోచన—

అయినా, సంగీతం మోడైన మ్రానులను చివురింపగల ఆదిశక్తి అని, స్వర్గకాంతులను భూమిపై వెదజల్లగల దివ్యమూర్తి అని ఎన్నోచోట్ల చదివి, అవన్నీ కల్పవృక్షాల్లాగు నరకబాధలలాగు కవికుమారుల స్వకల్పితాలని ఊహించుకొని అంతటితో శాంతపడేనీలకు పిల్లలకు సంగీతం నేర్పడంలోఉన్న ఆవశ్యకత ఎలా కన్పిస్తుంది? నేనేమైనా అంటే, "నీవూ, నానీనూ, ఎప్పుడూ తయారుకాని ప్రపంచాన్ని విప్లవ వీథుల్లో నడిపించాలని ఉబలాటపడతారు. అది అంత సమంజసంగా కన్పించదు నాకు"అంటుంది.

అసలు సనాతన సిద్ధంగావచ్చే ఆర్షసాంప్రదాయ ప్రకారం ఈ విశ్వమంతా కొన్ని రంగురంగుల ఆకారాల సమ్మేళనం. ఆ ఆకారాలు కొన్నికొన్ని శబ్దాలమీద ఆధారపడి ఉంటాయి అని యోగదృష్టిలో లీనమైన ఆర్యబుుషులు కొన్నివేల సంవత్సరాలనాడు గ్రహించి తత్ఫలితంగా యీలోకానికి మంత్రయోగాన్ని ప్రసాదించారు. అలా, చిత్తవృత్తిని అరికట్టగల మంత్రయోగమే మానవవాక్కుమీద, శబ్ద ప్రయోగముమీద, స్వరముల కదలికమీద ఆధారపడి ఉన్నప్పుడు వీటిమీదే ఆధారపడిన సంగీతజ్ఞానము ఎంతశక్తివంతమో, గ్రహించుకోలేమూ? చేతనాచేతన ప్రకృతినంతా సమ్మోహితులను చేయగల శంకరాభరణ, తోడిరాగాలతో, విశ్వకల్యాణాన్ని ఆలాపించగల కల్యాణులతో, హృదయ తంతుల్ని కదలించగల

శహన, నాదనామక్రియలతో ఊగిపోయే సంగీతమే హృదయాన్ని వికసింపచేయ లేకపోతే ఇంకా ఏ
ఆపని చేయగలుగుతుంది ?

ఇది కాకుండా, సుశబ్దాలను, సుస్వరాలను వినడంవల్ల చిత్తవృత్తిని అరికట్టగలమని లయయోగ
చెప్పతుంది. ఈ సుస్వరములు, మానవహృదయపద్మముయొక్క ఎనిమిది రేకులలో ఏదో ఒకమూల ఏ
ఉన్న ప్రాణవాయువును ఆత్మకు మాతృస్థానమైన హృదయ పద్మముయొక్క మధ్యభాగమునకు తీసికొనిపో
ఆత్మ వికసనానికి దారులు తీస్తవి.

ఇలాంటి సంగీతాన్ని పిల్లలకు నేర్పమంటే పిల్లలవాక్కును శుచియైన మార్గాలలో నడిపి
మంటే, పిల్లలవీనులు లయకొరకు ఎదురుచూచేటట్లు అలవడపరచమంటే, ఎందుకు అంత కినిసిపోతూ
నీల ?

అయినా, ప్రాణలీలను తాండవమాడించిన గోపాలకృష్ణుని మురళీరవాన్ని, నిత్యనూతన నృత్య
కేళితో అనుదినమూ అవధరించే నటరాజు ఢమరు నినాదాన్ని, "సంగీత జ్ఞాన విహీనులకు మోక్షము
కలదా, భువిలో"అని పాడుకొన్న మహాభక్తుని త్యాగయ్యను, మరచిపోయిన ఆంధ్రప్రతిభ ఇంకా బ్రతికి
ఉన్నదని అనడానికి హక్కు ఏమిటి మనకు ?

ఇదే విప్లవమైతే మేము విప్లవవాదులమే ! ఆ విప్లవమునకు ఆంధ్రలోకాన్నంతా సదా సహాయం
చేయమని ప్రార్థిస్తూనే ఉంటాము !!!

సదా నీ సహాయాన్నికోరే,
'మణి'

ప్రేమ

ఆగుమ నాసఖా ! వనవిహారము సేయగ నేను వత్తునం
చీగతి నడ్డుపెట్టెదవదేటికి ? నీకడ గూరుచుండినన్
సాగునె నాకు, నల్లవిగో జాజులు మల్లెగులాబులెల్ల నా
యాగమనంబుకై ప్రియత నారయుచున్నవి చూడుమో సఖీ !
ప్రియమున నాదుజాడగని పేర్మి సుధామధు మాధురీ సము
చ్చయ శుభశోభితాకృతులుసంధిల, పుష్పాడితావిగుమ్మనన్
నయనముదావహంబుగను నాట్యము సేయుచునుండె నిట్టులన్
రయమున నన్ను వానిపయి వ్రాలిసుఖింపను బిల్చుటోయనన్.
నాకును తత్ప్రసూన నటనా పరిశీలనభాగ్యమబ్బె నా
కాకుసుమంబులంగలసి యాడగ డెందముగుందుగాని, యా
హా ! కనుగొమ్ము నందనవనాంతర రమ్యప్రదేశ దేశముల్ ;
ఆకసమందు పూర్ణశశినారసి చుక్కనుచూతువే సఖా !

—శ్రీ ఆకుండి వెంకటేశ్వరరావు

సౌందర్యమును కాపాడు కొనుడు

పాండ్స్ కోల్డ్ క్రీము : చర్మమును శుభ్రపరచి మృదువుగా నుంచును. దినము రాత్రిప్రొద్దున ఉపయోగించుడు.

పాండ్స్ వ్యానిషింగ్ క్రీము : చర్మమును ఎండ, గాలి వీటినుండి రక్షించి, మృదువుగాజేసి, పౌడరు బాగుగాపట్టునట్లు చేయును.

మీభర్త, మిత్రుల హసన్ముఖమునకు కారణము మీముఖ సౌందర్యమేయని మీకు తెలిసిన మీరెంత సంతసింతురు. మనోహరత్వము తప్ప మరేదియు అతిస్వల్పకాలములో మెప్పువడయజాలదు.

మీ చర్మముపై తగిన శ్రద్ధవహించిన అమోఘమైన దేహ సౌందర్యమును పొందగలరు. ప్రతిదినము మీచర్మ రంధ్రములలోకూడిన మురికిని, నూనెనుతీయుట మొదటిపని. సబ్బుతో కడుగుట మాత్రమే చాలదు.

నిత్యము పాండ్స్ క్రీమును వాడుడు. చర్మమును శుభ్రపరచి, మృదుత్వము గల్గించుటలో పేరుగన్నది. ఇది ప్రతిరంధ్రములోనుపోయి మురికిని పూర్తిగాతీసి చర్మమునకు పుష్పదళ మృదుత్వము, యౌవనము నిచ్చును.

పాండ్స్ కోల్డ్ క్రీమును ప్రతిరాత్రి, ప్రొద్దున పట్టించుడు. చర్మముమీద వ్రేలితో క్రింది నుండి పైకి మెల్లగారాయుడు. కొంతకాలమట్లుంచి తరువాత మృదువైనగుడ్డతోగాని, పాండ్స్ టిష్యూతోగాని శుభ్రముగా తుడుచుడు. మరొకసారి ఇదేవిధముగా జేయుడు. మీ చర్మము ఎంత మేలుచెంది మృదువుగా ప్రకాశవంతముగా నుండునో మీరే చూడగలరు.

పగలు ఎండ, గాలి, దుమ్ము వీటినుండి రక్షణపొందుటకు పాండ్స్ వ్యానిషింగ్ క్రీమును ఉపయోగించుడు. ఏకొద్ది గరుకుదనమునుకూడా పోగొట్టి పౌడరు చక్కగా అంటునట్లు చేసి అందమును కలుగజేయును.

పాండ్స్ క్రీమ్

దేశభక్తి

గీ. మొగలురాచటీకఁపు దండిమగలకఱను, కత్తులందలి నెఱమాని కంపుఁగొంపు
దిగువనీడల భారతదేశలక్ష్మి, శిరమువాలిచి ప్రొద్దుపుచ్చిన దినాలు.

చ. యవన పటుప్రతాపవిలయానలదీర్ఘశిఖాచయమ్ము శా
త్రవ బలదర్పగోచులఁ బరాజయధూమములందు ముంపఁ హైం
దవజనగౌరవమ్ము పరతంత్రతకొదల యీయరాదు, ఆ
హవమునఁ గత్తిపోటులె సుఖావహమన్నది; యామె యొక్క తే.

సీ. అనిఁ గత్తివట్టినిల్చిన దండిమగలకు నూత్న దీక్షాశక్తి నూరిపోసి,
జాతీయతానలజ్వాల హైందవ వీరరక్త నాళమ్ముల రవులు కొల్పి
తనప్రతాపానలోద్ధత శుభారుణ రేఖ దేశమాతకు రత్న దీపమెత్తి
స్వాతంత్ర్య సమరనిష్ఠల మాతృభూమికి ప్రాణాశుగమ్ములు పాయనమిడి.
గీ. జీవనరథమ్ము స్వచ్ఛందభావవీధి ద్రిప్పుకొనుచుండి కీర్తిపొందినది; గోండు
రాణి దుర్గావతీదేవి రక్తి నామె పేరు భారతహృదయాల మారుమ్రోయు.

చ. మొగలు ప్రతాపదర్ప మరిమూకల గుండెలఁ జిచ్చువెట్టి పా
ఱఁగఁ గని భారతీయుల పరాక్రమ రేఖలు మాసిపోవ పె
ల్లుగరణ భూమినిల్చినతలోదరి భారతదేశరాజ్ఞి; యా
మగువ యుపాస్యదేవత; యమానుష విక్రమమూర్తి గావునన్.

చ. కరిహయ బృందముల్ సమసి, కాల్బలమెల్ల నశించి యోధు లె
ల్లరు హతులై, ప్రియాత్మజుడిలంబడియున్ మది ధైర్యలక్ష్మి నే
పురిగొని జాతిగౌరవ విభూతికి భంగమురాకయుండ మో
హరమున నొంటిమైనిలచె; నాయమ దెంతటి దేశభక్తియో.

ఉ. అంగనరైన నేమి హృదయంబు గభీరస్వతంత్ర భావనా
రంగము; దేశగౌరవమె ప్రాణము మాకనిజాటి చెప్పి పో
యెంగద, యట్టికాంత యుదయించిన భారతమాత గర్భమె
న్నంగ మహాపవిత్రము; జనంబులునన్నిట నామె బిడ్డలే.

ఉ. ఆహవభూమి ఖడ్గమున కాహితరక్తమరందబిందు సం
దోహము విందుచేసికొని, దుర్గమరాజ్ఞి పవిత్రమూర్తియై
దేహమువాసె నాస్థలమదే యిపుడున్నది, పూర్వవైభవం
బూహకు దెచ్చి జూడ్కులకయో యనిపించును పుణ్యభూమియై.
గీ. ఈ మహారాణి రణభేరులేమొ; కాక జాతిగుట్టలు, రాజ్ఞి పరాక్రమంబు
జాటుకొనుటేమి? యిప్పుడచ్చోట రాత్రి శ్రుతిపుటమ్ముల బడుమహాద్భుతరవమ్ము

—శ్రీమతి గంటి కృష్ణవే

భావతరంగిణి ★ ★ ★

'మనస్త్రీల అభివృద్ధికై యెవ్వరును శ్రద్ధవహించడంలేదు. స్త్రీలలో పనిచేయుటకు చాలమంది దేశసేవికలు కావలసివున్నారు. స్త్రీలు, పురుషులు వేరువేరు జట్లుగా వుండటం మంచిది. ఇరువురి సంబంధములు సహజముగా ఉండాలి గాని కఠినమైన నియమాలను నేను విధింపజాలను'

—మహాత్మా గాంధీ.

"భారతదేశ గౌరవము నేడు దశదిశలు వ్యాపించియున్నదంటే దానికి భారతమహిళా ప్రపంచముయొక్క అనన్య సామాన్యమైన ప్రవర్తనయే కారణము... వారు కళోపాసకులగుటచే గృహములకును, తద్వారా దేశమునకును శాంతి సౌఖ్యములను చేకూర్చుదురుగాక అని కోరుతున్నాను."

—పండిత జవహర్‌లాల్ నెహ్రూ.

"భారతీయులు పాకిస్థాను, సనాతనిస్థానులవిషయమై తగవులాడుతూ వున్నంతకాలము స్వాతంత్ర్యమునకు అర్హులము కాజాలము. ప్రస్తుతము ఐకమత్యము ముఖ్యావసరంగాఉంది. గత యుద్ధంలో బ్రిటిషువారు, వారి రాజకీయ విభేదాలను మరచిపోయి, ఒక్కనిగ శత్రువును ఎదిరించారు. పురుషులు యుద్ధభూమికి వెళ్లినప్పుడు వారి స్థానము స్త్రీ లాక్రమించారు... భావములోగాని, కార్యాచరణంలోగాని ఐకమత్యము లేకపోయిన ఏజాతియు జీవించు హక్కు కలిగివుండదు."

—శ్రీమతి సరోజనీనాయుడు.

"ఖద్దరు ప్రచారం, గ్రామపరిశ్రమలు, అస్పృశ్యతానివారణ, ప్రతిదినమును తప్పకుండా స్వయంగా నూలువడకుట, హిందూ ముస్లిం మైత్రి మొదలైన కాంగ్రెసు కార్యక్రమములోవున్న అంశాలనన్నిటిని మహారాష్ట్రంలో స్త్రీలందరూ కొనసాగిస్తూ ఉండాలి. అందువల్ల సత్యాగ్రహమును ప్రారంభించడానికి తగిన పరిస్థితులు దేశంలో కలుగుతాయి. అవకాశంవున్న స్త్రీలు సత్యాగ్రహ ప్రమాణాలమీద సంతకాలు చేసి వలంటీరులుగా చేరాలి."

—శ్రీమతి లీలావతి మున్షి.

"వెనుక కాంగ్రెసువారు స్వరాజ్యంకోసం సత్యాగ్రహం జరిపినప్పుడు అన్నిసారులూ భారత స్త్రీలు చాలా ప్రశంసనీయంగా పనిచేశారు. స్త్రీలు పురుషుల కధికమైన ప్రోత్సాహమును కలిగిస్తూ వారికి తీసిపోకుండా పనిచేశారు. ఈసారి స్వరాజ్యంకోసం కడపటి సత్యాగ్రహం జరుగుతుంది. అప్పుడు స్త్రీలందరు వెనుకటికంటె చాలా అధికంగానే పనిచేయాలి. స్త్రీలందరు సత్యాగ్రహ ప్రమాణ పత్రాలమీద సంతకాలుచేసి మొదటితరగతి వలంటీరులుగా చేరాలి."

—శ్రీమతి సుచితా కృపాలిని.

పల్లెటూళ్ల సాంఘిక దుస్థితి

★

శ్రీ ఆదిలక్ష్మీ వేంకటరత్న సోదరీలు

> భారతదేశ సౌభాగ్యం పల్లెటూళ్లో ప్రతిఫలిస్తుంది. అటువంటి పల్లె సాంఘికదుస్థితి దుర్భరంగా వున్నంత మనం ముందుకుపోలేము. నేటి నవ ప్రపంచ నిర్మాణానికి పల్లెటూళ్లే క్షేత్రాలుగా మారిపోవాలి—

పట్టణములయందువలెఁగాక పల్లెటి గ్రామములలో కులకట్టుబాట్లు కఠినరూపములు యుండును. పల్లెలయందు విద్య శూన్యము. అందును స్త్రీవిద్య పూర్ణానుస్వారము. బాలికలను స్వేచ్ఛ యరుగుమీదకైనను రానీయరు.

కొన్ని పల్లెలయందలి బాలికలను యింటియందల్లరి చేయకుండగ చంటిపిల్లల నెత్తుకొని గల యీడువచ్చువరకు బడికి పంపించి తర్వాత మానిపింతురు. పల్లెయందు వెయ్యింటొక్కరైనను విద్యనేర్చినవారుండరు. "బాలికలవిద్య భర్తకుత్తరము వ్రాయుటకని" కొందరి మతము.

పల్లెటూరివారు వారి బిడ్డలను పట్టణములందలి విద్యావంతులకో, లేక నుద్యోగుల యెక్కువ కట్నములనిచ్చి యుద్వాహము చేయుటయు, ఆ బాలికలు విద్యాశూన్యులగుటచే పడు చెప్పుకొనుటయును, వినుటయునుకూడ మిగుల బాధకరము. పల్లెలలోని కోడంద్ర నన్యాయముగా ఆడు బిడ్డలు కత్తులబోనులందుంచి కాపురము చేయించుకొందురు. మరియు, కట్నములు, లాం జరుపుటలోగల పూర్వపు లోపములకొఱకు ఆ కోడంద్రత్తలగువరకు పడుయమయాతనలు తలప

పల్లెలలోని బాలవితంతువుల బాధలను జూచిన హృదయము బ్రద్దలగును. సనాథలగు వా శోచనీయముగనుండ అనాథలగు వారిస్థితి వేరుగ జెప్పవలయునా? అసలు స్త్రీ లోకమే మూఢాచా గురియై, విద్యాగంధములేక, స్వార్థపరత్వపు మైకములో పడియల్లాడుచున్నది. పట్నవాసపు స్త్రీ విద్యావతులైనను, కానివారికంటె కనికష్ఠముగ నున్నారు. ఇక మూఢనమ్మకముల కాటపట్టైన ప ములయందలి స్త్రీలమాట చెప్పవలయునా?

ప్రపంచములో నేదైన యొకక్రొత్త యాచారము ప్రాత వాటి స్థానములో నుత్పన్నము కా దానిని అందరు ఆదరింతురుగాని, స్త్రీలు ఒక్కపట్టున ముందుకురారు. ప్రాతపద్ధతిని విడువవలెనన్న జాతికి ప్రాణముపోవును. అందును పల్లెటూరి స్త్రీలకుగల పట్టుదల అత్యధికము.

సంఘములోనున్న నేటి యవినీతి దురాచారములు నశించవలెనన్న, ముందుగా పల్లెస్త్రీ బాగుపడవలెను. వారు యభివృద్ధి స్థానమునకు వచ్చిన వెంటనే సంఘమునందు కనివిని యెరుగని యించును. అప్పుడు సంఘజీవితము సౌఖ్యవంతము కాగలదు.

ప్రస్తుతము పల్లెలలోని బాలికలకు, స్త్రీలకుఁగలుగు నక్రమములదీర్చు పుణ్యాత్మ లిప్పటి గానరారు. మహిళాసభలు, మహిళా గ్రంథాలయములు పట్టణస్త్రీల పురోభివృద్ధికిగాని తమ యా స్త్రీల క్షేమముకొఱకుకాదు. స్త్రీల నాయకురాండ్రింతటనుండియైనను సమదర్శినులై ప్రతి పల్లె ప్రచారముచేసి మహిళాసంఘములను స్థాపించి సమస్తవిధముల స్త్రీ లోకముయొక్క పురోభివృద్ధిని అనాథస్త్రీలను, నిరక్షర వనితాలోకమును నుద్ధరించుటకు తగుమార్గముల జూచి పనిచేయుదురుగాక!

లౌంజ్ సూటు

★

● శ్రీమతి పి. ఎస్. ప్రకాశమ్మ

కిరీటిరావు:-సుందరీ! ఉత్తరాలేమైనా వచ్చాయా?

సుందరి:-మాంబళం అడ్రస్సుకి ఏదో కవరొస్తే మావాళ్లు పంపించారు.

కిరీ:-ఖర్మం చాలక ఎప్పుడో మామగారింట్లో ఓ నెల్లాళ్లుంటే ఎల్లకాలం అక్కడే ఉన్నాననుకొని, నావుత్తరాలు రాసేవాళ్లంతా మీనాన్న 'కేర్' కే రాస్తున్నారు.

సుం:-ఏమండీ, మానాన్న ఎడ్రస్సుకి మీ ఉత్తరాలొచ్చినంతమాత్రాన్ని ఆయన సంరక్షణలో మీరుండి పోయినట్లు లోకం అనుకోపోతుందనా మీ భయం?

కిరీ:-నాన్సెన్సు! నేనొకటంటే నువ్వొకటర్థంచేసుకుంటావ్! నీతో వచ్చిన చిక్కే ఇది. ఏదీ ఆ కవ రెక్కడుందీ?

సుం:-అద్దం వెనకాల పెట్టేను. ఏదో ఆహ్వానంలా ఉంది.

కిరీ:-(కవరువిప్పి) సుందరీ! నువ్వుచెప్పినట్లు ఇన్విటేషనే. కాని ఎవరుపంపించారో తెలుసా?

సుం:-తోటి గుమాస్తా ఎవడింట్లోనో పెళ్లి కాబోలు.

కిరీ:-(కోపంతో) అంతే! నీబుద్ధి అంతకి పైకిపోదు. నేజేసేది గుమాస్తా నౌఖరీ కనక నా స్నేహితులంతా గుమాస్తాలే అనీ, నాకెప్పుడు ఇన్విటేషనొచ్చినా ఏ చచ్చు గుమాస్తానో పంపుంటాడని నీ అభిప్రాయం. నన్ను ఏదోవిధంగా చులకనచేసి మాట్లాడ్డమే నీక్కావలసింది.

సుం:-(ఆశ్చర్యంతో) రామ! రామ! నేనలాంటి ఉద్దేశంతో అనలేదండీ. దీనికేంగాని ఎవరిదగ్గర్నుం చొచ్చిందీ ఆకవరు?

కిరీ:-(సగర్వంగా) గవర్నరుదంపతుల దగ్గర్నుంచి. లార్డు ఎర్స్కిన్ అండు లేడీ మేర్జరీ ఎర్స్కిన్లు పంపేరు. ఏమనుకున్నావో! ఆ గవర్నమెంటు ముద్రచూస్తే తెలీటం ల్లేదూ నీకు? ఆప్రక్క సింహం, ఈప్రక్క గుఱ్ఱం, పైన కిరీటం! వారె! గిల్టుతో అచ్చుగుద్దేరు. బంగారులా మెరిసిపోతోందీ ముద్ర.

సుం:-నిజంగానే? గవర్నరేనా పిలుస్తా? ఎందుకోసమండీ ఆహ్వానం?

కిరీ:-ఇక్కడ సైన్సు కాంగ్రెస్సవుతోంది. దానికోసం, ఇండియాలో ఉన్న గొప్పగొప్ప సయింటిస్టులంతా సమావేశమయారు. వీళ్లందరికీ గవర్నరుగారు టీపార్టీ ఇస్తారుట.

సుం:-ఉహూ! సరేకాని......పోనీలెండి నాకెందుకు?

కిరీ:-అదేమన్నమాట! సందేహించక అడిగెయ్.

సుం:-ఎందుకు? మీకోపం వస్తుందనవసరంగా.

కిరీ:-రాదు, చెపుదూ అదేమిటో.

సుం:-సైన్సువాళ్లకిచ్చే టీపార్టీకి, లోకల్ ఫండాఫీసు గుమాస్తాలను పిలవడమెందుకోసం చెప్మా అను కుంటున్నా.

కిరీ:-(నిస్పృహత్వంతో) నీమొగుడు నీకంటికి లోకల్ ఫండు గుమాస్తాకంటె ఎక్కువగా ఎన్నడూ అగు పించడు! అందుకే అందరితో నామొగుడు 'గుమాస్తా' 'గుమాస్తా' అని చాటిచెబుతున్నావ్.

సుం:-చాటిచెప్పడమేమిటండీ! ఎవళ్లేనా అడిగినప్పుడు చెప్పకపోతే ఎలాగ?

కిరీ:-గుమాస్తా అనే కాని చెప్పడానికింక ఉద్యోగాల పేర్లే లేవేమిటి?

సుం:-(ఆశ్చర్యంతో) అయితే మిమ్మల్ని ఎవరైనా అడిగినప్పుడు మీరేమని చెబుతున్నారు?

కిరీ:-'ఆఫీసులో సూపరెంటెండెంట'ని చెపుతున్నా. మొన్న ఆమధ్య ఓ పెద్ద ఉద్యోగస్థుడికి పరిచయమై అతడడుగుతే అలాగనే చెప్పాను. అతడికి గవర్నమెంటుహౌస్‌లో ఏదో పెద్ద ఉ... మట. బహుశః ఆయనే నాకు ఈ ఇన్విటేషను పంపుంటాడు. ఒహో. ఈ క్రింద ... రాసుందే! మార్నింగు డ్రెస్సు, లేక లౌంజ్ సూట్.

సుం:-అంటే?

కిరీ:-పార్టీకి వెళ్లేటప్పుడు అడ్డమైన అవకతవక డ్రెస్సుల్లోనూ వెళ్లకుండా, మార్నింగు డ్రెస్సులో ... లౌంజ్ సూటులో కాని వెళ్లాలట. మార్నింగుడ్రెస్సంటే ఏమిటో?

సుం:-అదోరకం డ్రెస్సు కామోసు.

కిరీ:-ఆమాత్రం నాకు తెలీకపోలేదు.

సుం:-డ్రెస్సు వివరాలు కావలిస్తే, టెయిలర్ని కనుక్కుంటే తెలిసిపోతాయి.

కిరీ:-ఇదుగో, ఈ కవర్లోనే ఏదో అచ్చుకాగితం ఒకటుంది. ఉండు చదువుతా. ఒహో, ... పోర్టుసెంటుజార్జి గెజెట్లో, అచ్చువేసిన ప్రచురణ—గవర్నరుగారిచ్చే పార్టీలకు వెళ్లేటప్పుడు ... కావలసిన డ్రెస్సు వివరాలను గురించినది ఇందుతో పంపేరు.

సుం:-ఏమిటది?

కిరీ:-విను 1 జరీఅంచు ఉన్నదికాని, లేక కేవలం తెల్లనైనదికాని తలపాగ. 2. మెడబొత్తాంగల ... లాంకోటు—ఖండువా కావాలంటే వేసుకోవచ్చు, లేకపోతే మానెయ్యవచ్చు. 3. ... తెలుపుగాని నలుపుగాని కావచ్చును. లేనిచో పంచ పనికివచ్చును. 4 నల్లటిస్టాకింగులు, ... లెదరు బూడ్సు.

సుం:-ఈ డ్రెస్సు వేసుకుంటే మీరుచాలా బాగుంటారు.

కిరీ:-లేకపోతే బాగుండననా! నేను ఏడ్రెస్సు వేసుకున్నా బాగానేఉంటా. మీ అన్నలాంటివాళ్లు ... వేసుకున్నా బాగుండక ఆడ్రెస్సు గౌరవంకూడా పోగొడతారు.

సుం:-(కొంచెం చిన్నబోయి) పోనీలెండి వాడిఅందం గొడవెందుకిప్పుడు? మీ అందాన్నిపోలి పుట్ట... పొద్దుచాలక పోయింది వాడికి. దీనికేం గాని, ఈ పార్టీకోసం ఇప్పుడు లాంకోటూ, జరీ... వగైరాలు ఎక్కడ సంపాదిస్తారు?

కిరీ:-గవర్నరుపార్టీ కెదులో పూర్వకాలం ముసిలిఆఫీసరుకు మల్లే లాంకోటూ, పాగాపెట్టుకు... ఆలౌంజ్ సూట్లోనేవెడతా.

సుం:-మీకుందా మరి?

కిరీ:-లేకపోతే కుట్టిస్తా.

సుం:-ఈ పార్టీకోసమని కుట్టిస్తే బోలెడైపోతుందేమో.

కిరీ:-ఖాతే ఖాతుంది. ఖర్చవుతుందని గవర్నరు పార్టీ మానుకుంటామూ మేటే? ఓమాటు నాపేరు గవ... జాబితాలో పడిందిగనుక ఇంక ముందు ముందు పార్టీలన్నింటికీ ఇన్విటేషన్లు వస్తూ నేఉం...

కనుక ఓలాంజి సూటు నాకు శాశ్వతంగాఉండడం అవసరం. డబ్బయితే అయింది మంచి ట్వీడ్లు చింపిస్తా. ఐతే నీదగ్గరేమైనా సొమ్ముందా?

సుం:-మావాళ్లు పట్టుచీర కొనుక్కోమని ఇచ్చిన 50 రూపాయిలు తప్ప ఏమీలేదు.

కిరీ:-నీకు వాయిదాలమీద తీర్చేస్తా. ఆసొమ్ము నాకు బదులియ్యి. నీ చీర కిప్పుడు తొందరేమిటి?

సుం:-(నానుస్తో) మీయిష్టం.

కిరీ:-నా దగ్గరో ముప్పైఫ ఉన్నాయి. నీవియాభై, మొత్తం ఎనభైతో ఫస్టుక్లాస్ డ్రెస్సు వస్తుంది.

సుం:-ఈఖర్చు అవసరమో లేదో ఆలోచించుకు చెయ్యండి. ఉన్నది కాస్తా ఖర్చుచేసుక్కూర్చుంటే రేపు చిక్కుపడతామేమో.

కిరీ:-నాన్సెన్సు, అవసరమైనప్పుడు డబ్బుకి మొహం చూసుకోకూడదు. ఇంక నాలుగురోజులే ఉంది పార్టీ. ఈవేళ ఆర్డరియ్యకపోతే ఆనాటికి సూటు రెడీఅవదు...ఏదీ, నీదగ్గర సొమ్మిలా తే.

సుం:-ఇదిగో తెస్తున్నా (పెట్టెతీసినచప్పుడు) ఇదిగో.

కిరీ:-సరి. ఫేషన్‌గా కుట్టడానికని యూరోపియన్ టెయిలరు కిస్తా. బూడ్సు, ఇతర హంగామాకొనడానికి టైమ్ పడుతుంది గనుక రాత్రి కొంచెం ఆలస్యంగావస్తా, వెడుతున్నా.

సుం:-సరి.

(ఒక 10 నిమిషాలయాక సుందరి తమ్ముడు నరసింహారావు తలుపుదగ్గర)

నరసింహా:-అక్కా! తలుపు.

సుం:-వచ్చె, వచ్చె. (తలుపులుతీసి) ఇవేమిటి? మొక్కజొన్నపొత్తులా, ఎక్కడివి?

నర:-మాయింటికి ఎవరో కోనేటిరావుగారట? ఆంధ్రా యూనివర్సిటిలో ప్రొఫెసరట, ఆయనవచ్చాడు నిన్న. ఇక్కడసైన్సు కాంగ్రెస్సని ఓ మీటుంగవుతోందిలే. దానికోసంవస్తూ, ఆయన పట్టుకొచ్చారు ఈపొత్తులు.

సుం:-సైన్సు కాంగ్రెస్సుకా? గవర్నరేదో టీపార్టీ ఇస్తాట్టకాదు, వీళ్లందరికీ?

నర:-ఔనట! అందుకే కాబోలు ఈ కోనేటిరావుగారు 'నాకేమీ కవరురాలేదా? గవర్నరు టీపార్టీకి ఇన్విటేషను. ఈపాటికి వచ్చిఉండాలే' అని పదే పదే అన్నాడు. అమ్మ, కిరీటరావు బావకేదో కవరొచ్చిందనీ, అదితప్ప ఉత్తరాలే లేవనీ చెప్పింది. ఆకవరేదో మీకుపంపిందిటగా, ఎవ్రరాశారు?

సుంద:-ఆకవర్లో గవర్నరు టీపార్టీ ఇన్విటేషనే వచ్చింది. (ఆలోచిస్తో) కొంపతీసి, ఆకవరు ఆకోనేటిరావు గారిది కాదుగదా? ఏదీ చూడు.

నర:-ఎక్కడుందీ కవరు? ఒహో ఇదా? ఇది కోనేటిరావుగారికే వచ్చింది! అమ్మ కిరీటీరావు బావకే వచ్చిందనుకొని మీకు పంపినట్లుంది.

సుం:-ఎంతపొరపాటు జరిగిందో చూడు. ఆఇన్విటేషను తమకే అనుకొని మీబావ, ఆపార్టీకితగిన డ్రెస్సు కొనడంకోసం ఇంట్లోఉన్న సొమ్మంతా పుచ్చుకొని బజారుకెళ్లారు. తీరాఖర్చుచేసి ఇంటికొచ్చాటప్పటికీ ఆకవరు తమదికాదని తెలిసేక, ఇది మనంఅంతాకలసి ఆయన్ని అవమానపరచడంకోసం చేసిన ప్లాటని భావిస్తారు! అదేమిటోకాని, ఆయనకైనా అడ్రస్సు చూసుకోవాలని తోచిందికాదు.



సభలలో సమావేశాలలో

"ఏ సందర్భములో నయినా ఇండియన్ టీ ఆదర్శమయిన పానీయము అని నా అనుభవము" అని శ్రీ వత్సవ సతి చెప్పినది. దేశములో ఉన్న ప్రముఖులందరూ ఈమె ఆతిథ్యాన్ని పొందినారు. ఉచ్చస్వరముతో పలికిన ఈమె ప్రశంసవల్ల టీ లో ఉన్న అన్ని ప్రయోజనాలు తెలుస్తున్నవి. అంతే కాదు. హిందూదేశ సాంఘిక జీవితములో టీకి ఉన్న ప్రత్యేక స్థానము కూడా తెలుస్తూ ఉన్నది. ఇంట్లో చేసే ప్రతి ఉత్సవమూ పర్వమూ జయప్రదము కావడానికి టీ పానీయము అత్యంత అవసరము.

అతిథులను మెప్పించవలెనంటే వారికి "టీ"ని యివ్వవ

డియన్ టీ మార్కెట్ ఎక్స్‌పాన్షన్ బోర్డువారిచే ప్రకటించబడింది

గానకళ

సంగీతోపాధ్యాయ
శ్రీ గాలి పెంచలనరసింహారావు

హరికాంభోజిరాగము — రూపకతాళము

ఆరోహణ: సరిగమపదనిస		స. రి. గ. మ. ప. ద. ని. స
అవరోహణ: సనిదప మగరిస		,, చ. అం. శు. ,, చ. కై. ,,

సంపూర్ణ సంపూర్ణము

28-వ మేళకర్తయగు "హరికాంభోజి"

ప్రేలికి నాలుగుఅక్షరముల చొప్పున ఘాతనుండి రెండు అక్షరములు త్రోసి పాడుకొనవలయును.

పల్లవి: పదునాల్గు భువనములకు - పతియౌ దైవం
పదునాల్గు భువనములకు - పతియౌ ఒకే దైవం
పదునాల్గు భువనములకు - పతియౌ ఎందైనన్ ఒక్కే దైవం॥ పదు॥

అనుపల్లవి: హృదయపీఠమందు జేర్చి - పదిలముగను భజనసేతున్॥ పదు॥

చరణము: ఉర్వీలోని జీవకోటి - నుదరమందు నునచిబ్రోచు
సర్వరక్షకుండవయ్యు - స్వామివనుచు నుతులనందు॥ పదు॥

పల్లవి.	, , :	పపదనిసా నిదపా	,, మగగరి - పమగరిరిస
	:	పదునఅఆఅఅల్గు	,, భువనఅ - ముఉలఅకుఉ
	, , :	గమమపా, ,,-,, ,,	,, ,,-,, ,, - పదదప
	:	పతియౌఉౌ,-,,-,, ,,	,,-,,- ,, ,, - దైఇవం
	మప :	పపదనిసారిస నిదపా	,, మగగరి - పమగరిరిస
	౦౦ :	పదునఅఆఅఅ అఅల్గు	,, భువనఅ - ముఉలఅకుఉ
	, , :	గమ మపా, ,,-,, ,,	,, ,,-,, ,, - పదదప
	:	పతియౌఉౌ-,, ,, ,,	,, ,,-,, ,, - దైఇవం
	మప :	పపదానీ దనిసా నిసరిసనిద	పామగగరి - పమగరిరిస
	౦౦ :	పదునఆఅఅఅఅఅఅఅఅ	ల్గుభువనఅ - ముఉలఅకుఉ
	, , :	గమ మపా, ,,-,, ,,	,, ,,-,, ,, - సనిదప
	:	పతియౌఉౌ ,,-,, ,,	,,-,,-,, ,, - ఒకెఎదై
	దమ :	పపదానీదనిసా నిసరిస నిద	పామగగరి - పమగరిరిస
	ఇవం :	పదునఆఅఅఆ అఅఅఅ అఅ	ల్గుభువనఅ - ముఉలఅకుఉ
	, , :	గమమపా, ,,-,, ,,	,, సమగమ పా - సనిదప
	:	పతియౌఉౌ ,,-,, ,,	,, ఎందైఇనన్ - ఒకెఎదై
	దమ :	పపధా, నిరిసనిద-నిసనిద	పా, మగగరి, పమగరిరిస
	ఇవం :	పదునా, అఅఅఅఅ-అఅఅఅ	ల్గు-భువనఅ, ముఉలఅకుఉ
	, , :	గమ మాదప మపా,-,, ,,	,, ,,-,, ,,-,, ,,

	:	పతియాఉఉఉఊ-,, ,,	,, ,,-,, ,,-,, ,,
అనుపల్లవి.	, , :	నినిదానీసాసా	నిసా, రీ - రిసనిదా, సా,
	:	హృదయాపీఈర	మందూజెఎఎఏర్చీ,
	, , :	నినిదానీసాసా	నిససారీ - రిసనిద దాసా
	:	హృదయపిఈర	మందూ - జెఎఎఏర్చీ
	, , :	నినిదానీసాసా	నిసరి గమా - గామగరిసా
	:	హృదయపిఈర	మంంందూ - జెఎఎఏర్చీ
	, , :	సరి సనిదానీసా	నిసరి గమా గామగరీసా
	:	హృదయఅపిఈర	మంంందూజెఎఎఏర్చీ
	నిద :	దరిరీ - నిదనిససా	పదదనిరిస - నిదపదపా
	పఅ :	దిఇల - ముఉగఅనూ	భఅజఅనఅ - జెఎఎతూ
	నిద :	దరిరీ - సనిదనిసా	పదదనిసా రిస నిద పాదప పమ
	పఅ :	దిఇలా - ముఉగఅనూ	భఅజఅనాఅఅ, జెఎఏఎఎతున్
చరణము.	, , :	పాపా పాదపదా	దనిరిస సని - నిదదపపమ
	:	ఉర్విలోబబనీ	జిఇఇఇవఅ - కొఒఒఒటిఇ
	, , :	గగమా గరిగరిసా	,, గమ మపపా - పా పాదని
	:	నుదర మంందూ	,, నుఉనఅచీబ్రోచూఉఉ
	ధమ :	పాపా - పాదపదా	దానిరిసని - నిదదపపమ
	ఉఉ :	ఉర్వి - లోబబనీ	జీఇఇవఅ - కొఒఒఒటిఇ
	, , :	గగమపమా గరిగరిసా	,, గగమా - పదమపపా
	:	నుదరఅఆ ముంంందూ	,, నునచీ - బ్రోఒఒచూ
	, , :	పనిదా - దనిసాసా	సనిసారీ - రిసనిద దస
	:	సఅర్వ - రఅఆత్మ	కుంండ వఇఇఇయ్యుఉ
	, , :	పనిదా - దనిసాసా	నిసరిగమా - గామగరీగరిసా
	:	సఅర్వ - రఅఆత్మ	కుంంండ వఇఇఇఇయ్యా
	సని :	దరిరీ - సనిదనిసా	పదదనిరిస - నిదపదపా
	స్వఅ :	అఅమీ - వఅనుఉచూ	నుఉతుఉలఅ - నంంందూ
	సని :	దరిరీ - సనిదనిసా	పదదని దనిసా, నిసరిస నిదపా
	స్వఅ :	అఅమీ - వఅనుఉచూ	నుఉతుఉలఅఆ - నంంంందూ
	ధమ :		
	ఉఉ :	}పదునాల్గు భువనములకు పతియా	

ముక్తాయిస్వరము.

, , :	దనిదపామదపమగ		
పమ :	, గమపదా - నిసరిగ		, రిగమపా, ద, సనిదా
గమ :			మగసా, పా, సా, రి

పదునాల్గు భువనములకు పతియా

ఖద్దరు : స్త్రీలు

> జాతీయతకు జీవం, సాంఘికంగా సౌఖ్యప్రదం, ఆర్థికంగా ఆచరణీయం, గృహపరిశ్రమల్లో ప్రధానం, స్త్రీలపాలిటి పెన్నిది ఖద్దరు పరిశ్రమ. కదురుతిరిగినా కద్యముతిరిగినా కరు వుండదన్నారు. దీన్నిగురించి ఇంకా తర్కించుకోవడం, చర్విత చర్వణంకాదూ ?
>
> 'సత్యంవద'

సాధారణంగా స్త్రీలు ఖద్దరన్నా, రాట్నము వడుకుటయన్నా, చాలా అనాగరికమైన మోటు పని అనీ, నాగరికస్త్రీలకు చేయదగనిపని అనీ ఉద్దేశ్యం కలిగివుంటారు. మొన్న నేను ఖద్దరుచీర కట్టుకుని మా స్నేహితురాలు దగ్గరకు వెడితే ఆమె అంటుంది 'ఇదేమే, ఈ చీరలెల్లా కట్టుతున్నావే? ఇంత బరువు! మొన్న మావారు ఒకచీర తెచ్చారు ఎంతబాగుందో చూడు. రెండున్నర రూపాయల ఖరీదట; పల్చగా వుల్లి పొరలాఉంది; గంధపుచెక్కలాగ మన్నుతుంది. ఈ గాంధీచీర ఏమిటే, తల్లీ! ఎప్పుడూ చూడలేదు; ఇదికట్టుకుంటే భూతకిలాగున్నావు'. నేనన్నానుకదా 'సరే నీకిది భూతకిలాగే వుందికాని, నీవు కొన్నదే అసలైన భూతకి; మొన్న పోలెండును కబళించిన జర్మనీవాళ్లు తయారుచేసినవీ, చైనాను ధ్వంసం చేస్తూన్న జపానువాళ్లు పంపే మూడుగోజులైనా మన్నని సిల్కులూ, చక్కగా సుఖప్రదంగా వుంటాయి నీకు. ఇక్కడేమో, మనయింటిప్రక్కని తిండిలేక చస్తోన్న ముసలమ్మలూ, వాళ్ల సంసారాలు నీకళ్లకు గోచరించనే గోచరించవు. ఎందుకు? రోజూ పత్రికలుచదివి ఏంలాభం?' అని. ఆమెకు కోపంవచ్చినా సరే నా ఆవేశం ఆగిందికాదు.

ఖద్దరుకట్టుగుని నూలు తీసుకుంటూ, మన ముద్దుపాపలు ఏకులు చుట్టుతూ ఉంటే జీవితం ఎంత ప్రశాంతంగా ఉంటుంది! ఒకరిని కష్టపెట్టుడం వుండదు. ఇతరులకు ఈ జీవితము ఆదర్శప్రాయమై దేశమంతా ఎవరిశక్తి మీద వారు ఆధారపడే స్థితికి వస్తుంది. అప్పుడు అనవసరముగా హింసలు జరుగవు. జపాను సిల్కులూ, గ్లాసోకూ, మల్లులూకొన్ని మనలను అణగద్రొక్కి నాశనంచెయ్య దలుచుకున్న వాళ్ల క్షేమలేకుండా డబ్బు పంపిస్తున్నాము. ఎంత అన్యాయము! ఒకబట్టలేకాదు, సమస్తమూ ఇతరదేశాలవే. జడపిన్నులూ, రిబ్బనులూ, డియమ్సిదారాలు, వూలూ, అన్నీనూ; మనదేశంలో తయారుచేసుకోలేమా? అన్ని పరిశ్రమలూ మనమే మనదేశంలో అభివృద్ధి చేసుకోవచ్చు. కొనేజనులు వుంటేనేకాని ఏ పరిశ్రమ అభివృద్ధి పొందదు. మనదేశంలో తిండిలేని వారెంతోమంది వున్నారు. అల్లాంటి సమయంలో మన ధనమంతా ఇతరదేశాలకు ప్రవహింపజేయడం ఏం న్యాయం? మనపిల్లలు కొందరు తిండిలేక ఏడుస్తూ కడుపు కొట్టుకుంటూంటే, మనం సహించగలమా? ద్రోహం. ఆలోచిస్తే ప్రతీతల్లికీ ఇదెంత దుర్భరమో తెలియక తీరదు.

అఖిలభారత చరఖాసంఘంవారు మనదేశంలో అన్నిచోట్లా శాఖలు ఏర్పరచుకొని, న్యాయమైన కూలియిచ్చి ఏకులుచేయించి, నూలువడికించి, బట్టలు నేయించుతున్నారు. వీటిలో రకరకాలచీరలు వస్తున్నాయి. కొనేవారి ప్రోత్సాహమునుబట్టి ఉంటుంది వీటి ఆధిక్యత. ఇన్ని రకాలూ చేతిమీద మన

సోదరులు తయారు చేస్తూండగా, వాళ్లను పొమ్మని త్రోసివేసి, మనస్వార్థమే చూచుకొని, స్వ... ధరకదా అని, యితరదేశపు బట్టలు కొనగలగడం కేవలము ఆత్మవంచనకాదూ? ప్రోత్సాహ... పరిశ్రమ అభివృద్ధి అవుతూన్నకొద్దీ, అన్ని నాజూకులు ఈ బట్టలలోనూ, వస్తువులలోనూ తేవచ్చు... కూడా రానురాను తగ్గుతాయి.

లేనివాళ్లూ, ఉన్నవాళ్లూ తప్పక ఖద్దరేకట్టాలి. 'ఖద్దరు ఖరీదును భరింపలేనివాళ్లు ఖద్దరు... ధరించుట ఎట్లాగ?' అనేప్రశ్న రావచ్చును. చక్కగా ప్రత్తి పండించుకొని, లేక పల్లెటూళ్లలో కొ... స్వంతంగా ఏకులు తయారుచేసుకొనవచ్చును. ఈ పద్ధతి యిదివరలో పత్రికలలో ప్రకటించబడి... ఏకులతో ప్రతిదినమూ రాట్నముమీద కాని, తకిలీమీద కాని ఒకగంటసేపు నూలు తీయవచ్చును. ఖాళీ కబుర్లసమయంలో ఈపని సులభముగా చెయ్యవచ్చును. రోజునకు ఒకగంట రాట్నముమీద తీసినట్లయితే 200 గజములు నూలు సులభముగా తీయుటకు ఒకనెలలో అలవాటు పడుతుంది. సంవత్సరం పొడుగునాచేస్తే, ఎవరికి సరిపడ్డబట్టలు వాళ్లు నిరాఘాటంగా నేయించుకొనవచ్చును.

ఏండ్లునిండిన ముసలి స్త్రీలుకూడా కాలుకదుప నక్కరలేకుండా తమ జీవితమునకు సరిపడ్డ... ప్రతీ సంవత్సరం సంపాదించుకొనగలుగుచున్నారు. ఇంకేపనిఅయినా వీరికి తిండిపెట్టగలదా? క్షా... పట్టినప్పుడు ఈ ఖద్దరు ఉద్యమమే రక్షణోపాయమవుతోంది వేలకువేలు జనులకు. బాల్టిక్ రాజ్యాల... చదివితే, వారి గృహపరిశ్రమలు వారిని ఎట్లు రక్షిస్తున్నాయో తెలియగలదు. గాంధీమహాత్ముడు హిందూ... లోని పల్లెలసత్తా తెలుసుకొని, తన జీవితంలో ఖద్దరునకు మొదటిస్థానం ఇచ్చాడు. "రాట్నమే నా... అంటాడు 'రాట్నసేవయే ఈశ్వరసేవ'ట. ఈ ఖద్దరు మానవజీవన విధానమునందుకూడా ఒక... ధర్మమును వ్యక్తముచేస్తోంది. భారతదేశానికిది మోక్షసాధనము; నిరాడంబరజీవికి బాహ్య... అహింసాసిద్ధికి ముఖ్యసాధనము; గృహపరిశ్రమలలో నగ్రగణ్యాము. ఇది పేదలపాలిటి కామధేను... ములకు పోయే స్వర్ణవాహినిని ఆపగలిగే ఆనకట్టు. ఎండకన్నెరుగని మానవతులైన స్త్రీలకు... జీవనాన్నిచ్చే అపూర్వసాధనము; అనాధలకు శరణ్యాము. జీవనముకై ముష్టియెత్తుకొనడాన్ని లో... భారతజాతీయైక్యతకు సాధనము. ఖద్దరు పరిశ్రమ స్త్రీలసొత్తు. ప్రతిస్త్రీ రోజులో కొన్నిగంటలు... కాలక్షేపం చేస్తూనేఉంటుంది. అటువంటి సమయాల్లో నూలు తియ్యడం ఒకనిత్య ధర్మంక్రింద పెట్టి... ఆమె సంసారానికి కావలసిన బట్టలు తయారుచేయగలుగుతుంది. ఇటువంటి ఉత్తమ కార్యాన్ని 'మోటు'క్రింద కట్టివేయడమువల్ల నాజూకు పేరుచెప్పి మనమే మోసపోతున్నాము గాని వేరుగాదు.

కర్షకా!

జీవులకు అన్నదానంబుజేయు నీవు అష్టకష్టములన్నియు నట్టెమరచి
కండలను కరగించియు కష్టపడియు కర్షకా! యేమిటోయి నిర్ఘాంత పడెదు!
కళ్లు లొట్టలుపోయియు, కడుపు లంటుకొనియు ఎండుముఖాలతో కాళ్లకడ్డు
బడెడి దీనవదనముల బిడ్డల కని కర్షకా! యేమిటోయి నిర్ఘాంత పడెదు.
మంచిరోజులు గాంచెదం మనము ఇట్లు ఇంకనెన్ని దినంబులు ఈ ఇడుములు
నీదుశక్తి జూపన్ లెమ్ము నిద్రనుండి కర్షకా! యేమిటోయి నిర్ఘాంత పడెదు!

—శ్రీమతి ఈడ్పుగంటి ...

కొవ్వూరు హిందీబాలికా పాఠశాల బాలికలు

కుమారి
శివుడు సుబ్బలక్ష్మి
'ధన్ దాస్' అను హిందీ
నాటకమున పాల్గొని రజిత
పతకమును బడసినది.



కుమారి
జాజాల పార్వతి
హిందీ వక్తృత్వ పోటీ పరీ
క్షలో ప్రథమ బహుమతిగా
నొక రజిత పతకమును
బడసినది.

'మూడేళ్ల ముద్దుబాలుడు -
బాలికావేషమున'



'చిరునవ్వు'

సనాథా? అనాథా?

శ్రీ బంటి రామారావు

> నిర్మల మలయ మారుతంలో తేలియాడవలసిన నిర్మల జీవితం వృద్ధ వివాహపు సుడిగాలిలో చిక్కుకుని శిథిలమై పోయింది...
>
> సనాథమైన ఆమె అనాథ జీవితానికి మరి జీవన జ్యోతి లేదూ...

'ఆహా ప్రపంచమా' అంటూ కూలబడింది నిర్మల. కండ్లవెంబడి నీళ్లుకారడం ప్రారంభించాయి. నిన్నమొన్నటికోడలు. ఆమెకిటువంటి సంతాపమా? చిన్నప్పటినుండి నేటివరకు తలితండ్రుల ప్రేమలో గడిచాయి రోజులు. ఏకాంతవాసం యేర్పాటుచేసుకుంది. చిన్ననాటి స్నేహప్రవాహము ప్రవహించింది. ఇప్పుడు చిన్నప్పటి చెలికత్తెలను పోగొట్టుకుంది. ఆ నిర్మల నేడు మరోప్రపంచంలోకి నెట్టుకురాబడింది. అయితే సంతాపమెందుకుండదు? ప్రపంచమంతా ఆమెకు క్రొత్త. కొన్నిరోజులకుగాని యీ ప్రపంచానికి అలవాటుపడదు. తన్నుతాను తెలుసుకోలేకపోతోంది నిర్మల. జీవితపర్యంతం తాను ఎట్లాగడపాలో ఆలోచనకు రాలేదు. రేపే ఆమె పాపపరిహారం జరుగుతుంది. అపుడామెకు సంతాపానికి బదులు స్వభావిక ఆనందంవస్తుంది. జీవితవిలువకూడ తెలుస్తుంది. ఆమె భవిష్యత్తు అంధకారమయం. నిర్మల పుట్టి పెరిగిందన్నమాటే గాని వ్యవహారజ్ఞానం శూన్యం. తనభవిష్యత్తును కళ్లారా చూచింది. ఏమిటి? ఘోర అంధకారం. ముళ్ల డొంక. అడుగడుగునకు ఆపదలు. ఆపదలనుండి ముక్తిమార్గమేదీ కనబడలేదు. ఆమె ఆకాశమందు వెలుగులేని కిరణాలున్నాయి. పెద్దజ్వాల ఆమె కోమలహృదయంలో బయలుదేరింది. మనసుమాత్రం నిలకడలేదు. ఆమె తలితండ్రులే రక్షణకుబదులు కందకం త్రవ్వారు. పాపం నిర్మలకు సహాయంలేదు. చాల బాధపడుతూంది. ఏంచెయ్యాలి?...

ఆమె కొద్దిరోజులక్రితమే యీ యింట్లో పాదంపెట్టింది. ఇంటివద్ద స్నేహితురాండ్రు 'నిర్మల అత్తవారింటికెళితే యీవిధంగా ఉంటుందా? మనల్ని మరచిపోతుంది. మరల తిరిగివస్తే మనలను సరిగా చూడదు, సరిగా మాటాడదు, విసుక్కుంటుంది.' అని వేళాకోళం చేసేవారు.

నిర్మలవచ్చి రెండువారాలు గడచిపోయింది. తనపుట్టింటి గొడవలు మరచిపోయింది. కాని మనసు బాధిస్తూనే వుంది. మనోవేదన క్రమంగా మించింది. అయితే ఏమి? ఆమె కేవలం స్త్రీ ఆమెనోరు మెదిపితే సమాజం వేయికండ్లతో చూస్తూవుంటుంది. తనభాగ్యరేఖ ఆపదలతో పోరాడ్డానికి సిద్ధపడింది. గొప్పమార్పు వచ్చింది ఆమె జీవితంలో. ఆమె హృదయం కోమలం, కాని రాయైంది. స్త్రీ కంఠం మృదువు, కాని కటువయింది. ముఖాన కోపజ్వాల చెలరేగింది. ఎవరికొరకు? ఆమెకిదంతా తెలియదు. ప్రపంచమంటేనే ఆమె కసహ్యమయింది.

సంధ్యవేళ. నక్షత్రాలు ప్రకాసించాయి. గదిలో వంటరిగా చింతతోకూర్చుంది నిర్మల. ఆమె చింతఅనే చితిలోపడి మండిపోతుంది రాత్రింబవళ్లు. అదేదోగొప్పదే అయిఉంటుంది. ఆమెనెవరో పిలిచారు. గుండెకొట్టుకుంది వేగంగా. శరీరం గగుర్పాటుచెందింది. అకస్మాత్తుగా కళ్లనీళ్లుకారాయి.

'నిర్మలా నీవు నాధర్మపత్నివి; నాకుశక్తిలేదు; నీవు కోపముచెంద నవుసరంలేదు. భగవంతునిపూజ కాజాలదు. నేను భక్తుడనుకాని అసమర్థుడను; నాకోరకు నిన్ను పెండ్లాడలేదు; పూజలు బాగాజరుగుటకు చేసుకున్నాను' అని ఎవరోచెప్పినమాటలు ఆమె బాగావింది.

'ఒంటరిగా నేను దేవాలయానికి వెళ్లలేను' అంది నిర్మల ఏడుస్తూ.

'గురుదేవుడున్నాడు.'

'ఉన్నాసరే, నేనుపోలేను.'

'నీకువెళ్లుటకు భయమువేస్తే మనిషిని పంపిస్తా'నని కాళీచరణబాబు నౌకరును బలవంతపెట్టాడు. నిర్మల పెద్దనిట్టూర్పువిడిచింది. ఆజ్ఞ తిరస్కరించటానికి ప్రయత్నించింది, సాధ్యమా? ఆమె పూజ ప్రారంభించింది, స్నానంచేసి పూలతోసహా మందిరానికి పోతూంది.

దినములుగడచిన కొలది ఆపదలువస్తున్నాయి. ఎల్లపుడు ఆమె సతీత్వం చెడగొట్ట త్నాలు జరుగుతున్నాయి. తన్ను వెంటాడే కాముకులనుగురించి పతిదేవుతో మొరపెట్టుకుంది. లేదు. ఏమీచేతకానపుడేమిచేస్తుంది? వెక్కివెక్కి ఏడ్చింది.

ఆనాడు శ్రావణపూర్ణిమ. మందిర పూజారివచ్చాడు. 'నేడుమంచితిథి. యీరోజు ఉపవాసదీక్షతో పూజసల్పిన పుత్రుడు జన్మించును. రాత్రంతా అక్కడేఉండాలి'అని కాళీ చెప్పాడు. సంధ్యాసమయం. దేవాలయపు గడియారంమ్రోగింది. పతివ్రత, భారతనారి భర్తసేవ ఆమాటలన్ని నిర్మలకు చెప్పాడు, కాని ఆమె సందేహించింది. విధిలేక మందిరమువైపు ప్రయా కండ్లవెంబడి నీళ్లు కారుతున్నాయి, కాని ఆవిడ సంతోషానికి అంతులేదు.

నిర్మల నటుపంపి కాళీచరణబాబు సంతానంఅనే ఆశలోమునిగి రాత్రిగడిపాడు. 5 గం దేవాలయపు తలుపులు తెరువబడలేదు. ఆలస్యం అయినకొలదీ 'నిర్మలవ్రతం ఫలించింది. మేల్కొనడంచేత యింకాలేవలేదు. గురుదేవ్‌కూడ యింకా మేల్కొనలేదు.' అని ఆలోచి కాళీచరణ్. యింతలో 8 అయింది. నౌకరునిపిలిచాడు, కాని జాడలేదు. మరుక్షణంలో 5, 6 'మీరేనా కాళీచరణబాబు? మీభార్యయేనా నిర్మల?' అంటూవచ్చారు. పోలీసు యినస్పెక్ట మూడు ఖూనీలకు బాధ్యులైయున్నారు, మీ భార్యవ్రాసిన పత్రమిదిగో' నని జాబు చేతికిచ్చా బాటు సంకెళ్లుకూడ తగిలించారు. తన భార్యవ్రాసిన పత్రాన్ని కాళీచరణబాబు యీవిధంగా నారంభించాడు. 'సోదరులారా! నేను సనాథనైనా అనాథనైపోయాను. నాపతి కడువృద్ధ సం॥లో ఆయన నన్ను వివాహమాడారు. నేను వారిధర్మపత్నిని నన్నువారు అమర్యాదగా సంతానాపేక్షతో మందిరానికి పంపారు. అచట నా పాతివ్రత్యానికి భంగం గలుగపోయింది. నిమిత్తం నేను స్వయంగా రెండు ప్రాణాలుతీసాను; నా ప్రాణంకూడ సమర్పించాను' చదువుతూ బాబుకు కళ్లు మూతలుపడ్డాయి. ఇనస్పెక్టరును చూస్తూ చూస్తూ పక్కమీద కూలబడ్డాడు. నిమిత్తం లేకుండానే అతని ప్రాణాలుకూడా ఎగిరిపోయాయి.

(అనువాదం)

★ స్త్రీలు

రైలు ప్రయాణము

రైలుప్రయాణము - ఇదొకటి - పెద్ద చరిత్రగల సాంఘిక దుర్వ్యవస్థ. ఇందు స్త్రీలవిషయమై జరుగుచున్న అసౌకర్యములు, అగచాట్లు చెప్పనలవిగాదు. ఇందుకు స్త్రీ సంఘములు తగిన అందోళన జరిపినగాని ఇది చక్కబడదు.

రైల్వే ప్రయాణమును గురించి ప్రతి ఒక్కరు శ్రద్ధతీసుకొనుచున్నారు. ఎందుకన రైల్వేలలో ప్రయాణీకులకు గలుగుచున్న అసౌకర్యములే కారణము. ఇందులకుగాను భారతదేశములో ప్రయాణీకుల సంఘములు స్థాపింపబడి ప్రయాణీకులకు సౌకర్యముల కలుగజేయుటకుగాను కృషిచేయుచున్నవి. తెలుగు వారికి సేవచేయుటకుగాను బెజవాడలో 'ఆంధ్రదేశ రైలు ప్రయాణీకుల సంఘము' స్థాపింపబడి సొసైటీల ఆక్టుక్రింద రిజిష్టరు చేయబడినది. ఆంధ్ర సంఘమునకు ఆధీనమైన జిల్లా సంఘములు, తాలూకా సంఘములు కూడా కృషిచేయుచున్నవి.

రైల్వేలలో స్త్రీలు స్వతంత్రముగా ప్రయాణము చేయుటగలదు. కాని వారి ప్రయాణములో రైళ్లలో, స్టేషనులందు అనేక అసౌకర్యములు కలుగుచున్నవి. కాని అవి పూర్తిగా వెల్లడి అగుటలేదు. ఇందులకు కారణము మన అశ్రద్ధ అని చెప్పకతప్పదు. 1927 సం|| నుంచి ఆంధ్రసంఘము కృషిచేయుచున్నప్పటికి యింతవరకు స్త్రీలనుండి ఒకరిపోర్టుకూడా రాలేదు. కాని ఈమధ్య శ్రీమతి రాధాబాయమ్మ గారు సెంట్రల్ అసంబ్లి సభ్యురాలైన పిదప స్త్రీల విషయములలో ప్రశ్నలువేసిరి. మిస్ట్రెస్ సులోచన బాయి పారడకర్ గారు 'స్త్రీ ప్రయాణీకులకు జాగ్రత' గురించి రైల్వేబోర్డువారితో ఉత్తర ప్రత్యుత్తరముల జరిపియున్నారు.

ఆంధ్రదేశములో స్త్రీలకు కలుగుచున్న అసౌకర్యములను తెలుసుకొని వాటిని నివారణచేయ ప్రయత్నములు జరుగుటలేదు. ప్రతిస్టేషనుయందు టికట్లుతీసుకొను స్థలమున పురుషులతోకలిసి తీసుకొనునప్పుడు, గేటుదాటి వెళ్లునప్పుడు టిక్కెట్టుకలెక్టరువల్ల కలుగు ఇబ్బందులు, ఈరైలువద్ద స్త్రీలబండి ఎచటనున్నదో కనుగొనునప్పుడు, రైలునెక్కి స్థలములేక క్రిక్కిరిసియుండ నిలచుండుట వగైరా అనేక అసౌకర్యములు నిత్యము స్త్రీలు అనుభవించుచు వీటిని స్త్రీలకున్న సహజమైన ఓర్పుతో యిమిడ్చుకొనుచున్నారు కాని బయలు పరచుటలేదు.

జనసమర్దన మెక్కువయున్నట్టి బెజవాడవంటి స్టేషనులో ప్రత్యేకముగా స్త్రీలకు టిక్కెట్లు వేరుగా అమ్మించుట, ప్రత్యేకగేటులు ఏర్పరచుట, ఏముప్పదిమంది ప్రయాణీకులకే సరిపోవుబండ్లనుగాక యింకను ఎక్కువమంది సౌకర్యముగా కూర్చుండుటకు వీలగుబండ్లను తగిలించి, ఆబండిమీద పెద్ద అక్షరములతో 'స్త్రీలకొరకు మాత్రము' అని వ్రాయించుట చాల అవసరమైన విషయములై యున్నవి. స్త్రీల బండ్లలో చంటిపిల్లలకు ఉయ్యాలలు ఏర్పరచుటకూడ అవసరము.

గేట్లవద్ద టిక్కెట్టుకలక్టర్లు స్త్రీలను చేతులనడ్డగించి ఆపుట నిత్యము కళ్ళార చూచుచు కుండుట శోచనీయము. పురుషులుకూడా యిట్టిస్థితిలో తమ స్త్రీలు కారుకదా అని భావించి చూచు భావ్యముకాదు. ప్లాటుఫారంమీద సరకులమ్ము కుర్రవాళ్లు ప్రవర్తించునట్టి నడతలుకూడా విమ్మ వనేకముగలవు. రైళ్లలో పుస్తకములు అమ్మువారు 'నామగడె నీమొగుడు ఒకఅణా' అని పెద్దగా వేయుచూ అమ్ముట, మొదలైన అవినీతి ప్రసంగములు స్త్రీలువినుచూ చూచుచూ సిగ్గుతో పురుషులు ఆనందించుట మొదలగు అవినీతి ప్రవర్తనలు రైళ్లలో జరుగుచునే యున్నవి.

యం. యస్. యం. రైల్వేలో స్త్రీలకు ప్రత్యేక ప్రయాణీకులశాలలు ఏకొద్దిగానో యున్న వాటిని స్త్రీలు ఉపయోగించుటలేదు. ఒకవేళ ఉపయోగించిన టికెట్టుకలెక్టరువచ్చి మీటిక్కె అని అడిగి, 'మీదేవూరు? ఆ వూరు ఎక్కడ? మీరు ఈవూరు ఎందుకువచ్చారు' అని అతని కసు ప్రశ్నలు వేయుచుండును. (ఇట్టిది బెజవాడలో జరుగగా రిపోర్టుచేయబడి తగుచర్య తీసుకొన గార్డుల విశ్రాంతి గదులలోకి స్త్రీలను తీసుకొనివచ్చి అవమానించిన విషయములు పత్రికలలో వచ్చు యున్నాము. స్త్రీల క్యారేజిని ఒకదినమున ఇంజనుదగ్గిర, మరొకదినమున గార్డుపెట్టిప్రక్కన యుం

ఇట్టివి అనేక అసౌకర్యములు జరుగుచునే యున్నవని తలంచవచ్చును. వీటిని నివారణసే స్త్రీలుకూడా శ్రద్ధ వహించవలయునని వేరుగా వ్రాయ నవసరములేదు.

ఆంధ్రదేశ రైలుప్రయాణీకుల సంఘములో ప్రత్యేకముగా స్త్రీలకు సౌకర్యములు కలుగజే గాను 'స్త్రీశాఖ'ను ఏర్పరచ తలంచితిమి. విద్యావంతులైన స్త్రీలెల్లరు ఈ శాఖయందుజేరి వా సోదరీమణులకు సేవచేయ మిక్కిలిగా ప్రార్థించుచున్నాను.

నిత్యము ఖర్చుచేయుదానిలో ఎంతో విలువలేనట్టి రెండుఅణాలు మాత్రము సంవత్సరమ నిచ్చి ఆంధ్రదేశ రైలుప్రయాణీకుల సంఘమున సభ్యులుగాజేరి స్త్రీశాఖను వృద్ధిలోకి తీసికొని రాగల సోదరీమణులెల్లరని మిక్కిలిగా ప్రార్థించుచున్నాను. ఈ సంఘమునకు యం. యస్. యం. రైల్వే అడ్వ కమిటిలో ప్రాతినిధ్యముగలదు. ఈ ప్రాతినిధ్యమునకు నన్ను సభ్యునిగా ఎన్నుకొనిరి. కావున ప్రయా కలుగుచున్న అసౌకర్యములను, అవసరమగు సౌకర్యములను నాకు తెలుపగోరుచున్నాను. 'సూర్య సంజీవరాయణం, ప్రధానకార్యదర్శి, ఆంధ్రదేశ రైలు ప్రయాణీకుల సంఘం, తుమ్మపూడి పోష్టు, గుం జిల్లా,' అని వ్రాసిన నాకు వర్తమానములు తెలియగలవు.

—శ్రీ సూర్యదేవర సంజీవరా

"తేఁటి నాతో నింక మాటాడవేమి?"

నీగాన కలిమిచే రాగాంధమైన యారామ కుసుమముల నారాటపెట్టి
దూరానపోయెదు దొంగవాఁడట్టు లీలోన మఱిచూడ వాలోలవిరిని.
అలరు తేనియలాని యలసినావేమొ? విరిపరాగమ్ముల విశ్రమించితివో?
తేనెకాలువలందు తేలియాడితివా? తేఁటి నాతో నింక మాటాడవేమి?
ఆశలుడిగిన యట్టి యతివరునివోలె నదినిదాటిన పాంథనరుని చందాన
ప్రకృతిలో లీనమై పాటమానితివా తేఁటి నాతో నింక మాటాడవేమి?

—ఉభయభాషాప్రవీణ, శ్రీ వేదవల్లి తాయా



బాల భాగ్యోదయము.

బొమ్మల పెండ్లి

శ్రీ అంకాల సత్యవతిశ్మ.

శలవుదినాల్లో మాస్నేహితులు మా యింటికి రావడం, వాళ్లయిండ్లకు మేముపోవటం అలవాటు. ఒక ఆదివారంరోజున మాస్నేహితురాండ్రు వనజ, పంకజం ప్రొద్దున్నే వచ్చారు. మేమందరం ఒకచోట కూర్చుని ఏవో గొడవలు చెప్పుకుంటూవున్నాం. అప్పుడు మాచిన్నచెల్లెలు లలిత లోపలనుండివచ్చి 'అక్కయ్యా బొమ్మల పెండ్లి చెయ్యవూ' అని అడిగింది. ఆమాటవినగానే మాకందరికి గత శెలవల్లో చేసిన బొమ్మల పెండ్లి జ్ఞాపకానికి వచ్చింది. మళ్లీ ఆలాటిది చెయ్యాలని వుత్సాహము కలిగింది. అందరం చేద్దాం అంటే చేద్దాం అనుకొని రాబోయే అదివారంనాటికి ముహూర్తం యేర్పాటుచేసాం. ఆరోజునుంచీ బొమ్మలకు చీరెలు, రవికెలు, మంగళసూత్రాలు, పూసలతో నగలు మొదలైనవి అన్నీ తయారుచేసికొని శలవుదినం కోసరం యెదురుచూస్తూ వున్నాం.

వనజ, పంకజం ఒక బొమ్మకు శృంగారంచేసి తక్కిన స్నేహితులతోకూడి ఆదివారం ప్రొద్దున్నే వచ్చారు. మా చెల్లెలు శశి పెండ్లికొడుకువాళ్లకు చేయవలసిన మర్యాదలుచేసి లోనికి తీసికొనిపోయి ఒక చోట కూర్చోపెట్టింది. అంతలో మా తమ్ముడు మోహన్ వచ్చి 'అక్కా నేను పెండ్లికొడుకువాళ్లతో వుంటాను' అని అడిగినాడు. అట్లాగేవుండమని చెప్పి పంపేశాం.

అందరంకలసి వంటలుచేసికొన్నాం. తరువాత పెండ్లి ప్రారంభించపోయాం. బ్రాహ్మడు కావలసివచ్చాడు. మోహనును అడిగాం. వాడువొప్పుకొని కొంచెంసేపట్లో బ్రాహ్మడుగా తయారై వచ్చాడు. పెండ్లి మొదలుపెట్టాం. బ్రాహ్మణుడు మంత్రాలేవో చెప్పేశాడు. ముందు కట్నం చదివించమని అడిగింది పంకజం. నాలుగుదమ్మిడీలు తెచ్చి పళ్లెంలో వెయ్యబోయాను; 'అట్లా వల్లపడదు యిస్తానన్న ప్రకారం యివ్వవలసినదే'నని పట్టుపట్టింది జయ. చివరకు ఆరుదమ్మిడీలు వేస్తేనేగాని వూరుకోలేదు. కట్నం నగలు చాలా తక్కువయిచ్చారని, బట్టలు సరియైనవి పెట్టలేదని, పెండ్లికొడుకువారు వాళ్లవిధప్రకారం వాళ్లు గల్లంతు చేసారు.

పెండ్లి అయిపోయే సమయంలో పేరంటాండ్రకు కుంకుమబొట్టు తాంబూలాలు యిస్తూ యెవరి పనిమీద వాళ్లువెళ్లాం. తిరిగి వచ్చేటప్పటికి పళ్లెంలో వేసినకట్నంలో రెండుదమ్మిడీలు తగ్గాయి. బ్రాహ్మడు

మీద అనుమానం వేసింది. వాడిని అడిగితే లేదంటే లేదన్నాడు. చివరకు వాడి పైతుండుగుడ్డను లాగిచూ దాంట్లో రెండుదమ్మిడీలు వున్నాయి. బ్రాహ్మడికి యివ్వవలసిన కట్నం వొకదమ్మిడీ వాడికిచ్చాం.

పెండ్లయింది. భోజనాలవేళ కావటంచేత వడ్డించే యేర్పాటులో వున్నాం, ఈసమయ మోహన్ యెవరికి తెలియకుండా వంటయింట్లోకి వెళ్లిచూచాడు. గారెలు వాడికంటబడ్డాయి. వాడిక లంటే యిష్టం. అందుచేత రెండుగారెలుతీసుకు తినేశాడు. వాడు చేసినపనికి నాకు పట్టరాని కోపంవచ్చి నాన్నగారితో యీసంగతిచెప్పి కొట్టిస్తేనేగాని వీడికి బుద్ధిరాదని అనుకున్నాం. భోజనాలు అయినత మాస్నేహితులు యెవరియిండ్లకు వాళ్లు వెళ్లిపోయారు.

సాయంత్రం నాయనగారు అఫీసునుండి రావడంతోనే మోహన్ చేసిన వాటినిగురించి చెప్ప యికమీదట దొంగపనులు చేయకుండా బుద్ధిచెప్పాలని వాడిని పిలిచి నాయనగారు రెండుదెబ్బలు కొట్ట

పాత పాటలు

సీమ మిరపకాయ చిర్రోబుర్రో!
పాతగుడ్డచిరిగితే పుర్రోపుర్రో!
దానిమొగుడు దాన్నికొడితే మొర్రోమొర్రో!

సూరే గుమ్మిడికాయ
సుబ్బమ్మ తలకాయ
నార దబ్బకాయ
నారమ్మ తలకాయ

విశాఖపట్నం వీసెడిబెల్లం
నీకోపదలం నాకోపదలం

కళింగపట్నం కాసులపేరు
నీకోపేరు నాకోపేరు

భీముడిపట్నం బిందెలజోడు
నీకోజోడా నాకోజోడా

చెన్నపట్నం చెఱుకుముక్క
నీకోముక్క నాకోముక్క

బిందెనిండా కందులూ!
రంగసానీ బొందులూ!!

వాసాలమీదదే మీసాలఎలుక
చిట్టెమ్మ చేతిదే రత్నాలగిలక
రత్నాలగిలకికీ మూడువంకల్లూ
వజ్రాలుతాపింత్రు వారిమామల్లూ?

ఆటమాణిక్యమే పాటమాణిక్యం
నట్టింటరాఘవ రత్నమాణిక్యం!
రత్నమాణిక్యమ్మ ఎవ్వారిపట్టి!
రాజుల్లచెలికాడు రావన్నపట్టి!!

—శ్రీ శ్రీనివాసాచా

గ్రంథ సమీక్ష

శ్రీ మహారాజ విక్రమదేవవర్మ రచనలు

ప్రకాశకులు : శ్రీ తలిసెట్టి రామారావుగారు, మానేజరు, హుజూరు ఆఫీసు, జయపురం.

శ్రీ జయపురాధీశులును, సాహిత్య సామ్రాట్టులును అగు శ్రీ శ్రీ విక్రమదేవవర్మ మహారాజులుం గారు రచించిన ఖండకవితలు, కథలు, ఉపన్యాసాలు చేర్చి పుస్తకరూపాన్ని ప్రకటించారు ప్రకాశకులు. శ్రీ మహారాజుగారి కవితాప్రసక్తి ఆంధ్రమహాశయులకు క్రొత్తగాదు. వారి రచనలనన్నిటిని చేర్చి ఇట్లు పుస్తక రూపంగా వెలువరించడం మిక్కిలి సమంజసంగా ఉన్నది.

ఆకలి మంటలు

కర్త : కీ॥ శే॥ కామ్రేడ్ శెట్టిపల్లి. ప్రకాశకులు : రైతాంగ గ్రంధమాల, గుడివాడ. వెల 8 అ:

కార్మిక, కర్షకవర్గముయొక్క దైన్యస్థితి, వారుపడే పలువిధములైన బాధలు, జరిగిన కొన్ని ఘట్టాలతో ఇందు చిత్రింపబడ్డాయి. హృదయవిదారకమైన యీ స్థితిని నిర్మూలం చెయ్యడానికి, ఉద్యమాన్ని బలవంతంచేయడానికి ఇందులో చాలా విషయముంది.

శెట్టిపల్లి గీతాలు

సంపాదకులు : శ్రీ ఆచార్య రంగాగారు. ప్రకాశకులు : ఆంధ్ర రైతాంగ గ్రంథమాల, గుడివాడ. వెల 2 అణాలు.

భావగర్భితమై, ప్రజలలో విప్లవాన్ని రేకెత్తించగల రచన శెట్టిపల్లిది. ఈ గీతాల వాడి ఇదివరకే చవిచూచింది ఆంధ్రదేశం. ఆ గీతాలనన్నిటిని చేర్చి పుస్తకరూపాన్ని ప్రకటించడంలో వారి ధర్మాన్ని వారు నెరవేర్చారు రైతాంగ గ్రంథమాలవారు.

సంగీతోపాధ్యాయుని 'గానకళ'

శ్రీయుతులు గాలి పెంచలనరసింహారావుగారి గేయములపై మాకుఁగల ప్రేమాతిశయములను గుర్తించినవారగుటచే వారు 'గృహలక్ష్మి' పత్రికలోఁ బ్రకటించిన గేయములు మాకు బంపిరి.

వీరి కీర్తనలు, కర్ణాటక, హిందూస్థానీ, మరాటీ సంప్రదాయములలోని నిగ్గులతో ఆధునికాభిరుచుల కనుగుణ్యములగు పోకడలతో శ్రవణపేయములు, హృదయంగములునై యున్నవి. మరియు వీరి గేయములలో గన్పించు కొన్ని యపురూపరాగములు మున్ముందు దేశమున మహాప్రచారము నందఁదగియున్నవి. గేయములతోఁబాటు స్వరతాళ సంజ్ఞలుకూడ కడు జాగ్రత్తగా, యుక్తముగాఁ బ్రకటించియుండుటచే అభ్యాసకులకిది కల్పవల్లి యనఁదగినది.

ఇంక సాహిత్యసందర్భమున వీరి నెంతైన నభినందించవలసియున్నది. కేవలాధునాతన... పూర్వులు రచించిన యనేక గేయములలోకూడ ఉత్తమ కవిత్వము, నుత్తమ సాహిత్యము గానవ... వీరి గేయము లట్లుగాక ప్రతిపదము రసభావస్ఫూర్తితోఁ బ్రకాశించుచుండుట యెంతయుఁ బ్రశం... 'నిరాదరణమేలా? సరస్వతి! వరాలొసగిఁ బరిపాలింపవేలా?' అను నెత్తుబడి యెంత భావస... 'ఆశచేత ప్రతిమానవుడీధర ని - రాశజెందుగదవే మనసా' అను ఒక్క చరణమున జీవితరహస్య... వెల్లడింపబడినది కదా? 'కర్మానుభవముచే యింద్రియములు మర్మములకు లోనైయుండుటచే ధ... వివేకశూన్యుడై నిర్మాతను నింధించు మానవుడు' అను రచనమందలి శబ్దార్థసౌష్టవము వారి సహ... మధురిమను వెల్లడింపలేదా? 'మనసా! వృథాగర్వమేలనే? మహరాజులైన మనుజుండె గాదా!' ఒక్కవాక్యములో ఒక లోకము, ఒక యుగము గోచరించుచున్నవి. ఇట్టి గుణసంపదకు కృషియు... త్ప్రసాదమునుఁగూడ నవసరము. భక్తులై గేయములు వ్రాసిన మహనీయులెల్లరు వేలసంఖ్యలో వ్రాసి... మునచే శ్రీ నరసింహారావుగారికిట్టి శక్తియుక్తులును, యిట్టి మనోభావములును గలుగుటచే భగవంతు... మూలమున కళకును, దేశమునకు మహోన్నతి నుద్దేశించుట స్పష్టమగుచున్నది. కావున వీరును కడు... నిట్టివే వేలకొలది గేయములను రచించి, తాము తరించి లోకమును తరింపఁజేయుదురుగాక.

(ద్వారం వెంకటస్వామినాయుడు, విశ్వనాథకవి...

పత్రికా పరిచయం

కళ

'ఫిల్మ్ సర్వీస్ కార్పొరేషన్' అనే సంస్థ పక్షాన వెలువడుతున్న సచిత్ర సినిమా మా... సంపాదకులు : శ్రీ ఇంటూరి వెంకటేశ్వరరావుగారు, 40, ఎల్డమ్స్‌రోడ్, మైలాపూర్, మద్రాసు. చందా రు. 3. విడిసంచిక 4 అణాలు.

చక్కని ముఖచిత్రంతోటి, ప్రముఖుల వ్యాసాలతోటి పూర్తిగా ఆర్టుపేపరుమీదనే అచ్చు... వల్ల పత్రిక చాలా ముచ్చటగావుంది. 'శారడా' చణుకులు తీవ్రంగానే వున్నాయి. ఇది ఆంధ్రుల ... పొంది కళాసేవచేస్తుందని ఆశిస్తాము.

కథాంజలి వార్షిక సంచిక

సంపాదకులు : శ్రీ ఎ. యన్. రాఘవాచారిగారు, 32, కృష్ణప్పనాయక్ టాంక్ వీధి, మద్రాసు.

ఆంధ్రకథారచయితలు, పఠితలయొక్క ఆదరణాభిమానాలతో పెరిగి కథాంజలి మూడో... పండుగుచేసుకున్నది. ఈ శుభసమయమున మా ఆశీస్సుల నందజేస్తున్నాము. ఈసందర్భాన్ని పురస్క... కొని వెలువడ్డ వార్షికసంచిక, ముద్దులమూటగట్టు ముద్రణతోటి, ప్రముఖుల నాటికలతోటి, కథ... వివిధములైన చిత్రాలతోటి ముచ్చటగావుంది. విడిసంచిక ఒక అణా.



గోధుమలుతో తయారుచేయదగిన వివిధ పదార్థములు.

గోధుమనూక పులగము

అర్ధశేరు పెసరపప్పును నీళ్లలో పావుగంటకాలం నానవేసి వడియకట్టి ఆరపోయవలెను. 40 తులముల కాగిన నేతిలో 1 శేరు గోధుమరవ్వను వేసి సుమారైదునిముషములు వేయించి ఆరపోసిన పెసరపప్పును వేసి కలుపవలెను. ఈ రవ్వ పెసరపప్పువున్న పాత్రలో మరుగుచున్న నీరు కొంచెము కొంచెముగా పోసి కలిపి మూతపెట్టవలెను. గోధుమరవ్వ మూడుపాళ్లు వుడికినతరువాత పావలాయెత్తు పసుపుపొడి, తులము జీలకర్ర 2 తులముల నానవేసి పొట్టుతీసిన తెల్లని మిరియాలు వేసి కలుపవలెను. తరువాత 2 తులముల వుప్పుపొడివేసి కలియపెట్టి క్రిందికిదింపి నిప్పులమీద మూడునిమిషములుంచవలెను. 32 తులముల కొబ్బరివేసి కలియపెట్టవలెను.

రొట్టె చపాటి

30 తులముల గోధుమరవ్వ, 3 తులముల వెన్న, 3 తులముల మీగడ ఈ మూడింటిని తగు పాలతో కలిపి అరిచేతి వెడల్పున చీపురుపుల్ల మందమున రొట్టెలను చేసి యెర్రని నిప్పులమీద కాల్చవలెను.

గోధుమపిండి రొట్టె

24 తులముల గోధుమపిండి 6 తులముల బియ్యపు పిండి పావుతులం వుప్పు వీటిలో తగిన మంచి నీరువేసి కలిపి అరిచేతి వెడల్పున రొట్టెలుచేసి పెనముమీద కాచి యెర్రని నిప్పులమీద కాల్చిన పొంగి మంచి రుచికరముగా వుండును.

గోధుమరవ్వ బర్ఫీ

7 తులముల గోధుమరవ్వ 3 తులముల నెయ్యి 6½ తులముల పాలు, ఈ మూడింటిని కలిపి ముద్ద చేయవలెను. 30 తులముల నేతిని ఒక కళాయిలో పోసి నెయ్యి కాగినవెంటనే గోధుమపిండి ముద్దపిడుచలను చేసి వేయించవలెను. 120 తులముల పంచదార నొక కళాయిలో పోసి 1 శేరు మంచినీరు పోసి పొయ్యి మీద పెట్టి లేతపాకము రాగానే దింపవలెను. ఈ పాకములో గోధుమ పిడుచలను వేసి ముప్పాతిక తులము యేలకపొడి వేయవలెను. అంత ఒక పళ్లెములో పోసి ఆ పిడుచలను కత్తితో కోయవలెను.

—శ్రీ గోపరాజు వెంకటరత్నమ్మ.

గోధుమ పూరీ

గోధుములు మెత్తగ విసరవలెను. ఆ పిండి జల్లించి ఒక శేరు పిండికి ఒకతులం కొట్టిన ఉప్పు, అరపంపు నెయ్యివేసి నీళ్లతో గట్టిగ సాయంత్రం కలపి వుంచవలెను. మరునాడు వుదయం ఆ పిండిని నేతితో మర్దించవలెను. తరువాత వుండలుచేసి పూరీ కొంచం దళసరిగ వొత్తి నేతిలో మాదన్న చేయించవలెను.

గోధుమ హల్వా

ఒకశేరు గోధుమలు బాగుచేసి 4 శేర్ల మంచినీటిలో సాయంత్రం పోసి వుంచి మర్నాడు వుదయం గోధుమలను బాగా కడిగి రుబ్బి పాలుతీయవలెను. ఆ పాలను ఒక పల్చటిగుడ్డ గిన్నెలోనికి వడగట్టవలెను. వడగట్టిన పాలను రెండుగంటలు కదపకుండా తేరనియ్యవలెను. పైనీళ్లు పోసినయడల చిక్కని పాలు మిగులును. ఆ పాలతో గేదెపాలుగాని ఆవుపాలుగాని నీళ్లు కలపక రెట్టింపు పోసి శేరు పంచదారనుకలిపి సన్నని మంటమీద కలియపెట్టవలెను. అరగంటకు కొంచం గట్టిపడును. దానిలో ఒక సోలడు నెయ్యి పోయవలెను. 15 నిమిషము లయినతరువాత 1 పంపు జీడిపప్పు, 1 పంపు కిస్‌మిస్, 1 తులం ఏలకపొడి, 1 తులం కుంకుమపువ్వు వేసి బాగా కలియబెట్టవలెను. 10 నిమిషములకు బాగా గట్టిపడును. అప్పుడు ఒక పళ్లెమునకు నేయిరాచి దానిలో పొయ్యవలెను. ఒకగంటకు బాగా పళ్లెం గట్టిపడును. దానిని చాకుతో ముక్కలుచేయవలెను.

—శ్రీ సి. హెచ్. అన్నపూర్ణా

రవపుష్ప

నెయ్యి ½ ఫలం బాగుగా కాగినతరువాత ¼పడి గోదుమనూక కమ్మని వాసనవచ్చేవరకు వేచి పిదప ఒకపళ్లెములో పోసుకోవలెను. నెయ్యి 2ఫలాలు బాగుగా కాగినతరువాత తుంచిన మిరపకాయలు 1/8ఫలం, ఆవాలు ¼ ఫలం, మినప్పప్పు ¼ ఫలం, నేతిలోవేసి, సగంవంతు వేగినపిదప, జీడిపప్పు ¼ ఫలం, పచ్చిమిరపకాయలు ¼ఫలం, అల్లం ¼ఫలం, పచ్చికర్వేపాకు ¼ఫలంవేసి బాగుగావేగిన పిదప ½ఫడి నీళ్లు పోసి, ఆనీళ్లలో ½ఫలం ఉప్పువేసి బాగా మరిగినతర్వాత ఇష్టమైనవారు ఒకనిమ్మపండు రసంపిండి వేయించుకున్న గోదుమనూకను పోస్తూ కలియబెట్టవలెను. సగంవుడికినతర్వాత 2ఫలాల నెయ్యిపోసి కలిపి మూతపెట్టి సన్నని సెగమీద 5నిమిషములు వుంచవలెను.

—శ్రీ అనసూయ

పూరీ లడ్డు

½ వీశె గోధుమ పిండిలో ½ఫలం నెయ్యిపోసి అందులోచిటికెడు పొడిఉప్పువేసి తగినన్ని నీళ్లుపోసి ముద్దగా కలిపిపెట్టుకోవలెను. 10నిమిషములు నానినతర్వాత చేతితో బాగామర్దనంచేసి పెద్దవుసిరికాయంత వుండలుచేసి, ఒక్కొక్కవుండగా పీటమీదపెట్టి అప్పడాలకర్రతో పూరీ చేయవలెను. 15ఫలాలునెయ్యి బాగుగా కాగబెట్టి పైన ఒత్తిపెట్టిన పూరీని కాగిననేతిలో ఒక్కొక్క

వేసి చక్కగాతేల్చి పిదప ఒకపళ్లెములో యెత్తిపెట్టుకొనవలెను. పూరీలుఅంతా తయారయిన తర్వాత రోటిలోపోసి మెత్తగాదంచుకొని బూరాచక్కెర శ్శేరు పోసి మెత్తగాకొట్టి దానినితీసి ఒకగిన్నెలో వుంచుకోవలెను. పిదప జీడిపప్పు 1 ఫలం చిన్నచిన్న ముక్కలుగా తుంచుకుని బంగారుచాయగ నేతిలో వేపుకొని, దంచినపూరీలో దీనిని వేయవలెను. శ్శేఫలం చిన్నదాక్షపండ్లు దానిలోవేయవలెను. కుంకుమపువ్వు ఒకఅణాయెత్తు, ఒకవుద్ధరిణిపాలలో వేసి మర్దనంచేసి పైనచెప్పిన పూరీపిండిలో వేయవలెను. దానిని అంతా బాగుగాకలిపి మామూలు లడ్డువుండలుగా చేసికొనవలెను.

హల్వా ఒబ్బట్లు

మంచి నెయ్యి ఒకసోలకు కాగినతర్వాత మూడుసోలల గోదుమనూక వేసి బాగాకలుపవలెను. అది కొంచెము ఎరుపు రంగు వచ్చేదాకా వేచితరువాత కిస్‌మిస్‌పళ్లు, బాదంపప్పు, యాలకుపళ్లగుండ వేసి, తవ్వెడు పంచదార, తవ్వెడు నీరువేసి, బాగా కలియపెట్టి మూతపెట్టవలెను. అది ఉడికిన తరువాత దించివేసి అరసోలడు నెయ్యివేసి, మనకు కావలసినంత ఊరవుగా ఉండలు కట్టవలెను. తరువాత పూరీలకు తడపినట్లు గోదుమ పిండితడపి, బాగుగా కలిపి హల్వా ముద్దలకు పొదుపవలెను. రొట్టెల పీటమీద వరిపిండివేసి, ఈ ముద్దలను ఒకొక్కటి చొప్పున రొట్టెలకఱ్ఱతో ఒత్తవలెను. ఒకొక్కటి చొప్పున ఒత్తగా వచ్చిన ఒబ్బట్లను, పెనము మీదవేసి నేయి కొంచెము వేయవలెను. ఒబ్బటు తిరుగ వేసినపుడుకూడ కొంచెము నేయి వేయవలెను. బాగుగా వేగిన తర్వాత, పెనము మీదనుండి తీసివేయువలెను.

—శ్రీ ద్వారపు రత్నాబాయి.

—•• పదార్థముల పట్టిక ••—

ఆయామాసముల్లో మనకు లభ్యమయ్యే వస్తువులతో మనకు కావలసిన ఆహారపదార్థములు తయారు చేసుకొనేందుకు, ఆయా జిల్లావాసులగు సోదరసోదరీమణులు వారివారికి సరిపోవు పదార్థాలను వ్రాసిపంపిన వాటినన్నిటిని సమన్వయంచేసి, ఒక పట్టిక తయారుచేసి, ప్రకటించెదమని గతమాసపు 'గృహలక్ష్మి'లో ప్రచురించినాము.

కాని అందుకు తగునట్లుగా సరియైన విషయాలు మా కార్యస్థానానికి చేరలేదు. కాన యీ గడువును ఇంకొకమాసము పెంచినాము. కాన ఆగష్టు మాసమునకు సరిపోవు పదార్థములను వ్రాసి జూలై 20-వ తేదీలోగా పంపకోరుతున్నాము.

రచయితలకు బహుమానము

గోధుమధాన్యముతో వివిధములైన పదార్థములను తయారుచేయదగిన పద్ధతులను, యీ పత్రికలో ప్రకటించినవిగాక క్రొత్తవి, సరియైన తూనికలతో, కొలతలతో, మంచి అనుభవజ్ఞానముతో ఎక్కువ పదార్థములను వ్రాసిపంపిన వారికి బహుమతి యొసంగబడును. కాన గమనింప కోరుచున్నాము.

పుష్ప చయము * * *

ముస్లిం పెళ్ళిళ్లు

పెళ్లికి ముప్పైఫైరోజులు ముందే పెళ్లికూతురికి నలుగులు మొదలుపెడ్తారు. ఆవపిండి, బార్లీపిండి, పిండి వీటితో నలుగులు, కళ్లకు కాటుక, గోళ్లకు గోరింతాకు పేరికి ముఖ్యము. ఆ నెల పెళ్లికూతురు తేలికగా జీర్ణమై బలమునిచ్చే పదార్థములనే పుచ్చుకోవాలి. దీనినే 'మాంఝా' అ

షెరా

అంటే పెండ్లికూతురికి లగ్నమప్పుడు చేయించే అలంకారము. నారింజరంగు జరీఅంచు పిజమా, బాగా వదులైన చొక్కా తొడిగి, సన్నని పట్టురుమాలతో ముసుకు వేసుకోవాలి. చేతితో చింపి కట్టవలసిందే గాని కత్తిరించరాదు. కత్తెర ఉపయోగించితే ప్రేమానుబంధ పోతుందని వారి నమ్మిక. చమికీచేర్చిన పుష్పసరాలతో పెండ్లికూతురు ముఖమంతయు కప్పివే

గాజీలు

అంటే ముస్లిం పురోహితులు అరబ్బీభాషలో మంత్రములు చదువుతుంటే పెళ్లికూతురు పరదా నుండి 'ఈ వరుడు నీకిష్టమేనా' అని పెళ్లిపెద్దలు అడిగితే నెమ్మళంగా 'ఊఁ' అనాలి. పెళ్లికొడుకు ఆమె వెనుకప్రక్కగా వచ్చి ముందున్న నిలువుటద్దములో వధువు ముఖమును అంతవరకు ఒకళ్లనొకళ్లు చూచుకోరాదు. ఆ సమయమున వధువు కళ్లు గట్టిగా మూసుకొని కనులువిప్పి చూడమని మఱీమఱీ వరుడు బతిమాలుకొంటే ఒక్కసారి కళ్లువిప్పిచూచి మరల కొంటుంది.

దీనికి తర్వాత 'రోషితి' అంటే అప్పగింతలు జరుగుతాయి. పెళ్లికూతురు తల్లి, తండ్రి, అందరు ఆమెను వీడలేక దుఃఖిస్తూవుంటే, పెళ్లికొడుకు తటాలున ఆమెను ఎత్తి పల్లకీలో వెళ్లిపోతాడు.—

కాకినాడ స్త్రీ విద్యార్థినీ మహాసభ

శ్రీమతి వేదాంతం కమలాదేవిగారి అధ్యక్షతను కాకినాడ స్త్రీ విద్యార్థుల సభ జరిగింది. నందలి అన్ని విద్యాలయములనుండి సుమారు 70 మంది ప్రతినిధులు సభకరుదెంచారు.

కామ్రేడ్ పి. జగదాంబగారు (స్థానిక సోషలిష్టుపార్టీ కార్యదర్శి) విద్యార్థినుపతాకాన్ని స్వాతంత్ర్యము, శాంతి, అభ్యుదయాలనుగురించి మాట్లాడారు. శ్రీమతి కమలాదేవిగారు యందు అజ్ఞానాంధకారంలో మునిగి, మూఢాచారాల్లో కుళ్లిపోతున్న 100 కి 90 విద్యాదానం చేయుట ముఖ్యకార్యక్రమముగ పెట్టుకొని, ఉత్సాహముగ పనిచేయవలసిన ముగ ఉపన్యసించారు.

తరువాత, శ్రీమతులు సుబ్రహ్మణ్యేశ్వరి, లలితా నాగుబాయమ్మ, స్వరాజ్యలక్ష్మి, బి. కాంతమ్మ, యామినీ పూర్ణతిలకమ్మగార్లు విద్యార్థినుల ప్రత్యేకసమస్యలు, కష్టములనుగూర్చి మాట్లాడారు.

సత్యస్వరూపుడు గాంధీజీ

గాంధీజీ శిష్యురాలైన మీరాబేన్ మొన్న లాహోరులో మాట్లాడుతూ ఇలా చెప్పింది—"నేను యూరపులోను, అమెరికాలోను ప్రయాణించేటప్పుడు గాంధీజీ శిష్యురాలనన్నంత మాత్రంతో అందరూ నన్ను గౌరవించేవారు. ఒక పోర్టులో ప్రయాణీకుల సామానులన్నీ నిర్బంధంతో తనిఖీ చేస్తున్నారు. నామూట మల్లే ఎవరూ ముట్టుకోలేదు. కారణం? ప్రపంచంలోకల్లా సత్యవంతుడైన వాని శిష్యురాలి మూటలలో తనిఖీచేయవలసినవి ఏమివుంటాయి? అని వారన్నారు." గాంధీజీ తనకు తానేకాకుండా తనచుట్టూవుండే వాతావరణాన్నికూడా పవిత్రంచేయగల పుణ్యమూర్తి అనే మాట అక్షరాలా సత్యం.

సింధురాష్ట్రపు స్కూళ్లలో సంగీతం

సింధురాష్ట్ర విద్యాశాఖామంత్రి కోరికమీద భారతశాసనసభాసభ్యులైన జి. కే. షాహాని గారు సింధురాష్ట్రంలో సర్వసామాన్యంగా అంతా సంగీతం నేర్చుకోటం యెట్లా సాధ్యమవుతుందో ఒక విధానాన్ని తయారుచేసారు. ప్రైమరీ సెకెండరీ స్కూళ్లలో సంగీతాన్ని ఒక బోధనాంశంగా ఉంచి నేర్పాలని, కళాశాలల్లో శాస్త్రీయంగా విద్వత్తు కలిగేటట్లు నేర్పవచ్చునని వారు సూచించారు. అంతేగాకుండా యీ కాలంలో మామూలుగా అంతా పాడే రాగాలలో గానసమ్మేళనం యేర్పాటు చేయాలనికూడా వారి అభిప్రాయం. ప్రతి స్కూలులోను యీ ఏర్పాట్లను పెట్టి సంగీతాన్ని వృద్ధి చేయాలని కార్యక్రమం నిర్ణయించుకుని పనికి పూనుకున్నారు.

పిల్లలు పుట్టడం ఆహారంమీద ఆధారపడి వుంటుంది

స్త్రీలకు ఆడపిల్లగాని, మొగపిల్లలుగాని కలుగుట చూలు యేర్పడ్డది మొదలు వారు తిను ఆహారముపై ఆధారపడి వుంటుందని, అమెరికన్ డాక్టరు మిల్లరుగారు చెప్పుతున్నారు. కార్బొహైడ్రేట్సు హెచ్చుగావున్న పుష్టికరమైన పదార్థాలను తింటూవుండిన స్త్రీలకు ఆడపిల్లలే పుట్టారట, లేక చవుకైన తిండితిను బీద స్త్రీలకు మగబిడ్డలే పుట్టారట.

స్త్రీ ఖైదీలకు వయోజన విద్య

మధ్యరాష్ట్రములందు, జైలులోనున్న ఖైదీలకుకూడ వయోజనవిద్య గఱపుటకై ఒక స్కీమును తయారుజేసినారు. పురుషులకు మాత్రమే ఆస్కీముయొక్క వుపయోగము. ఇప్పుడు స్త్రీ ఖయిదీలకు కూడ ఈ విద్య గఱపబడు చున్నది. సంయుక్త రాష్ట్రములో కాంగ్రెసు మంత్రిత్వం ఈ స్కీమును మొదట ప్రవేశపెట్టింది. మధ్యరాష్ట్ర కాంగ్రెసు మంత్రివర్గంవారు దానిని అనుసరించినారు. ఆ స్కీమునే యిప్పుడుగూడ సర్కారువారు అమలు జరుపుతున్నారు. చదువుకున్న ఖైదీయే విద్యా ప్రచారకుడు, బోధకుడు. రాత్రి 7 గంటల నుండి 8 గంటల వరకు కొందరికి, పగలు 7 గంటల నుండి 10 గంటల వరకు కొందరికి వంతులువేసి ఒక్కొక్క దళము ఖైదీలకు బోధనచేయబడుచున్నది.

సంపాదకీయములు

భిక్షావృత్తి సమస్య

భారతీయుల ధార్మిక ప్రవృత్తికి తార్కాణముగ నిలచియున్న యీ 'భిక్ష' నేడు కృషిదూ సోమరుల జీవనోపాధియగుటవలన మన సాంఘికవ్యవస్థ ఎంత వక్రించినదియు సులభముగ గ్రహించ

నీచముగ పరిణామము జెందిన ఇది నేటి సాంఘికపరిస్థితులకు వేరుపురుగై సంఘమును మొనరించుచున్నది. దీని నెట్లయినను నిర్మూలించవలెనని ప్రయత్నములు అక్కడక్కడ జరుగుచున్నవి.

ఇటీవల బెంగుళూరునం దొకచోట ముష్టివాళ్లువచ్చి యాచించకూడదని నిషేధింప నైజాము సంస్థానమందు దీని నరికట్టుటకు ఒక శాసనము త్వరలో అమలులోనికి రానున్నది. ఈ గాంధిమహాత్ముడు గూడ, ఒకరిప్రశ్నకు జవాబుగ, దీనిని నిర్మూలించవలెనని వ్రాసియున్నాడు. శుభసూచకము.

ఈ బిచ్చగాండ్రలో శరీరదారుఢ్యము గలవారు, యాచనయే వృత్తియని జెప్పుకొనువారు వైకల్యులు, రోగపీడితులు, మొదలగు రకరకములవారితో వీరు దినదినమునకు పెరిగి పోవుచున్నారు. కృషిచేసి జీవనము సంపాదించుకొనుట మాని, కష్టములేకయే ఆర్జించుట కనువగు యీ వృత్తిననేకు చుచున్నారు. ఇందువలన సోమరితనము విపరీతముగ వృద్ధిజెందుచున్నది. ఇట్టి సోమరితనమున మోసగాండ్రకు నిలయమైయున్న దీనివలన సంఘపతనము సంభవించుచున్నది.

ఇక, కుష్ఠు, క్షయ మొదలగు సాంక్రామిక రోగములు గలవారు వీరిలో అత్యధికముగ వీరందరు విచ్చలవిడిగ తిరుగుటవలన యీ అంటువ్యాధులు సంఘములో నితరులకుకూడ వ్యాపించి పము దాల్చుచున్నవి. వికలాంగులు వీధులవెంటతిరుగుచు బాటసారులకు చీకాకు గలిగించుచు సభ్యతకు దూరము చేయుచున్నారు. మహాపిశాచమువలె నికృష్టరూపము దాల్చినదీనిని వెంటనే నామరూ లేకుండ నిర్మూలింపవలసియున్నది.

భిక్షాటనమే వృత్తిగాగలవారిని, శరీరపాటవమున్నవారిని నిర్బంధముగ నిషేధించి, తిరిగి యందడుగిడిన శిక్షింపవలయును.

అంటురోగులనందరను ఒకచోట చేర్చి వారికి తగు వైద్యసహాయము నిచ్చి ఆరోగ్య చేయవలయును. అంగవైకల్యులను వేరొకచోటచేర్చి, వారువారు చేయగలిగిన పరిశ్రమలను చేయిం అందువలన కొంతరాబడి కూడరాగలదు.

ఏదేశమునందును ఇట్టి తీవ్రరూపములోలేని ఇది మనదేశమందింకను నిషేధము కాకుండుట యము. ప్రభుత్వము దీనకి వెంటనే పూనుకొనుట ముఖ్యధర్మము.

లేనినాడు ఉదారులైన ప్రత్యేకవ్యక్తుల యాధ్వర్యమున సంస్థలు స్థాపింపబడి, స్థానిక ప్ర యాదరణలో, ప్రభుత్వ శాసనములయొక్క సహాయమువలన నిరాటంకముగ వీటిని నిర్వహించవచ్చు

సంఘోపకారములకు సహకారమునిచ్చు సుహృదయులు మనదేశమందు చాలమందిగలరు. ఇట్టిది తలపెట్టిన నాడు, సహకార సహాయములకు ఎన్నడును వెలితిరాదు.

ఇది ఇప్పటి కెన్నడో జరుగవలసినకార్యమైనను, దినదిన ప్రవర్ధమానమగుచున్న దీనిని వెంటనే అరికట్టకపోయిన, అంటురోగము లతితీవ్రముగ వ్యాపించి, సోమరితనము విపరీతమై, సంఘము ఎట్టియుపద్రవము నెదుర్కొనవలసివచ్చునో యూహించవచ్చును.

ఈ దుస్థితిని పునర్నిర్మాణము చేయుటకుముందుగ ఒకవిషయము ముఖ్యముగ గమనించవలసియున్నది. ఎందుకు ఇంతమంది యాచించుచున్నారో ఆలోచించి ప్రతిక్రియచేయు టవసరము. వీరందరికి పనికల్పించి అన్నము పెట్టగలప్పుడే ఇదిసాధ్యమగును. ఈ తాత్కాలికోపశాంతికి వెనువెంటనే ఆర్థికస్థితిని సమముచేయుట చాలముఖ్యము. ఇప్పుడుచాలమంది ధనికులు, చాలమంది బీదలు ఉన్నారు. వీరి ఆర్థికస్థితి సమముచేసినగాని ఇది చక్కబడదు. ఆర్థిక బలహీనత దీనికి మూలకారణమైనను, దేశక్షేమముకోరు పెద్దలందరు వెంటనే యీ విషయమై ఆలోచనలుచేసి, తగువిధమున కట్టుబాట్లు చేయవలసియున్నది.

యుద్ధము – భారతదేశము

పశ్చిమఖండమందు యుద్ధము తీవ్రరూపము దాల్చినది. నిరపరాధులగు ప్రజలనేకు లీపశుబలమున కాహుతియగుచున్నారు. చరిత్ర ప్రసిద్ధమైన పట్టణములు రూపుమాసి నామమాత్రావశిష్టమగుచున్నవి.

యుద్ధము ప్రారంభమైనప్పటినుండి ఒకటివెంబడి యొకటిగా 8 రాష్ట్రములు హిట్లరునకు దాసోహమన్నవి. ఫ్రాంసువంటి బలవత్తర రాజ్యముకూడ హిట్లరు కైవశముకాక తప్పినదిగాదు. ఇక హిట్లరు దృష్టి ఎటుమారునో దురవగాహముగనున్నది.

ఇటలీనియంత ముసోలినీకూడ మిత్రమండలిపై కత్తి దూసినాడు. ఫ్రాంసు ముగిసినతర్వాత అతని దృష్టి ఆఫ్రికను రాష్ట్రములవైపు మళ్లినది. దానిపై అమెరికాకూడ యుద్ధరంగమున ప్రవేశింపవలసిన కాలమాసన్నమైనది. అమెరికా అడుగుపెట్టిన జపానుకూడ యీ కార్చిచ్చులో కాలిడకమానదు.

వేరొకవైపున రష్యా బాల్కను రాజ్యముల నొకటొకటిగ ఆక్రమించుకొనుచున్నది. ఇట్టితరి ఈ నియంతల చర్యలు ఎప్పుడేరూపము దాల్చునున్నవో యూహించుట కష్టముగ నున్నది.

ఈ ప్రళయ సంక్షోభములో భారతదేశముయొక్క భావి ఎట్టి పరిణామము పొందవలసియున్నదో తెలియకున్నది. ప్రజా ప్రభుత్వరాజ్యముల పునరుద్ధరణకై పోరాడుచున్నట్లు ప్రకటించుచున్న ఇంగ్లండు, తనకు సామంతమైయున్న ఇండియాకు స్వాతంత్ర్యమును ప్రసాదించుట కిష్టపడుటలేదు. ప్రజాభిప్రాయమును తృణముగ నెంచి ఏడు రాష్ట్రములలో తన పరిపాలనమును నిర్విఘ్నముగ కొనసాగించుచున్నది నేడు.

తమ అధికారమును సుస్థిరముగ స్థాపించుకొనుటకై బ్రిటను భారతదేశమును నిరాయుధగ జేసినది; ఆర్థికబలహీనను చేసినది; దాస్య శృంఖలములలో కట్టివైచినది.

అర్థబలము, ఆయుధబలముకూడ లేని భారతదేశము ఇంగ్లండున కీసందిగ్ధసమయమున ఏవిధమున తోడ్పడగలదు? తనుదాను రక్షించుకొనలేని స్థితియందున్న భారతదేశముయొక్క సహాయము నపేక్షించిన ఇంగ్లండు భారతదేశమునకు స్వాతంత్ర్యమిచ్చి, ఆదేశముయొక్క సంపూర్ణ సహకారముల నొందుటకు ఇంకను ప్రయత్నింపకుండుట శోచనీయము.

భారతదేశమే స్వాతంత్ర్యమైననాడు బ్రిటనుకు అపారమైన సహాయము జేయగలదు, రక్తపిపాస నరికట్టగలదు. ప్రళయభీకరమైన యీ వికృతాట్టహాసమునాపి సుస్థిరముగ శాంతి స్థాపి... ముల బ్రిటనుకు తోడ్పడగలదు.

బ్రిటన్ భారతదేశములు రెండును పరస్పర సహకారముతో నిలచిననాడు వీరి బలమకే...

ఏటిధర్మమో ఇది ?

పిల్లలుగల తల్లి, 'వెట్టియట్టిల్ కుంజికుట్టియమ్మ' అనునామె, తన పిల్లలతోపాటు వెలి... ఇటీవల కొచ్చిన్ సంస్థానములో. ఆమె తన సంతానముతో జాతిభ్రష్ట కావింపబడుటయే కాక, ... యోగించు బావులు, చెరువులు మొదలగునవి ఉపయోగించుటకుకూడ నిషేధింపబడి, అస్పృశ్యుల... హీనముగ నిరసింపబడినది.

కొచ్చిన్ సంస్థానములో 'ఇరింజలకుడ' అను గ్రామములో, 'కుడల్ మాణిక్యం' దేవస్థాన... డైన తాచ్చుడయ కైమాల్ కును ఈమెకును సంబంధమున్నందున, దేవాలయ పూజారి గుర్తించవలసి... చర్యదీక్షను కాపాడుటకు ఆమెను వెలివేసిరి. పూజారికి శాస్త్రరీత్యా ప్రాయశ్చిత్తము కావించి, ... ముగ ప్రవర్తించు హామీమీద అతనిని ఆ దేవాలయమునకు తిరిగి పురోహితునిగ నియమించి... మహారాజు తరఫున దివానుగారైన సర్ షణ్ముగంచెట్టియార్ గారి ఈ ఫర్మానా, తగుమైన పోలీసు ... అమలుజరుపబడినది.

పవిత్ర దేవస్థానములందు ఇట్టి అవినీతిపరులగు పురోహితులుండుటవలన జాతి, సంఘ... బోవు ఇహపరమోక్షముల మాట ఎట్లున్నను, అట్టివాని నరికట్టుటలో ఒక స్త్రీయే సంఘబలిమికి ... శోచనీయము.

తనకొరకు సంతానమును కని, తనకు స్వర్గసౌఖ్యముల ప్రసాదించుచున్నట్టి స్త్రీని అన్యా... వంతలపాలుజేసి, ఆమె కష్టములపై ఫలితమనుభవింపజూచిన ఇట్టి పురోహితునివంటివారిని ... సంస్థానమునందుగాని, దేశమునందుగాని ధర్మాధర్మములు లేవన్నమాట.

సంఘ నియమముల నతిక్రమించి, నీతిదూరములగు పనులు చేసినప్పుడు, పురుషునికి ... స్త్రీకి ఒక శిక్ష విధించిన న్యాయశాస్త్రములో న్యాయములేదు. ప్రాయశ్చిత్తము పొందినంతమాత్రా... డైన పురుషుని సహించిన సంస్థానము, సంఘము స్త్రీకిమాత్రము దారిచూపరాదా? సమానముగ ... రించిన అతడు తిరిగి దైవపూజచేయు నర్హుడా? ఇది సంఘద్రోహమే గాక దైవద్రోహము గా... ధర్మమో యిది? స్త్రీ అసహాయ, ఆర్థికముగా బలహీన, విశేషించి సంఘ క్రౌర్యపు బంధముల... యున్నది. అట్టి తరి సరియగు న్యాయము నపేక్షించుటలో వివేకములేదు.

తచ్చుడయ కైమాల్ ఆమెను విడిచిపుచ్చకుండ ఆమెతోనున్నయడల విద్యాధికులు హ... కాని అతడు పురుషలోభత్వమునకు లోబడిపోయి; న్యాయాజ్ఞాన విచక్షణలేక, ఆమెను పాపకూ... త్రోసి తాను సుఖపడదలచినాడు.

ఇటువంటి అక్రమమును చేతులార జరిపించిన కొచ్చిన్ మహారాజుగాని, దివాన్ గారు... నీయులు. గాజాలరు. ఇట్టి చర్యలను సభ్యతా ప్రపంచమామోదింపజాలదు. ఇట్టి అన్యాయము... ఆమెయొక్క నిట్టూర్పునందలి వేడి సంఘకల్మషములను దహించి వేయకుండునా?

Edited by Dr. K. N. Kesari, Printed and Published by Dr. S. Seshagiri Rao
at the Lodhra Press, 15, Westcott Road, Royapettah, Madras.

RGD. No. M-2357

1st AUGUST 1940

గృహలక్ష్మి



GRIHALAKSHMI

PRICE AS. 4.

VOL. 13

No. 6

జ్వరము

జ్వరము - మానవుల శక్తిని, జీవనమును పీల్చివేయును కనుక జ్వరము మిమ్ము ఆవహించినదనగనే దానిని పారద్రోలవలయును. అట్లుచేయుచో మిమ్మాపిశాచి జీర్ణించి పిప్పిచేయదు.

అర్క

జ్వరము వచ్చినదనగనే అర్కను ప్రయోగించుము. ఆహార, విహార ఋతుభేద దోషంబులవలన అన్నాశయమునందు క్రిమికీటములు చేరి పలువిధములైన జ్వరములు సంభవించుచున్నవి. వాతజ్వరము, పిత్తజ్వరము, కఫజ్వరము, సన్నిపాతజ్వరము మరి యితర విష జ్వరములు, కడుపులో ప్లీహమును జ్వరగడ్డను, అర్క కుదుర్చును. ఈ ఔషధమును పసిబిడ్డలకు గూడ యివ్వవచ్చును.

6 ఔ. రు. 2-8-0   3 ఔ. రు. 1-8-0.   1 ఔ. అ. 8.

కేసరికుటీరము - రాయపేట - మదరాసు

విక్రమనామ సంవత్సర _ ఆషాడ - శ్రావణమాసములు

1940-వ సం॥ ఆగస్టు నెల

1	గు	ద్వా 4-18 ఆరు 48-55 ది 10-50 ప్రదోషం కావేరిప్రవాహం
2	శు	త్ర 0-37 చశి 55-27 పున 45-57 ది 17-26 శివరాత్రి
3	శ	● 49-5 పుష్య 41-44 ది 4-33 అమావాస్య
4	ఆ	ప్ర 41-57 ఆశ్లే 36-40 ది 11-2 శ్రావణ శుద్ధం
5	సో	ద్వి 34-21 మఖ 31-6 ది 3-53 రా 17-54
6	మం	తృ 26-39 పుబ్బ 25-28 రా 10-50
7	బు	చ 19-20 ఉత్త 20-6 రా 8-8 తిధిద్వయం గరుడ-నాగ-పంచమి
8	గు	పం 12-28 హస్త 15-18 రా 2-40 షష్టితిధి
9	శు	ష 6-25 చిత్త 11-14 ది 24-30 షష్టివ్రతం
10	శ	స 1-12 అ 56-55 స్వా 8-5 ది 21-34
11	ఆ	న 52-41 విశా 5 53 ది 15-41
12	సో	ద 51-28 అనూ 4-39 ది 19-37
13	మం	ఏ 50-19 జ్యే 4-31 ది 24-48 ఏకాదశితిధి సర్వైకాదశి
14	బు	ద్వా 50-11 మూల 5-20 ది 1-17 రా 30-5 ద్వాదశితిధి
15	గు	త్ర 51-10 పూషా 7-13 ది 28-13 సింహేరవిః 51-34 ప్రదోషం త్రయోదశితిధి
16	శు	చశి 53-15 ఉషా 10-12 ది 20-52 వరలక్ష్మీవ్రతం శూన్యతిధి
17	శ	○ 56-27 శ్ర 14-14 ది 25-5 పూర్ణిమాతిధి
18	ఆ	ప్ర 60-0 ధని 19-18 రా 8-6 శ్రావణ బహుళం ప్రధమతిధి
19	సో	ప్ర 0-44 శత 25-29 రా 12-20
20	మం	ద్వి 6-2 పూభా 32-28
21	బు	తృ 12-3 ఉభా 40-9 శే 3-32 చతుర్ధితిధి
22	గు	చ 18-33 రే 48-2 ది 14-6 అతిధి
23	శు	పం 25-2 అశ్వి 55-39 రా 13-27 కన్యాయనం 16-7 పంచమితిధి
24	శ	ష 30-57 భర 60-0 ది 22-22
25	ఆ	స 35-41 భర 2-27 రా 4-21 కృత్తికా గోకులాష్టమి
26	సో	అ 38-49 కృ 7-57 రా 19-39 మునిత్రయ శ్రీజయంతి -
27	మం	న 40-3 రో 11-44 ది 26-10
28	బు	ద 39-7 మృ 13-34 రా 3-43
29	గు	ఏ 36-20 ఆరు 13-18 రా 11-27 సర్వైకాదశి
30	శు	ద్వా 31-39 పున 11-4 ది 29-46 ప్రదోషం
31	శ	త్ర 25-19 పుష్య 7.10 రా 5-44 శివరాత్రి త్రయోదశితిధి

విషయసూచిక

1. భక్త మీరాబాయి
2. కార్యశూర కమలాదేవి ... 311
3. కమలాదేవి ఎప్పటికీ 'మృతజీవి'యే—శ్రీమతి దుర్గాబాయమ్మ ... 312
4. వీరనారీస్మృతి—శ్రీ శ్రీపాద లక్ష్మీనారాయణమూర్తి ... 315
5. ప్రజాసేవలో పరమార్థము పొందిన జీవయాత్ర—శ్రీమతి పొణకా కనకమ్మ ... 316 317
6. అచ్చెరువు గొలిపే శౌర్యసాహసాలు—శ్రీమతి ద్రోణంరాజు లక్ష్మీబాయమ్మ 318
7. ఎప్పటికో జ్ఞానోదయం!—శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మ ... 320
8. క్షమార్పణ—శ్రీ కొండపల్లి సుభద్రాంబ ... 322
9. పూర్వకవయిత్రి గంగాదేవి—శ్రీ కొత్తపల్లి వెంకటరత్నం ... 323
10. ఆంధ్రసోదరి! శ్రీ ఆగూరు సింహాచలపట్నాయకులు ... 326
11. ఆకలిమంటలు—శ్రీమతి గోపరాజు సీతాదేవి ... 327
12 శారదాచట్టము-యువకుల బాధ్యత—శ్రీమతి ఆచంట సత్యవతమ్మ ... 328
13. పద్మినీ!—శ్రీమతి జయంతి కామేశ్వరీదేవి ... 329
14. వింతవింతల ప్రపంచం ... 331
15. అద్దం—'గోపాలకృష్ణ' ... 332
16. అభ్యుదయము—శ్రీమతి జయంతి లక్ష్మీమంగతాయ్ ... 334
17. కళాకలాపము-కళలు-వాటిఉత్పత్తి-వికాసము—శ్రీమతి కె. సుగుణమణి 335
18. పిచ్చుకలగూడు—శ్రీమతి కొరరప్రోలు వెంకటరంగమ్మ ... 338
19. పరివర్తనము—శ్రీ భాస్కర్ల కృష్ణారావు ... 340
20. హైందవాచారాలలో విజ్ఞానం—'వసంత' ... 343
21. తలవనితలంపు—శ్రీమతి జి. కళ్యాణి ... 345
22. చిత్రవస్త్రకారుడు—విద్వాన్ శ్రీ వెం. శే. శర్మ ... 347
23. భావతరంగిణి ... 348
24. శ్రీ తిరుమల శ్రీనివాస త్రిలింగ మహావిద్యాపీఠము, బెజవాడ ... 350
విద్వాన్ శ్రీమతి కాంచనపల్లి కనకాంబ ... 351
25. ఈ అవిద్య అంతమొందదా?—శ్రీ దు. కృష్ణయ్య ... 352
26. శ్రీ వరలక్ష్మీవ్రత కథ—శ్రీమతి పక్కి వెంకాయమ్మ ... 356
27. గానకళ—శ్రీ గాలి పెంచలనరసింహారావు ... 359
28. వరలక్ష్మీదేవి—శ్రీమతి ద్రోణంరాజు లక్ష్మీబాయమ్మ ... 360
29. భారతీయనారి—శ్రీ స్వామి వివేకానంద ... 362
30. పుష్పచయము ... 364
31. పాకకళ ... 369
32. యుద్ధరంగము—'అరుంధతి' ... 372
33. సంపాదకీయములు

వర్ణచిత్రము: మీరాబాయి.

భక్త మీరాబాయి

అభినేత్రి శ్రీమతి 'చలం'



జయజయ గృహలక్ష్మి సఖి! జయజయ లలితాంధ్ర మధుర సారస్వతమా!
జయజయ లలనారత్నమ! జయజయ విద్యాప్రబోధ! జయకల్యాణీ!

దివసనభూక్, నీందనహిరైనా, ముఖసేకథత్ న ఆలై బైనా।
కహా కహూఁ కఛు కహత న ఆలై, మిలకర్ తపత బఝాయ్ ॥

పవలు ఆకలి లేదు,
రేయి నిదురే లేదు,
పెదవిదాటదు మాట,
ఏమిచెప్పుదు? ప్రభూ!
ఎదుట దయతో నిల్వవా?
నా స్వామి,
హృదయతాపము బాపవా?

(నవ్యకళా మీరాబాయ్)

★ కార్యశూర కమలాదేవి

పరిణతమై, పరిపూర్ణమైన జీవితమును గడపిన ఆదర్శయువతి

● జీవిత విశేషాలు ●

విద్వత్కుటుంబమైన ప్రతాపగిరివారి వంశంలో నందలూరు గ్రామమున జన్మించినదీ సుప్రసిద్ధ నారీమణి. తండ్రిగారు మంచి విజ్ఞానశేముషీదురంధరులైన న్యాయవేత్తలవటంవల్లను, సాంప్రదాయ ప్రసిద్ధమైన గొప్ప కుటుంబీకులవటంవల్లను చిన్ననాటనుండి యీమె ఉన్నతభావపూరితమైన వాతావరణంలో పెరిగింది.

ఈమెకు నలుగురు సోదరులు. తల్లితండ్రులకు యీమె ఒక్కతే కూతురు. సోదరులు నలుగురు ఉన్నతోద్యోగాలలో వున్నారు. వారిలో శ్రీ ప్రతాపగిరి రామమూర్తిగారు బొంబాయిలో హిస్టరీ ప్రొఫెసర్‌గా పనిచేస్తూ ఎంతో విఖ్యాతిపొందివున్నారు.

హైందవాచారానుగుణ్యంగా తండ్రిగారు యీమెను 14 వ ఏటనే శ్రీ వేదాంతం కృష్ణయ్యాగారికిచ్చి వివాహం చేశారు. శ్రీ కృష్ణయ్యగారు బ్రహ్మసమాజావలంబకులు; ఆయనతో ఈమెకూడా బ్రహ్మసమాజ మతమును అవలంబించింది.

సాంఘిక జీవితము

శ్రీ కృష్ణయ్యగారు కలకత్తాలో వైద్యపరీక్షకు చదువుచున్నప్పుడు యీమెకూడ భర్తతో కలకత్తా నగరంలో 5, 6 సంవత్సరాలు నివసించింది. శ్రీ కృష్ణయ్యగారు ఉత్సాహవంతులగు యువకులగుటచే, అన్నివిధముల కమలాదేవిగారికి ప్రోత్సాహాన్నిచ్చారు. తత్ఫలితంగా ఈమె మత, సాంఘిక, రాజకీయాలలో ఉత్సాహంగా పాల్గొంటూ, తగువిధముగా సేవచేసింది. బెంగాలీ భాషలో మంచి పరిజ్ఞానం సంపాదించింది. వంగ సోదరీమణులతో చేతులుకలిపి అనేకమైన ఉద్యమాల్లో పాల్గొంది.

తరువాత శ్రీ కృష్ణయ్యగారు కాకినాడలో వైద్యవృత్తి ప్రారంభించినప్పటినుండి, వారి తోడ్పాటులో కాకినాడయందు మహిళోద్యమాలలో మార్గదర్శకత్వం వహించి పనిచేసింది. శ్రీ కృష్ణయ్యగారు అమోఘమైన 'మెడికల్ ప్రాక్టీసు' తో తూర్పు గోదావరిజిల్లాలో అఖండఖ్యాతి సంపాదించారు. వారి వలనే ఉత్సాహవంతురాలవటంచేతను, వారి ప్రోత్సాహం వుండటంచేతను వ్యక్తిపరమైన పేరుప్రతిష్టలతో తన కార్యరంగాన్ని తాను నిర్మించుకుని, కాకినాడ మహిళోద్యమాలకు ఒక నూతన రూపు కల్పించింది.

ప్రసవసంబంధమైన కేసులకు భర్తగారితోకూడా వెళ్లి సహాయపడుతూ వుండేది. ఆ కేసులలో అనాథలగు బిడ్డలను ఇంటికి తీసుకువచ్చి తల్లికిమారుగా పెంచి, విద్యాబుద్ధులు చెప్పించేది. తన సంతానముతో సమానముగా అనాథలగు బిడ్డలకుకూడ మాతృమూర్తి కావడంవల్ల వీరి గృహము అనాథలకు స్వగృహమైంది. అందువల్ల వీరి ఇంట్లో ఎప్పుడూ కొంతమంది అనాథపిల్లలు పెరుగుతూనే వున్నారు.

రాజకీయ జీవితము

ఈమె రాజకీయజీవితము 1921 తో ప్రారంభం. అంతకుముందునుంచి పాల్గొంటూవున్నా, 1923 సంవత్సరంలో జరిగిన కాకినాడ కాంగ్రెసుతో ఈమె వ్యక్తిత్వం దేశవిఖ్యాతమైంది. కాకినాడ కాంగ్రెసుకు సూత్రధారులైన శ్రీ సాంబమూర్తిగారి త్యాగమహిమ ఈమె నాకర్షించింది. వారి ప్రోత్సాహం వల్ల కాంగ్రెసు కార్యకలాపంలో ద్విగుణీకృతోత్సాహంతో పనిచేసింది. కాకినాడ కాంగ్రెసుకు స్వచ్ఛంద సేవికాదళానికి అధిపతురాలై యీమె చూపిన కార్యనిర్వహణశక్తి ఔత్తరాహులను ఆశ్చర్యచకితులను చేసింది. తరువాత కాంగ్రెసు మహిళాసంఘానికి కార్యదర్శినిగా ఖద్దరుప్రచారం అమితంగా చేసింది. తిలక స్వరాజ్యనిధికి నిధులను ప్రోగుచేసింది.

ఉప్పు సత్యాగ్రహము - 6 మాసములు ఖైదు

1930 సంవత్సరంలో గంజాంజిల్లాలో అమితమైన ప్రచారంచేసి, ప్రజలలో చైతన్యం కలగజేసి, 'నౌపడా'లో, మహాత్ముని ఆజ్ఞానుసారం, ఉప్పుసత్యాగ్రహం చేసింది. దానికి 6 మాసములు సామాన్యఖైదు శిక్ష ననుభవించింది.

రెండు మూడు ఏళ్ల వయస్సుకలిగిన చంటిబిడ్డలను వదిలి ఈమె బందిఖానా నలంకరించడానికి వెళ్లుతూవుండిన నాటి హృదయవిదారక దృశ్యం గంజాం పౌరులు మరువలేరు.

1931 లో కాంగ్రెసు కార్యక్రమం కేవలం అసిధారావ్రతచర్యగా పరిణమించింది. అఖిలభారత జాతీయమహాసభను జరపడానికి వీలులేదని ప్రభుత్వం ఆంక్ష పెట్టింది. అక్కడ ఢిల్లీలో శ్రీమతి సరోజినీదేవి అధ్యక్ష్యాన్ని జాతీయమహాసభ సమకూడింది. ఇక్కడ గుంటూరులో శ్రీమతి కమలాదేవి అధ్యక్ష్యాన్ని జరిగింది. భారతదేశంలో మరి ఎక్కడ ఆ సంవత్సరం జరగనటువంటి మహాసభ ఆంధ్రదేశంలో యీ 'యోధురాలి' అధ్యక్ష్యాన్ని జరిగింది.

అప్పటి ఒక బహిరంగోపన్యాసానికి తిరిగి 6 మాసములు శిక్ష ననుభవించింది. అప్పుడే యీమెకు పక్షవాతం జబ్బు మొదటిసారిగా వచ్చి బాధపెట్టింది. కాని వస్తుతః కండపుష్టి కలిగిన శరీరదారుఢ్యం గనుక తేరుకుంది.

కాంగ్రెసు ప్రచారం

1935 లో దత్తమండలాలనుంచి కేంద్రశాసనసభకు అభ్యర్థిగా శ్రీ అనంతశయనం అయ్యంగారు నిలచినప్పుడు, ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు సంఘమువారి ఆదేశానుసారంగా దత్తమండలాలలో అపారమైన ప్రచారం కావించి, కాంగ్రెసు విజయానికి తోడ్పడింది.

మద్రాసులో శ్రీమతి రుక్మిణి లక్ష్మీపతిగారి అభ్యర్థిత్వాన్ని బలపరచి ప్రచారంచేస్తూవున్న సందర్భములో తిలకుఘాటులో కొందరు దుష్టులు రాజకీయంగా క్రోధం పెంచుకుని యీమెను కొట్టినప్పుడు అతి శాంతంతో భరించింది.

1937 లో జనరల్ ఎలక్షన్సులో యీ త్యాగజీవి చేసిన కాంగ్రెసు ప్రచారం సాటిలేనిది. బొబ్బిలి ఫిర్కాకు యీమెను అభ్యర్థిగా నిలువబెట్టి, తర్వాత కారణాంతరములచే శ్రీ గిరిగారిని నిలువబెట్టినప్పుడు తన అభ్యర్థిత్వాన్ని ఉపసంహరించుకుని, ఆ ఫిర్కాలో శ్రీ బొబ్బిలిరాజాగారికి ఎదురుగా అసమానమైన కాంగ్రెసు ప్రచారాన్ని కావించి, గిరిగారి విజయానికి కారణభూతురాలైంది. తన స్థానం అన్యాక్రాంతమైనప్పుడుకూడ ఎట్టి స్వార్థముగాని, కావేషముగాని లేక, కాంగ్రెసు ఆజ్ఞను శిరసావహించి ద్విగుణీకృతోత్సాహంతో సేవచేసిన త్యాగశీల—కమలాదేవి.

సాంఘికంగా నిత్యం ఏదోవిధముగా సంఘానికి సేవచేస్తువుండడము యీమె కలవాటైపోయింది. హరిజనసేవకసంఘానికి భర్తగారైన కృష్ణయ్యగారు కార్యదర్శిగా కాకినాడలో మంచిమార్పు తీసుకువచ్చారు. హరిజనులను తన ఇంటిలో పనిచేయించుటకు నియమించి యితరులకు మార్గదర్శినియైనది ఈమె.

సాంసారికముగా, యీమెయొక్క చక్కని వంటనేర్పు, చమికీ మొదలైన కుట్టుపనులలో నేత్రానందకరమైన ప్రవీణత వీరి గృహములో ప్రతిఫలిస్తూవుంటాయి. మొక్కల్ని పెంచి, వృద్ధిచేయడం యీమెకు మంచి సరదా. పనివాళ్లకు తలమానికమై నీళ్లుమోసి సమస్త కాయగూరలు దొడ్లోపండిస్తూ గృహప్రాంగణాన్ని నందవనంలాగ పుష్పభర శోభితంగాచేసిన ఆదర్శగృహిణి.

గత మూడు 'టరములు'గా కాకినాడ మ్యునిసిపల్ కౌన్సిలర్‌గా పనిచేసి, స్త్రీలుకూడా పరిపాలనను దక్షతతో నిర్వహించగలరని రుజువుచేసిన దీమె.

అస్తమయం

వీరచిహ్నలు వెల్లివిరిసే మూర్తిత్వం, వేదికమీదనుంచుని ప్రజానీకంలో అగ్నిని రేకెత్తించగల వాగ్ధాటి, యువక, యువతీ ప్రపంచానికి మార్గదర్శినియై కదనుతొక్కించగల ధీరత్వం, కాంగ్రెసుకు నమ్మినబంటై, నిర్మాణకార్య నిర్వహణలో ఆరితేరిన చాతుర్యం, ఒడుదుడుకులు లేక సంసారాన్ని సమరసముగా సాగించుకుంటూ కన్నబిడ్డలను ఆదర్శ భారత యువతీ యువకులుగా తయారుచేయగల చాకచక్యం, దీనజనసేవ మొదలైన సద్గుణ పుంజాలకాటపట్టగు వేదాంతం కమలాదేవిని పక్షవాతం జబ్బు కనికరంలేక కడుపున పెట్టుకుంది—జూలై 14 తేదీ ఆదివారం 5 గంటలకు. చనిపోవుసరికి ఈమెకు 43 సంవత్సరాల వయస్సు; నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు.

తూర్పు గోదావరిజిల్లాకు అఖండమైన ఖ్యాతినిగూర్చిన దుర్గాబాయమ్మ, కామేశ్వరమ్మ, కమలాదేవి—యీ మూర్తిత్రయంలో ధృవనక్షత్రం రాలిపోయింది—మరిలేదు.

కమలాదేవి ఎప్పటికీ 'మృతజీవి'యే...

శ్రీమతి దుర్గాబాయమ్మగారి సానుతాపాశ్రువులు

సుప్రసిద్ధ నారీమణి, దేశసేవిక వేదాంతం కమలాదేవి స్వర్గాన్ని అలంకరించింది. ఇందువల్ల ఆంధ్ర నారీలోకానికి, కాంగ్రెసుసంస్థకు తీరనిలోటు వాటిల్లింది.

అయితే ఆమె మరణించినదని నేను భావింపను. ఎందుచేతనంటే, ఆమెయొక్క అగణితమైన దేశసేవాపరంపరలవల్ల ఆమె 'మృతజీవి'గా నిల్చివుంది. ఆమె ధైర్యస్థైర్యాలు, నిర్మాణకార్యదీక్ష మొదలైన సద్గుణపుంజాలతో నూతన కాంతి జ్యోతులను వెదజల్లింది. ఆ జ్యోతులు ఆంధ్ర యువతీమణుల రక్తనాళాల్లో సర్వదా ప్రకాశిస్తూనే వుంటాయి.

ఆమె తన స్వార్థరహితమైన దేశసేవతో, తనకేకాక, ఆంధ్రమహిళా ప్రపంచానికికూడా ఒక నూతన శకారంభమైన చరిత్రను సృష్టించింది.

ఆమె అన్ని విధముల అనుభవములతోను పరిపూర్ణమై, పుట్టిననాటినుండి ఒకేవిధమైన విజయవంతమగు జీవితమును గడపిన ధన్యురాలు. ఆమె జీవితము, జీవితక్రమము, మొదలైనవి సోదరాంధ్రమహిళామణులు అనుసరించుటకు ఆదర్శములు. కళాప్రాభవము, రాజకీయచైతన్యము, సాంఘిక నిర్మాణము, మొదలైన సద్గుణాలు ఒకేచోట కూడివున్న యిటువంటి నారీమణిని సంఘజీవితములో మనం పొందగలిగివుండడం చాలా అరుదు. ఇటువంటి అపురూపమైన పుష్పాన్ని కలిగివున్న ఆంధ్రభూమి ప్రత్యేకంగా చాలా గర్వించవలసివుంది.

ఆంధ్రమాత వీరమాత. ఆమె గర్భాన్ని ఆణిముత్యాలవంటి వీర సంతానం ఉద్భవిస్తూనేవుంది.

ఏదేశమైన, ఆ దేశంయొక్క పుత్ర, పుత్రికామణుల మహనీయవర్తనాలవల్లను, త్యాగచర్యవల్లను, ఔన్నత్యంలోకి వస్తుంది. ఆ ఔన్నత్యం జాతిసల్పే 'వీరపూజ'ల మీదనే ఆధారపడి నిల్చివుంటుంది. ఆ వీరులయొక్క చరిత్రలను మననంచేసుకుంటూ వారి అడుగుజాడల్లో జాతినడిచినప్పుడే ఆ దేశం గొప్పది కాగలుగుతుంది. ఆ ఔన్నత్య 'జ్యోతి' ఆరిపోకుండా చిరంజీవత్వం పొందాలంటే, 'వీరపూజ' నిలిచి వుండాలి. ఇది దేశంలో ఎప్పుడు అదృశ్యం అవడం ప్రారంభించిందో అప్పుడే ఔన్నత్యంకూడా క్షీణిస్తుంది.

ఈ విషయంలోనే, ఆంధ్రదేశము వెనకబడిపోతూవున్నదని ఎంతో విచారంతో చెప్పుతున్నాను. వీరనారి కమలాదేవికి జాతి ఎంతో ఋణపడివుంది; దానిని తిరిగి జాతి తీర్చుకోలేకపోయింది. పోనీ, ఏవిధంగానైనా ఆమెను పూజించడానికికూడా నోచుకోలేకపోయింది. ఆమెను గౌరవించడం, మనం మనలను గౌరవించుకోవడమే. ఆ గౌరవం ఆ ప్రత్యేకవ్యక్తికిపోదు, అవి జాతికి ప్రత్యేకతనిస్తుంది, ప్రజ్వలవంతాన్ని కూరుస్తుంది.

ఆమెను అఖండమైన ప్రజ్ఞావంతురాలుగాను, ఒక వీర 'సిపాయి'గాను మనం తెలుసుకున్నాము. ఆమెకు ఏదైన ఒక బాధ్యతాయుతమైన పదవినికూడ ఇచ్చివున్నట్టయితే ఆమెను వాడిమీరిన ఒక రాచకార్యధురీణగా కూడా తెలుసుకొనేవాళ్లము. ఆమె ఖ్యాతి, దేశదేశాలా ప్రాకేది. దానితో ఆంధ్రజాతికి

ప్రత్యేక ప్రాభవం కలిగేది. కాని దానికి మనం పెట్టిపుట్టలేదు. కాలవైపరీత్యమో, లేక మన కానికర్మమో కాని, ఆంధ్రజాతిలో యీ వీరపూజ నశించిపోతూవుండడం గూర్చి మనలను మనం ఏమనుకోవాలో తెలియడంలేదు.

ఏది ఎట్లున్నప్పటికీ, స్వర్గీయ కమలాదేవివంటి ఆంధ్ర నారీమతల్లుల జీవిత విశేషాలు మనం ఆదర్శవంతంగా పెట్టుకున్న నాడు మనజాతి ఆదర్శవంతమై అచంచలమైన గొప్ప భవిష్యత్తును నిర్మించుకో గలదు. ఈ ఆదర్శ సోదరీమణి ఆత్మకు శాంతికలుగుగాక !

వీరనారీస్మృతి

కమలాదేవి

బరువైపోయిన స్థాలనంబడుట పూర్వప్రాభవౌన్నత్యముల్
తొరగన్ స్రుక్కెడి భారతీయతతికిన్ తొల్లింటిభాగ్యంబు చే
కురగా కాంగ్రెసుజేరి పాటుపడె కన్గొండంచు లోకుల్ సదా
స్థిరభక్తిన్ స్మరియించుచుంద్రు కమలాదేవీ సతీరత్నముల్.

చూపరుల్ మ్రాన్పడ నాపడ ఉప్పుసత్యాగ్రహంబున చూపినట్టి తెగువ,
కన్నబిడ్డలమీది గారాము నెంచక జైలులో కృశియించు సాహసంబు,
ఊరూరుతిరిగి అత్యుద్రేకపూరితోపన్యాసము లొసంగు ప్రౌఢధాటి,
జస్టిసుపక్షంపు స్తంభంబును జయింప కష్టాలకోర్చిన కార్యదీక్ష,
హరిజనాభ్యుదయార్థమై అనవరతము చాలకృషిసల్పి నుతిగన్న సర్వసమత,
ఆంధ్రవనితలకేకాదు, అఖిల హైందవాంగనాళికి ఆదర్శమయ్యెకాదె !

తల్లివలె దేశసేవచే ధన్యతగన నీమెపిల్లల నీశ్వరుండేలుగాత
జన్మభూమి స్వతంత్రతా సంపదగని యీమె యాత్మకు స్థిరశాంతి యొసగుగాత !

—శ్రీ శ్రీపాద లక్ష్మీనారాయణమూర్తి బి.ఏ., బి.ఇడి.,

విజ్ఞప్తి

అఖలభారత కాంగ్రెసు సంఘము - స్త్రీ శాఖవారు తలపెట్టిన దేశ సేవికల చరిత్ర ప్రచురణకు ఇతోధికముగ తోడ్పడ నెంచి, ఆంధ్రదేశమున 1920 సం॥ నుండి స్వాతంత్ర్య సమరమున పాల్గొని సేవచేసిన మహిళామణుల చరిత్ర క్లుప్తముగ వ్రాసి ఛాయాచిత్రములతో సహా పంపిన 'గృహలక్ష్మిలో' ప్రకటించెదము. కాన పాఠకులను తోడ్పడగోరుచున్నాము.

సంపాదకుడు.

'ప్రజాసేవలో పరమార్థము పొందిన జీవయాత్ర'

శ్రీమతి పోణకా కనకమ్మగారి సానుభూతి వచనాలు

సోదరి శ్రీ కమలాదేవికి స్మృతివాక్యాలు వ్రాయవలసివస్తుందని ఎన్నడు అనుకోలేదు. స్వతంత్ర సమరంలో జయభేరులు మ్రోయించి మాతృదేవతకు పుష్పాంజలులు పట్టనెంచిన చేతులతో, దేశభక్తుల అస్త్రమయ బాష్పాంజలులు అర్పింపచేసినది. మబ్బులుగ్రమ్మిన భారత రాజకీయ తారాపథంలో అక్కడక్కడ మెరసే వెలుగుచుక్కలలోనుండి ఒక జ్యోతి పడిపోయినది. స్వర్గీయసోదరి ఆత్మ అమరమై దీపించుచున్నను భౌతికదృష్టిలో ఇది తీర్చుకోలేని లోపము.

ఆ ఉద్యమ విజృంభణము, శాసనోల్లంఘనము, సత్యాగ్రహము, లాఠీచార్జీలు, కారాగృహాలు, శాంతిదేవత విక్రమించి వీరవిహారంచేసిన ఆ రోజులన్ని కళ్లముందు ఒక్కమారు పరుగులెత్తినవి. ఆ ఉత్సాహశక్తి, ఆ దేశభక్తి, ఆ సేవాసక్తి విస్మృతంకానివి. పవిత్రమైన ఆ సమయంలో సహవాసము, ఆ జయిలు జీవితము ఎంతో ఆనందముగ నుండెడివి. ఆమె దృఢకాయయైనను, అంత ఆరోగ్యజీవికాదు. జైలులో తరుచు అనారోగ్యముగనే యుండెడిది. ఇవి ఏమియు ఆమెను అడ్డుపెట్టలేదు. ఎట్టిస్థితిలోనున్నను కాంగ్రెసు శంఖారావము వినపడినదంటే, మహాత్ముని ఆజ్ఞ వచ్చినదంటే సర్వసంసిద్ధము. ఏది ఏమైనను లెక్కలేదు. ఏ కష్టనష్టములకును వెరపులేదు. సంకల్పించిన పని జరిగితీరవలసినదే. ఆమె యోధురాలు, ధీరచిత్త. ఆ శౌర్యసాహసములు, సేవాదృష్టి మొక్కవోనివి. ఆ త్యాగము, పట్టుదల శ్లాఘనీయములు.

అది ముచ్చటయైన పెద్ద సంసారము. వచ్చేపోయేవారితో ఎప్పుడు కలకలలాడుతూ ఉండెడిది. విద్యాసంపదలుగల సంస్కారకుటుంబము. స్వేచ్ఛా స్వాతంత్ర్యములకు నెలవైనది. అనుకూలపతి. అనురాగసంతతి. ఆమె బిడ్డలతల్లియైన నిండు ఇల్లాలు అయినను, ఉత్సాహముతో యువతులను మించి సంచరించెడిది. ఆమె దేశసేవ రాజకీయముగానే కాదు, సాంఘికముగా కూడ పేరుపొందినది. ఆమె హరిజనసేవలో మెప్పుగొన్నది. అనాథశిశువులను తల్లివలె ఆదరించి పెంచినది. వారిలో సొంతబిడ్డలెవరో పెంపుడుబిడ్డలెవరో తెలిసేదికాదు. వారివల్ల ఏదో ఒకవిధముగా ఎవరో ఒకరు సహాయము పొందుతూనే ఉండేవారు. కన్నీళ్లతో, నిట్టూర్పులతో కీర్తిశేషులకు తిలాంజలులిచ్చి సాంత్వనము పొందుటేగాదు మనపని. ఏ జీవి ఏ ఆశాజ్యోతికి ఆహుతి అయిపోయినదో అది లోకశ్రేయమైనదైతే ప్రదీప్తమొనర్చవలసిన బాధ్యత మనయందున్నది. అది యథోచితముగా నెరవేర్పగలిగితేనే వారికి ఆత్మశాంతి, మనకు మనశ్శాంతి. జాతీయవీరుల స్మృతిచిహ్నాలు ముద్రించవలసిన విజయపతాకం అప్పుడు ప్రతిష్ఠితమౌతుంది.

ఆ సోదరి జీవయాత్ర చరితార్థమైనది. సర్వదా ప్రజాసేవలో పరమార్థము పొందినది. పతికి, బిడ్డలకు, బంధుమిత్రులకు, తెలుగుభూమికి ఆమె కొరతయైపోయినను, ఆ సోదరి నిండుహృదయముతో వెలితిలేకుండ నిర్యాణము పొందినది. దుఃఖనిమగ్నమైయున్న ఆ కుటుంబమునకు మనశ్శాంతి, ఆ స్వర్గీయాత్మకు పరమశాంతి ప్రసాదించుటకు ఈశ్వరుని ప్రార్థించుచున్నాను.

'అచ్చెరువు గొలిపే శౌర్యసాహసాలు'

శ్రీమతి ద్రోణంరాజు లక్ష్మీబాయమ్మగారి పఠిత ప్రస్తావాక్యాలు

ఆంధ్ర సోదరీమణుల ఆశాజ్యోతులలో ఒక దీపిక మరుగుపడినది. శ్రీ కమలాదేవి అకాలనిర్యాణము అశనిపాతమై హృదయదారుణమైనది. నిర్విణ్ణులమైపోయినాము. నిజమేనా అనిపించినది. ఆ సేవాపరత, కార్యదీక్ష, ఉత్సాహము మరపురావు. ఆ జైలు జీవితము కళ్లకు కట్టినట్లుంటుంది. పెద్ద సంసారము, 6 గురు బిడ్డలు, భర్తగారు, వచ్చేపోయే బంధుమిత్రులు, తెరపిలేని కార్యకలాపము. ఏమయిననుసరే, ఎన్ని ఉన్నను సరే మహాత్ముని పిలుపు వచ్చినదంటే ఉరికితీరవలసినదే! కాంగ్రెసు ఆజ్ఞాపించినదంటే చేతులు కట్టుకుని నిలబడవలసినదే. ఆ శౌర్యసాహసాలు అచ్చెరువుగొలిపేవి. ఎంతలో ఎంతమాట! ఆ సోదరికి కన్నీటితర్పణము విడువవలసివచ్చినది. ఎంత విషాదకరము!

ఘోరమైన ఈ చావు బ్రతుకుల సంధిసమస్యలో మలమల మాడిపోతున్న ప్రపంచపు ఎడారులలో ఏ అగ్నితుపాను వీస్తుందోనని ఎదుర్కొనవలసిన రోజులలో, ఈ పిడుగులు పడుతున్నవి. గతప్రమాదిఅయినా ఇంత ప్రమాదకరముగా లేదు. ఈ సంవత్సరం ఏ దుర్ముహూర్తాన్ని అడుగుపెట్టినదో గాని అన్ని దెబ్బలే. తాళుకోలేని ఆఘాతాలు.

అమోఘమైన సేవాత్యాగాల్లో, మాతృపాదారవిందములపై ప్రాణాలు పూవుల్లా అర్పింపగల ధీరులు అసంఖ్యాకంగా వెలువడవలసిన ఈ తరుణంలో ఉన్నవారినే వెలితిచేయుచున్న విధినేమనాలి? సంపూర్ణ స్వాతంత్ర్యానికి అతృప్తనయనాలతో ఎదురుచూస్తున్న ఆ ఉద్విగ్నహృదయాల దీర్ఘనిశ్వాసములా యివి? ఈ పాంచభౌతిక శరీరంతో పొందలేని పరమాశయాన్ని ఆత్మశక్తితో సాధించడానికి తనువులు చాలిస్తున్నట్టున్నది. లేకపోతే ఏమిటి ఈ దుర్ఘటనలు? లోకంలో ఏజీవి కొరతపడినా ఆ కుటుంబానికి తీరని లోపమే. కాని సంఘాన్ని, దేశాన్ని కుటుంబంగా చేసికొన్న విశ్వజీవులుంటారు కొందరు. అట్టివారిలో ఒకరు మా సోదరి కమలాదేవి. ఈ భౌతికదృష్టికి ఇక ఆ సోదరి కనుపడదు. ఆ హృదయం ఏ సానుభూతిలో ప్రశాంతి పొందుతుంది? కేవల బాహ్యచిహ్నలే కావు. ఆ సేవాదీక్ష, కార్యపరతంత్రతలో కలుగుతుంది. ఐహికంగా చేయవలసిన ఆ సేవాభారంకూడా మనమీద పడినది. స్వర్గీయుల చితులమీద సానుభూతి పుష్పలతో, స్మారకసభలతో మన బాధ్యత తీరదు. దేశభక్తుల యథార్థస్మృతి మన హృదయాల్లో నెలకొల్పితే అది నిత్యజీవంగా ఉంటుంది.

ఆత్మపతికి అర్ధాంగి దూరమైపోయినది. బిడ్డలకు అమ్మ కరువైపోయినది. మిత్రులకొక హృదయము జారిపోయినది. తెలుగుభూమిలో, త్యాగశీలులైన మహిళామండలిలో ఒక వెలుగుచుక్క రాలిపోయినది. ఆ సోదరి జీవితం ధన్యమైనది. చదువు సంపన్నతలుగల కుటుంబం. యథాశక్తి దేశారాధనలో శరీరం అర్పించింది. అనుకూల దాంపత్యము. ఆర్యస్త్రీలభిలషించే పుణ్యసాధ్వి మరణము. ఆ సోదరి ఆత్మశాంతికి, ఆ కుటుంబం మనశ్శాంతికి అశ్రుతర్పణంతో పరమేశ్వరుని ప్రార్థిస్తున్నాను.



బ్రిటిషు యుద్ధ విమానం బాంబులు తీసికొని బయలు దేరుతూ వుంది.

యుద్ధం ప్రారంభమైన తర్వాత లండన్ నగరంనుంచి బాలబాలికలను పల్లెలకు పంపించివేశారు. పల్లెలకుపోయి ఊరికే కూర్చొకుండా ఆయువతులు వ్యవసాయంలో కృషి చేస్తున్నారు.



బొంబాయిలో ఇటీవల జరిగిన నేషనల్ ప్లానింగు కమిటీ సమావేశంలో స్త్రీలు కొన్ని ముఖ్య విషయాలు చర్చించారు.

I-WW 108-111—TL W. WOODWARD LTD. LONDON ENGLAND

★ ఎప్పటికో జ్ఞానోదయం…!

● శ్రీ కనుపర్తి వరలక్ష్మమ్మ

"మనకు నూరు ధర్మోపదేశాలు చేసి, తనకు వ్రేళ్ల ఉంగరాలు, తనభార్యకు కంఠహారములు అర్థించే గురువు యేమాత్రపు వేదాంతో విచారించాలె. స్త్రీలు గురువుయొక్క నైతికనిష్ఠను తెలుసుకోకుండా వానిమాటలచే వంచితులుకాకూడదు. మోక్షం ఆడంబరాలలో లేదు; ముమ్మాటికిలేదు."

దాదాపు రాత్రి యెనిమిదిగంటలవఱకు ఎక్కడనో ఉగాదిపండువు వినోద కాలక్షేపాలతో ప్రొద్దుపుచ్చి అప్పుడే యింటికి చేరుకున్నాడు రాఘవరావు. రాజేశ్వరికూడా పిల్లల్ని వెంటబెట్టుకొని అప్పుడే యింటికి వచ్చింది. రాఘవరావు ఆమెనుచూచి నవ్వుతూ,

'సంవత్సరాది పండుగనాడు ఏపనిచేస్తే అదే ఏడాదిపొడుగునా వెంటాడుతుందంటారు. ఇక ప్రతిరోజూ నీవు యింటికివచ్చేవేళ యిదే అవుతుందేమో కొంచెం పెందలాడే యింటికి రాకపోయినావా?' అన్నాడు.

పెనిమిటి మాటలకు రాజేశ్వరి వెన్నెలవిరిసినట్లు కిలకిలానవ్వుతూ 'పైకి సంస్కర్తలవలె మాట్లాడుతూ ఉంటారుగాని, ముసలమ్మలచేదస్తపు మాటలమీద మీకుగూడా వల్లమాలిన నమ్మకమున్నదే' అన్నది.

'అవును. ఇవి ఉగ్గుపాలతో రంగరించి పెట్టినవిగాని సామాన్యమైనవా? మహా నాగరికమైన పాశ్చాత్య ఖండాల్లోనే నల్లపిల్లి శకునాలు పోలేదు, ఇక మనదేశంలోనా? అయితే యెక్కడనుంచి రావడము' అన్నాడు రాఘవరావు.

'మంగళకరమైన సంవత్సరాది పండువుగదా ఒక్కమాటు భగవద్దర్శనం చేసుకుందామని దేవాలయానికి వెళ్లాను. కాని యేంప్రయోజనం?

"ఏమి? భగవద్దర్శనంకాలేదా? ఎడంచేతిలో డబ్బులపళ్లెము, కుడిచేతిలో శఠగోపురము పట్టుకొని అర్చకుడు అప్పలాచార్యులు వచ్చినవారికందఱికీ భగవద్దర్శనము చేయించడానికి సిద్ధంగానే ఉంటాడుగా"

"లోపలిదాకా వెళ్లగలిగితే భగవద్దర్శనం చేయించడానికి ఒకరు కావాలా?"

'అయితే వెళ్లలేదు?'

'గుడి ఆవరణమంతా జనమే, ఎట్లావెళ్లేది?'

'నీవలెనే పండుగ పుణ్యకాలమందు భగవంతుని సేవించవలెనని వారందఱికీ తలంపు కలిగింది కాబోలు.'

'అయితే నయమే.'

'మఱెందుకు మూగారు? ఏదైన ఉత్సవమా?'

'హరికథ చెప్పుచున్నారు.'

'పోనీ అదే కాశేపువిని రాకపోయినావా? అది మాత్రము పుణ్యము తక్కువగా యున్నదా? ఈ కాలంలో భజనలు, పురాణాలు, హరికథలూ అంటే మఱీ అరచేతిలో వైకుంఠము చూపేవేగదా.'

'అదైనా విననిస్తేగదా.'

'ఎవరు విననివ్వలేదంటావు?'

'ఒకరని పేరేమిటి. అందఱూ అందులో భాగస్థులే. మాటలు చెప్పుకునే ఆడవాళ్లూ, మందలించే మగవాళ్లూ, గంతులుపెట్టే పిల్లలు, పాలకేడ్చేపసిబిడ్డలు, నామసంకీర్తనలు చేయించే హరికథకుడు అందఱూ ఆ చప్పుడుకు కారణభూతులే. అయితేనేమి ? ప్రతి ఒక్కరికీ తాము యితరులను "ఊరుకోండమ్మా ఇంటి ముచ్చటలన్నీ యిక్కడనేటమ్మా" అని మందలించడము గూడా ఆ విపరీతశబ్దానికి కారణమౌతుందని తెలియదు. ఇతరులందఱూ అజాగ్రత్తగా అప్రస్తుత సంభాషణలుచేస్తున్నట్టు తాము మాత్రము శ్రద్ధగా మౌనంగా కూర్చుని వినదలచిన వారైనట్టూ భావించుకొని ప్రక్కవారిని మందలిస్తూ ఉంటారు. అదే పది మంది అనడంతో పెద్దధ్వని బయలు దేరుతుంది. అసలు కథ ఆగందరగోళంలో లీనమైపోతుంది.'

'నిజమే ఏదైనా ఒక ఉపన్యాసంగాని, పురాణంగాని హరికథగాని, వినడానికి వెళ్లేవాళ్లు ఒకరిని మందలించడానికైనా మాట్లాడమని యింటివద్దనే శపథంచేసుకొని వెళ్లితే బాగా ఉంటుంది. అయినా మీ ఆడవాళ్లు చేరినచోట సద్దులేకుండా ఉండదులే. మా పురుషులసభైతేనా ? ఎంత నిశ్శబ్దంగా ఉంటుంది. చీమ చిటుక్కుమంటే వినబడేటట్లుంటుంది.'

'అవును లెండి మేమూ నిక్కచ్చిగా ఒక్కొక్కరమే వెళ్లితే మాసభమాత్రం ముచ్చటగా ఉండ కేమి? మీలో ప్రతి ఒక్కరూ పసిబిడ్డలను మాకు వదలి, ఒక్కొక్కయెడ బిడ్డను వెంటబెట్టుకొని ఒకమాటు ఒక సమావేశానికి హాజరై చూడండి, మీ సమావేశ మెంత ముచ్చటగా ఉంటుందో.'

'నీకు మీ ఆడవాళ్లనంటే ఊరికే రోషపడతావుగాని, నిజానికి మీ మాటలకు పిల్లలొక్కరేనా కారణం? నిజం చెప్పు. ఇవాళ పండుగ కావడంచేత ఎంతప్రొద్దువేళ లేచారో, ఏయేపనులు చేశారో, ఎన్నెన్ని పిండివంటలు వండారో, చీరలేమికొన్నారో, రవికలేమి కుట్టించుకున్నారో, నగలేమి పెట్టు కున్నారో, పెనిమిటేమి కోపబడ్డాడో, పిల్లలేమి పేచీలుపెట్టారో, అన్నీ అక్కడ వెళ్లబోసుకోవలసిందే గదా. అందువల్లనే యివ్వాళ మఱీ మాటలసందడి యెక్కువై ఉండాలె. నూరుమంది కూడనీ, నిజానికి మాకీ మాటలుంటాయా?'

'నిజానికి మీరు చేసిందేమీ ఉండదుగా' అన్నది వెంటనే రాజేశ్వరి. రాఘవరావు పక్కున నవ్వాడు.

'ఇంతకు మావాళ్లకు మతిలేదు. ఈ స్త్రీలవల్లనే సందడి, అల్లరి, గొడవ అని మగవారంతా ఒక్క విధంగా ఆక్షేపిస్తూఉంటే, వీళ్లు ఆ సమావేశాలకు పోకుండా ఉండరాదూ? మాయ పుణ్యాపేక్ష వీళ్లను ఊరుకు లెత్తిస్తుందాయెను.'

'పుణ్యాపేక్షణకు, దయాసత్యశౌచాదులకంటె, నిరుపమాన సాధ్వీధర్మంకంటె, అతిథి అభ్యాగతి పూజకంటె, భగవదారాధనకంటె, భర్తృశుశ్రూషకంటె, బిడ్డలసేవకంటె ఈ హరికథలు యెక్కువ పుణ్య మిస్తాయా ? ఆ హరికథకుడు తానేదో పరమభాగవతశిఖామణి అయినట్టూ తాను కాస్తంత భగవన్నామం ఆలపించిన వారిచే చేయిస్తేనే తానూ వారూ స్వర్గానికి సోపానాలు కట్టుతామన్నట్టూ, తనకేమీ యీహ లేనట్టూ మాట్లాడుతూనే ఆడవారి జడలలో సూమలు, సిగలలో పూవులు, చెవులనూగే లోలకులు, పైకిపోయిన రవికలూ వర్ణిస్తూ ఉంటాడు. ఆ పరమభాగవతుడిట్లా పరిహసిస్తూఉంటే మీ ఆడవాళ్లంతా బిడియం లేకుండా తమ్ముగాదన్నట్టూ, ఆ ఆక్షేపణలకుగురి అయిన స్త్రీజాతి వేరే యెక్కడో తమకు సంబంధం లేకుండా ఉన్నట్టూ, తామమాత్రం ఉన్నతోన్నత ఉత్తమశ్రేణికి జెందిన స్త్రీలైనట్టు, విని ఆనందిస్తూ ఉంటారు.'

'నిజమే యీ పురాణాలు పుణ్యకథలు చెప్పే వారికి స్త్రీల నాక్షేపించడం మహాఖ్యాతి. నాకే అధికారముంటే యీ హరిదాసులు యిటువంటి అప్రస్తుతప్రసంగాలు చేయకుండా...'

'అవును, హరికథకులను శిక్షిస్తావు. అంతే మీ ఆడవాళ్లను మాత్రము పోకుండా ఆపలేవు. ఈ దండన ఎట్లా ఉన్నదంటే, మిఠాయి, కొనుక్కోకుండా మా అబ్బాయిని మేము ఆపలేము. ఊళ్లో మిఠాయి అమ్మకం జరగకుండా దుకాణాలను కట్టిపెట్టించమన్నట్లున్నది. అసలు ఈ హరికథలకు పురాణాలకు పోషకులు మీ స్త్రీలే. మీరు బాయికాట్ చేస్తే, నీరుపెట్టడం మానితే చేను యెండినట్టుగా, ఈ కాలక్షేపాలన్నీ వాటంతట అవే సన్నగిలి ఊరుకుంటాయి. కాని మీ స్త్రీలు జరిపే సమావేశాలకన్నా వీటికే అధికంగా మూగుతూ ఉంటారు. ఏ వెట్టి పుల్లయ్య చెప్పినమాటలను శిరసావహిస్తూ ఉంటారు. అన్నట్టు యివ్వాళ మీ సమాజంలో సంవత్సరాది సమావేశం జరిపారుకదా ఏమాత్రం స్త్రీలు వచ్చారు?'

'పాతికమందో...ముప్పైమందో...'

'మఱి హరికథవద్దనో కొన్ని వందలమంది ఉండి ఉంటారుగాదూ.'

'ఉన్నారు.'

'స్త్రీలచే స్థాపింపబడి, స్త్రీల అభ్యుదయము నిమిత్తము స్త్రీలచే నిర్వహింపబడుతూఉన్న స్త్రీ సమావేశాలకు వ్రేళ్లమీద లెక్కింపబడే మాత్రపు స్త్రీలు మాత్రమే రావడమూ, ఆ వెక్కిరికొక్కిరి కథలు చెప్పే పురాణాలకూ, హరికథలకూ స్త్రీలు తండోపతండాలుగా రావడమూ—తప్పు ఎవరిదంటావు?'

'పుణ్యం దప్ప మనుష్యులు మఱి దేనిని ఆశించగూడదనీ, ఆపుణ్యము యిటువంటి పురాణాలు, హరికథలు, భజనలు, వేదాంత విచారణలూ, గురు శుశ్రూషలు వగైరాలవల్లనే వస్తుందనీ నూరిపోసిన ఆప్పేవరిదో వారిదీ. అజ్ఞానులు అమాయకులు అవిద్యాంధకారమగ్నలూ అయిన వారిమాట యెందుకు? అన్ని విషయాలు చక్కగా తెలిసిన మీ పురుషులలో సైతము ఆ పురాణాలకు, పుణ్యకథలకు పంపినంత ధైర్యంగా తమ స్త్రీలను స్త్రీ సమాజాలకు పంపగలవారెందరున్నారో చెప్పండి? స్త్రీ సమాజాలకు తమ స్త్రీలు వెళ్లినట్లైతే వారిలో యే విజ్ఞానదీప్తి ప్రకాశిస్తుందో, ఏ స్వాతంత్ర్య కాంక్ష రేకెత్తుతుందో, ఏ సంఘీభావ మేర్పడుతుందో, అందువల్ల తమ స్వార్థానికేమి ముప్పమోఅని వారికి భయం. అందువల్ల యే ప్రమాదమున్నా తమ ఆధిపత్యానికేమీ ముప్పముండదుగదా అని తమ స్త్రీల నిట్టి కాలక్షేపాలకు మగవారు పంపుతూ ఉంటారు. సనాతన సాంప్రదాయాలమీద ఉండే గౌరవమూ, పుణ్యంమీదఉండే అపేక్షా మావాళ్లకి అసత్యతను గోచరింపకుండా చేస్తున్నది. ఎప్పటికో జ్ఞానోదయం...!' అని నిట్టూర్పువిడిచింది రాజేశ్వరి.

క్షమార్పణ

దినమునకొక పూటయును గంజిలేమిచేఁ జిక్కి వెన్నంటిన డొక్కతోఁడ
కటితలంబేనియుఁ గప్ప చేలములేక విచ్ఛిద్రమౌ గోఁచి పేల్కతోఁడ
చలికి నెండకు నింత తలదాచుకొన నీడఁ గానక కృశియించు మేనితోఁడ
సంఘతృణీకృతజాతి హైన్యతఁగల్గు నిర్బంధబానిస వృత్తితోఁడ
సంఘ సేవయొనర్చు పంచమసహోదరా! యికన్మమ్ము క్షమియింప రాదటయ్యా!
నీయుసురుగొట్టియే కాదె నిశ్చయంబు హైందవావని పారతంత్ర్యమ్మ గుడుచు!

—శ్రీ కొండపల్లి సుభద్రాంబ.

★ పూర్వకవయిత్రి గంగాదేవి ★

'మధురావిజయ' రచనలోని మాధుర్యము

●

— శ్రీ —

కొత్తపల్లి వెంకటరత్నం

వాఙ్మయ ప్రపంచములో స్త్రీలకు సంబంధం చాలాతక్కువ. ఈదౌర్బల్యం ప్రతివాఙ్మయానికి వున్నది. గార్గి, ప్రాతిథేయి, అవన్తిసుందరి మొదలగు ప్రాచీన సంస్కృత కవయిత్రులతో సరితూగగల స్థానము పూర్వకవయిత్రి 'గంగాదేవికి' కూడా వున్నది.

గంగాదేవి సంస్కృతమున మధురావిజయ (వీరకంపరాయ చరిత)మనే గ్రంథాన్ని రచించింది. ఈమె ఏ పండిత కుటుంబానికి జెందినదికాదు. ప్రాజ్య సామ్రాజ్యాధినేతయైన వీరకంపరాయని భార్య (బుక్కరాయని కోడలు) యని తెలుస్తోంది. దానికి ఆమె గ్రంథ మందలి ఉక్తియే ప్రబలసాక్ష్యం. 'అథకంపన్నపో పికృత్యవిత్ ....అవదత్ సవిధే స్థితాంప్రియాంభువి 'గంగే'త్యభినందితాహ్వయామ్॥ (7 స. 39 శ్లో.)' దీనివల్ల గంగాదేవి కంపన్నపతి భార్యయనియు తరువాత విషయాన్నిబట్టి (40. శ్లో.) ఆమె కవయిత్రి అనిగూడ స్ఫురించుచున్నది. సామాన్యంగా భోగలాలసత్వం, అలసత్వం, సింగారం ప్రధానంగాగల్గి, యీలోకమే తెలియకుండు, రాజకుటుంబంలో ఉద్భవించియు ఈమె మేటి కవయిత్రియై వెలయుట అసామాన్యము, అశ్చర్య జనకము. ఈమె మిగుల సౌజన్యయుక్త, సరళ హృదయ. ఆ విషయము గ్రంథాన్నిబట్టే తెలుస్తుంది. ఈమెకు శైవమత ప్రవర్తకుఁడు క్రియాశక్తి గురువు. సారస్వత గురువు విశ్వనాథకవి. "చిరంసవిజయీ భూయాద్విశ్వనాథః కవీశ్వరః యస్య ప్రసాదాత్సార్వజ్ఞంసమిద్ధే మాదృశేష్వపి." అని ఆమె నుడివల్ల తెలుస్తోంది.

విశేష మేమంటే తనభర్త చరిత్రనే తాను రచించుట. స్వీయ చరిత్రలను వ్రాసికొనడ మున్నదిగాని భర్తల చరిత్రలను పత్నులు వ్రాయడం సామాన్యంగా కనబడదు. సామాన్యంగా చాలామంది పురుషులకుగూడ అసాధ్యమైన ఈ కార్యానికి ఒక స్త్రీ, విశేషించి రాజపత్ని పూనుకొని రచించిందంటే ఆశ్చర్యం కదూ? ఆ కాలంలో స్త్రీ విద్యా ప్రాముఖ్యం లేకపోయినా ఈమె రాజ కుటుంబములోనిది గనక శ్రద్ధవహించి తలిదండ్రులు తగిన గురువుల నియోగించి విద్య చెప్పించి యుందురు. దీనిని బట్టి రాజ కుటుంబాల్లో చాలాకాలంనుంచి విద్య వున్నదని తెలుస్తోంది.

ఈ వంశంలో శివ భక్తిమెండు. ఈమెకు గూడ శివునియందు దృఢమైన భక్తి. అందువల్ల ఇతర దేవుల పేర్లుగూడ తలపలేదు. అక్కడక్కడ శివునే ఉపమానముగా గూడ గ్రహించింది.

"త్రిలోచన మివాపర" మని, "పశుపతిరి వనేత్రైః......త్రిభిరపి.........తైస్తనూజైరభాసీత్" నీ, (2. 42) "దేవా యీనామ తస్యాసీత్ ....శంకర స్యేవ పార్వతీ" (1. 73)

అని, రాజ వర్ణనయందుగూడ "మాతేస్త్ర్యబ్బక పాదుకాం..............భూపామమంస్త" అనీ, శివుని ఉపమానత్వమూ, రాజునకుగూడ శివభక్తియూ క్రమముగా తెలియు చున్నవి.

ఈమె మిగుల వినీత. ఆ విషయమును కవిస్తుతియే చెప్పక చెప్పుచున్నది. నిజంగా ఏతత్కావ్యంలో ఇదొక వైశిష్ట్య మనక తప్పదు. సామాన్యంగా ఏకవులైనా, ఇరువురు మూగురు కవులను స్మరిస్తారు గాని దీనిలో వలె ఇంతమంది కవులను స్మరింపరు. ఈమె శివ భక్తురాలు గనక ముందు విఘ్నేశ్వర, మహేశ్వరాదులను, తరువాత అది కవియగు వాల్మీకిని, అటుపిమ్మట, వ్యాస కాళిదాసాదులను స్తుతించినది. ఆతరువాత క్రమంగా బాణ, భారవి, దండి, భవభూతి, కర్ణామృత కవి, తిక్కయ, అగస్త్య, (విద్యానాథ) గంగాధర, విశ్వనాథాదుల యథావిధిగా స్తుతించింది. పురుషుల్లోగూడ వన్నెకెక్కిన కవులు చాలా అరుదు.

ఆ విషయమును "విరలాః కవయోలోకేసరలాలాపవేశలాః" అని గంగాదేవిగూడ బలపఱచు చున్నది. అట్టియెడ ఈ యన్నులమిన్న భావిమహిళామండలికి ఆదర్శార్హమైన ఈ పనికి పూనుకోవడం మిక్కిలి ప్రశంసాపాత్రము.

● మధురావిజయము విశిష్టత ●

సంస్కృత వాఙ్మయంలో స్వకపోలకల్పితం, ఖ్యాతం, మిశ్రమ, నియితి వృత్తము(Story) మూడు విధములు. అందులో పురాణేతిహాసమును గ్రహించి రచించిన గ్రంథాలే యెక్కువ. మధురా విజయము చరిత్రక (Historical) కావ్యము. ఇటువంటి గ్రంథాలు సంస్కృతంలో చాలా అరుదు. ఇది యీ గ్రంథాని కొక వైశిష్ట్యం. దీనిలో కథాభాగం చాలాతక్కువ. ఎక్కువగా వర్ణనలతోనే గడిచింది.

అసలు కథ - విద్యారణ్యుని సహాయముతో హరిహరరాయలు, బుక్కరాయలు విజయనగర సామ్రాజ్యాన్ని స్థాపించారు. హరిహరరాయల యనంతరం బుక్కరాయలు రాజ్యానికి వచ్చాడు. అతని తరువాత, అతని పుత్రుఁడు 'వీర కంపరాయలు' రాజయ్యాడు. అతని రాజధాని 'విజయ' అని యందు వర్ణింపబడింది. అదే సుప్రసిద్ధమైన విజయనగరము. బుక్కరాయలు, వీరకంపరాయలు, 14వ శతాబ్దములో రాజ్యాన్ని పాలించారు. వీరకంపరాయలకూ, మహమ్మదీయులకూ యుద్ధాలు సంభవించాయని ఈ క్రింది వానివల్ల తెలుస్తూన్నది.

"కంపంక్షితీంద్రం యవనాధిలాజః ప్రత్యగ్రహీద్వృత్ర ఇవామరేంద్రమ్" "...కంపనృపోఽభ్యనందీ ద్వీరస్సు రత్రాణ (సుల్తాన్) ముదగ్రశౌర్యః". "అంధ్రాంధకారక్షయతిగ్మ భాసోబాణా ముంచద్యవనే నరేంద్రః" ఇటువంటి వింకావున్నవి. చివరకు కంపన్నపతే యుద్ధంలో జయించాడు.

మధురావిజయకావ్యం అంత ప్రాచీనం కాకపోయినా, ఎందువల్లనో తాళపత్రప్రతినుంచి చాలాభాగ ముత్సన్నమై పోయింది. అందువల్ల ఇది యెన్నిసర్గల గ్రంథమో నిర్ణయించలేము. (శ్రీధర పవర్ ప్రెస్ ప్రతి) అవసర్గ 13-శ్లో. తరువాత, 55 వరకు. 41 శ్లోకములున్న, 'పతింతి' అనే క్రియాపదం తప్ప 55 పైపాదంకూడాలేదు. ఇంకా 8వ. సర్గమొదట దాదాపు 30 శ్లో-ను. చివర దాదాపు 10 పత్రాలు (100 శ్లో. పైన) దొరకలేదు. ఇంకా అక్కడక్కడ కొద్ది కొద్దిగా పోయినై.

● కవిత్వము ●

గంగాదేవి కవిత్వం చాల మృదుమధురంగా వుంటుంది. చక్కని తేలిక పదాలతో భావంస్ఫురింప జేస్తుంది. శైలి మిక్కిలి సరళం. మనోహరమైన భావాలు. ఈ కావ్యం చదివేటప్పుడు కాళిదాసు కవిత్వం జ్ఞప్తికి వస్తూవుంటుంది. అన్నిటిలోను స్త్రీ హృదయం వ్యక్తమవుతూ వుంటుంది. ఈమెకు ఉపమాలంకారం మీద ప్రీతిమెండు. అక్కడక్కడ, ఉత్ప్రేక్ష, శ్లేషగూడ ఉపయోగింపబడుతూ వుంటవి. శ్లోకంచదవగానే అర్థం స్ఫురిస్తూ వుంటుంది. గ్రంథమంతా ద్రాక్షపాకంతో వొప్పి, మిక్కిలి హృద్యంగావుంటుంది. అక్కడక్కడ 'సమస్త సామన్తమస్త కన్యస్తశాసనః' లాంటివీ ఇంకా పెద్ద సమాసాలున్నా మిక్కిలి సరళాలు, సద్యోర్థఃస్ఫోరకాలున్నూ, వర్ణనారీతిగూడ చాల చక్కగావుంది. ఉపమకు—

'తస్యాసీ ద్విజయనామ........శక్రస్యేవామరావతీ' 'యశ్శేష ఇవనాగానాం, నగానాం హిమవానివ, దైత్యారి రివదేవానాం' మొదలగు వానియందు ఉపమాలంకారము చక్కగా వున్నది.

మఱియు 'అన్తర్బింబిత చంపేంద్రా కంపేంద్ర స్యాసిపుత్రికా అప్సరోభ్యః పతిందాతు మన్తర్వత్నీ కిలాభవత్' (4-8-1) (లోపల ప్రతిబింబితుడైన చంపేంద్రుడుగల కంపన్నపతియొక్క కృపాణ పుత్రిక అచ్చరలకు భర్తనిచ్చుట కోయన, గర్భవతియై నట్లుండెను.) నక్షత్రాలను వర్ణిస్తూ—

'అవపత్కాల కాలకర్ష కస్తిమిరాంభః కలుసేనభస్తలే. విమలాముడు బీజమండలీం నవచంద్రాత పసస్య సిద్ధయే' (7-2-9) (నూత్న చంద్రికయను సస్యసిద్ధికై చీకటియనే నీటితోగూడిన ఆకాశమందు కాలమనే కర్షకుడు, నక్షత్రాలనే విత్తనాలనునాటి నట్లుండెను.) ఇటువంటి శ్లోకాలు మిక్కిలి చమత్కార జనకములుగా వున్నవి. గర్భము, గర్భదోహదాలు చక్కగా చమత్కారంగా వర్ణింపబడినై. సోమరాజి గర్భస్థమైన శిశువును రక్షించాడానికి వచ్చిన కాలోరగిగా వర్ణింపబడింది.

● అనుకరణము ●

గంగాదేవికి కాళిదాసన్న మక్కిలి అభిమానము, పూజ్యభావమూను. అతఁడు కవులలో కెల్ల ఉత్కృష్టుడని, శ్రేష్ఠుఁడనీ, కవిరాజనీ ఆమెతలపు. అందువల్లనే 'దాసతాం కాళిదాసస్యకవయః కేనబిభ్రతి ఇదానీ మపితస్యార్థా నుపజీవంత్య మీాయతః' (1-7) అని తక్కిన కవులకు కాళిదాసుని దాసత్వమును నిరూపించినది. అంతేగాక కాళిదాసుని ఆదర్శంగాపెట్టుకొని అతని అడుగుజాడల్లో తనపాదచంక్రమణాలను సాగించింది. శాబ్దికముగాను, ఆర్థికంగాను, అన్నివిధాలా ఆతనిపోకడలనే అలవరుచుకొన్నది. వర్ణనా పద్ధతిలోను, శైలిలోను ఆతనిచిహ్నాలే కన్పట్టును. కాళిదాసు ననుకరించే తావు లనేకములున్నవి.

'తేజోవిధాతుః ప్రథమేవసృష్టిః' (2,1) ఇది 'యాసృష్టిః స్రష్టురాద్యా' (శా) అనియు 'యాత్రసాద్యవతి విషయేసృష్టి రాద్యేవధాతుః' (మే. సం) అను కాళిదాసు శ్లోకములకు ఛాయయే.

'ఆకంపయిలష్యత్య యమేకవీరః సంగ్రామరంగే సకలానరాతీన్. ఇత్యేవనిశ్చిత్య సదీర్ఘదర్శీ నామ్నా సుతంకంపన ఇత్యకార్షీత్' (2-3-4) అనే శ్లోకమందు 'బ్రాహ్మే ముహూర్తే కిలతస్య దేవీ కుమార కల్పంసుషువే కుమారం అతః పితాబ్రహ్మణ పవనామ్నాత మాత్మజన్మాన మజంచకార' (ర. వం) అనే కాళిదాసుయొక్క పోకడలే ప్రతిబింబించినవి.

'ఆచారలాజైం పౌరాణాం పురంధ్ర్యస్తమ వాకిరన్' (4-3-3) అనేది, 'అవాకిరన్ వయో వృద్ధాస్తంలాజైః పౌరయోషితః' (ర. వం.) అనేదాన్ని, 'కలమగోపవధూభిరగీయత' అనే 'శాలి గోప్యోజగుర్యశః' (ర. వం.) అనే కాళిదాసు సూక్తులను పూర్తిగా అనుకరిస్తున్నవి. ఇలాంటి వింకావున్నై. ఇంకా దీనిలోని శ్లోకాలు కొన్ని 'రాఘవేంద్ర విజయము' లోని వానిని బోలివున్నవి. 'పృధివ్యాంపద్య నిర్మాణవిద్యాయాః ప్రథమంపదం' (మ. వి. 1-5) 'సగద్యపద్య నిర్మాణవిద్యాయాః ప్రథమంపదమ్' (రా. వి. 1-1-0) వీనికిని, 'వాణీ పాణి పరామృష్ట వీణానిక్వాణహారిణీం' (మ. వి. 1 ౧) 'వాణీ పాణి తలాసక్త వీణారవ విడంబినీ' (రా. వి. 1. 6) వీటికిని పరస్పరం చాలా సామ్యంవుంది.

'గుణంవిహాయ కావ్యేషు దుష్టోదోషంగ వేషతే. వనేష్వత్యక్తమాకందః కాకో నింబమపేక్షతే' (మ. వి. 1. 2. 0) 'కావ్యేగవేషతే కశ్చిత్ దోషమే వగుణంపరః, పిచుమందంయథా కాకః పికశ్చూతల తాంయథా' (రా. వి.) వీటిరెంటికినీ సామ్యం స్ఫుటంగానే తెలుస్తూంది. ఇలాంటి చోట్ల కొన్ని అను కరణాలున్నా కావ్యంబాగానే వుంది.

● మహా కావ్యత్వము ●

'నగరార్ణవశైలర్తు చంద్రార్కోదయ వర్ణనమ్ ....పతానియత్ర వర్ణ్యంతే తన్మహాకావ్య ముచ్యతే, ఏషామష్టా దశానాంయైః కైశ్చిదూనమ పీష్యతే' (ప్ర. రు) అనే లాక్షణికోక్త (మహాకావ్యశ్రీ) లక్షణాన్ననుసరించి గంగాదేవి తనగ్రంథాన్ని మహాకావ్యముగా నిరూపించుకొన్నది.

(ప్రథమసర్గ) పురవర్ణన, (ద్వి. స) కుమారోదయ వర్ణనము (పం. స.) ఋతువర్ణనము రత్యోత్సవ వర్ణనము, (స. స.) చంద్రోదయ వర్ణనము, (చ. స.) దిగ్విజయము, గ్రంథాంతమున ఆజినాయకా భ్యుదయము, మొదలైన వర్ణనలు చక్కగా వర్ణింపబడ్డాయి.

గంగాదేవియింకా యితరగ్రంథాలేవీ రచించలేదో, రచించినా ప్రకటింపబడలేదో గాని యితరా లేవీ కనబడవు. ఈ మహాకావ్యం హృద్యంగానూ, సరళంగానూవుండి రచయిత్రికి కీర్తిదాయకమై ఒప్పు చున్నది.

ఆంధ్ర సోదరి!

మేలఁతలకు నెల్ల నామెయే మిగులు సుగుణసంపదలనంచు లోకమే సతినిగొండు
సలుపునోయట్టి సీతను దలఁచుచుండు మాంధ్రసోదరి! శుభముల నందఁగలవు

ఆమెశీలము వర్ణింప నలవిగాని వారు కవులని యేపతివ్రతను గుఱించి
విజ్ఞులందురో? యట్టి సావిత్రి నీవు మఱువఁజనదాంధ్రసోదరి! మానసమున

భారతీయ మానినులకు వన్నెప్రోది సేయునట్టి చంద్రమతిని జెలిమిఁబలికి
నీదుదేశమునకు. ఖ్యాతి నిలిపితేని యాంధ్రసోదరి! శ్రేయములందఁగలవు.

ఉవిదలకు నెల్ల దమయంతి యొజ్జబంతి యంచు చెలిమిరికత్తెల యండఁజేరి
నీవు నొక్కి వక్కాణింపు నిఖిలశుభము లందఁగల వాంధ్రసోదరి! అడ్డులేక

మాని కన్యకలకునైన జ్ఞానబోధ సలుపగలయట్టి తెలివియే సతికిగలదో
అట్టిద్రోవది గుఱించి ప్రోయాంధ్ర తోడఁ బలుకు మాంధ్రసోదరి! నేరుపలవడంగ.

—శ్రీ ఆగూరు సింహాచలనట్నాయుడు.



ఇందిరాదేవి ఫిలిమ్సువారి 'ఇల్లాలు'లో

ఇందిర - కాంచనమాల　　　　లీల - లక్ష్మీరాజ్యం

కీ॥ శే॥ శ్రీమతి ముక్కామల సీతారామమ్మగారు

వీరు నంద్యాల మునిసిపల్ ఆస్పత్రి సివిలు అసిస్టెంటు సర్జనుగారైన శ్రీ ముక్కామల సుబ్బారావుగారి సతీమణి. ఇటీవలనే వారి భర్తను, ఏడుగురు సంతానమును అపార దుఃఖసాగరమున ముంచి దివంగతులైరి. చనిపోవుసరికి వీరి వయసు 43 సంవత్సరములు. వీరికి విద్యాభిమానము మెండు. గృహలక్ష్మి, భారతి, ఆంధ్రపత్రిక మున్నగు పత్రికలను నిరంతరము పఠించుచుండుటయే గాక, చుట్టుప్రక్కల బాలికలనుగూడ పత్రికలు చదువుటకు ప్రబోధించు స్వభావముగలవారు. ఇట్టి గృహలక్ష్మి యొక్క అకాలమరణమువలన స్త్రీ సమాజమునకును, ఆంధ్రరాష్ట్ర హిందీప్రచార సంఘమునకు నొక పోషకురాలు కరువైపోయెను.

ఆకలిమంటలు

శ్రీమతి గోపరాజు సీతాదేవి

'తల్లీ! గుప్పెడు మెతుకులు. మూణ్ణాళ్లనుంచి కూడులేదు. నిలవలేక పోతున్నాను. కడుపుమంట. నీకు పున్నెముంటుంది తల్లీ! నాల్గు రోజుల పసిగుడ్డు. నెత్తురుముద్ద. పాల్లేవు. మీరు తినగా పారేసిన ఒక్క కబళం. ధర్మాత్మురాలివి, కనికరించు అమ్మా!'

తపీమని తలుపులు మూసుకుపోయాయి. నాల్గురోజుల కటికబాలెంత - చిరిగిపోయి, మాసిపోయి శరీరాన్ని సగం సగం కప్పుతూండే గుడ్డ పేలికలతో, నడి శీతాకాలం రాత్రి తొమ్మిదిగంటలవేళ ఎముకల్ని కొరికే ఆచలిలో వీధిఅరుగుక్రింద అడ్డమయిన కుళ్లూ కొట్టుకుపోతుండే సైడుకాల్వపక్కన ఆ అనాథమాత చతికిలబడిపోయింది—

* * *

కోలాహలంగా వుంది భోజనాల పందిరి. విరవని అప్పడాలకోసం కూర్చున్నారు పెళ్లివారు.

* * *

ఎంగిళ్లు పారబోసే కుండీనిండా కుప్పలుకుప్పలుగా ఎంగిలాకులున్నాయి. కొన్ని కిందపడి పొర్లాడుతున్నాయి. రెండు కుక్కలు గట్టిగా దెబ్బలాడుకుంటూ పంచుకుంటున్నాయి క్రిందపడ్డవాటిని.

కుప్పలుగాఉన్న ఆ విస్తళ్లుచూచేసరికి ఆకలితోటి కళవళపడుతూన్న ఆమె మొహం సంతోషంతోటి, సంతృప్తితోటి ఇంత అయింది. భరించ శక్యంగాని వాసనలతోటి, మట్టి కొట్టుకుపోయిన కొంగుపరచి, బిడ్డను ఒకచేత్తో పట్టుకుని, రెండోచేత్తో ఒక ఆకు శుభ్రపరిచింది. ఒక్కొక్కవిస్తరి దొర్లించి అన్నం, పప్పుకూరలు, సగంసగం కొరికిన పిండివంటలు ఎంతో ఉత్సాహంతోటి పోగులుపెట్టుకో నారంభించింది. తనపిల్లలకి ఈవేళ కడుపునిండా కూడు - తనకి కడుపు నిండే పోయింది ఊహించుకోటంతోటి. అయ్యో, దిక్కుమాలిన కుక్కలు శనిగ్రహాల్లా మాటిమాటికి జొరబడి విసిగించాయి ఆమెని. ఇంక తాళలేకపోయింది. గబగబా, దొంతర్లుగా మూటకట్టి వెనక్కి తిరగకుండా చరచర నడిచిపోయింది—

ఆకలిమంటల విలయగర్జనలుచేస్తూ తీవ్ర అసహనంతోటి ఆ అమ్మి మీద మొరుగుతూనే ఉన్నాయి కుక్కలు చాలసేపు. కడుపుచిచ్చు తీర్చుకోటానికి, ఆఖరికి క్షుద్రజంతువులతోటి, పోటీపడుతోంది మనుష్యజాతి ఈ రోజున మానాభిమానాలు, నీతినియమాలు వమ్ము చేసి. అహో! దేవుని సంతానం!!

ఆకలిమంటలు! రక్తారుణితనేత్రాల్తో ఈ పీడితదీనప్రపంచం నాగరిక సభ్యతా ప్రపంచాన్నీ, నేటి సమాజ వ్యవస్థనీ ప్రశ్నిస్తోంది - సమాధానం ఏమిటి???

★ శారదాచట్టము

యువకుల బాధ్యత

> అనుకూల దాంపత్యాలు, దేశకళ్యాణం, సంఘోన్నతి, స్త్రీ అభ్యుదయము, హిందూదేశ పాతివ్రత్యమహాత్మ్యము, భారత మహిళాశీలము, అనాదిసిద్ధముగా యున్నటులే యింకను నిలబడాలంటే, యువకులే పూనుకోవాలి.
>
> శ్రీమతి ఆచంట సత్యవతమ్మ

'శారదాబిల్లు' ఎందుకు చట్టంచేశారు? కన్యల భావిసౌఖ్యంకోసమున్ను, బాలికలు అనుకూల దాంపత్యంకలిగి గృహమునుభూతలస్వర్గంలాచేసికొని సుఖించుటకొఱకున్ను, అజ్ఞానవయస్సులో పెండ్లిచేసినచో వివాహోద్దేశము, దానిపవిత్రత, పతియన్న యెట్లుగా భావించి మెలగవలెనో తెలియక, కేవలం బొమ్మల పెళ్లిళ్లుచేసి బాలికలు వినోదించులాగున, వేడుక వినోదాలనే అనుభవనీయంగా గాక, పద్నాలుగేళ్ల ప్రౌఢకన్యయైనచో దాంపత్య ధర్మమెరిగి వివాహముయొక్క సర్వానుభవమునెరిగి పొందవచ్చుననియే యుద్దేశించి చట్టంచేశారు.

కాని ఫలితం మరొకవిధంగా పరిణమించింది. ఏలాగంటే, బాలికయైనా ప్రౌఢకన్యయైనా, ప్రస్తుత పాశ్చాత్యస్వేచ్ఛా విహారవిద్యావతి తక్క, తతిమ్మాకన్యలందరూ ముప్పాతికమంది తలిదండ్రుల జాగ్రత్తలో పెంచబడుచున్న వారలలో స్వేచ్ఛావర్తనులుకారు. అన్నివిషయాలా మాతాపితల అధీనంలోనే ఉన్నారు. వారిగతి యిప్పుడెట్లున్నదనగా 'ఈనకాచి నక్కలపాలైనట్లుంది'. అమ్మాయినో పండులా పదహారేళ్లు పెంచారు. విద్యాబుద్ధులు, సంగీత సాహిత్యాలు, పనిపాటలు, నేర్పించారు. నిరుద్యోగం, డిప్రషన్ ఏకమై కుటుంబాలుచితికాయి. పిల్లలు పెళ్లిళ్లకెదిగారు. విద్యాయువకులు వరవిక్రయులయారు. మ్రింగడానికి ఆశకంతంలేదు. కన్యాసౌందర్య సుగుణాలు అవసరంలేదు. దేశపరిస్థితుల గమనింపేలేదు. కాఫీ, టీలు మెతుకులేకపోయినా మీసాలకు సంపెంగనూనెలు కావాలి. కడుపుకు గంజిలేకపోయినా, నాటకసినీమాలు కావాలి. కడుపుకన్నం లేకపోయినా కట్టుకునేటందుకు సూట్లు బూట్లును, కళ్ల వేడుకలకు కావాలికాని, కన్యాజనకుల కడగళ్లాలోచించేజ్ఞానంకల వరులు కనపడడంలేదు. వేలమీద వెడుతున్నారు.

దీనికితోడు, బాలింతమరణాలు, యువతీచావులు హెచ్చయ్యాయి. యువకులకన్న కౌమార వృద్ధవరులు వృద్ధియైనారు. అంతవరకు అనుకూలంగా సంసారంచేసి, బిడ్డపాపలతల్లియై మరణించిన సహధర్మ చారిణికొఱకు, సానుభూతి యిసుమంతలేక, పదమూడోదినం నాటికే, పట్టంచుకండువాలతో, పచ్చబొట్లలో పసుపుకాళ్లతో, పెళ్లికొడుకవడానికి సిగ్గులేక, చింతలేక, సిద్ధపడుచున్నాడు. కన్యకోసం, కట్నమిస్తానంటున్నాడు. పడుచుభార్యకోసం పలవరించి, మధ్యవర్తులచేత, మంగళసూత్రధారణ చేస్తానని మాటలుజరిపించి, కన్యయొక్క బీదతలిదండ్రులకు భ్రాంతికల్గించి, కనులుకప్పించి, కల్లభాగ్యములు చూపించి కన్యలను కళ్యాణ సౌందర్యమూర్తులను, లలితముగ్ధా సుందరమణులను ఆరముగ్గిన పండ్లను, నవనవలాడు పసిడిబొమ్మల నమాం

తంగా ప్రేమప్రణయ యువతీయువక స్నేహానుబంధముల విడదీసి, తమఆధీనం చేసుకొనుచున్నారు! పిల్లలబ్రతుకెంత కడగండ్లపాలు! అట్టి తల్లిదండ్రులెంత కఠినులు! కన్యలనే కాంక్షించు వృద్ధభాగ్యవతుల ఆశాప్రవర్తనలెంత విచారణీయం! ఇవి సంఘానికి క్షీణదశచేకూర్చి, అననుకూలదాంపత్య విలాపాలుకల్పించి, సవతితల్లుల పీడ బిడ్డలకు దాపురింపజేసి, సంఘవృక్షానికి వేరుపురుగులై, జీవచ్ఛవముగాజేసి, ప్రేమయనే బీజము నంతరింపజేయుచున్నారు. వితంతువుల మళ్లీ పెళ్లికి వరులు వేరు. తాముకన్యలనే కాంక్షించుటచేతను, యువకులు కట్నాల దేవతలగుటచేతను యువకులకు యువతులులేరు. తుదకీనకాచి నక్కల పాలైయాపీలాగ బాలికలు. ఇట్టి వివాహాలనేకం జరుగుచున్నాయి.

ఇట్టి దేశారిష్టాలరికట్టాలంటే, విద్యాయువకులు నడుంబిగించి, కట్నాల వెర్రులు తల్లితండ్రులకు వదల్చాలి; నచ్చచెప్పాలి. తామువిమర్శించుకొని, వృద్ధ పెళ్లికొడుకుల వెర్రి వ్యామోహాలు వదల్చాలి. బాలికల సుగుణసౌందర్యాలే చూడాలి కాని, డబ్బుమోహం వీడాలి. అప్పుడుకాని ఈ పీడలు వదలవు.

బాలికామణుల నమాంతంగ మ్రింగకాచుకొన్న వృద్ధ పెళ్లికొడుకులకు బుద్ధిచెప్పాలి. నలుబది సంవత్సరములు దాటినవారు భార్యావియోగానంతరం తిరిగి పెళ్లిచేసికొనుటొక గొప్పతప్పు. అందుపై యీడు జోడు విడదీసి, కన్యలనే పరిగ్రహించుటొక గొప్పఘోరము. కాన, శారదాయాక్టుయొక్క యుద్దేశం నిలబడులాగునను భారతరమణీపవిత్రత తొలగజేయు విడాకులచట్ట మవసరములేకుండునటుల చట్టము ప్యాసు జేసిననేకాని స్త్రీసౌఖ్యము, దేశసౌభాగ్యము నిలబడదు.

—•• పద్మినీ! ••—

ఉ. తామరవంటి పుష్పమును ధారుణిఁగానమటంచు మానవుల్
నీమముతోడ గొల్తురినిను నిత్యము; భానుని భార్యవౌట నీ
మోమును గాంచినంతనె త్రిమూర్తులదర్శన భాగ్యమబ్బు నో
భామరో! నేఁడు నీదగుస్వభావము వర్ణనఁ జేయఁజెల్లునే?

చం. మనుజులు నిన్నుగూరిచి యమానుషరీతి వచింత్రుగాని, నీ
వనవొక దివ్యమూర్తివని యాత్మగణింపదేమొ పద్మినీ!
అనునయశీతలామృత విహారమొనర్చెడు భృంగమేక్రియన్
గనుగొనుచుండు నిన్నటులఁగాంచగ నేరకయుంట నిచ్చలున్!

చం. "పరపురుషుండితండు గురుపత్నిహరించె వివేకశూన్యుఁడై
కరుణయొకింతలేక; మనకాంతుని ముందితఁడెంత?" యంచునీ
వరయుదివేమొ చంద్రుఁగనినంతనె, గర్వమిదేల నీకు? నీ
సరసునిఁగూడ కల్వలు శశాంకుని ప్రాపున చిన్నజూడవే!

మ. తొలికోడిన్ వినినంత నీహృదయమెంతో సంతసంబందు, తొం
గిలి చూడన్ జెలికత్తెలంగలసి సంఘీభావమేపారనీ
నిలయంబందున మోము నెత్తెదవుగానీ, వెంటనే రాడు; ఈ
యిలపై నింతటి మోహమున్న ప్రియుపై నెట్లోగదే పద్మినీ!

—శ్రీమతి జయంతి కామేశ్వరీదేవి.

నిత్యావసరములలో ఒకటి



మీ భర్త పనినుండి, మీ పిల్లలు బడినుండి, యింటికి రాగానే వారికి టీ తయారుచేసి యిచ్చుట మీ విధి. కాబట్టి ప్రతి రోజు మీ యింట్లో టీ పార్టీ అన్నమాట—సంసారఆనందమునకు ముఖ్య మిదియే. మీ యింటిలో వలెనే అనేక యిండ్లలోకూడా అదే విధముగా యిదే సమయమున యీలాటి సంతోషకర విషయమే జరుగుచున్నదని నమ్ముడు!

మనము ఇండియా టీ నేత్రాగుదము

తేనీరు తయారుచేయు విధం—మంచినీటిని మరుగ కాచవలయును. పరిశుభ్రమైన తేనీరు కావం పాత్రను కొద్దిగా వెచ్చజేయుడు. మనిషికొక చెమిచా చొప్పున, ఎంతమందికి తేనీరు కావలెనో అన్నిచెమిచాల తేయాకుతో. మరొక చెమిచా తేయాకు ఎక్కువగా చేర్చి ఆ పాత్రలో వేయుడు. కాగుతున్న నీరు సలసల మరుగగానే ఆ నీటిని ఆ తేయాకు పాత్రలో పోయుడు. అయిదు నిమిషములు అట్లుండనిచ్చి, ఆ తేనీరును కప్పులలోపోసి పాలను పంచదారను కలిపి సేవించుడు.

IK 116

ఇండియన్ టీ మార్కెట్ ఎక్స్‌పాన్‌షన్ బోర్డువారిచే ప్రకటించబడింది

వింత వింతల ప్రపంచం

ఫ్లోరిడాలో మైమిఅనే పట్టణంలో ఎమొరికాల్లన్ అనే వడ్రంగి వున్నాడు. అతనిభార్య గర్భిణితోవుంది. 6-వ మాసంలో ఆమెగర్భము బరువుగావుండడంవల్ల హాస్పిటలుకుపోయి డాక్టరును సలహా కోరింది. అతడు ఎక్సరే (X-Ray) ఫోటోతీసి 'ఇప్పటికి కడుపులో 5 గురు పిల్లలున్నారు. ఇంకాకొన్ని ఈ ఐదుకంటె చిన్నతలకాయలు కనపడుతున్నాయి. ఒకటిరెండు మాసములు గడిచితేనేగాని ఎంతమంది వుండేది చెప్పలేను' అన్నాడు. ఈ విచిత్ర గర్భానికి పరమానందపడుతూ వున్న ఆమె ఆరోగ్యం విషయంలో ఏవిధమైన బాధలుకలుగకుండా స్థానికప్రభుత్వం తగు శ్రద్ధచూపుతూ ఆమెకు సపర్యలు చేస్తున్నారు. ఈమె సుఖంగా ప్రసవమైనట్టయితే, వైద్యశాస్త్ర సహాయింతో జరిగినది ఇది 31 వది అవుతుందట, ఒక్క అమెరికా దేశంలోనే.

♦ ♦ ♦

న్యూజెర్సీ దేశంలో ఒకగ్రుడ్డిమనిషి వున్నాడు. అతడు తన చేతులతో తడుముకుంటూ పుస్తకాలు చదువుతాడు. ఇది అందరికి ఆశ్చర్యాన్ని కలగజేసింది. అలాచదవడంలో అతనికి భగవంతుడు ప్రసాదించిన ప్రత్యేకశక్తి ఎలాంటిదో కనిపెట్టగలిగితే గ్రుడ్డివాళ్లకందరికి విద్యనేర్పడంలో ఇదిఒక క్రొత్త పద్ధతిగా వుపయోగించవచ్చునని కొంతమంది శాస్త్రజ్ఞులు ఇప్పటికి 5 సంవత్సరములుగా ప్రయత్నిస్తున్నారు. ఇంతలో ఆగ్రుడ్డివాడు కారుక్రిందపడి తన రెండుచేతులు పోగొట్టుకున్నాడు. ఇప్పుడు రెండుచేతులు మొండివి. అయితేనేం, కాలిబొటన వ్రేళ్లతో అక్షరాలనుతాకి, చదువుతున్నాడు. దీన్నిచూచి ఆ శాస్త్రజ్ఞులకు ఏమీ అర్థమవక ముక్కుమీద వ్రేలేసుకున్నారుట.

♦ ♦ ♦

ఆఫ్రికా, ఆడ్డాపట్టణంలో నేషనల్ పార్కులోని ఏనుగులు పారిపోతూవున్నాయి. వాటిని ఆపడంకోసమని ఒక ఫెన్సు కట్టారు. ఆఫెన్సును సునాయాసంగా లాగేసి ఏనుగులు వెళ్లిపోయాయి. అప్పుడు ఫెన్సునుతిరిగి పాతి ఆతీగలో విద్యుచ్ఛక్తిని ప్రసారంచేసారు. కొద్ది రోజులుపోయిన తర్వాత, తీగలుకట్టిన స్తంభాల్లో విద్యుచ్ఛక్తి లేకపోవడంచూచి, ఆ స్థంభాలతో వాటిని ఊడపెరికి ఏనుగులు పారిపోయాయి. తిరిగి స్థంభాల్లోను, తీగల్లోనూ కూడా విద్యుచ్ఛక్తిని ప్రసారంచేశారు. అప్పుడు ఈ ఫెన్సు ఒక 10 మైళ్లవరకే వుండడంచూచి అంతవరకు ఏమిఎరగని వాటివలె నడిచివెళ్లి అక్కడనుంచి పరుగెత్తుకు పోయాయి. ఇంకాదొరకలేదు, ఆ పారిపోయిన ఏనుగులు.

♦ ♦ ♦

టెక్సాస్ పట్టణంలో 60 ఏళ్లు వయస్సుకలిగిన ఒక పల్లెవాడున్నాడు. అతనికి 58 ఏళ్లవయస్సు కలిగిన భార్యవుంది. వీరిద్దరికి 25 ఏండ్లక్రితం వివాహమైంది. ప్రతిసంవత్సరం ఒకొక్క కాన్పు చొప్పున ఇప్పటికి వారికి 24 గురు సంతానం. వారిలో 14 గురు మొగవాళ్లు, 10 మంది ఆడవాళ్లూను. 1940 డిశంబరులో వారిద్దరికి వివాహమై 25 ఏళ్లు పూర్తి అవుతాయి. ఇప్పుడు ఆమెకు గర్భిణి.

అద్దం

'గోపాలకృష్ణ'

సాత్పూరా పర్వతప్రాంతాల్లోవున్న అడవులలో కోయవాళ్లు చాలామందివున్నారు. అచ్చట కొమ్మూరు అనే కోయపల్లె వున్నది. ఆపల్లె చుట్టుప్రక్కల యెక్కడ చూచినా పర్వతాలే. అచ్చటి యువతులకు తామెంత అందముగానున్నారో చూచుకొనుటకు అద్దాలులేవు. అందుచేత తమ ముఖాలు యెలాగు వుంటాయో తెలిసికోవాలంటే, తమ ప్రియులు వానినిగురించి చేసే వర్ణనలమీదనే ఆధారపడియుండవలసి వుంటుంది. వారి వర్ణనలు సాధారణంగా అద్దంకన్న పదిరెట్లు యెక్కువగానే వుంటాయి.

కొమ్మూరులో 'మక్కీడు' అనే యువకుడు ఉండేవాడు. వాడు ఆ అడవుల్లో తిరుగుతూవుండగా చిన్న అద్దం కనిపించింది.

మక్కీడు గుండ్రంగావున్న అపూర్వ వస్తువును పైకితీసి చాలా కుతూహలంగా పరీక్షించాడు. ఆలాంటి వస్తువు తన జన్మలో యిదివరకెప్పుడునూ చూడలేదు. కాని దాన్ని చూస్తుండగానే, ఆతనికి దానియందొక విధమైన భయము, గౌరవము, ఆశ్చర్యము కలిగాయి. మాణిక్యంలాగు మెరుస్తూవున్న ఆ వస్తువులో వానికి తనతండ్రి ఆకారము కనుపించింది. "మాతండ్రి! మానాన్న ముఖమే!" అని సంతోషాతిశయంతో అనుకొన్నాడు.

మక్కీడు మెత్తనిఆకులు కోసుకొనివచ్చి చాలా జాగ్రత్తతో అద్దాన్ని వాటిలో చుట్టబెట్టాడు. గౌరవాతిశయంతో దాన్ని దాచుకొన్నాడు. ఇంటికి వెళ్లిన వెంటనే దానిని యెక్కడపెట్టి దాచవలెనో దీర్ఘంగా ఆలోచించి, చివరకు చూరులో దాచడానికి నిశ్చయించినాడు. ఈ సంగతి యెవ్వరితోను ఆతడు చెప్పదలచుకోలేదు. తన ప్రేయసియగు తిమ్మికికూడ ఆ సంగతి చెప్పదలచుకోలేదు. ఎందుకంటే స్త్రీలకు నోట్లో నూగింజయైనా ఆగదని ఆతని దృఢనమ్మకం. తిమ్మితో చెప్పితే త్రిలోకాలు తెలిసిపోతుందేమో అని అతని భయం.

కాని మక్కీడు మాత్రం తన తండ్రిముఖం కనిపించుచున్నదన్న అద్దాన్ని విడిచి చాలాసేపు ఉండలేక పోయేవాడు. తనపని మానేసి ప్రతిరోజూ మధ్యమధ్య యింటికివచ్చి తలుపువేసికొని తన కండ్లార మనస్సుతృప్తిగా ఆబొమ్మకేసి చూచుకొనేవాడు.

కోయ స్త్రీలకుకూడ మనలోవలెనే ఏదైనా క్రొత్తవస్తువుగాని, విషయంగాని కనిపించినప్పుడు దాని పుట్టుపూర్వోత్తరాలన్నీ తెలిసికొంటేగాని తృప్తి కలుగదు. మక్కీడు తాను పరిపరిసార్లు యింటికి రావడం తనను చూచి ఆనందించడానికే అని యెంతచెప్పినా తిమ్మికి బాగా నమ్మకం కల్గలేదు. మొట్టమొదట ఆతని ప్రణయసూక్తులు విని కాబోలనుకొన్నది. కాని ఆతడు వచ్చినపుడెల్ల ఆతని ముఖంలో ఒక వింతకళ, ఆశ్చర్యము, భయము మొదలగు భావాలు కనిపిస్తూ వచ్చాయి.

అప్పటినించీ తిమ్మి ఈ సంగతేమిటో కనుక్కోవాలని నిశ్చయించుకొని మక్కీడుచేసే కార్యాలన్నీ జాగ్రత్తగా చూడ్డం మొదలెట్టింది. త్వరలోనే ఆవిడ మక్కీడు ప్రతిరోజూ ఒంటరిగా పెరటిలోని

వెళ్లి ఏదో చూచి వస్తూండడం గమనించింది. ఆ విషయాన్ని పరిశోధించాలనుకొంది. కాని యెప్పుడు వెదకినా యేమీ కనుపించేదికాదు. చిట్టచివరకు ఆమె ప్రయత్నం సఫలమైంది.

ఒకనాడు మక్కీడు పెరటిలో ఉండగానే తిమ్మి హఠాత్తుగా వెళ్లింది. అప్పడే మక్కీడు చూరులో ఏదో సర్దుతూవున్నాడు. అప్పటి మట్టుకు తిమ్మి యేమీ మాట్లాడలేదు; కాని ఆతడు వెళ్లిపోయిన తత్క్షణమే తిమ్మి పెరటిలోనికి పరుగెత్తింది. తిన్నగా వెళ్లి చూరులో వెదకడం మొదలెట్టింది. ఆకుల్లో చుట్టపెట్టి వున్న అద్దాన్ని పైకి తీసింది. ఆశ్చర్యంగా దానిలోనికి చూచింది. అదీ! తెలిసింది, దానిలో చూడగానే, మక్కీడు దాచివుంచిన రహస్యం!

తిమ్మి తాను చూచినది తానే నమ్మలేకపోయింది. స్త్రీ ముఖమొకటి తనముందర ఆ వస్తువులో గానవచ్చింది. ఇదా మక్కీనికి తనపైనున్న ప్రేమకు తార్కాణము?

తిమ్మి మనస్సులో పరిపరి విధాలుగా ఆలోచించింది. ఆమె దీనత్వము, చింత, వర్ణించడానికి గదా, మక్కీడు మాటిమాటికి ఆ పెరటిలోనికి పోయేవాడు! గుట్టు బయటబడింది యెలాగైతేనేం!

ఆమె విచారం హఠాత్తుగా కోపంగా మారిపోయింది. అద్దేమైనా అందంగావుందా? ఆముఖం చూస్తే పూరకోతిలాగవుంది. అసహ్యం, డోకు పుట్టిస్తూంది ఆముఖం. అటువంటి స్త్రీని మక్కీడు ఎట్లు ప్రేమించగలిగాడు?

తిమ్మికి జీవితంలోని సౌఖ్యం ఒక్క దెబ్బతో తుడిచివేసినట్లు తోచింది. చేతులోని అద్దం అప్రయత్నంగా పట్టు వదలి ఒడిలో పడిపోయింది. పెరటిలో తిమ్మి క్రింద నేలమీద పడి దొర్లుతూ ఏడుస్తూవుంది. మక్కీడు ఇంటికివచ్చి 'తిమ్మీ' అని పిలిచాడు. పలకలేదు. 'ప్రేయసీ' అన్నాడు.

'నేనుకాదు ప్రేయసిని. మిమ్మల్నే దైవంగా నమ్మియున్న నన్ను మీరు యిలాగ చెయ్యడం మీకు న్యాయమేనా?' అంది తిమ్మి కంట నీరుపెట్టుకొంటూ.

'నాకేమీ అర్థం కావడంలేదు. ఏమిటీగోల?' అన్నాడు మక్కీడు ఆశ్చర్యంతో.

'అవును. మీ కర్థంకాదు. ఎందుకర్థం అవుతుంది? స్త్రీ చిత్రాలు ఇంటిలో దాచుకోవడం అర్థం అవుతుందికాని యింకేమీ అర్థంకాదు, పాపం. ఇదిగో మీ ప్రేయసి బొమ్మ. తీసికెళ్లండి.' అని యేడవడం ప్రారంభించింది తిమ్మి.

'తిమ్మీ, నీకేమి పిచ్చియెత్తిందా? ఇది మా నాన్నగారి బొమ్మ. ఆయన చనిపోయి యిప్పటికి పదేండ్లయినా, యిందులో ఆయన ముఖము బ్రతికి వున్నట్టు సరిగా కనిపిస్తూవుంది. నాకిది ఒక రోజున అడవిలో దొరికింది. అప్పటినుంచి, నేను దీనిని చూరులో పెట్టి దాచుకున్నాను.' అని మక్కీడు స్పష్టపరిచాడు.

అంత అబద్ధం మరొకటి వుండదనిపించింది తిమ్మికి. చేసిన తప్పుకితోడు అబద్ధంకూడా చెప్తున్నాడని తిమ్మికి కోపం ఉబికి వచ్చింది.

మక్కీడు ఓర్వలేక పోయాడు. ఏదోషమూ యెరుగని తన్ను నిందించు చున్నందులకు అతనికి చాలా విచారమూ, రోషమూ కలిగింది. దాంతో, నాలుగు చీవాట్లూ పెట్టాడు తిమ్మిని. అంతకంతకు పెద్ద గల్లంతుగా తేలింది. అప్పుడు ముసలి పురోహితుడొకడు ఆత్రోవను పోతూ, వీధి తలుపు తీసి వుండడంవలన, యింటిలో యేదో గల్లంతుగావుంది చూచిపోదామని లోపలకు వచ్చాడు.

'ఏమిటీ గడబిడ? యీ దెబ్బలాట యేమిటి?' అని తిమ్మిని, మక్కీడునీ అడిగాడు పురోహితుడు.

'అయ్యా! నాభార్యకు పిచ్చి యెత్తినట్లుంది. ఈమె నామీద వట్టి నీలాపనిందలు వేస్తోంది.' అని తిమ్మి కేసి చూచాడు.

'బాబుగారు, నేనన్నదానిలో యేమీ అబద్ధంలేదండి. ఇదిగో చూడండి, యీయన యెవరిదో ఆడుదాని చిత్రమును దాచికొని మాటి మాటికి చూచుకుంటూ వుంటారు.' అంది తిమ్మి.

'నేను ప్రమాణంచేసి చెప్తున్నాను. నాదగ్గర వున్నబొమ్మ మా నాన్నగారిదిగాని యింకెవరిది కాదు.' అన్నాడు మక్కీడు దృఢంగా.

'సరే, ఎందుకీ వాదం? ఏదీ, ఆ బొమ్మయేదో యిలా యివ్వండి, నేను చూస్తాను.' అని పురోహితుడు మధ్యవర్తిత్వం చేయబోయాడు.

అద్దాన్ని పురోహితుడి చేతులోపెట్టారు దంపతులు.

పురోహితుడు అద్దానికేసి తేరిపారి చూచాడు. అది చూడ్డంతోనే ఆతనికి ఆశ్చర్యం, గౌరవమూ, భయమూ, ఒక్కసారి కలిగాయి. అందులో కనుపడ్డ బొమ్మకి సగౌరవంగా నమస్కారంపెట్టాడు. ఆ నమస్కారాన్ని అబొమ్మ ప్రతి నమస్కారంతో అందుకొంది. తిమ్మినీ మక్కీడునీ చూచి పురోహితుడీలాగన్నాడు. 'దీనివిషయమై మీకేమీ వాదం అవసరంలేదు. ఇంక శాంతించండి యిద్దరూకూడా. మక్కీడూ, యిది నీ తండ్రి బొమ్మాకాదు, స్త్రీ ముఖమూకాదు, ఇది యెవరో ఒక మహానుభావుడగు పురోహితుని బొమ్మ. ఇది నేను తీసుకొనివెళ్లి నాపూజా మందిరములో దాచుతాను.'

పురోహితుడప్పుడు వాళ్ల నిద్దరనూ ఆశీర్వదించి, యింత గడబిడకూ మూలకారణమైన అద్దాన్ని పట్టుకు వెళ్లిపోయాడు.

అభ్యుదయము

చిరుకరి వెలుగుల
దినపతి బింబం
తూరుపు దెసనే
పొడిచింది.

వెలివెలి చీకటి
చిటుక లోనసే
ప్రొద్దు వెలుగులో
కరిగింది.

మానిని కోరే
మానవలోకం
నీతి హీనతలో
నమసింది.

మహిళల వలచే
మాన్యప్రపంచం
మహామహి తినే
లేచింది.

ప్రకృతి భాగ్యం
ప్రణయ ప్రభావం
తెలుసుకు
తెలిపే
భావౌన్నత్యత
ప్రబలింది.

పైపై రంగుల
వర్ణన చేసే
ప్రాత జబ్బులీ
క్రొత్త సొబగులో
అణిగేయి.

నవ కవులారా!
యువ నటులారా!
నవ్య మహూదయ
పాంచ జన్యమున
సుస్వర శ్రుతిలో
భావగీతికలు పాడండి
ప్రణయ నాటికలు ఆడండి.

భావ గీతికల
హృద్యారావములు
ప్రణయ నాటికల
లాస్య భాగములు
పాంచ జన్యపూ
పంచమ స్వరమూ
విశ్వం నిండాలి.

దెసలను దాగొను
వేలుపు పెద్దలు
ఎదుటికి రావాలి.

—శ్రీమతి జయంతి లక్ష్మీమంగతాయి.



తూర్పుఖండంలో జపాను తిరిగి యుద్ధపుచిచ్చు ముట్టిం
చింది. జపాను బాంబులకు గురియై ఇల్లు మొదలైనవి
సర్వనాశనముకాగా, కన్నబిడ్డతో నిలువ నీడలేక అల్లా
డుతూవున్న నిర్భాగ్య చీనా మాత.

బొంబాయిలోని చికిత్సక్ సమూహ విద్యాలయంవారు బొంబాయి యువతులకు, యుద్ధంలో దెబ్బలు తిన్నవారికి వైద్యసహాయం చెయ్యడంలో తరిఫీదియ్యడమే కాకుండా, మిలటరీ శిక్షణకూడా ఇస్తున్నారు.

కళాకలాపము

కళలు - వాటిఉత్పత్తి - వికాసము

శ్రీమతి కె. సుగుణమణి

★ కళోత్పత్తి

విశ్వమానవ వికాసములో మానవుఁడు దిగంబరత్వమును వీడి, పశుప్రాయత్వమును దాటి, పర్ణములను, ప్రకృతివస్తువులను తన శరీరాలంకారమునకు జీవితసౌకర్యమునకు వినియోగింప నారంభించిననాడే 'కళలు' సాకారమును దాల్చినవన్నమాట. అనాగరికుఁడగు అడవిమనిషి చెకుముకిరాళ్లు, విల్లమ్ములు, పనికరములు, ఆహారవిహారములు, క్రమముగ మోటుతనమును వీడి నాజూకులైనవి. అతని భావప్రకటీకరణకు అంగసైగలు, కరసంజ్ఞలు నశించి శబ్దోచ్చారణ యేర్పడినది; అనంతరము అక్షరసృష్టి ఆరంభమై వాఙ్మయము జనించినది; తన్మూలమున నాగరికత ఆరంభమైనది. ఈ భాషోత్పత్తి, లిపిజ్ఞానములవలన మానవుని మానసిక వికాసమునకు అపూర్వమైన దోహదమేర్పడినది. ఇక మానవుఁ డార్జించిన జ్ఞానము లిఖితరూపమున భద్రపరచబడి తరతరములుగా వ్యాపించు మార్గమేర్పడినది. మానవుని ప్రజ్ఞ ప్రబలి, ప్రాణికోటిలో నతని ప్రాధాన్యము, ప్రభుత్వము స్థాపింపబడినది. అదివరకు ఆహారసాకరణకే తిరుగాడు మానవునకు అవకాశ సావకాశములు లభించినవి; మానసవికాసమునకు తగిన ప్రాపుగలిగినది. తన జ్ఞానేంద్రియ కర్మేంద్రియములకు మనస్సును (బుద్ధిని) జోడిచ్చి, మానవుఁడిఁక పంచభూతాత్మకమైన ప్రపంచమునేగాక, పిపీలకాది బ్రహ్మపర్యంతరముగల ప్రకృతిని, ప్రకృతిధర్మములను, పరిశోధింప దొరకొనెను. విశ్వవిహారము సల్పగల మనస్సుచే విశ్వమును గాలించి, విశ్వనిర్మాతను, తన్నునుగూర్చి చింతింపజొచ్చెను. ప్రకృతిని వీలైనంతవరకు తన సౌకర్యమునకు వినియోగింప యత్నించి, ప్రకృతివస్తువులను, శక్తులను, తనకు ఆనంద ఆహ్లాదములు గూర్చువానిగా జేసికొనవలెనని కృషిసల్పెను. ఈ కృషి, యత్నములయొక్క ఫలితమే మన మిప్పుడు గాంచుచున్న 'విద్యలు', 'కళలు', 'శాస్త్రపరిశోధనలు', 'నాగరికత' మున్నగునవన్నియును.

★ కళావికాసము

ఈ కళావికాసక్రమమునకును మానవుని శరీర, మానసిక, ఆధ్యాత్మిక వికాసక్రమమునకును సన్నిహితసంబంధమున్నది. ఆదిని శరీరపోషణ, సౌకర్యములకై వలయు వస్తువులగూర్చియే మానవుఁడు చింతించి necessity is the mother of invention అన్న చందమున వానిని వుత్పత్తి చేసికొనదొడఁగెను. కాని మానవునకున్నది ఒక్క శరీరమేగాక మనస్సు, ఆత్మయుగూడను. పశు పక్షి మృగాదులవలె నితఁడు ఆహార, నిద్ర, సుఖవాంఛలతో సంతుష్టిపడి యూరకుండలేకుండెను. భౌతికశరీరపోషణ అభివృద్ధులకు, ఆహారమెట్లావశ్యకమో అట్లే మనస్సునకును (వేరొకవిధమైన) ఆహారమావశ్యకమైనది. వివిధవిద్యలు,

పరిశ్రమలు, కళలు, ఊహలు, ఉద్యమములు, ప్రేమభావము, దైవచింతన మున్నగునవి యీ మానసికాహారములు. మానవుని ఆత్మ అందలమున కెగిరి చిందులుద్రొక్కు నైజగుణముగలిగి, విశ్వవిహారమొనర్చి, విశ్వమును తనలో నిముడ్చుకొనజూచు స్వభావముగలది. ఆత్మకు ఆధ్యాత్మిక చింతన, ప్రేమభావము, దైవభక్తి అత్యంతావశ్యకములు. అందులకే 'నిరాహారినై దినములు బ్రతుకగలను గాని దైవప్రార్థనలేక క్షణకాలము మనజాల'నని గాంధీమహాత్ముఁ డొకచో వాక్రుచ్చెను. "Man does not live by bread alone" అన్న జీసస్ పల్కులకివి వన్నెదెచ్చుచున్నవి.

★ వ్యవసాయిక కళలు

ఆదిని మానవుఁడు తన శరీరపోషణ, సౌకర్యములకై సృష్టించుకొనిన కళలే వేట, వ్యవసాయము, పాశుపాల్యము, నేత, మృత్కర్మము, దారు, లోహకర్మములు మున్నగునవి. మానవుఁడు నాగరికుడైన కొలది, వేట తగ్గి 'వ్యవసాయము' ప్రాధాన్యతలోనికి వచ్చి, నాటికిని నేటికిని ముఖ్య కృషియు, మాతృకృషియునైనది. పూర్వము ఆర్యులు గోగణములను సాకుచు, సస్యములను పైరుజేసికొనుచు, ధాన్య, కందమూల, వన్యఫలములతో జీవించుచు, జీవితకాలమును జ్ఞానార్జనకై వినియోగించుచుండెడివారు. తమ సస్యములు, పశుగణములు సర్వజీవరాసులు చక్కగ సాకబడందులకై సూర్య, ఇంద్ర, వరుణాది దైవములకు వీరలు గావించు ప్రార్థనలు ఋగ్వేదమున గానవచ్చును. ఆధునికకాలమున "Oh, God, give us our daily bread" అని ముక్తిని విడచి భుక్తికొరకై ప్రభువును వేడు ప్రార్థనలును, జ్ఞానార్జనను మరచి ధనార్జననే ప్రధానముగ బెట్టుకొని సాగించు 'కళలు'ను, పాశ్చాత్య నాగరిక సోదర సోదరీమణులకడనే గాక ప్రాచ్య అనాగరిక సోదర సోదరీమణులకడను, విద్యావిహీనులగు దీనులకడను, విద్యాధికులగు మన నిరుద్యోగులకడను గూడ గాంచగలము!

★ ఆత్మానందమే ప్రధానముగాగల కళలు

వ్యవసాయిక కళలను సృష్టించినవెనుక మానవుఁడు క్రమముగ మానసికానందమే ప్రధానముగాగల కళలగు ఇతిహాస, ఆగమ, కావ్యాలంకార నాటకరచనలు, చిత్రలేఖనము, గానము, కవిత్వము మున్నగు కళలనన్నిటిని సమకూర్చెను. వీటితో చతుష్షష్టికళలు పూర్తియైనవి. వీటి నామములు 1939 జూలై 'గృహలక్ష్మి'లో నీయబడినవి. 'కళ' యనఁ మానవునిలో అపూర్వభావములను కలిగించునది. హృదయములను భావోద్రిక్తము లొనర్చుటయే కళకు స్వభావము. ఆంగ్లకవి షేక్స్‌ఫియర్ గూడ ఒక సందర్భమున నిట్లే వచించెను. అతనికి "Tongues in trees, books in running brooks, sermons in stones, and good in everything" గోచరించునట! ఈ వాక్కుల యథార్థము కవులకు, కళారాధకులకు పూర్తిగా నెరుకయే. చిన్న ఉదాహరణగూడ గైకొందము. కళామయ ప్రకృతియొక్క సందర్శనమువలన కళారాధకునకు భావపరంపర లుదయించి, అవర్ణనీయమగు అనుభూతి (feeling) గా మారి, అపూర్వమగు ఆత్మానందము నొనగూర్చును. ఈ ఆనందము నితరులకును కలిగించవలెననెడి ఆతురత మానవసహజమైయున్నది; గనుకనే ఆదిమహాకవులు మొదలు ఆధునిక భావకవులవరకు కవిత్వములు వ్రాసిరి; చిత్రకారులు చిత్తరువులు వ్రాసిరి, శిల్పులు రాళ్లకు జీవముపోసిరి; తదితర కళోపాసకులు కళావస్తువులను సృష్టించిరి. మనోహరమగు సూర్యోదయదృశ్యమును ఒక (i) కవి, (ii) చిత్రకారుడు, (iii) పాశ్చాత్య photographer కూడ గాంచినారనుకొందము. మువ్వురకును భావోద్రేకము, అనుభూతి, ఆనందము, ఆ ఆనందమును నొక్కయితరులకును కలిగించవలెననెడి ఆతురత జనించును. (iii) Photographer టిక్కున camera ను నొక్కి

ఆదృశ్యము పట్టి మన కట్టెదురబెట్టును. అందు జడప్రకృతియే మనకు గోచరించినను దానివలన మనకును కొంత ముదమొనగూడును. కాని యిందు ప్రకృతియే తనపనిని తాను గావించినది. ఫోటో తీసినది వెలుగు (light) యొక్క సహజగుణముగాని కేవలము photographer యొక్క ఘనత, మానసికవృత్తి గాదు. ఒక పెద్ద 'కళ'గా భావింపబడవలసిన ఘనత యిందు అంతగనుండదు. ఇట్లే యంత్రమే ప్రధానముగాగల తదితర పెక్కు పాశ్చాత్య 'కళలు' గూడను. (ii) చిత్రకారుఁడన్ననో ఆ అనుభూతిని జీర్ణముజేసికొని, ఆదృశ్యమును తొలుత తన హృదయఫలకమున జిత్రించుకొని, అటనుండి దానిని రంగులతో పత్రముపైకి దెచ్చి, మనకా ప్రకృతిసౌందర్యమును చవిజూపును. ఇందు సహజవర్ణములతో విరాజిల్లు చిత్రమునేగాక చిత్రకారుని సామర్థ్యమును, కృషిని, నైపుణ్యమును, కళకళలాడు ప్రకృతిశోభను గాంతుము. (i) కవి మనస్సునందును ప్రకృతిసందర్శనమువలన నిశితైక్యముతో భావానుభూతి జనించును. Photographer కు కానరాని సౌందర్యమెంతయో అతనికి గాన్పించును; ప్రకృతి అతనితో సంభాషించును. ప్రకృతిరమణీయకము తోబాటు అనేక అపూర్వవిషయముల నాతడు గ్రహించి, వానికి జీవముపోసి ఒక పద్య, లేక గద్యరూపమున నాదృశ్యమును, అంతియేగాక దానివలన తాను పొందిన భావానుభూతినిగూడ మనకు ప్రసాదించును. ప్రకృతి అతని మానస అద్దమునుండి ప్రతిబింబించి వాక్కులేక శబ్దరూపముదాల్చి, మనకు గోచరించును. 'తల్కుటద్దములు సత్కవుల మనసు' అని అందులకే అనియుండిరి.

★ కళ దేనికొఱకు ?

కళలన్నియు 'ఆత్మానందమే' ముఖ్యాశయముగాగలవి. కొందరు కళలు ప్రచారమున కనవచ్చును. కొందరు కళోపాసకులు యశఃకాములు కావచ్చును. ఒక గాయకుని గాని, చిత్రలేఖకునిగాని, కవినిగాని నీకీపాట, చిత్రము, కవితలల్లుట వలన నేమిలాభమని కొందరడుగవచ్చును. ధనార్జనమే జీవితాశయముగ దోచు నీ దినములలో నిట్టివారును కలరు. దీనికి జవాబు They are their own reward; వాటికవియే బహుమతి అని. అయా కళారాధకులకు తమ కృషివలన గలిగిన ఆత్మానందమును రూకలలో గణకట్టజూచుట మూర్ఖత్వము. ఆ యాత్మానందమే వారలపేక్షించునది; అపేక్షింపవలసినదియును. కాని విశేషముగ కవులు, కళారాధకులును ఏ ప్రభువునో ఆశ్రయించి మాన్యములు గైకొని తమ కళానైపుణ్యములను విత్తమునకు విక్రయించినవారలే యైరి. కళారాధకులకు చిరకాలముగ నీ దోష మాపాదింపబడినది. ఆదిమహాకవులు మొదలు ఆధునిక కళారాధకులందరు యీ మార్గమునే అనుసరించి 'నిరాశ్రయాఃనశోభంతే పండితా వనితా లతా' యని బల్కజొచ్చిరి. ఈ మార్గమును త్రికరణశుద్ధిగా నిరసించి కేవలము కవిత్వ కళారాధనకే బూనుకొని 'జననంబున్ సఫలంబుఁ జేసెదఁ బునర్జన్మంబు లేకుండగన్' అని సంకల్పించిన మహనీయుఁ డింతవరకు ఒక్కడే గలడు. ముముక్షువుల గణములో ధృవుని నామమై నక్షత్రము శాశ్వతముగా వెలసినట్లు యీ మహనీయుని నామాక్షరములు, వాక్కులు సువర్ణాక్షరములలో కళారాధకుల ప్రపంచమున ఆచంద్ర తారార్కముగ నుండునట్లు అతనివలననే లిఖింపబడినవి. చూడుఁడు—

'ఇమ్మనుజేశ్వరాధములకిచ్చి పురంబులు వాహనంబులున్
సొమ్ములుఁ గొన్ని పుచ్చుకొని చొక్కి శరీరమువాసి కాలుచే
సమ్మెటపే్రటులంబడక సమ్మతితో హరికిచ్చి చెప్పె నీ
బమ్మెర పోతరాజొకఁడు భాగవతంబు జగద్ధితంబుగన్.'

'బాలరసాలసాల నవపల్లవ కోమల కావ్యకన్య కం
గూళలకిచ్చి యప్పడుపుఁగూడు భుజించుటకంటె సత్కవుల్
హాలికులైననేమి గహనాంతర సీమలఁ గందమూలగౌ
ద్దాలికులైననేమి నిజదార సుతోదర పోషణార్థమై.'

ఈ మహోత్కృష్ట వాక్యములు వచించుటయేగాక, వానిని అక్షరముల ఆచరణలోఁబెట్టి చూపిన ఈ కళోపాసకుడు కళోపాసకులందరికి తలమానికమై, ఆదర్శకుడై, వందనీయుడై, పూజ్యుడై యలరారవలసినదే! ఇందు 'సత్కవుల్' అన్న పదమునకు బదులు 'కళారాధకులు' అన్న అర్థమునిచ్చు పదము బెట్టుకొన్నచో నీ పల్కులు సర్వజనులకు (కళోపాసకులకు) అన్వయించగలదు. కళయొక్క ఉన్నతాశయము ఆత్మకు ఆనందము చేకూర్చుట, మానసికాభివృద్ధికి తోడ్పటుట యని నిస్సంశయముగ జెప్పవచ్చును. దాని వలన ఆర్థికలాభము చేకూరినను నిజమగు కళోపాసకుడు స్వీకరింపడని పోతన జీవితము చాటుచున్నది.

ఈమాదిరి అపూర్వ 'ఐహికవస్తు నిరసన', 'కళోపాసన' 'కవితారాధన' 'దైవభక్తి' పోతన వంటి మహదాశయములుగల మహనీయునకే చెల్లినవి. ఆ మనోనిశ్చయము, స్వతంత్ర జీవనాభిలాష, కళాపిపాస, ఆధ్యాత్మ చింతన, అత్యంత ప్రశంసనీయములు. 'అడిగిన నౌఖరినీయని మిడిమేలపు దొరనువేడి, మిణుగు' ప్రజాసందోహములకు, 'వడిగల యెద్దులగట్టుక మడిదున్నుక బ్రతుకవచ్చు మహిలో' నన్న వేమనార్యుని పల్కులును, 'హాలికులైననేమి నిజదాగ సుతోదర పోషణార్థమై' యన్న పోతనామాత్యుని పల్కులును యెంతయు మార్గదర్శకములు. కాని ఆధునికులు 'ఏడువగలిగినచో వ్యవసాయము చేయు' మని బల్కు ప్రవీణులు. ఏడువవలసినదే గాని, ఏడ్చుట వ్యవసాయము చేయనేరక కాదు; 'రత్నగర్భము', 'విద్యాపీఠము', 'కల్పవల్లి' అనిపించుకొనిన దేశములో పరిస్థితులు, ప్రజలు, విద్యలు, ప్రజల మానసిక ప్రవృత్తులు యీరీతిగ పరివర్తన నందినందులకు. మాతృకృషియగు వ్యవసాయమువలన నీ రోజులలో జీవనోపాధి గడువకపోవుటకు హేతువులు 'నాగరికత' యనిన ప్రజలకుండు అభిప్రాయము ఒకటియు, పాశ్చాత్య ప్రభువుల ప్రభుత్వము వేరొకటియును.

పిచ్చుకల గూఁడు

కాలవశమున మా పర్ణశాలలోన పిచుకలొకరెండు గూటిని పెట్టియుండి
చల్లగా, ప్రక్క మందార చెట్టులోన పాటుపడి కట్టుకొన్న యాగూఁటిలోన
జీవయాత్రను గడపుచు, జెలఁగుచుండ వరప్రమాధిని వైశాఖ బహుళమందు
విష్ణుదిన భానువాసర విమలనిశిని మ్రానుపిల్లి యొక్కటి దీక్షఁబూని కండ్లు
కానజాలని పిచ్చుక స్త్రీనిబట్టి చంపితినిపోయె జముదూత చందమునను
చివుకుమనె మది, గూఁడును చిన్నవోయె వగలఁ బొగలుచు మగపుల్గు దిగులు నొంది
దానితోఁడను గూఁటిని తాను విడచి అచ్చటచ్చట కూర్చుని యడలుచుండె.
ఒక్కవారము దనుక నా వరుసనుండి యెటులఁ బోయెనో యాజాడ నెరుఁగరాదు
అంతలో వానిసంసార మంతరించె పక్షులందును క్రిములందు పశువులందు
జంగమస్థావరాత్మక జగతికెల్ల భువన మందిర దీప విస్ఫురిత కాంతి
కాంతగాకున్న నన్యంబుగల్లదె తలప; కళలు వెదజల్లు సృష్టికి కారణంబు.

—శ్రీమతి కొరప్రోలు వెంకటరంగమ్మ

"ఈ మాత్రము శ్రద్ధవహించిన మీ ముఖమునకు కోమలత్వము నిక్కముగా చేకూరును"

మీ ముఖ సౌందర్యమునకు మృదుత్వము, శుభ్రత చాలా అవసరము. ఇట్టి సౌందర్యము ప్రతి స్త్రీయును పొందగలదు. ముఖ కాంతిని నిర్లక్ష్యము చేయవద్దు. నిత్యము సామాన్యపు శ్రద్ధవహించిన మీ ముఖమునకు ఇదివరకెన్నడు కానబడని కోమలము, కాంతి, అందమును ఇచ్చును.

నిత్యము ఉదయమును, రాత్రియును కొంచెము "పాండ్స్ కోల్డ్ క్రీము"ను ముఖమునకు మర్దనచేయుడు. దానిలోనుండు శుభ్రపరచు తైలము మీ చర్మరంధ్రములలో జొరపడి పేరుకొనిన మురికినంతను నిర్మూలనముచేసి చర్మమును శుభ్రపరచును. మెత్తని గుడ్డతోగాని, లేక "పాండ్స్ ఫేస్ టిష్యూ"లతో గాని తుడిచివేయుడు. అదేమాదిరి రెండవతూరి చేయుము. రాత్రివేళ మరికొంచెము ఈ క్రీమును ముఖమునకు పూసి ఉదయమువరకు అట్లే ఉంచుము.

పగటివేళ ఎండ తాపము, వేడి గాలినుండి రక్షించుకొనుటకై "పాండ్స్ వ్యానిషింగ్ క్రీము" నుపయోగించుడు. అది జిగటలేనిది; మరియు పౌడరు వేయగానే అతుకుకొని పోవును.

మీ ముఖకాంతిని కాపాడుటకు తక్షణమే "పాండ్స్ క్రీము"ల నుపయోగింపుడు. రెండు వారముల తరువాత మీ చర్మము కోమలముగాను, కాంతియుతముగాను, అతి మృదువుగా నుండుట చూచి మీరే ఆనందించగలరు.

పాండ్స్ కోల్డ్ క్రీమ్: చర్మమును చాలా నిర్మలముగను మృదువుగ నుంచును. రాత్రియందు, ఉదయమందు దీన్ని ఉపయోగింపుడు.

పాండ్స్ వ్యానిషింగ్ క్రీమ్: ఎండ తాపము, వేడి గాలినుండి మీ చర్మమును జాగ్రతపరచును.

పాండ్స్ క్రీమ్

ముఖ సౌందర్యమునకు పాండ్స్ క్రీములు

పరివర్తనము

★ శ్రీ భాస్కర్ల కృష్ణారావు ★

'రాధా! నా పాంటెన్ కలం ఎవరు పాడుచేశారు యిల్లా?'

'..................'

'రాధా!'

'ఆఁ! వొస్తున్నా'

భర్త తీవ్రమైన అరుపులకి కారణం తెలియక కొంచెం కళవళపాటుతో నారాయణరావుగారి గదిలో ప్రవేశించింది రాధ. భార్య గది గుమ్మంలోకి రాగానే వొళ్లుతెలియని వీరావేశంలో మళ్లీ అదే వరసని అందుకున్నాడు నారాయణరావు.

'నీకోసం ఎన్నిసార్లని అరవాలి?'

'పెరట్లో కప్పులు కడుగుతున్నానండీ—పనితొందరలో మీ పిలుపు వినపడలేదు.'

'నీకు మరీ పరాకు ఎక్కువఅయింది. పిలుస్తుంటే మనిషిని కాననుకున్నావా? ఈ కలం ఎవరు పాడుచేశారు యిల్లా?'

'ఏమోనండీ, నాకేం తెలియదు, ఉదయంమాత్రం పిల్లలు ఈ గదిలో ఆడుకుంటూవుండగా చూచాను.'

'ఉదయం పిల్లలు ఎక్కడ ఆడుకున్నది నిన్నడగటంలేదు. ఈ కలం ఎవరు పాడుచేశారని నిన్నడగటం'

'పిల్లలు ఏమైనా తీశారేమొ కనుక్కున్నారా?'

పైవాక్యం వెలువడిందే తడవుగా నారాయణరావు గదంతా 'సుసీ', 'సుసీ' అన్న కేకలతో నిండిపోయింది.

సుసి మరుక్షణమే నాన్నగారి కోపానికి కారణం తెలియక బేలమొహంతో గదిలో ప్రవేశించింది.

'నా గదిలో అల్లరిచెయ్యొద్దని మీకు ఎన్నిసార్లు చెప్పాను?'

నాన్నగారి పైప్రశ్నకి సుసి కళ్లల్లో అమాంతంగా నీళ్లుతిరిగాయి. జవాబు చెప్పటానికి నోటిమాట పెకల్లేదు. ఎండిపోయిన చిరుపెదిమెల్ని నాలిక చివరతో తడుపుతూ, నిశ్చేష్టురాలై జవాబుగా కళ్లు నులుపుకోవటం మొదలెట్టింది సుసి.

'ఈ కలం నువ్వు తీశావా?'

లేదన్నట్లు తలూపింది...

'తమ్ముడేమైనా తీశాడా?'

జవాబులేదు...

'జవాబు చెప్పవేఁ?'

సుసి ఈమారుకూడా జవాబు చెప్పలేకపోయింది...

సుసి మౌనానికి నారాయణరావు ఉగ్రుడైపోయినాడు. కళ్లెర్రజేసి, ఒళ్లు తెలియకుండా ఆ అమ్మాయిని సమీపించి ఆ గదిలో వాహమూలకి వున్న చేతిబెత్తాన్ని అందుకొని బాదటం మొదలెట్టాడు. సుసి కిక్కురుమనకుండా, పొంగి పొర్లుతూ వొస్తూవున్న దుఃఖాన్ని దిగమ్రింగి 'కలం నేను తీయలేదు. నాన్నా కలం నేను తీయలేదు' అన్న అమాయకపు అరుపులతో ఆ అత్యాచారాన్ని సహించింది.

'తమ్ముడేడీ?'

రెండునిమిషాల తరువాత అడుగుతో అడుగు వేసుకుంటూ, ముకుళించిన మొహంతో మూడేళ్ళ కూన 'మురళి' నగ్నంగా గదిలోకి ప్రవేశించాడు.

'ఈ కలం నీవు తీసావా?'

అవునన్నట్లు తలూపాడు. పసిపిల్లలకి అబద్ధాలాడటం తెలియదు. వాళ్లకి అజీర్ణవాస్తువలకి మల్లే అసత్యంకూడా వొంటబట్టదు. నారాయణరావు తన కోపం ఆసాంతం ఇంతకుముందే సుసిపైన తీర్చుకున్నాడు. పడకకుర్చీలో పడుకున్నపాటుని ఆ కలాన్నే పుచ్చుకుని విసిరికొట్టాడు మురళి మొహంమీద.

మురళి సుసికి మల్లే దుఃఖాన్ని దిగమ్రింగటం తెలియక బోరుమని ఏడుస్తూ గదిలోంచి వెళ్ళిపోయినాడు.

* * *

నారాయణరావు ప్రథమ కళత్రం ఈ లోకాన్ని విడిచి షుమారు మూడుసంవత్సరాలయింది. కమలను నారాయణరావు ఆమె బ్రతికివుండగా అమితంగా ప్రేమించాడు. ఆ రోజుల్లో 'ఆమెతోడిదే ఈ లోకమన్నట్లు' నడుచుకోవటంవల్ల నారాయణరావు భార్యావిధేయుడనికూడా ప్రజల్లో ప్రతీతి అయింది.

మొదటిభార్య ఈ లోకాన్ని విడిచిందే తడవుగా నారాయణరావుకు సంబంధాలు రావటం మొదలెట్టాయి. కమల ప్రేమని అంత తొందరలో మరిచి, మళ్లీ వివాహానికి సిద్ధపడటమంటే ఆతనికి మొదట్లో మనస్కరించలేదు. చిన్నవయసులో వున్న నారాయణరావు, తనకోసం కాకపోయినా, పసిపిల్లలకోసమైనా మళ్లీ వివాహం చేసుకోవటం శ్రేయస్కరమని బంధువులంతా సలహాయిచ్చారు. నారాయణరావుకు కొంత వరకు వాళ్ల సలహా న్యాయసమ్మతంగానే గోచరించింది. వొంటరిగా పిల్లలతో కాపురంచేయటమంటే కష్టసాధ్యంగానే కనపడింది.

ఈ విషయాలన్నీ నారాయణరావు మనస్సుని బాగా కలతపెట్టాయి. పిల్లల బాగోగుల్నిబట్టి వివాహం చేసుకోవటమే అతనికి అప్పట్లో విద్యుక్తంగా కనపడింది. తత్ఫలితంగా చివరకి రాధని పరిణయమాడాడు.

* * *

ఆరోజు రాత్రి నారాయణరావు గదిలోకి పడుకోవటానికి వెళ్లేసరికి పిల్లలు యింకా నిద్రపోకుండా పక్కలమీద కూర్చునే వున్నారు. అంత రాత్రిదాకా పడుకోనందుకు కొంచెం విసిగి, పడుకొమ్మని పిల్లల్ని మందలించి, తనపక్క సమీపించాడు నారాయణరావు. వెళ్లి పక్కమీద మేనువాల్చిందే తడవుగా అతనికి సుఖంగా నిద్రపట్టింది.

రాత్రి పన్నెండింటికి గావును నారాయణరావుకు మళ్లీ మెలుకువ వొచ్చింది. నిద్రమాంద్యవల్ల ఎంతరాత్రి అయిందో అతనికి తెలియలేదు. కిటికీలోంచి బయటికిచూస్తే అర్ధచంద్రుడు వాయువేగంగా మబ్బులోంచి పరుగెత్తుతూవున్నట్లు అతనికి కనపడింది. నెమ్మదిగా కదిలి, తనమీదవున్న రాధ చేతుల్ని పక్కకు వత్తిగించి, ఎడమపక్కని మళ్లేసరికి పిల్లలు కిక్కురుమనకుండా పక్కలమీద కూర్చునివున్నట్లు పొడకట్టిందాతనికి. రెండునిమిషాలు ఆలోచనారహితంగా వాళ్లవేపు నిదానించి చూచాడు నారాయణరావు.

సుసి తమ్ముడిముందు కూర్చుని మురళికంటికి ఆవిరిపెడుతోవుంది. మొదట్లో మురళి కంట్లో నలుసు యేదో పడివుంటుందనుకున్నాడు నారాయణరావు. కాని వొకనిమిషం తదేకదీక్షగా ఆ కంటివేపు చూచేసరికి కన్ను అమితంగా పొంగినట్లు కనపడిందాతనికి.

'మురళీ! ఏమయిందమ్మా కంటికి?'

నారాయణరావు ధ్వని వినపడగానే సుసి కొంచెంగా వులికిపడి ఏమీతెలియనట్లు పడుకోవటానికి ప్రయత్నించింది. కాని అంతలోకే నారాయణరావు పిల్లల్ని సమీపించి 'భయంలేదులే తల్లీ! లేచి కూర్చో' అని లాలించటంతో సుసి కొంచెం ధైర్యంతెచ్చుకుని మళ్లీ లేచి కూర్చుంది.

నాన్నగారి లాలనకి మురళి అమాంతంగా కళ్లవెంబడి నీళ్లుపెట్టుకున్నాడు. నారాయణరావు దిగులుగా మురళిని వొళ్లోకి తీసుకుని ధోవతి కుచ్చెళ్లతో కన్నీళ్లు తుడిచాడు. మురళి దుఃఖం నాన్నగారి బుజ్జగింపులకి అంతకంతకు మరీ ఎక్కువయింది.

'నాన్నా! ఏమయిందే నీకంటికి?'

మురళికి తన బాధనిగూర్చి తండ్రికి చెప్పుకోవటంకూడా చాతకాలేదు. మురళికి యితరులని అర్థం చేసుకోగల శక్తిమాత్రం కలిగింది గాని తన మనోగతభావాల్ని యితరులకుమాత్రం స్పష్టంగా వ్యక్తపరిచే జ్ఞానం యింకా కలగలేదు. ఆ మాటలురాని పసికూనకి కంటికేదో నెప్పి అయింది అని చెప్పటంకూడా దుర్భరమయింది.

మురళి అవస్థ నారాయణరావుకి సునాయాసంగా వ్యక్తమయింది. మళ్లీ మురళిని ప్రశ్నించటంవల్ల లాభంలేదని తెలుసుకుని 'సుసీ! ఏమయిందమ్మా తమ్ముడి కంటికి' అని పక్కనున్న అమ్మాయిని రెట్టించి అడిగాడు. సుసి మొదట్లో నిజంచెప్పటానికి జంకింది. కాని నారాయణరావు 'భయంలేదులే' అని హామీ యిచ్చేసరికి ఆ లేతహృదయానికి యెక్కడలేని ధైర్యం కలిగింది.

'నాన్నా! పొద్దున్నే, కలంతో నీవు కొట్టలే...'

నారాయణరావుకు అంతా అర్థమయింది. ప్రొద్దుటి దృశ్యం సినిమాకి మల్లే వొక్కమాటు కళ్లముందు తిరిగింది. ఉదయం పిల్లలపట్ల అంత అమానుషంగా, క్రూరంగా ప్రవర్తించినందుకు లోలోపల తన్ను తానే నిందించుకున్నాడు. పిల్లలు 'అనాథలకు మల్లే' బ్రతకటంచూచి అతని హృదయం తరుక్కుపోయింది.

'కమలమీది అవ్యాజమైన ప్రేమకి యిదా ఫలితం అన్న వొక్కప్రశ్న ఆతని హృదయాన్ని దహించటం మొదలెట్టింది.

మరుక్షణంలోనే యిద్దరి పిల్లల్ని చెరో చంకని యెత్తుకుని తనపక్కని తిన్నగా చేరుకున్నాడు నారాయణరావు. మళ్లీ అదే ప్రశ్న. హృదయంలో చెప్పరాని బాధ అంకురించింది. ఆ బాధ నివారణానికి అప్పట్లో ఏమిచేయుటమో అతనికేమీ తోచలేదు. ఎంతో ఆలోచించాడు. ఏమీ పాలుపోలేదు. చివరకి వొక్కటే వొక్క మార్గం కనపడింది. అప్పట్లో అతనికి అదే యుక్తంగా తోచింది.

అప్రయత్నంగా పిల్లల్ని హృదయానికి గట్టిగా అదుముకున్నాడు. కొంత మనోశాంతి కలిగింది కాని హృదయానికి సంపూర్ణమైన సంతృప్తికాలా. ఆ పసిపిల్లల్ని అంతకంతకు తన హృదయంలో యిముడ్చుకోవటానికి ప్రయత్నంచేశాడు, కాని సాధ్యంకాలా. విఫలమనోరథుడై ఏదో అర్థిస్తున్నవాడికి మల్లే కమలవేపు రెండునిమిషాలవరకు ఏకాగ్రంగా చూచాడు. ఫోటోలోంచి కమల చిరునవ్వు నవ్వినట్లు కనపడిందాతనికి. ఆలోచనరహితంగా, సంతృప్త హృదయంతో వెనుదిరిగిచూచేసరికి రాధ ప్రేమపూర్వకంగా చిరునవ్వునవ్వుతూవున్నట్లు పొడకట్టింది. ఆ చూపులకి గొప్ప అపరాధికి మల్లే బాధపడి పిల్లల్ని మరీ దగ్గరికి తీసుకుని నిండుగా శాలువ కప్పుకున్నాడు నారాయణరావు. నిద్ర యెప్పుడు పట్టిందో, ఏమో అతనికే తెలియదు.—

హైందవాచారాలలో విజ్ఞానం

పేడ నీళ్లు
ముగ్గులు

వసంత

మానవునికి జ్ఞానోదయమైనప్పటినుండి ప్రకృతిని అర్థంచేసికొనడానికి నిరంతరంగా చేస్తూన్న కృషియొక్క ఫలితమే విజ్ఞానం. మేధావంతుల దృక్పథంబట్టి, పరిశోధనా విధానంబట్టి, వ్యక్తిగతంగాచేసిన సేవబట్టి విజ్ఞానవృక్షం శాఖోపశాఖలుగా పెరిగింది. సంఘాభ్యున్నతికి విజ్ఞానమెంతైనా అవసరం. స్వార్థ త్యాగబుద్ధితో 'సర్వేజనాస్సుఖినోభవంతు' అను సదాశయంతో విజ్ఞానులు పారంపర్యంగాచేసిన అమూల్యమగు సేవ మూలంగానే మనం నేడు అత్యంత సుఖజీవనం చేయగలుగుతున్నాం. రైళ్లమీద వేలకొలదిమైళ్లు శీఘ్రంగా పోగలుగుతున్నామంటే; నౌకలతో మహాసముద్రాలు తరిస్తున్నామంటే; పక్షివలె వాయుమార్గాన్న కడు త్వరగా ప్రయాణం చేయగలుగుతున్నామంటే; మనం మాట్లాడేమాటలు, వెలిబుచ్చే భావాలు లిప్తలో ప్రపంచాన్ని చుట్టపెట్టేటట్లు యంత్రాలు నిర్మింపగలిగేమంటే; నిర్జీవపదార్థంలో గుప్తంగానున్న దేవగానాన్ని యంత్రాలచే ఆలపింపచేస్తున్నామంటే; అద్భుత నటనాకౌశలాన్ని పదేపదే తెరమీద ప్రదర్శింపగలుగుతున్నామంటే ఇవన్నీ ఆదినుండి మానవజాతి మళ్లుకట్టి పెంచిన విజ్ఞానవృక్షంయొక్క ఫలాలే. కార్య సాధనానికి, హృదయాహ్లాదానికి, భావోత్తేజానికి మనంచేసే పనులన్నిటిలో విజ్ఞానముంది.

విజ్ఞానంలేని జీవితశాఖ నేడు కనుపించదు. గ్రాసం పండించడానికి, వృక్షసంతతి పెంపొందించడానికి, ఆరోగ్యప్రదమైన ఆహారం నిర్ణయించడానికి, మీటనొక్కి దీపం వెలిగించుకోడానికి, ఒకటికాదు, ఉదయంనుండి మరునాడుదయంవరకు మనంచేయు ప్రతిస్వల్ప కార్యానికీ విజ్ఞానమవసరమే !

పాశ్చాత్యవిజ్ఞానం కేవలం భౌతికంగా పెంపొందుతూంది. మన ప్రాచీనవిజ్ఞానం అధ్యాత్మికంగా విస్తరించింది. జీవితసుఖావాప్తికి వారు సృజించిన యంత్రాలతో, ఉపకరణాలతో భౌతిక విజ్ఞానులు జాతి మతభేదం లేకుండా మానవకోటినంతటిని ఆకర్షింపగలుగుచున్నారు. వ్యక్తిపరంగా గాని గుర్తింపబడని అధ్యాత్మజ్ఞానప్రతిభ, కాయక్లేశంతోగాని లభ్యంగానట్టి ఆత్మజ్ఞానాభ్యుదయం ఈ యుగంలో భారతీయులకే వెగటనిపిస్తున్నాయి. సుఖజీవనమే లక్ష్యంగాగల పాశ్చాత్యనాగరికతా వ్యామోహంలోబడి ప్రాచీన విజ్ఞానాన్ని, తుదకు తిరస్కరిస్తున్నాం.

కాని, సర్వజనులు సుఖమయజీవనం చేసికోడానికి వైజ్ఞానికంగా చక్కని దైనందినాచారాలు, మతధర్మాలు, సంఘనియమాలు ప్రాచీను లేర్పాటు చేసేరు. వాటి మూలభావం మనం గుర్తించలేక గుర్తించవలసిన బాధ్యత త్రోసిపుచ్చి, నిర్లక్ష్యంగా వాటి నతిక్రమిస్తున్నాం. అట్టి ఉల్లంఘనవల్ల వాటిల్లవలసిన అనర్థం తక్షణం కనుపించదు. అయినప్పటికీ, ఆ తిరస్కారభావం శారీరకంగా, మానసికంగా, నైతికంగా, ఒకటేమిటి సర్వవిధాలా మనలను క్రుంగతీస్తూంది. మన అధఃపతనం తరతరానికి హెచ్చయిపోతూంది. ఇప్పుడైనా తగిన శ్రద్ధవహించి ఈ అధోగమనాన్ని ప్రతిఘటించి ప్రాచీనౌన్నత్యం పునః ప్రతిష్ఠించాలంటే హైందవాచారాలలో భావం గ్రహించాలి, శ్రేయోదాయకమైన వాటిని అనుకరించాలి, వెఱ్ఱివెఱ్ఱి పోకిళ్లు మానుకోవాలి. వ్యామోహాంధకారం పటాపంచలు కావించుకొని అభ్యుదయ ప్రభాతమయేటట్లు ఏకముఖంగా

కృషిచెయ్యాలి. అప్పుడది జాతీయపునర్నిర్మాణంగా పరిణమిస్తుంది. అందులో సోదరీమణులు ఎక్కువగా పాటుపడవలసి ఉంటుంది. ముఖ్యపాత్రవారిదే అని చెప్పవచ్చునేమో!

ఏమంటే గృహస్థాశ్రమంలో సంసారలాభానికి, కుటుంబక్షేమానికి బాధ్యురాలు గృహిణి. ఆమె కించిద్దూరదృష్టితో, లోకజ్ఞానంతో సంసారం నడిపించిన పక్షమందు జీవనం ఆనందదాయకంగా ఉండడమే కాక, సంతానం సన్మార్గమవలంబిస్తారు. వెల్లివిరియు మాతృవాత్సల్యంతో నిజసంతతికి క్రమశిక్షణ యొసంగిన తల్లి భూలోకదైవమే. ఆమె సంతానం పరోపకారార్థం దేహప్రాణధనాలర్పించు స్వార్థత్యాగపరులౌతారు. అట్టి పౌరుషవంతమైన సంతానాన్నికన్న సతీమతల్లులు కొఁదవైనారు. కాబట్టి బాల్యంనుండి పుత్రీపుత్రులకు ఉన్నతభావాలు బోధించి నిరాడంబర జీవనంయొక్క ఉత్కృష్టతను ఎఱుకచేసి, స్వార్థత్యాగంయొక్క మహిమ తెలిపి, వారిని భారతవీరులుగా తయారుచేయు బాధ్యత సోదరీమణులపై నున్నది. అందులకు వారు అర్హులైఉండాలి. సదాచారాలు వారు పాటించి, పాటింపచేయాలి.

అనాదిగా వాడుకలోనున్న హైందవాచారాలు ఎంత శ్రేయస్కరమైనవైనా వాటి అంతరార్థం గ్రహింపలేకను, పరిచయాధిక్యంతో జనించు విముఖతచేతను వాటిని నిరసిస్తున్నామనేది నిశ్చయం. ఎంత స్వల్పమైన వాటి విజ్ఞానం జాగ్రతగా విమర్శించినా ఆ ఉదాసీనం పోతుందనుటకూడ నిశ్చయమే. ఏమనగా ఎంతో ఎక్కువైన ఆరోగ్యసూత్రాలే ఆచారాలుగా నిత్యవిధులుగా పరిణమించేయి అనవచ్చును. అట్టివి కొన్ని విచారిద్దాం.

ఉదయాన్ని లేవడంతోనే వాకిలిలో పేడ నీళ్లుజల్లి ముగ్గులు పెట్టుకొంటారు. అందులో రెండు విషయాలున్నాయి. ఆరోగ్యం, భూతదయ. రాత్రి వాకిట్లోను ముంగిల్లోను చేరిన క్రిములను నాశనంచేయ డానికి పేడ అవసరం. ఆ సూక్ష్మక్రిములను ఉదయాన్నే సంహరిస్తే వాటివలన అనారోగ్యం కలుగనేరదు. ప్రతిగృహంలో సులభంగా లభ్యమయేది సూక్ష్మక్రిములను హరించేది పేడ. కాని నాగరికసంఘంలో అది అసహ్యమైపోయింది. పట్టణవాసులు పేడనువాడరు. ఆమూలంగా అనారోగ్యదేవతను ఆహ్వానిస్తున్నారన్న మాట. ఇక ముగ్గుఅనగా అసలు బియ్యప్పిండివాడేవారు. ముగ్గులుపెట్టడం కేవలం అందానికేకాదు. అది కాకిపిచుక మొదలైన పక్షులకాహారం. నోరెరుగని పక్షులు ప్రతి ముంగిలిలోను కొద్దిగా పిండి సంగ్రహించు కొని తృప్తినొందడం ఆ గృహమేధులకు శ్రేయస్కరం. ఈ నవనాగరిక దినాలలో బియ్యప్పిండికి బదులుగా సున్నం ముగ్గువాడుచున్నారు. దానివల్లకలుగు ధనలాభం లేశంగాని, పాపం, అమాయకపు పక్షులనోటిలో మన్నుకొట్టడం, జరుగుతూంది. ఆరోగ్యసూత్రం భంగమయింది; భూతదయ అంతరించింది.

అయితే ఏదోకథ చెప్పినట్లు మూఢాచారంగా పరిణమించినట్టివి మాత్రం గుర్తించుకోవాలి. ఒక సోమయాజిగారింట్లో ఒకపిల్లి ఉండేదిట. ఆ పెంపుడుపిల్లి నివేదనకుపెట్టిన పదార్థాలు తినివేయకుండుటకు గాను సోమయాజి నిత్యాహ్నికములు నిర్వర్తించుకొనుటకు ముందుగా దానినొక రాటకు కట్టేవారు. వారి తరువాత తరంవారికి నిత్యాగ్నిహోత్రాలుపోయి దేవతార్చనే మిగిలింది. తండ్రిగారు పిల్లిని కట్టనిదే దేవతా రాధన ప్రారంభించకుండుట చూచిన పుత్రులుకూడ దేవతార్చనకు పూర్వం పిల్లినితెచ్చి రాటకుకట్టేవారు. మరి రెండుతరాలు పోయినవెనుక ఇంట్లో దేవతార్చనకూడ లేకపోయింది. అయినప్పటికి భోజనానికి పూర్వం పిల్లిని కట్టివేయడం తాతముత్తాతలనుండి ఆచారమైనదని, ఆతరంవారు ఊరల్లావెదకి పిల్లినితెచ్చి రాటకు కట్టనిదే భోజనం చేసేవారుకారు. ఇట్లు ఎందుకైతే ఉద్దేశింపబడినదో భగవదర్చన అది అంతరించి నప్పటికి ఆక్రియమాత్రం మూఢంగా నిలిచిపోయింది. అట్టి ప్రమాదం కలుగకుండా కొంత వివేచనతో ఆచారాలు విమర్శిస్తే వాటి యదార్థం గోచరిస్తుంది.

(ఇంకాఉంది)

తలవని తలంపు

శ్రీమతి జి. కళ్యాణి

★

'అదిగో, రాముడూ! ఆ ముసలమ్మ. దాన్నిచూస్తే నా కడుపు చెరువైపోతుంది.'

రోడ్డు కెడమవైపుగా, మెల్లిగా రిక్షాలాగుతూ 'అవునమ్మా. ఏంచేస్తుంది? పాపం, అలాగే మెల్లిగా ఇంటింటికీ తిరుగుతూవుంటుంది. ముగ్గిపోయిన పండుగదా. పట్టుమని పదికొంపలేనా తిరగలేదు. ఆ తిరిగిన కొంపల్లో దొరికిన గింజలతోటే దాని బ్రతుకు తెల్లారాలి.' అన్నాడు రాముడు తుండుగుడ్డతో చమట తుడుచుకుంటూ. రిక్షా రోడ్డుప్రక్కల చెట్లనీడల్లో మెల్లిగా దొర్లుతూంది. శ్యామల అందులోకూర్చొని ఆ ముసిలిదానికేసే చూస్తూవుంది.

'పాపం, ఆ రోజున నాన్నగారు అడ్డురాకపోతే బుట్టనిండా బియ్యంపోసేదాన్ని. నాన్నగారి మనస్సు కఠినపాషాణం. అదెంత తిట్టుకుంటూపోయిందో! అలాంటివాళ్ల ఉసురుతగిల్తే ఇంకేమయినా ఉందా?'

'అంతా నీలాంటివాళ్లే ఉంటారమ్మా. మీ నాన్నగార్ని ఎంతమంది తిట్టిపోస్తూవుంటారు? రక్తం పిండుకుతాగుతాడనీ, పిసినిగొట్టనీని. అవన్నీ వింటూంటే నాకు చాలా కష్టంగావుంటుంది.'

స్కూలుగంట గణగణ మ్రోగింది. అదివిని రాముడు ఉలికిపడి గబగబా లాగటం మొదలెట్టేడు.

'మెల్లిగాలాగు రాముడూ! దగ్గరకొచ్చేశాంగా' అంది శ్యామల.

◆ ◆ ◆

స్కూలుగంట శబ్దం విని రాముడు రిక్షాలోంచి లేచి దిండు సరిచేసేసరికి శ్యామలవచ్చి కూర్చుంది. యెంతో దిగులుగాఉన్న శ్యామలనిచూచి

'ఏమమ్మా అలాగున్నావు మేష్టరేమన్నా అన్నారా?' అన్నాడు రాముడు.

స్కూలుకేసి దీనంగా చూస్తూఉన్న శ్యామల కనుకొలుకుల్లోంచి నీటిబిందువులు జలజలా రాలేయి.

'ఈ బడికీ మనకీ రుణం తీరిపోయింది రాముడు—'

'అదేమమ్మా?'

'సెలవులిచ్చేశారు; రేపణ్ణుంచే ప్రారంభం'

'మళ్లీ తెరుస్తారుగా ఈ వేసంగివెళ్లగానే?'

'ఆ, తెరుస్తారు. అందరూ వస్తారు తిరిగి, కాని నాకు ప్రాప్తంలేదు'

'అదేమిటమ్మా?'

'ఈ వేసంగి సెలవల్లో నా వివాహం—ఇక స్కూలుకు రానివ్వరుగా'

శ్యామల నోటివెంట ఆ మాటలు రావడంతోటే రాముడు బిక్కపోయాడు. శ్యామలకేసి అర్థహీనంగా చూట్టం మొదలెట్టేడు. రేపటినుంచి ఆ రిక్షాకీ తనకీ రుణం తీరిపోయిందనుకున్నాడు. అప్పటికి 14 సంవత్సరాలనుంచి ఆ రిక్షా తన శరీరంలో ఓకీలులా తిరుగుతూంది. శ్యామల్ని యెత్తుకొని ఆడించేడు చిన్నతనంనుంచీని. ఆమెను పెంచిన తన హృదయంలో శ్యామలమీద సోదరీవాత్సల్యం చక్కగా పెరిగి

పుష్పించింది. ఆ సౌరభం ఆనాటితో మరిరాదు. చీకూ చింతా లేకుండా ఇన్నాళ్లు పెరిగిన తన జీవితలత వేరొకవృక్షాన్ని ఆధారంచేసుకొని పాకిపోవాలి. ఇంకో చెట్టో పుట్టో దొరుకుతుందో దొరకదో...అతనికంతా శూన్యంగా కనిపించింది.

◆ ◆ ◆

మంగళతూర్యనాదాలతోటి, విప్రవరుల వేదఘోషలతోటి, పేరంటాండ్ర మంగళగీతికలతోటి శ్యామల వివాహం దేదీప్యమానంగా జరిగింది. సాయంత్రం పెళ్లి పెద్దలందరూ ఫోటో తీయించుకున్నారు. రాముడు శ్యాము బలవంతంమీద ఓమూల నుంచున్నాడు. తరువాత శ్యామల్ని తీసుకొని వెళ్లిపోతున్నారత్తవారు. వారితో రాముడుకూడా వెళదామనుకొని ఉబలాటపడ్డాడు గాని పనుంది ఆగిపొమ్మని శ్యామల తండ్రి అంటే ఆగిపోయేడు. పల్లకీలో మంచి సుఫురద్రూపియైన బి. ఎ. పెళ్లికొడుకు యెదురుగుండా శ్యామల తలవంచుకొని కూర్చుండగా బోయీలెత్తేరు పల్లకి. అరుగునంటిపెట్టుకొని నుంచుండిపోయాడు రాముడు పల్లకీ వెళ్లిపోతూవుంటే దానికేసి తదేకధ్యాన్నంగా చూస్తూ.

◆ ◆ ◆

పాతికేళ్లు గిర్రుమని తిరిగిపోయేసరికి, కాలంలోనే గాదు, మనుష్యులలోకూడ వూహకందని మార్పు కలిగిపోతుంది. నాటి పిన్నలు ఇప్పుడు పిన్నలకు పెద్దలై సంసారాలు దిద్దుకొంటూవుంటే ఆ మార్పును గుర్తించలేము.

పట్నంలో రంగంనుంచి వచ్చిన రామస్వామినాయుడుగారి మిల్లు అంటే పేదవాళ్లకి పెన్నిధిలా వుంది. 5 ఏళ్లు తిరిగేసరికి రామస్వామినాయుడుగారి ఖ్యాతి నలుదిశలా వ్యాపించింది. నిరుద్యోగ పట్టభద్రుల దగ్గరనుంచి, నిరక్షరాస్యులైన నీరసపు సంసారులందరికి అతడు దాత అయిపోయాడు. అందరికి అతనంటే పితృవాత్సల్యం.

నాటి రిక్షాలాక్కుని పొట్టపోసుకున్న రాముడే నేడు మిల్లు యజమాని రామస్వామినాయుడు అంటే ఎవరైనా నమ్ముతారా!

◆ ◆ ◆

నాడు నాయుడుగారి యింటికి వచ్చేవారు, పోయేవారుతోను చాలా హంగామాగాను, హడావిడిగాను వుంది. నాయుడుగారికి టైఫాయిడ్ జ్వరము చాల తీవ్రముగావుందని పట్నం అంతా విచారిస్తోంది. పనివాళ్లు ఎప్పుడు యేమాట వింటామో అని దిగులుగా భగవంతుణ్ణి ప్రార్థిస్తూ నాయుడుగారి యింటిముందు కూర్చున్నారు.

నాయుడుగారి గదిలోంచి అందరూ యీవలికి వచ్చేశారు నాయుడుగారి కోరికమీద. మిల్లు మేనేజరు గోపాలరావుపంతులు ఒక్కడుమాత్రము నాయుడుగారి మంచంప్రక్కన కూర్చునియున్నాడు. గోపాలరావుపంతులుమీద నాయుడుగారికి అమితమైన వాత్సల్యం. ఆయన నడవడి, కష్టానికి ఓర్చి పదిమందికి మంచిచేయాలనే స్వార్థరహితమైన నడత ఆయన్ని ముగ్ధుణ్ణిచేశాయి. కళ్లుతుడుచుకుంటూ

'ఏమి శలవు?' అన్నాడు పంతులు.

'నాయనా, నాకు యిక శలవైంది. మిల్లునంతా అందులో పనిచేసే పనివాళ్లందరికీ యిచ్చేశాను. ఆసంఘానికి నీవుపెద్దవు. దాన్ని నీవు నేనులేని లోటులేకుండా నిరవాకంచెయ్యి. నీచేతుల్లో పెట్టుతూన్నాను. ఇంక ఒక్కటే కోర్కె వుంది. బేంకులోవున్న 50 వేల రూపాయిల్లోను సగం, చూడు, యీ ఫోటోలోవున్న

అమ్మాయికి యిచ్చివెయ్యాలి. మిగిలినది మిల్లుది. ఆమెకోరకు ప్రయత్నించాను రంగాన్నుంచి వచ్చినప్పటి నుంచీను. కాని ఆమెను చూచే భాగ్యానికి నేను నోచుకోలేదు. యీమె ఫలానా గణపతిరావు వకీలుగారి కూతురు...' అంటూ ఫోటో చేతికిచ్చాడు.

గోపాలరావుపంతులు ఫోటో అందుకుని చూచి నివ్వెరపడిపోయాడు—

గబగబ యీవలకువచ్చి కారుయెక్కి యింటికి వెళ్లిపోయాడు. తిరిగి వెంటనే వచ్చేశాడు భార్యతో నాయుడుగారి దగ్గరకు.

నాయుడుగారు శ్యామలను చూచి 'అమ్మా, అమ్మా నిన్ను తిరిగి చూస్తాననుకోలేదు తల్లీ... రంగాన్నుంచి వచ్చి నీ చిన్ని చేతుల్లో ఒక చీర పెడదామనుకొన్నాను. అదిగో ఆ పెట్టెలో వుంది తీసుకో. నీ వాత్సల్యం, అభిమానంతో పెరిగిన దేహమే యిది. ఇదిగో యీ హృదయంలో యింకాఉంది ఆనాటి నీ యనురాగం. గోపాలరావుగారు స్ఫోటకపు మచ్చలతో రూపుమారిపోయారు. తెలుసుకోలేకపోయాను. భగవంతుడు కలుపుతాడు. అతడు దయాసాగరుడు—'అంటూ శ్యామల రెండుచేతులూ పట్టుకున్నాడు.

వణుకుతోవున్న చేతులుమీద జలజలా రాలాయి శ్యామల కళ్లల్లోంచి అశ్రువులు.

నాయుడుగారి గుండెమీదవున్న తన పెళ్లి నాటి ఫోటోకేసి శ్యామలచూచి యేదో చెప్పబోయింది. యింతలో నాయుడుగారి చేతులు నీటికుండలైపోయాయి. తలవనితలంపుగా జరిగిన యీ సంఘటనకు తెల్ల బోతూ శ్యామల మరి మాట్లాడలేకపోయింది. ఆలాగే నివ్వెరబోయి నిలబడిపోయింది.

చిత్ర వస్త్ర కారుఁడు

నేయుమా బట్ట సోదరా! నేయుమయ్యా
బిరబిరను విసరు కండె సంబరము తోడ
చూపుమా నీదు నేర్పుతో జూపుమోయి
ప్రకృతి యందున్న వింత సంభారములను,
సొరు, జిగి, రంగు మృదులతా సౌష్టవంబు
ముదురు, లేతల కలయిక మోహనంబు
గాగ సృష్టించు నేర్పు నీకడనె కలదు
సౌరభం బొక్కటే గూర్ప జాల వీవు
నేయుమా సోదరా నేయుమా నీవు—
సంజ కెంజాయల సవరింపు మయ్యా
ప్రతి తంతువున దయ పరిఢ విల్లంగ
ప్రతి దారమున కళల్ ప్రజ్వ రిల్లంగ
ప్రతి సూత్రమున శాంతి ప్రబలు చుండంగ
సృష్టింపుమా చిత్ర చిత్రంబులైన
నిరుపేద పాలి పెన్నిధియైన శుద్ధ
దేశీయ వస్త్రకళా విశేషముల—
ఎన్ని జన్మాల నెత్తిననేని జనుఁడు
ప్రోదిగా జేయ డొక్కొక పోగుతోడ
పడుగు పేకను గూర్చియు పంచనేసి
ఐకమత్యము నందున్న యతిశయంబు
చాటుచున్నావు ప్రజకు నిశ్శంక తోడ
చీర యందున తంతువుల్ జేరినట్లె
సర్వభూతంబు లందున సర్వసాక్షి
నిండి యున్న దటంచను నిజముమాకు
చూపుచుంటివే సోదరా! చూపుమయ్యా—

—విద్వాన్ శ్రీ వెం. శే. శర్మ.

భావతరంగిణి ★ ★ ★

'తన గృహంలో, తనతల్లివద్ద కన్య పొందుతూవున్న తరిఫీదు చాలాఉత్తమమైనది. కాని సంకుచితమైపోయిన నేటిమన సాంఘికవ్యవస్థలో కన్యకు సరియైన తరిఫీదు లభ్యమవటంలేదు. దానికి జపానులోవలె 'బ్రిడాల్ ట్రెయినింగు' మనదేశములోకూడ అవసరమనిపిస్తోంది. జపానులో కన్య వివాహమునకు అర్హతపొందుటకు ముందుగా కుట్టుపని వచ్చియుండాలి. ఆమెకు, సంసారమునకు సంబంధించిన ఆర్థిక విషయాలు, పిల్లలను పెంచడం, తీరికసమయాలలో ఏదోవొక గృహపరిశ్రమ చేయడం మొదలైన విషయాలు తప్పక తెలిసివుండాలి. ఇవి చేతకానిదే ఆమెకు వివాహము నిషేధము'

—సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య.

'స్త్రీ పురుషులలో ఎవరైనను, ఎట్టివృత్తి నవలంబించుటకైనను ఎట్టిఅడ్డంకులు వుండకూడదు.'

—సర్ అల్లాడి కృష్ణస్వామయ్య.

'స్త్రీలు ముఖ్యంగా రాట్నాలమీద నూలువడకడం, ప్రథమచికిత్స, గృహకృత్య నిర్వహణ మొదలైనవి ముఖ్యముగా నేర్చుకోవాలి......ఘోషాపద్ధతిని వదలివేయాలి. స్వరాజ్యంకోసం పురుషులతో పాటు స్త్రీలుకూడా శ్రద్ధగా పనిచేయాలి.'

—బాబు రాజేంద్ర ప్రసాద్.

'పని, వ్రాత అంతా చక్కగా చేయగల స్త్రీలే నిర్వహించేటట్టు కాంగ్రెసు సంఘాలు, అభిమానులు తోడ్పడితే చాలాబాగుంటుంది. స్త్రీలయినా, పురుషులయినా, ఎవరు కార్యభారం వహించినా కాంగ్రెసు చరిత్రను, సత్యాగ్రహ అధ్యాయాన్ని అమోఘంగానడిపించి, చిరయశస్కులు కావడానికి మూలమైన ప్రతిస్త్రీవద్దకు, పల్లె పల్లెకు, మూలమూలకుపోయి, అదృశ్యంగా దిగివున్న ఆ రత్నాలను వెలువరించి, ఆ జీవనజ్యోతులను భావిచరిత్రలోని బంగారు పుటల్లో అలంకరింప జేయాలి.'

—పొణకా కనకమ్మ, ద్రోణంరాజు లక్ష్మీబాయమ్మ.

'మనపుత్రులకు, పుత్రికలకు కూడా అభివృద్ధి వికాసం సమానంగా కలగాలి. అందుకు అవకాశాలు కూడా సమానంగానే వుండాలి. ఆలాజరిగి తేనేగాని భారతజాతికంతకు సమానంగా సమగ్రమైన అభివృద్ధి కలగదు........మనదేశానికంతకి హిందూస్థానీభాష సార్వజనిక భాషగావుండాలి. అందువల్ల ప్రజలలో ఐకమత్యం కట్టుబాటు మొదలైనవి చాలా అధికమౌతాయి.'

— బేగం హమీదాలీ.

స్త్రీలయొక్క శరీరబాధలనుగురించి స్త్రీ వైద్యులవద్దనే విపులముగా చెప్పుకోగలరు. అందుచే ముఖ్యముగా మనరాష్ట్రములో స్త్రీ వైద్యులు చాలామంది కావాలి. ఇందుకుగాను మద్రాసులోనున్న రెండు మెడికల్ కాలేజీలలోను కనీసము 100 సీట్లనైనా స్త్రీలకై ప్రత్యేకించుట ప్రభుత్వధర్మం. దీనికి స్త్రీలోకం తగిన ఆందోళన చేయాలి.'

— డాక్టరు ముత్తులక్ష్మి రెడ్డి.

బీడు సబ్బులు నాకు అక్కరలేదు - నేను సన్‌లైట్ సోపును వాడెదను.



"ఒకప్పుడు అగ్గువైన సోపులను వాడుచుంటిని. ఐతే ఒకదినము నా స్నేహితరాలను తన దుస్తులను మెరియునంత తెల్లగ ఎట్లు ఉంచుకొనగలిగెనో నాకు చెప్పమంటిని. ఆమె సన్‌లైట్ సోపును వాడుచున్నదనియు, సన్‌లైట్ ఇచ్చెడి సబ్బుమయమైన నురుగే తన దుస్తులకు అంత అద్భుతమైన శుభ్రతను ఇచ్చుచున్నదనియు చెప్పెను.

అప్పటినుండి పైకమును వృధాపఱచు అగ్గువైన సోపులను వాడుట మానితిని. ఇప్పుడు నేను సన్‌లైట్ సోపునే వాడెదను. ఒక్కొకరును మన దుస్తులు లేశమాత్రమైనను దోషములేక చాల శుభ్రముగానుండుటను చూచి ఆశ్చర్యపడుచున్నారు.

సన్‌లైట్ సబ్బు

అప్పటమైన వృక్షవర్గపు తైలములనుండియే ఇండియాలో తయారగుచున్నది.

S. 18-50 TL LEVER BROTHERS (INDIA) LIMITED

శ్రీ తిరుమల శ్రీనివాస త్రిలింగ మహావిద్యాపీఠము, బెజవాడ.

30-6-1940 తేదీన, బెజవాడ మునిసిపల్ ఛైర్మన్, సి. రాజగోపాలాచార్యులవారి యాజమాన్యమున జరిగిన సభలో, శ్రీమతి కవితిలక, కవితావిశారద విద్వాన్ కాంచనపల్లి కనకాంబగారిచే జదువబడిన పద్యములు

చ. ఎవరిది వారికిం బగుచు నీయిల వేయివిధాలు వెట్టివా
స్తవమగు వేదశాస్త్రములు సత్కళలున్ రసవత్ప్రబంధముల్
సవనము లాశ్రమంబులును సద్గురుబోధము సాధుసేవలున్
నవవిధభక్తులున్ గడు ఘనంబులు మాకొరు సుద్దులేటికిన్.

చ. తిరుపతి వేంకటేశ్వరుఁడె దేశికమూర్తి త్రిలింగపీఠమున్
పరమ పవిత్రధర్మములఁ బాలనజేయఁ బ్రతిష్ఠచేసెనో
వరమతులార యివ్విజయవాటిక నేటికి రాజధానియై
స్థిరముగ నొప్పుదానికిఁ బ్రసిద్ధియు, సిద్ధియు, సిద్ధమేగదా.

మ. కులధర్మంబులు నిర్వహించుటయు జంకున్ మాని శ్రీ సద్గురూ
క్తులఁ బాలించుట వేదవాక్కులన యుక్తుల్ మాని కేల్మోడ్చుటు
జ్వలమా బ్రహ్మముపాస్యమంటయు సదాచారంబులా మాకు ని
క్కలిలో వేంకటనాయకుండొకఁడె నిక్కంబైనదిక్కారయన్.

మ. బ్రదుకంజాలక చావజాలకెటు లీప్రాణంబు లెడ్డేగునో
యదియుంగానక మానజాలకెది చేయంజాలకెందేని మం
చిదియే గానక దేవులాడుగద యీ జీవుం డహంకారమున్
మదిబూనున్ మమకారమూను బుధులన్ మన్నింపఁ డెన్నండును.

ఉ. వేదముగాదనున్ బుధుల వెట్టులనున్ గురుదేవనిందకున్
మోదమునొందు, బెద్దల ఘనుండయి దిద్దును దోసమెంచు వ్యా
సాదుల, నార్యధర్మమపహాస్యమొనర్చెడు నేడొకండు దు
ర్వాదము నాస్తికత్వమపవాదము తోడుగ నెంతొ వేడుకన్.

శా. మింటంబాటిన నీటదూరినను భూమిన్ గెల్చి తానేలినన్
గెంటంజాలునె కాలునిన్ హరినెదన్ గీర్తించి సంసారపున్
దంటాలన్ గడవంగ నేర్చునతఁడే ధన్యుండదేనాటికిన్
ఘంటానాదమువోలె వేదమదిమ్రోగన్ జంక నింకేటికిన్.



‘ ఫీట్ ’



ముగ్గులతో ‘ హిందూదేశము ’

★

— శ్రీమతి —

రాజుపాలెం లక్ష్మమ్మగారు

ఈమె గుంటూరుజిల్లా కొల్లపూడి కాపురస్తురాలు. వైదిక బ్రాహ్మణులు; విద్యావతి. ఈమె వితంతువై, తిరిగి నియోగ బ్రాహ్మణులగు శ్రీయుత రాజుపాలెం రాధాకృష్ణమూర్తిగారిని ఇటీవల వివాహమాడిరి. ఆ ప్రాంతములో ఎన్నడు జరిగియుండని నియోగి వైదీకి మిశ్రిత వివాహ బాంధవ్యములకు ఈమె మార్గదర్శిని యైనది.

★



సీతాకోక చిలుక

చిన్నమాంబా ముద్రాలేఖినిపై తలకట్టులేని 'డ' అక్షరములను కూర్చి బైపు చేయబడినది.

ఉ. పీనుగు వెంటలౌచు బృధివీతలమింతయు గంపుకొట్టినన్
గానరు మానవుల్ శుభముగా మనుమార్గమహంకరించుటన్
మానరు దుష్టమార్గములు మాధవపాద సరోజ పూజపై
మానసమూన రీదురభిమానులు మూఢులెఱుంగనేర్తురే.

మ. మనకున్ లేదని వారికున్నదనుచున్ మావారలగ్గింతురా
ఘనతన్ జూడమె నేడు మాడుగద లోకంబంత సంగ్రామభూ
మిని, గ్రామంబుల నాంధ్రబిడ్డలను బల్మిన్ జంపుచే యోగ్యమా
పనిగాఁ దోచెడు ధర్మమోక్షముల దల్పన్ వచ్చునే యచ్చటన్.

ఉ. ఆసురసంపదల్ ప్రబల నా సురసంపదలెల్ల కల్లగాఁ
జేసిరి చేయుచుండిరిక చిల్లరయోజనలెల్ల జేయుచున్
భూసురులే కలిప్రభవముల్ వికృతుల్ చెలరేగ విత్తనాల్
చేసినజాలు సత్కళల జిక్కిన దక్కిన వేదశాస్త్రముల్.

మ. పెరుమాళ్లన్నను బెద్దలన్న పరమప్రీతిన్ దదీయార్చనల్
జరుపన్ గావలె వేదశాస్త్రముల విశ్వాసంబుతో భక్తితో
సరహస్యంబుగ నేర్వగావలెను సంసారంబులో సారమా
హరినామంబని నమ్మగావలెను దేహస్ఫూర్తి బోనాడుచున్.

★ ఈ అవిద్య అంత మొందదా?

అక్షరాస్యుల సంఖ్య మనదేశమున అత్యల్పము. పదుగురిలో ఒక్కరికి అక్షర సంస్కారమున్నదని లెక్కలు చూపుచున్నవి. చదువ నేర్చినవారి సంఖ్య మన దేశమునకంటె బర్మాయందు మేలు. మన దేశములోకూడ అనగా, బ్రిటిషు హిందూదేశమునకంటె స్వదేశ సంస్థానములలో చదువనేర్చినవారి సంఖ్య హెచ్చు. మొదటిది కొచ్చిను; తరువాత తిరువాన్కూరు, బరోడా. స్త్రీల విద్యావిషయములో స్వదేశ సంస్థానములు ముందడుగు వేయుచున్నవి చదువనేర్చిన స్త్రీల సంఖ్య పురుషులతో పోల్చినచో

స్త్రీలు	1	(కొంచము అధికము)	పురుషులు	2	కొచ్చినులో
,,	1	(సుమారు)	,,	2	తిరువాన్కూరు
,,	1	(సుమారు)	,,	3	బరోడా
,,	1	(సుమారు)	,,	5	మైసూరు

విద్యావిషయములో మన దేశములో పార్సీలు జూపుచుండు పట్టుదల అమోఘము. వారిలో 100 టికి 80 వంతు విద్యావంతులున్నారు. క్రైస్తవులలో నూటికి 23 విద్యాగంధము నొందియున్నారు. హైందవులలో నూటికి 8 మంది విద్య నభ్యసించినవారు గలరు. ముస్లిములలో ఆర్గురికి చదువువచ్చును.

ఎక్కువ విద్యాసౌకర్యములుగల పట్టణములయందే చదువుకున్నవారు తక్కువైనప్పుడు, ఇక గ్రామసీమలమాట చెప్పవలయునా? నవయుగ నిర్మాణమును గావించుచున్నామని చెప్పికొను బ్రిటిషు పరిపాలిత ప్రదేశములందు ఇంత మంది నిరక్షరాస్యులున్న నవయుగ నిర్మాణమెక్కడ? ఈ అజ్ఞాన తమస్సునందికెంత కాలమిట్లు మనగలము. దీనికి తరుణోపాయములేదా?

—శ్రీ దు. కృష్ణయ్య.

శ్రీ వరలక్ష్మీవ్రత కథ

శ్రీమతి పక్కి వెంకాయమ్మ

ఇప్పటికి రమారమి డబ్భై యెనభైయేళ్ల కిందట రాజమహేంద్రవరం సమీపంలో వున్న యిసుగంటివారిపేట అనే చిన్న పల్లెటూళ్లో కనకమ్మ అనే ఒక కమ్మయిల్లాలు ఉండేదట. మా బామ్మ ఆ కనకమ్మ యింటిపేరుకూడా చెబుతూవచ్చింది, పత్తివారనో, దూదివారనో బాగా జ్ఞాపకంలేదు. ఆ కమ్మావిడ చదువుకోలేదు గాని, చదువుకున్నవాళ్లకంటే యెక్కువ సమాలోచన చేయగల బుద్ధిమంతురాలట. ఆ వూళ్లో బ్రాహ్మణపడుచులు యీ లక్ష్మీవ్రతం చెయ్యడం చూచి, కల్పం కథా వినీ, యేమనుకుందో తనుకూడా ఆ వ్రతం చెయ్యాలని ఉత్సాహపడిందట. వెంటనే పౌరోహిత్య బ్రాహ్మడి యింటికివెళ్లి ఆయనకు దణ్ణంపెట్టి 'అయ్యగారూ! నాకు వరలక్ష్మి నోము నోచుకోవాలనుంది. మేం కమ్మవారం. నోచుకోవొచ్చునాండీ?' అని అడిగింది. ఆ బ్రాహ్మడు 'అయ్యో! అడ్డమేమమ్మా! అన్నివర్ణాలవారూ కూడా చెయ్యొచ్చునమ్మా' అన్నాడట. కనకమ్మ చాలా పేద సంసారిణి. నలుగురు పిల్లల తల్లి. పురోహితుడు చెప్పిన మాటవిని చాలా సంతోషించి 'బాబూ! మమ్మల్ని మీ రెరుగుదురు. ఆ ఉన్న యకరం కొండ్రా దున్నుకుని యేదో ఓపూట గంజీ మెతుకులూ తిని రోజులు గడుపుకుంటున్నాం. ఇలాంటి మేము మీకేమివ్వగలం? మీరు మామీద దయవుంచి అసలు ఆ నోముకి యేం కావాలో చెబితే ఉన్నంతలో నాలుగు సరుకులూ సమకూర్చుకుంటాం' అని దీనంగా అడిగింది.

'కనకమ్మా! సరుకులు మాటకేంగాని, ముఖ్యంగా యీ వ్రతానికి కల్పంలో చెప్పబడిన ధర్మం చెబుతాను విను. ఈ వ్రతం చెయ్యదలుచుకున్న పుణ్యస్త్రీ లోకంలో అంతా సుఖపడాలనీ, కావలసినంత కలిమీ గట్రా కలిగి పేదసాదల్ని కనిపెడుతూ బిడ్డా పాపాతో కులుకుతూ ఉండాలనీ కోరుతూండాలి. తన లాభంకోసం యెన్నటికీ అబద్ధం చెప్పకూడదు. ప్రతిరోజూ తన యిల్లూ వొళ్లూ శుభ్రంగానూ చక్కగానూ నిర్మలంగానూ ఉంచుకుంటూ ఉండాలి. ఇంక వ్రతంరోజైన శ్రావణమాసంలోని పవర్ణమి ముందు శుక్రవారం నాడు నాలుగ్గళ్ల తెల్లారుగట్ట లేచి, యిల్లూ వాకిలీ శుభ్రంగా అలికి, ముగ్గులుపెట్టుకుని, తనూ మగడూ పిల్లలూ హాయిగా తలంటి నీళ్లోసుగుని, గుమ్మాలికి మామిడి, నేరేడు, మారేడు మొదలైన చిగురుకొమ్మల్తో తోరణాలు కట్టుకోవాలి. తరవాత మంచి సువాసనలుగల రకరకాల పువ్వులు దండలుగుచ్చి, యింట్లో పదిమందీ కూర్చోడానికి అనుకూలమైనచోట చిన్న పాలవెల్లి కట్టి, ఆ పాలవెల్లికి నేజెప్పిన దండలు అలంకరించాలి. యిలా యిల్లంతా సువాసనలతో నిండిన గాలితోటిన్ని మంచి వెలుతురుతోటిన్ని ఆకర్షకంగా ఉండేటట్టు అలంకరించి, ఆ పాలవెల్లికింద మహాలక్ష్మీదేవిని ఆవాహనచేసి పూజచెయ్యాలి. తన శక్తికొద్దీ ఆరోగ్యకరములైన భోజనపదార్థాలతో పేదలకూ సాధలకూ యింకా అర్హులైన బ్రాహ్మణులు మొదలైనవారికిన్ని భోజనములు పెట్టి, వారితోపాటు తాను, తన బంధువులు స్నేహితులు కలిసి భోంచేసి, ఆ రోజంతా సంతోషంగా పాటలుపాడుకుంటూ, నీతి న్యాయములు ప్రబలడానికిన్ని, లోకంలో అన్ని జంతుజాలాలూ హాయిగా బ్రతకడానికిన్ని, తమ శక్తియుక్తులు వినియోగించిన మహాత్ములైనవారి కథలున్ను, గృహమునందు స్వర్గసౌఖ్యం లభించడానికి అనుకూలమైన పద్ధతులు అవలంబించి సంసారం నడిపిన రమణీమణుల కథలున్ను వింటూ కాలక్షేపం చెయ్యాలి. తన యిల్లూ, వొళ్లూ, ప్రవర్తన, హృదయం, యివి మహాలక్ష్మీదేవిని అనగా ఐశ్వర్యాన్ని తన యిల్లు వొదలకుండా ఉండేటట్టు దిద్దుకోవాలి. విన్నావా? అమ్మా, కనకమ్మా! నేను పేద బ్రాహ్మణ్ణి. నీదయ ఉండి ఆ వ్రతం నన్ను చేయించమంటే నేనే చేయిస్తాను' అన్నాడు ఆ బ్రాహ్మడు.

ఇదంతా విని ఆ కమ్మ కనకమ్మ 'బాబయ్యగారూ! మీరు చెప్పిందంతా చేస్తాను గాని, అసలు కావలసిన వేమిటో చెప్పారు కారు. కొబ్బరి బొండాలూ, అరిటిపళ్లూ, తమలపాకులూ, ఊదొత్తులు, సాంబ్రాణి, హారతి కర్పూరం, డబ్బులు యిలాటివన్నీ కావొద్దండీ? చెప్పరేం?" అంది. 'ఇంకేమీ అన్నీ నీకే తెలుసునాయెను. అవన్నీ సిద్ధంచేసుకోవడం మంచిది. మరి నాకు పనుంది. నువ్వు వెళ్లి నోము యత్నంచేసుకో. సర్వవిధాలా నీ యిల్లు బంగారమై పిల్లాజెల్లాతో సుఖపడతావు' అన్నాడు ఆ బ్రాహ్మడు.

కనకమ్మ ఆయనను తనకు వ్రతం చేయించమని చెప్పి యింటికి వెళ్లిపోయింది.

* * *

ఆ రోజు శ్రావణ శుద్ధ దశమి గురువారం. కనకమ్మ రేపు మా యింటికి వరలక్ష్మీదేవి వస్తుందని యెంతో ఉత్సాహపడుతోంది. గురువారం పగలంతా పనిచేసి తన చిన్నయిల్లు బూజులు మొదలయినవన్నీ దులిపింది. అక్కడక్కడ చిన్నచిన్న దెబ్బలుతిన్న గోడలన్నీ చక్కగా మెత్తి, నున్నగా తయారుచేసి, కొత్త సున్నం రెండుసార్లు గోడలన్నిటికీ వేసింది. నేల అంతా ప్రతి గదీ ప్రతి వసారాలోనూకూడా కొత్త ఆవు పేడతో చక్కగా అలికి చూడడానికి యింపుగా ఉండేలాగ ముగ్గులుపెట్టింది. కనకమ్మ భర్తపేరు వీరాస్వామి. అతడు సాయంకాలం చేలోకి వెళుతూంటే కనకమ్మ 'పొలం బయలికెడుతున్నారు గాబోలు. యింటికొచ్చే టప్పుడు మామిడికొమ్మలూ, నేరేడు, మారేడుకొమ్మలూ తీసుకురాండి. రేపు శుక్కురారం. మనయింటికి శుక్కురారం మాలక్ష్మి ఒస్తుంది. అందుకు గుమ్మాలకి దూలాలకి అన్నింటికి తోరణాలు కట్టాలి' అంది.

అనుకున్నప్రకారం అన్ని సామగ్రులూ సిద్ధంచేసుకున్నారు. ఆ రాత్రి కనకమ్మకు తిన్నగా నిద్ర లేదు. జాము తెల్లవారుగట్టనే లేచి ముగ్గురు కొడుకులకూ మగనికీ తలఅంటి నీళ్లుపోసింది. తానున్ను తలంటు గుంది. పొలములోకి పోతూఉన్న భర్తతో ఆమె 'ఏపంచి కట్టుగున్నారు? ఒదిలేసిన పంచి కట్టుగోకండి. ఇంకోపంచి ఉదికి ఆరేసిపెట్టాను, అది కట్టుగుని చాకలిది తెచ్చిన పంచి పైనేసుగెళ్లండి. మనం అంతా శుభ్రంగా ఉంటేగాని ఆ మాలక్ష్మి తల్లి రాదంట' అంది. పిల్లలకందరికి చాకలి ఉదికితెచ్చిన బట్టలు కట్టింది. తాను ఉదికి ఆరవేసిన పట్టుచీర కట్టుగుంది. జాము ప్రొద్దెక్కేసరికి బ్రాహ్మణుడు రామయ్య వచ్చాడు.

రామ:—కనకమ్మా! చక్కగా అలంకరించావమ్మా.

కన:—అయితే అయ్యగారూ! ఆ మాలక్ష్మి తల్లి మా యింటికొస్తుందాండి?

రామ:—వొస్తుంది. రాకేం జేస్తుంది? కాని ఒకవేళ యీ వారం రాకపోతే పైవారం రావొచ్చును. రాలేదని నోము మానకూడదు. యెన్నాళ్లకైనా ఆవిడకు దయకలిగి వచ్చిందాకా ఓపికతో యిలాగే చెప్పిన ప్రకారం భక్తి శ్రద్ధలతో నోము చేస్తూవుంటే యెప్పుడో ఒకప్పుడు తప్పకుండా వొస్తుంది.

ఆ రోజున చక్కగా కనకమ్మ కూతురినికూడా దగ్గిర కూర్చోబెట్టుకొని వ్రతం చేసింది. రెండు ఝాములు తిరిగిందాకా శుక్రవారపు మహాలక్ష్మి వస్తుందేమో అని యెదురెదురు చూచింది. రాలేదు. క్రమంగా ఆ నెలలో వచ్చిన మిగత రెండు శుక్రవారాలూకూడా వ్రతం చేసింది. శ్రావణమాసం వెళ్లి పోయింది. శ్రావణంలో యిల్లు శుభ్రముగా ఉంచడం, తాను, భర్త, పిల్లలు ఒళ్లూ బట్టలూ శుభ్రముగా ఉంచుకోవడంవల్ల మనస్సుకి కలిగిన ఒక విధమైన సంతోషానికి అలవాటుపడిన కనకమ్మ క్రమక్రమంగా ప్రతిరోజూ అలాగే పరిశుభ్రమైన విధాన్ని ప్రేమింపసాగింది. దినదినమూ యిల్లూవాకిలీ అంతా స్వచ్ఛంగా

ఉంచడమే కాకుండా మగపిల్లవాళ్లచేత రకరకాల పువ్వులు తెప్పించి దండలు గుమ్మాలకు కట్టడం, కొప్పులో పెట్టుకోవడం, పిల్లల మెడలో వేయడం తద్వారా మంచి సువాసన అనుభవించడం మరిగింది. కనకమ్మకు ఇంట్లోనూ, దొడ్లోనూ, పరిసరాలనూ యేమాత్రం దుర్వాసనఉన్నట్లు గోచరించినా అందుకు కారణాన్ని తొలిగించేదాకా తోచేదికాదు. ఆవిడకి 'యీ స్థితిలో యీ చేసే లక్ష్మీపూజ ప్రతినిత్యం చేస్తే తప్పేముందీ?' అని తోచింది. అక్కడనుంచి తనయిల్లే స్వర్గం అనుకోతగిన దారిలో బడింది ఆమె నిత్యకృత్య ధర్మం. మనస్సుకి ప్రతి వస్తువును గురించీ శుభ్రతను గమనించడం స్వభావమైపోయింది కనకమ్మకి అందువల్ల తాగేనీరు, తినేవస్తువులూ, కట్టేబట్టలూ, నివసించేయిల్లూ, సంచరించే పరిసరములూ అన్నింటి విషయంలోనూ కడుశ్రద్ధ తీసుకొనేది. అటువంటి స్వచ్ఛమైన జీవనం ఆమెకు లభించడంతోటే ఆమెలోను ఆమె భర్తలోనూ బిడ్డలలోనూ సౌఖ్యకరమైన ఆరోగ్యం పెంపొందడం ప్రారంభమైనది. ఇంతలో మళ్లీ శ్రావణమాసం సమీపించింది.

శ్రావణమాసం ప్రవేశించకుండానే అనుకున్న ప్రకారం పశువులపాక చెలకలో వేసుగోవడమున్ను యిల్లు బాగా యెత్తుచేసి మంచిగాలీ వెలుతురూ వచ్చేటట్టు కట్టుగోవడం జరిగింది. ఈ సంవత్సరం కనకమ్మ శ్రావణమాసంలో నాలుగు శుక్రవారాలేకాక నాలుగు మంగళవారాలూ మంగళ గౌరీపూజలుకూడా చేసింది. ప్రతిరోజూ చేసుకునే పూజ తానే యేదో 'లక్ష్మి! అమ్మా! తల్లీ! మా యింటికి రావమ్మా' అని అర్థం యిచ్చే పాటపాడుతూ చేసేది. మంగళవార శుక్రవారాలు మాత్రం బ్రాహ్మణరామయ్యవచ్చి పూజ చేయించేవాడు. ఆయన కేదో తవ్విడుబియ్యం, ఒకఅణా డబ్బులూ, నాలుగు అరిటిపళ్లు, రెండు తాంబూలాలూ యిస్తూవుండేది. ఇవి యిచ్చినప్పుడు రామయ్యగారు పొందే సంతోషాన్ని చూడగాచూడగా కనకమ్మ తన కున్నదానిలో ఉన్నంత యెవరికైనా యిచ్చి వారితోపాటు తానుకూడా సంతోషించడానికూడా అలవాటు పడింది. ఆ సంవత్సరం శ్రావణమాసం మహా సంతోషంగా జరిగిపోయింది. ఆ కమ్మవారి కుటుంబాన్ని చూచి ఊళ్లో యింకా కొందరు యిల్లాళ్లుకూడా యీమెలాగే తాముస్నూ నోము చేయసాగారు. క్రమంగా యీ వ్రతం చేశేవారంతా ఒక సంఘంగా యేర్పడ్డారు.

కనకమ్మగారి మగబిడ్డలు ముగ్గురూ బాగా వ్రాయనూ, చదవనూ నేర్చి తనకు అక్షర జ్ఞానంలేకపోయిందని పశ్చాత్తాపపడుతూవున్న తమ తల్లికికూడా బాగా చదువనేర్పారు. కనకమ్మ ముగ్గురు మగబిడ్డలూ వీరాస్వామీ వంతులు వేసుకొని రోజుకు నాలుగు గంటలకు తక్కువకాకుండా నూలువడికేవారు. అందరూ కలిసి నాలుగుగంటలసేపు పొలంపని చేసేవారు. ఒకగంట మంచిమంచి గ్రంథములు చదివేవారు. ఒకగంట ఉత్సాహంగా మాట్లాడుకొనేవారు. మిగత యింటిపనులతోను, గృహాలంకారములు, ఆరోగ్యవిధానములు ఆచరణలోకి తెచ్చి పనిచేయడములోనూ కాలంపోతూ ఉండేది. ఈ పదేళ్లలోనూ క్రమంగా తమ పాటువల్ల లభించిన డబ్బులో మితంగా ఖర్చుపెట్టుగుంటూ సాధ్యమైనంతవఱకు కాయకష్టంవల్ల జరిగేపనుల నిమిత్తం డబ్బు ఖర్చుచేయకుండా సంఘంవారు అన్యోన్య సహాయంవల్ల పనులు నెరవేర్చుకుంటూ కొంత ధనంకూడ బెట్టుకొని దానితో నాలుగు యెకరములభూమి కొన్నారు. తుదకు యీ సంఘంవారంతా కలిసి జమీందారిణీగారికి దరఖాస్తుచేసి యెనిమిది యెకరముల మంచి మెరకస్థలం పొంది ఆ స్థలంలో విశాలమైన వీధులు యేర్పరచి ఆరోగ్య విధానములకు ఆదర్శకంగా ఉండేటట్లు సభ్యులు పదహారుగురు పదహారు విశాలములైన భవంతులు కట్టుగున్నారు. ఆ భవనములలో యెప్పుడుచూచినా నిత్యకళ్యాణం పచ్చతోరణంగా ఉండడమే కాకుండా నిత్య సంతుష్టి ఉండేది. ముఖ్యంగా చెప్పమరచిన సంగతి వారిలో యెవరికిగాని ఒకప్పుడైనా రోగం రావడము, వైద్యుని అవసరము అనేది లేనేలేక పోయిందట.



ఇప్పుడు నీ యొక్క సొగసైన వస్తువులనన్నిటిని నీకిష్టము వచ్చినపుడెల్ల పలుమారు లక్సుతో జాగ్రతగ నుంచుకొన వచ్చును. ఎందుకనిన నీ పైకమునకు ఈ పెద్ద సైజు లక్సు ఎక్కువ సోపును ఇచ్చుచున్నది. గట్టి రంగుగల పట్టు వస్త్రములను, కంబళము మొదలైన ఉన్ని వస్త్రములను చాల జాగ్రత్తగ లక్సు ఉతుకును. చల్లని నీటిలో లక్సు నురుగును ధారాళముగ నిచ్చును. నీ మలినమైనట్టి సూక్ష్మమైన వస్త్రముల లక్సు నురుగులో జాగ్రత్తగ పులిమిన, మలినమును చెమటయు పూర్తిగ తొలగిపోవును. ఎట్టి చెరుపును కలుగనీయక బాగుగ శుభ్రపరచును. చన్నీటిలో చెరుపులేక దేనిని నీవు తడపవచ్చునో వాని నన్నిటిని లక్సులో ఎట్టి హానిలేక ఉతక వచ్చును!

క్రొత్త పెద్ద సైజు లక్సు
కొనుటచేత నీ పైకమునకు ఎక్కువ సోపును పొందెదవు



చిన్న సైజు, సాధారణ సైజు లక్సు ప్యాకెట్లు కూడను నీ పైకమునకు గొప్ప ఆదాయము నిచ్చును.

LEVER BROTHERS (INDIA) LIMITED

L.X. 2-173 TL.

గానకళ ★ సంగీతోపాధ్యాయ శ్రీ గాలి పెంచలనరసింహారావు

రాగము: హిందోళము — ఆదితాళము

ఆరోహణము: సమగమదనిస	స. గ. మ. ద. ని. సఀ.	
అవరోహణము: సనిదమగస	„ సా. శు. శు. కై. „	

వక్రమ ఔడవము.

20-వ మేళకర్తయగు "నఠభైరవి" యందు జన్యము

ఇయ్యది రెండవఉసిలో రెండు అక్షరములు త్రోసి పాడుకొనవలయును; వ్రేలికి నాలుగుఅక్షరముల చొప్పన-

పల్లవి: పరమాత్ముని దరి - జేరగనౌనా
పరబోధలను విను - పామరులకు॥ పరమా॥

అనుపల్లవి: పరదాస్యము పర - ధనకాంతలనక
పరతత్వముగను - గొనువారికె గాక॥ పరమా॥

చరణము: ధర్మార్థకామమో - క్షార్వాతకై
మర్మంబులన్ తెలియ - జాలని నరులు
కర్మానుభవంబని - తెలుసుకొనక
నిర్మాతను నిందిం - చెడువారికి॥ పరమా॥

పల్లవి:

		|	„ - „ - „ సమ
		|	„ - „ - „ పర
మగమాగాసా సనిసా నిద నీ	| సాసా మగమా	|	మా „ - „ సమ
మఅఆత్మనిదఅరీజేఏఏ	| రగనఉఊ	|	నా „ - „ పర
గమదమగాసా - సనిసానిద నీ	| సాసా మగమా	|	మా „ - „ సమ
మఅఅత్మని - దఅరీ - జేఏఏ	| రగనఉఊ	|	నా „ . „ పర
గమదగమగసా - సనిగసనిద నీ	| సనిసా గసగా	|	మా „ - „ సమ
మఅఅత్మఉఉనీ - దఅరిఇజేఏఏ	| రఅగ - నఊఊ	|	నా „ - „ పర

గమదగమగసగ - సనిగసనిదనీ	సనిసా సమగా	మా ,, - ,, సమ
మఅఅత్మ్ఉఉనిఇదఅరిఇజేఏఏ	రఅగ - నఉఉ	నా ,, - ,, పర
గమదనిసనిదమ - గమగసనిదనీ	సనిసా సమగా	మా ,, - ,, సమ
మఅఅఅత్మ్ఉనిఇదఅరిఇజేఏఏ	రఅగ నఉఊ	నా ,, - ,, పర
గమదని - సగసని - దమగసనిదనీ	సనిసా సమగా	మా ,, - ,, మగ
మఅఅఅ - త్మ్ఉనిఇ - దఅరిఇజేఏఏ	రఅగా - నఉఊ	నా ,, - ,, పర
గా ,, మామా - దాదా - నీనీ	దనిసని - దామా	మగమా - ,, మగ
బో ,, ధన - లను విను	పఅఅఅ - మరు	లఅకు - ,, పర
గా ,, మామా - దాదా - నీనీ	మదనిస - నిదనిద	మగమా - ,, మగ
బో ,, ధన - లను విను	పఅఅఅ - మఅరుఉ	లఅకు - ,, పర
గా ,, మామా - దమదా - నిదనీ	మదనిస - గసనిస	నిదనిద - మగ - మగ
బో ,, ధన - లఅను - విఇను	పఅఅఅ - మఅరుఉ	లఅకుఉ - ఉఉ - పర
గా ,, మగమా - దమదా - నిదనీ	దనిసగ - సగమగ	సగసనిదమ - మగ
బో ,, ధఅనా - లఅను - విఇను	పఅఅఅ - మఅరుఉ	లఅఅకుఉఉ - పర
గా ,, మగమా - దమదా - నిదనీ	దనిసగ - సగమగ	సనిదమగస - సమ
బో ,, ధఅన - లఅను - విఇను	పఅఅఅ - మఅరుఉ	లఅకుఉఉఉ - పర

మాత్మ్రని దరిజేరగనా నా॥

అనుపల్లవి :

		,, - ,, - ,, - మద
		,, - ,, - ,, పర
గా ,, మామా - దాదా నీదా	నీసా - సాసని	గసనిసనిద - మద
దా ,, స్యము - పర ధన	కాంతలఅ	నఅకఅఅఅ - పర
మగగా మామా - దాదానీసనిదా	దనిసా - సనిగస	నిసనిదనిద - మద
దఅఆస్యము - పరధాఅఅన	కంంతఅఅఅ	నఅఅకఅఅ - పర
మగగా మామా - దాదానీసనిదా	దనిసని - గసమగ	సగసనిదమ - మద
దఅఆస్యము - పరధాఅఅన	కంంంతఅలఅ	నఅఅకఅఅ - పర
మగగామామా - దాదానీసనిదా	దనిసగ సగమగ	సగసనిదమ - దని
దఅఆస్యము - పరధాఅఅన	కంంంతఅలఅ	నఅకఅఅఅ - పర
సా ,, సాసా - ,, నిసాగసా	సనిగస - నిదనీ	దమదమగమ - దని
త ,, త్వము - ,, గనుగొను	వఅఅఅరిఇకే	గఅఅకఅఅ - పర
సా ,, సాసా - నిససమగా , ససా	సనిగస - నిదసని	దమనిదమా దని
త ,, త్వము - గఅనుఉఊ , గొను	వఅఅఅ - రిఇకెఏ	గఅఅఅక - పర
నిసా , సాసని - నిససగాగసా	సనిగస - నిదసని	దమదమ - గమదని
తఅ , త్వముఉ - గఅనుఊగొను	వఅఅఅ - రిఇకెఏ	గఅఅకఅఅ - పర
నిసా , సాసా - సమగమగ ససా	సనిగస - నిదసని	దమదమ, గస, సమ
తఅ , త్వము - గఅనుఉఉగొను	వఅఅఅరిఇకెఏ	గఅఅఅ కఅ పర

మాత్మ్రని దరిజేరగనా నా॥

చరణము:

		,, - ,, - ,, సమ
		,, - ,, - ,, ధఅ
మా ,, మా - మా ,, మా - మా ,,	, ద - గమాదమా	గా సా - ,, సమ
ర్మార్ధకా ,, మ - మో ,,	, ఒక్షఅర్వాత	కై ఈ - ,, ధఅ
మా ,, మా - మా ,, మగ - గమదని	సానిదాసనీ	దమగసా, - సమ
ర్మా ,, ర్ధకా ,, మఅమొఒఒఒ	ఓక్షఆర్వాత	కైఇఇఈ, - మఅ
మగమగసా - సనిగస - నిదనిదనీ	,, సమామగా	మామా - మా - సమ
ర్మఅఅఅంబు-లన్న్న్-తెఎలిఇయా	,, జఆలనీ	నరు - లు - మఅ
గమదమ - గమగస - గసనిదనిదనీ	,, సగమా , మగా	మామా - మా - మద
ర్మఅఅఅంబుఉలన్న్న్ తెఎలిఇయ	,, జఅఆ , లని	నరు - లు - కఅ
గా ,, మామా - దాదా - నీదా	నీసా - సాసని	గసనిసనిద - మద
ర్మా ,, నుభ - వం - బని	తెలు - సుకొాఒ	నఅకఅఅఅ - కఅ
మగగా - మామా - దాదా - నీసనిదా	దనిసగ - సగమగ	సగసనిదమ - దని
ర్మఅఆ - నుభవం - బఅఅనీ	తెఎలుఉ - సుఉకోబ	నఅఅకఅఅ - నిఇ
సా ,, - సాసా - ,, నిసాగసా	సనిగస - నిదనీ	దమదమ, గమ - దని
ర్మా ,, తనా - ,, నిందిం	చెఎనుఉ - వఅఆ	రిఇకిఇఇఇ - నిఇ
నిసా , - సాసా - నిససగాగసా	సనిగస - నిదసని	దమదమ, గస - సమ
ర్మఆ , - తను - నిందింంం	చెఎనుఉ - వఅఅఅ	రిఇఇకిఇఇ - పర

మాత్మని దరిజేరగనా॥

చిట్టస్వరము.

		,, - ,, - ,, గా
మద గమదమ గమగస నిసనీసద	నిసనిస - మాగమ	గమదగ - మానిద
నిమదనిస నిసమాగ నిసానిమద	, దగమా - మగస	నిదనిమ - గమ॥ పర

మాత్మని దరిజేరగనా॥

శక్తి క్రమేణా క్షీణించుట

మలేరియా జ్వరపీడితులు నిర్బలులగుటచే ఏ ఆహారమును తినజాలరు.

జ్వరము మిమ్ముల నెందుకు నిశ్శక్తులుగా చేయును? జ్వరపు విషము రక్తములోకలిసి, నరస్నాయువులలో ప్రవేసించి మీ సకలావయవములను బలహీనముగా చేయునని డాక్టర్లు చెప్పుదురు.

కడుపు ఈబాధను తప్పించుకొనజాలదు. జీర్ణశక్తి తగ్గుటచేత కడుపునకు శ్రమ. మలేరియా జ్వరపీడితులు నిశ్శక్తులగుటచే ఏ ఆహారమును తినజాలరు.

అలసిన దేహమునకు ఆహారము అవసరము హార్లిక్సు తగుమైన ఆహారము. ఇది జీర్ణశక్తికి ఏలాటి హానినికలుగ జేయక, సులభముగా జీర్ణమై, అలసిన నరస్నాయువులకు పటుత్వమునిచ్చి, రోగమును పూర్తిగా నిర్మూలించును.

H. 477 C.

★ వరలక్ష్మీదేవి ★

శ్రీమతి ద్రోణంరాజు లక్ష్మీబాయమ్మ

శ్రావణభాగ్యలక్ష్మి! అహా! స్వాగతమమ్మ! దయామయీ! జగ
త్పావని! లోకపాలన విధానమతిన్ దయచేసినావె? ని
న్నేవిధినర్చసేయగల నీహృదయస్థితవై యథేచ్ఛగా
సేవలనంది వేనగవుచిందుల దీవనలిచ్చి బ్రోవుమా!

దీనహృదయాలపై పరాధీనమతిని కొలువుదీరిచి గుణములు కొలుతువంట!
కాన్కనిడుచుంటి నామనఃకమలదళము మనసుకందినదో? యొకమాటదెల్పు.

శ్రావణి! ఏవియత్పథపుచాయలలో విహరింతొ చూపుకే
రావొక యేటిదాకను, పరామృశియింపుట లెప్పుడూరకే
పోవుదా? మాకుటీరముల పొంతనొకించుక నిల్చి వర్ష దు
ర్భావమెడల్చిమమ్ము వరలక్ష్మి దయామతి నాదరింపవే.

చల్లగావచ్చి శ్యామలశాద్వలములు ననలుగొనుచున్నవో ఏమొ? గనుమొకింత
వేడివేలుపు కాకలవాడిపోవు ఆలప్రేగులదన్పు తీయనిజలాల.

శ్యామల! దేవి! నీచరణ సారసయుగ్మము నాశ్రయించి చే
తో ముదమొంద గ్రామయువతుల్ నిను నిత్యము బూజసేతురీ
సీమలె సర్వదావిడిది సేయగనీ కనువైనపట్లు ఏ
మేమొదలంచి యన్యమొనరింపకు మాపిలుపుల్ గ్రహింపుమా!

నిలిచినెమ్మది ఎటునిను గొలువవలెనో తెలుపకున్న మాచేతకాగలది యేమి?
తామసింపకు లోక సంత్రాణమునకు విడిసినేడిట మావిందు గుడిచిపొమ్ము.

కలిమితల్లికి చదువులలలితకొకట పొందువడదంట ఇదియేటి పోటుమాట?
వమ్మగాదాని ముల్లోకపాలకులును నిలిచి మాగృహముల సమర్చలనుగొనుడు.

వచ్చుబోవునెప్పుడు మగవారికేవొ పర్వములు మనకేటికి? వానిజోలి
కనుల పండువుగా పండుగలనుదనిపి ప్రముదమిడరమ్మ త్రైలోక్య రాణులార!

రండి! మాతల్లులార! ఏపండుగలకు లోటుచేయక మాపేద లోగిళులకు
క్రమముగా దసరాలు, సంక్రాంతిగడపి కలిసిరారమ్మ యొకట యుగాదినాడు.

భారతీయనారి

★

శ్రీ స్వామి వివేకానంద

అనువాదం : శ్రీ పూర్ణానంద

నేను వివాహ మొనర్చుకొను ఆచారములేని సాంప్రదాయమునకు జెందియున్నాడను. అందువలన తల్లి, భార్య, కన్య, సహోదరీరూపముల ఇతరులవలె నారితో సంబంధ మొడగూరుట నాకు వీలు లేదు. తరువాత నేను గుర్తించు కొనవలసిన మరొక విషయము. భారతవర్షము కేవల మొక దేశముకాదు. అయ్యది విశాలమగు మహా ఖండము. అచ్చట చాలకుటుంబము లున్నవి.

నేను ధర్మ ప్రచారకుడనై ఎడతెగకుండ దేశదేశాంతరముల పరిభ్రమించి, సంఘమునందలి విభిన్న స్తరముల సంస్పర్శను బొంది, స్త్రీ జాతియొక్క పరిచయమును బొందువీలును ఇతరులకంటె నెక్కుడుగానే బొందితిని. ఉత్తర భారతమున పరదా విధానము విరివిగనున్నను, తద్దేశీయ నారులు ధర్మము కొఱకై ఈ నియమము నుల్లంఘింతురు. నావంటి పరివ్రాజకునితో సంభాషించుట, లేక ఉపదేశమును గ్రహిప సంకోచింపరు. అయినను నేను భారతీయనారి విషయమున సర్వజ్ఞుడనని నొక్కి చెప్పజాలను.

అందువలన, నేను కేవలము మీ సమ్ముఖమున భారతీయనారి ఆదర్శమును జూప యత్నింతును. ప్రతిజాతికి జెందిన నరుడును నారియును ఒక ఆదర్శమును గ్రహించును. జ్ఞాన పూర్వకముగనో లేక తద్వ్యతిరిక్తముగనో అయ్యది వారి జీవితమున ప్రతిఫలించును. వ్యక్తి ఆదర్శముయొక్క బహిప్రకాశము. ఇట్టి వ్యక్తుల సమిష్టియేజాతి. ఈ జాతికి ఒకానొక ఆదర్శముండును. దానివైపునకే జాతియొక్క నిరంతరగతి. అందువలన, ఏదైన ఒకజాతిని ఎఱుగవలెనన్న, మొట్టమొదట దీని ఆదర్శము యొక్క పరిచయమును బొందుటావశ్యకము అను అభిప్రాయము అత్యంత సత్యము. ఏలయన, ఇతర జాతి స్థాపించిన మానదండమున విచారింపబూనుకొనిన ఏ జాతియొక్క పరిచయము బొందుట సంభవము కాదు.

వృద్ధి, ఉన్నతి, సమృద్ధిలేక అవనతులగుటెంచి చెల్లు బడిలోనున్న ఏ తూకమును గ్రహించినను, ఈ అభిప్రాయమే లభింపగలదు. ఏ వ్యక్తియొక్క యదార్థ పరిచయమును బొందగోరిన, తత్సంబంధమగు స్థాపిత మానమును (Standard) గ్రహింపవలెను. ఇయ్యది ఆ జాతియొక్క జీవితమున స్పష్టముగనే ప్రతీతమగును. ఒక జాతి దృష్టిలో ఉత్తమ మగునది, మఱియొక్క జాతి దృష్టిలో ఉత్తమము కాకపోవచ్చును. దగ్గిర సంపర్కమున్న అన్న చెల్లెళ్ల పెళ్లి ఈ దేశమున (అమెరికా) సంపూర్ణముగ అనుమోదితము, కాని భారత దేశమున నియ్యది న్యాయవిరుద్ధము; కేవలము న్యాయవిరుద్ధమేకాదు, బీభత్సమగు వ్యభిచారముతో సమానము.

ఈ దేశమున విధవా వివాహము న్యాయవిహితము. కాని, భారత దేశమున ఉన్నత వర్ణముల మధ్య నియ్యది సంపూర్ణముగ వ్యభిచారము. మన కార్య కలాపములు ఇట్లు, విభిన్న భావముల నియంత్రితములగుచున్నవని మన మిప్పుడు గాంచగలుగు చున్నారము; అందువలన నొకజాతిని మరియొక జాతియొక్క ఆదర్శముతో విచారించుట కేవల మన్యాయమే కాక, అసంభవముకూడ. ఆ జాతి ఏ విశేష ఆదర్శమును నిర్మించినది గ్రహించుటుచితము. విభిన్న జాతుల గుఱించి . ఆలోచించునప్పుడు, మనము అన్ని జాతుల ఆదర్శము ఒకటేయను అభిప్రాయమున నడుతుము. మన విచారముయొక్క పర్యవసానము మనకు మంచిదైనది, ఇతరులకుగూడ మంచిది. మన ఆచారమే మంచిది. మన మాచరింపనిది ఇతరుల పట్లగూడ గర్హితము. నేను

కేవలము నిమర్శించుటకొఱకై ఇట్లు నుడువుచున్నానను కొనవలదు. ఈ సత్యమును మీ అంతరమున ప్రవేశింపజేయ వాంఛితును. అమెరికాయువతులు చీనా యువతులను లోహ పాదుకల నుపయోగించి, పాదముల హ్రస్వీకరింతురని ఆక్షేపించునప్పుడు, వారు తాముపయోగించు కొరసెట్ (Corset) అంతకన్న ఎక్కుడు హానికరమను విషయమును మరతురుకాబోలు! ఇది మాత్రమొక ఉదాహరణ. ఈ కొరసెట్‌ను ధరించుటవలన స్నాయు వికృతి, మేరుదండ వికృతి సంభవించి దేహమునకు గలుగు అపకారముతో బోల్చిచూచిన, పాదముల హ్రస్వీకరించుటవలన గలుగు నష్టము లక్షాంశమున ఏకాంశముకూడగాదు. తులజూచు సమయమున ఈ వికృతము లన్నియును పట్టుపడును. ఈ విషయముల నేను కేవలము తప్పుల బట్టుకొన జెప్పుటలేదు. మీరు మిమ్ముల శ్రేష్ఠులుగదలచి ఇతర దేశముల రమణుల ఆచరణమున కులిక్కి పడునట్లు, వారు మిమ్ముల ననుకరింపకున్నందు వలన వారుగూడ మీరీతి నీతులగాంచి ఉలిక్కి పడుదురని నిరూపింప గోరుచున్నాడను. అందువలన పరస్పరము గ్రహించుటయందు వెలితియున్నదని తేలుచున్నది. కాని, ఒకానొక సాధారణ మూలమున్నది. ఒక సాధారణ జ్ఞాతవ్య ప్రదేశమున్నని. ఒక సాధారణ మానవ ధర్మమున్నది. అయ్యదియే మన కార్యమునకు సార్వజనీన మూలము కాగలదు. ఏ మానవ ప్రకృతియొక్క ఆంశికవికాసము సర్వత్ర కానబడుచుండునో, దాని సంపూర్ణతను వెదికి వెలికి దీయవలసి యుండును. ప్రకృతి ఏ వ్యక్తికిని సర్వవిషయముల సంపూర్ణత నొసగి యుండలేదు. మీరొక విశేషభూమికను ధరించి సంసార రంగమున బ్రవేశించినారు. ఎంత క్షుద్రమేయవనిమ్ము నావుగూడ ఒనర్పవలసినది ఒకించుక యున్నది; ఇతరులకుగూడ ఒనర్ప వలసినది ఒకించుక యున్నది. ఇట్లే మఱియొకనికిగూడ. వ్యక్తుల మొత్తమే సమిష్టి. వ్యక్తిపక్షమున నెయ్యదియో, సమిష్టి పక్షమున గూడ నయ్యదియే. ప్రతిజాతికి ఒనర్పవలసినది ఒకించుక యున్నది; ప్రతిజాతికిని మానవ ప్రకృతియొక్క ఒక దిక్కును వికసింపజేయు భారమున్నది. మనమీ భావముల నన్నిటిని ఒకట గ్రహింపవలసి యున్నారము. సుదూర భవిష్యత్తున, ఈ విభిన్నజాతుల ఉపలబ్ధియగు విశేష అపూర్వ సిద్ధుల నన్నిటిని సమ్మిళిత మొనర్చు ఒకజాతి ఉద్భవింపగల ఆశయున్నది! ఈ జాతియొక్క ఉద్భవము జగత్తుయొక్క అపూర్వస్వప్నము. ఈ విషయముగాక నాకాలోచింపవలసిన దేమియును లేదు. నా జీవితమున నేను విశేషముగా జగత్తున పరిభ్రమించితిని కాని, సర్వదా నా దృష్టిని ప్రసారిత మొనర్చి యుంచితిని. తిరుగు కొలది నా నోరు కట్టుపడుచున్నది. సమాలోచింపవలసిన దేమియు కనబడుట లేదు.

భారత దేశమున మేము ఆదర్శ రమణిని గుఱించి భావించు నప్పుడు, మాతృ భావమే మాయెదల నుదయమగును. మాతృత్వమే దాని ఆరంభము, మాతృత్వమే దాని పరిణామము. భగవానుని వారు 'అంబా' యని పిలుతురు. బాల్యకాలమున చిన్న పిల్లలు ప్రత్యహము ప్రాతఃకాలమున తల్లి యొక్క పాదోదకమును పాన మొనర్తురు.

పాశ్చాత్య దేశమున నారి, స్త్రీ శక్తి. అచ్చట నారీత్వము యొక్క అవగాహన స్త్రీ శక్తి యందే కేంద్రీభూతము. భారతదేశమున సాధారణ మనుష్యుని కడగూడ సమస్త నారీ శక్తి మాతృత్వమున ఘనీభూత మగుచున్నది. పాశ్చాత్య దేశముల భార్యకుటుంబమును శాసించును; కాని భారత దేశమున సంసారము మాతయొక్క శాసనాధీనము. పాశ్చాత్య సంసారమున తల్లి, భార్య కధీనమై యుండవలయును; అచ్చట భార్యయే (కోడలు) సంసారమున సర్వమును. తల్లి సర్వదా మా దేశమున మా కుటుంబముననే యుండును; భార్య ఆమె యధీనమున. భావగతమగు సార్థక్య మెంతయో గమనింపుడు.

(సశేషము)

పుష్ప చయము * * *

★ కృత్రిమ సంతానోత్పత్తి-మహాత్ముని భావములు

"మాతృత్వము మంచిదేగాని, విషయలోలత్వము పనికిరాదు. గాజుపాత్రలలో కృత్రిమపద్ధతుల ద్వారా శిశువులను ఉత్పత్తిచేసినచో విషయలోలత్వము, కామప్రక్రియ లుండవుగదా! ఇట్లుచేసినచో ఆధ్యాత్మికాభివృద్ధిగూడ నుండునని మీరంగీకరింపరా?" అనే ఒకప్రశ్నకు మహాత్ముడు యీలా ప్రత్యుత్తరమిచ్చాడు.

"దీనివలనవిషయలోలత్వము నిర్మూలమైతే మీ పద్ధతిని నేను అంగీకరిస్తాను. విషయలోలత్వమువలన పురుషుడు, స్త్రీ బాగుగా అభివృద్ధికాజాలకున్నారను అభిప్రాయము నాకుఉన్నంతవరకు ఈ కృత్రిమ సంతానసాధనములను నేను ప్రతిఘటింపక తప్పదు. నాకు తోచినంతవరకు మీ పద్ధతివలన బుద్ధిహీనులు, రాక్షసులు, కామక్రోధ దుర్గుణపూర్ణులు నుద్భవింతురు. కామక్రోధాదులను నాశముచేయుట మానవుని పరమావధియైయుండ వాటిని వృద్ధిపరచుమానవులు ఈకృత్రిమ సాధనములవలన ఉత్పత్తియగుచున్నారు. కాని నేను ప్రాతకాలపు వాడనని నేను అంగీకరింతును. స్త్రీలు పురుషులు విలాసమునకై నడచుచు, తమపనులకు మోటారుకారులమీద, విమానములమీద పోవు నూతనయుగములో వివాహము రద్దయి, దానిస్థానే క్రొత్త పద్ధతులు రాగలయుగము నాకు యిష్టములేదు.

★ స్త్రీలకు అన్యాయము

ప్రెసిడెన్సీ కాలేజి (మదరాసు) లోని లిటరేచర్ ఆనర్సు క్లాసు సంగతిచూడండి. ఈ ఆనర్సు క్లాసులో మొదటి తరగతి (3rd years Hons) లో ఈ సం|| 14 మంది విద్యార్థినిలు చేరారు. కాని విద్యార్థులలో ఒక్కడే. అంతకు పైతరగతి (4thyear) లో ఆడువారి సంఖ్యలో సగముమాత్రమే మగవారు. ఆఖరుతరగతిలో ఆడువారిసంఖ్యలో మూడవవంతు మాత్రమే మగవారు. ఇతర క్లాసులలో మామూలే! కాని ఈసారస్వతం తరగతుల్లో ఆడువారిదే పైచేయి. మొదటితరగతిలోని విషయాల్నిచూచి కాలేజీ అధికారులు బెంబేరెత్తారు. ఇలాఉండడం తమ పురుషహోదాకు అవమానకరమనుకున్నారు కాబోలు! మరికొంత మంది మగవారికి ఎలాగో నచ్చచెప్పి బలవంతాన అయినా ఆ క్లాసులో చేర్చడానికి ప్రయత్నిస్తున్నారు. చేరిన 14 మంది ఆడువారికి ప్రత్యేకపరీక్షలు పెట్టి కొంతమందిని తీసివేయడానికి ప్రయత్నిస్తున్నారట. ఇదే నిజమయినట్లైతే ఇదెంతవరకు న్యాయమో లోకం ఆలోచించాలి, సారస్వతం పట్లఎక్కువ అభిమానంగలిగి ఎక్కువమంది ఆడవారు ఆ క్లాసులోచేరితే వీరికి వచ్చిననష్టం ఏమిటి? ఆడవారి అధికసంఖ్యను తగ్గించడానికి మాయోపాయాలెందుకు? ఇదే నిజమయినట్లయితే స్త్రీ జాతి; ముఖ్యంగా విద్యావంతులు దీనిని తమకొక అవమానంగాపాటించి తగిన చర్యతీసుకోవాలి. ప్రెసిడెన్సీ కాలేజిలో స్త్రీలు పురుషులను ఇలాంటి దీనస్థితికితరిమారు. ఆంధ్రవిశ్వ విద్యాలయంలో కూడ సోదరీమణులు ఇలాంటి విజయం పొందిరన్న శుభవార్త వినేభాగ్యం ఎన్నటికో?

(కాగడా)

★ ఇంజనీరింగు కాలేజీలో స్త్రీలు

ఈ సంవత్సరం ఇంజనీరింగు కాలేజీలో యిద్దరు యువతులు చేర్చుకోబడ్డారు. ఇంజనీరింగు కాలేజి చరిత్రలో యిదే ప్రధమ పర్యాయముగ స్త్రీలు యీ సంవత్సరము చేర్చుకోబడ్డారు.

★ ప్రాణాయామమువలన స్త్రీల కారోగ్యము

కుడిచేతి బొటనవ్రేలితో కుడిముక్కును మూసుకొని నెమ్మదిగా ఊపిరిపీల్చి బాగా స్తంభించిన తర్వాత క్రమముగా ఊపిరి విడవాలి. మరల 6 సెకండ్లు స్తంభించి తిరిగి ఊపిరి పీల్చాలి. ఈరీతిగా 15 సార్లు చేసిన తర్వాత ఎడమముక్కు మూసుకొని కుడిముక్కుతో అదేవిధంగా అభ్యసించాలి

నోటితో తొమ్మిదిసారులు ఊపిరిపీల్చి 4 సెకండ్లు స్తంభించి మరల నోటితోనే 12 సార్లు ఊపిరి విడవాలి. ఒకరోజుకు ఈ విధముగా 20 సార్లుచేస్తూ, 50 వరకు ఒక్కొక్కటి చొప్పున వృద్ధిచేసు కుంటూ రావాలి.

ఒక కుర్చీలో తిన్నగాకూర్చుని నోటితో బాగా ఊపిరిపీల్చి, నోరుమూసుకొని గడ్డముతో మోకాలు నంటునంతవరకు వంగి నెమ్మదిగా ముక్కుతో ఊపిరిని బయిటికి విడవాలి. రోజుకు 8 వంతున ఇట్లే హెచ్చించి 16 వరకు చేయాలి.

తిన్నగా నిలబడి రొమ్మున గడ్డమంటునట్లుగా వంగి చివుక్కున తలను వెనకకు వంచి ఊపిరిపీల్చి బాగా స్తంభించి మరల ముందుకు వంగి ఊపిరివిడవాలి. ఇట్లే 60 సార్లతో ప్రారంభించి నూరువరకు రోజుకొక్కటిగా హెచ్చిస్తూరావాలి.

తిన్నగా నిలబడి రెండుచేతుల ఒక్కసారిగా మొదట కుడిప్రక్కగా తర్వాత ఎడమప్రక్కగా ఊపుతూ ముక్కుతో ఊపిరిపీల్చాలి. దీన్ని 30 లో ప్రారంభించి 50 వరకు రోజుకొక్కటిగా హెచ్చించుకోనాలి.

ఇసుకకడ్డీ వ్యాయామము

ఎత్తుగా అమర్చబడిన కడ్డీని రెండుచేతులతో పట్టుకొని, ఎడమకాలి బొటనవేలు భూమికాన్చి కుడికాలిని ముందుకు వెనక్కు బాగా ఊపాలి. ఇట్లేకాలుమార్చి కాలు 25 సార్లు ఊపాలి. 50 వరకు హెచ్చించు కొనవచ్చు.

కుడిచేతితో కడ్డీని పట్టుకొని ఎడమచేతి ప్రక్కకున్ర్వాలి, అదేతీరున ఊపుతూ, ముక్కుతో ఊపిరి పీల్చాలి. మరల ఎడమచేతితో పట్టుకొని ఆవిధముగానే ఊగాలి.

రెండుచేతులతో కడ్డీలను పట్టుకొని కాళ్లుపైకెత్తి మోకాళ్లుముడుచుకొని ఇటు అటు ఊగాలి. నోరు మూసుకొని ముక్కుతోనే శ్వాసపీల్చాలి.

రెండుచేతులతో కడ్డీని పట్టుకొని గడ్డముకూడ కడ్డీకిఆన్చి, వూపిరి బిగపట్టి 4 సార్లు ఊగాలి. ఇట్లే మూడుగోజుల కొకటిగా హెచ్చించి, 25 సార్లవరకు అభ్యసించాలి.

★ శ్రీమతి విజయలక్ష్మి పండిట్ గారికి చైనానుండి ఆహ్వానం

"మీరున్ను మీప్రతినిధివర్గము వారందరున్ను చీనాకు రావలెనని చీనాలో యావన్నంది స్త్రీలపక్ష మునను నేను సంతోషపూర్వకంగా మిమ్మల్నందరినీ. ఆహ్వానిస్తున్నాను. జపానువారి విమానాలు పట్ట పగలువెలుతురు బాగుగా వున్నప్పుడుకూడ నిరపరాధులైన ప్రజలమీద సైతముబాంబులను వేస్తున్నాయి కనుక మీరందరూ అక్టోబరులోగాని నవంబరులోగాని రాగోరుతాను." అంటూ డిక్టేటర్ మార్షల్ చియాంగ్-కే-షేకుగారి భార్య శ్రీమతి విజయలక్ష్మి పండిట్ గారికి వ్రాసినారు.



గోధుమలుతో తయారుచేయదగిన వివిధ పదార్థములు 2.

బెనారస్ కాజా

ఒక అరవీశ గోధుమపిండి, అరసోలెడు నెయ్యి, కొట్టినఉప్పు ఒకచిటిక, వీటిని నీటితో గట్టిగ కలపవలెను. 2 గంటలు నాననిచ్చి నేతితో బాగ మర్దించి నిమ్మకాయంత వుండలు చేసివుంచి, అరపంపు శనగపిండి, 1 పంపు నెయ్యికలిపి, ఒకపూరీవత్తి దానిపై నెయ్యితో కలపిన శనగపిండి రాయవలెను. తరువాత మరియొకపూరీ పైనవేసి చాపవలె చుట్టవలెను. దానిని అడ్డముగ చాకుతోకోసి, అప్పడాలకర్రతో ప్రతిముక్కను నిలువుగ ఒకసారి మాత్రం వత్తవలెను. అరవీశ పంచదార పాకం లేతగాపట్టి సన్ననిప్పశగమీదవుంచి, 1 శేరు నెయ్యి బూర్లమూకుటులోపోసి బాగా మరగనిచ్చి కాజాలు సరిగవేయించి పాకంలో వేయవలెను. 5 నిమిషములకు వాటిని మరియొకచోట పెట్టవలెను. ఒక ఏబులం పంచదార వేరేపాకం పట్టి ఆకర్ని కాజాల పైనపోయవలెను.

రవ కేసరి

నాలుగుతులముల నెయ్యి కాగనిచ్చి, పావుశేరు గోధుమనూకను వేసి కమ్మగావేయించి, అర్ధశేరు పాలుపోసి వుడకపెట్టవలెను. 10 నిమిషము లుడకనిచ్చి, పావుసేరు పంచదారనువేసి కలిపిన తరువాత, పావు తులం ఏలకపొడి, 1 తులం కిస్‌మిస్, 4 తులముల జీడిపప్పు నేతిలోవేయించి, ¼ తులం కుంకుమపువ్వు, వేసి కలియపెట్టి, అరపంపు నెయ్యికాచి పోయవలెను 5 నిమిషములకు దింపి పళ్లెంలో పెట్టవలెను.

రవ దోసె

ఒకతవ్వ గోధుమనూక, అరసోలడు వరిపిండి, సోలడుమజ్జిగ 1 తవ్వ నీరుపోసి సాయంత్రం కలపవలెను. మరునాడు, అల్లం ఒకతులం, అరతులం పచ్చిమిరపకాయలు, అరతులం ఉప్పు మెత్తగా రోటిలో తొక్కి వేయవలెను. 4 తులములు కొబ్బరి కోరువేసి, తావా రేకుమీద నెయ్యివేసి కాగినతరువాత అట్లు వేయవలెను. దోశె వేగినపిదప తిరగవేసి కొంచెం నెయ్యివేసి తీయవలెను.

పాల పూరీ

ఒక ఏబులం గోధుమపిండి, అరసోలడుపాలు, 2 తులములు నెయ్యి కందిబద్దంత ఉప్పువేసి నీటితో గట్టిగ కలపవలెను. 2 గంటలు నాననతర్వాత మర్దించి అవసరమయినంత వుండలు చేయవలెను. 1 శేరు పాలుకాచి, ఏబులం పంచదార, పంపు నేతితో వేయించిన జీడిపప్పు, 4 తులములు కిస్‌మిస్, అరతులం ఏలకపొడి వేసి కలపవలెను. అరవీశెనెయ్యి మరగనిచ్చి, కొంచం దళసరిగవత్తి పూరీలు వేయించవలెను. వేగిన పూరీలు పాలలో వేయవలెను.

రవ ఇడ్డెన్

పావుశేరు మినపప్పు, 4 గంటలు నీటిలో నానపెట్టి మెత్తగా రుబ్బవలెను. ఒకతవ్వ గోధుమ నూకను కలిపి సాయంత్రం వుంచవలెను. ఒకతులం పచ్చిమిరపముక్కలు, అరతులం అల్లంముక్కలు, అరతులం కొట్టినఉప్పు పిండిలోకలిపి, ఇడ్లీపాత్రతో మామూలుగా వండవలెను.

రవ లడ్డు

అరపడి గోధుమనూకను అళాను నెయ్యివేసి వేయించవలెను. 5 ఫలముల జీడిపప్పు, 2 ఫలం కిస్‌మిస్ నేతిలో వేయించి వేయవలెను. అరపడి పంచదార, 1 తులం ఏలకపొడి ఒక కొబ్బరికాయ కోరి వేయించి అన్ని వేగిన నూకలో కలపవలెను. ఒకఆళాను కాచిననెయ్యి, 2 ఆళాసుల కాచిన పాలుపోసి మొత్తం అన్నికలిపి వుండలు చేయవలెను.

రవ ఒడియాలు

మూడుతవ్వలనీరు వెడల్పుగిన్నెలో మరగనిచ్చి, ఒకతులం ఉప్పు, 2 తులములు పచ్చిమిరపకాయలు మెత్తగా రుబ్బి నీటిలో వేయవలెను. శనగగింజంత ఇంగువపొడి, అరసోలడు సగ్గుబియ్యంపోసి 15 నిమిషములు వుడకనిచ్చి ఒకతవ్వ రవపోసి అరగంట వుడకపెట్టి దింపవలెను. ఒక తడిబట్టమీద జంతిగి కర్రతోతిప్పి ఎండ పెట్టవలెను. 4 ఎండలుఎండిన తర్వాత, నెయ్యి మరగనిచ్చి వేయించవలెను.

రవ పులిహోర

1 తవ్వనీరు మరగపెట్టి 1 పావుసేరు రవపోసి నీటిని బాగా వార్చవలెను. 5 నిమిషములకు దింపి పళ్లెంలోనికి తీసి పావుతులం కొట్టినఉప్పు, కొంచం కర్వేపాకు, వడ్లగింజంత పసుపు, 2 తులముల మంచినూని వేసి కలపవలెను. ఒక గిన్నెలో 2 తులముల నెయ్యివేసి అరతులం ఎండుమిరపముక్కలు, తులం మినపపప్పు, అరతులం ఆవాలు, తులం శనగపప్పు, శనగబద్దంత ఇంగువ, పావుతులం మెంతులు, అన్ని ఎర్రగావేయించి, పావుతులం కర్వేపాకువేసి, నూకను పోపులోవేసి బాగా కలియపెట్టి 3 నిమ్మపళ్లుకోసి రసం పిండవలెను.

పాకం పూరీ

అరవీశ గోధుమపిండి, 4 తులముల నెయ్యివేసి నీటితో గట్టిగకలిపి 2 గంటలు నానినతరువాత నిమ్మకాయంత వుండలుచేసి అర్ధరూపాయ దళసరి పూరీలు వత్తవలెను. శేరు పంచదార లేతపాకంపట్టి సన్నని నిప్పుమీద వుంచవలెను. శేరు నెయ్యి కాగనిచ్చి పూరీవేయించి పాకంలోవేసి 5 నిమిషములకు తీసి వేరే వుంచవలెను.

గోధుమ జిలేబీ

ఒకగ్లాసు గోధుమపిండి, 8-వ వంతు మజ్జిగ, నీరుపోసి పెరుగువలె కలపవలెను. 2 గంటలు నానపెట్టి, 4 గ్లాసుల నెయ్యి వెడల్పయిన పాత్రలోపోసి మరగనిచ్చి జిలేబీగిన్నెతో పిండిని తిప్పవలెను. 2 గ్లాసుల పంచదార లేతపాకంపట్టి వేగిన జిలేబీ వేయవలెను. 10 నిమిషములకు తీసి వేరే పెట్టవలెను.

—శ్రీమతి సి. హెచ్. అన్నపూర్ణాబాయి.

ఉడికించిన రొట్టెలు

ఒక శేరుపాలను కళాయిపాత్రలోపోసి అర్ధశేరుపాలు అయ్యేటట్లు మరిగించవలెను. తరువాత 13 తులముల పంచదారనువేసి కలుపవలెను. వుడుకుచున్నపాలలో 4 తులముల నెయ్యివేసి గరిటెతోకలిపి దింపవలెను 18 తులముల రవ్వను 9 తులముల పాలలోకలిపి మర్ధించి వుసిరికాయలంత వుండలుగాచేసి అప్పడములవలెచేసి వీటినిఒత్తి ఆవిరిలో వుడికించి తీసి సిద్ధమైయున్న పాకములో వేయవలెను.

బియ్యము రొట్టెలు

5 తులముల గోధుమపిండి 12 తులముల బియ్యపుపిండి పావుతులం వుప్పు పళ్లెములోపోసి 8 తులముల నీటిలోకలిపి మర్దించి నిమ్మకాయలంత వుండలుచేసి పూరీలాగునే వెడల్పుగాఒత్తి పెనముమీద కాల్చి వెంటనే నిప్పులమీద కాల్చవలెను.

రవ్వ-శనగపిండి కలిపిన జిలేబీ

40 తులముల రవ్వను 8 తులముల శనగపిండి 4 తులముల బియ్యప్పిండి 8 తులముల నెయ్యి ఈ నాలుగింటినీ కళాయిపాత్రలోపోసి నీళ్లతోకలిపి దానిలో 3 నిమ్మకాయలరసమును కలుపవలెను. తీగసాగిన రీతిగా కలిపి ఒకరాత్రి వుంచవలెను. ప్రొద్దున్న 60 తులముల చక్కెర ఒక కళాయిలోవేసి దానిలో ఒక గిద్దెడుపాలు గిద్దెడునీళ్లువేసి కలిపి పొయ్యిమీదపెట్టి లేతపాకమురాగానే దింపవలెను. కాగిన నేతిలో కలిపియుంచిన పిండిని ఒక కొబ్బరిచిప్పలో వేసి జంతికలువలె తిప్పి వేగినతరువాత పాకములోముంచి తీయవలెను.

—శ్రీమతి గోపరాజు వెంకటరత్నమ్మ.

పొటేటో భాత్

$\frac{1}{2}$ శేరు గోధుమనూకను కొలిచిపెట్టుకొనవలయును. ఒక కొబ్బరికాయను కొట్టి, దానిని పాలుతీసి వుంచవలెను. 10 ఫలముల బంగాళదుంపలను ముక్కలుగా కోసి, 3 ఫలముల వుల్లిపాయలును, 6 పచ్చిమిరపకాయలును పొడవుగా తరిగి వుంచుకొనవలెను. 1 ఫలం నేతిలో 2 ఫలముల జీడిపప్పును ఎర్రగా వేయించవలెను. 5 ఏలకపండ్లను చితకగొట్టి, దానితో ఒక కానీ బిరంజి ఆకు, ఒక కానీ లవంగపట్టను జతచేర్చి, పై నెయ్యిలో పోపుపెట్టి, నీరుల్లి ముక్కలను, పచ్చిమిరపకాయ ముక్కలును దానిలో ఎర్రగా వాడ్చిన పిదప బంగాళాదుంప ముక్కలను అందులోవేసి, కొబ్బరిపాలున్నూ, కొంచెము నీరున్నూ కలిపి, మొత్తం $\frac{3}{4}$ శేరుగా వుండేటట్లు కొలిచి, దానిలో 1 చంచా వుప్పునువేసి, పై పోపులో పోసి, అది మరిగినపిదప గోధుమనూకను వేసి, జీడిపప్పును వేసి కలిపి దించవలెను.

సొజ్జి

$\frac{1}{4}$ శేరు గోధుమనూకను $\frac{1}{4}$ తూనిక శేరు బెల్లం పాత్రలోవేసి, $\frac{1}{4}$ శేరు నీరుపోసి మరగించవలెను. వుడికిన అది మరగినతర్వాత దానిలో గోధుమనూకనువేసి కలుపుతూ, 1 ఫలం నెయ్యిపోసి బాగుగా కలిపి, తర్వాత 8 ఏలక్కాయల పొడివేసి, 1 ఫలం జీడిపప్పు, 1 ఫలం ద్రాక్షవేసి కలిపి దించుకొనవలెను.

గవ్వలు

2 కొబ్బరికాయలు కోరి, చిక్కగా ¼ శేరు అవునట్లుగా పాలుతీసుకొని, శేరు గోధుమనూకను ఈ పాలతో తడిపి బాగా ముద్దఅయేలాగున కలిపి వుంచవలెను. 4 గంటలసేపు నానినతర్వాత దానిలో చిటికడు కొట్టిన వుప్పును వేసి బాగా మర్దనచేయవలెను. 15 నిమిషములు మర్దనచేసిన తర్వాత గచ్చకాయ అంత వుండలుచేసికొని, దానిని గవ్వలపీటమీదగాని లేక సన్న పండ్లదువ్వెనమీదగాని ఒక్కొక్కవుండను బొటనవ్రేలితో గట్టిగా అదిమి, తర్వాత దానిని చుట్టలవలె చుట్టవలెను. పొయ్యిమీద పాత్రనువుంచి దానిలో ½ వీశ పంచదారను అరగ్లాసు నీరుపోసి కొంచెము ముదురుపాకమును పట్టవలెను. గోరుమీదవుంచిన ముద్దగా నిలుచునట్లు పాకము పట్టవలెను. తర్వాత కళాయిలో నెయ్యి 10 ఫలములను మరగించి పై గవ్వలను కొద్దికొద్దిగా ఎర్రగా వేయించి వాటిని పాకములో వేయవలెను.

డయిమన్ కట్స్

½ శేరు గోధుమపిండిని ముద్దగా తడిపివుంచవలెను. 2 గంటలసేపు నానినతర్వాత బాగా మర్దన చేసి నిమ్మకాయంత సైజు వుండలను చేసికొని పూరీలు వత్తవలెను. తర్వాత దానిని చాకుతో నలుచవుకముగా రెండణాల కాసు అంత వురవున కోసికొని, 10 ఫలముల మరగిన నేతిలో ఎర్రగా వేయించి తీసుకొనవలెను. తర్వాత 15 ఫలముల పంచదారను కొంచెము లేతపాకముగా పట్టి వేయించిన డయిమన్ కట్స్‌ను అందులో వేయవలెను.

రవ లడ్డు

10 ఫలముల నెయ్యిని మరగించి 5 ఫలములు సన్నగాకోసిన జీడిపప్పు, 2 ఫలముల ద్రాక్షను ఎర్రగా వేయించి తీసుకొనినపిదప ఆ నేతిలో ½ శేరు గోధుమనూకను వేయించి గోటిలోవేసి మెత్తగా దంచవలెను. గుండ అయినపిదప ½ శేరు (బూరా) పంచదారను వేసి, జీడిపప్పు, ద్రాక్ష, 10 ఏలకకాయల పొడుము, ¼ తులం కుంకుమపువ్వును వేసి ఎంత వురవు కావలెనో ఆరీతిగా వుండలు కట్టవలెను.

పాకము లడ్డు

5 ఫలముల నెయ్యిని మరగించి దానిలో 5 ఫలముల జీడిపప్పు, 2 ఫలముల ద్రాక్షను ఎర్రగా వేయించి తీసికొనినపిదప ½ శేరు గోధుమనూకను దానిలోవేసి కొద్దిగా వేయించవలెను. తర్వాత ½ శేరు పంచదారను కొంచెము అనగా ఒక గ్లాసెడు నీళ్లతో తీగెపాకమువలె పట్టవలెను. ఆ పాకములో వేయించిన గోధుమనూకను, జీడిపప్పు వగయిరా సామగ్రులను వేసి లడ్డువుండలను కట్టవలెను.

గోధుమ సోమాసిలు

½ శేరు గోధుమపిండిని ముద్దగా తడిపి వుంచుకొనవలెను. ¾ వీశ బంగాళాదుంపలను ముక్కలు కోసి వుడికించి తోలువలచి దానిలో మనకు కావలసిన కారముపొడిని, కొంచెము పసుపుగుండను, కొంచెము కొట్టిన వుప్పును వేసి మెత్తగా చేతితో పిసకవలయును. దానిని కొంచెము నూనెలో మినపప్పు ½ గిద్దడు, ½ గిద్ద శనగపప్పును, కొంచెము కరివేపాకును, కొంచెము ఆవాలును, 2 ఎండు మిరపకాయలను పోపుతో వేయించి బంగాళాదుంపముద్దను వేసి కలబెట్టి తీసుకొనవలెను. పై గోధుమపిండిని చిన్న నిమ్మకాయంత వుండలనుచేసి దానిని పూరీలు వత్తి, దానిలో వేయించిన బంగాళాదుంప కూరను పొదిపి, కజ్జికాయలను చుట్టవలెను. 5 ఫలముల నెయ్యిని, 5 ఫలముల నూనెను మరగించి, దానిలో కజ్జికాయలను మూడేసివంతున ఎర్రగా వేయించి తీసుకొనవలెను.

అత్తిరసములు

½ శేరు గోధుమపిండిలో 5 ఫలముల బెల్లమును పొడిచేసి గట్టిగా తడిపి వుంచుకొనవలెను. ఒక పళ్లెములో 5 ఫలముల గసగసాలను పోసి వుంచుకొనవలెను. పై పిండిని మనకు కావలసిన సైజుగా చిన్నచిన్న బిళ్లలవలె చేతితో వత్తి, 5 ఫలముల నూనెగాని నెయ్యిగాని మరగించి దానిలో బిళ్లలను వేయించి తీసుకొని, వాటిని గసగసాలతో అద్దవలెను.

ఉప్పు బిస్కొత్తులు

1 శేరు గోధుమపిండిని, 1 కప్పు నెయ్యిలో కలుపవలెను. ముందు 1 కప్పు నెయ్యిని చేతిలో రంగరించవలెను. నెయ్యి బాగా నురుగువచ్చినతర్వాత, గోధుమపిండినివేసి ఒకస్పూను టేబిల్ సాల్టును, ఒక స్పూను, బేకింగు (Baking Powder) పొడరునువేసి బాగా ముద్దగా కలుపవలెను. ముద్దకట్టనిచో 2 అవున్సుల పాలతో కలుపవచ్చును. 4 గంటలసేపు నానినతర్వాత దానిని మరల మర్దనచేసి మనకు కావలసిన వురువుగా బిళ్లలనుచేసి దానిని చీపురుపుల్లతో 5 చిల్లులను పొడవవలెను. ఒకపెద్దపాత్రను నిప్పులదాలియందు వుంచి దానిలో 2 సేర్ల యిసుకనుపోసి యిసుక బాగా వేడిఅయిన తర్వాత దానిలో ఒక చిన్నపాత్రనువుంచి పై బిళ్లలను 5 లేక 6 చొప్పున ఎర్రగా కాల్చవలెను. పైన సన్ననినిప్పును దమ్ముపెట్టవలెను.

బరోటా

½ శేరు గోధుమపిండిలో 2 చంచాల పేరిననెయ్యిని వేసి అరచంచా మెత్తని ఉప్పునువేసి బాగా ముద్దగా నీళ్లతో కలుపవలెను. 2 గంటలసేపు నానినతర్వాత దానిని నిమ్మకాయంత వుండలుచేసి పలచగా పూరీవత్తి ఆ పూరీమీద నెయ్యిరాచి దానిని మడవవలెను మరల ఆ మడచిన దానిని పూరీలువత్తి కళాయిలో ఒక్కొక్కదానిని 1 చంచానెయ్యితో కాల్చవలెను.

రవ పకోడీ

1 వంతు గోధుమనూకను 1 వంతు గోధుమపిండిని, 1 వంతు పెరుగుతో తడిపి దానిలో 1 చంచా కొట్టినవుప్పును 4 పచ్చిమిరపకాయలను సన్నగాతరిగి పులుపు యిష్టమున్నపక్షమున అరబద్ద నిమ్మకాయరస మునువేసి బాగుగాకలుపవలెను. బాణలిలో 5 ఫలముల నెయ్యిగాని, నూనెగాని మరగించి దానిలో పైపిండిని పకోడీలవలె వేసి దేవవలెను.

రవ యిడ్లీ

½ శేరు గోధుమనూకను 5 ఫలముల నేతిలోవేయించి దానిని ¾ శేరు గడ్డపెరుగుతో తడిపి దానిలో ఒక చంచావుప్పును 6 పచ్చిమిరపకాయల ముక్కలను 1 తులం అల్లంముక్కలును 5 ఫలముల జీడిపప్పును వేయవలెను. 6 గంటలసేపు నానినతర్వాత దానిని కావలసినసైజుగా యిడ్డెనులు పెట్టవలయును.

—శ్రీమతి ఇమ్మానేని సావిత్రీదేవి.

రచయితలకు బహుమానము

గోధుమధాన్యముతో వివిధములైన పదార్థములను తయారుచేయదగిన పద్ధతులను, ఇంతవరకు ప్రకటించినవిగాక క్రొత్తవి, సరియైన తూనికలతో, కొలతలతో మంచి అనుభవజ్ఞానముతో ఎక్కువ పదార్థములను వ్రాసిపంపినవారికి బహుమతి యొసంగబడును. కాన గమనింప కోరుచున్నాము.

యుద్ధరంగము

- ఫ్రాన్సులో నూతనరాజ్యాంగము
- మధ్యధరాలో మంతనాలు
- ఇంగ్లండుపై జర్మనీ దాడి...?
- హిట్లరు శాంతి సూక్తులు

★ అరుంధతి ★

పశ్చిమఖండంలోని స్వతంత్రరాజ్యాల నన్నిటిని జయించి తన ఏకచ్ఛత్రాధిపత్యాన్ని నిరంకుశంగా సాగించి, ఒక నూతన జర్మను సామ్రాజ్యాన్ని స్థాపించాలనే దురాశతో హిట్లరు వరుసగా పోలెండు, నార్వే, హాలెండు, డెన్మార్కు, బెల్జియం, ఆస్ట్రియా, జెకోస్లవేకియా, లక్సెంబర్గు రాజ్యాల నాక్రమించాడు. హాలెండు, బెల్జియములు హిట్లరు కైవశమయిన తర్వాత ఫ్రాన్సు ఎంత బలవత్తర రాజ్యమైనా మాగినాటు దుర్గశ్రేణి ప్రక్కగా దారి ఏర్పడడంవల్ల జర్మనీ దాడి నెదుర్కొనవలసి వచ్చింది.

పారిస్ వంటి చరిత్ర ప్రశిద్ధమైన మహాపట్టణాన్ని పూర్తిగా సంరక్షించుకొనడానికి ఫ్రెంచిప్రభుత్వం పారిస్‌కు 12 మైళ్ల దూరంలో జర్మనుదాడులను ఎదుర్కొన్నాయి. పరరాజ్యాలను జయించాలనే దురాశ ఫ్రాన్సుకు మొదటినుండి లేకపోయినా, స్వదేశ రక్షణార్థమై యావశ్శక్తిని వినియోగించడానికి కూడా సావకాశం లేకపోవడంవల్ల హిట్లరుయొక్క కుతంత్రాలకు, పశుబలానికి లొంగిపోక తప్పిందిగాదు.

● ఫ్రాన్సులో నూతనరాజ్యాంగము

హిట్లరుకు దాసోహమన్నప్పటినుంచి ఫ్రాన్సు రాజ్యాంగంలో అమితమైనమార్పు వచ్చింది. ఇన్నాళ్లనుంచి అమల్లోవున్న రాజ్యాంగము ప్రస్తుత నూతన పరిస్థితుల్లో ఫ్రాన్సుకు ఏలాటి ప్రయోజన కారి కాదని మార్షల్ పెటియన్ సర్వసేనాని, నియంతృత్వ పద్ధతిపై కొత్త రాజ్యాంగాన్ని నిర్మించాలనేభావంతో ఒక నూతన మంత్రివర్గాన్ని ఏర్పరచాడు. ఈ నూతన మంత్రివర్గంవారు నియంతృత్వ విధానంతో ఫ్రాన్సు యొక్క క్షేమాభివృద్ధికి పాటుపడడానికి కృషిచేస్తారట. అందుకు పెటియన్ సర్వాధికారాలు చలాయిస్తాడు.

ఈ నూతన రాజ్యాంగం ఫ్రెంచి ప్రజల ఆమోదాన్ని పొందడానికి వోట్లు తీసుకుంటారట. కాని ప్రజల్లో సుముఖభావం కనపడటంలేదు. కాని జర్మను జస్టపూవారు అప్పుడే 17000 మంది ఫ్రెంచి ప్రజలను రహస్యంగా నిర్బంధించి పెటియన్ ప్రభుత్వానికి సుముఖతగా వోట్ల నిచ్చేటట్టు చేస్తున్నారు. ఈ కుట్ర మొదలై బాగా సాగుతోంది.

ఫ్రాన్సులో యీ నియంతృత్వ విధానం క్రింద కొత్త మంత్రివర్గంయొక్క పరిపాలన రావటం హిట్లరు ముసోలినీలకు ఏమాత్రం ఇష్టంలేదు. ఇంతకాలంనుంచి ఫ్రాన్సు ఒక పారిశ్రామికదేశంగా వుంటూ వచ్చింది. ఇక ముందునుంచి వ్యవసాయకదేశంగా మారాలి. యూరప్ రాజ్యాలన్నీ వ్యవసాయకదేశాలై, ఆయాదేశాలనుండి ముడిపదార్థాలను పొందుతూ జర్మనీ ఒకపెద్ద పారిశ్రామికదేశంగా వుండాలని హిట్లరు కోరిక. ఈ సూత్రాన్నే హాలెండు, బెల్జియం, మొదలైన దేశాల్లో అమల్లోపెట్టాలని హిట్లరు ప్రయత్నిస్తున్నాడు.

● ఇంగ్లండుపై జర్మనీ దాడి...?

తనకు ప్రబల శత్రువై కూర్చున్న ఇంగ్లండు నెట్లాగునైనా యుద్ధంలోకిదించి, దాన్ని జయించి, తన ఏకచ్ఛత్రాధిపత్యాన్ని సాగించుకోవాలని హిట్లరు తగుమైనఎత్తులు వేస్తున్నాడు.

ఇంగ్లీషుఛానల్ దాటి అకస్మాత్తుగా జర్మను విమానాలు ఇంగ్లండు సముద్రతీరాన్ని బాంబులు విసిరిరావడమూ, ఆయుద్ధ విమానాలను బ్రిటిషువారు నాశనముచేయడమో, తరుమగొట్టడమో జరుగుతూవుంది. బ్రిటిష్ యుద్ధవిమానాలు జర్మనీలోనూ, జర్మనీ ఆక్రమించుకొన్న యితర ప్రదేశాలలోను, ఎచ్చటెచ్చట మందుగుండు సామానులు, నూనెస్టాకులు, ఆయుధాలు తయారుచేసి ఫ్యాక్టరీలు ఉన్నాయో, అక్కడక్కడ బాంబులువేసి నాశనం చేస్తూనేవున్నాయి. హాలెండులోను, రూర్ జిల్లాలోను, ఎమ్డెన్ నౌకాలయముపైన, స్టోల్టాన్దగ్గరవున్న రైలు మార్గాలమీద, బొలోనువద్దనున్న యుద్ధ నావలమీద, డోర్నిస్ విమాన ఫ్యాక్టరీ మీద బాంబులువేసి జర్మనీకి కొంత నష్టం కలగజేశాయి. బ్రిటిష్ విమానాలు నిరంతరం ఈ దాడులను గావిస్తూ జర్మనీ ఇంగ్లండు పైకిరావడానికి చేస్తున్న ప్రయత్నాలనన్నిటిని దగ్ధపటలం చేస్తున్నాయి. కాల క్రమేణా ఇంగ్లండు తన సామ్రాజ్యంలోని దేశాలదగ్గరనుండి సంపాదించుచున్నబలం వృద్ధిఅవుతూండడం చూచి, తాను పూర్వంవేసుకున్న ఎత్తులప్రకారం ఇంగ్లండును జయించడందుర్ఘటంఅని తెలుసుకున్నాడుహిట్లరు.

ఇందుకు ప్రక్కదార్లు తొక్కితేనేగాని తాను జయించలేనని, యితరరాజ్యాలతోవున్న బ్రిటిషు సంబంధాలను చికాకుచేయడానికి తలపడ్డాడు.

● మధ్యధరాలో మంతనాలు

మధ్యధరాసముద్రంలో ఇంగ్లండుయొక్క పలుకుబడిని తగ్గించాలని ముసోలినీతో మంతనాల జరిపి, మధ్యధరాసముద్రంలోని బ్రిటిషు నావికాసంపత్తిని స్వదేశానికి పోకుండా జిబ్రాల్టరును స్వాధీనంచేసుకోవ డానికి ప్రయత్నాలు చేస్తున్నాడు. అయినా ఆంగ్ల నౌకాబలం తన పూర్వ అధికారాన్ని మామూలుగానే సాగిస్తున్నది. ఇటలీ బహిరంగంగా ఇంతవరకు ఆంగ్ల నౌకాబలంతో పోరుకు సిద్ధపడలేదు. మాల్టా దీవిని ఆక్రమించుకోవడానికి విమానదాడులను గావించింది గాని సాధ్యమైందిగాదు. అయోనియా సముద్రంలో ఇటలీ నావికాబలాన్ని ఇంగ్లీషువారు తరిమివేశారు. ఎర్రసముద్రంలో ఇటలీ జలాంతర్గామి ఆంగ్ల నౌకాబలా నికి నష్టం కలిగించాలని ప్రయత్నిస్తే దాన్ని పట్టుకుని ఏడెన్లో నిర్బంధించారు. సూయిజ్ కాలువలో వున్న ఫ్రెంచి నౌకల్ని ఇంగ్లండు తన ఆధీనంలోకి తెచ్చుకోవడంవల్ల ఇటలీకి నౌకాబలం పెంచుకోవాలన్న ఆశ అంతరించింది. అంచేత స్పెయిన్ యొక్క తాటస్థ్యాన్ని చెడదీసి, ఫ్రాంకోను యుద్ధంలోకి దింపి, జిబ్రా ల్టర్ను స్వాధీనంచేసుకోవాలని ముసోలినీ ఎత్తులువేస్తున్నాడు. వెనుక స్పెయిన్ అంతర్విప్లవంలో యీ నియం తల సహాయం పొందినవాడు గనుక ఫ్రాంకో, ఇటీవల ఒక ఉపన్యాసంలో, 'ఆఫ్రికాలో వున్న స్పెయిన్ వలసరాజ్యాలతో స్పెయిన్ ప్రభుత్వానికి రాకపోకలు మొదలైన సంబంధాలు నిరాటంకంగా జరగాలంటే, స్పెయిన్కు జిబ్రాల్టరు స్వాధీనపడిపోవాలని తేల్చాడు. దీనికి దోహదమివ్వడానికి ఆగస్టు మొదటివారంలో ఫ్రాంకో ముసోలినీల సమావేశం జరుగుతుందని వార్తలు వస్తున్నాయి. ఈ విషయంలో ఫ్రాంకో ఇంగ్లండుతో యుద్ధానికి తలపడతాడో లేదో చూడాలి. ఇదేకాకుండా, జర్మనీ ఇంగ్లండుపై దాడిసల్పిన మరుక్షణంలో జిబ్రాల్టరును స్వాధీనంచేసుకొని మధ్యధరాసముద్రంలో నుంచి బ్రిటిష్ నావికాబలాన్ని స్వదేశానికి రాకుండా చేసేటట్టు జర్మనీ గూఢచారులు స్పెయినులో ఫెలంగిస్టు పక్షంవారితో ప్రయత్నాలు చేస్తున్నారు.

యుద్ధ రంగము

అటు ఆఫ్రికాఖండంలో బ్రిటిష్ వలసరాజ్యాలవారికి, ఇటలీ వలసరాజ్యాలవారికి మధ్య నిత్యం పోరాటం జరుగుతూనే వుంది.

ఇటు ఐర్లండులో వ్యవహారాలు చక్కబడే సూచనలు కనపడుతున్నాయి. రష్యా బాల్టిక రంగంలో తన బలాన్ని వృద్ధిచేసుకుంది. రష్యాకు ఇంగ్లండుకు చెడినట్లు కనపడిన వ్యవహారాలు సఖ్యతగా పరిణమించునట్లు కనపడుతున్నాయి.

ఇంతలో నిత్యం జరుగుతూవున్న బ్రిటిషు నౌకాతీరాలయందు జర్మను దాడులను బ్రిటను చిందర వందర చేయడమే కాకుండా జర్మను దాడిని ఎదుర్కొనడానికి ఏర్పాట్లుచేసినట్టు ప్రకటించింది. స్వసంరక్షణకు కట్టుదిట్టాలు చేసికోవడమే కాకుండా, దాడుల పద్ధతినే అమల్లో పెట్టడానికి, జర్మనీవారు దాడులు రాకుండా వారికి అవరోధాలు కల్పించడానికి బ్రిటిషువారు కృషిచేస్తున్నారు.

● హిట్లరు శాంతి సూక్తులు

ఇట్టి పరిస్థితులలో శాంతిసూచనలు కావిస్తే తన ప్రయత్నాలు ఫలిస్తయ్యేమో నని హిట్లరు గత వారం రిచిస్టాగులో ఉపన్యసిస్తూ, ఆంగ్లసామ్రాజ్యాన్ని నాశనంచెయ్యడం తన అభిమతంగాదని, ఇంగ్లండు ఐరోపాఖండ వ్యవహారాల్లో జోక్యం కలగజేసుకోకూడదని, ఐరోపాలో జర్మని సర్వాధికారి అని గుర్తించాలని, యీ శాంతికి వప్పుకోకపోతే జర్మనీయో, ఇంగ్లండో అంతమయ్యేవరకు యుద్ధం తీవ్రరూపాన్ని దాల్పిస్తానని బెదిరించాడు.

కాని యీలాటి ప్రగల్భోక్తులకు బ్రిటిషు సింహం గడగడలాడుతుందనుకున్నాడు గాని, గర్జించింది. ప్రజాస్వామ్య రాజ్యస్థాపనకు ఇంగ్లండు నడుంకట్టుకుందనీ, దాన్ని సాధించేందుకు చివరవరకు పోరాటం సాగిస్తుందనీ హెచ్చరిస్తూ హాలిఫాక్సుప్రభువు జర్మనీకి సమాధానం ఇచ్చాడు. రాక్షసప్రభుత్వంవారి ఇటువంటి సూచనలను ఇంగ్లండు ఒక్కనాడు ఒప్పుకోలేదు. ఐరోపాలో ఏ ఒక్కరాజ్యంగాని సర్వాధికారం కలిగివుండడం ఇంగ్లండు అభిమతంగాదు.

ఉత్తరాన్ని నార్వే సముద్రతీరాన్నించి, ఇటు హాలెండు బెల్జియం కోస్తానుంచి విమానదాడులు, నౌకాబలంతో ఒక్కసారిగా ఇంగ్లండుమీద విరుచుగుపడడానికి సుమారు 6 లక్షల సైనికులు సిద్ధంగావున్నట్టు ఇటీవల జర్మనీ, ఇటలీ పత్రికలు ప్రచారంచేస్తున్నాయి. ఈ బెదిరింపులకు ఇంగ్లండు లొంగిపోతుందని హిట్లరు ముసోలినీలు తలుస్తున్నారు. కాని ఇంగ్లండు ప్రతిదినం దాడి గావిస్తూ, శత్రువులయొక్క బలాన్ని ఎక్కడేవిధంగా వున్నదో తెలుసుకుంటూనే వుంది. జర్మన్ మంత్రివర్గంలో ఇంగ్లండుపై దాడివిషయంలో పొరపొచ్చాలు పుట్టాయనికూడా తెలుస్తోంది. అసలు నిజమేమంటే, నాజీ నాయకులు ఇంగ్లండుపై దాడి జయప్రదంకాదని గ్రహించుకుని యీలాటి అభూతకల్పనలకు దిగి ప్రచారంచేస్తున్నారు. కాని ఇంగ్లండు మొక్కవోని ధైర్యంతో నిలబడేవుంది.

(28-7-1940)

సంపాదకీయములు

అఖిలభారత మహిళా మహాసభ

అఖిలభారత మహిళామహాసభ ఇటీవల ఢిల్లీలో సమావేశమై ఉత్తేజకరములైన తీర్మానములను గావించినది. అధ్యక్షతవహించిన శ్రీమతి బీగం హమీదాలీగారు తమ అధ్యక్షోపన్యాసములో స్త్రీజనాభ్యుదయకరమగు హక్కులను ధర్మముగా వారికొసంగుటకు పురుషులు అంగీకరింపకున్నారనియు, అట్టి హక్కులను సంపాదించుటకై స్త్రీలు అవసరముకలిగిన 'సత్యాగ్రహము' సల్పుటకుగూడ సంసిద్ధులై యుండవలెననియు హెచ్చరించిరి.

ఈ హక్కులవిషయమై ఇట్టివి, ఇంతవరకు అని నిర్వచించుటయే కష్టము. సాధారణముగ యీ హక్కులనునవి ఒకరిచ్చునవి, వేరొకరు పుచ్చుకొనునవి అను సంబంధము స్త్రీ పురుషుల నడుమ పేర్కొనుట అర్థములేనిది. అందును భారతజాతికి ఇటువంటి ప్రత్యేకమైన కట్టుబాట్లేమియు లేవు.

ఎవరికి ఎట్టిహక్కులు కావలసినను అవి వారి స్వయంకృషిపైననే ఆధారపడియుండును. తత్ఫలితముగ వారివారి హక్కులు వారివారికి నిర్ణీతములైపోవును. ఇందొకరి యాటంకముగాని, అపహాస్యముగాని వుండనేరదు. ఇది నైతికముగ స్త్రీ పురుషు లొండొరులు, సమరసభావముతో, జాతిశ్రేయస్సునే ప్రధానలక్ష్యముగ నెంచి నిర్ణయించుకొనవలసినదే గాని నిర్బంధమువలన గాదు.

కాని, దీనికి భిన్నముగ నేటి మన సంఘజీవితమున యీ సామరస్యము కరువైపోయినది. స్త్రీ కేవలము ఆర్థికబలహీనగ విశేషించి విద్యావిహీనగ జేయబడినది. మూర్ఖపు పట్టుదలలు మితిమీరి, స్వార్థపరత్వమువలననో, మరి స్వాభిమానమువలననో కాని, అజ్ఞాన తిమిరము జాతిలో దినదినము వృద్ధియై ఘనీభవించుచున్నది. దీనికి ప్రత్యేకముగ పురుషుల లోభత్వమే కారణమనిన సత్యదూరముగాదు.

ఇందు విషయమై నారీలోకము తమ జాతిశ్రేయస్సుగోరి, తగువిధమున పాటుబడి, వారి జన్మహక్కులను సాధించి, సంపాదించుటకు గడంగుటలో తప్పేమియును లేదు. అందుకొరకై వారు పలువిధముల ప్రయత్నింపవచ్చును. వాటిలో హింసాదూరమగు సత్యాగ్రహసూత్రము మాత్రము సమ్మతము కాకూడదా!

ఈవిషయము మహాసభా తీర్మానములందు కన్పడుటయే తడవుగా పలువురు పలువిధముల వ్యాఖ్యానముల చేయ తలపడినారు.

'ఇండియన్ ఎక్స్ప్రెస్' పత్రిక తన సంపాదకీయ వ్యాఖ్యలో స్త్రీలు, వారికితగిన బాధ్యతాయుతమైన పదవులనిచ్చినను వాటిని బాగుగ నిర్వహింపలేకపోయిరనియు, ఉదాహరణకు మద్రాసు ఎసంబ్లీని ఎత్తుకొని అచ్చట స్త్రీ సభ్యులు 'తమది' అని పేర్కొనదగిన కార్యములుగాని, బిల్లులుగాని తేలేకపోయిరనియు, ఏమేమియో వ్రాసినది.

నిజమునకు మద్రాసు మంత్రాంగములో వ్యక్తుల ప్రత్యేకత ఏమియును లేదు. 'ఏకనాయకత్వము' 'ఏకాభిప్రాయము' పైననే పరిపాలన జరిగినది. అందు పురుషులకే స్థానము లేనప్పుడు స్త్రీలకు తావెక్కడ? శ్రీమతి గంధం అమ్మన్నరాజాగారి దేవదాసిబిల్లు బయటకు రాకుండగనే మద్రాసు మంత్రాంగము విరమించినది. ఈ విషయమెల్లరకు విదితమేగదా? ఇప్పట్టున ఒకరిని ప్రత్యేకముగ హీనపరచుటకు తావులేదను విషయము యీ పత్రికా ప్రముఖులకు తెలియదా?

'మద్రాస్ మెయిల్' పత్రికగూడ, 'వంటయిల్లు మొదలగుచోట్ల సత్యాగ్రహమొనర్చిన స్త్రీలు తమ హక్కులను సంపాదించగలరని' హేళనచేసినది. 'వంటచేయమనియు, సంసారములను సరిదిద్దమనియు' స్త్రీలెన్నడును చెప్పియుండలేదు. వారి విషయమున జరుగవలసిన న్యాయము ధర్మముగా జరుగకున్న బాధ్యత వహించిన ప్రభుత్వముతో సత్యాగ్రహము చేయుదుమని మాత్రమే చెప్పియున్నారు. ఇందు న్యూనతగా వ్రాయవలసిన విషయము లేదే! దీనికి వేరువిధముగా అర్థముచేసుకొని అవకతవక ప్రసంగములకు దిగిన 'మెయిల్' పత్రిక తన సంకుచితస్వభావమును బయల్పరచుకొనినదే గాని వేరుగాదు.

తమకు సహజముగా రావలసిన హక్కులకొరకై ఎన్ని విధముల ప్రయత్నించినను ఫలితములేనప్పుడు యీ ధర్మాస్త్రమును ప్రయోగించెదమనుట న్యాయదూరముగాదు.

ఇట్లూరకుండుటవలననే గదా మద్రాసునందున్న రెండు మెడికల్ కళాశాలలయందునుకూడ—అసలు వైద్యవృత్తిలో స్త్రీలకు ప్రత్యేకసమర్థతయున్నను—స్త్రీలకు సరియైన స్థానములు లభ్యముకాలేదు. ఇదియేగాక—స్థానిక స్వపరిపాలనా శాఖయందు, విద్యాశాఖయందు, తదితర విషయములందునుగూడ అమితమైన అన్యాయము జరుగుచున్నదే! ఇట్టి అధర్మము నిత్యము హెచ్చగుచుండుటవలననే మహిళాప్రపంచము నేడు కొంచెము తీవ్రప్రక్రియ చేయ తలపడినది. ఇది వివేకదూరమని కొందరు వివేకులు వ్యాఖ్యానముచేయుటలో వారి యవివేకము గన్పడుచున్నది గాని అన్యముగాదు.

ప్రస్తుత సమాజమందున్న బ్రాహ్మణ బ్రాహ్మణేతర తగవులవలెను, హిందూ మహమ్మదీయ అసఖ్యతవలెను స్త్రీ పురుషుల నడుమకూడ అనవసరమైన విభేదముల గల్పించి జాతిని ఛిన్నాభిన్నముచేసి, అశాంతిని రేకెత్తించకుండ యీ విషయములను సమరసభావముతో చక్కబరచవలసియున్నది. ఇందులకు సంఘము వెనువెంటనే పూనుకొని కార్యరూపమున బెట్టుట ఎంతయు ధర్మము.

ఉత్తేజకరములును, సాహస ధైర్యోత్సాహపూరితములును అగు శక్తివంతములైన తీర్మానముల గావించిన మహిళామహాసభవారు అభినందనీయులు.

వెనుకటివలెనే కార్యరూపమునందని తీర్మానములవలె గాక, యీతూరి సరియైనమార్గ మనుష్ఠించి అఖిలభారత మహిళా మహాసంఘమువారు ఆదర్శనీయులౌదురుగాక యని విశ్వసించుచున్నాము.

బాల్యవివాహ నిరోధచట్టమునకు సనాతన సుడిగాలి

ఇప్పటికి రెండు సంవత్సరములకు పూర్వము నైజాము సంస్థానమునందు హిందూవితంతు వివాహము చట్ట సమ్మతమైనది. తిరిగి అట్టి వేరొక సంస్కరణమును బొందగలుగు భాగ్యము హైదరాబాదు హిందువులకు కలుగనున్నది. బాల్యవివాహముల నరికట్టుటకొరకు చట్టమునుచేయ సంస్థానము తలపెట్టి పనిచేయుచున్నది.

నైజాము సంస్థానమునందు హిందువులలో అతి బాల్యవివాహము లతి మిక్కుటము జరుగుచున్నవి. అందు బ్రాహ్మణాది అగ్రకులములందివి విపరీతముగ వృద్ధిజెందియున్నవి.

బ్రాహ్మణేతరులందీయతి బాల్యవివాహములున్నప్పటికిని, కొందరిలో వితంతుబాలికలకు పునర్వివాహములు జేయునాచారమున్నది. బాలికలకు యుక్తవయస్సు రాకముందే ఇట్టి పునర్వివాహములు రెండు మూడు కూడ జరుగుచున్నవన్న యీ బాల్యవివాహపిశాచమెంత విలయతాండవము జేయుచున్నదో యూహింపవచ్చును.

బాల్యమునందే వితంతువైన బాలికకు తిరిగి బాల్యవివాహమునే గావించు తల్లిదండ్రుల దురాచారతమస్సునందు వివాహమునకు పవిత్రత యెక్కడ?

ఇకనీ పునర్వివాహము లాచారములందులేని బ్రాహ్మణాదికులములందలి వితంతుబాలికల దుర్భరజీవనములు, హాహాకారములు సంఘమునవినీతికూపముగ జేయుచున్నవి.

ఇట్టి యవినీతిని, అశాంతిని వెనుకనిడుకొని, ఇట్టి శాసనములవలన హైందవమతము గంగలో కలియుచున్నదనియు, దానిని రక్షించుట కను నెపముతో, ఆచారముపేర, మతముపేర యీ శాసనమును నిరోధించుటకు సనాతనప్రముఖులు తీవ్రప్రయత్నములతో దాడిసల్పుచున్నారు.

జీతములను, దినసరి బత్యములనుకూడనిచ్చి కొందరిచే ప్రతిపల్లెయందును ప్రచారముగావించు విపరీతములకుకూడ వీరు సంసిద్ధులగుచున్నారనిన, వీరి యవివేకమునకు, మూర్ఖతకు పారము గలదా? వీరి యజ్ఞానతిమిరమును పారద్రోలు జ్ఞానప్రభాతము ప్రసాదింపబడుగాక యనికోరుటదప్ప వేరేమి చేయగలము?

అసలుస్వదేశసంస్థానములందు సంఘశ్రేయమును గోరు సంస్కరణలే చాలతక్కువ. సాంఘికపునర్నిర్మాణమును గావించుకొనుచు, నవయుగ నిర్మాణమునకై జాతిముందుకు వర్వులెత్తుచుండ సంస్థానములందు మచ్చుకేని ఇట్టిచైతన్యముగానరాదు. ఎన్నడో వచ్చియుండవలసిన యిట్టి సంస్కరణములు ఇప్పటికైన వచ్చినప్పుడు హర్షము జూపవలసినదిమాని ఆగ్రహము జూపుట ఏటివివేకము?

స్వదేశ సంస్థానములందు అగ్రస్థానమువహించిన నైజాము సంస్థానమునం దిట్టివి ఇంకను కాకుండుట క్షేమకరము గాదు.

ఈ బాల్యవివాహ చట్టము నిర్మించినగాని వెనుకటి వితంతువివాహ చట్టమునకు తగిన బలము సమకూరదు. కాన వెనుకటి చట్టసందర్భమువలె యిప్పుడుగూడ యీ సనాతన సుడిగాలిని ప్రజలు, ప్రభుత్వము కూడ ఎదుర్కొని హింసాకూపమున బడిపోవుచున్న బాలికల నుద్ధరింతురుగాక! ప్రభుత్వము ఇందుకు తగిన శ్రద్ధబూని, సనాతనుల చాంధసమును విస్మరించి, చట్టమును త్వరలో ప్రసాదించునుగాక యని విశ్వసించుచున్నాము.

Edited by Dr. K. N. Kesari, Printed and Published by Dr. S. Seshagiri Rao,
at the Lodhra Press, 15, Westcott Road, Royapettah, Madras.

విక్రమనామ సంవత్సర – శ్రావణ - భాద్రపదమాసములు

1940-వ సం॥ సెప్టెంబరు నెల

1	ఆ	చశి 17-40 ఆశ్లే 1-59 మఖ 55-50 ది 28-54 తిథిద్వయం
2	సో	● 9-15 పుబ్బ 49-10 ది 13-37 సోమవార అమావాస్య ప్రథమతిథి
3	మం	ప్ర 0-30 ద్వి 51-44 ఉత్త 42-22 ది 4-32 రా 0-29 భాద్రపద శుద్ధం
4	బు	తృ 43-18 హస్త 35-50 రా 23-19 సామోపాకర్మ
5	గు	చ 35-29 చిత్త 29-55 రా 12-15 వినాయకచతుర్థి
6	శు	పం 28-37 స్వా 25-2 రా 7-42 ఋషిపంచమి
7	శ	ష 23-12 విశా 21-25 రా 0-34 షష్ఠి-తిథి-వ్రతం
8	ఆ	స 19-9 అనూ 19-8 రా 2-31 తిథిద్వయం
9	సో	అ 16-33 జ్యే 18-22 రా8-10 నవమితిథి
10	మం	న 15-22 మూల 18-59 ది 14-56 రా 13-52 ఆవణిమూలం
11	బు	ద 15-46 పూషా 21-7 రా 11-55
12	గు	ఏ 17-29 ఉషా 24-32 రా 4-59 ద్వాదశి తిథి సర్వ-జీవవార-పరివర్తన-ఏకాదశి
13	శు	ద్వా 20-27 శ్ర 29-9 రా 9-59 అతిథి శ్రవణద్వాదశి ఓణం
14	శ	త్ర 24-32 ధని 34-52 రా 24-35 త్రయోదశితిథి
15	ఆ	చశి 29-35 శత 41-27 కన్యారవిః 51-27 చతుర్దశీ తిథి అనంతవ్రతం
16	సో	○ 35 24 పూభా 48-41 శే 3-23 సూన్యతిథి
17	మం	ప్ర 41-44 ఉభా 56-20 ది 15-45 ప్రథమతిథి భాద్రపద బహుళం
18	బు	ద్వి 48-18 రే 60-0 రా 0-5
19	గు	తృ 54-48 రే 4-13
20	శు	చ 60-0 అశ్వి 11-54 ది 0-37 రా 8-41 త్రిదినస్పృక్ సంకటచతుర్థి
21	శ	చ 0-51 భర 19-6 రా 22-13 మహాభరణి కృత్తికా
22	ఆ	పం 6-3 కృ 25-28 షష్ఠీతిథి
23	సో	ష 10-3 రో 30.27 ది 8-47 రా 15-13 తులాయనం 10-37
24	మం	స 12-26 మృ 33-45 రా 25-17 మధ్యాష్టమి
25	బు	అ 12-57 ఆరు 35-13
26	గు	న 11-34 పున 34-46 ది 4-59 రా 24-6
27	శు	ద 8-10 పుష్య 32-29
28	శ	ఏ 3-7 ద్వా 56-18 ఆశ్లే 28-34 ది 2-24 రా 25-46 సర్వైకాదశీ
29	ఆ	త్ర 48-25 మఖ 22-59 రా 11-0 ప్రదోషం శివరాత్రి గజచ్ఛాయ
30	సో	చశి 39-39 పుబ్బ 16-27 రా 2-33

విషయసూచిక

1. శ్రీమతి చుండూరు రత్నమాంబగారు ... 375
2. వాంతులు—కనకదండి లలితాదేవి ... 377
3. యుద్ధరంగము—'అరుంధతి' ... 378
4. కోకిల—పొదిలాపు సూరమ్మాంబ ... 380
5. నక్షత్ర ఫలితాలు—కవికలహంసి శ్రీమతి చేబ్రోలు సరస్వతీదేవి ... 381
6. స్త్రీ సాముద్రిక శాస్త్రము " " ... 382
7. పార్వతి—శ్రీ కుమాండూరి వెంకటరామానుజాచారి ... 383
8. మా తల్లీ!—పన్యాల చూడికుడుతమ్మ ... 387
9. నిత్యకళ్యాణము - పచ్చతోరణము—శ్రీమతి కందుకూరి మహాలక్ష్మీదేవి ... 389
10. తెలుగు వాణి—పెనిశెట్టి సత్యవాణి ... 394
11. వింతవింతల ప్రపంచం ... 395
12. సుందరం—శ్రీ 'కౌండిన్య' ... 397
13. కళా కలాపము—శ్రీమతి కె. సుగుణమణి ... 399
14. భావతరంగిణి ... 402
15. 'అవివాహిత యిప్పటికామె'—శ్రీ సత్య దుర్గేశ్వర కవులు ... 404
16. చిత్రవధ—శ్రీ బ్రహ్మాండం నరసింహం ... 405
17. రాధపిలుపు—శ్రీ గోనెల నరసింగరావు ఎం.ఏ. బి.యల్. ... 406
18. బాల భాగ్యోదయము - గుణపాఠం—కుమారి చిరంజీవి ... 410
19. 'బొమ్మల పెళ్లి'—కందుకూరి లింగరాజు ... 411
20. భారతీయనారి—శ్రీ స్వామి వివేకానంద ... 413
21. స్వర్గీయ కమలాదేవికి స్మారకచిహ్నం—శ్రీమతి కూచిమంచి నరసాయమ్మ ... 414
22. ఇల్లాలు—సి. నరసింహాచారి ... 415
23. పిన్నిపుత్తరాలు—దక్షిణదేశం ... 418
24. వినాయకచవితి—ఉభయభాషాప్రవీణ శ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రి ... 419
25. హైందవాచారాలలో విజ్ఞానం—'వసంత' ... 420
26. గ్రంథ సమీక్ష ... 422
27. పాకకళ ... 423
28. పుష్పచయము ... 427
29. సంపాదకీయములు ... 429

త్రివర్ణచిత్రము: శ్రీమతి చుండూరు రత్నమాంబగారు



ప్రథమ పురపాలక సంఘాధ్యక్షిణి

శ్రీమతి చుండూరు రత్నమాంబగారు.

జయజయ గృహలక్ష్మీ సఖి! జయజయ లలితాంధ్ర మధుర సారస్వతమా!
జయజయ లలనారత్నమ! జయజయ విద్యాప్రబోధ! జయకల్యాణీ!

ప్రథమ పురపాలక సంఘాధ్యక్షిణి

శ్రీమతి చుండూరు రత్నమాంబగారు

సత్యాగ్రహంబున సర్వకష్టంబులకోర్చి పేరందిన యోధురాలు
కన్నీరు మున్నీరుగానేడ్చు విధవల కుద్వాహములుచేయు సద్వివేక
పొట్టకూటికిలేక పొక్కు జనాళిని ప్రియమార రక్షించు ప్రేమమూర్తి
మహిళోద్యమములకై మనసార కృషిసల్పి మార్గదర్శినియైన మాన్యచరిత

సరస సంగీతసాహిత్య సారమెఱింగి రసికులను గారవించెడి రత్నమాంబ
దివ్యచరితంబు నొక్కొక్క తెలుఁగుపడతి మార్గదర్శకమనియెంచి మసలుగాత!

కాకినాడలో నున్న యార్యవైశ్యకుటుంబీకులలో సుప్రసిద్ధులైన రావు బహద్దరు పైండా వెంకట చలపతిగారి నెఱుంగనివా రీయాంధ్రదేశమున యరుదు. వీరఖండైశ్వర్యవంతులు. జమీందారులు. కాంగ్రెసు సంస్థకు అమితముగ విరాళమొసంగిన దానశౌండులు. కీర్తికాయముచే విలసిల్లు నీ మహోదారచరితుని గారాబుపట్టియే మన ఈ సోదరీరత్నమగు శ్రీమతి చుండూరి రత్నమాంబగారు.

ఇట్టి నాగరికతావిశిష్టమైన కుటుంబమున జన్మించిన కతననే నీయమకు సంగీతసాహిత్యములు, ధర్మకర్మానురక్తి, స్వదేశభక్తి, జాతీయత్వప్రసక్తి ఉగ్గుపాలతోనే పట్టువడినవి. సుకృత పరిపాకంబున నీమె కనురూప సద్గుణ సంపత్సౌభాగ్యవిలాసుడగు భర్తగారు లభించిరి.

శ్రీయుత చుండూరు శ్రీరాములు శ్రేష్ఠిగారీమెను పరిణయమాడి ఈమెకు గల ఉత్తమాశయములకు వలయు దోహదమొసంగి, సకల కార్యనిర్వాహములయందును చేయూతనిచ్చి ప్రోత్సహించిరి.

ఈమె ఆగర్భ శ్రీమంతురాలై, కష్టమననేమో ఎరుగని సాధ్వీవసంతమయ్యు నిస్వార్థప్రేమగలిగిన యౌదార్యవతి. త్యాగశీల. దేశాభ్యుదయ కార్యములయందు అమితోత్సాహముతో కృషిచేయుచు ప్రజల మన్ననల వడయుచున్న ఆదర్శయువతి.

సంగీతమామెకు అభిమానవిద్య. సంస్కృతాంధ్ర హిందీ భాషలయందును చక్కని పరిజ్ఞానము కలదు. సభావేదికలపై నిలచి యుపన్యసించునపుడు నీమె వక్తృతాశక్తియు, విశాలహృదయమును, సమత్వ దృష్టియు వెల్లివిరిసి సభ్యుల నాకర్షింపజేయును. విజయవాడ, రాజమండ్రి మొదలగు పట్టణములలో జరిగిన మహిళామండల వార్షికోత్సవములందు అగ్రపీఠము నలంకరించి ఈయమ గావించిన ఉపన్యాసములు కొలాను గుణ్యములై, జ్ఞానదాయకములై, మార్గదర్శకములై యున్నవి.

గాంధిమహాత్ముని శంఖాపూరంబున సత్యాగ్రహమొనరించి 6 నెలలు ఖయిదు శిక్ష ననుభవించిన ధీరగుణాఢ్య.

1931-వ సంవత్సరమున సంభవించిన కొల్లేటివరదలకు గురియైన దీనజనాళి నుద్ధరించుటకై రత్నమ్మగారు స్వయముగా ద్రవ్యసహాయము చేయుటయేగాక ఇంటింటికేగి పప్పు, ఉప్పు, బియ్యము మొదలగు సామగ్రులను వసూలుచేసి వారి కష్టములను తొలగించిన ఈమె యౌదార్యము, పదార్థపటిమ వేనోళ్ళ బొగడబడినది. 'నా కులదేవతయగు కన్యకాపరమేశ్వరియే నాకాదర్శ'మని పలుతావులలో నీమె నుడువుచుండును. ఉపన్యాసములలో తన సదాశయములను వెలిబుచ్చుటయేగాక దానికి సర్వశక్తుల ధారబోసి సార్థకవంతము జేయగల ప్రౌఢాంగన రత్నమ్మగారు.

దేశోపకరములగు ధర్మసంస్థలెన్నియో ఈ ధర్మ పరాయణయొక్క విరాళములను బొందినవి. ఈ జమీందారిణి నెలకొల్పిన సత్రములు, చావడులేగాక ఏలూరు పట్టణమున ఒక పెద్ద పుస్తక భాండాగారములో నొక యువతీజన పఠనాలయమును, క్లబ్బను పేరెన్నికగాంచి, ఏలూరు నారీలోకమునకు విద్యావిజ్ఞానప్రదాయినియై యుండుటయేగాక ఆంధ్ర రమణీమణులందరికి మార్గదర్శకమై, గౌరవప్రదమై యలరారుచున్నది.

సంసారయాత్రలో నుండియు, భరతఖండంబున గల సకల తీర్థయాత్రలను సేవించి, ప్రపంచానుభవము సంపాదించి దానియందు గల సత్యమును తన సోదరీమణులకు మిక్కిలి నేర్పుతో నెరుకపరచి యుద్బోధించుచుండును.

రాజకీయ, సాంఘిక, సారస్వతోద్యమములలో నీమె చేయికలిపి పాటుపడుటయేగాక తనతోడి శ్రీమంతులను, భూస్వాములను భారతజాతీయ నిర్మాణమునకు పూనుడనియు, శుష్కప్రియులై యుండక కార్యశూరులై, జాతీయచిహ్నములగు ప్రతిష్ఠాపనలకు ప్రయత్నింపుడనియు పురిగొల్పుచుండును.

వాంతులు

ఏలూరులో గానకళాపరిషత్తు స్థాపించి బహుమానములొసంగి సంగీత విద్యాప్రచారము చేయుచున్నది. మరియు ఎక్కువ గణ్యతజెందిన బాలికా పాఠశాలకు రోలింగుషీల్డులును, ఎక్కువ కాంగ్రెసుసభ్యులను చేర్చినవారికి రోలింగుషీల్డు నిచ్చి ప్రజల కుద్రేకయుత్సాహముల నొడగూర్చుచుండు యుత్తమచరిత్ర.

మద్యపాన నిషేధప్రచారమున రాత్రింబవలు తిరిగి ప్రజాప్రబోధము గావించిన ధన్యజీవి.

ఆదర్శ గృహలక్ష్మియగు ఈ సోదరికి కుట్టుపని, పద్యములల్లుట, వంట మొదలగు గృహపరిశ్రమయందును నేర్పుకలదు. నిజకర్తవ్యమెఱింగిన ఈ పతిదేవత పెక్కు వితంతూద్వాహములను స్వయముగా చేయించి బాలవితంతువుల భావికల్యాణమునకును మన్ననలకు పాత్రురాలైనది.

ఈ యమ కార్యదీక్ష, విజ్ఞానము, వ్యవహారదక్షత, జీవితక్రమము మొదలైనవి ఆంధ్ర సోదరీమణులు ఆదర్శములుగ అనుసరించదగినవి.

ఇటువంటి వీరమాత ఇప్పుడు ఏలూరు పురపాలకసంఘమునకు అధ్యక్షురాలుగా నియమింపబడుట ఆంధ్రభూమి ప్రత్యేకముగా మన ఆంధ్ర వనితాలోకము గర్వించవలసియున్నది.

చెన్నపురి రాజధానిలోని పురపాలక సంఘములలో ప్రప్రథమమున ఒక దేశసేవికను అధ్యక్షురాలుగా నెన్నుకొని మార్గదర్శులైన ఆంధ్రరాష్ట్రీ కాంగ్రెసు సంఘమువారును ఈ విజయమునకై అత్యంతశ్రద్ధ జూపిన ఆంధ్రరాష్ట్రీకాంగ్రెసు సంఘాధ్యక్షులైన ఆంధ్ర కేసరి శ్రీ టంగుటూరు ప్రకాశం పంతులుగారును, ఏలూరు పురపాలక కాంగ్రెసు సభ్యులును ఎంతయు అభినందనీయులు.

ఇట్లే ఆంధ్రదేశములో తదితర పురపాలకసంఘమువారును తమతమ ధర్మములను జూపి విజయపతాకమెత్తగలరని యాశించుచున్నాము.

'వాంతులు'

కనకదండి లలితాదేవి

ఎందుకు నాకీ జన్మం
కాదందుకు వీల్లేదే
కరవైనది విజ్ఞానం
మొరపెట్టుకు లాభం
స్వార్థప్లీహపు రాజ్యం
వ్యర్థం - జీవితలభ్యం
ఏమిటోయి - నీమాటే
కామంలో - లోభంలో
కని, వినవోయంటే
కర్మం - కలిధర్మం,
మనదేశంలో దాస్యం
కనకూలాక్షుత దేహం
మనదేశం - దారిద్ర్యం
వినజం నిలభూతం
కేదో నా కాత్మకవి.

కాదో ప్రేయసి విధి
లేదో సోదరు స్థితి
కూలంకష యాదార్థ్యం
యాత్మోద్దంచితగాఢం
దరిద్రుడడిగే దానం
ధనికుడు దాచే పాపం
భారతజాతుల నీతి
వీరతపస్వుల భూతి
కాలాగ్ర ప్రళయంలో
మలమల తాపంలో
తరలీపొరలిందా
మరలీ కరగిందా
భాందసుడా ఏమోయి
చండాలం నీ బ్రతుకు
బంధంలో నిద్రాస్థితి

అంధంలో మత్కుణము
అందికలో బాహ్యంగా
అధికారం పీడించే
పొందికలో మార్జాలం
నామాటలు నీకోసం
ఏదేశంలో, వేశం
ఏచోటున, పాటులు
నీకేం, నీకేం - నాకు
నా అరపులు - లోపల
కరచినవా - లోపల
తరచినవా - నాకవి
వాక్కాంతులు - నాకవి
వ్యవధానపు కాంతులు
వ్యధితాస్థిత వాంతులు.

యుద్ధరంగము

- మధ్య యూరపులో కరువు.. ?
- సోమలీలాండు యుద్ధ విరమణ
- ప్రాచ్యఖండంలో జపాను జిగీష
- బ్రిటీష్ దీవులకు దిగ్బంధనం...?

★ అరుంధతి ★

ఇంగ్లండుపై దాడి వెడలడానికి బ్రహ్మాండమైన రహస్యపుఎత్తులు వేస్తూ, హిట్లరు పైకి తేనె పలుకులుగా కావించిన శాంతి విన్నపాన్ని ఇంగ్లండు ధిక్కరించిననాటినుండి, జర్మనీ ఇంగ్లండుపై ప్రతిరోజూ విమానదాడులను కావిస్తూనే వుంది. ఇంగ్లీషు ఛానల్‌లో, ఫ్రాన్సు పశ్చిమతీరాన్ని పెద్దబారు ఫిరంగులను నిర్మించి ఇంగ్లండుపై అగ్నివర్షాన్ని కురిపించాలని జర్మనీ ఆశపడుతోంది.

చిన్నచిన్న చిత్తజల్లులుగా వచ్చిపోతూవున్న యీ జర్మనీ విమానదాడులు చివరకు గాలివానగా మారేసరికి ఇంగ్లండు అతిధైర్యంగా నిలబడి, శతృదాడిని పట్టి పల్లార్చుతూవుంది. ఈరకంగా ఇంతవరకు జర్మనీ విమానాలు సుమారు 700 వరకు నాశనమైనాయి యీ మాసంలో. ఇంగ్లాండులోమాత్రం చెప్పుకో తగ్గంత నష్టమేమీ జరగలేదు. బ్రిటను ఇంతవరకు పిచికిమీద బ్రహ్మాస్త్రమెందుకని వూరుకున్నది గాని, జర్మనీ రెచ్చినప్పుడు తగిన శాస్తిచేసి పంపుతూనేవుంది.

*   *   *

● మధ్యయూరపులో కరువు...?

మధ్యయూరపులో ఇంతవరకు జర్మనీ జయించిన దేశాలలో అశాంతి ప్రబలుతూవుంది. కాటకపు సూచనలు కనపడుతూవున్నాయి. పరరాజ్యాలలో వున్న తమ రాణీ 'విల్ హెల్ మినాన'కు 60వ జన్మదినోత్సవం ఆగష్టు 31 వ తేదీని హాలెండీయులు జరుపుకుంటామంటే జర్మనీ అట్టిది వీలులేదని పర్మానాచేసింది. బట్టలకుకూడ అమితమైన కరువు ఏర్పడింది. అందుకు 'కార్డు'లను ఇచ్చు పద్ధతిని హాలెండులో అమల్లోపెట్టింది జర్మనీ.

నార్వేలోకూడ ఇట్టి పద్ధతులనే అమల్లోపెట్టుతోంది జర్మనీ. పోలెండులో వార్సాచుట్టు శ్మశానవాటిక కావడంవల్ల పంటలకు ఏమీ ప్రయోజనకారి కావటంలేదు. ఫ్రాన్సులోకూడ ఇటువంటి పరిస్థితే పొడసూపుతూవుంది. ఫ్రాన్సు బ్యాంకులలో నున్న డబ్బునంతను జర్మనీ వశపరచుకుని, ఆర్థికముగా ఫ్రాన్సును జర్మనీ కొల్లగొట్టడం ప్రారంభించింది. డలాడియర్, రేనాడు మొదలగు మంత్రులను శిక్షించవలసినదని పెటియన్ మంత్రివర్గాన్ని జర్మనీ బలవంతపెడుతోంది. ఈ కారణాలేకాక, కరువువచ్చే సూచనకూడా కనబడుతూవుంది. జర్మనీ ఆక్రమించిన దేశాలకు ఆహార పదార్థాలుగాని, యుద్ధానికి పనికివచ్చే తదితర ముడి పదార్థాలుగాని సప్లయిచేయకూడదనే ఇంగ్లండు పెట్టిన ఆంక్ష అమెరికా మన్నించి పదార్థాలను పంపక పోయినా, ఒకవేళ పంపినా అది నాజీ రాక్షసికి ఎల్లాగూ బలిఅవుతాయి కనుక, యీ దుర్భరపరిస్థితులు సంభవించే చిహ్నాలు బాగా ప్రబలంగా వుండడంవల్ల ప్రజల్లో నిస్పృహ హెచ్చి, తుదకు విప్లవము రావటానికి అవకాశం కలుగుతుందేమోనను భయముతో పెటియన్ సేనాని లావెల్ మంత్రిని నాజీనాయకులతో సంప్రదించడానికి జర్మనీకి పంపించాడు.

ఇక ఎటుచూచినా దారిద్ర్యం తాండవించే సూచనలు కనపడుటచే హిట్లరుయొక్క కన్ను స్విజర్లండుపై పడింది. స్విజర్లండులో బాగా బంగారు గనులున్నాయి. నూనె, ఆహారపదార్థాలు మొదలైనవి జర్మనీకి బాగా ఎగుమతిచేయాలని, వ్యాపారం బాగా సాగించాలని ఒక నెపంగా స్విజర్లాండును తుది సందేశంగా జర్మనీ ఒక తాఖీదు పంపించింది. ఏదో సాకుమీద జర్మనీ స్విజర్లాండుపై విరుచుకుపడుతుంది. స్విజర్లాండు జర్మనీకి కైవశం అయిందంటే మధ్య యూరప్‌లో జర్మనీ నిరంకుశత్వానికి మరి అడ్డుండదు—

ఇటువంటి ఆశతోనే హంగిరీ రుమేనియాపైకాలు దువ్వేందుకు జర్మనీ హంగిరీని బలవంత పెట్టింది. కాని, రుమేనియా రష్యాతో సంబంధాలను పెంచుకొని ఎదురు తిరుగుతుందేమోనని హిట్లరు ముసోలీలు కొంచెం వెనకాడుతున్నారు.

*　　　*　　　*

● సోమలీలాండు యుద్ధ విరమణ

ఇటు ఇటలీ మధ్యధరాసముద్రంలో బ్రిటిషు నౌకా బలాధికారాల్ని తప్పించాలని చేసే ప్రయత్నంలోనే వుంది. ఎలాగునైనా స్పెయిన్‌ను యుద్ధంలోకి దించాలని, హిట్లరు ముసోలినీలు ప్రయత్నించారు గాని ఇంకా ఫలవంతంగాలేదు. ఇది ఇట్లావుండగా ఆఫ్రికాలో కూడా బ్రిటిషు అధికారానికి ఒత్తిడి కలిగించాలని ఇటలీ బ్రిటిష్ సోమలీలాండుపై దాడి సల్పింది. సోమలీలాండు బ్రిటిషువారికి అంత లాభకరమైనదిగాదు. ఆ రాజ్యాన్ని వెనుకనే ఇటలీకి ఇచ్చివేస్తానన్నది. కాని అప్పుడు ఇటలీ తీసికోలేదు. ఇప్పుడు దానిమీదికి దాడి సల్పితే అక్కడ ఇటలీయొక్క ఆయుధబలం కొంత నాశనం కావడానికి మాత్రం బ్రిటను యుద్ధం చేసింది. మెల్లిగా సోమలీలాండును ఖాళీచేశాయి బ్రిటిష్ సైన్యాలు. ఇర్రిట్రియాలో ఇటలీ విమానాశ్రమం తగులబడడమే గాని సోమలీలాండులో ఇటలీ సంపాదించింది ఏమీలేదు. ఎర్ర సముద్రంలో బ్రిటిష్ అధికారం నిర్విఘ్నంగా సాగుతూవున్నంతకాలం సోమలీలాండు ఎవరిచేతుల్లోవున్నా ఇంగ్లాండుకు ఏ విధమైన నష్టమూలేదు. కనుకనే ఇంగ్లాండు దానిని వదిలివేసింది.

*　　　*　　　*

● ప్రాచ్యఖండంలో జపాను జిగీష

ఇక్కడ పశ్చిమఖండంలో యుద్ధక్రమం ఇటువంటి పరిస్థితిలో వుండగా, యిటు దూర ప్రాచ్యఖండంలో పరిస్థితులు కాలక్రమేణా విషమరూపాన్ని దాలుస్తూవున్నాయి. చైనాను పూర్తిగా వశంచేసుకోవాలనే తనకోరికను జపాన్ కొనసాగించుకొనడానికి చైనాకు ఏవిధమైన సహాయంరాకుండా కట్టుకడుతున్నది. అందుకు బర్మా - చైనా రోడ్డును మూడుమాసములువరకు మూసివేయవలసినదిగా బ్రిటనుకోరితే ప్రస్తుతంలో జపాన్‌తోగూడా సంఘర్షణ తెచ్చుకోవడానికి ఇష్టంలేక బ్రిటన్ ఒప్పుకుంది. అయినా జపాన్ చైనాలోని ఇంగ్లీషువారిని అరెస్టుచేసింది. చైనాను దిగ్బంధనంచేసి దాన్ని పూర్తిగా లోబరుచుకోవాలని, చైనాలో కొన్ని సౌకర్యాలు చేయవలసిందిగా ఫ్రాన్సును కోరింది. కాని పెటియన్ మంత్రివర్గంవారు అమెరికా జపాన్‌తో యుద్ధానికి తలపడితే, తాము చైనాతోకూడి జపాన్‌ను ఓడిద్దామని ఇంకా ఏలాటి సమాధానం ఇవ్వలేదు.

సయాములో కూడా కొన్ని అవకాశాలను ఇవ్వవలసిందిగా జపాన్ సయామును కోరింది. ఇందుకు సయాము ఒప్పుకుంటే దక్షిణాన్నుంచి చైనాపై దాడి వెడలవచ్చునని జపాను ఆశ. కాని సయాము ఇందుకు

ఒప్పుకున్నట్లయితే అమెరికా రష్యాలుకూడా ఇక్కడ యుద్ధంలోకి దిగవలసివస్తుంది. అప్పుడు దూర ప్రాచ్య ఖండంలో కూడా పరిస్థితులు చాలామార్పు చెందుతాయి.

* * *

● బ్రిటీష్ దీవులకు దిగ్బంధనం...?

హిట్లరు, ముసోలినీలతో జపాన్‌కూడ కలిసి ఇంగ్లండుకు అన్నివైపులా ఒత్తిడి కలగచేద్దామన్న అభిప్రాయంవున్నట్టు కనబడుతూవుంది.

గతవారం "సముద్ర యుద్ధసంబంధమైన నిబంధనలను ఇంగ్లండు ఉల్లంఘించడంవల్ల బ్రిటిష్ దీవులను సంపూర్ణంగా దిగ్బంధనం చేస్తున్నా"మని జర్మనీ ప్రకటించింది. ఇంగ్లాండుచుట్టూ సముద్రాలలో 'మందుపాతలు' పెట్టామనీ, ఏ తటస్థరాజ్యపు నౌకఅయినా వెళ్లడానికి ప్రమాదం సంభవిస్తుందనీ, ఆ ప్రమాదానికి తాము బాధ్యులముకాదనీ కూడా ఆ ప్రకటనలో వుంది.

ఈ ప్రకటనపై "ఇంగ్లండు సర్వసిద్ధంగావున్నదనీ, ఎన్ని సంవత్సరాలైనా శత్రువుతో పోరాడ్డానికి కావలసినన్ని విమాననౌకాబలాలు తయారుగావున్నవనీ, నాజీయిజమును సర్వనాశనం చేస్తేనేగాని బ్రిటను ఊరుకోదనీ, జర్మనీయొక్క ప్రగల్భోక్తులకు ఇంగ్లండు జంకదనీ" చర్చిల్ ప్రధాని కామన్సుసభలో ప్రకటించాడు.

అయినా, జర్మనీ రాత్రిళ్లుకూడా ఇంగ్లండుపై దాడితీస్తూనేవుంది. ఇంగ్లండుకు వీటివల్ల కొద్ది నష్టమేగాని జర్మనీ విమానాలుమాత్రం నాశనముచేయబడుతూనేవున్నాయి.

ఏదైనా యుద్ధం అన్న తర్వాత నష్టం కలగకుండా వుండదు. కాని గతవారంలో ఏడెన్‌మంత్రి "యుద్ధం సరిగ్గా ప్రారంభంకాలేదనీ, బ్రిటను విజృంభించి ముందుకుపోతే 'మూడవప్రపంచ యుద్ధం' ఎవరూ చూడరనీ, యుద్ధానంతరం ప్రపంచంలో కనివిని యెరుగని ఒక క్రొత్తమార్పు-అపూర్వమైనది-కలుగబోతుందనీ, దానికి బ్రిటను కంకణం కట్టుకొని పాటుబడుతుందని" ఒక ప్రకటనలో తెలియజేశాడు.

బ్రిటను ఇందుకు పూర్తిగా సమర్థత కలిగివుండడంలో సందేహం ఏమీలేదు—

కోకిల

గున్నమామిడిచెట్టుపైఁ గూరుచుండి
నిరుటి యీదినంబులలోన నీవుపాడు
మధురశృంగారగీతముల్ మఱల, గొంతు
నెత్తిపాడుము; కోకిలా! యింపుగాను.

అంతుగానని ప్రకృతిమహా ప్రబంధ
గాన మొనరించుచుండు వేకవివరేణ్యు
చెంతనీవిద్య నేర్చితో? పంతమూని
నీకె నీవభ్యసించితో? నేడు చెపుమ.

సత్కళావేత్తయా కవిచంద్రునట్లు
ప్రకృతి భావకావ్యంబు నుపన్యసించు
చుండి విశ్వముమఱపించు చుందువహహ!
భాగ్యమన నీయదియెయనవచ్చు పికమ.

—పొదిలాపు సూరమ్మాంబ.

★ నక్షత్ర ఫలితాలు

కవికలహంసి
శ్రీమతి చేబ్రోలు సరస్వతీదేవి

భాద్రపదమాసము

అశ్విని
స్వల్పాధికారము, సంతోషము, విషభీతి.

భరణి
శాభిశూల, కోపము, పరుల బాధ, అకాలభోజనం.

కృత్తిక
రాజభయం, విరోధం, వ్రణభయం తెగులుంట.

రోహిణి
బంధుదర్శనం, విష్ణుభక్తి, విద్వత్సహవాసం, వైరం.

మృగశిర
ధనలాభం, గురుభక్తి, జ్ఞానం, సౌఖ్యం.

ఆర్ద్ర
గౌరవం, బహుమానం, సంభోగం, ప్రీతి.

పునర్వసు
గోలాభం, భోగం, యత్న కార్యసిద్ధి.

పుష్యమి
ప్రయాణం, శిరోవ్యాధి, దుఃఖము, వైరం.

ఆశ్లేష
భీతి, ధననష్టము, ప్రయాణమునందు చోరభయం.

మఖ
యుద్ధభయం, దుష్టస్త్రీ కలహం, పీడ, క్లేశము.

పుబ్బ
నీలవస్త్రలాభం, ప్రమాదములు, మతిభ్రంశం.

ఉత్తర
శస్త్రభయం, విచారము, గ్రహపీడ, జ్వరం.

హస్త
సంపత్తు, బుద్ధివైకల్యం, సుఖం, సంతోషం.

చిత్త
అలంకారప్రాప్తి, కీర్తిహాని, ఉద్యోగం, విరోధం.

స్వాతి
మనస్సునకాహ్లాదం, భోగం, ఆరోగ్యం, గౌరవం.

విశాఖ
సౌభాగ్యం, ద్రవ్యలాభం, కార్యలాభం.

అనూరాధ
అనారోగ్యం, బంధువైరం, ప్రయాణం, స్వల్పసుఖం.

జ్యేష్ఠ
ఉపవాసం, గర్భశూల, స్థానచలనం, కలహం.

మూల
బంధువిరోధం, కించిత్ లాభం, ధాన్యనష్టం, జ్ఞానం.

పూర్వాషాఢ
కష్టం, వాతశూల, అకారణవైరం, కృషిహాని.

ఉత్తరాషాఢ
శస్త్రభయం, ఋణమూలమున వివాదం, పైత్యరోగం.

శ్రవణం
విద్వాంసులతో స్నేహం, ధనలాభం, అకాలభోజనం.

ధనిష్ఠ
సత్సాంగత్యం, శుభం, పుత్రసంతోషం, లాభం.

శతభిషం
మృష్టాన్న భోజనం, సంభోగసౌఖ్యం, గౌరవము.

పూర్వాభాద్ర
సుగంధాదిలేపనం, యత్న కార్యసిద్ధి, భోగభాగ్యం.

ఉత్తరాభాద్ర
దుర్బలం, బంధుమిత్రులతో పగ, జ్వరబాధ.

రేవతి
ప్రయాణం, నష్టం, క్రోధం, భయము, చంచలం.

★ స్త్రీ సాముద్రిక శాస్త్రము ★

కవికలహంసి శ్రీమతి చేబ్రోలు సరస్వతీదేవి

సాముద్రిక శాస్త్రమునందు మానవుని హస్తము. 3 భాగములుగా విభజింప బడియున్నది. (1) వ్రేళ్లు (2) అరచేయి, (3) మణికట్టు.

వ్రేళ్లు అయిదింటిలో (1) మొదటిది చూపుడు వ్రేలు. (2) రెండవది నడిమి వ్రేలు. (3) మూడవది ఉంగరపు వ్రేలు. (4) నాలుగవది చిటికిన వ్రేలు. (5) అయిదవది బొటన వ్రేలు.

ప్రతివ్రేలును 3 పర్వములుగా విభజింపబడినది. (1) గోటితో చేరియున్న భాగము. (2) మధ్య భాగము. (3) మూడవ భాగము.

వ్రేళ్లయొక్క ఆకార, పరిమాణములను బట్టి యవిఏడుతరగతులుగ విభజింప వచ్చును.

(1) మొనదేలిన వ్రేళ్లు.

(2) విస్తరించియున్న కొనలుగల వ్రేళ్లు.

(3) చదరపు వ్రేళ్లు.

(4) గోపురాకారమైన వ్రేళ్లు.

(5) దేహపరిశ్రమను దెలియజేయు వ్రేళ్లు.

(6) మిశ్రితమైన వ్రేళ్లు.

(7) తత్వజ్ఞానము దెలియజేయు వ్రేళ్లు.

వ్రేళ్ల ఆకారములు వాటిగుణములు

(1) వ్రేళ్లు మొనదేరియున్న యడల వ్రేళ్లమొదటి పర్వములుకూడ మొనదేరి, అరచేయి మధ్యపరిమాణముగలిగి, బొటనవ్రేలు కురుచై అందముగానుండును.

ఇట్టి వ్రేళ్లు కలవారు, బుద్ధిమంతులు, భక్తికలవారు, భక్తిగ్రంథముల రచించువారు, అందమైనవస్తువుల యందపేక్షగలవారై యుందురు.

(2) విస్తరించియున్న కొనలుగల వ్రేళ్లయొక్క మొదటిపర్వము దళసరిగను పెద్దదిగను యుండును.

ఇట్టి వ్రేళ్లు కలవారు, వ్యవసాయ ప్రియులు, వ్యాపారమునందు తెలివితేటలు గలవారు, యంత్ర సంబంధమైన పనులయందు ఇష్టముగలవారు, శ్రమకోర్చిపనిచేయువారుగను యుందురు.

(3) చదరపు వ్రేళ్లు గలిగియున్నయడల సాధారణముగ బొటనవ్రేలు పొడవుగను, మూడవపర్వములు బొద్దుగను, అరచేయి మధ్యపరిమాణముగలదిగను, కఠినముగను యుండును.

ఇట్టి వ్రేళ్లు గలవారు విద్యాధికులు, యంత్రసంబంధపు పనులవలన జీవించువారు. ధైర్య, స్థైర్య, సాహసముగలవారు. విజ్ఞానవంతులై యుందురు.

(4) గోపురాకారమైన వ్రేళ్లకు మూడవపర్వములు దళసరిగను పెద్దవిగను యుండును.

ఇట్టి వ్రేళ్లు గలవారు, అసూయాపరులు, ప్రపంచసుఖములందు లక్ష్యములేనివారు, ఎక్కువగా మాట్లాడువారు, ఇతరుల అభిప్రాయములను నిరసనభావముతో చూచువారునైయుందురు.

(సశేషము)

గతమాసం బొంబాయిలో తిలకు వార్షికోత్సవం జరిగింది. ఆ సమయంలో దేశసేవికలు, బాలికా దళములు ఊరేగింపు టుత్సవంలో పాల్గొన్నారు.



శ్రీమతి కమలాదేవి ఛటోపాధ్యాయిగారు అమెరికాలో చాలాకాలమునుండి సంచారంచేస్తూ భారతదేశ స్వాతంత్ర్యాన్నిగురించి అమెరికాప్రజల్లో ప్రబోధం చేస్తున్నారు. ఆమె కుమారుడు శ్రీ రామకృష్ణ ఛటోపాధ్యాయి అమెరికా ఆర్. సి. ఎ. రేడియో విద్యాలయంలో విద్య నభ్యసిస్తూవున్నాడు. కమలాదేవి న్యూయార్కు వెళ్లినప్పుడు కుమారుడు రేడియోయంత్రాల్ని గురించి తల్లికి బోధ పరుస్తున్నాడు.

పార్వతి

శ్రీ కుమాండూరి వెంకటరామానుజాచారి

పతివియోగినియైనను, ఉన్నతాదర్శముతో సంచరించి తనకు, తన అన్నకే కాక అత్తవారికి కూడ ఆమె ఆధారభూతమైనది... పతితులైన పతివియోగులకు పార్వతి బాట పరమపద తుల్యము కాదా?-

రాధాచరణుని యకాలమృతిచే నతని పినతండ్రి పినతల్లుల కపారమగు దుఃఖముకల్గెను. కాని అభాగినియగు పార్వతికి సంసారమే అంధకారమాయెను. ప్రపంచమున నామెకు ఆశ, ఉత్సాహము, సుఖము సర్వనాశనమైపోయెను. శోకభారముచే పార్వతి కోమల హృదయము నిస్సంశయముగ పిండియైపోయినది. కాని విధివిపరీత విధానమున నెవనికేమి యధికారమున్నది?

రాధాచరణుని పినతండ్రి రామప్రసాదు సామాన్యహోదాగల మనుష్యుడు. రాధాచరణు పంచవర్షప్రాయముననే అతనితండ్రి గురుప్రసాదుడు మరణించెను. తల్లి సునీతియు భర్తృమృతిశోకవత్సరము పిమ్మటనే స్వర్గలోక గామినియైనది. ఇందుచేతనే పినతండ్రి రామప్రసాదును, అతని పత్నియగు హరదేవియు బాలుడగు రాధాచరణుని పెంచి పెద్దజేసినారు. వారికి పైతృకమగు కొంత ఆస్తిగలదు. దానిపైవచ్చు ఆదాయముతో నింటిఖర్చు నడచుచున్నది. ఉండుటకు చక్కనియిల్లుండెను. కాని యీ పిత్రార్జితమున, నివసించునింటను సంపత్క్షయరోగమగు ఋణపుకీటాణువులు ప్రవేశించినవి. రామప్రసాదు తనపుత్రి చమేలీయొక్క వివాహమునకు నగరునందలి మూర్ఖులు, నిరుద్యోగులునగు మానవుల నోళ్లనుండి కృత్రిమ మధురవాక్యములను వినుటకై చాలధనమును పాడుచేసెను.

రామప్రసాదు పుత్రిక చమేలీకి పెండ్లియైనవత్సరమే రాధాచరణుడు బి.ఏ. లో మొదవసంఖ్యలో కృతార్థుడైనాడు. రాధాచరణున కతని యోగ్యతచే స్కూలునుండియే విద్యార్థి వేతనము లభించుచున్నది. కాని బి.ఏ. జీతము, పుస్తకములకొఱకు పినతండ్రి రామప్రసాదు 150 రూ॥ల తనకిచ్చియుండెను. అదే వత్సరమున రాధాచరణుని యాస్థినంతయు అప్పులక్రింద కర్చుపెట్టి, ఋణప్రసంగము లేవగనే రామప్రసాదన్న కొడుకు చదువు నెత్తుచుండెను. అతని లెక్కలో రాధాచరణుడు చదువకుండినట్లయితే తాను ఋణగ్రస్థుడగుట కాకుండెడిది అని. చిన్నచిన్నమాటలపై రామప్రసాదు రాధాచరణునితో "అపుడే నీవు నాకేమిసేవ యొనర్చితివి? ఒక సాలునుండి నెలకేబదిరూపాయలు తేనారంభించితివి. నన్నుచూడు, నీ చదువు కారణముచే నష్టమైపోతిని. ఇంత యీయవలసి వచ్చినది" అని చెప్పుచుండెడివాడు.

శోక ప్రబలతరంగముల బ్రవహించుచున్న రామప్రసాదు దంపతులు తమ కోడలి యాతననుగూడ గ్రహించకైరి. భాద్రపదవర్షానంతరము సూర్యభగవానుడు అధికాసహ్యుడై నిలబడుచుండురీతిగ శోకసాగరస్నానమొనర్చిన రామప్రసాదు దంపతుల కఠోరహృదయము మరింత కఠినమైనది. ఇపుడు మాటమాటకు వారు "రాధా మమ్ములను చంపివేసెను; అతడు మా అన్నకొడుకుకాడు; శత్రువు; మమ్ములను ధ్వంస మొనర్చుటకు వచ్చెను" అని చెప్పుచుండిరి.

పార్వతి హృదయమున శోకంపు బ్రచండాగ్ని ప్రజ్వలించుచున్నది. పైన రామప్రసాదుదంపతుల కఠోర వ్యవహారమాయబలను నిర్జీవి నొనర్చుచున్నది. శోకపుటనంత జ్వాలలో, అనంతవిరహపు ప్రచండా

నలమున గాఢతమ నిరాశాంధకారమున ఉపేక్షాకృత దుర్గంధపూర్ణ సంసారమున నెల్లయెడల నామెకు పరలోకగతపతియొక్క పవిత్రముఖపద్మముతప్ప వేరొండు గనపడుటలేదు.

పార్వతి 'హిందీ మధ్యమ' ప్యాసైనది. రాధాచరణుడు చాలా బలవంతముతో నామెకు ఇంగ్లీషుకూడా నేర్పియుండెను. దీనితో నామె ప్రవేశిక పరీక్షనీయగల్గునని యతనియాలోచన, గాని అతని యకాలమృతి అనేకములగు నన్యవిషయములతోఁబాటుగ నీకోర్కెను పూర్తికానీయలేదు.

భర్తృమృతికిఁబిమ్మట నభాగినియగు పార్వతికి బుస్తకస్పర్శనకు నవకాశము దొరుకుచుండలేదు. గృహమున నామెబలమేమియు లేదు. రాధాచరణుని మృతికామెయే కారణమని యత్తగారు తలఁచుచున్నది. పార్వతి ధాన్యము విసరుచున్నది; వంటయిల్లు, పాత్రలు శుభ్రము చేయుచున్నది; భోజనము తయారు చేయుచున్నది; ఇంతచేసినను అత్తమామల సానుభూతికి మాత్రము పాత్రురాలగుటలేదు. ఇంతేగాక వారినోటినుండి యెన్నడును మృదుపదములు వినుచుండలేదు. వినుచున్నది ఋణగ్రస్తతకుఁ గారణమగు తనదౌర్భాగ్యగాథయు, భర్తృనిందయును.

పార్వతికి గుటిలతాపూర్ణ సంసారమున సానుభూతి చిహ్నమెచటను గన్పించుటలేదు. ఆమె కొక పినతండ్రి కొడుకుగలడు. అతడెచటనో నౌకరు; కాని, వివాహితుడు. దారిద్ర్యఫలములగు సంతానపు టాధిక్యము తోడి యైశ్వర్యము గలదు. పార్వతికి ఘోరనిరాశాంధ కారమున, అత్తమామల కఠోర వ్యవహారరూప నరకమున, ఉపేక్షాసముద్రమున, శోకమహాసాగరమున, తనయన్నయను ధ్రువతార దర్శన మొనర్చెను. దానింజూచి దిగ్భ్రష్టయగు పార్వతి కర్తవ్య పథనిశ్చయ మొనర్చుకొనెను. ఎదుటనిలచిన బీరువాయందున్న పుస్తకము లామెను తమతమ భాషలతో నోదార్చ దొడగినవి. అవి 'పార్వతీ! నీవు వ్రాయ, జదువ నేర్చిన దానవు, మేము నీ స్నేహితురాండ్రము, మాకు ఏవగింపు తెలియదు. ఉపేక్షించుటరాదు, మాతో నెపడైన విరక్తుడైనను, మేమెవరితోను విరక్తులమగుటలేదు' అని చెప్పదొడగినవి. పుస్తకముల విభిన్న-కాని-మాన భాషల నామె చక్కగ గ్రహించినది. ఆమెభగ్న హృదయమున శాంత్యస్ఫుటకిరణోదయ మాయెను. అలమారునందలి పుస్తకములందామె సాక్షాదభయదయగు సరస్వతీదర్శన మొనరించెను.

◆ ◆ ◆

ఒకనాటి ప్రాతఃకాలమున పార్వతి చాలా శాంతముతో తన యత్తకు "కొన్నిదినములు నేను నా యన్నదగ్గరకు బోగోరుచున్నాను. మీరతని కొకజాబు వ్రాయించుడి" అని తెలియజేసినది.

అత్తకు మనోవాంఛితము చేజిక్కినది. ఆమె తన పతి రామప్రసాదుతో ఆ విషయమును జెప్పినది. అతడు తొలుతనేమో 'హాఁ హూఁ' అనినాడు. తిరిగి ధర్మస్వభావముల సాధినియగు స్త్రీ చెప్పుటను వినిన మీదట సుఖదయాళునకొక లేఖ వ్రాసెను.

నాల్గురోజులకు పిమ్మట కోడలు వెడలిపోవును. ఇందుచే గోడలితో నధిక కఠోరవ్యవహార మొనర్పఁదగదనితలచి పార్వతితోడి రామప్రసాదు దంపతుల వ్యవహారము పూర్వముకంటె బాగైనది.

రాధాచరణుడు మృతిజెంది ఒకవత్సరముకూడ కాలేదు. ఈ స్వల్పకాలములోనే పార్వతికి గృహమందలి ప్రతియొక వస్తువును పూర్తిగా మారిపోయినది. ఇంటి మనుజులతోఁబాటింటి ద్వారములు, గోడలు, కూడా ఆమెను బాధింపఁబరుగిడుచున్నవి. చందా పూర్తికాని కారణమున నింతవరకు నామెపేర కొన్ని పత్రికలు వచ్చుచున్నవి. సమయము దొరికినపుడు పార్వతి వానిని చదువుకొనుచున్నది.

సోదరిని తీసికొని వెడలుటకై శనివారమురాత్రికి సుఖదయాళుడు వచ్చునని మూడవదినమున జవాబువచ్చినది. బుధవారమున లేఖ చేరినది. పార్వతి నింక దినద్వయపుటతిథిగనెంచి, అత్తమామల కఠోర హృదయములు మరింతమందమైనవి. పార్వతి సేవయందున, నెన్నడుఁజలింపని యామె శీలమున వారలకిపుడు చాల మంచితనము కన్పింపఁదొడగినది. శనివారమురాత్రికి సుఖదయాళుడు వచ్చినాడు. సోదరిని కౌగలించుకొని యతడు చాలగ నేడ్చినాడు. రెండవదినపు టుదయపు రైలులో నాతడు పార్వతిని దీసికొని యింటికి బయలుదేరెను.

వెడలుచున్నపుడు పార్వతి తన పతియొక్క పుస్తకముల ట్రంకు నొకదానిని మాత్రము వెంటదీసికొనెను. మిగిలిన యే జవాహరుగాని, రెండు చీరలు దప్పించి యేబట్టనుగాని వెంట నిడుకొనలేదు. నిండు గృహము, ఏది యామెకొఱకుఁ దొలినుండి ఖాళీయైపోయినదో దానిని ఆమెకూడా ఖాళీచేసినది. బయలుదేరునపుడత్తగారు పెదవుల ప్రేమతో 'ద్వరగా రమ్మ'ని చెప్పినది.

పార్వతి నిష్కపటహృదయముతో నే సమయమున నత్తగారి చరణస్పర్శ మొనర్చెనో, ఆసమయమునఁ గొన్ని వేడి కన్నీటి బిందువులును హరదేవీచరణస్పర్శ మొనర్చుటలో నామెతోడి శత్రుత్వము వహించినవి.

◆ ◆ ◆

పార్వతిరాకచే సుఖదయాళుని దరిద్రపైతృకగృహము స్వర్గమాయెను. నిర్ధనత్వముచే శిక్షను పొందజాలకున్న అతని బాలకులు మేనత్తయగు పార్వతివలనఁ జదువఁదొడగిరి. సుఖదయాళుని జ్యేష్ఠపుత్రిక యగు 'శాంత' ఆమెనుండి హిందీ శిక్షతోఁబాటుగ కుట్టుపని నేర్వదొడగినది. కొలది దినములలోనే పార్వతీ శాంతలకు సూది ప్రభావముచే కొంచెము తక్కువగా రోజుకు రెండురూప్యము లాదాయము కాఁజొచ్చెను. పార్వతి చెప్పినమీదట సుఖదయాళుడొక మంచి గోవునుగొని తెచ్చెను. ఇపుడతని యింట సర్వముగలదు. విద్యయున్నది; ధనమున్నది; గోరసమున్నది.

ఒకవర్షము గడచినది. హిందూ బాలికాపాఠశాలలో పార్వతి హిందీ నేర్పుచున్నది. ఈ సంవత్సరమే యామె 'ప్రవేశిక' పరీక్ష ప్యాసైనది. నెల కేబదిరూపాయీల వేతనము దొరకుచున్నది. ఒక సాలుకు పూర్వము దిక్కులేక బికారులవలె దిరుగుచున్న సుఖదయాళుని బాలకులు నేడు స్వచ్ఛమగు వస్త్రములు ధరించి, పెద్దయింటి పిల్లలవలె చంకల బుస్తకములఁ దగిలించి బడికిబోవుచున్నారు. బాలికశాంత కూడా పార్వతితో బడిలో పనిచేయుచున్నది. దేవీ స్వరూపిణియగు సోదరి యనుగ్రహమున సుఖదయాళుడు గూడ దాస్యకర్కశ కరములనుండి ముక్తినిబొంది, వ్యాపారపుకొట్టును తెరచెను.

మరి నాల్గువత్సరములు గడచినవి. పార్వతి ప్రైవేటుగ బి.ఏ. ప్రథమశ్రేణిలో ప్యాసైనది. రాయపురపు కలెక్టరుభార్య స్వహస్తముతో పార్వతియొక్క తెల్లనిచీరపై ప్రతిష్ఠాసూచకమగు మెడలు సుధరింపఁజేసినది. ఏ పదవీశోభను, ఉపయుక్త హిందూ పండితాణి లభింపనికారణమున నిప్పటిదనుక క్రిస్టియను లేడీలు వృద్ధిచేయుచున్నారో అట్టి హిందూ బాలికాపాఠశాలా ప్రధానాధ్యక్షిణీ (Lady Principal) పదవియందు పండితాణియగు పార్వతియొక్క యశోగానము కాజొచ్చెను. జీతముకూడ నొక్కమారుగ 250 రూప్యములైనది.

◆ ◆ ◆

దరిద్రభారతదేశపు కల్పితైశ్వర్యస్వప్నమునుఁజూచి నేడుకూడా అనేకమంది విదేశీయులు ఉలికిపడుచున్నారు. కాని, భారతదేశపు పల్లెలను, ఏకవస్త్రధారులు, కృశకాయులు, అస్థిచర్మావశిష్టులు, భారత

గౌరవరూపులు, నగురైతులను యెవరు చూచియుందురో వారు భారతపు వైశ్వర్యవిభూతిని జక్కగ గ్రహించుచున్నారు.

‘బాలికాపాఠశాలలోని ఎనిమిది రూప్యముల బంట్రౌతుగిరి కింతమంది మనుష్యులు వత్తురని యెవరికిని తోచలేదు. అనేకులగు వృద్ధమనుజులు పంక్తులుదీర్చి కూర్చొనినారు. రాయుబహాదరుపత్నియు, రెండవ యుపాధ్యాయినియగు సుశీలయు, నా గుంపునుండి నల్గురుమనుష్యుల నెంచినారు. వీరి నుండియే యొకనిని పెద్దఅమ్మగారెంచుకొనెదరు. హిందూబాలికాపాఠశాలలో ఘోషా, సదాచారములపై విశేష ధ్యానముంచఁబడుచున్నది. ఇందుచేతనే యే నౌకరునియామకములోనూగూడ చాల సావధానతతో యేర్పుచ్చుకొనవలసివచ్చుచున్నది. పాఠశాల అంతటిలోను కేవలము బంట్రౌతుపనిమాత్రమే పురుషుని యధీనము. మిగిలిన యెల్ల కార్యములలోను స్త్రీలేనియుక్తులు.

పదిగంటలు కాగానే లేడీ ప్రిన్సిపాలుగారి బండి బడివసారాలో చేరినది. విభిన్నతరగతుల విభిన్నపంక్తులలో నిలచి బాలికలు శ్రద్ధతో ప్రధానాధ్యాపికకు ప్రణామమొనరించిరి. బండినుండి దిగి యామె తిన్నగా ఆఫీసునఁ బ్రవేశించినది. ప్రిన్సిపాలుగారు వచ్చినమీదట దాసీ వరుసగ నా నల్గురు మనుష్యులను బిలచినది.

మొదటిమనుష్యుని చూచుటతోడనే పార్వతియొక్క విస్మయమునకు హద్దులేదు. ఆ ముసలి మనుష్యుఁడు మరెవ్వడుగాడు. అతనినిజూచి పండితాణి యగు పార్వతియొక్క హృదయమున లజ్జోదయ మాయెను. కాని, తత్కాలముననే ఆమె తనను సంబాళించుకొనినది.

‘నూరుమైళ్లదూరమున నెన్మిదిరూపాయల నౌకరీకొఱకాతఁడేల వచ్చియున్నాడు? అతని ఆస్తి యిల్లు, ఇచ్చకముల మారియుఁ బొరుగువాడు నగు నా వడ్డీవ్యాపారి విశాలోదరమున నిమిడిపోయియుండునని తోచుచున్నది.’ రామప్రసాదుని మలిన, చింతిత, ముఖమునుఁజూచి కరుణహృదయయగు పార్వతి హృదయము చలించినది. ఆ యమ మొగము నోరగఁబెట్టి ఖిన్నభావముతో సందేహ నివృత్తికొఱ కిట్లడిగెను.

‘తమపేరు?’

‘రామప్రసాదు పాండే’

‘నివాసము?’

‘విలాసపురము.’

‘నౌకరీకొఱ కింతదూర మెందుకువచ్చిరి?’

‘అమ్మా! పొట్టకొఱకు.’

‘ఇంటియొద్ద వ్యవసాయము లేదా?’

‘అమ్మా! సర్వమున్నది. పొలమే యేల? జమీందారీకూడ నున్నది.’

‘అదేమైనది?’

‘అప్పులో విక్రయమైనది.’

‘అప్పు ఎందుకు తీసికొనినావు?’

‘అమ్మా! వానిని మరచిపోవుటయే మంచిది; దుఃఖము కల్గించు విషయములవి.’

‘ఐనా వినిపించినట్లయితే—’

‘అన్నకొడుకు చదువుకొఱకు.’

‘ఇంకా ఏమిటి?’

‘ఇంక నేమియు లేదు.’

‘పిల్లపెండ్లిలో దుర్వ్యయము చేసియుండలేదా?’

వృద్ధుని ముఖము మలినమైపోయినది. అతడు పార్వతియొక్క ముఖము నెన్నడును చూడలేదు. మఱి యిప్పుడుమాత్రము విద్యాధికార గౌరవముల దీప్తి యామెను పూర్తిగ మార్చివేసినది. ముసలి తన హృదయములో నీ యమ్మగారిని దేవిగాఁ దలఁచ మొదలిడెను.

‘మంచిది. తాము బయట కూర్చొనుడు’ అని చెప్పి, మిగిలిన ముగ్గురు మనుష్యులలో నొక ఆసామి యెంచి తీసికొనఁబడెను. వృద్ధుడగు రామప్రసాదు అపుడే లేడీ ప్రిన్సిపాలు బంగాళాకుఁ జేర్చఁబడినాడు.

ఎనిమిదిరూప్యముల నౌకరీకై వచ్చియున్న రామప్రసాదుకు బంగాళాయందలి నౌకరులు తనను యజమానిమాదిరిగఁ జూచినపుడు అతనికి చాల ఆశ్చర్యమైనది.

సాయంకాల భోజనానంతరము పార్వతి ‘తమరు నన్ను గుర్తించితిరా?’ అని ప్రశ్నించినది.

‘అమ్మా! మీరు స్కూలు పెద్దదొరసానిగారు.’

‘నేను తమ అన్నకొమరుని అభాగిని నగు భార్యను.’

వృద్ధుని నిద్ర వదలినది. అతనికి మూర్ఛ రాఁదొడగెను. రామప్రసాదిక్కడనే యుండవలెనని పార్వతి చాలగ వేడికొనెను. కాని యతఁడెవ్విధమునను గూడ నొప్పుకొనలేదు. ఆత్మగ్లానియొక్క తీవ్రాగ్నిచే నతడు లోలోననే కుములుచున్నాడు. వెళ్లుసమయమున నప్పుడప్పుడు దర్శనమిచ్చునట్లు పార్వతి మాటఁదీసికొనినది. తిరిగి వేయిరూప్యములవి రెండు నోట్లను సంచిలో మూసి,, ముసలిమామ చేతికిచ్చి, నమ్రతతో ‘ఈ చీటీని అమ్మగారికిండు, మరి యీమారు ఆమెను తప్పక మీతోడ తీసికొనిరండు’ అని చెప్పినది.

(హిందీనుండి)

మా తల్లీ!

మాతల్లీ! భవదాగమంబునను, ఇమ్మాడ్కిన్ ప్రసూనమ్ములన్
చేతన్ పట్టియు స్వాగతాలు భవసాన్నిధ్యమ్మునందివ్వగన్
నీతోకూడిచరింపగన్, మరియు శాంతిజ్యోతి యందైక్యమై
మాతృస్పర్శను పొందనుంటి మిటులమ్మా! మమ్ముదీవింపవే!
నీమధురమోహనాకృతిన్ మేముచూడ లేకపోయి నన్నాళ్లును లేదుమాకు
మోక్షమన్నది ఏకోణముననను, దేవి! భూమిలో పొందలేమమ్మ పున్నెమైన
తల్లిచెంతను లేకున్న తల్లడిల్లు పిల్లలవిధమ్మునన్ విలపించినాము
ఇపుడు మాచెంతవచ్చి లాలించినావు తల్లి! మాతల్లి! మా స్వాగతాలకొనుమ!

—పన్యాల చూడికుడుతమ్మ.



సభలలో సమావేశాలలో

"ఏ సందర్భములో నయినా ఇండియన్ టీ ఆదర్శమయిన పానీయము అని నా అనుభవము" అని శ్రీ వత్సవ సతి చెప్పినది. దేశములో ఉన్న ప్రముఖులందరూ ఈమె ఆతిథ్యాన్ని పొందినారు. ఉచ్చస్వరముతో పలికిన ఈమె ప్రశంసవల్ల టీలో ఉన్న అన్ని ప్రయోజనాలు తెలుస్తున్నవి. అంతే కాదు. హిందూదేశ సాంఘిక జీవితములో టీకి ఉన్న ప్రత్యేక స్థానము కూడా తెలుస్తూ ఉన్నది. ఇంట్లో చేసే ప్రతి ఉత్సవమూ పర్వమూ జయప్రదము కావడానికి టీ పానీయము అత్యంత అవసరము.

అతిథులను మెప్పించవలెనంటే వారికి "టీ"ని యివ్వవలెను

ఇండియన్ టీ మార్కెట్ ఎక్స్‌పాన్షన్ బోర్డువారిచే ప్రకటించబడింది

★ 'నిత్యకళ్యాణము - పచ్చతోరణము' ★

హైందవాచారములందు 'ముగ్గు'లకు గల అలంకారము - ప్రాముఖ్యత.

— శ్రీమతి —
కందుకూరి మహాలక్ష్మీదేవి

హిందూమతాచారములు, విజ్ఞాన విషయపూరితములు.

ఆచారమనుపేర పూర్వపరంపరగా వచ్చుచున్న ముగ్గులు శారీర మానసికాభివృద్ధికి వెలుగుల నిచ్చు విజ్ఞాన జ్యోతులు—

అయిన, వాటిలోని భావమేమిటి...?

ప్రపంచమునందెల్ల మతంబులలో నగ్రస్థానము వహించిన హిందూమతమునగల ధర్మములు, పూర్వాచారములు, తపశ్శాలురగు ఋషులచే నిర్మింపబడినవి. పూర్వపరంపరగానున్న హిందువుల ప్రతి ఆచారమునందును యేదియోయొక మహత్తరమును, క్షేమకరమును నగు విషయజ్ఞాన మిమిడియేయున్నది.

ప్రతి హిందూ గృహమునను దేవతామూర్తులుగల పటములచే నలంకరింతురు. వీనివలన హిందువులకుగల దైవభక్తి విశదమగుచున్నది. ఈ విగ్రహములలో హిందువుల దైవములు, వారి యవతారములు, వారొనర్చిన కృత్యములు మొదలగు చర్యలు చిత్రింపబడి మనకు ఎంతయు మార్గదర్శకములుగా నున్నవి. ఈ చిత్రపటములలో విష్ణువు, శివుడు, రాముడు, కృష్ణుడు, దుర్గ, లక్ష్మి, పార్వతి, సరస్వతి మొదలుగాగలవి యెంతయు హృదయాకర్షకములుగ నుండును. ప్రాతఃకాలమున నిద్రలేచినతోడనే ఈ పటములను చూచుట వలన పాపహరము, మనస్సంతోషము, హృదయ నైర్మల్యము కలుగుననుటకు సందేహములేదు. ఇంతియేఁగాక యీ పటములు నిత్యమును యిష్టదైవప్రార్థనమునకు వీలు కలుగఁజేయును.

సాధారణముగ ప్రతిహిందూ గృహమునను దైవారాధన చేసికొనుటకు ప్రత్యేకముగ నొక పూజాగృహము (గది)గాని, యింటిలో నొకమూలను ప్రత్యేకస్థలముగాని యుండితీరును. పూజ కుపకరించు ఫలపుష్పపత్రముల నొసంగుటకై నారికేళ, కదళీ వృక్షములును, తులసి మొక్కలును, మరికొన్ని పూలమొక్కలును గృహావరణములో నుండును.

హిందువులు అలంకారప్రియులు

మనము మన శరీరముల నలంకారములతోను, శుభ్రవస్త్రములతోడను అలంకరించుకొనునట్లే మన గృహములనుగూడ అలంకరించుట యాచారమైయున్నది. గృహబాహ్యాలంకారములలో ద్వారమున మామిడియాకుల తోరణములు కట్టుట మనకు ముఖ్యాచారమైయున్నది. ఇట్లలంకరించుట శుభసూచకము. ఇవి శుభకార్యములయందును, పర్వదినములందును ముఖ్యముగా నలంకరించుచున్నాము. ఎల్లప్పుడును గృహమున సంతోషమును, శుభమునుగోరి "నిత్యకళ్యాణము, పచ్చతోరణము" అను సామెత వాడుకలోనికి వచ్చినది.

మత సాంప్రదాయములగు పూర్వాచారములు హిందువులకు నిత్యకృత్యములుగను, విధ్యుక్తధర్మములుగను పరిణమించినవిగాని వానియందలి సారాంశము, భావము, అంతరార్థము గ్రహింప నూహ జనింపకుండుటచేత కొన్ని యాచారములను నిరసనగా జూచి వానియందుపేక్షవహించి వదలుకొనుచున్నారు.

గృహకృత్యము లన్నింటిలోను మొట్టమొదటి దినకృత్యము వాకిట ముగ్గులు పెట్టుట. వీనిని ముగ్గులు, రంగవల్లులు అనెదరు. తెల్లవారుఝామున సూర్యోదయముకాక ముందుగనే గృహములో నుండు వారెల్లరు లేవక పూర్వమే గృహిణి మేల్కొని వాకిలియూడ్చి, గోమయము కలిపిననీళ్లచే కలయంపి జల్లి, తదుపరి ముగ్గులువేయుట ఆచారమైయున్న సంగతి అందరెఱింగిన విషయము. ఈ ముగ్గులకై పూర్వము బియ్యపుపిండి (వరిపిండి)ని ముఖ్యమైన వస్తువుగా వాడుచుండెడివారు. ఇదిగాక పసుపుపొడి, కుంకుమ పూవు, పచ్చకర్పూరము మొదలగునవి కూడ వాడుకలో నుండెడివి.

పూర్వమున మన హిందూదేశము సకలైశ్వర్యములతో తులతూగుచున్నపుడు మహారాజులు పురప్రవేశము చేయునపుడును, పురమున యూరేగునపుడును కస్తూరి, జవ్వాది, పునుగు మొదలగు మిక్కిలి వెలగల సుగంధ ద్రవ్యములను, పచ్చకర్పూరపు నీటితోను, పన్నీటితోను కలిపి అలుకుటకును, కలయంపి జల్లుటకును యుపయోగించుచు వీధులలో మంచి ముత్యములతో ముగ్గులు పెట్టుచుండెడివారని పూర్వకవులు తమ ప్రబంధములలో మిగుల వర్ణించిరి. ప్రస్తుతము ముగ్గులు వేయుటకు అనేక గృహములయందు పాషాణ సున్నము నుపయోగించుచున్నారు. అదియును గృహిణులు చేయక పరిచారికల చేతనే చేయించుచున్నారు. నాగరికతాభివృద్ధినొందిన యిక్కాలమున ప్రతిపనికిని యంత్రములు బయలుదేరి కులవృత్తులను, చేతిపనులను అడుగంటఁజేసి, ప్రజలను సోమరులుగను, నిఱుపేదలనుఁగా జేయుచున్నవి. అన్ని పనులకును యంత్రములు బయలుదేరినట్లే ముగ్గులు వేయుటకుఁగూడ ఒకచీనారేకు గొట్టమేర్పడినది. దీనివలన కష్టములేకుండ సునాయాసముగా చిత్రవిచిత్రములగు రంగవల్లుల నలంకరించుట కవకాశమేర్పడినది. ఏనుగులు, గుఱ్ఱములు, చిలుకలు, హంసలు, లతలు, పండ్లు మొదలగు చిత్రములు (ముగ్గులు)తీర్చి, అచ్చుగ్రుద్దినట్లు వేసికొనవచ్చును. ఇది కేవలము అలంకారమునకేగాని వానిలో నర్థమేమియు బొడగట్టకున్నది.

పూర్వపు హిందూవనితలు పెట్టు ముగ్గులు బాహ్యాలంకారములకేగాక ఆధ్యాత్మికాంతరార్థములతో నిమిడియుండి రేఖాగణితములోని గీతలను, కోణములను స్ఫురణకు దెచ్చుచుండెడివి. వానిలో అర్థమే లేకున్న వారుకూడ యే నక్కలనో, కుక్కలనో, గోవులనో, పక్షులనో ముగ్గులతో చిత్రించగలవారే! వారి యాశయమది కాదు.

ఇఁక రేఖాగణితము మొట్టమొదట సృష్టికర్తచేతనే ఆరంభింపబడినది. ఇందులకు మన నుదుటను, అరచేతులయందును, పాదములయందును గల రేఖలే ప్రబలనిదర్శనములుగా నున్నవి. ఆ రేఖలలో గొన్ని సమానరేఖలు (Parallel lines) కొన్ని కోణములు (Angles) కొన్ని త్రికోణరేఖలు (Triangles) కొన్ని చతుష్కోణరేఖలు (Squares) కొన్ని చక్రములు (Circles) గను మరికొన్ని తదితరాకృతులుగను నుండుట మనకు దృగ్గోచరంబుగ నుండుటయేగాక, వానివానికి తగిన యంతరార్థములతో మానవులకు శుభాశుభంబు నొసంగుచుండుట సాముద్రికశాస్త్రమునందు నమ్మకమున్న వారందఱికిని విశదమే. ఈ రేఖలు దైవనిర్మితములు. వీనిని పూర్వకాలపు ముగ్గులు మానవ నిర్మితములగు రేఖాగణితములోని గీతలనియే నాయభిప్రాయము. పుష్పదళ హైందవస్త్రీలు ఆధ్యాత్మికాంతరార్థములతో రేఖలుగను, కోణములుగను, చక్రాకారములుగను, పుష్పదళాకారములుగను సూర్యోదయమునకు ముందుగనే శుద్ధమగు వరిపిండితో తమ గృహముల వాకిండ్లయందలంకరించుచుండిరి. ఇవి మొదట ఋష్యాశ్రమములయందే పుట్టియుండవచ్చును. ఎందులకనగా ఋష్యాశ్రమమందలి స్త్రీలకుగూడ వేదాంతపరిశ్రమ ముండెడిది. వేదాంతార్థములుగల ముగ్గులు వేదాంత పరిజ్ఞానముగలవారికి గాక మఱెవరికి యర్థమగును?

ముఁగ్గులకు గల వేదాంతార్థము

స్త్రీ పురుషాదులగు మానవవ్యక్తులకు వీపు మధ్యభాగమున కంఠము మొదలు ఆసన పర్యంతము నిడుపుగా వ్యాపించియుండు వెన్నెముకయందిమిడి తెల్లనిత్రాడువంటి మస్తిష్కపదార్థము (మెదడుయొక్క

పదార్థము)నకు (Spinal cord) తెల్లనరము (సుషుమ్న)అని పేరు. ఈ తెల్ల నరమునందు ఆసనమునుండి కంఠమువరకు అచ్చటచ్చట గుబురు (గ్రంథులు)లుండి యవి శరీరమంతటను ఆయాభాగములకు వ్యాపించు నరముల గుంపులకు (Nerve plexuses) ఉత్పత్తిస్థానములగుచున్నవి. ఈ గుబురులకు వేదాంత శాస్త్రజ్ఞులు చక్రములనియు, కమలములనియు పేరిడిరి. ఈ చక్రములు లేక కమలములు వానివానికి తగినన్నిదళములుగలిగి ఆయుర్వృద్ధికి సాధనములగుచున్నవి. ఇవి ఆసనమునుండి కంఠమువరకు క్రమముగా అధోభాగమునుండి ఊర్ధ్వ భాగమువరకు (1) మూలాధారచక్రము (2) స్వాధిష్ఠాన చక్రము; (3) మణిపూరక చక్రము ; (4) అనాహత చక్రము; (5) విశుద్ధచక్రము అనిరైయెదును, ఇవిగాక కనుబొమలనడుమ (భ్రూమధ్యమందు) ఆజ్ఞాచక్రమును, కపాలమున (నడుశిరమున) సహస్రారచక్రము (కమలము)ను యిమిడియున్నవని వచించిరి. ఈ కమలములకు సంస్కృత వర్ణక్రమమునందలి అక్షరములను దళములుగను, కొన్ని అక్షరములు బీజములుగను నిర్ణయించిరి.

చక్రముల వివరము

(1) మూలాధార చక్రము



ఈ పైని చిత్రించిన మూలాధార చక్రమునకు గుదస్థానమున వ, శ, ష, స, యను నాలుగు దళములును, 'ఓం' అను బీజాక్షరమును గలిగి అర్ధచంద్రాకృతితోడను, సువర్ణచాయతోను యుండి క్రియాశక్తి అధీనములోనుండి విఘ్నేశ్వరుడు అధిదేవతగా నొప్పుచున్నది.

(2) స్వాధిష్ఠాన చక్రము



ఈ స్వాధిష్ఠాన చక్రమునకు గుహ్యస్థానమున బ, భ, మ, య, ర, ల అను ఆరు దళములును, 'న' అను బీజాక్షరమును గలిగి త్రికోణాకారము తోడను, శ్వేతవర్ణముగను యుండి జ్ఞానశక్తి అధీనములో నుండి బ్రహ్మ అధిదేవతగా నొప్పుచున్నది.

(3) మణిపూరక చక్రము



ఈ మణిపూరక చక్రమునకు నాభిస్థానమున డ, ఢ, ణ, త, థ, ద, ధ, న, ప, ఫ అను పది దళములును, 'మ' అను బీజాక్షరమును గలిగి షట్కోణాకారముతోడను, శ్యామల వర్ణముగను యుండి ఇచ్ఛాశక్తి అధీనములోనుండి విష్ణువు అధిదేవతగా నొప్పుచున్నది.

(4) అనాహత చక్రము



ఈ అనాహత చక్రమునకు హృదయస్థానమున క, ఖ, గ, ఘ, ఙ, చ, ఛ, జ, ఝ, ఞ, ట, ఠ అను పండ్రెండు దళములును, 'శి' అను బీజాక్షరమును కలిగి వట్రులాకారముతోడను, నీలవర్ణముగ నుండి, ఆది శక్తి అధీనములోనుండి రుద్రుడు అధిదేవతగా నొప్పుచున్నది.

(6) ఆజ్ఞా చక్రము



ఈ ఆజ్ఞాచక్రమునకు భ్రూమధ్యస్థానమందు 'హం, క్షం' అను రెండు దళములును, 'య' అను బీజాక్షరమును కలిగి అన్ని వర్ణములతోను పరమాత్మ అధిదేవతగా నొప్పుచున్నది.

(5) విశుద్ధ చక్రము



ఈ విశుద్ధ చక్రమునకు కంఠస్థానమున అ, ఆ, ఇ, ఈ, ఉ, ఊ, ఋ, ౠ, ఌ, ౡ, ఏ, ఐ, ఓ, ఔ, అం, అః అను పదునాఱు దళములును, 'వ' అను బీజాక్షరమును కలిగి పదునారుదళములు గలిగి ధూమ్రవర్ణముగ నుండి పరాశక్తి అధీనములో నుండి జీవుడు (ఆత్మ) అధిదేవతగా నొప్పుచున్నది.

(7) సహస్రార కమలము



ఈ సహస్రార చక్రమునకు బ్రహ్మరంధ్రమున వేయి దళములతో 'రాం' అను బీజాక్షరము కలిగి చిత్రవర్ణములతో తేజోస్వరూపముతో గురువే అధిదేవతగా నొప్పుచుండును.

(8) శ్రీ చక్రము



ఈ చక్రముల నాశ్రయించి క్రమముగా ఢాకిని, రాకిని, లాకిని, కాకిని, శాకిని, హాకిని యను భూతశక్తులుండి వానిని క్రమపద్ధతిలో నడుపుచుండును.

ఈ ముగ్గులు వాకిట నొకతీరుగను, ఇంటిలో నొకమాదిరిగను, పూజామందిరమందు (స్థలమున్న) నింకొకరకముగను పెట్టుదురుగాని అన్నియు నొకేరీతిగ నలంకరించరు. తఱుచుగా వాకిటముందు మూలాధార చక్రమును (నాలుగు దళములు) బోలిన ముగ్గు వేయుచుందురు. ఇట్టి రీతిగనే తదితర చక్రములుగూడ గృహాంగణమందు వేయు సనాతనాచారముగలదు.

ఉదయముననే పడకనుండి మేలుకొని యింటిలోని వారందఱు యింటనుండి బయటికిని, బయటనుండి యింటిలోనికిని యెన్నియోసారులు పోవలసియుండుటచే వారట్లు పోవునపుడు యీ ముగ్గులపై నుండియేదాటుచు పోవలయును. ఇట్లు చేయుటచే వారి నాశ్రయించియుండు దుష్టగ్రహబాధలు తొలగి పోవునను నమ్మకమొకటి. దీని ననుసరించియే బీజాక్షరములుగల మంత్ర సహితములగు యంత్రములను (చక్రములను) పలుచని రాగిరేకులపై వ్రాసి వానిని తాయెత్తులలోపెట్టి దుష్టగ్రహ పిశాచాదులు సోకినవారికి గట్టుటయు, నట్లుధరించిన వెనుక నవి తొలగిపోవుటయుకూడ మనము చూచుచున్నాము.

ఇంకొకయంశమేమన ఈ చక్రములను (ముగ్గులను) ప్రతిదినమును చూచుచుండుటవలన తమ శరీరములో నిట్టి చక్రములేయున్నవనియు, వానివలననే సర్వేంద్రియ వ్యాపారములు నడుచుచున్నవనియు, వానిని సాధకముచే తమ స్వాధీనమున యుంచుకొని దేహారోగ్యమును కాపాడుకొనుచు, శారీరక, మానసిక వ్యాధుల దరిజేరనీయక సుఖప్రదముగా చిరకాలము జీవించుచూ ఆత్మజ్ఞానసంపన్నులై పరమేశ్వరుని లీలా వినోదముల మనంబుల స్మరించుచు ఆనందమయులై ప్రవర్తిల్లుటకు మార్గమేర్పడునను యుద్దేశములో యీ ముగ్గులను పెట్టుచుండెడివారని తలంప వీలుకలుగుచున్నది.

కావున సనాతనహైందవస్త్రీలు గృహాంగణమందు యలంకరించు యీ ముగ్గులను, మూఢాచారముగ విశ్వసించక యిందలి సత్యమును ప్రాముఖ్యతను పై శీర్షికవలన విశదీకరించుటచే పాఠక మానినీలోకము యిప్పుడైనను గుర్తెఱింగి యీ యాచారమును శ్రద్ధాభక్తులతో నాచరించుట వారి ముఖ్యధర్మము.

తెలుగు వాణి

జననిలేనీ చిన్నబిడ్డల
జననిపెంచిన పెద్దవారల
మనగజేయుదు నీదుసస్యము
తినగనిచ్చి తెలుగుభూమీ
చిరతప్రాయమునందె నీదూ
చిన్నకొమరుల కందరకునూ
మాతృదాస్య విమోచనంబును
మాటనేర్పితి తెలుగుతల్లీ
చిన్నతనమునుండి నీవు
కన్నబిడ్డల నంతమందిని

సర్వమానవ సోదరత్వము
సలుపుమంటవి తెలుగుతల్లీ
భారతము రచియించినట్టి
బ్రాహ్మణ కవిత్రయమునీకు
ప్రథమదివ్యసుమనోదామము
భక్తినొసగెను తెలుగువాణి
తరతరములనుండి బహుఘన
తరులగు సుకవీశ్వరులు నీకు
వికసితకుసుమ మాలలెన్నో
వేడ్కనొసగిరి తెలుగువాణి.

—పినిశెట్టి సత్యవాణి.

ఇప్పుడు పెద్ద సైజు లక్సు అమ్మబడుచున్నది

ఇప్పుడు సొగసైన వానిని లక్సును ఎక్కువగ వాడి జాగ్రతగ కాపాడ వచ్చును. పెద్ద సైజు లక్సు పెట్టె నీ పైకమునకు ఎక్కువ సోపును ఇచ్చును. చన్నీటిలో లక్సు ధారాళముగా నురుగును ఇచ్చును. లక్సు నురుగులో సొగసైన నీ గుడ్డలను ఉతికిన పిదప ఆరవేయుము. నీళ్లలో భద్రముగానుండు వస్తువులన్నియు లక్సులో కూడ భద్రముగానుండునను మాట మరవకండి!

మన పైకమునకిది ఎక్కువ లక్సును ఇచ్చును.



సాధారణ సైజు, చిన్న సైజు లక్సు కూడను పైకమునకు చాల మంచి విలువను ఇచ్చును

LEVER BROTHERS (INDIA) LIMITED LX. 9-172 TL.

వింత వింతల ప్రపంచం

రష్యన్ నియంత లెనిన్ 1870 వ సంవత్సరంలో పుట్టి 1924 సంవత్సరంలో చనిపోయాడు. చని పోయినతర్వాత ఆయన శరీరాన్ని ఒకగాజు సీసాలోపెట్టి అట్టేవుంచారు. ఆ సీసా ఆయనంతపొడుగు, అంతలావూ వుంటుంది. మాస్కో పట్టణంలో 'క్రెమ్లిన్ వాల్' అనేచోట భద్రపరచారు దీన్ని. ఈ శవపేటి కను ప్రపంచంలోని అన్ని మూలలనుంచి వచ్చినవారు 16,000,000 మంది చూచారట. ఈ చారిత్రక వీరపురుషుని చూచినవారు 'నిజంగా లెనిన్ నిలబడివుండి, మనవైపు చూస్తున్నాడా'అని ఆశ్చర్యపోతున్నారట. శరీ పురంగులోగాని, లావులోగాని ఏవిధమైనమార్పు రాలేదట. ప్రపంచంలో మృతకళేబరాన్ని నిలుపుచెయ్య డానికి అనేకమైన ప్రయత్నాలు జరిగివున్నాయి గాని ఏదీ ఇంతకాలం, అంటే 16 సంవత్సరాలు, ఎటువంటి మార్పుకూడా రాకుండా నిలవచెయ్యడంలో విజయవంతం కాలేదట. ఆగాజుసీసాల్లో పోసివుంచిన 'ఏసిడ్'ల యొక్క ప్రత్యేకమైనపాళ్లు ఇంతవరకు బయటపెట్టలేదట. ఇది రష్యావారియొక్క విజ్ఞానశాస్త్ర పరిశోధనల పరిణతిని తెలుపుతూవుంది.

♦ ♦ ♦ ♦

ఆఫ్రికాఖండానికి 1400 మైళ్లలోను, అమెరికా ఖండానికి 1700 మైళ్లలోను 'ట్రిస్టాన్-డా కున్‌హా'అనే ఒక ద్వీపంవుంది. 1816 వ సంవత్సరంలో నెపోలియన్‌కు తలదాచుకుందుకు ఉపయోగపడ కుండా వుండటానికి 'విలియమ్ గ్లాస్' అను నతణ్ణి ఆద్వీపానికి కావలిగా పంపారు. అతడు భార్యాపుత్రా దులతో వెళ్లి అక్కడే వుండిపోయాడు. తర్వాత అతడు స్వదేశానికి రానంటే మరియొక 5గురు దంపతులను అచ్చటకు పంపారు. ఇటీవల వారివిషయం తెలుసుకోగా వారు 188 మంది వున్నారట ఆద్వీపంలో. వారు అందరూ కలిసిమెలిసి, దుంపలుతింటూ, చాలా సత్యకాలం మనుష్యుల్లా ఏవిధమైన పొరపొచ్చాలూలేకుండా వున్నారట. ప్రయాణంలో పగిలిపోయిన ఓడలనుంచి బ్రదికి బయటపడ్డవారు కొంతమంది చేరారట యీ ద్వీపంలోకి. ఇక్కడ అదొకజాతి పక్షివుంది. అది ఒకవారంరోజులు యీడుకలిగిన కోడిపిల్లలా నల్లగా వుంటుంది. దానిరెక్కలు అంగుళమంతవున్నా అతివేగంగా పరిగెడుతుంది. ప్రతి ఆగస్టునెల్లోను ఆద్వీపం మీదికి కొన్నివందల పక్షులువచ్చి తిరిగి ఫిబ్రవరినెల్లో వెళ్లిపోతాయట. యీ 6 మాసములు వాటికి పెళ్లి రోజులట. గత సాలులో వచ్చేటప్పుడు 900 వందలున్నాయట. వెళ్లేటప్పుడు 1800 పక్షులున్నాయట. అవి చెట్లుమీదిగూళ్లలో కాకుండా, భూమిలోని బొరియల్లో నివసిస్తాయట. అవి యిటు దక్షిణధ్రువానికి అటు ఉత్తరధ్రువానికి కూడా ఎగిరి వెడుతూ వుంటాయట.

♦ ♦ ♦ ♦

అమెరికాలో కొంతమంది శాస్త్రజ్ఞులు కలిసి చావు, దురారోగ్యములకు కారణం ఏమైయుండునా అని ఆలోచనలు చేయడం మొదలెట్టారు. 'జీన్ గాన్ట్'అనే ఒక 7 మాసముల పసిబిడ్డను తీసుకువచ్చి ఆ పసిబిడ్డకు అసూయ, అపనమ్మిక, విరోధభావం, పగ మొదలైన దుర్గుణాలు కలుగకుండా పెంచిచూస్తే ఆ బిడ్డ కలకాలం బ్రతుకుతుందనే నమ్మికతో వారున్నారు. అందుకోసం 'లాంగ్ ఐలండ్'అనే దీవిలో 60 లక్షల పౌనులు ఖర్చుపెట్టి కట్టిన ఒక బ్రహ్మాండమైన భవనంలో, వైభవోపేతమైన అన్ని సదుపాయములు ఉంచి ఆ బిడ్డను దానిలో పెంచుతున్నారు. జబ్బులకు కారణం దురాలోచన. అదే మనుష్యులను చంపుతుంది. సదాలోచనలలో పెరిగేటట్టు ఆ బిడ్డను 20 సంవత్సరాలవరకు పెంచి, అప్పుడేమౌతుందో చూస్తారు! ఇప్పుడా బిడ్డను 'చిరంజీవి'అని పిలుస్తున్నారు.

సుందరం

శ్రీ 'కౌండిన్య'

★ ★ ★

'సుందరం'

'ఒస్తున్నానండీ—'

అంటూ మా ఆవిడ వాళ్ల సీతమ్మ వదినగారి వంటింటిలోనుంచి మెల్లగా, ఏదో అనుకుంటూ మేడ మీదికి వచ్చింది...

'మొత్తంమీద తీరికయిందే ఇంటికి రావడానికి. అయిదుగంటలకి ఆఫీసు వదుల్తారనిపేరు. నే కాపరానికి వచ్చి అయిదేళ్లయింది. ఒక్కరోజయినా ముచ్చటగా సూర్యాస్తమయం కాకుండా ఇంటికి వస్తారేమో అని చూస్తాను! ఇదేం ఆఫీసు బాబూ! ఉద్యోగాలు మావాళ్లుకూడా చేశారు కాని ఎక్కడా చూడలేదమ్మ యీ మోస్తరు.' అంటూ మామూలు సొద మొదలెట్టింది. ఆ ప్రవాహానికి అడ్డుకట్ట వేస్తేనేకాని లాభంలేదని

'సరేకాని కాస్త కాఫీ ఏమన్నా యిస్తావా లేకపోతే పెందరాళే యింత అన్నంపెడతావా? అన్నట్లు యీవేళ మంచి సినిమావుంది. 9 గంటల ఆటకి వెళదాం, పెందరాళే తెమిలితే?'

'ఒడ్డించమన్నారా ఏమిటయితే?'

'ఊఁ? యిదుగో యీవేషం అంతా తీసేసి కాళ్లు కడుక్కుంటూ' అంటూఉండగానే ఒక్క ఉడాములో క్రిందకి వెళ్లిపోయింది సుందరం.

సుందరం అభిప్రాయం ఏమిటంటే ఆఫీసు అయిదు గంటలకే మూస్తారుగదా ఆరున్నరదాకా నేనేం చేస్తాను అని. అంటే ఆఫీసు మూసేసినా, నాకుర్చీని, బల్లని, అంటిపెట్టుకొని యింకోగంట సేపు కూర్చుంటానని. కలక్టరు ఆఫీసువ్యవహారం సుందరానికి ఏమి తెలుసు పాపం!

స్వతహాగా సుందరానికి అన్ని చూడాలని, తెలుసుకోవాలని చాలా సరదా. పాపం వాళ్లవాళ్లకి ఏమీలేక పోవడంమూలాన్ని యిటువంటివి తన చిన్నతనంలో ఎరుగదు తరుచు. అందుచేతనే సినిమాకువెళ్లడం అంటే ఆనాడు పండుగ.

* * *

'అవును, అబ్బాయి ఏడీ?'

'పడుకున్నాడు'

'అప్పుడే!'

'ఏం. రాత్రి పొద్దోయిందాకా మేలుకుని నన్ను వేపుకొని తినాలా ఏమిటి? చాలు, మీ పోలికలు వచ్చిఉంటే నా ప్రాణాలుకాస్త పోయేవి! రాత్రి రెండుజాములదాక పడక మొహం చూడకుండా ఉండడానికి.'

'మా పోలికలు రానక్కరలేదు బాబూ. పోనీ, అందానికీ, తెలివితేటలకీ, ఆనిద్దరకీ వాడి మేనమామల పోలికవచ్చి.........'

'చాలు. మాతమ్ముళ్లని మీరు ఎంచక్కరలేదు. వాళ్లు మిమ్మల్ని ఎప్పుడేనా ఏమన్నా అంటారా! ఏదో వాళ్ల ఖర్మాన్నివాళ్లు ఉన్నారు. కాకా ఏమమ్మా అందానికీ.....అన్నారు ఏం? మీచెల్లెళ్లు మహ అప్సరసలు కాబోలునేం! ఏదోనల్లగా ఉన్నారని మహఎంచుతారు. నల్లదనంలోనే అందంఉంది!'

'పోనీలేగాని ఆ నిద్దరకి మాత్రం వాళ్లపోలిక వచ్చింది.'

'ఆఁ. మీరుమరీని, మాతమ్ముళ్లు పగలస్తమానూ రాత్రితెల్లవార్లూ ఒకటే నిద్రపోతారా ఏమిటి?'

'సా...రె. నువ్వేగా అన్నావు నిద్దరకి మాపోలిక అక్కరలేదని, మీవాళ్లు పోలిక కావాలనీను!'

'నేనలా అనలేదు- ఒకవేళఅంటేమాత్రం...నాయిష్టం మా తమ్ముళ్లని నేనేమేనాఅంటాను. అంటే మీరుకూడా అనాలికాబోలు!'

'సరే పోనీలేకాని, పెందరాళే తెమలాలి. అప్పుడే 8 గంటలయింది!' అంటూ చెయ్యికడుక్కుని బయట పడ్డాను. మొత్తంమీద యీరాత్రి ఏమీబాగాలేదు. వ్యవహారం కాస్తయిదిగాఉంది. దాంలోటివాళ్ల తమ్ముణ్ణి నిద్ర ఎక్కువ అన్నానట!......తననచ్చూ:!......

* * *

'ఏమండీ యీచీర కట్టుకోనా లేకపోతే. అబ్బాయి బారసాలకి కొనుక్కున్నది కట్టుకోనా!' అంది సుందరం, పెట్టిలో సగంబట్టలు పైనపడేసి యింకోటిచేత్తో పైకితీస్తూ.

'...................'

'అబ్బ! చెప్పండిమరీ. టైము లేదంటారు మళ్లీ!'

'ఏదో ఒకటి కట్టుకుందూ చప్పునా'

'అందుకే మరీ. పోనీమీరు...అప్పుడు...పెట్టినచీర కట్టుకోనా యేమిటి?'

'ఎప్పుడుపెట్టిన చీరా?'

'ఆఁ ఎప్పుడో అప్పుడు, అట్టే తెలియనట్లుగా'

'కట్టుకో'

'జాకెట్టు...కూడా...అప్పటిదే'

'గడియారపు గొలుసూను, చంద్రహారం మాత్రం వేసుకుని వస్తాను. ఏం?'

'చప్పునతెములుమరి, తొమ్మిదయింది.'

మొత్తంమీద ఎల్లాగయితే చీర సింగారింపు అయింది. ఇంక బయలుదేరదామనుకుంటే, ఏమిటో మించిపోయినట్టు లోపలికి పరుగెత్తింది. ఏమా అనుకున్నాను. కాస్సేపటికి ఏమిటో చేతులో పట్టుకుని సణుగుకుంటూ తయారయింది.

'ఎప్పుడూయింతే మీరు. పోనీ సినీమాకు వెళ్లాలనుకున్నప్పుడేనా కాసిని మల్లెపువ్వులేనా వచ్చే దారిలో కొనుక్కొని రాకూడదూ!'

'అదిగో! ఎవోపెట్టావే తలలో'

'ఆఁ చెప్పకుంటే సిగ్గుకూడాను. ఏమున్నాయి దొడ్లో చంద్రకాంత మొక్కలేగా.'

'యింకనేం మరి'

'చాలు'

సుందరంతలలో చంద్రకాంత పువ్వులుకూడా అందంగానే కనిపించాయి. ఏపువ్వులయితేం మా సుందరానికి ఆఖరికి గడ్డిపువ్వులయినాసరే, పువ్వువు తేచాలు, కాగితపువ్వులమాట ఏమో, నే చెప్పలేనుగాని!



అఖిలభారత కాంగ్రెసు మహిళాసంఘ ప్రధాన కార్యదర్శిని శ్రీమతి సుచితా కృపాలినిగారు గతమాసంలో బొంబాయి వచ్చినప్పుడు, బొంబాయి మహిళలు. భావికార్యక్రమాన్ని గూర్చి చర్చించుకొనేందుకు సమావేశమయ్యారు.

బరంపురం బాలికా పాఠశాల చిన్న బాలికలు బీదవిద్యార్థుల చదువు నిమిత్తమై 'గృహలక్ష్మి' అను నాటకమును ప్రదర్శించి సహాయముచేసిరి. పాత్రధారులందరికి బహు రజిత సువర్ణపతకములు బహూకరింపబడినవి.

కీ. శే. శ్రీమతి బోయపాటి ప్రమోదకుమారీదేవిగారు

కృష్ణామండల వెంట్రప్రెగడ వాస్తవ్యులైన 'ఆంధ్రజననీ' పత్త్రికా సంపాదకులగు శ్రీ వేంకటకృష్ణారావుగారి సతీతిలకము. కాంగ్రెసు సభ్యురాలు. తన యిరువది యెనిమిదవయేడు పూర్తిగాక మునుపే మరణించుటవలన ఆగ్రామమున ఒక కాంగ్రెసు సేవకురాలు కరువైపోయినది.

కళా కలాపము

కళలు - కళాపోషకులు - కర్తవ్యము

శ్రీమతి కె. సుగుణమణి

★ కళలు, నాగరికత

అన్నగతప్రాణులమగుట యొకటియు, దుర్భర ఆర్థికదుస్థితుల జిక్కుట మరొకటియు హేతువులై భారతీయుల సహజగుణమగు కళారాధనను కొంత క్రుంగదొక్కుట వాస్తవము. కళాభిలాష, జీవితానందము లనిన నేమియో యెరుఁగక 'నిజదార సుతోదర పోషణార్థము' రాత్రింబవళ్లు కష్టించు కష్టజీవుల నేకులు నేఁడీ భారతావనిని గలరు. 'అన్నమో రామచంద్ర' యని యడలు సంసారములెన్నియో గలవు. ఇట్టివారికి గీతారహస్యమునుగూర్చియు, కళారాధనా సంజనితమగు మానసికానందమునుగూర్చియు ఉపన్యాసములిచ్చుట కంటె ప్రథమావశ్యక దోహదక్రియ కొంతయున్నదని గ్రహించిన గాంధి పరమాత్మ యిద్దానికై పూను కొని, సాంఘికౌన్నత్యమునకు పునాదులగు స్త్రీలను, కర్షక కార్మికులను, హరిజనులను, యువకజనములను సరిదిద్ద కృషిసల్పుచున్నాడు.

ఎల్లరకు సులభసాధ్యములగు దేశీయవృత్తులను, కళలను పునరుద్ధరించుటకై గాంధిజీ యత్నించు చున్నాడు. ప్రస్తుత విద్యలకువలె గాక Hand, Head and Heart లను ఏకకాలమున తరిఫీదుజేయుటకై వార్ధా విద్యాప్రణాళికను ప్రతిపాదించెను. ఒక్క నూలువడకుట, నేతపరిశ్రమలవలన యాప్సితార్థముల నందవచ్చునని యెల్లరను, ముఖ్యముగ స్త్రీజనములను నీతఁడు హెచ్చరించుచున్నాడు.

Face is the index of mind- మోము మానసప్రవృత్తికి సూచకమైనట్లే Arts are the index of the state of civilisation of a country కళలు దేశనాగరికతౌన్నత్యమునకు సూచకము. కళాభివృద్ధియు, నాగరికతాభివృద్ధియు నొకటియే. ఏ దేశముయొక్కగాని, జాతియొక్కగాని నాగరికతౌన్నత్యమును గణకట్ట వలెనన్న అచ్చటి కళలు, కళాచిహ్నములే ఆధారములు.

★ కళలు - కళాపోషకులు

సర్వసాధారణముగ ఏ కళయొక్క ప్రాముఖ్యతయైనను - ఆ కళకు గల రాజపోషణనుబట్టి యుండును. రాజరాజనరేంద్రుని ప్రోత్సాహమువలననే భారతమువంటి పంచమవేదము ప్రసన్నమైనది. అప్పటి రాజులు కళాపోషకులు గనుకనే భారతావని వివిధకళలకు ఆటపట్టైనది కృష్ణదేవరాయలువంటి కళాభి మాని యుండజేసియే అష్టదిగ్గజములగు కవులు, తదితర కళారాధకులు రాణించిరి. అతనికాలమున వ్యవసాయ వాణిజ్యములతో సర్వకళలకు అఖండపోషణ యుండెడిది. విద్యానగరవీధులలో రత్నములు రాసులుగ బోసి విక్రయించెడివారట! హంపిక్షేత్రమును, అచటి శిధిలమందిరములను, విఠలాలయమును గాంచిన ప్రతి భార

తీయునకు శిల్పకళ, పురనిర్మాణ కౌశలము మున్నగు కళలెన్నియో జ్ఞప్తికివచ్చి, అప్పటి కళౌన్నత్యమును యిప్పటి దీనస్థితియును మనసునకు దట్టి అప్రయత్నముగ అశ్రుబిందువులు రాలవలసినదే. తంజావూరు 'రఘునాథభూపరసికాగ్రణి'యు, తక్కుంగల రాజులును కళాభివృద్ధికై యెంతయో తోడ్పడి, కళారాధకులను సన్మానించెడివారు. "సుకవితాయద్యస్తి రాజ్యేనకిం?" అన్న నుడువులు యేవిధముగ జూచినను సత్యములే; కళారాధకునకున్న ఆనందము రాజాధిరాజునకైనను లభించదు. చాళుక్యులకాలమున కట్టిన నందికేశ్వరాలయము, దక్షిణమున గల మధుర దేవాలయము, తిరుమల నాయకుని నగరు, రామేశ్వరమండపము, తిరుచునాపల్లి కోటదుర్గము, శ్రీరంగపు గోపురములు మున్నగునవన్నియు, ఎల్లోరా అజంతాగుహలవలె శిల్పకళౌన్నత్యమును జాటు శాశ్వతచిహ్నములే. మహారాష్ట్రుల (శివాజీ) కోటలు, కొండదుర్గములు కళాచిహ్నములే. ప్రస్తుతకాలమున పాశ్చాత్యప్రభువుల పోషణ శాస్త్రజ్ఞులకు, శాస్త్రపరిశోధనలకు మాత్రమే లభించుచున్నది. దేశమున గల వివిధకళలు, (డక్కా మస్లిన్ నిర్మాణ నైపుణ్యమువలె) కలలోని వస్తువులగుచున్నవి. 'నాగరిక' ఐరోపాలో యీ శాస్త్రపరిశోధనల ఫలితము ముఖ్యముగ మారణయంత్రనిర్మాణమునకు, మానవజాతి నిర్మూలమునకు తోడ్పడుచున్న తోడ్పడవచ్చును గాని, 'అనాగరిక' భారతదేశమున నట్లుగాలేదు. సర్ సి. వి. రామన్, సర్ పి. సి. రే, సర్ జె. సి. బోసుల వంటి శాస్త్రవేత్తలను గని భారతావని సగర్వముగ నిల్చినది. వీరును కళారాధకులే. మానవజాతి సేవకులే. బోస్ మహనీయుని పరిశోధనల ఫలితముగ జడపదార్థములందును జీవశక్తి, ఆత్మశక్తి గలదని నిరూపింపబడి, పాశ్చాత్య ప్రపంచమునుగూడ పర్యాలోచనలకు దింపినది; 'ఆత్మవత్సర్వభూతాని' యన్న అఖండసత్యమును ప్రతిపాదించినది; దీనిచే దేశకీర్తి ప్రజ్వలించినది. ఠాగూరు, గాంధి, రాధాకృష్ణన్‌లవంటి నిరుపమాన తేజోమూర్తులను గని భరతమాత గర్వించుచున్నది. విశ్వభారతిని స్థాపించి, విశ్వమానవ సౌభ్రాత్రమునకు పాటుపడు ఠాగూరు అపూర్వ కళారాధకుడు. వీరి శాంతినికేతనము కళారాధన మండపము. కుమయూన్ కొండలపై ఉదయశంకరుఁడు నిర్మించిన భవనమును కళారాధనకొరకే. కవిసార్వభౌముడగు ఠాగూరు, Indian nightingale అగు సరోజినీదేవుల హూణభాషా పాండిత్యము పశ్చిమఖండములను సమ్మోహపరచినవి. వేదాంతి రాధాకృష్ణన్, వివేకానందుని బోలు గురుగ్రహము. వీరి కళాకాంతులు ప్రాచ్యమునుండి పశ్చిమమునకు, పశ్చిమమునుండి ప్రాచ్యమునకు వెలుగు గూర్చుచున్నవి. ఇంక గాంధి మహనీయుడు కళల ప్రోవు. భారతావనియందు విహరించిన మహోత్కృష్టభావములు, కళలు, గుణగణములన్నియు స్వరూపమునుదాల్చి యీ రూపమున ప్రత్యక్షమైనవి. ఇతఁడు సత్యస్వరూపి, ప్రేమమూర్తి, అహింసావ్రతధారి. నిరాడంబరులలో నిరాడంబి, హరిజనులలో హరిజనుఁడు, కళారాధకులలో కళారాధకుఁడు, గృహస్థులలో బ్రహ్మచారి, మానవులలో దేవతామూర్తి దేవతలలో మానవమూర్తి, యుగపురుషుడు, రాజకీయవేత్త, సంఘసంస్కర్త, వేదాంతవేత్త, డాక్టరు, శాస్త్రజ్ఞుఁడు, ఋషి, వీరాధివీరుఁడు, వివిధభాషలలో అపూర్వవక్త, గీతకు వ్యాఖ్యానకర్త, అందలి అమూల్య సూత్రముల నాచరణలోబెట్టిన అఖండ ఆధ్యాత్మిక శక్తిస్వరూపి; పరమాశయములకు రాజకీయములకు ఐహికమునకు పరమార్థమునకు ముడివెట్టిన ప్రధానమనీషి; భారతీయుల భావముక్తికై, సాంఘికముక్తికై, రాజకీయముక్తికై, ఆర్థికముక్తికై, ఆధ్యాత్మికముక్తికై యత్నించు పావనమూర్తి. భారతమాత యితనిగాంచి 'త్వమేవాహం అహంత్వమేవ' ('నేనే నీవు - నీవే నేను') అనుచున్నది.

ఆంధ్రరాష్ట్రముగూడ కళాప్రవీణులకు, కళారాధకులకు బుట్టినిల్లు. నన్నయ, తిక్కన, పోతనవంటి కవులు, కళారాధకులెందరో యిట జన్మించిరి. దుర్గాకళామందిర నిర్మాణకర్త శ్రీ కాశీనాధుని నాగేశ్వరరావుగారు కళాభిలాషి, కళాపోషకుఁడు; సారస్వతసేవతో దేశసేవ గావించిన ధన్యజీవి. 'గృహలక్ష్మి' కంకణ బహూకరణవిధానము నేర్పరచిన శ్రీ కేసరిగారు—

"ఎందును విద్యలేయెఱుఁగ రెవ్వరెఱింగినఁ గొంతమాత్రమే
యందును సాహితీరసమహత్వమెఱుంగ రెఱింగిరేనియా

> యందమెఱుంగలే రెఱింగినప్పటికిన్ కనిమెచ్చి యీయరె
> న్నందగు..............................."

నన్న చేమకూరకవి పల్కులను సరిగ జ్ఞప్తికితెచ్చు కళాపోషకులు. 'గృహలక్ష్మి' సంపాదక మహాశయులై స్త్రీజనాభివృద్ధికిని, భాషాభివృద్ధికిని, కళాభివృద్ధికిని వీరు గావించు సేవయు, యత్నములును నిరుపమానములైనవి. కళారాధనామందిరములు, జాతీయకళలను గరపు పాఠశాలలు రాష్ట్రమున అందందు గుంటూరు, రాజమండ్రి మున్నగుచోట్ల కొన్నిగలవు; కవులు, కళాప్రవీణులు దేశమున అందందు యెందరో కలరు. రాజపోషణలేక కళలు రాణింపకున్నవి; ఆర్థికదుస్థితులలో నణగిపోయినవి.

★ 'కళా'శాలలు

ఇంక మన విశ్వ 'విద్యాలయములు' 'కళాశాల'లలో, నిజమగు 'విద్యలు', 'కళలు' మచ్చునకైన గానరావు. 'విద్య' యన మానవునియందలి ఆత్మశక్తిని బహిర్గతమొనర్చవలెను. 'కళ' యన కమనీయ భావపరంపరల బుట్టించి కళామయ ప్రకృతిని, ప్రకృతిలో ప్రకృతినిర్మాతను గాంచి యానందించగల శక్తిని కలుగజేయవలెను. "విద్యయొక్కయు, సర్వకళలయొక్కయు, సర్వశాస్త్రములయొక్కయు ఆశయమును, అంతమును - ప్రపంచమునంతను సంచలింపజేయగల మానవవ్యక్తిని ప్రత్యక్షమొనర్చుటయే" యన్న శ్రీ వివేకానందుని వాక్యార్థముల జింతించియు - 'అదియే విద్య, ఆవిద్య సర్వమును......' అన్న కవిపల్కులు దలంచియు - 'భుక్తి, యుక్తి, శక్తి, రక్తి, భక్తి, ముక్తులకు దూరమై', "Plain living and high thinking" అన్న ఆశయములకు వ్యతిరిక్తాశయములను ప్రసాదించు ప్రస్తుత 'విద్య'లను, 'కళ'లను గాంచి, నిట్టూర్పు విడువని భారతీయుడుండడు.

★ కళోపాసకులు - కర్తవ్యము

ఇట్టి దుర్భర పరిస్థితులలో కళారాధకుల కర్తవ్యమును, స్త్రీజనముల బాధ్యతయు మరింత యెక్కువయైనవి. బాధ్యత, కర్తవ్యములనియుంటిని; (మానవుల 'హక్కు'లకై పోట్లాడు H. G. Wells గారివలెను, స్త్రీల 'హక్కు'లకై పోట్లాడు స్త్రీ సంఘములవలెను) 'హక్కులు' అనలేదు. ఏలనన యిటీవల H. G. Wells అను పాశ్చాత్య ప్రముఖుండు (Rights of Man) 'మానవుల హక్కులు' అను పెద్ద ప్రపంచచర్చ గావించినవెనుక - గాంధి మహాశయుని సలహా యేమన—"తలవదలి తోకకడ నారంభించినట్లు Wells గారు మానవుల (Duties) 'కర్తవ్యములు' వదలి, (Rights) 'హక్కు'లగూర్చి చర్చింపదొడంగిరి; మన కర్తవ్యములగూర్చి చర్చించి, ఆ కర్తవ్య నిర్వహణకై తగుమార్గమును జూపియున్నచో కృతార్థులమైయుందుము. ఆ వెనుక హక్కులు తమంతట తామే లభించును" అని. ఈ సలహా యే స్త్రీజనములకును, కళారాధకులకు, కళాపోషకులకును, సర్వజనులకునుగూడ వర్తించును. కాన మన విధ్యుక్త కర్తవ్యములను మనమెరింగికొని, వాటి నిర్వహణకొరకై మన శక్తికొలది యత్నించి, అవ్వలప్రభువును ప్రార్థించి, అతనిపై భారము వైతము.

> "The glory of Art is the flavour of the nation."
>
> కళావికాసమే జాతియొక్క ఔన్నత్య సౌరభము
>
> —రవీంద్రనాథ్ ఠాగూరు.

భావతరంగిణి

"ఇంగ్లండు బ్యాంకులో నాకు కోటి రూపాయలు వున్నవని అసత్యములు వ్యాపింపజేయబడి నప్పుడు, ఆ అబద్ధాలను అరికట్టడానికి ఏలాటిచర్యలు తీసుకొనివుండలేదు. ఇటువంటి అబద్ధాలకు ప్రత్యుత్తరం ఇవ్వకుండావుండడమే మంచిది. వీటిని గుర్తించకుండా వూరుకుంటే, వాటంతట అవే సమసిపోతాయి వాటికి స్వత్ససిద్ధమైన శక్తిలేదు కనుక. ప్రతిఘటించామంటే మాత్రం అవి పెద్దవైపోతాయి. అందువల్ల అసత్యాలను ఎదుర్కోవడానికి మౌనమే మంచిది."

—మహాత్మ గాంధీ.

"మనదేశంలో వస్తుసంపద అపారంగావుంది. దానిని సరిగా ఉపయోగించకపోవడమువల్ల మన దేశంలో దారిద్ర్యం పెరిగిపోతూ వుంది. దేశంలో ధనము, విజ్ఞానము, పరిశ్రమలు, వ్యవసాయం మొదలైనవి వృద్ధికావడాన్నిగురించి పాటుపడడానికి నేషనల్ ప్లానింగు కమిటీ ఏర్పడింది. స్త్రీలు ముఖ్యముగా గృహ పరిశ్రమలను పెంపొందించాలి. ఈ కమిటీలో అన్ని శాఖలతోపాటు స్త్రీల శాఖకూడా వున్నది కాబట్టి స్త్రీలుకూడా ఎక్కువ శ్రద్ధ బూనవలసియున్నది."

—పండిత జవహర్‌లాల్ నెహ్రూ.

"ఆధునికవిద్య పట్టి గుమాస్తాపనికి తప్ప జాతి ఔన్నత్యమునకు గాదు. స్వరాజ్యం కావలెనంటే దేశమునకు స్థావరమైన సైనికదళముండాలి. ప్రతి విద్యార్థి, విద్యార్థినీగూడ జాతీయ సైనికదళంలో చేరాలి. గ్రామ పునరుద్ధరణకు ప్రతి విద్యార్థి తన శలవుదినాల్లో గ్రామములవెంట వెళ్లి ప్రచారంచేయాలి. ప్రతి గ్రామము స్వయంపోషకంగా వుండాలి."

—శ్రీ టంగుటూరి ప్రకాశంపంతులు.

"హిందూ మహమ్మదీయైకమత్యము మనదేశంలో లేదనుకోవటం పొరపాటు. ఉన్నదానిని లేదని చెప్పుకోవడంలో వున్న అల్లరే ఇది.... దేశీయపరిశ్రమలు, ముఖ్యంగా గృహపరిశ్రమలు పెంపొందింపబడితేనే గాని, దేశంయొక్క, ప్రత్యేకంగా స్త్రీలయొక్క ఆర్థికబలహీనత చక్కబడదు. అందుకనే పురుషులతోబాటు స్త్రీలకుకూడా సమానహక్కులుండాలి...అంటున్నాను."

—బీగం హమీదాలీ.

"పశ్చిమ గోదావరిజిల్లా కాంగ్రెసు స్త్రీలశాఖలో పదిమంది సభ్యులున్నారు. ఈ సంఘాన్ని ఇద్దరు ముగ్గురు చొప్పున జట్లుగా నిర్ణయించి, వీరిని పల్లెటూళ్లమీదకు పంపాలి. పట్నాలలో బాధ్యత వహించ వలసిన పని ఒకజట్టు ప్రత్యేకం తీసికోవాలి. వీరు అన్నిప్రదేశాలకుపోయి ప్రచారం చేస్తారు. ఆయావ్యక్తు లను కలుసుకుంటారు. విషయము సమకూరుస్తారు. ఆ చరిత్రల్ని వ్రాసుకుంటారు. జరిగిన కాంగ్రెసుసేవ బహిర్గతం చేస్తారు. వర్తమానంలో ప్రబోధం యిస్తారు. భావి సౌధానికి పునాదులు వేస్తారు."

—పొణకా కనకమ్మ, ద్రోణంరాజు లక్ష్మీబాయమ్మ.



ఆకర్షవంతమైన చర్మసౌంధర్యము

ఏ స్త్రీ చర్మమైతే ఆరోగ్యముగాను, శుభ్రముగాను పుష్పదళ మృదుత్వము పోలియున్నదో, ఆమెను ఒక రహస్యమైన మనోహరత్వము ఆవరించి యుండును. ఏ సొమ్ములుగాని, పట్టు వస్త్రములుగాని, శ్రేష్టమైన ఒళ్లు గగుర్పాటు వొనర్చు మృదువైన చర్మముతో సమానము కానేరదు. గాలి ఎండలచే దెబ్బతిన్న చర్మము ఆకర్షకముగా ఉండనేరదు. ఎందుకన చర్మముయొక్క రంధ్రములు బొత్తిగా శుభ్రపరచక పోవుటచేత.

చర్మము వాడకుండ, లేతగా నుంచుకొనుటకు ప్రతి ఒక స్త్రీ జాగ్రత్తపడ నవసరము. పాండ్స్ క్రీమ్ సీసాను కొనుడు.

మీ వేళ్ల చివరలతో క్రీమును, మీ చర్మముమీద రాయుడు. మృదువైన గుడ్డతో దులుపుడు. మరియు కొద్దిగా వేరే క్రీమును తేలికగా పూసి రాత్రంతయు ఆ నాణ్యమైన పొరను ఉంచుడు. ఈ మోస్తరుగా ఒక పదిహేను రోజులు రాత్రులయందు వాడుడు. అప్పుడు మీ చర్మము మృదువుగా లేతగా ఉన్నట్లు మీకు తెలియగలదు.

పగలు, గాలి, దుమ్ము నుండి రక్షించుటలో శ్రేష్టమైనది పాండ్స్ వ్యానిషింగ్ క్రీమ్.

పాండ్స్ క్రీములు అన్ని గొప్పస్టోర్సులలో దొరకును, లేక పాండ్స్, పి॥బ॥ బాక్సు 144 బొంబాయివారికి వ్రాయుడు.

పాండ్స్ క్రీమ్

"అవివాహిత యిప్పటికామె"

శ్రీ సత్య దుర్గేశ్వర కవులు

(శతావధానులు)

ఉ. కాలువగట్టు వైపుకు 'షికారు'కు పోదమువత్తురా? యనెన్
శీలవతీలలామ పరిశీలనగల్గిన మేటిరామ మా
'స్కూలు' న క్లాసులోన ప్రతిచోటను నాసలహాను గొంటమా
మూలయిపోయెనామె కొక మోస్తరుగా నెటు త్రోసి వేయుదున్.

చం. సరె! పదపోదమంటిని ప్రసంగము లేవియొచేసి కొంచు ని
బ్బరముగ సాగిపోయితిమి, పండుగులాబి రకాల వాసనల్
మరగిన మందవాయువుకు మారుఁడు మారకళా ప్రబంధముల్,
బరితెగియించితన్ గొలుచు భామల కల్లనఁ జెప్పుచోటకున్,

చం. మొదలిడె నామె యందునను ముద్దులుమాటలుగట్టు మారసం
పదబహు గోప్యమై మివుల వ్యంగ్యముగానటియింప ముచ్చటల్
ముదిత మనోహరాకృతిని మూలల మూలల ద్రొక్కులాడకన్
గొదుమల వాలుచూపుతళు కుల్ సెలగాటములాడ నీ విధిన్—

చం. మొదటికళాసులో మొగము మొత్తెను నీమధుదర్శనంబుచే
నదిమొదలేను పుస్తకము నంటిన పాపమునొందలేదు—నీ,
పెదిమెల 'ఖైదు'లో విడిచి, పెట్టిన మాటలెసేకరించి - యు
చ్చదశనుగొంటి నంచుమనసావచియింతును నాయుదంతమున్

చం. అదిమిన వెన్నపూసకెన, యాచిరుబుగ్గల యద్దమందునే,
యుదయము నీడ చూచుకొనకుండరచింపను జుక్కబొట్టు నీ
హృదయముతోడు ఇందులవమేని అబద్ధము లేదటన్న న
మ్మదువనుకొందు నీజిలుగు, మోమున నాకనులున్న వన్నచోన్.

ఉ. ఈవిధిగావచించి మఱి, యేమనుకొన్నదోగాని క్రీగనుల్
ద్రోవలఁజూప నాఘనను, లో పులిచారలగద్దె మీదమేల్
ఠీవివెలార్చు మన్మధుని, శేవకునల్లననొత్తిగిల్లె కా
నీ - విపరీతమేమొ? గదె, నిల్వఁడుమారుఁడు మన్మనంబునన్.

ఉ. ఏజిసుమారుగానిరువ, దేడు లెయిద్దటికిన్ సుశీల కా
లేజికి ఫస్టుమార్కుగల లేమ మదిన్ కలగుండు పెట్టునా
మోజుకు తత్తఱింపడెడి ముగ్ధ ఎఱుంగదు అన్యమేమి నా
తేజము అన్యకాంతకునధీనము పూర్వమెయయ్యె నక్కటా!

ఉ. ఆతరుణాన నామొగము నందు జనించినమాట యెట్టిదో
నాతినిరాశయయ్యె మది నాటినప్రేమకు హద్దులేదు నా
చేతకుసూరుమన్నమరు చేడియచందిరు గేరు మోముపై
వ్రాతదియేమొగాని అవివాహితయిప్పటికామె ఈధరన్.

చిత్రవధ

★

— శ్రీ బ్రహ్మాండం నరసింహం —

★

'మన సాంఘిక పరిస్థితులను గురించి అయిన ఆనాటి ఉపన్యాసం విని ఇంటికివస్తున్నాం. హాలు లోంచి పైకి వచ్చేటప్పటికే చల్లని వానగాలి వీచసాగింది. రోడ్డుమీది దుమ్మంతా సుడులుతిరిగి మమ్మల్ని ధూళిస్నానం చేయించింది. వర్షం వస్తుందేమోనని నడకవడి హెచ్చించాం. కాని ఒక ఫర్లాంగు నడిచేటప్ప టికి వానచినుకులు టపటపమని పడటం ప్రారంభించినై. దగ్గరగాఉన్న ఒక ఇంట్లోకి త్వరగా చేరుకుని, వాన తగ్గుతుందా అని కాచుకున్నాం.

ఇంతలోకే మా ఎదురుగా ఒక జట్కా పోతున్నది. నేను వెంటనే 'ఓయ్, జట్కా, ఎంతక్కడ లావు కాలేజీ హాస్టలుకి?' అన్నాను. అదోపరధ్యానంగా 'ఎంతిస్తారు? ఆరణాలు' అన్నాడు. నేను ఎక్కుదామని సిద్ధపడ్డాను. ఇంతలోకే ఆచారి 'పావలాకి కట్టవ్?' అని బేరమాడేడు. బండివాడు 'ఎక్కండి - బేడకైనా కడతాను' అని గొణుక్కున్నాడు. మేమంతా ఎక్కి కూర్చున్నాం.

చీకటి బాగా ఆవరించింది. విద్యుద్దీపాల వెల్తురును నిరోధించడానికి వర్షం మరీ దట్టంగా కురుస్తున్నది. బండిలోకి ముందునుంచి జల్లుకొట్టకుండా కట్టిన మైనపుగుడ్డలోంచి, బండి నడపడానికి అవతలకు జాపిన బండివాని తల తడిసి ముద్దయింది. అతడి తలకీ మైనపుగుడ్డకి మధ్యఉన్న సందులోంచి జల్లుకొట్టు తున్నది మాకు. చలిగాలి బోరున వీస్తున్నది. చేతిగుడ్డలు చెవులకు కట్టుకుని కూర్చున్నాం.

ఆచారి బండివాణ్ణి అన్నాడు 'మామీదికి జల్లు కొట్టుతున్నది, మైనపుగుడ్డ సరిగా కప్పు' అని. నాకు చాలా జాలివేసింది. 'అంత నిర్దయా?' అని జాలిగా అన్నాను. బండివాడు 'ఈయన దయగానే ఉన్నాడు బాబూ, గాలి తనకు తగిలింది కనుక తగిలిందన్నాడు' అంటూ మైనపుగుడ్డ పూర్తిగా కప్పేసి తాను వర్షంలో కూర్చున్నాడు. తరువాత నేనెన్నోమాట్లు లోపల కూర్చోమన్నా కూర్చోలేదు.

ఇంతలోకే హాస్టలు చేరుకున్నాము. వర్షం చాలా జోరుగావున్నందున బండివానికి మా హాస్టలు లోనే భోజనంపెట్టించి నా గదికి తీసుకుపోయాను.

నేను దుస్తులు మార్చుకుంటూ ఉన్నంతసేపూ అతను గది అంతా కలయచూస్తున్నాడు. అతని ముఖం ఎంతచూసినా నాకేభావం స్ఫురించలేదు. ఖాళీగా ఉంది అతని మొహం. 'నువ్వు అంత నిర్లక్ష్యంగా ఎందుకు తడిశావు?' అన్నా స్వెట్టరు తొడుక్కుంటూ.

నా ప్రశ్న వినిపించుకోనట్టు 'ఈ సంఘంలో దయ అనేది వుండాలంటారుకాదు మీరు?' అన్నాడు. అతని యాసచూస్తే అతను మామూలు జట్కావాడుకాడని తోచింది. ఆ విశాలమైన నుదురు, ఎత్తైన ముక్కు, చురుకుతనం కోల్పోయిన కళ గలమొహం—అన్నీ ఇతను సామాన్యుడుకాడనిపించినై. అతని పడుచుముఖంలో ఉన్న ముసలిరేఖలు, అతని అకాలంలో నెరసిన జుట్టూ అతని మనోబాధను తెలియ చేస్తున్నాయి.

'నేను వాల్తేరు పిచ్చి ఆస్పత్రినుంచి విడుదలచెయ్యబడ్డప్పటినుంచీ...' అతను కథ చెప్పబోతు న్నాడని కూర్చోమని సంజ్ఞచేశాను. కుర్చీలో నిదానంగా కూర్చుంటూ 'మీపాటి నన్ను ఆదరించినవాళ్లు ఎవ్వరూ లేరు. ఒకరిద్దరు 'ఏమి అలా పరధ్యానంగా ఉంటావు?' అని అడిగినవాళ్లున్నారు. కాని నేను వాళ్లకథ ప్రారంభించగానే వారు నన్నుచూసి నవ్వి 'మరీ అంత దేశకాలపాత్రతలు తెలియకుండా ప్రవర్తిస్తే!' అని వెక్కిరించారు. ఈ సంఘంలో దయ, సహనం ఏవీ? నన్ను సంఘం కావించిన చిత్రవధకు నేను కుమిలి చస్తూఉంటే, నా హృదయబాధకు బహిర్గమనంలేక నేను కొట్టుకుంటూఉంటే, నేను చెప్పేకథకు ఊర్కొట్టే ఓపికలేదే లోకానికి!' అని ఊపిరితీసుకుందుకు ఆగాడు. అతని పెదవులు వొణుకుతున్నాయి. కాని మొహం శాంతంగా ఉంది. అతన్ని ఎలా ఓదార్చాలో తెలియలేదు. అందుచేత మౌనంగా కూర్చున్నాను. అతను కథ ప్రారంభించాడు—

"...ఇప్పటికి పదేళ్లక్రిందట ఒకనాటి సాయంకాలం నా భార్యకు జబ్బుచేసింది. సుస్తీగాఉందని పడుకుంది. అసలు దాని ఒళ్లు ఆరోగ్యంగా ఉండేదికాదని తెలిసినా, ఇదివరకు అనేకసార్లు జబ్బురావటం తెలిసివున్నా, అప్పుడు ఇంతేచేసి, పెద్దజ్వరం రాకపోయినా, ఆనాడు సాయంత్రం నా హృదయంలో గుబులు బయలుదేరింది. ఎందుకో, ఆమెతల ఒళ్లోపెట్టుకుని ముంగురులు సవరిస్తూ ఈ జన్మకు ఆఖరుసారి సెలవుతీసుకుంటున్నానేమో అన్నట్టు తెగిపోతూన్న గొంతుకతో ఏడ్చేశాను. నా పదేళ్ల కూతురు పద్మ పక్కనే ఉంది. బావురుమని ఏడ్చింది.

తరువాత, నా జీవితప్రపంచ సూర్యుడస్తమించిన నిశిలో నాకో చంద్రవంక లభించింది. నా పద్మనుచూసి నా భార్యకోసం దుఃఖించడం తగ్గించుకున్నాను. పద్మకోసమే ప్రపంచంలో జీవించడానికి నిశ్చయించుకున్నాను. నా ప్రేయసి హృదయపూర్వకంగా నాకివ్వగలిగిన అత్యంతఘనమైన ప్రేమచిహ్నాన్ని నాకు ప్రసాదించింది. దాన్ని కాపాడుకుందుకు నేను నా శాయశక్తులా పాటుపడ్డాను.

నా చిన్నారికి క్రమంగా పన్నెండవఏడు వచ్చింది. మూడుమూర్తులా తల్లిని పోలియుండేది. ఎంతో చురుకుగా ఉండేది. ఇంతలోకి పెళ్లిమాట జ్ఞాపకంవచ్చింది. జాగుండేలో రాయిపడింది. పెళ్లి చెయ్యకుండా ఎట్లా ఉండను? పైగా అప్పట్లో సంఘాన్ని సంస్కరించే బుద్ధీలేదు - శక్తీలేదు.

ఇల్లరికం ఉండే అల్లుడికోసం చుట్టుపక్కలనున్న ఊళ్లన్నీ వెతికాను. అదృష్టవశాత్తు ఒక కుటుంబంలో వాళ్లకి ఎనిమిదిమంది పిల్లలుంటే, అందులో ఒకణ్ణి తెచ్చాను. అతనికి పదహారేళ్లు ఉంటాయి. అందంగా ఉంటాడు. బుద్ధిమంతుడని విన్నాను. అంతే నేను కోరినది. ఆస్తి నేనెన్నడూ ఆశించలేదు. వివాహం సక్రమంగా జరిగిపోయింది. మరునాటినుంచీ ప్రకాశాన్ని మా యింట్లోనే ఉంచేసుకున్నాను.

పద్మకు పదోఏటినుంచి స్త్రీ పరిచయం తక్కువకావడంవల్లనూ, ఎప్పుడూ నేను ఆమెను ప్రతీ చోటికీ తీసుకువెళ్లుతూ ఉండడంవల్లనూ, అదృష్టం బాగుండి సిగ్గు అలవాటుకాలేదు. పద్మా ప్రకాశం కులాసాగా ఆడుకుంటూ ఉండేవారు.

పద్మకు ఏమీ పని ఉండేదికాదు. ఎప్పుడూ మాతోనే ఆడ్డమో, పాడ్డమో, చదవడమో; ఇరుగు పొరుగువాళ్లతో మాకు ప్రమేయం ఉండేదికాదు. ఎప్పుడైనా ఇటు పక్కనఉన్న మంగమ్మగారు వచ్చి మా పద్మకు జడవేసిపోయేది. 'పాపం, ఆవిడ ఉంటే ఎంతో బాగుండేది' అని నాకూ, నా పద్మకూ స్వర్గంలో మాకోసం ఎదురుచూస్తున్నవాళ్ల అమ్మమాట తలపుకితెచ్చి కంట తడిపెట్టించేది.

అయినా మా యింటిసంగతి ప్రపంచానికి తెలిసిపోకుండా ఉండిపోలేదు. మా పనిచేసే పైడమ్మ ద్వారా పద్మకు ప్రకాశంవద్ద ఉండే స్వేచ్ఛ పైకిపాకింది. ఎప్పుడైనా మేము షికారుపోతూంటే మేము వీధి మళ్లేదాకా మావేపుచూసే కళ్లను, చిన్నతనంచేత ప్రకాశం పద్మా గమనించకపోయినా, నేను చూస్తూఉండే వాణ్ణి. అప్పుడప్పుడు వాళ్ల వెక్కిరింపులుకూడా నాకు కనిపించినయి. 'ఇంక కార్యం అక్కరలేదని' 'పద్మ ప్రకాశాన్ని పెళ్లాడలేదు-ఉంచుకుందనీ'ను. నేను వాటినెంతమాత్రం లక్ష్యపెట్టలేదు. వాళ్లిద్దరికీ ఆ మాటలు వినబడకుండా నా శాయశక్తులా ప్రయత్నంచేశా కూడా.

ఇంతచేసినా, నా దురదృష్టం నన్ను మొహమ్మీద తన్నింది. ఆ మరుచటిసంవత్సరం ప్రకాశానికి అమ్మవారు పోసింది. రాత్రింపవళ్లు నేను పద్మా పడ్డ అవస్థలు వ్యర్థం అయినై. మమ్మల్ని మరో ఆప్త బంధువు మరణానికి విచారించమని విధి లిఖించింది. ఈ జన్మకింక దుఃఖంలేదనుకున్న నాకు మరోదుఃఖం వచ్చింది. రెండుసార్లూ 'ఈ దుఃఖం భరించడం ఎల్లా?' అనుకున్నాను. రెండుసార్లూ దుఃఖాన్ని అతిక్రమించి హృదయాన్ని రాయిచేసుకుని బతకగలిగాను.

పద్మని ఓదార్చడం ఒక ప్రత్యేకఘట్టమైంది. నేనొక్కణ్ణే ఆ పని చెయ్యలేకపోయాను. మంగమ్మగారు ఆనాడల్లా కూర్చుని 'మానవజీవితం అశాశ్వతమైనదనీ, మహానుభావులుకూడా మృత్యుముఖంలోంచి తప్పించుకోలేరనీ, పుట్టడం చావడంకోసమేననీ' బోధిస్తూనేఉంది. పద్మ ఆనాడల్లా భోజనం చెయ్యనేలేదు.

* * *

నేను నా విధి నిర్వర్తించుకునే ధోరణిలో పడ్డాను. నేను చనిపోయేలోపల పద్మకు శాశ్వతమైన జీవితపథం కల్పించడం నా విధి. ఒకమాటు నేనాప్రయత్నంలో విఫలుడనయ్యాను. ప్రకాశం మరణం ఎంత విధివిహితమైనా, దానికి నేనే కారణం అని కొట్లాడేవాణ్ణి మనస్సుతో. నేను మళ్లీ అల్లుళ్ళకోసం వీధిన పడ్డాను. నేను రెండోపెళ్లి చెయ్యబోతున్నాననే వార్త రెండురోజుల్లో ఊరంతా పాకిపోయింది. వెంకయ్యగారు దారిలో ఎదురుపడ్డారు. 'ఏమయ్యా నీ అల్లుడు పోయాట్ట! పోదూ! హుఁ. మరీ అంత విచ్చలవిడా! నేననుకుంటూనే ఉన్నాను అలా తిరుగుతే ఆయుక్షీణమని. ఎక్కడోయ్! ఈకాలపువాళ్లు సంస్కర్తలు! పూర్వకాలపువాళ్ళకంటే తము మహాఁ తెలివైనవాళ్ళమనే - ఇహిహి - చావక బతుకుతాడూ?' అన్నాడు. ఈయనకారం జల్లడానికి పుండుచేసుకున్న నా హృదయమే దొరికిందీ? నేను కోపం పట్టలేక శాంతున్నైపోయాను.

ఇంచుమించుగా, నన్నెరిగిన ప్రతీ మానవుడూ నన్నుచూసి నవ్వేడు. ప్రతీ అడుక్కీ నావెనుక కిలకిలలు వినిపించినయి. నన్ను వెంట తరిమినయి. వాటిని వదిలించుకోడానికి నేను వడివడిగా నడచాను. ఇంటి గుమ్మంలో కాలుపెట్టాను.

ఎన్నడూ లేంది, ఆనాడు గది గుమ్మంలో చాలామంది ఆడవాళ్లున్నారు. అప్పుడే పద్మ లోపలికి పోయి ధఢీమని తలుపువేసుకొన్నది. నాకు ఆశ్చర్యంవేసింది. అలా నిలబడ్డాను సంగతేమిటోనని....

సుబ్బమ్మగారు అంటున్నది 'ఏదోనమ్మా మాకు తోచిన సలహా మేమివ్వబోయినాం చిన్నపిల్లవు నీకెంతెలుస్తుందని.'

వెంకాయమ్మగారు 'అయినా అంతకోపం అయితే!' అంది ముక్కున వేలువేసుకుంటూ.

నేనప్పుడే గ్రహించాను. వీళ్లేదో తీవ్రంగానే అని ఉంటారని, వాళ్ళంతా నన్నుచూసి ఒకరొకరు వెళ్లిపోయారు.

'నేను పిల్చాను 'పద్మా' అని. 'వాళ్లు వెళ్లారా?' అంది నీరసంగా. 'ఆ, తలుపు తియ్యమ్మా' అన్నాను. 'కిటికీదగ్గరకు - రండి' అని ఎంతో ప్రయత్నంమీద అంది. గబగబా పరుగెత్తేను, మంచంమీద పడుకుని ఉంది పద్మ. నన్నుచూసి 'నాన్నా, తలుపుతియ్యడానికి లేవలేక రమ్మన్నాను. వీళ్ళమాటలు పడలేక...నీకు వచ్చే అవమానం...' తీవ్రమైన బాధతో ఉండచుట్టుకుపోయింది పద్మ. నాకు గాభరా ఎత్తింది. 'అప్పుడు డాక్టర్ని పిల్చుకురానా' అని కేకవేశాను.

పద్మ బాధనుంచి తెప్పరిల్లి 'క్షమించు...తరువాత నీకు ఎంత కష్టమో...తెలుసు కాని... క్షమించు నాన్నా...ఆ గూట్లోఉన్న విషం తాగే...' ప్రపంచం అంతా తిరిగిపోయింది. భూమి ఆకాశం కలిసిపోయినయి. పెద్ద ఆకాశంలో నేను తేలిపోతూ ఉన్నాను.

తరువాత పద్మ ఎంతసేపు మాట్లాడిందో!

డాక్టరు వచ్చాడో లేదో!..."

'నేను నిర్ఘాంతపోయి చూస్తున్నానతనివైపు. అతను వంచిన తలఎత్తి ఆ నీళ్ళతో నిండిన కళ్ళతో నిశ్చలంగా ఉన్న నా కళ్ళలోకి చూశాడు, అదే అతనికి తృప్తి.—'

రాధపిలుపు

శ్రీ గోనెల నరసింగరావు ఎం.ఏ. బి.యల్.

మురళీ మోహన! ఏదీ, ఏయెడ నీ జాడ? ఎందుఁ జూచిన నుందువందురే, కనుల విందొసఁగవేలా! సందేహమెందుకు? కృష్ణా! కరుణాప్రపూర్ణా!! కనిపించవేమి? కనికరించవేమి? చూడు—

"ప్రకృతియు నిన్నుఁబోలె జలపాదితనమ్ము వహించి యెంతయో
వికలతగూర్చు చున్నయది; ప్రేమ మయాత్ముఁడవైన నీవె, న
న్నకట యుపేక్ష సేయఁగ ననాదరణమ్ము ఘటిల్లదొక్కొ, రా
ధికనిటు గుందుమంచును విధించె, విరించి, యిఁకెట్ట లోకదా."

ఇంకా,

"పున్నమరేయి నొక్క తెనుబోయి వనమ్మున నీదు ముద్దుమో
మెన్నఁడుఁ జూడఁ గల్గుదునో యేనని గ్రుమ్మరునయ్యెడన్ జగా
వెన్నెల తేఁట నీటులను బిన్నని నీనగవంచు నెంచి, కా
కున్న తెఅంగెఅంగి కడునొంనితి విన్నదనమ్ము నెమ్మదిన్."

పోనీలే, దయలేదుకదూ! నీరాధ ప్రేమ అగాధ, తీయని బాధ ననుభవించుచున్నది. మాధవా! నీ మృదు మధుర నామము నా హృదయమును గదలించి వేయుచున్నది. నీ పేదదాని యెడల నీ యనాదర మేల? జేలనై నీ పాలఁబడితినని యాలసించెదవా? ఆలోచించెదవా? ఔను. నీ యెదలోని ప్రేమ యింకి పోయినది. నీ పెదవులు సుధాధరమునుఁ గ్రోల జంకిపోయినవి. నీ చేతలు పెంకెతనము నుంకించుచున్నవి. ప్రణయ ప్రేమావతారా, మొగమింత సూపరాదా? ఇసుమంత దయ చిల్కరాదా? ఏమనుచున్నావు? నా గుండెలో పండిపోయినావా? కనులలో నిండిపోయినావా? నోటిలో నుండిపోయినావా? సరే.



ఈ రెండు బిడ్డలకును దాని
శ్రేష్టమైన గుణము తెలియును

ఉడ్ వర్డ్స్
గ్రైప్ వాటర్ బిడ్డలను
రక్షించుచున్నది

WOODWARD'S
GRIPE WATER
keeps baby well

I-WW 109-111—TL

W. WOODWARD LTD LONDON, ENGLAND

బాల భాగ్యోదయము.

చిన్న కథ

'గుణపాఠం'

వివేకానంద స్వామి కాశీ వెళ్లుదామని కలకత్తా స్టేషనులో రైలెక్కాడు ఒకసారి. ఆయన ఎక్కిన రైలుపెట్టెలో రెండే బెంచీలున్నాయి. ఒక ఆంగ్లేయుడు ఒక బెంచీమీద పడుకుని, రెండో బెంచీమీద తన పెట్టె పెట్టుకొని ఒక్కడూ వున్నాడు ఆ పెట్టెలో. ఆంగ్లేయుణ్ణిచూచి ఆ పెట్టెనుతీసి పైన పెట్టుకోమన్నాడు వివేకానందస్వామి. కాని అతడు ఆ పెట్టె తనదికాదని, ఆ పెట్టెగల మనిషి రైలుదిగి స్టేషనులోకి ఎందుకో వెళ్లాడని, వేరే ఇంకో పెట్టెలోకి పొమ్మని చెప్పాడు, హాయిగా బెంచీమీద పడుకుని. వివేకానందస్వామికి కూర్చోడానికి చోటులేదు. అలాగే నుంచునివున్నాడు. పడుకునివున్న ఆ ఆంగ్లేయుడు లేచి చోటన్నా ఇచ్చినాడు గాదు. ఇంతలో రైలు కూతకూసి బయలు దేరింది.

క్రమంగా ఒక్కొక్కపెట్టె ప్లాటుఫారాన్ని దాటి ఈవలికి వచ్చేస్తున్నాయి. ఆ పెట్టె గల మనిషి వచ్చి రైలు ఎక్కలేదు. ఇది గ్రహించాడు వివేకానందస్వామి. వెంటనే ఆ పెట్టెను రైలు కిటికీలోంచి ప్లాటుఫారంమీదికి విసిరివేసి, ఆ బెంచీమీద కూర్చున్నాడు. ఆ ఆంగ్లేయుడు ఖంగారుపడుతూ 'అదేమిటి? ఆ పెట్టె పారవేశావేం?' అని అడిగాడు. 'పాపం! ఆ పెట్టెగల మనిషి స్టేషనులో వుండిపోయాడు. పెట్టె లేకపోవడంవల్ల, వూరుకాని క్రొత్తచోట చాలా చిక్కపడిపోతాడని పెట్టె గిరవాటవేశాను' అన్నాడు.

తనపెట్టె ఆవల పడిపోయినందుకు ఆ ఆంగ్లేయుడు వెర్రిమొహంవేసి వివేకానందుడు తనకు చక్కగా బుద్ధిచెప్పినందుకు ఖిన్నుడై కూర్చునిపోయాడు.—వివేకానందస్వామిని మోసగించుదామనుకున్న ఆ ఆంగ్లేయుడే మోసపోయాడు. 'అందరూ సమానమే' అనే ఇంగితజ్ఞానంలేక చరించే ఇలువంటివాళ్లకి ఇది చక్కని గుణపాఠంగాదూ?

—కుమారి చిరంజీవి.

నాటకం

★ బొమ్మలపెళ్లి ★

'అబ్బాయి...మరీ...'

'ఉ. ఏమిటీ...?'

'మరే, మరే, నేను మగపెళ్లివారిని నువ్వేం ఎంచక్కా ఆడపెళ్లివారివి. ఏం?'

'ఉహు. నేనే మగపెళ్లివారిని.'

'పోనీలే, అమ్మా, మరీ...'

'ఉహు అదేమిటి? నేను మగవాడిని కనుక మగ పెళ్లి వారిని'

'అయితే నేను ఆడను...'

'పోనీ వెళ్లు. ఆడాళ్లు ఆడపెళ్లివారిగావుంటే బాగుంటుంది.'

'నేను ఆడను హుఁ. వెళ్లిపోతాను. నీజతవుండను నీకు నాకు 'కావు—కావు—కావు'

'అమ్మాయీ!'

'..............'

'వెళ్లకే, రావే...'

'ఊ ఎందుకూ మరీ'

'నువ్వే వుండుగానే. పోనీ, నేనే ఆడపెళ్లివారిని. సరే మరి అమ్మనడిగి కందిపప్పు, అటుకులు తీసుకురావే.'

'మరి బెల్లం.'

'బెల్లం కూడాను.'

'సరే.'

* * *

'అబ్బాయీ!'

'ఓయ్'

'దబ్బునరా పెళ్లివేళ అవుతోంది'

'అమ్మాయీ'

'మరీ నేను బ్రాహ్మణ్ణి'

'ఊ అల్లాగే'

'నేను ఎంచక్కా మంత్రాలు చదువుతానే'

'ఉ. పీటలమీదకూర్చోపెట్టి మంత్రాలుచదువు.'

'కేశవా నారాయణా, గోవిందా'

అచ్చింతాయం బుచ్చింతాయం.
అమ్మాయి మెళ్లో మంగళసూత్రం
ముక్కు మూసుకోవే

'సరే.'

'ఆ బెల్లం నైవేద్యము పెట్టవే'

'పెళ్లికి నైవేద్యం ఏమిటిరా? కట్నాలు, లాంచనాలు ఇవ్వాలి కాని'

'ఇది ఉత్తిత్తి పెళ్లి కాదు టే.....అంచేత భోజనాలే...'

'మరి అయిందా పెళ్లి?'

'అయిందోయ్ పెళ్లి అయిపోయిందోయ్'

'అమ్మాయీ, మరీ, మరచిపోయేవే'

'ఏమిటి?'

'పళ్లెంలో వెలిగిస్తారు అది మంగళహారతీ'

'ఉ. ఔను అదీ.'

'సరే, పళ్లెం పట్టుకురా'

'ఇదుగో'

'వెలిగించాను. మరి నువ్వు పాటపాడు'

'నాకురాదు. నువ్వుపాడు'

'మరి పాడనా? ఏమిపాడనూ?'

'ఏదో ఒకటి పాడు'

'సునో సునో పాడనా?'

'ఉ. పాడు'.

'సునో సునో బనకేరాణీ—రాణిహు'

'అదివద్దే. బాగాలేదే'

'ఇంకోకటి పాడనా?'

'ఉ. పాడు, మంచిదిపాడు'

'సరే. మంగళమని పాడరె మన శ్రీరామునికి మంగళం.'

—కందుకూరి లింగరాజు.

భారతీయనారి ★

శ్రీ స్వామి వివేకానంద
అనువాదం : శ్రీ పూర్ణానంద

నేను తులజూచు సంగతిని మాత్రమే చెప్పుచున్నాడను; రెండు పక్షముల సరిజూచిన పిమ్మట సత్యమును వివరించు చున్నాడను. ఇప్పుడు మీరే తులజూచు కొనుడు. నారీత్వమున భారతీయ నారి స్థానమెక్కడ? అని మీరు ప్రశ్నించిన, భారతవాసి మాతృత్వమున అమెరికా నారి స్థానమెక్కడ? అని ప్రశ్నవచ్చును. ఎవరినుండి మన మీ శరీరమును బడసితిమో ఆ మహిమమయి ఎట్టిది? మనల పదినెలలు గర్భమున ధరించిన ఆపె ఎవరు? అవసరమైన యెడల నాకొరకు వెయ్యి మారులు జీవితమును త్యజింప సిద్ధమగు ఆపె స్థాన మెచ్చట? నూర్లకొలది అపరాధములు తప్పులు ఉన్నను ఎవరి వాత్సల్యము సముద్రముననే ప్రవహించు చున్నదో ఆపె స్థాన మెచ్చట! ఏ భార్య కొంచము బెసికినచో వివాహ విచ్ఛేదార్థము విచారాలయమునకు పరిగిడుచున్నదో ఆభార్యతో సరిజూడ మాతయొక్క స్థాన మెచ్చట నిర్దిష్టమై యున్నది! ఓ అమెరికా యువతులారా! ఆపె స్థాన మెచ్చటో వచింపుడు? ఈ దేశమున నా కాపెను బొందు అశ లేదు. ఈ దేశమున నేను మాతకు అగ్రస్థానము నొసగు పుత్రుని గాంచలేదు. మృత్యు సమయమునగూడ మేము స్త్రీ పుత్రులకు మాతృస్థానము నధిరోహింప నియ్యము. మాతల్లి కంటె ముందుగానే మేము మరణించుచో, ఆపె ఒడిలో తలనిడి మరణింప వాంఛింతుము. ఆపె స్థాన మెచ్చట? నారీయొక్క నారీత్వము కేవలము రక్తమాసంములతో జడితమా? మాంసము కేవలము మాంసము తోడనే జడితమై యుండును. ఇట్టి ఆ దర్శమును చింతించుటకుగూడ హైందవుడు భయపడును. వలదు, వలదు, నారీ! నిన్ను నేనెన్నటికి రక్త మాంసములతో జోడింప జాలను. నీ నామము శాశ్వతముగ పవిత్రమై పోయినది. ఏలయన, 'అమ్మ' ఈ యొక్క పదముగాక మఱియొక శబ్దము ఎద్దాని కడకు కామమరుగ సాహసింపదో లేక ఎద్దానిని ఎట్టి పశుత్వము స్పృశింప జాలదో అట్టి శబ్దము ఉన్నదా? భారతము యొక్క ఆదర్శ మియ్యదియే.

మా సాంప్రదాయము చాలమటుకు భిక్షాజీవులగు మీ క్యాథలిక్ సన్యాసులవంటిది; వస్త్రాలంకారములయెడ విముఖత, ఇంటింట భిక్షువృత్తి ప్రాణముల నిల్పుకొనుట, ఇటనట శయనము, జిజ్ఞాసువులకు ధర్మోపదేశము; ఇట్లు మాజీవితమును గడపవలసి యుండును.

మా సాంప్రదాయ నియమానుసారముగా ప్రతినారిని, ప్రతిబాలికను గూడ 'అమ్మ' యని పిలువవలసి యున్నది. పూర్వాభ్యాసవశమున, పాశ్చాత్య దేశమున కరుదెంచియు, 'అమ్మ' యని సంబోధింప వారు అచ్చెరువు నందెడువారు; ఎందుకో నేను గ్రహింపజాలక పోయెడు వాడను. తుదకు అన్వేషింప లభించినది. దాన వారిని వృద్ధలని తలచినట్లు భారతమున నారీత్వముయొక్క పరాకాష్ఠ మాతృత్వమున అపూర్వ స్వార్థలేశహీన, సర్వంసహా, క్షమాస్వరూపిణి, అగు మాతయే మా ఆదర్శము. భార్య లేక పశ్చాదనువర్తియగు ఛాయ. మాతయొక్క ఆదర్శమున జీవిత నిర్మాణమే ఏక మాత్ర కర్తవ్యము. మాత ప్రేమయొక్క ఆదర్శ స్వరూపము. ఆపె సంసారముయొక్క పెద్ద. సంసారము ఆపెదే. భారతదేశమున తండ్రియే, అన్యాయము, కుకర్మలకొఱకు దండించును, మాత రక్షించును. ఈ దేశమున శాసించు భారము తల్లిది; తండ్రి రక్షకుడు. ఆదర్శముయొక్క భేదమును గమనింపుడు! సమాలోచకుని దృష్టితోనే నిద్దానిని జెప్పుచుండుట లేదు; మీ రొనర్చునదంతయు మంచిదే; కాని మా రీతినీతులగూడ మేము యుగయుగాంతరములనుండి నేర్చుకొనుచున్నారము. భారత దేశమున మాతృవదనమున సంతానమును గుఱించి అభిశాపము వినబడదు. ఆపె కేవలము క్షమించుచునే యుండును. ఈశ్వరుని మేము 'స్వర్గముననున్న పితా' అని పిలువము; సర్వదా 'అంబా' అనియే సంబోధింతుము. ఈ శబ్దము, ఈ భావము హిందువులమనస్సున అపారమగు ప్రేమతో జడితమైయున్నవి; ఏలయన, ఈ మర్త్యజగత్తున మేము తల్లియందే ఈశ్వరప్రేమయొక్క ఆభాసను సర్వాపేక్షికముగ నెక్కుడు గాంతుము. జగన్మాత ఉపాసకులగు రామప్రసాదాది సాధకుల సంగీతమున వారు నుడువుట కాననగును, కుపుత్రుడుండ వచ్చునుగాని, కుమాత యుండదు.

భారతమున హిందూమాతయొక్క స్థాన మిట్టిది. వధువు కన్యాస్థానీయమై ఆపె గృహమున కరుదెంచును. తాను కన్నబిడ్డ వివాహమైనపిదప అన్యుల గృహమున కరుగ ఈవైపున పుత్రుడు వివాహ మొనర్చుకొని మఱియొక కన్యను దెచ్చి తల్లి కొసగుచున్నాడు. గృహకర్త్రియగు తల్లియొక్క శాసనమునకు తలవంచి తీరవలెను. మా సాంప్రదాయస్థు (సన్యాసు) లెన్నడును వివాహ మొనర్చుకొనరు. నేనును, ఒనర్చుకొనలేదు. కాని, వివాహితుడనైన, నాభార్య నాతల్లిమాటను విననిచో, నేను భార్యపట్ల ఏవను బొందకుండ నుండజాలెడు వాడనుగాను. ఏల? నేను మాతృ పూజకుడను. ఆపె కోడలట్లేల అవదు? నేను పూజించునాపెను నాభార్య పూజింపదా? నన్నవహేళనమొనర్చి నాతల్లిని శాసించుట కాపె యెవరు? నారీత్వముయొక్క పూర్ణతమ వికాస మవనంతవఱకు ఉపేక్షింపవలసి యుండును. మాతృత్వమును బొందుటయే నారీత్వముయొక్క ఏకైక సార్థకత. తల్లియగునంతవఱ కాపె వేచియుండును గాక, పిదప ఆపెకూడ ఈ అధికారమును బొందగలదు.

హిందూమతమున మాతృత్వము నందుటయే నారియొక్క చరమోద్దేశము. హిందువుల ఈ ఆదర్శము పాశ్చాత్యుల ఆదర్శముకంటె ఎంతగ విభిన్నము! ఈ రెంటినడుమ ఆకాశపాతాళముల బోలు అంతర మున్నది. నా జన్మకు పూర్వము, నాతల్లి దండ్రులు సంతానార్థము చాలఏండ్లు వ్రతోపవాసముల నాచరించి యుండిరి. ఏలయన, సాధారణముగ భారతదేశమున, సంతాన ప్రసవమునకు బూర్వము వారిట్లు వ్రతోప వాసముల నొనర్చి సత్పుత్రుని బడయ గోరెదరు. మా స్మృతికారుడగు మనువు సత్సంతాన వాంఛాఫలముగ జన్మించినవాడే 'ఆర్యు' డను సంజ్ఞనొసగియున్నాడు. ఈశ్వరునికడ సంతాన కామన ఫలముగ జన్మింపని వాడు, అనార్యుడని స్మృతికారుల అభిప్రాయము. సంతానముకొఱకు ఈశ్వరుని బ్రార్థింపవలెను. అభిశాపము అసంతోషములనడుమ జన్మించినవారును, సంయమ రాహిత్యమువలనను, ఉత్తేజనయొక్క అసావధానత వలనను, ఈ జగత్తునబడిన సంతానముకడ మన మేమి ఆశింపగలము? అమెరికా మాతలారా! మీరు శ్రద్ధతో వినుడు. మీరొకసారి అంతరమున భావించుకొని చూడుడు. మీరు యదార్థ నారు లవగోరు చున్నారా? దేశము, కులము, జాతుల మిథ్యాగర్వమున కచ్చట తావులేదు. ఈక్షణభంగురజీవనమున, ఈ దుఃఖసంకుల జగత్తున ఈ గర్వమునుంచుకొన సాహసించు వారెవరు? భగవంతుని అనంతశక్తికడ మన మెంత తుచ్ఛులము! నేడు మిమ్ము నే నడుగునది, సత్సంతాన లాభార్థము మీరందరును భగవంతుని బ్రార్థించుచుంటిరా? మీ మనస్సుల నొక్కతడవ పరీక్షించి చూచుకొనుడు. మాతయైనందులకు, మీరు భగవంతునికడ కృతజ్ఞులా? తల్లియైనందువలన మిమ్ము మీరు పవిత్రులుగ నెంచుకొందురా? కానిచో, మీ వివాహము ప్రవంచన. మీ నారీత్వము వ్యర్థము. విద్యకు సంస్కారము మీ సంతానోత్పత్తికి మూలముగ ఈశ్వరుని సత్సంతానమునకై వాంఛించుట యుండనిచో, అయ్యది మనుష్య సమాజమున కభిశాపము. ఈ రెండును ఎట్టి విభిన్న ఆదర్శములో జూడుడు! మాతృత్వముపైన నెంతటి గురుభారము. ఇదియే పునాది, ఇటనుండియే అగ్రేసరులు కండు. తల్లియెడల ఇంతటి శ్రద్ధాభక్తులేల? జన్మగతములగు శుభా శుభ సంస్కార ములే శిశువుయొక్క జీవితమున సుకు ప్రభావముల విస్తరింపజేయునని మా శాస్త్రములు వచించుచున్నవి శతసహస్ర సంఖ్యములగు కాలేజీల కరుగుడు, లక్షలకొలది పుస్తకములనే పఠింపుడు. జగత్తునందలి పెద్ద పెద్ద పండితుల సంగమునే యొనర్పుడు, చివరకు మీరు గాంచునది, జన్మగతమగు శుభసంస్కారమే స్వసాఫల్యమునకు గారణము. పుట్టుకనుండియే మీ సదసత్ రూపకమగు అదృష్టము నిర్దిష్టమైయున్నది.

జన్మాదిగనే శిశువు దేవతయో లేక దానవుడో అయియున్నది. ఇది సాస్త్రరహస్యము. విద్య మున్నగు విషయములన్నియును తరువాత వచ్చును. వాటి ప్రభావము అత్యంత సామాన్యము. మీరెట్టి జన్మను బడసితిరో అట్లేయగుదురు. అనారోగ్యముతో జన్మించినారు, ఇప్పుడు జగత్తునందలి ఔషధాలయముల నన్నిట తిరుగాడినను సమగ్రజీవిత స్వాస్థమును తిరిగి పొందగలరా? దుర్బలులు, రుగ్ణులు, దూషితరక్తులు అగు మాతాపితలు స్వాస్థయుతులు సబలురునగు పిల్లల నెందఱిని గనగలరు? చెప్పుడు! ఎందఱిని?

(సశేషము)

స్వర్గీయ కమలాదేవికి స్మారకచిహ్నం

శ్రీమతి కూచిమంచి నరసాయమ్మ

వీరనారి కమలాదేవి స్వర్గాన్ని అలంకరించింది. ఈ ఏడు ఏ దుర్ముహూర్తాన్ని అడుగుపెట్టిందో కాని ఆంధ్రమాతకు అడుగడుగుకు ఆఘాతాలే. రత్నాలవంటి పుత్రుల వియోగదుఃఖాన్నుంచి యింకా తేరుకోలేదు. తిరిగి తాళుకోలేని యీదెబ్బ—కమలాదేవి అస్తమయం. తెలుగుతల్లికి కానికాలం సంభవించింది.

ఆంధ్ర వనితాలోకానికి కమలాదేవి ప్రసాదించిన అద్భుతచైతన్యం అలపికానిది. రాజకీయ పోరాటాల్లో, సాంఘిక పరివర్తనాల్లో యీమెను వరవడిగా పెట్టుకుని నడిచే స్త్రీలోకం ఆంధ్రదేశంలో చాలా వుంది. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలలోని మహిళోద్యమాలు తలమానికమైనాయి అంటే, ఆ కీర్తి కొంత వరకు కమలాదేవిదే.

గత స్వాతంత్ర్యపోరాటంలో పాల్గొని సేవచేసిన స్త్రీలలో ఆంధ్రదేశముదే అగ్రస్థానం. అందులో తూర్పు పశ్చిమ గోదావరిజిల్లాలది ముఖ్యస్థానం. ఆ జిల్లాలలోని మహిళారత్నాలలో కమలాదేవి ఒక ఆమె.

కమలాదేవిలో స్వార్థంలేదు. ఆమెకు అదే వున్నట్లయితే, కాకినాడ మ్యునిసిపల్ సంఘానికి ఎన్నడో చైర్‌పర్సన్ అయ్యేది. తూర్పు గోదావరిజిల్లాకు ఏనాడో అధ్యక్షురాలై వుండేది. కాని ఆమెకు ఆలాటి పదవీ వ్యామోహంలేదు. ఆమె ఎంతసేపూ వాంఛించేది, నిర్మలకార్యక్రమం.

ఇటువంటి మహిళారత్నాన్ని పోగొట్టుకున్న మనం కేవలం అభాగ్యులమె. ఇక ఆమె స్థానం మరి పూడడం కష్టం. అయితే ఆమె అడుగుజాడల్లో నడవగలిగిన్నాడు తిరిగి మహిళాలోకం, దానితో ఆంధ్రదేశం ఒక నూత్నఛాయని పొందగలుగుతుంది. అటువంటి ఉద్రేకం, ఉత్సాహం మనలో కలగాలంటే, ఆమె మనకు నిత్యం కనపడుతూ, అటువంటి ప్రోత్సాహాన్ని కలుగజెయ్యాలి. ఇది ఎల్లా సమకూరుతుంది.?

ఒక స్మారకచిహ్నం ద్వారానే!

అది ఏమి ప్రారబ్ధమోగాని, ఆంధ్రభూమిలో యీ వీరపూజ నశించిపోతోంది. 'నాగేశ్వరరావు పంతులుకు స్మారకచిహ్నం' అన్నాము. అది ఏమైపోయిందో ఎవరికీ తెలియదు. తరువాత 'రఘుపతి-వెంకటరత్నం నాయుడుగారికి' అన్నాము. అది మొదలేలేదు. ఇల్లా మనం ఎంతమందికి చేద్దామనుకోలేదు, కొత్తకొత్త పొంగుల్లో? ఆ వేడి తగ్గిపోగానే మనంకూడా నీళ్లుకారిపోయాము. ఇది ఎంతనీచము! పరులకు ఎంతలోకువ! ఇప్పటికైనా గుర్తిస్తారా నా ఆంధ్ర సోదర సోదరీమణులు యీ దౌర్బల్యాన్ని?

స్వర్గీయ కమలాదేవికి వెంటనే స్మారకచిహ్నం ఏదో ఒకరీతిగా నెలకొల్పబడాలి. ఇది ఆంధ్ర మహిళాలోకానికేగాదు, అఖిలాంధ్ర దేశానికంతటికి గౌరవప్రదమైనది.

ప్రథమజిల్లాబోర్డు అధ్యక్షురాలుగా శ్రీమతి కె. రామసుబ్బమ్మగారిని (కడప) ఎన్నుకొనడానికీ, ప్రథమ పురపాలక సంఘాధ్యక్షురాలుగా శ్రీమతి చుండూరి రత్నమాంబగారిని (ఏలూరు) ఎన్నుకొనడానికీ, ఆంధ్రులు మార్గదర్శులైనారు. ఇక ఈ వీరపూజలోకూడా ఆంధ్రులది మొదటిస్థానం కావాలి.

దీనికి వెంటనే, ఆంధ్ర సోదరీమణులు పూనుకోవాలి. ముఖ్యంగా కాకినాడ పౌరులు దీక్ష వహించాలి. కాకినాడలో పురపాలక సంఘం దగ్గర్నుంచి, అనేక సంఘాలున్నాయి. ఒక్కొక్క సంఘం కొంత కొంతగా ప్రయత్నిస్తే యీ విషయం అతిసునాయాసంగా తేలిపోతుంది. దీనికి కాకినాడ పౌరులు ఏమంటారు?



నవ్యకళావారి 'మీరాబాయి'లో ఒక సన్నివేశము

కీ॥ శే॥ శ్రీమతి కళ్లేపల్లె వెంకటరమణమ్మగారు

గంజాంజిల్లా బరంపురమునందు 9-9-1864 తేదీని జన్మించిరి.

ఈమె భర్తయగు శివరామయ్యగారు స్త్రీ విద్యయం దత్యంత యాదర ప్రోత్సాహములుగలవారగుటచే వీరికి స్వయముగా సంగీత సాహిత్యములు నేర్పి, మిగుల జ్ఞానవంతురాలుగా నొనర్చిరి.

1910 వ సం॥ నాటికి పుణ్యపురుషుల పత్రికా ప్రచారము వలనను, ప్రోత్సాహమువలనను పత్రికలకు వ్యాసములు వ్రాయ స్త్రీ లనేకమంది బయలుదేరిరి గాని, శ్రీ వెంకటరమణమ్మగారు వ్రాయ కాలమునాటికి లెక్కగా 10 మంది స్త్రీలు మాత్రమే పత్రికలకు వ్రాయుచుండిరి. ఈమె వ్రాసిన వ్యాసములు అప్పటి 'శశిరేఖ', 'దేశోపకారి' 'హిందూ సుందరి', 'సావిత్రి', 'కృష్ణాపత్రిక' మున్నగు పత్రికలు ప్రచురింపజేసినవి. కృష్ణాపత్రికలో 'తెలుగుదేశపు మూర్ఖాచారములు—తన్నివారణామార్గము', ఆంధ్ర పత్రిక సంవత్సరాది సంచికలో 'ఆంధ్ర స్త్రీల స్థితి' అను శీర్షికతో వ్రాసిన వ్యాసములను చదివినవారికి ఈమె యుదారాభిప్రాయములు తెలియగలవు. 'కల్పలతా' పత్రికలో ప్రశ్నల కుత్తరములిచ్చి వారి వలన నీమె పారితోషకమును బడసినది. కాకినాడ 'స్త్రీ విద్యాభి వర్ధనీ' సమాజమునకు కొంతకాల మధ్యక్షురాలై, 'హిందూసుందరి' పత్రికకుకూడ కొంతకాలము సంపాదకత్వము వహించి స్త్రీ విద్యాభ్యుదయమొనరించెను. 'ఆంధ్ర ప్రచారిణీ' గ్రంథమండలి (కొవ్వూరు) వారిచే ప్రచురింపబడిన 'దుర్గేశనందని' అను నవలకు విమర్శనము వ్రాసి వారివలన రు. 50 లు బహుమతిని బడసిరి.

నరసాపురపు 'స్త్రీ విద్యాభివర్ధనీ' సమాజమువారి స్త్రీల పోటీ పరీక్షలలో కృతార్థతనంది యొక బంగారుపతకమును బడసిరి. వీరు బరంపురమునందు 'ఆంధ్రలక్ష్మి' యను నొక మాసపత్రికను స్థాపించి స్త్రీజనోద్ధరణమునకై విశేషముగా పాటుబడిరి.

వీరు 21-1-1935 తేది సోమవారం రాత్రి ఇరువురు పుత్రులను 5 గురు పుత్రికలను బంధుమిత్రులను విడిచి స్వర్గస్థులైరి.

వీరు రచించిన శ్రీ మహాలక్ష్మి పూజపాటలు, తులసి పూజ పాటలు, శ్రీ వరలక్ష్మి శతకము చదివినవారికి వీరి మృదుమధుర కవితాసామర్థ్యము తెలియగలదు.

ఇల్లాలు

[సంఘజీవితంలోని కష్టసుఖాలకన్నా సాంసారిక జీవితంలోని ఒడుదుడుకులు విషాదరూపాన్ని పొందుతూ ఉన్నాయి నానాటికి. ఇవి నేటి యువతీయువకులను బొత్తిగా పీడిస్తూవున్నాయి. సంసారాలను సమరసంగా సాగించుకొనడానికి సలహాలు, చర్చలుపూర్తిగా అవసరం. అట్టివాటికి ఇది ఉపక్రమణిక.]

★

కన్య వివాహం అయినంత మాత్రాన్ని గృహలక్ష్మిగా మారుతుందా? యువకుడు శక్తి సామర్థ్యాలేమీ లేకుండా, పైకిపోయి నాలుగు డబ్బు లెలాగ ఆర్జించుకోలేడో, అలాగే యువతికి కూడ 'యిల్లాలు' అనిపించు కోడానికి కొంత శిక్షణ కావలసివుంది. పెళ్లి అనేది యావజ్జీవం నిలిచి వుండే బంధంగనుక దాన్ని విజయవంతంగా సాగించడానికి ప్రతి స్త్రీ చాలశ్రమ పడవలసివుంది.

'వయోగుణ రూపతుల్య'అయిన కన్య పరిగ్రహింప తగిందని పెద్దలు నొక్కి చెప్పినా, భావిప్రపంచ పరిణామాన్ని గమనిస్తే, యిదొక ముఖ్య లక్షణం కూడాను. యువతీ యువకు లిద్దరు పరస్పరానురాగం ప్రకటిస్తూ, అన్యోన్య ప్రేమ పూర్వకంగా, ఒకరి హృదయాన్ని మరొకరు అవగాహనచేసుకొని, వివాహం చేసుకొంటే, ఆదాంపత్యం అఖండ విజయాన్ని పొందుతుంది. బాల్యవివాహాల్లో యిట్టి దానికి యేమాత్రం అవకాశం లేదుగనుక వాటిఫలితాలు మనం విచారింప నవసరం లేదు.

ఒక అనుకూల దాంపత్యం యిరువురికికూడ పరిపూర్ణ సుఖంకలిగిస్తుంది. కాని అట్టి ఆనందం అనుభవించడానికి ముందు ఆమెకొంత శ్రమపడాలి. తన సుఖంకోసం పాటుపడే స్త్రీ దాన్ని సంపాదింప గల్గుతుంది.

ఆమెకు ప్రారంభంలోనే మంచి లాభంవున్నది. ఒక యువకుడామెను హృదయ పూర్వకంగా ప్రేమించాడు. తన జీవిత సుఖమంతా ఆమె చేతులలో నున్నదని నమ్మినాడు. ప్రపంచంలో నున్న స్త్రీలందరిలో ఆమె యే అతని ప్రణయిని. ఆమెకొక గృహం నిర్మిస్తాడు. ఆమెకు సంరక్షకుడౌతాడు. సకల భారాలు భుజాలను వేసు కుంటాడు. అతని ప్రణయామృతమే ఆమెకొక పరిపూర్ణ స్త్రీ వ్యక్తిత్వాన్ని ఆపాదింప జేసింది. కాపురానికి వచ్చీరావడంలోనే, "నువ్వు వంటచెయ్యగలవా? సరిగా యిల్లు చక్కబెట్ట గలవా?" అని అడిగి ఆమెను ఖిన్నపెట్టడు. అతనిది గ్రుడ్డినమ్మకం కాకపోయినా, చాలా అద్భుతము. ఆమె చక్కని గృహిణి అనుకుంటాడు.

మంచి యిల్లాలు ఆ యువకుని ఆశా సౌధాలకు నిజరూపం కల్పిస్తుంది. ఒక గృహాన్ని ఏర్పరచుకొని, అతనిని దానికి పట్టం గట్టి, అతినిపుణతతో సంసార చక్రాన్ని మృదువుగా సాగనిస్తుందేకాని, అనవసరాందోళనానికి తావివ్వదు. అట్టి సామర్థ్య తానెలాగ సంపాదించిందో నలుమూలలాచాటదు. ఆమెకు చేదోడు వాదోడు యెవరైనావుండచ్చు, లేక ఒంటరియేకావచ్చు. ఏమైనా, మంచి గృహిణి తొట్రుపడక చక్కగా తనపనితాను నిర్వహించు కొంటుంది. ఆత్మను వశంచేసుకొని, ఆ ఒక్క యువకునికి మాత్రం ప్రణయినియై కాలం గడుపుతుంది.

ప్రణయం—అది భార్య కష్టార్జితము మాత్రమే! అనుగుణ్యమైన వరుడు లభిస్తే, మాతయై తనకు పరిపూర్ణత్వం ఆపాదింప చేసుకుంటుంది. తెలివైన భార్య మొదట ఆధ్యాత్మిక సుఖాన్ని ఆ కాంక్షిస్తుంది. ఆమె స్వశక్తివల్ల ఒకయువకుని వశంచేసుకుంది. అతడు తనపాశాలను వీడిపోకుండా కాచుకొనే భారం ఆమెదే. ఒక వ్యాపారస్థుడు తనపని సరిగా నిర్వహించు కోవాలంటే, చాలకష్ట నిష్ఠూరాలకు లోనై యుండ

వలసి వస్తుంది. కాని అవన్నీ ఎవరు చర్చిస్తారు? అలాగే గృహాన్ని రమణీయంగాచేసి, సంసార చక్రాన్ని సక్రమంగా సాగించడానికి, ఆమె చాల శ్రమపడవలసి యుంటుంది. కాని పనిముగిసిన తర్వాత గంటలాదిపడిన కష్టాలన్ని, భర్తరాగానే పంచాంగ శ్రవణంచేసేకంటే, చేసిన అలంకారాల్నిచూసి దాన్నంతా, అతన్ని గ్రహించనీయడం మంచిది. సాధారణంగా ప్రతిభర్త పగలంతా పని చేసి చేసి, ప్రాణంవిసిగి యింటికి వస్తాడు. కల కల లాడే కాంతముఖం చూసేసరికి కష్టాలన్నీ గట్టెక్కుతాయని గంపెడాసతో వస్తాడు. అప్పుడే నిష్ఠుర వాక్యాలు వినేసరికి అతనికి మతిపోతుంది. ఆనంద సాగరం అల్లకల్లోలమై పోతుంది, ఆశా సౌధాలు అథఃప తనాన్ని పొందుతాయి. అట్టి అకాల ప్రళయానికి కారణభూతం ఎవరు, ఆమె కాకపోతే?

గృహనిర్వహణంలో చిన్న చిన్న వ్యవహారానికి ఆమె ప్రాముఖ్యం యివ్వదు. ఉప్పు చింతపండు అయిపోయినంతమాత్రం, వచ్చిన ప్రమాదంయేమిలేదు. ఆమె ఒకనటి, ఒక పాత్రను అతి సమరతతో నిర్వహించ వలసివుంది. ఇల్లే ఆమె రంగస్థలం. తనసౌరభ్యాన్ని పెంపొందించడానికి గృహాన్ని రమణీయంగా అలంకరిస్తుంది. భర్త యింటికి రావడం తన నాయకి కోసమే కాని, చక్కగావున్న గృహానికి మాత్రం కాని, నాలుగు మెతుకులు తిని విశ్రమించడానికి మాత్రం కాని కాదు.

అసాధారణమైన తనప్రజ్ఞవల్ల, అక్షయమైన ప్రణయంవల్ల, నాల్గు గోడల మధ్య అనంతామృతాన్ని కురిపిస్తూ, అతన్ని సౌఖ్యాబ్ధిలో ఓల లాడిస్తుంది. ఆమె మంత్ర ప్రభావానికి వివశుడై ఆమెను వివాహమాడాడు. అట్టి ప్రభావం ఏమాత్రం తగ్గకుండా చూడడమే ఆమె కర్తవ్యం. ఇది చాలాకాలం అయినా సరే సాధించాలి. సుప్రసిద్ధనటి కాలాను గుణ్యంగా రంగమెక్కినప్పుడల్లా రంగు మారుస్తుంది, అలాగే మంచి గృహలక్ష్మికూడా. గణనకెక్కిన నటి ప్రజల పొగడ్త గాంచినట్లే, భార్యకూడా తనపాత్రను నిపుణత్వంతో నిర్వహించి భర్తమెప్పుపొందినప్పుడే, ఆదాంపత్యం విజయవంతం అవుతుంది.

ఆమె అతని భావంలో పరిణతిపొందిన 'ఇల్లాలు' అని అనిపించుకొనుట, ఎంత మాత్రం తప్పు కాదు. ప్రణయభిక్షకోసం ఆమెను అర్థిస్తున్నాడని తెలుసుకోడం, అతనిప్రపంచానికి ఆమెయే మూలం అని ఆ గృహాన్ని ఒక భూలోక స్వర్గంగా తలంచేలా చెయ్యడం చాలాకష్టం.

భార్యలో అద్భుతమైన శక్తివుంది. ఆమెను ప్రేమించి పూజించే పురుషుని సుఖపెట్టి తన్మూలంగా తాను సుఖిస్తుంది. గృహభారం మాత్రం మోసే దాసిగా మాత్రంకాక అతనికి సహచరియై కొంత కాంతంగాను అనురాగంతోను ఉండాలి. ఇంట్లో ఒంటరిగా వున్నంతసేపు సంసారం నిర్వహిస్తూ, అవసర సమయాల్లో మాత్రం తాను ఆనందించి అతన్ని సంతోషపెడితే మన్ననలు పొందుతుంది. ప్రపంచంలో తనని సుఖపెట్టేది ఆమెయే అని కొలిచే అతన్ని, వచ్చేరాని చిలుక పలుకులతో తేనె లొలుకుతూ 'అమ్మా' అని పిలిచే తమ యిద్దరి ప్రణయ ఫలాలైన బిడ్డల యొక్క జీవితాల్లో తానట్టి ప్రాముఖ్యస్థానం ఆక్రమించుకోవడమే ఆమె పడిన శ్రమకు ఫలితం! ఆ గృహలక్ష్మి మూలాన్నే ఆదాంపత్యం పరిపూర్ణ విజయం గాంచిందన్నమాట. నేటి సాంసారిక సమస్యలలో ప్రధానస్థాన మాక్రమించియున్న వివాహంయొక్క అంతరార్థం, ప్రాముఖ్యం అవగాహన చేసుకోవాలి. ఆ ప్రకారం అన్నివిధాల అనుష్ఠించి, తాను 'ఇల్లాలు' అవడానికి సర్వవిధాలా ప్రయత్నించాలి ఆమె. ఇది ఆమె అనుకున్నంత కష్టతరం మాత్రం కాదని నొక్కి చెప్పవచ్చును.

—సి. నరసింహాచారి.

సంతుష్టో భార్యయా భర్తా భర్త్రా భార్యా తథైవచ।
యస్మిన్నేవ కులే నిత్యం కల్యాణం తత్రవై ధ్రువం॥

ఏ కులంబున భార్యచే భర్తయు, భర్తచే భార్యయు సంతసము గలిగియుందురో, ఆ కులంబున సంపద యెల్లప్పుడు తాండవమాడుచుండును.

—మనుస్మృతి.

సన్‌లైట్ సోపు

మీఇండ్లకు సౌఖ్యమును తేనిందు

ప్రతిదినమును సన్‌లైట్ సోపును వాడిన, నీ పని తక్కువగును. నీకుటుంబమునకు ఆరోగ్యమును శుభ్రతయును, సౌఖ్యమును ఇచ్చును. సన్‌లైట్ శుభ్రతను మీ ఇండ్లలో ఇప్పుడే రానిందు.



అప్పటమైన సన్‌లైట్ ఇట్టి అట్టల పెట్టలోనే అమ్మబడును.

S. 20-50 TL LEVER BROTHERS (INDIA) LIMITED

★ దక్షిణదేశం

సర్వమంగళా,

నిరుటేడు మనం యాత్రలుచేస్తూంటే నీకెంతో సరదాగా ఉండేదికాదూ? తిరపతికొండ, సింహచలకొండ, పళనికొండ—ఇవన్నీ ఎక్కి దేవుళ్లని చూశాం. కృష్ణానదిలోనూ, కావేరిలోనూ, తామ్రపర్ణిలోనూ కులాసాగా స్నానాలుచేశాం. రామేశ్వరంలోను, ధనుష్కోటిదగ్గర సముద్రంలో స్నానంచేస్తోంటే ఎంత బాగా ఉంది! అక్కడ అట్టే కెరటాలే లేవు. నువ్వూ, చెల్లాయీకూడా భయంలేకుండా స్నానం చేసేశారు. ఎన్నిగుడులు చూశాం! అందులో తంజావూరుగుడి ఎంత ఎత్తుందో జ్ఞాపకం ఉందా నీకు! మెడఎత్తి చూస్తే, ఆకాశాన్ని అంటుకుపోతోన్నట్లు ఉంది దానిపైన ఉన్న గుమ్మటం. అన్నింటికన్నా చిత్రం, ఆ గుడిలోవున్న పెద్ద నంది. ఒక్కరాయిలో అంతనందినీ చెక్కారంటే నువ్వు ఆశ్చర్యపోయావు కదూ! మధురదేవాలయంలో ఉన్న బొమ్మలని పదేపదే చూసివచ్చేదానవు, జ్ఞాపకం ఉందా? అక్కడ తిరుమలనాయకుడి నగరు ఎంత విశాలంగానూ ఎత్తుగానూ ఉందో. దానిలో ఒక్కొక్క స్తంభమే ఉంది లైటుహౌసంత పెద్దదిగా!

అన్నింటికన్నా కుత్తాలందగ్గర ధారలో స్నానం హాయిగానూ సరదాగానూ ఉందికదూ! నీరు ఎత్తుగా కొండమీంచి దడదడ పడుతోంటే నీకు మొదట భయంవేసింది కాని తరవాత నువ్వూ చెల్లీకూడా సరదాగానే నిలబడ్డారు ధారకింద. తిరవనంతపురానికి కొండల్లోంచి రైలువెడుతోంటే మనకెంత సంతోషంగా ఉంది! ఆ కొండలనిండా ఎక్కడచూసినా పచ్చటి చెట్లే. ఆ కొండలమీద వర్షం బాగా కురిసి చెట్లూ, తీగలూ, పొదలూ గుజ్జులుగా పెరుగుతాయి. తిరువనంతపురంలో అనంతపద్మనాభస్వామి దేవాలయం తతిమ్మా గుళ్లకి మల్లేకాకుండా వెడల్పుగా ఉంది. అక్కడ దేవుడి విగ్రహం అంతపెద్దది మరి. మూడు ద్వారాల్లోంచి చూస్తేనేకాని దేవుణ్ణి చూడలేకపోయాం, జ్ఞాపకం ఉందో లేదో! ఆ ఊళ్లో జంతువులన్నీ ఉన్న తోట మరీ బాగుంది.

అక్కణ్ణుంచి మనం బస్సులో కన్యాకుమారి అగ్రానికి వెళ్లేం. అగ్రం అంటే చిగురని చెప్పేను ఆవేళ నీకు. మనదేశం అక్కడితో ఆఖరన్నమాట. ఆ కిందంతా పెద్ద సముద్రమే. ఇటు చెన్నపట్నాన్నుంచీ రామేశ్వరంనుంచీ వచ్చిన సముద్రం, అటు బొంబాయినుంచి వచ్చే సముద్రం ఈ అగ్రం దగ్గిర ఏకమై పోతాయి. ఈ రెండు సముద్రాలమధ్యనా తేనెపట్టు ఆకారంగా ఉంది భూమి. ఈ దేశాన్నే దక్షిణదేశం అంటారు. మన ఊరునుంచి చెన్నపట్టణం వచ్చేవరకు మనకు తెలుగుమాటే వినిపించింది. అక్కణ్ణుంచి కుత్తాలం దాకా తెలుగుపోయి మరోభాష వినిపించింది మనకి. ఈ భాషని అరవం అంటారు. ఈ భాష మాట్లాడేవాళ్లు అరవ్వాళ్లు. వీళ్ళ కట్టు, తిండీ మనవాటికంటే కొంచెం తేడాగా ఉన్నాయి కదూ. కుత్తాలందాటి కొండల్లోంచి వెళ్లేటప్పటికి నీకు భాష మళ్లీ మారిపోయినట్టు తెలిసిపోయింది. అక్కడిభాష మళయాళం. ఈ దక్షిణదేశంలో నువ్వు విననిభాష ఒకటుంది. దాన్ని కన్నడం అంటారు. మనం ఆ ప్రదేశాలు నిరుడు చూడలేదు. అది మైసూరు రాజ్యం. అందులోనే బెంగుళూరుంట. ఈమాటు దేశం చూడ్డానికి బయల్దేరినప్పుడు మనం మైసూరు వెడదాం. ఏం?

అమ్మడూ! చూడ్డానికి బయలేరితే దేశం ఎంతేనా ఉంది. ఎన్నో పట్టణాలూ, ఎన్నో నదులూ, ఎన్నో కొండలూ, ఎన్నో చిత్రాలూ చూపిస్తాయి. సరదాగా ఎప్పుడేనా చూద్దాం వెళ్లి. ఈలోపుగా నాకు తీరుబడైనప్పుడల్లా వాటినిగురించి నీకు ఉత్తరాల్లో రాస్తోంటా సరదాగా చదువుకుందువుగాని.

ఇట్లు,
పిన్ని.

మద్రాసు
1-9-40



జగదీష్ ఫిలిమ్సువారి 'విశ్వమోహిని'లో
శ్రీ[illegible]లలిత



యోగిని కృష్ణాబాయి

(మదనపల్లి)

ఈమె జన్మదినము మహాలయ అమావాస్య అగుటచే, ఈమె తల్లిదండ్రులు ఆ దినము అశుభదినమని తలచి, ఈమెను ఒక సన్యాసికి దానమొసగి, మరల 2 రూప్యములా సన్యాసి కొసగి ఈమెను స్వీకరించిరి. బొంబాయి వాస్తవ్యులగు కీ॥ శే॥ కె. లక్ష్మణరావుగారు ఈమెను వివాహమాడి అనంతరము 7 సంవత్సరములకే మృతినొందిరి. నాటినుండియు కృష్ణాబాయి దైవధ్యానములో కాలము గడుపుచుండెను. కొలది దినములకే ఈమె శ్రీ సిద్ధామృతస్వామివద్ద శివమంత్రోపదేశమును, శ్రీ రామదాసుస్వామివద్ద రామమంత్రోపదేశమును స్వీకరించి, తన గురువువద్దనే (ఆనందాశ్రమము) నివాసమేర్పరచుకొనినది. ఈమె వయస్సు ముప్పది సంవత్సరములు. శిశురక్షణ, భగవత్సేవ, దేశసేవ, మొదలగు మహోపకారములను నేటికిని చేయుచు, ఆశ్రమమునకరుగు సకలజనుల మన్ననలను పొందుచున్నది.

వినాయక చవితి

ఉభయభాషాప్రవీణ శ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రి

ఎలుకగుఱ్ఱము నెక్కి యీ రేడుభువనాలు
పరువెత్తివచ్చిన పందెకాడు
ముల్లోకముల నేలు ముక్కంటి యింటిలో
పెత్తనమ్మొనరించు పెద్దకొడుకు
"నల్లమామా" యంచు నారాయణుని పరి
యాచకాలాడు మేనల్లుగుఱ్ఱ
వడకుగుబ్బలి రాచవారిబిడ్డ భవాని
నూరేండ్లునోచిన నోముపంట
అమరసభ నగ్రతాంబూల మందుమేటి
ఆరుమోముల జగజెట్టి యన్నగారు
విఘ్నదేవుడు వాహ్యాళి వెడలివచ్చె
ఆంధ్రవిద్యార్థి! లెమ్మ జోహారులిడగ.

★

కొలుచువారలకు ముంగొంగు బంగారమ్మ
పిలుచువారలపాలి ప్రియసఖుండు
సేవించువారికి చేతిచింతామణి
భావించువారికి పట్టుకొమ్మ
ఆశ్రయించినవారి కానందమందార
మర్థించువారల కమరశాఖ
"ధాసోహ" మను వారి దగ్గరచుట్టంబు
దోసిలొగ్గినవారి తోడునీడ
జాలిపేగులవాడు లోకాలకాది
దేవుడే-మన పార్వతీదేవికొడుకు
చిట్టెలుక నెక్కి నేడు వేంచేసినాడు
అక్కరో! అర్ఘ్యపాత్ర మిట్లందుకొనవె!!

★

తిలకమ్ముగా దిద్దితీర్చిన నుదుటి జా
బిలిరేక తరిపి వెన్నెలలు గాయ
జలతారు పూలకుచ్చుల వల్లెవాటుతో
త్రాచుజందెములు దోబూచులాడ
పసుపునిగ్గులనీను పట్టుకుచ్చెలచెంగు
మురిపెంపుపాదాల ముద్దుగొనగ
కొలుచు ముప్పదిమూడుకోట్ల దేవతలపై
చల్లనిచూపు పచారుసేయ
ముజ్జగములూగు చిన్నారి బొజ్జతోడ
గౌరికొమరుడు కొలువు సింగారమయ్యె
జాగుచేసినచో లేచి సాగునేమొ
చెల్లెలా! తెమ్మ పువ్వుల పళ్లెరమ్మ!!

★

వలిపంపు పట్టుదువ్వలువ లక్కరలేదు
పసుపుగోచీకె సంబ్రాలుపడును
లడ్డూమిఠాయి హల్వాల గోడేలేదు
బియ్యపుండ్రాళ్లకే చెయ్యిజాచు
ముడుపుమూటల మ్రొక్కుబడులతో పనిలేదు
పొట్టిగుంజిళ్లకే పొంగిపోవు
కలికి తురాయీలకై తగాదాలేదు
గరికపోచకె తలకాయత్రిప్పు
పంచకల్యాణికై అల్కపాన్పులేదు
ఎలుకగుఱ్ఱానికే చంకలెగురవేయు
పంచభక్ష్య ఫలాహార కించలేదు
పచ్చివడపప్పుదిను వట్టి పిచ్చితండ్రి.

★

వలిమల తాతయ్యపిలిచి ముద్దాడుచో
ముసలిగడ్డము గుంజుముద్దుచేయి
కథలుచెప్పెడు నాన్నగారిపై కెగబ్రాకి
సిరసుచందురులాగు చిలిపిచేయి
తల్లిచంకెక్కి పాల్ద్రావుచు నావైపు
చంటిపై తారాడుకొంటెచేయి
కదనరంగమునందు గజదైత్యకంఠమ్ము
కత్తిరించిన మొనగాడుచేయి
ప్రీతినిండార భక్తులర్పించుకుడుము
లుండ్రములు బొజ్జకెగవేయు గండ్రచేయి
పార్వతీబాయి ముద్దులబ్బాయిచేయి
తెలుగుబిడ్డల భాగ్యాలుదిద్దుగాక.

హైందవాచారాలలో విజ్ఞానం

స్నానం

పూజ

వసంత

ఇల్లు, ముంగిలి పెరడు శుభ్రమొనర్చినతరువాత గృహిణి స్నానం చేయవలెనని విధి. దైవారాధనకు పూజాద్రవ్యం గృహిణి ఆయిత్తమంచేసిన అనంతరము గృహమేధి సుస్నాతుడై నిత్యాహ్నికములు యథావిధి నిర్వహించవలెను. ఈ రెండు ప్రధానవిధులను పాటిస్తూన్నవారి సంఖ్య అత్యల్పమని నిస్సందేహంగా చెప్ప వచ్చును. జీవితంలో వాటి ప్రాబల్యం గుర్తింపలేని కారణం చేనైతేనేమి, కాయక్లేశానికి సమ్మతింపకైతే నేమి ప్రాతఃస్నానం, దైవరాధనం చాలావరకు మనం విసర్జించి జాతియొక్క నైతికబలాన్ని ఘోరంగా అంత రింప చేస్తున్నాం. ఇట్టి ఆధ్యాత్మిక ప్రమత్తత నానాటికీ ఝురీవేగంతో వ్యాపిస్తూ, కీళ్లూడదీసి, నిర్వ్యా పారత్వం తెచ్చిపెట్టి జీవితలక్ష్యాన్ని మఱుగుపరుస్తూంది. ప్రాచీనాచారాలను, విధులను లఘుభావంతో క్రీగంటచూచే మహానుభావులు నేటికిని వీటినిస్వల్ప విషయాలుగా భావించి కొందరివ్యక్తుల జీవితాలను హృద యంలో విమర్శిస్తూ "వీటినిపాటించక పోయినంతమాత్రాన దోషమేముంది? ప్రపంచంలో సత్పురుషుల జయంలేదు. ఫలానావారు ఎంతెంతదుండగాలు చేస్తూన్నా గౌరవంగా, సుఖంగా జీవించడంలేదా?" అని వితర్కించుకూంటారు; ఆత్మవంచనకు మరీ దాసులౌతారు. ఈ ప్రకారంగా విషమచక్రంలో భ్రమిస్తూ, ఈ మిథ్యాభావాలని ప్రచారంచేస్తూ వారివంశాలను, సంఘాన్ని అధోగతి పాలుచేస్తారు. దానిఫలితం భావ దాస్యం, నైతిక వైరూపం.

జాతియొక్క ధీవైశాల్యాను గుణ్యంగా, దేశంయొక్క భౌతికావస్థల కనుకూలంగా నియమాలు ఆచారాలు ఏర్పరుపబడి ఉంటాయి. ఆచారాలేకావు, కట్టేబట్ట, తినేతిండి, అనుకరించేపద్ధతి దేశదేశానికి వేరువేరుగానుంటాయి. అవి ఒక్కొక్క జాతియొక్క ప్రత్యేకతని సూచిస్తాయి. అసత్యంగమనించక కాల ప్రవాహంలోబడి కొట్టుకుపోతూ సనాతనాచార విసర్జనంచేయడం మహా శోచనీయం.

ప్రాతస్స్నానం, దైవారాధనం; వీటి ముఖ్యోద్దేశమేమైయుంటుంది అను విషయం అవశ్యవిచార ణీయం. మొదటిది శౌచంకొఱకు రెండవదీ శౌచంకొఱకే; మొదటిది బహిశ్శుద్ధి, రెండవది ఆత్మశుద్ధి. గృహ పరిసరం, గృహం ఆరోగ్యప్రదంగా శుద్ధిచేసుకుని, మానవుడు స్వశరీరాన్ని, అంతరాత్మని శుచిర్భూతం గావించుకోకపోతే జీవితం దుఃఖభాజనమైపోతుంది. అయితే, ఈ ప్రక్షాళనం అనుదినంచేయవలసిన అగత్యమేమి అని కుశ్శంక బయలుదేరవచ్చును. ఒక ప్రదేశంగాని, వస్తువుగాని, శరీరంగాని, మానసంగాని ఏదైనాసరే అనుక్షణం మలీమసమొందు లక్షణంగలది, గాలికిరేగినదుమ్ము వస్తువులమీద పడుతూ ఉంటుంది. మానవ శరీరంలో తయారగుచుండు మలినపదార్థాలలో చెమట చర్మరంధ్రాలనుండి పైకిపోయింది. అగుట, శరీరాన్ని నిర్మలంగా నుంచాలంటే రోజుకొకస్నానం న్యాయంగా చాలనేచాలదు. అయినప్పటికి నిద్రబడలికతీర్చుకొని నిశితబుద్ధితో దైనందినకార్య కలాపం నిర్వహించుకోడానికి ప్రాతస్స్నానం ఎంతయినా అవసరం.

ఆ స్నానం సూర్యోదయమగుచుండగా చేయడం శ్రేయస్కరం. అరుణభానుని లేలేతకిరణాలలో ఆరోగ్యదాయకమగు కిరణాలుకొన్ని గలవని పాశ్చాత్యవైద్యులు ఇటీవల కనుగొన్నారు. అట్టి కిరణస్పర్శయే ప్రకృతిసిద్ధమైన దివ్యౌషధం. చర్మరోగాలకు, శరీరంయొక్క సామాన్యారోగ్యతకు ఎంతోమంచిదని ప్రతీతి. ఆకారణంచెప్పకుండా, శరీరాభ్యున్నతికి ప్రాతస్స్నానం మంచిదనైనా తెలియజేయకుండా, నిత్యవిధులలో దానిని చేర్చడంచేత, ఇతర విధులతోపాటు ప్రాతస్స్నానంకూడా మనంపరిత్యజిస్తున్నాం.

ఇక, అంతశ్శౌచవిషయం బహుదీర్ఘమైంది, గంభీరమైంది. మానవునిశరీరంయొక్క మాలిన్యం తనకి పైవారికి తెలుస్తుంది; చిత్తమాలిన్యం విశదంగాదు. మలిన చిత్తంగలవారు లోలోనే కుళ్లి, దుఃఖానికి గురి అవుతారు; వారికి మనశ్శాంతిఉండదు, నిలకడఉండదు. అట్టివారెట్టికార్యమూ సాధించలేరు. ఏకముఖంగా వారి అంతశ్శక్తులు పనిచేయలేవు. ఆనందమయజీవనం వారికి స్వప్నానుభూతి వారిప్రయోజనం వారికేలేదు. సంఘానికి, దేశానికి వారుచేయగలసేవ స్వల్పం. తలపెట్టితే వారిఅనుచరులని చెడుమార్గాలు త్రొక్కించగలరు, సంఘంలో అలజడి కలిగించగలరు, అశాంతిబయలుదేరించగలరు. వారిజ్ఞానచక్షువులు మూసికొనిపోతాయి; జీవితచిత్రంలో సౌందర్యరేఖలు వారికిగోచరించవు. కాలోచితంగా అంతశ్శుద్ధి కావించుకొనకుండుటే ఇన్ని దురవస్థలకుమూలం.

అయితే అంతశ్శుద్ధికి ప్రాకృతికమైన స్థూలవస్తువులు పనికిరావు; వాటి ఉపయోగంలేదు. సబ్బుతో శరీరం,దంతచూర్ణంతో పళ్లూ తోముకొనినట్లు ఏపదార్థంతోను చిత్తాన్నితోమి మాలిన్యం వదలగొట్టలేము. రూపరహితమైన చిత్తాన్ని రూపరహితమైన శక్తితోనే శుద్ధిచెయ్యాలి; అనుదినమూ శుద్ధిచెయ్యాలి.

హృదయాన్ని ఏఒక్కవిషయంపై లగ్నంకానీయకుండా, పరిపరివిధాల పరుగెత్తించేదే హృదయ మాలిన్యం. అట్టి చిత్త చాంచల్యాన్ని ఎప్పటి కప్పుడు వారించుటే శుద్ధి. అంటే, హృదయదౌర్బల్యం అరికట్టి ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవాలి—అది భయభక్తులచే సాధ్యమౌతుంది. మానవాతీతములగు విశ్వశక్తులు సృష్టిస్థితిలయకారణాలనీ, వాటినారాధించి వాటియనుగ్రహంచేతనే అభీష్టసిద్ధి పొందవచ్చునని మానవుడు గ్రహించేడు. అయితే అగోచరశక్తులనుతోడి సామాన్య మానవులు ఊహించలేరని, వాటికే 'దైవ' మని అనేకమైన పేర్లుపెట్టేరు; విగ్రహరూపంతో ఇంటింటనెలకొలిపి, విగ్రహారాధనం ప్రోత్సహించేరు. భక్తిమార్గం సర్వజనానుమోదంగా నుంటుందని నిరంతరభ్యాసంచే చిత్తస్థైర్యం అలవడుతుందని భగవదారాధన అనుదినం నిర్ణయించేరు.

సర్వోత్కృష్టమైన పరమస్వరూపాన్ని, సర్వవ్యాప్తమగు అదృశ్యశక్తిని దినదినం స్మరించుకొని దీక్షతో ఆరాధించుకొంటే ఆరాధకుని అల్పత్వం అప్పుడప్పుడైనాస్ఫురించి చిత్తశుద్ధి కలిగిస్తుందన్న విశ్వాసంతో దైవారాధన కంత ముఖ్యస్థానంఇచ్చేరు. అంతేకాదు అట్టిఆరాధన స్థిరచిత్తంతో చేస్తూన్నంతకాలం మన శ్శక్తి పెంపొందుతూనే ఉంటుంది. ప్రవర్ధమానంగానున్న మనశ్శక్తి సర్వవిధములా ప్రయత్నసిద్ధిచేకూరుస్తుంది. ఈప్రకారంగా, అనుదిన దైవారాధన చిత్తస్థైర్యం, మనశ్శక్తి, కార్యసాధనానికి ఏకముఖంగా తనశక్తుల నన్నిటిని నియోగించు సామర్థ్యం ఆరాధకునికి అలవడజేస్తుంది.

ఈవిషయం మనప్రాచీనగ్రంథాలు వేనోళ్ల ఘోషిస్తున్నా మనకు నమ్మకములేదు. ఈ భౌతికవిజ్ఞాన యుగంలో మనఃతత్త్వంగూర్చి ప్రాచీన శాస్త్రాలుచెప్పినది రుచించడంలేదు. అయితే ఈవిషయంగూర్చి భౌతికవిజ్ఞానం ఎట్టిసూచనలచేయగలదో పరిశీలించి మనఅవిశ్వాసం తగ్గుతుందేమో చూద్దాం.

(ఇంకావుంది.)

సమతయు దమముదితిక్షయు నమత్సరము హ్రీయు ననసూయార్యత్వములు।
నహింసాదానక్షమాత్యజన సూనృతములు సత్యము మూర్తుల్॥

సమత్వము, ఇంద్రియ నిగ్రహము, ఓర్పు, క్రోధములేక యుండుట, సిగ్గు, అసూయలేమి, అహింస, దానము, త్యాగము ఇవి సత్యస్వరూపములు.

—మహాభారతము.

గ్రంథ సమీక్ష

సంస్థాన సమస్యలు

కర్త: శ్రీ భోగరాజు పట్టాభి సీతారామయ్యగారు. అనువాదకులు: శ్రీ జానపాటి సత్యనారాయణగారు. ప్రకాశకులు: శ్రీ దేశోద్ధారక గ్రంథమాల, సికింద్రాబాదు. వెల ఆరు అణాలు.

డా॥ పట్టాభి సీతారామయ్యగారి, కటకంలో జరిగిన ఒరిస్సా సంస్థాన ప్రజల ప్రథమ మహాసభాధ్యక్షోపన్యాసము, బెంగుళూరు ఉపన్యాసము దీనిలో వున్నాయి. సంస్థానప్రజల హక్కులు, సంస్థానములకు సామ్రాజ్యమునకు వున్న అవినాభావ సంబంధాలు మొదలైనవి ఆమూలాంతంగా చర్చింపబడ్డాయి వీటిలో. అనువాదం మాతృకకు వన్నెతెస్తోంది.

కాంగ్రెసు—సంస్థానములు

ఇదికూడా శ్రీ డా॥ పట్టాభి సీతారామయ్యగారి ఉపన్యాసమే. అనువాదకులు: శ్రీ జానపాటి సత్యనారాయణగారు. ప్రకాశకులు: శ్రీ దేశోద్ధారక గ్రంథమాల, సికింద్రాబాదు, వెల ఆరు అణాలు.

1939 లో 'నవసారి'లో జరిగిన అఖిలభారత సంస్థాన కార్యకర్తల సమావేశములో ఇచ్చిన అధ్యక్షోపన్యాసమును ఆంధ్రీకరణంచేసి యీ పుస్తకరూపముగా ప్రకటింపబడింది. అఖిలభారత కాంగ్రెసుకును, సంస్థానములకును వున్న సంబంధములు విపులముగా విశదీకరింపబడ్డవిందులో. ముఖ్యముగా ప్రతి సంస్థానమునందును రాజకీయచైతన్యము ఎట్లకలిగినదో, దానినెట్లు అభివృద్ధిచేయవలెనో చక్కగా వ్రాయబడినది.

ఈ రెండు పుస్తకాలు సంస్థానముల సందర్భంలో కావలసినంత విషయాన్ని చదువరులకు సమకూరుస్తున్నాయి. ఇట్టి ఉత్తమ గ్రంథప్రచురణకు పూనుకొన్న దేశోద్ధారక గ్రంథమాలవారు ఎంతయు ప్రశంసనీయులు.

ఆంధ్రవీరకుమార శతకము

కర్త: శ్రీ బి. యస్. మూర్తిగారు, 68, మెడాక్స్ వీధి, వేపేరి, మద్రాసు. వెల నాల్గు అణాలు.

శ్రీ బెజవాడ గోపాలరెడ్డిగారు దీనికి తొలిపలుకు వ్రాశారు.

ఆంధ్రభాష, ఆంధ్రమహాకవులు, ఆంధ్రక్షాత్రము, ఆంధ్రమహాపురుషులు, ఆంధ్రుల దేశభక్తి ఆంధ్ర నారీమణులు మొదలైన వివిధ మకుటాలతో ఆంధ్రజాతియొక్క ఔన్నత్యాన్ని, ప్రత్యేకతని చక్కని పద్యాలలో గానంచేశారు కవిగారు. ప్రతి పద్యములోను కవిత్వపు సొరు, భావముయొక్క గాంభీర్యము చిప్పిలుతూవుంది. శ్రీ మూర్తిగారి కవితలో ప్రాచీనుల గాంభీర్యము, ఆధునికుల హృద్వేగము చక్కగా మిళితమై ఒక క్రొత్త పోకడ ముఖరితమౌతుంది. దానికీశతకమే తార్కాణము.

కమ్మతెమ్మెరలు

ఆంధ్రకేసరి గ్రంథమాలవారి ప్రథమ ప్రచురణము. వెల నాలుగణాలు. చిరునామ :178 సుల్తాన్ బజారు, హైద్రాబాదు, దక్కను.

'నిప్పులం,' 'మాబావ,' 'ఎందుకు' మొదలైన 10 కథలుగల సంపుటి ఇది. కథలు మంచి రసవంతంగా వున్నాయి. రచనావిధానంలో వ్యావహారిక భాష సొంపుమీరి నైజామాంధ్రపుత్రుల వ్యావహారిక తెలుగురచనకు వన్నెతెస్తోంది. ఈ పుస్తకం అన్నివిధములా సంపాదకుల ఆశయాలను ప్రదీపనము సూరుస్తోంది.



గోధుమలుతో తయారుచేయదగిన వివిధ పదార్థములు—3.

కరాచి కోవా

2 గ్లాసుల పంచదార లేతపాకం పట్టవలెను. దానిలో 1 గ్లాసు గోధుమపిండిని చల్లుతూ గరిటితో కలుపవలెను. 10 నిమిషములకు తగుమాత్రం నెయ్యి కరగపెట్టిపోసి కొంచెము ఏలకపొడివేసి 5 నిమిషములకు దింపి పళ్లెంలో పెట్టవలెను.

మైసూరు చిప్స్

1 పంపు గోధుమపిండి ½ పంపు శనగపిండి కొంచము జీలకర్ర, వుప్పు కలపిన కారం వీటిని 1 గరిట పెరుగుతో నీరుపోసి చిక్కగ కలుపవలెను. 4 బంగాళాదుంపలు గుండ్రని రేకులవలె తరిగి, ముక్కలను పిండిలోముంచి చమురులోవేసి వేయించి తీయవలయును.

గోధుమ అన్నం

అరపడినీరు సలసలకాగిన తరువాత 2 ఆళాకులు గోధుమనూకనుపోసి, పై నీటిని వార్చవలెను. 10 నిమిషములు నిప్పుమీదవుంచి దింపవలెను.

గులాబీ పువ్వులు

ఒకగ్లాసు గోధుమపిండిని నీటితో కొంచం చిక్కగా కలుపవలెను. గులాబీపువ్వుమాదిరి ఇనప చట్రంపిండిలో ముంచి కాగిన నేతిలో ముంచవలెను. వేగిన తర్వాత పంచదార లేతపాకంపట్టి దానిలో వేయవలెను.

బాదం హల్వా

1 శేరు పాలలో ½ శేరు గోధుమపిండిని కలిపి పొయ్యిమీదపెట్టి గరిటెతో కలుపుతూవుండవలెను. పావుగంటకు తగుమాత్రం నెయ్యి, బాదంపప్పు, వేయించిన జీడిపప్పు, ఏలకపొడివేసి 10 నిమిషములకు దింపి పళ్లెంలోపెట్టి, కొద్దిగా కాచిన నెయ్యి పైనపోయవలెను.

స్వీట్‌స్టార్స్

1 ఆళాకు గోధుమనూకను నెయ్యిలో వేయించవలెను. 10 నిమిషములకు 1 ఆళాకుపాలు 1 ఆళాకు నీరు 1 ఆళాకు పంచదార వేసి 15 నిమిషములు వుడకనిచ్చి ఏలకపొడి వేసి దించి చల్లారినతర్వాత గచ్చకాయలంత వుండలుచేసి వుంచవలెను. 1 ఆళాకు గోధుమపిండి గట్టిగాకలిపి అర్థణాఅంత బిళ్లచేసి రవతోచేసిన వుండను పెట్టి పైన పిండినిసర్ది అంగుళం దళసరి పూరీవలె పీటమీద వత్తవలెను. బిళ్లలను నేతిలోవేసి వేచిన తరువాత తీయవలెను.

వెన్న బిస్కట్లు

1 గ్లాసు గోధుమపిండి 1 గ్లాసు పంచదార ½ గ్లాసు గోధుమనూక 4 తులములవెన్న వీటిని తగ పాలతో గట్టిగాకలిపి ½ అంగుళం దళసరి రూపాయంత బిళ్లలుచేసి, ఒకపళ్లెమునకు నెయ్యిరాచి దానిలో వరుసగా పెట్టవలెను. ఒక ఇనపబాణలిలో ఇసుకనువేసి బాగా వేడిచేసి బిస్కట్లున్న పళ్లెమును ఇసుకపైన పెట్టి కొంచం మంట వుంచవలెను. అరగంటకు దింపవచ్చును.

గోధుమ కాఫీ

గోధుమలు వేయించి మెత్తగావిసిరి జల్లించవలెను. ఒక గ్లాసునీరు మరగపెట్టి 1 చంచా గోధుమలు విసిరిన పొడివేసి వడపోసి 1 గ్లాసు కాచిన పాలలో కలిపి 1 చంచా పంచదార వెయ్యవలెను.

ఒబ్బట్లు

ఒకశేరు గోదుమపిండి ఒక చిటికెడు ఉప్పువేసి నీటితో కొంచెం గట్టిగా కలపవలెను. ఒకశేరు శనగపప్పు వుడకపెట్టి వార్చవలెను. ఒకశేరు బెల్లప్పొడి వేసి పప్పును మెత్తగారుబ్బి ఏలకపొడివేసి కలిపి నిమ్మకాయంత వుండలుచేయవలెను. నిమ్మకాయంత గోదుమపిండి అరచేతిలో బిళ్లచేసి పూర్ణపు వుండపెట్టి పైపిండిని చుట్టూసర్ది, అరటిఆకులో వేసి కొంచెం దళసరిగ చేతితో వత్తవలెను. పెనం కాలినపిదప కొంచెం నూనివేసి ఒబ్బట్టును పెనంమీదవేసి వేగినయడల తిరగవేసి తీయవలెను.

గోధుమ అట్లు

¼ శేరు గోదుమపిండి ¼ శేరు బెల్లంపొడి 1 కొబ్బరికాయను కోరి అన్నీ నీటితోకలిపి అట్లు పోయవలెను.

డింకీలు

1 అళాకు గోధుమపిండి 1 అళాకు బియ్యంపిండి 1 చంచా వాము,ఉప్పువేసి, నీరుపోసి గట్టిగా కలిపి కవిరి ముక్కవలె పలకలుగా చేసి, నేతిలో వేయించవలెను.

రవబజ్జీ

½ శేరు గోధుమరవ ½ శేరు గోధుమ పిండి కొంత ఉప్పు, జీలకర్ర, కొంచం కారం వీటిని మజ్జిగతో గట్టిగా కలపవలెను. నెయ్యిగాని నూనెగాని కాగనిచ్చి పిండిని చిన్న చిన్న బిళ్లలుచేసి చమురులో వేసి వేయించి తీయవలెను.

—సి. హెచ్. అన్నపూర్ణాబాయి,

వాంగీభాత్

½ శేరు గోధుమనూకను ఎసరులోవేసి కొంచెము బిరుసుగావుడికించి వార్చవలెను. ½ గిద్దడు శనగపప్పు, ½ గిద్ద మినపప్పు, ½ గిద్ద ధనియాలు, కొంచెము లవంగపట్ట, బిరంజిఆకు, 4 ఏలక్కాయలు, 6 లవంగములు, 1 మరాటమొగ్గ, వీట్లను వేరువేరుగా వేయించితీసుకొనవలెను. చిటికడువుప్పువేసి, అన్నిటిని మెత్తగా గుండజేయవలెను. కొంచెము జీడిపప్పు నేతిలో ఎఱ్ఱగావేయించి తీసుకొనవలెను. కొంచెము మినపప్పు, కొంచెము శనగపప్పు, కొంచెము ఆవాలు, 2 ఎండుమిరపకాయలు, కరివేపాకు, పోవుపెట్టి, దానిలో 10 ఫలముల వంకాయముక్కలు తరిగివేసి, 1 చంచా వుప్పును, చిటికడు పసుపుగుండనువేసి మూత వుంచవలెను. ముక్కలు 3 వంతులు చమురులో మగ్గినతర్వాత, కొంచెము నీరుపోసి, అరబద్ద నిమ్మరసముపిండి, ముక్కలనువుడికించి, వార్చిన గోధుమనూకలోవేసి, జీడిపప్పును, 1 చిప్ప కొబ్బరికోరునువేసి బాగాకలపవలెను. సన్ననిప్పుమీద 5 నిమిషములు వుంచవలెను.

స్వీట్ కట్‌లెట్సు

½ శేరు గోధుమపిండిని ముద్దగాతడపవలెను. 10 ఫలముల చిలగడదుంపలను వుడికించి, తోలు వలచి, కొద్దిగాఉప్పువేసి ముద్దగాపిసకవలెను. పైగోధుమపిండిని దళసరిగా, వెడల్పుగా పూరీలువత్తి దానిలో వుడికించిన ముద్దనుపాదెపి, చుట్టలుచుట్టి, చాకుతో ముక్కలుకోసి, నేతిలో ఎఱ్ఱగావేయించితీసి, అన్నిటినీ బూరాపంచదారలో పొర్లించి తీయవలెను.

పేణీలు

½ వీశ సన్నగోధుమనూకను తడిపి 6 గంటలు నానినతర్వాత దానిని ½ గంటసేపు బాగా మర్దన చేయవలయును. తర్వాత, దానిని పూరీలువత్తి దానిమీద వెన్నగాని, పేరిన నెయ్యిగాని రాచి, మడతలుగా మడిచి, మరల పూరీవత్తి నెయ్యిలోవేయించి తీసి, ఒక్కొక్కపూరీమీద మెత్తని పంచదార చల్లవలెను.

పెరుగు పొంగడములు

¼ శేరు పెరుగులో 1/3 శేరు గోధుమపిండిని, కొన్ని పచ్చిమిరపకాయల ముక్కలను, కొద్దిగా అల్లంముక్కలు, కరివేపాకు, ఒకచంచా వుప్పును యిష్టమున్నపక్షమున, 2 వుల్లిగడ్డలను సన్నగాతరిగి, చేర్చి జారుగా కలపవలెను. బాణలిలో, 2 చంచాల నెయ్యిగాని, నూనెగానిమరగించి, ఒక్కొక్క పొంగడమునుపోసి వేయించి తీయవలెను.

చప్పిడి పొంగడములు

½ శేరు గోధుమ పిండిలో 1 చిప్ప కొబ్బరి కోరును, ఒకచంచా వుప్పును, ½ గిద్దడు తెల్ల నువ్వులను వేసి జారుగా కలిపి, బాణలిలో కొద్ది చమురులో పొంగడములు పోసి వేయించి తీయవలెను.

తీపు పొంగడములు

1 వంతు గోధుమ పిండి, 1 వంతు బెల్లముగుండ కాని లేక పంచదార గాని కలిపి, తగుమాత్రం జీడిపప్పు, ద్రాక్ష, ఏలకాయల పొడి, కొంచము కుంకుమ పువ్వును గోధుమ పిండిలో వేసి, కొద్ది జారుగా నీళ్లతో కలపవలెను. రెండేసి చంచాల మరగిన నేతిలో ఒక్కొక్క పొంగడమును పోసి, వేయించి తీయవలెను.

లవంగ త్రికోణము

½ శేరు గోధుమ పిండిని ముద్దగా తడవవలెను. ½ శేరు గోధుమనూకను, నేతితో వేయించి తీయవలెను. తగుమాత్రం జీడిపప్పును, ద్రాక్షను, సారపప్పును, ఏలకాయల పొడిని కొంచెము కుంకుమ పువ్వును వేసి గోధుమనూకను మెత్తగా దంచవలెను. పై గోధుమపిండిని పూరీలు వత్తి దానిలో దంచిన నూకను పొదిపి ముక్కోణముగా మడిచి, ఒక్కొక్క దానికి, ఒక్కొక్క లవంగమును గ్రుచ్చి, వేయించి తీసి ½ వీశ పంచదారను తీగె పాకము పట్టి, దానిలో వేయవలెను. జీరాలో కొంచెము ఎసెన్సున్నూ, కొంచెము రంగును (పసుపు రంగును) వేయవలెను.

బర్ఫీ

1 వంతు గోధుమ పిండిని, కమ్మగా వేయించి తీసుకొనవలెను. 1 వంతు పంచదారను కొద్ది నీళ్లతో పొయ్యిమీద వుంచవలెను. పంచదార కరిగిన తర్వాత తోలువలచిన బాదంపప్పు ముక్కలను, సారపప్పును, 1 స్పూను ఎసెన్సును, ఎర్ర కలరును కొంచమును, కరగిన పంచదారలో వేసి గోధుమపిండిని పోసి కలుపుతూ తగుమాత్రం నెయ్యిని పోసి బాగా కలిపి, ముద్ద అవగానే పళ్లెములో ఆరపోసి ముక్కలు కోయవలెను.

గోధుమ కీరు

¼ శేరు గోధుమనూకను నెయ్యితో ఎర్రగా వేయించ వలెను. ¾ శేరు చిక్కని పాలను మరిగించి దానిలో నూకను వేసి ఏలక్కాయల పొడిని, జీడిపప్పును, ద్రాక్ష పండ్లను, బాదంపప్పు ముక్కలను సారపప్పును వేసి, కుంకుమ పువ్వును కొద్దిగా పాలతో కలిపి, 1 స్పూను ఎసెన్సును వేసి మరుగుచున్న పాలలో వేయవలెను. గోధుమనూక వుడికిన తర్వాత తగినంత నెయ్యిపోసి, పంచదార వేసి, కలిపి దించవలెను.

కొబ్బరిపాల పూరీ

½ శేరు గోధుమపిండిని తడిపి, చిన్నచిన్న పూరీలు చేసి నేతిలో వేయించి తీయవలెను. 3 కొబ్బరి కాయలను చిక్కగా పాలుతీసి దానిలో ¼ శేరు పంచదార వేసి బాగా మరిగించి దానిలో పూరీలను వేయవలెను.

—ఇమ్మానేని సావిత్రమ్మ

రచయిత్రిలకు బహుమానము

గోధుమ ధాన్యముతో చేయదగిన పలువిధములైన పదార్థములను, గత రెండు మాసములలో రెండు పట్టీలయందు ప్రకటింపబడినవిగాక, ఎక్కువపదార్థములను వ్రాసివంపినవారికి ఒక బంగారుపతకము బహూకరింపబడును. వెనుక గృహలక్ష్మి లో ప్రకటింపబడిన వాటినికూడ ఎత్తి వ్రాయగూడదు.

సంపాదకుడు.

పుష్పచయము * * *

★ ఇప్పటి నియంతలు గత ప్రపంచమహాయుద్ధ (1914) సమయంలో ఏంచేస్తున్నారు?

హిట్లరు:—వస్తుప్రకటనలకు (ఎడ్వర్టైజుమెంట్లు) బొమ్మలు వ్రాసుకునేవాడు.

డలాడియరు:—ఫ్రాన్సులోని కండోర్సెట్ కాలేజీలో హిస్టరీ ప్రొఫెసర్ గా వుండేవాడు.

చాంబర్లెయిన్:—బర్మింగ్ హాము పురపాలకసంఘానికి మేయరుగా వుండేవాడు.

ముసోలిని:—'లా-అవన్‌తి' అనే సామ్యవాద పత్రికకు ప్రధాన సంపాదకుడుగా వుండేవాడు. అప్పుడే రాజకీయసంబంధంగా జైలులోకూడా వున్నాడు.

స్టాలిన్:—సైబీరియాలో సర్కారు ఖైదీగా చాలాబాధలు పడుతున్నాడు.

ఫ్రాంకో:—'రిఫ్' దేశంలో ఒకచిన్న సిపాయిజట్టుకు పెద్దగావుండేవాడు.

పెటియన్:—'కొలోనల్'గా పనిచేసి పెన్‌షన్ పుచ్చుకుందుకు దరఖాస్తు పెట్టుకున్నాడు. ఇంతలోయుద్ధం ప్రారంభమైనందువల్ల పెన్‌షన్ ఇవ్వబడిందిగాదు.

ఈడెన్:—ఫ్లాండర్సులో వాలంటీరుగావున్నాడు.

లిట్వినాఫ్:—లండన్ నగరంలో వీధులంటతిరుగుతూ చిల్లరవస్తువులు అమ్ముకొనేవాడు.

రిబ్బన్ ట్రాప్:—అట్టావానగరంలో బ్రాందీషాపు పెట్టుకున్నాడు. 'రేడియోలాన్ టెన్నిస్ క్లబ్బు'లో సేవకుడుగా కూడా పనిచేశాడు.

★ స్త్రీ హితైషిణీమండలి - బాపట్ల

ఈ మండలియొక్క నవమవార్షికోత్సవము జూలై నెల 28, 29, తేదీలలో ఈ పురమునందలి యువతీ విద్యానిలయ ప్రధానోపాధ్యాయినియగు శ్రీమతి సి. లక్ష్మమ్మ బి.ఏ.యల్.టి.గారి అధ్యక్షతక్రింద యువతీ విద్యానిలయ భవనములో నత్యంత జయప్రదముగా జరుపబడినది. 28.వ తేదీ ఆదివారము నాల్గుగంటలకు దైవప్రార్థనతో సభ ప్రారంభమైనది. పిమ్మట అధ్యక్షురాలు ప్రారంభోపన్యాసము గావించిరి. పిమ్మట శ్రీమతి ఉభయభాషాప్రవీణ ఊటుకూరి లక్ష్మీకాంతమ్మగారు ఉపన్యసించుచు 'తలయొక సంస్థను స్థాపించి యేదియును పైకి రాకుండచేయుటకంటె ఒకే సమాజమున కందఱు అన్ని విధముల తోడ్పడి తమ తమ అభిరుచికి అనువైన అన్నిశాఖలను ఆ సమాజమునందే నెలకొల్పి వృద్ధికి తెచ్చుట శ్రేయస్కర'మని ఉద్బోధించిరి. తరువాత శ్రీమతి దేశిరాజు భారతీదేవిగారు మండలి నాశీర్వదించుచు వ్రాసిన పద్యములు చదువబడెను. పిమ్మట ప్రధాన కార్యదర్శినిచే మండలి నవమ వార్షికనివేదిక చదువబడెను. అనంతరము ఆర్కెస్ట్రా జరుపబడెను. ఆర్కెస్ట్రాలో శ్రీమతి ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ, కోడే వెంకటసుబ్బమ్మగార్లు వీణెయు, శ్రీమతి గట్టుపల్లి తాయారమ్మగారు ఫిడేలును, పురుషోత్తమరావు అను 2.వ ఫారం విద్యార్థి కంజీరాయును వాయించిరి. శ్రీ నటకావతంస స్థానం నరసింహారావుగారి సోదరి సత్యాదేవిగారు గాత్ర పాటపాడిరి. పిదప బాలికలు కొందఱు 'లాటరి' అను హాస్యరస ప్రధానమగు ప్రదర్శనము గావించుటతో నాటి కార్యక్రమము ముగిసెను.

మఱునాడు 29-7-40 సోమవారం సాయంత్రము 5 గంటలకు దైవప్రార్థనతో మరల కార్యక్రమము ప్రారంభమయ్యెను. బాలికలు మండలి పతాకవందనము గావించిరి. అధ్యక్షురాలి ప్రారంభవాక్యము

లైన తరువాత బాలికలు కొందఱు 'సెట్టిగారి ఉపాయము'ను హాస్యమును ప్రదర్శించిరి. తదుపరి శ్రీయుత స్థానం నరసింహారావుగారి యేకైక పుత్రిక చి॥ సావిత్రి అను అయిదేండ్ల ముద్దుబాలిక తెలుగు హిందూస్థానీ కీర్తనలను తన మృదుమధురమగు చిన్న గొంతుకతో పాడి సభవారి నెంతయు రంజింప జేసెను. తదుపరి సత్యాదేవిగారు బుల్ బుల్ ను, శ్రీమతి కోడే వెంకటసుబ్బమ్మగారు వీణను, అత్యంత మనోహరముగా వాయించిరి. తదనంతరము యిరువురు బాలికలు డ్యాన్సును, మఱికొందఱు బాలికలు 'ప్రమద్వర' అను నాటకమును అత్యంత మనోహరముగా ప్రదర్శించిరి. ప్రదర్శనానంతరము ఆర్సెస్టా జరిపిన వారికిని ఆటలలో పాల్గొనిన బాలికలకున్, వెండిగిన్నెలు, బరిణెలు, యిత్తడిబొట్టు పెట్టెలు బొమ్మలు, సబ్బుపెట్టెలు, ఫౌంటెనుకలములు, పుస్తకములు వగైరాసామానులు బహుమానముగా నీయబడెను. ఆకర్షవంతమైన నీ కార్యక్రమమును తిలకించుటకు పురస్త్రీలు తండోపతండములు వచ్చిరి.

—కనుపర్తి వరలక్ష్మమ్మ.

★ స్త్రీలకు ఉచితవిద్య

సెకండరీ పాఠశాలలలో చదువు స్త్రీలు జీతములుకట్ట నవసరములేదని పుదుక్కోట సంస్థానాధీశులు ప్రకటించారు.

★ శ్రీ ఆంధ్రభాషాభి. వర్ధినీ గ్రంథాలయము, జయపురము

ఉత్కళ రాష్ట్రమునగల యీ జయపురమున ఆంధ్రభాషాభివృద్ధికై స్థానికవర్తక మహాశయులు ఆంధ్ర గ్రంథాలయమును పఠనమందిరమును 28-10-1939 న నెలకొల్పిరి.

భాషాభివృద్ధికై బాల బాలికల కుపన్యాస పోటీపరీక్ష మాసమునకొకసారి జరుపుచున్నారు. మరియు గతమాసమునుండి సంగీత పోటీపరీక్షకూడ ప్రారంభింపబడినది. ఉత్కళరాష్ట్రమునకు చేరిన ఆంధ్రుల భాషాభివృద్ధికిది ఎంతయు దోహద మొనర్పగలదు.

జ్వర విషయములు

స్వస్థత జెందుటకు ఆహారము ముఖ్యముగా తోడ్పడును. శాస్త్రపరిశోధకులు జ్వరమును గురించి నూతన విషయములను తెలియపరచినారు. అదే మనదేహ ఉష్ణము హెచ్చుట, సహించలేని తలనొప్పి వణకుసంతట బలి మొదలగునవి జ్వరచిహ్నములు. జ్వరవిషము రక్తమునందు కలసి నరకండరములలో ప్రవేశించి మనుష్యుని బలహీనునిగా చేయును.

పూర్తిగా స్వస్థతచెందుటకు పూర్వము అలసిన అవయవములను తిరిగి అభివృద్ధిచేయుట ఆవశ్యకము. అందుకుగాను గట్టిగానుండు సర్వసాధారణ ఆహారము పనికిరాదు. కారణము కడుపు నీరసముగానుండి జీర్ణశక్తి లేకపోవుటచేత.

జ్వరపీడితులకు, హార్లిక్స్ శ్రేష్టమైన ఆహారపదార్థమని ఋజువుచేయబడినది. క్లిష్టసమయములందు హార్లిక్స్ తీసికొనుటవలన కడుపుకేవిధమైన బాధ కలుగదు. స్వస్థతపొందుటకు కావలసిన వస్తువులు దీనియందున్నవి. అనతికాలములో దేహారోగ్యమునిచ్చి నూతన యవ్వనవంతునిగా చేయును. సాధారణముగా అన్ని ఆస్పత్రులలోను హార్లిక్సును జ్వరబాధితులకు ఇచ్చు ఏర్పాటుచేసినారు.

సంపాదకీయములు

కామేశ్వరమ్మగారి అభిభాషణము

గతమాసము పోలవరములో జరిగిన తూర్పుగోదావరిజిల్లా మహిళామహాసభకు అధ్యక్షతవహించి, శ్రీమతి పెద్దాడ కామేశ్వరమ్మగారు తమ అధ్యక్షోపన్యాసములో ప్రస్తుత పరిస్థితులందు స్త్రీలయొక్క విద్యుక్తధర్మమునుగూర్చి చక్కగ ఉద్బోధించిరి.

నేడు సమాజములో ప్రబలముగానున్న పాశ్చాత్యానుకరణము కడు ప్రమాదమైనదనియు, స్త్రీలు ఎల్లప్పుడును జాతీయములైన భావములనే పెంపొందింపవలెననియు, భారత స్వాతంత్ర్య పోరాటములో వెనుకటివలెనే తిరిగి పాల్గొనుటకు సంసిద్ధులుగ నుండవలెననియు, ముఖ్యముగా దేశానర్థకరములైన జాతిభేదములను రూపుమాపుటకు స్త్రీలు పాటుపడవలెననియు—మొదలగు అమూల్య విషయముల గురించి ప్రబోధించుట ఎంతయు సమంజసముగను, సమయోచితముగను యున్నది.

వర్తమాన పరిస్థితులలో కామేశ్వరమ్మగారొసంగిన సలహాల ననుష్ఠించిననాడు స్త్రీ సమగ్రమైన విశ్వకుటుంబిని కాగలిగి తన విద్యుక్తధర్మమును నిర్వర్తింప జాలుననుట అతిశయోక్తికాదు.

కాని, ప్రతి సంవత్సరమును తాలూకా, జిల్లా, రాష్ట్రమహిళామహాసభలు జరుగుటయు, ఎవరో కొలదిమంది మహిళామణుల అధ్యక్షతను ఉత్తేజకరములైన ఉపన్యాసములును, తీర్మానములును జరుగుటయు మాత్రమే—గత కొలది సంవత్సరములుగా జరుగుచున్న విషయము. ఇంతదనుక ఆంధ్ర స్త్రీ లోకమునందు ఉపన్యాసములయందున్నంత సంస్కారముగాని, చైతన్యముగాని కనుపించదు. వారువారు చెప్పు విషయములు స్త్రీలలో కొంతమందికి అర్థముకూడ నగుటలేదన్న స్త్రీలలో ఎంత అవిద్య ప్రబలమైయున్నదో తేటపడగలదు.

స్త్రీలలో-ముఖ్యముగ పల్లెస్త్రీలలో-విద్యపూర్తిగ వ్యాపించినగాని యీ ప్రబోధములు ఫలవంతములుగానేరవు. నేడు మన మభిలషించుచున్న సర్వతోముఖాభివృద్ధి సమకూరవలెనన్న ముందు ఏదైన యొక నిర్మాణకార్యక్రమము నేర్పాటుచేసికొనవలసియున్నది.

పయోజన విద్యా ప్రచారమును, విజ్ఞానాభివృద్ధిని వ్యాపింపజేసి తద్వారా స్త్రీలలో సాంఘిక రాజకీయ చైతన్యము కలుగజేయ ప్రయత్నించవలయును. ఇందుకు ప్రతి గ్రామమందును మహిళాసమాజముల స్థాపించి, ప్రస్తుతమున్నవాటిలో జీవముపోసి, కార్యక్రమమును తీవ్రరూపమున అమలులోపెట్టి పాటుపడిన త్వరలో ఊహకందని మార్పు మనము పొందగలము.

ఇందులకు మనరాష్ట్రమందున్న ఉన్నత విద్యావతులైన స్త్రీ నాయకురాండ్రు ఒకచో సమావేశమై యీ కార్యక్రమము నేర్పాటుచేసికొనవలసియున్నది.

శ్రీమతి పెద్దాడ కామేశ్వరమ్మగారివంటి వనితామణులు ఇందుకు వెంటనే పూనుకొన్న యాశయములు అతి శీఘ్రముగ సఫలీకృతముకాగలవని ఘంటాపథముగ చెప్పవచ్చును.

ఈ విషయమై స్త్రీ నాయకురాండ్రు వెంటనే ప్రయత్నింతురా?

ఆంధ్రరాష్ట్రవిద్యార్థిసంఘము - స్త్రీ శాఖ

ఆంధ్రరాష్ట్రవిద్యార్థిసంఘములో స్త్రీ విద్యార్థి శాఖ నొకదానిని ఏర్పరచి, ప్రత్యేకముగా కృషి సల్పనెంచుట ఎంతయు అభినందింపదగిన విషయము.

మనరాష్ట్రములో ఉన్నతవిద్య నభ్యసించు స్త్రీలే చాలతక్కువ. ఉన్నవారికైనను తగిన ప్రోత్సాహము లభించుటలేదు. పాఠశాలయందును, పరిపాలనయందును ప్రస్తుత లోపభూయిష్టమైన పరిస్థితులే ఉన్నతవిద్య నభ్యసింప నాశపడు యువతులకు నిరుత్సాహము కలుగజేయుచున్నవన్న సత్యము దూరముగాదు.

యువతులకై ముఖ్యముగా ప్రత్యేక పాఠశాలలను నెలకొల్పవలసియున్నది. లేనిచో యువకులతో కలసి చదువుకొను పాఠశాలలయందు యువతులకు తగురీతిని సమస్త సదుపాయములను సమకూర్చవలసియున్నది.

స్త్రీలలో ఉన్నతవిద్య ప్రోత్సహించుటకై తగినన్ని 'స్కాలర్‌షిప్పుల' నొసంగుటకై ప్రభుత్వమును, ఆంధ్ర విశ్వకళాపరిషత్తువారును వెంటనే శ్రద్ధ బూనవలసియున్నది.

స్త్రీలకై ప్రత్యేక 'హాస్టల్సు'ను ప్రతి ఉన్నతపాఠశాలయందును నిర్మింపవలయును. ప్రత్యేకమైన విశ్రాంతిగదులు మొదలైన సదుపాయములు సమకూర్పబడినగాని స్త్రీలలో ఉన్నతవిద్య బడయు నాసక్తి ప్రబలముకాదు.

ఇక విద్యార్థినిలు సహితము 'అల్జిబ్రా - జామెట్రీ'లతో కాలము వెళ్లబుచ్చుటే తమ విద్యార్థి జీవితముయొక్క పరమావధియని తలపోయుకాలముగాదిది. ప్రతి విద్యార్థినియును, నిత్యజీవితమునకు సంబంధించిన సాంఘికసమస్యలను, రాజకీయ, ఆర్థికాదివిషయములయందుగూడ తగినంత ప్రవేశముకలిగి, తమతమ పురోభివృద్ధి మార్గములబట్టి పోవలసిన యావశ్యకత దినదినము వృద్ధిజెందుచున్నవి.

తీరిక సమయములందు తోడి సోదరీమణులలో విజ్ఞానాభివృద్ధికై పాటుబడినగాని, వారు స్వీకరించు విద్య సాఫల్యము గానేరదు. ముఖ్యముగా స్త్రీలలో 'అవిద్య' నిర్మూలింపబడినగాని, మనమాశించుచున్న 'సర్వతోముఖ సంఘాభివృద్ధి' చేకూరజాలదు.

కాకినాడ స్త్రీ విద్యార్థిసంఘమువారి సాంఘికజీవితమున కీ విషయము ప్రాతిపదిక కాగలిగిననాడు స్త్రీలలో (ముఖ్యముగ పల్లెస్త్రీలు) విద్యాప్రబోధము కలిగి స్త్రీజనపరముగ నేడు జరుగుచున్న సాంఘిక దుర్నీతులు అతిశీఘ్రముగ సమసిపోగలవు.

ఆంధ్రదేశములో రాజకీయముల మాట అటుంచినను, సాంఘికనిర్మాణమునకై వెలసిన సంఘములకు కొరతలేదు——

——కాని ఏయొక్క సంఘముగాని చెప్పుకొనదగినంత నిర్మాణము చేసినది కానరాదు. సంఘములను స్థాపించుటలోను, ఆశయములను వెలిబుచ్చుటలోను కష్టములేదు. కాని వాటిని నిర్విఘ్నముగ సాగించి శాశ్వతఫలితములను నిర్మించినప్పుడే అవి అజరామరములై సార్థకరూపమును దాల్చగలవు.

సంపాదకీయములు

కాకినాడ స్త్రీ విద్యార్థి సంఘము, గత జీవితమువలెగాక, ఆంధ్రదేశపు అన్నిప్రదేశములయందును, ఉపసంఘములను ఏర్పరుచుకొని, అచ్చటచ్చట గల మహిళాసంఘములయొక్క సహకారమును బొందుచు, చక్కని నిర్మాణకార్యక్రమము నేర్పరచుకొని, పాఠశాలలయందు స్త్రీ విద్యార్థుల హక్కుల నిర్మాణమునకై కృషిసల్పుట, సాంఘికముగా విద్యాప్రబోధము చేయుట మొదలగు పైవిషయముల నాచరించుచు, పెద్దలయొక్క సమ్మతమును బడసి పనిచేయునుగాక యని విశ్వసించుచున్నాము.

బాల్య వివాహ నిషేధశాసనముపై సనాతన ప్రముఖుల పరవళ్లు

హైద్రాబాదు సంస్థానములో హైందవుల యందు బాల్య వివాహములను నిషేధించు నిమిత్తమై త్వరలో నొక శాసనము రానున్నదనియు, దానిపై వ్యతిరేక ప్రచారమును గావించుచున్న సనాతన ఛాందసుల యలజడిని విస్మరించి, వెంటనే శాసనమును గావించుట ప్రభుత్వ ధర్మమనియు గతమాసపు 'గృహలక్ష్మి సంపాదకీయము'లో ప్రస్తావించి యున్నాము.

ఈ విషయిము పై హైద్రాబాదు ఆంధ్ర సోదరీ మణుల వద్ద నుండి మా కార్యాలయమునకు వచ్చుచున్న వివిధము లైన వార్తలను బట్టిచూడ, యీ శాసనముపై సనాతనులు ఎంతనైచ్య ప్రచారమునకు పాల్పడుచుండిరో తెలియుటయేగాక, ఈ శాసనమును ఎంత త్వరలో గావింప వలసి యున్నదియుగూడ తేటపడుచున్నది.

అతి బాల్య వివాహముల జరుపుటకు ఏ నాగరిక జాతియు సమ్మతింపదు. అన్నెపున్నెము నెరుగని పసి బాలికలకు వివాహముల నొనరించుటయన, యది నైతికముగా సంఘ పతనమునకు ప్రాతిపదిక. ఇట్టి యత్యాచారమును మానవత్వముగల ఏ మానవుడును ఆమోదింప జాలడు.

ఈ విషయము నెత్తుకొని 'దివ్యవాణి' పత్రికలో (19-8-40) "నిజమైన జాతీయ వాది" గారు, "గృహలక్ష్మి పాశ్చిమాత్య స్త్రీల వ్యభిచార వృత్తిని పాతివ్రత్య ధర్మముక్రింద నెంచుననియు, మూర్ఖత్వమనకు సనాతనులు పాత్రులని వ్రాసిన గృహలక్ష్మిని విడువవలె" ననియు గతమాసపు గృహలక్ష్మి సంపాదకీయ వ్యాసము పై విమర్శించుచు ఏమేమియో వ్రాసినారు.

పాశ్చిమాత్యుల వ్యభిచార వృత్తినే గాదు, పాశ్చిమాత్య పద్దతులను గూడ 'గృహలక్ష్మి' ఎన్నడును ఆమోదింపదు. పాశ్చాత్య పద్ధతుల యంధానుకరణమును నిర్మొగమాటముగ విమర్శిచుట గృహలక్ష్మి లక్ష్యములలో నొకటియను విషయము సర్వజన విదితము.

ఇట్టి దాని పై అవకతవక ప్రసంగమునకు దిగిన 'నేతి బీరకాయ'వంటి యీ "నిజమైన జాతీయవాది" గారిలో 'నిజమే'యే గాదు 'జాతీయత' గూడ లోపించుచున్నది. ఇట్టి ఉత్తమ సంస్కారమునకు సహకారమునిచ్చు పత్రికల పైనను, ప్రజల పైనను రాళ్లురువ్వు యిటువంటి సనాతని ప్రముఖులకు 'మూర్ఖత్వమే' గాదు 'జడత్వము'గూడ నాపాదించుట తప్పుగాదు.

ఇట్టివారు కేవలము అభివృద్ధిని నిరోధించు వారిలో అగ్రగణ్యులు. పాత ఎంతరోత యైనను, ప్రస్తుత ప్రపంచమునకు అది ఎంత ప్రమాదమును ఘటించుచున్నను దానినే పట్టుకొని వ్రేలాడు చుందురు. ఇటువంటి యీ 'నిజమైన జాతీయవాది' గారు ధర్మవిషయ పరిశీలన తెలియనప్పుడు, తెలిసికొనుటకై ప్రయత్నింపవలెను గాని, అనవసర ప్రసంగములకు ఇకనైనను దిగకుందురు గాక!

ఇట్టి అనవసరార్భాటములను హైద్రాబాదు సంస్థానమువారు లక్ష్యపెట్ట గూడదు. బహుజనాభిప్రాయసమ్మతమును, దేశోపకారకరమును అయిన యీ సంస్కారమును వెంటనే గావించుట వారి విద్యుక్త ధర్మము.

హరిజనబాలికలకు ఉచితవేతనములు

అఖిలభారత హరిజనసేవక సంఘముయొక్క జెనరలు సెక్రటరియైన శ్రీయుత ఎ. వి. థక్కర్ గారి 71 వ జన్మదినోత్సవ సందర్భమున బొంబాయిలోపౌరులు సమర్పించిన రూ 1,02,807-8-0 లో 30000 రూపాయలు హరిజనబాలికల ఉన్నతవిద్యకై ప్రత్యేకింపబడినదనుట ఎంతయు శ్లాఘాపాత్రమైనది.

ఇందునుండి హరిజనబాలికలకు కొందరికి సహాయవేతనమిచ్చి ప్రోత్సహించుటకు తీర్మానించినపుడు ఆంధ్రరాష్ట్రములోనుండియే ఎక్కువ దరఖాస్తులు వచ్చినవి. కాకినాడ, ఏలూరు, బెజవాడ, నెల్లూరు ఈ స్థలములలో హరిజనబాలికలకై హాస్టల్సు నెలకొల్పబడి మంచి కృషి సల్పుచున్నవి.

ఈ వసతుల సౌకర్య ప్రోత్సాహములచే ప్రతి సంవత్సరము హరిజనబాలికలు ఉన్నతవిద్య నంది గొప్పస్థానముల నలంకరించగలరు.

ఇట్టి వసతిగృహములను మన ఆంధ్రరాష్ట్రములో అన్నిచోట్లయందు స్థాపించి, నిర్వహించుట ముఖ్యావసరము. ఇటువంటి సంస్థలు నెలకొల్పబడవలయునన్న ద్రవ్యమవసరము. దానికి ఉదారచిత్తులగు మహాశయులు, శ్రీమంతులును ముందంజవేసి విరాళముల నొసంగి సంఘోద్ధరణమునకై దీక్షవహింతురని మా యాశయము.

ఇట్టి సంఘోన్నతికి నడుముకట్టి విధివిరామములేక కృషిసల్పు శ్రీ మాగంటి బాపినీడు మున్నగు మహోదారు లభినందనీయులు.

శ్రీమతి రామసుబ్బమ్మగారి పరిపాలనా ప్రాభవము

ఒకవనితామణిని ఒకప్రధాన ప్రజాసంస్థకు అధ్యక్షురాలుగ ఎన్నుకొను గౌరవమును పొందుటకు భారతదేశమంతటకును ప్రప్రథమున కడపజిల్లాబోర్డు పెట్టిపుట్టినది. అధ్యక్షురాలుగా శ్రీమతి రామసుబ్బమ్మగారి పరిపాలనలో కడపజిల్లాబోర్డు పరిణతిపొందుటయే గాక, ప్రభుత్వమన్ననలనుగూడ బడసినది.

మద్రాసు స్థానికప్రభుత్వాధికారి కడపజిల్లాబోర్డు పరిపాలననుగురించి 'శ్రీమతి రామసుబ్బమ్మగారు ఆఫీసుపనులను స్వయముగా తనిఖీచేయుచు పనులను త్వరగాను, నిపుణతగాను జరుగుటకు తోడ్పడుచున్నారు. గతసంవత్సరముకంటె జిల్లాబోర్డు పరిస్థితులలో చాల అభివృద్ధి కన్పడుచున్నది.' అని ప్రశంసించినారు. ప్రజాసంస్థలపాలనయందు ముఖ్యవిషయములు 'విద్య - వైద్యము.' వీటిని నిర్వహించుటకు కావలసిన లక్షణములు సాధ్యాసాధ్య విచక్షణ, పొదుపు, ఓర్పు. ఇవి ప్రత్యేకముగ స్త్రీల సొమ్ములుగాన వీటి పరిపాలనమును స్త్రీలు చక్కగ నిర్వహింపగలరు. కొన్ని కొన్ని విషయములలో పురుషులకంటెగూడ కడు సమర్థతతో నిర్వహింపగలరనియు, స్థానిక సంస్థలకు స్త్రీల నెన్నుకొనుట కేవలము ఒక సాంఘికాదర్శము కొరకు మాత్రమే గాదనియు, ఆ ఆదర్శము ప్రతిచోటను ఆచరణీయము కావలెననియు నిరూపించినారు శ్రీమతి రామసుబ్బమ్మగారు.

ఇది కేవలము ఆంధ్ర స్త్రీలోకమునకే కాక, అఖిలభారత దేశమునకుగూడ కీర్తికరమైనది. ఇట్టి యాదర్శమును నిర్మించి మార్గదర్శకురాలైన శ్రీమతి రామసుబ్బమ్మగారిని అభినందించుచున్నాము.

Edited by Dr. K. N. Kesari, Printed and Published by Dr. S. Seshagiri Rao,
at the Lodhra Press, 15, Westcott Road, Royapettah, Madras.

REGD. NO.
M-2357

గృహలక్ష్మి

1ST OCTOB
1940

GRIHALAKSHMI

VOL. 13
NO. 8

దసరాసంచిక

PRICE
AS. 4.



For Booking :

SRI JAGADISH FILMS,

విషయసూచిక

1. ఆశీస్సు—శ్రీ చెళ్లపిళ్ల వెంకటశాస్త్రి శతావధాని ... 433
2. దసరా ... 434
3. చెల్లీ! గృహలక్ష్మీ!—శ్రీమతి కె. రామసుబ్బమ్మ ... 436
4. భార్యాభర్తలు—శ్రీ చెళ్లపిళ్ల వెంకటశాస్త్రి శతావధాని ... 438
5. అంజలి—కవికలహంసి చేబ్రోలు సరస్వతీదేవి ... 441
6. స్థానికసంస్థలు స్త్రీలకే ఉండాలి—శ్రీమతి దుర్గాబాయమ్మ ... 442
7. ఆశీస్సు—శ్రీమతి చుండూరు రత్నమ్మ ... 444
8. బిచ్చగాడు—శ్రీమతి లోకనిండి సత్యవతీబాయి ... 445
9. పతాకసందేశము—శ్రీమతి వేదవల్లి తాయారమ్మ ... 449
10. లక్ష్మి—శ్రీమతి దేశిరాజు భారతీదేవి ... 450
11. విద్యాస్వరూపము—శ్రీమతి బూరుగుల రుక్మిణీబాయి ... 454
12. కళ—శ్రీమతి కామరాజు మైత్రేయి ... 457
13. పరదా—శ్రీమతి ఎల్. అలివేణి ... 460
14. సజీవమైన వాఙ్మయం కావాలి 'రోహిణి' ... 462
15. బదులు—శ్రీమతి నందగిరి ఇందిరాదేవి ... 463
16. భృంగమా!—శ్రీమతి వట్టికొండ విశాలాక్షి ... 465
17. మహారాష్ట్రమహిళలు—శ్రీమతి గంటి కృష్ణవేణమ్మ ... 466
18. సత్వరాంధ్రరాష్ట్ర సముపార్జనలో-స్త్రీల బాధ్యత 'ఆంధ్రపుత్రిక' .. 469
19. చారుదత్త—శ్రీమతి స్థానాపతి రుక్మిణమ్మ ... 470
20. అంధలోకం—శ్రీమతి అడపా సుగుణమణి ... 474
21. అలాఏడుస్తావేం_ఆడపిల్లలా? 'సరస్వతి' ... 477
22. స్త్రీ విద్యార్థి సంఘాలెందుకు?—మిస్ కనకదేశ గుప్త ... 478
23. దేశసేవిక—శ్రీమతి మధురాపంతుల విజయలక్ష్మి ... 481
24. లలనారత్నములు చలనచిత్రములు—శ్రీమతి కె. నిర్మలాదేవి ... 482
25. కుమారి టంగుటూరి సూర్యకుమారి 'చిత్రలేఖ' ... 486
26. సినిమాలు-స్త్రీ షెక్స్పియన్లు—శ్రీమతి జి. కళ్యాణి ... 489
27. మొగలాయీ కళ-రేఖా లేఖనపతనం—శ్రీమతి సి. వి. రమణమ్మ ... 492
28. ఒకరికి సనాతనమూ? ఒకరికి సంస్కారమూనా?—శ్రీమతి కె. సీతాదేవి 493
29. ఆంధ్రమాత—శ్రీమతి కొరప్రోలు వెంకటరంగమ్మ ... 497
30. సర్వనాశనమా! సర్వోదయమా!!—శ్రీమతి కె. సుగుణమణి ... 498
31. ఎంత దారుణము?—శ్రీమతి వెలిదండ చూడికుడుతమ్మ ... 502
32. ఆంధ్రీ—శ్రీమతి మీనాక్షి ... 506

33. నవారుపరిశ్రమ—శ్రీమతి పులిపాక బాలాత్రిపుర సుందరమ్మ ... 507
34. గృహలక్ష్మి—శ్రీమతి ఇనుగంటి సరస్వతీదేవి ... 509
35. లక్ష్మీ సరస్వతులు — శ్రీమతి లక్ష్మీసరస్వతులు ... 512
36. మైసూరు పట్టాభిషేకమహోత్సవము ... 515
37. మన కర్తవ్యము—కవికలహంసి శ్రీమతి చేబ్రోలు సరస్వతీదేవి ... 519
38. మహిమోపేతుడు మహాత్ముడు—శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మ ... 521
39. విజయదశమి—శ్రీమతులు వల్లభనేని రంగాదేవి, కే. యన్. రత్నాదేవి ... 523
40. యుద్ధరంగము—'అరుంధతి' ... 524
41. సంపాదకీయములు ... 526

వర్ణచిత్రములు :

నవరాత్రికొలువు, లలిత, కాంచనమాల.

ఉచితము !

ఫాన్సీ చేతి గడియారము

మా శ్రేష్టమైన మందు 'జోర్ - ఇ - హుసన్' (రిజిష్టర్డు) శరీరములో ఏ భాగముననున్న వెంట్రుకలనైనను తీసివేయును. తిరిగి నీ జీవితములో అచ్చట వెంట్రుకలు మొలువవు. చర్మము మెత్త దనము మృదుత్వమును జెంది శిల్కువలె అందముగ నుండును. వెల ఒక సీసా రు. 1-15-0.

ఈ మందును ప్రసిద్ధిచేయుటకుగాను, ప్రతి సీసాతోను ఒక్కొక్క ఫాన్సీ చేతిగడియారము ఉచితముగ ఇవ్వబడును. ఈ గడియారము చాల గట్టిదని, అందమైనదని 10 సంవత్సరములు గ్యారంటి. ఈ గ్యారంటీ కాగితము ప్రతి గడియాగముతోను పంపబడును.

ముఖ్య గమనిక :—వస్తువులు నచ్చనియెడల వెల తిరిగి యిచ్చివేయబడును. 3 సీసాలను ఒకేసారి కొనువారికి 3 ఫాన్సీ చేతిగడియారములు, ఉచిత తపాలఖర్చులు ఇవ్వబడును.

GENERAL SUPPLY CO.,
POST BOX No. 39 (G. L. M.) AMRITSAR (INDIA)





నవరాత్రి కొలువు

జయజయ గృహలక్ష్మి సఖి ! జయజయ లలితాంధ్ర మధుర సారస్వతమా !
జయజయ లలనారత్నమ ! జయజయ విద్యాప్రబోధ ! జయకల్యాణీ !

ఆశీస్సు

గృహలక్ష్మి కాయువబ్బుత
గృహలక్ష్మికి నిర్మలమగు కీర్తి కలుగుతన్
గృహలక్ష్మికి జయమబ్బుత
గృహలక్ష్మికి సిరిసంపద లెసఁగుంగాతన్.

—శ్రీ చెళ్లపిళ్ల వెంకటశాస్త్రి, శతావధాని.

దసరా

ఈ విశాల ప్రపంచమున సాధారణముగ నశాంతికి కారణము రాక్షసాంశులగు దుర్మార్గులు బలవంతులై సాధులను హింసించు చుండుటయేగదా! అట్టియలజడినుండి తిరిగి ప్రపంచము నుద్ధరించి సంరక్షించు మహాత్ములను అవతార పురుషులుగ పరి ణించుట సహజధర్మము.

'శ్లో. పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చదుష్కృతాం ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే' అని శ్రీకృష్ణ వాక్యానుసారము ఆదిశక్తి స్వరూపిణియే మహావీరులయందు బ్రవేశించి తనకర్తవ్యమును వారిద్వారమున జేయించి ధర్మమును నెలగొల్పుచుండును.

అట్టి జగజ్జననిని ఈ నవరాత్ర మహోత్సవ దినంబులలో వివిధ దేశములవారు వివిధ నామములతో బ్రతిష్ఠించి గొల్చుచుందురు.

ఈ పరదేవతను—

'చ. హరిహర పద్మగర్భులును నష్టదిగీశ్వరులెల్ల దేవతల్ పరమమునీంద్రు లంద రును భక్తిఁ దలిర్పగనే పరాంబికా చరణములర్ యజించి విలసద్గతినొందుచు రమ్యమహీ శ్వరిఁ నరులుయజించు టబ్బురమె' యని బ్రహ్మాది దేవతలే గొల్చుచుండగా మానవు లగు మనము గొల్చుటేపాటిది ?

> సీ. దేని జపించుటచే నంబుజభవుండు జగముల సృజియించు జాణయయ్యె
> దేనిజపించుటచే సురేంద్రుడు రక్షకత్వమునందు బ్రకాశతగనె
> దేనిజపించుటచే సుమాప్రియుఁడులయమ్ము సేయఁగ శక్తి నందిమించె
> దేనిజపించుటచే నెల్ల దిక్పతుల్ రక్షింప శిక్షింప దక్షులైరి
> దేని జపియించు వారికెందేని హాని పుట్టదో యట్టి....

లోకమాతను నిప్పుడు మనము యథావిధిగా దసరాలలో బూజించి నేటి క్లిష్ట పరిస్థితులను నెదుర్కొనజాలు నాత్మశక్తిని గాంచుట ముఖ్యావసరము.

ఇది విప్లవయుగము. ఈ సమయమున ప్రపంచ మెటుచూచినను ప్రశాంతమునే వాతావరణములో మునిగి వేరుమార్గంబు గానక శ్లేష్మములో బడిన ఈగవలె గొట్టుకొనుచు బరితపించుచున్నది. నలుదిక్కుల రజస్తమస్సు లావరించె. సత్యమెటుదాగెనో మచ్చునకైన గనబడుటలేదు. ప్రజానీక మీప్రచండ భీభత్సముద్రములో దెన్నుగానక మానవ యంత్రముల కాహుతియగుచున్నది.

ఇట్టి పరివేదనార్భటియందు తమోగుణ ప్రధానులగు బలవంతులు కృపారహితులై బలహీనులను ఎందర వందరగా జిత్రవధజేయుచు తమ దౌష్ట్యమును విజృంభింప జేయుచున్నారు. సత్యాసత్య వివక్షతసున్న. తెలివి తేటలు విపరీతము. స్వార్థాభిమానము వృద్ధి జెందినది. నీతినియమము లధోగతిపాలైనవి.

ఆసేతు శీతనగపర్యంతముండు మనభారతదేశ మిప్పుడు శృంఖలాబద్ధమై తల్లి దాస్యమునుబోగొట్టిన గరుత్మంతునివంటి పుత్రపుత్రికలకై నిరీక్షించుచు నహోరాత్రంబులు బరితపించుటచే మనకు రణరంగమున కురకవలసిన సమయ మాసన్నమయినది. ఆర్థిక రాజకీయ సాంఘికోద్యమములలో జయపతాక మెత్తి ధైర్యముగ నిలువవలసిన భారము మన భుజాస్కంధములపై నిలచియున్నది. నేడు మనము పతితులమై యుంటిమి. కావున మన ప్రాచీన విజ్ఞానమును వీసమునైనను గుర్తింపలేకున్నారము. మన సాంప్రదాయములు మనకు మృగ్యములు. గీర్వాణభాషా సముద్రములోనున్న నీతిరత్నములు దృష్టిదోషమున మనబుద్ధికి బొడగట్టకున్నవి. మన మాతృదేవతకు దూరమై, మనభాషకు దూరమై, మన రుచులకు దూరమై యన్యపదార్థ సంపర్కమున జెడిపోవుచు రెంటికిని చెడ్డరేవడివలెనున్న మనప్రస్తుత జీవితదశను దలచుకొన్న గుండె నీరగుచున్నది. భారతదేశమునకు స్వాతంత్ర్యము రాలేదన్న లోపమేగాక మనకన్నిటలోపమే యని గుర్తింపజాలకున్నాము. సర్వవిధముల నైకమత్యములేక వెనుకబడినవారము మనమే. భక్తిశూన్యులము మనమే. నానాటికి మన బుద్ధియునట్లే ఈడ్చుకొనిపోవుచున్నది. రత్నాకరమువంటి ప్రాచీన విజ్ఞానమును జక్కగా నవగాహన మొనరించుకోలేక చేయదగుకర్తవ్యము, చేయదగుకార్యము ప్రాణావసాన పర్యంతము నా భారతాంబను, నా మహాశక్తిని గొల్చు ఘనవ్రతనిష్ఠాపరత్వ మెఱుంగలేక యజ్ఞానులవలె మ్రొక్కుబడుల చెల్లించినట్లు చేయు మూఢవ్రతముల ఫలము నిష్ప్రయోజనము. ఇప్పట్టునచేయదగు వ్రతమెట్టిదో చూపుటకు ఉన్నతాశయములతో నాదర్శికముగ జీవితమును గడుపు 'మహాత్ముడు' మనకిప్పుడు చుక్కానియై మనపాలిటి భగవంతుడై యున్నాడు.

అతని యడుగుదమ్ముల ననుసరించి భక్తివీడక, సంశయముజెందక, విశ్వాసమును వీడక నడచితిమేని త్వరలో నొకదరికి జేరగలము.

మనకాధార భూతుండును, ఏకాకారుండును, లీలామానుష విగ్రహుండును నగు మహాత్మునకు జాలినంత ధైర్య స్థైర్యములను, దీర్ఘాయుర్దాయమును, నోపికయు, శక్తియు గలుగుటకుగాను నీ దసరా పుణ్యదినములలో సర్వకారణక్రియాశక్తి స్వరూపిణియగు ముగురమ్మల మూలపుటమ్మయగు జగజ్జననిని శ్రద్ధాభక్తులతో పూజించవలసిన ధర్మమై యున్నది.

చెల్లీ!
గృహలక్ష్మీ!

నేడు దేశమంతా అల్లకల్లోలంగావుంది. భవిష్యత్తు తెలియని ప్రాణికోటికి 'రేపు' ఎలా మారుతుందో నిర్ణయించడానికి వీలులేకుండావుంది. ప్రపంచమంతా ఆవరించిన భయంకరయుద్ధ మేఘాలచాటున పవిత్రోద్యమాలు మరుగుపడిపోతున్నవి. ప్రతిష్ఠకోసం, పదవులకోసం ప్రాణాలు బలియిస్తూవున్న పాశ్చాత్యజాతి అహింసలోగల ఔన్నత్యాన్ని గుర్తించడములేదు. నవపల్లవ కోమలమగు నారీజాతి సహితం హిట్లర్ రాక్షసుడి మారణాస్త్రాలధాటికి తలఒగ్గింది. దయా.ధర్మాలు తమతమ నెలవులుతప్పి చావడానికి సంసిద్ధంగావున్న సత్య శాంతులలో సమ్మేళనం కాబోతున్నవి. వెలుగు రేఖలు మాయమై, విషాదచ్ఛాయలు మానవసంఘం మీద ప్రసరించడం మొదలెట్టినవి.

ఇలాటి విషమ విషణ్ణసమయంలో నీవు ఆటంకాలన్నీ అధిగమించి 'దసరా'కోసం ముస్తాబుకాబోతున్నావంటే, నీలో ఏదో మంచి మహత్తువుందనీ, నీ జీవితానికి గొప్ప భవిష్యత్తువుందనీ తేటపడక మానదు.

సోదరీ!

శ్రీమంతుడైన వీరకేసరి చిన్నిబిడ్డవు. అందగాడైన ఆంధ్రుడు నీభర్త. సాహిత్యమూర్తులు-చక్కని గద్య పద్యాలు నీ సంతానము. పరవళ్లు ద్రొక్కిన తెనుగు పౌరుషసీమలు నీ విహారభూములు. జీరలు వారినప్పటికిని శిథిలముకాని తెనుగు చిత్రకళలు నీ అభిమాన విద్యలు. నాయకురాలి పౌరుషం, సావిత్రిసతీత్వం, పన్నా ప్రభుభక్తి, మొల్లకవితాస్ఫూర్తి నరనరాల్లో గూడా వ్యాపించిన నారీశిరోమణివి. ఇట్టి నిన్నేమని ఆశీర్వదించాలో నాకు తోచడంలేదు. అయినా ఇలా ఆశీర్వదిస్తాను—

అపశ్రుతి దారులబట్టిన ఆంధ్రుల ఆదర్శాన్ని చక్కని రాజమార్గంలో నడిపించడానికి సవరింపబడ్డ నీ సాహిత్యవిపంచిక సాయపడుగాక! స్వరాష్ట్రి సంకుచితమైన ఆంధ్రదేశం నీ అమరసందేశాన్ని ఆలకించి వికసించుగాక! సతులు సంతానమునేగాదు, స్థానిక సంస్థలనేగాదు, శాసనసభలనేగాదు సర్వజగత్తును గూడా సంస్కరింపగల సమర్థులని చాటెదవుగాక! పాశ్చాత్యవిద్యతో బరుగువారుచున్నను ఆంధ్రమహిళామండలి తన ప్రాచీనాంధ్ర సాంప్రదాయాన్ని విస్మరింపదని ముక్తకంఠంతో ఘోషింతువుగాక! నీ మధురమనోహర భావోజ్జ్వల గీతికలు నిద్రాణమయిన ఆంధ్రజాతిని మేల్కొల్పుగాక! నీకు శుభమగుగాక!!

శ్రీమతి కె. రామసుబ్బమ్మ
కడప జిల్లాబోర్డు అధ్యక్షురాలు

భార్యాభర్తలు

బ్రహ్మశ్రీ
చెళ్లపిళ్ల వెంకటశాస్త్రిగారు
శతావధాని

★

యీ రెండు శబ్దాలకూ వున్న అర్థాన్ని మన ఆర్యులు బాగా తెలుసుకొని వర్తించినట్లగుపడుతుంది. భృఞ్ భరణే అనే ధాతువునుండి యీ రెండు శబ్దాలున్నూ పుట్టినాయి. భరించతగ్గది. అనఁగా? పోషించతగ్గది భార్య. యెవరిచేత? అని ఆకాంక్ష కలుగుతుంది. ఆకాంక్ష అంటే? శంక. ఆ శంకకు సమాధానం భర్తచేత అనియ్యేవే. స్కూలుమాస్టరీ వగైరా ఉద్యోగాలుచేసి తన పోషణం తానే చేసికొన్న స్త్రీలు మన ఆర్యులలో వున్నట్లు లేదు. వంటలక్కలుగా వుండిన్నీ నీళ్లబిందెలు మోసుకొనిన్నీ జీవించేవాళ్లు అచ్చటచ్చట లేకపోలేదు గాని వున్నప్పటికీ వాళ్లందఱూ భర్త జీవితానంతరం గత్యంతరంలేక ఆలాగు పొట్ట పోషించుకోవలసివచ్చిన దురదృష్టవంతురాండ్రు. 'ఆపత్కాలేనాఽస్తి మర్యాదా' కనక అది స్త్రీ లోకానికి ఆదర్శంకాదు. యీమధ్య పోలండులో కాఁబోలును గత్యంతరంలేక కుక్కమాంసంతిని ప్రాణధారణం చేసికోవలసివచ్చిందని పత్రికలలో చదివినట్లు జ్ఞాపకం. అంతమాత్రంచేత అది ఆ దేశవాసులకందఱికీ మార్గదర్శకంగా వుంటుందా? యేదో ద్వాదశవర్షక్షామంలో విశ్వామిత్రుఁడంతవాఁడుకూడా చండాలుని యింట్లో వండుకున్న కుక్కమాంసాన్ని తినడానికి సిద్ధపడ్డట్టు పురాణాలలో వుంది. అవన్నీ ఆపత్కాల సంప్రాప్తాలే. మనకి ప్రస్తుతం కావలసింది ఆఁడదాని పోషణకోసం ఆఁడది విద్యాభ్యాసం చేయవలసివుంటుందా? అంటే! అందుకోసం విద్యాభ్యాసం చేయవలసివుండదనిన్నీ, జ్ఞానసంపాదనార్థం చేయవలసివుంటుందనిన్నీ నేను అభిప్రాయపడతాను. భార్యా శబ్దానికి వ్యుత్పత్తి తెలుసుకున్నాం గనక యిఁక భర్తృశబ్దానికి తెలుసుకుందాం. భరణకర్త అనఁగా భరించేవాఁడు (పోషించేవాఁడన్నమాట) కనక భర్త అనిపించుకుంటాఁడు. యీ రెండు శబ్దాలున్నూ యిట్టి అర్థంతో పుట్టివున్నాయి. నిమ్నజాతులు, కుటుంబం జరుగఁబాటు తక్కువగా వుండడంచేత భార్యాభర్తలు యిద్దఱూకూడా పనిపాటలు చేసుకోవడమయితే వుందిగాని వున్నప్పటికీ అంతో యింతో యీ అర్థాన్ని (వాళ్లెఱుఁగనప్పటికీ) పాటిస్తూనేవుంటారు. జ్ఞానార్థంగా స్త్రీ విద్యాభ్యాసం చేయవచ్చునని వ్రాసేవున్నాను. అట్టి విద్యకు డిగ్రీలతో ఆవశ్యకంలేదు. డిగ్రీలవల్ల వచ్చే పుట్టిములకేమిటంటే, కావలసినంత వుంది. డిగ్రీ చదువుకోసం పాఠశాలా ప్రవేశం ఆవశ్యకంగదా! అందుచేత ఉన్నతవిద్య నభ్యసించవలసివస్తే ఆఁడవాళ్లకి ప్రత్యేకించిన పాఠశాలలు విరివిగా లేవుగదా? ఆ సమయంలో మొగవాళ్ల పాఠశాలలలోకే వెళ్లాలి. అ వెళ్లేనాఁటికి అమ్మాయికి పదహారేళ్లు దాపవుతాయి. మొగవాళ్లతో కలిసి చదవడానికి మన ఆర్యులు సమ్మతించారుకారు. వారిని కొందఱు దుర్మార్గులని అంటే అంటారు గాక! నేను ఆలా అనఁజాలను. మహానుభావులనే అంటాను.

ఆడదాని పోషణకోసం ఆడది విద్యాభ్యాసం చేయ వలసి వుంటుందా?

"వటునకింతిపొత్తు వలదు వలదు"

అనే భాగవతాన్ని నేను శిరసావహిస్తాను. 'నమాత్రానస్వస్రానదుహిత్రా' అంటూ ధర్మశాస్త్ర కర్తలు నిషేధించివున్నారు. యిదేకాదు, వున్నతవిద్య నభ్యసించిన వధువుకు వున్నతవిద్య నభ్యసించిన వరుఁడు స్వజాతిలోనే కుదరాలంటే కష్టసాధ్యంగదా? అందుచేత వివాహానికి స్త్రీత్వ పురుషత్వాలున్నూ డిగ్రీలున్నూ మాత్రమే ప్రయోజకాలుగాని బ్రాహ్మణత్వాదికం కాకపోవలసివస్తుంది. దానితో వర్ణ సాంకర్యం ప్రసక్తిస్తుంది. కాలాన్నిబట్టి జాత్యంతర వివాహాన్నికూడా ఆమోదించమంటే నేను అందుకూ సిద్ధమే. (నలుగురితోపాటు నారాయణా, కులంతోపాటు గోవిందా) కాని పూర్తిగా జాతిభేదం అంతరింప చేశాకగాని స్త్రీలకు సాంకర్యకారకమైన వున్నతవిద్యాభ్యాసం పనికిరాదంటాను. ఇప్పుడంటారా? కొడుకుల దుర్నీతివల్లనైతేయేమి కూఁతుళ్ల అవినీతివల్ల అయితేయేమి యెందఱో తల్లిదండ్రులు మంచాలుపట్టి మఱుఁగుతూ వున్నారు. ఆ యీ విషయాన్నిగూర్చి కొన్నాళ్ళక్రిందట 'శివశంకరవిజ్ఞప్తి' అనే పేరుతో కొన్నివందల చరణాలు, కొంత చేదస్తంగానే అనండి నాకుతోఁచి వ్రాశాను. అందులోన్నుంచి కొంచెం వుదాహరిస్తాను—

కూఁతులఁ గాంచినవారికి పూర్వము కొండంత పుణ్యమనిగద? శంభో!

ఇప్పుడు కూఁతులఁ గాంచినవారికి ఎట్టినరకమో? తెలియదు శంభో!

అల్లుఁడు హరిజనుఁడో? హరజనుఁడో? అన్యుఁడో? తెలియదక్కట! శంభో?

చాలును, యీలాటి వ్రాఁతలువ్రాస్తే యిప్పటి సోదరీమణులలో యెంతోమంది నన్ను యేవగించు కుంటారననీన్నీ యెఱుఁగుదును. అయితే యేంచేసేది. ఆత్మను వంచించి వ్రాఁయడంమాత్రం యుక్తంగా వుంటుందా? ప్రపంచకమంతా మార్పుచెందుతూ వుంది. యెందుకోసమో? అంటే? స్వరాజ్యంకోసమని పత్రికలవల్ల స్పష్టపడేది. నిన్న మొన్నటినుంచి కాఁబోలును ఆ మాటకూడా అంతగా వినపడడంలేదు. వృథాగా చెడిపోతూవున్నాంగదా! అనుకున్నాను. కొన్నాళ్లు మొగాళ్లు చెడిపోయినా ఆఁడవాళ్ళద్వారా మన సనాతన మర్యాదలు నిలుస్తాయనుకొనేవాణ్ణి. యిప్పుడో? ఆ ఆధారంకూడా అడుగంటిపోతూవుంది. అగ్రహారాలలో వుండే బ్రాహ్మణ బాలికలుకూడా సిగరేట్లుపీల్పు ఫేషన్క్రింద జమకట్టి అవలంబిస్తూ వున్నారంటే—యిఁక చెప్పేదేమిటి? యీ కాలంలో అభిమానంకలవాఁడెవఁడుగాని తలెత్తి తిరగడానికి

అవకాశం వున్నట్టు కనపడదని నాకు తోఁస్తూవుంది. యిది నా చేదస్తమైనా కావచ్చును. అంతటి దుర్భాగ్యమాని యెవఁడేనావుంటే వాఁడు పెళ్లిచేసుకోకుండా యావజ్జీవమూ గడుపుకోఁగలిగితే వాఁడికంతగా తలవంపులతో పనివుండదు—

మ॥ కొడుకుల్ గల్గినఁ గూఁతులుద్భవిలినన్ గోడండ్రు నల్లుండ్రు నే।
కడజాతుల్ ఘటియింతురో? అనెడి దుఃఖంబక్కటా? ఆర్యులీ।
చెడుకాలమ్మునఁ బుట్టుచేటికో? గదా, సీ! సీ! దురంతమ్ములె।
వ్వఁడు సైఁచున్ భరతావనీ భవుల కీపాట్లొక్కొ? కామేశ్వరీ॥

మ॥ సడికిం బూర్వులు జంకువారలిపుడో? జంకన్న దేలేదు ముక్।
బిడియం బంగనకుండె నిప్పుడదియుంటే పెద్ద దోషంబహో!।
విడియాకుల్ మఱియున్ 'విడో' స్వరిణయా విర్భావముల్ తల్లి యీ।
చెడుకాలాన మనస్వి యేవిధముగా జీవించుఁ గామేశ్వరీ॥

ఆ యీ పద్యాలు లోకానికి నచ్చకపోయినా నా మనఃపరితాపం యీలాటిదని తెలుసుకోవడానికుపకరిస్తాయని వుదాహరించాను. విడో స్వరిణయాలుగాని, స్త్రీ విద్యగాని నేను బొత్తిగా వొప్పుకోని ఛాందసుణ్ణిగాను. నా వొప్పుదలనిగూర్చి వోపికవుంటే మఱొకప్పుడు వ్రాస్తాను. పత్రికాధిపతి తొందరగా వుత్తరంమీఁద వుత్తరంగా రెండు వుత్తరాలు వ్రాస్తే యీ రెండు మాటలున్నూ వ్రాసి పంపివున్నాను. ఆంధ్రవారపత్రికలో నా వ్యాసాలు పడుతూవుండడంవల్ల నేను మంచి ఆరోగ్యంలోనే వున్నానని పలువురభిప్రాయపడుతూవుంటారు. కాని ఆ వ్యాసాలు సంవత్సరానికి పూర్వం పంపిన బాపతు నిల్వలోనివిగాని నిన్నా నేఁడూ పంపినవికావు. తీరికకొలదిని వారప్పుడప్పుడు ప్రచురించుకుంటూ వుంటారు. అందులో కొన్ని చూచినప్పుడు యిది నేను పంపిందేనా? అని సంశయంకూఁడా నాకు కలుగుతూవుంటుంది. యిది విషయాంతరం. ప్రకృతమనుసరామః. మన సంఘగౌరవం నిల్పవలసిన భారం స్త్రీలమీఁదనే వుంది. యిరవైనాలుగువేల రామాయణ గ్రంథం యావత్తూ స్త్రీ గౌరవాన్ని నిల్పడానికే పుట్టింది. సీత యే సూర్జహాను వంటిదో అయితే రాముఁడు అంత పరిశ్రమ చేయవలసి వుండనే వుండదుకదా? మొదటినుంచీ మన ఆర్యుల గౌరవాన్ని స్త్రీలే నిల్పుతూవున్నారు. యీ సంగతి బాగా జ్ఞప్తిలో వుంచుకొని స్త్రీలు విద్యాభ్యాసం చేయడానికి అభ్యంతరంలేదు. దీన్ని మఱచిపోయి చేసే విద్యాభ్యాసం మన ఆర్యుల సంఘాన్ని కళంకితంగా చేస్తుందని విన్నవిస్తూ ముగిస్తున్నాను.





పతిత భారత పావనాత్మకు
దీన హరిజనోద్ధారకునకు
భావి భారత భాగ్యరాసికి
సత్యాహింసల సాధుమూర్తికి
ప్రాపంచిక శాంతిదూతకు
సూత్రయజ్ఞ ఆధ్వర్యునకును
ధీరభారత తేజశ్శాలికి
మూడు మూర్తుల యుగప్రవర్తకు

డెబ్బది రెండవ పుట్టిన
దినవు శుభ సమయమునందున
జయ జయా భవ! దిగ్విజయ భవ!
జయ జయా భవ! దిగ్విజయ భవ!!

బాణసంచా వేడుక

అంజలి

సర్వమంగళగాన "సర్వదేశంబుల
మంగళ" మొప్పార మనుపుమమ్మ
కలితవీణాపుస్తక కరాంబుజవుగాన
"మాతృభాషాప్రేమ" మాకు నిమ్మ;
వహ్ని శుద్ధాంశుక భాసితాంగివిగాన
"ఖాది"పై లక్ష్యంబు గలుగ నిమ్మ;
భవరోగసంహార ప్రౌఢవీవేగాన
"ఆరోగ్యబోధ" సంవ్యాప్తి నిమ్మ
చెడుగురక్కసిమూక జిదుము దిట్టరిగాన
"అస్పృశ్యతా" ధాటి నవియ నిమ్మ;
సకలలోకాధారజనని నీవే గాన
"స్త్రీజనోద్ధరణ"కై దీక్ష నిమ్మ

గీ॥ అంబ! జగదంబ! గాంధీమహాత్మ "సూక్తి"
లెలమి వర్ధిల్ల సూత్రధారిణివి నీవె
శక్తియుక్తుల మాకిచ్చి సాదరముగ
నీ ప్రణాళిక సాధింపనిమ్మ జననీ!

కవికలహంసి,
చేబ్రోలు సరస్వతీదేవి

స్థానిక సంస్థల పరిపాలనలో వుండే ప్రాథమిక విద్య, పారిశుద్ధ్యం, శిశుసంరక్షణ - ఈ పనులు ఆమెచల్లని చేతికి చక్కగా నప్పుతాయి. అందులోను ఇంటిరాణి కీదెంత ?

స్థానిక సంస్థలు

● శ్రీమతి దుర్గాబాయమ్మ ●

స్త్రీ విధులు కేవలం గృహానికి, పురుషుని విధులు కేవలం ప్రపంచానికి చెందిన వనుకోవడం పొరపాటు. బయట తానుచూస్తూన్న పోషణ, రక్షణ, అభివృద్ధి—పురుషుడు యింటాచూడాలి. ఇంట తాను కనుక్కుంటూన్న అందం, చందం, హాయి—స్త్రీ బయటా కనుక్కోవాలి.

స్థానికసంస్థల పరిపాలన కూడా సరిగా గృహపరిపాలన లాంటిదే. కాని దీనికి పదిరెట్లు యెక్కువ ఓర్పు, చురుకుతనం, చాకచక్యం కావాలి. ఇంటిని దిద్దడంలోను, బిడ్డల్ని ఆదరించడంలోను, విద్యావిషయం కనిపెట్టడంలోను, ఆరోగ్యం చూడ్డంలోను స్త్రీ ఆరితేరింది. గృహంలో నిత్యకృత్యంగా నెరవేరుస్తున్నవే స్థానికసంస్థల సంగతులుకూడా. అటువంటప్పుడు ఆ సంస్థలపాలన కేవలం స్త్రీ కెందుకు విడిచిపెట్టకూడదంటాను ? దానివల్ల ఆమె కార్యరంగం విస్తృతి కనడమేకాక, ఆమెకొక విశేషత్వంకూడా చేకూరుతుంది. అప్పుడామె యింటినే అంటిపెట్టుకుని అలావుండిపోడం తటస్థించదు. ఆమెశక్తి, వివేకం ఆరియిస్తాయి. ఆవిధంగా ఆమెఆదరణ కిందనుండే సంసారం పెద్దదవుతుంది.

ఈ పెద్దసంసారం ఆమె యెలా చక్కబెట్టగలదో అన్న చింత అక్కర్లేదు. ఇంటిరాణి కీదెంత? పారిశుద్ధ్యం, ప్రాథకమికవిద్య, శిశురక్షణ - ఈ పనులు ఆమె చల్లనిచేతికి చక్కగా నప్పుతాయి.

ఈ పనికి పురుషులు తగరనిగాని, తక్కువవారనిగాని నా అభిప్రాయముగాదు. దీన్ని ప్రత్యేకంగా స్త్రీలకి యెందుకు విడవమంటానంటే, బుద్ధి వికసించివున్న పురుషులను యింతకంటె కష్టతరమైన కార్యాలకి వుపయోగించుకోడం యుక్తమని.

మునిసిపాలిటీ శాసనకర్తలకి శిక్షణభూమి అన్నారు. ప్రభుత్వం చెయ్యగల నేర్పరులు మనకి యెక్కువగా కావలసివున్నారు. స్త్రీ పురుషుల కిరువురకీ సమానావకాశాలే వున్నాయి. స్త్రీలు వుపేక్షించగూడదు. ప్రారంభశిక్షణమైన నగరపాలనానుభవంతో దీనికి వీరు తగినవారవుతారు.

అనుభవంలేదనిగాని, విషయపరిజ్ఞానం పూజ్యమనిగాని స్త్రీలని త్రోసిపుచ్చడంలో న్యాయం కనిపించదు. అసమర్థులు కానంతవరకు యే అడ్డూ వుండకూడదు. అవసరమైన జ్ఞానానుభవాలు కలుగ

స్త్రీలకే ఉండాలి

పురుషుడు చెయర్‌మన్ అయితే - స్త్రీ కమీషనరు, స్త్రీ చెయర్‌మన్ అయితే పురుషుడు కమీషనరు - యీ విధమైన ఏర్పాటు నా ఆశయాన్ని నెరవేరుస్తుంది.

చెయ్యాలి. అవకాశాలు కల్పించాలి. సహజశక్తితో శోభించే స్త్రీకి శిక్షణమివ్వాలిగాని, నిషేధిస్తే యెలాగ? అది ఆమె నెలావుద్ధరిస్తుంది?

పురుషులుమాత్రం పుట్టుకతోనే తయారయి చక్కావచ్చారా? వారికి అవకాశం లభించి, అనుభవం సిద్ధించింది. ఈ ఆనుకూల్యం స్త్రీలకీ సందర్భపడితే, వాళ్లుమాత్రం తీసిపోతారా?

ఒక్కొక్క స్త్రీకి ఒక్కొక్క విభాగం అప్పచెప్పాలి. ఆవిభాగానికి చెందిన యావత్తు బాధ్యత తానే వహిస్తుంది. సహనశక్తి, సమర్థత వున్నవాళ్లనే యేరండి నగరపాలకులుగా. పురుషులకన్న స్త్రీ లుండడం వుపాధ్యాయినులకు, మంత్రసానులకు, యితర శ్రమజీవులకు చాలా సౌకర్యంగా వుంటుంది. అప్పుడాయా విభాగాలు శ్రద్ధగా, వుత్సాహంగా నడుస్తాయి.

'ఈ స్థానికసంస్థలని స్త్రీలకి వదలివెయ్యమనడం పురుషుల్ని పూర్తిగా తప్పించివెయ్యడం కాదా? అదిమాత్రం న్యాయమా?' అని యెవరైనా అడగొచ్చు. కాదంటాను. ఈవిషయాల్లో తమకున్న అనుభవంతో పురుషులు స్త్రీలని నడిపించాలి. మాకు వారిసహాయం, సహకారం కావాలి. వారుసానుభూతి చూపించాలి. మాకు బాధ్యతలివ్వాలి, భారాలు కల్పించాలి. అప్పుడుచూడాలి. పురుషుడు చెయిర్‌మన్ అయితే స్త్రీ కమీషనరు; స్త్రీ చెయర్‌మన్ అయితే పురుషుడు కమీషనరు—యీవిధమైన యేర్పాటు నా ఆశయం నెరవేరుస్తుంది.

ఈ కష్టమైన వుద్యోగానికి స్త్రీలు సంసిద్ధులుకావాలి. సంగతి, సమాచారం గ్రహించాలి. క్లిష్ట సమస్యల కీలకం గుర్తించాలి. న్యాయదృష్టి, వివేచనాబుద్ధి పెంపొందించాలి. నేర్పు, ఓర్పు ప్రదర్శించాలి. నిర్దోషంగా, నిర్విఘ్నంగా తమబాధ్యతలు నిర్వహించాలి.

ప్రస్తుతం ప్రబలుతూన్న వుత్సాహం ధర్మమా అంటూ అప్పుడే యీ పద్ధతి అక్కడక్కడ ఆచరణలోకి రావడం ఎంతో ఉదారంగావుంది. ఈ పరివర్తన ఆశాజనకంగా, ఆనందంగా వుంది. స్త్రీలు యీ అవకాశం వినియోగించుకుని, పైకిరావాలి.

ఈశాఖ పూర్తిగా స్త్రీలహస్తగతమయే రోజుకోసం ఆత్రంగా యెదురుచూస్తూంటాను. ఇది భవ్యతరమైన దేశాభ్యుదయానికి దారితీస్తుందని నా గట్టినమ్మకం.

ఆశీస్సు

— శ్రీమతి —
చుండూరు
రత్నమ్మ

★

ఏలూరు
పురపాలక
సంఘాధ్యక్షిణి

హిందూగృహానికి తుల్యమయింది యింకొకటి లేదు. ఇచ్చటే గాదు ఖండ ఖండాంతరాల్లో గూడాను. హిందూవనితకు సాటియైన స్త్రీ ఏదేశమందు చూడము. ఒక్క విషయాన్ని గురించే గాదు. ధార్మిక, ఆధ్యాత్మికాదర్శాలలో ఆమె ఆదర్శచరిత.

స్వామి వివేకానందుని అమెరికాలో ఒక పురుషుడడిగాడు, 'మీరు మీ స్త్రీలను ఏవిధంగా గౌరవిస్తా'రని. 'మిసెస్సని మీవలె వారలపిలువక తల్లియని మాతృస్వరూపిణిగా ఆరాధించుతామ'ని స్వాములవారన్నారు. అందుకనే మన కవులు 'కలకంఠి కంట కన్నీరొలికిన సిరియింటనుండ నొల్లద'ని గౌరవించారు. 'ఏ దేశాన స్త్రీలు గౌరవానందాలతో నోలలాడుతారో ఆ దేశాన లక్ష్మి తాండవమాడుచుండున'ని మనువు వుపదేశించాడు. ఈ ధర్మాలను సార్థకంచేయడానికి 'గృహలక్ష్మి' స్త్రీ జనాభివృద్ధికి కల్పవృక్షములా స్త్రీ ధర్మాన్ని బాహాటంగా చాటుతోంది. పుష్కరంపైనుంచి ఆంధ్రవనితల హృదయాల్లో రాజ్యంచేస్తోంది. 'గృహలక్ష్మి' లేకపోతే ఆంధ్రగృహములు చీకట్లుకమ్ముతాయని అనిపించుకొంది. ఆంధ్రులలో శహబాస్ అని ప్రసిద్ధి చెందింది.

కేసరిగారు సంకల్పసిద్ధులు. వారుపట్టింది బంగారమవుతుంది. వారి కోర్కెలు అమోఘంగా ఫలించుతాయి. కేసరిగారు ఆంధ్రులకు చిరస్మరణీయులు. వారిది వజ్రసంకల్పము. స్త్రీ జనాభివృద్ధికి పాటుపడే శ్రీ కేసరి మహాశయులనూ, వారి పత్రికారత్నాన్ని భగవానుడు చిరస్థాయిగా దీవించుగాక! ఆంధ్రవనితలందరు గృహలక్ష్మిని ఆదరిస్తారని నమ్ముతాను.

బిచ్చగాడు

శ్రీమతి
లోకనిండి
సత్యవతీబాయి

★

మనుష్యులుమాత్రమే కాదుం
డా జంతువులుకూడా అస
హ్యించుకుంటాయి బిచ్చ
గాడిని చూస్తే—

అయితే యీ 'అసహ్యం'
★ అతడి 'ఆకారం'లోనా?
అతడి 'ఆయవారం'లోనా?

రోతగా జీవితాన్ని మోసు
కుంటూ చావలేక బ్రతికే
రోగులు—

కష్టంలేకుండా బ్రతకడానికి
ముష్టికి బయలుదేరే నికృ
ష్టులు—

—అందుకే అసహ్యం.

అయితే, వారిలోనూ మృదు
వైన మానవాత్మ వుంది-
పరుల కష్టాల్ని చూచి ద్రవిం
★ చిపోతుంది—

కాని, వారినీ నీచయాచన
నుండి ఉద్ధరించడానికి సంఘం
తలపెడితేగదూ?

★

చీకట్లు నలుదెసలా అలము కొంటున్నాయి. దూరాన్ని పల్లెకొక్కటి నల్లని మచ్చలా అగపడుతోంది. ఆ బిచ్చగాడు రోడ్డు ప్రక్కన పచ్చికమీద తన చింకిగొంగళి పరచుకొని మేనువాల్చాడు. ఆకలితో వాని కడుపు చుమ్మలుచుట్టుకొని పోతోంది. పట్టెడన్నమానాడు వాడికి దొరికిందికాదు.

జీవితంలో సుఖమెట్టిదో వాడెరుగడు. వణుకుతూ గడిపిన శీతాకాలపురాత్రుళ్లూ, ఎండలో మాడుతూ నడచిన వేసాకాలపు పగళ్లూ, తడిసిముద్దయి పంచల్లో చూర్లక్రింద గడిపిన గడియలూ, యివే వాడెరిగినవి. మనుష్యులుకూడ వాడినెంతో నిరసనభావంతో చూశారు. పట్టెడన్న మడిగి తానుతిన్న చీవాట్లు, ఆకలిబాధకోర్వలేక యింకను ప్రాధేయపడి తానుతిన్న దెబ్బలుకూడా జ్ఞాపకానికొచ్చినయి. అన్నిటికంటే తనయెడల ప్రజలుచూపే నిరసనభావం తనకు చాలాకష్టమనిపించింది. తన్నుచూస్తే ఆందరికీ ఎందుకింత అనుమానమూ, కోపమూ, చీకాకున్నూ? గుమ్మములోకి పోగానే పెద్దవాళ్లు తొలిగిపోతారు. ఆడవాళ్లు కసురుతారు, పిల్లలువెక్కిరిస్తారు, చివరకు కుక్కలుకూడా మొఱుగుతవి. అయినా అతనికెవ్వరిపైనా క్రోధము కాని, అసూయకాని లేదు. తానుపడ్డ కష్టాలన్నీ అతనిహృదయంలో సహనాన్ని, జాలినిమాత్రము నిలిపిపోయినవి. అబ్బ, నిద్రన్నా పట్టితే యీ ఆకలిబాధ, పిచ్చి తలపులు మరవొచ్చునని కండ్లు గట్టిగా మూసుకున్నాడు.

అతని కప్పుడే మాగన్నుగా నిద్రపట్టుతోంది. ఏదో అలికిడివిని తలయెత్తిచూశాడు. ఒక గడ్డిబండి వస్తోంది. గడ్డిమోపా బండినిమించి రోడ్డునంతటినీ ఆక్రమించుకొంటోంది. మళ్లీపడుకున్నాడు. బండిసమీపించింది. దాటిపోయింది. చక్రాలచప్పుడూ, ఎద్దు మెడలోని మువ్వలమోతా సన్నగిలిపోయినవి. బండివాని రాగము మాత్రము వినబడుతోంది. అదికూడా చప్పుననిల్చిపోయి బండివాడు ఎద్దునదర్చుట వినబడింది. కొరడాచప్పుడు

తో ఎద్దును తిట్టుతూకొట్టడము చెవినిబడ్డది. బిచ్చగాడులేచి కండ్లనుసులుముకుంటూ కూర్చున్నాడు. ఎద్దు కొలదిలాగినా బండికదలడములేదు. బండివాడతడ్నిచూసి, 'ఇదుగో తాతా, కొంచముచెయ్యిపట్టు. ఈ గొయ్య డులో బండి పోవడములేదు' అన్నాడు. బిచ్చగాడులేచి బండిదగ్గఱకువచ్చి ఒక చక్రముపట్టాడు; బండివాడు కోటి పట్టాడు. ఇద్దరూశక్తికొద్ది తోస్తూ ఎద్దును హెచ్చరించారు. ఎద్దుమోరచాచి, వెనకటికాళ్లను నిగడ్దన్ని తొడలు కంపించగా తనబలాన్నంతటినీ వినియోగించి బండినిలాగింది. కాని, లాభంలేకపోయింది. ఒక్కఅడు గన్నా అంతఎత్తుగావున్న ఆ రోడ్డుమీద ముందుకు వేయలేకపోయింది. పక్కలెగురవేస్తూ, ముక్కుపుటాలు కంపించగా రొజుతూ నిలిచిపోయింది. బిచ్చగాడిదిచూచి జాలితో 'అబ్బాయి కొంచము గొడ్డును నేదట్టి దానిశక్తికిమించినబరువుంది బండిలో—' అన్నాడు బండివాడు 'కానేకాదు వట్టి తిండిపోతుది, ఆ రాయి తెచ్చి చక్రముకిందపెట్టు. సరే, ఈ కొరడా తిప్పికట్టైతో దాన్నిబాదు. నేనీచక్రాన్ని ముందుకితోస్తాను. బండి ఎట్లాకదల్లో చూస్తాను—'

రివ్వురివ్వున పడ్తున్న దెబ్బల కోర్చుకోలేక ఎద్దుమళ్లీ బండినిలాగింది. కాస్త చక్రముకదిల్తే రాతి ముందుకుతోస్తూ, చక్రాన్ని బలంతో నెట్టితే బండి అదంతట అదేకదిలిపోతుందని బండివానివూహ. "ఊ, కానీ - యింకా యింకా—" అని ప్రోత్సహిస్తున్నాడు. ఎద్దు ఒక్కఅడుగు వేసింది రెండోకాలెత్తిందికూడ. కాని లాభంలేకపోయింది. బరువుకివెంటనే వెనక్కుతూలింది. ఆ కుదుపుకి బండిబండే వెనక్కువాలింది. బండి వాడు వశముతప్పి, జారి ఒక్కకేకతో వెల్లకిలాపడిపోయాడు. పాపము, వెంటనే బండి రొమ్ముమీద కటాలున పోతుందని దబ్బున తనచేతులు చక్రానికిపోటిపెట్టి ప్రాణభయంతో, "ముందుకుతోలు - ముందుకుతోలు" అని గావు కేకపెట్టాడు. జరిగినమోసం గ్రహించి బిచ్చగాడు గొడ్డును శక్తికొద్దీ మోదసాగాడు. ఎద్దుముందుకు సాగయత్నించి బలముచాలక మోకాళ్లపై ముందుకుకూలపడి లేవనుంకించి, పక్కకొరిగి పడిపోయింది. బిచ్చ గాడు గాభరాతో వెనక్కు చక్రముదగ్గరున్న బండివానిదగ్గరకు పరుగెత్తాడు. పాపము, బండివాడు తనబలా న్నంతా వినియోగించి, రాతిమీదకి దొల్లినచక్రాన్ని తన వక్షానికి నాలుగైదు అంగుళాల ఎడాన్ని పట్టి నిలిపి వుంచాడు. వాడుకాస్త జరిగినా, కించిత్తు వానిబలము సడలినా, ఆ చక్రముబండి బరువుతో వాడిని నలిపివే స్తుంది. బండివాడదిగ్రహించి వంగి తనను లేవనెత్తచూస్తున్న బిచ్చగానితో, "నన్ను తాకకు, ఆ వరిచేలవతల పల్లె వున్నదే, ఎగుపైన గుమ్మడిపాదు పాకివున్న గుడిసెకుపోయి మావాళ్లను తీసుకురా - దబ్బున పో. కాస్సేపెట్లా గో అట్లా యీ బరువునిపట్టి నిలిపివుంచుతా" అన్నాడు—

మారుపలక్కుండా బిచ్చగాడు పొలానికడ్డంగా రాళ్లురప్పలూ ముళ్లకంచెలూ లక్ష్యపెట్టకుండా పరుగెత్తాడు. గుమ్మడిపాదున్న గుడిసెచేరి ఒగర్పుతో రొజుతూ చప్పున అరవలేక తలుపు దబాదబా కొట్టాడు. "రంగా - నీవా -" అని లోపలనుంచి వినబడ్డది. మళ్లీతట్టాడు, లోపలనుండి 'రంగా'. బైటినుండి బిచ్చగాడు 'కాదు. కాని, ఆ రోడ్డుమీద—' ఇంతలో ఒక ముసిలాయన తలుపుతీసి చీకట్లో బిచ్చగాణ్ని తేరిపార చూసి, 'ఎవడవురా? ఈరాత్రి. పో! బిచ్చపువెధవా! మా అబ్బాయి అనుకున్నాను—' అని బిచ్చగాని నోట్లోంచి మాట రాకమునుపే తటాలున తలుపుమూసేశాడు. బిచ్చగాడు చకితుడైపోయాడు.

'ఏమిటి! నేనేంచేశాను - ఓ! నిద్రచెడితేపాను కాదూ! ఐనా పాపమతనికొడుకు సంగతి తెలియ దుగా' అని మళ్లీతలుపు కొట్టాడు. ఇప్పటికి బిచ్చగానికి ఒగర్పు తగ్గి గొంతునుండి మాట బైటికివచ్చింది. 'తలుపు తీయండి బాబూ' అని కేకపెట్టాడు. అతని స్వరములోని ఆదుర్దాను గమనించి మళ్లీకోపముతో

'పోతావా? లేదా? వెధవా' అని లోపలనుంచి గర్జించాడు బండివాని తండ్రి. 'లేదుబాబూ, నా మాట వినండి' అని దీనంగా పలికాడు బిచ్చకాడు. లోపలనుండి ఆడమనిషి కంఠస్వరము 'కసరడమెందుకండీ? ఏం చెబుతాడో వినకూడదూ?' 'వినాలిగా - పళ్లురాలగొట్టక. రాత్రిలేదు, పగలులేదు బిచ్చానికి. ఏదీ వాడింకోసారి రాత్రుళ్లు నిద్రచెఱపకుండా బుద్ధిచెబుతానుండు' అని దబాలున తలుపు తీసి చేతిలో కట్టెతో ప్రత్యక్షమయ్యాడు ఇంటియజమాని.

దెబ్బకొడతాడేమోనని త్రుళ్లిపడి వెనక్కుతగ్గి, బిచ్చగాడు రంగడిసంగతి చెప్పనోరుతెరిచాడు. ఇంతలో - 'పొమ్మన్లే గాడిదకొడకా. వినపడలా? అర్ధరాత్రి నిద్రచెరిపి మరీ, బేజారుచేస్తున్నావు - పో -' అని తెల్లబోయి నిలబడిపోయిచూస్తూన్న బిచ్చగాడి నొకదెబ్బకొట్టాడు. పాపము! ఎముకలపోగులావున్న బిచ్చగాడికా దెబ్బఎంతోబాధపెట్టింది. భయముతో వెనక్కుతిరిగి పరుగెత్తాడు. కొంచెందూరము పోయి నిలబడిపోయాడు. ఇంతనీచంగా, హీనంగా తన్నెందుకు చూస్తారు ప్రజలు? తానుబిచ్చగాడనేనా? ఐతేమాత్రము? పిడికెడన్నముకోసరము వస్తేమట్టుకు దానికింత నిరాదరణా, క్రౌర్యమూనా?

బిచ్చగానికింతలో అవతలగోడ్డుమీద దిక్కులేకుండా, భారంక్రింద కుంగిపోతున్న బండివాని నిస్సహాయస్థితి చటుక్కున జ్ఞాపకానికివచ్చింది. 'అయ్యో, ఏంచెయ్యను? మళ్లీమళ్లీ తలుపుకొడితే ముసలాడు చావకొట్టుతాడు. ఇంకెవరినన్నా లేపుకుని తీసుకుపోదామంటే వాళ్లూ యిట్లాగే వర్తిస్తారు. ఇంకేమిచెయ్యాలి?' అని ఆందోళనతో జాలితో తల్లడిల్లిపోయాడు. కాస్త సంకోచించి రంగడున్నవేపు రోడ్డుమీది కొక్కపరుగు తీశాడు. తనశక్తంతాధారపోసి, తననరాలు బండిబరువుకి తెగినాసరే, బండినిజరిపి రంగడిప్రాణాలు నిలుపుదామని పిచ్చియూహతో—రంగడున్నస్థలం చేరీచేరకముసుపే 'అబ్బాయి, అబ్బాయి' అని కేకపెట్టాడు జవాబులేదు. సమీపించి మళ్లీపిలిచాడు. మళ్లీప్రత్యుత్తరమురాలేదు-ఆదుర్దాతో వంగిచూసేసరికింకేముంది? బండిచక్రము రంగడి వక్షముమీదపడి అతణ్ణి నలిపివేసింది. కండ్లు మూతపడివున్నవి. నోట్లోంచి రక్తముకారుతోంది. అట్లాగే నిశ్చేష్టుడయి బిచ్చగాడు నిల్చిపోయాడు. తర్వాత మెల్లగా కూలబడ్డాడు. అతనికి తెలియకుండానే రెండశ్రువులా కృంగిన కండ్లలోంచి శవముమీద పడ్డవి.

అతడక్లే ఎంతోసేపు కొయ్యబారిపోయాడు. అంతమూర్ఖముతో, నిర్దయతో, తనను తరిమివేసి, రంగడిని చావువాతవేసిన ఆ ముసలాడు జ్ఞాపకానికొచ్చాడు. అప్పుడతనికి జీవితంలో ఎన్నడూరాని, ఎక్కడలేని కోపమూ ముంచుకొచ్చింది. మెల్లగాలేచి నిదానంగా తనజోలినీ, గొంగడినీ సవరించుకొని రంగడింటివేపు మళ్లీదారి బట్టాడు. చేరాక వెనకటి గాభరాలేకుండా ఈసారి తలుపును నెమ్మదిగా కొట్టాడు. అప్పుడంటే రంగని ప్రాణాలు కాపాడే తొందర; మరి ఇప్పుడో...........

లోపలినుండి 'రంగా - నీవా? వస్తున్నానుండు' అని రంగనితండ్రి 'ఎంతపొద్దుపోయింది నాయనా?' అని తల్లి. రంగనితండ్రి లేచివచ్చి తలుపుతీశాడు. బిచ్చగాడు 'నేను రంగడినికాను - ఒక్కగడియకింద రాలేశ? నీకొడుకు బండికిందపడి చావసిద్ధముగా వున్నాడని చెప్పడానికి, ఆ బిచ్చపువెధవను-' రంగనితండ్రి గాభరాతో 'ఆ! ఏమిరా? లోపలికిరా. ఏంజరిగింది? చెప్పూ-' అని తలుపు బారుగాతెరిచాడు. వీండ్ల మాటలు వింటూ తలుపవతలవున్న రంగనితల్లి బోరునఏడుస్తూ కూలబడి పోయింది. ముసలివాడు చేతికర్రను తీసుకొని చెప్పులుతొడుక్కొని 'ఒరే అబ్బీ, పద ఎక్కడ?' అని దబదబ బైటికివచ్చాడు. బిచ్చగానినికానక 'ఒరే అబ్బీ, ఒరేయి అబ్బీ' అని ఆందోళనతో అరిచాడు. కాని అతనికి జవాబిచ్చేవారెవరూ లేకపోయారు. ఆ బిచ్చగాడా చీకట్లో అప్పుడేఎక్కడికో వెళ్లిపోయాడు.

దూరాన్ని ఒక కుక్కమాత్రము మొరిగింది. అప్పుడేవచ్చిన గుడ్డివెన్నెలకు తెల్లవారిందనుకొని పక్క కోడికూసింది—అంతే...............



తారలు ఏమిచెప్పెదరు

హిందూదేశ సినీమా తారలలో ఉత్తమ శ్రేణికిచెందిన న్యూ థియేటర్సు వారి తారయైన **జమునాదేవి*** ఒక కప్పు టీ వలె సేద దీర్చ గలిగినదీ, ఆనందపర్చ గలిగినదీ, మరొకటి లేదు* అని చెప్పుచున్నది. జమునా దేవి తనఉత్సాహ శక్తుల కాపాడుకొనుటకు యీ పానీయమందలి అమోఘ గుణమైన "సేద దీర్చగల" దను పదమును గూర్చి నొక్కి చెప్పుట గుర్తించ తగియుంది. మీ ప్రియమైన తార ననుసరించి ఇండియా టీ ని త్రాగుము.

★తారలందరు★ వాడుచున్నది ఇండియన్ టీ

ఇండియన్ టీ మార్కెట్ ఎక్స్‌పాన్‌షన్ బోర్డువారిచే ప్రకటించబడింది



తార — అభినేత్రి పుష్పవల్లి

శ్రీమతి బ్రిజిలాల్ నెహ్రూ

రాబోవు అఖిలభారత మహిళా మహాసభకు అధ్యక్షురాలుగా ఏక గ్రీవముగా ఎన్నుకొనబడినారు



కుమారి సి. ఎ. రాధాబాయి

బి. ఎ. (ఆనర్సు)

'దక్షిణదేశంలో ఫిలిం పరిశ్రమ' అనే గ్రంథాన్నివ్రాసి, మద్రాసు యూనివర్సిటీ వారివల్ల యం. లిట్. పట్టం బహూకరింపబడింది. ఫిలిం పరిశ్రమనుగురించి స్త్రీలు రచనసాగించడమూ, అందులో సత్కృతులు పొందడమూ కూడా ఇదే మొదటిసారి.



పతాకసందేశము

జాతికిచిహ్నమ్మ జండాయెసుమ్మ
నీతినిఁదెల్పుచు నిలుచున్న దిచట.

భారతీయులశక్తి భారతీయుల యుక్తి
భారతీయుల ప్రతిభ భద్రపరచినది.

జాతీయతాసక్తి శాశ్వతమ్ముగఁ జేయ
జాతీయకేతువే సాధనమ్మరయ.

మూడురంగులతోడ ముచ్చటైయుండి
వేడుకను గలిగించు విజ్ఞాన మొసఁగు.

మూడుగుణంబులు ముడివడినట్లు
మూడుమతములకు మూలమ్ము జండా.

హిందూముసల్మానులందుఁ గ్రైస్తవుల
సందేహమందకే సమకూర్పఁ గలదు.

ఎవ్వారు చెప్పిన నెట్లు చెప్పినను
భావైక్యమందిన ఫలమందవచ్చు.

పలుజాతి జనములు కలిసినట్లైన
వెలలేని ఫలమబ్బు నిలలోన నిజము.

ఐకమత్యంబె మనకాదర్శ ధర్మ
మికనైన భారతా! వేగిరంపడుమ!

ఎన్నివర్ణాలైన నిటులేకమైన
నెన్నికల్ జయముతో సన్నుతికెక్కు.

త్యాగంబహింస సాహసమను మాటి
యోగంబుఁ జూపుచున్నదీ జండా.

త్యాగమ్మునకు గుర్తు జేగూరురంగు
భోగమ్ములను వీడి పొందనుచుండె.

సహనమహింసయే జయమిచ్చుననుచు
రహివహించెను తెల్లరంగు నందముగ.

నిరపాయమును దెల్పు తరచైన పచ్చ
వరసాహసాంకమై వరలుచునుండు.

పైని రాట్నఁపుబొమ్మ బంగారుదిమ్మ
మనపరిశ్రమయిదే మరువకుఁడనుచు.

చాటిచెప్పెడు భంగినూటిగా నమరె
నేఁటికాలమునకు నిదియె ధర్మమ్ము.

యంత్రములనుగూడ నణపంగఁజాలు
మంత్రమాధ్వనియందు మారుమ్రోగెడిని.

కాదనకీవృత్తిఁ గడకతోఁ బెనుప
బీదల పాలిఁటి పెన్నిధియగును.

పోయిన స్వాతంత్ర్యమును గోరునెడల
వేయుఁడు ముందంజ వీరత్వమునను.

గాంధీమహాత్ముని ఘనమైనకోర్కె
సందేశరూపాన నిందిమిడి యుండె.

● శ్రీమతి వేదవల్లి తాయారమ్మ ●

లక్ష్మి

శ్రీమతి
దేశిరాజు
భారతీదేవి

★

కోటమ్మకిద్దరుపిల్లలు. పెద్దదైన కొమార్తెకుమాత్రము పెండ్లి జేసింది. ఆమెభర్త చనిపోయినాడు. యెనిమిదేండ్ల యీడుగల కొడుకు మాత్రము తండ్రిపోయినతర్వాత అదుపాజ్ఞలులేక దుస్సాంగత్యముచేత తల్లిమాటవినక ఒకనాటిరాత్రి చెప్పకుండా యెక్కడికో పారిపోయినాడు. భర్తపోయిన దుఃఖానికి తోడుకొడుకు దుష్ప్రవర్తన యీమెను కృంగదీసింది. యెంతవెదకినా యెచ్చటా కనబడ లేదు. ఇక నిరాశజెంది కొమార్తెనే అన్నిటికిని దిక్కనినమ్మి ఆమెవద్దనే వున్నది కోటమ్మ. కాని తగిలినవేలుకే తగులుతుందన్న సామ్యమట్లు కోటమ్మకష్టాలు గట్టెక్కలేదు. ప్రసవమై పదిరోజుల పసికూనను తల్లికివప్పగించి కోటమ్మకూతురు చనిపోయినది. దుర్భర గర్భశోకమునకుతోడు పసిబిడ్డ పెంపక మామెకత్యంత బాధాకరమైనది. వెంటనే ఆ పసికూననుతీసికొని చేరువనేయున్న ఒక బస్తీచేరి ఆ బాలికను పోషించుకొంటూ తన పొట్టబోసుకుంటున్నది. తర్వాత సంవత్సరానికి కోటమ్మ అల్లుడుగూడ పాముకఱచిపోయినట్లు విని తన దురదృష్టానికి మిక్కిలి వగచింది కోటమ్మ. ఇక లక్ష్మికి దిక్కులేదు. 'తాను చనిపోతే ఆ బాలికగతియేమిటి!' అనే దిగులుతో నానాటికి కృంగి కుళ్లిపోతున్నది కోటమ్మ. కాని యేమిచెయ్యగలదు?

* * *

కాలచక్రం గిఱ్ఱున తిరిగిపోతూన్నది. లక్ష్మి వ్యక్తురాలైనది. కోటమ్మ యీరాటము యెక్కువైనది. తాను పాచిపనిజేసేయింట్లో లక్ష్మిని ప్రవేశపెట్టి తాను మనమరాలి పెండ్లివిషయమై వరుణ్ణి వెదకసాగింది. తనశక్తివంచనలేకుండా ప్రయత్నంజేసింది. తుదకొక రెండవపెళ్లి వరుణ్ణి కుదుర్చింది కోటమ్మ. వాడివిషయం విచారించిచూచిన లక్ష్మికి పైప్రాణంపైనే యెగిరిపోయింది. వానివిషయమై కోటమ్మకు తెలిసినదంతయు వట్టికల్ల. కాని అమాయకురాలగు కోటమ్మ వాని మాయమాటలు నమ్మింది. వెంటనే పెండ్లిజేసి తనబరువు తీర్చుకుందామని వూహించింది. లక్ష్మికి తెలియజేసింది. ఆమె యిష్టపడలేదు. కొన్నాళ్లు గడిచాయి.

ఒకనాటిప్రొద్దుట పాచిపనిజేసి యింటికొచ్చేప్పటికి అవ్వపిలిచి తనుపండుకున్న మంచంమీద కూర్చోమనిచెప్పి మనుమరాలితో యిట్లా చెప్పింది. 'లచ్చీ, నేనింక ఎక్కువరోజులు బతికేట్టుగాలేను. నాకున్నదల్లా నీ పెండ్లివిషయమే దిగులు. నీవొకయింటిదానివైతే చూచిపోతాను. నాదిగులు తీరుతుంది. నిన్నెవరేమంటారో, ఆనక నీవేమి తిప్పలుపడుతావో. దిక్కులేనిదానివై యీ గుడిసెలో వక్కదానివేవుంటే నిన్నెవరేమంటారో, అమ్మా, నామాటినుకోతల్లీ. వాణ్ణి జేసుకో'మంటూ హితబోధజేసింది. అసహాయురాలగు ఆబాలిక యేమి చెయ్యగలదు? అమాయకురాలైన అవ్వ లోకులమాటలువిని తనసుఖము చూడటములేదు. పెండ్లిచెయ్యటమే ప్రధానమనుకొంటున్నది గాని వేరేయాలోచనయేమీ చేయటములేదు. 'అవ్వా, ఆలోచించి మాటలాడు చెపుతాలేయే, నన్నెందుకు గోలబెడతావు' అన్నది ధైర్యంతో.

ప్రతిరోజూ వెళ్లేవేళతప్పి పనిలోకి వెళ్లడము, మామూలుగా వుండే వుత్సాహమేమీ లేకుండా బిక్కమొగముతో దుఃఖాన్ని దిగమ్రింగుకుంటూవచ్చిన లక్ష్మినిచూచి యజమానురాలు సత్యవతమ్మగారు 'ఏమే లక్ష్మీ, చాలా ఆలస్యముగావచ్చావు? అట్లావున్నావేమే' అన్నది. ఆ మాటకు భయపడి 'ఏమీ లేదమ్మా. నిద్రబోయిలేచి యిప్పుడేవచ్చాను. దబ్బున మెలకువ రాలేదమ్మా' అంటూ మొగంతిప్పుకుని వెళ్లి అంట్లుతోముతూ కూర్చున్నది లక్ష్మి. కాని వచ్చిందిమొదలు దానివాలకమంతా కనిబెట్టివున్న సత్యవతమ్మ గారు యెట్లాగైనా దానిసంగతి పూర్తిగా తెలుసుకోవాలని అనుకుంది.

సర్కిల్ యినస్పెక్టర్ వెంకయ్యానాయుడుగారికి క్రొత్తగా యీవూరు బదిలీయైనది. వారువచ్చి నాలుగుమాసాలేగాని, డాక్టరు నారాయణరావు పంతులుగారికి నాయుడుగారికి మంచిస్నేహము కుదిరింది. నారాయణరావుగారు వస్తుతః ఉదారస్వభావులు. యితరుల కష్టములుచూచి సహించలేరు. ఎవరికే యాపద వచ్చినా తనకేవచ్చినట్లు భావించి వారికివచ్చినకష్టము తీరేవరకు వూరుకోక తన శక్తికొద్దీ సహాయముచేసే వాడు. బీదలకు వుచితముగా మందులివ్వడము, నిరుద్యోగులకేదైన పనిగల్పించి సహాయముచెయ్యడము, ఆయన ముఖ్యనియమాలు. నాలుగుమాసాల స్నేహంలోనే వెంకయ్యానాయుడి కుటుంబపరిస్థితులన్నీ విచారించాడు. వెంకయ్యానాయుడు తనబాల్యములోనే యెవ్వరికీచెప్పకుండా బొంబాయివెళ్లడము, అచ్చట ఒక మహాశయుని సహాయమువల్ల చదువుకోవటము, అక్కడే పెండ్లాడి ఉద్యోగియై స్వదేశానికి తిరిగి రావడము, తల్లిని విచారించడము, ఆమెసంగతేమీ తెలియక నిరాశజెందటము, ఆరుమాసములక్రిందట భార్యచనిపోవడము, తానావూళ్లోవుండలేక యీవూరు బదలీ చేయించుకోవడము మొదలైన సంగతులన్నీ తెలుసుకున్నాడు; తన భార్యకూడా తెలియజేశాడు. తల్లిలేనిపిల్లలని నాయుడుగారి పిల్లలిద్దరిని తనపిల్లలతో సమంగా ఆదరించే వారాదంపతులు. మళ్లీ నాయుడుగారికి పెండ్లిజేయాలని సత్యవతమ్మ నారాయణరావుగార్లు ప్రయత్నం జేస్తున్నారు.

*   *   *

లక్ష్మి మామూలుపనులన్నీ దీర్చి 'అమ్మా శలవిప్పిస్తారా! పనులన్నీ అయినాయి' అన్నది సత్యవతమ్మగారితో. ఆమెనవ్వుతూ 'వెళ్లుదువుగాని, రా పనియున్నది' అంటూ మేడమీదకు తీసికొనివెళ్లి తానొకకుర్చీలో కూర్చుని లక్ష్మిని దగ్గరగా కూర్చోమంది.

సత్యవతమ్మ:-లక్ష్మి నీవివ్వాళ ఏమో దిగులుగావున్నావు. చాలా యేడ్చినట్టుగా నీ మొగమంతా కందిపోయింది. మీఅవ్వ కులాసాగా యున్నదా?

లక్ష్మి:-ఏమి కులాసా తల్లీ, ఏమి బాగాలేదు దానిసంగతి అయ్యగారిచ్చిన మందు పోస్తున్నాను. దానికేమి? నయమైనా కాకపోయినా మారాజే, వున్నవాళ్లకేగదమ్మా తిప్పలు?

అంటూ కళ్లనీళ్లుబెట్టుకున్నది. ఆమాటవిని సత్యవతమ్మగారు కేవలము అవ్వజబ్బువల్లనే యీపిల్ల దిగులుపడుతున్నట్లు లేదు. వేరే యేదో కారణమున్నట్టు గ్రహించి చాలా ఆదరముగా, 'లక్ష్మి నీకు వేరే దిక్కెవ్వరూ లేరుగదా? నేను నీతల్లివంటిదాన్ని. నీమనస్సులోసంగతి దాచకుండా నాకుచెప్పు నాచేత నయినంత సహాయముచేస్తాను. కేవలము నీకు అవ్వనుగూర్చిన దిగులేగాకుండా యేదోయితరమైన దిగులుతో బాధపడుతున్నావు. నాతోచెప్పనిది నిన్ను యివ్వాళ యింటికి వెళ్లనీయను' అన్నది. ఆమాట కాబాలిక హృదయం పులకరించిపోయింది. తనవిషయమంత శ్రద్ధగా కనుగొనవలెనను కుతూహలము జూపినవారుగాని, తనయందంతాదరము కనబఱచినవారుగాని యిదివరకెవ్వరూ కనబడలేదు. సత్యవతమ్మగారే తనకా సమయములో తల్లివలె తోచిందామెకు. తనఅవ్వచనిపోతే యికదిక్కు యీతల్లేగదా! యీమే పోషకురాలు కావున యీమెకుచెప్పక యింకెవ్వరికి చెప్పేదనుకొన్నది. పూసగ్రుచ్చినట్టు తనసంగతంతాచెప్పి ఆమె కాళ్లరెండూపట్టుకొని భోరున విలపించినది లక్ష్మి. దిక్కులేనితనానికి బిడ్డలతల్లియగు ఆ మాతృహృదయం ద్రవించిపోగా కన్నులార్ద్రములైనవి. 'లక్ష్మి, నీవు దుఃఖపడవద్దు. నీవు నా బిడ్డవంటిదానవు. నీకు పెండ్లిజేసే భారమునాది. నీవు మీఅవ్వమాటలు వినవద్దు. ఆ త్రాగుబోతువాణ్ణి చేసికోవద్దు' అంటూ ఖండితముగా జెప్పి, భయపడవద్దని అభయహస్త మిచ్చిందామె.

మనుమరాలు తనమాటను త్రోసివేస్తుందని కల్లోకూడా తలపోయలేదు కోటమ్మ, కాని యేమి చేస్తుంది? ఆరోజుకారోజు కామెవ్యాధి తీవ్రరూపము దాల్చుతోంది. లక్ష్మి పూర్తిగా నిరాశజెందింది. అయ్యగారి దగ్గఱకెళ్లి మొరబెట్టుకొన్నది. కాసేపుండి వచ్చిచూచి మందిస్తానని నారాయణరావుగారు చెప్పి పంపినారు.

వెంకయ్యానాయుడిగారితో కలిసి షికారు వెళ్లుతూ త్రోవలో కోటమ్మ గుడిసెలో కాలు పెట్టినాడు నారాయణరావుగారు. లోపల కోటమ్మ లక్ష్మికి కుదిర్చిన వరుడు చాల గడబిడ జేస్తున్నాడు. వ్యాధిచేత బాధపడుతూన్న కోటమ్మను త్రాగివచ్చిన మత్తులో అనరానిమాటలని యింకా యెక్కువ బాధపెడుతున్నాడు. డాక్టరుగారిని చూడగానే లక్ష్మి సంతోషముతో 'రండయ్యగారు' అంటూ లేచింది. ఆయనవెళ్లి 'కోటీ, కులాసాగా వున్నావా?' అంటూ ఆమె చెయ్యిచూచి, గుండె పరీక్షజేసి 'సరే మందు పంపుతాను, కాని వీడెవ్వడు' అన్నాడు. అందుకా త్రాగుబోతు 'చూడండయ్యా, పెద్దమనుసులు. యీ ముసిల్ది నాకు పిల్లనిస్తానని జెప్పి యిప్పుడొల్లకాదంటది' అంటూ తీవ్రంగా అరవడము మొదలుబెట్టినాడు. ఈ కేకల కిరుగు పొరుగులంతా మూగినారు. రోడ్డుమీద నిలబడివున్న వెంకయ్యానాయుడు లోపలకొచ్చి చూచి, మనిషిని గుర్తుబట్టి యీ త్రాగుబోతు వాడిదివరలో చోరీ నేరం క్రింద అరెస్టయి, జామీనుమీద విడదలై యున్నట్లు చెప్పినాడు. కోటమ్మ సంగతంతాచెప్పి యీ ముదుసలిని వీడు పిల్లనివ్వలేదని పీడిస్తున్నట్లు డాక్టరుగారు నాయుడుగారికి చెప్పగా తొందరగా కోటమ్మదగ్గఱకెళ్లి నిదానించి చూచి, నిశ్చేష్టుడై కొంతసేపటికి తెప్పరిల్లి 'అమ్మా' అంటూ ఆమెమీద వ్రాలిపోయినాడు వెంకయ్యానాయుడు. 'అమ్మా' అన్నమాట చెవిబడగానే పంచప్రాణాలు లేచివచ్చినట్లు కాగా ఆనందాతిరేకమున 'నాయనా, వెంకూ యెక్కడకెళ్లావు? యెక్కడున్నావు? యెప్పుడొచ్చావు?' మొదలైన ప్రశ్నలవర్షం కురిపించింది కోటమ్మ. తాను మంచి హోదాగల ఉద్యోగియైయుండి ఆ వూళ్లోనే తనతల్లి దిక్కులేక దీనతగావున్న సంగతి వెంకయ్యానాయడి కడుపులో చెయ్యిబెట్టి కలచినట్లయింది. కోటమ్మ మాటలకేమీ సమాధానం చెప్పలేకపోయినాడు. కొంచెముసేపెవ్వరు మాట్లాడలేదు. 'అయ్యా మీ అక్క చనిపోతూ పదిరోజులబిడ్డను నాకువప్పగించి పోయింది. మీ బావకూడా పోయినాడు. దిక్కులేని యీ బిడ్డను పెంచాను. దేవుడిదయవల్ల నువ్వు మళ్లీ కనబడ్డావు. నాయనా, నాదిగులు తీరింది. దీనికి నువ్వేదిక్కు. లచ్చి! రా తల్లి. మీమామ యిడుగో. దేముడుదయవల్ల మళ్లీ మా నాయనకళ్లకు కనబడ్డాడు. నీకుకూడా వీడే దిక్కు తల్లి' అంటూ ఆనందాతిరేకముచేత కన్నీళ్లుగార్చింది. సంతోషము సగము సత్తువ అన్నట్లు చాలాకాలమునుండి లేవలేక నీరసముగావున్న కోటమ్మ లేచి కూర్చున్నది. విషయమంతా నిమిషములో గ్రహించిన నారాయణరావుగారు వెంటనే బండినొకటిపిలిపించి లక్ష్మిని, కోటమ్మను ప్రయాణము చేయసాగినాడు. లక్ష్మిని డాక్టరుగారింట్లో పనిజేసేసమయములో చూచివున్న నాయుడు మళ్లీ యిప్పుడుచూచి చాల కటకటపడ్డాడు. వెంటనే డాక్టరుగారి ప్రోత్సాహముచేత వెంటనే తల్లిని, కోడల్ని తనయింటికి తీసుకునివెళ్లినాడు నాయుడు.

శుభముహూర్తమున లక్ష్మిని వెంకయ్యానాయుడికిచ్చి పెండ్లిజేయించినాడు నారాయణరావుపంతులు. మనుమరాలిని తనకొడుకు వివాహమాడుట కళ్లారచూచి ఆనందించింది కోటమ్మ. కాని కొద్దిరోజులలోనే తానీలోకాన్ని విడచిపోయింది. కాని లక్ష్మిమాత్ర మామెను మరచిపోలేకపోయింది చాలాకాలము. డాక్టరు దంపతుల ఆశ్చర్యానికి మేరలేదు. ఎప్పుడైనా వెళ్లితే సంతోషంగా 'లక్ష్మి, నీ పెండ్లిజేసేభారం నాదే' నంటూవుంటుంది నవ్వుతూ, సత్యవతమ్మగారు.



ఇప్పుడు నీ యొక్క సొగసైన వస్తువులనన్నిటిని నీకిష్టము వచ్చినప్పుడెల్ల పలుమారు లక్సుతో జాగ్రతగ నుంచుకొన వచ్చును. ఎందుకనిన నీ పైకమునకు ఈ పెద్ద సైజు లక్సు ఎక్కువ సోపును ఇచ్చుచున్నది. గట్టి రంగుగల పట్టు వస్త్రములను, కంబళము మొదలైన ఉన్ని వస్త్రములను చాల జాగ్రత్తగ లక్సు ఉతుకును. చల్లని నీటిలో లక్సు నురుగును ధారాళముగ నిచ్చును. నీ మలినమైనట్టి సూక్ష్మమైన వస్త్రముల లక్సు నురుగులో జాగ్రత్తగ పులిమిన, మలినమును చెమటయు పూర్తిగ తొలగిపోవును. ఎట్టి చెరుపును కలుగనీయక బాగుగ శుభ్రపరచును. చన్నీటిలో చెరుపులేక దేనిని నీవు తడపవచ్చునో వాని నన్నిటిని లక్సులో ఎట్టి హానిలేక ఉతక వచ్చును!

క్రొత్త పెద్ద సైజు లక్సు

కొనుటచేత నీ పైకమునకు ఎక్కువ సోపును పొందెదవు



చిన్న సైజు, సాధారణ సైజు లక్సు ప్యాకెట్లు కూడను నీ పైకమునకు గొప్ప ఆదాయము నిచ్చును.

LX. 7-178 TE.

LEVER BROTHERS (INDIA) LIMITED

★ విద్యాస్వరూపము

ఆదర్శమునకు నైతిక విచ్ఛిత్తి ★

• శ్రీమతి బూరుగుల రుక్మిణీబాయి •

విద్యార్థియొక్క మెదడు అనంతములగు శక్తులకు కేంద్రము. అందుండి జీవితాచారాదర్శము లుత్పన్నములగుచున్నవి అట్టి యాదర్శములకు నైక్యత చెడినది. గ్రామజీవితమంతయు పట్టణవాసములకు బలియైపోయి నది. వృత్తివిద్యలన్నియు యంత్రధాటి కాహుతియైపోయినవి. స్త్రీ పురుష ధర్మమంతయు సాంప్రదాయ విచ్ఛిత్తి నందియున్నది. ప్రాచ్య - పాశ్చాత్య సంఘటనమువలన దాస్యస్వాతంత్ర్యపోరాట మేర్పడినది. ఈవిధముగా విచారింప విద్యార్థిజీవితమంతయు నొక విషాదపూరిత దృశ్యకావ్యమైపోయినది.

వేదకాలమును పరికింపగా విద్యాసముపార్జనమొనర్చు స్త్రీ పురుషు లెనిమిదివత్సరములకే ఉపనయనాది సంస్కారమునొంది గురుకులములం దొదలబడెడివారు. అచ్చటి గురువులు విజ్ఞానజిజ్ఞాసాపీడితులే కాని ధనజిజ్ఞాసాపీడితులు కారు. వారెల్లెడలను 'విద్య - విద్యకొఱకే' అను నాదర్శమునే యనుష్ఠించుచుండిరి. అట్టియెడ విద్యాసముపార్జనాశీలురగు స్త్రీ పురుషులు, గురుదత్తములగు వేదశాస్త్రకళాప్రావీణ్యముచే పటిష్ఠులై, 'క్షణశఃకణశశ్చైవ విద్యామర్థంచసాధయేత్' అను నియమమునకు గురియై, గురుకులములనుండి విడువబడియు, తమ విజ్ఞానబీజములను విశ్వశ్రేయఃస్సాధనమునకై వినియోగించి బ్రహ్మచర్య ధర్మమున సంపూర్ణమగు ఫలసిద్ధినంది గార్హ్యస్థ్యమును స్వీకరించి విజ్ఞానజిజ్ఞాసా ప్రపూర్ణులై, ఇహపరములందు జీవిత సాఫల్యమును గాంచెడివారు.

ఇక ఆధునికస్వరూపమున, మనము రాజ్యభ్రష్టులము, బానిసలము. కావుననే పాశ్చాత్య వ్యామోహపాశములచే ముందు మానసిక బానిసత్వమును, ఆ పై దైహిక బానిసత్వమును, ఆ పై పారలౌకిక బానిసత్వములు మనకు సిద్ధించినవి. ఇట్టియెడ నేటి పాలక రాజ్యతంత్రజ్ఞులకు లోనై, అత్యల్ప వేతనములకు మన మనోదేహజీవముల నమ్ముడుపెట్టితిమి. మన బాల్య యౌవన కౌమారాద్యవస్థలన్నియు, అనుక్షణము భ్రష్ట పాశ్చాత్య సభ్యత్వమునకే గురియగుచున్నవి. అట్టి సభ్యత్వముచే యువతీయువకుల బ్రహ్మచర్యధర్మము సంపూర్ణస్వాతంత్ర్యమైనది. బ్రహ్మచర్యముచే సాధింపతగిన రాజకీయ, ఆర్థిక, నైతికశక్తి కుంటువడి సంపూర్ణస్వాతంత్ర్య సంగ్రామమున పరాజయము నందుచున్నాము. బ్రహ్మచర్యేతరములగు గార్హస్థ్యాద్యాశ్రమములందుకూడ సర్వాంగసుందరమగు ధర్మానుష్ఠానమును చేయజాలకుంటిమి. కావుననే మహాత్మాగాంధి బ్రహ్మచర్యాశ్ర

శ్రమధర్మముల నన్నిటిని తన జీవితమున ఆదర్శభూతములొనర్చుచూ నేటి పాశ్చాత్య విద్యాసభ్యత్వమును రూపుమాపి భారతీయ యువతీయువకులను అజ్ఞానతిమిర సుషుప్త్యవస్థలనుండి జాగ్రతమొనర్చి విద్యావిధానమును మార్పునొందించుచున్నాడు.

నేటి విద్యార్థి లక్షణము - దౌర్బల్యము

ఇప్పుడు ఎన్నియో సభలు ప్రచలితములగుచునే యున్నవి. కాని ఆయా సమావేశకాలములకు విద్యావంతులు చేరుచున్నారే కాని వారు చేయు తీర్మానములన్నియు విద్యాసంస్కరణోన్ముఖములు కాక శక్తిక్షైణ్యమునకు, నిరుద్యోగసమస్యకు స్థానభూతములుమాత్రమే యైనవి.

కళాశాలలందుగాని - విశ్వవిద్యాలయములందుగాని తయారగు గ్రాడ్యుయేడ్లు జవసత్వములుడిగి వాడిన ముఖములు, గుంటలుపడిన కనుదోయి, అంటుకుపోయిన చెక్కిలి, ఎండిన పెదవులతోడను ప్రత్యక్షమగుచున్నారు. మెదడుమాత్రమే వీరికి సజీవమైయున్నది - అదియును నిస్తేజముగ.

గృహమునకును - విద్యాలయమునకు దుర్భేద్యమగు భిత్తి నిర్మింపబడినది. విద్యావిధానమంతయు సాంఘిక సాంప్రదాయైక్యతను విచ్ఛిత్తి చేయుచున్నది. గృహమున బాల్యవివాహములు, విద్యాలయములందు శృంగారరసప్రబోధపూరితములగు కావ్యపఠనము చేయబడుచున్నది. వ్యవహారమున రాజభక్తి యెక్కుడు. కోరికయందుమాత్రము ప్రజాస్వాతంత్ర్యప్రబోధము మాత్రమే చేయబడుచున్నది. విచారింపగా నీ పరిస్థితులన్నియు బయటనుండి - అనగా విజాతీయతనుండి యుత్పన్నములై యువజన విద్యార్థులయొక్క ఆదర్శ విచ్ఛిత్తిని కలుగఁజేయుచున్నవి.

ఇతరదేశములు - యువజనసంఘము

స్వతంత్రదేశముల పరికింప, అచ్చటి యువజన విద్యాలక్షణము, భవిష్యద్దశాకార్యముల సృష్టించి, ఆత్మవిశ్వాసమును వికసింపఁజేయుచున్నది. వర్తమానకాల పరిస్థితులను సాహసముచే కార్యప్రణాళికయందు పరివర్తనమొనర్చుచున్నది. ఆశాజ్యోతిని త్యజింపక జీవితమును దీపశిఖవలె జ్వలింపఁజేయును. దేశముయొక్క భవితవ్యసిద్ధినంతను, అచ్చటి యువజన విద్యాలక్షణమే పరిష్కరించుచున్నది. కావుననే వారి యుద్యమములు దేశమహత్తును ప్రదీపింపఁజేయుచున్నవి. ఆ సంఘము లెల్లెడలను స్వాతంత్ర్యవాయువునే పీల్చుచున్నవి. ఆ సంఘముల రక్తము వీరపురుషుల చరిత్రలచే నుద్రిక్తమైయుండును. భావికాల యుత్సాహ సాహసములచే స్థైర్యమునొందియున్నవి. ఆ సంఘముల తీక్ష్ణదృష్టి కాలుమేఘముల బద్దలుచేయును.

సామ్రాజ్యసంపాదనము - ప్రాచీనాధునికము

నేడు మనకన్నులయెదుట, డిక్టేటర్‌షిప్పుల తోడను, ఫాసిజ, ఇంపీరిలిజమ్, సోషలిజములతోడను సామ్రాజ్య సంపాదనముచేయుచున్నటుల రాజ్యతంత్రము మనకు ప్రత్యక్షమగుచున్నది. ఈ వాదములతో కూడిన సామ్రాజ్యతత్వము వేదకాలమున నిమ్నోన్నతముల నొందలేదు. కాని శేషించినకాలములందు, ఒకదానివెనుక మఱొకటి ప్రచరితములై పోటీచేయుచు పోరాటమును సాగించుచున్నటుల మన ప్రాచీనచారిత్రక సాక్ష్యములున్నవి. (1) త్రేతాయుగమున రావణ కుంభకర్ణులు తపశ్శక్తి ద్వారమున వరప్రాప్తినొందిరి. రావణుడు దేవమానవులచే అవధ్యత్వమును సాధించుటకు సంపూర్ణమగుశక్తి సామర్థ్యముల నార్జించెను.

సూర్యచంద్రాద్యష్టదిక్పాలక ప్రకృతిశక్తుల నతిక్రమించి రాజ్యతంత్రమును సాగించెను. సామంతరాజు నందరిని తరాజులఁజేసెను. తన యేలుబడిలో చరాచర పదార్థముల నన్నిటిని స్వతంత్ర మొనర్చెను. ఇయ్యది సామాన్యమగు డిక్టేటరు షిప్పా! హిట్లర్ వంటి డిక్టేటర్లు రావణుని ముందు ధూపమునకైన పనికివత్తురా! ఇట్లే హిరణ్యకశ్యప, హిరణ్యాక్షు, తారకాసుర మొదలగు దానవనేతలును రాజ్యతంత్రమును నిర్వహించిరి.

మన వేదములందే 'సోషలిజ, కమ్యూనిజములకు' అంకురార్పణ చేయబడినది. 'సహనావవతు, సహనౌభునక్తు-సహవీర్యంకరవావహై- తేజస్వినావధ తమస్తుమావిద్విషావహై-ఓం శాంతిశ్శాంతిశ్శాంతిః' అని ఇప్పటికిని వైదిక సాంప్రదాయ వివాహవిధులందు స్త్రీల స్వాతంత్ర్యమునకు వలయు ధార్మికవిధుల పాణిగ్రహణమున 'ధర్మేచ, అర్థేచ, కామేచ, నాతిచరితవ్యా-నాతిచరామి' అని విధింపబడుట మనకు తెలియుచున్నది. ఇట్టి సమాన ప్రతిపత్తితోఁ గూడిన సోషలిజము వేదకాలమున మరొకరూపముననైనను, అనుష్ఠింప బడియుండెనని పై వైదిక ఋక్కుల సాక్ష్యమువలన నూహింపవలసిపడుచున్నది. కాని యిప్పటి రష్యా యందు ప్రచలితమై సిద్ధినొందిన దీమార్గమే రూపాంతరము నొందినదనవచ్చును. కాక మన వేదాంతమంతయు విశ్వమానవ సోదరత్వమునే ఘంటాపథముగ చాటుటలేదా!

రామాయణకాలమును పరికించిన డిక్టేటరులకు డిక్టేటరగు రావణుని హతమార్చి శ్రీరాముడు సోషలిజమునకు స్థానమిచ్చుటకు ప్రయత్నించలేదా! కాక అగ్నిచే పారిశుద్ధ్యమొందిన సీతా మహాసాధ్విని ప్రజానురంజనమునకై తిరిగి యరణ్యమున బలిపెట్టలేదా! లోకారాధనకై కాంతాకనకముల రెంటిని త్యాగ మొనర్చి శ్రీరామచంద్రమూర్తి మానవాదర్శముల చిరస్థాయిగ నుండునట్లొనర్చి యశఃకాయమును బడసె ననుటలో సందేహమేమికలదు? ఇట్లే మానవాదర్శముల నన్నిటిని మనకు సమకాలీనుడగు మహాత్మాగాంధీ గారు అనుభవపూర్వకముగ మన కన్నులయెదుట ప్రత్యక్ష మొనర్చుటలేదా!

నేటి భరతఖండము - తదుద్ధరణము

నేటి భరతఖండము కళామయసంపదను సంపూర్ణముగ కోల్పోయినది. కళ యనగా ఉపాధ్యాయ వృత్తి మొదలు వివిధవృత్తులను దేశ, దేహ, ప్రకృతులకును, మత సాంఘిక సాంప్రదాయములకును ఐక్యతను సంపాదించి, దేశమును వివిధదాస్యములనుండి విముక్తినొందించుటయే. ఇట్టి ప్రణాళిక నుద్ధరించుటలో మనమును నకు వృత్తికిని యభేదమును సాధించుట మొదటి ప్రయత్నము. భారతీయ గృహోపకరణములన్నిటియందును ఈ యభేదమును సమగ్రముగ ప్రతిబింబింపఁజేయవలెను.

ఋషిముఖ్యశ్రుత వేదవేదాంతాదిజ్ఞానము మొదలు బిచ్చగాండ్ర పాటలవరకును, ఒకేవిధమగు సమన్వయజ్ఞానమును తిరిగి సాధింపవలెను. జీవితములను దేశ దైవ భక్తిమయములను గావింపవలెను. ఐహికా ముష్మికములకు ఏకాత్మను సాధింపవలెను. అద్దాన జ్ఞానసమృద్ధమైన యానందము లభింపగలదు. వృత్తిపరుల హస్తముల దాగియున్న కళాప్రావీణ్యమును లెస్సగ నుద్ధరింపవలెను. అప్పుడే గ్రామ, పట్టణచైతన్యముద్దీపితమై దేశమంతయును కళామయసంపదచే విరాజిల్లగలదు ఈ ప్రయత్నము. కేవలము ధనికశక్త్యముచే సాధింపబడ నేరదు. ధనము లోకమునకు మూలశక్తియే, కాని తన్నిర్వహణమునకు విద్యాధికులగు (విజ్ఞానులగు) యువతీ యువకుల ప్రయత్నములే దోహదమొసగి సర్వసంపూర్ణమగు దేశభవితవ్యతను సిద్ధింపఁజేయగలవు.

కళ

★

శ్రీమతి
కామరాజు
మైత్రేయి

★

'ఏమండీ, మీపేరు కళా? ముద్దుగావున్నది. కళోపాసకుల లక్షణాలన్నీ వున్నాయి. ఆహా! మంచి ప్రొఫైలు వుంది. అదృష్టవంతుణ్ణి. నీవు నిజంగా కళానిధివే సుమా!' అని నెమ్మదిగా, కళను రెండు చేతులలోకి తీసికొని బలవంతంగా ముద్దుపెట్టుగోబోయ్యాడు ఆ డైరెక్టరు...

'ఛీ! వదులు...'

'వదలను ..'

'జాగ్రత్త!'

'ఏం జేస్తావు?'

'నలుగురితో చెప్పి గడ్డిపెట్టిస్తాను...'

'ఆలోచించుకో...'

'నేను సినిమాలో పనిచెయ్యను—'

'ఏం కళోపాసినివి కావూ?'

'అయితే—'

'కళ అంటే మంచిచెడ్డలతో తీసికోవాలి'

'నాకు కళలో వుండే మంచే కావాలి'

'ఛీ! నీవంటి అవ్యక్తి మరొక్కతె వుండదు. సిరి వస్తుంటే మోకాలు అడ్డుతున్నావు.'

—చెంపలున ఒక్క లెంపకాయపెట్టి, డైరెక్టరు రూములోనుంచి పరుగెత్తుకొనివచ్చి కారులోపడ్డది కళ. అంతే, అంతటితో కళకు సినిమాకు విడాకులు. ఆ పరిశ్రమలో యింక చేరనని శపథంపట్టింది ఆ కళోపాసకురాలు. మరునాడు ఆంధ్ర దైనికపత్రికలో యొక పూర్తి పేజీ యడ్వరుటైజుమెంటు—

"ఆంధ్రలోకానికి నూత్నతార, డైరక్టరు, కెమేరామేను మొదలైనవారు, ఫిలిం పరిశ్రమకు తమ శక్తినంతా ధారపోసినవారు, సమస్త కష్టాలకు, శ్రమకు, ఖర్చుకు ఓర్చి, ప్రత్యేకించి యేరిన వరాలతార— మిస్ చంచల.

అభిప్రాయాలు :—

డైరెక్టరు :- ఇంతవఱకు ఆంధ్రలోకం, కనని అందం, వినని గాత్రం. ఈమె అభినయించే నూత్నఫిలిం చూడండి.

కెమేరా :- ఏ ఫక్కీలో ఫోటో తీసినా యింత అందమైన వ్యక్తి నేను చూడలేదు.

సౌండు రికార్డరు :- ఏ స్థాయిలో పాడినా యింత హాయియైన పాట నేను వినలేదు.

మేకపు ఆర్టిస్టు :- ఏ మేకప్పు లేకుండా సహజమైన సౌందర్యం, లావణ్యం వుంది మిస్ చంచలకు.

త్వరలో రాబోవుచున్నది. రాబోయే ఉగాదికి ఆంధ్రలోకానికి కానుకగా అర్పింప దలచాము."

ఈ ప్రచురణ చూసింది కళ. భావాలు పరంపరలుగా రేగాయి. ఇవన్నీ తాను ఒప్పుకుంటే, తనకు వర్తించేవి. 'అబ్బా ఎవరినయినా చేయగలరు. ఏ తారనయినా సృష్టించగలరు. దుమ్ములో కలపగలరు. ఒకనాడు తార-మరునాడు కూడు గుడ్డలకు లేని బికారి.'

౨

కళ చిన్నప్పటినుంచి ఆదర్శకంగా పెరిగింది. బడిపంతులు సుబ్బారావుగారి కూతురు. ఈయన భార్య రాధ. ఎంతో గారాబంగా పెంచారు కళను. ఇరుగుపొరుగువారందరికి కళను చూస్తే ఎంతో ముచ్చటగావుండేది. చదువులో చురుకు. మంచి అందమైనది. సంగీతం బాగా నేర్చుకుంది. సుబ్బారావు నాట్యం అంటే చెవికోసుకునేవాడు. అందుచేత కళకు భరతనాట్యం నేర్పించాడు. తనకు వచ్చే కాస్త జీతం, కళను ఆదర్శకంగా చేయాలని మొదటనుంచి ఖర్చుపెట్టేవాడు. బళ్లో ఏ యిన్స్పెక్టర్లు వచ్చినా, ఏ ప్రైజు రోజన్నా, అందరు కళ కోసము వెదకాలిసిందే. అందరు కళను అభినందించేవారు.

ఒకరోజు బళ్లో 'పేరంట్సు - డే' ప్రతి సంవత్సరంలాగే యీ సంవత్సరము జరపడానికి ఏర్పాటులు జరిగాయి. ఆ రోజునే ప్రైజులన్నీ పిల్లలకు యిచ్చేవారు. పిల్లలు చిన్న నాటకం వేస్తారని, ఫాన్సీ వేషాలకు ప్రైజులిస్తారని ఏవేవో చెప్పుకుంటున్నారు. చిన్న పెద్ద అందరు చాలా హడావిడిగా వున్నారు. వూళ్లో వుద్యోగస్తులందరు వచ్చారు.

ప్రైజులు యిచ్చేటందుకు కలెక్టరు 'రాజు' గారికి ఆహ్వానము పంపుతే తప్పక వస్తాననీ, ఆరోజు ఆ వూళ్లో క్యాంపు వేస్తానని జవాబు వచ్చింది. ఇంతకంటే కావలసినదేమిటి? బడిఅంతా అట్టుడుకుతున్నది. మంచి తోరణాలు, ఎఱ్ఱ, పచ్చ కాగితాల జెండాలు, చెట్లమీదనుంచి బడిమీదికి, బడిమీదనుంచి చెట్లమీదికి ఎగురుతున్నాయి. సాయంత్రము 5 గంటలైంది. పిల్లలంతా మంచిమంచి జరీపావడలతో, చొక్కాలతో, వివిధరంగుల రిబ్బన్లతో, పూలతోను, ఒకరిచెయ్యి ఒకరు పట్టుకొని, గంతులువేస్తూ వుల్లాసముగా తలిదండ్రుల వెంబడి నడుస్తున్నారు. చూసేవారికి చాల హాయి గొలుపుతున్నది ఆ దృశ్యము. మంచిచెడ్డలు తెలియని ఆ పసికూనల జిలిబిలి పలుకులకు, వారు వేసే వివిధప్రశ్నలకు జవాబుచెప్పలేక, మాటలు మైమరపించి వారి పెద్దరికము కాపాడుకొనుటే ఉచితమని ఎంచి 'అదిగో, ఈవేళ కళ నాట్యం చేస్తుందిట. మీరుకూడ అలా నాట్యం నేర్చుకోకూడదా' అని పిచ్చిపిచ్చి ప్రశ్నలు వేయకుండా వారి బుద్ధి కుశలతను అణిచివేశారు.

హాలంతా క్రిక్కిరిసి తలిదండ్రులతో, ఆడపిల్లలతో కిటకిటలాడుతున్నవి. స్త్రీలు తలలలోవున్న పూలవాసనలచే హాలు పరిమళిస్తోంది.

బిళ్లబంట్రోతు, వెనక తహశీల్ దారు, రివిన్యూ యిన్స్పెక్టరు, గుమాస్తా, కలెక్టరుగారితో హుంగుగా దయచేసి వారికై ప్రత్యేకించిన స్థలాల్లో ఆసీనులయ్యారు.

మాష్టరుగారు చెప్పిన తొలిపలుకులతో వార్షికరిపోర్టు చదవటం అయింది. ప్రెసిడెంటుగారు బడియొక్క రిపోర్టు విని ఆమోదించి మాష్టర్లకు, వారుచేసిన కృషికి మెచ్చుకొని, ధన్యవాదాలు అర్పించారు. ప్రైజులు యివ్వవలసిన అవకాశము వచ్చింది. హెడ్డుమాష్టరుగారు లేచి, 'అన్నిటిలో ప్రాముఖ్యతవహించి, ప్రతి సబ్జక్టులోను ఫస్టుమార్కులు వచ్చినందున, ఫస్టుప్రైజు బంగారుపతకం కుమారి కళకు' అని చెప్పారు. ముసిముసి నవ్వులతో, సిగ్గుతో తలవంచుకుని కలెక్టరుగారిదగ్గరకు వచ్చి బంగారుపతకం తీసికొంది. అందరు కరతాళధ్వనులు చేశారు. సుబ్బారావు, రాధల కళ్లు చెమ్మగిలినాయి. వారి పిల్ల యింత మందిలో పేరుదెచ్చుకొని, అందరి మెప్పులు తెచ్చుకోవటంకంటె తల్లిదండ్రులకు కావలసిందేమిటి? మిగతా

ప్రైజులన్నీ యివ్వడము అయినవెంటనే, ఏవో కొన్ని చిన్నచిన్న సీనులు, ప్రహసనాలు అయినవి. తర్వాత కుమారి కళ నాట్యము అన్నారు.

అంతా నిశ్శబ్దంగా వుంది. ఇదివరకే ఏర్పాటుచేసిన స్టేజిలో ఫిడేలు, మృదంగ వాయిద్యములు వాయిస్తున్నారు. ఎక్కడో మురళీనినాదం వినవచ్చింది. ఆ నాదాన్ని వెతుక్కుంటూ రాధ వచ్చింది. ఆ రాధే కుమారి కళ. నాట్యంచేసికొంటూ, మురళీనాధుని వెతుక్కుంటూ, ప్రేమతో ఆహ్వానిస్తూ, ప్రేమరసం కళ్ళలో ఒలుకుతూ, మురళీనాదం విననప్పుడు నిస్పృహచెందుతూ, వివిధభావాలు ముఖంలో చూపిస్తూ చూసేవాళ్ళకు ఒళ్లు పులకరింపజేస్తోంది.

ఇంకనుకొన్ని ఆటలుపాటలు అయినతర్వాత సభముగిసింది. కలెక్టరుగారు తమ తుది ఉపన్యాస ములో, 'జీవితంలో కళ యేవిధంగా పైకివస్తుందో చూస్తువుంటాను. గృహచ్ఛిద్రాల్లోపడి 'కళ'ను మరచి పోయి, ముప్పైయేండ్లకే ముదుసలియై, జీవితముమీద రోతకలిగివుంటుందో, లేక, ఆంధ్రదేశానికి హిందూ దేశానికి పేరుతెచ్చి, కళకు మెరుగులుపెట్టుతుందో చూస్తూవుంటాను' అనిచెప్పి సభముగించారు.

3

కాలచక్రము తిరుగుతోంది. కళకు 18 సంవత్సరాలు వచ్చేయి. సుబ్బారావుగారు చనిపోయాడు. రాధకు కష్టాలుఅన్నీవచ్చాయి. ఇంట్లో మగదిక్కు లేదు. కళా తానుతప్ప ఎవ్వరులేరు. సుబ్బారావు ఆస్తి చాలావదలిపెట్టకపోయినా, ఏదో యింతతినటానికి భూవసతికల్పించాడు. దానితోటేవారు కాలము వెళ్ల బుచ్చుతున్నారు. సుబ్బారావు బ్రతికివున్నప్పుడు రాధయెంతచెప్పినా కళకు పెళ్లిచెయ్యటానికి యిష్టపడలేదు.

కళకు చిన్నప్పటినుండి సినిమాలోకివెళ్లి పెద్దతారఅయిపోవాలని ఓ కోరికవుండేది. దానికితోడు సంగీతము, నృత్యము అవికూడ వుండడముచేత మరీ అభిలాష ఎక్కువగావుండేది. రోజు పేపరులలోవుండే సినిమాపోజులు, బొమ్మలు ఆవిడను ముగ్ధురాలినిగా చేస్తూవుండేవి. ఒకనాటిపేపరులో కళ 'తారలు' కావాలన్న అడ్వరుటైజుమెంటుచూసి, ఇన్నిరోజులకు తనకోరిక తీరుతున్నది కదాఅని, ఏదో జీవనోపాధి కనుపించుచున్నది కదాఅని, అప్లికేషను పెట్టుకొన్నది.

కళనుచూసిన దగ్గరనుంచీ యన్ని గౌరవాలు, ఆదరాలు ఆవిడవే. అసలు డైరెక్టరుగారు నిశ్చ యించడమే రెండు మూడురోజులు కులాసాగావెళ్లిపోయింది.

డైరెక్టరుగారిని దర్శించివచ్చిన తర్వాత కళ యేమిచేయటానికితోచక నిస్పృహతో తనపడక కుర్చీలో పడుకుని ఏదో ఆలోచిస్తోంది. భగ్నహృదయ జీవిత ఆశయాలన్నీ ఒకసారి రేకెత్తాయి. చిన్నతనంలో తనకువచ్చిన గౌరవాలు, ప్రైజులు, కలెక్టరురాజుగారి ఉపన్యాసం యివన్నీ ఒక్కసారి ఆమె మనోవీధిలో తళుక్కుమన్నాయి. వేడినిట్టూర్పు విడిచింది—

కళ ఎంతో ప్రయత్నంమీద కలెక్టరు రాజుగారి అడ్రెసు కనుక్కొని, ఆయన దర్శనార్థము వెళ్లింది. రాజుగారు కళను చూచి నివ్వెరపోయినాడు. ఆనాటి కుమారి కళ యీనాటి భగ్నహృదయ కళ.

తనకున్న పలుకుబడి వినియోగించి స్త్రీ సదనములో నెలకు ఏభైరూపాయిల జీతంమీద పిల్లలకు కళోపాధ్యాయినిగా ఏర్పాటుచేయించాడు. ఇచ్చిన వాగ్దానము నెరవేరింది.

పిల్లలకి నాట్యము నేర్పుతూవుంటే కళకి ఎంతో ఆనందముగా వుండేది. పిల్లలను బాగా తరిఫీదు చేసేది. ఇక విద్యార్థినిలు సహజంగా, అవలీలగా నృత్యంచేస్తూవుంటే 'భావి ఆంధ్రదేశపు అవలోమా' అని అందరు అన్నారు. పాపం కుమారి కళ కళ్లు చెమ్మగిల్లి ఒక కన్నీటిబిందువు ముత్యమువలె జారింది—

పరదా

— శ్రీమతి —

ఎ౯. అలివేణి

పరదాల మాటున౯
బ్రతుకేటి సరదా?
సోదరీ!
తెరదాటి విశ్వమును
పరికింప రాదా?

పరదాల మాటునే
బాగున్న దంటావు
బానిసత్వమె మహా
భాగ్యమంటావు - ఐన
స్త్రీజాతి కికముక్తి
లేదమ్మ సోదరీ! ||పర||

మహిమాస్పదము 'హిందు'
మతమునందున బుట్టి
దానికి కళంక భూ
తంబైన పరదాను
చేపట్టి నా వింత
సిగ్గయిన లేకుండ ||పర||

పులిజూచి నక్క వా
తలు పెట్టుకొన్నట్లు,
అన్యమత సాంప్రదా
యంబైన పరదాను
అనుకరించీ హాస్య
మునకు పాలయ్యావు ||పర||

అన్య మతస్థులే
అది దురాచారమని
అవలగెంటిరి దాని
నదితెచ్చి పెట్టుకొని
పదిలమ్ముగా భద్ర
పఱచావ పెట్టెపై ||పర||

నిను 'అసూర్యంపశ్య'
అనగానె అదియొక్క
పొగడికయని మది౯
పొంగి పోయెదవు చాల్
చాల్ దివాంధము తోడ
సరిపోల్చుటయ కాద ||పర||

సూర్యరశ్మి యొకరి
సొత్తటే పురుషుండు
గుత్తకొన్నాడ నీ
కది లేకపోవుటకు
ఆరోగ్యమునకు న
త్యంతావసర మద్ది
పడయవే రవిరశ్మి
పరదాలు వడివీడి ||పర||

ప్రకృతీ కాంతామణీ
రమ్యా వయవములను
తిలకించి పులకింప
కలనైన వీలవని
దిక్కుమాలిన పరద
తెచ్చుకొంటివి జేల ||పర||

సర్వతోముఖ సంఘ
సంస్కార మీవేళ
జరుగుచున్నను దురా
చారమా పరదాను
అంటిపెట్టుకు వదల
నంటావు ఇదియేమె ||పర||

అన్ని మహిళా సమ
స్యలలోన 'పరదా' యె
అతిముఖ్యమగు కాన
సవరింపు మునుముందు
అదియె స్త్రీ యున్నతికి
ప్రథమ సోపానంబు

పరదాల మాటున౯
బ్రతుకేటి సరదా?
సోదరీ!
తెరదాటి విశ్వమును
పరికింప రాదా!

IMPORTANT TO MOTHERS
WOODWARD'S CELEBRATED
"GRIPE WATER"
బిడ్డ తన
స్నేహితుడైన ఉడ్
వర్డ్స్ గ్రైప్ వాటరును
తానుగా తెలుసుకొను
చున్నది
WOODWARD'S
GRIPE WATER
keeps baby well
I-WW 110-111 —TL.
W. WOODWARD LTD LONDON, ENGLAND.

సజీవమైన వాఙ్మయం కావాలి

కవిత్వమున్నది కాని - నిర్మాణం లేదు

★ రోహిణి ★

"నేటి మన వాఙ్మయము" ను గురించి చెప్పుకోవాలంటే ఉత్సాహం సన్నగిల్లుతూవుంది. అంటే చెప్పుకోతగ్గదిఏమీలేక కొంత, ప్రాచీనవాఙ్మయానికి పై చేయికాగలిగినది, లేక వాటితో తులతూగేది కాని లేక కొంత, ఏమీ చెప్పుకోలేక పోతున్నాము. పురుషులచే నిర్మింపబడ్డది గాని, స్త్రీలచే నిర్మింపబడ్డదిగాని ఏదీ లేకపోవడం మన దౌర్బల్యాన్ని సూచిస్తూవుంది.

అసలు వాఙ్మయ ప్రపంచముతో స్త్రీలకు సంబంధం చాలాతక్కువ. ఈ దౌర్బల్యం అన్నిభాషలకు వున్నట్టే మనభాషకుకూడావుంది. ఇక స్త్రీ రచనల కొరకు చూడాలంటే ప్రాచీన కవయిత్రీమణులైన గార్గి, మైత్రేయి, అవన్తిసుందరి, సులభ మొదలైనవారు మాత్రమే కనబడతారు. ఇటీవల పూర్వకవయిత్రీ మణులైన మొల్ల, తరిగొండ వెంకమాంబ, ముద్దుపళని మొదలగువారు గోచరిస్తారు. అంతే—

ఇక ఆధునిక రచనలలో పూర్వపువారి దారిని పోయినదేతప్ప స్వతంత్ర రచన గానరాదు. ఇది భావి చరిత్రకారునికి ఒక నిద్రాణమైన యుగంలా కనబడుతుంది—నిర్మాణములేని నిస్తేజులమనుకుంటాడు.

అయితే నేడు కవిత్వం లేదనిగాదు, నిర్మాణంమాత్రం లేదు. ఈనాడు అమల్లోవున్న భావకవిత్వం తాటాకుల మంటలాటి 'పొంగు'గా చూడబడుతోంది గాని, సరియైన నిర్మాణపు పంథాలోకి చేర్చబడడంలేదు.

ఇక ఎటునుంచి ఎటుచూచినా, ఈ విషయంలో మనం ఏమాత్రమూ అలక్ష్యంగా వుండకూడదు. శాశ్వతంగానిలచి, ఒక క్రొత్తదనానికి మార్గదర్శకము కాగలిగిన గ్రంథాలు మన యుగంలోకూడా నిర్మితంకావాలి.

అయితే మనలో శక్తివంతులులేక కాదు ఈ దౌర్బల్యం వృద్ధిఅవుత. ప్రస్తుతం 'మనది' అంటే 'మనకు' గౌరవంలేని పరదాస్యాప్రవృతి అనే తమస్సులో పడి, అజ్ఞానులమైవున్నాము; ఇదే మనలను నిర్వీర్యులను చేస్తోంది. 'ఇది సజీవమైన వాఙ్మయము' 'ఇది స్త్రీలచే నిర్మాణమైనది' అని చెప్పుకోగలరచన సృష్టింపబడితేనేగాని మనకర్తవ్యం పూర్తికాదు. దీనికి వెంటనే నేటికవితా ధురీణులు, కవితామతల్లులు కొంచెం శ్రద్ధబూనుతారా?

బదులు

● శ్రీమతి నందగిరి ఇందిరాదేవి

★ ఎరువు, ఉద్దెర, బదులు, అప్పు—చివరకు చావుబాకీ క్రింద పరిణామం—పుచ్చుకొనునప్పటి శ్రద్ధ ఇచ్చునప్పుడుండదు—ఈ దౌర్బల్యం 'అలవాటు' అయిపోయి, మనలో నీచత్వాన్ని మనకు తెలియకుండానే వృద్ధిచేస్తోంది. ఇది ఉపేక్షణీయంకాదు.

బదులుతీసికొనుట దురభ్యాసమనిన వింతగాఉండవచ్చు. ఏలనన, కొన్నిఅలవాట్లు దురలవాట్లు అని మనకుతెలిసికూడ వాటినుండి తప్పించుకొనలేము. జర్దాతినుటగాని, పొగత్రాగుటగాని (Smoking) ఆరోగ్యమునకు భంగముకలిగించు దురభ్యాసమని ప్రతివారికితెలియును. కాని ఈ దురలవాట్ల జాబితాలో 'బదులుతీసికొనుట'కూడ ఉన్నదని సాధారణముగా స్ఫురించదు. ఎంతోసామాన్యవిషయమే అయినప్పటికీ, ఈ బదులుతీసికొనుట అలవాటయినవారు, త్రాగుడుఅలవాటుకంటె విపరీతముగా, నెమ్మదిగా అప్పులు చేయుటకు వెనుదీయరు. వీరికి అప్పుచేయుట మిగుల కొంచెపువిషయముగా కన్పట్టును. ఈ అప్పుమొదలు కొద్ది మొత్తముతో ప్రారంభమయి క్రమముగా పెరుగకమానదు. ఈపెద్ద మొత్తములు వడ్డీకి వడ్డీలతో ప్రజ్వలించి కాపురములను కాలవహ్నిలో కూలద్రోయును.

ఏ దురభ్యాసమునయినను దానిని అలవరచుకొను నుద్దేశము ఎవరికియుండదు ప్రథమమున. కాని అదిఏదో తమాషాకు సిగరెట్లు, సారాయి, నల్లమందు-ఒకసారి రుచిచూడడమునకే ఆరంభమయిన అలవాటు, మత్తుకలిగించుగుణము కలవి కనుక, మరియొకసారి ఆకర్షింపబడెదరు. ఇంతలో అలవాటుకాబోయినదాయని రెండవసారికూడ తప్పదు. మూడవసారి తప్పించుకునెదమనినను తప్పించుకొనజాలరు. బదులుతీసుకొనుట కూడ ఆ విధముగనే అభ్యాసమగును. అందువలన చిన్నప్పటినుండియు చక్కగ పాతుకొనిపోవును ఈ అలవాటు.

'ఒ-న-మా'లు దిద్దుకొను పిల్లలదగ్గరనుండికూడ 'ఒకమాటు నీ బలపంముక్కయియ్యవు?' అని ప్రక్కపిల్లలను అడిగెదరు. కొంచెము పెద్దవారైనపిమ్మట విద్యార్థులు తరగతిలో టీచర్లుఇచ్చునోట్సు బద్ధకముచేత అప్పటికప్పుడు వ్రాసుకొనరు. మరల వ్రాసుకొనవచ్చునని తరగతిలో తమాషాగ గప్పాలుకొట్టి సాయంకాలము కష్టపడిపనిచేయునట్టి విద్యార్థులవద్దకు నోట్సు బదులుకువెళ్లెదరు. ఇక గృహస్థులయినపిమ్మట ఈ అలవాటు తమాషాక్రిందనుండక మరల్చుకోలేని అలవాటుగమారును. బజారులో ఆకర్షణీయమయినవస్తువు కనబడినయెడల, అది అవసరములేకపోయినను, దగ్గరడబ్బులేని సందర్భములో స్నేహితులనడిగి 'యింటికి పోగానే యిచ్చివేస్తాను' అని ఆవస్తువుకొనుట జరుగును. చేతులో పదిరూపాయలనోటున్నను పండ్లవానికి రెండణాల డబ్బులియ్యవలసివచ్చినప్పుడు నోటును విడిపించ బద్ధకించి ప్రక్కయింట రెండణాలు బదులు తీయుదురు.

ఇట్లు బద్ధకమువలన, సోమరితనమువలన ఒకటి రెండుసారులు బదులుతీసికొనినపిమ్మట ప్రతివస్తువు కూడ బదులుతీసికొనివచ్చుటకు బుద్ధిపుట్టును. ఈ తీసికొనిన అణాలు, రూపాయలు, వస్తువులు ఇయ్యకుండవలెనను

నుద్దేశముతో తిరిగియియ్యరనికాదు. తీసికొనినప్పుడు తొందరగా ఇయ్యవలయుననియే తీసికొందురు. కాని అశ్రద్ధవలన మరచిపోవుటకూడ కొన్నిసారులు సంభవించును. దీనితో మనస్పర్థలేర్పడక తప్పవు. ఈ మనస్పర్థలు, తత్సంబంధమయిన ఎత్తిపొడుపులు చిన్నచిన్న పోట్లాటలుగామారి 'వారికి వీరికి మాటలులేవండీ' క్రిందకు దిగును. సంగతేమని విచారించిన "వడ్లగింజలోనిది బియ్యపుగింజ." తోడుకు మజ్జిగచుక్క నీయలేదనో, పిండివిసురుకొనుటకు తిరుగలియియ్యలేదనో సాధారణముగా స్త్రీలలో మనస్పర్థలకు కారణములగును. అలవాటయినపిమ్మట ఈరకమువారు బదులుతెచ్చిన వస్తువులుకాని, డబ్బుకాని తిరిగి యిచ్చివేయవలయునన్న భయముకాని బాధ్యతనుకాని గుర్తించరు.

కొందరుసంపాదన యెంతతక్కువగనుండినను తమ 'స్టాండర్డు'ను కాపాడుకొనుటకు కొనువస్తువులకు, బిడ్డల నగలకు పెట్టుఖర్చు అమితముగానుండును. ఇవన్నీ అవసరముగానే కన్పట్టును. సంపాదనబట్టి ఖర్చులు హెచ్చుతగ్గు చేసుకొనవలయునుగాని ఏనెల కానెల 'హల్లికి హల్లి - పూజకు పూజ' చేయుటవలన బదులుచేయవలసివచ్చును. అకస్మాత్తుగావచ్చుజబ్బులకు, ప్రయాణములు మొదలయినవి వచ్చినటువంటప్పుడు సంఘములో గొప్పవాళ్లమని అనిపించుకొనుటకు ఎక్కడలేనిడబ్బు ఖర్చుపెట్టుటవలన జబ్బులమాట అటుండనిచ్చి రోజుబత్తెముగడుచుట దుర్ఘటమగును. అయ్యగారికిప్లానలు సూట్లు, అమ్మగారి బనారసు పట్టుచీరలు మొదలుకొని స్నేహితులకు కాఫీకప్పులవరకు ఆయాఅంగళ్లలో బదులే. ఇక్కడ ఈ శబ్దమును బదులనివాడు ఉద్దెరఅనివాడున్నను ఫలితము రెండునుఒకటే. కొద్దిగా నాగరకులమనిపించుకున్న వారిఅవసరములు అట్లుండ తక్కువజాతివారికి దురలవాట్లు ఉండుటవలన ఆసమయముకాగానే బదులుచేయవలసినదే. త్రాగుడు అలవాటయిన తలతాకట్టుపెట్టిఅయినా డబ్బు తెచ్చుకొనెదరు. ఇట్లు అప్పులన్ని పెరిగినపిమ్మట ప్రాణము విసిగి ఆత్మహత్యలరూపమున పరిణమించును.

బదుళ్లుకాక 'ఎరువు'లుకూడ అటువంటివే. నగలు, బట్టలు, వెండివస్తువులు మొదలయినవి తీసికొనిన వస్తువులను ఆ రూపములోనే తిరిగి యిచ్చుటను 'ఎరువు'అనివాడెదరు. ముప్పాతికమువ్వీసము పెండ్లిండ్లలో పోట్లాటకు కారణము ఈఎరువుసొమ్ములే. వివాహంముగిసిన పిమ్మట పెండ్లిపీట్లపై పెట్టిననగలు తీసికొనుట సంభవించగానే బాగా సొమ్ముపెట్టినారని సంతోషించిన తల్లిదండ్రులు ఏదోవిధముగా తమకోపమును ప్రకటించెదరు. ఈవ్యవహారము ముదిరినప్పుడు మగపెళ్లివారు 'కావలిస్తే మీ అమ్మాయిని తీసుకుపొండి. మాఅబ్బాయికి యిహపెళ్లేకాదా?' అని ధీమాగా మాట్లాడెదరు. అంతటితోచెల్లు ఆపెళ్లి! ఆ అమ్మాయి వీరికవసరములేదు.

బదుళ్లు, ఎరువులు ఇచ్చువారు తాము ఇచ్చుటకూడ ఒక దురభ్యాసమని గమనించిన ఈ చెడు అలవాటు సమసిపోవును. సాధ్యమయినంత వరకు బదులు ఇచ్చుట నిరాకరించుట అలవరచుకొనవలయును అంత్య నిష్ఠూరమునకన్న ఆదినిష్ఠూరమే మేలుకనుక. కాని మొహమాటమువలన, స్నేహితమువలన అట్లు అడిగినప్పుడు మోటుగా లేదని నిరాకరించలేము. ఇట్లుబదుళ్లు ఇచ్చుటలో పరోపకారము సహాయము లేదనను. నిజముగా, స్నేహితులయినవారు ఆపదలో నున్నప్పుడు డబ్బు సహాయము (ఇంకేదయినను) చేయవలసినదే కాని తిరిగి వాపసు రాబట్టుకొన వలయునను ఆశ లేకుండా ఇచ్చుట మంచిపద్ధతి. ఒకవేళ ఆడబ్బు వాపసు వచ్చినట్లుయిన సంతోషము. లేకున్న దిగులుపడకూడదు. అట్లే బదులుకు వెళ్లకుండా సరిపెట్టుకొనుట ప్రతిగృహిణి, ప్రతిగృహస్థుడు నేర్చుకొనవలయును. బదుళ్లుతెచ్చి స్నేహితులను సంతోషపెట్టి గొప్పవాళ్లమనిపించు కొనుటకంటే—నిర్భయముగా బీదవారముగానే ఉండిన, తినినతిండి ఒంటబట్టును. తమసంపాదనకనుగుణముగా ఖర్చుపెట్టుకొనిన ఈ చిక్కులేవియు నుండవు.



ఫేమస్ ఫిలిమ్సువారి 'ధర్మపత్ని'లో

శ్రీ శాంతకుమారి



శ్రీమతి విజయలక్ష్మి పండిట్, ఆమెసోదరుడు శ్రీ జవహరిలాల్ నెహ్రూగార్లు
ఇటీవల బొంబాయిలో జరిగిన కాంగ్రెసు కార్యసంఘ సమావేశ సందర్భమున
ఒక అహింసా వ్రతునితో 'అహింస' యొక్క ప్రాముఖ్యాన్నిగురించి చర్చించారు



బొంబాయిలోజరిగిన కాంగ్రెసు కార్యసంఘ సమావేశానికి హాజరై నాయకుల
ప్రసంగాలను దీక్షతో వినుచుండిన స్త్రీలలో ఒక భాగము.

భృంగమా!

శ్రీమతి వట్టికొండ విశాలాక్షి

ఈ కలువపూవులో
ఈవు ఝుంకారిస్తు
ఆ కలువపూవులో
ఆపె ఝుంకారిస్తు
ఏమి చేయుచునుంటి రే!
భృంగమా!
ఏమి చేయుచునుంటి రే!

★

రమణీయమైన ఆ
రామవాటికలోన
గుంపు గుంపులు గూడి
సొంపుగా కూర్చుండి
ఏల చూచుచు నుంటి రే?
భృంగమా!
ఏల చూచుచు నుంటి రే?

★

అస్ఫుటిత కుసుమాళి
నందముగ కూర్చుండి
పరిమళం బింతేని
పరవశము గాకుండ
కాపుకాయుచు నుంటివా?
భృంగమా!
కాపుకాయుచు నుంటివా?

★

కలువ రేకులలోని
కమ్మతావులు చిమ్మ
మధురాసవాస్వాద
మత్త చిత్తమ్ములో
ఝుంకార మొనరింతువా?
భృంగమా!
ఝుంకార మొనరింతువా?

★

భవదీయ మృదుగాన
పారవశ్యమ్ములో
ఉన్నంతసేపు నా
కొక్క విషయంబేని
జ్ఞప్తికైనను రాదుగా
భృంగమా!
జ్ఞప్తికైనను రాదుగా!

★

సద్భావ సౌధాళి.
శాంత చేతస్కులై
కల్పనా ప్రతిభమై
కైతనల్లెదు కవుల
కామోదమొనగూర్తువా?
భృంగమా!
ఆమోద మొనగూర్తువా?

★

అనుపమాన దయార
సార్ద్రచిత్తవయేని
అహరహంబును గూడ
ఆనంద దాయివై
అచటనే వసియింపుమా!
భృంగమా!
అచటనే వసియింపుమా!

మహారాష్ట్రమహిళలు

● అంగపటిమకు - సుగుణ సంపదకు - ధైర్యసాహసములకు ఆంధ్రవనితలకు వీరు అక్కచెల్లెండ్రు ●

శ్రీమతి గంటి కృష్ణవేణమ్మ

మహారాష్ట్రమనునది బొంబాయి రాజధానిలోని కొన్నిజిల్లాలు కలసిన ప్రదేశము. మధ్యపరగణాలలోను, నిజాంరాజ్యములోను మహారాష్ట్రులు లేకపోలేదు. కాని యాప్రాంత్యము లుత్తరమహారాష్ట్రమని పిలువఁబడుచున్నవి. ఉత్తరమహారాష్ట్రులకు దక్షిణమహారాష్ట్రులకు భాషలో చాలవఱకు వ్యత్యాసములున్నవి. దక్షిణమహారాష్ట్రులభాష శుద్ధము, ఔత్తరాహుల దన్యభాషా మిశ్రమము.

మహారాష్ట్రభాష పంచప్రాకృతములలో నొకటి. దేవనాగరలిపి దీనిప్రాచీనతను వెల్లడించుచున్నది. వీరిభాష, దేశము శతాబ్దములనుండియు చారిత్రకప్రశస్తిని పొందినవి. చాలవఱకాంధ్రమునకు మహారాష్ట్రమునకు పోలికలున్నవి. పవిత్ర గౌతమీ కృష్ణానదులు రెండుదేశములను శీకరాక్షతలతో సేసలుచల్లి యాశీర్వదించుచున్నవి. గోదావరి మహారాష్ట్రముననే భూమికి దిగినది. ఆంధ్రమునుజుట్టి యంబుధిఁగలసినది. మనరాష్ట్రమువలె నిదియును పురాతన నాగరికతగలది. ప్రఖ్యాతివహించిన పురుషులేగాక స్త్రీలును రెండుదేశములలోనున్నారు.

భారత స్త్రీలోకమున కాదర్శప్రాయులైన మహిళామణుల నీ రాష్ట్రము నాటికినేటికి కనిపెంచుచున్నది. పీష్వాలకాలమునుండియు మహారాష్ట్రమునకు పూనా ప్రధాననగరమును, సాహిత్యము నకుఁబట్టుగొమ్మయునైయున్నది. చాలావఱకిచటి స్త్రీలు విద్యావతులు. గ్రామాదులలోని కర్షకకుటుంబములు విద్యాగంధము లేనివనుట తప్పుకాజాలదు. సాధారణ గ్రామములోను, చిన్నచిన్న పట్నములలోను మహిళాసంఘము లున్నవి. విద్యావతులగు స్త్రీల యాజమాన్యమున నీసంఘములు స్త్రీజనోద్ధరణకై యనుపమానమగు సేవను చేయుచున్నవి. స్త్రీలను విద్యావతులుగా నొనర్చుటే యీసమాజముల ముఖ్యోద్దేశము. సభ్యురాలుగా చేరిన ప్రతిస్త్రీయును సంఘసేవసేయవలెననెడి యాశయ మీసమాజములలో గొనియాడదగినది. కార్మికుల యిల్లాండ్రకు తదితర స్త్రీలకు మహిళాసంఘములు విద్యనిచ్చి నాగరకులనుగా నొనర్చుచున్నవి. అన్నిటికంటె నాంధ్రమహిళలు గ్రహింపఁదగిన యుత్తమాదర్శము వీరికడనున్నది. యాజమాన్యము వహించినవారియెడ సభ్యురాండ్రందఱుచూపు గౌరవవిశ్వాసములు-దీనిని వీరపూజయనుడు, నేతలయెడభక్తి యనుడు, ఏదైననుఁగావచ్చును. నాయకురాండ్ర యడుగుజాడలఁదప్పించి యవల పాదమూపని వీరిభక్తి విశ్వాసములు గొనియాడఁదగినవి గావా? వీరిసమాజమే వీరికుటుంబము. కలతలు, కష్టనిష్ఠూరము లీకుటుంబమున నుండవు. సమాజోద్దేశమును గార్య రూపమునఁబెట్టి సఫలీకృతమనోరథులు కావలెననెడిదే వీరియుత్తమలక్ష్యము.

వెక్కుచోట్ల సేవాకాంక్షగల స్త్రీలు వైద్యసహాయము దొరకనిచో స్త్రీల కష్టముల నివారింపఁదలఁచి ప్రసూతికావైద్య (Midwifery) పరీక్షలకు బోయి యుత్తీర్ణలై సేవకుగడంగుచున్నారు. అచ్చటచ్చట యీ సమాజము లనాథ శిశుపోషణముకూడ చేయుచున్నవి. తన్నిమిత్తము శ్రీమంతుల సీమంతినులు గూడ Nursing నేర్చుకొనుచున్నారు. ఇంతియుగాక యీ సంఘము లమాయకపు బాల వితంతువులకుఁ బైపరీక్షలకేగఁదగు సామర్థ్యమును గల్పించి స్వయంపోషక శక్తిని కలిగించుచున్నవి.

నేనెఱింగినంతలో మనయాంధ్రవనితలకన్న, ఘూర్జరాంగనలకన్న మహారాష్ట్ర స్త్రీ హృదయ మౌదార్య ధైర్యసాహసముల కాకరమని చెప్పకతప్పదు. పూర్వ మెపుడోయుండిన దుర్గావతి యాదిగాగలవారి కథలటుండ, నేడును బొంబాయి నగరముననేగాక నాసిక, ఖాందేశ్, మున్నగు చిన్నపట్టణములలోగూడ స్వాతంత్ర్యోద్యమములందుగాని, మరి యే కార్యక్రమములందుగాని బాలికలు, యువతులు, వృద్ధులు ముందంజవేసినిలుచుచుఁ దమ పూర్వుల చరిత్రముల జ్ఞప్తికిఁదెచ్చుచున్నారు. పికెటింగ్ మొదలగు ముఖ్యస్థలముల స్త్రీలే కనబడుచుందురు. రక్షకభటులొకరి నాస్థానమునుండి తప్పించిన మరుక్షణముననే మఱియొకయువతి కాన్పించుచుండును. అక్షయవస్త్రముల ట్లొకదినమంతయు నీరీతిజరుగుట నొకానొక సమయముననే స్వయముగఁ జూచియుంటిని. నిష్పాక్షికబుద్ధితోఁ బరిశీలించిన మనదేశమున స్త్రీ లింతటి సాహసచిత్తులులేరనియే చెప్పవచ్చును. ఒకమాటు మనయాంధ్రదేశము నుండి వచ్చిన M. L. A. (Central) గారొకరీయూర 'ఆంధ్రమహాసభ' యందు పన్యసింపుచు "అఖిలభారత కాంగ్రెసు సమావేశపుటుత్సవ సందర్భములో 'ప్రభాత్ భేరీ'లు సాగించుచుండిరి. అన్నిదేశముల గుంపులలోను స్త్రీలనేకులగు పడుచుండిరి. కాని యాంధ్రదేశపు పంక్తిలో నొక్క దుర్వూరి సుబ్బమ్మగారు దక్క మరియొక స్త్రీ యెట్టునకైనను లేకుండెను. దీనిఁబట్టి మనయాంధ్ర స్త్రీల సాహసౌదార్యములను స్వాతంత్ర్యాభిమానము లనెఱుంగనగు" నని విచారమును వెలిబుచ్చియుండిరి.

మహారాష్ట్రమున స్త్రీలనేక సంఘములలో వ్యాయామ పరిశ్రమలయందుత్తీర్ణలై స్వచ్ఛందసేవికాదళముల వేనవేలు స్త్రీలను చేర్పించుచున్నారు. చేతి పనులన చెప్పనక్కరలేదు. క్లబ్బులలోని సభ్యురాండ్రుచేసిన చిత్ర విచిత్రపుఁ జేతిపనుల ప్రదర్శనములు (Exhibitions) సాగించి తన్మూలమున సంఘాభివృద్ధికి ధనమును ప్రోగుచేయుచున్నారు. వారి సంఘము లింతటి యుపయుక్తములగుటకు ముఖ్యకారణము వారిలోగల సంఘీభావము.

మనకును వారికినిగల వ్యవహారతారతమ్యముల నింతవఱకును పరిశీలించితిమి. ఆచారములఁ గొంతవఱకు గమనింతము. ఉత్తమ కులాంగనలేగాక తదితర జాతుల

★

'మహారాష్ట్ర' మనుట తోడనే వీరచిహ్నమని ద్యోతకమగును. శివాజి, దుర్గావతి, తిలక్, గోక్లేలవంటి వీరావతంసల కడుపార గన్న ధన్యభూమి అది.

స్వాతంత్ర్యాపేక్షకు, ధైర్య స్థైర్య సాహసములకు, సంఘీభావమునకు, కరడు గట్టిన విశ్వాసము గల వారిఆచార వ్యవహారముల యందభిమాన గౌరవాప్రమత్తతలకు మహారాష్ట్ర మహిళలదే అగ్రతాంబూలము.

★

వారును శుభ్రత శీలములందాసక్తి గలవారు—మాంసాహారులు కానిండు, శాకాహారులు కానిండు. నిద్దుర లేచినంతనే ప్రతిస్త్రీయు కల్యకృత్యముల నిర్వర్తించి స్వీయాలంకరణమునకు గడంగి, తలదువ్వి జడవేసికొని ముఖమున బొట్టుపెట్టుకొని, తరువాత గృహాంగణముల రంగవల్లులచే నలంకరించును. నాగరికులుగాని యనాగరికులుగాని వీరివలె పాత్రముల తళతళలాడునట్లు శుభ్రపఱచుకొను నలవాటవశ్య మనుకరింపదగినది. వంట చేయునప్పు డనాగరికులనిపించుకొను స్త్రీలును మిక్కిలి పరిశుభ్రతతో భోజనపదార్థముల నుపకరణముల సిద్ధముచేసికొందురు. ఎంతపేదవారైనను నీదేశమున మూతలేని పాత్రముల కొనరు.

మహారాష్ట్ర దేశమునందలి స్త్రీలు చాలవఱకు సుస్ఫురద్రూపులు. వీరినిజూచియే రవివర్మతన చిత్రములఁ గళలుట్టిపడునట్లు లేఖింప గలిగెను. నాగరికులగువారిమాట యటుంచి పల్లెపడుచులుకూడ కనుల పండువు సేయునట్లలంకరించుకొందురు. జాతివిభేదములేక సర్వులాకేరీతి పైకాసెబిగితో చీరలఁగట్టుదురు. ముక్కునకు నత్తువేసికొను నలవాటు నేటికిని వీరియందు విరివిగాఁగనబడుచున్నది. కుంకుమాంకిత వదనముతో, నాసికాచంపకమునకు నాడెముఁగూర్చు ముక్కరతో, మంగళాలయయగు గౌరీదేవివలె మహారాష్ట్రాంగన కనులపండువుసేయును. విపరీతపు సొగసులకులోనై వ్యక్తిత్వమును చంపుకొనని యాదర్శ ప్రాయయగు హిందూగృహిణి యీమె.

స్వకులాచారానుసరణమునందును, స్వధర్మాచరణమునందును వీరికి పట్టుదలహెచ్చు. ఆంధ్ర వనితామతల్లికివలెనే వీరికిని శ్రావణమాసము ముఖ్యము. క్రొత్తగఁబెండ్లియైన పడుచునకు మనవలె మంగళగౌరీ వ్రతమున్నది. వరలక్ష్మీవ్రతమును వీరుపాటింపరు. నాగచతుర్థి, గరుడపంచమి యిత్యాదుల ననుసరింతురు. దసరా, దీపావళి, సంవత్సరాది, వినాయకచతుర్థి వీరి ముఖ్యమగు పండుగులు. ఆషాఢశుద్ధ ఏకాదశీనాడు పండరీపురమున తిరుణాలజరుగును. ఆనాడు మహారాష్ట్రులు స్త్రీ పురుషులుపవసించి భజనలు, పూజలు జరిపింతురు.

వీరు మాతృభాషాభిమానులని చెప్పకతప్పదు. ఏలయన నెంతటియనాగరికులైనను, కాయకష్టము సేయువారైనను వారివారిపిల్లలను - మీదుమిక్కిలి పదిపదునైదేడుల యాడుపిల్లలను విద్యాభ్యాసమునకై పాఠశాలలకు బంపుచుందురు. వారు సువేషములననుకరింపక, తమ యాచారములనుండి దృష్టిమరల్పక విద్య నభ్యసింపుచుందురు. చదువుకొనినస్త్రీలు గృహకృత్యముల నిర్వర్తింపరను మూఢమతమునకు వీరి యాచరణ ఖడ్గమువంటిది. మనదేశపుస్త్రీలకన్న వీరికి జాత్యభిమానము మెండు. సంఘమున సంఘీభావము బలవత్తరము.

అంగపటిమయు, సుగుణసంపదయు, ధైర్యసాహసములును వీరిలోవలె తెనుగువనితలయందును గలవు. కాని మనస్త్రీలోకమునకు త్తేజ మిచ్చువారుకొఱత. విసుగువిరామములేని ప్రయత్నములవలన, నిరంతర ప్రచారములవలన మనస్త్రీలకిట్టి యున్నతదశ తప్పకరాగలదు. కుగ్రామముల, పట్టణముల, నగరముల, మారుమూలల స్త్రీజనోద్ధరణకై యభ్యుదయ సంఘములు చిన్నవికాని, పెద్దవిగాని స్థాపించుకొని ప్రచారము సాగింపఁగల యుత్సాహవతులగు యువతీరత్నముల చేతనున్నది యాంధ్రమహిళల భావి భాగ్యోదయము. ఉద్ధరింపఁ బ్రయత్నింపక మనస్త్రీలు వెనుకబడియున్నారనుకొనుట మనదేతప్పు 'యత్నేకృతే యదిన సిద్ధ్యతికోఽత్రదోషః'. యత్నించి విఫలమనోరథులమైనను తప్పుకాదు—

సత్వరాంధ్రరాష్ట్ర సముపార్జనలో

స్త్రీల బాధ్యత

—— ఆంధ్ర పుత్రిక ——

'ఎక్కడున్నావే గొంగళీ? అంటే, వేసినచోటనే వున్నాను' అన్నట్టుగా వుంది మన ప్రత్యేకరాష్ట్రోద్యమస్థితి. పాతిక సంవత్సరాలుగా జరుగుచున్న యీ ఆందోళన, ఉత్సాహం ప్రారంభమైననాడు ఎట్లావుందో నేడూ అట్లానేవుంది. అంతకంటె ఏవిధమైన అభివృద్ధీ లేదు—

అయితే, ఇకజరగవలసిన విషయమేమిటి, అందుకు స్త్రీ లెంతవరకు పాలొని పాటుపడవలసి వుంటుంది?

ఇందుకు కట్టుదిట్టమైన నిర్మాణాన్ని వృద్ధిచేసే కార్యక్రమం ఒకటి ముఖ్యంగా కావాలి. పురుషులతో సమానంగా-ఒకవిధంగా అధికంగాకూడా-త్యాగం చేసి స్త్రీలు దేశోద్యమంలో పాల్గొని పాటుపడడానికి ఏవిధమైన ఆటంకమూ లేదు. అందుకు సంసిద్ధులైనవారు తప్పకుండా చేయవలసిందే. కాని, ఈవిధమైన, అంటే గత స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొనినట్లు త్యాగాన్ని చూపేందుకు ప్రతిస్త్రీకి వీలుపడదు. అట్టివారు ఇంటివద్దవుండే అఖండమైన మార్పు తీసుకొనిరావచ్చు.

ముఖ్యంగా పరిశ్రమలను పోషించడం. ఆంధ్రదేశంలో కొండపల్లి దువ్వెన్నల దగ్గరనుంచి అనేకవిధములైన వస్తువులు తయారు అవుతూవున్నాయి. మనకుకావలసిన వస్తువులను కొనుక్కునేటప్పుడు ఆంధ్రపరిశ్రమలది మొదటి పక్షంగాచూచి కొనుక్కోవడం - లేనినాడు స్వదేశీసామానులు కొనుక్కోవడం - ఒకనియమంగా పెట్టుకోవాలి.

ఇంట్లో బాలబాలికలకు రాష్ట్రప్రసక్తి, ఆంధ్రనాయకుల యొక్క ప్రత్యేక శక్తులు, ఆంధ్రభూమియొక్క ప్రత్యేక ప్రాభవం-మొదలైన ఆంధ్రాన్నత్యానికి దోహదమునిచ్చు విషయాలనే ఎప్పుడూ చెబుతూవుండాలి.

తోడిస్త్రీలలో యీవిషయమైన రాష్ట్రవాంఛను ప్రబోధించాలి.

ఉత్తర ప్రత్యుత్తరాలలో ఆంధ్రభాషకే ప్రాధాన్యం కల్పించాలి.

ఇవిపైకి అల్పవిషయాల్లా కనపడినా, నైతికంగా అఖండమైనమార్పు తీసుకొనిరాగలవు. దీనికి ఆంధ్రమహిళాలోకం ఎందుకు శ్రద్ధవహించకూడదూ?

చారుదత్త

● శ్రీమతి స్థానాపతి రుక్మిణమ్మ

శూద్రక మహాకవిచే సంస్కృతమందు విరచితమై సారస్వతప్రపంచంలో ఆణిముత్యమువలె ప్రకాశించుచు విశ్వవిఖ్యాతి నొందినది - 'వసంతసేన, లేక మృచ్ఛకటిక'—

—అది నిశాసమయము - చీకటిముసుగులో అమరావతి పట్టణము ప్రశాంత రూపము దాల్చియున్నది - మన్మథోత్సవములో చారుదత్తుని గాంచి తన హృదయము నాతనికి దత్తమొనర్చిన వసంతసేన - నిజగృహంబునువీడి, పరిచారికలువెంటరా చారుదత్తుని గృహంబున కేతెంచుచున్న సమయమది—

—మార్గమధ్యమున విట, శకారులు వెంబడించినారు.

శకా:-నిలు - నిలు - వసంతసేనా! - నిలు.

గీ॥ ఏల పోయెదు? పఱుగిడి యేల చనెదు?
చంగు చంగున, దయనించు, చంపమాగు
నిప్పులోబడ్డ తోలునా నిప్పుడిదిగో
కాల్చుచున్నాడు కాయమ్ముఁ గాముఁడతివ!

విటు:-వసంతసేనా!

గీ॥ నాట్యమును నేర్పు మృదుచరణమ్ములదర
గాఢ భయచంచలములైన కనులతోడ
పాఱిపోయెదవేలనే - వ్యాఘ్రము వెను
తరుమగా వేగఁ బఱుగిడు హరిణివోలె.

శకా:-బావా! ఇదిగో వసంతసేన వెడలుచున్నది.

గీ॥ మనము వెనువెంట తరుమగాఁ జనెదు నదిగో
కుక్కలు తరుమపో యాడునక్క వలెను
అతుల నూపురారవ పరిహాసయగుచుఁ
జక్కిలమువోలె నామది గ్రుక్కఁజేసె.

విటు:-వసంతసేనా!

గీ॥ పతఁగ రాజేంద్రు భయమునఁ బాఱిపోవు
పాపపడఁతినా వేవేగఁ బఱచెదేల?
వడికిఁ బవనోపమేయుఁడఁ బట్టుకొనఁగ
లేన నిన్నింతలో? శక్తిలేద నాకు?

గణిక:-(కలయఁజూచి) పల్లవకా, పల్లవకా! పరభృతికా, పరభృతికా! మధురకా, మధురకా! శారికా, శారికా! అమ్మయ్యో! నా పరిజనము కనిపించుటలేదు. ఇప్పుడు నా శరీరమును నేనే రక్షించుకొనవలెను.

శకా:-భొత్తుకాతురా! విలపించు. విలపించు. పల్లవకనుగాని, పరభృతికనుగాని, శారికనుగాని, నిఖిలవసంతమునుగూర్చిగాని విలపించుము. ఎవ్వఁడు కాపాడునో చూచెదను—

గీ॥ దుస్ససేనుండు సీతను దొంగిలించి
నటులనే జుత్తుఁబట్టి నిన్నిటహరింతు
యమపురేశుండు కృష్ణుఁడో? యముఁడో? కుంతి
కొడుకు జనమేజయుండొ? దిక్కుగలదొక్కొ.

విటు:-వసంతసేనా! భయమెఱుఁగని నన్ను హృదయమున నిలుపుము. చూడు—

గీ॥ పాడు శీలమ్ముచే రాత్రి పరిచితమ్మొ
వెనుక నెఱుఁగుదుఁ జీకటి వీధులెల్ల
స్త్రీల సన్నిధి నీమాటఁ జెప్పనేల?
బాటఁ జావగా మిగిలిన భటులె సాక్షి.

గణిక:-అమితముగ సందేహించుచున్నాను. ఆత్మస్తుతి పరాయణులకార్యము లానరింపరా?

విటు:-కల్యాణీ! మమ్ము బ్రతిమాలుకొనడమను పగ్గములను పట్టుకొనుము. చూడు—

గీ॥ ఆశ్రయము వీడ జనియించు నాగ్రహామిఁక
నలుక నేమేమిచేయుము? అనునయులను,
స్త్రీలఁ గాపాడు - నా ఖడ్గ దీర్ఘకరము
బాల! నన్ను నీమేనుఁ గాపాడుకొనుము.

గణిక:-అనునయమున్న - భయమునే కలిగించుచున్నది.

శకా:-వసంతసేనా! బావ బాగుగా పలికినాడు. బలవజ్జనదుర్లభానునయమంతదాక బహూకరింపఁబడును. చూడు—

గీ॥ నెమ్మి మెడవలె నల్లనై నిశితమైన
ఖడ్గమునఁ దలఁగొట్టి బోకార్తు నిన్ను.
కోపమును మాకుఁ బుట్టించు కుజనుఁడకట!
తత్క్షణమె చచ్చు బ్రతుకడు తథ్యమరయ.

గణిక:-ఆర్య! కులపుత్రజనమునకు శీలపరితోషజీవినియగు గణికను కదా!

విటు:-కనుకనే ప్రార్థనము.

గణిక:-ఆర్య! నన్నేమి కోరుచున్నారు. శరీరమునా? అలంకారమునా?

విటు :-లత పువ్వులను విలుచుటకు తగినది కాదు. అలంకారము వలదు.

గణిక :-ఆత్మను కష్టపెట్టజాలను.

శకా :-వసంతసేనా! రాజకుమారుఁడను. కామింపఁదగినవాఁడను.

గణిక :-శాంతుఁడవైతివి.

శకా :-విను. బావా! విను. వసంతసేన నన్ను శ్రాంతుఁడవనుచున్నది.

విటు :-(తనలో) మూఢుడు నిందను తెలిసికొనలేకున్నాడు. విధ్వంసకుఁడవు అనిన శ్రాంతుఁడవు అన్నదను కొనుచున్నాడు. మఱియు—

గీ॥ అభినయించుచు మాటల సంగగముల
పలుకుచున్నాఁడు మతిలేని పలుకులెల్ల
విరసగతినాఁడు, మితిమీఱు పురుషమయద
దనరు పసరమ్ము నూత్నావతారమితఁడు.

(ప్రకా) వసంతసేనా! వేశ్యాజనవిరుద్ధముగ నాకడ ప్రవర్తించుచున్నావేమి? చూడు—

గీ॥ వెలసె మాకొఱకయి సానివీథులయిన
దారిబుట్టిన లతవంటి దానవీవు
ధనమునకు నమ్మ దేహమ్ము దాల్చినావు
ప్రేమమై జరింపుము ప్రియా ప్రియులఁగూడి.

గణిక :-ఈ యభినివేశ మభిజనముచే తూచబడుచున్నది.

శకా :-బావా! ఈ వీథి గాఢాంధకారపూరితము. దీనినిప్పుడు పారిపోనీయరాదు. ఇది - ఆ మన్మథోత్సవము మొదలు నయనమాత్ర సంతుష్టుఁడును, దరిద్రసార్థవాహపుత్త్రుఁడును అగు చారుదత్తవటువును ప్రేమించినది. ఇదె వాని ఇంటి పెరటి గుమ్మము.

గణిక :-(సంతసించి, తనలో) ఇదె అతని గృహము! భాగ్యవశమున శత్రుజననిరోధమునఁ బ్రియజన సామీప్యమునకుఁ దీసికొని రాబడితిని. అగును - ఇంతలో నిట్లొనరింతును. (వెడలును)

శకా :-(చూచి) బావా! పారిపోయినది—పారిపోయినది—

విటు :-ఎటుపోయినది? వెతుకుము. వెతుకుము—

శకా :-బావా! కనిపించుటలేదు.

విటు :-అయ్యో! వంచితులమైతిమి. వసంతసేనా! ఇప్పుడే దొరకెదవులే—

గీ॥ గాఢమగు సందెచీకటిఁ గానరావు
మేఘగర్భమ్ములోనున్న మెఱుపుపగిది
వాయువశమైన గంధంపు పరిమళమ్ము,
ముఖరితాభరణములు నిన్ మొనసి తెలుపు.

(గణిక స్రగ్గాభరణములు తొలగించును)

శ్రీమతి స్థానాపతి రుక్మిణమ్మగారి ఆంధ్రీకృత చారుదత్తములోని ఒక సన్నివేశము.



దసరా ఉత్సవముల సందర్భమున విద్యుచ్ఛక్తి దీపములచే అలంకరింపబడిన
మైసూరు రాజప్రాసాదము

మైసూరు చాముండి పర్వతమునగల మహానంది



శ్రీమతి బొడ్డుపల్లి
బాలాత్రిపురసుందరమ్మగారు

గుంటూరునందు స్త్రీల నిమిత్తమై మహాలక్ష్మి పఠనమందిరమును స్థాపించి స్త్రీల విద్యాభివృద్ధికై నిరంతరము పాటుబడుచున్న సేవావ్రత. తమ కొమారులకు కట్నములను గాని, తమకు వియ్యపురాలి లాంఛనములనుగాని స్వీకరింపక విద్యావంతులగు తమ కొమారులకు విద్యావతులైన కన్యలను దెచ్చి వివాహమొనర్చిన సంస్కరణ పరాయణ. నిరంతర ఖద్దరుధారి, దేశసేవిక, కవయిత్రి. ఈమెచే విరచితమైన పాటలు కొన్ని 'గృహలక్ష్మి'లో అప్పుడప్పుడు ప్రచురితమగుట పాఠకులు గమనించియుందురు.

పెనుగొండ భారత మహిళాసమాజమువారు, సమాజముయొక్క ప్రథమ వార్షికోత్సవమును జరిపారు. అధ్యక్షతవహించిన శ్రీమతి హట్టి పిళ్లమ్మగారు మధ్యగా కూర్చుని వున్నారు.



ఇప్పుడు నేను సన్‌లైట్ సోపును వాడెదను. గుడ్డలను నిజముగ శుభ్రముగ నుండునట్లు చేయుచున్నది.

నా ఇరుగు పొరుగువారి గుడ్డలు, నా గుడ్డలకంటె ఎక్కువ శుభ్రముగా ఉండెను. ఆమె సన్‌లైట్ సోపును వాడుచున్నదని పిదప తెలిసికొంటిని. సన్‌లైట్ సోపు ఎక్కువ నురుగు ఇచ్చునియు, నురుగే మురికిని పోగొట్టుననియు ఆమె చెప్పెను. నేను ఈ భేదమును తెలిసికొంటిని. తెల్ల అని అనుకొనిన గుడ్డలు ఇప్పుడు నిజముగా తెలుపుగానున్నవి. గనుక సన్‌లైట్ సోపుకు నా కృతజ్ఞత.

సన్‌లైట్ సబ్బు

వస్త్రు వర్గపు శుద్ధమైన నూనెలతోనే ఇండియాలో తయారగును

S 14-50—TL. LEVER BROTHERS (INDIA) LIMITED

అంధలోకం

★

పవిత్రప్రణయమే వివాహ ధర్మంలోని పవిత్ర సూత్రం. అట్టి ప్రణయాన్ని అంద చందాలుగాని, అంగసౌష్ఠవాలుగాని, అలంకారాలుగాని- ఆకర్షించలేవు.

పవిత్రప్రేమ పవిత్రహృదయంలోనే ప్రతిఫలిస్తుంది. ఇదే—

పట్టభద్రుడు ప్రభాకరుడి జీవితాశయానికి ఇతివృత్తం అయింది.

అనాధ శకుంతలకు అర్థంకాక పోయినా, ఆమెలో అనురాగ వాహిని పొంగిపొర్లింది.

★

“శకుంతలా! నీవింత దీనంగావున్నావేమి? ఈ కన్నీటి కెరటాలేమిటి?...నీవైఖరిచూస్తే రాత్రంతా నిద్రలేకవిలపిస్తున్నట్టుంది......మాట్లాడవూ? నీ మనస్సు బాధించేవిషయం అంతరంగిక మిత్రుడనైన నాతో చెప్పకూడదూ?” అంటూ ఆప్యాయంగా ఆమె తలనిమురుతూ, బుజ్జగిస్తూ సమీపంగాకూర్చున్నాడు ప్రభాకరరావు.

‘నా’ అన్నవారులేని విశాలప్రపంచంలో ఏకాకిగా జీవిస్తోంది శకుంతల.

ప్రభాకరరావు ఆడినమాటలవలన, బాధింపబడ్డ ఆమె మనస్సు కొంతవరకు ఉపశమించి ఊరటబడింది. క్షణంక్రిందట లోకం తనకు సర్వశూన్య మనుకొన్న శకుంతల తనకు కావలసిన సర్వస్వము ఉందను కొని నిర్ధారణ చేసుకుంది. అందువల్లకలిగిన అపరిమితానందంతో మాటాడలేకపోయింది. “శకుంతలా! మాటాడవేమి? ఎల్లప్పుడూ నీ దృష్టిలోపానికి ఏడుస్తూకూర్చుంటే ఫలమేమైనావుందా? భగవంతుడేమిచేసినా మనమేలు కొరకేఅన్నారు అనుభవజ్ఞులు.” అంటూ తనవుపన్యాసాన్ని మరికొంతవరకు సాగదీశాడు.

“ప్రభాకర్! నేనేమి పాపంచేసేనని భగవంతుడు నాకీశిక్ష విధించాడు? పదునైదుసంవత్సరాలవరకు ప్రకృతి రామణీయకంచూచి ఆనందించినకళ్లు ఇట్టేమాయమై గుడ్డిదాన్నయేనంటే కారణం ఏమని నిరూపించుకోవాలి? నాకడగండ్లుచూడలేక కాబోలు కనికాచిన తలిదండ్రులు చినప్పుడే కాలంచేశారు. పెంచిపెద్దచేసిన నాయనమ్మ పట్టుమని పండ్రెండేండ్లు నిండకముందే పరమపదించింది.” అని దుఃఖమును దిగమ్రింగుతూ జవాబు చెప్పింది. “ఊరడిల్లు శకుంతలా! ప్రతి జీవికీ కర్మకట్టికుడపందే విడవదు. బాధసహిస్తేనేగాని భక్తికుదరదు. అన్నట్టు అడగమరచాను, నీకు ప్రాయంపైబడ్డా పెళ్లిమాట తలపెట్టవేం శకుంతలా?” అంటూ మందహాసంచేసేడు.

ప్రభాకరరావు నోటనుండి ఈ మాటలు ఊడిపడేసరికి కొంచెంఉపశమిస్తున్న శకుంతల దుఃఖం మళ్లీ ఉబికిఉప్పొంగింది. ఆమెవిడచిన వేడినిట్టూర్పు వాతావరణాన్ని చీల్చి ప్రభాకరరావు హృదయంవరకు ప్రాకితాకింది. ఆమె హృదయంలో ఎన్నో భావాలు రేకెత్తేయి, మస్తిష్కంలో లెక్కలేనన్ని తలంపులు మెరిశాయి.

“అయితే ప్రభాకర్! అంధురాల్ని ఎవరుపెండ్లాడుతారు? నన్నుచూడ్డానికే సహించని స్వార్థపరులు పుస్తెకట్టడానికి పూనుకొంటారా? అధవా, కడితే వాళ్లకినలుగుర్లో నగుబాటు, తాహతుకు

తక్కువ కాదూ ? పోని ఇప్పుడు పెళ్ళికై ఎవరు పెనుగులాడేరు ?'' అంటూ లేనిధైర్యము తెచ్చుకొని జవాబు చెప్పింది.

'అదికాదు శకుంతలా ! నిన్ను పెళ్లాడ్డానికెవరైనా సమ్మతించి వచ్చారనుకో' అంటూ గొంతు సవరించుకొని పలికేడు——

'అటువంటిది తటస్థించదు. ఒకవేళసమకూడితే నే నిరాకరిస్తాను. ఎందుచేతనంటే ?.........'

'ఎందుచేత ?'

'నేను వివాహితను కనుక' అని ధీమాగా సమాధానంచెప్పింది శకుంతల.

'శకుంతలా ! నీకు వివాహమైనదా? ఎవ్వడు ? ఎక్కడ ? ఎవరికి?' అతనికంఠము రుద్ధమైనది. హృదయకుహరములో తుపానుచెలరేగింది. అప్పుడే అప్రయత్నంగా వారిరువురిచేతులు కలుసుకొన్నాయి.

ప్రభాకరరావు పట్టభద్రుడు, సంఘసంస్కర్త. అతని నివాసస్థానం లక్ష్మీపురమే. అతనికి వేలువిడచిన మేనమామతప్ప 'నా' అన్నవారులేరు. పిత్రార్జితమైన భూవసతి, గృహముకలవు. ఉద్యోగమేదయినా కలసి వచ్చేవరకూ అనవసరపు భేషజముల కాటపట్టైన పట్టణాలలో ఊరకే ప్రొద్దుపుచ్చడానికి ఇష్టపడక తన స్వగ్రామానికి చక్కావచ్చేడు. శకుంతలా ప్రభాకరుల ఇండ్లురెండూ ఎదురుగుమ్మాలు. ప్రభాకరునిదయకు పాత్రమైహృదయాన్ని అయస్కాంతంవలె ఆకర్షించింది శకుంతల. సంఘంసానుకూలం కాకపోయినా, అమ్మ

★ శ్రీమతి అడపా సుగుణమణి ★

లక్కలాడిపోసినా, తోడివారు తొంగిచూడకపోయినా కూడా, తన మేనమామ కుప్పలుతిప్పలుగా ఉత్తరాలు వ్రాసినా, వారిపవిత్రప్రేమని అరికట్టలేకపోయినాయి. కాలక్రమేణ శకుంతలా ప్రభాకరులు భార్యాభర్తలైనారు.

వేళాకోళానికిపాత్రలైన క్రొత్తకోడలు అత్తవారింట అడుగుపెట్టగానే ప్రభాకరుడికి రెవిన్యూ యినస్పెక్టరు (Revenue Inspector) పదవి లభించింది. అంతవరకూ మీసముత్రిప్పుతున్న గ్రామమునసబు దాసోహం అన్నాడు. కండ్లెఱ్ఱజేసిన కరణం కాళ్లా వేళ్లా తిరిగాడు. పరిహసించిన పౌరులు పడిగాపులు పడ్డారు.

ప్రభాకరరావు నివాసస్థానం పట్టణానికి మార్చుకొన్నాడు. కళ్యాణమై రెండేండ్లు గడచేయి. ఆదంపతుల ప్రేమాభివృద్ధి చిహ్నముగా ఒకకుమారుడు కలిగాడు. ఇంటవంటమనిషి సేవకులు, దాది ఉండడంచేత శకుంతలకు నేత్రలోపం కానరాకుండా కాలం గడచిపోతోంది.

ఒకనాఁజురాత్రి ప్రభాకరుడు కమానునుంచి తిరిగివచ్చేసరికి శకుంతల కంటతడిపెట్టడం కానిపించింది. కారణం ఏమని కలయవెదికి చూచాడు కాని కానరాలేదు.

'శకుంతలా ! నీవింకా దేనికొరకు విచారిస్తున్నావు? నీకు లోకములో నేను, చిన్నికుమారుడు రక్షకు ఉన్నాం. మాకు నీకండ్లలోపం ఏమాత్రం కడగండ్లు పెట్టలేదు. నీ వనవసరంగా మనస్సు నొప్పిచేసుకోవడం కూడదుసుమా' అంటూ ఓదార్చేడు ప్రభాకరుడు.

'ప్రపంచంనాకు ప్రబలాంధకారం. కట్టుకొన్నభర్తనీ, కడుపునగన్న కొడుకునీ చూడడానికి నోచుకోలేని నిర్భాగ్యురాలను. నాకు నాకొడుకుని చూడాలని మనస్సు కొట్టుకొంటున్నది. మీ దివ్యమంగళ

విగ్రహాన్ని సందర్శించాలని మనస్సు తహ తహ పడుతున్నది....ఓ భగవంతుడా! నేనేంపాపము చేసేనని నాకళ్లు పాడుచేసేవు......?" అని విలపిస్తూ ప్రభాకరునితొడపైకి ఒరిగిపోయింది.

'శకుంతలా! నా బాల్యస్నేహితుడైన డాక్టరొకడు పాశ్చాత్యదేశాలు తిరిగి కండ్లజబ్బులు బాగు చేయడంలో ప్రావీణ్యంపొందేడు. అతడు రేపోమాపో ఈవూరికి రానున్నాడు. వచ్చినవెంటనే అతనితో ఈ విషయం ప్రస్తావించి అతనిసలహా తీసుకుందాం. మనఅదృష్టం బాగుండి భగవంతునికరుణ మనవరకూ ప్రసరిస్తే నీదృష్టిమాంద్యం మాయవచ్చు.' అంటూ ఆ సమీపములోనే ప్రాకుచున్న రమేశాన్ని చేతులలో పైకెత్తి 'అమ్మనిన్ను కళ్లతోచూడాలని కంగారుపడుతోందిరా. ఆ భాగ్యానికి నోచుకుంటావో, లేదో బాబూ!' అంటూ ఆప్యాయంగా ముద్దుపెట్టుకొన్నాడు కొడుకుని.

ఆరోజున శకుంతల కండ్లకి శస్త్రచికిత్స చేయడానికి సర్వమూ సమకూర్చబడినవి. నిర్ణీతకాలానికి డాక్టరువచ్చాడు. బాగోఓగో, ఏదో ఆ గుండుకొమ్ము లనుమానం ఆరోజున తేలిపోవాలని నిశ్చయించుకొని ఆపరేషన్ టేబు (Operation Table) లెక్కింది శకుంతల. ఆమె యిష్టదైవాలని పూజించింది. యిలవేల్పులకు మ్రొక్కింది. పెద్దలకి పేరంట్రాండ్రకి పసుపూ కుంకమూ చెల్లించింది. శస్త్రచికిత్స సమాప్తమైంది. 'ఆపరేషన్ (Operation) సవ్యంగా అయిపోయింది. ఆపైని భగవంతునిదయ, మీ అదృష్టం. నేటినుండి పదిహేనుదినములు కండ్లకుకట్టిన కట్టు విప్పకూడ'దంటూ డాక్టరు వెళ్లిపోయాడు.

రోగిని మంచంమీదనుండి లేవకుండా వలయుసౌకర్యాలు స్వయంగా ఏర్పాటుచేస్తూండేవాడు ప్రభాకరుడు.

'నా అదృష్టంబాగుండి మీ అర్ధాంగినైనాను. కాకుంటే నాపాట్లు కుక్కలకుకూడా లేకపోయి ఉండేవి. అయినా సేవకులుండగా మీరెందుకు శ్రమతీసుకుంటారండీ?" అంది శకుంతల సాభిప్రాయంగా.

'వెట్టిదానా ఆలిఅన అర్ధాంగి అని నీవెరుగుదువు. నా శరీరమునకై నే సేవచేసుకోకూడదూ. దానికూడా పరాయివాని సహాయంకావలెనా' అంటూ సమయోచితంగా జవాబుచెప్పేడు ప్రభాకరుడు.

'ఒకటీ......రెండూ......మూడూ......కాదు అబ్బా పదునైదుదినాలే ఎంతని ఓపిక పట్టనూ? రోజులుగడిచినట్లే కనబడవు. ఒక్కొక్కరోజు ఒకయుగంలాగ తోస్తోంది. ఈయిల్లు ఎల్లాంటిదో? ఈగది ఎట్లాగుంటుందో? రమేశు ఎవరిపోలికో......?"

* * * *

'అదిగో నాకుమారుని కిలకిలనవ్వు...రమేశ్...రమేశ్...రమేశ్' అని కండ్లకట్టువిప్పి పిచ్చిదానివలె లేచిపరుగెత్తి చిన్నకుమారుని ముద్దులాడి మూర్ఛపోయింది శకుంతల.

'శకుంతలా, శకుంతలా! ఒక్కరోజు తాళలేకపోయితివా? అయ్యో! కలకాలం గుడ్డిదానివలె పడియుండుమని నీ నుదుట భగవంతుడు వ్రాసిఉండెనా?" అంటూ శకుంతలనుచేరి శైత్యోపచారాలు చేయ మొదలుపెట్టాడు ప్రభాకరుడు.

'భయంలేదు. శస్త్రచికిత్సకి పదిరోజుల విరామమేచాలు. చావుకవేస్తే లంకణానికి తేలుతుందని నేను పదిహేనురోజులని నియమంపెట్టాను. క్రొత్తగా వెలుతుర్ని చూడడంచేత మూర్ఛపోయింది. అదిగో స్పృహకలుగుతుంది. మీయొద్ద భగవంతుడున్నాడు. మీ రన్యోన్యాను రాగముతో లోకానికి ఆదర్శ దంపతులుగ జీవించం' డని డాక్టరు సరిగా ఆసమయమునకేవచ్చి ఆశీర్వదించాడు.

శకుంతలకి చైతన్యం కలిగినతరువాత డాక్టరుకి ప్రణామంచేసి, కొడుకునెత్తుకొని ముద్దులాడి, భర్తను సందర్శించి మందహాసంచేసింది.

"అలా ఏడుస్తావేం... ఆడపిల్లలా?"

★ సరస్వతి ★

'అబ్బే, ఆడపిల్లలా అలా ఏడుస్తారా?' అని చటుక్కున అనేస్తారు, ఎవరైనా ఒకపిల్లవాడు ఏడుస్తూవుంటే. దీనిభావమేమిటో గాని యిది మనలోనేగాదు, తమిళులు మొదలైన దక్షిణాత్యులలోను, ఔత్తరాహుల లోను కూడా ప్రబలంగావుంది. పోనీ, మగవాళ్లుమాత్రమే ఆడవారిని చులకనచేసే నిమిత్తం అంటున్నారా అంటే, ఆడవారుగూడా యీమాట అనేస్తూవున్నప్పుడు, దీనిలో ఏదో విశిష్ఠత వుండితీరాలి—

అయితే, 'బాలానాం రోదనం బలం' అనే సామ్యంప్రకారంగా పిల్లలైనప్పుడు అందరూ ఏడుస్తారుగాని, ఆడపిల్లలుమాత్రం ఏడవడం, మగపిల్లలు ఏడవకపోవడమూ ఏమిటి? అంచేత 'ఆడపిల్లలా ఏడవడం'లో ఏదో ప్రత్యేకత వున్నదన్నమాట.

మనలో ముసలమ్మలు కొందరు, శిశువు పుట్టీపుట్టడంతో వారి ఏడుపును బట్టి ఆడపిల్లయినదీ, మగపిల్లవాడయినదీ చెప్పుతూవుంటారు. అందువల్ల వీరిఏడుపుకు ఒకప్రత్యేకత వుండటం తథ్యం.

కాకుంటే, పేరుమోసిన పెద్దకవీశ్వరులైన పెద్దన్న, తిమ్మన్న అంతటి వారే స్త్రీల రోదనవిశేషాలనుగురించి అధ్యాయాలకధ్యాయాలే వ్రాసి వున్నప్పుడు ఆడపిల్లల ఏడ్పులో అతిశయం లేకపోవడమేమిటి?

అంతవరకూ ఎందుకు, శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రిగారి నడిగితే యీ ఏడుపుయొక్క ప్రాశస్త్యం పూర్తిగా తెలుస్తుంది.

నిజానికి ఆడపిల్లల ఏడుపులో అందము, లాలిత్యము, అదొకవిధమైన కళ గోచరిస్తుంది. అదే మగపిల్లలలో అస్వభావికంగాను, మోటుగానూ వుంటుంది. అంచేత ప్రకృతిలోనే దీనిసూత్రం మరుగుపడివుందని తెలుస్తుంది. ఇంకొకటి - యీ 'ఏడుపు' కూడా లలితకళల్లో ఒకఅంగముకూడా అయి వుంటుంది, ఏడుపులో ఎన్నెన్నో భావాలు వ్యంగ్యముగాను, స్పష్టముగాను స్ఫురిస్తూ వుంటాయి గనుక. ఆవేదన, వ్యథ, దుఃఖము, విరహము మొదలైన విశేషావస్థలు దీనిలోనివే గనుకాను.

అయితే ఇవన్ని, విశేషించి ఆడపిల్లల ఏడ్పులో సహజంగా, మార్దవంగా స్పష్టీకరింపబడతాయి గనుక యీమాట వ్యావహారికమైపోయి వుంటుంది సర్వత్రా. అంతేకాని నేడు మనమనుకుంటూ వున్నట్టు, చులకనచేయు నిమిత్తంగాదని మాత్రం తెలుసుకోవాలి.

★ ★ ★ స్త్రీ విద్యార్థి సంఘాలెందుకు?

రెండుమూడు సంవత్సరాలు తీవ్రంగా పనిచేసి, విద్యార్థిసంఘాలు విద్యార్థుల్లో చైతన్యాన్ని తీసుకొచ్చినై. ఆందోళనావిధానం, ఉద్యమం మొదలైనవాటినిగురించి ప్రతీ సామాన్యవిద్యార్థికీ తెలిసింది. విద్యార్థుల కోర్కెలను సంపాదించటానికి జరిపిన వివిధ పోరాటాలవల్ల సంఘాలు మంచి బలాన్ని సంపాదించినాయి. దేశీయోద్యమానికి ఉపాంగాలని నిరూపించుకొన్నాయి. కాని స్త్రీ విద్యార్థులేరీ ఈ దృశ్యాల్లో? విద్యార్థిసంఘాలు తాము తీసుకొద్దామనుకున్న చైతన్యాన్ని, స్త్రీ విద్యార్థుల్లో తీసుకురాలేక పోయినై. స్త్రీ విద్యార్థుల సంపూర్ణ సహకారం లేకపోతే విద్యార్థి ఉద్యమం ముందుకు సాగలేదని వేరే చెప్ప నవసరంలేదు.

విద్యార్థిసంఘాలు స్త్రీ విద్యార్థి ఉద్యమాన్ని ఎందుచేత తీసుకరాలేకపోయాయో పరిశీలించవద్దూ మరి! స్త్రీ విద్యార్థులీ రోజునకూడ, విద్యార్థులు చేసే ఆందోళన, సంఘాశయాలు, కార్యక్రమం తమకికూడ చెందినవేనని గుర్తించలేదు. వారి దైనందిన కృత్యాల్ని యంత్రాల్లాగ నెరవేరుస్తున్నారు. పాఠశాలకి వస్తారు; కాలేజీలకి వస్తారు, ప్రతీ రోజు, ప్రతి సంవత్సరమూను. చుట్టూ ఉండే విశాలప్రపంచంలో ఏం జరుగుతుందో వారికి తెలియటంలేదు. వారి విషయం ఒకే ఒక్క విషయంమీద కేంద్రీకరింపబడివుంది. అది వారి విద్యార్థి జీవితాశయం; పరీక్ష ప్యాసు కావటం. ఈ గ్రుడ్డితనానికి తోడు, మనదేశంలోని ప్రస్తుత విద్యావిధానంవారిని మరింత గ్రుడ్డిగా చేస్తోంది. ఉన్నతభావ సందర్భానానికి గాని, సాంఘిక, ఆర్థిక, రాజకీయ మనోదాస్యాలనుండి రక్షించుకోటానికిగాని ఉపకరించటంలేదు; మార్గాలు చూపించటంలేదు!

స్త్రీ విద్యార్థుల ప్రత్యేక సమస్యలు

కొంచం శ్రమ తీసుకొని ఆలోచించి చూస్తే, స్త్రీ విద్యార్థులకి, పురుష విద్యార్థులకి ప్రస్తుత సమాజంలో ఉన్న స్థానం, వారి స్థితిగతుల్లో ఉన్న భేదం. ఈ విషయాల్ని అవగాహనచేసుకొని గుర్తించపోవటం మూలాన్నే, విద్యార్థి సంఘాలు ఈ రోజువరకు స్త్రీ విద్యార్థులను ఉద్యమంలోనికి తీసుకురాలేకపోవటానికి కారణం అని వెంటనే తేలిపోతుంది. విద్యార్థులికి, స్త్రీ విద్యార్థులకి ఒక నిర్ణీతమైన సామరస్యపు హద్దు తప్పక వుంది. ఇది వప్పుకొని తీరాలి. కాని ప్రస్తుతం వారు స్నేహభావంతోటి, పరస్పర సానుభూతి సహాయాలతోటి మెలగుతూండడానికి, ఉద్యమంలో బాహాటంగా కలసి ముందుకు నడవటానికి, స్త్రీ విద్యార్థులను నిరోధించే ముఖ్యకారణాలు యివి.

ఈ రోజున విద్యార్థుల్లో కదులుతూన్న ఉజ్వలచైతన్యం స్త్రీ విద్యార్థుల్లో చాల కొఱతపడివుంది. ఇంకా వారు ఉద్యమ ఆవశ్యకతని గుర్తించలేదు. విద్యార్థిసంఘాల్లో పురుష విద్యార్థులతోబాటు తమకుకూడ సమానకర్తవ్యం, బాధ్యత వుందని గుర్తించలేదు.

విద్యార్థిసంఘాలు, ముఖ్యంగా రాజకీయసంఘాలనే దురభిప్రాయం చాలవరకు వ్యాపించివుంది.

ఇవన్నీ అటుంచి, విద్యార్థిసంఘాల్లోనే కొన్ని లోపాలున్నాయి. మనదేశంలోని స్త్రీ పురుష విద్యార్థుల స్థితిగతుల్లో చాల భేదం ఉందని, వారికి ప్రత్యేక అవసరాలు. సమస్యలు ఉన్నాయని

విద్యార్థి సంఘాలదృక్పథం రాజకీయం కాకపోయినా ప్రతి విద్యార్థినీ సాంఘిక, ఆర్థిక, రాజకీయ విషయాల్లో తననేవారంగాన్ని సువిశాలం చేసుకొని, పాఠశాలల్లోను, పరిపాలనలోను, విద్యావిధానములోను వున్న లోపాలు సంస్కరింప బడడానికి తగిన ఆందోళన చేయవలసివుంటుంది. లోపాలు సవరింపబడితేనే గాని యువతీలోకం ఉన్నత విద్యకొరకు ఉత్సహించదు.

ఈ ప్రాథమిక సత్యం విద్యార్థి సంఘాల దృక్పథానికి దూరంకాకూడదు.

మాతృక :
మిస్ కనకదేశ గుప్త

అనువాదం :
ఆంధ్రరాష్ట్ర స్త్రీ విద్యార్థి సంఘం

★ ★ ★ ★ ★

విద్యార్థిసంఘాలు ఇంతవరకుకూడ గుర్తించలేకపోయాయి. తత్ఫలితంగా, వారి ప్రత్యేక సమస్యలకు ఇవ్వవలసిన ప్రాముఖ్యత, శ్రద్ధ ఇవ్వలేదు.

అందుచేత ఇప్పుడు చేయవలసిన పని యేమిటంటె, వారి ప్రత్యేక సమస్యలమీద, కష్టాలమీద చిన్నచిన్న ఉద్యమాల్ని లేవతీయాలి. ఈ ఉద్యమం తమదేనని, దాంట్లో వారికి సమానబాధ్యత వుందనీ, ప్రతి స్త్రీ విద్యార్థికి విపులంగా బోధించాలి. ఆమె చేయూతలేనిదే ఉద్యమం సాగదని మరీ మరీ స్పష్టీకరించి ఆమె ఉద్యమంలో చేరేటట్టు చేయాలి. అది ఆమె జాతిఅంతా కోరే వాంఛ, మాతృదేశపు పిలుపూను.

స్త్రీ విద్యార్థులు ప్రత్యేక సంఘాలక్రింద ఏర్పడవలసిన ఆవశ్యకత

వీరి కనీసపు కోర్కెలమీద, కష్టాలమీద నెమ్మది నెమ్మదిగా ఆందోళనచేస్తూ ఉద్యమాన్ని సాగించాలి. ప్రారంభదశలోనే పెద్ద వివాదాల్ని, సమస్యల్ని పెట్టుకోటం చాల పొరపాటు. ఎప్పుడుకూడ వాస్తవికత్వానికి (Reality), వాతావరణానికి దూరంగా తొలగిపోకూడదు. విద్యార్థిసంఘాలు పోరాడే కోర్కెలకు ఈ క్రింది కోర్కెలు జతచేర్చి ఉద్యమం లేవదీయవలసివుంటుంది.

విద్యార్థినుల ప్రత్యేక కోర్కెల

1. మనదేశంలో నూటి కిద్దరుబాలికలు మాత్రమే విద్య నభ్యసిస్తూండడం చాల శోచనీయమైన విషయం. మిగిలిన స్త్రీజనానికి ఆఖరికి వారిపేరైనా వ్రానుకోటం చేతకాదు. అందుచేత మన ముఖ్యకర్తవ్యం వారికి విద్య నభ్యసించే అవకాశాలు కలుగజేయటం. ప్రభుత్వాన్ని వెంటనే తగినన్ని విద్యాలయాలు, విద్యార్థి వేతనాలు, ప్రాథమిక పాఠశాలలు ప్రతీ పెద్ద గ్రామంలోను స్థాపించేటట్టు ఒత్తిడిచేయాలి.

2. గ్రామాలనుండి దూరప్రదేశాల్నుండి వచ్చే విద్యార్థినులకు ఉండే గొప్ప విషమ సమస్య వసతి గృహాలనుగురించి. స్త్రీ విద్యార్థినులకు కొంచం సుఖవంతంగాను, గౌరవప్రదంగాను ఉండే వసతిగృహాలు కావాలి. ఇల్లాటివి మిక్కిలి తక్కువగా ఉన్నాయి. ఉన్న కొన్నికూడ, జైలుజీవితం కంటే నికృష్టంగా ఉంటున్నాయని తమ అనుభవాల్ని చెబుతున్నారు స్త్రీ విద్యార్థులు. పైగా ఈ వసతుల్ని విశ్వవిద్యాలయాధికారులు గుర్తించటం చాల అరుదు. ఉదాహరణకు, కలకత్తావంటి మహానగరంలో రికగ్నైజుచేయబడిన వసతి

గృహాలు రెండుమాత్రమే ఉన్నాయి. ఈవిధంగా విద్య నభ్యసిస్తూన్న కొద్దిమంది స్త్రీ విద్యార్థినులు చాల అసౌకర్యానికి లోనవుతున్నారు. అందుచేత మనం వెంటనే విద్యార్థినులకు తగినన్ని భోజన, వసతిగృహాల్ని ఏర్పరచి, వాటిని గుర్తించేటట్లు చేయాలి.

3. కొన్నికొన్నిచోట్ల విద్యాలయాలు ఒక్కొక్క జాతికొరకు స్థాపించబడివున్నాయి. ఒక్కొక్క కాలేజీలో, హిందువులకో మహమ్మదీయులకో తప్ప, మిగిలిన ఏ జాతివారికి చోటుండదు. అర్థంలేని ఇల్లాంటి విపక్షతలు, భేదాలు విద్యార్థిజీవితానికి, దేశాభ్యుదయానికి భంగకరం కాబట్టి విద్యాలయాలు జాతి, మత, తరగతి భేదంలేకుండా ఉండేటట్టు పాటుపడాలి.

సాంఘిక వ్యవహారాలు

ప్రస్తుత సమాజపు మూఢాచారాలు, నిరంకుశపు ప్రాచీన కట్టుబాట్లు, స్త్రీ విద్యార్థులను ఎన్ని విధాల బాధించి కృంగదీస్తున్నాయో చెప్పలేము. బాలురకంటె బాలికల్ని ఎక్కువ ఘోరంగా బాధిస్తున్నాయీ కట్టుబాట్లు. స్త్రీ విద్యార్థులకు సమాజంలో గౌరవప్రదమైన స్థానమే లేదు. వారసత్వపు హక్కు లేనే లేదు. యువకులతోపాటు యువతులుకూడ సమానహక్కుల్ని, బాధ్యతల్ని పంచుకొనేటట్లు తీవ్రంగా అలజడి సాగించాలి.

విద్యాలయాధికారులు సమాజము, వీరి ఆరోగ్యసౌభాగ్యాలనుగురించి శ్రద్ధవహించ నవసరంలేదనుకుంటున్నారు. ఈ విషమ పరిస్థితుల్ని నశింపజేసి, బాలికల ఆయురారోగ్యాల్ని అభివృద్ధిపొందేందుకు అన్ని జాగ్రత్తలు తీసుకొనేటట్టు చెయ్యాలి మనం. ప్రతీ స్కూల్లోను, కాలేజీల్లోను మనకి ప్రత్యేక ఆటస్థలాలు తగినన్ని ఉండాలి. వ్యాయామశిక్షణ పొందేటందుకు, ఆరోగ్యం అభివృద్ధిపొందేటందుకు మనం ప్రతీ ప్రయత్నంచెయ్యాలి.

ప్రాథమిక సంఘాలు స్థాపించాలి

ఈ పై కోర్కెలతో, స్త్రీ విద్యార్థుల్లో చిన్నచిన్న ఉద్యమాల్ని, ఆందోళనాన్ని లేవదీయాలి. అందుకోసం ప్రతీ విద్యాలయంలోను ప్రాథమిక సంఘాల్ని వెంటనే స్థాపించాలి. ఈ సంఘాలు విద్యార్థినుల కష్టాల్ని, కోర్కెల్ని బాహుళ్యంగా ప్రచారం అవటానికి, పఠనబృందాలు (Study Circle) వాగ్వాద సభలు (Debates) ఏర్పరుస్తూండాలి. ప్రసిద్ధ నాట్యప్రదర్శనాలు, నాటకాలు మొదలైనవి ఏర్పాటుచేసి తమ కార్యక్రమంతో స్త్రీలలో విద్యాప్రచారంకూడ సాగించాలి.

నిద్రపోతున్న స్త్రీ విద్యార్థుల్లో చైతన్యం కలగజేసి, తర్వాత విద్యార్థి ఉద్యమంలో వారి కర్తవ్యాన్ని నెరవేర్చేటట్టు చేయడమే ఈ సంఘాల ప్రధానాశయం.

ప్రస్తుతపరిస్థితుల్లో కొద్దిమంది బాలికలుమాత్రమే విద్యావతులై, కర్తవ్యాన్ని గుర్తించి, స్వాతంత్ర్యవాయువుల్ని పీల్చటానికి ప్రయత్నాలుచేస్తోంటే, వేలకొలది యువతుల్ని సత్యాగ్రహంచేసి, లాఠీదెబ్బలుతిని, జైళ్లకుపోవాలని అనకూడదు. న్యాయంకూడా కాదు. విద్యార్థిసంఘాలు నిజంగా తమకోసంకూడా పాటుపడుతున్నాయని తెలియజేయగలిగితే, వారి ప్రత్యేకసమస్యల్ని అందరూ కలిసి చర్చించుకోటానికి సావకాశం కల్గజేసినట్లైతే చాలు మన స్త్రీ విద్యార్థిసంఘాల ప్రధానాశయం సాధించామన్నమాటే! అప్పుడే ఉద్యమం ఎల్లా నడపాలో తెలుస్తుంది. సంఘంలోని స్వార్థపరుల నోళ్లు కట్టి యువకులతో సమానఅర్హతని పొందగలమని తెలుసుకుంటారు. అప్పుడే వేలకొద్దీ యువకులు ఉజ్జ్వలచైతన్యంతోటి ముందరికివచ్చి పనిచెయ్యగల్గుతారు.

దేశసేవిక

శ్రీమతి మధురాపంతుల విజయలక్ష్మి

స్వాంతంబార్తజన ప్రమోద కరణాసక్తంబు; కృత్యంబులా
శాంతవ్యాప్త చలద్య శోకలిత సద్యానంబు; లాస్యంబు సౌ
మ్యాంతర్భావ సమృద్ధసూచితల సద్భాసంబులై యొప్పదో
కాంతా! శాంతయుతా! సువాగ్విభవయుక్తా! ధన్యనీవే సుమా!

'నా దేశంబిదె, నాదుసోదరులె యన్నంబంచు బన్నంబులె
న్నోదిక్కింతలేక కుందుచయయో! యున్నారు' నీవేటి క
మ్మా! దివ్యంబగు తావకీనసువచో మాధుర్య సంపత్తి స
ద్బోధంబున్ బచరించె మాకెటుగణింతున్ నిన్నుఁ జక్షుప్రదా?

స్వారాజ్యాప్త్యభిలాషఁ బూరుషులు విశ్వస్తుత్య మారీతిఁ దా
మారంభింపఁగ దేశసేవలను, దేశౌన్నత్య సంసిద్ధికై
నారీలోకముకూడఁ జాలునని సానందాత్మవై చాటఁ గాం
తారత్నంబ! ధరింతువెల్లపుడుఁ జేతన్ రంగుజెండానహో!

నీకుంగల్గెడి వస్తుజాలముల నన్నింటిన్ నాసన్ వీడి లోఁ
జీకాకింతయు లేక మాతృపద రాజీవార్చ నాలగ్నవై
లోకుల్ 'మేల'ని నీ మహోద్యమము నాలోకించుచున్ బల్క న
స్తోకామోదముతోడ నుందువు నమస్సుల్ నీకుఁ ద్యాగాస్పదా!

అమ్మా నాన్న యటన్న పల్కులకు ముందాగాదె నీపుత్ర ర
త్నమ్ముల్ నేరిచిమాటలందునను యత్నంబింతయున్ లేక యే
సమ్మోదమ్మిడఁ జాలునట్టివగు నా 'స్వారాజ్య సంసిద్ధి' 'భే
దమ్ముల్ వీడుట' లన్న వాక్కులవి సంతాపాభ్రఝంఝానిలా!

కన్నుల్ గల్గిన గ్రుడ్డిమానవులు లోకంబందు వేలాతిగా
నున్నారంచుఁ దలంచి, జ్ఞానమిడఁగా నూహించి, సాధించఁగా
నిన్నుం బంపఁగఁబోలు సదసన్నిర్ధారణా జ్ఞానభూ
తౌన్నత్యన్; సకలామరస్తుతమహాత్పాదాబ్జయౌవాణియే!



★ చలనచిత్రకళా ప్రపంచం ★

లలనారత్నములు చలన చిత్రములు

ప్రపంచమందెల్ల పరిశ్రమలలో నేడు సినిమా పరిశ్రమ అగ్రస్థానము వహించియున్నది. కేవలము ధనార్జనముకొఱకై ఏర్పడిన వ్యాపారసరణియే గాక కళాప్రధానమైనదగుటచే యీ పరిశ్రమ అధికజనాదరణమునకు పాత్రమైనది. అన్ని దేశములందువలెనే ఆంధ్రదేశమునందుగూడ నిది అన్నిమూలల నల్లుకొనుచున్నది. అనేకులగు స్త్రీ పురుషుల కిది జీవిక నొసంగుచున్నది. అసంఖ్యాకులగు స్త్రీలును, పురుషులును దీనిలో ప్రవేశించి ఈ కళ నారాధించుచున్నారు. అందులో ముఖ్యముగా స్త్రీలెంతవరకు సినిమాలయందు నటింపదగునను విషయమును జర్చించుటే యీ వ్యాసోద్దేశము.

సినిమాలలో స్త్రీ లభినయించుటనుగూర్చి ఇదివరకే పలువురు చర్చించియున్నారు. కొందరు అభినయము, నాట్యము అనాదినుండియు వేశ్యలసొమ్మనియు, ఏ కారణముననో అవి మాయమైపోగా పడుపువృత్తియే వారికి మిగిలినదనియు, నేడు సినిమాలు వెడలుటనుబట్టి వారందఱు వానిలో నటింప దొరకొన్నచో నిప్పటి హేయమగు దుస్థితి తొలగిపోయి సంఘము కొంతవరకు బాగుపడుననియు వ్రాసియున్నారు. మఱి కొందఱు స్త్రీలు స్త్రీ పాత్రలును, పురుషులు పురుషపాత్రలును నటింపబూనుకొన్నచో సంఘమున అవినీతి మఱింత హెచ్చగుననియు, భారతదేశపరిస్థితుల కది తగదనియు వ్రాసియున్నారు. ప్రఖ్యాతనటకులును, విమర్శకులును అగు శ్రీ బళ్లారి రాఘవాచారిగారు వాహిని సినిమా సంచికలో 'కథ ఏ సాంఘికపరిస్థితులతో సంబంధించియుండునో, కవియు, నటకులును నా సంఘమువారై యుండినగాని సహజములును, నిర్దుష్టములును నగు ఉత్తమచిత్రములు తయారుగా'వని వ్రాసియున్నారు. అనగా 'రైతుబిడ్డ' యను చిత్రము తయారు

జాతీయజీవనమునకు ప్రతిబింబమై, అంతర్జాతీయ ప్రఖ్యాతిని, ప్రాముఖ్యతను పొందవలసిన యీ చలనచిత్రకళా పరిశ్రమ మన దేశమున సంకుచితమై అవినీతి కాకరమై యుండుట, భారతదేశ కళాప్రాభవమునకు తీరని మచ్చ —

జాతీయోన్నతికి దీనిని సమగ్రముగ నుపయోగించుకొనుటకై జాతి మత వివక్షత లేక సర్వులు దీని నారాధించి చలనచిత్రకళయొక్క కార్యక్షేత్రమును సువిశాల మొనర్చుకొనుటకు 'కులస్త్రీలు' కూడ యిందు పాల్గొనవలయునను భావము ప్రబలమై యున్నది.—

కాని ఇట్టి 'సంస్కారము' ముందుగా పరిశ్రమ యందును, దాని నారాధించు వ్యక్తులయందును అవశ్యకము గాని - కళలోను కులస్త్రీలలోను మాత్రము కాదు.

★

— శ్రీమతి —

కె. నిర్మలాదేవి

★

కావలయునన్న, కవియు, నటకులునుగూడ రైతులైయుండవలయునని వారి తలంపు. అట్లే వేశ్యలనుగూర్చిన కథలలో వేశ్యలును, సాంసారిక చిత్రములయందు సాంసారిక స్త్రీలును నటింపవలయునే గాని లేకున్న చిత్రము సహజముగా నుండదని వారి యభిప్రాయము. ఇందు వలన ఆచార్యులుగారు సంఘములో గల ఎల్ల తరగతులవారును నటింపవచ్చునని ఒక స్వేచ్ఛాపత్రము దయచేసినవారైరి. వీరి యాశయమెంతవర కనుసరణీయమో యవశ్యము చర్చింపవలసి యున్నది.

ఈ యభిప్రాయము ప్రకారము స్త్రీల జీవితమున సినిమాలు నేడు పెద్ద మార్పొకటి తెచ్చిపెట్టుచున్నవి. ఈ మార్పు నేటి స్త్రీలకు శ్రేయోదాయకమా లేక హానికరమా అను విషయముకూడ మన మాలోచింపవలయును సాంఘికపరిస్థితులు నానాటికి సంస్కారము నొందుచున్నవి. ప్రాచీనులు నిర్మించిన కొలతబద్దలతో నేటి పరిస్థితులను కొలిచి యిది మంచి, అది చెడ్డయని చెప్పుటకు వీలుగాకున్నది. పూర్వ మవినీతికరములుగా నిషేధింపబడిన కార్యము లిప్పుడు నిరభ్యంతరములుగా జేయబడుచున్నవి. 'సామాన్య దృష్టిలో అవినీతి అనే అజ్ఞానానికి కళాలోకంలో తావులేదు' (ముత్యాలశాల) ఇది వెంపటివారి కళాసూత్రము. కళ పేరట ఎన్ని దురాగతములు జేసినను తప్పులేదని వారి సిద్ధాంతము. సినిమా రంగము నానాటికి ఆర్థిక, సాంఘిక, రాజకీయ విషయములలో విశాలమైపోవుచున్నది. దానిలోని ధనార్జనోపాధులు, దానిలోని స్వేచ్ఛాజీవనము సాంసారిక స్త్రీలకుగూడ వ్యామోహము గల్పించుచున్నవి. దినదినము ఎందఱో కుటుంబస్త్రీలు సంసారములవదలి రంగమున బ్రవేశించి ఉజ్వలతారలగుచున్నారు. ఉన్నతకుటుంబములకు జెందినవారుగూడ అనేకు లీవెట్టి వ్యామోహమునకు దాస్యము జేయుచున్నారు. సినిమాలపేరట నెంతయో కాలుష్యతము సంఘమున పేరుకొనుచున్నది. వెంపటివారు జెప్పిన కళ యను కృతకాంబరముతో దానిని సంస్కర్తలు, విద్యావంతులు కప్పిపుచ్చుచున్నారు. పూర్వుల యభిప్రాయములేవియును ఇప్పటి కళాభిజ్ఞులకు రుచించుట లేదు. పూర్వలాక్షణికులు దూరాహ్వాన, వధా, యుద్ధ, భోజన, శయ్యావిహారాదుల నాటకరంగమున కెక్కింపరాదని నిషేధించినారు. కాని నేటి రంగము మారినట్లే, ఆ సూత్రములును మారినవి. ఇప్పుడు రంగముపై ముఖ్యముగా చూపబడునవివియే.

పరపురుషస్పర్శ, ఆలింగన,చుంబనాదులు సాంసారిక స్త్రీలకు కూడనివి. ఆచారమునుబట్టి వేశ్యలు చేసినను తప్పుగా నెంచబడనివి.

నటీ జీవితమున నివి తప్పించుకోరానివిగూడను. ఏలన, చిత్రమున నటించు వ్యక్తులు భార్యాభర్తలే యుండు టరుదు. అదియునుగాక వారి సమ్మేళనముతోడనే కథ పూర్తిగాదు. కథలో యితర సంఘటనము లనేకము లుండును. వానిలో నాయిక అనేకములైన ఇతర కథాపాత్రములతో కలిసిమెలిసి తిరుగవలసియుండును. సామాన్యజీవితమునందుకంటె విలక్షణపరిస్థితులను కల్పించుకొననిదే కథా వస్తువు ఆకర్షకముగా నుండదు. అట్టిచో సంసారస్త్రీలకు ఇతర కథావ్యక్తులతో గలుగు సన్నివేశములుగూడ సామాన్యజీవితమందునకంటె విలక్షణముగానే యుండును. యీ విలక్షణత్వము సంసారస్త్రీల గృహజీవనమునకు మిక్కిలి హానికరము. నాయకుడు భర్తయైనప్పుడే ఇన్నిచిక్కులు గలుగుచుండ ఇతరవక్త్యులవిషయమున వేఱుగా జెప్పనవసరములేదు.

బొంబాయిటాకీసువారి 'జీవనప్రభాత్' నందును, 'నిర్మల' లోను గృహజీవనము ప్రదర్శించు పట్టున స్త్రీ వ్యక్తులును పురుష వ్యక్తులును ఎట్లు సంచరింపవలయునో చక్కగా ప్రదర్శింపబడినది. జీవన ప్రభాత్ లో శయ్యాగృహరహస్యములను ప్రదర్శించు పట్టునగూడ కథాపాత్రములను ఎడమెడముగా శయ్యాపై నాసీనులనుజేసి హాస్యకరములగు సంభాషణములతోడనే డైరెక్టరు రసపోషణము చక్కగా గావింపగల్గినాడు. మన 'వందేమాతరం' డైరెక్టరుగారికి నాయిక నమాంతముగా నాయకుడు లాగి పైని బడవేసికొనునంతవరకు చూపించినగాని తృప్తిగలుగలేదు. ఇట్టి యసభ్యదృశ్యమును గల్పించుటకు నాయిక సంసార స్త్రీయైనచో యెట్టి యవస్థలపాలౌనో వేఱుగా జెప్పబనియుండదు. 'నిర్మల'లో గృహస్థజీవనము జూపు పట్టున నాయకు డూలువిచ్చెను చేతులతో బట్టుకొనియుండ నాయిక దానిని ఉండగా జుట్టుచున్నట్లు చూపియున్నాడు. ఈ ఘట్టము మిక్కిలి సున్నితముగాను, కళాసమన్వితముగాను, ఆకర్షకముగాను నున్నది. కాని వందేమాతరం లోని గృహజీవనము 'ఇది సానికొంపా, సంసారికొంపా?' అని అందులో అత్తగారడిగిన ప్రశ్నలో మొదటి భాగమునకే సమాధానముగా నున్నది. ఇట్టి విపరీత జీవితమును ప్రదర్శించుటకే ఏర్పడిన సినిమాలయందు సంసార స్త్రీలు నటించుటేమాత్రమును తగదు.

'సామాన్యజీవితమునగూడ గాజులవాడు, వైద్యుడు మున్నగువారిచే తాకబడినను స్త్రీ తన పాతి వ్రత్యమును నిలుపుకొనుచున్నది కాదా! అట్లే సినిమాలలోగూడ ఇతరులు తాకినను, పట్టుకొన్నను యామె తన జీవితమును నిష్కలంకముగానే నిర్వహింపవచ్చు'నని ఈ సందర్భమున నెవరేని ఆకాంక్షింపవచ్చును. కాని సామాన్యజీవితమున అట్టివి జీవిత ధర్మసాధనమునకు ఏర్పడిన నిర్ణయములు. శరీరధారణమునకు, సుమంగలీ జీవితమునకు అవి లేకున్న జరుగదు. వానిని సంఘము, శాస్త్రము ఆమోదించి విధులుగా జేసినవి. అవి యవి నీతిని ప్రబలజేయుటలేదు. అట్టివి జీవితమున కదాచిత్కముగా సంభవించుచుండును. సినిమా జీవితమందన్నో వానికంటె విపరీతములగు సంఘటనములు, మన శ్చాంచల్యమును ప్రేరేపించునట్టి శృంగార చర్యలు, డైరెక్టర్లు తమ బుద్ధిబలమునంతయు వినియోగించి, ఆలోచించి, కల్పించి వానిలో తారలను జొనిపి జంత్రపుబొమ్మల నాడించినట్లు ఆడించుచున్నారు. దీనివలన స్త్రీలకుండు సహజ సౌకుమార్యము, స్త్రీత్వము, కలికితనము నాశనమై పోవుచున్నవి. ఇట్టి జీవితము నిజముగా స్త్రీ లెవ్వరికి సమ్మతముగాదని డైరెక్టర్లకు తెలియును.

అందువలన వారు వేలకొలది రూప్యములను జీతములుగా నిచ్చి యాళగొల్పి తారలకొఱకు వలల నొడ్డు చున్నారు. నూతనోత్తేజమనియు, స్వేచ్ఛాజీవనమనియు, సంఘసంస్కారమనియు, దేశస్వాతంత్ర్యమనియు, పెద్దపెద్ద పేరులుబెట్టి ఆత్మలాభాభిమానులై కేవలము ధనాశాపరులై జాతిసంప్రదాయమును గుర్తింపక, ఆచారమును ఆదర్శగుణమును మరచి ఇష్టమువచ్చినట్లు చిత్రములుదీసి జాత్యౌన్నత్యమును మంటగలుపుచున్నారు.

క్రొత్తయొకవింత, పాతయొకరోత యన్నట్లు క్రొత్తగా గనిపించుచున్న యీస్వేచ్ఛా జీవనమునకు వ్యామోహమునొంది, సంసారస్త్రీలును, కులీనలగుయువతులును రోజురోజును మందలుమందలుగా సినిమా రంగమునజేరుచున్నారు. దరిద్రభారతదేశమున జన్మించుటే చేసినపాపమై పేదరికము ననుభవించు మానవతు లెందఱో దరిద్రబాధ భరింపలేక డైరక్టరులిచ్చు జీతమునాశించి యందుప్రవేసించి వారిసౌశీల్యమును గోల్పోవు చున్నారు. ఇట్టిజీవితము సంసారస్త్రీలకు తగదు. సంసారస్త్రీలు సినిమాలో నటించుటతగదు. సినిమాలపైని యభిమానము తలకెక్కుటచే మగలతో విడాకులనొంది రంగములకెక్కిన కాంతలవిషయములుగూడ మనకు గోచరించకపోలేదు. ఇప్పటికి నటనటీవర్గమునందుజేరి ప్రఖ్యాతివహించినవారల శీలగుణాదులను మనము నిత్యము పత్రికలలో చదువుచునేయున్నాము. తారలప్రసిద్ధి వహించిన హాలీవుడ్డునటీమణులు, తమశీలమును క్షీణసంతలో వేలము వేయుటచేతనే లక్షలాదిగా జీతము లార్జించుచు నటీనక్షత్రమండలము నలంకరించుచున్నారు. దానినే యొరవడిగా నుంచుకొని ఆంధ్రతారలుగూడ జాతీయత, ఔన్నత్యమును, ఘనతనుమరచి డైరెక్టర్ల చేతులలోని కీలు బొమ్మలై తమజాతికంతటికి నైచ్యమాపాదించుచున్నారు.

ఇట్టివ్యభిచార భావములను ప్రదర్శింపవలసిన వారగుటచేతనే వారిసంసర్గము సంఘమున దోషమునకు మూలమని యెంచి నటనటీ వర్గమును శాస్త్రము పఙ్క్తిబాహ్యముగానిషేధించియున్నది. కావున సకాలమునందే ఈయరిష్టప్రవాహము నరికట్టుటకు ఆంధ్రమహిళా సమాజము ప్రబలమగుప్రయత్నము జేయవలయును, సినిమా రంగములు పూర్తిగా సంస్కరింపవలయును. లేకున్న జాతికి తీరనిచేటు వాటిల్లును, ఆంధ్ర స్త్రీల యౌన్నత్య మింకను అడుగంటును. నేడు సినిమారంగములం దవినీతిప్రభుత్వము వహించియున్నది. దానికిస్వలాభము నాసించెడి డైరెక్టర్లేకారణము. వారుతీయు కథలట్టివి, వారుకల్పించు రంగములట్టివి. వారుప్రోత్సాహముజేయు ప్రయత్నములట్టివి. ఒకానొకఫిలుము డైరెక్టరు, 'వ్యభిచారమన్న నేమియుతప్పులేదనియు, అన్యపురుషసంపర్క మన్నచో స్త్రీలు భయపడవలసిన పనిలేదనియు, అట్లుభయపడుట సంఘములో దౌర్బల్యము నధికము జేయు టనియు, అవినీతియను దానికొకకొలత బద్దలేదనియు, ఒకజాతికి అవినీతిగాతోచునది మఱొకజాతికి మిక్కిలి నీతియుక్తముగా దోచుచుండు' ననియు, నుపన్యసించుచుండ నేనుస్వయముగా వినియున్నాను. ఆయనఇప్పుడు గూడ మనరాసులలో ఒకపెద్దఫిల్ముకంపెనీకి డైరెక్టరు, ఫిలుములుగూడ తీయుచున్నాడు. నేటిడైరెక్టర్ల యభి ప్రాయములట్టివి. నిజముగావారిస్టూడియోలలోని జీవితమంతయునట్టిదే. ఇట్టి నికృష్టజీవితముపై సంసారస్త్రీలే మాత్రము సానుభూతిజూపతగదు. ఈ వేలుపుర్వు ఆంధ్రమహిళా జాతీయ వృక్షమును సమూలముగా కొరికి వేయకమునుపే ఆంధ్ర స్త్రీలు మేల్కొనవలెను. అవినీతితో వఱ్ఱోడుచున్న ఈసినిమా జీవితప్రవాహమున ఇంకను కొందఱు స్త్రీలు కొట్టుకొని పోకమునుపే దానినరికట్టుటకు తగుప్రయత్నములు జేయుచుండుట ఎంతయు ఆవశ్యకము.

కుమారి టంగుటూరి

సూర్యకుమారి

ఉత్తమకుల కన్య ● నృత్య గానకళా పిపాస ● ఆదర్శ భావపూరిత

(చిత్రలేఖ)

సంపన్నకుటుంబీకులు, సాంప్రదాయప్రసిద్ధులు అయిన శ్రీ టంగుటూరివారి వంశంలో జన్మించిందీ కుమారి. సుప్రసిద్ధ ఆంధ్రనాయకులు ఆంధ్రకేసరి శ్రీ టంగుటూరి ప్రకాశంపతులుగారి తమ్ములు శ్రీ టంగుటూరి శ్రీరాములుగారి మూడవకుమార్తె ఈమె. రాజమండ్రిలో శ్రీరాములుగారు వకీలుగా పనిచేస్తూవున్న రోజులవి. ప్రకాశంపంతులుగారి స్వరాజ్య పత్రికకు ఉత్తేజకరములైన వ్యాసములను వ్రాస్తూ, వీలైనప్పుడల్లా జాతీయోద్యమాలలో పాల్గొంటూ శక్తివంచన లేక శ్రీరాములుగారు పాడుపడుతూవున్న దినములవి. నలువైపులా జాతీయవాంఛ ప్రాకుతూ పొంగిపొరలుతున్న 1925 సంవత్సరం అక్టోబరు నెలలో జన్మించింది సూర్యకుమారి.



కుమారి టంగుటూరి సూర్యకుమారి

చిన్నప్పటినుంచి జాతీయ భావపూరితమైన వాతావరణంలో పెరుగుచు, జాతీయగీతములు పాడుతూ ఉన్నతాదర్శముల నలవరచుకొన్నది. పాటలన్నా, పద్యములన్నా అత్యధికమైన ఆశ. ఎప్పుడును ఏదో ఒకటి పాడుతూవుండే ఆసక్తి. అన్నగారైన రామమోహన్‌తో కలిసి గ్రామఫోన్ పాటలు వచ్చీరాని మాటలతో పాడుతూవున్న నాటి పసితనపు పలుకులు, పాటలు వినేవారిని ఆహ్లాదపరవశులను చేసేవి. అన్నా తానూ పోటీలు వేసుకొని పాడిన పాటలకు ఆల్‌కాట్ తోటలోని గున్నమామిడి చెట్లమీది చిన్న కోవెలలు సృతి మేళవించి హెచ్చరికతో గొంతెత్తిపాడి, సూర్యకుమారి భావికీర్తికి రేఖలు దిద్దుతూ ఆలాపించేవి.

బడిలో నాటకములు వేయునప్పుడు సూర్యకుమారి పాటలు వినడానికి ప్రత్యేకంగా కుతూహల పడేవారు. నాటకాల్లో కృష్ణుడు, నారదుడు మొదలైన పాత్రలను ధరించి మృదుమధురంగా పాటలు పాడడమే గాక, హావభావపూరితంగా అభినయించేదికూడ.

సుమారు నాలుగుసంవత్సరముల క్రితం సూర్యకుమారి పాటవిని శ్రీ గోపాలకృష్ణ ఫిలిమ్సువారు తీయడానికి ఉద్యమించిన 'విప్రనారాయణ' అనే తమిళచిత్రంలో పూజారి కుమార్తె పాత్రకు యీమెను నియోగించారు. అదే యీమె మొట్టమొదటగా సినిమాప్రపంచంలో పాల్గొనడమైనప్పటికి, అన్యప్రాంతానికి చెందిన పరభాష అయినప్పటికి ఆపాత్ర నతి సహజంగా నటించి తమిళదేశములో ప్రజామన్ననల పొందింది. దానితో 'అదృష్టము' (Luck) అనే తమిళ చిత్రంలోకూడా ప్రధాన భూమికను నిర్వహించి తన కీర్తిని సువిశాలం చేసుకొన్నది—

చి॥ సూర్యకుమారి అన్న రామమోహన్‌తో—(చిన్నతనమున)

తరువాత సూర్యకుమారి యొక్క దివ్యగానామృతము ఆంధ్రభూమిలోకూడా వెల్లివిరిసింది. శ్రీ గూడవల్లి రామబ్రహ్మంగారి కోరిక మీద సారథి ఫిలిమ్సువారి 'రైతుబిడ్డ'లో రైతు నర్సిరెడ్డి కుమార్తెగా నటించి ఆంధ్రమహాశయుల ప్రత్యేకాభిమానాన్ని సంపాదించుకుంది. దానిలో యీమె పాడిన 'రాబోకు రాబోకు చందురూడా' 'హృదయము-పొంగెగా' అనే పాటలు, ప్రత్యేకంగా యీమెచే పాడబడిన 'కాంగ్రెసుజెండా' 'పావన హిందూ మాత' మొదలైన జాతీయగీతాలు ఆంధ్రభూమిలో అమితమైన ప్రచారాన్ని పొందాయి—

కుమారి సూర్యకుమారి సినీమాలలో ప్రవేశించుట ధనాశచేగాదు - సంగీతమునందు, నాట్యము నందు ఆమెకు వున్న విశేషాదరాభిమానములే ఆమెను ఆకర్షింపజేసినవి.—

ఐనను గౌరవము, ప్రతిష్ట, మంచినడత మొదలైనవి ప్రధానముగ నెంచు ఈమె కలకత్తా, బొంబాయి మొదలగు పట్టణములనుండి అనేకమైన ఆహ్వానములు వచ్చినను వారివారియొక్క నడవడి మొద లైనవి పూర్తిగ తెలియనందున యీమె ఆ ఆహ్వానాలను మన్నించలేదు. వయస్సున పిన్న అయినా సుగుణములలో మిన్న అయిన సూర్యకుమారి అభిప్రాయములు ఆదర్శమైనవి.—

అన్నవస్త్రములకు లోపములేని సంపన్నకుటుంబములో జన్మించి, కళారాధనకే పాటుపడుతూ వున్న సూర్యకుమారి గౌరవప్రతిష్టలు అభినందింపదగినవి.

కిన్నెరలు మ్రోగే గాత్రమూ, మృదుమధురమైన ఒదుగు, హృదయతంత్రుల నాలాపింపజేసే పాట, ఆదర్శపూరితమైన భావాలుగల సూర్యకుమారి తనకు ఒక వినిర్మలమైన భవిష్యత్తును నిర్మించుకొనడమే గాక, ఆంధ్రప్రసక్తికి, ఆంధ్ర వనితాలోకానికి కీర్తినిగూర్చే ఒక ఆధునిక యువతీరత్నమౌతుందని ఆశించడంలో అతిశయోక్తిలేదు.

- ప్రతి సంవత్సరమూ భారత దేశంలో తయారవుతూవున్న చిత్రాల క్రింద 1,20,00,000 అడుగుల ముడి ఫిల్ము ఖర్చు అవుతూవుంది.
- భారతదేశాన్నించి ఇంగ్లండు అమెరికా దేశాలకు ఫిల్ముల సంబంధంగా సగటున 60 లక్షల రూపాయిలు ప్రతి సంవత్సరమూ పంపబడుతున్నాయి.—
- బాలబాలికలకు విద్యను గరపడానికి ఉపయోగించే విద్యావిషయ ప్రబోధకరమైన చిన్నచిన్న చిత్రాలు, ఒక్క అమెరికాలో 2,500 వున్నాయి.
- అమెరికాలో అన్ని శాఖల్లోను పనిచేసేవారిలో స్త్రీలకంటె పురుషులే ఎక్కువ. కాని సినిమాలలోమాత్రం పురుషులకంటె స్త్రీలు నూటికి 8 మంది ఎక్కువగా వున్నారు.
- అంతర్జాతీయ విఖ్యాతినందిన గ్రేటా గార్బో అనే పాశ్చాత్య నటీమణి యీ పరిశ్రమలో సంపాదించినంత ధనం మరి ఏ తార ఇంతవరకు సంపాదించలేదు.

జాతీయ విజ్ఞానవికాసములకు క్రీడారంగమైన చలనచిత్ర రంగమును కులస్త్రీలు బహిష్కరించకూడదు—

కాని, కులస్త్రీలు పాల్గొనడానికిపూర్వము దానిని సంస్కరించవలసి వుంది. అందుకు వనితామణులు టెక్నీషియన్లుగా వుండడం చాలా అవసరం.



సినిమాలు – స్త్రీ టెక్నీషియన్లు

★

— శ్రీమతి —

జి. కళ్యాణి

★

చలనచిత్ర పరిశ్రమ ప్రస్తుతము ప్రపంచ ప్రధానపరిశ్రమలలో ఒకటిగా ఎంచబడుతోంది. వేలకువేలు ప్రజలు యీ పరిశ్రమనే ఆధారంగా చేసుకుని జీవిస్తూవున్నారు. ఈ పరిశ్రమకు సంబంధించిన చిత్రముల ప్రకటనలలో స్త్రీల పేర్లే విరివిగా ప్రచారం పొందుతూవుంటాయి. అంచేత స్త్రీలీ పరిశ్రమల్లో విశేష స్థానంపొంది, దీన్ని పోషిస్తున్నారనుకుంటాము. కాని నిజం పరికిస్తే ఇది అంతా వట్టి భ్రమ అని తేలిపోతుంది. ప్రకటనల లోను, తదితరములలోను కనపడేవారు కేవలము కథాసందర్భములో పాత్రధారిణులుగా వున్నవారే కాని ఫిలిమును తయారుజేసే సాంకేతికశాస్త్ర ప్రవీణుల్లోమాత్రం కాదు. ఈ లోపం ఎక్కడుంది? చిత్రాల్లో నటించి పెట్టుబడిదార్లకు లక్షలకొద్ది ధనాన్ని సంపాదించిపెడుతూన్న స్త్రీలకి యీ టెక్నికల్ విషయాలలో ప్రవేశం ఎందుకుండ కూడదు?

అయితే, స్త్రీలుకూడా లేకపోలేదు. బొంబాయిటాకీసువారి సంగీతదర్శకురాలు సరస్వతీదేవి అనే విద్యాధిక. మద్రాసు సౌండు సిటి ఫిలిం కంపెనీ నిర్మాతలైన ఎ. నారాయణగారి సతీమణిగూడా శబ్దగ్రాహిణిగా పనిచేస్తూవుండేది. ఇక విఖ్యాత ఆంధ్రతార శ్రీమతి కన్నాంబకూడా రాబోయే వారి 'మాతృప్రేమ' అనే చిత్రానికి దర్శకత్వంలోకూడా పాలు తీసుకుంటుందని వింటున్నాము. ఇంతే. దీనికిమించిన వారు స్త్రీలలో కనపడరు.

పాశ్చాత్య చలనచిత్ర పరిశ్రమలో స్త్రీలు అమితంగా పాల్గొని, యీ కళయొక్క ఔన్నత్యానికి పాటుబడుతున్నారు. డైరెక్టరు సహాయార్థం 'కంటిన్యూయిటి గరల్సు'గా పనిచేస్తున్నారు. చిత్రంయొక్క ముందువెనుకల సమన్వయం యీ కంటిన్యుయిటీ మీదనే ఆధారపడివుంటుంది. దుస్తులలోను, స్థలనిర్దేశములోను, ముఖభావాలను ఆయా పాత్రలకుండవలసిన పరిస్థితులలో వారి నుంచుటలోను వీరు సహాయపడి

చిత్రంలో ఎగుడు దిగుడులు రాకుండా కథాసందర్భాల్లో అన్వయం కుదిరేలా చూస్తూవుంటారు. ఇదేకాక, అన్నివిధములైన టెక్నికల్ విషయాల్లోనుకూడా వీరు విశేష శ్రద్ధ చూపుతూవుంటారు.

అలాగే మనదేశంలోకూడా ఉత్సాహవంతులగు స్త్రీలు ఛాయాగ్రహణంలోను, శబ్దగ్రహణంలోను, శిల్పంలోను, మేకప్‌లోను తరిఫీదునొంది పనిచేస్తే ఈ పరిశ్రమ ప్రస్తుతము ఉన్నస్థితికంటె ఎక్కువ ఔన్నత్యమునకు రావడానికి వీలుంటుంది.

స్త్రీలకు మేకప్ చేయవలెనంటే స్త్రీలే వుండాలి. స్త్రీలకంటె ఎక్కువ అందముగా మేకప్ చేయగలరా తదితరులు? స్త్రీలు వేషాన్ని ధరించివున్నప్పుడు వారికి స్త్రీలే సహాయులుగా వుంటే చాలా మంచిది. మేకప్‌లో స్త్రీలు వున్నారంటే సంసార స్త్రీలుకూడా ఫిలింలో కొన్నికొన్ని పాత్రలను ధరించడానికి అవకాశాలుంటాయి.

నేటి చిత్రాలు కొన్నిటిలో అన్నచెల్లెలు, తండ్రికూతుళ్లు - ఎవరికితగిన గౌరవము వారికివ్వక అనవసరముగా ఒకరినొకరు ఆలింగనము చేసుకొనడం మొదలైనవి ఎన్నెన్నో చూపిస్తున్నారు. ఇటువంటి చోట్ల స్త్రీలను కేవలము నీచపరచడమే గాక, నీతియుతమైన కథాసందర్భాన్ని పాడుచేయడము, స్వభావికత దూరమైపోవడమూ, అసభ్యంగా తయారవడమూ జరుగుతున్నాయి.

స్త్రీజాతికి మన చిత్రాల్లో జరుగుతూవున్న అన్యాయం మరెక్కడా వుండదు. దేశవిఖ్యాతిపొందిన ప్రభాత్ కంపెనీ, బాంబే టాకీసు, న్యూ థియేటర్సు మొదలైనవారి చిత్రాలలో స్త్రీలకు తగిన గౌరవం ఇస్తున్నారు. సంసారవిషయములు చూపించునప్పుడు ఒకరినొకరు ముట్టుకొనకుండానే అన్నిరసములు చూపిస్తున్నారు. ఈపాటి గౌరవమర్యాదలు మన ఫిలిముల్లో కరువైపోయాయి. ఈ మాలిన్యం పోవాలంటే యీ పరిశ్రమకు సంబంధించినవారిలో కొంత ఉన్నతభావాలు ఉదయించి మార్పు రావాలి—

తరువాత స్త్రీలు టెక్నికల్ శాఖలలో పనిచేయాలి. అప్పుడుగాని యీ అన్యాయం పోదు—

ఇదేగాకుండా, స్త్రీలు ఆయా పర్యవేక్షణలలో వుంటే, గృహములను చూపించు సందర్భాలలో, దినచర్యలను చూపించు సందర్భాలలో పరికరములను వస్తువులను సమకూర్చడం మొదలైన విషయములు అతి స్వభావసిద్ధముగా చూపించబడతాయి—

దర్శకత్వము, ఛాయాచిత్ర శబ్ద గ్రహణములు, ఎడిటింగు మొదలైన టెక్నికల్ విషయములలో స్త్రీలు ప్రవేసించి పనిచేసిన చిత్రములలో అస్వభావికత చాలవరకు తగ్గిపోతుంది. ఓర్పు, సహనము, పట్టుదల, విషయ విమర్శనము మొదలైన గుణములకు స్త్రీలు ఆటపట్టు. ముఖ్యంగా చిత్రం విజయవంతం కావాలంటే ఇటువంటి గుణములు టెక్నీషెయిన్సుకు వుంటేనేగాని వీలుపడదు.

ముఖ్యంగా స్త్రీలు దర్శకులుగాను, సాంకేతిక పర్యవేక్షకులుగాను వుంటే నేడు యీ పరిశ్రమలో జరుగుచున్న అవినీతి పూర్తిగా తొలగిపోతుంది.

నేడు సంసారస్త్రీలుకూడా యీ పరిశ్రమలో విశేషంగా పాల్గొనాలి అనే విషయం బాగా ప్రబలంగావుంది. వీరు చేరడానికి ఏలాటి అభ్యంతరమూలేదు. కాని ముందుగా యీ పరిశ్రమలో ప్రస్తుతం ప్రబలంగావున్న అవినీతి తొలగిపోవాలి. దానికి సాంకేతికశాఖలో స్త్రీలు విశేషంగా వుండాలి. అప్పుడుగాని సంసారస్త్రీలకు యివి ప్రవేశార్హంగాదు. కనుక యీ విషయంలో స్త్రీలుకొంచెం శ్రద్ధబూనితే చలనచిత్రకళా పరిశ్రమ ఇంకా వృద్ధిపొంది, దానియొక్క ఉపయోగం మనం విరివిగా పొందగలుగుతాము.

ప్రొద్దస్తమానము బయట తిరుగుటవల్ల మీ లేతనైన ముఖచర్మము, గాలి, దుమ్ము, ఎండలకు వాడిపోవును. మీ చర్మము మీకు తెలియకనే మొద్దుబారియుండుటయు, కళాహీనముగాను, వికారంగాను ఉండుటను చూడడముతోనే మీకు దిగులు కలుగును.

సుందరమైన చర్మము స్త్రీకి మెప్పును, ప్రీతియు తెచ్చును. అతి శుభ్రముగాను, పూలమృదుత్వము పొందియున్న ముఖచర్మమును ఎంతచూచినను తక్కువయే.

స్త్రీయొక్క చర్మమునకు జాగ్రత్త అవసరము. అందులో వట్టి కడుగుటతో చాలదు. పాండ్స్ క్రీమ్ రంధ్రములలోనుండు మురికిని, నూనె విశేషమును తీసి అతి శుభ్రముగా నుంచును.

పాండ్స్ క్రీమ్ సీసాను కొనుడు. మీ వేళ్ళ చివరలతో క్రీమును మీ చర్మముమీద రాయుడు. మృదువైన గుడ్డతో దులుపుడు. మరియు కొద్దిగా వేరే క్రీమును తేలికగా పూసి, రాత్రంతయు నాణ్యమైన పొరను ఉంచుడు. ఈ మోస్తరుగా ఒక పదిహేనురోజులు రాత్రులయందు వాడుడు. అప్పుడు మీ చర్మము మృదువుగా లేతగా అవుతున్నట్టు మీకు తెలియగలదు.

పగలు, గాలి దుమ్మునుండి రక్షించుటలో శ్రేష్టమైనది 'పాండ్స్ వ్యానిషింగ్ క్రీమ్.'

పాండ్స్ క్రీములు అన్ని గొప్పస్టోర్సులలో దొరకును. లేక పాండ్స్ పి||బా|| బాక్సు 144 బొంబాయి వారికి వ్రాయుడు.

పాండ్స్ క్రీమ్

★ మొగలాయీ కళ

రేఖా లేఖన పతకం ★

ప్రేమతో మా కమలకు,

నేను సకాలంలో ఉత్తరాలు వ్రాయడంలేదని నీకు నా మీదకోపం వచ్చేవుంటుంది. కాని ఏం చేయమంటావు ? నా జీవితము ఒకపత్రికా సంపాదకుని జీవితమువలె అయిపోయింది.

ఎప్పుడూఅనుకోలేదు నేను: ఈమధ్య ఉష ఉత్తరం వ్రాస్తుందని. ఉష ఈమధ్య ఢిల్లీవెళ్లిందట. అక్కడవున్న మొగలాయీ చక్రవర్తుల నాటివికొన్ని చిత్రాలను చూచి, ఆనందించి ఆరసోన్మాదంలో నాకువ్రాసింది. 'మొగలాయీ ప్రభువులు భారతీయకళకు ఎంత సేవచేశారు......మానవులెరుగని దేవుళ్లకోసరం ప్రాకులాడే మనకళను మానవసేవకోసరం భూమిమీదకు దించేరు.... తెలిసియో, తెలియకో ఎంత మహోత్కృష్టమైన కార్యాన్ని చేశారు యీ ప్రభువులు !'

నేను సంతోషించవలసిన విషయం ఒకటి, నాస్నేహితుల పేదహృదయాలన్నీ...నాతోపాటు కళకోసరం ఆర్చిపోతూవుంటవి. కాని భారతీయ కళాప్రాబల్యము వీరందరకూ అర్థం అయ్యిందా అని నాగుండె కొట్టుకుపోతూ ఉంటుంది.

భారతీయకళ నా అభిప్రాయములో, బౌద్ధమహాయుగంలో, బౌద్ధబిక్షుల యోగదృష్టి సహాయంతో అజంతాగుహల కుడ్యాలంకార రూపంలో, ఉన్నతోన్నతమైన స్థానాన్ని ఆక్రమించింది. రూపాన్ని రేఖలలో ప్రతిబింబించే ధ్వనికి (Suggestion) ప్రాధాన్యాన్ని ఇస్తూ, నిర్ణయాన్ని ముద్రలమూలాన...అనాది నుండీ అనుకరింపబడుతూ ఉన్న శిల్పసూత్రాల సహాయాన్ని... తెలియజేస్తూ...ఉత్తమ ఆదర్శాలకోసరం ప్రాకులాడేవారు ఆనాడు భారతీయ శిల్పులు. ఆ భారతీయాదర్శము మొగలుల చేతులలో ఏమైంది ? మహా ప్రభువు జహంగీరు చక్రవర్తి చేతులలో ఈకళ వింతైనమార్పులను పొందింది. వస్తువనుకరణంకోసరం... చక్రవర్తి భోగలాలసను తృప్తిపరుచడానికోసరం...రంగురంగులతో...రంగుల నీడలతో (Shade and Perspective) ప్రాకులాడింది. అనాదిసిద్ధమైన శిల్పసూత్రాలు యోగముద్రలు...మాయమైపోయినవి. ప్రబంధ కవిత్వము లాగు భావము క్రుంగిపోయింది—భాషాకాఠిన్యాన్ని భరించలేక. ఆనాటినుండే మనకు రేఖా లేఖనము (Linear drawing) కరవై పోయింది. రంగురంగుల అలంకరణాలతో మునిగి తేలే ఈ చిత్రాలలో,

మొగలాయీ ప్రభువులుచేసింది సేవే అంటావా? నా అభిప్రాయంలో కాదని. ఏనాడు మనకళ, మన ఆదర్శాలకు...మన సూత్రాలకు (Conventions) మన ముద్రలకు దూరమైపోయిందో...ఏనాడు ఉత్కృష్టమైన రేఖా లేఖనపు స్థలమును నిర్జీవ ప్రాపంచిక (Realistic) చిత్రము దొంగిలించుకున్నదో... ఆనాడే మనసత్యమైన పతనము ఆరంభమయ్యింది. దానికి పునాదివేసింది ఎవ్వరు ? అది 'మహోత్కృష్టమైన' కార్యమా ? బాగా ఆలోచించు ! తెలిసియో తెలియకో ఉష అలావ్రాసింది; దానికి పంద్రెండు పేజీల సమాధానం వ్రాసి పంపేను. తీరికవున్నప్పుడు అదిఅంతా వ్రాసి పంపుతాను. ఈ ఉత్తరం వ్రాయడానికి ఇంత ఆలస్యమైనందుకు క్షమిస్తావా ?

ఇట్లు నీ 'మణి'

ఒకరికి సనాతనమా?

ఒకరికి సంస్కారమా?

★

నీలాకాశంలో విహరించడానికి పక్షి ఒక్కరెక్కతో పైకి ఎగరలేదు .. రెండు రెక్కలూ వుండి తీరాలి.

'సంఘం' అనే 'పక్షి'కి స్త్రీ పురుషులు ఇద్దరూ రెండు పక్షాలు. ఇరువురిలోను సంస్కార భావం సమానంగా సాగుచేయబడితేనే గాని, సంఘం శాంతి సౌఖ్య నీలాకాశంలో విహరించలేదు!

స్త్రీయే దీనికి ముందంజవేస్తే పురుషుడుమాత్రం...?

★

రిటైర్డు డిస్ట్రిక్టుజడ్జీ నరిసింహశాస్త్రిల్లవారు యిప్పుడు మద్రాసులో ఉంటున్నారు. శాస్త్రిలగారికి ఒక్కకొడుకు, ఒక్కకూతురు. కొడుకుపేరు వేణు. కొమార్తెపేరు పుష్ప. భార్య చిన్నప్పుడే మరణించినందున శాస్త్రిలవారు బిడ్డలను అతి గారాబముగా పెంచాడు. వేణు కిప్పుడు 20 సంవత్సరములు. బి.ఏ. సీనియరు చదువుతున్నాడు. వేణుకు పుష్పకు రెండేడ్లు తేడా. పుష్ప స్కూలుఫయినల్ ప్యాసై ఇంటరులో ప్రవేశించింది. చిన్నప్పటినుంచీ పుష్ప అంటే మిక్కిలి ప్రేమ వేణుకు. అన్నంతిన్నా, బడికిపోయినా, చదువుకొన్నా అంతాయిద్దరు ఒకమాటే చెయ్యాలి. తల్లిలేని బిడ్డలని తండ్రిగూడా వారికేకొఱతలేకుండా చూస్తూ వారి ఐకమత్యమునకు చాలా సంతోషపడుతూండేవాడు. కాని ఒక్కచోట చిక్కుగా ఉండేది. తండ్రి కొంచము సనాతనుడు. ఈ కొంచమే కొంపలుతీసేది. పిల్లలిద్దరికి చాలా అడ్వాన్సుడ్ వ్యూస్.

వేణుకు ఇంటరులో కలిశాడు ప్రసాద్. అప్పటినుంచి ఎంచేతో ఇద్దరూ చాలా స్నేహంగా ఉండేవారు. ప్రసాద్ ఎప్పుడూ తమ యింటికి రావడం, అందరూకలసి సినిమాలకు, బీచిలకు తిరగడం శాస్త్రుల వారికి ఏమాత్రము గిట్టదు. ప్రసాదు రావడం చూచాడంటే మరి విరుచకపడతాడు యింట్లో హిట్లరులాగ. ఒకటిరెండుసార్లు ప్రయత్నించాడు రావద్దని ప్రసాద్‌తో చెప్దామా అని, కాని ఎందువల్లో మానేసాడు.

ప్రసాద్ ఫస్టుక్లాసులో ప్యాసయ్యాడు. Bar-at-law కోర్సుకు పోవాలనని ప్రసాద్ తీర్మానించుకున్నాడు. వేణుకు గ్రూప్‌లో పోయింది. పుష్పదేముంది, ఆమె జూనియరునుండి సీనియరుకు మారింది.

● శ్రీమతి కె. సీతాదేవి ●

ఆ సాయంకాలం వాకిట్లో టాక్సి (Taxi) వచ్చి నిలచిఉంది. ఈ మూర్తిత్రయం వంచినముఖా లెత్తకుండా ఆలాగె వెళ్లి తిన్నగా కారులోబడ్డారు. కారు బయలుదేరింది.

ఎట్లో సెంట్రలుచేరారు. ఫస్టుబెల్ అయింది. పెట్టెలోకెక్కాడు ప్రసాద్. ఆతనిజూచి ఒక్కమాటు భోరున ఏడువసాగింది పుష్ప. తనకంటి వెంబడి ప్రవహించుచున్న కన్నీటికాల్వల సంగతి తెలియక పుష్పను ఓదార్చబోయ్యాడు వేణు. ప్రసాద్ దుఃఖము మరి చెప్ప నలవికాదు. ఆతనికండ్లు నిప్పులవలె ఉన్నాయి. ఇదంతాచూస్తే ఒకరినివిడిచిఒకరు బ్రతుకగలరా అనిపిస్తుంది. ఇంతలో బండి కూత వేసింది. దగ్గరకుబోయి ప్రసాదుకు ఏదో చెప్పబోయింది పుష్ప కాని, బండి కదిలింది మరి ఉంటుందా!

ఉత్తర ప్రత్యుత్తరాలు విధివిరామములేకుండా జరుగుతూనే ఉన్నాయి లండను మద్రాసులమధ్య. తానక్కడ చూచుచున్న చిత్ర విచిత్రాలనంతా పూసగ్రుచ్చినట్లు ప్రతిజాబులో వ్రాస్తున్నాడు ప్రసాద్. ప్రసాద్ వద్దనుండి జాబువచ్చిందంటే ఆదినమొక పండుగ వేణు పుష్పలకు. వేణులేనప్పుడు ఆ వుత్తరాన్నే తిరిగి తిరిగీ చదువుకొని ఏదో సంతోషించేది పుష్ప.

తిరిగి ఎండకాలపు శలవులు వచ్చాయి. ఈ సంవత్సరంతో చదువులు పూర్తిఅవుతాయి వేణు పుష్పలకు. వేణు యం.ఏ., పుష్ప బి.ఏ. ఒక నెలదినములనుండి శాస్త్రిలవారు ఏదో కొంచము హడావిడిగా ఉన్నాడు. ఒకరోజు మధ్యాన్నము భోజనములైన తదుపరి పడకకుర్చీలో పడుకొని 'అబ్బాయి' అని పిలిచాడు శాస్త్రిలవారు వేణును. 'వస్తున్నానునాన్నా'అంటూ వేణు తండ్రివద్దకు వచ్చాడు. '......ఏం లేదు......పుష్పకిప్పుడు 20 సంవత్సరముల వయసైయింది. ఏదో పదిమందీ ఒప్పుకోకపోయినా వివాహం చెయ్యకుండా చదువులో దింపాను. బి.ఏ., గూడా పూర్తిఅయింది. యింక త్వరలో ఆనాలుగు తలంబరాలు గూడా పడితే బాగుంటుందేమో అని ఆలోచిస్తున్నాను" అన్నాడు శాస్త్రిలవారు.

వేణు:-అవును నాన్న, నా అభిప్రాయంగూడా అదే. త్వరలో చేయడమే బాగుంటుంది. ఏదో ముగ్గురమూకలసి ఆలోచిద్దాం. పుష్పను పిలువనా? పుష్ప అభిప్రాయముగూడా కనుక్కుంటే బాగుంటుంది అన్నాడు. 'ఏమిటి దాని అభిప్రాయం కనుక్కునేది? నేచెప్పేది వినుముందు. మన సుబ్బరామయ్యను చూచావుగా నీవు? వాండ్లకు ఇప్పుడు రెండుమూడులక్షల రూపాయలకుంది ఆస్థి. వాడు చాలాయోగ్యుడు. వాడికిస్తే బాగుంటుంది? అని అభిప్రాయపడుతున్నాను. ఏమంటావు.'

......'సరే ఏదో ఆలోచిద్దాంలే నాన్నా' అంటూ వెళ్లిపోయాడు వేణు.

* * *

పెండ్లిపనులేమో జరుగుతున్నాయి. తాను చెప్పినప్రకారమే జరిగితీరాలంటాడు తండ్రి. ఇది జీవితానికి సంభంధించిన విషయం, కాబట్టి నీవు పూర్తిగా ఆలోచించుకొని నీ అభిప్రాయం నాకు తెలియ చేశావంటే నా ప్రాణమైనా అర్పించి నీయిష్టం ప్రకారమే జరిగేటట్టు చూస్తాను అంటాడు అన్న వేణు. తనకా ప్రసాద్ మీదుంది మనసు. మరి ప్రసాద్ మనసో, ఏమో ఏలాఉంటుందో! తీరాచూస్తే అతడేమంటాడో! ఒప్పుకుంటాడనే దానికి ఘట్టి తార్కాణం ఏమీలేదు. ఆతనికి వ్రాయడానికా అసహ్యంగా ఉంటుంది. ఆతడొచ్చేవరకు ఆపుదామంటే దానికిగూడా ఒప్పుకోడు తండ్రి. మాట యిచ్చాను ఆ ముహూర్తానికే జరిగి తీరాలంటాడు. తానీ సంబంధానికి ఒప్పుకోనుఅంటే, వేణు తనవైపే ఉంటాడు కాని పరిస్థితులేలా మారు

కాయో! వేణుకు దమ్మిడెత్తు ఆస్తిగూడా యివ్వడు తండ్రి. తన నిమిత్తమై ఆతని జీవితము పాడవదా? అవును. అవుతుంది. అది ముమ్మాటికి నిశ్చయము. తన స్వార్థంకోసం వేణు జీవితాన్ని పాడుచేయడమా? కాదు. ఆల్లెన్నటికి జరుగదు. అది అధర్మము. తానేమైనాసరే—

తన కోర్సు పూర్తి అవడంతోటే అమెరికాకుపోయి అచ్చటినుండి రావలెననుకొన్నాడు ప్రసాద్. ఆ ప్రకారమే తన ఉత్తరాల్లోగూడా వ్రాశాడు వేణు పుష్పలకు. కాని ఏంచేతో మానుకొని నేరుగా ఇండియాకే బయల్దేరాడు. మద్రాసులో జరిగే గొడవలేమీ అతనికి తెలియవు.

మద్రాసులో దిగీదిగడంతోడనే బయల్దేరాడు నేరుగా శాస్త్రిలవారి యింటికి. కారు సర్గ్గా వారి వాకటముందర నిలిచింది. ఆలా యింటివైపు చూచాడు ప్రసాద్. ఆ పచ్చతోరణాలు, ఆ మంగళవాయిద్యాలు, ఆ హడావిడి అంతాచూచి బహుశా అది శాస్త్రిలవారి యిల్లుకాదేమో అనుకున్నాడు. కాని పరికిస్తే అదేయిల్లు. ఏమిటో దిగి చూద్దామని కారుదిగి లోపలికెళ్లాడు. ఇంకేముంది. తన కెదురుగా అగుపడుతూంది పుష్ప పెండ్లిపీటలమీద. కాళ్లు ఆగాయి. ఆలాగే నిలుచున్నాడు కొయ్యబొమ్మలాగు. శరీరమంతా ముచ్చెమ్మటలుకమ్మాయి. దేహమంతా ఒడకసాగింది. నోటమాట రావడంలేదు. కండ్లవెంబడి ఒకటి రెండు వేడికన్నీటిబొట్లురాలినై. అంతా హడావిడిగాఉంది. ఎవరిపనుల్లోవారున్నారు. ఈతనిస్థితి ఎవ్వరూ గమనించలేదు. కాని హఠాత్తుగా పుష్ప చూచింది. చూచిజూడడంతోటే 'ప్రసాద్' అని కేకవేసింది. లేవబోయింది గూడా. ప్రసాదును చూచిన సంతోషంలో ఆమె ఎక్కడున్నదిగూడా మరచిపోయింది. అందరు ఆశ్చర్యపోయారు. సుబ్బరామయ్య వెనుకకు తిరిగిచూచాడు. గ్రహించాడు సంగతి. వెంటనేలేచి ఒక్కవిసురులో పొయ్యాడు, 'నాకీపెండ్లి అక్కరలే'దంటూ.

ఏదో పనివుండి లోపలికెళ్లాడు వేణు. జరిగిన గడబిడ అతనికి ఏమీ తెలియదు. కాని వెంటనే ఈ కలకలారావము విని పరుగెత్తుకువచ్చాడు. చూచాడు పరిస్థితి. ఆతడు నిర్ఘాంతపొయ్యాడు. అంతా అగమ్య గోచరంగాఉంది. పుష్ప ఇంకా పీటలమీద ఆలాగేఉంది. ఎదురుగా కొంచము దూరములో నిశ్చేష్టుడై నిలబడిఉన్నాడు ప్రసాద్. పెండ్లికొమారుని ఎటులైనా బ్రతిమాలి తేబోయిన పెండ్లిపెద్దలతో గూడా తిరిగివచ్చాడు తండ్రి నిరాశుడై. అతడు ససేమిరాఅంటే ససేమిరాఅన్నాడు.

మరి యిప్పుడు కర్తవ్యమేమిటి? ఏం జరగాలి? పుష్ప ఏమౌతుంది? తండ్రివైపు చూచాడు వేణు 'నాన్నా' అన్నాడు. తండ్రి పలుకలేదు. మంగళవాయిద్యములు గూడా ఆగిపోయాయి. అంతా నిశ్శబ్దంగాఉంది. యోచించి యోచించి 'ప్రసాద్ స్నానంచేసివచ్చి పీటమీదకూర్చో' అన్నాడు అతి ధైర్యంగా వేణు. ఈమాట అందరినీ స్తంభీభూతులను జేసింది. శాస్త్రిలవారు అక్కడచేరిన నలుగురి సిద్ధాంతులవైపు చూశారు. వారంతా గుడ్లెర్రజేసి—

'ఈ ఘోరకృత్యానికి సంఘం ఎంతమాత్రం ఒప్పుకోదు' అన్నారు ఏకగ్రీవంగా.

'ఏం' అన్నాడు వేణు.

'ఏం అంటే? అంతే! ఆలాఉన్నాయి ధర్మసూత్రాలు.—'

'మరి పెండ్లి అవలేదుగా!'

'అవసరంలేదు. సీటలమీద కూర్చున్నారుగా, అదిచాలు. తిరిగి వివాహమునకు పిల్లవాడికి హక్కున్నది గాని పిల్ల కెంతమాత్రములేదు.'

'ఏంచేత?'

'ఏంచేతంటావేమిటి? అంతే. నీకేంతెలుసు? అలా చెప్పిఉంది మన గ్రంథాల్లో. ఎవరైనా వాటికి కట్టుబడాల్సిందే. లేకపోతే సంఘం వారిని బహిష్కరిస్తుంది.'

తోకత్రొక్కిన తాచులాగైంది వేణు స్థితి. కోపం పట్టలేకపోయాడు. 'మీరంతా' అని ఏదో ప్రారంభించబోయాడు. ఇంతలో తండ్రి అడ్డమువచ్చాడు. కాని ఆతడు లక్ష్యముచేయలే. తన ధోరణి తాను సాగించాడు. 'మీరంతా నే చెప్పబొయ్యే విషయం దయచేసి కొంచము సావకాశంగా వినాలని నా ప్రార్థన. ఈ రోజు ఇచ్చట జరిగిన పరిస్థితి అంతా మీకందరికి తెలిసియేవుంది. ఇప్పుడు నేజెప్పే నాలుగుముక్కలు గూడా విని ఏది న్యాయమో ఏది అన్యాయమో మీరే నిర్ణయించండి. అసలు ఈ సంబంధం నాకుగాని పుష్పకుగాని ఏమాత్రం ఇష్టంలేదు. ఇది మా తండ్రిగారు, మా మేనత్తగారు చేసిన కుట్ర. నా చెల్లియదే దోషమూ లేదు. ఆమె పరమసాధ్వియని చెప్పుటకు నేను గర్విస్తున్నాను. ఆమె ప్రేమించిన వ్యక్తి ప్రసాద్. కాని కత్తులబోనులో పెట్టి నొక్కాడు మా తండ్రి. దాని ఫలితమే యిది. మూడు సంవత్సరముల నాడు మద్రాసు వదలి లండన్‌కు పోయిన ప్రసాద్, అందులో తాను మనసార ప్రేమించిన ప్రసాద్, అనుకోకుండా అకస్మాత్తుగా పైనుండి ఊడినట్టు ఎదుట అగుపడినప్పుడు పుష్ప అతనిని పలుకరించకుండా ఉండగలదా? స్వాభావికంగా చూస్తే ఏ మానవహృదయమైనా ఊరుకుంటుందా? ఒకవేళ అలా మైమరచుట తప్పంటారేమో! అయిన అగుగాక. కాని ప్రకృతికి విరుద్ధం ఎంతమాత్రము కాదని నేను ఘంటాపదంగా చెప్పగలను. పెద్దమనుష్యులగా పరిగణించబడే యిచ్చట చేరిన కొంతమంది ఏదో 'సంఘం' 'సంఘం' అని పదిమారులన్నారు. ఏమిటాసంఘం? సంఘం పవిత్రంగా శాశ్వతంగా ఉండాలంటే సంఘ నిబంధనలు సభ్యులందరికీ, వారు స్త్రీలు కానీయండి పురుషులు కానీయండి సమానంగా ఉండాలి. అన్ని ఉడిగి కాటికి కాళ్లుజాపుకొన్న సిద్ధాంతులవారికి నాలుగో పెండ్లి అవుతుంటే సంఘం ఒప్పుకుంటుంది. ప్రపంచమేమిటో యెరుగని పదేండ్ల పసికూన, ఆ సిద్ధాంతులవారి కొమార్తెకే తిరిగీ పెండ్లవడానికి సంఘం ఒప్పుకోదట. ఇదంతా మనం అంటే పురుషులు సంఘంపేరుతో చేసే ఘోరకృత్యాలు' అని ఇంకా ఏదో చెప్పబోతుండగా స్త్రీలలో ఏదో కొంత అలజడి జరిగింది. 'కూర్చోండి! కూర్చోండి' అని కేకలేశారు సిద్ధాంతులవారిని. సిద్ధాంతులవారికి ఏమీ బలం అగుపడలే. తిరిగి పెండ్లాడుటకు పుష్పకు హక్కుందన్నారు స్త్రీలందరూ ఒక్క కంఠంతో. ఒక్క జట్టుగా స్త్రీలు ప్రత్యేక శ్రద్ధ తీసుకొన్నారు. ఎవరిపనులు వారందుకొన్నారు. మ్రోగాయి తిరిగి మంగళవాద్యాలు. ప్రసాద్ పెండ్లికొడుకయ్యాడు—

ఆంధ్రమాత

ఆంధ్రభారతకృతినంది, కీర్తివహించు, శ్రీ రాజమహేంద్రుఁడే సీమనుండె,
తిక్కనార్య సహాయదీప్తిఁ జెన్నొందిన శ్రీ మన్మసిద్ధియే సీమనుండె,
కవిపోషణమునఁ బ్రఖ్యాతుఁడౌ సర్వజ్ఞ సింగభూకాంతుఁడే, సీమనుండె,
"దేశభాషలయందు దెలుగులెస్స"ని దెల్పు, శ్రీ కృష్ణరాయలే సీమనుండె,
మఱియు ఘనులైన ప్రభువులు, మంత్రివరులు, కవులు, పండితుల్ నీయందుగల్గినారు,
సకలసౌభాగ్యజాత ప్రఖ్యాత, పూత, యఖిలదేశైక విఖ్యాత, యాంధ్రమాత!

కష్టసహిష్ణుతగల్గిన నీవారి కిలనైక్యభావంబు గలుగదేల?
సకలవిద్యలయందు చతురులౌ నీవారి కిలనైక్య భావంబు గలుగదేల?
సర్వకార్యంబుల శక్తులౌనీవారి, కిలనైక్యభావంబు గలుగదేల?
పరులసేవలయందు ప్రౌఢులౌనీవారి కిలనైక్యభావంబు గలుగదేల?
తాము తమవారి కపకృతిదలఁచుచుండ, దయనురక్షింప నెవ్వరితరము జగతి,
"కంచెయే చేనుమేసిన, కాపదేల"; నఖిలదేశైక - విఖ్యాత, యాంధ్రమాత!

ఆంధ్రరత్నంబని యభినుతినొందిన, గోపాలకృష్ణాఖ్య గొప్పశక్తి,
త్యాగ శీలంబులదాల్పు సుబ్రహ్మణ్య కార్యదీక్షాక్రమ ఘటితశక్తి,
విశ్వదాతయటంచు వేనోళ్ల ప్రఖ్యాతి, దీపించుపుణ్యాత్మ దివ్యశక్తి,
ప్రజలకై దమతమ ప్రాణధనంబుల నర్పించినట్టి వారాత్మశక్తి,
ఆంధ్రదేశమా! నీప్రతియణువునందు, నిత్యవిజయైక దీక్షనే నెరపుచుండు,
కాలపక్వమన్నిటికిని గలుగవలయు నఖిలదేశైక విఖ్యాత, యాంధ్రమాత!

తమధర్మమునువీడ దగదంచు; గీతల శ్రీ కృష్ణులేమున్న జెప్పినారు,
స్వాతంత్ర్యమే మనజన్మహక్కుగ లోకమాన్యులు ప్రకటించి మనిపినారు,
సత్యాగ్రహము సర్వజయమని బోధించు గాంధీమహాత్ములు గల్గినారు,
శక్తివంచనలేక శ్రమపడునాయకుల్ భాగ్యవశంబునఁ బ్రబలినారు,
సత్యమే పరంబుగ వేదసమితిదెల్పు; ధర్మమే జయంబని ఋషితతియుఁబల్కు;
ఆస్తికతతోడ నుండ మమ్మరయుమమ్మ, అఖిలదేశైక విఖ్యాత, యాంధ్రమాత!

● శ్రీమతి కొరప్రోలు వెంకటరంగమ్మ ●

చివరకు—
సర్వనాశనమా! సర్వోదయమా!!

(జిజ్ఞాస - విజ్ఞానదృష్టి)

★ శ్రీమతి
కె. సుగుణమణి ★

మానవుడు యీ అనంతవిశ్వాన్ని, కాలాన్ని, ప్రదేశాల్ని శోధింప యత్నిస్తాడు, అందులో తానొక భాగం గనుక; తనలో అది యిమిడివుంది గనుకాను. అందుచేత తన నివాసస్థానమైన యీ భూమిని గూర్చి, తదితరములనుగూర్చి తెలిసికోవాలన్న ఆతురత అతనికి కలిగింది. ఆతురతతో అన్నివైపులా వెదుకుకున్నాడు. కండ్లకు కనబడినంతవరకు భూభాగాన్ని, సూర్య చంద్ర బింబాలనీ, నక్షత్రమండలాలని తిలకించి యేదైనా ఆచోకీ లభిస్తుందేమోనని ఆశపడ్డాడు. దాన్నిగురించి చెప్పే ప్రతివారి మాట, ప్రతి శాస్త్రం ఆలకించేడు. శాస్త్రజ్ఞులు యీ విషయాన్నిగురించి - తన నివాసస్థానం, తన ఉత్పత్తి, ఉనికి, కడకు రాబోయే స్థితిగతులు మొదలైన విషయాలు తెల్పుతారని గంపెడాశతో యెదురుచూస్తూ చెప్పినదంతా చెవులు తెరచుకు విన్నాడు. మొదట్లో అంతా బాగానే చెప్పేరు. భూగోళం విడిచి నక్షత్రలోకాలన్నీ త్రిప్పి చూపిస్తే 'ఓహోహో' అంటూ ఆనందించేడు. 'కాలప్రవాహం యెదురాడి మాతోకూడ రమ్మంటే' వచ్చేడు. 'ఇంకా 200 అంగుళాల దూరదర్శని యంత్రాల్ని తయారుచేస్తున్నాం' అంటే పుబ్బిపోయేడు. 'అద్దాలమధ్య వస్తువులవలె అనంతకోటి నక్షత్రాలను చూస్తూ - ఒకవేళ విశ్వం తిరిగి చుట్టివచ్చిన కాంతి ప్రసారంవల్ల మళ్లీ చూచినవాటినే చూపెడుతున్నారేమో' నన్న శంకైనా లేకుండా 'ఏమి అనంతవిశ్వం' అంటూ ప్రస్తుతించేడు.

అంతవరకు బాగానేయుంది; బాగానే చెప్పేరు; విన్నాడు ఓపికతోటి....కాని...కానీ. చి-వ-ర-కు సర్వనాశనం సర్వశూన్యం అయిపోతుందనేసరికి!—తన సూర్యుడూ, తతిమ్మా నక్షత్రలోకాలు 'అవిలంఘనీయములగు ప్రకృతినియమాలకు లోనయిపోయి భస్మీభూతమైపోతా'యనేసరికి..., ఆ నియమాలవల్లే భూమండలం సూర్యుడికి దూరదూరం అయిపోయి అఖండశీతలంలో మునిగిపోతుందనేసరికి—, తాను, తన దారాపుత్రాదులు, సంతానీకులు, తన పరిశోధనలు, ప్రజ్ఞ, ప్రయత్నాలు, ఆశలు భూగోళంతో సహా నశిస్తే, తన సూర్యుడికీ నక్షత్రాలకు చివరకు తనరాతే రాస్తుందనేసరికి..., విశ్వం చివరకు ఉష్ణంలో చావడం (Heat death) ప్రాప్తించి, దానిపై అపూర్వచైతన్యంతో జీవరూపంతో నాట్యమాడే జీవశక్తి తతిమ్మా ప్రకృతిశక్తి యావత్తు విశ్వాంతరాళాలలో యిమిడిపోయి - భరింపరాని, ఊహింపలేరంకాని, జీవంఅనేది వుండటానికి దుర్భరమైపోయే శీతలములోనున్న - అచింత్యం, అభేద్యం, అనంతం అయే నిబిడాంధకారంలోనున్న లీనమైపోతుందని వినేసరికి,...ఉష్ణరక్తం కాస్తా చప్పగా చల్లారిపోయి నిరుత్సాహంతో పటుత్వంతప్పి, నిర్జీవప్రతిమయైపోతాడు.

అంతేగాదు అందలాని కెగిరి చిందులుద్రొక్కే నైజగుణంగలిగి, విశ్వవిహారం సల్పగల సామర్థ్యం గలిగిన మనస్సుకూడ వైకల్యంపొంది 'హా పరమేశ్వరా!' యని యెప్పుడోవచ్చే ప్రళయం యిప్పుడేవచ్చినట్లు ఆశాపాశాలు త్రెంచుకుంటుంది. అవినాశినని యెఱిగిన దిట్టరియైన ఆత్మమాత్రం ప్రశాంతంగా ఉండగలుగుతుంది. కాని అంతాఅంతటి ఆత్మశక్తిగలిగినవారే వుంటే - అంతామహాత్ములు - రాధాకృష్ణులు, రామకృష్ణ పరమహంసలు అయితే యీగోలంతా యెందుకు? ఆస్థితికి అంతారావాలనేగదూ - ఈఅజపా జపాలు, తీవ్రతపస్సులు, అఖండ అల్లకల్లోలాలు, ప్రచండ పరిశోధనలు, వినూత్నజ్ఞాన సముపార్జనలు, నవనాగరి కతలు, అనంతరచనలు, యీ మాయనాటకాలు, తంతూ, తమాషాను!

అలాఅన్నీ నశిస్తాయనిచెప్పి, మళ్లా ఆశకల్పిస్తూ, 'భయంలేదు; మానవజాతికి యింకాకొన్ని కోట్ల కోట్ల సంవత్సరాలు వ్యవధివుంది.' అని శాస్త్రజ్ఞులు ఊరటజెప్పినా శాంతిపొందడు మానవుఁడు. జీవితవికాసం, ప్రేమ ప్రయాసం, కళాకలాపం, మత మహత్యం, కాసింతైనా పనికిరాక కేవలం భౌతిక ధర్మాలు రాజ్యంచేస్తాయని నమ్మజాలక పోతాడు.

శాంతములేని జీవికిక ఆనందమెక్కడిదీ? తననైతికజీవనం భౌతికాన్ని కాపాడలేదని శాస్త్రజ్ఞులు తేల్చేక పూర్వపు శాంతికలుగుతుందా? 'శాంతికొరకని యదార్థాన్ని మరుగుబుచ్చి కల్లచెప్పమా?' యని శాస్త్రజ్ఞులనవచ్చు కాని వారిశాస్త్రంచెప్పిందే రైటనడం యేలాగు? భౌతికశాస్త్రజ్ఞులు తమశాస్త్రం ఆధారంగా చేసికొని, ఒక్కదృక్పథంలోనుండియే సృష్టిని పరీక్షించి 'సర్వనాశనం' అనుకోవచ్చు. కాని సమగ్రంగా చూచిచెప్పలేనందుకు అంతా తప్పిపోలేదూ? ఆలాగే శాస్త్రవేత్తలు చూచేది 'దృశ్యప్రపంచము', 'ఊహాసమన్వయమున్ను' ఇదిసృష్టికి ఒక వైపేనేమోనని ఆలోచించక, తమశాస్త్రాలకు పట్టుబడని వస్తుజాలం యీ ప్రపంచంలో భౌతికేతరంవుందని, అది శాస్త్ర పరిభాషలో చెప్పబడదేమోనని సందేహించక - తమ పరిమితజ్ఞానంతో సృష్టిని సర్వాన్నీ వూహించి (పై పండితులవలె) వర్ణిస్తే యదార్థం అంతే యెందుకవుతుంది? సృష్టికర్త వుద్దేశంకూడ అదేయేలా అవుతుంది?

ఈ శాస్త్రజ్ఞుల నాశనసిద్ధాంతం అవశ్య చింతవ్యమైనది. ఎందుచేతనంటే దీన్నిగురించి చింతించి తానురాబోయే నిర్ణయముపై మానవుని జీవితవిధానం ఆధారపడివుంటుంది. జీవంయొక్క నవశక్తి, సృష్టికర్త యొక్క ప్రేమదృష్టి, మానవునియొక్క దైవభక్తి, సృష్టియొక్క వైచిత్రియం, చివరకు యెందుకూపనికి రాకుండపోయి, రాబోయేవిషయాలు కేవలం భౌతిక సిద్ధాంతాలమీద ఆధారపడి వుండడమే నిజమనితోస్తే యికనైతిక దృష్టికి తావుంటుందా? అంతాకూడ యిప్పటి పాశ్చాత్య 'నాగరికత' దేశీయులవలె భౌతికదృష్టి ప్రధానంగా గలవారైపోతే మరి ఆధ్యాత్మికాని కాశయేమైనవుందా? ఇదే వాస్తవమైతే యిక యీ ప్రపంచంలో 'తినేటందుకు బ్రతకాలికాని, బ్రతికేటందుకు తిననక్కరలేదు'. భౌతిక శరీరపోషణకు యెక్కువ ప్రాముఖ్యతయిచ్చి మానసిక ఆరోగ్యంమాట తలపెట్టం. ఉన్నతాశయాలు యీ భౌతికజీవాన్ని ఉద్ధరిస్తాయని నమ్మటకుబదులు భౌతికపరిస్థితులే మనలను తరింపజేస్తాయని తలుస్తాం! ఇఁక సార్థక్యజీవనంఅంటే యీ ప్రాపంచిక వస్తువులు, విషయాలు వీట్లలోని గొప్పమాత్రం లెక్కకువస్తుంది గాని, ఉత్కృష్టభావాలు, జంతుప్రేమ, పుణ్యాకర్మలు, లలితకళలు, నిజమైన విజ్ఞానం సమకూర్చేవిద్యలు అడుగంటుతాయి, 'సత్యమే జయం' అన్నఆర్యోక్తి నడచి, రాక్షసయుద్ధాలు చేయగలిగేవాడిదే రాజ్యం అన్నట్లు తయారవుతుంది. వీట్లచిహ్నలేగా ఇప్పుడు పాశ్చాత్య ప్రపంచంలో గోచరిస్తూ వున్నాయి. 'ప్రేమమున లోకముదయించె' నన్న సృష్టిహేతువును మరచి మారణక్రియను దొరకొనిన మానవుడింక మానవుడనిపించుకుంటాడా?

ఇలాంటి ప్రేమభావం నశిస్తే అధఃపతిత్వం దాపరించి దానితో 'నూతన నాగరికతవిజ్ఞానం'లా కాలుపెట్టే మన్నమాట! సర్వమత సమన్వయమైన ఆర్యమతానికి, సర్వోత్కృష్టమైన భారతీయ నాగరికతకు అంజలివిడిచి పాశ్చాత్తపథంలో పడిపోతాము; పడిపోవుచున్నాము కూడా. సనాతనజాతీయ నాగరికతకంటె పాశ్చాత్త్యపద్ధతులే రుచించి నవనాగరికతా వ్యామోహానా వివశులగుచున్న భారతీయులును ఉన్నారు. వీరు - పూర్వము సీతాదేవి కుటీరమును వెల్లగించిన రావణునంతటి వాడెవడైన యిప్పుడు పుట్టియున్నచో హిందుదేశమును వెల్లగించి యేహాలెండుప్రక్కనో వేసిపెట్టమని వానిని ప్రార్థించియుందురు కూడను!! వారి దురదృష్ట వశాత్తునైతేనేమి, తదితరుల అదృష్టవశాత్తునైతేనేమి అట్టివాడు లేకపోయేడు!!

మామూలుగా మనిషి - తనశరీరం నశించినా విశ్వాన్ని, విశ్వనిర్మాతను విశ్వసించబోతాడు. ఏదో అవినాశిఆధారం ఒకటిఉండాలని తలుస్తాడు. ఈ జీవితసముద్రంలో కష్టసుఖం అనే తరంగాలలో కొట్టుకొంటూ అల్లాడుచున్న మానవుఁడు గట్టిగాపట్టుకొనుట కేదైనఆధారం వెదుక్కుంటాడు. వెదకి వెదకి ఆధారంఏమీ కనబడడంలేదు; నాకుతెలిసిన ప్రతీదీ, నేనుప్రేమించే విశ్వం యావత్తు అచింత్యమైన భీకర శీతలంలో పేరుకుపోతుంది. విశ్వనిర్మాత ప్రాపుదేనికీ, యెచ్చటావున్నట్లు చెప్పబడదు! అని యిలా ఆధార రహితమైన విషయం సహించలేడు. ఇన్నాళ్లు పాపం, పుణ్యాం, మంచి, చెడ్డ, దైనికజీవితం, భౌతిక జీవితం అని ఆశాపాశాలలో కొట్టుకొన్న మానవుఁడు ఒక్కసారిగా నిరాశచెందలేక - పదేపదే తర్కిస్తాడు. తతిమ్మా శాస్త్రాలేమంటాయో, విజ్ఞానవేత్త లేమంటారో కూడ ఆలకించి, తనకు సృష్టికర్త ప్రసాదించిన వివేకాన్నికూడ వాటికిచేర్చి చూస్తానంటాడు.

మొన్న మొన్ననే పుట్టిన యీ శాస్త్రాలు, ఒకవైపుచూపేగల భౌతికవిజ్ఞాన శాస్త్రాలు మానవ జీవితాన్నిగూర్చి, దృశ్యాదృశ్య ప్రపంచాన్నిగూర్చి, జీవితం - విశ్వం వీట్ల అంత్యదశలను గూర్చి యింకా సమగ్రదృష్టితో పారజూచి నిశ్చితంగా చెప్పలేవేమోనని తలుస్తాడు. కేవలం భౌతికనియమాలేకాక - భౌతికాన్ని నడిపే ఆధ్యాత్మికశక్తియే విశ్వమానవ వికాసాల (Evolution of universe and man) కు కారణం కావాలని శంకిస్తాడు. తనలో అవినాశాన్ని తలపింపజేసే ఆత్మవస్తువుకూడ అదే కావాలనుకుంటాడు. భౌతిక బలంకంటె ఆత్మబలమే గొప్పదని నిర్ణయించిన తరువాత అంధకారమయమనుకున్న జీవితంలో మరల ఆనందభాస్కరుఁ డుదయస్తాడు. మానసకమలం వికసిస్తుంది. ఆవెనుక జగత్తుప్రేమ జన్యమని, ఈశ్వరుఁడు ప్రేమమయుడని గుర్తించి తనలో భూతదయ, విశ్వప్రేమ, విశ్వమానవ స్వాభ్రాత్రభావం పెంచగలుగుతాడు. ఈవిధంగా భారతీయనాగరికత మరల సర్వదేశీయులకు మార్గదర్శకముకాబోయే తరుణంకూడ వచ్చింది.!

జ్ఞానార్జనమే మనముఖ్య కర్తవ్యముగా పెట్టుకొన్నతర్వాత - 'పాశ్చాత్త్య' 'ప్రాచ్య' భావాలు పోనడచి పాశ్చాత్త్య శాస్త్రాలూ విందాం; ప్రాచ్యవేదాంత గ్రంథాలూ చూద్దాం. 'సనాతనం', 'నూతనం' అని అనకుండా పూర్వకాలపు ఆధ్యాత్మ తత్వకోవిదులు పలికిందీ గ్రహిద్దాం, నూతన భౌతిక శాస్త్రవేత్తలు చెప్పేదీవిందాం. 'మా విశ్శన్న చెప్పిందే వేదం' అనివేదాలలో చెప్పబడిన సర్వం 'వేదవాక్యం'గా తీసికోనూవద్దు; ఈ శాస్త్రజ్ఞులు చెప్పిందే మహాప్రసాదమని అంతా స్వీకరించనూవద్దు. పెద్ద పిన్న భేదం లేకుండా, దేశం కాలం మాట యెత్తకుండా, భాష జాతి విభేదం కల్పించుకోకుండా, ఎవరుచెప్పినా యెట్లు చెప్పినా అంతా సాంతంగావిందాం. నిష్పక్షపాత బుద్ధితో ప్రతీదీతూచి చూద్దాం.

సర్వనాశనమా! – సర్వోదయమా!

అంతేగాక మనలోకొందరు - తమకు సృష్టిప్రకారమేగాదు, మతంసారమేగాదు, శాస్త్రరహస్యమే గాదు - సహజంగా సర్వం అవగాహనమవుతూవుంటే - ప్రజలను పిలిచి ప్రబోధించగలుగుతారు. విశ్వాంతరాళాలనుంచి వారికి విశ్వగానం వినబడుతుందట! అట్టిమహాపురుషులు తేల్చేది తీసుకుందాం. ఒక్కొక్క దృక్పథంలోంచిచూచి చెప్పుతారు; గనుక పైభేదబుద్ధులు లేకుండా అంతావినాలి. భౌతికం, ఆధ్యాత్మికం కూడా అవగాహనచేసుకోవాలి. అప్పుడు విశాల పరిజ్ఞానం లభించి, వీలైనంత సమగ్రంగా వీక్షించగల సమర్థత అలవడుతుంది. ప్రశాంతంగా వివేకంతో వితర్కించ వీలవుతుంది. అప్పుడేమైనా యదార్థం గోచరిస్తుందేమో!

ఈ లీలాజగత్తులో మనకు తెలిసిన ప్రతీదీ క్షణక్షణం మార్పుజెందిపోతూవుంటే 'యదార్థం' అని దేన్ని అంటాము? అంటారేమో! ఈ లీలకువెనుక నిత్యం ఊహింపరానిదా? అసత్యానికి వెనుక సత్యం ఉండదా? వినాశికివెనుక అవినాశి కానరాదా? విశ్వానికివెనుక విశ్వకర్తఉండడా? ఉన్నా అతనికి విశ్వకళ్యాణం అక్కరలేదా? ఈ విశ్వం శాస్త్రజ్ఞులు చెప్పిన భౌతిక నియమాలకులోనయిపోయి 'సర్వనాశన' మైపోతుంటే - ఆధ్యాత్మికశక్తి - ఒకటివుండి తనప్రియసృష్టిని, (మానవుని) స్వస్థలానికి చేరుస్తుందని విశ్వసించడానికి వీలేమైనావుందా?

ఉన్నట్లేతోస్తుంది - శరీరబలంకంటే ఆత్మబలం గొప్పదని యుగయుగాలుగా ఋజువుచేయబడింది. పాశ్చాత్యులుకూడ భౌతికశరీరంయొక్క రుగ్మతలు మానసిక బలంవల్ల మాన్పవచ్చునని యిప్పుడిప్పుడే గ్రహిస్తున్నారు. ప్రపంచమందున్న ప్రతీదీకూడ ఒకరూపంనుండి ఇంకొకరూపంగా మారుతుందేగాని 'సర్వనాశన' మనేది లేనేలేదని యిటీవల వప్పుకుంటున్నారు. పరమాణువు మొదలు బ్రహ్మాండంవరకు ప్రతీదికూడ ఒకనియమిత విధానంలో తిరుగాడుచు, మనుచు, మార్పునందుచున్నదని గ్రహించిన పాశ్చాత్త్యశాస్త్రజ్ఞులు, వాటిశాసనకర్తను, రక్షకుని ఏలవప్పుకొనరాదు?

సృష్టికర్త సృష్టించిన జంతుజాలములో మానవజీవి చిత్రాతి చిత్రవిచిత్రమైన జంతువే - ఈ మానవ జీవిత వికాసక్రమాన్ని తిలకిస్తే - మానవుని శరీరం అట్టేమార్పునొందక పోయినా మస్తిష్కము, బుద్ధిక్రమేణా అపరంగా పెరిగిపోతుందని తేలింది. అతనిబుద్ధి (దానిరూపాంతరములగు అంతఃకరణ, మనస్సు, చిత్తము, అహంకారము కూడ) ఇలా పెరిగిపెరిగి కాలక్రమమున శరీరరహితమై, ద్రవ్యాధార మక్కరలేకయే బ్రతుకగలుగుతుందాయేమి!

లేక బుద్ధివికాసం కొంతకాలానికి ఒక అవధిచేరి, ఆవెనుక సంకుచితం ప్రారంభమై, మరల అడవి మనిషి తయారవడం సంఘటించి - న్యాయాన్ని అనుసరిస్తుందాయేమి!! ప్రస్తుతదారుణ యుద్ధాలు, రాక్షస కృత్యాలుచూస్తే - ఇట్టిదిగూడా సంభవమేనని తోచగలదు.

లేదా, క్రమక్రమముగా వికాసమునంది, మానవుని మనస్సు అనంతశక్తియుతమై, కడపట విశ్వములో లీనమైపోయి-సర్వవ్యాపి, సర్వాంతర్యామియైన బ్రహ్మంలో నైక్యమై నిర్యాణదశ పొందుతుందాయేమి!!!

ఎంత దారుణము?

★

ఆశ, తృప్తి—రెండే రెండు జీవికలు ప్రపంచంలో బ్రతికివుండడానికి—

ఆశ జీవిలో నూతనోత్సాహాని కలిగిస్తుంది. ఊహా జ్యోతిని వెలిగించి భవిష్యన్మార్గాన్ని సూచిస్తుంది.

—కాని, ఈ ఆశ దురాశగా వికృతినొందినప్పుడు...?

శ్రీమతి
వెలిదండ
చూడికుడుతమ్మ

★

'ఏమీ, ఎన్నిసార్లు పిలిచినా ఆలాగు మౌనంగా ఊరుకుంటారు? ఇలాగూరుకుంటే నాకేం తోస్తుంది చెప్పండీ. ఒంట్లో బాధో, నీరసమో, ఏ సంగతి చెప్పరాయెను. నాకేమో మిమ్మల్ని చూస్తున్న కొద్దీ భయం వేస్తున్నది...ఏమండీ బాబూ, ఏమైనా కాస్తంత నయంగా ఉన్నట్టు చెప్పగలరా? జ్వరమేమో ఇంతో అంతో వదలకుండానే ఉంటూఉన్నది. ఏమీ పాలుపోక నేను అంతకంతకు వెఱ్ఱిదాననైపోతున్నాను.'

'అమ్మా, తొందరపడకండి. మొన్ననేకదా మీకు తగని సుస్తీచేసింది. ఆదుర్దా ఎక్కువౌతూ వుంటే మీ రోగము మళ్లీ తిరుగబెట్టిందన్నమాటే' అని డాక్టరు రోగివైపు నిదానించి చూస్తూ 'రావు గారూ మీబాధ ఏలాగున్నది?' అన్నాడు.

'ఫలానావిధంగా ఉందని చెప్పలేను. మీరుకోసిన చోటికంటె మరికొంచెము దూరములో వాచినట్టుంది చూడండి.'

'నేను చూస్తూనేయున్నాను. తిరిగి రేపు ఇంకొక కోతకొయ్యవలెను. అవునుగానండి, మీఅన్న గారికి పట్నముకు మీ సుస్తీనిగురించి ఏమైనా వ్రాసినారా?'

'నేనేమి వ్రాయలేదు. మొన్ననే మా అన్నగారు జవాబు వ్రాసినారు. ఇంతకూ నాకు వచ్చిన భయమేమిటి? మీరువచ్చి మందువేస్తున్నారుగా కొద్ది రోజులలో అదే మానిపోతుంది.'

డాక్టరు తీక్షణముగా కురుపును తనిఖీచేస్తూ 'అయ్యా, మొట్టమొదట మీకురుపు చూచిన వెంటనే నేనే మీ అన్నగారికి మీ విషయమై వ్రాస్తూ వెంటనే రావలసినదిగా సలహాఇచ్చాను. బహుశా ఈ రాత్రియే రాగలరని నేను ఎదురు చూస్తున్నాను; గాని ఆయన వచ్చువరకు ఈ కురుపును కోయకుండా ఉంచటం చాలా ప్రమాదం. మీతో చెప్పకూడదనుకున్నా. ఇక్కడ మీకంటె ఇంకొకరులేరు గనుక రోగముయొక్కస్థితి చెప్పకతప్పదు. ఇది రాచకురుపు, చాలా ప్రమాదము. మీదుమిక్కిలి జ్వరము తగ్గకుండా ఉన్నది. నేనింకొకగంటలో అన్ని పరికరాలతోవచ్చి శస్త్రము చేస్తాను. నాకు మీయింటిస్థితి చూస్తే చాలా విచారంగాఉంది. ఆమె చూడబోతే బహు సుస్తీగాఉన్నారు. మీకు అకస్మాత్తుగా ఈ కురుపు ప్రవేశించి నది. ఇంట్లో చూడబోతే పిలిస్తే పలికేదిక్కైనా లేనట్టున్నది.'

‘మా కోడలు తన పుట్టినింటినుండి రాకరాక మొన్ననేవచ్చింది. కొంచెము సహాయముగావున్నది. భగవన్నిర్ణయము ఈలాగుంటే ఎవరేమి చేయగలరు? సమస్తసౌఖ్యాలను అనుభవించుటకూ, ఒకరికి పెట్టుటకూ సర్వేశ్వరుడు అన్నివిధముల అనుకూలపరిస్థితులను కల్పించినాడు. కాని అనుభవించుటకు తగిన యోగ్యతనుగాని మానసికోత్సాహమునుగాని మా నొసటను వ్రాయలేదు.’ అని మరి మాటాడలేక గ్రుడ్ల నీరు త్రిప్పి కండ్లు క్రిందికిదించాడు. ఈ మాటలను ప్రక్కనుండి వింటూఉన్న సుందరమ్మ కండ్లు తుడుచుకుంటూ పదునాలుగు సంవత్సరములక్రిందట కళాశాలలో ఉన్నతవిద్యను చదువుచూ ఇరువదిసంవత్సరములు మాత్రమే జీవించి అకాలమృత్యువు వాతబడిన తమ ఏకైకపుత్రునితలుచుకొని మరీ విచారించింది.

‘అమ్మా విచార్కించకండి. నేను మీ కుమారుడుకలసి విజయనగరములో బి.య్యే చదివినాము. అతడు నేను అన్నదమ్ముల్లాగే అప్పుడు తిరుగుతూఉండే వాళ్లము. ఆతని చావుకబురు ఒకపిడుగు దెబ్బలాగు మా స్నేహితులందర్ని కలతపెట్టింది. ఈశ్వరమాయ. మీరు మాత్రము ధైర్యముగా ఉండండి. మీ బావ గారు రాత్రికి వస్తారు. మీకు చాలావరకు ధైర్యము కలుగుతుంది. నే నింకొకగంటలో వస్తున్నాను. నీళ్లు మాత్రము బాగా కాగబెట్టించండి; సెలవు.’అంటూ డాక్టరు వెళ్లిపోయాడు.

*   *   *

జానకి రావుగారి వితంతుకోడలు. పాపము భర్తతో ఒక సంవత్సరమైనను పూర్తిగా కాపురము చేయలేదు. భర్త చనిపోవుటకు నాలుగునెలలకుమునుపే పండుగకు తన పుట్టినింటికి వచ్చివుంది. తరువాత పెనిమిటిపోయిన తొమ్మిదవరోజునవెళ్లి అంత్యక్రియలు పూర్తియైనవెనుక తనకు అత్తవారిచ్చిన మూడువేల రూపాయిల సొమ్ముతో పుట్టింటికివచ్చి అక్కడనే వుండిపోయింది. ఏదో సకృతుగా రెండుమూడుసారులు తప్ప తిరిగి అత్తవారియింటికి పోనేలేదు. పదునాలుగేండ్ల తరువాత అత్తగారికి జబ్బుచేసిందని విని చూడ వెళ్లింది. ఇంతలో మామగారికి జబ్బుచేయటం, రెండుమూడుసార్లు కురుపుకోతలు జరగటం సంభవించినందున ఆయన తన సంతానాభివృద్ధికొరకు వీలుప్రాయ నిశ్చయించుకొన్నంతవరకు వచ్చింది. ఈ సంగతితెలిసి జానకి నాలుగురోజులలో తిరిగి వస్తానిచెప్పి పుట్టింటికి వచ్చింది.

మామగారి అన్నపిల్లల కెవరికో ఆస్తిని సంక్రమింపజేయాలని కదా ఆయన దత్తకాధికారం తన కిస్తానన్నది. కాని అది జానకికి ఎంతమాత్రము ఇష్టములేదు. తన చిన్నఅక్క కుమారుణ్ణి వదిలివేసి ఎవరికో ఆస్తినంతా ధారాదత్తమివ్వడానికి ఆమెకు మవస్కరించలేదు. అందుకోసం యింతకుపూర్వమే తాను చిన్నక్క కుమారుణ్ణి దత్తతచేసుకున్నట్టు చూపించడానికి తగిన వ్రాతమూలాలు మొదలైన ఏర్పాట్ల నిమిత్తం అన్న గారితో సంప్రదించింది.

అనుకున్నప్రకారం అంతాజరిపి, జానకి తన అన్నగారితోకలిసి, తిరిగి మామగారియింటికి బయలుదేరి వచ్చింది. ఆరోజున రావుగారు అందర్నిపిలిచి యిలాఅన్నాడు—

‘ఏమోయీ గిరీ, ఏమోయీ మృత్యుంజయం, ఇప్పుడొచ్చిన భయం నాకేమీలేదు. గడియ మనది కాదు కాబట్టి చేయదలచుకొన్నది వెంటనే చేసివేయటం మంచిది. గనక, ఇదేమంచి అవకాశమని నాకు తోస్తున్నది. నేనిప్పుడు మంచముమీదనుంచి సరిగా లేవలేని స్తితిలో వున్నాను. ముందు ఏమవునో తెలియదు. కావున ఒకవీలు వ్రాయవలెనని ఉన్నది. నా కుటుంబము నాతో అంతరించకుండా చేయవలెనని ఉన్నది. నా తదనంతరము నా జనకసంబంధీకు నొక్కని నా కుమారునకు నా కోడలు దత్తత చేయవలెననిన్నీ, ఆమె ఆలాచేయనియెడల, నాభార్యయే వానిని నాకు దత్తతచేయవలెననిన్నీ, నా ఆస్తి యావత్తు రెండువంతులు

చేసి, ఒకవంతు దత్తునికిని, మిగిలినవంతు నాభార్య, కోడలు సమముగా పంచుకొని జీవితకాలము అనుభ వించుటకును ఏర్పాటు చేయవలెననిన్నీ నా ఉద్దేశము. ఆ విధంగా వ్రాసి నా చేతికివ్వండి. నేను చదువుకుని సంతకము చేసేస్తాను. ఇప్పుడు ఇక్కడఉన్న మీరిద్దరు, డాక్టరుగారూ, ఇంకా మీతోవచ్చిన ఆ ముగ్గురు పెద్దమనుష్యులు సాక్షి సంతకములుచేయండి. ఇంతమంది పేరుపొందిన పెద్దలు సాక్షి సంతకముచేస్తే, ఇంక వేరే రిజస్టరీ చేయించనక్కరలేదు" అనిచెప్పి కాగితంవ్రాయించి, డాక్టరుగారిచేత, వారిచేత సంతకాలు చేయించేడు.

డాక్టరు: "మీరు ఇంత సదుద్దేశంతో, ఈశ్వరసాక్షిగా, ఇంతమంది సమక్షాన వ్రాయించి నిర్ణయించిన శాసనాన్ని తిరస్కరించుటకు ఎవరికిసాధ్యము. మీ ఎదురుగుండా మేమనటం కాదుగాని, కుమారుడు చనిపోయినవెంటనే పుట్టినింటికిబోయి, పదునాలుగు సంవత్సరములనుండియు మీకు సహాయము చేయక, ఇప్పుడు నెలక్రిందటవచ్చిన కోడలికి, నలువది సంవత్సరములుగ అన్ని కష్టసుఖాల్లో పరిపూర్ణమైన బాధ్యతను పొందిన మీ భార్యతో సమానమైన ప్రతిపత్తిని కల్గించి గౌరవించారు. ఆహా ఏమి మీ న్యాయ శీలత! కుటుంబగౌరవ స్థాపనాపేక్ష!"

రావు వినమ్రుడై, తలవంచాడు. ఇంతలో గడియారము 5 గంటలు కొట్టగా అందరూలేచి, రావు తోను, ఆయన అన్నగారితోను, తిరిగి రాత్రివస్తామనిచెప్పి వెళ్లిపోయారు.

* * *

"ఏమోయి జగన్నాధరావూ, నెలదినములనుంచి కనబడటమే లేదే. ఎక్కడికి వెళ్లావు?"

"ఈ మధ్య అర్జంటుగా చెన్నపట్టణము పనిమీద వెళ్లవలసివచ్చింది. నేనింటికిరాగానే మా చిన్న వాడు, రావు వారము దినములై చనిపోయినాడని చెప్పినాడు. అ కబురు వినే వినటంతోటే నా ప్రాణం నా బొందిలోనుంచి లేచిపోయినట్లైనది. ఆ వీలువ్రాసిన రోజున చూడటమే నా అఖరుచూపైంది. తరువాత అతను మరో 15 రోజులున్నట్టు విన్నాను. నేను వచ్చిన సాయంకాలమే వాళ్లింటికివెళ్లి ఆయనభార్యను చూచాను. ఆమె కోడలు ఆమెను అప్పుడే తగాదాలోనికి దింపుచున్నట్టు తెలిసింది."

"అవును, నాకూ తెలిసింది. ఇదేమిటోయి ఈ చిత్రం. రావు తాను వ్రాయదలచుకొన్న వీలును గురించి ముందుగా మనతో చర్చించినప్పుడు ఆయన కోడలు, ఆమె అన్నగారూ అక్కడనే యుండిరిగదా! ఈవరకే దత్తత అయిఉంటే ఎందుకు చెప్పలేదూ? ఎంత దారుణమైన కార్యానికి సాహసించారు?"

"అవును, జ్ఞాపకం వచ్చింది. అసలు రావు తన కుమారుడు పోయిన కొన్ని నెలలకే, తన తల్లి సలహానుసరించి తన అన్నగారి మనుమడినే దత్తతచేయుదలచి, కోడలికితెలుపగా, ఆమె అప్పుడు 14 సం॥ముల బాలికయగుటచే, ఆ చిన్నవయస్సున దత్తతచేసికొనుట హాస్యాస్పదమని తలచియో, "వంశాభివృద్ధి"ని గూర్చి పరితపించవలసిన ఆవశ్యకత ఆమె మనస్సుకు అప్పుడు సహజముగా తట్టకుండుటచేతనో, మనోవృత్తి మాత్రమే కోరుచూ కొన్నాళ్లున్నూ, మామగారే ఒక పెద్ద పిల్లవానిని దత్తత చేసుకొనవలసినదనిన్నీ, తన చెల్లెలినిచ్చి వివాహముచేసి, అత్తవారితో సంబంధమును ఉంచుకొనదలచినట్టు కొన్నాళ్లున్నూ, చెప్పుచూ ఉండెనట. కాని, రావు తన కుమారునకు దత్తతచేయుటయే సవ్యమైన కార్యమని నిశ్చయించి, ఎప్పటికైనా తనకోడలు ఒప్పుకొనదా అని కాలహరణము చేయుచుండెను. ఇప్పుడకస్మాత్తుగా కోడలికి ఎందుకీబుద్ధి పుట్టెనో గదా!"

"ఆమెకు పుట్టినింట అన్నగారు ఉన్నారుగదా! వారూ స్థితిపరులే. అయినను ఆశకు మేరలేదు గదా! స్వతహాగా ఆమెకే ఇప్పుడు దురాశ ఏర్పడి ఉండవచ్చును; దానికి అన్నగారు దోహదమిచ్చియుండ వచ్చును. మామగారు పోకముందే తాను ఒక పిల్లవానిని దత్తతచేసుకున్నానని చెప్పటంవల్ల ఆస్తి అంతా తనకేవచ్చునని భ్రమతో ఉన్నట్టున్నది. కాని వారు తొందరలో కల్పించిన కాగితాలనుబట్టి, అన్నగారే ఆమె మెడకు ఒక ఉరిత్రాడు తగిలించినట్టున్నదట."

"అదేమిటి?"

"ఆస్తినంతా ఆ పెంచుకున్న పిల్లవానికి ధారాదత్తము చేసినట్టు స్టాంపుమీద వ్రాసి రిజస్టరీ కూడా చేయించినాడట. ఆ పిల్లవాని జనకసంబంధీకులు ఆ పిల్లవానితరఫున ఆస్తిని అన్యాక్రాంతముచేసినను, లేక ఆ పిల్లవాడే మేజరయినతర్వాత అన్యాక్రాంతముచేసినను, ఆమెకు చేతికి చిప్పయే. మామగారు వ్రాసిన వీలునుబట్టి తన భాగమును తాను బ్రదికియున్నంతకాలము ఎవరును ముట్టుకొనజాలరు."

"ఈ సంగతి ఆమెకు తెలుసునా?"

"ఆమెకు తెలియదట. అన్నగారికీ మొదట తెలిసియుండకపోవచ్చును. తొందరలో చేసినపని అగుటవలన 'దురాశ దుఃఖము చేటు' అనునట్లు ఈ అనర్థము దైవికముగానే సంభవించియుండును. అయినను రావుగారి భార్యను భయపెట్టదలచి, తమకు చాలా ధనమున్నదనియు, తాము చేసిన కార్యములు అన్యాయములు అసత్యములు అయినను, ఆమెను మూడు కోర్టులలోను తిప్పించి, ముప్పతిప్పలు పెట్టించెదమని బెదరించుచున్నారట. సంఘములోని పెద్దలకు చాలమందికి అన్ని సంగతులు తెలిసినను, కోడలు అన్నతో కలిసి చేయుచున్న ఈ పని బహు దారుణకార్యమని నమ్మకమున్నను, ఎవరును దానిని నివారింపజేయలేరుగదా! ఆహా, సంఘబలమెంత క్షీణించినది! కోర్టులే శరణ్యములు. ఇంక ఇటువంటి కేసులు కోర్టులకెక్కితే ఏవిధముగా పరిణమిస్తవో! తిరిగి కలుసుకుందాం."

సంయుక్తరాష్ట్రముల మాజీ ప్రధానామాత్యులైన

శ్రీ గోవింద వల్లభపంత్ గారిచే

రచింపబడిన చరిత్రాత్మిక నాటిక

— రాజమకుటం —

రాబోవు సంచికనుండి మూడు ఖండాలుగా

ముద్రింపబడుతుంది.

ఎదురు చూడండి

ఆంధ్రీ!

శ్రీలవెలసిన తెలుఁగు తల్లికిఁ
గీర్తిఁగాంచిన యాంధ్రజననికిఁ
జేరి హారతులీయఁగా, వే
గిరము రావే సోదరీ!

★

సుధలు గురిసిన తెలుఁగు నాటను,
సిరులు విరిసిన తెలుఁగు తోఁటను
బుట్టి, పెరిగెడి మనకు లేదిల
నెట్టి కొఱఁతయు సోదరీ!

★

పలుకు పలుకునఁ దేనెలొలికెడు
తెలుఁగుమాటల తీపు తేఁటలు
వెలికిఁ జిమ్మిన మొల్లసతివలెఁ
గులికి, కూయవె సోదరీ!

★

వైరిబలములనెల్ల సంగర
రంగమున నోడించి, సమధిక
వీరవనితయునైన రుద్రమ
రాణిఁదలఁపవె సోదరీ!

★

దినదినమ్మును నీ మనమ్మున
నవ్యరసమును బాదుకొలిపియు,
దివ్యతేజముఁగాంచి, సుఖసం
చయముఁ బడయుము సోదరీ!

★

పసిడినగల ధరించి మెడలో,
నొసట కుంకుమ తిలకముంచియుఁ,
బట్టు పుట్టముఁ గట్టు మాతకు
వందనములిడు సోదరీ!

★

శ్రీమతి మీనాక్షి.

★

గృహలక్ష్ములు
గుర్తించవలసిన
గృహపరిశ్రమ

నవారు పరిశ్రమ

★
శ్రీమతి
పులిపాక
బాలాత్రిపుర
సుందరమ్మ
★

★

కొంతకాలమునుండి ప్రతి స్త్రీ హృదయములోను గృహపరిశ్రమలు చేయవలెనని, వాటివలన ఆర్థిక లాభము చేకూర్చవలెనని ఆందోళన బైలుదేరినది. మరికొద్దికాలమునుండీ ఎక్కడ ఏవిదొరుకునా? ఏమిచేయుదుమా? అని మనస్సులలో ఉర్రూతలూగుచున్నారుగాని ఏమిప్రయోజనము? తాము ఒకచోటికివెళ్లి తెలుసుకొనుటగాని, ఎక్కడ ఏదిఉన్నది విచారించుటకుగాని వీలుకాదు స్త్రీలకు. పురుషులైనను ఏవైనాకనుక్కొని తెచ్చి స్త్రీలకు అందజేసి చేయించుట అసలేలేదు. తాముచేతనైనంతవరకు సంపాదించి ఖర్చుపెట్టుట, ఖర్చు ఎక్కువైతే విసుగుజెందుటేగాని, మీరుఇంట్లోఉండి ఫలానిదిచేయండీ అని ఆజ్ఞాపిస్తే చేయని స్త్రీ లేదుగదా!

ప్రస్తుతము మేము నవారు పరిశ్రమ ఒకటి తెలుసుకొంటిమి. దానికి ఎక్కువ కాయకష్టముగాని, ఎక్కువ డబ్బు పెట్టుబడిగాని అవసరములేదు. ఎక్కువ పరికరములుకూడా అవసరములేదు. ఒక అర్ధరూపాయిగాని పదిఅణాలుగాని డబ్బుచాలును. తరువాత నూలుపెట్టె ఒకటి మూడురూపాయల పావులా ఇచ్చి తెచ్చినట్లైతే నేత ప్రారంభించవచ్చును. నవారునేయుట చాలా సులభము ఈ నవారు మగ్గముమీద రోజుకు రెండుఅణాలు లాభముండును. ఇంకాతొందరగా నేసినచో ఇంకాఎక్కువేవచ్చును. ఈ పరిశ్రమ ముందుగొప్పవారు ప్రారంభించి ముందునకు వచ్చినగాని కొద్దివారు భయము, అభిమానము వదిలిముందునకురారు. గనుక ఈ పరిశ్రమ ప్రతియింటను ముఖ్యముగా ఉండవలసినది. ఈ పని ఎక్కువరోజులు నేర్చుకొనవలసిన అవసరములేదు. ఒకరు చేయుచుండగాచూచి మరివకరు చేయవచ్చును. బాలలు వృద్ధులుకూడా శ్రమలేకుండా పనిచేయవచ్చును. ఇంటిపనులు నెరవేర్చుకొని తీరికసమయమున ఒకపెట్టెనూలును యిరువదిరోజులలో నేయవచ్చును. పెట్టె నూలుతో నేసిన నవారు మనిషి ప్రమాణపు మంచములకు రెండింటికి సరిపోవును.

దీనికి కావలసిన పరికరములు

ఇనపతీగెలు ఏబది; వీటిని బళ్లుఅంటారు. ఇవి నేతపరిశ్రమ ఉన్నచోట సాలీల ఇండ్లలోగాని అన్నీ అమ్ము కొట్లలోగాని దొరుకును. చీరాలలో ముఖ్యముగా దొరుకును. బలపపులావు నాలుగు అంగుళముల పొడవుగలవి నాలుగు ఇనుపముక్కలు. ఆరంగుళముల వెడల్పు అడుగున్నర పొడవుగలవి రెండుచెక్కలు. మూడు బెత్తలపొడవు అంగుళము వెడల్పుగలిగి పదునులేకుండా రెండుప్రక్కలా ఒకేమాదిరిగాఉండి పిడిఉన్న కత్తి ఒకటి.-ఇవి నవారునేత పరికరములు.

బల్లు ఒక వందా ఆరణాలు. ఇక మిగతావస్తువులు మన ఇండ్లలో ఉన్నవే; లేక కొన్నను ఒక పావలా, ఆరణాలు ఇచ్చిన వచ్చును.

ఈ బల్లు ఏవిధముగా ఉండును అంటే, మూడుబెత్తల పొడుగు ప్వైనుదారమంత లావు ఉండును. రెండువైపులా రింగులవలె ఉండి, మధ్య దోసగింజవలె బెజ్జముండును. వీటిని ఇనపముక్కకు ఒక్కొకటి చొప్పున ఎక్కిస్తూ దారముతో బిగించవలెను. ఆవిధముగా ఒక్క ఇనపముక్కకు పాతికచొప్పున ఎక్కించి కట్టవలెను. ఆ విధముగా ఇనపముక్కలు, రెండుప్రక్కలా దూర్చి కట్టి తడికలవలె తయారుచేయవలెను. వీటిని జల్లెడలని తీగెతడికలని వ్యవహరించెదరు. ఈ విధముగా రెండు తడికలవలె తయారుచేసి హెచ్చు తగ్గులు లేకుండ ఈ తడికలను రెండుప్రక్కలా తిక్కడిగా త్రాళ్లు కట్టి పైపైపు త్రాళ్లు రెండూ కలిపి కట్టవలెను. దానికి మళ్లీ ఒకత్రాడు కట్టవలెను. ఈ విధముగా రెండుతడికలను కట్టవలెను. తరువాత రెండుబెత్తల పుల్లకు మధ్య త్రాడుకట్టి ఆ త్రాడు దూలమునకు కట్టవలెను. ఇనపతడికలను కట్టిన త్రాళ్లు పైనకట్టిన పుల్లకు రెండు వైపుల రెండుతడికల తాళ్లు కట్టవలెను. తడికలను రెండోవైపునున్న తిక్కడిత్రాళ్లను రెండింటికి రెండు చెక్కలుకట్టి భూమికి బెత్తెడు ఎత్తుగా వదలవలెను. చెక్కలను రెండోవైపున తాళ్లుకట్టి మన వీలుప్రకారం ఒకదానికొకటి ఎదురుగా గుంజలు పాతిగాని లేక స్తంభములున్నచో ఉన్నచోటనేగాని మనము కూర్చునే చోట వెనుక గుంజను ఈ రెండు చెక్కల త్రాళ్లు కలిపి ముడివేయవలెను. తరువాత నూలు మనకు కావలసిన పొడుగు పెట్టి పడుగుచేసుకుని ఆ పడుగుదారపు చివరలు ఈ తడికలమధ్య బెజ్జములలో ఎక్కించవలెను. రెండవ చివరలు రెండవ తడికలలో ఎక్కించవలెను. అలా దూర్చేటప్పుడు మొదటిదాని తీగెల మధ్యలో రెండవదాని పోగులున్నూ రెండవదాని తీగెల మధ్యలో మొదటిదాని పోగులున్నూ దూర్చుతూ ఎక్కించవలెను. తరువాత రెండు చివరలు కలిపి ముడివేయవలెను. అప్పుడు తడికలు రెండున్నూ పడుగుమధ్యలో ఏర్పడును. తరువాత పడుగు రెండు స్తంభములకు చుట్టూ త్రిప్పికట్టి మిగతాది రూలరును చుట్టిగాని వచ్చిపోని ముడివేసిగాని వదలవలెను.

కొంతదారము కండెలకు చుట్టుకుని పడుగు కుడిప్రక్కను వచ్చేలాగున ఎత్తుపీట వేసుకుని కిందికి ఒదిలిపెట్టిన చెక్కలు రెండూ తొక్కుతుంటే పైకి క్రిందికి వేరువేరుగా దారము ఏర్పడి కాళీ కనుపించును. ఆ కాళీలోనుంచి కండె ఇటూ అటూ మార్చుకుంటూ కత్తితో కదియ కొట్టవలెను. ఈవిధముగా గంటకు రెండు గజములు నవారు నేయవచ్చును. ఈ విధముగా ఈ పరిశ్రమ నాకు తెలిసినంతవరకు వ్రాసితిని. దీనిలో ఇంకా ఎక్కువ పనితనముగాని యింకా సులభముగా తయారుచేసే విధముగాని తెలిసినచో సోదర సోదరీమణులెల్లరు సోదరి గృహలక్ష్మి ద్వారా తెలియచేయుదురుగాక యని ప్రార్థించుచున్నాము.

పనిముట్లయొక్కయు యితర వస్తువుల పేర్లు

1. స్తంభములు (వాని దిమ్మెలు) 2. పడుగు. 3. నేసిన నవారు. 4. దారపు కండె. 5. జల్లెడలు. 6. బల్లు. 7. పై కట్టిన త్రాడు. 8. త్రొక్కుడు చెక్కలు (పాంకోళ్లు) 9. చెక్కలకు కట్టిన త్రాడులు. 10. కూర్చొను బల్ల (స్టూలు) 11. దూలము. 12. నూలు (పడుగుయొక్క) చుట్టబడిన రూలరు. 13. నేసిన నవారు చుట్టబడిన స్తంభము. 14. కత్తి.



పట్టాభిషేక సందర్భమున సింహాసనారూఢులైన శ్రీ శ్రీ శ్రీ జయచామరాజ
ఒడయర్ బహద్దరువారు

హిస్టారికల్ ఎసోసియేషనుకు గౌరవాధ్యక్షులైన
శ్రీ మహారాజావారు.

గృహలక్ష్మి

తన గృహమును సరిదిద్దుకొనగలి
గిన గృహలక్ష్మి, దేశమునంతయు
సరిదిద్దగలదు—గృహిణి యొక్క
జీవితాదర్శము గృహోద్ధరణమే
కాదు ప్రపంచోద్ధరణము గూడ.

శ్రీమతి ఇనుగంటి సరస్వతీదేవి

గృహలక్ష్మి యనఁగా నేమి? ఇల్లాలు - భార్య. గృహమున కలంకారము గృహలక్ష్మి. గృహిణి లేని గృహము వనము. గృహిణియున్నప్పుడే శోభ. కళకాంతులు. పురుషుఁడు కష్టపడి ద్రవ్యార్జనసేయువాఁడు. స్త్రీయే గృహాధికారిణి. భర్త కష్టపడి చెమటకోర్చి వేసారి యింటి కరుగుదెంచిన భార్య ప్రేమరసపూరిత వాక్యములతో నుత్సాహపరచిన యెట్టి శ్రమయుఁ గాంచక భర్త కానందముకలుగును. భరించువాఁడు భర్త, భరింపఁబడునది భార్యకదా! ఇట్టి అనుకూలదాంపత్యము స్వర్గ తుల్యముగ నుండును. లోకకల్యాణోద్ధరణము నిజమైన దంపతులపైననే యాధారపడియున్నది. దాంపత్యాను రాగ మన్నింట నేకమై యనుకూలముగ నుండెనా? తత్సంతాన సుగుణవిశేషమును నల్లేయుండు. దేశాభి వృద్ధికి, సంఘాభివృద్ధికి వీరలే మూలకారణములగుదురు. 'యథారాజా తథాప్రజా' యనునట్లు యింటి యజమాని గుణసంపత్తిపైననే, నడవడిపైననే భార్యాపుత్రుల నడవడియు నుండును. అనుకూలవతియగు భార్య యున్నచో గృహమును దిద్దుకొనుటయే కాక తన సంతానమునకును పట్టుపడవలసిన విజ్ఞానమును బోధించి దేశమాతకుఁ దగిన పుత్రులనిపించుకొనునట్లు సవరించుకొనగలదు. విమలపాతివ్రత్యధర్మమును తన పుత్రికలకు నుగ్గుపాలనాటనుండియు నలవాటుచేయఁగలదు. కనుక ముఖ్యముగా గృహలక్ష్మిపైననే యింటికి కీర్త్యప కీర్తులు గలుగును.

"ఆతతధర్మార్థ సుఖ
ఖ్యాతులు సద్భార్యవలనఁగాదే కలుగుక."

అను మహాభారత వాక్యమేనాఁడును మఱువంగరానిది. ఒక్క ధర్మార్థకామములకే కాదు, మోక్షప్రాప్తికిఁగూడ సత్సతి హేతువగునని చెప్పుట సాహసముకాదు. ఐహికాముష్మికఫలముల కన్నింటికిఁ దోడు భార్యయే. ధీరోదారగుణరత్నాకరులగు పుత్రులను బడయుటకును, వీరసంతానాభివృద్ధికిని, రెండువంశ ములవారిని తరింపఁజేయఁగల సాధ్వీరత్నములను గాంచుటకును భార్యయే యాధారమని యంగీకరించునాఁడు ఆ యీ సత్కార్యాచరణములచే, ధర్మప్రవర్తనలచే, మోక్షసామ్రాజ్యలక్ష్మియు గృహలక్ష్మివల్లనే లభింపఁ గలదని ఘంటాపథంబుగఁ జెప్పకతప్పదు. ఈ భావమే పంచమవేదమనఁబకు భారతమున విశదీకరింపఁబడినది.

సీ. ధర్మార్థకామసాధన కుపకరణంబు, గృహనీతి విద్యకు గృహము విమల
చారిత్ర శిక్షకాచార్యకంబన్వయ, స్థితికి మూలంబు సద్గతికి సూత్ర
గౌరవంబున కేక కారణం బున్నత, స్థిరగుణమణుల కాకరము హృదయ
సంతోషమునకు సంజనకంబు భార్యయ, చూవె భర్తకు నొండ్లు గావు ప్రియమ

గీ. ఎట్టి ఘట్టములను నెట్టి యాపదలను, నెట్టి తీరములను ముట్టఁబడిన
వంతలెల్లఁబాయు నింతుల ప్రజలను, నొనరఁజూడఁగనిన జనులకెందు.

ఇన్నియుఁ జెప్పి చివఱకు నట్టి పతివ్రతదైవమనియే వేదమంగీకరించిన ట్లీగీతికవలనఁ దెలియనగును.

"పాతివ్రత్యము గలిగిన
నాతియనఁగ దైవమన జనస్తుత వేశ్రే?"

సాధ్విచేఁ జేయఁబడు మహాకార్య మిట్టిదట్టిదని చెప్పుటకన్న శ్రీనాథకవిసార్వభౌమకృతమగు నొక్క గీతమును బేర్కొన్నఁ జాలు.

గీ. తల్లి వంశంబునం దేడు తరములకును
తండ్రి వంశంబునం దేడు తరములకును
ధవుని వశంబునం దేడు తరములకును
శాశ్వత స్వర్గసౌఖ్య మీఁజాలుసాధ్వి.

గృహలక్ష్మికి ముఖ్యముగ క్షమ యుండవలె. ఒక్క క్షమాగుణమున్న నన్నియు నున్నట్లే. దాని సమస్త సద్గుణములు పట్టుబడును. అదియే తృప్తినిచ్చు. భర్త ధనికుఁడైనను నిర్ధనికుఁడైనను భార్య తారతమ్యమును గణింపరాదు. అట్లుగానిచో దినమెల్ల కష్టపడి, యలసి సొలసి, యింటికేగుదెంచు సమయమున భార్య

ఉ. "దూరముపోయి యెండఁబడి దూపిలివచ్చిన ప్రాణనాథునిక
ద్వారకవాటగేహళులదాఁక నెదుర్కొని తీర్థమార్చి యా
హారముపెట్టి వీడ్యము సమర్పణచేసి విహారశయ్యపై
నూరువులొత్తి చిత్తమునకుబ్బొనరించుట ధర్మమింతికిక్."

అను కవిసార్వభౌముల ధర్మోపదేశము పెడచెవినిఁబెట్టి నగలు నాణెములు లేవనియు మంచి రకరకంబులగు చీరెలు లేవనియు వేయేల? యివి లేవవి లేవనియు వాదులాడి చిఱచిఱలాడుచు నెడముగము పెడమొగము బెట్టినచో భర్త కట్టిజీవితము నరకమునకన్న హేయముగ నుండును. పతి యెట్టివాఁడైనను బతితో నేకీభవించి సంసారశకటమును నడుపు సతియే యిహపరముల రెంటను సౌఖ్యమందఁగలదు. అట్టి లేనినాఁడు రెంటికినిఁ జెడ్డ రేవడివలె రెండును గోల్పోవును. అట్టి భాగ్యమున్నను లేకున్నను నొకటే. భార్యాభర్తలిద్దఱును రెండు చక్రములవలె, కావడికుండలవలె సమానముగ నున్ననాడే సంసారశకటము కలిమిలేముల స్థితి చక్కఁగ నడచును.

ప్రస్తుత కాలపరిస్థితుల ననుసరించి పురుషుఁడు స్త్రీ సమానమను సిద్ధాంతములో మన స్త్రీలు మెలంగుచున్నారు. సంసారచక్రమునందు వీరుభయులు సమానులు; కాని యందుఁగల బాధ్యతలు వేఱు గదా. అట్టులనే యే సమయాన నే సమస్యలో సమానబాధ్యత వహించవలయునో గృహలక్ష్మి గమనించుటలోనే తన సతీధర్మము వెల్లడియగును. కాలమెంతగమారినను నవనాగరికత యెంతగా హెచ్చినను, అభిరుచులలో భేదమెంతగాఁ గలిగినను, భర్త ననుసరించి తిరుగుటయే భార్యకుఁ బ్రధానధర్మము. అప్పటున నట్టి వైపరీత్యమును గలుగదు.

గృహలక్ష్మి

"సతులకేడుగడయుఁ బతుల చూవె."

కనుక భర్త యనుమతితో నెట్టి పని వెంటనంటిచేసినను ధర్మమునకు దూరముగాదు.

"మంచి పనియైనఁ బ్రాణేశు మనసురాని
పనులు మానుట భద్రంబు వనితలకును"

అని యేనాఁడో దూరదృష్టి గమనించి చెప్పిన పెద్దలవాక్కులను గాదందురా. మనప్రాచీన సిద్ధాంతములన్నియు నాయాకాలములకు సరిపడునట్లెగాక సర్వకాల సర్వావస్థలయందును యుగయుగముల వారికి సరిపడునట్లు బ్రహ్మజ్ఞానవేత్తలచేఁ జెప్పఁబడినవి. మనప్రాచీనుల సాంప్రదాయము అజ్ఞానాంధకారమున మునిఁగి మనము గుర్తింపలేకున్నారము. ఈనాఁడెన్ని మార్పులువచ్చినను నిజముగ మనజీవితము లాదర్శకముగ నుండుటకుఁ జెప్పఁజాలువారొక్కరును లేరనుట సాహసవాక్యమని తలంపవలదు. కోటికొక్కరున్నను లాభమేమి? మన ప్రాచీనకాలమెంతగా సతీమణుల పరమపావన ప్రవర్తనలచే శోభిల్లినదో యొక్కసారి వెనుకకు దిరిగిచూచిన జ్ఞప్తికివచ్చు. ఈనాడు స్త్రీసంఘము సర్వసమస్యలందును పాల్కొను చున్నదనుట తప్పని చెప్పుటకీవ్యాసము వ్రాయుటలేదు. ఆనాఁడును గృహము మొదలు రణరంగమువఱకు భార్యలు భర్తలకన్నిట సాయపడుచు వచ్చుచుండిరి. కాని పురుషులను గాదని స్వేచ్ఛగసంచరించిన వారలెవరును లేరు. ఏకార్యమునకైనను నొకనియందు బాధ్యతయుండవలె. కనుక గృహసందర్భమును జెప్పునాఁడు, గృహలక్ష్ముల ప్రసక్తి వక్కాణించునాఁడు తమతమ మగవారలపై నిలచి యుండునేనుమాట రూఢిగనమ్మవలె. అప్పుడే మనమన యభీష్టములు నెరవేరి సర్వకార్యములయందు జయముగలుగును. పురుషులకుఁదోడునీడవలె స్త్రీలు సంచరించుటయే ధర్మము. తనపురుషునికంటె వేఱుదైవము స్త్రీకి లేదు. ఒక్క మాట,ఒక్క నమ్మకము,ఒక్క దైవము, ఒక్క భక్తి, ఒక్క నిలకడయుండవలెఁగాదా. అదియే సర్వకార్యసిద్ధికిఁదోడ్పడు. ఒక్కనిబుద్ధితోఁబనియేల యని స్వేచ్ఛగా సంచరించిననాఁడు సతికెట్టి గౌరవములేదు. ఎట్టికార్యమును నెరవేరదు. పైపెచ్చు అపనిందయే మిగులును. అట్లుగాక "పతిగడవంగ దైవతము భామలకెందునులేదు" అని త్రికరణశుద్ధిగ సంచరించిననాఁడు తనలోకమును నుద్ధరింపఁగలుగుటయేకాక, తన స్త్రీసంఘమభివృద్ధిలోనికిఁ దేఁజాలుశక్తిని గాంచుటయే కాక పురుషులకుసైతము తననడవడి ఒరవడివలె నాదర్శకముగ నుండునట్లొనర్చుటయెకాక, "భాసురభూషణాంబరాన్విత ధనధాన్యగౌరవము విశ్రుతసంతతియున్ యశంబుసద్గతియునుగల్గు" నట్లు నిర్ధారణచేయగలదు. స్త్రీ తానుచేయవలసిన ధర్మమెఱుంగక విడాకు లిచ్చినంతమాత్రమున నుపన్యాస వేదికలపై నిలబడి ధర్మోపదేశములు చేసినంతమాత్రమున నేమగును? లలాటలిఖితరేఖ మార్పజాలరని గంభీరముగ మెట్టవేదాంతము కురిపించినను లాభములేదు. గొప్పఐశ్వర్యముతోఁబనిలేదు. గృహలక్ష్ములకుఁ బ్రధానభూషణములు శాంతము, సత్యము, తృప్తి, నిరాడంబరప్రవృత్తి, ఇన్నిఁటఁదులతూగి గృహమునకు వన్నెతెచ్చునదియే గృహలక్ష్మి. తన గృహముసరిగ దిద్దుకోగలిగిననాఁడు ప్రపంచమందుండు గృహములన్నిఁటిని దిద్దఁగలుగు. అట్టిగృహలక్ష్మి ప్రపంచమున కాదర్శకముగనుండు. కాన వనితామణులెల్ల నిగర్వశిఖామణులై, శాంతచిత్తలై, సాధ్వీశిరోరత్నములై తనరారునాడు భారతదేశ సౌభాగ్యభాగ్యాభివృద్ధి నాఁడునాఁటికిఁ గన్నులపండువుగనుండు. దేశమున కలంకారభూతులు గృహలక్ష్ములే.

లక్ష్మీ సరస్వతులు

ఈ అత్త కోడండ్రకు బొత్తిగా పొత్తు కుదరదనుట ఏటి సిద్ధాంతము? ధన మున్న వారికి విద్యలేదా? విద్యావంతులు ధనికులుగారా? లక్ష్మీ సరస్వతుల కటాక్షములందు ఈ భేదములేదని నాటికాల మున, నేటికాలమున కొన్ని నిదర్శనములు - గాని, ఇది ఛలోక్తికి మాత్రముగాదు.

● లక్ష్మీ సరస్వతులు ●

నామ మాత్రమున లక్ష్మియనియు సరస్వతియనియు భేదముకనఁబడు చున్నదిగాని సూక్ష్మదృష్టిఁ జూచిన యాత్మజ్ఞాన తత్త్వవేత్తలకు వీరిరువుర యందును దారతమ్యము గానరాదు. త్రిమూర్తుల కన్నిటి నభేదమేకదా! అట్టులే ఉమాలక్ష్మి సరస్వతులకును భేదములేదు. మానవత్వమునఁ దత్త్వమెఱుంగక మనలో మనమేర్పఱచుకొనిన భేదబుద్ధియేయిది. వివాదములకు, కాలక్షేపములకు, ఉబుసుపోకలకు నిట్టి వాదము పనికివచ్చును. అవతారభేదములనుబట్టి రాముఁడనియుఁ గృష్ణుఁడనియు నెట్లు నామమాత్రమున మార్పుజెందెనో యట్లే వారివారికార్య నిర్వాహకత్వమున వివిధనామములను ధరింపవలసిన వారలైరి. కడియమన్నను, కంకణ మన్నను మరేమన్నను రూపమునఁ బేరున భేదమేకాని వాస్తవము వస్తు వొకటియే. సౌకర్యార్థమై, వ్యవ హారికమునకై వివిధనామములు మనసంతతికినిచ్చు చుండుటలేదా! తల్లిదండ్రులకుఁ సత్సంతాన సంతతియంది సుమంతయైనను భేదముండునా! అదియటులుండ లక్ష్మి సరస్వతులు అత్త కోడండ్రులైరని యీ కాలమునను సరించి వారలకుగూడ భేదబుద్ధి యారోపణచేయుట న్యాయమా! అత్తకోడండ్రకు బొత్తిగా సరిపడదనుట యేటిసిద్ధాంతము? మూర్ఖవాదమునకుఁ దావిచ్చి, బలమిచ్చి, పోషించి నిర్హేతుకముగఁ గుటుంబ కలహములను బెంచి సౌఖ్యహాని కలుగఁజేసికొనుటకే కాని మఱెట్టి యుపయోగమున కీవాద మక్కఱకురాదు. పై వెచ్చ లేని యీర్ష్యావేదనమునకు స్థానము గల్పించి మనశ్శాంతికి భంగము కలిగించుకొనుటయు నగును. ఏవిధమునఁ జూచినను లక్ష్మి సరస్వతులొక్కచోట నుండవనుట సంభవము. లక్ష్మి యనగా ధనమనియు సరస్వతి యనగా విద్యయనియుఁ గదా రూఢిమాట! ఒక్కొక్కశాఖ యొక్కొక్కరి యధీనమున నుండుట మేలని లోకవృత్తాంతములను జూచిన మనమంగీకరింతుముగదా. కుటుంబ నిర్వహణ బాధ్యత యజమానునిపై నున్నట్లే ధనాధీశ్వరి లక్ష్మియయ్యె. విద్యాధీశ్వరి సరస్వతియయ్యె. ఆ జగదాంబలు తమతమ పుత్రులకు పుత్రికల కెంట సమానభాగమిచ్చి సమానదృష్టినే చూచుచుందురు. కాని కర్మానుభవము, కర్మసిద్ధాంతము బ్రహ్మాదు లకును దప్పకపోవుటచే వారివారి ప్రాక్కర్మల ననుసరించి లక్ష్మి సరస్వతీ భాగ్యములబ్బుచుండును, అంతియ కాని యీ భేదముగాని యీ నేరముగాని లక్ష్మి సరస్వతీ కటాక్షములయందు లేదు—ముమ్మాటికిని లేదు. ధనమున్నవారికి విద్యలేదా? విద్యావంతులు ధనికులుగారా? ఈ విచిత్రకల్పన యేల? లేక చదువున్నచోట

ధనముండదని చెప్పుదురా? ధనమున్నచోట విద్య శూన్యమందురా? ఈ రెండును బొసఁగవని చెప్పుట కాధారమేది? ఈ రెంటికిని పొత్తు సమానముగ నుండఁగలదని నాఁటికాలమున నేఁటికాలమునఁ గొన్ని నిదర్శనములు చూపఁగలము. అవి కాదనువారలుండరుగదా. విషయమెఱుంగుటయు, యెఱింగినదానిని తిరిగి క్రొత్తఁజేసికొనుటయు, గుణగ్రహణముకొఱకు మా సోదర సోదరీమణులకుఁ జెప్పుటకుమాత్రమే యీ వ్యాస రచనోద్దేశముగాని లేదని చెప్పువారికిది సమాధానమగునని కాదు. ఛలోక్తికై కూడ కాదు.

విద్యయనఁగా నవిద్యను బోఁగొట్టునది. అనఁగా నజ్ఞానమును బారఁదోలునది. అట్టి విద్యను బొందియు నొకచోఁ బ్రారబ్ధకర్మంబున ధనలోపము సంభవించిన నా లోపము, మన కర్మము వారల కంటఁ గట్టుదురా? దానమనదుష్కర్మ తొలఁగిపోవకుండుటయె కాక పరమార్థసాధకమున కడ్డుతగులు పాపము మూటఁగట్టుకొనునట్లగును. కొంచెము జ్ఞానమెఱింగినవారలిట్టివి స్వబుద్ధిచేఁ గలిగించుకొనరాదని చెప్పుటకే కాని 'బుద్ధిః కర్మానుసారిణి' యనునది కాదనుటకుఁ గాదు. మఱొక్క చిన్న విషయమును గమనింపుడు. లోకములో మొద్దులు, బండలు, నిరక్షరకుక్షులు ఎందఱు లేరు? అట్టివారినిఁగూర్చి సరస్వతికి దయలేక పోయినదని చింతించుచున్నారా? చదువురాలేదని వాపోవువారలెందఱున్నారు? ఆ యపవాదము సరస్వతి కేల యంటఁగట్టరు? 'వాడిఖర్మం చదువురాలే'దని ఒక్కమాటలోఁ దృప్తిపొందుటయే మనము చూచు చున్నారము. లక్ష్మి విషయ మట్లుగాక యానేర మా జననిపైననే పెట్టుట లోకవిదితము. దీనినిఁబట్టియే పక్షపాత మనంబున నీర్ష్యావేశ జనితంబుననే మన లోపమన్యులపైఁ బడవేయుచున్నట్లు పొడఁగట్టు. అందుచే లక్ష్మి సరస్వతుల కెయ్యెడలను బొత్తు కలియు టసంభవముకాదనుట సత్యదూరమే. వారలకుండు నన్యోన్యాను రాగము వర్ణనాతీతము. తల్లి కూతురుల ప్రేమకంటె నత్తకోడండ్ర యనురక్తియే యెక్కుడు. రెండును రెండు కళలు; కాని యొక్కకళకుఁ జేరినవే. ఎన్ని రాజాస్థానములు; ధనవంతుల పేరోలగములు సరస్వతీ సంపన్నులకు గౌరవాదరములు కూర్చుటలేదు? లక్ష్మి కీర్ష్యయున్న విద్యావంతుల నేల గౌరవించును? క్రీగంటనైనను జూడదుగదా.

ఇది యటులుండ విద్యాధనములు రెండును నొకరిసొమ్మలే యనుట కీయుదాహరణంబులు చాలును. లక్ష్మి సరస్వతులు కలసి మెలసి స్పర్ధలావంతయులేక యెన్ని రాజాస్థానముల నాట్యమాడుట లేదు? శ్రీ రాజరాజనరేంద్ర, భోజ, కృష్ణదేవరాయ ప్రభుచంద్రములు లక్ష్మిసంపన్నులగుటయే కాక కేవల సరస్వతులనియే ప్రఖ్యాతిఁగాంచినవారలుగదా. నిదర్శనంబులు స్వల్పములని విషయమును ద్రోసి రాజు చేయవలదు. అత్తకోడండ్రకుఁ గలిమిడియున్నదా లేదా యనియే విషయప్రసక్తి. ధనికులు విద్వాంసులను గౌరవించుటలేదా? అనఁగా లక్ష్మి చదువరులను నాదరించి ప్రేమించి కౌగిలించుటగదా. భోజనరేంద్రుని మొగముజూచిన కవిత్వము వచ్చుననుమాట కల్పితమా? ఆ మహాలక్ష్మి సంపన్నుని కింతటి విద్య యెక్కడ నుండి వచ్చె? లక్ష్మి సరస్వతులు వాదములాడుకొని చివరికొక్కనియందే ప్రవేశించిరి కాఁబోలు. లేదా ఆ ధీరోదాత్తగుణాకరుఁడా రెంటిని తనవశములో నుంచుకొనఁగలిగెనేమో? ఎట్టులనైననేమి యెడమొగము పెడమొగము పెట్టుకొనక యొకట లక్ష్మి సరస్వతీ విగ్రహములు కాపురముండె. నేఁటికాలమునఁ జూత మందురా? శ్రీ రాజా విక్రమదేవవర్మగారు, శ్రీ రాజా భుజంగరాయ బహద్దరుగారు, కీర్తిశేషులైన శ్రీ సురభి రాజా మల్లభూపాలోత్తములును సరస్వతీ సంపన్నులగుటయే కాక మహాకవులునుగూడ నైరి. శ్రీ రాజా వాడ్రేవు విశ్వసుందరరావుగా రాంధ్రాంగ్లములయందుఁ బండితులు. ఈ మహాప్రభువుల యింట నత్తకోడండ్ర వైరమెక్కడిది?

ఇంతవఱకు లక్ష్మిసంపన్నులకడ విద్యావిభవంబు కలదని చెప్పికొంటిమి - ఈపైన రెండవపక్షమును దర్శింతుముగాక. బ్రహ్మశ్రీ వసురాయ కవిశేఖరుఁడు లక్ష్మి సరస్వతీ సంపన్నుఁడై సహస్రమాసజీవియై యశఃకాయమున వెలుంగుచున్నవాఁడుగదా.

సీ. అనుభవించితిమి దీప్యద్భోగములను రాజాధిరాజులకన్న నధికముగను
ఆర్జించితిమి యింత నతిథులకిడి మేము ననుభవింపఁగఁజాలు నట్టి వృత్తి...

అని చెప్పికొనిన తిరుపతి వేంకటేశ్వర శ్రీ సంపత్తి ప్రత్యేకించి చెప్పనక్కరలేదు. కవితా సామ్రాజ్యమునకు వీరలే చక్రవర్తులుగదా!

ప్రొద్దుటూరులోఁ జుక్కలమధ్య చంద్రునివలెఁ బ్రకాశించుచున్న రాణాప్రతాపసింహచరిత్రాది మహాగ్రంథములను రచించిన కళానిధి రాజశేఖర శతావధానిగారు యాచకులను ధనికులుగఁ జేయఁగల భాగ్యవంతులు.

సీ. రాజరాజేంద్ర సామ్రాజ్యభోగములందు నన్నయభట్టు పాల్గొన్నవాఁడు
మనుమసిద్ధీశక్షమాచక్ర మరుదారఁ దిక్కన్న తనచేతఁ ద్రిప్పినాడు
వీరభద్రారెడ్డి విరివియౌ విభవంబు శ్రీనాథుఁడెంతో భుజించినాడు
రాయలయొద్ద గౌరవమొందఁ బెద్దన్న యెక్కి యందలము నూరేగినాడు.

అను వసురాయ కవిశేఖరుల భావములు యథార్థములుగదా. ఆ మహాకవులు వరప్రసాదమూర్తులు. వాక్సిద్ధికలవారు. కేవలము సరస్వతీ యవతారస్వరూపులే యని చెప్పవచ్చు. అట్టివారలకడ ధనలక్ష్మి తనంతఁదావచ్చి కాపురముండె.

కనుక లక్ష్మీ సరస్వతుల కెందును వైరములేదు. విద్యాలక్ష్మియై, వాగ్లక్ష్మియై, కావ్యలక్ష్మియై, యశోలక్ష్మియై విరాజిల్లు.

సంఘాభివృద్ధికిని, దేశసేవకును, దీనజనోద్ధరణమునకును, కార్యసాధనమునకును, లోకమున నావరించిన యజ్ఞానాంధకారమును దొలగించుటకును, తత్త్వపీఠముల నుద్ధరించుటకును, పతితులైన తోడిమానవులఁ బైకి నెత్తుటకును లక్ష్మీ సరస్వతీ సంపన్నులిరువురు కలసినకదా యేతన్నిర్వహణ మొనరించుట.

మన భారతదేశము లక్ష్మీ సరస్వతీ కరుణాకటాక్ష వీక్షణ శ్రీలచే ఖండాంతరములకంటె నొకచూపెక్కుడుగ నన్నిఁట నభివృద్ధిగ నుండుఁగాక!

అత్త కోడండ్ర కలిమిడిచేఁ గుటుంబములన్నియు నైకమత్యమున మెలంగి యేతత్సతీమతల్లులచే భారతదేశ సౌభాగ్యభాగ్య విద్యాసంపత్తి నాఁడునాఁడును వర్ధిల్లుఁగాక!

మలేరియా

అంటువ్యాధి

ఇంతకుపూర్వము మలేరియా అంటువ్యాధి ప్రబలినపుడు హార్లిక్సు ధారాళముగా ఉపయోగింపబడెను. దీనినుండి మితిలేని తృప్తి, గుణము కలిగినది. రోగులు ఆహారవిషయము ముఖ్యముగా గమనించవలసినది. జ్వరపు విషము నరస్నాయువులలో ప్రవేసించి రోగిని నిశ్శక్తునిగా జేయును. కడుపు బలహీనముగా నుండుటచే ఏ ఘన ఆహారమును సహించదు. ఇట్టి సందర్భమున హార్లిక్సు యోగ్యమైన ఆహారమని డాక్టర్లు గ్రహించినారు. ఇది జీర్ణకోశమునకు ఏలాటి హాని కలుగజేయదు. ఇది వందకువంద పుష్టినిచ్చునది గాన, కోల్పోయిన శక్తి సామర్థ్యమును త్వరలో చేకూర్చును. జ్వరమునుండి రక్షణ పొందుటకు ప్రతియింటను హార్లిక్సు తప్పక యుండవలసినది.

H - 302

పట్టాభిషేక మహోత్సవము

శ్రీ శ్రీ శ్రీ జయచామరాజ ఒడయర్ వారు

మైసూరు సింహాసనము నలంకరించిననాటి దృశ్యములు

మహారాజ శ్రీశ్రీశ్రీ జయచామరాజ ఒడయర్ వారి పట్టాభిషేక మహోత్సవము మైసూరులో నతివైభవముగా, శాస్త్రోక్తముగా గత మాసము జరిగియున్నది.

పట్టాభిషేకమునకు తొలిరోజున కాశీనుండి గంగాతీర్థము తెప్పించి, కనకమయ పాత్రలలో నింపి పూజించి రజతమయ పల్లకీయందుంచి సల్తనత్ సవారీలతో గజాశ్వంబులతో భేరీ మురజాది తూర్యఘోషంబులతో యూరేగించి సమస్థానమునకు కొని తేబడినది.

తరువాత పట్టాభిషేకమురోజున వేకువజాముననే మహారాజుగారు, బ్రాహ్మణ ముత్తైదువల మంగళగీతంబులు సెలంగ, సంపెంగ తైలంబులో శిరసంటి మంగళస్నానంబు గావించి జిలుగైన

మహతాపీ వస్త్రాలంకృతులై రత్నఖచితకంకణ కేయూరములు, నవరత్నహారములు అలంకరించి, చెలువైన తలపాగజుట్టి, తమ కులదేవతయగు చాముండీశ్వరికి భక్తిప్రణామంబుతో పూజలు సల్పిరి.

తరువాత శాస్త్రోక్తముగా బ్రాహ్మణోత్తమల వేదఘోషంబులు చెలంగ పురోహితాది మంత్రివర్గంబులతోగూడి వంశపారంపర్యముగా జరుగుచుండు హోమాది కార్యకలాపములను నెరవేర్చి, కంకణము ధరించి దీక్షవహించి మహారాజుగారు బయటికివచ్చిరి.



అశ్వారూఢులైన శ్రీ జయచామరాజ ఒడయర్ బహద్దరువారు
(చిన్నతనమున)

అచ్చట బంగారు నగలతో శృంగారించబడిన భద్రగజంబునకును, భద్ర అశ్వంబునకును పూజలు చేసిన పిదప రాజ్యాభిషేక మహోత్సవమునకు ఆహ్వానితులైన, సకల రాజశ్రేష్ఠులును, సామంతులును, గౌరవోద్యోగస్తులును, పండిత ప్రవరులును, వేదవేదాంగ పారంగతులును పురప్రముఖులును వచ్చి నిండియుండు దర్బారు హాలునకు పరివారసహితంబుగా దయజేసిరి.

అటకు వచ్చుటకు పూర్వము అందరి సముఖంబున రాజగురువులగు వైష్ణవమతాచార్యులు పరకాల మఠాధిపతివారికి భక్తిపురస్సరముగా పాదపూజలొనరించి ప్రణామంబులు గావించి వారి శుభాశీర్వచనంబులవడసి, మహారాజుగారు దర్బారుహాలులో ప్రవేశించి రత్నసింహాసనమునకు దగ్గరనే అమర్చబడిన పీఠమునం దాసీనులైరి.

వేదఘోషంబులును, మంగళవాద్యంబులును మారుమ్రోగుచుండగా పవిత్రమైన గంగాతీర్థకలశంబులు మహారాజావారిముందు బెట్టబడినవి. అతి వైభవోపేతమైన సమయమున ఐదుగురు బ్రాహ్మణశ్రేష్ఠులు మామిడి ఆకులతో గంగాతీర్థమును మహారాజుగారి శిరస్సుపై చల్లి ఆశీర్వదించిరి. తరువాత ఐదుగురు క్షత్రియ శ్రేష్ఠులును, ఐదుగురు వైశ్య శ్రేష్ఠులునుకూడ తీర్థమును చల్లిరి.

తరువాత అచ్చటనుండి భద్రసింహాసనమును సమీపించి మంత్రి పురోహితులతో సింహాసనమునకు పూజలొనర్చిరి. మైసూరు సమస్థానములోనుండు రాజప్రతినిధి హస్తావలంబనముతో శ్రీ శ్రీ మహారాజుగారు భద్రసింహాసనంబుపై అధిరోహించిరి. వృద్ధబ్రాహ్మణ ఆశీర్వాదంబులతో మహారాజుగారు సింహాసనాసీనులైరి. రాచకీయ యుద్యోగులును, సైనికోద్యోగులును వారివారి గౌరవమర్యాదలను ఉచితరీతి చెల్లించి సత్కరించిరి.



శ్రీ మహారాజావారు సహాధ్యాయులతో

ఆ నాటి సాయంత్రము మరల శ్రీ శ్రీ మహారాజాగారు సింసనంబున పద్మాసనులై కూర్చుండి యుండ, సైనికుల కవాతు ప్రదర్శనములును, బాణవేడుకలును అద్భుతముగా జరిగినవి. ప్రేక్షకుల కానంద దాయకంబై, కన్నులపండువై మహా వైభవముగా మహోత్సవము సంపూర్ణమయ్యెను.

జీవితచరిత్ర

శ్రీ మన్మహరాజ శ్రీ శ్రీ శ్రీ జయచామ రాజేంద్ర ఒడయరు బహద్దరుగారు 1919 సం॥ జన్మించిరి. వీరు కీ. శే. మైసూరుయువరాజు కంఠీరవనరసింహరాజుగారి ఏకైక పుత్రులు. మైసూరు విశ్వవిద్యాలయమునందు మొదటి తరగతిలో బి. ఏ. ప్యాసయినారు. దేశచరిత్ర, రాజకీయములు వీరికభిమానవిద్యలు. మహారాజావారు హిస్టారికల్ అసోసియేషను గౌరవాధ్యక్షులుగా నెన్నుకొనబడిరి. అంతర్జాతీయ వ్యవహారములను, భారతదేశ సమస్యలను నిర్విశేషముగా చర్చించి చక్కగా అవగాహన మొనర్చుకొనిరి. పట్టభద్రులయిన తరువాత రాజ్యపరిపాలనా ప్రజ్ఞకై ఇండియన్ సివిల్ సర్వీస్ అధికారి ఎల్విన్ గారివద్ద చక్కని శిక్షనందుచున్నారు.

నూతన మహారాజుగారికి సంగీతములోను, హిందీభాషలోను మంచి పరిజ్ఞానము కలదు.

శ్రీవారు మంచివక్త, గొప్పయుదారమనస్కులు. నిరాడంబరజీవి. వీరిపెద్దతండ్రి వలెనే వీరికి దైవభక్తి, ప్రజాదరణ, దేశసేవ, స్వదేశ పరిశ్రమాభిమానము మెండు.

వీరు తమతల్లి దండ్రులతో 1937 సం॥న విదేశ సంచారముచేసి వచ్చిరి. 1938 సం॥ మే నెలలో, చర్కారీ మహారాజుగారి సోదరియైన శ్రీమతి సత్యప్రేమాదేవిని పరిణయమాడిరి.

వీరు విక్రమనామ సం॥ భాద్రపద శుక్ల సప్తమి ఆదివారం (8-9-40) మైసూరు రాజ్యమునకు పట్టాభిషిక్తులై రత్నమయ కర్నాటక సింహాసనము నలంకరించిరి.

రత్నసింహాసనము

మైసూరురాజులు పట్టాభిషిక్తులగు మహిమోపేతమైన రత్న సింహాసనము అత్యంత ప్రాచీనమైనది. పూర్వము హస్తినాపురమును పాలించిన యుధిష్ఠిర సార్వభౌముడు దర్బారు చేయుచుండిన భద్రసింహాసనమిది. దీనిని 'దంపులరాజ'ను నరేంద్రుడు తెచ్చి, పెనుగొండలో భూగర్భమున భద్రపరచెను. క్రీ. వె. 1336 లో విజయనగర సామ్రాజ్య స్థాపకులు దానిని బయటకుదీసిరి. తర్వాత ఒకటిన్నర శతాబ్దమువరకు వారి స్వాధీనములోనే యుండి, కృష్ణదేవరాయలాది సార్వభౌముల మన్ననలను వడసినది. తదనంతరము శ్రీ రంగరాయలకది సంక్రమింప శ్రీరంగ పట్టణమునకు గొనితేబడినది. 1609 శ్రీరాజా ఒడయరు గారు శ్రీరంగపట్టణమును ముట్టడించి శ్రీ రంగరాయలును ఓడించి ఈరత్న సింహాసనమును వశముగావించుకొనిరి. అప్పటినుండి మైసూరు మహారాజులకు అది భద్రపీఠమై యొప్పుచున్నది.

ఈ సింహాసనము బంగారు కదళీ స్తంభములతోను, బంగారు మామిడియాకులతోను అలంకరించబడియున్నది. సోపానముల కిరుప్రక్కలను గంధర్వప్రతిమలతోను రెండు యాళిబొమ్మలతోను విరాజిల్లుచున్నది. సింహాసనముమీద శ్వేతచ్ఛత్రము చుట్టును ముత్యాలజాలీలు; శిఖరముమీద పిట్ట నవరత్న ఖచితమై నిగనిగలాడుచున్నది. కూర్చుండు ఆసనము కూర్మాకారము. నాల్గువైపులు చతురంగ బలస్వరూపముతో చెక్కబడియున్నది.

తూర్పున ఏనుగులు, పడమట పథాతులును, దక్షిణమున గుఱ్ఱములును ఉత్తరమున రథములును అమర్చబడియున్నవి. ఇవిగాక దక్షిణమున బ్రహ్మస్వరూపమును ఉత్తరమున శివస్వరూపమును మధ్య విష్ణుస్వరూపమును చిత్రింపబడియున్నవి. 4 మూలలలోను 4 సింహములును, దానిపై విజయనిచిత్రమును, 4 హంసలును, 2 శరభములు 2 గుఱ్ఱములు, పొందికగా చిత్రించి ఇమడ్చబడియున్నవి. దిగ్దేవతలను, నాగకన్యలనుకూడ అద్భుతముగా పొదిగించి నిర్మింపబడిన ఈ రత్నహింహాసనము కన్నులపండువై పూర్వపు శిల్పుల హస్తలాఘవమును ప్రదర్శించుచున్నది.

★ మనకర్తవ్యము

★

కవికలహంసి
శ్రీమతి
చేబ్రోలు
సరస్వతీ దేవి

★

కర్తవ్య మెరుగని కార్యదీక్ష నేలవిడచిన సాముచంటిది. అనుసరణములోను, ఆచరణములోను ఆశయము అవగతమైన గృహపాలనాదక్షత పురపాలనా పద్ధతియందు కూడ జేజేల నందుకొనును.

మన భారతదేశమునందు స్త్రీ పురుషుల జీవితచర్య ఒడిదుడుకులులేక స్థిమితముగను గంభీరముగను ప్రశాంతముగను బరిపూర్ణమగు నున్నతాశయముతో నడువవలెనన్న వారి వారలముఖ్య కర్తవ్యములను జక్కగా నెఱిగి గతులుదప్పక, నీతిప్రవర్తనములకు దూరముగాక, ధర్మముబాయక, యొకకంట దేశసేవోద్ధరణ దృష్టియు, నొకకంట సంఘోద్ధరణ దృష్టియు గలిగి నూటిగా సత్యనిర్ణీత ప్రణాళికమీదనే యడుగులువేసి చరించవలయును. గతిదప్పిన ధృతితప్పు; ధృతితప్పిన మతితప్పు; మతితప్పిన సర్వము తారుమారై తలక్రిందులగును. గనుకనే మనబుద్ధులకెట్టి రాగద్వేషములును దగులకుండ కాపాడుకోలేని నాడు దేహావసాన పర్యంతమున నెట్టికార్యమును సాధింపలేక జీవితమువ్యర్థమై నశించిపోవలసినవారల మగుదుమని యీ దిగువ గీతావాక్యములచే తెల్లమగుచున్నవి.

శ్లో. క్రోధాద్భవతి సమ్మోహస్సమ్మోహాత్ స్మృతి విభ్రమః
స్మృతిభ్రంశాద్బుద్ధి నాశోబుద్ధినాశాత్ప్రణశ్యతి.

ఈ సూక్ష్మమును గ్రహించియే మనప్రాచీనులు మంచి యనుభవముగలవారగుటంజేసి యెట్టి పొరబాటులైనను నవలీలగ గెంటజాలునది విద్యయని గ్రహించి యట్టి స్త్రీ పురుషుల విద్యా విధానమును క్రియాకలాపమును ఇదమిద్ధమని నిర్ణయముజేసి శాసించిరి.

చిరస్థాపితమై, ఆచరణయోగ్యమై, సుకరమై, యాదర్శకంబై యిందు నందు బరమార్థ సాధకంబై యొప్పు యీ ధర్మపథమునుండి ఎట్లోమనము దూరమైపోయితిమి. ప్రాచీనమనుట తోడనేకొందరికి హేయముగ దోచుచున్నది. నవీనభావాకాశములోనే విహరింప ననేకులు యాతురపడుచున్నారు. మనకర్తవ్యములేవియో, హక్కులేవియో, ఆచరణీయము లేవియో, అనుకరణీయము లేవియో చక్కగా నవగాహన మొనరించుకొనక ప్రమాదపడుచున్నాము.

పూర్వము హరిశ్చంద్ర పాండవ నలాది వీర నృపశిఖామణులు దురంత దుఃఖములకులోనై వనవాసాది క్లేశముల ననుభవించు సమయమున వారితోబాటు వారి ధర్మపత్నులును కడగండ్లకు సుస్వాగత

మొసగి ఆహ్వానించిరే, యెద్దానికి? తమతమ పవిత్రకర్తవ్యములను చక్కగా నెఱింగినవారు గనుక సౌఖ్యముల కాలదన్ని కష్టజీవితములనే కౌగలించుకొన్నారు. ఆదర్శవీరవనితా రత్నములైనారు. భారతభూమికి సింగారమును జేయించినారు.

వీరేగాక ఇటీవల పేరెన్నికగాంచిన మనోరమ, అహల్యాబాయి, లక్ష్మీబాయి, మహామాయ, సరస్వతిమున్నగు వీరమాతలును సాంఘిక, రాజకీయ ఆర్థికసంస్థలలో తలయొగ్గి తమకర్తవ్యమును సాంగోపాంగముగ నిర్వర్తింపజేసిరి. అప్పటి సౌభాగ్యస్థితిని చూచి భారతమాత దరహసితవదనారవిందయై కళకళలాడుచు తనగారాబు కూతులంజూచి ఆనందాశ్రువులరాల్చుచుండినది. మరి ఇప్పుడో విపరీతభావ పరిణామములలో జిక్కి 'పులినిజూచి నక్క వాతబెట్టుకొన్న'ట్లు పాశ్చాత్య అంధానుకరణంబుతో తైతక్కలాడుచు 'స్వధర్మే నిధనం శ్రేయః పరధర్మో భయావహః' అను ధర్మవాక్యమునకు దూరమై, కళావిహీనరై ప్రవర్తించు కూతులంజూచి పొగిలి పొగిలి దుఃఖాశ్రువులమ్రింగుచు బరితపింపవలసివచ్చె.

మనభారత సౌభాగ్యమును, పునరుద్ధరింపదలచితిమేని మొట్టమొదట మనజీవితపంథలో మార్పు గలుగవలయును. ఇప్పటి విద్యావిధానమును తొలగించి భారతవిజ్ఞానమునకు పునాదివేయు నిక్కమగు సక్రమ విద్యను బడయవలయును. పొట్టకూటికైనను యుపకరించని నేటివిద్యా విధానముతోనే తృప్తినందక మానవ జాతికి శ్రేయోదాయకమై, సంఘ సంస్కరణోపాయమై, అజ్ఞానతిమిర భాస్కరమై, స్వతంత్రభావోపేతమై, హృదయశక్తుల వృద్ధిగావించు విద్య నలవడజేసుకొనవలసి యున్నది.

ఇప్పుడిప్పుడు మనలో కొందరు న్యాయవాదినులై, ఉపాధ్యాయినులై, పండితాణిలై, వైద్యరత్నములై, జిల్లాబోర్డు అధ్యక్షిణులై, చేయిర్మనులయి వాసియు వన్నెయు గాంచుచుండు టెంతయు ముదావహము. అంతమాత్రములోనే తమసహజ ధర్మమగు గృహధర్మములకు తిలోదకములు విడువరాదు. గృహధర్మమున్నదని సేవాధర్మము, కళోపాసనను మరచిపోరాదు.

గృహపాలనములో, రాజకీయ, ఆర్థిక, సంఘ, సాహిత్య సంస్కరణములు నిమిడియేయున్నవి. కాని నిర్మాణములో చిన్నది. అదియే పెద్దదిగా విస్తరించినపుడు 'విశ్వమానవకల్యాణమునకై చేయు సేవ', 'దేశోద్ధరణకై సల్పుకృషి' అని వేరువేరు నామములతో నొప్పుచుండును. ఈ రెండింటికిని భావములో భేదములేకపోలేదు. ఒకటి స్వార్థము; రెండవది పరార్థము-ఇంతే భేదము.

గృహధర్మములను సక్రమముగా నెఱపుటలో స్త్రీలే సహజచాతుర్య ధురీణలు. క్షమాస్వరూపులు. ఎంతటి గౌరవోద్యోగములు జేయువారైనను గృహపాలనలో పురుషులు వెనుకకు తగ్గవలసినవారేకదా! గృహపాలనాదక్షతగలవారే పురపాలనాపద్ధతిలోను జేజేల నందుకొందురని దృష్టాంతముగా ఇప్పుడు కడపలో శ్రీమతి రామసుబ్బమ్మగారు జేగంట మ్రోగించుచున్నారు.

కావుననే గాంధిమహాత్ముడు సత్యాగ్రహమునకుగాని, దేశసేవకుగాని స్త్రీలే ముందంజవేయవలయునని నిత్యము చెప్పుచున్నాడు. పెక్కు సంవత్సరములనుండి భారతీయుల భావముక్తికై దీక్షవహించి, పడరానిపాట్లు పడుచు, క్లిష్టసమస్యల ధైర్యముగ నొక్కడై యెదుర్కొనుచు నిక్కమగు భారతపుత్రుడని పించుకొని తన సోదర సోదరీమణులను నీ కార్యరంగమున కహింసావిధానమున దయారుచేయుచున్న మహాత్ముడొక్కడే యిప్పట్ల మన కెయ్యెడలనైన శరణ్యము. గాంధిమహాత్ముని దేశనిర్మాణ కార్యక్రమపద్ధతి చాల

గొప్పది. ఆ మహాత్ముని యుద్దేశానుసారము 13 పద్ధతులలో ముఖ్యములగు వయోజనవిద్య, స్త్రీ సముద్ధరణ, ఆరోగ్యబోధ, మాతృభాషాప్రేమ, ఖాది, గ్రామపారిశుభ్రత మున్నగు విషయములు స్త్రీలే నిర్వహింపదగినవి. దానికి యర్హులు స్త్రీలే.

ప్రతి సమస్యకు నిర్మాణకార్యక్రమము సిద్ధముచేసికొని ప్రతి పల్లెలలోను, పట్టణములలోను స్త్రీ సదనములు నిర్మించి యుద్బోధ చేయవలయును. గృహబాధ్యతవహించునట్లే ఈ కార్యక్రమ భారమును ఇల్లాలే వహించవలె. ఇది తన ధర్మమని ప్రతి గృహలక్ష్మియు గ్రహించిననాడే మానవశ్రేయస్సు, లోక కల్యాణము తలచూపును.

మనలో భావస్వాతంత్ర్యము సమసిపోయి శతాబ్దములు కావచ్చినది. స్వతంత్రచింతన కవకాశమే లేదు. అందుచేత నేయభివృద్ధియులేక మైలురాయివలె నొక్కచోటనే యుండవలసినవారమైతిమి. ఇంత కంటె హైన్యము కలదా? అన్నింటికిని మూలకారణము సరియగు విద్యాగంధము వ్యాపింపకపోవుటయే. కావున తెలివితోపాటు హృదయమునుగూడ విశాలముచేయు విద్యనభ్యసించుటకు గర్తవ్యములెల్ల రెటింగి పాటుపడి గమ్యస్థానము చేరువరకు తదేకదీక్షతో బనిచేయవలయును.

రాజా స్నో

మొటిమలను పోనిచ్చి

సౌందర్యమును హెచ్చించును

వెల 0—8—0 అణాలు

"రాజా స్నో" వారివల్ల

రాజా స్నో హేరాయిలు

రాజా స్నో కస్తూరి సోపుకూడ

తయారగుచున్నది

ఇవి మంచి సువాసనగలవి.

Manufacturers:

MANYAM & CO.,

MADRAS & BANGALORE.

మైసూరు సిల్కు ధరిస్తే
అందంగా అగపడతావు

వివేకవతులైన స్త్రీ లెక్కడున్నా మైసూరు సిల్కునే కోరుతారు. ఎందుకంటే వాటి ధారణ అందంగా చేస్తుం దనే భావం వారికి కలిగింది.



మైసూరు సిల్కు బట్టలన్నీ శుద్ధమైన మైసూరు పట్టుతోనే నేయబడ్డాయి; అందులో కృత్రిమపట్టు గాని, విదేశపట్టుగాని చేరివుండలేదు.

మైసూరు సిల్కు బట్టలు,

జార్జెటి, క్రేప్స్, శాటిన్స్, చేతిగుడ్డలు శుద్ధమైన పట్టునుండి గవర్నమెంటు సిల్కు వీవింగు ఫ్యాక్టరి, మైసూరులో చేయబడుతున్నాయి.

దొరకు చోట్లు:

1. మైసూరు ఆర్ట్స్ & క్రాఫ్ట్స్, 1/11, మౌంట్ రోడ్, మద్రాసు.
2. మద్రాసు స్వదేశీ ఎంపోరియం లిమిటెడ్, 1/17-A, మౌంట్ రోడ్ మద్రాసు.
3. మైసూరు ఇండస్ట్రీస్, చాపల్ రోడ్, హైదరాబాద్, దక్కన్.
4. ది మైసూరు ఆర్ట్స్ & క్రాఫ్ట్స్ డిపో, 23, సౌత్ పెరేడ్, బెంగుళూరు.

మహిమోపేతుడు మహాత్ముడు

శ్రీరాముని సత్యశీలములు, శ్రీ కృష్ణుని కార్యదీక్షాబుద్ధి కౌశలములు, బుద్ధుని త్యాగ అహింసాభావములు, సమ్మేళనము జెందినవి మహాత్మునియందు.

శా
ర
ద
శే
ఖ

మూవురవతారమూర్తుల జీవిత సారములను గంగా యమునా సరస్వతులవలె స్వీయజీవితమున మేళవింపజేసికొనిన మహావ్యక్తి మహాత్ముడు.

★ శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మ ★

నెచ్చెలీ!

అక్టోబరు రెండవ తేది భారతీయులకు అత్యంతపవిత్రదినము! పుత్తలీబాయి గర్భశుక్తిముక్తా ఫలము! భారతాంబనోముల పంట! భారతీయులభాగ్య సర్వస్వము! శ్రీ మహాత్మమోహన్‌దాస్ కరంచంద్ గాంధి జన్మించిన శుభదినముగదా అది! భారతభూమి విదేశీయ పరిపాలనా పీడితయేయగుగాక, పారతంత్ర్యదాస్య శృంఖలానిబద్ధయేయగుగాక, దారిద్ర్యాంధకార నిమగ్నయేయగుగాక, పూజ్యతముడైన మహాత్ముని గనుభాగ్యము పొందగలిగినందుకు మాత్రము ఎంతయైన సంతసింపవచ్చును.

మహాత్ముడనిన మహాత్ముడా? ఎంత సత్యనిరతి! ఎంత త్యాగశీలత! ఎంత వైరాగ్యభావము! ఎంత ఈశ్వరవిశ్వాసము! ఎంత కార్యకౌశలము! ఎంత ధర్మానురాగము! ఎంత బుద్ధివైశద్యము! ఎంత రాజనీతిజ్ఞత! ఎంత ఆర్తరక్షణాకాంక్ష! ఎంత దేశాభిమానము! ఎంత నిరాడంబరజీవనము! ఎంత ఋజువర్తనము! ఎంత నియమపాలనము! ఎంత జనవశీకరణశక్తి! ఎంత అహింసాపరత్వము! అహో! ఎన్నియని చెప్పవచ్చును. సద్గుణంబులెల్ల సంఘంబులై వచ్చి, ప్రహ్లాదకుమారునియందు నిలిచినట్లు మహాత్మునియందు నిలిచి అతనికతడే సాటియనిపించుచున్నవి గదా!

కల్పలతా! రాముడు, కృష్ణుడు, బుద్ధుడు మున్నగు అవతారపురుషులగని భారతవర్షము మహాపురుషులకు పుట్టినిల్లను ఖ్యాతి నిదివరకే గాంచియున్నను మహాత్మునివంటి మహాపురుషుని గాంచుటచే నా విఖ్యాతి యింకను యినుమడించినది సుమా. ఏలనందువా? ఆ అవతారమూర్తులకంటె మహాత్ముని జీవితమే మిన్నయనిపించుచున్నది. చూడుము. శ్రీరాముడు సత్యనిరతుడే, శీలవ్రతుడే, అయిననేమి దుష్టశిక్షణకు పశుబలమునే ఆరాధించినాడు. శ్రీ కృష్ణుడు కార్యదక్షుడే, రాజనీతిజ్ఞుడే, యుక్తిపరుడే, అయిన నేమి ఋజుమార్గగామి కాడు. బుద్ధుడు అహింసానిరతుడే, త్యాగశీలుడే, అయిననేమి యీశ్వరవిశ్వాసిగాడు. ఆతని అహింసా ప్రచారముగూడ జంతుహింసా నివారణకే అధికముగా వినియోగపడినది. మహాత్మునియందో శ్రీరాముని సత్యశీలములు, శ్రీ కృష్ణుని కార్యదీక్షాబుద్ధి కౌశలములు, బుద్ధుని త్యాగ అహింసాభావములు, సమ్మేళనము జెందినవి. కాన మూవురవతారమూర్తుల జీవితసారములను గంగా యమున సరస్వతులవలె స్వీయజీవితమున

మేళవింపజేసికొని జన్మించిన మహావ్యక్తి మహాత్మాగాంధి. అన్నిటికన్న అహింస విషయమై మహాత్ముడు పల్కెడి సూక్తులు, చేసెడి నిర్వచనములు, పాటించెడి ధర్మములు, ఆచరించెడి నియమములు ఎంత మహత్తరములై యున్నవో చూచుచుంటివా ?

● త్రికరణశుద్ధిగ అహింసను పాటింపవలయునట. మనోవాక్కర్మంబుల నెందును పరహింస పనికిరాదట. దౌర్జన్యముతో సంపాదింపబడిన దేవరాజ్యమైనను పరిత్యాజ్యమేనట. తన ప్రాణమొడ్డునేగాని పరప్రాణహింసకు తానొప్పడట. హిందూస్థానమునకు స్వరాజ్యసిద్ధి అహింసద్వారానే కలిగి అహింసద్వారానే పాలింపబడవలయునట. ఇదియే ఆయన ఆదర్శమట. ఇట్లు కానిచో తనకు కాంగ్రెసు సారధ్యమే వలదట. పశుబలమునందును, ఆయుధసంపత్తియందును స్వసామర్థ్యమునందును విశ్వాసముగల నాయకులు దీని నెట్లంగీకరింతురు? "మహాత్మా, మావల్లగాదని"నారు "ఒకవేళ అహింసద్వారా రాజ్యమును సంపాదింపగలిగినను రక్షించుట మాత్రము మాకు సాధ్యముగాదని"నారు. మహాబలాన్వితమైన బ్రిటిష్ సామ్రాజ్య హస్తగతమైయున్న రాజ్యమును స్వాయత్తముచేసికొనుటకు అహింసకు సాధ్యమైనచో దాని రక్షణమాత్రమేల సాధ్యముగాదని ఒక మందహాసముచేసి మహాత్ముడు పైదొలగినాడు. కాని, యిరువది సంవత్సరములనుండి అహింస నాధారపఱచుకొని తాను నేతయై నడపుచున్న కాంగ్రెసు, తన్ననుసరించుచున్న ప్రజానాయకులు, దౌర్జన్యరాహిత్య సిద్ధాంతము నొక్కమారు గోటమీటి దేశరక్షణ వ్యాజమున పశుబలమునాకాంక్షించువారైనపుడు మహాత్ముడెంత గాఢతర విషాదమును జెందెనో హరిజను పత్రికలో ఆయనవ్రాసిన వ్యాసములు విశదపఱచినవి. సముద్ర మథనమునందు ఉద్భవించిన హాలాహలమును పరమశివుడు కంఠస్థము చేసికొనినట్లు స్వరాజ్యామృతమును యేకైకనాయకుడుగానైనా అహింసద్వారా బడయుటకు కృత నిశ్చయుడైనాడు. ప్రపంచమునకంతటికి మార్గదర్శకము కాగల అహింసాసిద్ధాంతముయొక్క బిగువు సడలించుటచే కాంగ్రెసు బిగువును సడలినట్లైనది. కాంగ్రెసు నాయకులలోగలిగిన యీ అభిప్రాయభేదముల నాధారముగా చూచుకొని ప్రభుత్వమువారి బిగువు హెచ్చినది. అభిప్రాయభేదములతోను, మత భేదములతోను కొట్టుకొనుచున్న యీ భారతవర్షమునకు వారెంతమాత్రము స్వరాజ్యము ప్రసాదించరట. ఈ హిందూస్థానమున వసించు నానాజాతులవారు అన్యోన్యకలహములులేక సురక్షితముగా నుండుటకు తమ పరిపాలన యీ దేశమునకు ఎల్లప్పుడును అవసరమేనట. రాజప్రతినిధియు, యిండియా మంత్రియు నీ విధముగా నిక్కచ్చిగా తెలుపుటతో నాయకుల తలలు తిరిగిపోయినవి. ఇట్టి సంధిగ్ధసమయములో కాంగ్రెసు నేతృత్వము వహింపగల సామర్థ్యమెవరికున్నది? మహాత్మునకే కాని అహింసా సిద్ధాంతమును సంపూర్ణముగా కాంగ్రెసు చేపట్టకున్న మహాత్ముడు నాయకత్వమువహించునా ? కాన స్వరాజ్యసిద్ధికి అహింసయేమూలము. మహాత్ముడే నాయకుడు.

● ప్రపంచమంతయు అహింసాదౌర్జన్యములచే కల్లోలితమైపోవుచున్నది. మానవత్వము నశించినది. పశుత్వము విలయతాండవము చేయుచు మానవవినాశమునకు దొరకొనుచున్నది. నాగరకతాగ్రగణ్యమైన పశ్చిమఖండమంతయు ఈ పశుబలారాధనలో జిక్కుకొని ఆహుతియగుచున్నది. నిరపరాధులగు స్త్రీలు బిడ్డలుగూడ ఈ మారణకర్మంబునకెరయై అసువుల గోల్పోవుచున్నారు. పశ్చిమఖండవాసులు అఖండ పశుబలారాధనవలన పొందుచున్న విపత్పరంపరల వినుచున్న గుండెలు ద్రవ్యాలగుచున్నవి. కాన యిదియే భారతీయులకును ఆరాధ్యమగుచో మహాత్మునివంటి అహింసాయోగినిగన్న భారతవర్షముయొక్క విశేషగౌరవమేమిగలదు ?. మహాత్ముడు కారణజన్ముడు గాని మానవమాత్రుడుగాడు. ఇటీవల మహాత్ముడు గావించిన

ఒకానొక ప్రకటనలో ప్రస్తుత సంగ్రామానల జ్వాలల జల్లార్చుటకు అహింసయే ముఖ్యసాధనమనియు, అది భారతీయులవల్లనే సాధింపబడవలయుననియు వాక్రుచ్చినాడు. ఇక దానికి మహాత్ముడే నాయకత్వము వహించునని వేరే చెప్పవలయునా? శాంతి సమరము మరల సాగింపబడనున్నది. మహాత్ముడు అహింసా శంఖమును విశ్వమోహనముగ పూరింపబోవుచున్నాడు. ఈమారు భారతవర్షమేగాక యావత్ప్రపంచము నాతని ననుగమించును. మహాత్ముని దివ్యాదర్శము సఫలమైతీరును. నిజతపశ్శక్తిచే ముజ్జగంబుల నుఱ్ఱూత లూగించిన మహర్షులకు కాణాచియైన భారతవర్షము మహాత్మునిద్వారా నిఖిల ప్రపంచమునకు అహింసా సందేశము నొసంగి తన ఆర్యసంప్రదాయమును నిలబెట్టుకొనును.

ఇట్టి సత్సమయమున మనముగూడ యీ ఆర్యావర్తమున నుదయించి అమ్మహాత్మునకు సమకాలికులమై ఆయన దివ్యబోధనలను నాలించుభాగ్యము గల్గుట నిజముగా మన బహుజన్మసుకృత పరిపాకమే; సందియములేదు. అయితే ఇట్టి మహాత్ముడు మనవాడని చెప్పుకొని మురియుటతో ప్రయోజనములేదు. ఆయన బోధించెడి ధర్మములకు బద్ధులమై ఆయనచెప్పెడి విధమున వర్తించినపుడే మన ధర్మమును మనము నిర్వర్తించినవారమగుదుము. అఖిలదేశములందలి ప్రాజ్ఞులు మహాత్ముని ధర్మోపదేశములచే ఆకర్షితులై ఆయనను సేవింప సేవాగ్రామమునకు విచ్చేయుచున్నపుడు భారతవర్షమున నుదయించియు ఆతని మహత్తును తెలిసికొనజాలక పోతిమేని మనకంటె అజ్ఞానులు లేరనియే చెప్పవలయును గదా. కల్పలతా! అట్టి అవివేకమతులుగాక భారతీయులెల్లరు మహాత్మననుసరింతురుగాక! పూజ్యతముడైన మహాత్ముడు చిరంజీవియై వర్ధిల్లునుగాక!

విజయదశమి

బ్రహ్మభార్యను పూజించి బ్రాహ్మణుండు
శస్త్రపూజలు జరిపియు క్షత్రియుండు
అరకలంటిని పూజించి హాయిగాను
వైశ్యుడుండిన నాడెగా విజయదశమి!

క్రొత్తదుస్తులు ధరియించి కోటుదొడిగి
జొన్నకంకులు తలపాగ జొనిపి జొనిపి
సమరమందున జయమందు శూరుడోలె
వైశ్యుడుండిన నాడెగా విజయదశమి!

పొలముకాపుకు పనులన్ని పూర్తిగాగ
పాలకులు కాపువారల పలుకరించి
శత్రురాజుల మీదికి సైన్యమంపి
విజయశంఖుం బూరించుగా విజయదశమి!

వల్లభనేని రంగాదేవి
కే. యన్. రత్నాదేవి

యుద్ధరంగము

★ లండనుపై జర్మనీ దాడులు

★ ఈజిప్టుపై ముసోలినీ ముష్కరత

★ ఇండో చైనాపై జపాను ఒత్తిడి

★ అరుంధతి ★

ఇది నవయుగ నిర్మాణమో, నవయుగ నాశనమో బోధపడటంలేదు. పలుముఖాల విజ్ఞానాన్ని వృద్ధిచేసి, ప్రకృతిని జయించి లోబరుచుకుంటూ విశ్వప్రయత్నాలుచేసి నిర్మించిన నేటి సభ్యత పరరాజ్యాక్రమణకు, నరరక్త దాహమునకూనా? యుద్ధం ప్రారంభమైనప్పటినుండీ యీ రెండు వికృతశక్తులేకాక మరి వేరు ప్రయోజనమేముంది? సంవత్సరం దాటీ దాటడంతోటే, జర్మనీ ముష్కరత ఎనిమిది రాజ్యాలలో మానవసభ్యతను దిగ్రమింగింది. 'తృష్ణ' వికృతరూపంతో హిట్లరులో రాక్షసత్వాన్ని దాల్చి కరడుగట్టుకు పోయింది. లేకపోతే యింతటి దారుణ మారణహోమం జరగడానికి తావేదీ?—

పాశ్చాత్య నాగరికతకు ఆటపట్టైన ఫ్రాన్సు, కళాకౌశలంలో వన్నెమీరిన ఫ్రాన్సు, స్వాతంత్ర్య జీవికకు ప్రాణప్రదమైన ఫ్రాన్సు - వారంరోజులైనా పోరాడకుండా హిట్లరుకు లొంగిపోయిందంటే, నేటి యుద్ధంలో జర్మనీ దుండగాలయొక్క పరిమితి తెలుస్తుంది.—

ఫ్రాన్సు పతనం - వెంటనే ఇంగ్లండుపై ప్రయోగిస్తున్నాడు హిట్లరు తన పరాక్రమాన్నంతా. అప్పుడే రెండు మాసములుగా సాగుతోంది అతని విజృంభణ. - ఆకాశాన్ని చించుకుని అగ్నిజ్వాలలు కురుస్తున్నాయి - సముద్రం కళవళపడిపోయి ఓడలను దిగ్రమింగుతూవుంది. సుమారు 70 చదరపుమైళ్ల పరిమితిగలిగిన బ్రహ్మాండమైన పట్టణం, సుమారు కోటి జనసంఖ్యగల మహానగరం తరతరాలుగా చీమలుపుట్టలు కట్టినట్లుగా కట్టుకువచ్చిన సుందరనగరం లండన్ - యీ అఘాతాలకు పాలౌతోంది. - బర్కింగుహామ్ పాలెస్, వెస్టుమినిస్టర్ అబే మొదలైన కట్టడాలు బాంబు తాకిడులకు గురి ఔతున్నాయి. అయినా సహజ ధైర్యప్రతాపులైన బ్రిటిష్ పౌరులు వీటికి జంకిపోవటంలేదు - నిగ్రహంచూపి జర్మన్‌దాడికి ప్రతీకారం చేస్తూనేవున్నారు. బ్రిటిషు విమానాలు తమ స్వదేశాన్ని కాపాడుకోవటమే గాక బర్లిన్‌పై దాడివెడలి అచ్చట ముఖ్యమైన యుద్ధ కర్మాగారాలమీద బాంబులు వర్షించి వస్తున్నాయి. ఏకైకజోదువలె ఇంగ్లండు ఒక్కటే జర్మనీతో పోరుతూంటే, దాన్ని జయించలేక రెండునెలలుగా హిట్లరు అస్తవ్యస్తమౌతున్నాడు.

ఇంగ్లాండుయొక్క పటిమనుచూచి ఇక చేసేదిలేక యితరరాజ్యాలను ఇంగ్లండుపై పురికొల్పు తున్నాడు హిట్లర్.

ఇటలీని లేవదీసి ఆఫ్రికాఖండంవైపు అల్లరి ప్రారంభించాడు. ముందుగా సోమలీలాండును లోబరుచుకుని ఈజిప్టును దిగమ్రింగడానికి బయలుదేరాడు ముసోలిని. ఈజిప్టు పరిసరాల్లో చాలావరకు ఇటాలియను సైన్యాలు చొరబడ్డాయి. ఈజిప్టును జయించి, సూయిజ్ కాలవను బంధించి, మధ్యధరాలో సర్వాధిపత్యాన్ని చలాయించాలని ముసోలినీ ఆశ. ఇదేకాకుండా ఫ్రెంచివారి సిరియాపైకూడా కాలు దువ్వుతున్నాడు ముసోలినీ. కాని ఈజిప్టులోను, పాలస్టైన్‌లోను బ్రిటిషు సైన్యాలు చాలా వుండడంవల్ల ముసోలినీకి ధైర్యం చాలడంలేదు. ఇందుకు తోడుపడటానికే కాబోలు రిబ్బన్‌ట్రాప్ జర్మనీనుండి యిటలీకి పోయి ముసోలినీతో ఏవో మంతనాలు జరుపుతున్నాడు.

ఇక మధ్యధరాసముద్రంలో జిబ్రాల్టరు కోట అభేద్యమైనది బ్రిటిషువారికి వుంది. ఈ ద్వారాన్ని కూడా బంధించినట్లయితే అటు సూయిజ్ ద్వారం - యిటు మధ్యధరా ద్వారం - రెండూ నిరుపయోగాలై బ్రిటిషువారికి సహాయం సన్నగిల్లిపోతుందని హిట్లర్ ఆశించి పన్నిన పన్నాగమిది. అందుకోసం స్పెయిన్‌ను గూడా యుద్ధంలోకి దింపాలని ఫ్రాంకోను లోబరుచుకున్నాడు. ఎంతమందికూడినా జిబ్రాల్టరు ఉక్కు కోటలను బ్రద్దలుచేయజాలడం కలలోని వార్త. అక్కడ బ్రిటిష్ నావలు, విమానాలు అప్రమత్తతతో తిరుగుతూ కాపాడుతూనే వున్నాయి.

ఇది చాలక తూర్పుఖండంలో జపాన్‌ను హుషారిచ్చి బ్రిటిష్ నౌకాస్థానాలకి, వ్యాపారస్థానాలకి ఒత్తిడి కలగజేస్తున్నాడు. ముందుగా ఫ్రెంచి ఇండోచైనాను స్వాధీనంచేసుకుని సింగపూరురేవును ముట్టడించాలని ప్రయత్నాలు చేస్తూవుంది ఇటు జపాన్.

జర్మనీ, ఇటలీ, స్పెయిన్, జపాన్—యీ నాలుగుదేశాలు ఒక్కమారుగా విజృంభించి, నాలుగు వైపులా విరుచుకుపడి ఇంగ్లండును ఓడించివేయాలనే ఆశతో హిట్లరువేసిన ఎత్తు ఇది.

కాని, ఇంతమందికీ జబాబుగా బ్రిటన్ తన ఆయుధసంపత్తిని సమీకరింపజేసుకొని, అన్ని యుద్ధ రంగములలోను శత్రువులను ఎదుర్కొని తగినశాస్తి చేస్తూనేవుంది.

రెండు మాసములుగా సాగుచున్న యీ విపరీత విలయతాండవములో యీ నాలుగుదేశాలు బ్రిటనును ఏమిచేయగలిగినవి? బ్రిటిష్ సింహమువద్దనా యీ కుప్పిగంతులు?

ఏది ఎటులున్నా, యుద్ధముమాత్రము తీవ్రరూపం దాల్చుతోంది నానాటికి. ధర్మబలము, స్వాతంత్ర్యదేశముల సానుభూతి నీగల బ్రిటన్‌యొక్క అచంచలస్థానమును యీ రాక్షసబలము ఏమాత్రమూ సడలించలేదనడంలో అతిశయోక్తి లేదు—

(25-9-40)

సంపాదకీయములు

దసరా సంచిక

జగత్సృష్టికి మూలకారణము స్త్రీ శక్తి. ఈ ఆదిశక్తికి తమతమ విధేయతల దెల్పుటయు, ఆమె నన్నివిధముల గౌరవించి, పూజించి, అగ్రస్థాన మధిరోహించునట్లు చేసినగాని, తమ కభ్యున్నతిలేదని అర్థించుటయు—దేవీపూజలలోని అంతరార్థము.

ఈ పరాశక్తిలోని పవిత్రభావమును మన మవగతముచేసికొన్న, నేడు కేవల సాంకేతికమైయున్న యీ 'పూజ'లలోని అంతరార్థము తేటపడగలదు.

దసరా దినములలో భారతదేశమంతయు యీ శక్తిస్వరూపిణికి పూజలుసల్పి ఆరాధించుచున్నది కాని, 'శక్తిస్వరూపిణి' అనిన ఒక విగ్రహముమాత్రమే గాదు. ఆ యమయందు మూర్తీభవించియున్న వివిధ శక్తులు - ధైర్యము, స్థైర్యము, సాహసము, ఉత్సాహము, సత్యము, హృదయనైర్మల్యము, ఏకాగ్రత—

ఈ ధీరోదాత్తమగు సద్గుణపుంజముల కాకరమైన ఆ యాకారము, ఒక చిహ్నము మాత్రముగా వెలసి, తమతమ జీవితక్రమములయం దనుష్ఠించవలసినదిగా మనుజకోటిని హెచ్చరించుచున్నది.

ఇట్టి ఉత్తేజకరములైన దేవీప్రసాదిత వివిధశక్తులను మనలో వ్యాపింపజేసికొని, మన ధర్మములను ఒకసారి మననముజేసికొని, జాత్యభివృద్ధికి క్రొంగ్రొత్తరేఖల దిద్దవలసియుండుటయు—

సనాతన, అధునాతన సంఘవ్యవస్థల సంధికాలములో మన విధులను సంఘ పురోభివృద్ధి కనువగు సక్రమపద్ధతులపై నడపవలసియుండుటయు—

ప్రాచ్య,పాశ్చాత్య నాగరికపద్ధతులు దినదినము పెచ్చుపెరిగి, యిరుపైపుల పోటీశక్తుల ప్రసరించుచు అస్థిరత్వమును ప్రబలమొనర్చుచున్న - నేటి వర్తమాన పరిస్థితులలో నిబ్బరమునుకూడ దీసుకొని, నిలకడగా నిలబడవలసియుండుటయు—

—నేటి స్త్రీ పురుషుల నెదుర్కొనుచున్న పెద్ద సమస్యలు.

ఈ భావప్రవాహముల ఒత్తిడిలో యీ సమస్యలను పరిష్కరించుకొని చెక్కుచెదరని పద్ధతుల నిర్మాణము చేసుకొనవలసియున్నది.

దీనికి భావములు, భావములకు దగిన భాష, అనుసరణీయమై, ఆచరణయోగ్యమైన పంథాలు మనకు కావలసియున్నవి.

—ఇట్టి వివిధభావముల కేంద్రీకరణమే యీ దసరా సంచిక.

కోరికను మన్నించి, తోడనే చాల తక్కువవ్యవధిలో, తమతమ రచనలను మాకందిచ్చి, యిందుకు తోడ్పడిన వివిధ రచయితలకు మా కృతజ్ఞతను తెలియజేయుచున్నాము.

వ్యవధిలేమిచేతను, స్థలాభావముచేతను కొందరి రచనలను ప్రకటింపలేకపోవుటను దయతో మన్నింప వేడికోలు.

కాగితపు కరువు పరిస్థితులలో యిట్టి ప్రత్యేక సంచికను ప్రకటించుట మాది సాహసమేయైనను, ఆంధ్ర సోదర సోదరీమణుల వాత్సల్య ప్రోత్సాహములే మమ్మల పురిగొల్పినవని చెప్పక తప్పదు.

'దసరా సంచిక' నా మూలాంతము తిలకించినంత, ఒక క్రొత్తదనమును ప్రస్ఫుటముజేయగల భావజ్యోతులిందలి విషయములైననాడు, మా యాశయము నెరవేరగలదు.

ఇది పాఠకులే నిర్ణయించవలసియున్నది. వారు ఆయా విషయములను మాకు దెలియజేసిన భావి పత్రికాభివృద్ధికి దోహదమొనర్చిన వారలగుదురనికూడ మనవి చేయుచున్నాము.

*　　　*　　　*　　　*

మహాత్ముని జన్మదినోత్సవము

అక్టోబరు రెండవ తేది - అఖిలభారత పర్వదినము. భారతమాత నోములపంట - గాంధిమహాత్ముని జన్మదినము.

సత్యాహింసలతో సర్వ ప్రపంచము నందును శాంతిసామ్రాజ్యమును స్థాపింప సంకల్పసిద్ధుడైన మహాత్ముని జన్మదిన మహోత్సవములు ఆసేతుశీతనగపర్యంతము అతి వైభవముతో అక్టోబరు రెండవ తేదీ నుండి దశవాసరములు జరుపబడనున్నవి. ఆబాలగోపాలమును అందు పాల్గొని, మహాత్ముని ఆశయములను త్రికరణశుద్ధిగా ఆచరించెదమని దీక్షబూన వలసిన పవిత్రదినములవి.

మహిమోపేతుడైన మహాత్మునికి సమకాలికులమై, ఆయన దివ్యబోధల వినుటకు మనమునోచికొనుట ఎంతయు మన యదృష్టము.

'రామరాజ్యమ'ని వేనోళ్ల నుతినొంది, పురాణప్రసిద్ధమైన శ్రీరాముని యవతార కాలమునందు గూడ ఆయనను విమర్శించువారు లేకపోలేదు—

గీతావాక్యములతో ధర్మ ప్రతిష్టాపన మొనర్చిన శ్రీ కృష్ణుని కాలమునగూడ ఆయనను ద్వేషించు వారు లేకపోలేదు—

అట్లే, కలియుగ పురుషుడైన మహాత్ముని బోధలను హేళనచేయు ప్రబుద్ధులు కూడ యుండుట గూడ యది లోకముయొక్క పోకడగాబోలు!

గత వివిధ సమయములయందు మహాత్మునియొక్క మహత్తర కార్యాచరణములను గమనించియుం డియు ఆయన పెంచిన బిడ్డవంటి కాంగ్రెసు మహాసంస్థకూడ, సత్య, అహింసా సూత్రములను పాటించుటకు

హద్దుకోరి, చేయునదిలేక 'అన్యధాశరణంనాస్తి' అని తిరిగి మహాత్ముని వేడుకొనవలసి వచ్చినది. తిరిగి మహాత్ముని మహత్తు ప్రపంచమున కొకసారి వెల్లడియైనది.

మహిమోపేతుడు మహాత్ముడు కాంగ్రెసు సారధ్యమును స్వీకరించినాడు. విశ్వమానవ స్వాతంత్ర్యమును స్థాపింప సమకట్టి రధమును నడుపుచున్నాడు. ప్రపంచ చరిత్రలో నూతనయుగారంభమును సృష్టింపనున్నాడు. కలియుగమందు కృతయుగ ధర్మమును స్థాపింప యుగప్రవక్త కానున్నాడు—

'అహింసా చరణము', 'ఖద్దరు వస్త్రధారణము' మొదలైన పవిత్రవ్రతములను జపింపుచు, మహాత్ముని మనోవాక్కాయ కర్మల ననుసరించుచు, యీ దేవీనవరాత్రోత్సవ పర్వదినములలో, యీ మహాత్ముని జన్మదినోత్సవ శుభదినములల్లో మనమీ దీక్షాకంకణమును ధరింతుము గాక!

Edited by Dr. K. N. Kesari, Printed and Published by Dr. S. Seshagiri Rao, at the Lodhra Press, 15, Westcott Road, Royapettah, Madras.

For Bookings apply to:—

FAMOUS TALKIE DISTRIBUTORS,

MADRAS.

విషయసూచిక

1. నిరీక్షణ—‘అనార్కాలీ’ ... 529
2. సత్యాగ్రహం ... 530
3. దసరా సంచిక-ప్రశంసలు విమర్శనలు ... 531

స్థానికసంస్థలు స్త్రీలకే వుండాలి, తనివిదీరనిదై యున్నది, సజీవమైన వాఙ్మయం కావాలి, సర్వనాశనమా! సర్వోదయమా, చారుదత్త కవి భానుడు-శూద్రకుడు కాదు

4. రాజమకుటం—శ్రీ పురాణం కుమారరాఘవశాస్త్రి ... 537
5. అన్నా!—శ్రీ క్రొత్తపల్లి వేంకటరత్నం ... 544
6. పోతన ద్రౌపది—శ్రీమతి శ్యామల ... 545
7. వింతవింతల ప్రపంచం ... 550
8. ఆత్మహత్య—శ్రీ పంగనామముల సూర్యప్రకాశరావు ... 551
9. యోగి—శ్రీ పుట్టపర్తి నారాయణాచార్యులు ... 553
10. చూపుల చదువు—శ్రీ గజపతిరాయవర్మ ... 554
11. భావతరంగిణి ... 558
12. పట్టుచీర—పి. వి. రామచంద్రమూర్తి బి. ఎ. ... 559
13. కళాకలాపము-ఆంధ్రులు-సంగీతవిద్య—శ్రీమతి అ. గోదావరమ్మ ... 563
14. ఉభయతారకము—శ్రీ కర్లపాలెం కృష్ణారావు ... 564
15. కడుపుశోకం—శ్రీ తోట లక్ష్మయ్య ... 566
16. గానకళ—శ్రీ గాలి పెంచలనరసింహారావు ... 570
17. బాలభాగ్యోదయము-మైసూరు రాజ్యం ... 574
18. విజ్ఞప్తి—శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మ ... 576
19. దీపావళి—శ్రీ అనిశెట్టి సుబ్బారావు ... 577
20. సీత శాపము—శ్రీ ఆంచట సూర్యనారాయణమూర్తి ... 578
21. నక్షత్రఫలితాలు—కవికలహంసి శ్రీమతి చేబ్రోలు సరస్వతీదేవి ... 580
22. స్త్రీ సాముద్రిక శాస్త్రము „ ” ... 581
23. ఆంధ్రపతాకము—శ్రీ బూర్గుల రంగనాధరావు బి. ఏ. ... 582
24. పాకకళ ... 583
25. చెన్నపురి ఆంధ్రమహాసభ-స్త్రీలశాఖ ... 585
26. గ్రంథసమీక్ష ... 594
27. పత్రికాపరిచయము ... 595
28. సంపాదకీయములు ... 596

త్రివర్ణచిత్రము: నిరీక్షణ చిత్రకారుడు: శ్రీ సి. వి. శ్రీనివాసరావు



విరహిణి



జయజయ గృహలక్ష్మి సఖి! జయజయ లలితాంధ్ర మధుర సారస్వతమా!
జయజయ లలనారత్నమ! జయజయ విద్యాప్రబోధ! జయకల్యాణీ!

నిరీక్షణ

మసృణ సంధ్యాకాల మధుర కాంతులలోన ఘుసృణ మందార సంకుమద రోచులలోన
దాచుకున్నాను నాతరుణారుణచ్ఛాయ వేచుకున్నాను నావిభుని రాకలదాక ;
ముసలిసంజల తమ్మి మొగ్గ మూతలలోన కసటుప్రొద్దుటి లేతకలువ వేపులలోన
నాకన్నె సిగ్గుటందము దాచుకొన్నాను నాకంఠమాల ప్రాణపతి వచ్చెడుదాక.
రండురండమ్మ పేరంటాండ్రు మీరెల్ల దండులై మదనసుందరుడు రానేవచ్చె
స్వామి! నీకొరకు పూజాద్రవ్యములు తెచ్చి యేము కాచెదము రావే మోహనాకార ;

—'అనార్కలీ'

సత్యాగ్రహం

'సత్యాగ్రహమనగా నేమి? సత్యాగ్రహమనగా సత్యమును ఆగ్రహించుట - అనగా గట్టిగా పట్టు కొని యుండుట' అని మహాత్ముడు స్పష్టీకరించినాడు. భాగవతములో ప్రస్తావింపబడిన సత్యవ్రతమిదియే. ఇట్టి సత్యవ్రతులు తమ సర్వస్వమును ధారపోయుటయేగాక ప్రాణములనైన గోలుపోవుటకు సంసిద్ధులగుదురు గాని ఒరులను దూషింపరు; హింసింపరు. ఇట్టి సత్యాగ్రహమును విజయవంతముగ నెరవేర్చినవారే హరిశ్చంద్ర, దశరథ, శిభి మొదలగు మహానుభావులు. పూర్వమునుండియు పరంపరగావచ్చు నీ సత్యాగ్రహము నిప్పుడు మహాత్ముడు చలింపక, ధైర్య స్థైర్యవిశ్వాసముతో ఆచరించి చూపుచున్నాడు.

శ్రీమద్భాగవతములో సత్యాగ్రహ ప్రస్తావనలో నారదుడు ధర్మరాజునకు ధర్మమును బోధించుచు ఈ ముప్పదిలక్షణములను విశదీకరించినాడు.

సత్యవ్రతము, దమము, తపము, శౌచము, ఓర్పు, సదసద్వివేకము, మనోనియమము, బహిరింద్రియ నిగ్రహము, అహింస, జపము, బ్రహ్మచర్యము, దానము, సమత్వబుద్ధి, సంతోషము, మార్దవము, మహాజనసేవ, కోరికలు మానుట, వ్యర్థక్రియలు విడుచుట, మితభాషిత్వము, ఆత్మాన్వేషణము, పరోపకారము, ప్రాణులందు దేవతాబుద్ధి, శ్రీమన్నారాయణ పదపద్మస్మరణ, కీర్తన, శ్రవణసేవార్చన, నమస్కారము, దాస్యము, ఆత్మసమర్పణము అనునవి.

ఈశ్వరుడు సత్య స్వరూపుడు. ఈ నవయుగమునందు ప్రకృతితో పరిశోధనలతోపాటు ఆధ్యాత్మిక విషయములుకూడ పరిశోధింపబడుచున్నవి. నేటి విద్యాధికులలో సత్యాన్వేషణమునకు కుతూహల మమితము. కాని వారు మూఢ విశ్వాసములతోను, ఆచారములతోను నిబద్ధమయియున్న పూర్వ పద్ధతులందు (మతము) ఉదాసీనులుగా నున్నారు. కావున ఈ యుగమునందు చిరంతన సిద్ధాంతములను చెప్పక సత్యమునే నిర్వచనముచేసి వీరిముందు బెట్టు టత్యంతావశ్యకము.

"దాదాపుగ నెడతెగక ఏబది సంవత్సరములనుండి సత్యమునకై సలుపబడిన తీవ్ర పరిశోధన మూలమున నామట్టుకు నేను 'దైవమే సత్యము, సత్యమే దైవము' అను పర్యవసానమునకు వచ్చితిని. ఇది నా నిర్ణయము - ఇట్లని నిరూపించగలన"ని మహాత్మా గాంధిగారు నుడివియున్నారు.

సత్యజీవులు సత్య నిరతులై సత్యముకొఱకై జీవించుట కుత్సాహపడుచుందురు. సత్యమే దైవమని వ్యక్తపరుచుటవలన దైవమునుగుఱించి సరియైన అభిప్రాయము బోధపడగలదు.

ఈ నవయుగమునందు భౌతిక విజ్ఞాన నిరతులగు విద్యావంతులకు సయితము, సత్యమును ఆదర్శముగ కనబరచుట మూలమున ఆస్తికభావము విస్తరించును. మరియు "అహింసా జీవనము పరిపక్వమగుటచే సత్యస్వరూపుని సంపూర్ణదర్శనము కాగలదని, పరిశోధనలవలన నిర్ణీతమయినద"నియు మహాత్ముడు వచించియున్నాడు.

భిన్నజాతుల పురోభివృద్ధికిని, మానవశ్రేయస్సుకును, ఈశ్వర సాక్షాత్కారమునకును పరమ సాధనము అహింసాతత్వమనియు మహాత్ముని సిద్ధాంతము. అహింసాగ్నియందు స్వార్థము భస్మమై హృదయము

పరిశుద్ధమగును. మానవులందరు పరస్పర ప్రేమయందు కట్టుబడి ఒకరి మేలుకొరకు మరియొకరు పాటుపడుటకు యత్నింతురు.

ప్రచండభయంకర శతాఘ్నులకు ఆహుతియగుచున్న అసంఖ్యాకుల రక్షణమంత్ర మిప్పుడ హింసామంత్రమే. నేడు మానవహృదయములో ఈర్ష్య, క్రోధము, క్రౌర్యము, అంధతమస్సేచిందులుద్రొక్కుచున్నవి. దీని నా మూలాగ్రముగా ఛేదించవలెనన్న, అహింసా ప్రేమతత్వములు పిక్కటిల్లవలయును. ప్రేమ ప్రవాహమువల్లనే నీ మురికి కాలువలు, పెంటపోగులు కొట్టుకొనిపోయి పరిశుభ్రవాతావరణము సమకూరును.

మహాత్ముడు ప్రేమోపాసకుడు. ఈతని ప్రథమశిష్యుడు వినోబాబావేగారు. సర్వవిధముల గురునికి తీసిపోని అంతరంగికశిష్యుడు. ఈతని నుడికారమునందుగల వాత్సల్యము, ప్రేమ, సంతాపము, కార్యదీక్ష, అనురాగము మనకిప్పుడు చక్కగా బోధపరచినాడు. చల్లని వాక్యములతో ప్రజలకు కర్తవ్యమును దెలిపి వారి హృదయములను సానబెట్టినాడు. నాలుగురోజుల సంచారములోనే ప్రజల భక్త్యాదరములకు పాత్రుడైనాడు. ఇప్పుడు చెరసారలోనున్నాడు.

మహాత్ముని ప్రథమ సత్యాగ్రహి



శ్రీ వినోబా బావే

దసరా సంచిక

● ప్రశంసలు ● విమర్శనలు

స్థానికసంస్థలు స్త్రీలకే వుండాలి

మీ దసరాసంచికలో "స్థానికసంస్థలు స్త్రీలకే వుండాలి" అని శ్రీమతి దుర్గాబాయమ్మ వ్రాసిన వ్యాసముచూచి సంతోషించినాను. అది వాస్తవముగా చాల ఆనందప్రదంగా వుంటుంది. ఇంటిలో ఒక పురుషుడు ఒక స్త్రీ యిద్దరిమనస్సు లతుక్కుపోయి సంసారశకటం చక్కగా నడిచినట్టే, పురపాలకాది వ్యవహారములుగూడా వ్యాసకర్త సూచించినట్లు 'కమీషనర్ స్త్రీ అయితే, చెయిర్మేన్ పురుషుడు' అయితే చాలా శుభదాయికముగానే వుంటుంది. వారు అట్టిపదవులుకోరి ముందుకువచ్చి పట్టుదలగా పురుషుల సహకారంతో పనిచేయడంగూడా గొప్పవిషయమే. ఎట్టిపురుషుడైనను నిరాకరించడని నావుద్దేశ్యము.

దరిద్రనారాయణ నిశ్చలంగా మన దేశంపై తాండవమాడుతూంటే దాన్ని మూలంటనేకి సర్వమానవ సౌభ్రాతృత్వము, సమానత్వము, నేటిమన దైనిక సమస్యలను (Daily Problems) పరిష్కరించ బూనదలచుట యింకా చాలా వుత్తమమైన పనియని నాయుద్దేశ్యము. తర్వాత అచ్చముస్త్రీలే పరిపాలనా దక్షతను బూనుకొన్నను, మరెట్టి సంస్కరణలు జరిగినను అడుగువారుండరు.

—ఆనందం, నెల్లూరు.

'తనివిదీరనిదై యున్నది'

దేశసేవకు మూలము భాషాసేవ. భాషాసేవకు మార్గము పత్రికా నిర్వహణము. విశ్వమానవ కల్యాణమునకు స్త్రీ పురుషులిరువురు ముఖ్యులు. వర్తమానయుగ పరిణామమున స్త్రీ తేజమన్నికళలయందు క్రమక్రమాభివృద్ధినిఁ గాంచుచున్నది. దీనికి వీరవిజయకేసరి యనుంగు కూతురుట్టియగు 'గృహలక్ష్మి'యే మార్గదర్శిని. విక్రమదసరా పత్రములను దిలకించితిమి. ప్రతిపత్రము గృహలక్ష్మి మతల్లుల కలంకారప్రదమైయుండె. క్రొత్తదనము, గంభీరభావపూరితము, వాఙ్మయవిలాసము సర్వము చూచుకొలఁది నొక క్రొత్త సోయగము గూర్చుచుఁ దనివిఁ దీరనిదైయున్నది. ముఖ్యముగ 'ఇనుగంటి' వారి గృహలక్ష్మి కేసరి గృహలక్ష్మిలో విద్యావంది గృహలక్ష్ముల మేలుబంతియై తనరారుచున్నది. 'కవికలహంసి' గారి 'మన కర్తవ్యము' స్త్రీ పురుషుల కొరవడి చూపునదియైయుండె. శ్రీ వేంకటరంగమ్మ గారి 'ఆంధ్రమాత' పద్యగానలహరి మనోహరము. శ్రీ రుక్మిణీబాయి గారి 'విద్యాస్వరూపము' ఆకర్షణీయము. నిర్మాణకార్యక్రమ విధానము ప్రధానాంశము. ఆదర్శభావ ప్రకటనము ప్రశంసార్హము.

'గృహలక్ష్మి' కేసరి గృహలక్ష్మి. గృహలక్ష్మిలోక విజ్ఞాన మార్గదర్శినియై శ్రీ పరాత్పరునికృపావిశేషమునఁ జిరాయురున్నతుల వర్థిల్లుగాతమని మా యాశయ ప్రకటనము.

—స్నేహలతాకవితాసంఘ సభ్యులు, కొల్లాపురం.

సజీవమైన వాఙ్మయం కావాలి

కవిత్వమున్నదికాని - నిర్మాణంలేదు

(గతసంచికలోని 'రోహిణి' గారి వ్యాసముపై విమర్శ)

"గృహలక్ష్మి"లో ప్రకటింపబడుతూవున్న చిన్నచిన్న శీర్షికలున్నాయే ఆంధ్రుల ఉత్సాహాన్ని రెచ్చగొట్టడమే కాకుండా కొంతవరకు మెదడుకు చురుకుతనాన్నికూడా కలిగిస్తున్నాయని ఒప్పుకోక తప్పదు. అందుకు గృహలక్ష్మి సంపాదకులను నేను అభినందిస్తున్నాను. "నేడు ప్రాచీన వాఙ్మయానికి పై చేయి కాగలిగినది లేకవాటితో తులతూగేదిగానిలేక కొంత యేమీ చెప్పుకోలేకపోతున్నాము" అన్నారు 'రోహిణి' గారి వ్రాతలో. ప్రాచీనవాఙ్మయము అభివృద్ధిపొందటానికి అప్పటి అండవేరు. ఇప్పటి అండవేరు. అయినా యీ నాటికైనా వ్రాసేవాళ్లలో ఉత్సాహం చావలేదు. నన్నయ భారతం తెనిగించేడంటే రాజరాజనరేంద్రుడు పూనుకున్నాడు గనుక. నన్నయ, తిక్కన, ఎర్రాప్రగడ మొదలైనవాళ్లు వ్రాతను అభివృద్ధిచేశారు. అనగా వాఙ్మయాన్ని విజృంభింపజేశారు. ఎందుకు చేశారంటే, చెయ్యమని ప్రోత్సహించే అంతశ్శక్తి, (Emotion) వాళ్లలో వుండేది. ఇప్పుడు మనవాళ్లలో లేదని నేను అనటంలేదు. కాని యిప్పటికి అప్పటికి తేడా యేమిటంటే అప్పుడు మన వాఙ్మయ సృష్టికర్తలకు ప్రభుత్వపు ఆదరణ ఎక్కువగా వుండేది. అందుకనే వాళ్లు, భారతపురాణేతిహాసములు మొదలైనవి తెనిగించటానికి కారణాలైనాయి. రాజులకొలువులో, ఉదా: కృష్ణదేవరాయలకాలంలో అష్టదిగ్గజాలు వుండేవాళ్లు. విక్రమార్కుడికాలంలో నవరత్నాలు వుండేవాళ్లు. కాని నేడో! మన ప్రభువు మనకు ఆరువేల మైళ్లదూరంలో వున్నాడు. వారి బాష వేరు. మనబాష వేరు. భక్తచింతామణిలో వనురాయకవి చెప్పినట్లు "వేషభాషాచేష్టలు వెక్కులు" అన్నట్లు వుంది.

"రోహిణి" గారేమంటున్నారంటే నిర్మాణశక్తి మనలో ప్రస్తుతం లేదని. కాని దానితో నేను యేకీభవించను. కట్టమంచి రామలింగారెడ్డిగారు ప్రాచీనకవులను విమర్శిస్తూ "కవితత్వ విమర్శనము" వ్రాయలేదూ? ఉన్నది; నిర్మాణశక్తి మనలోనూ ఉంది. పూర్తిగా చావలేదు. ఆరిపోయే దీపంలాగ కునుకుతూ, కునుకుతూవుంది. దీపానికి చమురుచేర్చి నిలబెట్టునట్లు నిర్మాణశక్తి వున్నవాళ్లను పైకి తీసుకువచ్చే ఆనకర్త, పూనకర్తలు మాత్రం ఎవళ్లూ లేకుండావున్నారు.

పూర్వపు స్త్రీలు, మొల్ల, గార్గేయి, తరిగొండ వేంకమాంబ మొదలైనవాళ్లు వాఙ్మయాభివృద్ధిచేశారనీ, అట్లా చేసేవాళ్లువున్నారుగాని నిర్మాణం లేదంటున్నారు. అనగా - వాళ్లుసృష్టించిన, అనగా రచించిన శాశ్వతమైన గ్రంథాలు బయటికి రావటంలేదని వారి భావమనుకుంటాను. అవును ఆమాటనిజమే. మొల్ల, గార్గేయి కాలములో మహమ్మదీయ దండయాత్రలులేవు. స్త్రీలకు స్వేచ్ఛవుండేది. చక్కగా పురుషులతో సమానంగా చదువుకుని గొప్పగొప్ప రచనలుచేసేవారు. తురక దండయాత్రలు రావటంతోనే దాస్యభావం భామామణులకు శనిలాగ దాపురించింది. స్త్రీలను వంటయింటి బానిసలుగా చేశారు. కాని, నేడు యుగం మారింది. చదువుకుంటూవున్న స్త్రీలసంఖ్య అభివృద్ధి అవుతూవుంది. అనేకమంది పెద్ద చదువులు చదివి పెద్ద ఉద్యోగాలుచేస్తూ, చివరకు మంత్రిత్వాలు-పురపాలక, జిల్లాబోర్డు సంఘాలకు అధ్యక్షులై రాచకార్యాలనుకూడా చక్కదిద్దుతూ వున్నవాళ్లను మనము చూస్తూనేవున్నాము. ఈ అభివృద్ధికి మనం గర్వించవలసిందే.

స్త్రీలు వాఙ్మయాభివృద్ధి చేయగలరని మనకు పూర్వ నిదర్శనాలు, వాళ్ళు చేసిన సేవా వుంది. నేడుకూడా ఆపేరు నిలబెట్టుకోవాలంటున్నారు "రోహిణి" గారు. ఈ హెచ్చరిక చాలా బాగావుంది. లేవండి, బహుపరాక్ అన్నట్లువుంది. అందుకు సోదరి "గృహలక్ష్మి" సహాయం చేస్తుంది. కనుక ఆంధ్రస్త్రీలు యీ అవకాశం పోగొట్టుకొనక-యీ హెచ్చరికను పెడ చెవినిబెట్టక, సజీవమైన నిర్మాణం స్త్రీలలో లేదనే అపవాదు తొలగించుకుంటారని ఆంధ్ర సోదరీమణులను వేడుకుంటున్నాను.

—కొండేపూడి సుబ్బారావు బి: ఎ., బి. ఇ. డి., రాజమండ్రి.

"సర్వనాశనమా! సర్వోదయమా!!"

"గృహలక్ష్మి దసరా సంచిక"లో పై శీర్షికను ప్రకటితమైన శ్రీమతి కె. సుగుణ మణిగారి వ్యాసం మహా గంభీరంగా ఉంది. వ్యాసం చదువుతూంటే ఆశానైరాశ్యములు, భయోత్సాహములు, విషాదానందములు పర్యాయేణ పాఠకుల హృదయంలో జనింపకతప్పదు. అనంతము, అచింత్యము, దుర్గ్రాహ్యమునైన విశ్వచిత్రాన్ని భావోన్నత్యానికి యుక్తమైన భాషా పటుత్వంతో, మృదుల కలా కౌశలంతో ఇంపుగా, సూక్ష్మంగా పాఠకుల హృదయాలకు హత్తుకొనేటట్టు చిత్రించేరు. ఇటు ప్రాచీన ఆధ్యాత్మిక విజ్ఞానాన్ని, అటు ఆధునిక భౌతిక విజ్ఞానాన్ని నిష్పక్షపాతంగా సమీక్షించి వాటి సామరస్యం వాంఛించేరు. కాని, అందులో రెండు విషయాలు విపులీకరించవలసిన అవసరం గోచరించింది.

"ఈ విశ్వం శాస్త్రజ్ఞులు చెప్పిన భౌతిక నియమాలకు లోనయిపోయి 'సర్వనాశన'మైపోతుంటే - ఆధ్యాత్మికశక్తి - ఒకటి వుండి తన ప్రియసృష్టిని (మానవుని) స్వస్థలానికి చేరుస్తుందని విశ్వసించడానికి వీలేమైనా ఉందా?" అన్నారు. మానవుడు ఆధ్యాత్మిక శక్తియొక్క 'ప్రియసృష్టి'అని మనమెందుకూహించాలి? అదే మానవునిలోనున్న అహంకారము. మానవజాతి మాయమైపోతే - మచ్చునకొక్కడైనా లేకుండా మానవులందరు విశ్వగర్భంలో లీనమైపోతే - జగత్కార్యకలాపం నిర్విఘ్నంగా యథావిధి కొనసాగలేదా? దానికెట్టి అభ్యంతరములేదని ఆధ్యాత్మిక భౌతిక విజ్ఞానాలు రెండున్ను సూచిస్తున్నాయి.

ఆధ్యాత్మికంగా యోచిస్తే భౌతిక శరీరంనుండి విముక్తినొంది తిరిగి జన్మింపకుండుటే జీవుని పరమావధి. ఐహిక జీవనమే ఒక విపరీతయాతన. సంచిత కర్మానుసారంగా జన్మమొందడము, జీవయాత్రలో చేసిన పాపపుణ్యాలచే, అజ్ఞానంచే అరిషడ్వర్గాలకు లోనవడము, తత్ఫలంగా దుఃఖభాజనమైన జీవితం గడుపుతూ అధఃపతన మొందడము - ఇవి జీవుని నిత్యకృత్యాలు. ఇట్టి దురవస్థ వారించుటకే ప్రాచీనులెన్నో మార్గాలు నియమించేరు; దైవారాధన, అహింస, చిత్తశుద్ధి, భూతదయ మొదలగునవి. భూతలం ఒక నాట్యరంగమని, జీవుడొక నటకుడని, ఈ వేషాలు ముగించి నాట్యరంగనుండి విరమించుటే మోక్షమని సూక్ష్మంగా సూచించేరు. కాబట్టి, మానవజాతి నశించిన పక్షమందు, నాట్యశాల భగ్నమయిన పక్షమందు జీవికి యాతన ఉండనే ఉండదు. అదే వాంఛనీయము. ఆ పరిస్థితి బ్రహ్మానంద దాయకమే! భయానికి, చింతకి కారణం గాదు!!

ఇక, భౌతిక విజ్ఞానరీత్యా విమర్శిస్తే: భూగోళంపుట్టి సుమారు 200 కోట్ల సంవత్సరాలయేయని విజ్ఞానులు నిర్ణయించేరు. భూమితో మానవులురాలేదు. ప్రచండ వాయుగోళంగానున్న భూమి చల్లవారి, ద్రవించి, పైపొర ఘనీభవించిన ఎంతోకాలానకి మానవు డుదయించేడు. 'మానవుడు' అనుపేరు వహించుటకు తగిన జీవులుపుట్టి 50,000 ఏండ్లకన్న ఎక్కువకాలేదని భూతత్త్వజ్ఞులు నిర్ణయించేరు. మానవజాతి ప్రాయం జగత్కాలంలో ఒక లిప్తకన్న స్వల్పం. సూర్యుని చుట్టు తిరుగుతూన్న బుధ శుక్రాది గ్రహాలలో మన మెరిగిన జీవంవంటిజీవం కనుపించదు. అట్టి జీవమున్నట్లు సూచనలైనాలేవు. అపారములగు జగచ్ఛక్తుల మానవు డొక లెక్కలోనికిరాడు. ఎట్లో భూమిలోపుట్టేడు, జీవిస్తున్నాడు, మరొక ప్రళయం సంభవిస్తే లయమైపోతాడు. ఎన్నోకోట్ల ఏండ్లనుండి జగత్తు కాలానుకూలంగా పరిణామం చెందుతూంది; ముందెన్ని కోట్ల సంవత్సరాలు మనుతుందో ఊహించలేము. ఈ జగత్తు ఆద్యంత రహితము కాలమా సన్నమైనప్పుడు మానవజాతి నశించిపోతుంది. మరల జన్మించనూ వచ్చు! జగచ్ఛక్తుల కావిషయమై విచారంలేదు.

ఇక రెండవది : ‘‘పరమాణువు మొదలు బ్రహ్మాండంవరకు ప్రతీదికూడ ఒక నియమిత విధానంలో తిరుగాడుచు, మనుచు, మార్పు చెందుచున్నదని గ్రహించిన పాశ్చాత్యశాస్త్రజ్ఞులు వాటి శాసనకర్తను, రక్షకుని ఏల వప్పుకొనరాదు?’’ అన్నారు. ఈ భౌతికవిజ్ఞానులు ‘శాసనకర్త’, ‘రక్షకుడు’ అను నామములతో భగవంతుని ఒప్పుకొనక పోయినప్పటికిని ఆభావాన్ని ఆమోదిస్తున్నారు. విశ్వశక్తుల అమోఘ సామర్థ్యాన్ని అనంత వ్యాపకత్వాన్ని, ప్రత్యక్షంగా గుర్తించేరు. ప్రాచీన భారతీయులుకూడా ఏ దైవమును ఆరాధించినప్పుడైనా విశ్వశక్తి పరంగానే ధ్యానించేరు. ఏ స్తోత్రంచూచినా విశదమౌతుంది. శ్రీ లలితా సహస్ర నామావళిలో అనేక శక్తులను స్తుతించేరు. ‘విస్వరూపా’, ‘ఉన్మేష నిమిషోత్పన్న విపన్న భువనావళిః’ ‘అనేకకోటి బ్రహ్మాండ జననీ’, ‘ఇచ్ఛాశక్తి జ్ఞానశక్తి క్రియాశక్తి స్వరూపిణీ’, ‘దేశకాలా పరిచ్ఛిన్నా’, ‘విశ్వధారిణి’, ‘భవచక్రప్రవర్తిని’, ‘విశ్వభ్రమణకారిణి’ అని సంబోధించారే! అట్టి సర్వతో ముఖశక్తి ఏ ఒక్క స్వరూపంగల మానవునిలోగాని, తదితర జీవిలోగాని అంతర్భూతమై ఉండగలదు? అది దుస్సాధ్యమని, అసంభవమని మన ప్రాచీనయోగి పుంగవులు గ్రహించేరు. నిత్య వ్యవహారం నిరాటంకంగా, సాఫుగా సాగిపోడానికని కొన్ని శక్తులకు నామకరణంచేసేరు - అగ్ని, వరుణుడు, వాయువు మొదలగునవి - వాటిని భక్తితో కొలువమన్నారు. రూపరహితమైన భగవంతుని ఆరాధించుట కష్టమైనపని; నమ్మకం కలుగదు. అందుకని విగ్రహాలు సృష్టించి దేవాలయాలలో స్థాపించేరు. ఇవి నిత్య వ్యవహారంకోసమేగాని అంతకు మించికాదు. ఆ విగ్రహాలకు పూజచేసినప్పుడు విశ్వశక్తులనే స్మరిస్తూ, వాటి ఔన్నత్యాన్నే కొనియాడేరు.

నేటి భౌతికవిజ్ఞానులు ఆ మార్గమే అవలంబిస్తున్నారు. అనంతాకాశమందు అసంఖ్యాక గోళాలు నియమిత మార్గాలలో అనాదిగాచరిస్తున్నాయి; గతులు తప్పడంలేదు. నక్షత్రాలు అమితంగా తేజోష్ణాలు ప్రసరిస్తూ కృశిస్తున్నాయి. ఈ శక్తి శూన్యాకాశంలో యానంచేస్తూంది. యుగాల తరబడి ప్రయాణంచేయగలదు. విశ్వంలో ద్రవ్యం నశించి శక్తి జనిస్తూంది; శక్తినశించి ద్రవ్యం జనిస్తూంది. నిజమే. కాని ‘నాశన’ మన్నపదానికి తావులేదేమో! ఏమంటే ద్రవ్యం, శక్తి ఒకే పదార్థంయొక్క వికారాలని స్పష్టమయింది. విశ్వంలో ద్రవ్యభాగం క్షీణిస్తే శక్తిభాగం పెరిగింది; శక్తి పరిమాణంతగ్గుతే ద్రవ్యపరిమాణం అధికమయింది. రూపాంతరమేకాని నాశనంలేదు. కాబట్టి జగత్తులో ఎప్పుడూ ‘సర్వోదయమే’. ఈ మహత్తర విషయం గ్రహించేరు భౌతిక విజ్ఞానులు. జగచ్ఛక్తుల మహాత్మ్యం వారికి బుద్ధి గోచరమైంది. ఇక, నామం విషయమై తగవు అనవసరం. ద్వైతాద్వైత విశిష్టాద్వైతాది మత భావములు పెట్టుకొని వాదులాడ నక్కరలేదు. ఏ విజ్ఞానానికైనా భర్తృహరి ప్రార్థనశ్లోకం వర్తిస్తుంది.

దిక్కాలాద్యన వచ్ఛిన్నానంత చిన్మాత్ర మూర్తయే ।
స్వానుభూత్యేక మానాయ నమశ్శాంతాయతేజసే ॥

అయితే, ఒక్కమానవుని పరంగా యోచించినప్పుడే ‘సర్వనాశన’ భయం కలుగుతుంది. ఆత్మ అవినాశినిగదా! అభయం అనవసరం.

—‘వసంత’, విజయనగరం.

చారుదత్తకవి భాసుడు—శూద్రకుడు కాదు

1940 అక్టోబరు ‘గృహలక్ష్మి’లో ‘చారుదత్త’ అను నా వ్యాసప్రారంభమునందు (పరిచయము) చారుదత్త వ్రాసినవాఁడు శూద్రకుఁడని ప్రకటింపబడినది. అది పొరపాటు—

చారుదత్త వ్రాసినవాఁడు భాసుఁడు. శూద్రకుఁడు కాదు. శూద్రకుఁడు మృచ్ఛకటిక వ్రాసినవాఁడు. కథ ‘అమరావతి’లో జరుగలేదు, ‘ఉజ్జయిని’లో జరిగినది.

ఇఁక, చారుదత్త నాల్గు అంకములు. చారుదత్తా - మృచ్ఛకటికలలోని శ్లోకములును, ప్రసంగములును ఒకే పోలికలో నున్నను, కొలఁదిపాటి మార్పులతో నున్నవి. మృచ్ఛకటికలో నందందు న్యూనాతిరిక్తము ఉన్నది. ఈ రెంటిలోని కథావస్తువు ఒక్కటయ్యును చారుదత్తలో మృచ్ఛకటికాది వృత్తాంతములు లేవు.

చారుదత్తలోని పాత్రలు:—'నాయకః, గణికా, చేటీ, చేటః, విదూషకః,' అని వ్యవహరింపఁబడినవి. విట, శకారులు రెంట సమమే. మృచ్ఛకటికలోని దొంగ శర్విలకుఁడు. చారుదత్తలో సజ్జలకుఁడు.

శ్లోకాదులు మచ్చుకు—

నాయకః— (దీర్ఘం నిశ్వస్య) భోఃదారి............

"యాసాం బలిర్భవతి మద్గృహదేహలీనాం హంసైశ్చసారసగణైశ్చ విభక్త పుష్పః
తాస్వేవ పూర్వబలిరూఢయవాంకురాసు బీజాంజలిః పతతికీటముఖావలీఢః."

చారుదత్త, అం. ౧, శ్లో. ౨.

చారుదత్తః— (ఊర్ధ్వమవలోక్య సనిర్వేదం నిశ్వస్య)—

"యాసాంబలి స్సపది మద్గృహదేహలీనాం హంసైశ్చ సారసగణైశ్చ విలుప్త పూర్వః
తాస్వేవ సంప్రతి విరూఢ తృణాంకురాసు బీజాంజలిః పతతికీట ముఖావ లీఢః."

మృచ్ఛ. అం. ౧, శ్లో. ౯.

విటః— వసంతసేనే!

కింత్వం భయేన పరివర్తిత సౌకుమార్యా వృత్తోపదేశవిశదా చరణౌక్షిపన్తీ
ఉద్విగ్న చంచలకటాక్ష నివిష్ట దృష్టి ర్వ్యాఘ్రానుసారచకితా హరిణీవయాసి."

చారు. అం. ౧, శ్లో. ౯.

విటః— వసంతసేనే, తిష్ఠ తిష్ఠ.

"కింత్వం భయేన పరివర్తిత సౌకుమార్యా నృత్యప్రయోగ విశదౌచరణౌక్షిపన్తీ
ఉద్విగ్న చంచలకటాక్ష విసృష్ట దృష్టి ర్వ్యాధానుసారచకితా హరిణీవయాసి."

మృచ్ఛ. అం. ౧, శ్లో. ౧౭.

సజ్జలకః:—......................

"భోః! వృక్షవాటికా పక్షద్వారే సంధిం ఛిత్వా ప్రవిష్టోఽస్మి యావదిదా
నీం చతుః శాలముపసర్పామి (సనిర్వేదం విచిన్త్య) భోః........................"

చారు. అం. 3.

శర్విలకః—

"........................ వృక్షవాటికాపరిసరే సంధిం కృత్వా
ప్రవిష్టోఽస్మి మధ్యమకమ్ తద్యావది దానీం చతుఃశాలకమపి దూషయామి భోః,........"

మృచ్ఛ. అం. 3.

ఇప్పటికింతే—మృచ్ఛకటికకు ముందు చారుదత్త కలదని తెలియుటకే చారుదత్త అనువదించితి. చారుదత్తా మృచ్ఛకటికల వ్యత్యాసాదులగూర్చిన విపులవ్యాసము ముమ్ముందు ప్రకటింతును.

—స్థానాపతి రుక్మిణమ్మ, విశాఖపట్నం.

★ రాజమకుటం

రచయిత:
శ్రీ గోవింద వల్లభ పంతు.

అనువాదకర్త:
శ్రీ పురాణం కుమారరాఘవశాస్త్రి

పాత్రలు

1.	విక్రమసింహుడు	...	మేవాడ్ మహారాణా
2.	ఉదయసింహుడు	...	విక్రముని తమ్ముడు
3.	వనవీరుడు	...	శీతలసేని పుత్రుడు
4.	కర్మచందు	...	ప్రధానమంత్రి (వృద్ధుడు)
5.	జయసింగు	...	కర్మచందు పుత్రుడు
6.	రణజిత్తు	...	ఒక లోభి సర్దారు [సిపాయి
7.	బహుదూరుసింగు	...	పన్నాభర్త, దక్షిణహస్తసూన్యుడు,
8.	చందన్	...	పన్నాపుత్రుడు
9.	ఈశకర్ణుడు	...	దూంగరపురపు రాజు
10.	ఆశాశాహుడు	...	కమల్‌మీర్ దుర్గాధిపతి
11.	ఛందావత్	...	ఒక సర్దారు
12.	ఈశకర్ణుని సేనాపతి	...	
13.	బారి	...	
14.	యోగి	...	
15.	పన్నా	...	ఉదయసింహుని దాది
16.	శీతలసేని	...	వనవీరుని తల్లి

ప్రథమాంకము

౧. దృశ్యము

[చిత్తూరు మహారాణా విక్రమసింహుని విలాసభవనం. మేజామీద సురాపాత్ర ఉంటుంది. విక్రమసింహుడు దుఃఖసూచకమైన ముఖంతో ఎడమ చేయిపమీద అరచేయి మోపి నిలబడి ఉంటాడు.]

విక్రమ:- మానవజీవితము క్షణికం. (ఉత్తేజితుడై) నా సుఖేచ్ఛలు ఈ జన్మలోనే ఎందుకు ఫలించవు? మనస్సులో చింతామాలిన్యమెందుకు పోషించుతున్నాను?

[రణజిత్ ప్రవేశిస్తాడు]

రణ :- ఆ మాలిన్యాన్ని దీనిలో కడిగివేయండి మహాప్రభూ! (సురాపాత్ర ఎత్తి విక్రముని కందిస్తాడు)

విక్రమ :- అది సురాపాత్ర! రణజిత్, ఇటు తే. సర్దార్లందరిలో నీవే నామేలు కోరుతూన్నవాడివి. పానీయము లన్నింటిలో ఇదే ఎంతో ఉపయోగకరమైనది. క్షణిక జీవితమా! ఇక నీ విచారాల్ని మరచిపో. ప్రాపంచిక సుఖభోగాల్ని ఎంతవెలకైనా కొని తీరుతాను. (సురాపాత్ర అందుకుని తాగుతాడు)

దుఃఖిని :- (తెరలో) రక్షించండి, రక్షించండి.

విక్రమ : ఇప్పుడేమి రక్షణ! ఇప్పుడు విక్రముడు సురాపానమత్తుడు. ఇప్పుడేమీ లాభంలేదు. మరొకసారి నేను ప్రశాంతంగా ఉన్నప్పుడు రా. లేదా, వెళ్ళిపో. వెళ్ళి ఆ గుంపులో చేరు - విక్రముని చేత పీడింపబడి, అతన్ని రాజ్యభ్రష్టుణ్ణి చేయాలని చూస్తోన్న వాళ్ళగుంపులో...

రణ :- (కత్తి పెరికి, లక్ష్యము కల్పించుకుని) జాగ్రత! నీవు దేవేంద్రుడివైనా సరే, మా విక్రమునిమీద ఈగ వాలనీకుండా ఇక్కడ ఈ రణజిత్ ఉన్నాడు తెలుసునా?

విక్రమ :- భేష్. నీవిక్కడే ఉన్నావు కదూ, రణజిత్!

రణ :- చిత్తం, రణజిత్ తమ సేవకుడే.

విక్రమ :- అయితే ఏమీ భయం లేదన్నమాట.

రణ :- నా బొందిలో ప్రాణముండగా ఏమీలేదు.

విక్రమ :- ఏదీ మరొకసారి పాత్ర నింపిఇవ్వు; తాగేస్తాను. ఇప్పుడేమీ భయం లేదుకదూ! (రణజిత్ పాత్ర నింపి విక్రముని కిస్తాడు)

[విక్రముడు తాగుతాడు. దుఃఖిని తన ఇద్దరు బిడ్డల్ని ఎత్తుకుని ప్రవేశిస్తుంది]

దుఃఖిని :- రక్షించండి, రక్షించండి. (పిల్లల్ని నేలమీద దింపుతుంది)

విక్రమ :- ఎవరది?

దుఃఖిని :- దుఃఖపీడిత, విపత్తాడిత.

విక్రమ :- అభాగినీ! ఎందుకీ వివాదస్వరం తెచ్చావు నా మధురగాన ప్రపంచంలోకి?

దుఃఖిని :- చిత్తోడు కులభూషణా! ఇదా వింటున్నాను తమ నోటివెంట? సదా తమ వంశము మావంటి దీనుల ఆర్తికి చెవియొగ్గేది.

విక్రమ :- నేనుమాత్రం ఏమీ వినను. ఈ వంశమునందిక మీ సుఖగీతికానాదం మోగదు. అట్టే వాగితివా, తెలుసునా? - నా యీ ఉత్సవగీతాన్ని తారామండలమువరకూ వ్యాపింపచేసి అందులో నీయేడుపు అంతర్లీనము చేస్తాను.

దుఃఖిని :- బాగా చెప్పారు. మహారాణా! దేశంలో ప్రతిమూలా కరువు వ్యాపించి ఉంది. ప్రజలు ఆకలి మంటతో విలవిల కొట్టుకుని చచ్చిపోతున్నారు.

విక్రమ :- చావనీ. వీళ్లపంటలు నేనేమన్నా కోసేసుకున్నానా? నేనేమి మేఘాధిపతినా?

దుఃఖిని:-రాజా! నేను బిచ్చమెత్తుకుని జీవించేదాన్ని. అక్రమంగా తమ ఉద్యోగులు నా పాక దోచుకుని, ఒక్క మట్టిపాత్రకూడా మిగల్చకుండా ఎత్తుకుపోయారు. ఏంచేయను?

రణ:-ఏదైనా పాడుపడ్డ దేవాలయంలోకి వెళ్లి నీ భగ్నభాగ్యంకోసం దీపారాధన చేసుకో; వెళ్లు. వెళ్లిక్కడినుంచి—

దుఃఖిని:-నువ్వు రాజుగారి కపటమిత్రుడివి. నువ్వే ఆయన్ను చెడుమార్గానికి తిప్పుతున్నావు. పట్టాభిషేక సమయమప్పుడు విక్రమసింహ మహారాణా ఈలాగునలేరు. నేను రాణాముందు న్యాయభిక్షుకురాల్ని (ఒడి పట్టుతుంది)

విక్రమ:-పో, పో, వెళ్లిపో—ఇదే నా న్యాయం. వెళ్లగొట్టవోయి రణజిత్!

[రణజిత్ జబర్దస్తీగా దుఃఖినిని సమీపిస్తాడు. అతని హంగామా చూచి ఆమె బిడ్డలు ఏడుస్తారు]

దుఃఖిని:-ఇదేనా మహారాణా న్యాయం? సంగ్రామసింహునితోనే చిత్తోడు కులగౌరవము సమాప్తమయిందా? మేవాడ్ మిత్రుడంతరించాడా!

విక్రమ:-ఎవర్రా అక్కడ? ఈ దౌర్భాగ్యురాలిని వెళ్లగొట్టండి. (ద్వారపాలకుడు వస్తాడు. అతడూ రణజిత్తు - ఇద్దరూ కలిసి ఆమెను, ఆమె బిడ్డల్ని గెంటివేస్తారు.) ఈ ప్రకారంగా ఇక నెవర్నీ లోపలకు రానీయవద్దు, తెలిసిందా?

ద్వార:-చిత్తము. (నిష్క్రమిస్తాడు)

విక్ర:-ఏమిటి! చాటున ఉండి, చిత్రపుబొమ్మలవలె చూస్తూ, నిశ్శబ్దంగా ఉండిపోయారు!

(నాట్యకత్తెలు నిల్చిఉన్న ఇరువంకలా చూస్తాడు. వాళ్లు ముందుకువచ్చి నాట్యమారంభిస్తారు.)

భైరవి - త్రితాళం.

ఈ వలపుల తమి కేమయ్యేదనో - నా తలపు లెపుడు నెరవేరెడినో,
నా మధు పాత్రిక నాథునికొరకే - అంచులాలుకగా నింపుకొంటినే;
ఆస్వాదింపగ సఖి! రాడేమే! - ఇది ఎపుడో ఒలికి పోవునేమో.

ఏమని వనమాలినిదూరి, ఏమి ప్రయోజనమి పుడు,
ఇంతగ అవమతి చేసినవాని, అంతుచూడనా ఎపుడో,
నా మొల నూలున కట్టకపోవుదునో.

సుందర శ్యామ స్వరూపము చూపీ,
తొందరగా వచ్చెదనని పలికీ,
ఎందుకు రాడే చెలి! ఇప్పటికీ
దుస్సహ మీ మధుర - బాధ యెదలో.

(తెరలో లాఠీకర్రల చప్పుడు. నాట్యకత్తెలు భయపడి, పాట ఆపివేసి పారిపోతారు)

ఒకడు :-(తెరలో) ఎందుకు పోనియ్యవు ?

రెండవవాడు :-(తెరలో) రాజు మా రాజు. తోవ యివ్వు.

మూడవవాడు :-(తెరలో) చూస్తారేం! లాఠీతీసి చితకకొట్టండి.

(నలుగురు ప్రజలు ప్రవేశిస్తారు)

మొదటివాడు :-ఈ కరువునుంచి, దుష్టవ్యాధులనుంచి, మమ్మల్ని రక్షించండి.

రెండవవాడు :-మీ రాజ్యంలో విధింపబడ్డ హెచ్చు పన్నులను తగ్గించండి.

మూడవవాడు :-మోసగాళ్లు, దొంగలు, దోపిడిగాళ్లు, తమ ఉద్యోగులు-వీళ్ళబాధలు పడలేకున్నాం, అభయ మివ్వండి.

నలుగురు :-అన్యాయాల్ని అణచివేయండి. న్యాయపాలన చేయండి.

రణజిత్తు :-న్యాయమేమిటి? ఇది న్యాయాలయ మనుకున్నారా ?

మొదటివాడు :-రణజిత్! నీవు మాట్లాడకు. నీ అబద్ధాలు మమ్మల్ని శాంతపరచలేవు.

రెండవవాడు :-న్యాయాలయ మంటున్నావేమిటి? చెప్పు, అది ఎక్కడుందేమిటి ?

విక్రముడు :-నా మనస్సిప్పుడు అమృతగాన తరంగాలమీద స్వర్గవిహారం చేస్తున్నది. ఏమిటిది, మీరు వచ్చి నరకద్వారం తెరచారు! ఛండాలులు! వెళ్లండి ఇక్కడినించి—

రణజిత్తు :-ఔను. వెళ్లండి, వెళ్లండి. అలసి ఉన్న మహారాణాగారి మనస్సు విశ్రాంతి పొందవలసిన సమయ మిది. మీరు వచ్చి కోలాహలం చేయటానికి కాదు. (వాళ్లను నెట్టబోతాడు)

మూడవవాడు :-జాగ్రత! రణజిత్, మధ్యన నీవు కల్పించుకురాకు.

విక్రముడు :-ఎవర్రా అక్కడ! ద్వారపాలకుడు లేడూ ?

నాల్గవవాడు :-మమ్మల్ని లోపలికి రానీకుండ అడ్డగించినందుకు ద్వారపాలకుణ్ణి తగినట్టుగా శిక్షించి వచ్చాం

విక్రముడు :-(కత్తిపెరికి, క్రోధుడై) వచ్చి నన్ను హింసించాలని చూస్తున్నారా ? ఛండాలులు! మిమ్మల్ని ప్రాణాలతో విడిచిపెట్టను.

మొదటివాడు :-అందుకు మేమేమీ విచారపడము.

రెండవవాడు :-మేము కోరేదీ అదే. బ్రతికి ఉండి ఏమి సుఖపడుతున్నామని!

(రాణాముందు శిరస్సువంచి నిలబడతాడు. విక్రముడు కత్తియెత్తి కొట్టబోతుంటాడు. నలుగురు సర్దార్లతో సహా కర్మచందు ప్రవేశించి రాజుగారి హస్తాల్ని పట్టుకుంటాడు.)

కర్మచందు :-సావధానులు కండి మహారాజా! నిరసులు, నిరపరాధులు, ఆయుధరహితులు అయిన ఈ ప్రజల మీదనా తమ కరవాలము? వీరి నిష్కలుష రక్తంతో పదునుపెట్టి దాన్ని మళ్లీ ఎక్కడ ఉపయోగించుతారు ?

విక్రముడు :-ఎవరు ? ప్రధానామాత్యుడా? ఇది రాజసభ కాదు; నా విలాసభవనం. ఇక్కడ నా ఇచ్ఛ ప్రతిఘటించే అధికారం ఎవరికీలేదు. ఈ వధ్యులకు ప్రాణదండన విధించి తీరుతాను.

కర్మచందు :-అయితే తమ రాజసింహాసనము అచలమని భావించకండి - దాని కాధారములై వీరి భుజాలు ఉన్నవి. కాబట్టి ఆలోచించుకోండి. మీరు తమ కర్తవ్యాన్ని మరచినా నేను మరవను. నేను వీరిని రక్షిస్తాను. చంపనీయను.

విక్రముడు :నన్నిప్పుడు అడ్డగించినవాడు నా కత్తికి మొదటిబలి కాక తప్పదు.

కర్మచందు :-అయితే కానీయండి, కొట్టండి. తమ బాహువులలో శక్తి, తమ కరవాలానికి తీక్ష్ణత ఉన్నట్లయితే_ఇదిగో, ప్రతికేశమూ మేవాడి సేవయందే పలితమై ఉన్న ఈ వినతశీర్షము మరింత వినతము చేస్తున్నాను. (తల వంచుతాడు)

విక్రముడు :-సిద్ధముగానే ఉన్నాను. (కత్తి ఎత్తుతాడు) (జయసింహుడు ప్రవేశించి తండ్రిగారిని రక్షించేందుకు కత్తిపెరికి విక్రమునిపై దెబ్బ దీయబోతాడు)

జయసింహుడు :-జాగ్రత !

(ఇంతలో వనవీరుడు కత్తిదూసి ప్రవేశిస్తాడు. జయసింహుని కత్తివేటును తన కత్తిపై తీసుకుంటాడు)

వనవీరుడు :-జాగ్రత !

కర్మచందు (జయసింహుని కత్తి దింపాడు) విక్రముడు నాకు మిత్రుడు, సోదరుడు. ఆతనిమీద దెబ్బ తీయడానికి ముందు నాకత్తి పదును చూడవలసి ఉంటుంది.

కర్మచందు :-నాయనా ! ఏమిటిదీ ?

జయసింహుడు :-తండ్రిగారి పట్ల నేను నిర్వర్తింపవలసిన కర్తవ్యం మరేముంది?

కర్మచందు :-వద్దు, వద్దు. విక్రముడు నా ఒడిలో పెరిగాడు. అతడూ నాకు నీవంటివాడే. నామీద అతడు కత్తి యెత్తిన మాత్రాన ఏమయింది? నన్నతడు చంపలేదు. నీవది మరచిపో.

జయసింహుడు :-మరచిపోనా ? నాన్న గారూ ! మీ శివశివర్ని మరచి పొమ్మంటారు? ఎవరికి మరుపొస్తుంది. అటుచూడండి, ఆ ప్రజల దుర్దశ.

ప్రజలు :-శరణు, శరణు.

జయసింహుడు : వీరి యీ దశచూచి మేవాడ్ రాజ్యపు భవిష్యత్తును ఊహించండి. ప్రజ లెంతవరదాక శాంతి వహిస్తారు ?

ప్రజలు :-రక్షించండి, రక్షించండి.

జయసింహుడు :-[సర్దార్లతో] చూచారుకదా! రాణాగారి హృదయంలో ప్రధానమంత్రి పట్లనే ఇటువంటి ఆదరభావం ఉన్నప్పుడు మీమాట చెప్ప నక్కరలేదు. ఏమిటి మీ కోరిక? మేవాడ్ సింహాసనంమీద న్యాయ రహితుడైనరాజు ఉండటము మీ కిష్టమేనా?

సర్దార్లు :-సింహాసనము శూన్యముగా ఉండటమే మేలు.

జయసింహుడు :-[ప్రజలతో] మీ కోరికేమిటి ?

ప్రజలు :-మా కష్టాల్ని తొలగించండి.

జయసింహుడు :-విక్రమునివల్ల తొలగవు.

మొదటివాడు :-మరింకేదైనా ఉపాయం ?

ఒక సర్దారు :-మరొక ఉపాయం ఏముంది ? విక్రముని సింహాసనమునుండి తొలగించటమే.

జయసింహుడు :- ఔను. అదీ ఒక ఉపాయమే. పదండి, దాన్నిగురించి ఆలోచిద్దాం. [పోబోతాడు]

కర్మచందు :- నాయనా! ఏమిటది?

జయసింహుడు :- మిమ్మల్ని అవమానించినందుకు ప్రతీకారం.
పదండి. మేవాడ్ దేశ కళ్యాణాన్ని కోరేవారంతా పదండి. నేను మీకు సుఖమార్గాన్ని చూపిం చుతాను. [జయసింహునివెనుకను నలుగురు సర్దార్లు, నలుగులు ప్రజలు, కర్మచందుకూడావెళుతారు.]

వనవీరుడు :- నేనూ వస్తున్నాను. నా సోదరుడైన విక్రమునిపట్ల నీవేమి వైషమ్యము నెరపుతావో!
[నిష్క్రమిస్తాడు]

విక్రముడు :- అందరూ వెళ్ళిపోయారు. రణజిత్! నీవూ వెళ్ళవేం?

రణజిత్తు :- రణజిత్ ఎందుకు వెళుతాడు మహారాజా! వీడేమి తమ శత్రువా?

విక్రముడు :- కేవలం ఒక్క మిత్రుడివల్ల ఏమౌతుంది? రణజిత్! నీవూ వెళ్ళిపో. నేను సురాదేవిని సేవిస్తూ ఒంటరిగానే ఉంటాను ఈ భవనంలో. [ఆసనముపై కూచుని సురాపానం చేస్తాడు]

రణజిత్తు :- [తలపై చేయి ఉంచి కొంతసేపు ఆలోచన చేసినమీదట] ఔను. మీరు చెప్పింది బాగానే ఉంది. ఆ విద్రోహుల రహస్యాల్ని సంగ్రహించటానికైనా నేను వెళ్లవలసిందే. వెళుతున్నాను.
[నిష్క్రమిస్తాడు]

విక్రముడు :- వెళ్లిపో విక్రముడి కేమీ భయంలేదులే. సర్దార్లంతా విగ్రోహులైనారు; ప్రజలంతా విద్రోహులైనారు. ఇంకెవరేనా మిగిలి ఉన్నారా?

[శీతలసేని ప్రవేశిస్తుంది]

శీతలసేని :- ఆ.

విక్రముడు :- ఎవరు?

శీతలసేని :- వనవీరునిమాత, రాణి శీతలసేని.

విక్రముడు :- రాణి శీతలసేని! రాణీ! హ! హ్హ హ్హ హ్హ.

శీతలసేని :- ఏమిటా వ్యంగ్యహాసము? మహారాజా! మీ పినతండ్రి పృథ్వీరాజు భార్యనుకాదూ నేను?

విక్రముడు :- ఎందుకంత శ్రమపడి ఇలా వచ్చావు పాపం?

శీతలసేని :- యాచన కేమీకాదు. నాహక్కు పొందగోరి వచ్చాను.

విక్రముడు :- ఏమిటది?

శీతలసేని :- మీకు తెలుసును: మహారాణా సంగ్రామసింహుడు నాకూ, నా కుమారుడు వనవీరునికీ నియమితము చేసిపోయిన మాసికవృత్తి. మా కెంతకాలంనుంచీ లభించటము లేదో - ఎన్నిసార్లు అడిగి విఫలు రాలినైనానో.

విక్రముడు :- మాసికవృత్తి ఇవ్వకపోతే ఏమి ఆకలి మంటతో చచ్చిపోతున్నావా?

శీతలసేని :- చచ్చిపోవటంమాట అటుంచు. సావధానుడివై ఆలోచించు. నే నడగటం న్యాయంకాదా?

విక్రముడు :- అవచ్చు. కాని ప్రస్తుతం వెళ్లిపో. ఇప్పుడు బొక్కసంలో డబ్బులేదు. మరొకప్పుడు చూస్తా.

మహిళా సేవామండలి—మచిలీపట్నం

కుట్టు, నూలు వడకుట మొదలగు చేతిపనులు, గ్రంధాలయ పఠనాలయముల స్థాపనము వీరి యాశయములలో ముఖ్యములు. శ్రీ గాంధీజన్మ దినోత్సవ సందర్భమున ఒక లక్ష గజములకు పైగా నూలునువడికి మహాత్మునికి కానుకగా నర్పించిరి. గాంధీవారములో ఇండ్లకుపోయి ఖద్దరును విరివిగనమ్మిరి. అధ్యక్షురాలైన శ్రీమతి దుల్ల వెంకట రమణమ్మ గారు, కార్యదర్శిని శ్రీమతి మల్లాది వెంకట రమణమ్మగారు, కోశాధ్యక్షురాలు శ్రీమతి పోతరాజు సత్యవతమ్మ గారు ఇందుగలరు.

కుమారి జి. లక్ష్మీబాయి

ఏలూరు, బెజవాడ హరిజన సేవక సంఘము వారిచే నడపబడు బాలికావసతి గృహములలో స్కూలు ఫైనలు వరకు చదువుకొనినది. ప్రస్తుతము ఆంధ్రరాష్ట్ర హరిజనసేవక సంఘమువారి సహాయమున మద్రాసులోని ఇండియన్ మెడికల్ స్కూలులోజేరి చదువుచున్నది. ఇట్టి వైద్యపరీక్షకు చదువుటకు ఆంధ్ర హరిజనస్త్రీలలో నీమెయే ప్రధమరాలు.

గోపికానృత్యం

జంత్రవాద్యముల సంగీతశాఖ

నిర్వాహకురాలు: శ్రీమతి జగదేవి జమునాబాయిగారు.

★ పోతన ద్రౌపది ★

మూర్తీభవించిన మాతృహృదయమే
పోతన తీర్చి దిద్దిన ద్రౌపది

● శ్రీమతి శ్యామల ●

> స్త్రీ హృదయమున గల అమృత ప్రపూర్ణమైన కరుణరసమునకు, పవిత్ర ప్రేమకు, మాతృవాత్సల్యమునకు గల మహత్తర సౌందర్యమును ద్రౌపది పాత్రలో చిత్రించి, లోకమునకు వెల్లడించిన పోతన లేఖిని అత్యంతోదాత్తమైనది.

భారత యుద్ధాంతమున క్రోధావేశపరుడై, మైమరచి నిదురించుచున్న యుపపాండవుల, నర్ధరాత్రమున అశ్వత్థామ ఘోరముగ చిత్రవధ గావించెను. ద్రౌపది మత్స్యపురి నుండెను. ఈ ఘోరవార్త నామెకు దెల్పి యుపప్లావ్యంబున కామెను బిలువనంపిరి. ధర్మజుని సమీపించినంతనే శోకభరమున నామె మూర్ఛజెంది, కొంతవడికి దెలివివహించి, "అశ్వత్థామోద్దామరణకరణ స్మరణంబు, తన చిత్తంబు త్తలపెట్ట గోపంబు దీపింప"

క. "......గాఢనిద్రం, గూరిన సమయమున ముట్టుకొని నా సుతులం
గ్రూరత దెగటార్చెను బాపారంభుడు గురుతనూజు డక్రమలీలన్.

క. అది యాఁటని పెనుజిచ్చై మదిగాల్పదొడంగె దీని మాన్పనుపాయం
బుదలంప నొండులేదయ్య దయని ముట్టుకొని నామమడచుట దక్కన్.

క. వాయుసుతుబనిచి నేడటు సేయింపక తక్కితేని వినుమే
ప్రాయోపవేశముననీ కాయము పేక్షింతు........"

అని క్రోధపూరితముగ బల్కెను. శాంతివచనముల ధర్మజుడామె ననునయింప యత్నించును. ధర్మజువలని ప్రతీకారముసేయు తెరవు గన్పింపకపోవుటచే, క్రోధోద్రేకముల దక్క మరియొండెరుంగని భీమునికి, క్షత్రధర్మము పేరిట బురియెక్కించును. అశ్వత్థామవధకై భీముడు బయలుదేరును. పాండవులందరాతనికి దోడుగనేగి, అశ్వత్థామతో బోరి, వ్యాసుడవతరించి ఉభయులకు సంధిజేయ, విజయసూచకముగ అశ్వత్థామ శిరోరత్నముం గొని పాంచాలికడకేగుదురు. వైరుల నిర్జించి రాజ్యలక్ష్మి గొన్న యవ్వేళ "శోకసమయంబుగ జేయుట నీకర్హమే" అని భీముడామెను హెచ్చరించును. "అనిన గొండొక తెలివొందు నాననంబుతో", "నా మనమార దీనిగని నందము బొందితి నింతసాలు" నని యామెయు దృప్తిజెందును.
—ఇవి భారతములోని వివరములు.

ఈ ఘట్టమునే పోతన కొన్ని మార్పులగూర్చి, కడురసవంతమొనర్చి, స్త్రీ హృదయమందలి యుత్కృష్టతను, గడు మనోహరముగ జిత్రించినాడు.

"బాలురచావు కర్ణముల బడ్డకలంగి యలంగి యోరువం
జాలక భాష్పతోయకణజాలము చెక్కులరాలనేడ్చి పాం
చాలతనూజ నేలబడి జాలిబడం............"
గనున్న దృశ్యముతో నారంభించినాడు.

ఆమెను "గనియెత్తి మంజువాచాలత జూపుచుం, జికురజాలము దువ్వుచు", "ధరణీశాత్మజవీవు నీకు వగవన్ ధర్మంబె...మద్గాండీవ నిర్ముక్త భీకరబాణంబుల నేడు వాని శిరముం జండించి నేదెత్తు దచ్ఛిరముం ద్రొక్కి జలమ్ముల్లాడు మిచటన్" అని యామెకు మిక్కిలి యనురక్తుడౌ యర్జునుని ప్రక్క గూర్చుండబెట్టి యాతనిచే నామకూరట జెప్పించి, అశ్వద్ధామాన్వేషణ కాతని బయలువెడలదీసెను. పుత్రశోకమున గ్రుంకి కుములుచున్న స్త్రీ హృదిని, "నా కుమారుల జంపినవాని శిరముదెచ్చి యీకున్న నే చత్తు"నను ద్వేషపూరితమగు రాక్షసవాంఛకు దావీయక, వివశయై పడియుండినట్లు వర్ణించినాడు. అర్జునునివంటి రణరంగవిహారి, శస్త్రజీవికి, ఉద్రేకము గల్గి ప్రతిశిక్షజేయు వాంఛ యుదయించుట సహజమే. తన మనోవృత్తినిబట్టియే తన పత్నియు నుండునని దలచి, పుత్రఘాతియగు యశ్వద్ధామ శిరము ఖండించి తెచ్చిన నామె కోపము చల్లారి శోకమడగునని యెంచి, తనంత తానే బయలుదేరి వెడలును. అశ్వద్ధామ నోడించి, పట్టి, బంధించి శిబిరంబు కడకుం గొనిపోయి, ద్రౌపది కట్టెదుట నిల్పును.

అంతటి శోకభరమున నొడలెరుంగని స్థితియందుండియు, నెదుట గాన్పించు నాతడే తనపుత్రుల నతికౄరముగ నంతమొందించెనని యెరింగియుండియు, ద్వేషమునకుగాని యుద్రేకమునకుగాని ఆమె తావీయదు. నిజగౌరవమర్యాదల గుర్తెరింగిన మానినియగుట, బాలవధజనిత పరాఙ్ముఖుండైన గురుపుత్రుని గన్నంతనే లేచి ముందుగ మ్రొక్కినదట. ఆహా! ఎంతటి సౌశీల్యమో! నతాననుండైన గురుకుమారు నుద్దేశించి,

"పరగన్ మా మగవారలందఱును మున్ బాణప్రయోగోప సం
హరణాధ్యాయుధ విద్యలన్నియును ద్రోణాచార్యుచే నభ్యసిం
చిరి పుత్రాకృతి నున్న ద్రోణుడవు నీ చిత్తంబులో లేశముం
గరుణాసంగములేక శిష్యసుతులన్ ఖండింపగా బాడియే."

అని మున్ముందు తమకును ద్రోణాచార్యులకును గల బాంధవ్యము, అందుచే ద్రౌపదికిని గల సన్నిహిత, గురుశిష్యానుబంధము నుగ్గడించినది. మాయెడ మీ తండ్రిగారికి గల యభిమానమెంతటిదో నీవెఱుంగనిది కాదే. ఆ తండ్రి కుమారుడవే, నీవే, యిట్టి ఘాతుకకృత్యము నెట్లు నీ చేతులార జేయగల్గితివయ్యా! మీ తండ్రిగారినిబట్టియే నీ మంచిచెడుగు లాలోచింప నవసరములేదే. స్వతస్సిద్ధముగ "భూసురుడవు, బుద్ధి దయాభాసురుడవు, శుద్ధ వీరభట సందోహాగ్రేసరుడవు", "ఆసురకృత్యంబగు శిశుమారణము నీకు ధర్మమగునే తండ్రీ" అని యాతనికి నైజముగ నుండవలసిన యున్నతగుణముల బేర్కొని, అట్టి సత్కులప్రసూనుండై, విద్యాధికుడై యుండు తన ధర్మమును మరచి, రాక్షసత్వము వహించినందుల కెంతో వగచును. అంతటితో విడువక

ఉద్రేకంబునరారు శస్త్రధరులై యుద్ధావనిన్ లేరు కిం
చిద్ద్రోహంబును నీకు జేయరు బలోత్సేకంబుతో జీకటిన్
భద్రాకారుల చిన్నపాపల రణప్రౌఢ క్రియాహీనులన్
నిద్రాసక్తుల సంహరింప నకటా నీచేతులెట్లాడెనో.

అని వధింపబడిన యమాయకబాలుర నిస్సహాయస్థితి, లేతవయస్సు, నిరపరాధత బేర్కొని, యిసుమంతేనియు దోసములేనివారల నా విధి హింసింప మనసెట్లొప్పినదో, మానవత్వమేమాయెనో యని యాతని కరుణారసమున కంజలి పట్టినది.

గురుశిష్యబాంధవ్యము, తన కులమర్యాద, స్వధర్మము, ఎదుటివారి నిరపరాధత, వీని అన్నిటికిని తోడారీతిగ తన్ను గౌరవించి పలవించు ద్రౌపదిని దలచినంతనే అశ్వత్థామ హృదయమున సంక్షోభము జనింపక మానదు. శల్యముల బొడిచినను, ఖడ్గముచే జిత్రవధ నొనర్చినను శరీరమునకు బాధ గల్గింపవచ్చును గాని, మానసిక పరివర్తనము గలుగదు. ద్రోహికి పశ్చాత్తాపము గల్గించి, తాజేసినది మహాదుర్ణయమని యాతని చేతనే గ్రహింపజేసి, యాతనిమనసు నొవ్వజేయుటయందు బశుత్వములేదు సరికదా, ఉత్కృష్టమగు అహింసా సిద్ధాంతమునకు సాఫల్యము గల్గును. తడియారని కన్నులతో, మూర్తీభవించిన కరుణరసమో యన నొకతల్లి, తన పుత్రఘాతకునెదుట నిలువ, నారీతి గౌరవమొనసెడి వాక్యములతో నొవ్వబలుక, ఎదుటనిలిచిన యపరాధి హృదయమెంత పాషాణమైనను చలింపకుండునా!

అల్లారుముద్దుబిడ్డల జంపెనని, యొక్క దురుసుమాటయైన లేదు. "తామే యిట్లొనరింప మము రక్షించువారెవరు తండ్రీ" యని యాతని కరగించును. తలయెత్తిచూడ నెదుట లజ్జావనతాననుడై "యాజ్ఞకుండు రజ్జువునం బశువుగట్టిన చందంబున బంధింప"బడియున్న గురుపుత్రుని దీనదశ గాంచినంతనే, తన హృదయమున బొంగి పొరలుచున్న పుత్రశోకమామెకు క్రోధము గల్గించుటకు మారు, ఆతనియెడ మాతృవాత్సల్యమును బెంపొందించును. బిడ్డలగన్న తల్లియు, నప్పుడే కూరిమి కుమారుల చావువలన బొగులుచు "కడుపుతీపె"ట్టిదియో యెరింగినదగుట

"అక్కట పుత్రశోకజనితాకులభారవిషణ్ణ చిత్తనై
పొక్కుచునున్న భంగి నిను బోర గిరీటిని బద్ధుజేసి నే
డిక్కడికీడ్చి దెచ్చుట సహింపనిదై భవదీయమాత నే
డెక్కడ నిట్టి శోకమున నేక్రియ నేడ్చుచు బొక్కుచున్నదో."

"కర్కశహృదయుడవగు నీవును, నిను బంధించి హింసింపదెచ్చిన క్రోధమానసులగు పాండుపుత్రులు నెరుంగకుండవచ్చు గాని, ప్రేమ యననేమో, మాతృవాత్సల్యమన నేమో, స్త్రీ నగు నేనెరుగనా" యన్నటుల స్త్రీ హృదయాంతరాళమును నిత్యపవిత్రమొనరించు వాత్సల్యనిర్ఝరి నొక్కమారు వెల్లివిరియజేసినది. తానెంతటి దుఃఖార్ణవమున మునిగియున్నను, ఎదుటివారిని మరువజాలని దయామయి; పరులబాధ సహింపలేదు.

"ద్రోణునితో శిఖింబడక ద్రోణకుటుంబిని యున్నదింట న
క్షీణతనూజశోకవివశీకృతనై విలపించు భంగినీ
ద్రౌణి దెరల్చి తెచ్చుటకు దైన్యమునొందుచు నెంత పొక్కునో"

యని యెదుటివారి కష్టము నూహించుకొని, తన దుఃఖము దిగమ్రింగి, అశ్వత్థామను రక్షింప బూనుకొనును. స్త్రీ యగుటంజేసి, ప్రేమపరిపూతహృదయ యగుటబట్టి, తానారీతి మాతృహృదయము గుర్తెరుంగగలిగినది కాని, కేవలాభిమానధనులును, క్షాత్రము, రౌద్రము, క్రౌర్యము ప్రతి నాళమున బరువిడు పరుషహృదయులగు తన నాథులు హింసకు బ్రతిహింస జేయక విడువరని యామె యెరుగును. ఇక వారి హృదయముల నెట్లైన గరగింపవలె. బంధితుడు గురుపుత్రుడని, యాతని హింసించిన గురుపత్నికి మితిలేని వ్యథ గూర్చుటగుననియు చెప్పుటయేకాక, పాండవుల కత్యంత గౌరవపాత్రుడైన ద్రోణాచార్యుల నామము పదే పదే యుచ్చరించి, వారి మనముల ద్రోణ సంబంధము పూజ్యమైన దను భావము ధ్వనింపజేయును. అంతటితో నాగక, "ప్రాణవియుక్తుడైన నతిపాపము, బ్రాహ్మణహింస మానరే" యనియు, "భూపాలకులకు విప్రుల గోపింపంజేయదగదు, కోపించిన దత్కోపానలంబు మొదవికి భూపాలాటవుల గాల్చు భూకంపముగాన్" అని వారికి ధర్మబోధయే గాక ఒకింత బెదురుగూడ గల్పింప యత్నించినది. స్వవిషయము మనసునకు దట్టదు గదా యెవడేని ముందువెనుక లాలోచించునది. ఆ రహస్య మెరింగినదగుటనే, హింసకు బ్రతిహింస జేయ బూనుటయు ఆత్మనాశకారియే యని మందలించినది. "కొడుకులబట్టి చంపెనని కోపము నొందదు" "ధర్మ్యంబును, సకరుణంబును, సమంజసంబును, నిర్వ్యాళీకంబును, శ్లాఘ్యంబునుగా" బలుకు ద్రౌపది వచనము లెల్లరి హృదయముల బరివర్తన మొనరించెను. కోపముదక్క యెుండెరుంగక "విడువుమటంచు జెప్పెడిని వెట్టిది ద్రౌపది, వీడు విప్రుడే, విడువగనేల, చంపుడిటు వీనిని మీరలు సంపరేని నా పిడికిటిపోటునన్ శిరము భిన్నముచేసెద"నని పైపరుపు వృకోదరుని వారించుటకు మాటలు చాలవని యామె యెరుంగును. చెప్పినతీరుగనే చేసితీరునని పూర్తిగ దెలియును. వేఱొండు మార్గముగుపింపదు. తానే అశ్వత్థామ కడ్డుపడి నిలుచును. భీమునివారించి మరియొక హత్య లేకుండ గాపాడినది. కృష్ణానుమతంబున, అశ్వత్థామ శిరోరత్నము నొలిచి పుచ్చుకొని, శిరోజములందఱిగి, యాతని నవమానించి పాండవులు విడిచిపుచ్చిరి.

స్త్రీ హృదయమున గల యమృతప్రపూర్ణమైన కరుణరసమునకు, పవిత్రప్రేమకు, మాతృవాత్సల్యమునకు గల మహత్తర సౌందర్యమును ద్రౌపది పాత్ర నీరీతిగ చిత్రించి. లోకమునకు వెల్లడించిన పోతన లేఖిని యత్యుదారమైనది. భారతకథా వివరణమం దొకింత మార్పుగల్గించిననేమి, పాత్రౌచిత్యమునకు, పాత్రపోషణమునకు నాతడు దిద్దిన తీరులు హృద్యములు కావా! పోతన సృష్టించిన ద్రౌపదిపాత్ర నింతగా వివరించుటలో భారతరచయితల కెట్టి కించిత నాపాదించు నుద్దేశములేదు. వారి పంథ వేరు. స్త్రీ హృదయమందలి సహజ వాత్సల్యమును పోతన యెంత సొగసుగ గ్రహించి వర్ణించెనో తెల్పుటమాత్రమే యాశయము.

శక్తిక్రమేణా క్షీణించుట

మలేరియా జ్వరపీడితులు నిర్బలులగుటచే ఏ ఆహారమును తినజాలరు.

జ్వరము మిమ్ముల నెందుకు నిశ్శక్తులుగా చేయును? జ్వరపు విషము రక్తములోకలిసి, నరస్నాయువులలో ప్రవేశించి మీ సకలావయవములను బలహీనముగా చేయునని డాక్టర్లు చెప్పుదురు.

కడుపు ఈ బాధను తప్పించుకొనజాలదు. జీర్ణశక్తి తగ్గుటచేత కడుపునకు శ్రమ. మలేరియా జ్వరపీడితులు నిశ్శక్తులగుటచే ఏ ఆహారమును తినజాలరు.

అలసిన దేహమునకు ఆహారము అవసరము హార్లిక్సు తగుమైన ఆహారము. ఇది జీర్ణశక్తికి ఏలాటి హానిని కలుగజేయక, సులభముగా జీర్ణమై, అలసిన నరస్నాయువులకు పటుత్వమునిచ్చి, రోగమును పూర్తిగా నిర్మూలించును.

H-477 C.


ఒక ప్రాచీన వైద్యము
ఈ విధముగనే మంచి సమా
చారములు విస్తరించుచున్నవి
ఉడ్ వర్డ్స్ గ్రైప్ వాటర్ బిడ్డలను
బాగుగా రక్షించుచున్నది
WOODWARD'S
GRIPE WATER
keeps baby well
IMPORTANT TO MOTHERS
WOODWARDS CELEBRATED
GRIPE WATER
W. WOODWARD LTD. LONDON. ENGLAND.
I-WWIII-III —TL

వింత వింతల ప్రపంచం

దక్షిణ అమెరికా బ్రెజిల్ దేశంలో లాక్ అగస్టయిన్ అనే బాలికవుంది. ఆమె వయస్సు ఇప్పుడు 9 ఏళ్లు. ఆమెకు 10 మాసముల యీడుగల పిల్లవాడు వున్నాడు. ప్రపంచంలోకెల్లా ఇంత తక్కువవయస్సు కల 'తల్లి' లేదట! గొప్పగొప్ప శాస్త్రవేత్తలు యీ అమ్మాయిలో ఇంత చిన్నతనంలోనే యింత త్వరగా బిడ్డను కనడానికి కలిగిన మార్పులను తెలుసుకొనేందుకు తగిన శాస్త్ర పరిశోధనలను చేయడానికి అవకాశాన్ని కల్పించవలసిందిగా ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం అందుకు అనుమతించింది. యీ సంవత్సరాంతంలోగా ఆమె న్యూయార్కు పట్టణం చేరుతుంది.

♦ ♦ ♦ ♦

గత ప్రపంచ మహాయుద్ధంకన్నా యిప్పటియుద్ధంలో అనేకరకములైన కొత్తకొత్త మారణ యంత్రాలు అమల్లోకి వచ్చాయి. వీటిలో ఒకదేశం కనిపెట్టిన సాధనానికి విరుగుడుగా ప్రతిసాధనం రెండోదేశం కనిపెట్టి ఉపయోగిస్తూ వుంది. కాగా, రష్యా ఒక క్రొత్తటాంకు కనిపెట్టింది. యీ టాంకును విమానం పైకిమోసుకుపోయి వాటిలోంచి మంటలను వెదజల్లుతుంది. యీ మంటలను సుమారు ఒక మైలు దూరంవరకు విసురుతుంది. కొన్ని రకాల నూనెలనుకలిపి తయారు చేయడంవల్ల యీమంటలు వస్తున్నాయి అని మాత్రం గ్రహించుకున్నారు కాని, దానికి ప్రతిక్రియ ఇంతవరకు కనిపెట్టలేక ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు.

♦ ♦ ♦ ♦

గాలిలోంచి పడవేసే కొత్తసాధనం రష్యా కనిపెడితే నీటిలోంచి నడిపే కొత్తసాధనం అమెరికా కనిపెట్టింది. దీన్ని తయారుచేసినవాడు వెష్టర్ బార్లో అనే ఆయన. యీ గనివల్ల 10 వేల టన్నుల బరువు గల ఓడనైనా ధ్వసంచేసి వేయవచ్చు. అత్యంత ఉపద్రవకరమైన యీ మందుగని అతి సున్నితంగా, అతి స్వల్ప వ్యయంతో తయారుచేబడింది. దీనిని విమానాలమీదకూడా తీసుకుపోయి, సముద్రంలో విసురు తారట. ఒక్కొక్క విమానం ఆరింటిదాకా మోసుకుపోగలదు. ఇదివిని యుద్ధ పీడితదేశాలు తల్లడిల్లి పోతున్నాయి. అయితే, దీనికిగూడా యింకా విరుగుడు కనిపెట్టబడలేదు.

♦ ♦ ♦ ♦

జనరల్ ఎలక్ట్రిక్ కంపెనీవారు ఒక క్రొత్తరకం కెమెరాను కనిపెట్టారు. దీనిలోటి ఒక సెకండుకు 1,20,000 ఫోటోలు తీయవచ్చును. ఒక్కొక్కఫోటో ఒక చదరపు అంగుళంలో 3వ వంతు ఉరవకలిగి వుంటుంది.

♦ ♦ ♦ ♦

జపానుదేశంలో గాలిపటములను ఎగరవేయడం మొదట్లో వినోదంగా వున్నప్పటికీ యిప్పుడు ప్రాణాంతకంగా తయారయింది. యీ గాలిపటములను పందెములు వేసుకుని ఎగరవేయటం దినదినమూ పెరిగి పోతోంది. 3000 చదరపు అడుగుల వైశాల్యంగలిగినంత గాలిపటాలనుకూడా ఇప్పుడు ఎగరవేస్తున్నారు. యీ పటాలను గాలిలో ఎగరవేసి ఆ తాడును 200 మంది వరకు పట్టుకుని కాళీప్రదేశాల్లో అటు ఇటు పరు గులు పెడుతూ వుంటారు. ఒక్కొక్కప్పుడు ఆతాడు తెగిపోయి ఆతాడుతోకూడా కొంతకొంత మంది జనం గాలిలోకి లాగుకొనబడిపోతూ వుండటంవల్ల కొంతమంది చనిపోతూ వున్నారు. దీనిని ఆపి వేయటానికి వృద్ధులు కొంతమంది తీవ్రంగా పాటుబడుతున్నారు కాని ప్రయోజనం లేకుండావుంది.

★ ఆత్మహత్య

● శ్రీ పంగనామముల సూర్యప్రకాశరావు

మా అమ్మ చనిపోయిన నాలుగేండ్లకి నా ఆరవఏట మానాన్న చచ్చిపోయాడు. మాకున్న ఆస్థిని చూసిపెట్టడానికి నాకొకరక్షకుడు కావలసి వచ్చింది. అప్పటికి మాకూ వెంకటేశ్వరరావుగారికీ బంధుత్వం కన్న స్నేహం ఎక్కువగావుండేది. అంతేకాకుండా నాకు రక్షకుడుగా వుండదగిన బంధువులెవ్వరూ లేక పోయారు కూడాను. అందుచేత నాకాయనే రక్షకుడుగా ఉండవలసి వచ్చింది. ఆయనపోషణలో వుండినందుకు నేను విచారించలేదు. పైగా ఆనందించాను. కొన్నాళ్లు మురిసిపోయాను. నేడు దుఃఖిస్తున్నాను.

వెంకటేశ్వరరావుగారికి విశాల పెద్దకూతురు. ఆ అమ్మాయిని వెంకటేశ్వరరావుగారు, శీతమ్మ గారుకూడా పువ్వుల్లోపెట్టి పెంచారు.

విశాల నేను తరచుతోటలో ఆడుకునేవాళ్లం. అప్పుడు విశాల పెంకిపనులుచేసి నాకు కోపం తెప్పించేది. ఒకమాటు సీతమ్మగారు నన్నుకోప్పడింది. వెంటనే విశాలను పిలిచి అడిగాను. 'ఎందుకు అమ్మతో చెప్పావు?' 'మరినీవెందుకుకొట్టావు?' అనికోరగాచూసింది. 'నువ్వునేను కొయ్యావద్దన్న పువ్వును ఎందుకు కోశావు?' అన్నాను. అప్పుడు విశాల మృదువుగా నాచంపమీద చరిచి 'ఇంకెప్పుడూ అమ్మతో చెప్పనులే' అంది.

విశాల రానురాను పెద్దదౌతున్నది. ఆమె శరీరం పరిపూర్ణతను వహించసాగింది. బుద్ధి ప్రాజ్ఞతను పొందసాగింది. సీతమ్మగారికి మాత్రం మా ఆటలేమీనచ్చినట్లులేదు. ఒకనాడు నేను యింటికి వచ్చేటప్పటికి విశాల తన ప్రకృతివిరుద్ధంగా ఒక గదిలో కూర్చొని శూన్యంగా చూస్తున్నది. ఏదో జరిగిందనుకున్నా. ఆ పాము లాంటిజడను చేతులో కొట్టుకుంటూ అడిగాను, విశేషం యేమిటని. ఆ తుమ్మెదల్లాంటి కండ్లను ఒక్కసారి చెకచెకా గదిచుట్టూ తిప్పింది. గిర్రున అటున్న మనిషి యిటు తిరిగి నాచెవుల్లోచెప్పింది. ఏమనీ? సీతమ్మగారు పాపం! తన్నుకోప్పడిందట, నాతో స్వేచ్ఛగా వుంటున్నందుకు.

మరోనెలకు పెద్ద చదువుకోసం నేను యీవూరు వచ్చేశాను.

ఒకనాడు నాకు యింటినుంచి ఉత్తరం వచ్చింది; విశాలకు పెండ్లి అని. ఆశుభలేఖ నాకు గొడ్డలి పెట్టుగావచ్చింది.

కాని చిన్నతనములో ఆదుఃఖాన్ని రెండు రోజుల్లో మరచిపోయాను. మరోవారానికి పెండ్లికోసం యింటికి వెళ్లిపోయాను. చూడగానే సిగ్గు! ఇది శుభలేఖకన్న వజ్రాఘాతంగా వచ్చింది. శాంతంగా భరించడం కన్న చెయ్యగలిగింది యింకేమివుంది?

ఆ మర్నాడు పెళ్లి అనగా వెంకటేశ్వరావుగారు నాతో చెప్పారు. నాకుగూడా వారంరోజులలో పెండ్లిగాబోతున్నదనీ, పెండ్లికూతుర్లు ఒకరిద్దరు వున్నారని. అనేక పిచ్చిపిచ్చి ఊహలుతట్టినయ్. నేను చదివిన నవలలలోని వీరులంతా నాకండ్లముందర నాట్యం చేశారు. కాని విశాలతో యీప్రస్తావన తెచ్చేందుకే భయంవేసింది.

కాని, మర్నాడు నన్ను చూడంగానే విశాల 'ఓహో! పెళ్లికొడుకూ!' అని హాస్యంచేసింది. నాహృదయంలోవున్న తీవ్రతరభావాల్ని తోసిపుచ్చి నేనుకూడా 'ఓహో! పెండ్లికూతురూ!' అనకతప్పిందికాదు. 'నీకో మంచి పెళ్లికూతుర్ని ఎంచాను, చేసుకుంటావా?' అంది. 'నీలావుంటుందా?' అన్నాను. 'అదుగో కొంటె మాట లాడ్తావు. మనకు వరుసలు కుదరవుట; లేకపోతే పెండ్లిచేసేవారే, అని జాలిగా చూసింది. నానవలలన్నీ మరచిపోయాను. విశాలను ఆశీర్వదించటానికి మాత్రం నా ఆ నవలలనన్నిటిని వుపయోగించుకోగలిగేను. విశాల కృతజ్ఞతా సూచకంగా 'ఆ కదంచేటివారి అమ్మాయి వరలక్ష్మి బాగుంటుంది. చాలా చదువుకుంది. బాగా పాడుతుంది.' అంది. 'సరే, చూద్దాం' అంటూ యివతలకు వచ్చేశాను.

నిజంగానే నాభార్య చాలాచదువుకుంది. బాగాపాడుతుంది. పైగా విశాల నాకోసం యెంచి యిచ్చిందికదా అని నా భార్యమీద నాకుకలిగిన గౌరవం యిప్పటికీ పోలేదు. నేను నా భార్యని ఒక ప్రేమ చిహ్నంగానే ప్రేమిస్తూ వచ్చాను.

మరొక రెండేళ్లకు బి. యల్. ప్యాసయి యీవూళ్లో బోర్డు తగిలించేటప్పటికి విశ్వనాధం విశాల భర్త, యీవూళ్లోనే వుంటున్నాడు. నేను మా వరలక్ష్మి తరచుగా వాళ్లింటికి పోతూవుండేవాళ్లం. అతనుకూడా మాతోబాటు సరదాగానే తిరిగేవాడు.

కొన్నాళ్లకు వరలక్ష్మి పుట్టింటికి వెళ్లిపోయింది.

నేనొక్కణ్ణి విశ్వనాధాన్ని చూడ్డానికి వెళ్లేవాణ్ణి. సాధారణంగా విశ్వనాధం యింట్లోనే వుండేవాడు. ఎప్పుడైనా అతను లేకపోతే విశాలవచ్చి చిన్నతనపు ముచ్చటలు చెప్పి నన్ను మరపించేది. నేను వరలక్ష్మిని స్వీకరించినందుకు తనెంతో కృతజ్ఞురాల ననేది.

♦ ♦ ♦ ♦

విశాల ఎక్కడనుంచో తడుచుకుంటూ వస్తున్నది. నేను వెంటనే ఆమెను లోపలికి రమ్మన్నాను. ఆవర్షం రాత్రి పదిగంటలదాకా తెరిపియివ్వనేలేదు. వర్షంపడుతున్నంతసేపూ విశాల ఇంటికి పోవాలని తొందరపడుతూనేవుంది. చుట్టాల యింటికి సాయంత్రం వెళ్లిందట చూసొద్దామని. వంటైనాచేయలేదట. వాళ్లింట్లో భోజనాలు చాల ఆలస్యంగానే అవుతాయి. కాని ఇంతఆలస్యంగానా?

నాకు హోటల్ నుంచి వచ్చిన క్యారియరు మాట చటుక్కున జ్ఞాపకంవచ్చింది. 'విశా! ఇక్కడే అన్నం తినరాదూ? యీ అన్నం యిద్దరకు సులభంగా సరిపోతుందీ అన్నాను. చాలాసేపు తిననని వాదించింది. భర్త తినక మునుపు తను తినకూడదని! చివరకు నా బలవతంమీద తినటానికి ఒప్పుకుంది.

పదిగంటలకు వర్షం తగ్గగానే నేనొక జట్కా మాట్లాడాను, విశాలను అందులో ఎక్కించాను. నేనుకూడా అందులోనే కూర్చున్నాను. విశాలను 'దిగబెట్టేందుకు' విశ్వనాధం గారింటికి చేరుకున్నాం. అతను వీధివసారాలో అటూయిటూపచారీ చేస్తూన్నాడు. ముందు నేను, తరవాత విశాల దిగివచ్చాం.

పాపం! విశాల వండడానికేమో వంటింట్లోకి వెళ్లింది. విశ్వనాధం వసారాలోంచి కేకవేశాడు హోటల్నుంచి తెప్పించుకున్నాలే, నాకోసం వండనక్కరలేదు అని. నేను విశ్వంతో అన్నాను బావా, విశాల మాయింటివరకూ వచ్చేటప్పటికి వర్షం పట్టుకుంది. అదృష్టవంతురాలు. మరి కాస్తదూరం వెళ్లాక పడితే తడిసి ముద్దయి వచ్చేది యింటికి. 'ఊఁ' అని గంభీరంగా అన్నాడు విశ్వం.

ఇంతలోకి వర్షం మళ్లీ విజృంభించింది. విశాల తలుపు చాటునుంచే అంది 'పోనీ, యీ రాత్రికి యిక్కడే పడుకోరాదు' అని. నేను మూగగా ఒప్పుకున్నాను.

పదకొండు దాటివుంటుంది. నాకలత నిద్రలో మెలకువ వచ్చింది. విశ్వనాథం విశాలను ఏదో కోపంగానే తిట్టుతున్నాడు. నేను మేలుకున్నట్లు తెలియడం మంచిదికాదని పడుకున్నాను. విశ్వనాథం తనకసిఅంతా తీర్చుకొని ఎక్కడికో వెళ్లిపోయాడు.

విశాల వచ్చి నన్ను లేపింది. నాకు ఆమె అవస్థ అంతాచూస్తే జాలివేసింది. నేను ఆమె సంసారంలో యింత ఒడుదుడుకులున్నా యనుకోలేదు. పాలచెక్కిళ్ల వెంట ముత్యాలలా కన్నీళ్లుకారుస్తూవున్న ఆశోక మూర్తిని ఎలా ఓదార్చడం? 'ఆయనకెందుకు కోపంవచ్చిందా?' అని అడిగాను. విశాల చెప్పింది. 'వెంకటం! యిది యిన్నాళ్లూ దాచివుంచాను. యిది నువ్వు యీవూరు వచ్చినప్పటినుంచి జరుగుతూనేవుంది. నువ్వు ఇంద్రలోకతుల్యంగా వున్నాయి రోజులు అనే దినాల్లోకూడా నేను యీఅడకత్తెరలో నలుగుతూనేఉన్నాను. ఆయనకింత అసూయ ఎందుకు వచ్చిందో నా కర్థంకాలేదు. ఆయనను నొప్పిస్తానేమో ననేభయంచేతనే నేను ఆయనఎదుట సాధ్యమైనంతమటుకు నీతో మాట్లాడ్డం, నీకు కన్పించడం తగ్గించేదాన్ని. అయినా ఆయన అసూయ తగ్గలేదు. అది యివ్వాళ ఉగ్రతమ రూపంచాల్చింది. నన్ను అనరానిమాటలు అన్నారు. యిందాక నీయింటిదగ్గర జట్కాలో ఎక్కుతున్నప్పుడే నేనీపర్యవసానం వూహించాను. వెంకటం, నేను నిన్ను మన సారా ప్రేమించాను. నా యీ సోదరప్రేమలో దురాశాబీజాలు లేవు. ఈ విషయం నీకూ నాకూ కాకుండా భగవంతునికికూడా తెలుసును. కాని, ఇక వచ్చేజన్మంలోనయినా నిన్నేపొందడంకోసం నేను నిత్యం దైవారాధనచేస్తున్నా. నా హృదయపూర్వకంగా నీకు వరలక్ష్మినిచ్చాను. దాన్ని నాలాగే చూసుకో. ఇంక నీకు నమస్కారంమాత్రం యివ్వగలను. వర్షం తగ్గింది. నువ్వు యింటికివెళ్లు' అంది. సోదరి విశాల హృదయ గంభీరతను చూచి నేను మూగవాణ్ణయిపోయాను. ఏమనడానికి పాలుపోలేదు. అతి ప్రయత్నంమీద 'నీవొక్కత్తెవీ ఎట్లా వుండగలవ్ చెల్లీ?' అన్నాను. 'నాకరున్నాడుగా ఫరవాలేదు, వెళ్లు, మఱచిపోకు, వెళ్లు' అంది.

నేను హృదయంలేని మొరడునై, మెదడులేని పశువునై బయటపడ్డాను. నాకు దేవుడు ఏమాత్రం మెదడు యిచ్చినా ఆమె మాటలలో అర్థం గ్రహించేవాణ్ణి. మూర్ఖణ్ణి మాట్లాడకుండా వచ్చేశాను. వచ్చి కుంభకర్ణుడిలా నిద్రపోయాను.

తెల్లవారిలేచేటప్పటికి అప్పుడే పిడుగులాగవచ్చింది వార్త విశాల చచ్చిపోయిందని. నేను ఒక్క వూపున విశాల శవం ప్రక్కన పడ్డాను. ఏడ్చాను. ఏంలాభం? విశ్వనాథం ప్రక్క నిలబడి 'ఆత్మహత్య చేసుకుంది!' అన్నాడు నాకు రోషంవచ్చింది. 'ఆమె ఆత్మ నేటికి రెండేళ్లక్రిందటనే చచ్చిపోయింది; కాదు హత్యచేయబడింది. నేడు చచ్చిపోయినది ఆమె శరీరం మాత్రమే' అన్నాను.

యోగి

శ్రీ పుట్టపర్తి నారాయణాచార్యులు

చిమ్మచీకటిలోఁడు నిశీథమందు
ఎవరుపిలిచెదరిటు నన్ను ?—
అంతకంతకు గంభీరమగుచు, నార్ద్ర
భావముల నొల్కఁబోసెడి పలుకుతోడ !

అమ్మరో ! నీవు, నన్ను ఓదార్చకమ్మ
మధురమైన విషాద సమాధినుండి

మేలుకొలుపకు, నేను జన్మించినాను,
దుఃఖమునకె, శోకమె - నాదు తోడునీడ.

పాడుకొందును - అవిదితాంబరమునందు—
యెన్నడో నేను రచియించుకొన్న గీతి
అడ్డురాకుము - ఓదార్చకమ్మ నన్ను
సుకములెరుగని ప్రేమభిక్షుకుఁడ నేను.

★ చూపుల చదువు

● శ్రీ గజపతిరాయవర్మ

గ్రామీణ ప్రజానీకంలో అతిత్వరితంగా, అతి సునాయాసంగా విద్య వ్యాప్తము కావలసిన అవసరం మిక్కిలిగా వుంది. అందుకు 'చూపుల చదువు' పద్ధతిని మించినది లేదు.

ఏ పత్రికతీసినా, ఎక్కడ ఉపన్యాసం విన్నా, ఏ మారుమూల పల్లెటూరుపోయినా 'వయోజన విద్యావ్యాప్తి' అంటూ రకరకాల పోకడలు పరిచయాలవుతున్నాయి.

ఈ 'వయోజన విద్య' నిర్వచనం ఏమిటో సులభగ్రాహ్యంగా లేదు. సుమారు ఊహ్యంగానే ఉంది. వయోజనులకు ప్రత్యేకంగా ఒక విద్య. అయితే ఎవరీ వయోజనులు? వయసువచ్చినవారంతాను - ఏ సందర్భంలో - ఏ విషయానికి వయసువచ్చినవారో సరిగా చెప్పడానికి సులువుగాలేదు. చదువుకోడానికి వయసువచ్చినవారా? వయసురానిదే ఎవరూ చదువుకోరాదు. తెలుగు పెద్దలు నేర్చే విద్య. పెద్దలునేర్చే విద్య అంటే? పిల్లల తండ్రులు హాజరయే పెద్దచదువు లిందులో పరిగణింపబడవు. చదవేసే వయస్సులో చదువులేక ఏ ఇరవయ్యోయేటనో ప్రారంభవిద్యకు ప్రయత్నించడము.

వయోజన విద్యావ్యాప్తికని అనేకులు పాటుబడుతున్నారు. తమిళరాష్ట్రంలో 'ఊరికొక గ్రంథాలయం' అనే శీర్షికల్తో వార్తలుపడ్డాయి. బొంబాయిరాష్ట్రంలో కొందరు వ్యక్తులు ప్రారంభించిన ఈ ఉద్యమాన్ని బాధ్యత గుర్తించి కాబోలు ప్రభుత్వమే ప్రోత్సహించి ప్రచారిస్తోంది.

వయోజన విద్యకని సాధనాలు అనేకం చెలామణీ అవుతున్నాయి. పుస్తకాల సంబంధం, ఉపన్యాసాలు, గ్రామఫోను, రేడియో, మ్యాజిక్ లాంతరెన్ డిమాన్‌స్ట్రేషన్స్ మొదలైనవి. వయోజన విద్యావ్యాప్తికే చాలినంత పబ్లిసిటీ - ఆకర్షణ లేదుకదా ఇవేంజేస్తాయి అనిపించవచ్చును. అందుకే ఒకే సాధనాన్ని క్లుప్తంగా పరామర్శిద్దాం.

ప్రస్తుతం వయోజన విద్యావ్యాప్తి పేరున అమ్మకమయే పుస్తకాల ప్రస్తావనైతే - నిజమాడితే నిష్ఠూరం. ప్రజలకని నిర్ణయించేందుకు తగిన అధికారం, ప్రజలతో కలిసి మెలిసి వాళ్ల అభిరుచుల తెలుసుకునే ఎడ్యుకేషనిస్ట్సు, రైటర్సు బహుతక్కువ అని చెప్పితే చాలు. పుస్తకాల సందర్భంలోనే వస్తాయి పఠనాలయాలు, గ్రంథాలయాలూను. వీటిల్లో సాధారణంగా ఉండే పుస్తకాలు దళారీ బేరాలమీద, కారుచౌకగా వచ్చిన రైల్వే లిట్రేచరు. ఇటువంటి పుస్తకాలు వయోజనుల విజ్ఞాన సముపార్జనకు ఏవిధంగా ఉపకరిస్తాయి?

రాత్రి పాఠశాలల్లో నలుపు తెలుపుచేయడం. కిరసనాయిలు ఖర్చుతో నేర్చేది నిశానీమాని పొడి అక్షరాల సంతకం. అంతకన్నా నేర్చినవారగుపడుటలేదు. కాదు ఉన్నారూ అంటే అనేకులవలె విద్యను దుర్వినియోగం చేస్తూ మోసగాండ్రుగా తయారవుతున్నారనుకోవాల్సినదే; ఏ పల్లెటూరైనా వెళ్లిచూడండి.

అక్షరాల ద్వారా నేర్పడం అంటే చాలా భాషాజ్ఞానం కావాలి. మాటవరుసకు ఏ కథో, చరిత్రో వుంటుంది. చక్కటి వర్ణన ఉంటుంది. ఆ భాషాపరిజ్ఞానం ఉన్నవారు చటుక్కున అవగాహన చేసుకుంటారు. తెలియనివారిగతి! భవభూతినాటకం చదువుతూ అర్థంచేసుకోగల అదృష్టవంతులు హాయి హాయనొచ్చు. సీతకై అడవల్లా తిరిగే రాముని దుఃఖం చూడగలరు. వీరంతా అల్పసంఖ్యాకులు. అదే ఆధారంతో ఏ చిత్రకారుడో, శిల్పి కుంచెలూ, సుత్తీ, శాణాం పట్టుకు పనిచేస్తే ఒకరిద్దరు కాదు,

ఇరవైమంది ఒకేసారి పుస్తకం చదవక్కర్లేకుండా చిత్ర శిల్పాన్ని చూచిన తక్షణం, అనుభూతితో కనుకొలకుల్లో నీరు కారుస్తారు.

ఇక రేడియో వుంది. కేవలం వినోద కాలక్షేపానికనేట్లు గాక మార్పులతో 'పబ్లిక్ రిసార్ట్సు' లాంటి స్థలాల్లోనేగాక పొలాలమధ్య, చెరువుగట్టునా, నదీతీరానే గాక సర్వత్రా వినడానికవకాశం కల్పిస్తూ జీవితక్రమం సవ్యంగా, సౌఖ్యంగా చేసుకోడాని కుపకరించగల కార్యక్రమాలు జరిగేట్లు చూడాలి. ఇన్నీ చేయడం జరిగితే ఒక చిక్కువుంది. వినేవాళ్లు ఏ విషయం మళ్లీ వినాలన్నా సాధ్యంకాదు. రేడియో కన్నా ప్రోత్సాహించదగినది గ్రామఫోను. ఎప్పుడు కావాలన్నా, ఎక్కడైనా, ఏ విషయం అయినా ఎవరైనా సరే తెలుసుకోవచ్చును. కాని మన దౌర్భాగ్యం కొద్దీ అలాంటి ఉపయోగకరమైన రికార్డులు లేవు. కారణం దీనికీ సెన్సార్ బిగింపు సరిలేకుండడం. సంగీతం, శాస్త్రం ఏఁవీ కాదు. వెర్రి మొర్రి కూతలు, నానా అసహ్యంగా కుటుంబంలో ఉన్న నల్గురూ కూర్చుని వినడానికవకాశం కానివే ఉన్నాయి. 'కల్చరు' కాన్పించనివీ - 'ఎడ్యుకేటివ్ ఎసన్సు' ఏమాత్రం ఎరుగనివి చాలా ఉన్నాయి. సవ్యంగా సాగిస్తే అనేకులు ఏకలవ్యులైపోతారు. భాషలనుంచి వృత్తులు - చరిత్రాదులన్నీ ఎవరికివారు నేర్వవచ్చును. గ్రామఫోను కంపెనీలమీద తగు చర్య తీసుకోడం ప్రభుత్వం పని.

ఓవిధంగా అలా అక్షరాలక్కర్లేకుండా ఉపకరిస్తున్నాయి 'స్లయిడ్సు'. కాని ఈ రోజుల్లో ఇంకా వీటినే సాధనంగా పనిచేయించడం పాతరకం. మ్యాజిక్ లాంతరు ప్రదర్శనాలు కొన్నికొన్నిచోట్ల పనిచేస్తున్నాయి. కాని విషయాలు తక్కువ. ఆరోగ్యం, సహకారం, హరిజనసమస్యవంటివీ పశువైద్యం లాంటివీ చాలా ఉన్నాయి. కానైతే ఇంతకన్నా మంచి సాధనాలుండగా యింకా వీటిని పట్టుకుతిరగడం ఏవిటి? ఇంతకన్నా వినోదరూపంగా విద్యాదానంచేసే 'సినిమా ఫిల్మ్' ప్రారంభించడం శ్రేయోదాయకం. ఇంకా 'పిక్టోరియల్ పోస్టర్సు' మొదలైనవున్నాయి. ఇకనుంచీ చూపుల చదువు పద్ధతి ప్రారంభం.

పసివారికైనా పెద్దలకైనా తెలియచెప్పించాలంటే అక్షరాలకన్నా బొమ్మలు బాగా ఉపకరిస్తాయని, నా వాదమే కాదు, అనుభవం. దీన్నంతా అంగీకరిస్తారు. అనేకులాచరిస్తున్నారు. పశివాళ్లకూ చదువుల్లో ఉన్నాయి. 'కిండర్ గార్డెన్, మాంటెసురీ' అని విద్యావిధానాలున్నాయి. వస్తువుచూపి చెప్పడం, వస్తువువద్దకు తీసుకువెళ్లి చెప్పడం ఇది అక్షరాల విద్యకన్నా 'ప్రాక్టికల్' కాబట్టి సులువుగా అర్థమాతుంది. సముద్రంలో ఓడ ఉందంటే అవకాశం ఉన్నవారు నేర్చుకునేవారి నక్కడికి తీసుకువెళ్లి, చూపించి యిది ఫలానా అంటారు. ఆ అవకాశంలేకుంటే బొమ్మలువేసి చెప్తారు.

పుస్తకాలు పత్రికలకన్నా శాశ్వతంచేసే బోధనలు సద్దణగిపోతున్నా కళల్లో ఉన్నవి. ఈనాటి యంత్రసహాయంవల్ల అద్భుతమైన కృషితో మిక్కిలి ప్రయోజనకారిగా సవరించే అవకాశాలున్నాయి. బాగుపడ్డావారనడానికి ఉదాహరణలు ఆధారాలు అనేకాలున్నవి.

రంగుల పటాలద్వారా చదువుచెప్పడం అనేది క్రొత్తపద్ధతి కాదు. మామూలు బొమ్మలతోనే పశివాళ్ల పాఠాలనుండీ ఉండనే ఉన్నాయి. 'ఈగ, గంప, వల, తల' ఇలాంటివాటితో ప్రారంభించి జాగ్రఫీ - హిస్టరీల దాటి 'యూనివర్సిటీ కోర్సు'కూ ముఖ్యం బొమ్మలే. ఈ పద్ధతులు ఎక్కువగా పాశ్చాత్యులుపయోగించుకుంటున్నారు. ఇక్కడి కాన్వెంటు పుస్తకాలు చూడండి. మిషనరీ పాఠశాలలు పరికించండి. సాధ్యమైనంతవరకూ బొమ్మలే ఉంటాయి. రంగులే ఉండాలనే నియమంలేదు. సంజ్ఞలు, రేఖాచిత్రాలతోనే అక్షరాలక్కర్లేకుండా చదువు సాగుతుంది. అసలు అక్షరాల్లేక, ముందు కొన్ని దేశాల్లో చిన్నచిన్న బొమ్మలే, కుంచెపనే లిపిగా ఉండేది. రేఖాచిత్రాలు, పటాలుకన్నా రంగులు వేసినవైతే మరీ బాగుంటాయి. వివిధవిషయాలు విద్యాసాధనానికి కాకపోయినా బొమ్మలుగా ఉండడం పూర్వనుంచీ వస్తూవున్నదే.

ఇలా ఎన్ని చిత్రాలు వేయించగలం? ఖర్చెక్కువలాంటి కారణాలు చూపిస్తారేమో? ఒక్క చిత్రానికి నకళ్లు తీయడానికి యంత్రాలున్నాయి. పుస్తకాలకన్నా మహా ఎక్కువవదు. కాని ప్రయోగానికని చెత్తతో బీర్వాలు నింపడంకన్నా వయసుకుమించిన ఊహల గ్రంథాలు బండెడు బరువు బాలబాలికలచే మోయించడంకన్నా, ముఖ్యం మూడేసి విషయాలు చెప్పే బొమ్మలున్నా చాలు.

నిజంగా నేర్చుకోవాలంటే మన నిత్యజీవనాల్లో తటస్థించే అనేక విషయాలు, మన పరిసరాలు, అన్నీ తెలుసుకోదగ్గవే. ఆ కనిపించేవాట్లో ఎంతో బోధనాశక్తి వుంటుంది. అయితే దాన్నెవరూ గుర్తించరు.

పూర్వ శోభలకేం వినోదంగా ఈనాడు వయోజనులైనా విద్య నేర్చేందుకు అనేకమైన చక్కటి అవకాశాలున్నాయి. విజ్ఞానం యిచ్చే కళలు, పరిశ్రమలున్నాయి.

తోలుబొమ్మలు తెలుగుదేశంలో యెరుగనివారు లేరు. పోనీ ఇవి పాతవైనా యనుకుందాం నాటకాలో బొమ్మలకన్నా బాగా పనిచేస్తాయి. మొఖం మొత్తేట్లు ఆంధ్రపత్రికల్లోనూ, మొన్నటి 'గృహలక్ష్మి' లలితకళాసంచికలోనూ వివరించాను. ప్రస్తుతం నాటకాలు మంచిదారికి వచ్చేమార్గం లేదు. మిగిలింది - అన్నిటికన్నా బాగా పనికొచ్చేది సినిమా. విద్యా, విజ్ఞానాలకు సినిమాలెలా ఉపకరిస్తున్నాయో ఆంధ్ర వార దైనికపత్రికల్లో రష్యా జర్మనీ పరిశ్రమల వివరించాను. మనకంటే లేవు కాని, జీవితానికుప కరించే చిత్రాలు పెద్దలకూ పిన్నలకూ వృత్తులనుబట్టి అభిరుచుల ననుసరించి వయసు నాధారించి చదువులుచెప్పే చిత్రాలు పాశ్చాత్యప్రపంచంలో ప్రదర్శింపబడుతున్నాయి. యంత్రాలు, గృహ గ్రామీణాలు, రైతాంగం, వాణిజ్యం, పరిశ్రమలు, వృత్తులు, శాస్త్రాలు, భాష యిలాంటివన్నీ ఫిల్ములద్వారా సాగించుకుంటున్నారు. అంతా ఉచితంగా స్వల్పఖర్చుతో చూచి నేర్చుకోడాని కవకాశాలిస్తున్నారు. గ్రంథాలయాలవలెనే ఫిల్ములూ తిరుగుతుంటాయి. వారి దేశమైన ఇంగ్లండులో బ్రిటిష్‌వారుకూడా ఇలాంటి సంస్థలు సాగిస్తున్నారు. 'డిస్ట్రిబ్యూషన్' వుంది సొసైటీలకూ స్కూల్సుకూను. 'ది జుయల్ ఇన్‌స్ట్రక్షన్స్' కని అనేకచిత్రాలు తయారవుతున్నాయి ఒక్క 'ఇంపీరియల్ ఇన్‌స్టిట్యూట్'లో. ఇలాంటివి ప్రపంచం అన్ని మూలలకూ (ఒక్క హిందూదేశం మినహా) చెందిన చిత్రాలు, శాస్త్రం, సంఘం, పరిశ్రమాదుల గూర్చినవి రెండువేలు పైగా ఉన్నాయట.

ఇలా ఎంతైనా చెప్పవచ్చును. విదేశీయులవరకూ ఎందుకు? మనకు సమీపస్థులు పరరాష్ట్రీయులే పద్ధతుల గుర్తించి అలా చేయ ప్రయత్నిస్తున్నారు. కాంగ్రెస్ మంత్రాంగంలో మద్రాసు మినహా యితరులే పరిశ్రమ విద్యాబోధకంగా పరిణమించేట్లు పరిశ్రమింపజేశారు. వేలాంవెర్రి వేదాంతం కథలు, కబుర్ల కన్నా మానవాభ్యుదయాని కుపకరించే చిత్రాలు తయారవడం జరిగితే ప్రొడ్యూసర్లు, వాళ్లూ స్వార్థపరులనే నింద పోగొట్టుకోగలుగుతారు. ఇందుకు కార్యరూపం దాల్చేందుకు ప్రభుత్వం చూడాలి. ప్రభుత్వం శాశించిందంటే కిక్కురుమన రీ తయారుదార్లు.

ప్రభుత్వం చర్యదీసుకుంటే తయారుదార్లు ప్రేక్షకులనుండి పుచ్చుకుంటున్న డబ్బుకు ప్రత్యుపకారం వినోదింపజేయడంగాని గారడీ చూపడంకాదని గ్రహిస్తే చిన్నచిన్న చిత్రాలైనా వృత్తివిద్యలు, విజ్ఞానవిశేషాలు జీవితోపయోగాల కుపకరించేవి వస్తాయి.

ఇందుకు పట్నాలలోనేకాక మామూలుపట్నం అంటే పల్లెకాని వూర్లలో ఒక్కొక్క థియేటరుండడం అవసరం. సెన్సారువారు మొఖమాటంవదలి చూచేవారు వారికి మేలుకల్గాలని గుర్తించాలి.

ప్రతీ (కనీసం) హైస్కూలుకూ ఓ బేబీ ప్రొజక్టరైనా ఉండడం ఆపని (రి ప్రొడక్షన్) చేయడానికీ - చిన్న చిత్రాలతో చదువునేర్వడానికికూడా అవకాశం ఉంటుంది.

నేనెరుగు సోపులలో చాల
బాగుగ ఉతుకునది సందేహము లేక

సన్‌లైట్ సోపే.

ఉతికినపిదప కూడ నా గుడ్డలు మందముగాను, బూడిదవర్ణము గాను ఉండినవి. పిదప ఒక స్నేహితురాలు సన్‌లైట్ సోపును గురించి నాకు చెప్పెను. ఆమె సాధారణమైన సోపులు శుభ్రపరిచెడి నురుగును చాల తక్కువగ నిచ్చుననియు నురుగే గుడ్డల శుభ్రపరచునది యనియు నాకు చెప్పెను.

సన్‌లైట్ సోపు ఎక్కువ నురుగును ఇచ్చును. సన్‌లైట్‌లో ఉతక బడుదుస్తులు నిజముగ శుభ్రముగనుండును.

సన్‌లైట్ సబ్బు

S. 16-50 TL LEVER BROTHERS (INDIA) LIMITED

భావతరంగిణి

"నాఅహింస మెత్తని ఉన్నితో తయారయిందికాదు. ఉక్కుకన్న కఠినమైన లోహంతో తయారయింది. అయినా, ఉన్నికంటెకూడా మెత్తనిది."

"స్త్రీలకు సంఘంలో సరిసమాన గౌరవం ఇవ్వాలి. ఆడపిల్ల పుట్టితే మనవారు సంతోషాన్ని ప్రకటించనంతవరకు మన సంఘానికి పక్షపాతము వచ్చినట్లే. స్త్రీలను అణిచిపెట్టి వుంచడం అహింసను నిరాకరించడమన్నమాట. ప్రతి స్త్రీని తన తల్లి, లేక చెల్లెలివలె చూడనంతవరకు మనకు ఔన్నత్యం లేదన్నమాట"

—మహాత్మా గాంధీ.

"ఇప్పటి భావకవులు కొందరు స్వతంత్ర రచనలను సాగించాలని, యతి ప్రాసలను గట్టుకట్టెంచుకొని పోవడానికి యత్నించే క్షోభ వర్ణనాతీతము. అట్టి రచనలు కవితకు వేరుపురుగులవంటివి. హృదయములో మధనగలిగి, శబ్దములో లీనమై, స్వతంత్రముగ పదలాలిత్యము ఒప్పులాగున, ఔచితి పాటించి, చమత్కారముతో రచనలు సాగించిననాడే ఆంధ్రదేశము ధన్యము కాగలదు."

—జి. జాషువ

"మనకు రాజకీయ స్వాతంత్ర్యము కావలసిందే. ఆర్థిక, సాంఘిక, న్యాయశాస్త్ర విషయక స్వాతంత్ర్యముకూడా కావలసిందే. కాని అన్నిటికంటె మనకుకావలసినది ఆత్మ స్వాతంత్ర్యము. ఈ ఆధ్యాత్మిక స్వాతంత్ర్యం ఆత్మాభివృద్ధికి చాల అవసరమైనది. మానవుడే ఆధ్యాత్మికాభివృద్ధికి అధికారి."

—సర్. సర్వేపల్లి రాధాకృష్ణయ్య.

"పశ్చిమ గోదావరి జిల్లాలో జోగన్నపాలెం అనే గ్రామంలో మంచి ఫలితాలు కలిగేలాగు సేవ చేయగలిగాను. ఆ గ్రామంలో స్త్రీలు, బాలురు, బాలికలుకూడా నూలు వడకటం, బట్టలు నేయటం మొదలైన గృహ పరిశ్రమలు చేస్తున్నారు. అందువల్ల వారి ఆదాయం అధిక మవుతోంది. అంతకు పూర్వము దామాషాని ఒక రోజుకు ఒకవ్యక్తి ఆదాయం 3½ దమ్మిడీలు మాత్రమే. ఇప్పుడు ఒక రోజుకు ఒక అణా ఆదాయం వస్తూవుంది. అనగా నాలుగురెట్లు హెచ్చింది. మరి ఆరు నెలలనాటికి ఇది ఇంకా హెచ్చుతుందని నాకు నమ్మకం వుంది"

—టంగుటూరు ప్రకాశం పంతులు.

"ఉపాధ్యాయుడు తన ధర్మాన్ని నిర్వర్తిస్తే శిష్యుల హక్కులు భద్రమవుతవి. తండ్రి తన ధర్మాన్ని నిర్వర్తిస్తే పిల్లల హక్కులు సంరక్షింపబడుతవి. భూస్వామి తన ధర్మాన్ని నిర్వర్తిస్తుంటే రైతుల హక్కులు కాపాడినట్లు. రాజ్యంలో ప్రతివారు తమ ధర్మాన్ని నిర్వర్తిస్తుంటే ఎప్పుడున్ను సంఘర్షణాని కవకాశమె వుండదు."

—ప్రొఫెసర్ అమరనాథ ఝా.

పట్టుచీర

(వినోద నాటిక)

శ్రీ

పి. వి. రామచంద్రమూర్తి బి. ఎ.

1వ రంగం—నరసమ్మ, కమల.

కమల: అమ్మా, నీ యాత్ర గొడవకేంగాని, నాకు పట్టుచీరకొని తెచ్చావా, లేదా? ముందు చెప్పు.

నర: పట్టుచీరేనా? తెచ్చానమ్మా, లేకపోతే నువ్వు నిలవనిస్తావూ! నీకూ ఒదినకీకూడా పట్టుకొచ్చాను.

కమల: చూశావా! నిలవనివ్వనన్నపేరు నాదీని, తేవడంమాత్రం నాతో సమంగా ఆవిడకీని!

నర: అదేమిటే కమలా అలా అంటావ్! నీకు తెచ్చినప్పుడు దానికి మాత్రం తేవద్దూ?

కమ: తేవద్దంటే మాత్రం మానేస్తారా ఏమిటి? ఇంతకీ అలా అనడానికి నాకేం హక్కుందీ?

నర: అమ్మాయ్, ఏమిటే ఆపెడసరం మాటలూ నువ్వూనూ! చాల్లే, ఆచీరలు రెండూతెచ్చి, ఏది బాగుందోచూసుకో.

కమ: నా కక్కర్లేదు రెండుచీరలూ, ఆవిడకే ఇచ్చుకో!

నర: ఒసేవ్, కమలా! చూడూ, ఎవళ్లేనా నవ్విపోతారు నీ చుప్పనాత్తనాన్నిచూసి......లే, వదిన రాకుండానే, ఆ రెండుకోకలూ చూసుకుని, నీకేది నచ్చుతుందో అది పుచ్చుకో. ఆ రెండోదే దానికిద్దాం.

కమ: ఆ, అ, అలా ఎందుకిస్తావ్! మంచిదే ఆవిడకి సమర్పిస్తావ్ కాని! "అన్నయ్యేమైనా అనుకుంటాడేమో! పొరిగింటి పుల్లమ్మేమైనా అనుకుంటుందేమో" అని మంచిదేదో ఆవిడకే ఇచ్చుకుంటావ్!

నర: ఇదేమిటే, ఇలా సాదింపు మొదలెట్టావ్?.........ఊఁ., ఇవిగో చీరలు రెండూను. ఈ ఆకుపచ్చచీరెంతో తెలుసా? పాతికో, పరకో, అనుకుంటున్నావేమో! నలభైయ్యొక్క రూపాయి.

కమ: ఆ రెండోదెంత?

నర: ముప్ఫయ్‌రెండు రూపాయలు

కమ: అమ్మా, ఆనలభైయొక్క రూపాయిలచీర్రా నిజంగా వదినకోసమేకదూ కొన్నావ్!

నర: అదేమిటే, నీకన్నీ ఇలా గేతోస్తాయ్! కొనేటప్పుడు, నీకోసమనీ, దానికోసమనీ ఏం నిరుకుచేసి కొన్నానా? "చక్కగా జరీగట్రా ఉందీ, రంగుకాస్తముదురుగా అగుపించినా నేత చిక్కగాఉందీ, చీర, కట్టినకొద్దీ అరగడమేగాని చిరగడమంటూ ఉండదూ" అని చెప్పేసి కాస్త ఖరీదెక్కువైనా వెనక చూడకకొనేశా. రెండోదికూడా ఇదేరకం కొందామనుకున్నాను కాని, మొత్తంమీద బోలెడైపోతుందని వెనకతీశా.

కమ: బేరంచేస్తే యింకా తక్కువ కిచ్చునేమో?

నర: ఆ కొట్టులో బేరాల్లేవుట. ప్రతీ చీరమీద ధరవేసి ఓ అట్టముక్క వేలాడుతోంటుంది. నచ్చితే అంతా ఇచ్చి కొనుక్కోడం, లేకపోతే చక్కా రావడం. చూడూ ఈ చీరల్లోకూడా ఉంటాయి ఆ అట్ట ముక్కలు.

కమ: ఆ. ఇవిగో ఉన్నాయ్. దీని మీద నలభైయొక్కటనే ఉంది. అదేదీ,......ఊఁ. నువ్వు చెప్పినట్లు, ముప్ఫయిరెండే ఉంది సరిగా:..అలా ఐతే నేనీ ఆకుపచ్చ చీరే పుచ్చుకుంటానే. నువ్వేమంటావ్?

నర: అదే పుచ్చుకో. ఆమాటకొస్తే, ఆ గులాబిరంగుచీర నా కంతగా నచ్చేలేదు. లుంగీకి మళ్లే పెద్దపెద్ద గళ్లూ అదీ ఏం బాగుందీ?

కమ: మరి బాగుండకపోతే ఎందుకొన్నావ్?

నర: ఏమిటో, ఈ ఆకుపచ్చచీర తప్ప, తక్కిన రకాలన్నీ నాకు కొత్తగానే అగపడ్డాయాకొట్లో. 'ఇది కాదని అది 'అదికాద'ని ఇదీ తిరగేసి చూస్తూంటే, ఆఖరికేది కొనాలో తేలిందేకాదు నాకు. ఏం చెయ్యడానికీ తోచకుండా నిలబడిపోయి చూస్తూంటే—ఎవరో ఓ స్కూలు పిల్లలా ఉంది— జోడు చప్పుడు చేసుకుంటూవచ్చి. ఈ గళ్ళచీరలాంటి రకమే తీయించింది. చాలా బాగుండక కుంటూ, కొనుక్కు చక్కాపోయింది. 'ఆపిల్ల బాగుందందికదా' అని ఈ లుంగీచీరే నేను కొన్నాను.

కమ: సరేకాని, వదిన ఖరీదెక్కువ కదా అని, ఆకుపచ్చ చీరే తనకావాలంటుందేమో?

నర: అలా అనదు. ఏదిస్తే అదే పుచ్చుకుంటుందది. పోనీ, ఖరీ దెక్కువని చెప్పనే చెప్పకు!

కమ: అలాకాదు. ఓ పనిచేద్దాం. ఈ నలభైయొక్క రూపాయని వేసున్నచీటి ఏమో ఆ గులాబిరంగు చీరకి తగిలిస్తే సరి! అప్పుడేమో తనకే మంచి చీరొచ్చిందనుకుంటుంది ఒదిన! ఏవంటావ్?

నర: అదుగో సూరీడొస్తోంది. నువ్వేం జేసినా సరే.

కమ: (రహస్యంగాను తొందరగాను) తొరగా ఇయ్యిదాన్ని ఈ చీటీదానికి గుచ్చెయ్. (ఏమీ ఎరగనట్టు) వదినా!

సూరీడు (ప్రవేసించి) ఏం కమలా?

కమ: మీ అత్తగారు నీకు పట్టుచీరకొంది. నాకూ కొందిలే ఒహటి.

సూరీ: నిజంగానా? ఏ మండత్తా చెన్నపట్నంలో కొన్నారా ఏవిటి?

నర: ఔనే. చూడు.

సూరీ: ఎంచక్కా ఉన్నాయండీ చీరలు.

కమ: ఈ రెండిట్లో నీకేవి బాగుందొదినా?

సూరీ: రెండూ బాగానే ఉన్నాయి కమలా.

కమ: అమ్మేమోనె నిన్నిగళ్ళచీర తీసుకోమంటోంది. గులాబీరంగు బాగుంటుందని, నీకోసం కొందిటదీన్ని

సూరీ: ఉహూ? ఔను నాకీ రంగెంతో ఇష్టం.

కమ: ఈచీర ఖరీదుకూడా ఎక్కువే, చూడూ. అంది మీద చీటిలో ఎంతనివేసుందో.

సూరీ: (చూసి) నలభైయొక్క రూపాయి! అమ్మయ్యోయ్! ఏమండత్తా, ఇంత పెట్టికొన్నా రెందుకండీ నాకు చీర?

కమ: అమ్మ నా కనికొన్న యీ ఆకుపచ్చ చీరెంతో తెలుసా?

సూరీ: ఏదీ ఈ చీరెంత?

కమ: ఇదిగోచూడు చీటీ, ఇరుప్ఫయి రెండు రూపాయలు అంతే!

సూరీ: ఇంతకంటే తక్కువా అది! ఏమండత్తా, మా యిద్దరికీ ఓ రకమేపట్రాక కమలకి తక్కువరకం పట్టు కొచ్చారేమి?......పోనీ కమలా ఓ పనిచేద్దాం? ఈ గులాబీరంగుచీరే నువ్వుచ్చుకో. నాకంటె చిన్నదానవ్; నీకు సరదా ఎక్కువుంటుందికూడాను.

చిత్రకళా శాఖ

నిర్వాహకురాలు : 'చిత్రకళా విశారద' శ్రీమతి రత్నాల కమలాబాయిగారు

(గృహలక్ష్మీ స్వర్ణకంకణ గృహీత)



జూనియర్ హిందీతరగతి

నిర్వాహకురాలు : శ్రీమతి బెన్నూరి కృష్ణవేణమ్మగారు (విశారద)

నంద్యాల మహిళాసంఘ తృతీయ వార్షికోత్సవము

కడపజిల్లాబోర్డు అధ్యక్షురాలగు శ్రీమతి కె. రామసుబ్బమ్మగారి అధ్యక్షతను జరిగెను.



పశ్చిమగోదావరిజిల్లా మహిళాసభ

తాడేపల్లిగూడెములో శ్రీమతి బత్తుల కామాక్షమ్మగారి అధ్యక్షతను జరిగెను.

నర: ఎవళ్ళకోసం తెచ్చినది వాళ్లే పుచ్చుకుందురూ ఏమిటీ దీనికోసం ఇంత ఆలోచన?
సూరీ: ఏం కమలా, నువ్వు చెప్పు.
కమ: నువ్వే పుచ్చుకోవదినా. నీకుమాత్రం మంచిచీర ఒకటైనా ఉండొద్దామిటి, మరి?
సూరీ: సరే నీ ఇష్టం......వచ్చే శుక్రవారంనాడు కొత్తబట్టలు కట్టుకుని గుళ్లో కెడదాం?
కమ: ఉహూ. చిట్టి పుట్టినరోజు వస్తోందికదూ! అప్పుడు కట్టుకుందువుగాని.
సూరీ: సరేలే అలా చేద్దాం.

2వ రంగం

(సూరీడు, నరసమ్మ, కమల.)

సూరీ: పేరంటానికి ఎవరెవర్ని పిలవమన్నారత్తా?
నర: దగ్గిరవాళ్ళని నలుగుర్నీ పిలిచి వద్దురూ, చాలు. దూరంవాళ్లని పిలిస్తేమాత్రం వస్తారుగనకనా?
సూరీ: సరే; రావో కమలా.
కమ: పద, వెడదాం.
(కొంతసేపయాక)
సూరీ: కమలా, మొదట ఈ సుభద్రమ్మగారిని పిలుద్దాం రా......సుభద్రమ్మగారూ! తలుపు తలుపు.
సుభద్ర: (తలుపుతీసి) ఏమిటర్రోయ్, విశేషం? పట్టుచీరలు కట్టుకొచ్చారిద్దరూను.
సూరీ: రేపు మా చిట్టి పుట్టినరోజండీ, మీరు పసుపు కుంకానికి రండి.
సుభ: ఓ, అలాగే. ఔనుగాని సూరీడూ, ఎక్కడ కొన్నారూ ఈ చీర? ఈగళ్లచీర లింకా మన ఊరు రాలేదే.
సూరీ: మా అత్త చెన్నపట్టణంలో కొని పట్టుకొచ్చారండీ.
సుభ: అలాచెప్పు. చెన్నపట్నంలో అంతా ఇప్పుడు ఈగళ్లచీరలే కడుతున్నారు. అందులోనూ నీ ఈడు పిల్లలు ఇవే కాని మరొకరకం కట్టడమేలేదు.
సూరీ: అలా ఐతే మా అత్తగారు నాకు చాలా ఫేషన్ చీరె కొన్నారన్నమాట.
కమ: మా అమ్మకి ఫేషన్లు తెలుస్తే ఇంకనే! ఆకొట్లో కెవరో ఓ అమ్మాయొచ్చి, ఈరకం బాగుందని చెప్పి కొనుక్కెడితే మా అమ్మకూడా కొందిట.
సుభ: ఎంతక్కొండో.
సూరీ: నలభైయ్యొక్క రూపాయటండీ.
సుభ: ఉహూ.
కమ: ఏమండీ చేస్తుందా? అంతా
సుభ: ఏమోమరి. మా తమ్ముడీ మధ్యనే ఇల్లాంటిచీర ఒకటికొని పంపించాడు. పట్నంనుంచే. దీనికీ దానికీ తేడాలేదు. ఎటొచ్చీ అంచేమో అది రిబ్బనంచు, ఇది టిక్కట్టంచు అంతే. దానికి ముప్పై రూపాయిలు కాబోలు అయిందన్నాడు మావాడు......ఖరీదుకేం లెద్దు. ఎంతిచ్చినా ఇవ్వొచ్చు; చీర చాల బాగుంది సుమా.

కమ: ఏమండీ సుభద్రమ్మగారూ నాచీర బాగుండలేదూ?

సుభ: ఏమీ, బాగుండకేం? బాగానే ఉంది. ఎటొచ్చీ......

కమ: ఏం? సందేహిస్తున్నారేం, చెప్పండి.

సుభ: అబ్బే-కొంచెం పూర్వకాలపు చీరలా ఉంది. అంతే.

కమ: కాని, జరీ ఎంతుందో చూశారా?

సుభ: ఉందిలే-జరీకోసం ఇప్పుడెవళ్లూ మోజుపడ్డం లేదర్రా.

కమ: నాచీరకూడా మా అమ్మ చాలా ఖరీదే ఇచ్చి కొందిటండీ.

సుభ: అంత జరీ ఉన్నాక ఖరీదుండకపోతుందా? నే చెప్పేదేమిటంటే, ఇలాంటిచీర మీ అమ్మలాంటి పెద్దవాళ్ళకి బాగుంటుందికాని, మీలాంటి కుర్ర పిల్లలకి ఎందుకు? పోనీ, నీక్కూడా సూరీడు చీర లాంటి గళ్లున్నదేకొనక పోయిందీ మీ అమ్మ?

కమ: (మొహం చిట్లించుకుంటూ) ఏమో మా అమ్మకిదే నచ్చినట్టుంది......రావమ్మా వదినా వెడదాం పొద్దోతోంది. ఇంకా చాలామందిని పిలవాలి.

సూరీ: ఊఁ. పద. వస్తామండీ సుభద్రమ్మగారూ.

సుభ: మంచిది.

3వ రంగం

(కమల, నరసమ్మ, సూరీడు)

కమ: అమ్మా నాకీ ఆకుపచ్చ చీరొద్దే.

నర: ఏం?

కమ: నిన్న పిలవడానికెళ్ళినప్పుడంతా వదినచీరే బాగుందన్నారు.

నర: అంటే అంటారు. ఒహళ్లు మెచ్చుకోకపోతే ఇంక మనకి బాగుండనట్టేనాఏమిటి?

కమ: ఏమో నా కక్కర్లేదిది. నిజంగా ఈచీరే ఖరీదెక్కువదని చెప్పేసి వదిన్నే పుచ్చుకోమను దీన్ని; నాకా గళ్ళచీర ఇచ్చెయ్యమను.

నర: చాలుచాలు, ఊరుకో నీ గుణాలూ నువ్వూను. ఎవరేనావింటే నవ్విపోతారు. మొదట నచ్చిందని పుచ్చుకుని ఇప్పుడు పనికిరాదని దానికిచ్చేస్తావ్? ఏం బాగుంటుందే? నిజంగా ఈచీరే ఖరీదెక్కువదని ఏ మొహం పెట్టుగు చెబుతావ్? చెబితే మాత్రం ఎవరేనానమ్ముతారా ఇప్పుడు?

కమ: అంతా నువ్వే చెబుతావ్ ముందు. అడుగుతే ఏంపోనీ? ఆవిడా మంచిచీర ఎక్కడ నాకిచ్చిపోతుందో అని బెంగనీకు. కూతుర్నికాదని కోడలికిలా ఎవ్వరూ చెయ్యరు!

నర: ఏడిశావులే. కూతురని అఘోరించే ఆవేళ దాంతో ఉత్తి పుణ్యాన్ని అబద్ధమాడాను. పాపం అక్కడికీ అది నిన్నే పుచ్చుకోమందాచీర. దానిమీద మహా ఆపేక్ష వెలిగిపోతూన్నట్టు నంగనాచిలా మాట్లాడావ్! చాల్లే మాట్లాడక ఊరుకో ఇంక.

సూరీ: (ప్రవేశించి) ఏమండత్తా శనగలెన్ని నానపొయ్యమన్నారు? (ఆశ్చర్యంతో) ఏం కమలా అదేమిటీ! ఎందుకండీ అలా ఏడుస్తోంది? ఏమన్నారు మీరు?

నర: ఏమన్లేదూ! ఎందుకేమిటీ? ఏడిచేవాళ్లు ఎందుకో అందుకు ఏడుస్తూనే ఉంటారు.......ఊ! నడు వస్తున్నా:

కళాకలాపము

ఆంధ్రులు - సంగీతవిద్య

శ్రీమతి అ. గోదావరమ్మ

ఆంధ్రులు సంగీతవిద్యయందు వెనుకబడియున్న వారని వ్రాయుట కెంతయు విచారకరముగ నున్నది. ఆంధ్రదేశములోకాని, అరవదేశములోకాని, యే ప్రదేశములందు గానసభలు జరిగినను అరవగాయకులకే ప్రాధాన్యము నొసంగుచుండుట మనమందరము ప్రత్యక్షముగ చూచుచున్నాము. అరవగాయకులు తెనుగుకీర్తనలు పాడునపుడు కొన్ని అక్షరములు ఉచ్చరింపలేకయున్నారు. వారి భాషలో 'చ-స'లకు రెండింటికిని భేదములేదు. 'చ స' గను 'స చ' గను ఉచ్చరించుట అలవాటు. ఒకానొక గానసభలో గొప్ప అరవవిద్వాంసుడు త్యాగరాజకీర్తన 'చనితోడి తేవె'ను శనితోడి తేవే' అనియు, వైశాఖోత్సవమున అనే మాటను 'వైశాఖోశవమున' అనియు పాడుచుండెను. యిటువంటిభాష ఉచ్చారణలో యెన్నియో లోపములు ఉన్నప్పటికిని మనము వారికి ప్రాధాన్యము నొసంగుచుండుటకు కారణము గుర్తింపలేకున్నాము.

అరవగాయకులు సంగీతములో మాధుర్యము, రంజన, ముఖ్యముగ నెన్నుకొని దానియందు కృషి సలుపుచున్నారు. ఆంధ్రగాయకులు తాళము, శాస్త్రము ముఖ్యముగ నెన్నుకొని రంజనగ పాడుటయందు తగు శ్రద్ధతీసుకొనుట లేదు. తాళము, రంజన కలిసినగాని పాటరాణించదు. ఆంధ్రదేశములో పేరు ప్రసిద్ధిపొందినటువంటి ఆంధ్రగాయక శిఖామణులు చెన్నపురికిపోయి రంజనగ పాడుట నేర్చుకొని అరవదేశములో తమ విద్యానైపుణ్యమును ప్రదర్శించి వారిచేత మెప్పువడసి వచ్చుచుండుట మనమెల్లరెరింగిన విషయమే. మనము వెనుకబడియుండుటకు యింకొక కారణ మేమన గాయక శిఖామణులని పేరుపొందినవారు తమ విద్యానైపుణ్యమును ప్రదర్శించుటయందే కాలము వినియోగపరచు చున్నారుకాని, యితరులను ప్రోత్సాహపరచి వారివృద్ధికై యెంతమాత్రము తోడ్పడుటలేదు. దీనికి నిదర్శనము ఆంధ్రదేశములోనే గాక అరవదేశములో కూడ ప్రఖ్యాతిగాంచిన వైణికశిఖామణియను బిరుదుపొందినటువంటి కీర్తిశేషులయిన వీణ వెంకటరమణదాసు గారు. వీణ యెవ్వరును లేనిసమయముననే అభ్యాసము చేయుచుండుట, ఆనందముగ పాడుట అలవాటని ఆంధ్రదేశములో వాడుక. శిష్యులను తయారుచేయక పోవుటయే రెండవ నిదర్శనము. యీ కాలములో సంగీతోపాధ్యాయులను దూషించనివారు లేరు. సంగీతమునకు ఉపాధ్యాయుని పెట్టిన వారమునకు రెండు పర్యాయములు వచ్చుటయు, ఆడపిల్లలకు పెండ్లిపాటనే ఉద్దేశ్యముతో కొన్నికృతులు చెప్పి వారిని ఆ విధముగ సంతోషపెట్టి కాలము గడుపుచుండుటయు మనము ప్రతిరోజు చూచుచున్నాము. యీ ఉపాధ్యాయుల బాధపడలేక కొంతమంది స్త్రీలు గ్రామఫోనులద్వారా, రేడియోద్వారా లేక గానసభలకు తరచుగాపోవుచు, సంగీతవిద్యను వృద్ధిపరచు కొనుచున్నారు. మనము ఉపాధ్యాయుల దూషించుట న్యాయముకాదు. దీనికంతయు కారణము ప్రతిపూరిలోను సంగీతము నేర్పువారు యిద్దరు, ముగ్గురుకంటె

లేకపోవుటచేతను నేర్చుకొనువారి సంఖ్య చాలా యెక్కువగ నుండుటచేతను, నేర్పువారికి కాలము చాలకపోవుటవల్లను శిష్యులకు ఎక్కువవిద్య నేర్పుటకు అవకాశములేక యున్నది. యికమీదనైన స్త్రీలందరుచేరి ప్రతివూరిలోను గానకళాశాలలు నిర్మించి సంగీతవిద్య అభివృద్ధి చెందుటకు ప్రయత్నము చేయవలెను. ఆంధ్ర సోదరీమణులందరును శ్రీమతులు బెంగుళూరు నాగరత్నం, పట్టమ్మాళ్ మొదలుగాగల అరవ సోదరీమణులను ఆదర్శముగ గైకొని గానమును అభ్యసించి సభలలో తమ విద్యా నైపుణ్యమును ప్రదర్శింప చేయుటకు దృఢముగ పూనుకొనవలెను. స్త్రీల సమాజములలో సంగీతవిద్య తెలిసిన వారిచేత నెలకొకసారి సభ చేయుటకు ప్రోత్సాహపరుపవలెను. యిట్లు చేయుటవలన స్త్రీలకు సభా పిరికితనములేక సభలలో ఎంత జనమున్నను ధైర్యముగ పాడుటకు అవకాశము కలుగును. స్త్రీలగాత్రము పురుషుల గాత్రముకంటె యెక్కువ మాధుర్యముగ నుండుటవలన స్త్రీలు సంగీతవిద్యను అభ్యసించిన ఆంధ్రదేశములో గానకళ అభివృద్ధిచెంది దేశమంతటను ఆంధ్రవనితలయొక్క కీర్తి వ్యాపించుననుటకు సందేహములేదు. మంచి గాత్రములేనివారు వీణ ఫిడేలు మొదలగు వాద్యములతో తమ పాండిత్యమును వెల్లడించిన ప్రజలకు ఆనందకరముగ నుండును.

ఉభయతారకము

శ్రీ కర్లపాలెం కృష్ణరావు (సాహిత్యలత సంపాదకులు)

ఇసుకపడకల బొరలుట ఈలలూదు యేటితరగల కొసరి వీక్షించుచుంట
పూలతోనాడు గాలిలో పాలుగొంట ఆదినుండియు నైజంబులగును నాకు.

చైత్రయాత్రలు సొగసుల చదువునేర్పె పూలగుత్తులు శిల్పము బోధజేసె
మలయపవనుడు స్వాతంత్రములను గరపె విప్పి విజ్ఞానమును వినువీధి జెప్పె.

అంద మానంద మినుమడై, అంతరంగ మందు వెలసిన భావము లంతులేక
వదనమందున వెలువడె వాణియగుచు, కోరిచేరెను కవితాకుమారి నన్ను.

ప్రకృతియే నాకు వశమగు ప్రతిభతోడ, అమృత తేజము లేఖిని యందు నిలువ
వ్రాసినది యెల్ల మధురమై భాసిలంగ విమల విఖ్యాతి నార్జించి వినుతిగంటి.

సతము కవితావినోదినై సంచరింప చిత్త మేకాగ్రతనుజెందె చిత్రగతిని
అన్యచింతలు గనని నా యాత్మయపుడు తథ్యముగ జూచె బహ్మపదార్థ మొకటి.

ఏ మహాశక్తి నరునిగావించు ఋషిగ ఏ మహాశక్తి దేవత్వ మిచ్చె ఋషికి
ఏ మహాశక్తి జగతి సృష్టించగలదొ ఆ మహాశక్తి యగు తపస్సందుకొంటి.

మత్పురాకృత పుణ్య సంతతులు పండి నేను కవిరాజునైతిని, దానజేసి
తపసినైతిని జన్మము ధన్యమయ్యె * కవియు ఋషియును నొకడె కాదె తలప!

* నానృషిః కురుతే కావ్యమ్.

ఇప్పుడు పెద్ద సైజు లక్సు అమ్మబడుచున్నది

ఇప్పుడు సొగసైన వానిని లక్సును ఎక్కువగ వాడి జాగ్రతగ కాపాడ వచ్చును. పెద్ద సైజు లక్సు పెట్టె నీ పైకమునకు ఎక్కువ సోపును ఇచ్చును. చన్నీటిలో లక్సు ధారాళముగా నురుగును ఇచ్చును. లక్సు నురుగులో సొగసైన నీ గుడ్డలను ఉతికిన పిదప ఆరవేయుము. నీళ్లలో భద్రముగానుండు వస్తువులన్నియు లక్సులో కూడ భద్రముగానుండునను మాట మరవకండి!

మన పైకమునకిది ఎక్కువ లక్సు ఇచ్చును.



సాధారణ సైజు, చిన్న సైజు లక్సు కూడను పైకమునకు చాల మంచి విలువను ఇచ్చును

LX. 9-172 TL

LEVER BROTHERS (INDIA) LIMITED

కడుపుశోకం

● శ్రీ తోట లక్ష్మయ్య

★

పుట్టనూపోనూ, పుట్టనూపోనూ. ఈ విధంగా ఏ డెనిమిది కాన్పులు పోయాయి. గుమ్మడిపండ్లంటివాళ్లు. మేలిమి బంగారానికైనా వన్నెపెట్టచ్చుగాని, ఆ అర్ధాయుసు బిడ్డలకు మాత్రం పేరుపెట్టేవాళ్లలేరు. ఎవర్ని మరుద్దామన్నా మరవచ్చుగాని, ఆ బిడ్డలు, ఆ బంగారబిడ్డలు, ఆవజ్రాల కొండల్నిమటుకు మరచి ఏతల్లీ జీవించలేదు. ముచ్చటగా మూడు నాలుగేండ్లుపెరగటం, వారి ఋణంవారు తీర్చుకోవటం, చక్కాతిర్గి వారిదార్ని వారు పోవటం. ఈలాంటి పుత్రశోకాన్ని భరించటానికి కాబోలు ఆ భగవంతుడీ జానికమ్మ నీలా సృష్టించాడు. ఈ సంసారాన్ని తలచుకునేటప్పటికి ఆమె గుండెలు గుభీలుమనేవి. మనస్సు వ్యాకులత చెందేది. కడుపులో తాటాకుల మంటపెట్టినట్లుండేది.

ఆలాంటి పరిస్థితుల్లో జానికమ్మకు దిక్కు, తోవ తోచలేదు. ఈ ప్రపంచమంటేనే అసహ్యమేసింది. ఆమెకంతా అంధకార బంధురంగానే కనపడ్డది. బిడ్డలుకోసమని ఆ తల్లిపడ్డకష్టాలు కష్టాలుకావు. తాయిత్తులు చేయించుకొనేది. విభూతి పెట్టించుకొనేది. ముక్కుమొఖంవుండే రాళ్లన్నటికీ మ్రొక్కేది. ఉపవాసాలుండేది. వ్రతాలుచేసేది. నానాటికి కృశించిపోయింది. ఈ కష్టాలన్నీ దేనికి? ఆ కాయలకోసం.

పేరయ్యకు యాభయ్యోపరవిడి దాటింది. మహాబీదకుడు. రెక్కలున్నంతవఱకూ వాటి నమ్ముకొని బ్రతికేవాడు. పెద్దతనంలో యీ కష్టాలు, కష్టాలకుతగినట్లు కళ్లు కనపడకపోవటం, వెనకాముందూ బంధువులెవరూ లేకపోవటం, ఆస్తులుపాస్తులు శూన్యంకావటం ఇవన్నీ వక్కసారేకలిసి వచ్చాయి. తాను పోవాలి, బేడో పావలో సంపాయించాలి. పొయ్యిమీద కుండెక్కాలి. అంతలో భగవంతుడి దయవల్ల జానికమ్మ గర్భం దాల్చింది. కడుపు పండిందనుకొంది. కష్టాలు తీరాయనుకుంది. కాని, భగవంతుడు మటుకుమాచి ఓరుస్తాడు! ఆమె కడుపున ఈబిడ్డపడటం. భర్తకు వల్లువాపుచూపటం. తింటానికి లేకపోవటం. ముసలితనంలో యిన్ని కష్టాలురావటం. ఈ దిగుళ్లతో మనిషి సగం క్రుంగిపోవటం. ఆమెకు ఏడో మాసంవచ్చింది. చిత్తస్వాతులు ప్రవేశించటంతోటే ఆ వృద్ధుడు, ఆ జానకమ్మపెనిమిటి, జీవాల్ని విడవలేక, విడవలేక, విడవాల సొచ్చిందిగదాయని విడిచేసి, ఆతల్లి నీ లోకంలో ఏకాకిని చేసి పోయాడు.

మందభాగ్యురాలు జానికమ్మ ఏం చేస్తుంది? ఎటుచూచినా నిరామయం. తింటాకిని తిండీలేదు, కట్టటానికి బట్టాలేదు, ఉంటానికి తావూలేదు. తాకట్టుదారుడొచ్చి ఇల్లు ఖాళీచేయమన్నాడు. నిండు గర్భం. ఏమీ పాలుపోలేదు. ముందునుయ్యి, వెనుకగొయ్యి. మానం కాపాడుకోవటానికిమటుకు పదిపన్నెండు మూళ్ల చినిగినకోకొకటి చుట్టుకొని, చిరకాలంనుంచి తన భర్తతో కాపురంవున్న ఆ గృహాన్ని విడవవలసొచ్చిందిగదా భగవంతుడా అని దుఃఖించి, ఒకరోజున, వేకువ జామునే లోకులకళ్ళల్లో పడకుండా బయలుదేరి, పొద్దు కొండలో పడేటప్పటికో పల్లె చేరుకుంది.

♦ ♦ ♦ ♦

అదో చిన్నపల్లె. ఆపల్లెలో ఆసామీల బజారు చేరింది. అంతవఱకుకూడ పొరిగింటిలో, కూటికిగాను పరిచర్య చేయనటువంటి ఆ యిల్లాలు ఒక ఆసామింట్లో కుదిరింది. ఆయన, కొట్టంలో పొగ

చూపాడు. దాంట్లోనే ఆమెవుంది. నవమాసాలు నిండాయి. నడవలేదు. ఇరుగు పొరిగిండ్లకుపొయ్యి అడుక్కోలేదు. ఆమెను చూచినవారంతాకూడా చాలా విచారపడ్డారు. ఈ దిక్కులేనివాళ్ల కీకడుపు లెందుకని కొందరన్నారు. ప్రతివాళ్లు ఏదో తమకుదోచిన సహాయం వాళ్లుచేసారు. పదోమాసం సగంతరానికి, కష్టాలకిష్టయ్య, కష్టాలేంపెట్టకుండానే భూమిమీదపడ్డాడు. పండుకుంటానికో కుక్కిమంచం, బిడ్డనెత్తికి ఆముదం, పక్కకు పాత్తిగుడ్డలు, బాలింతరాలికో పాత చెప్పులజోడు ఆయమ్మా ఈయమ్మా యిచ్చారు. ఆ కాపు కూతురు చిన్నపిల్ల, సుబ్బమ్మమటుకు కిష్టయ్యదగ్గర్నే ఎప్పుడూ వుంటూవుండేది.

మూడేళ్లు ఈవిధంగా గడిచాయి. ఆబిడ్డను చూచుకుంటూవుంటే భర్త పొయ్యాడనే దిగులామెకు కొంచెం కొంచెంగా తగ్గుతుండేది. కిట్టడుగూడా తల్లి కూర్చుంటే, మంచినీళ్లు తీసుకొచ్చేంత మొనగాడయ్యాడు. కిట్టడేవిధంగా రోజూరోజూ పెరుగుతూన్నాడో, ఆమెదిగులు రోజుకు రోజుకు ఆ విధంగా తగ్గుతుండేది. కొడుక్కి చదువు చెప్పించాలని తల్లికి మహాప్రేమ. అయిదో ఏడురాగానే అక్షరాలుదిద్దబెట్టింది. వీధిబళ్లోవేయించింది. అల్లరిగిల్లరి చేయకుండా చదువుకుంటూవుండేవాడు. నాలుగోతరగతికూడా ప్యాసయ్యాడు. తర్వాత ఆవూరి కైదారుమైళ్ల దూరంలో ఓ హైస్కూలువుంటే అందులోచేరాడు. వాళ్ళ వీళ్లనడిగి వారాల కుదుర్చుకున్నాడు. బళ్లో పిల్లకాయలచేత, తననోటి మంచితనంచేత, చందా లేయించుకొని, జీతాలుగడిపి, మెల్లిగా స్కూలుఫైనలుగూడా ప్యాసయ్యాడు. ఆస్కూలు హెడ్మాష్టరుగూడ కృష్ణమూర్తి అంటే దయగల్గి, జాలేసి, గవర్నమెంటు స్కాలరుషిప్పుగూడా తెప్పించాడు.

ఇంతలో జానికమ్మవున్న కొట్టంలోనుంచి, యింకోచోటికి పోవాలసొచ్చింది. ఆ ఆసామే, వేరే ఒకచోట స్థలం చూపించాడు. వాళ్లువీళ్లు బొంగులు, తాటాకు సప్లయిచేస్తే, ఓచిన్న గుడిసెవేసుకుంది. ఏలాగో ఒక పాతికరూపాయలువెనకేసింది. దానితో ఒక బర్రెనుకొని పాడిచేసి, పాలు, పెరుగు, నెయ్యి, అమ్మకొని, ఇరుగు పొరుగాళ్లకి చాకిరిచేసి, నలభైయాభై రూపాయలువెనకేసింది.

ఇక కృష్ణమూర్తి కాలేజీకిపోవాలి. పోవటానికి సిద్ధమయ్యాడుకూడా. జానికమ్మనుమటుకు, దుఃఖము సంతోషం, ఒకేసారి కప్పేసాయి. ఇంక నాలుగు సంవత్సరాలదాక, కొడుకును చూచుకోను కావాలనని దుఃఖము. భర్తపోయినా, కాపురంవున్నయిల్లు పోయినా, అక్కడ చేసికొని, ఇక్కడ చేసికొని, కొడుక్కి చదువు చెప్పించినందుకుగాను, కాలేజీకి పోగలిగినాడే అనేటటువంటి సంతోషం. ప్రయాణమయ్యాడు, దాచిపెట్టిన డబ్బుకాస్తా మూటకట్టి జాగ్రత్త అని చెప్పింది. ఆ కాలేజీమటుకు దగ్గరా దాపా? ఇరవై ఆమడ. అంతవఱకు తల్లి కొడుకుని చూడనటువంటి రోజులేదు. ఇంక ఈ నాలుగు యుగాలు గడపటం ఏలా అనుకునే టప్పటికి, తెలియకుండానే, కళ్ళనుంచి బొటబొటరాలినయి. సిద్ధమయ్యాడు. పోబోతున్నాడు. సాగనంపటానికి బయలుదేరింది. కళ్లనిండా నీళ్లు కమ్మినయి. 'నాయనా, ఇంక ఎన్నాళ్లకో కదా!'అని అన్నది. అయిదారడుగు తీశాడు. మళ్లా 'నాయనా' అని పిలిచింది. ఆగాడు, దగ్గఱకు పోయింది. ముద్దెట్టుకుంది. గోళ్ళతో తలదువ్వింది. పంపించటానికి చేతులురాలేదు. ఇద్దఱూ ఊరుదాటి ఒచ్చారు, ఎవ్వరూలేదు. ఆకాశంలో ఆతండ్రి, క్రింద ఈ కొడుకూతప్ప. 'ఇక పోయిరానాయనా'అంది. పది పణ్ణండడుగులేశాడు. తాను గబగబావెంటనే పోయింది. నడక సాగలేదు. ఎంతదూరంపోయినా, కలుసుకోలేననుకుంది. తిరిగి 'నాయనా'అని పెద్ద కేకేసింది. మూర్తి తిరిగొచ్చాడు. తల్లిని కాగలించుకున్నాడు. ఆ ముఖంలో తల్లి భర్తనుచూచింది. వెనుకటి కష్టాలన్నీ జ్ఞప్తికొచ్చాయి. ఆపుకోలేకపోయాడు.

తనకు తెలియకుండానే తానూ ఏడ్చాడు అంతవఱకు, కాలేజీకిపోతామనే సంతోషమేగాని, తల్లిని ఒక్కతి పెడతన్నామనే విచారం లేనటువంటివాడు. జానికమ్మ గుండెనిబ్బరం చేసుకుంది. 'పోయిరా-నాయనా' అని చెప్పాలని నిశ్చయించుకొన్నది. చెప్పటానికి ప్రయత్నించింది. చెప్పక తప్పిందిగాదు. చెప్పింది. తల్లిని మళ్లా కౌగిలించుకున్నాడు. ఆఖరుసారి 'వెళ్తానే' అన్నాడు. వెళ్లాడు. నిలుచుండి కనపడేంతవఱకూ తిరిగి చూస్తూవున్న కొడుకుని చూస్తూ నిలుచుంది. చివరకి, డొంకమూల తిరిగింది. కొడుకు కనపడలేదు. ఊరువైపుకు మొఖం దిప్పింది. వెనుకటి సంగతంతా జ్ఞప్తికొచ్చింది. చివరకిల్లుచేరింది. ఆరాత్రి అన్నం దినలేదు. అన్నం తినబోతూవుంటే మూర్తి జ్ఞప్తికొచ్చాడు. పండుకోబోతుంటే జ్ఞప్తికొచ్చాడు. ఆరాత్రి నిద్రే పట్టలేదు. ఈవిధంగా రెండు మూడువారాలు గడిచాయి. రెండుమూడు సంవత్సరాలుగూడా గడిచాయి.

♦ ♦ ♦ ♦

అక్కడ మూర్తి కాలేజీలోచేరాడు. కులాసాగానేవున్నాడు. యఫ్. ఏ. ప్యాసయ్యాడు, బి. ఎ. లో చేరాడు. మూడోసంవత్సరం జరిగింది. నాలుగో సంవత్సరం సగం జరిగింది. బి. ఎ. జూనియర్ లోనే ఒక స్నేహితుడితో సహవాసం కుదిరింది. ఆ స్నేహితుడు భాగ్యవంతుడు. ఇద్దఱూకలిసే చదువుకునేవాళ్లు. యూనివర్సిటీ పరీక్షలు, ఇంకోనెల్లో వచ్చినయి. బాగానే చదివారు. పరీక్షకు కూర్చున్నారు. తృప్తికరంగానే రాశారు. చివరకు ఏలోగ ఆలాగ అయిపోయినాయి.

అది ఏప్రల్, 15వ తేది సాయంత్రం. పరీక్షలు అయిపోయినాయి. ఆసాయంత్రమే ఇంటికి టెలిగ్రామిచ్చాడు, మరుసటినాడు సాయంత్రం 10 గంటల బండికి చేరుతానని. సామానంతా సర్దేశాడు. ఒక రోజా, ఒకనెలా, ఒకసంవత్సరమా, నాల్గు సంవత్సరాలు దాదాపు ఎప్పుడు ఇంటికెళ్దామా, ఎప్పుడు తల్లిని చూద్దామా అనివున్నాడు మూర్తి. 'ఈ రాత్రి బయలుదేరుతున్నాన'ని స్నేహితుడితో చెప్పాడు.

'ఎక్కడికి'

'ఇంటికి'

'ఈరాత్రి టాకీచూచుకుని రేపుదయం బయలు దేరచ్చులే'

'కాదు మఅమ్మకు రేపొస్తానని టెలిగ్రామిచ్చాను. ఆమె నాకోసం ఎదురుచూస్తుంటుంది.'

'ఏం మూర్తీ, ఇంకా ముసలివాళ్లమాటల్లోనే, బి. ఏ. జదివి గూడా'

'కాదు, చాలారోజులయింది ఇక్కడకొచ్చి'

'ఎన్ని రోజులవుతుంది'

'నాలుగు సంవత్సరాలు'

'ఇన్ని సంవత్సరాలుండచ్చుగాని, ఈ రోజొక్కటి పట్టుకుంటుంది' అని బలవంతంచేశాడు. మాట తప్పించుకోలేకపోయాడు. మరునాడు మధ్యాహ్నం బయలుదేరుదామనుకొన్నాడు.

♦ ♦ ♦ ♦

తల్లికి టెలిగ్రాముఅందింది. ఆమె ఆనందానికంతులేదు. ఒకసారికి ఏడుసార్లు తృప్తిదీర చదువుకుంది. జాగ్రత్తగా దాచిపెట్టింది. ఇరుగుపొరుగువారికి సంగతిచెప్పింది. పూరికొంప బూజుదుల్పింది. లోపల

బయటా బాగాఅలికింది. కొడిక్కిష్టమైన పిండివంట ఏదోచేసింది. బి. ఏ. చదివొస్తున్నాడుగదా, కింద్కెట్లా కూర్చుంటాడని అరువుకు, పాతకుర్చీ తెచ్చేసింది. అంతా తయారుచేసింది. ఆనందంలో మునిగిపోయింది. కూనరాగాలు తీయటం ప్రారంభంచేసింది. 'ఎప్పుడీ యాళిటప్పుడు, ఇంట్లోవుండదే! రాగాలు గూడా పాడుతుందే' అని దోవనబొయ్యే ముసలివాడొకడొచ్చి తడిక తొయ్యగానే సిగ్గుపడి, అబ్బాయివస్తాడని చెప్పింది. టెలిగ్రాముకూడా చూపించింది. తాను మళ్లాచదువుకుని జాగ్రత్తచేసింది. తర్వాత బయటికొచ్చి కూర్చుంది. పొద్దు కొండలోపడ్డది. 7 అయింది, 8 అయింది, 9 అయింది. అందరు అన్నాలుతిని నిదుర బోయారు. తానుమటుకు తినకుండానే ఎదురుచూస్తూంది. 10 అయింది 10-30 అయింది, కొడుకింకారాలేదు. నడిచిరావాలగదా స్టేషనుదగ్గఱనుంచి, ఆలశ్యం అవుతుందిగదా యనుకుంది. కొడుకుని చూడాలని చాలా ఆతురతతోవుంది. పండు పండిందిగదా కష్టాలు దరిబట్టినాయిగదా, అని ఏదో ఏదో అనుకుంది. నిముషము యుగంగావుంది ఆమెకి.

పట్టాలు తొలిగినందున, ఆనోజు 10 గంటలకు రావాలసినబండి పడిపోయింది. పాతికో, ముప్పయ్యిమందో మరణించారు. అందులో నలుగురు కాలేజీ విద్యార్థులుగూడా వున్నారట అన్నవార్త స్టేషనుమాష్టరుకు తెలిసింది. స్టేషనంత ఒక్కసారి ఘల్లుమన్నది. ఈపల్లెటూరివాళ్లు కొందఱక్కడ పనిచేసే వాళ్లు రాత్రి 11 అప్రాంతాన ఇల్లుచేరారు. ఊరంత నిశ్శబ్దంగావుంది. అందరు నిద్రపోయారు. ఇంటి ముందు జానికమ్మ ఒక్కటేమటుకు కూరుచుంది. 'ఏం జానికమ్మ, ఈయాలదాక మేలుకున్నావు నిదుర బోకుండా' నన్నారు. ఈ బండికి అబ్బాయివస్తాడు అందుకని ఎదురుచూస్తున్నాను. ఇంకారాలేదు అని అన్నది. పిడుగువంటివార్త, వారామెచెవిని వేయాలసొచ్చింది.

'రైలుపడ్డది. జనంచచ్చారు. కాలేజీపిల్లకాయలు గూడా అందులోవున్నారట'అని అందులో ఒకడుచెప్పాడు. గోడకానుకున్న జానికమ్మ 'ఆ!' అన్నది. కడసారి ఆవలించింది-అంతటితో ఆమెకష్టాలన్ని ఒక్కసారి దరిబట్టాయి-

మూడోరోజు కొడుకు స్టేషనులోదిగి ఉళ్లోకొచ్చాడు. తల్లి ఎదురురాలేదు, ఇంటిముందుకొచ్చాడు తలుపేసివుంది. ఇల్లు తమదేగదా అని పరికించాడు. తమదే. తల్లిలేదు ఇంట్లోనేగాదు, ఈ లోకంలోగూడా అని దగ్గఱ తులశమ్మచెప్పింది. 'అయ్యో! అమ్మా!' అంటూ అక్కణ్ణే పడ్డాడు-

యం మాతాపితరౌ క్లేశం సహేతే సంభవే నృణాం,
న తస్య నిష్కృతిశ్శక్యా కర్తుం వర్షశతై రపి.

తల్లిదండ్రులు బిడ్డల పుట్టుకకై యెంతకష్టము పడుదురో, ఆకష్టము నూఱేండ్లకయినను దీర్పశక్యము కాదు. తల్లి గర్భమునం బదినెలలు మోసి, ప్రసవవేదన ననుభవించి, పుట్టినబిడ్డను పెంచి పెద్దచేయుట, తండ్రి పసితనమున సంరక్షణముచేయుట, యుపనయనముచేయుట, వేదవేదాంగాదులను జెప్పించువిషయమై కష్టముపడుట, వీరియిద్దఱి యాశ్రమ ఎన్నిజన్మములకైనను తీరదు.

—మను స్మృతి.

గానకళ ★ సంగీతోపాధ్యాయ శ్రీగాలి పెంచలనరసింహారావు

మనోమయం రాగము — గజజంపె తాళము

శ్లో॥ గజజంపేచయమళో విరామాంతం ద్రుతద్వయమ్ ॥

ఆరోహణ : సరిమపదస	}	,, కా. ఖ. ,, ఖ. చ. ఖ. ,, కై. ఖ. ,, ఖ. అం ఖ. ,,
అవరోహణ : సనిదపమరిమపనిదపమగరిస		స. ని. ద. ప. మ. రి. మ. ప. ని. ద. ప. మ. గ. రి. స.

ఔడవ వక్రమము

ఈ తాళము నూటొక్క తాళ ప్రస్తారమునందు 77-వ తాళము

వ్రేలికి రెండు అక్షరముల చొప్పున ఘాతమీదనుండి ఎత్తుకొనవలయును

పల్లవి : సతతము నీ భజనమె నాకు, నతజన పరిపోషణపరాక॥ సతతము॥

అనుపల్లవి : సుతుడని నీ మనమున లేద, నుతులను జేసిన దయరాద॥ సతతము॥

చరణము : అతులితముగ నీ నామమును, కృతులుగ వ్రాసితిగద రమణా
పతితుల బ్రోచెడు బిరుదమును, మదినిడ నీ మహిమ కరుగదె॥ సతతము॥

పల్లవి :	సారీమామా	రీమాపాదా	పమపమ	గరిగరి	సని	
	సతతము	నీఈభజ	నఅమెఎ	నఅఅఅ	కుఉ	
	సారీమామా	సరిమపపాదా	పమపమ	గరిగరి	సని	
	సతతము	నిఇఇఇభజ	నఅమెఎ	నఅఅఅ	కుఉ	
	సారీమామా	మగరిస రిమపదా ,,, పదా ,	పమపమ	గరిగరి	సని	
	సతతము	నిఇఇఇఇఇఈ ,,, భజా ,	నఅమెఎ	నఅఅఅ	కుఉ	
	సారీమామా	పమపద - సనిదప	మగరీ సరిమప	నీ, దపమగరి	సానీ	
	సతతము	నిఇఇఇ - భఅజఅ	నఅఆమెఎఎ	ఏ, ఎనఆఅఅ	కూఉ	
	సారీమామా	సమరిప మపదా , పదా	పమపమ	గరిగరి	సరి	
	సతతము	నిఇఇఇఇఈ , భజా	నఅమెఎ	నఅఅఅ	కుఉ	
	మాపాదాసా	సనిరిస - నిదనిద	దపపమ	రిమపనిదాపమ	గరిసా	
	నతజన	పఅరిఇ - పోఒఒ	షఅణఅ	పఅరఅఆకఅ	అఅఆ	
	మాపాదాసా	సనిగరి - సనిదస	నిదపమ	రిమపనిదాపమ	గరిసని	
	నతజన	పఅరిఇ - పోఒఒ	షఅణఅ	పఅరఅఆకఅ	అఅఅఅ	సత॥
అనుపల్లవి :	పామాపాదా	సా ,, - సాసా	సనిరిస	నిదనిద	పమ	
	సుతుడని	నీ ,, - మన	ముఉనఅ	లెఎఎ	దఅ	
	పదపమ - పదపద	సనిసా - సనిగరి	సనిరిస	నిదనిద	పమ	
	సుఉతుఉ - డఅనిఇ	నిఇఈ - మఅనఅ	ముఉనఅ	వైఎఎ	దఅ	
	పదసా - నిదపమ	రిమపని - దపమగ	మగపమ	గరిగరి	సని	
	నుఉతూ - లఅనుఉ	జెఎఎ - సిఇనఅ	దఅయఅ	రఅఅఅ	దఅ	
	సనిరిస - నిదనిద	పమదప - మగపమ	రిమపనిదా	పమగరి	సని	
	నుఉతుఉ - లఅనుఉ	జెఎఎ - సిఇనఅ	దఅయఅఅ	రఅఅఅ	దఅ	సత॥
చరణము :	సారీమామా	మరిమా - పదమప	మగపమ	గరిగరి	సని	
	అతులిత	ముఉగా - నిఇఇఇ	నఅఅఅ	మఅముఉ	నుఉ	
	సా సరిసని సరి సరిమా	మరిమా - పమగరి	సమరిప మపదా	పమపమ	గరి	

అతుఉఉఉలిఇతఅఅ	ముఉగా - నిఇఇఇ	నఅఅఅఅఅఅ	మఅముఉ	నుఉ
సారీ - సానీ	సారీ - మామా	రీమా	పాదా	పా
కృతు - లుగ	వ్రాఅ - సితి	గద	రమ	ణా
సాసరి - సాసని	సరిమా - మరిమా	పాపమ	పాపద	పా
కృతుఉ - లుగఅ	వ్రఅఅ - సిఇతీ	గాదఅ	రామఅ	ణా
పామాపాదా	సా ,, సాసా	సనిరిస	నిదనిద	పమ
పతితుల	బ్రో ,, చెడి	బిఇరుఉ	దఅముఉ	నుఉ
పదపమ - పదపద	సనిసా - సనిగరి	సనిరిస	నిదనిద	పమ
పఅతిఇ - తుఉలఅ	బ్రోఒఒ - చెఎడిఇ	బిఇరుఉ	దఅముఉ	నుఉ
పదసా - నిదపమ	రిమపని - దపమగ	మగపమ	గరిగరి	సని
మఅదీ - నిఇడఅ	నిఇఇఇ - మఅనఅ	నుఉగఅ	రుఉగఅ	డెఎ
సనిరిస నిదనిద	పమదప - మగపమ	రిమపనిదా	పమగరి	సని
మఅదిఇ నిఇడఅ	నిఇఇఇ - మఅనఅ	నుఉగఅఅ	రుఉగఅ	డెఎ

చిట్టస్వరము.

సరీమాపమగ	రీసరి మపదా	పదామ	పదాద	సా	
రీసనీనిదద	పమ - రిమాపనిద	పమగరి	పమమ	గరి	సత॥

గమనిక: నఠభైరవి మేళకర్తయందు జన్యమగు భైరవిని పాడునపుడు, ఆరోహణమందు చతుశ్శృతి దైవతమును, అవరోహణమందు శుద్ధదైవతమును వాడుట సహజమైయున్నది. యిటులనే మనవాడుకలో గల అనేకరాగములు ఫలాని మేళకర్తయందు జన్యమని వ్రాసినను, దేశీయముగా పాడుకొను నభ్యాసము కలదు. అటులనే యీ రాగమునకును అవరోహణమునుంచి వక్రించు "రి మ ప ని" యని పాడుకొనునపుడు చతుశ్శృతిరిషభమును, కైసికినిషాదమును వేసి పాడుకొనవలయును.

గజఝంపె తాళమును ఒక గురువును, రెండు ద్రుతములును, ఒక అనుద్రుతమును కలదు. అందు గురువును, రెండు చతురశ్రజాతి లఘువులక్రింద విభజించి వ్రాయడమైనది. మనకు 35 తాళములలోనే కొన్ని తాళములు వాడుకలో లేవు. గనుక, ముప్పైయైదు తాళములందు కొన్ని మాటొక్క తాళమునందు కొన్ని కృతులను వ్రాసియుంటిని. క్రమేపి పాఠకులకు తెలియపరచగలను.





మీరు మనోహరమైన చర్మమును పొంద వచ్చును

వలపుగొలుపు సుందరచర్మము స్త్రీలుపొందుటకై జాగ్రత్త అవసరము. గాలి దుమ్ముసోకుటచే చర్మము కళకాంతులను గోల్పోవును. పాండ్స్ క్రీమ్ ప్రతిదేశములోను చర్మమునకు నూతనమైన మృదుత్వముకొరకు స్త్రీలు వాడుదురు. అదిచర్మరంధ్రముల లోనికి దూరి మురికిని తొలగించును. పాండ్స్ క్రీమును వ్రేలికొనతో తీసికొని చర్మముమీదరాచి, మృదువైన గుడ్డతో దులిపి, మరికొంచెము క్రీమును మరల తేలికగపూసి, రాత్రి అంతయు ఆహారనుఉంచవలెను. ఈరీతిగ 10, 15 దినములు రాత్రులందు వాడిన చర్మము మృదువై, లేతనగుట కాననగును. గాలి దుమ్మునుండి చర్మమును రక్షించే పాండ్స్ వ్యానిషింగ్ క్రీమ్ అన్ని స్టోర్సులలో దొరకును. లేక పాండ్స్, పో॥బా॥144, బొంబాయికి వ్రాయుడు.



పాండ్స్ క్రీమ్



పిన్ని ఉత్తరాలు

మైసూరు రాజ్యం

సర్వమంగళా,

దసరాపండుగుల హడావిడిలో నీకు ఉత్తరంరాయడం ఆలస్యమైంది. ఇక్కడంతా బొమ్మల కొలువులు పెట్టేరు. నువ్వుకూడా కొలువు పెట్టుకున్నావా? మీయింట్లో నవరాత్రి పూజచేశారా?

మన ఇళ్లల్లో ఉత్సవాలకేంగాని, దసరా ఉత్సవాలు చూడాలంటే మైసూరు వెళ్లాలి. మైసూరు ఓ దేశమనీ, అక్కడ కన్నడభాష మాట్లాడుతారనీ ఇదివరకు ఉత్తరంలో రాశానుకదూ! ఆ దేశానికి ప్రత్యేకం ఓరాజున్నాడు. ఆయనకి చాలా ఏనుగులున్నాయి. ఆ ఏనుగులన్నింటినీ చక్కా ముస్తాబుచేసి దసరా ఉత్సవాల్లో ఊరేగిస్తారు.

మైసూరులో రాజుకు మల్లే మన తెనుగుదేశంలోనూ, అరవదేశంలోనూ రాజులేడు. ఈ రెండు దేశాల్ని గవర్నరు పాలిస్తున్నాడు. గవర్నరంటే ఓదొర. ఈ దొరపోతే ఈయన కొడుక్కి గవర్నరుపని అవదు. కాని మైసూరులో అలాకాదు. మహారాజుపోతే, ఆయన కొడుక్కి రాజ్యం వస్తుంది. రాజు చేతులో ఉంటుంది రాజ్యం అంతా. ఆయనకి మంచి దర్బారు ఉంటుంది. సలహా చెప్పడానికి మంత్రి ఒహాడుంటాడు. ఒహాళ్ళకిలొంగి ఉండకుండా రాజు స్వాతంత్రంగా రాజ్యంచేసుకోచ్చు. అందుకే మైసూరు ఓ స్వతంత్రరాజ్యం అన్నమాట. మనం తిరువనంతపురం వెళ్లేం చూడు; ఆ రాజ్యంకూడా స్వతంత్రరాజ్యమే; అక్కడకూడా ఓ మహారాజున్నాడు. హైదరాబాదుకూడా స్వతంత్రరాజ్యమే. ఇది చాలా పెద్దరాజ్యం; దీన్ని రాజుకాదు రాజ్యంచేస్తోంట; ఓ నవాబురాజ్యం చేస్తున్నాడు.

మనం తిరువనంతపురం వెళ్లేటప్పుడు కొండలుదాటి వెళ్లేం చూడూ. ఆ కొండలను "పడమటి కొండ"లంటారు. ఆ కొండలకి తూర్పున ఉంది మైసూరు రాజ్యం. ఈ ప్రదేశం ఎత్తుగా వుంటుంది; ఇలా ఎత్తుగావున్నభూమిని పీఠభూమి అంటారు, ఇక్కడకురిసే వర్షమంతా పల్లాలకి పోతుందికాని ఇక్కడ నిలబడదు. అంచేత నీరులేక వరిలాంటి పంటలుపండవు. జొన్నలు - అలాంటివి పండుతాయి.

నువ్వు కావేరీనది చూశావుకదూ. శ్రీరంగందగ్గరా, కుంభకోణందగ్గరా ఆ నదిలో స్నానం కూడా చేశాంమనం. ఆనది ఎక్కడ పుడుతోందో, తెలుసా? పడమటి కనుమలలో పుడుతోంది. కొండలు ఎత్తుగా వుంటాయి. అక్కడపడ్డ వర్షం అంతా ఈనదికింద అయి, మైసూరు పీఠభూమిలోంచి ప్రవహించి, తూర్పుగాదిగి ఆఖరికి సముద్రంలో కలిసిపోతోంది.

కుత్తాలందగ్గర కొండమీంచి ధారపడుతోంటే చూశావుకదూ. ఎత్తుమీంచి నీరు అలాగ ఒక్కమాటుగాపడితే దాన్ని 'జలపాతం' అంటారు. కావేరీనది ఓచోట అలా ఎత్తుగా పడుతుంది. చాలా వేగంగా పడుతుంది నీరు. కుత్తాలందగ్గరకుమల్లే ఈ ధారకింద ఎవరూ స్నానం చెయ్యడానికి వీల్లేదు. అంత వేగంగా పడుతుంది ధార. ఈ ధారకింద పెద్దపెద్ద మిషన్లుపెడితే, ఈ ధారవడికి ఆ మిషన్లు పనిచేస్తాయి. అప్పుడు విద్యుచ్ఛక్తి పుడుతుంది. విద్యుచ్ఛక్తి అంటే, కాకినాడ, రాజమండ్రీ - ఇలాంటి పట్టణాల్లో మీటు నొక్కితే దీపాలు వెలుగుతాయి చూడు. ఆ దీపాలు వెలిగేటట్టుచేసేది ఈశక్తే. విద్యుచ్ఛక్తివల్ల చాలాపనులు చేయిస్తున్నారింకా. మైసూర్లో బంగారంగనులున్నాయి. ఆగనుల్లోంచి బంగారం తియ్యాలంటే చాలాకష్టం. ఏమంటే బంగారం నలుసులు మట్టిలోనూ, ఇతర లోహాలలోనూ కలిసిపోయుంటాయి. ఆ నలుసుల్ని తక్కిన మన్నూ, మశానంనుంచి విడదియ్యడానికి చాలా పనుంది. ఈపని అంతా విద్యుచ్ఛక్తిచేత చేయిస్తున్నారు.

మైసూరులో జలపాతాలు చాలా ఉన్నాయి. ఇవన్నీ చూడ్డానికి ఎంతో బాగుంటాయి. 'బృందావనం' అని ఓప్రదేశం ఉంది. అదంతా ఓ చక్కనితోట. చూస్తే కన్నులపండుగే. మైసూర్లో రాజు భవనాలు అన్నీ చూడతగ్గవే. బెంగుళూరుకూడా చాలా బాగుంటుంది. శ్రీరంగ పట్టణం అని ఓ ఊరుంది. అక్కడ టిప్పుసుల్తాన్ అని ఓ నవాబు రాజ్యంచేశాడు. ఆయనా, ఆయనతండ్రి హైదరాలీ అనే ఆయనా-వీళ్ళిద్దరూ మన దేశాన్ని ఇప్పుడు పాలిస్తోన్న దొరలతో యుద్ధంచేశారు.' ఎక్కడనుంచో వచ్చిన ఈ దొరలకి మనదేశం ఎందుకు అప్పచెప్పాలన్న పట్టుదలతో యుద్ధంచేశారు. ఎక్కడనుంచో వచ్చిన ఈ దొరలకి మనదేశం ఎందుకు అప్పచెప్పాలన్న పట్టుదలతో వీళ్లు పోరాడేరు.

రాచప్ప, కృష్ణప్ప అనేవారి సంగీతం నువ్వు గ్రామఫోనులో విన్నావుకదూ. వీళ్లు మైసూరు దివాణంలో సంగీత విద్వాంసులు. సంగీతం పాడడం, బొమ్మలెయ్యడం, పద్యాలు అల్లడం - ఇలాంటివన్నీ కళలంటారు. వీటిమీద మన రాజులకిసరదా. అంచేత ఇవి చేతనైనవాళ్ళని పూర్వం రాజులురప్పించి తమ దివాణాలలో జీతాలూ, భత్యాలు ఇచ్చి ఉంచుకునేవారు. రాజులు ఇలా ఆదరిస్తున్నారుకదా అని చాలా మంది వీటిని నేర్చుకునేవారు. కాని మనరాజులకి రాజ్యాలుపోయి తెల్ల దొరల రాజ్యంవచ్చాక వీటికి ఆదరణ పోయింది. మైసూరులాంటి సంస్థానాలలో మనదేశంరాజులే ఇంకా పాలిస్తున్నారు గనక అక్కడ కాస్త ఆదరణ ఇప్పుడుకూడా ఉంది.

అమ్మయీ, మన తెనుగురాజులలో కళలను పోషించినవాళ్లు చాలా మందున్నారు. ఈమాట ఉత్తరంలో రాస్తాలే వాళ్లనిగురించి.

మద్రాసు, 1-11-40

ఇట్లు,
పిన్ని.

ఇంటింటి కొకపూవు

ఈశ్వరునికొకమాల

శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మగారి

విజ్ఞప్తి

గృహలక్ష్మి పాఠక సోదర సోదరీమణులారా!

1928 సంవత్సరము మార్చి ఒకటవ తేదీని గృహలక్ష్మి మాసపత్రిక ప్రారంభింపబడినది మొదలు నేను తమతో పరిచయము కలిగియున్నాను. ఈ పదిరెండు వత్సరములనుండియు నా రచనలు యెడతెగక గృహలక్ష్మిలో ప్రచురింపబడుటకు కారణము నా రచనలయెడలను నాయెడలను మీరు జూపుచున్న ప్రగాఢ ప్రేమయే. నేనీ సాహిత్య సేవతో తృప్తినంది యున్నచో నా జీవితము అపరిగ్రహవ్రత విశేషితమై యుండెడిదే. కాని తెలిసియో తెలియకయో నేను 1931 సంవత్సరములో నా జన్మస్థలమైన బాపట్ల పురమునందు మా పురస్త్రీల తోడ్పాటుతో 'స్త్రీ హితైషిణీ మండలి' అను స్త్రీ సమాజమును స్థాపించితిని. అదియు భగవదనుగ్రహమువలన దినదిన ప్రవర్ధమానయై 1300 ల గ్రంధములు, పదిరెండు వార్తా పత్రికలుగల గ్రంథాలయ శాఖతోను, నవారునేయుట, నూలువడుకుట, చాకములల్లుట మొదలగు పరిశ్రమలుగల గృహపరిశ్రమ శాఖతోను, బ్యాట్ మెంటెన్, రింగుటెన్నిస్, క్యారమ్స్, పిన్‌బోర్డు డోమ్, చదరంగము ఆదిగాగల క్రీడా శాఖతోడను, స్త్రీ జన ప్రబోధకరములగు కరపత్ర ప్రచురణ శాఖతోడను, పండువులు, జయంతులు, వార్షికోత్సవములు మున్నగు ఉత్సవ కలాపములతోడను, మహనీయుల ఉపన్యాసములు, మహిళాసభలు మొదలగు ప్రత్యేక స్త్రీ సభలతోడను విరాజిల్లుచు గృహవసతికొఱకు నన్ను తొందరపెట్టుచున్నది.

గుంటూరుజిల్లాబోర్డు వారు మా విజ్ఞప్తిని మన్నించి మండలి భవననిర్మాణము నిమిత్తము దాదాపు వేయిగజముల నివేశన స్థలమిచ్చియున్నారు. అందు భవననిర్మాణము చేయవలసిన బాధ్యత నాపైబడినది. ఎచటనైన ఒక స్త్రీ సమాజము స్థాపింపబడి అదికొంచెము ఉన్నతికి వచ్చిన దనగనే దానికి గృహావరణాది సౌకర్యములు కావలసివచ్చుటయు, ధన సంపాదనా సౌకర్యములు లేని స్త్రీలు అందుకు సమర్థలు కాకపోవుటయు, అంతటితో నా సమాజకార్యములు నిలిచిపోవుటయు మనదేశమున జరుగుచున్న విషయమేగదా! నన్నుగూడ యీ చిక్కు ఇప్పుడెదుర్కొనినది కాన నా పుస్తకములను కొనుక్కొనుటకైన నొకరిని ప్రార్థించియెుఱుగని నేను యీ మండలికొఱకు పరుల నర్థించవలసివచ్చినది. అయినను 'పరహితరతమతి యుతులగు వారలకు నడుగుటలు నొదలి తొడవులు పుడమిన్' అను భాగవతసూక్తి ప్రకారము పరార్థ కార్యమునకు అపరిచితులగు మిమ్ము అరవిడిచి తోడ్పడ కోరదలంచితిని.

ఇంటింటి కొకపూవు యీశ్వరునకొకమాల, యనిసామ్యముగదా. మీలోఒక్కొక్కరు యథాశక్తి ఒక్కొక్కరూకగా సహాయమొనర్చినను శ్రమలేకయే నా సంకల్పము ఫలించును. కావున రాష్ట్రాంతరాంధ్రసోదర సోదరీమణులెల్లరు నాజీవితములో ఒక్కగా నొక్కమారు స్త్రీ జనోపయోగకరసంస్థకొరకు యీ అత్యల్ప సహాయమును మనఃపూర్వకముగా నొనర్చి నాకృతజ్ఞతాభి వందనములకు పాత్రులు కావలయునని వినయ పూర్వకముగా ప్రార్థించుచున్నాను. మా భవన నిర్మాణనిధికి చందానీయనెంచినవారు 'కనుపర్తి వరలక్ష్మమ్మ, శక్రటరీ, స్త్రీహితైషిణీమండలి, బాపట్ల (గుంటూరుజిల్లా)' అను విలాసమునకు మనియార్డరు ద్వారగాని పోస్టలుఆర్డరుగాగాని పంపవచ్చును. తామేగాక యితరులవల్లగూడా నాకు సహాయము చేయనెంచిన ఉదారహృదయులు నాకుతెలియబరిచినచో తమ యూరికినేను స్వయముగావచ్చి తమ సహాయమును వందనములతో స్వీకరింపగలను.

బాపట్ల,

12-10-40.

ఇట్లు, మీ ప్రేమాస్పదురాలగు సోదరి,

కనుపర్తి వరలక్ష్మమ్మ

ఫేమస్ ఫిలిమ్సువారి ధర్మపత్నిలో పెళ్లికూతురుకి అలంకరణము



రవీంద్ర కవీంద్రుడు

ఇటీవల జబ్బుపడి, భగవదనుగ్రహము వలన
తేరుకొని, స్వస్థత జెందుచున్నారు.

శ్రీమతి సరళకన్యాలాల్ మున్షిగారు.

బొంబాయిలో స్త్రీ సొలిసిటరుగా పనిచేయుచున్నారు. గుజరాతీలలో ఇట్టిపనికి యీమెయే ప్రప్రథమురాలు.



కాశీ విశ్వవిద్యాలయపు మెట్రిక్, డొమెస్టిక్ సైన్సు తరగతి
నిర్వాహకురాలు: శ్రీమతి ఎ. సి. చెన్నగంటమ్మగారు

దీపావళి

ఉదయం

తెల్లారే
నిద్దరలేచీ
తలంటు స్నానం
చేశావా,

వాకిళ్ళంతా
పసుపు పులుముతూ
కుంకుమ చుక్కలు
పెట్టావా,

పాపాయికి
తెలతెల్ల గౌనొకటి
తొడుగుతు పాపటి
తీశావా,

చిట్టిపాపకొక
కొత్త పలక
బలపాల కట్ట
కొనితెచ్చావా,

పక్కయింటి ఆ
బీదరాముడికి
ఇన్నిచిచింద్రీ
లిచ్చావా,

ఇంటిముందు
పంచాదిలోః
తెల్లటిముగ్గుల
గొలుసులు
వేశావా.

సాయంత్రం

జారుజడకు ఈ
మల్లెలు, దవనం,
అందెలు, గొలుసులు
అమర్చుకో మరి
అంతా తయారు
కావాలీ...
పాపా! చిట్టీ!
నీవూ...ఊఁ...
తక్షణమే.

రాత్రికి

శిల్కుచీర అది
జాగ్రత...కొంచెం
పై కనుకోరాదా
నీ గాజులు...

పాపాయీ! రా
టపాకాయిదిగో
చూడిది...చిట్టీ
పేల్చే శేయ్...

ఒరేయ్, ఒరేయ్
ఆ చుక్కలు చూడూ
పైన చుక్కలతో
పంతంవేసే
ఎగిరెగి రెగిరెగి
రింతై పోతూ...
నాన్నారికి ఆ
తూటా యిచ్చేయ్...

ఎక్కడిదో ఈ
విష్ణుచక్రమూ
గిరగిర గిరమని
గిర్కొట్టిందీ...

అమావాస్య అని
పేరేగానీ
చీకటి అంతా
ఉత్తుత్తయింది,
లేనేలేదు...
కాల్చండీ ఇవి
వెలిగించండీ!
చీకటి చించీ
నరకాసురుణ్ణి
చంపండీ...

బాగా చదువులు
బాగా బొమ్మలు
ఈ వత్సరమం
తా దొరికాయీ,

అంతా సుఖమయ
మై పోతుందీ
వినండి వినండి
రేడియొ గూడా
మనపాటే పాడింది
వినండీ,

పాపా, చిట్టీ
నువ్వూ, నాన్నా
అంతా వినండి
దీపావళినాడే.
వినాలి మరి
వినండి వినండి
దీపావళినాడే
పాడండి.

- శ్రీ -

అనిశెట్టి సుబ్బారావు.

"ఆత్మవిశ్వాసంలేని రాజు, అతన్ని కొలిచే మూఢప్రజలు"

(పాత కథలకు క్రొత్త పూతలు)

— శ్రీ ఆదంట —
సూర్యనారాయణమూర్తి

సీత శాపము

ఆ మళుపుతిరగ్గానే అయోధ్య కనపడీ కనపడకుండా ఉంది. ముందూ వెనుకా అరమైలు అరమైలు దూరాన్ని రథాలు, ఏనుగులు, గుఱ్ఱాలు, సైనికులు, చూడ్డానికి వచ్చిన ప్రజలు నడుస్తున్నారు. మధ్యగ సీత, రాముడు, సోదరులు, వాల్మీకి, ఇంతక్రితమే ఎదురుగా వెళ్లి వాళ్లను కలుసుకున్న, వసిష్ఠుడు వస్తున్నారు. వెనకాల హనుమంతుడు, బుజాలమీద కుశ లవులిని ఎత్తుకు తీసుకువస్తున్నాడు. అంతా నిశ్శబ్దంగా నడుస్తున్నారు. అందరి చూపులు ఆలోచనలతో నిండిపోయాయి. కంటిరెప్పలు బరువెక్కి సగం సగం వాలిపోయాయి. ఏవేవో భావాలతో నిండి భారంగా ఉన్న తలల్ని అందరూ వంచుకు నడుస్తున్నారు.

సీతకు రాముడుకు మధ్యను ఎవరులేరు. అయినా వాళ్లు ఒకరివంక ఒకరు చూసుకోవాలని ప్రయత్నమేనా చెయ్యడంలేదు. రామునిముఖం చాలా విచారంగా ఉంది. బొత్తిగా కళావిహీనం అయి పోయింది. ఎంతో నేరంచేసి కప్పిపుచ్చుకుంటూన్న వాడి ముఖంలా ఉంది. అసలే నలుపుగా ఉండే ముఖం, మరీ నలుపెక్కి పోయింది. బెంగతో సీత సన్నగా కృశించి పోయింది. అభిమానంతో తలెత్తుకోలేక పోతోంది. ముఖం అంతా ఎఱ్ఱగా కందిపోయింది. ముఖంలో సౌందర్యం తగ్గలేదు, కాని ఉత్సాహం అడుగంటి పోయింది. ఎన్నెన్నో కష్టాలతో కాయ కాసి పోయింది. రోషంతోటి, ఆవేశంతోటి కళ్లల్లోంచి నిప్పులు కురుస్తున్నాయి. ఎంతో తెగింపుతో ఎవర్నీ లెఖచెయ్యకుండా వంచినతల యెత్తకుండా ఎదురుగా తదేకంగా రెప్ప వాల్చకుండా చూస్తూంది, లోపలినుంచి పొంగివచ్చే ఆవేశాన్ని క్రింది ప్రెదిమను పైపళ్లతో నొక్కి ఆపుకుంటూంది.

స్వాగతం యివ్వడానికి ఎదురుగా వస్తూన్న అయోధ్యా పౌరులను చూసి వాల్మీకి ఆగాడు. ఆగిన మహామునికేసి రాముడు తలెత్తిచూసి తానుగూడా ఆగాడు. అందరూ ఆగిపోయారు. వెనకా ముందూ నడిచేసైన్యాలు ప్రజలూ ఆగి పోయారు. ఎదురుగా వస్తూన్న పురజనులు మాటవినబడే దూరాన్ని చేతులు జోడించుకు నిలబడి పోయారు.

అంతా అదొక మోస్తరు నిశ్శబ్దంగా ఉన్న మూలాన్ని నెమ్మదిగా మాట్లాడుతోన్నా, వాల్మీకి మాటలు ఖంగ్ న వినిపించాయి.

వాల్మీకి: ఇంక నేను దిగడతాను.

రాముడు: అప్పుడే? అప్పుడే వెడతారా? మిగతా కార్యక్రమాన్ని గూడా పూర్తిచేసి మరీ దయచేద్దురుగాని.

వాల్మీకి: మిగితా వాటి కేముంది? నీ పుత్రులు, నీ భార్య, నువ్వు అంతా దైవకృపవల్ల కలుసుకున్నారు. సుఖంగా నగరం చేరుకున్నారు. సౌఖ్యంగా ఉండండి. నేను వెళ్లివస్తా.

రాముడు : అన్నీ తెలిసిన పెద్దలు మీరే ఆలా అంటే ఎల్లా? నా స్వార్థాన్ని చంపుకుని లోకం కోసం నేను చేస్తూన్న వ్రతం ఏవిధంగా నెరవేరింది?

వాల్మీకి : అంటే?

రాముడు : మీకు తెలియకే ప్రశ్నిస్తున్నారా? మీరు చేరదీసి మీ చెంతను యింత కాలం నీడను యిచ్చారన్న సంగతే ఆమె నిష్కళంకాన్ని చాటిస్తుంది. కాని ఒక్క సంగతి మరవకండి. మీరు నాకు స్నేహితులు. నేను రాజును. మనకూ మనకూ అనేక అవసరాలు ఉంటాయి. అందుకని మీరు ఆమెను చేరదీసారని ఎవరేనా అనుకోవచ్చును. అనవచ్చును. కాబట్టి ఆమే స్వంతంగా ఏదేనా నిదర్శన పూర్వకమయిన శబధంచేస్తే మంచిది.

సీత : ఆమె ఒకసారి చేసింది.

వాల్మీకి : సీత మహా పతివ్రత.

రాముడు : సీత పాతివ్రత్యాన్ని నేను కలలోనైనా అనుమానించ లేదు.

సీత : అనుమానించకపోతే యిదంతా ఎందుకు?

రాముడు : ప్రజలు నిన్నుగురించి పూర్తిగా తెలుసుకోవడం కోసం.

సీత : ప్రజలకోసమే అయితే అగ్ని పరీక్ష అయోధ్యలో జరుపవలసింది?

రాముడు : ఇప్పుడు మించిపోయిందేమిటి? మరొక శపథంచెయ్య వచ్చును.

సీత : అవును, రోజూరోజూ చేస్తూఉంటాను. ఒక్కొక్కమూర్ఖుడు ఒక్కొక్కమాట అంటూఉంటే ఒక్కొక్కసారి వనవాసం, నిదర్శన పూర్వకమయిన శపథంచేస్తూ ఉంటాను.

రాముడు : మూర్ఖులలో, జ్ఞానులలో, ఆ ప్రజలకు నేను రాజును.

సీత : తాను మనస్సులో నమ్మినది ధైర్యంగా చెప్పలేనిరాజు... ఆత్మ విశ్వాసంలేని రాజు.

రాముడు : రాజు ప్రజాభిప్రాయానికి బద్ధుడు.

సీత : ప్రజాభిప్రాయానికా? ప్రజలలో మూర్ఖుల అభిప్రాయానికా?

రాముడు : అందరుప్రజలు రాజుకు సమానులే.

సీత : ఆత్మ విశ్వాసంలేని రాజూ, ఆఆత్మ విశ్వాసంలేని రాజును కొలిచి పూజించే మూఢప్రజలూ - వినండి - శబధం చేస్తున్నా - శపిస్తున్నా - "ఆత్మస్వాతంత్ర్యం, ఆత్మవిశ్వాసంలేని రాముణ్ణి ఎవరు పూజిస్తూ ఉంటారో వాళ్లు ఆత్మవిశ్వాసం, స్వాతంత్ర్యంలేక నిర్జీవులై నశించిపోతారు." బ్రతికిఉండి వీళ్ల మధ్య మసలడంకంటె ఆత్మహత్య చేసుకోవడం మెరుగు.

(సీత నిలబడినచోట భూమి రెండు చీలికలుగా విడిపోయింది. చటుక్కున సీత దిగజారింది. భూమి యథాప్రకారం మూసుకుపోయింది.)

★ నక్షత్ర ఫలితాలు

కవికలహంసి
శ్రీమతి చేబ్రోలు సరస్వతీదేవి

● కార్తీక మాసము ●

అశ్విని
ధనలాభం; సౌఖ్యం; ప్రీతి.

భరణి
గోలాభం, కార్యసిద్ధి, సౌఖ్యం.

కృత్తిక
రాజభయం; శిరోవ్యాధి; విరోధం.

రోహిణి
ప్రయాణం; ధననష్టం; జ్వరం, భీతి.

మృగశిర
స్వల్పాధికారం; యుద్ధభయం; కలహం.

ఆర్ద్ర
నీల వస్త్రలాభం; జంతుభయం, పుత్రులవలన వ్యథ.

పునర్వసు
ఆయుధభయం; విచారము; పాపకర్మ.

పుష్యమి
బంధుసమాగమం; విద్వద్గోష్ఠి; విష్ణు చింతనం.

ఆశ్రేష
గురుభక్తి; అలంకారప్రాప్తి; సుఖం.

మఖ
ఉల్లాసం; భోగం; ఐశ్వర్యం; సంతోషం.

పుబ్బ
మృష్టాన్న భోజనం; ఇష్టార్థసిద్ధి; ఆరోగ్యం; కీర్తి.

ఉత్తర
దుఃఖము, గృహచ్ఛిద్రం; జ్వరం.

హస్త
ప్రయాణమందు చోరభయం; దుర్వార్తా శ్రవణం, కార్యనాశం.

చిత్త
బంధు విరోధం; కార్యసిద్ధి; అర్ధలాభం.

స్వాతి
నాభిశూల; కోపము; మతిభ్రంశం.

విశాఖ
దెబ్బతగులుట; విచారము; రాజభయం - శత్రువృద్ధి.

అనూరాధ
మంచివిద్య; తల్లికి సుఖం; ధనధాన్య లాభం.

జ్యేష్ఠ
జ్ఞానము; గౌరవం; సంతోషము.

మూల
లాభం; గృహనిర్మాణం; సౌఖ్యము.

పూర్వాషాఢ
శయ్యాసుఖం; సంగీతగోష్ఠి; హృదయానందం.

ఉత్తరాషాఢ
అసౌఖ్య భోజనం; అపవాదు; పుత్రపీడ; ఆయాసం.

శ్రవణం
ప్రయాణం; ధనహాని; సోమరితనం.

ధనిష్ఠ
విషభీతి; స్త్రీ కలహం; అనారోగ్యం.

శతభిషం
గర్భశూల; ప్రమాదం; కృషిహాని.

పూర్వాభాద్ర
కార్యవిఘ్నము; రాజభయం; త్రిప్పటలు; ధనవ్యయం.

ఉత్తరాభాద్ర
దైవభక్తి; ఆహ్లాదం; నూతన విద్యారంభం.

రేవతి
వస్త్రాలంకారప్రాప్తి; ధనలాభం, యశస్సు;

★ స్త్రీ సాముద్రిక శాస్త్రము ★

కవికలహంసి, శ్రీమతి చేబ్రోలు సరస్వతీదేవి

(గతసంచిక తరువాయి)

---

(5) దేహ పరిశ్రమను తెలియజేయు వ్రేళ్లు కలవారలకు సాధారణముగా నరచేయి వ్రేళ్లకన్న పెద్దదిగా నుండును. వ్రేళ్లు కుఱుచగను, దళసరిగను కఠినముగనుయుండి, గోళ్లు పొట్టివిగను, బొటనవ్రేలు కురుచగను వంపుగను యుండును.

ఇట్టి లక్షణముగల వ్రేళ్లున్నవారు. అధైర్యపరులు, తెలివి తక్కువవారు, పాటుపడి సంపాదించిన ధనమువల్ల బ్రతుకువారు, చదువురానివారునై యుందురు.

(6) మిశ్రితమైన వ్రేళ్లుగలవారలకు కొన్నివ్రేళ్లు, గోపురాకారముగను, కొన్ని విస్తరించినవిగను, కొన్ని చదరముగను యుండును.

ఇట్టివారు సర్వవిషయములను బోగట్టాజేయువారును సర్వకార్యములందు సామర్థ్యముల జూపువారునునై యుందురు. వీరికి ఒక్క విషయమునందుకూడ పూర్ణ ప్రజ్ఞయుండదు.

(7) తత్వజిజ్ఞాస తెలియజేయు వ్రేళ్లు కలవారలకు అరచేయి పెద్దదిగాను ఉబ్బెత్తుగనుయుండును. వ్రేళ్ల కణుపులు పూర్తిగా యుబ్బియుండును. వ్రేళ్లు నిడివిగను, నడిభాగము అదోపాటుగను, వ్రేళ్ల కొనలు చదరముగను యుండును.

ఇట్టి లక్షణముగలవారు యదార్థము కనుగొనువారును, వేదాంతశాస్త్రముల నభ్యసించువారును, మత విషయమందెక్కువ శ్రద్దగలవారుగా నుందురు.

వ్రేళ్లు కణుపులు, వాటిమీద చిహ్నములు. మొదటివ్రేలు.

చూపుడువ్రేలు లేక గురువ్రేలు, అధికారము, విద్యాసక్తి, పలుకుబడి, మతాభిలాష, సాంఘిక జీవనము-వీటిని సూచించును.

ఇది మధ్యవ్రేలికన్న పొడవుగానుండిన, నిరంకుశత్వము, గర్వము, క్రౌర్యము, ఎవరిని లెక్కసేయకుండుట-వీటిని సూచించును. సమానముగానున్న నిరంకుశత్వము, ధనము, గౌరవము, విశేషమైన అధికారమును తెలుపును. ఉంగరపు వ్రేలికన్న పొడవున్న పెద్దపెద్దకోరికలు, అత్యాశను తెలుపును.

చాల కురుచగానున్న చపలత్వము పిరికితనము సూచించును.

దీని మొదటికణుపు నిడుపైయుండెనేని, వారు చిత్రపనులయందుగాని, వాస్తు శాస్త్రమునందుగాని, వ్యవసాయపు పనులయందుగాని యభిరుచి కలిగియుండును.

రెండవకణుపు నిడుపైయుండిన యంత్రపుపనులు, వ్యవసాయము, వీటియందు నేర్పుండును.

మూడవకణుపు నిడుపైయుండిన లుబ్ధత్వము, స్వార్థ పరత్వముకలిగి యుండును.

మరియునిది బొటనవ్రేలివైపుకి వ్రాలియున్న స్వార్థపరత్వము, స్వాభిమాన మెక్కువ.

మధ్యవ్రేలిమీద వ్రాలియున్న గర్వము, తంత్రజ్ఞత, స్వాతంత్రేచ్ఛ గల్గియుండును.

(సశేషము)

★ ఆంధ్రపతాకము

శ్రీ బూర్గుల రంగనాథరావు బి. ఏ. ★

ఒకనాడాంధ్రులు దక్షిణాపథమునన్ ఉత్తుంగవింధ్యాద్రిపై
సకల ద్వీపమహీధవుల్ తలలువంచన్ హూణకర్ణాదిరా
జకిశోరంబులు తల్లడిల్ల తెలుగుం జండాను ఎత్తించి, ఆం
ధ్ర కిరీటంబును భారతాంబకిడి ప్రాధాన్యంబు సాధింపరే!

భుజబల విక్రమంబున నపూర్వ ప్రభా విభవంబుచేత, నీ
ధ్వజము చతుశ్శతాబ్దములు భారతిపై నెగిరించుచున్, విదే
శజనుల, శాకపల్లవుల చైత్రరణంబుల భీతిమాన్పి, ది
గ్విజయము గూర్చి హైందవుల స్వేచ్ఛను నిల్పిరి తెల్గుతల్లిరో!

శాతవాహన వీర శాతాసిధారచే సామ్రాజ్ఞి పదవి నీ శరణుజొచ్చె,
వ్యాసనుడు, కవిబ్రహ్మ, పోతన్నచే శాశ్వత సాహిత్య సౌధమమరె;
త్యాగయ్య కిన్నెరీ తంత్రులు ఆంధ్ర సంగీత స్రవంతికి కేలొసంగె;
హరుని కన్నులచేత నిరతంబు పోష్యమై త్రైలింగ భూమినీ తల్లియయ్యె?

కాకతీయాది సామ్రాజ్య గర్భమందు ఇంకిపోయిన రుధిరంపు కంకణములు
ఆంధ్రభోజునిశిల్పవిద్యా విశేష తేజమెల్లను నీ దెగా తెలుగుతల్లి.

ఆలాటి తెల్గుతల్లి యిప్పుడు

"ఎల్లరురాగ నా తనయు లేకడనుండిరి ? రారదేల ? నా
యుల్లము బాధపెట్టును సహోదరి పుత్రులు తెంపుతోడ మా
తల్లికి భారతావనికి దాస్యవిమోచన సేయనుండ ; భీ
తిల్లితి నాంధ్రమాత" నని దీనముగా విలపించె నాంధ్రుడా !

కాబట్టి

జయ జయ ధ్వానములునిండ చదల నొకరి వెంటనొక్కరు వరుసగా విధియటంచు
జాతి శంఖపు మ్రోతకు చేతులొగ్గి శాంతి సమరంబుజేరుడు సైనికులుగ.



గోధుమలుతో తయారుచేయదగిన వివిధ పదార్థములు—4.

గోధుమ హాల్వా

2 శేర్ల గోధుమలను బాగా నానబెట్టి రుబ్బి పాలుతీయవలెను. పాలు ఎంతవుంటే అంత బెల్లమును, కావలసినంత జీడిపప్పును, ద్రాక్షను, ఏలక్కాయపొడిని, కుంకుమపువ్వును కలిపి, పాలతోచేర్చి, పొయ్యిమీద వుంచి, గడ్డఅయేవరకు కలుపుతూ, 1 వంతు నెయ్యిపోసి, బాగా గట్టిగా అయినతర్వాత, పళ్లెములో ఆరపోసి ముక్కలు కోయవలెను.

లస్కూరా బూరెలు

2 వంతుల కొబ్బరికోరును, 1 వంతు బెల్లమును ఎర్రగావేయించి తీయవలెను. 1 వంతు గోధుమ పిండిని జారుగాకలిపి, పై వేయించిన కొబ్బరికోరును, చిన్న ముద్దలుచేసి, గోధుమపిండిలోముంచి మరగించిన నూనెలో వేయించి తీయవలెను.

—శ్రీమతి ఇమ్మానేని సావిత్రీదేవి.

గులాబ్ జామ్

చిక్కనిపాలు 1 శేరు ఒక పాత్రలోబోసి అడుగంటకుండ కలుపుతూ కాచవలెను. గసగసాలు, జాజికాయ, ఏలకాయపొడి మరగినపాలలోవేసి కలుపవలెను. 1 శేరు గోధుమపిండిపోసి ముద్దగాకలిపి దొండకాయంతలావు పొడుగుగా వత్తులు చేసి నేతిలోవేయించి, పంచదార లేతపాకముపట్టి అందులోవీటిని వేసి నానబెట్టుకోవలెను.

రవ్వ పూర్ణపు పోళీ

గోధుమరవ్వ ½ శేరు నేతిలోవేయించి బాగాకాగిన నీటిలోవేసి కలుపవలెను. అర్ధపావు ఉడికిన తోడనే బెల్లం, 20 తులములపొడిపోసి కలుపవలెను. ఏలకుపొడి పెంకాయతురిమి ఉడికే రవ్వలోవేసి ఉడికినవెంటనే దించి పళ్లెములో పెట్టుకొనవలెను. అర్ధపావు శేరు బియ్యపుపిండి, అర్ధపావు శేరు గోధుమపిండి ఉప్పు వేసి చక్కగా నీళ్లుపోసి కలుపవలెను. రవ్వపూర్ణము నిమ్మకాయంత ముద్దలుచేసి చిక్కగాకలిపిన పిండిలోముంచి నేతిలోవేగనిచ్చి తీయవలెను. జీడిపప్పు, కిసిమిసికూడ వేసి చేసుకొనవచ్చును.

—శ్రీమతి చి. రామానుజమ్మ.

గోధుమ బోండ

3 తులముల గోధుమరవ, 2 తులముల పంచదార ఈ రెండింటిని కాచినపాలతో గట్టిగాకలిపి వుసిరికాయంత వుండలుచేసి నెయ్యిలోవేసి యెఱ్ఱగా వేయించవలయును.

గోధుమ అప్పాలు

3 పావుల మఱిగిననీళ్లలో ఒకపావు గోధుమరవనువేసి బాగుగా వుడికినపిమ్మట దానిలో అర్ధశేరు బెల్లమునువేసి కలుపి దించినపిమ్మట ఒకపావు గోధుమపిండిని దానిలోవేసి బాగుగాకలియపెట్టి 15 నిమిషములు మూతపెట్టి యుంచవలయును. పిమ్మట ఒకఅరటియాకును నెయ్యిరాచి పెద్దవుసిరికాయంత వుండలు చేసి ఆకుమీదతట్టి కాగిననేతిలో వేయించవలయును.

బొంబాయిపూరి

పావు గోధుమపిండి, పావు శెనగపిండి, కొంతవుప్పు, కారమువేసి తగినంతనీళ్లువేసి ముద్దగా కలిపి నిమ్మకాయంత వుండలుచేసి, అప్పడాలకఱ్ఱతో పూరీలు తయారుచేయవలయును. ఆ పూరీలను ఛిద్రి కాయల గరిటతో చిన్నచిన్న ముక్కలుగాకోసి నేతిలో నాలుగు నాలుగుగావేసి యెఱ్ఱగావేయించి తీయవలయును.

రవవుండ

పావురవను 2 టీస్పూను నెయ్యివేసి వేయించి పంచదార తీగెపాకం పట్టుకొని దానిలో ఎండు కొబ్బెర, ద్రాక్ష, జీడిపప్పు, యాలకులువేసి ఈ వేయించిన రవనుకూడ పాకములోవేసి దించుకొని వుండ కట్టవలయును.

పదరఫేణి

½ శేరు సన్నటిరవ నీళ్లువేసి ముద్దగాకలుపి మెత్తగ దంచుకొనవలయును. తరువాత ఆపిండిని నిమ్మకాయంత వుండలుచేసి పూరీలు తయారుచేయవలయును. పిమ్మట కొంతనెయ్యిలో 4 టీస్పూనుల బియ్యపుపిండివేసి బాగుగా మర్దన చేయవలయును. ఒకపూరిమీద ఈ కలిపిననేతిని బాగుగారాసి మరియొక పూరీనివేసి మరలనెయ్యిరాసి చుట్టవలయును. దానిని రెండుముక్కలుగాచేసి అరటిఆకుపైన నెయ్యిరాచి ఆముక్కను ఆకుపైనపెట్టి గుండుగా చేతితోతట్టి నేతిలో వేయించవలయును.

—శ్రీమతి ఎన్. మనోరమదేవి.

బంగారుపతకం బహుమానం

గోధుమ ధాన్యముతో చేయదగిన పలువిధములైన పదార్థములను, గత సంచికల లోని మూడు పట్టీలయందు ప్రకటింపబడినవి గాక, ఎక్కువ పదార్థములను వ్రాసిపంపినవారికి ఒక బంగారుపతకము బహూకరింపబడును. వెనుక గృహలక్ష్మిలో ప్రకటింపబడిన వాటినిగూడ ఎత్తి వ్రాయగూడదు.

సంపాదకుడు.

చెన్నపురి ఆంధ్రమహాసభ - స్త్రీలశాఖ

ప్రథమ సంవత్సర జయంత్యోత్సవము

శ్రీమతి దుర్గాబాయమ్మగారి కృషిఫలితము



శ్రీమతి దుర్గాబాయమ్మ ఎం. ఎ.

చెన్నపురి ఆంధ్రమహాసభ స్త్రీలశాఖ సంవత్సరోత్సవం, గతమాసం దసరా మహోత్సవ పర్వదినాల్లో అత్యంత జయప్రదంగా జరిగింది.

స్త్రీల శాఖయొక్క కార్యస్థానమైన 'మాధవభాగ్'లో బొమ్మలకొలువును తీర్చిదిద్ది కన్నులపండువుగా అమర్చారు. పురములోని ఆంధ్రబాలికలు ప్రతివొక్కరుకూడా బొమ్మలను తీసుకువచ్చి యీ కొలువులోపెట్టి అలంకరించడంవల్ల బొమ్మలకొలువు ప్రత్యేకంగా ఒక ఆకర్షవంతమైన దృశ్యంగా తయారైంది. మహార్నవమినాడు ప్రత్యేకంగా స్త్రీలశాఖయొక్క ప్రథమ సంవత్సర విజయోత్సవం హృదయాహ్లాదకరంగా జరిగింది. మద్రాసు చరిత్రలో యిటువంటి సంస్థ మైలాపూరు గడ్డలో బయలుదేరి ఇంతటి అపూర్వ చైతన్యంతో, ఇటువంటి సత్కార్యకలాపంతో విజయోత్సవాలు జరిపినది లేదని ఆనాడు సమావేశమైన పురజనుల హృదయాల్లో తళ్కొత్తింది.

సరిగా నాలుగుగంటలకి ఆహ్వానితులైన పిన్నపెద్దలతో మాధవబాగ్ ఆవరణ పిక్కటిల్లిపోయింది. ఉత్సాహోద్రేకాలు సమావేశమైన స్త్రీ పురుషుల్లో తాండవమాడేయి.

నాటి ప్రదర్శన వేడుకలకోసం ప్రత్యేకంగా నిర్మింపబడ్డ రంగస్థలంవద్ద సరిగా 5.30 గంటల ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశంపంతులుగారి అధ్యక్షతను కార్యక్రమం ప్రారంభమయింది. సభకు శ్రీ పిఠాపురం యువరాణిగారుకూడా వచ్చారు.

ప్రప్రథమాన్ని శ్రీ సాంబమూర్తిగారు సంవత్సరోత్సవాన్ని గురించి చెబుతూ ప్రకాశంపంతులు గారిని అధ్యక్షతవహించవలసిందిగా కోరారు.

జయజయధ్వానాలమధ్య ప్రకాశంపంతులుగారు అధ్యక్షపీఠం అలంకరించగానే, స్త్రీశాఖ యొక్క కార్యదర్శినియైన శ్రీమతి దుర్గాబాయమ్మగారు సాంవత్సరిక నివేదికనుగురించి ఇట్లా చెప్పారు.

‘ఈ స్త్రీశాఖ 1939 వ సంవత్సరంలో స్థాపించబడింది. ఇది కేవలం ఒక క్లబ్బుగానే కాక, విద్య, లలితకళలు మొదలైన వివిధవిషయాలలో తగుమైన కృషి సల్పవలెననే ఆశయంతో ఇది స్థాపించ బడింది. అందుకనుగుణంగా విద్యాశాఖ, లలితకళాశాఖ, క్రీడాశాఖ, పారిశ్రామిక శాఖగా వివిధశాఖలు నిర్మించి కృషిచేస్తున్నాము. గత సంవత్సరంలో విద్యాశాఖలో 14 గురు హిందీ పరీక్షకు కట్టి ఉత్తీర్ణులై వచ్చారు. కాశీ విశ్వవిద్యాలయంయొక్క స్కూలుఫైనలు తరగతికి కొంతమందికి తరిఫీదు ఇవ్వబడుతోంది. సంస్కృతం, తెలుగు, హిందీ విద్వాన్ పరీక్షలుకూడా చేర్పబడుతున్నాయి.

ఇక కళాశాఖలో భరతనాట్యం తరగతికి చెందినవారిలో 34 బాలికలు నాట్యాన్ని అభ్యసిస్తున్నారు. సంగీతం, గాత్రపాట, వాద్యాలుకూడా నేర్పబడుతున్నాయి. ఇందులో 16 గురు చక్కగా శిక్షణ పొందుతున్నారు.

చిత్రకళాశాఖలో ఇంకను మేము ఆశించినంత ఉత్సాహం కనపడటంలేదు. ముందుముందు దానిలోకూడా మంచి అభివృద్ధి చూపగలమనే ధైర్యం నాకు వుంది.

క్రీడాశాఖలో ‘బాడ్మింటెన్’, ‘పింగ్‌పాంగ్’ మొదలైనవి బాగా అభివృద్ధిచెందాయి.

ఇక యీ సంవత్సరం పారిశ్రామికశాఖనుగూడ స్థాపించి కృషిచేయ దలుచుకున్నాము. ఈ శాఖలో స్త్రీలకు కావలసిన గృహపరిశ్రమల నన్నింటిని చేర్చి కృషిచేయాలని మేం సంకల్పించుకున్నాము. దీనికైనా డబ్బు వుండాలి. ఆర్థికసహాయం లేనిదే ఏ వుద్యమమైనా బలంగా సాగిపోలేదు. దీనికి చెన్నపురి ఆంధ్రులు చేయూతనిస్తే యీ స్త్రీశాఖ ఒక్క మద్రాసుకే గాదు, యావదాంధ్రదేశానికి, ఆంధ్ర ఔన్నత్యానికి, ఆంధ్ర కళాప్రాభవానికి మకుటాయమానమైన కేంద్రస్థానం కాగలుగుతుందనే గట్టి నమ్మకం నాకు వుంది. దీనికి అన్ని విధములా మాకు సహకార సానుభూతులు చూపవలసినదిగా మిమ్ములనందరిని ప్రార్థిస్తున్నాను.

నేను ఇంకా మాట్లాడితే రుచికరంగా వుండదు. మంచి కార్యక్రమం ఇంకా ముందు వుంది. అంచేత కాలహరణం చెయ్యకుండా అధ్యక్షులవారిని మాట్లాడవలసినదిగా కోరుతున్నాను.’

తరువాత చిత్రకళాశాఖ, జంత్రవాద్యములశాఖా నిర్వాహకురాలైన ‘చిత్రకళావిశారద’ శ్రీమతి రత్నాల కమలాబాయి(గృహలక్ష్మి స్వర్ణకంకణగృహీత) గారికిని; భరతనాట్య శాఖానిర్వాహకురాలు శ్రీమతి రంగనాయకమ్మగారికిని, సంగీతముశాఖా (గాత్రపాట) నిర్వాహకురాలైన ఆర్. బృహదాంబగారికిని, విద్యా శాఖా నిర్వాహకురాలు శ్రీమతి చెన్నగంటమ్మ ఎం. ఎ. ఎల్. టి. గారికిని, క్రీడాశాఖా నిర్వాహకురాలు శ్రీమతి చాగంటి సునందమ్మగారికిని దుర్గాబాయమ్మగారు వారి కృతజ్ఞతను తెలిపారు.

తదనంతరం శ్రీ ప్రకాశంపంతులుగారు, స్త్రీ శాఖయొక్క కార్యక్రమాన్ని చూచి ఆనందపరవశులై గంభీరంగా ఇట్లా ఉపన్యసించారు.

"ఈనాటి సమావేశానికి నన్ను అగ్రాసనాధిపతిగా వుండమని సాంబమూర్తిగారు కోరినప్పుడు నాకీ ప్రోగ్రాముల విషయం ఏమీ తెలియదు.

సాంబమూర్తిగారు నాకు చాలాకాలంగా స్నేహితులు. సాంబమూర్తిగారు కేవలం సృష్టికర్త. ఏపని తలపెట్టినా ఆయన దాన్ని దిగ్విజయంగా నిర్వహించి తీరుతాడు. ఇది నా అనుభవంవల్ల చెబుతున్నాను. మద్రాసు మంత్రాంగంలో మమ్మల్ని అందర్ని కూడదీసి నిలబెట్టినవాడు ఈయనే. మమ్మల్ని అందర్ని మంత్రులుగాజేసి, మామీద సవారీ చేయడానికి తాను స్పీకరై కూర్చున్నాడు. మా మంత్రిత్వాలు పోయినా, ఆయన స్పీకరుషిప్పు పోలేదు. అక్కడే కాకుండా, ఇక్కడగూడా తాను స్పీకరుగానే తయారయ్యాడు. చెన్నపురి ఆంధ్రమహాసభను పునరుద్ధరించి నేడు దాన్ని అత్యుత్తమస్థానాన్ని అధిరోహింపజేశారంటే అది సాంబమూర్తిగారి కార్యదీక్ష. ఆ ఆంధ్రమహాసభలో స్త్రీలశాఖ నొకదానిని ప్రత్యేకించి కృషిచేస్తున్నారంటే నాకు చాలా ఆనందంగా వుంది.

ఆంధ్రులచరిత్ర చాలా బ్రహ్మాండమైనది. నేడు మన దేశంయొక్క జనాభాలో ఆంధ్రులస్థానం రెండవది. ఆంధ్రులు అఖిల భారతదేశం అంతటా వ్యాపించివున్నారు. నేను యీమధ్య దక్షిణదేశంలో పర్యటనంచేస్తూ వుంటే చాలాచోట్ల నన్ను తెలుగులో మాట్లాడవలసిందిగా కోరారు.

ఇటువంటి మనవారియొక్క ఔన్నత్యం చిరస్థాయిగా నిలబడాలంటే ఒక సంఘం, ఒక కార్యకలాపం, ఒక నాయకత్వం వుండాలి - అట్టి పురోభివృద్ధికి ఇటువంటి సంస్థలు చాలా కృషిచేస్తాయి.

ఈస్త్రీశాఖ నిర్వాహకురాలు శ్రీమతి దుర్గాబాయమ్మను నేనుబాగా ఎరుగుదును. దుర్గాబాయమ్మయొక్క కార్య నిర్వహణాదక్షత నాకు బాగా తెలుసును. ఇప్పుడామె నివేదికలో చెప్పినట్లు పారిశ్రామిక శాఖ ముఖ్యంగా నెలకొల్పబడాలి.

ఖద్దరు పరిశ్రమ ముఖ్యంగా నిర్వహింపబడాలి. 'ఈదేశం నాది, యీరాజ్యం నాది' అనేభావం పరిశ్రమలవల్లనే కలుగుతుంది. ఇందుకు తార్కాణం జపాన్ దేశం. అక్కడ రాజు మొదలు బంట్రోతువరకు వారిదేశపు సరుకులతోనే అన్ని సమకూర్చుకుంటారు. కర్రనుంచి తయారుచేసిననూలుతో నేయబడిన గుడ్డలనే వారు ధరిస్తారు.

ముందుగా గ్రామాలు యిట్టి పరిశ్రమల నాధారంగా చేసుకుని స్వయంపోషకాలు కావాలని నేను ప్రయత్నించి కొంతవరకు జయంపొందాను. జోగన్నపాలెం గ్రామంలో మా ప్రయత్నం జరుగుతూవుంది. అచ్చట స్త్రీ పురుషులు అందరు కష్టపడి ఖద్దరు ఉత్పత్తిచేయడం మొదలైనపనులు చేస్తున్నారు. గృహ పరిశ్రమలను స్త్రీలు చేపట్టినట్లయితే మనదేశం ఎంతైనా అభివృద్ధికి వస్తుందని నాకు గట్టి నమ్మకంవుంది - ఈ పరిశ్రమలను పునరుద్ధరించవలసినదిగా మనలను మేల్కొల్పిన గాంధీ మహాత్ముని మాటల్లో ఎంతో సత్యం వుంది. ఖద్దరు మన జాతీయ జీవనానికి జీవగర్ర. ఇది గాంధీగారిని నేను గుడ్డిగా అనుసరించి చెబుతూ వున్నది గాదు. కొన్ని సంవత్సరముల పరిశీలనమీదట చెబుతున్నాను. కనుక యీ స్త్రీశాఖ యిటువంటి ఉత్తమ, దేశ పురోభివృద్ధి కనువగు కార్యకలాపంతో ఇంకా వృద్ధిలోకి వస్తుందని ఆశిస్తున్నాను."

శ్రీ ప్రకాశం పంతులుగారి ఉపన్యాసానంతరం 'భారతమాత ప్రార్థన' కొంతమంది బాలికలు భావ గర్భితంగా నృత్యంచేస్తూ కావించారు.

తర్వాత మంత్రీప్రగడ నరసింహం పంతులుగారు వచ్చే సంవత్సరంలో, చెన్నపురి ఆంధ్ర మహిళ సభకు 25 సంవత్సరములు పూర్తియైనందున, రజతోత్సవం చేయ తలపెట్టబడినట్లును దానికి అందర్నీ సహకారాన్ని ఇవ్వవలసినదిగా కోరుచూ ఉపన్యసించారు.

కుమారి విమల "కోకిలా పాడవే"అనే కీర్తన మృదు మధురంగా పాడింది.

ప్రప్రథమాన్ని "కృష్ణలీలలు" నాటకం తెలుగులో ప్రదర్శింపబడింది.

రవీంద్ర కవీంద్రుని "చిత్ర" అను ఇంగ్లీషు నాటకంలోని కొన్ని దృశ్యాలు ప్రదర్శింపబడ్డాయి.

వెంటనే "దుర్గాదాస్"లోని కొన్ని దృశ్యాలు హిందీని ప్రదర్శింపబడ్డాయి.

ఈ నాటకాల్లో వివిధ పాత్రలను శ్రీమతి రాజేశ్వరి, కల్పకం, లీల, రాజ్యలక్ష్మి, తిమ్మాబాయి, సుసీలగార్లు ధరించి, భావగర్భితంగా నిర్వహించారు.

శ్రీ పిఠాపురం యువరాణీవారు నాడు నృత్యంచేసిన బాలికలకు బహుమతులను ఇవ్వడానికి వాగ్దానంచేశారు. ఆటలలో గెలుపొందినవారికి బహుమతులు శ్రీ యువరాణీవారు పంచిపెట్టారు.

హృదయంగమమైన నృత్యాలతోటి, ఉత్తేజకరములైన ఉపన్యాసాలతోటి, ప్రముఖుల సహానుభూతులతోటి, పెద్దల ఆశీర్వాదాలతోటి నాటి సంవత్సరోత్సవం అత్యంత మంగళప్రదంగా, జయప్రదంగా రాత్రి సుమారు 10 గంటలకు సమాప్తి అయింది.

ఇంకా సంవత్సరం పూర్తిగా దాటకుండా స్త్రీలశాఖను ఇంత అభివృద్ధిలోకి తీసుకువచ్చిన దుర్గాబాయమ్మగారి కార్య నిర్వహణాదక్షత ఆశ్చర్యం కలగజేస్తుంది. యీ స్త్రీశాఖ చెన్నపురి ఆంధ్రమహిళా లోకంలో నూతనజీవంపోసి చైతన్యాన్ని కలుగజేసిందంటే ఆకీర్తి కేవలం దుర్గాబాయమ్మగారిది. అన్ని విధములైన విషయాలకు స్త్రీశాఖ కేంద్రంగా వుండాలనే దుర్గాబాయమ్మగారి ఆశయం నేటి స్త్రీశాఖ కార్యకలాపంలో ప్రతి ఫలిస్తోంది. దుర్గాబాయమ్మ యొక్క అనన్య సామాన్యమైన కార్య దీక్షాసక్తియొక్క బాహ్యరూపంగా ఏర్పడిన యీ స్త్రీశాఖ ఆంధ్రకీర్తికి ఒక కర్ణధారి కాగలదని ఆసిస్తాము.

త్యాగమూర్తి సాంబమూర్తిగారి అధ్వర్యాన్ని, కార్యశూర దుర్గాబాయమ్మగారి నిర్వహణాన్ని యీ మహాసంస్థ ఆంధ్రుల అభిమతానికి ఆదర్శప్రాయమై జ్యోతిర్మయనీలాకాశంలో విహరించే పక్షి ప్రొద్దుల కోసం ఎదురుచూస్తాము.—

—గృహలక్ష్మి ప్రతినిధి



సీనియర్ హిందీ తరగతి

నిర్వాహకురాలు : శ్రీమతి సుందరమ్మగారు (విశారద)

కాశీ విశ్వవిద్యాలయ మెట్రిక్యులేషన్ తరగతి

సివిక్సు తరగతి నిర్వాహకురాలు : శ్రీమతి దుర్గాబాయి ఎం. ఎ.



భరతనాట్యం తరగతి

నిర్వాహకురాలు: శ్రీమతి పి. రంగనాయకిగారు

తొలకరి నృత్యం

చెన్నపురి ఆంధ్ర మహాసభ

స్త్రీల శాఖ

తొలిపలుకు

ఆంధ్రనారీజనోద్ధరణ మా ఆశయం. ఆంధ్రాభ్యుదయం మా ఆదర్శం. ఆంధ్ర మహిళల నందర్నీ కూడదీసి – వారి విద్యావ్యాప్తికి, విజ్ఞానాభివృద్ధికి, కళావికసనానికి పాటుపడ్డం మాసంకల్పం. ఈ కార్యక్రమం జయప్రదంగా కొనసాగిస్తూ – స్త్రీ ఉద్యమ విజయానికి, దేశకల్యాణానికి ఉపకరించడం కోసం మా సంరంభం.

వందనం

ఈ శాఖను, చేదోడువాదోడుగావుండి, నడిపిస్తూన్నవారు ఆంధ్ర మహాసభాధ్యక్షులు శ్రీ బులుసు సాంబమూర్తిగారు. తమ ధారాళమైన విరాళంతో నిర్విఘ్న ప్రారంభానికి తోడుపడినవారు శ్రీ నాదముని చెట్టిగారు. అవసరసహాయంతో, అత్యధిక సానుభూతితో నిరంతరప్రోత్సాహంగా వుంటున్నారు డాక్టరు కేసరిగారు. చెన్నపురి ఆంధ్ర మహాసభవారు, సుహృద్భావంతో, సంఘం యొక్క నిత్యవ్యవహారానికి, క్రమాభివృద్ధికి సర్వవిధాల సహాయపడుతున్నారు. సంఘసుస్థాపనకి పెద్ద సహాయమైనవారు– మా శాశ్వతసభ్యురాండ్రు: లేడీ యం. వెంకటసుబ్బారావుగారు, శ్రీమతి శాంతాబాయి గారు, శ్రీమతి వేదవతిగారు (పిఠాపురం యువరాణీ), స్వర్గస్థులైన శ్రీమతి ఇందిరాదేవి గారు (పిఠాపురం రాజకుమారిణి), శ్రీమతి బులుసు భద్రమ్మగారు, శ్రీమతి కె. మాధవి అమ్మగారు, శ్రీమతి కాశీనాధుని రామాయమ్మగారు, శ్రీ పవనిరాణిగారు.

నిర్వాహకులు

దీనిని బయల్దేరతీసిందిమొదలు నిరుపమానమైన సేవ చేస్తూ నిర్వహించుకొస్తున్నారు ఆర్గనైజరు శ్రీమతి దుర్గాబాయి ఎం. ఎ. గారు. అంతశ్శాఖలకు చెందిన నలువురుసభ్యురాండ్రకార్యవర్గం సహాయంగా, వీరు స్త్రీ శాఖకు సంబంధించిన సమస్త వ్యవహారాలు చక్కబెడుతూంటారు. ఆర్థికవ్యవహారవిషయంలో మాత్రం ఆర్గనైజరు గారు ఆంధ్రమహాసభా కార్యనిర్వాహకవర్గానికే జవాబుదారీ.

సభ : క్రీడలు

మాశాఖ వివిధోపశాఖలతో నానాటికి అభివృద్ధి చెందుతోండడం సంతోషమైన సంగతి. చుట్టూవిశాలమైన ఆవరణంతో, సుందరమైన భవనంలో (లజ్, మాధవ

బాగ్) సభ యేర్పాటయింది. పెద్దలకి, పిల్లలకి కూడా క్రీడావినోదా లేర్పాటయి వున్నాయి. టెన్నిస్, బాడ్ మింటన్, టెన్నికోయిట్ కోర్టులు,-స్వింగ్స్; రింగ్స మొదలైన ఆటసరంజాం అమర్చాం. ఈ ఔట్ డోర్ గేమ్సు అన్నిటిలోను వుత్సాహంగా పాల్గొంటున్నా రందరూ. ఇవిగాక - భవనంలో పింగ్ పాంగ్, కేరమ్స్, చదరంగం లాంటి ఆటల్నికూడా సిద్ధపరిచాం. శ్రీమతి చాగంటి సునందమ్మగా రీ విభాగాన్ని, శ్రీమతి చెన్నగంటమ్మ ఎం. ఎ. ఎల్. టి గారి సహాయంతో వుత్సాహకరంగా నడుపుతున్నారు.

విద్యాశాఖ

ఇది కేవలం విలాస కేంద్రం కాదు. మనోవికాసం కలిగించే వ్యాసంగాల కిక్కడ మంచి ప్రాధాన్యం వుంది. తోటివాంద్రలో విద్య వ్యాపింపజేసి, వారి ఉన్నతికి తోడ్పడకపోతే మా సభ కృతకృత్యురాలు కాజాలదు. అందుకు మేము విద్యాశాఖను ముఖ్య విషయంగా ప్రారంభించాం.

హిందీ

జాతీయభాషమైన దీని వ్యాప్తి చాలా అవసరమైంది. దేశభాగ్యోదయానికి తాము చెయ్యవలసింది చెయ్యడానికి తయారవుతూన్న తెలుగు స్త్రీలందరూ కూడా దీనిని నేర్చుకోవలసిందే. చక్కని భాష. సులభంగా పట్టుబడి, తక్కిన చదువులికి కూడా వురికొల్పుతుంది. అన్నివయస్సులవారూ యీ తరగతుల్లో చేరుతున్నారు. శ్రీ మతులు బెన్నూరి కృష్ణవేణమ్మ (విశారద), ఎ. సుందరమ్మ (విశారద) గార్లు పాఠాలు చెబుతున్నారు. అప్పుడే రెండుమూడుతడవలు పరీక్షలిచ్చి, ప్యాసయివచ్చారు చాలా మంది. పై పరీక్షలకి చదువుతున్నారు. కొత్తవాళ్లు తయారవుతున్నారు.

తెలుగువిద్వాన్

భాష ఔన్నత్యం మీదనే, జాతిగౌరవం ఆధారపడి వుంటుంది. భాషాభివృద్ధి అతి ప్రధానమైంది. స్త్రీలకి కూడా భాషాసేవ విధాయకమే. పరీక్ష నెపంతో, భాషాపరిచయమైన కలిగించిన వార మవుతామని మద్రాసువిశ్వవిద్యాలయంవారి తెలుగు విద్వాను పరీక్షకు స్త్రీలని పంపడానికి సంకల్పించాము. ఆ యేర్పాట్లన్నీ పూర్తయినాయి.

బెనారస్ మెట్రిక్యులేషన్

అభివృద్ధి నాకాంక్షించే ఆంధ్రస్త్రీలందరూ, ఆధునికవిషయపరిజ్ఞానం కలిగి వుండాలని భావించి, యీ పరీక్ష నిచ్చే సౌకర్యాలు కల్పించడానికి పూనుకొన్నాం. ప్రతినిమిషం పరివర్తనచెందుతూన్న ప్రస్తుతప్రపంచపరిస్థితుల్లో, భారతభాగవతాదులతో ఆగి వూరుకోడం ప్రయోజనకారి కానేరదు. అన్ని విషయాలు తెలుసుకుంటూ, తమని వృద్ధి ముందుకు నడవగలిగినప్పుడే స్త్రీలు తమ విధులు నెరవేర్ప గలుగుతారు,

రించుకో గలుగుతారు. ఆత్మవిశ్వాసం కలిగిస్తూ, ఆ మార్గంలో పెట్టే వుద్దేశంతో మేమీ ప్రవేశపరీక్షావకాశం కల్పించాం. ప్రత్యేకంగా వుండే పాఠశాలలకొలకు చూసే బాలికలకు, పాఠశాలకు పోకుండా ప్రత్యేకంగా చదువు సాగించాలని చూసే వయసువారికి యీ శాఖ అతి వుపయోగంగా వుంటుంది. మా అభిప్రాయంప్రకారం అప్పుడే యిరుతెగల వారు యిక్కడచేరి శ్రద్ధగా, వుత్సాహంగా చదువుకుంటున్నారు. అల్పకాలంలో, సూక్ష్మంగా పరీక్షకు తరిఫీదు చెయ్యడం మా ప్రధానోద్దేశం. మొదటినుంచీ, విడువకుండా కృషిచేస్తూ వొచ్చినవారే గణితంతో నెగ్గగలరు. మద్రాసు, ఆంధ్ర విశ్వవిద్యాలయాల్లో యీ గణితం తప్పనిసరిగా తీసుకోవాలి. కాని బెనారెస్ వారు గణితానికి బదులుగా—అవసరమై, అనాయాసంగా పట్టుబడే సంగీతం, చిత్రలేఖనం, వృక్షశాస్త్రం మొదలైన విషయాలు తీసుకోడానికి వీలుకల్పించారు. ఈ అంశాలన్నీ సమర్థులైన వారు బోధిస్తున్నారు. 1942-వ సంవత్సరము పంపేవారిని పెద్ద క్లాసుగా తరిఫీదు చేస్తున్నాం. ఇంగ్లీషులో యింకా బాగాకృషిచెయ్యవలసిన వారిని చిన్నక్లాసుగా యేర్పరిచి, తరవాత పంపించడానికి తయారుచేస్తున్నాం. ఈ శాఖలో శ్రీమతి చెన్న గంటమ్మ ఎం. ఎ. ఎల్. టి. గారు శ్రద్ధ వహిస్తున్నారు. హిస్టరీ, సైన్సు మొదలైన విషయాలు ప్రత్యేకసామర్థ్యం వున్నవాళ్లే చెబుతున్నారు. ఈ అవకాశం అందరు సద్వినియోగం చేసుకుంటారని నమ్ముతాం. ఇక్కడివారు, పై వూరివారు-చాలా మంది అడుగుతూన్నా, మేమింకా వసతిగృహం (Hostel) యేర్పాటు చెయ్యలేక పోయినందుకు విచారిస్తున్నాం. ఈ హెచ్చరిక యిలాగే సాగినట్టయితే, అది కూడా అచిరంలోనే సాధించగల మనుకుంటాం.

లలితకళాశాఖ

జీవితం శోభామయమై, ఆనందంగా గడిచి పోవాలంటే కళాసాహచర్యం కావాలి. మా లలితకళాశాఖ దినదినప్రవర్ధమానంగా వుంది. నృత్యం, గానం, చిత్రలేఖనం - ఇవి స్త్రీలకి సహజంగా వొప్పే కళలు.

నృత్యం

ప్రస్తుతం భరతనాట్యం చెప్పిస్తున్నాం. పలువురు వుత్సాహంగా నేర్చుకుంటున్నారు. వయసువారీని తర్ఫీదు యివ్వబడుతోంది. ప్రశస్తమైన ప్రదర్శనా లివ్వగలిగిన ప్రావీణ్యం సంపాదించి, చవి చూపిస్తున్నా రప్పుడే. శ్రీమతి పి. రంగనాయకమ్మ గారు వీరికి అద్వితీయమైన శిక్షణ యిస్తున్నారు. సావకాశం చూసుకుని మణిపురి, కథాకళి మొదలైన యితరనాట్యరీతులుగూడా నేర్పింపనున్నాం.

సంగీతం

నృత్యం నేర్చేవారందరూ తప్పకుండా సంగీతంలో చేరాలని నియమంపెట్టాం. శ్రీమతి బృహదాంబగారు కర్ణాటకసంగీతం చెబుతున్నారు. వీణ, ఫిడేలు మొదలైన

వాద్యాలపై శ్రీమతులు జమునా, కమలాబాయిగార్లు కృషిచేయిస్తున్నారు. మాసభవారు గోష్ఠిసంగీతంకూడా అతిశ్రద్ధగా అభ్యాసంచేస్తున్నారు. వివిధవాయిద్యాలతో పదిమందిదాకా పాల్గొనేది మా ఆర్కెస్ట్రా. తరచు, ఆల్ ఇండియా రేడియో, కార్యక్రమాల్లో పాలుతీసుకుంటూంటారు. ఇతరత్రాగూడా మంచిమంచి ప్రదర్శనా లిస్తున్నారు. నెలవారీగా సభలో గోష్ఠిగానం నెరపడానికి నిశ్చయించారు. ఇదంతా నిర్వహిస్తున్నది శ్రీమతి నిర్మలాదేవిగారు.

చిత్రలేఖనం

ఈ రోజుల్లో అంతగా ఆదరం పొందుతూండని చిత్రలేఖనాన్ని పునరుద్ధరించి, కొత్తపొలిమేరలకి కొనిపోవాలని అభిలషిస్తున్నాం. 'గృహలక్ష్మివారి' స్వర్ణకంకణం అందుకున్న శ్రీమతి రత్నాల కమలాబాయిగారు ఈ శాఖాధికారి. బెనారస్ మెట్రిక్యులేషను చదువుతున్నవా రెవరయినా దీనిని పఠనీయాంశంగా తీసుకోడాని కనువైన యేర్పాటు కావించాం.

అప్పుడప్పుడు వుత్సాహప్రదర్శనాలిస్తూన్నాం. ప్రత్యేకంగా నాటకసేవ చెయ్యడానికింతవరకు పడలేదు. అన్నిటిలోను అద్భుతకార్యోత్సాహం కనపరుస్తూన్న మా వివిధశాఖాధికారిణులు యీవిభాగం కూడా త్వరలో ప్రారంభించి, ప్రశంసనీయంగా పనిచెయ్యగలరని నమ్ముతున్నాం.

పారిశ్రామికశాఖ

స్వతంత్రజీవనానికి, దేశసౌభాగ్యానికి సాధనభూతమైన పరిశ్రమలను ప్రారంభించి, పెంపొందించడం మా పరమాశయమైనప్పటికీ – తగినద్రవ్యసహాయం లేకపోవడంచేత యేమీచేయలేకపోయాం. ఈ సభయొక్క పురోభివృద్ధిని యెల్లప్పుడు కోరే దాతలు వలసిన సహాయసంపత్తి కలుగజేసినవెంటనే – అత్యావశ్యకమైన యీశాఖ నారంభించి, అనుమానంగా నడపదలచుకున్నాం. బట్టలకి రంగులువేయడం, బుట్టలల్లడం, కాగితాలు చెయ్యడం, నవారునేత మొదలైన గృహపరిశ్రమలు స్థాపిస్తాం.

సారస్వతశాఖ

ప్రారంభప్రథమావస్థ అవడంవల్ల, ధనం మిక్కుటంగా కావలసివుండడంవల్ల, కొన్ని శాఖలు మాత్రమే మొదలుపెట్టి, అవి నిరాటంకంగా నడచేలా చూసుకుంటూ, తలపెట్టిన తక్కినవాటి దిక్కుకుచూడ్డానికే వీలుకాకపోడం తటస్థించింది. పత్రికలు విరివిగా తెప్పిస్తూ, పుస్తకభాండారం వృద్ధిచేసి, – సభలతో, చర్చలతో సందడిగావుండే సారస్వతశాఖనుగూడా సాగించి, మా సభని సర్వతోముఖమైన సద్గోష్ఠి చెయ్యాలని మా సకల ప్రయత్నాలూ. ఈ శాఖ యాజమాన్యము గృహలక్ష్మి స్వర్ణకంకణ గృహీతలును గృహలక్ష్మిసహాయసంపాదకురాలును ఐన శ్రీమతి చేబ్రోలు సరస్వతీదేవిగారు వహిస్తారు.

తుదిమాట

సభ నింకా సహస్రవిధాల విస్తరింప చెయ్యాలని మా వుద్దేశం. తెలుగు స్త్రీ లందరికీ ఉపయుక్తమైన విద్యాకేంద్రమొకటి నెలకొల్పడం, వారి కనువైన విద్యాప్రణాళికతో పరీక్షల నేర్పాటుచెయ్యడం, వారిపక్షాన్ని ఒక వారపత్రికను ప్రచురించడం, యింకా యెన్నో ఆశలున్నాయి మాకు. నిమ్నజాతులవారికి శుభ్రత చెప్పి, విద్యావంతుల్ని చేసి, సుఖజీవనం చూపించడం మొదలైన సంఘోపచారాత్మకమైన సత్కార్యాలు విధిగా నిర్వర్తించే సేవాసదనంగాకూడా చెయ్యాలి మా సభనని కోరిక. వీటికన్నిటికీ వుదార హృదయుల చేయూత అన్నివేళల అపేక్షిస్తున్నాం. దివ్యంగా సంవత్సరం ముగించిన మా సంస్థ-అందరి ఆశీర్వచనాలతో, ఆదరాభిమానాలతో, ఆదర్శప్రాయంగా తయారవగల దని మా విశ్వాసం.



క్రీడా శాఖ

నిర్వాహకురాలు: శ్రీమతి చాగంటి సునందమ్మగారు

గ్రంథ సమీక్ష

దూత ఘటోత్కచము

కర్త్రి : శ్రీమతి స్థానాపతి రుక్మిణమ్మగారు, విశాఖపట్నం, కవితాసమితి గ్రంథావళి సప్తమపుష్పం.

మనోహరమైన ముద్రణతో పొత్తము ముద్దుల మూటగట్టుచున్నది. అనువాదకర్త్రి శ్రీమతి స్థానాపతి రుక్మిణమ్మగారు, విశాఖపట్టణము.

భాసమహాకవి సంస్కృతమున రచించియించినదానికిది స్వేచ్ఛానువాదము, నిర్దుష్టమైన గంభీర గ్రాంధికశైలి. ఏకాంకనాటకములపై మిక్కిలి యాదరణము చూపుచున్న ప్రస్తుతసమయమునకు దగినట్లు 17 వందల సంవత్సరముల క్రిందట వ్రాయబడిన ఉపరూపకమును తెనుగున చిత్రించి ఆంధ్రుల యాదరాభిమానముల వడసిన రుక్మిణమ్మగారి లేఖిని ప్రశంసార్హము. ఈ చిన్న నాటికను ఈ యమ తనపతి కంకితమిచ్చి ధన్యచరితయైనది. ఇందులోని పద్యములు శబ్దసౌష్టవము, భావసంపదగలిగి ఈమె రచనాపాటవమును వెల్లడించుచున్నవి.

రెండో ప్రపంచయుద్ధమా ? (మొదటిభాగం)

ఆంధ్రకేసరి గ్రంథమాలవారి రెండవ ప్రచురణము - వెల నాలుగు అణాలు. చిరునామా : ౧౭౬, సుల్తాన్ బజారు, హైద్రాబాదు (దక్కన్.)

1914 తో అంతమై, తిరిగి అప్పటినుండి నివురుగప్పిన నిప్పులా రగులుతూ, తిరిగి నేడు ప్రపంచ యుద్ధంగా పరిణామంచెందిన పాశ్చాత్య ప్రపంచధోరణిని సామాన్య అక్షరాస్యులకుకూడా అర్థమయ్యేటట్టు ఒక కథలా ఆకట్టేటట్లు వ్రాయబడింది యీ పుస్తకం. కేవలంకథలు, నాటకాలేకాక, ప్రజానీకంలో రాజకీయ చైతన్యం కావలసిన యీ రోజుల్లో పెద్దపెద్ద విషయాలను సులభగ్రాహ్యంగా వ్రాయించడము, అందరికి అందుబాటులో వుండే వెలతో ప్రకటించడం చాలా సమంజసంగానూ, సమయోచితంగానూ వుంది. ఇందుకు గ్రంథమాలవారు ఎంతయు అభినందనీయులు.

వ్యత్యాసాలు

కర్త : శ్రీ అందే నారాయణస్వామిగారు. వలయువారు : నవ్యసాహిత్య పరిషత్తు, గుంటూరు.

దీనిలో 'ప్రతిఫలం', 'పుత్రసంతానం', 'పరివర్తనం' అనే మూడు కథలున్నాయి. మూడింటిలోను మూడు సామాజిక జీవిత తరంగాలు ఇతివృత్తాలుగా ముచ్చటగా వున్నాయి. రచనలోను, నడకలోను, కథావస్తువులోను, కొంచెం దీర్ఘంగావున్నా, నారాయణస్వామిగారికి మంచి జిగివుందని దీనివల్ల స్పష్టపడుతుంది. యీ గ్రంథం ఆధునిక రచనలలో ఒక విశిష్ట స్థానాన్ని పొందుతుందనడంలో అతిశయోక్తిలేదు.

చింతాదేవి

ఆంధ్రజాతీయగ్రంథమాలవారి ప్రథమకుసుమము. కర్త : విద్వాన్, శతావధాని, అనుముల వెంకటశేషకవిగారు, కర్నూలు. వెల ఒక రూపాయి.

నిజంగా ఇటీవల వెలువడిన గ్రంథాల్లో యీలాంటి పద్యకావ్యం రాలేదు అంటే సత్యదూరం గాదు. అందులోను చరిత్రాత్మక పద్యకావ్యం అవటంవల్ల దీనిప్రాశస్త్యం ఇతోధికమవుతోంది. వీరరసం ప్రతి పద్యంలోనూ మిక్కిలి గంభీరంగా నడిచింది. కథ యావత్తూ ఒకేఒక పాటగా ఎగుడుదిగుడులులేక నడిచింది. గ్రంథం ఆమూలాంతం చదివించి తేనే గాని ఆపనీయని పట్టులో నడకసాగిపోయింది. ఇటువంటి ఉత్తమ గ్రంథరచనకు కర్తలైన శ్రీ అనుముల వెంకటశేషకవిగారు ఇటువంటివే ఉత్తమకావ్యాలు ఇంకా రచించి ఆంధ్రభారతికి కానుకలుగా అర్పిస్తారని ఆశిస్తాము.

తిమ్మరుసు

కర్త: శ్రీ గుంటూరు సత్యనారాయణగారు, ఎం. ఏ., యలమంచిలి, విశాఖపట్నంజిల్లా. వెల అర్ధరూపాయి.

ఆధునిక నాటకరచన కొంత విశిష్టరూపాన్ని పొందబోతోంది అని చూపడానికి 'తిమ్మరుసు' కంటె వేరే ఉదాహరణ అక్కరలేదు. ప్రతిరంగము కడు చిన్నదిగా వుండి, ఉద్రేకభావాలకి, విషయ విపులతకు స్థానమై ప్రేక్షకుణ్ణి భావసోపానాలెక్కించి ఉద్రేకుణ్ణి చేస్తుంది.

నాటకంలో ఒక క్రొత్తపోకడ విస్పష్టమౌతూవుంది. యిట్టి స్వతంత్రరచనలను ఆంధ్రమహాశయులు ఆదరిస్తారని విశ్వసిస్తాము.

ప త్రి కా ప రి చ యం

గ్రామస్వరాజ్యం (వారపత్రిక)

సంపాదకులు: ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశంపంతులుగారు, మౌంటురోడు, మద్రాసు. సాలుచందా 4 రూపాయిలు, అర్ధసంవత్సర చందా 2-8-0.

గ్రామాలను స్వయంపోషకాలనుచేసి, పల్లెలలో భారతదేశ ఔన్నత్యాన్ని పునఃప్రతిష్ఠాపనచేయ డానికి యీ పత్రిక పాటుపడుతుంది. ప్రకాశంపంతులుగారు సంకల్పశిద్ధులు. వారి ఆధ్వర్యాన యీ ఉత్తమ ఆశయం యీ వారపత్రికముఖాన ప్రచారితమై ప్రతిష్ఠాపనమానుగాక యని కోరుతున్నాను.

దేశాభిమాని (వారపత్రిక)

సంపాదకులు: శ్రీ పాములపాటి వేంకటకృష్ణయ్యచౌదరిగారు, గుంటూరు. సాలుచందా రూ. 2-8-0. విడిపత్రిక అర్ధణా.

జిల్లాకు సంబంధించిన ప్రాతీయసమస్యలయందు శ్రద్ధవహించుచు జాతీయాభ్యుదయములకొరకు కృషిసల్పు జాతీయ వారపత్రిక. ఆంధ్రమహాశయుల తోడ్పాటుతో ఇది చిరకాలం దేశసేవ చేస్తుందని ఆశిస్తున్నాము.

కేసరి (వారపత్రిక)

సంపాదకులు: పి. వి. సుబ్బారావుగారు, నెల్లూరు. చందా నెల్లూరివారికి రూ. 2, పొరుగూరి వారికి రూ. 3, విడిపత్రిక మూడు కానులు.

రైతు, స్థానికసంస్థల సమస్యలకు, శ్రీ సాయిబాబా వుద్యమవ్యాప్తికి పాటుబడే వారపత్రిక.

దీనిలోని వివిధ శీర్షికలలో యీ ఆశయం ప్రతిఫలిస్తోంది. ఇది సర్వదా ఆంధ్రుల ఆదరణను బహు ముఖాల అందుకుంటుందని విశ్వసిస్తాము.

సంపాదకీయములు

ప్రభుత్వోద్యోగములు - స్త్రీల కన్యాయము

ప్రభుత్వ పరిపాలనయందు కొన్ని భాధ్యతాయుతమైన పదవులను స్త్రీలకు ఇంకను అధికముగ నొసంగుటకు తగురీతిని ఏర్పాట్లు చేయవలసినదిగ కోరుచు శ్రీమతి యం. ఎ. జానకిగారు భారతరాజప్రతినిధికి పెట్టుకొనిన అర్జీవిన్నపము మన్నింపబడలేదు.

నేటి పరిపాలనలో ప్రస్తుతమమలుయందున్న ఉద్యోగచట్ట నిబంధనల ప్రకారము స్త్రీల కొసగదగునవి 'టైపిస్టులు,' 'టెలిఫోను గుమాస్తాలు' మొదలగు సాధారణ ఉద్యోగములు మాత్రమే. అవియును అవివాహితలగు స్త్రీలకును, సంతానవిహీనలగు వితంతువులకు మాత్రమే.

సామాజిక జీవనములో స్త్రీ పురుష సమానత్వము, అధికారవాంఛ మొదలగు వాటి విషయమెట్లున్నను, ప్రస్తుతపు యీ చట్టమందు అత్యల్పమైన సాధారణ విషయ పరిశీలనా పరిజ్ఞానముగాని, న్యాయదృష్టిగాని ఏమాత్రము లేదని చెప్పుటకు చింతిల్లుచున్నాము.

విద్యా ప్రాభవముగాని, నిర్వహణాసమర్థతగాని లేనిపక్షమున స్త్రీలకు ఉద్యోగము లీయరాదను వాదమందు అర్థమున్నది. కాని వివాహితయైనంత మాత్రమున ఉద్యోగనిర్వహణకు పనికిరాదనుట ఏటి న్యాయము? 'వివాహమే' ఇట్టిదానికి ప్రతిబంధకముగా నెంచుపట్ల 'వివాహము'నకే ఇది అపచారము చేయుచున్నది. పైగా 'స్త్రీ ధనార్జన చేయగూడదు' అను ప్రభుత్వ ఆజ్ఞగా ఇది గన్పట్టుచున్నది గాని, ఇందులో ధర్మవాదమగుపడుటలేదు. వివాహితలైన స్త్రీలవిషయ మెట్లున్నప్పటికిని, సంతానవతులైన వితంతువులను గూడ నిషేధించుచున్న యీ చట్టములో ధర్మపరిశీలన శూన్యముగాదా?

భర్తల యనంతరము ఆర్థికసదుపాయములేక వితంతువులే యల్లాడుచుండ, నిక సంతానవతియైన వితంతువుయొక్క దుర్భరస్థితి వేరుగ జెప్పవలయునా? తినుటకైనను తిండిలేనితల్లి బిడ్డల పురోభివృద్ధికనువగు విద్యాబుద్ధుల నెట్లు చెప్పించగలుగును? భార్యలులేని పురుషులు ఉద్యోగములు చేయుటలేదా? అట్లే భర్తలులేని స్త్రీలు మాత్రము చేయలేరా?

సంతానవతులగు వితంతువులకు ఉద్యోగములిచ్చి ఆర్థికముగ సహాయముజూపుట ముఖ్య ధర్మమైయుండ, ఇట్టి చట్ట నిబంధనలతో వారిని నిషేధించుట ప్రభుత్వమునకు కీర్తికరముగాదు.

సమర్థతా సమర్థత, పరిపాలనాదక్షత, నిర్వహణాశక్తినిబట్టి పరిశీలింపదగిన విషయములుగాని కేవలము 'స్త్రీ'యని నిషేధించు ప్రభుత్వపుదృష్టిలో న్యాయములేదు.

సనాథలకు, అనాథలకుకూడ యీ చట్టము అత్యంతమైన హానిని చేకూర్చుచున్నది. ఇట్టి అవమానకరమైన విషయములను పరిష్కరించుటకునై వనితాలోకము తీవ్రాందోళనము చేయవలసియున్నది.

పరిస్థితులకు అనుగుణ్యముగ న్యాయ మొనరించుటకునై వైస్రాయిగారిచే పంపబడిన శ్రీమతి జానకిగారి విన్నపమును, పూర్వపు రీతిగనే యుంచుటలో మద్రాసు ప్రభుత్వపు వారిచర్య ఎంతమాత్రమును అభినందనీయముగాదు

స్థానిక సంస్థలలోను, తదితర ప్రభుత్వోద్యోగములలోను స్త్రీలు అత్యంత దక్షతతో పదవుల నిర్వహించుచు ప్రజాదరణల నొందుచుండుట గమనించియుగూడ యీ విషయమున నేటి ప్రభుత్వపుదృష్టిలో మార్పు గలుగకుండుట శోచనీయము.

స్త్రీ హితైషిణీమండలికి మందిర నిర్మాణము

ప్రఖ్యాత రచయిత, సంఘసేవా ధురీణ, శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మగారి కార్యదర్శికత్వమున నిర్వహింపబడుచున్న బాపట్ల స్త్రీ హితైషిణీ మండలినిగురించి మేమిప్పుడు క్రొత్తగా చెప్పవలసిన పనిలేదు. ఈ మండలి కేవలము క్రీడాప్రాధాన్యముగనే కాక, స్త్రీ జనోపయోగకరములైన నవారు నేత మొదలగు గృహపరిశ్రమలు, పఠనాలయములు ఆదిగాగల వివిధవిషయములు గలిగి ఆంధ్రమహిళాసమాజములకు తలమానికమై యున్నది.

దీనికి జిల్లాబోర్డువారు స్థలమునుగూడ మంజూరుజేసియున్నారు. అందు సమాజమునకు మందిరమును నిర్మింపవలసియుండుట నేడు అత్యంతావశ్యకమై యున్నది.

ఇది కేవలము బాపట్ల పురమునకు చెందినదైనప్పటికిని మహిళాభ్యున్నతికి సహాయపడు నుద్దేశ్యముతో యీ గృహనిర్మాణమునకు సహకారమునిచ్చుట అఖిలాంధ్ర సోదర సోదరీమణుల విహితధర్మము.

నేడు బాపట్ల-రేపు మరియొక పురమునగూడ ఇట్టి మహిళాసమాజ మందిరములు నిర్మింపబడవలసి యున్నవి. ప్రాంత్యభావములుగాక, స్త్రీజన భాగ్యోదయమునే గోరుచు ఇట్టి సంఘశ్రేయస్కరములగు కార్యములకు చేయూతనిచ్చుట ప్రతియొక్కరి విధియునైయున్నది.

ఇందు విషయమై శ్రీమతి వరలక్ష్మమ్మగారి విజ్ఞప్తిని ప్రత్యేకముగ ప్రకటించియున్నాము.

వారి విజ్ఞప్తిలో విన్నవించినటుల ప్రతియొక్కరును వారికి తోచినంత ధనసహాయముచేసిన యిది అంత భారముగాదు.

వరలక్ష్మమ్మగారి వ్యాసములద్వారా విజ్ఞానప్రబోధితులైన ప్రతి గృహలక్ష్మి పాఠకులను, తదితరులను ముఖ్యముగా చందాలిచ్చి తోడ్పడుదురుగాక యని కోరుచున్నాము.

Edited by Dr. K. N. Kesari, Printed and Published by Dr. S. Seshagiri Rāo, at the Lodhra Press, 15, Westcott Road, Royapettah, Madras.

విక్రమనామ సంవత్సర – కార్తీక - మార్గశిరమాసములు

1940-వ సంll నవంబరు నెల

1	శు	ద్వి 36-53 విశా 9-2 ది 18-5
2	శ	తృ 29-53 అనూ 3-24 జ్యే 59-8 ది 16-24
3	ఆ	చ 24-34 మూల 56-29 ది 18-15 రా 23-51
4	సో	పం 21-5 పూషా 55-46 ది 20-12 స్కందషష్ఠి
5	మం	ష 19-37 ఉషా 57-5 ది 16-13 షష్ఠి-తిధి-వ్రతం
6	బు	స 20-13 శ్ర 60-0 ది 7-38 సప్తమితిధి
7	గు	అ 22-57 శ్ర 0-25 ది 11-16
8	శు	న 27-20 ధని 5-32 ది 25-30
9	శ	ద 33-4 శత 12-5 రా 1-24
10	ఆ	ఏ 39-38 పూభా 19-30 రా 18-1 సర్వైకాదశి. భీష్మపంచకం వేదనిధి
11	సో	ద్వా 46-26 ఉభా 27-22 క్షీరాబ్ధిపూజ
12	మం	త్ర 53-2 రే 35-9 ది 1-16 ప్రదోషం
13	బు	చశి 58-59 అశ్వి 42-27 రా 2-38 చతుర్దశితిధి [అన్నాభిషేకం
14	గు	○ 60-0 భర 48-59 ది 9-4 త్రిదినస్పృక, జ్వాలాతోరణం, పూర్ణిమ,
15	శు	○ 4-11 కృ 54-38 ది 21-49 వృశ్చికరవిః 20-20 ప్రథమతిథి, కృత్తిక
16	శ	ప్ర 8-23 రో 59-21 రా 9-16 ద్వితీయాతిధి కార్తీక బహుళం
17	ఆ	ద్వి 11-32 మృ 60-0 ది 14-12
18	సో	తృ 13-42 మృ 3-1 ది 24-56 సంకటచతుర్ధి
19	మం	చ 14-45 ఆరు 5-39 రా 8-1 విద్యానిధి
20	బు	పం 14-42 పున 7-15 ది 27-25
21	గు	ష 13-28 పుష్య 7-45 రా 11-0
22	శు	స 11-9 ఆశ్లే 7-6 రా 7-48 దాపాయనం 25-14 కాలభైరవాష్టమి
23	శ	అ 7-35 మఖ 5-16 ది 24-17 నవమితిధి
24	ఆ	న 2-55 ద 57-10 పుబ్బ 2-21 ఉత్త 58-24 ది 19-10
25	సో	ఏ 50-31 హస్త 53-29 ది 17-41 స్మార్తఏకాదశి
26	మం	ద్వా 43-10 చిత్త 47-54 ది 11-37 వైష్ణవ ఏకాదశి
27	బు	త్ర 35-52 స్వా 41-54 ది 0-30 రా 26-13 ప్రదోషం, శివరాత్రి
28	గు	చశి 27-25 విశా 35-53 రా 16-40 చతుర్దశీతిధి
29	శు	● 19-49 అనూ 30-3 రా 14-39 తిధిద్వయం
30	శ	ప్ర 12-54 జ్యే 25-6 రా 15-49 ద్వితీయాతిధి మార్గశిర శుద్ధం

ముఖ్య పండుగలు

3, ఆదివారం - నాగులచవితి

14, గురువారం - కార్తిక పౌర్ణమి, జ్వాలాతోరణం.

REGD. NO.
M-2357

గృహలక్ష్మి

1ST DECEMBER
1940



GRIHALAKSHMI

VOL. 13

No. 10

PRICE AS. 4.

జ్వరము

జ్వరము - మానవుల శక్తిని, జీవనమును పిల్చివేయును కనుక జ్వరము మిమ్ము ఆవహించినదనగనే దానిని పారద్రోలవలయును. అట్లుచేయుచో మిమ్మాపిశాచి జీర్ణించి పిప్పిచేయదు.

అర్క

జ్వరము వచ్చినదనగనే అర్కను ప్రయోగించుడు. ఆహార, విహార ఋతుభేద దోషంబులవలన అన్నాశయమునందు క్రిమికీటకము చేరి పలువిధములైన జ్వరములు సంభవించుచున్నవి. వాతజ్వరము, పిత్తజ్వరము, కఫజ్వరము, సన్నిపాతజ్వరము మరి యితర విష జ్వరములు, కడుపులో ప్లీహమను జ్వరగడ్డను, అర్క కుదుర్చును. ఈ ఔషధమును పసిబిడ్డలకుగూడ యివ్వవచ్చును.

6 ఔ. రు. 2-8-0 3 ఔ. రు. 1-8-0. 1 ఔ. అ 8.

కేసరికుటీరము - రాయపేట - మదరాసు

విక్రమనామ సంవత్సర – మార్గశిర - పుష్యమాసములు

1940 డిసెంబరు

1	ఆ	ద్వి 7-10 మూల 21-26 ది 17-41 రా 16-22
2	సో	తృ 2-54 పూషా 19-18 రా 11-1
3	మం	చ 0-26 ఉషా 19-2 రా 1-9 నాగపంచమి
4	బు	పం 0-5 శ్ర 20-48 రా 3-14 చంపాషష్ఠి
5	గు	ష 1-47 ధని 24-32 రా 16-3 షష్ఠివ్రతం
6	శు	స 5-31 శత 30-7 రా 19-50 మిత్రసప్తమి
7	శ	అ 10-48 పూభా 37-6
8	ఆ	న 17-15 ఉభా 44-48 ది 4-11
9	సో	ద 24-2 రే 52-38 ది 18-43 సత్యనిధి
10	మం	ఏ 30-38 అశ్వ 59-58 రా 20-38 సర్వ-క్షాశిక-ఏకాదశి
11	బు	ద్వా 36-27 భర 60-0 ది 26-34 మత్స్య-అఖండ-ద్వాదశి [జయంతి
12	గు	త్ర 41-8 భర 6-8 రా 11-1 కృత్తికా-వ్రతం-దీపం, ప్రదోషం, హనుమత్
13	శు	చశి 44-31 కృ 11-46 చతుర్దశీతిధి [విష్ణు సర్వాలయ దీపం
14	శ	○ 46-35 రో 15-52 శే 0-30 రా 2-25 దావేరవిః 56-10 పూర్ణిమాతిధి
15	ఆ	ప్ర 47-26 మృ 18-38 రా 12-9 మార్గశిర బహుళం
16	సో	ద్వి 47-10 ఆరు 20-20 రా 22-36
17	మం	తృ 45-58 పున 21-2 రా 12-54
18	బు	చ 44-0 పుష్య 20-53 రా 24-29 సంకటచతుర్ధి
19	గు	పం 41-17 ఆశ్లే 20-0 రా 21-11
20	శు	ష 37-58 మఖ 18-29 రా 9-44
21	శ	స 34-2 పుబ్బ 16-25 రా 5-34 మకరాయనం 57-17
22	ఆ	అ 29-29 ఉత్త 13-49 రా 5-34
23	సో	న 24-22 హస్త 10-24 రా 1-4 నవమితిధి
24	మం	ద 18-42 చిత్త 6-37 ది 19-38 తిధిద్వయం
25	బు	ఏ 12-43 స్వా 2-25 విశా 58-0 ది 15-23 సర్వైకాదశి ద్వాదశితిధి
26	గు	ద్వా 6-32 అనూ 53-39 ది 7-27 ప్రదోషం
27	శు	త్ర 0-28 చశి 54-46 జ్యే 49-37 ది 6-43 శివరాత్రి
28	శ	● 49-47 మూల 46-17 ది 8-30 రా 14-25 అమావాస్య
29	ఆ	ప్ర 45-55 పూషా 43-59 ది 9-29 పుష్య శుద్ధం
30	సో	ద్వి 43-32 ఉషా 43-7 ది 3-41 రా 25-8
31	మం	తృ 42-45 శ్ర 43-50

విషయసూచిక

1. విజయసారధి—'దేవకీ నందన' ... 599
2. భిక్షుక సమస్య ... 600
3. నక్షత్ర ఫలితాలు—కవికలహంసి శ్రీమతి చేబ్రోలు సరస్వతీదేవి ... 601
4. శ్రీ రావు ఇందిరాదేవి స్మృతి—మల్లెమడుగుల సత్యనారాయణ ... 602
5. 'సజీవమైన వాఙ్మయం కావాలి'—శ్రీమతి వట్టికొండ విశాలాక్షి ... 604
6. నాదమహతి—పిల్లలమఱ్ఱి వేంకట హనుమంతరావు ... 605
7. స్త్రీ సాముద్రిక శాస్త్రము—శ్రీమతి చేబ్రోలు సరస్వతీదేవి ... 606
8. రాజమకుటం—శ్రీ పురాణం కుమారరాఘవశాస్త్రి ... 607
9. వింతవింతల ప్రపంచం—వారణాశి భాస్కరమహాలక్ష్మి ... 616
10. స్త్రీలు-కవిత్వం—శ్రీమతి వేదవల్లి తాయారమ్మ ... 618
11. విజయ శంఖము—మధునాపంతుల వేంకట సూర్యనారాయణమూర్తి ... 619
12. గౌతమి—శ్రీ పాలకోడేటి శ్రీరామశర్మ బి. ఏ. ... 620
13. ఆంధ్రశిల్పి—వారణాసి వేంకటేశ్వరులు ... 622
14. విద్యావతులు అవివాహితలుగా మిగిలిపోతున్నారు-కె. సరోజనీదేవి ... 623
15. అన్నం ఎలా అరుగుతుంది ?—డాక్టరు యస్. శేషగిరిరావుగారు ... 626
16. తెనుగుదేశం—పిన్ని ఉత్తరాలు ... 628
17. భావతరంగిణి ... 630
18. కళాకలాపము-చిత్రలేఖనము—శ్రీ ఒంగోలు వెంకటరంగయ్య ... 631
19. స్త్రీ మూర్తి—శ్రీ అనుముల వేంకటశేషకవి ... 634
20. దమయంతి కాలంలో విడాకులు ఉండి వుండాలి —శ్రీ ఆచంట సూర్యనారాయణమూర్తి ... 636
21. ఆంధ్రజాతిలో...—శ్రీమతి బసవరాజు రాజ్యలక్ష్మమ్మ ... 637
22. 'ఆమె నీడ'—శ్రీ శివరాజు వెంకటసుబ్బారావు ... 640
23. భారతీయనారి—శ్రీ స్వామి వివేకానంద ... 647
24. సర్వనాశనమా !-సర్వోదయమా ! !—శ్రీమతి కె. సుగుణమణి ... 649
25. పాకకళ ... 655
26. పుష్పచయము ... 659
27. చలనచిత్రాలు ... 661
28. గ్రంథసమీక్ష ... 662
29. యుద్ధరంగము ... 663
30. పత్రికాపరిచయము ... 665
31. సంపాదకీయములు ... 666

వర్ణచిత్రము: విజయసారధి



విజయసారథి



జయజయ గృహలక్ష్మీ సఖి! జయజయ లలితాంధ్ర మధుర సారస్వతమా!
జయజయ లలనారత్నమ! జయజయ విద్యాప్రబోధ! జయకల్యాణీ!

విజయ సారధి

కలనుగననీ కారు మబ్బులు
ముందు విననీ మరల మ్రోతలు
జేరుచున్నవి జంబు భూమిని
పూర్వపశ్చిమ బురులనుండి
బరగుచున్నవి పగలురాత్రై

మెరయుచుండెను ధృవపుచుక్కై
శాంతమూర్తి గాంధి దేవుఁడు
జూపు చుండెను సుకర మార్గము
మృత్యుదేవత మ్రోలబడక
విజయ సారధి, విశ్వసింపుడీ!

—'దేవకీ నందన'

భిక్షుక సమస్య

భారతీయుల జీవకారుణ్యమునకును ధార్మిక చింతకును నిధానమై నిలచియున్న ఈ 'భిక్ష' ఇప్పుడు విపరీత రూపమును దాల్చినది. కృషిజేయ నొల్లని సోమరులకును ఉద్యోగ రహితులకును సులభ జీవనోపాధియై సంఘమునకే ముప్పు దెచ్చిపెట్టినది.

కుంటి, గ్రుడ్డి మొదలగు అంగవైకల్యులు సరేగదా, శరీరపాటవము గలవారును కష్టపడి కృషి చేయనొల్లక సులభముగా నార్జించుట కనువగు యీ భిక్షా వృత్తిలోనే యడుగిడుచున్నారు. దీని వలన ప్రజలలో సోమరితనము విజృంభించి అధర్మము అన్యాయము పెచ్చు పెరుగుచున్నవి. స్త్రీలు, పురుషులే గాక పసిపిల్లలు సహిత మీ భిక్షాటనమునకే యలవాటుపడి నానావిధములగు కుత్సిత మార్గములలో బడి చెడిపోవుటయే గాక ప్రభుశిక్షణలకు పాత్రులగుచున్నారు.

ఇట్టి వారలకు ప్రభుత్వము శిక్ష ననుభవించు కాలములో మాత్రము వడకట్టు నేయుట, వడ్రంగిపని, తోటపని మున్నగు చేతిపనుల నిచ్చి ఊడిగము చేయించుకొనుచున్నది. కాని వీరు జెయిలునుండి బయటికి రాగానే మరల ఆ అవినీతి కార్యములలోనే జొరబడుచున్నారు. ఈ దుస్థితిని నిర్మూలించుటకు ముందు ముఖ్యముగ దీనికారణము ఆలోచించి ప్రతిక్రియ చేయవలసి యున్నది. వీరందరికి తగినపని కల్పించి అన్నము పెట్టగలప్పుడే ఇది సాధ్యమగును.

భిక్షాటనమే వృత్తిగాగల కొందరు అనాధలగు పిల్లలను చేరదీసి వారిచే డబ్బు సంపాదించి కుటుంబములను పోషించుటయే గాక వడ్డి వ్యాపారములు జేయుచున్నారు.

ఇది గాక క్షయ, కుష్ఠు మొదలగు అంటు జాడ్యములుగలవారు లెక్కకు మిక్కిలై విచ్చలవిడిగా వీధులవెంటను, బస్సు స్టాండులవద్దను, ట్రాంబండ్ల వద్దను గుంపులుగా జేరి బాటసారులకు విసుగు గొల్పుటయే గాక ప్రజలలో నిట్టి నికృష్ట వ్యాధులను వ్యాపింపజేసి సంఘమునకు మహానర్థమును గూర్చుచున్నారు.

ఈ సమస్యను గురించి వెనుక జూలై సంచికలో 'గృహలక్ష్మి' తీవ్రముగా హెచ్చరించియున్నది. తదనుగుణ్యముగ ఇప్పుడు మద్రాసు కార్పొరేషను మద్రాసులోని ముష్టి వాండ్రకు ప్రత్యేకముగా నొకస్థలమును నిర్మించుటకును, దీనికొఱకై పోలీసు యాక్టును సవరణచేయు బిల్లునొకటి ప్రజాభిప్రాయము కొఱకు ప్రకటించుటకును నిర్ణయించినట్లు ప్రకటింపబడినది. ఈ బిల్లును అతిత్వరలో ప్యాసు జేయించి, వసతి గృహమును నిర్మించి కార్యరూపమును దాల్చుటకు యత్నముచేయు భారము ప్రజానీకముపై యున్నది.

★ నక్షత్ర ఫలితాలు

కవికలహంసి
శ్రీమతి చేబ్రోలు సరస్వతీదేవి

మార్గశీర్ష మాసము

అశ్విని
విద్వత్సమాగమం; ధనలాభం; దైవభక్తి.

భరణి
గురుభక్తి; సౌఖ్యం; ఆభరణలాభం.

కృత్తిక
ప్రీతి; లాభం; సుఖభోజనం; భోగం.

రోహిణి
సౌభాగ్యం; గోలాభం; కృషిమూలమున ఫలం.

మృగశిర
రాజభయం; శిరోవ్యాధి; దుఃఖము.

ఆర్ద్ర
కోపము; ఉపవాసం; ప్రయాణం.

పునర్వసు
స్వల్పాధికారం; విషభీతి; యుద్ధభయం.

పుష్యమి
వస్త్రలాభం; జంతువులచే భయం; పరులవలన బాధ.

ఆశ్లేష
వ్యాజ్యచిక్కులు; విచారం; స్వదేశపరిత్యాగము.

మఖ
బంధుసమాగమం; శుభవార్త వినుట; ప్రయాణములో ధనలాభం.

పుబ్బ
గురుమూలమున ధనలాభం; జ్ఞానం; ఆరోగ్యం.

ఉత్తర
ఆహ్లాదం; ధర్మకార్యం; ఇష్టభోజనం.

హస్త
భోగభాగ్యం; రాజదర్శనం; లాభం.

చిత్త
ప్రయాణములో క్లేశం; దేహబాధ; కార్యవిఘ్నం.

స్వాతి
ధననష్టము; అనారోగ్యం; మోసము.

విశాఖ
దుష్టస్త్రీ కలహం; గృహచ్ఛిద్రం; తేజోహాని.

అనూరాధ
గర్భశూల; పుత్రవియోగం; వ్యయం.

జ్యేష్ఠ
ఆయుధభయం; మనోచాంచల్యం; నిష్ఠూరము.

మూల
ద్రవ్యలాభం; సత్సహవాసం; క్షేత్రదర్శనం.

పూర్వాషాఢ
వినోదగోష్ఠి; సంతానసౌఖ్యం; యశోవృద్ధి.

ఉత్తరాషాఢ
ఆనందం; యత్నకార్యలాభం; గౌరవము.

శ్రవణం
పశువృద్ధి; సంపత్తు; పుష్పాలంకారం.

ధనిష్ఠ
అగ్నిభయం; విరోధం; కాంతిలేకపోవుట.

శతభిషం
చోరభయం; జూదం; ఆందోళన.

పూర్వాభాద్ర
వ్యయం; ధాన్యనాశం; విచారం.

ఉత్తరాభాద్ర
కార్యవిఘ్నం; మతిభ్రంశం; వ్యాధి.

రేవతి
పరితాపం; దేశాటనం; ఉద్యోగభయం.

శ్రీ రావు ఇందిరాదేవి స్మృతి

శా. అమ్మా! మీరిలఁ బాయుటల్ నిజమొకో? యత్యంత ప్రేమన్
విలాసమ్ముల్ గూర్చెడు భర్తఁ బాసి, తమకున్ స్వాంతంబుఁ బొంగించు
చిన్నమ్మన్, ముద్దుల బిడ్డనిన్ విడచి, యన్యాయమ్ముగా నేగఁ బంతమ్మె
దేనియుఁ గల్గెనా? చెపుడు, మాతా, యిందిరా దేవిరో!

ఉ. ఎంతటి వెఱ్ఱి ప్రశ్న! మదినెంతునుఁ మీరిలఁ గాంతు వీడగా;
నెంత తపంబుఁ జేసి జనియించితిరో భువి మాదు సూర్యభూ
కాంతునిఁ జెట్టఁ బట్ట, సతిగా నతనిన్ దరిలేని ప్రేమఁదే
లింతు నటంచు నమ్మి; యటు లేగుదురా తమరిందిరా సతీ!

మ. అదియుంగాక, తరంబె బ్రహ్మకయినన్ యావత్ప్రపంచంబు నె
మ్మదిలోనం దృణమంచు నెంచు తమ ప్రేమన్ ద్రుంప యత్నింపగా
నిదియే నిక్కవమైనచో జగములోనే లేదు సౌఖ్యంబు; ప్రే
మఁ దలిర్పన్ జగమేల, లేడె ప్రభు! వమ్మా యిందిరా దేవిరో!

గీ. తమరె ప్రాణంబు సూర్య భూధవున, కతడె
తమకుఁ బ్రాణేశు డెన్ని జన్మములకైన,
లేదు తమ కెపు డెడబాటు లేదు లేదు;
కాంతు హృత్సీమ వసియించు కన్నతల్లి!

చ. తమ యసమాన రూపము, సదా చిరునవ్వులఁ జిల్కు మోము, మో
దము నొడఁగూర్చు వాక్సుధయు, ధర్మగుణంబు ననన్య సాధ్య శీ
లమును బతివ్రతాత్వము, నిలన్గననూని విశాలదృష్టి మీ
విమల చరిత్ర, మా హృదయ వీధుల నున్నది, యిందిరాంబరో!

—మల్లెమడుగుల సత్యనారాయణ.



స్వర్గీయ రావు ఇందిరాదేవి
(శ్రీశ్రీశ్రీ పిఠాపురం రాజకుమార్ వారి ధర్మపత్ని)



దసరా సంచికలోని

'సజీవమైన వాఙ్మయంకావాలి'

అనే శ్రీమతి 'రోహిణి' గారి

సారస్వత హెచ్చరికకు క్రొత్తవెలుగులు

గృహలక్ష్మి దసరాసంచికలో 'రోహిణి' గారు చెప్పినట్లుగా ప్రాచీన వాఙ్మయాన్ని మించేదికాని లేక దానితో తులతూగేదిగాని లేకపోవడంవల్ల నేటి మన సాహిత్యాన్నిగురించి చెప్పుకోవాలంటే ఉత్సాహం సన్నగిల్లుతూవుంది. ఇది నిజంగా మన దౌర్బల్యాన్ని సూచిస్తూవుంది.

సాహిత్యమెప్పుడూ ఆర్థిక, సాంఘిక, రాజకీయ పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది. అందుచేత నేడు సాహిత్యవికాసం సన్నగిల్లుతూ ఉందంటే దీనికి ప్రధానకారణం జాతి దౌర్బల్యమేకాని వ్యక్తిగత దౌర్బల్యంకాదు. ప్రపంచంలో యేభాషా చరిత్రలు చదివిచూచినా మనకిదే విషయం గోచరమౌతుంది. ఆయా జాతుల స్థితిగతుల్నిబట్టి ఆయాభాషల్లో కాలానుగుణ్యంగా పరిణామం కల్గుతూనేఉంది. దీని కుదాహరణగా ఆంధ్ర సారస్వతంలో నన్నయభట్టునుంచి ఇప్పటివరకు కలిగినమార్పుల్ని పరిశీలిస్తే మనకీవిషయం స్పష్టమౌతుంది.

సాహిత్య మెప్పుడూ ప్రజాభిప్రాయానికి ప్రతిబింబంగా ఉంటుంది. మనదేశంలో ప్రజ లెక్కువగా విద్యావిహీనులు కావడంచేత ఉదరపోషనార్థం కవులు రాజాశ్రయం అపేక్షించారు. అందువల్ల ప్రాచీన సాహిత్యంలో ప్రజాభిప్రాయంకంటె రాజాభిప్రాయమే రాణించింది. అందులోగూడా కవులకు రాజులకు ఉండే సన్నిహిత సంబంధాన్నిబట్టి క్రమంగా మారుతూ వచ్చింది.

ఆంధ్ర సాహిత్యంలో ఆదికవి నన్నయభట్టు; రాజరాజుకు ఆస్థానకవి. అప్పుడు ఆంధ్రదేశం అన్నివిధాలా ఔన్నత్యంలో అలరారుతూఉంది. తర్వాత కవులమాదిరి నన్నయభట్టు రాజుకు కేవలం ఆశ్రితుడుగానో లేక దాసుడుగానో కన్పించకుండా గురుతుల్యుడుగా గోచరిస్తాడు. అందుకనే భారతాన్ని లోకోపకారార్థం తెలిగిస్తున్నానని చెప్పుకో కలిగినంత స్వతంత్రుడయ్యాడు. మనుమసిద్ధి కాలంలో తిక్కన గురుతుల్యుడు కాకుండా అమాత్యపదాదరణకు పాత్రుడయ్యాడు. తర్వాత శ్రీనాథ కవిసార్వభౌమునిలో రాజాశ్రయం ప్రజాశ్రయం రెండూ కనుపిస్తున్నవి. రాజులను రంజింపజేసే శృంగారనైషధం మొదలు ప్రజాభిప్రాయం ప్రతిబింబించే పల్నాటివీర చరిత్రవరకూ వ్రాయగలిగాడు. "దీనారటంకాలతీర్థ మాడించిన" రాజపూజితుడు జొన్నకలి, జొన్నయంబలికూడా చవిచూచాడు. అందుకనే ఆయనకవిత్వంలో అంతవైవిధ్యం వైచిత్ర్యం ప్రస్ఫుటంగా కనుపిస్తూవున్నవి. మళ్ళీ ఆంధ్రభోజుని కాలంలో ఆంధ్రసామ్రాజ్యం అభివృద్ధిలోకి వచ్చింది. శత్రురాజుల దండయాత్రలు లేకపోవడంచేత ప్రజలు హాయిగా జీవయాత్రను సాగించినరోజులవి. రాజాశ్రయంలో పరరాజకన్యలతోపాటు కవితాకన్యకూడా భోగాసక్తురాలయింది. కాబట్టే కవులందరూ శృంగారరసమే ప్రధానంగాగల ప్రబంధాలు రచించారు. ఈకాలంలో దాదాపు కవులందరు గురుత్వ అమాత్యపదవులనుండి ఆశ్రితులుగామారారు. ఆంధ్రసామ్రాజ్యం కృష్ణరాయల తర్వాత క్షీణించుతూ రామరాయలుతో అస్తమించింది. సామ్రాజ్యంగతే సాహిత్యానికికూడా పట్టింది. ప్రజలతో పాటు కవులుకూడా దాసులయ్యారు. దీనితో సాహిత్యంలో అంధయుగం ప్రారంభమయింది. మెచ్చియిస్తే 'చంద్రరేఖావిలాసం' లేకపోతే 'చంద్రరేఖావిలాపంగా' మారింది కవిత్వం. ఇంతలో మనదేశాన్ని ఆంగ్లేయులు ఆక్రమించారు. పరదాస్య ప్రవృత్తిలోనే ప్రజలకు కొంత స్తిమితం చిక్కింది. పాశ్చాత్యభాషా సంపర్కంవల్ల మన సాహిత్యంలో ఆధునికయుగం ప్రారంభమయింది.

ఇంతకుపూర్వం మనసాహిత్యం కేవలం పద్యప్రధానంగా నడచింది. ప్రస్తుతం విజ్ఞానాభివృద్ధితో పాటు భాషాయోషకూడా కావ్యాలు, గేయాలు, నాటకాలు, నవలలు, వ్యాసాలు, కథలు, చరిత్రలు,

స్వీయచరిత్రలు మొదలయిన సర్వాంగములతో దినదినాభివృద్ధి పొందుతూవుంది. అనేకమంది అనేక నూతన పంథాల్లో ప్రయత్నంజేస్తున్నారు. కొన్నిశాఖల్లో కొంతమంది రచనలు తృప్తికరంగానే ఉంటున్నవి. ఈ ఆధునిక రచనల్లో ఏది ఎంతవరకు శాశ్వత సారస్వతంలో చేరుతుందో ముందుకాలమే నిర్ణయిస్తుంది. తాత్కాలికమైన పేరుప్రతిష్టల్నిపట్టి సమకాలికుల్ని నిర్ణయించడం సాహసమాతుందేమో!

ప్రాచీన సాహిత్యంలో యే దేశంలోనైనా యే యిద్దరు ముగ్గురు కవయిత్రులో తప్ప చెప్పతగినంత యెక్కువగాలేరు. కవులతో తులదూగే కవయిత్రులు అప్పుడుగానీ ఇప్పుడుగానీ లేకపోవడానికి కారణం పురుషులతోపాటు సమానంగా స్త్రీలకుకూడా రాజకీయ, సాంఘిక, ఆర్థిక స్వాతంత్ర్యము లేకపోవడమే. స్త్రీలను పురుషులు అమానుషమైన ఘోషాబందిఖానాలో ఉంచి పశువులుగా, వంటయింటి పనిముట్లుగా, భోగవస్తువులుగా, దాసీలుగా తయారుచేశారు. ఇట్టి అస్వతంత్రసంఘంలోనుంచి ఉన్నతస్థానం అలంకరించే మహిళామణులు రాలేదంటే దీనికి పురుషులుజేసుకొన్న స్వయంకృతాపరాధమే. ఇప్పుడిప్పుడే కొంచెం ఘోషాలు తగ్గిపోతూ ఉండడంవల్ల కొంతమంది స్త్రీలైనా వృద్ధిలోకి రాగల్గుతున్నారు. తెలివితేటల్లో పురుషులకంటే స్త్రీ లేమాత్రం తీసిపోరు. ఇక ముందైనా వారితోపాటు అన్నివిషయాల్లోను సమాన హక్కులుంటే స్త్రీ లేమాత్రం వెనకబడర్మనడానికి మున్మాటికీ యేమీ సందేహంలేదు.

—వట్టికొండ విశాలాక్షి.

నాదమహతి

నామహతికి తంత్రులెన్నో
లెక్కలేనన్ని వున్నాయీ!
నాదమహతితో నాలపించుట
కేనునొక్కడ తగుదునోయీ!
తంత్రినొక్కటి మీటుకొనుచూ
దివ్యపురుషుల దింపగలనూ!
తీగనొక్కటి కదుపుకొనుచూ
తీవబోదుల ద్రిప్పగలనూ!
పాటనొక్కటి పాడుకొనుచూ
పాములన్నిటి బట్టగలనూ!
తంత్రినొక్కట తాళమేసీ
తాండవానికి తావునిత్తును!
తీగనొక్కడ దలపుపెట్టీ
తీయబలుకుల బలుకనిత్తును!
రాగమొక్కటి రగులుకొలిపీ
భంగిమబ్బుల బాదిగివేతును!

ముదముగూర్చే ముగుదముచ్చట
ముచ్చటించే మేళమొకటి!
నృత్యగీతము నేర్పడానికి
నాలపించే నాదమొకటీ!
కావ్యగానపు కల్పనానికి
కధలనిచ్చే కంఠమొకటీ!
కొమ్మయందలి కోయిలమ్మతో
కలసిపాడే కాలమొక్కటి!
ఏటిరొదలనె యేరుకొనుచూ
వాటిసరణిని వరసయొక్కటి!
భీతిగొలిపే యలలఘోషలు
పిక్కటిల్లే ఫణితియొక్కటి!
నాదమహతితో నాలపించుట
కేనునొక్కడ తగుదునోయీ!

—పిల్లలమర్రి వేంకట హనుమంతరావు.

★ స్త్రీ సాముద్రిక శాస్త్రము ★

కవికలహంసి, శ్రీమతి చేబ్రోలు సరస్వతీదేవి

(గతసంచిక తరువాయి)

ఈ గురు వ్రేలియొక్క మొదటి కనుపునకు (గోరుతో కూడినది) మేషరాశియనికూడ పేరు.

ఈ కనుపుమీద నక్షత్ర రేఖయుండిన గొప్ప ధనవంతుడు, సంపదగలవాడు.

నిలువు రేఖయుండిన మిక్కిలి ఆలోచన, సుగుణము, వాచాలత్వము యుండును. తర్కవాదము నందు ఆసక్తియుండును.

గురు వ్రేలియొక్క రెండవ కనుపునకు వృషభరాశి యనిపేరు. దీనిమీద రెండు కత్తెర రేఖలుండిన ధనవంతులతో చెలిమిగల్గును. నిలువురేఖ యుండిన పరులను పీడించుస్వభావము; అబద్ధము చెప్పువారు, నక్షత్ర చిహ్నముండిన, దుర్నీతిని సూచించును. గురువ్రేలియొక్క మూడవకనుపునకు మిధునరాశి యనిపేరు.

దీనిమీద వంకరలేక యుండిన అన్యులవద్దనుండి ధనము సంప్రాప్తించును.

రెండు సమాంత రేఖలుండిన మంచితనము, ధర్మగుణము సూచించును.

మూడు నిలువురేఖ లుండిన స్వయముగా ధనార్జనము చేయును.

గురువ్రేలి గోటిమీద తెల్లమచ్చయుండిన ధనముండును. నల్లమచ్చ యుండిన తనకున్నధనము గోల్పోవును.

ఈ వ్రేలిమీద చక్రముండిన పితృ ధనమువచ్చును, లేక స్నేహితుల ధనమబ్బును; చక్రముగాక వేరే చిహ్నములుండిన వారికి రాబడికన్న ఖర్చు ఎక్కువగ నుండును.

మరియు నీ వ్రేలిమీద రేఖలు చీలికలై యుండిన ఆ స్త్రీ విధవయగును.

నడిమి వ్రేలు—

నడిమివ్రేలు, లేక శనివ్రేలు సుఖ దుఃఖములను, జ్ఞానా జ్ఞానములను నిరూపించును.

ఈ శనివ్రేలు వంకరలు తిరిగియుండిన క్రూర స్వభావము - హత్య చేయువారుగా నుందురు.

ఉంగరపు వ్రేలికన్న చాలా పొడవుగానుండిన రోగమువలన మనిషి క్షీణించును. విద్యా భంగము గల్గును.

ఉంగరపు వ్రేలికన్న కురుచగానున్న అజాగ్రత, సాహసము, మొండిచొరవ గలిగి యుండును. సమముగానున్న జూదము, త్రాగుడు సూచించును.

శనివ్రేలి మొదటి కణుపునకు కటకరాశి, రెండవ కణుపునకు సింహరాశి, మూడవ కణుపునకు కన్యారాశి యనియు పేర్లు.

ఈ మొదటి కణుపు కొనదేరి యుండిన పరుష స్వభావము, విస్తరించియుండిన ఆలోచన పరులు, చదరముగానున్న, కృషియందు అసక్తి, ధర్మానురక్తి. శని వ్రేలి గోటిమీద తెల్లమచ్చ యుండిన దేశసంచారము. నల్లమచ్చయుండిన తండ్రికి, తనకు అనారోగ్యము.

(సశేషము)

★ రాజమకుటం

రచయిత :
శ్రీ గోవింద వల్లభ పంతు.

అనువాదకర్త :
శ్రీ పురాణం కుమారరాఘవశాస్త్రి

ముందు కథ

చిత్తోడు మహారాణా విక్రమసింహుని మధుపాన మత్తుణ్ణిచేసి, రాజ్యపాలనాన్ని కంటకంగా పరిణమింపజేశాడు కుటిలసర్దారు రణజిత్తు. ఈ మధుపాన మత్తతలో కష్టాల్ని చెప్పుకోవచ్చిన దుఃఖినిని, ప్రజలను అవమానించాడు; తనకు విరోధియైన శీతలసేనినికూడా నిర్లక్ష్యంచేశాడు రాణా. అంతఃపుర దాసి పన్నా ప్రవేశించి, విరోధులైన మేవాడ్ సర్దార్ల దావానలాన్ని తన రక్తవర్షముతో చల్లారుస్తానని ప్రతిజ్ఞ పట్టింది. పినతండ్రి కుమారుడైన వనవీరుడు సర్దార్ల విద్రోహత్వాన్నిగురించి చెప్పి, తాను రాణాకు కుడిభుజంగా వుంటానని ప్రమాణంచేశాడు.

పాత్రలు

1. విక్రముడు	...	మేవాడ్ మహారాణా
2. రణజిత్తు	...	ఒక లోభి సర్దారు
3. వనవీరుడు	...	శీతలసేని పుత్రుడు
4. జయసింహుడు	...	కర్మచందు పుత్రుడు
5. కర్మచందు	...	ప్రధానమంత్రి-వృద్ధుడు
6. ఉదయసింహుడు	...	విక్రముని తమ్ముడు
7. చందర్	...	పన్నా పుత్రుడు
8. పన్నా	...	ఉదయుని దాది
9. శీతలసేని	...	వనవీరుని తల్లి

ప్రథమాంకము

౧. దృశ్యము

(వనవీరుని భవనం : శీతలసేని పాడుకుంటూ ప్రవేశిస్తుంది.)

కాఫీరాగం—జప్ తాళం

అవమాన దవాగ్ని !
నా చిత్తములో దరికొనుమా.

౧

క్షాత్రవుల తేజమ్ము క్షయము కావాలి
భయభావములు నన్ను వదలి పోవాలి
అదృష్టము పట్టాలి !

శీతలసేని :- రాజమాతను కావాలన్న ఈ కోరిక ఎన్నాళ్లనుంచి నా హృదయంలో మెదలుతున్నదో చెప్ప లేను. సమయమిపుడు అనుకూలంగా కూడి వచ్చింది. విక్రముడు నాకు గావించిన అవమానమే నన్ను మాన్యపదవి కెత్తగలదు. విక్రముని స్థానే వనవీరుని మహారాణాను చేయడానికి సర్దార్లంతా గట్టి పట్టుదలలో ఉన్నారు. నేను రాజమాతనౌతాను.

(రణజిత్తు ప్రవేశిస్తాడు)

రణజిత్తు :- మరి నేనూ?

శీతలసేని :- విన్నావూ? బలే చతురుడివి సుమా! మంచిది, నీవు ప్రధానమంత్రి వౌతావు. కాని అందుకు నీవేమైనా ప్రయత్నాలు చేస్తున్నావా మరి?

రణజిత్తు :- చేయకేం? విక్రముడికి తెలీకుండా ప్రజల్లో ఈ విప్లవాగ్ని రగిల్చిందినేనే; ఆయన సమక్షంలో మాత్రం మిత్రుడులాగ కనిపించేవాణ్ణి. ప్రజల దుఃఖాల్ని తొలగించాలనే ఆలోచనలో ఆయన ఉన్నప్పుడల్లా పరిపూర్ణ సురాపాత్ర చేతి కందించేసేవాణ్ణి.

శీతలసేని :- నీవంటివాడి సహాయంవల్ల నా ఆరంభం - సందేహంలేదు - ఫలిస్తుంది.

రణజిత్తు :- కాని నా భయమేమంటే - అంతా ఐన తర్వాత నేను మీకు జ్ఞాపకం ఉంటానో ఉండనో!

శీతలసేని :- ఏమీ భయంలేదు. రణజిత్! కావాలంటే రాసికూడ ఇస్తాను. (రాసి ఇస్తుంది)

రణజిత్తు :- చదవనీయండి. (కాగిత మందుకుని చదువుతాడు) "రాణి శీతలసేని రాజమాత అయేందుకుగా సర్దారు రణజిత్తు సహాయంచేసే యెడల, అతనికి మేవాడధిపతి వనవీరునివద్ద ప్రధాన మంత్రిపదవి మంజూరు చేయబడుతుంది.

శీతలసేని.

(కాగితం జాగ్రత్తగా మడిచి లోపల జేబులో పెట్టుకుంటాడు)

శీతలసేని :- కాని, రణజిత్! మన మెన్నడూ అనుకోనుకూడా అనుకోని విఘ్న మొకటి తటస్థించింది.

రణజిత్తు :- ఏమిటబ్బా అది!

శీతలసేని :- (విచారంగా) వనవీరుడు విక్రమునికి ప్రాణమిత్రుడు. అతన్ని సింహాసనం దింపించి తాను రాజ్య పదవి స్వీకరించటానికి మన మెంతచేసినా ఒప్పుకోడు.

రణజిత్తు :- అయితే, వాళ్లిద్దరిమధ్యా విరోధలతిక మొలిపించటం ఈ సేవకుడికి ఎడమచేతి ఆట!

శీతలసేని :- అది ఈ రోజే మొలవాలి! పుష్పించాలి; ఫలించాలి కూడాను. ఇదిగో, ఈ కటారు పుచ్చుకుని అక్కడెక్కడేనాదాగి ఉండు. (కటారు ఇస్తుంది) వనవీరు డిప్పుడే ఈవేపువస్తాడు. రాగానే అతన్ని వధించే—

రణజిత్తు :- (కటారు విసిరివేసి, అర్ధోక్తిలో) వద్దు. తల్లీ! వద్దు. ఇదా తీరా మీరు ఉపదేశించుతున్నది?

శీతలసేని :- అతన్ని వధించేంత హంగామా చెయ్యి. అంతే అతన్ని కిందపడవేయటం, కటారులో పొడవ బోవటం - అంతా తంత్రరచన.

రణజిత్తు :- ఓహో, ఇప్పుడు తెలిసింది. (నేలమీది కటారు తీసుకుంటాడు)

శీతలసేని :- ఆ సమయాన నేను వెనుకనుంచి వచ్చి నీకత్తియెత్తిన చేయి పట్టుకుని నిన్ను బంధించుతాను.

రణజిత్తు :- (అదరిపడి దూరంగా పరుగెత్తుతాడు. మళ్లీ కత్తి కిందపారేస్తాడు. రెండు చెవులు మూసుకుం టాడు) అరి, భగవంతుడా! బంధించి ఉరితీయించుతావు. అంతేకదూ! ఈ పని నావల్లకాదుతల్లీ!

శీతలసేని :-అయితే, ఆ లిఖితపత్ర మిటు తే. దానితోపాటు మంత్రి పదవిమీద ఆశకూడ వదలుకో.

(పత్రముకోసం చెయి చూపుతుంది)

రణజిత్తు :-ఊహుం ఇది ఇచ్చివేయటం నా కిష్టంలేదు.

శీతలసేని :-అయితే-మంత్రిపదవిమీద నీకంత తీవ్రవాంఛ ఉంటే నీళ్లల్లో, నిప్పుల్లో ఉరకటానికి సిద్ధపడి ఉండాలి.

రణజిత్తు :-సరే, చెప్పమ్మా! అది ఎటువంటి మహా సాగరమో! ఎటువంటి అగ్నిగుండమో! చెప్పు. ఒక్క సారిగా దూకేస్తాను.

శీతలసేని :-దీన్ని తీసుకో; నిండా కప్పుకో (ముసుగొకటి ఇస్తుంది) నేనున్నానుగా నీ విముక్తికి ఉత్తరదాతను.

రణజిత్తు :-భేష్. ఇప్పుడు బాగా తెలిసిపోయింది. అయితే ఇదే మంత కఠినమైన పని కానేకాదు. ఇక చూద్దురుగాని _ ఈ రణజిత్తుగాడి హస్త కౌశలాన్ని.

శీతలసేని :-ఇది కప్పుకుని ఆ గదిలోదాగి ఉండు. మాటలధోరణిలో పెట్టి వనవీరుని ఇక్కడే నిలిపేస్తాను. కొంతసేపైన తర్వాత నీకు సైగచేసి వెళ్లిపోతాను. అప్పుడు నీవు తటాలున వనవీరునిపై దుమికి, అతన్ని కింద పడవెయ్యి. తక్షణమే నేను నీకు మద్దత్తుగా పరుగెత్తివస్తాను. త్వరగావెళ్లు. అదిగో వనవీరుడు వస్తున్నట్టున్నాడు.

రణజిత్తు :-అలాగే. (నిష్క్రమిస్తాడు.)

శీతలసేని :-ఛీ, ఛీ, ఎంత అవమానం! (వనవీరుడు వచ్చి వింటూ ఉంటాడు) నువ్వు నన్ను జుట్టుపట్టిలాగావు. 'దాసి, వేశ్య' అన్నావు. హా, భగవంతుడా! నా పుత్రుడు వనవీరుని భుజాల్లో బలంలేదూ!

వనవీరుడు :-(ప్రవేశిస్తూ) మా అమ్మకు అవమానమా? ఎవడా సాహసుడు?

శీతలసేని :-ప్రతీకారం నెరపగల పౌరుషరక్తమేనా నీనరాల్లో ప్రవహించేది?

వనవీరుడు :-ఎందుకు కాదు? (కత్తి దూస్తాడు.)

శీతలసేని :-మాతృరుణముంచుకోని సత్పుత్రుడనిపించుకో. ఈ క్షణమే విక్రముడెక్కడున్నాడో అన్వేషించు; అతడే నీ తల్లిని 'వేశ్య' అన్నాడు. స్వాభిమానం అంచులువారిఉన్న ఆమస్తకాన్ని మొండెమునుండి వేరుచెయ్యి.

వనవీరుడు :-(కత్తి విసరిపారేసి) అట్లనకమ్మా. విక్రముడు పరాయివాడా? నావంటి పుత్రుడేకాదూ! కొడుకెప్పుడూ తల్లిని అవమానించడు. తల్లి సదా కొడుకు దుడుకుతనాన్ని క్షమిస్తుంది.

శీతలసేని :-క్షమ! వనవీర్! క్షమించమంటున్నావా? హా! భగవంతుడా! ఇప్పటికి తెలిసివచ్చింది; నేను వంధ్యను; నా ఒడిలో పుత్రుణ్ణికాదు పెంచాను, పంజరంలో పక్షిని.

వనవీరుడు :-ఈ అగ్నికణంమీద గాలికాదమ్మా విసరవలసింది; ఇన్ని నీళ్లు చిలుకు. పద! విక్రముడు నీ కాళ్ల మీద పడి క్షమాపణ వేడుకుంటాడు. ఈ కరవాలము మేవాడ్ శత్రుసంహారమునకు మాత్రమే ఉపయోగపడుగాక! (నేలమీదినించి కత్తి అందుకుని ఒరలో పెట్టుకుంటాడు.)

శీతలసేని :-మేవాడ్‌కు శత్రువు లెవరున్నారిప్పుడు విక్రముడు తప్ప? నీవు తల్లికి జరిగిన అవమానాన్నికూడా సహిస్తావు. పోనీ, ప్రజల దీనదశకు విచారమైనా కలగటంలేదూ నీకు?

(జయసింహుడు నలుగురు సర్దార్లతో ప్రవేశిస్తాడు.)

జయసింహుడు :- నీవు మా తీర్మానంగురించి ఆలోచించుకున్నావు కదూ! విక్రముని సింహాసనం అధిష్టించే దుకు సిద్ధంగా ఉన్నావా, లేదా? ఏం చెబుతావు?

వనవీరుడు :- రాజమకుట హీనుడై విక్రముడేమౌతాడు?

జయసింహుడు :- కోటలోని అంధకార కారాగృహంలో ఉంటాడు; ఆ మరణాంతమూ చేసిన పాపాలకు ప్రాయశ్చిత్త మనుభవిస్తాడు.

వనవీరుడు :- నీ తండ్రిగారి ఉద్దేశమూ అదేనా?

(కర్మచందు ప్రవేశిస్తాడు.)

కర్మచందు :- ఔను, నాయనా! నా జన్మంతా ఈ మేవాడ్ సేవయందే వినియోగిస్తున్నాను. మన రాజ్యము పట్ల నాకెన్నడూ అహితచింత లేదు.

వనవీరుడు :- అయితే, విక్రముని చిన్నతమ్ముడు ఉదయుడున్నాడు; అతడికి పట్టాభిషేకం చేయండి.

కర్మచందు :- అలా కాదు. ఉదయుడు కేవలం పసివాడు. అతనికి వయసు వచ్చేవరకూ మేవాడ్ రాజ్యాధి పత్యం నీవే వహించు.

వనవీరుడు :- మరి విక్రముడు రాజమకుటముకూడ పోగొట్టుకొని కారాగారమందే ఉండవలసిన ఆవశ్యకత ఏమిటి?

కర్మచందు :- కారాగారపు కష్టాలు అతన్ని పశ్చాత్తప్తునిచేసి సన్మార్గానికి తిప్పవచ్చు. మేవాడ్ రాజ్య కళ్యాణముకోసమై అధికసంఖ్యాకులైన శుభచింతనులు అట్లే నిశ్చయించారు. నీవు మా తీర్మానాన్ని మన్నించినందుకు సంతోషం; మంచిది. మేము వెళ్లి నీ పట్టాభిషేకోత్సవము ప్రకటిస్తాం.

(పోబోతాడు)

వనవీరుడు :- కాని___

శీతలసేని :- (అడ్డువచ్చి) ఊరుకో! మేవాడ్ రాజ్యకళ్యాణ కార్యక్రమమున 'కాని' శబ్దం రాకూడదు.

(కర్మచందు, జయసింహుడు, సర్దార్లు నిష్క్రమిస్తారు.)

వనవీరుడు :- చాల వికట సమస్య! సమ్మోహనచణమైన సువర్ణ రాజమకుటము!

శీతలసేని :- (అప్పటికప్పుడు) మంచిది, ఇక నేను వెళ్లుతున్నాను.

(దాగివున్న రణజిత్తుకు సైగచేసి వెళ్లిపోతుంది. ఛద్మవేషముతో రణజిత్తు కటారు పుచ్చుకుని ప్రవేశిస్తాడు. వెనుకనుంచి హఠాత్తుగా వనవీరునిమీద దూకిపడతాడు. వనవీరుని కిందపడేసి కటారు ఎత్తిన తక్షణమే శీతలసేని ప్రవేశించి కటారు లాక్కుని, రణజిత్తును పారిపొమ్మని సైగచేస్తుంది. రణజిత్తు పరుగెత్తిపోతాడు.)

వనవీరుడు :- ఎవరు?

శీతలసేని :- నరపిశాచం! ఘాతకుడు! పరుగెత్తి పారిపోయాడు. పట్టుకోండి! పట్టుకోండి! (ఘాతకునివెంట పరుగెత్తబోతుంది. కాని వనవీరుడామె చేయిపట్టుకుని ఆపుతాడు.

వనవీరుడు :- అమ్మా! నీవు నన్ను రక్షించావు. వాడు పారిపోతే పోనీలే.

శీతలసేని :- ఆశ్చర్యంగా ఉందే; నిన్ను హత్యచేయటానికి ఎవరు వీడు వచ్చాడు?

(కటారుపై దృష్టి నిలుపుతుంది)

"హరిదాసుగారు..."

కుమారి గాదిరాజు విమలకుమారి

చెన్నపురి ఆంధ్రమహాసభ - స్త్రీల శాఖవారి సాంవత్సరికోత్సవంలో మృదుమధురంగా పాటలుపాడింది. 'ఇల్లాలు', 'బాలనాగమ్మ' మొదలైన చలనచిత్రాలలో నటించింది. చక్కనికంఠం, భావయుక్తమైన పాట కలిగిన ఉత్తమకళాకన్య.



శివ - శక్తి నటనావిలాసము.

వనవీరుడు :- నాకు శత్రువులెవరూ లేరు.

(ఛద్మవేషం తీసివేసి రణజిత్తు ప్రవేశిస్తాడు.)

రణజిత్తు :- విక్రముడు తప్పు. వనవీర్ ! అంత తెలుసుకోలేకుండా ఉన్నావేమయ్యా ! సర్దార్లంతా కలిసి నిన్ను తన సింహాసనంమీద నిలబెట్టాలని చూస్తున్నట్టు విన్నప్పటినించీ విక్రముడు నిన్నెలాగేనా రూపుమాపాలని ఆలోచిస్తూనే ఉన్నాడు.

శీతలసేని :- సందేహం లేదు. ఈ ఘాతకుని పంపించింది విక్రముడే.

వనవీరుడు :- అదా సంగతి ! ఆనాడు రాజసభలో నేనతని ప్రాణాలు కాపాడానే !

శీతలసేని :- అట్లనుకోకు. ప్రపంచమంతా అంతే. లే, మేవాడ్ సింహాసనాధిష్ఠానమునకు సిద్ధపడు. నీమార్గంలో ఆటంకములుగా ఉన్నవారిని నులిమివెయ్యి.

వనవీరుడు :- అమ్మా ! అట్లే చేస్తాను. అతడు నిన్నవమానించాడు. జనకతుల్యుడైన వృద్ధమంత్రిని - కర్మచందును తిరస్కరించాడు. ప్రజల్ని అనేకవిధాల కష్టపెట్టాడు. ఇవాళ అతడే నా ప్రాణాల్నికూడా మింగివేయదలచాడు. నీ ప్రతీకారేచ్ఛ, సర్దార్ల బలవంతం, ప్రజల హాహాకారాలు, నా ప్రాణాలమీది తీపి ఇవన్నీ మేవాడ్ సింహాసనాధిష్టానమునకు నన్ను పురిగొల్పుతున్నవి. చెప్పమ్మా, రాజమకుట మెక్కడున్నది ?

(వనవీరుడు, అతనివెనుకనే శీతలసేని, రణజిత్తు నిష్క్రమిస్తారు)

(తెరపడుతుంది.)

3. దృశ్యము

ఉపవనములో చిత్తోడేశ్వరి ఆలయం. పన్నా చేతులుజోడించి ప్రార్థన చేస్తూఉంటుంది.

ఫీల్ రాగం - త్రితాళం

పన్నా :- నీరుచిరమూర్తి హృద్గేహములో
నీస్తుతిగీతిక అధరోష్ఠముపై
నీధ్యానంబే విచారములలో
నీపూజామాలిక చేతులలో.

[ఎడమవైపునుంచి ఉదయుడు ప్రవేశిస్తాడు]

ఉదయుడు :- ఆదిదేవతవు ! పరమేశ్వరివీ

[కుడివేపునుంచి చందన్ ప్రవేశిస్తాడు]

చందన్ :- రుద్రాణివి విలయాంతకారిణివి.

పన్నా :- తారల్లోనూ, పూవుల్లోనూ, ఉదధిలోననూ ప్రతిబింబితవూ.

ముగ్గురు :- నీధ్యానంబే విచారములలో నీపూజామాలిక చేతులలో.

[ఉదయుడు, చందన్ నిష్క్రమిస్తారు]

పన్నా :- నీరుచిరమూర్తి హృద్గేహములో నీస్తుతిగీతిక అధరోష్ఠముపై.

[ఉదయుడు ప్రవేసిస్తాడు]

ఉదయుడు :- అణువు అణువు నందూ నీ మహిమా.

[చందన్ ప్రవేశిస్తాడు]

చందన్ :- అడుగు అడుగునందూ నీ గరిమా.

పన్నా :- రాత్రి సమయముల తమస్సు నీవే. భానుకిరణముల వెలుతురు నీవే.

ముగ్గురు :- తేజము తమమూ నీవే సుమ్మా. విషమసమములూ నీవేనమ్మా.

ఉదయుడు :- ఆకాశములో నీలిమ నీవే.

చందన్ :- సమరభూమిలో కాళివినీవే.

ఉదయిడు, చందన్ :- నీ ధ్యానంబే విచారములలో, నీ పూజామాలిక చేతులలో.

ముగ్గురు :- నీరుచిరమూర్తి హృద్దేహములో,
నీస్తుతిగీతిక అధరోష్టముపై,
నీ ధ్యానంబే విచారములలో,
నీ పూజామాలిక చేతులలో.

[ఒకపక్క ఉదయుణ్ణి, ఇంకోపక్క చందన్‌ను తీసుకుని పన్నా ముందుకు సాగివస్తుంది.]

పన్నా :- మీ రిద్దరూ ఒకే చెట్టునుంచి వ్యాపించిన రెండు కొమ్మలు; ఒకే కొమ్మన వికసించిన రెండు పుష్పాలు; ఒకే పూవునుంచి ఉద్భవించిన రెండు కాయలు.

ఉదయుడు :- ఆ రెంటికీ నీవేకదమ్మా ఆధారం!

పన్నా :- నాకున్నది ఒక్కటే కోరిక : మేవాడ్ రాజ్యం నిత్యమంగళంగా ఉండాలి. అందుకే నే ననేకసార్లు మాతచిత్తోడేశ్వరీ ఆలయంలో ప్రార్థన సలిపాను. సంగ్రామసింహుని వంశానికి గౌరవకీర్తులు ప్రాప్తించుగాక! మేవాడ్ ప్రజలకు సుఖమాగాక!

చందన్ :- సంగ్రామసింహుడు మన ఉదయుని తండ్రి. అమ్మా! ఆయనపేరు మాకు చాలసార్లు వినిపించావు; కాని మానాన్నను గురించి ఎన్నడూ చెప్పనే చెప్పవేం? సంగ్రామసింహ రాణా సైన్యంలో ఒకసైనికుడుగా ఉండేవాడని మాత్రం ఎప్పుడో చెప్పావు, అంతే.

పన్నా :- ఔను. ఆ తరవాత ఆయన కణవాహ యుద్ధానికి తన దక్షిణహస్తం ఉపహారంగా ఇచ్చి సైనికవృత్తి మానేశారు. గుజరాతు సుల్తాను చిత్తోడును ధ్వంసంచేసి, మన ప్రాణాల్ని తప్ప ఏమీ మిగల్చలేదు. అప్పుడు నువ్వు చాల చిన్నవాడివి.

చందన్ :- అదంతా నాకు తెలుసు. అంతకంటే ఎక్కువ తెలుసుకోవాలని నాకోరిక. నాన్న ఎక్కడున్నాడమ్మా! నా చిన్నతనంలో చెబుతూండేదానివి : ఆయన ధనం సంపాదించేందుకు విదేశాలు వెళ్లారని. మళ్ళీ ఎప్పుడొస్తాడు?

పన్నా :- ఏమి జవాబు చెప్పను నాయనా!

ఉదయుడు :- ఆయన విదేశాలు వెళ్ళారని ఇదివరకు మోస్తరుగా ఇప్పుడు చెప్పటంలేదు నీవు. వెళ్ళేటప్పుడు నీతో చెప్పి వెళ్లలేదా ఆయన?

పన్నా :- లేదు. భర్తృవియోగం నాకు ప్రాప్తించిన ఆనిశి ఇప్పటికీ - ఇంతకాలం గడచిన తర్వాతకూడా జ్ఞాపకం వచ్చినప్పుడల్లా భయావహంగా ఉంటోంది.

ఉదయుడు :-అసలాయన ఎందుకు వెళ్ళాడో!

పన్నా :-దరిద్రతా దుఃఖ వికలుడై. అంతకంటే ఇంకేమి కారణం ఉంటుంది?

ఉదయుడు :-నీమీదా, చందన్ మీదా ప్రేమ త్రెంచేసుకునే?

పన్నా :-ఔను తండ్రీ! మా విషయికమైన చింత ఆయన కప్పుడు లేకనేపోయింది. భగవంతునిమీద విశ్వాసమే నశించింది ఆయన కప్పుడు. [కంఠంనుంచి ఒక తాయిత్తుతీసి] ఈ తాయిత్తు ఎప్పుడూ ఆయన కంఠాన చూస్తూండేదాన్ని. ఆయన మాతో చెప్పకుండా ఇల్లువిడిచిపోయిన రాత్రి తెల్లవారుఝామున నాకిది ద్వారందగ్గర పడి ఉండగా దొరికింది. ఆయన మళ్లీ ఎప్పుడో తిరిగివస్తారనే ఆశతో దీన్ని నాటినుంచి ధరిస్తూవచ్చాను. ఇకనుంచి నీవు ధరించుకోరా చందన్! ఇది నీకు రక్షాకవచమూ గాక! [తాయిత్తు చందన్ మెడలో కడుతుంది]

చందన్ :-నేను దీన్ని ఎక్కడా పారేసుకోకుండా జాగ్రతగా ఉంచుకుంటా.

ఉదయుడు :-నీవు మరి తిరిగి మా కొలువులోకి ఎప్పుడొచ్చావు?

పన్నా :-నేనట్లా నిస్సహాయనై ఉన్నప్పుడు నీ తండ్రిగారి దర్బారుకు వచ్చాను. ఆయనకు నాపై దయగలిగి నిన్ను పెంచేభాగం నాకు ఒప్పజెప్పారు.

ఉదయుడు :-ఆయన నీ కెప్పుడేనా జ్ఞాపకం వస్తారా?

పన్నా :-జ్ఞాపకంరారని ఎట్లా చెప్పను? కాని మీ ఉభయుల అధరపల్లవాలమీది హాసచంద్రికల్ని చూచినప్పుడు నా అశ్రుబిందువులు ఇగిరిపోతవి.

చందన్ :-అయితే అమ్మా! నాన్నగారి సమాచారం ఏమీ తెలియడమే లేదా?

పన్నా :-నమ్మతగిన వార్తలేమీ రావటంలేదు. కొందరు దోపిడి దొంగల్లో చేరాడనీ, కొందరు బైరాగి అయిపోయాడనీ, మరి కొందరు......[కంఠావరోధం]

చందన్ :-వద్దమ్మా, ఆ మూడోమాట చెప్పనేవద్దు. అలా జరగదు, అది అబద్ధం. మానాన్న ఎక్కడో దూరాన్నుంచి నన్ను పిలుస్తోన్నట్టుగా నా గుండెలో వినబడుతున్నది. 'రారా, చందన్!' అంటున్నాడాయన. నే నాయన కంఠాన్ని కావలించుకుంటాను తప్పకుండా; ఎప్పుడో మాత్రం చెప్పలేను.

ఉదయుడు :-అమ్మా! ఇన్నాళ్లనుంచీ ఏమిటోమరి నా కర్థంకాకుండా ఉంది: మహారాణాకు, సర్దార్లకు మధ్య అంత విద్రోహం పెరిగిపోయిందేం? రాజసభా వ్యాపారాలు నియమితంగా జరగటమేలేదు. ప్రజ లెందుకో అంత అసంతృప్తిగా ఉన్నారు.

పన్నా :-దీని కంతకూ ఒక్కటే కారణవస్తువు. ఏమిటో అది సరిగ్గా అవగతం కావటంలేదు.

ఉదయుడు :-(తెరవేపు చూస్తూ) అరుగో మహారాణా ఇటే వస్తున్నారు. ఆయన్నే అడుగుదాం. జయము జయము చిత్తోడేశ్వరునికి.

(మహారాణా విక్రమసింహుడు ప్రవేశిస్తాడు.)

విక్రమ :-నన్నడిగి ప్రయోజనంలేదు ఉదయ్! నాకు మెడమీద తలే భారంగా తోస్తున్నది. ఈ తలపై చిత్తోడు రాజమకుటము ధరించటానికి యోగ్యతలేదు.

ఉదయుడు :-ఎంతమాటన్నారు మహారాణా!

విక్రమ :-నేను సత్యమే చెబుతున్నాను. ఉదయ్! విక్రమసింహుడు సుఖపడనీ, పడకపోనీ—చిత్తోడురాజ్యానికి మంగళ మవశ్యము కావలసినదే.

పన్నా :-మహారాణా! తమరెందుకో ఇవాళ చాల వ్యగ్రులై ఉన్నారు.

విక్రమ :-అందుకు నీవేమీ విచారపడకు పన్నా; సర్దార్లు నన్ను సింహాసనభ్రష్టుని చేయాలని నిశ్చయించారు. నేను వారికన్న ముందే ఈ చిత్తోడు రాజ్యమకుటాన్ని నీకు ఒప్పజెప్పిపోయేందుకు వచ్చాను (మకుటము చేతిలో పట్టుకుని) ఉదయ్! ఎంతకాలంవరకు నీ చిన్నారి మస్తకము ఈ మకుటధారణకు ఉపయుక్తముకాదో, అంతవరకూ పన్నా! ఈ మకుటరక్షణ భారంకూడా నీదే.

(మకుటము పన్నా కీయబోతాడు. క్రోధావేశంతో వనవీరుడు ప్రవేశిస్తాడు.)

రావోయి వనవీర్! ఈ సమయంలో నీవుకూడ ఇక్కడ ఉండటము ఆవశ్యకమే. కాని అదేమిటి? మాట్లాడవేం? నీ కన్నుల్లో క్రోధారుణచ్ఛాయ కమ్మింది. చివరకు నీకూ నామీద కోపం—

వనవీర్ :-నోరుముయ్. విక్రమ్! నీ కపటస్నేహం బయలుపడక తప్పిందికాదు పాపం! ఎందుకొచ్చానో నీకు తెలియదేం?

విక్రమ :-నా రాజ్యంలోని యీ విద్రోహాగ్నిని ఉపశమింపచేయటానికి కేదైనా మంచి ఉపాయం చెప్పేందుకు వచ్చావనుకుంటున్నాను. నిజం.

వనవీర్ :-కాదు, కాదు. నా ప్రాణవాయువులేనా వీచి దాన్ని గగనచుంబిని చేసేందుకు. శాంతికోసు కాదు, యుద్ధానికి వచ్చాను.

విక్రముడు :-యుద్ధానికా? మనిద్దరమూ ఒకేపక్షం కాదూ?

వనవీరుడు :-కాదు, మనిద్దరమూ ఒకరొకరికి శత్రువులం.

విక్రముడు :-నీ కంఠధ్వని భయావహంగా ఉంది. ఈ నీ రోషానికి ఆధారం! ఇంత తొందరలో ఈ విషమ భావ పరివర్తనకు కారణం?

వనవీరుడు :-గుండెమీద చెయివేసుకుని నిన్నే ప్రశ్నించుకో. నిన్నిప్పుడు వధించటానికే వచ్చానని నేను చెప్పుకోవటం న్యాయకర్ణములకు అపశ్రుతిగా వినిపించదు.

పన్నా :-ఎమిటీ గొడవంతా? వనవీర్! ఎందుకంత ప్రబలంగాఉంది నీ హింసాభావమీనాడు?

వనవీరుడు :-ఏం, జనాబుచెప్పవేం? విక్రమ్! నేను నీ మార్గంలో ప్రబలకంటకంగా ఉన్నాను; నీవొక హంతకుణ్ణి పంపావు; వాడు నన్ను చంపలేకపోయాడు.

విక్రముడు :-నేను నీ హత్యకోరి హంతకుణ్ణి పంపానా? ఎంత అద్భుత సత్యం! అందుకు సాక్ష్యం?

(రణజిత్తు ప్రవేశిస్తాడు.)

రణజిత్తు :-నేనూ. విఫలప్రయత్నుడై ఆ హంతకుడు పారిపోతోంటే ఈ కన్నులతో చూచాను.

విక్రముడు :-హంతకుడు విఫలప్రయత్నుడయినందుకు సంతోషం. కాని వాణ్ణి నేను పంపానా? ఎవరుచెప్పారీ అబద్ధం?

రణజిత్తు :-అనుమానమూ, తర్కమూ చెబుతున్నై. లేకపోతే అన్నిసంగతులూ ప్రత్యక్షంగా ఎక్కడ చూడ గలుగుతాం ఎవరమైనా?

విక్రముడు :-రణజిత్! మొన్నటివరకూ నాకు వంతపాట పాడుతూండేవాడివి, నిన్నుకూడా ద్రోహచింతన ఆవేశించినదీ? లేక మీరిద్దరూ ముందుగా అలోచించుకువచ్చి ఈవిధంగా పరిహాసమాడుతున్నారా! చాలు, చాలు. ఈ అసహ్యాపీడ చాలవరకు తెచ్చారు..

రణజిత్తు :-చావడమా, బ్రతకడమా అన్న సమస్య ముందుంచుకుని ఎవరు పరిహాసమాడతారు?

వనవీరుడు :-నీదెబ్బ తప్పించుకున్నమీదట, ఇప్పుడు నేను పట్టవలసినది డాలా? కరవాలమా? ఏం జవాబు చెబుతావు?

ఉదయుడు :-అమ్మా! ఏమిటిదంతాను? చిత్తోడు మహారాణాకూడా ఇట్లు సంబోధింపబడుతున్నాడేమిటి?

విక్రముడు :-ఇదంతా ఎవరికుట్రో ఏమీ అర్థంకావటం లేదు. నిన్నెవరు నాపట్ల ఇంత విముఖుణ్ణి చేశారు? వనవీర్! నేను జీవితాశే వదులుకుంటున్నాను. నేను నీ హత్యకోరి హంతకుణ్ణి పంపించినట్టు అనుమానించి, నీవిప్పుడు నన్ను వధించటానికేవస్తే—జ్ఞాపకముంచుకో సత్యమనేది పృథ్వీగర్భాన్ని పటాపంచలు చేసుకొని ఏనాటికైనా ప్రకటనమౌతుంది. చిత్తోడు రాజ్యమకుటము కోసమే ఇంత చేస్తున్నావంటే నాకు పశ్చాత్తాపమే ఉండదు. ఇదిగో, అది ఇక్కడే ఉంది; తీసుకో.

(మకుటాన్ని ఇస్తాడు)

వనవీరుడు : (మకుటం తీసుకుని) ఇటు తే. దీన్ని రక్షించటానికి నేనే బాధ్యుణ్ణి. సైనికులు! విక్రముని బంధించండి.

(నలుగురు సైనికులు ప్రవేశిస్తారు)

పన్నా :-(ఒరనుంచి కత్తిపెరికి) ఏమిటది? వనవీర్! జాగ్రత! నేను దాసిని మాత్రమేకాదు; రసపుత్ర స్త్రీనికూడ. నా బొందిలో ప్రాణమున్నంతకాలము మహారాణాను ఎవరూ బంధించలేరు. (విక్రముని రక్షింపబోతుంది)

వనవీరుడు : (సైనికులతో) ఏమిటి చూస్తున్నారు? బంధించరేం? మహారాణాను నేను.

పన్నా :-(సైనికుల్ని లక్షించి) జాగ్రత! అడుగు ముందుకు వేశారంటే, మృత్యువు మూడిందే అనుకోండి.

(నల్గురు సర్దార్లతో కర్మచందు ప్రవేశిస్తాడు)

కర్మచంద్ :-(పన్నా చేతిలోనించి కత్తి తీసుకుంటాడు. ఆయన్నుచూచి పన్నా ఆదరం చూవుతూ నిల్చి ఉంటుంది.) శాంతించు పన్నా! ప్రజలకోరిక ఇలాగే ఉంది. ఇదే పరమేశ్వరుడి ఆదేశముకూడాను. నీ స్వార్థము మరచిపో. (సైనికులవేపు తిరిగి) బంధించండి!

విక్రముడు :-ఔను—ఔను. బంధించండి!

(విక్రముడు బందీ ఔతాడు)

కర్మచందు :-ఉదయ్! ఇటురా!

వనవీరుడు :-ఇదిగో, ఈ రాజమకుటము నీది. నీవు పెద్దవాడివయ్యేవరకూ దీన్ని నేను కాపాడుతాను.

(ఉదయుని మస్తకంమీద రాజమకుటం ఉంచుతాడు.)

ఉదయుడు :-(మకుటముతీసి క్రిందబెట్టి) వద్దు. వద్దు. ఈ విధంగా లభించిన ఇది బరువుగా కనిపిస్తోంది. భరించలేను.

(శీతలసేని ప్రవేశిస్తుంది)

శీతలసేని :-ఎవరు? మహారాణా విక్రమసింహుడు! ఇది నారీ అవమానమునకు ప్రతీకారమా?

స్థిర దృశ్యం. తెరపడును.

(ఇంకా వుంది.)

వింత వింతల ప్రపంచం

కెలేనుంచి డోవరువరకు యింగ్లీషుఛానల్ క్రిందనుంచి సుమారు 30 మైళ్ల పొడుగున ఒక సొరంగము దొలుచుటకు ఆలోచనజరిగింది. కాని 1883లో ఆస్కీమును పార్లమెంటు నిరాకరించింది. తిరిగి 1930లో ఆ స్కీము అమలులో పెట్టడానికి ప్రయత్నించారు. కాని 35 మిలియనుల పౌనులుపైగా ఖర్చు పెట్టవలసి వుంటుందనిన్ని, యుద్ధ సమయములలో అపాయము యెక్కువగా వుంటుందనిన్ని ఆలోచించి పార్లమెంటువారు ఆ బిల్లును తిరిగి నిరాకరించారు. ప్రపంచంలో యిదివరకు యెక్కడాలేనంత పొడుగు ఆ టన్నెలువుండేది. ఆ యింజనీరింగుపని ప్రపంచములోని వింతలలోవకటిగా వుండేది. ఆ సొరంగములో నుంచి లండన్, పారిస్‌లమధ్య ప్రయాణము యలక్ట్రిక్ ట్రైన్ మీద ముప్పావుగంట మాత్రమే పడుతుంది. అందువల్ల రెండుగంటలకాలము కలిసివస్తుంది. కాని ఇది జరిగింది గాదు.

♦ ♦ ♦ ♦

బలవంతుడగు అగస్టస్ అను పోలెండురాజునకుగల అనేకమంది భార్యలకు 350 మంది పిల్లలు పుట్టేరు. రోడ్ ద్వీపముమీద కాపురముండే ఒక కెనడాదేశస్తునకు తన ముగ్గురు ధర్మపత్నులవల్ల 41 మంది పిల్లలు పుట్టేరు. అందులో మొదటిభార్య వరుసగా కవలపిల్లలనుకన్నది. మూడవభార్యకు మూడుమార్లు ఒక్కొక్కసారి ముగ్గురేసి పిల్లలచొప్పున జన్మించారు. అందులో 36 గురు నిలిచారు. కెనడాలో సాధారణంగా ఒక కుటుంబానికి 8 లగాయతు 10వరకు పిల్లలుంటారు. 18మంది పిల్లలుండడం అసామాన్యంకాదు. ఒక్కొక్కప్పుడు ఒకేతల్లికి 25 మందిపైగానే పుట్టడంకూడాకలదు.

♦ ♦ ♦ ♦

ఐర్లండు స్వతంత్రపోరాటంలో 1920వ సం॥రంలో మాక్స్వినీ అనే ఆయనకు 2 సంవత్సరములు ఖైదువిధించగా అతను నిరశనవ్రతం 75 రోజులు సాగించి చివరరోజున చనిపోయాడు. 1933 లో మహాత్మాగాంధిగారు మూడువారములు ఉపవసించి మృత్యుదేవతను గెలిచారు. ఏసుక్రీస్తు 40 అహోరాత్రములు ఉపవసించినట్టు బైబిలు చెబుతోంది.

♦ ♦ ♦ ♦

మానవశరీరములోని ధమనికలు, సిరలు విడదీసి ఒకదానిచివర ఒకటి వరుసగా పొడుగుగాపెట్టినట్లైతే 3,50,000000 మైళ్ళ పొడుగవుతుంది. అనగా భూమియొక్క చుట్టుకొలతకు 14రెట్లు వుంటుందన్నమాట.

♦ ♦ ♦ ♦

చెమటపోవుటకు మనుష్యుని చర్మములో 2000000 రంధ్రములుంటాయి. అంటే సగటున చదరపు అంగుళమునకు 500 వుంటాయి. కాని అరికాళ్ళలోను అరిచేతులలోను 4రెట్లు అనగా చదరపు అంగుళమునకు 2000 వుంటాయి.

—వారణాశి భాస్కర మహాలక్ష్మి

సన్‌లైట్

మీ ఇంటికి సౌఖ్యము తేనిమ్ము!



సన్ లైట్ మీకు శుభ్రత ఇచ్చుగాక. అది మీకు ఆరోగ్యమిచ్చును. సన్ లైట్‌ను వాడిన మీ పని తగ్గును. మఱియు మీ దుస్తులు రక్షింపబడును. సన్ లైట్‌ను వాడి మీ పైకమును నిలువ చేసికొనుము. సన్ లైట్ సోపు ఆరోగ్యమును, సౌఖ్యమును, శుభ్రతను, సంతోషమును మీ కుటుంబమునకు ఇచ్చును. వదలక సర్వదా దీనినివాడు.

అప్పటమైన సన్ లైట్ ఈ ప్యాకెట్లలోనే అమ్మబడును.

S. 31-50 TL.

LEVER BROTHERS (INDIA) LIMITED

★ స్త్రీలు - కవిత్వము ★

కళామయమగు స్త్రీకి కవిత్వము కాణాచి

●

శ్రీమతి వేదవల్లి తాయారమ్మ

●

లలిత కళామయమగు స్త్రీ హృదయము నుండి వెలువడు కవితకు గాఢిన్యము కావలెననినను గాన్పింపదు. అట్టియెడ మృదుమధుర లలిత భావసమన్వితమైన కవితలనల్లి, జాతికి వెలుగు వెన్నెలల గూర్చ మహిళాలోక మేల ప్రయత్నింపదు ?

"ప్రకృతిఃకర్త్రీ పురుషస్తు పుష్కరపలాశవన్నిర్లేపః" అని సృష్టిలో స్త్రీకి ప్రధానస్థాన మబ్బినది. స్త్రీ వ్యక్తియన నొకదేవతా స్వరూపిణి. సర్వశక్తి సంపన్న. సృష్ట్యాదినుండియుఁ ద్రిమూర్తులుగూడఁ దమ స్త్రీలకుఁ దమ శరీరములందే యగ్రస్థానములనిచ్చి కృతార్థులైరి. మాతృదేవతయను నుడి యామెకే చెల్లినది. పోతఁబోసిన శాంతిమూర్తి. కరుడుగట్టిన ప్రేమమయి. విసువులేని సహనశీల. లేనిచో బిడ్డలవలన గలుగు బాధలను సైరింపనేరికిఁ దరమగును! స్త్రీ హృదయ మంతటికోమలముగాననే పరుషవాక్కులఁ బలుకవెఱచు. ఎందునుగూడఁ బురుషులకుఁ దీసిపోని శక్తులు వారికిఁగలవు. స్త్రీలు సర్వశక్తి సంపన్నలుగాననే గరిటెపట్టిన చేతనే కత్తిపట్టి కదనరంగమునకురికి వీరత్వముజూపి వీరాంగనలైరి. పరహృదయభేదకముగా రాజ్యచక్రములఁ ద్రిప్పిరి. విద్వత్సభలయందుఁ బండిత వరులతో వాదములుసల్పి ప్రఖ్యాతినందిరి—

లలితకళలందు స్త్రీలకుఁగల నేర్పు వెన్నతోఁబెట్టినది. ఏ నికేతనములందు నే పాఠశాలలందును నేర్చికొనకయే గృహిణులు వన్నెవన్నెల ముగ్గులతోను, రంగులతోను వివిధములగు పూల మొక్కలతోను గృహముల నలంకరించి చూఁపఱకు కన్నులపండువు గావింతురు. జంత్రగాత్రములచే రాల్గరగింపఁజాలు గానకళవారి సొమ్ము; గానమునకు వన్నెతెచ్చు మాధుర్యము నెచ్చటను గొని తేఁబనిలేదు. "కలదుగదా సుధారసము కంజదళాక్షుల ముద్దుపల్కులన్" అనునపుడు గానమునందుఁ గరవగునా! స్త్రీ రోదన మొన్పినను నేదేనొక రాగమాలపించినట్లేయుండునఁట! "ఆరాజీవాననయేడ్చె కిన్నరవధూ రాజత్కరాంభోజ కాంభోజీమేళవి పంచికారవసుధా పూరంబుతోరంబుగన్"అని గదా కవులవర్ణన. స్త్రీలు చిత్రగానకళలందే గాక కవితాకళయందుఁగూడ నెందును దీసిపోరు.

కవితయనఁ బాండిత్యముచే నలవడునదిగాదు. మనుజునకు జన్మాంతరవాసనా విశేషముచే లభించునొక మహాఫలము. రవిగానని పదార్థములనుగూడ కవి తన సునిశితమగు దృష్టిచేఁ గనుఁగొని పాఠకులయెదుటఁ బెట్టును. దాననే కవిని "క్రాంతదర్శి"యనిరి. ఎన్నియుగములు గడచినను కవి యశఃకాంతులు కనుమఱుగు గానేరవు. ప్రాచీనచరితను బదిలపఱచు రత్నపేటికయనఁదగు వాఙ్మయమునకు సృష్టికర్త కవియే. రాజాధిరాజులనుగూడ ధిఃకరించుశక్తి కవివాక్కునకుఁగలదు. లేనిచో "ఇమ్మనుజేశ్వరాధము"లని పల్కుటకు బోతనకు సాధ్యమగునా! కాననే భర్తృహరి "సుకవితా యద్యస్తిరాజ్యేనకిమ్మ"ని సకల సంపద్విలసితమగు సామ్రాజ్యమును దృణప్రాయముగా నిరసించెను. ఇట్టి కవుల ధనమగు కవిత పలుపోకలతో స్త్రీ పురుష వ్యక్తిభేదములేకనే యలవడుచుండును. అందును స్త్రీలకు సహజ పాండిత్యముగూడ నుండునని యొకకవి వ్రాసెను.

కవిత "ప్రాఁగముత్తెఁపుసరుల్ ప్రోహళించినలీలఁ దమలోనఁదొరయు శబ్దములఁగూర్చి" చెప్పవలెననియు, సుకవి పలుకులు "చలువగల వెన్నెలల చెలువునకు సౌరభము" గలిగినట్లుండుననియుఁ గవులు తమ నేర్పు కొలఁది చెప్పి పాఠకుల మన్ననలనందిరి. స్త్రీల కవితయందుఁగూడ నీ చెప్పిన లక్షణములెందును గొఱవడవు. లలితకళామయమగు స్త్రీ హృదయమునుండి వెలువడు కవితకుఁ గాఠిన్యము కావలెనన్నను గాన్పింపదు. ఇందులకొక చిన్నకథ చెప్పెదరు—'ఒకప్పుడొక యన్నయుఁ జెల్లెలుకలిసి యొకచోటునకుఁ బోవుచుండఁగా, దారిలో వారికొక యెండిన వృక్షము గాన్పించెను. దానినిజూచి సోదరుఁడు "శుష్కవృక్ష స్తిష్ఠత్యగ్రే" అని పల్కెను. ఆ భావముతోనే సోదరి "నీరస తరురిహవిలసతిపురతః" అని పలికెను.' దీనినిఁబట్టి చూడ స్త్రీల వాక్కునందెంత సహజమగు సౌకుమార్యముండునో తెలియఁగలదు.

ప్రాచీన కాలమునుండియు స్త్రీలలో విదుషీమణులు కవయిత్రులు లేకపోలేదు. వేదకాలమున వేదములలోని కొన్ని ఋక్కులనుగూడ రచించినవారున్నారు. తరువాతి కాలమున సుప్రసిద్ధ రచయితలగు పళని, మొల్ల, వెంకమాంబ మున్నగు మహిళామణులున్నారు. వాఙ్మయము చాలవఱకు యక్షగానములు పాటల రూపముననున్న కాలమున విద్యాగంధములేని కాంతలుగూడ "లంకాయాగము", "కుశలవకథ", "కృష్ణలీలలు" మున్నగుపాటలను నేర్చుకొని మరపులేకుండ నుండెడివారు. వీరలకుగల ధారణాశక్తి యత్యద్భుతము. ఎప్పుడోయననేల? నేటికిని శ్రీ సరోజినీదేవికవితను గొనియాడని యాంగ్లభాషా కోవిదులుండరు. వంశములోనున్నచో నెప్పటికైన వచ్చుననునట్లు స్త్రీ జాతియందే యీ కళ కాణాచిగానున్నదను చుండనది యెట్లులభింపకుండును? పెద్దలు ముద్దార నేర్పించినయడల ముదితలు నేరఁగరాని విద్యయుండదు. వేయేల? ఈ మన గృహలక్ష్మి యారంభమునకంటె నిపుడెంత పెంపొందినది! ఎందఱు గృహలక్ష్ముల వ్యాస రాజములచే వన్నెకెక్కుచున్నది! ఎందఱు చిత్రకారిణుల చిత్రములచే చిత్రింపఁ బడుచున్నది! కాన స్త్రీలకుఁదగిన యవకాశము గల్పించినచో విద్యావిషయమునందేగాక కవితాకళయందుఁగూడ నగ్రస్థానము నందఁగలరనుటకు సందియములేదు.

విజయ శంఖము

మధునాపంతుల వేంకట సూర్యనారాయణమూర్తి

యువకరక్తము ఉడుకుటలేదా?
రక్తజ్వాలలు వెలుగుటలేదా?
ఆంధ్రత్వము అణగిపోయెనా?
ఏలనో ఈ ఆలస్యం?—

జయభేరిని మ్రోగించండి
ఎంతకాలం ఈ అంధత్వం
ఎంతకాలం ఈ బానిసశృంఖలలు
పటపట త్రెంపలేవా?
స్వేచ్ఛవిహారాల్ సలుపగలేవా?
స్వేచ్ఛాజీవిక జరుపగలేవా?
త్రెంపివేయుడు దాస్యశృంఖలను
ఏల ఈ ఆలస్యం!—

రమ్యాజనః రమ్యవిహారాలు
సలుపుటలేదా! సాధించండి!
ఉరకండి పైపైకి ఉరకండి?
ఏలనో ఈఆలస్యం!—

అస్వాతంత్ర్యపు ఆగడమ్ములు
అస్వాతంత్ర్యపు ఆచరితమ్ములు
అస్వాతంత్రపు అహంభావములు
ఆకర్షించుటలేదా?
ఆంధ్రవిజయము!
ఆచరింపుడు!
'ఆంధ్ర' శంఖము
పూరించండి!—

గౌతమి

శ్రీ పాలకోడేటి శ్రీరామశర్మ బి. ఏ.

'అమ్మా! యింతరాత్రివేళ నీదగ్గర కెందుకొచ్చానంటావేమో! యిక్కడికి యిప్పుడు నేను వంటరిగా రావడం, ప్రజలకీ, లోకానికీ విడ్డూరంగా, తప్పుగా కనిపిస్తే కనిపించవచ్చుకాని నాకూ నామనస్సుకీ మాత్రం అదితప్పుకాక ఒప్పుగానే కనిపిస్తూంది. నన్ను నీ కడుపులోపెట్టుకుని కాపాడాలి. వాళ్లు_వాళ్లందరూ_ నన్ను చాలా బాధపెట్టేరు_హింసిస్తున్నారు_యింకా - యింకా కాల్చుకుతింటారు. నువ్వు ఒక్కర్తెవే నా బాధల్ని నివారణచేస్తావని వచ్చేను. తల్లీ! నిజమే! ప్రపంచానికి యీలోకానికి నాబాధ, నా మనస్సులోని అగ్నిజ్వాలలు యేంతెలుస్తాయి? నా కథంతా చెప్పమంటావా? అలానే చెప్తానమ్మా! నా గోడువింటాననేవారే లేరు. అయితే విను.'

♦ ♦ ♦ ♦

'యీ లోకపుటీర్ష్యా నేత్రాలు నాపై ప్రసరించకముందే యీ సంఘ దౌర్జన్యం, సంఘంలో ఉండే కుళ్లూ తెలుసుకోడానికి తగినఅవకాశము కలుగకముందే, నా చదువు చట్టుబండలుచేసి, పెళ్లంటే యేమిటో తెలీకమునుపే నాకు పెళ్లిచేశారు మావాళ్లంతాను. సరి కొన్నాళ్లకి పంపించమని ఉత్తరం. నేనింకా అత్తారింటిలో అడుగుపెట్టేనో లేదో, ప్రారంభం రణగొణధ్వని. యింతాదేనికి? నేను పట్నవాసంలో పెరిగేనుట, కొంతవరకూ చదువుకొన్నానుట. అసలుకారణం మావాళ్లు పెళ్లిలో యిస్తానన్న కట్నం అయిదువేలూ ఆ సమయానికి కొద్దిగా సొమ్ము తక్కువవటంచేత ఓ వెయ్యిరూపాయిలు బాకీపెట్టి తరవాత యిస్తానన్నారు. అదీ కొంపమునిగింది. ఆ కారణంచేత నామీద విరుచుకుపడ్డారు వాళ్లంతా. రోజు అయిందానికీ కానిదానికీ రామ రావణయుద్ధం. అబ్బ! వారుఅనే ఒక్కొక్కమాట నా హృదయంలో గునపాల్లా గుచ్చుకున్నాయి_ నేనే!! ఆయన్ని పాడవమన్నానా? తనకిబుద్ధిలేక తనుపతితుడై- పాడై నన్ను అధోగతిపాలు చేసిందికాక నా మూలాన్నే పాపం ఆయన పాడయ్యేట్ట. అబ్బ! అమ్మా! యీమాటలికపడలేను. సరే, పోనీనాకర్మం యిలా కాలింది అంచేత అంటారని సహించేను. ఎంతైనా ఆయన 'భర్త'కదాఅని ఆయనకి కావలసిన పనులన్నీ చేసేదాన్ని. మంచంమీంచి లేవగలుగుతే కదూ! కొంతకాలం బాధచేతో మరెందుచేతో ఆయనకూడా మాటికీ చీటికీ నామీద రొస రొసలాడేవారు. భగవంతుడా! యే జన్మలో చేసుకున్నపాపమో యిప్పుడు అనుభవించక తప్పుతుందా అని నా పూర్వజన్మ కర్మని తలుచుకుంటూ నాలో నేనే కుళ్లేదాన్ని. పోనీ మనసుకి కొంతశాంతి కలుగుతుందికదా అని ఏదేనాపుస్తకం చదువుకుంటే అప్పుడే ప్రారంభం 'ఓ! దీనికే చదువువచ్చు మరెవళ్లకీ యింతోటి చదువురానట్టు. ఏం పుణ్యమా పురుషార్థమా? ఎంతసేపు ఏదోపత్రికలూ, పేపర్లూ అవే కదూ? బూతులబుంగలు. అవి చదవడం. వాటిలో మళ్లే సంచరించడం. అవన్నీ చదివి నాకొడుక్కి యేమందో మా కొంపెట్టి'_అబ్బ చెప్పడానికి కష్టంగా ఉందమ్మా 'చంపేసి, మరో మొగుడితో లేచిపోదామని చూస్తోందట్లో_' అబ్బ ఆ ముక్కలన్నీ ఒక్కొక్కమాట ఒక్కొక్క_గాయంచేసేయి యీ హృదయమ్మీద. భారత స్త్రీ హృదయం అంతమొక్కిపోలేదని తెలుసుకోలేదు. భారతస్త్రీ యింకా అంతనీచంగా ప్రవర్తించడానికి సమకట్టలేదని తెలుసుకోలేక పోయారు పాపం.

పోనీ మావాళ్లెవళ్లేనా నాలుగురోజులు తీసుకెళ్తామంటే పంపరు. మా అన్నయ్య నామీద చాలా దయగా ఉండేవాడు. నా దుస్థితిచూసి గుండె పగిలేటట్టు ఏడ్చేవాడు. అతను నాలుగురోజులపాటు పంప

మన్నాడు. వారికి పెళ్ళినాడిస్తానన్న కట్నంమాట తేల్చమన్నారు. అయినదంతా అయిపోగా అతనికి మున్ఫై రూపాయిల ఉద్యోగం మిగిలింది. అతనేంవిటిస్తాడమ్మా!_ఆధనంకోసమా నన్ను బాధలు పెట్టడం. పోనీ చదువుకున్నారుకదా వారికేనా ఆ జ్ఞానం ఉండకూడదూ?

నాభాధలుచూచి సహించలేక వాళ్లతో దెబ్బలాడి నన్ను తనయింటికి తీసుకొచ్చాడు. కొన్నాళ్లు గడచిపోయాయి. ఓ రోజున మాఅన్నయ్య ఏమనుకున్నాడో నాదగ్గిరకొచ్చి మెల్లగా 'అమ్మా నేనో మాటంటాను కోపంరాదుగద? ఆముక్క అనకూడదుకాని నీ కష్టాలు మరి చూడలేకుండా ఉన్నాను తల్లీ. నీకు పెళ్లయిందగ్గరనుంచీ ఓముచ్చటేనా యెరుగుదువూ? కంటినిండా నిద్ర కడుపునిండా భోజనంఉందీ? ఎప్పుడూదుఃఖం తప్ప. అతనుండే అభాజనుడు. ఎవరికీపనికిరాడు. మంచంమించి లేవలేని పొట్లపండు. అతను నీకు మూడుముళ్లూ వేసాడుకాబట్టి పేరుకిభర్తకాని అతనివల్ల ఒకరోజేనా సుఖమెరుగుదువూ? పైపెచ్చు కష్టాలుతప్ప_అంచేత_అమ్మా! అంచేత ఆభర్తను_వదిలేసి...' 'నీవేనా మాట్లాడుతున్నది. ఆయన్ని వదిలేసి మళ్లీపెళ్లి చేసుకొమ్మంటావా?' 'మ_ళ్లీ_పె_ళ్లి' అతనిగొంతు కంపించిపోయింది. నేత్రాల్లో అరుణజ్వాల ప్రజ్వలించింది. 'అవునమ్మా! మళ్లీపెళ్లి_ఏంతప్పా? మనధర్మ శాస్త్రాలలోనేఉంది. భార్య కాని, భర్తకాని ఏ ఒకరైనా కుదరదని, నిర్ధారణపడి ఏదీర్ఘవ్యాధిచే బాధపడుతూన్నా ఒకర్ని వకరు ఐదే ళ్లలో ఒకమారేనా చూసుకోకపోయినా, ఉత్తరప్రత్యుత్తరాలు లేకపోయినా, వారు ఆడదైనా మగాడైనా. విడాకులిచ్చి మళ్లీపెళ్లి చేసుకోవచ్చు' అని. 'అన్నయ్యా! నువ్వేనా మాట్లాడుతున్నది? భారత స్త్రీ యెంతకాలం భారత స్త్రీయో అంతకాలం అలాటిపని జరగనేరదు. భారతనారి అంత యెంగిలి మంగలం మాత్రం కాజాలదు. అంచేతనే మనభారతదేశం అన్నిదేశాలకీ తలమానికంలాఉంది. మళ్లీపెళ్లిఅని అనేశావే కాని, దాన్లోఉండే కష్టసుఖాలు గుర్తించావా? బాగాఆలోచించు. సంఘం నిన్నూ, నన్నూ బతకనిస్తుందా? యీ సనాతనులంతా విచ్చుకత్తులు నూరరూ! నిన్నూ నన్నూ నీకుపుట్టబోయే పిల్లల్ని అందర్నీ వెలివేస్తుందీ సంఘం. నిలవడానికినీడా తాగడానికినీళ్లూ పుట్టకుండా చెయ్యగలదీ మానవసంఘం' 'పోనీ నీ సౌఖ్యమే నాకుకావాలి. యీ సంఘాన్ని, మానవలోకాన్ని లక్ష్యపెట్టేవాడెవడు?' 'అన్నయ్యా! ఉత్తివెఱ్రితనం. లాభంలేదు. మనంయెదిరించలేం. యెందుకుకష్టపడతావు. అయినప్పటికీ యింకానారీలోకం అంతపతనావస్థకు రాలేదు. భారతస్త్రీలు మృగాలకన్నా కనాకష్టంగా అయేహీనావస్థకురాలేదు. నాప్రాణమేనా పోవ డానికి సిధ్దపడతాను కాని అలాటిపనిమాత్రం చెయ్యలేను; క్షమించు. నామీదనీకున్న ప్రేమకి ధన్యవాదాలు' అన్నాను. మాఅన్నయ్య మరిమాట యెత్తలేదు.

అమ్మా! అంతటితోనా కష్టాలు గట్టెక్కుతేనా? వాళ్లని కాదని నన్ను మాఅన్నయ్య తీసుకొచ్చేట్ట. అంచేత వాళ్లగడప మరి యెక్కొద్దన్నారు. అసలుసంగతి కట్నంసొమ్ము. మా అన్నయ్యకి బోధపరచి యెన్నోఉత్తరాలు రాయించేను. కాని వాళ్లుపట్టువదుల్తేనా? 'అమ్మా! పోనీ నీకష్టాలు గట్టెక్కాయి. పీడవదిలింది, నాకో అన్నదమ్ముడివి అనుకుంటాను. నాతోపాటే కలోగంజో నువ్వూ తాగుదుగాని. నీ ఒక్క పొట్టబరువైపోయిందా తల్లీ! చదువుకుంటే చదువుచెప్పిస్తా' నన్నాడు. అడుగంటిన ఆశాలత చిగిర్చింది. పోనీ ప్రపంచంలో యే సుఖంలేకపోయినా, నాజీవితంలో యీ పాటేనా దీపం వెలగబోతూన్నందుకు సంతో షించాను. నామనస్సుని రాయచేసుకున్నాను. నన్నుస్కూలికి పంపేడు అన్నయ్య.

ఓ సంవత్సరం గడిచింది. ఓరోజున మా వదిన ఏమో అన్నయ్యతో మాట్లాడుతూంది. అన్నయ్య గొంతు గద్గదికమై పోయింది. 'నువ్వుయెన్ని చెప్పినా ఆమాటలునమ్మను. అదిఅలాటిదికాదు_దానిహృదయం

నీకు తెలీదు_అలాటిదే అయితే, నేను పెళ్లిచేస్తానంటే వద్దని యిలాంటి పనికిలోబడుతుందా ?" అన్నారు. నాగుండె ఝల్లుమంది. 'నేనుమాత్రం చూశానా_లోకులు కాకులన్నారు. లోకాన్ని ముయ్యడం మన వశమా ? మొగుడ్ని వదిలేసి, చదువుకుంటూంది_అది_అచ్చి_యింకా ఏమేమో గుసగుసలు ప్రారంభమయ్యాయి. మీరింకతలెత్తుకుని తిరగ్గలరూ ?_మనపరువుమర్యాదలు దక్కుతాయీ !' 'లోకంగుడ్డిది, దానికి చెవులేకాని కళ్లులేవు. అబ్బా ! అమాయకురాల్ని యెంతకష్టపెడుతూంది గుడ్డిప్రపంచం, నేనునమ్మలేను.' మరినేను వినలేకపోయాను. కళ్లుచీకట్లుకమ్మాయి. లోకం_పాడులోకం_పాపం నానుంచి మాఅన్నయ్యకి పరువుమర్యాదలుండవు. అబ్బా ! నాకర్మం యిలాఉంటే యెవరుతప్పిస్తారు. అమ్మా_యింక_తల్లీ ! గౌతమీ ! యింక యీకష్టాలు అనుభవించలేను. నానుంచి యెవరి పరువుమర్యాదలూ పోనక్కరలేదు. నీచల్లని కడుపులో చోటియ్యి. నాకదేపదివేలు. యింక యీ అభాగినికి నీ కంటేదిక్కులేదు. శాశ్వతానందం యియ్యి ! తల్లీ నన్ను నీలోకలుపుకో !_యివేనాతుదివందనాలు'

ఆంధ్రశిల్పి

తొలచినాఁడవు గండశిలలనే ఒకనూత్న శిల్ప సౌందర్యంబు చిందులాడ
మలచినాఁడవు చేవమ్రాఁకులనే శిల్ప శృంగార రసధునుల్ పొంగిపొరల
కల్పించినాఁడవు కఠినలోహములనే లలితకలాశోభ మొలుకు లీల
చిత్రించినాఁడవు చీకు మృత్తికలనే జీవనజ్యోతులు జెలఁగుచుండ

ఆ మహాకళాకాంతినే భూమిలోన
వెలుఁగఁజేసితివో నేడు తెలియరాదు
కవిని, నాకైన వచియింపు కలనునైన;
గాన మొనరింతు నీకళా గాథలెపుడు.

నీ మహోజ్వలశిల్ప నిపుణత్వమున, నజంతాగుహా సీమ రత్నాలు మెరసె
నీ సృష్టిప్రతిభచే నిస్తుల శిల్పమ్ము ఎల్లోరా కొండలో వెల్లివిరిసె
నీ కళాకౌశల శ్రీకారణమ్మున హంపి నిలింపాలయంబు నమ్యె
నీ కల్పనాశక్తిచే కళామృతరాశి అమరావతీ స్తూప మందుఁదనరె

ఆ మహోత్కృష్ట శిల్ప భాగ్యంబునరసి
భవ్య భవదీయ సద్యశో భావగీతి
పాడుచున్నది సతతంబు భారతాంబ
ఆంధ్రశిల్పి ! ధన్యాత్ముఁడవయ్య నీవు !.

—వారణాసి వేంకటేశ్వర్లు

గతమాసములో నంద్యాలలో జరిగిన 14 వ ఆంధ్రరాష్ట్రీయ మహిళా మహాసభకు ఆహ్వాన సంఘముగా ఏర్పడిన విదుషీమణులు.



బొంబాయి మహిళామండలి, గుజరాతీ స్త్రీ మండలి వారి ఆధ్వర్యాన్ని, వనితా విశ్రామ మందిరంలో 'స్వదేశీ వస్త్రప్రదర్శనము' ఏర్పాటు చేయబడింది. ప్రదర్శనము శ్రీమతి రామారావు సతిగారిచే బహిరంగపరుపబడింది. చిత్రములో శ్రీమతి రామారావు సతిగారు కార్యదర్శినిరైన శ్రీమతి జయశ్రీ రాయ్‌జిగారితో ప్రదర్శితములైన వస్తువులను గురించి చర్చించుట కానవగును.



తాడేపల్లిగూడెం సతీహితసమితి శారదా గ్రంథాలయం అష్టమ వార్షికోత్సవం గతమాసంలో జరిగింది. శ్రీమతి చుండూరు రత్నమ్మ గారు అధ్యక్షత వహించారు.

కుమారి చిలుకోటి నాగరత్నం

"ఠక్కరుజయంతి విద్యార్థి వేతనము" సహాయంతో యీ సంవత్సరం రాజమండ్రి సెకండరీ గ్రేడు ట్రెయినింగు (2వ సంవత్సరము) చదువుచున్న హరిజన విద్యార్థిని యీమె గతసంవత్సరము ఆంధ్రరాష్ట్ర హరిజనసేవక సంఘంవారిచే ఒసగబడిన "మూర్తి విద్యార్థి వేతనము" సహాయంతో మొదటి సంవత్సరము ట్రెయినింగులో కృతార్థురాలు అయింది.

కట్నాలు తెచ్చిపెట్టిన కొత్త అనర్థం—

★ ★ ★

విద్యావతులు అవివాహితలుగా మిగిలిపోతున్నారు

వివాహానికి చదువుకున్న కన్యలు కావాలంటున్నారు .. ఆడపిల్లల చదువుకూ డబ్బు ఖర్చు ఎక్కువౌతూవుంది - వారి వివాహాలకు కట్నమూ ఎక్కువౌతూ వుంది– రెండువిధాలా కన్య తండ్రికి ఒత్తిడి ఎక్కువై నలిగిపోతూ వున్నాడు.

కట్నాలు ఇవ్వలేకా, తాహతుకు తగినవరుడు దొరకకా విద్యావతులగు కన్యలు అవివాహితలుగా ఉండిపోతున్నారు.

ఇందువల్ల అశాంతి ప్రబలమౌతూ వుంది. దీన్ని మనవారు గమనించారా?

●

శ్రీమతి కె. సరోజనీదేవి

●

ఈ కట్నం అనేరాక్షసి యింకా హిందూదేశాన్ని వదలలేదు. విద్యావికాసాలు అభివృద్ధిగాంచిన కొలదీ తగ్గిపోవలసిన యీకట్నంబాధ అంతకంతకు హెచ్చిపోతోంది. విద్యాధికులలోనే కట్నాలు హెచ్చు అయినాయి. దీనికికారణాలు, దానివలన సంఘంలో జరిగేమార్పు, దానివలన యితర నష్టాలూ మనం ఇంకా గ్రహించలేదు.

పూర్వం కట్నాలు ఒకలాంఛనం. పెండ్లి కుమార్తెతండ్రి ఏదో సంతోష పూర్వకంగా అల్లుడ్ని ఆశీర్వదించి యిచ్చినబహుమతి. ఇది చివరకు ఒక తప్పనిసరియైన పని అయింది. అదొకమర్యాద అయింది. "స్త్రీ విత్తం అధమాధమం" అని విధించిన హిందువులే ఈ కట్నాన్నికూడా తెచ్చిపెట్టారు. కట్నపిశాచం మనదేశంలో ఏకారణంవల్ల వస్తేనేంగాని ప్రస్తుతం అతి తీవ్రరూపాన్నిదాల్చి సంఘాల్ని అంత అలజడి చెయ్యగలిగిన కారణాలు పరిశీలించాలి.

ఆర్థికంగా కట్నాలుపుచ్చుకోవడం తప్పులేదు. తండ్రి ఆస్తి కొడుకులకూ, కూతుళ్లకు న్యాయానికి సమంగాపంచాలి. మన హిందూమతము స్త్రీకి అట్టిహక్కులేకుండగా చేసింది. ఏనాడైతే ఆర్థికంగా స్త్రీ పురుషునిమీద ఆధారపడవలసి వచ్చిందో ఆనాటినుండి స్త్రీ పురుషునకు దాసీఅయింది. తండ్రి తన బిడ్డను ఇంకొకరి ఇంటికి పంపించినప్పుడు ఆర్థికంగా తనబాధ్యత నంతా వదలించుకొంటున్నాడు. ఆపిల్లకు తన ఆస్తిమీద హక్కులేకుండా చేస్తున్నాడు. ఆ బాధ్యతవహించే పురుషుడు అట్టి తండ్రిమీద ఆర్థిక సహాయం విధించడం అట్టే తప్పులేదు.

4

మొత్తంమీద అది ఆ అమ్మాయికి బహుమతి అయితేనేం, అబ్బాయికి బహుమతి అయితేనేం ఏదైతేనేం - ఏకట్నం పుచ్చుకోకుండ బాగానేయుంటుంది కాని - ఆ పెద్దమనిషి ఇచ్చుకోగలుగునా లేదా అనే విషయం ఆలోచించాలి. ఇచ్చుకోగలవారి దగ్గరనుండి ఎంత పుచ్చుకొన్నా భయంలేదుకాని ఇచ్చుకో గలడా, లేడా అన్న విచక్షణలేకుండగా ఇవ్వవలసివస్తూంది కాబట్టే కట్నాన్ని పిశాచం అనవలసివస్తూంది.

పిల్లవాని తరఫునుంచిచూస్తే అతని ఆలోచన ఇలావుంటుంది. మంచి పిల్లకావాలి. చక్కని సాంప్రదాయం వుండాలి. ఆపైగా పెండ్లిఅంటే గొప్ప బాధ్యత, ఇంకొకరినిపోషించాలి. అందువలన ఒకా నొకపిల్ల కట్నంతోటివస్తూంటే చాల బాగుంటుంది. అందులో మధ్యతరగతివాడైతే తను చదువుకున్న చదు వుకు పెట్టినదానిలో కొంతభాగం అయినా కూడతీద్దామనుకుంటాడు. అందరూ చదువుకున్న అబ్బాయే కావాలంటారు. అందుకనే విద్యాధికులలోనే కట్నం హెచ్చు అయిపోయింది.

న్యాయానికిచూస్తే ఆడపిల్లకు కొడుకులతోకూడ ఆస్తివచ్చే పక్షం అయితే ఎంత వస్తుందో అంత కట్నం ఇచ్చే పెద్దమనిషి ఎవరూలేరు. దీన్నిబట్టిచూస్తే కట్నాలుహెచ్చు అనుట అన్యాయం. పైగా ఈ ఆడ పిల్లలుగల తండ్రులు వారికి తగువారికియిచ్చేపక్షం అయితే కట్నాలతీవ్రత వుండనేవుండదు. ఆర్థికంగా తన కంటేమించినవాళ్ళ అబ్బాయికి తన అమ్మాయిని యిద్దామని ప్రతితండ్రి చూస్తాడు. ఆ అబ్బాయికోసమే అలాగే అనేకమంది చూస్తారు. అందుచేతకట్నం మోజు అవుతోంది.

ఇటీవల మన సంఘంలోకలిగే గొప్పమార్పు ఒకటి మనవారు ఇంకా గ్రహించినట్లు కనుపించదు. స్త్రీవిద్య అభివృద్ధిగాంచుచున్నందువలన తండ్రులకు ఆపిల్లలవిద్యకయ్యేఖర్చు లెక్కువవుతాయి. చదువుకొంటే మంచి భర్తవస్తాడనే ఉద్దేశ్యముతో ఆడపిల్లలను ఎక్కువచదివిస్తున్నారు. అట్టి విద్యావతులగు పిల్లలకు ఎక్కువ విద్యావంతుడైన భర్తకావాలికదా అని ఆలాటివారు ఎక్కువకట్నం ఇవ్వనిదేకాని దొరకరు. కనుక చివరకు ఆడపిల్లలకు చదువుకూ ఎక్కువడబ్బు అయిపోతూవుంది; కట్నమూ ఎక్కువవుతూవుంది. మన సంఘంలో ఆడపిల్లలభారము తల్లితండ్రులకే ఎక్కువ. తగిన భర్తలభించకపోతే ఎక్కువకట్నం ఇయ్య గలిగినవారు వెంటనే తమ పిల్లలకు వివాహముచేస్తున్నారు. కట్నం ఇవ్వలేనివారు తమ పిల్లలను ఆలావుంచి వేయడమో, చదువు చెప్పించడమో జరుగుతున్నది. అవివాహితలు, విద్యావంతులు అగుకన్యలు మన సంఘంలో మిగిలిపోతున్నారు.

ఇది చాల అనర్థదాయకమగు మార్పు. దీనివలనకలుగు ఫలితాలు ఒకసారి వంగదేశాన్నిచూస్తే తెలుస్తాయి. వంగదేశములో కట్నాలబాధహెచ్చు. విద్యావంతులు, అవివాహితలు అగుకన్యలు ఎంతో మందివున్నారు. వీరికి ఆంగ్లవిద్యవలన, హైందవ సాంప్రదాయకమగు నీతి నియమములంటే నమ్మకము తగ్గుతూవుంది. పైగా వయసువచ్చినస్త్రీలు పురుషులతో తరచు తిరుగుచుండుటవలన చెప్పరాని అనర్థాలు అనేకములు కలుగుతున్నాయి. 1938లో సుజాత సర్కారు అను B. A. విద్యార్థినియొక్క బలవన్మరణము సంగతి అందరికీ తెలిసినవిషయమే. సుజాతా సర్కార్ అనుకన్య B. A. విద్యార్థిని. దుస్సాంగత్యము - గర్భ విచ్ఛిత్తి-చివరకు ప్రాణములు గోల్పోయింది. ఇటువంటివి అనేకముతరుచు జరుగుతున్నాయనీ, విద్యావతు లగు స్త్రీలు అవివాహితులైయుండి ఇట్లు చెడిపోవుటకు కారణము వరశుల్కబాధే అని 'అమృతబజారు' పత్రిక ముఖ్య సంపాదకీయం వ్రాసింది.

అటువంటి చెడ్డ పరిస్థితులు, ఇంకా మనసంఘానికి రాలేదుగాని, మనం ఇప్పుడే కండ్లు తెరవక పోతే మన బాలికలుకూడా పాడయిపోతారు. సంఘం పాడవుతుంది. నీతి నియమాలు పోతాయి. ఆదుర్దినం రాకుండా కాపాడేభారం విద్యావంతులగు పురుషులది. వారివిషయం గమనించి కట్నాలమీద మోజు తగ్గిస్తారా?



I-WW 112-111—TL. W. WOODWARD LTD, LONDON, ENGLAND



అన్నం ఎలా అరుగుతుంది?

డాక్టరు యస్. శేషగిరిరావుగారు

మీవూళ్లో ధాన్యం మరవుంది. దాన్ని మీరు చూచేవుంటారు. ఆ మర ధాన్యాన్నిదంచి బియ్యం చేస్తుంది. మరలో వడ్లుపోస్తే మర వాటినిదంచి పనికిరానివూకను వొకపక్కా, పనికివచ్చే బియ్యాన్ని యింకోపక్కా, తౌడును మరోపక్కా పోస్తుంది. కాని యిలాపనిచేసేమర ఊరకే పనిచేస్తుందా? చక్రాలు వున్నంతనే పనిచేస్తుందా? చేయదు. ఆమర పనిచేయడానికి రాక్షసిబొగ్గు, పెట్రోలు, కిరసనాయలు యింకా యిటువంటివే యేవేవో కావాలి. అవన్నీ మరలోపోస్తే వాటిని వంటపట్టించుకుంటూ ఆమర ఝుయ్యిఝుయ్యిమంటూ ఆడుతూ పాడుతూ పనిచేస్తుంది.

మీవూళ్లోవున్న మరనే గుర్తించారుకాని మీలోనే, మీ ఒంట్లోనే ఓమరవుంది. అది గుర్తించారూ! నిజంగా ఆలోచిస్తే నేనూ ఓమర. మీరూ ఓమర! మరల చక్రాలూ పట్టాలూ తిరిగినట్టుగా మన శరీరంఅనే యంత్రంయొక్క కాళ్లూ చేతులూ కదలాలి అంటే యంత్రాలకు చమురుపోసినట్టే మనం ఆహారం తీసుకోవాలి. ఆహారంతింటున్నాం; అది జీర్ణంచేసుకుని వంటపట్టించుకున్నాం. కనకనే మన ఆకలితీరి చేతులూ కాళ్లూ, కళ్లూ చెవులూ, మెదడు పనిచేస్తూ వున్నాయి.

మనశరీరం వృద్ధిపొందడమూ, మనం యెదగడమూ అంతాతిన్న ఆహారాన్ని జీర్ణించుకోవడంలోనే వుంది.

జీర్ణించుకోవడం అంటే యిదేమా అనుకుంటున్నారు కదూ! అదే చెపుతావినండి. మీరు స్కూలునుంచి యింటికివెళ్లి "అమ్మా ఆకలివేస్తోంది అన్నంపెట్టు" అంటారు. అమ్మ అన్నం పెడుతుంది. మీరు దాన్నితింటారు; ఆకలి తగ్గుతుంది. నీరసంగావున్నమీకు కొంచెం ఉత్సాహంకలుగుతుంది. తిన్నది జీర్ణం అయినమీదట అంతకుముందుకన్నా మీకు చెలాకీయెక్కువ ఔతుంది. మళ్లీ చెపుతున్నా. యిది అంతా మీరు తిన్నవస్తువులను జీర్ణంచేసుకోవడము మీద ఆధారపడి వుంటుంది.

ఇప్పుడు జీర్ణంచేసుకోవడము చాలా ముఖ్యమయిందని తెలుసుకున్నారు. యిక యీ ఆహారం యెలా జీర్ణానికివస్తుందో ఆసంగతిచెపుతా.

మనంతినే ఆహారంలో మాంసాన్నిపోషించే పదార్థాలువున్నయి. పనిచేయడంవల్ల శరీరానికికలిగే క్షీణతను ఆదుకునే కొవ్వు పదార్థాలూవున్నయి. యింకా లవణాలూ, శక్తీ, వేడీ యిచ్చే పిండిపదార్థాలూ

వున్నయి. యిప్పుడుచెప్పానే ఆ పదార్థాలు అన్నీ మన శరీరయంత్రం పనిచేయడానికి అవసరం; అయితే యీ పదార్థాలు కొన్నింటిలో యెక్కువ కొన్నింటిలో తక్కువావుంటవి. కొన్నికొన్ని పదార్థాలు కొన్నింటిలో లేవనుకోనవలసినంత కొద్దిగా వుంటవి.

ఉదాహరణకు చెప్పుతా-మాంసం, గుడ్లు, గోధుమలు,చిక్కుళ్లు, బటానీలు, జొన్నలు యిటువంటి వాటిలో మన శరీరంలోని మాంస భాగాన్ని పోషించే పదార్థాలు వున్నవి. నెయ్యి, వెన్న, పాలూ, నూనె, చేపలు యిటువంటి వాటిలో కొవ్వు పదార్థం వుంది. బియ్యం, గోధుమలు, బంగాళాదుంపలు యిటువంటి వాటిలో పిండిపదార్థాలు వున్నయి.

యీ పదార్థాలు అన్నీ రక్తంలో కలియడమువల్ల శరీరానికి సత్తువ వస్తుంది ; అలసట తీరుతుంది. అయితే మనం భోజనం చేస్తాం. చేయగానే ఆ భోజనంలో వుండే పైన చెప్పిన పదార్థాలు రక్తంలో కలిసిపోతున్నవా ?—అలా యెప్పుడూ కాదు. అలా చేరేలోపున మన శరీరంలోని యెన్నో మరలు ఆ పదార్థాన్ని యెన్నో విధాలుగా మార్చివేస్తవి. అది మహా తమాషాగా వుంటుంది.

మీరు స్కూలునుంచి వెళ్లి భోజనానికి కూచుని గబగబా అన్నంముద్దలు చేసుకుని నోటిలో పడవేసి మింగివేస్తూ వుంటే "అబ్బాయ్ అలా వొక్కమారుగా మింగకూడదు. నవిలిమింగు" అని అమ్మ చెపుతుంది. అలా చెప్పడం యెందుకు అనుకున్నారు ? మీరు తింటున్న వాటిని జీర్ణం చేసుకోడానికీ వంట పట్టించుకోడానికీ యిదేమార్గం సుమా అని !

మనం తినే ఆహారంలో కొన్ని మెత్తటి పదార్థాలూ కొన్ని గట్టి పదార్థాలూ వుంటవి. వాటిని నోట్లో వేసుకుని పళ్లతో కొరికి, దంతాలతో నమలి, నాలుకతో యిటూ అటూ కలియ తిప్పాలి. యిది అంతా మనం తింటూ వున్నప్పుడు దాని అంతట అదే జరిగిపోతూ రావాలి.

ఇప్పుడు మరొకసంగతి చెప్పాలి. మనం భోజనానికి కూచున్నప్పుడు రుచిగల పదార్థాలు చూచినప్పుడు నోరు వూరుతుంది. అప్పుడు నోట్లోవచ్చే జలాన్ని లాలాజలం అంటారు. నోట్లో నలిగిన పదార్థాలతో యీ లాలాజలంకలిసి అది అంతా వొకవిధమైన పలచటి జారుడు పదార్థంగా తయారౌతుంది. అప్పుడది సాఫీగా గుటక వేయడానికీ మింగడానికి వీలౌతుంది. అంతే కాదు యీ ఉమ్మినీరు కలియడంవల్ల నోటిలో ఆహారంలోని పిండిపదార్థాలు చక్కెరగా మారుతవి. అలా తయారైంది, అన్ననాళం గుండా కడుపులోవున్న జీర్ణాశయంలోకి, అంటే తిత్తివంటి ఒకదానిలోకి వెళ్తుంది. ఆ తిత్తిలో ఆహారంయేమి ఔతుంది ? ఆ సంగతులగురించి చెపుతా. ముందుగా జీర్ణాశయం తీసుకుందాం. ఈ జీర్ణాశయం దాన్ని అనుసరించే ప్రేవులతోపోలిస్తే పెద్దది. దీనిలోపలి భాగంలో - అంటే జీర్ణాశయంలో పక్కలను అంటుకున్నట్టుగా చిన్న చిన్న గొట్టాలవంటివి అనేకంవున్నయి. జీర్ణాశయంలోకి ఆహారం వచ్చింది అంటే యీ చిన్న గొట్టాలు ఒక విధమైన రసాన్ని - దీన్నే జఠరరసం అంటారు - ద్రవిస్తాయి. యీ ద్రవం ఆహారపదార్థాలతో కలుస్తుంది. దానితో ఆ జీర్ణకోశంలో ఒక కదలిక యేర్పడుతుంది. ఆ కోశం విడవడం ముడుచుకోవడం - ముడుచుకోవడం విడవడం - యిలా జరుగుతుంది. ఈ కదలికవల్ల చూడండి మనవాళ్లు నానవేసిన పప్పును రుబ్బురోటిలోవేసి రుబ్బితే ఆ పప్పు నలిగి మెత్తని పిండి ఐనట్లుగా జీర్ణకోశంలోని ఆహారంకూడా మార్పుజెందుతుంది. ఈ మార్పులతో చివరకు ఆ పదార్థాలన్నీ పూర్తిగా రూపం మారిపోయి పాలవంటి ద్రవం అయిపోతవి. ఇక్కడే ఆహారపదార్థాల్లోని మాంసపోషకపదార్థాలుకూడా కరుగుతవి.

ఇలా రూపాంతరంపొందిన ఆ ద్రవాహారం అక్కడనే వుండిపోతుందా?—వుండదు. అక్కడి నుంచి జీర్ణాశయాన్ని అనుసరించివున్నవి అని చెప్పానే ఆ ప్రేవుల్లోకి - చిన్న ప్రేవుల్లోకి వెళ్తుంది. ప్రేవు లంటే యేమిటనుకున్నారు? జీర్ణకోశం తరువాత పొడుగ్గావున్న గొట్టాలు. ముందు చిన్న ప్రేవులు; ఆ తరువాత పెద్ద ప్రేవు. చూచారూ మరో తమాషా! మీరేమో 4 అడుగుల పొడవే వున్నారు కాని మీ పొట్టలోని ప్రేవులుమాత్రం 25 అడుగుల పొడవు వున్నవి! ఈ ప్రేవులు-ఇంత పొడవున్నవంటే నమ్మరూ! మీరు ఆశ్చర్యపోతారు. కాని యిది నిజం సుమండీ! 20 అడుగుల పొడవు చిన్న ప్రేవులు 5 అడుగుల పొడవు పెద్ద ప్రేవు. చిన్నప్రేవుల్లోకి వెళ్లిన ఆహారపదార్థాలల్లో కొన్ని ద్రవాలు మధురరసం, పైత్యరసం యితర అవయవములనుంచి వచ్చి చేరి ఆహారాన్ని మరీ మార్చివేస్తై. ప్రేవుల్లో మరోరసం - దీన్నే ఆంత్రరసం అంటారు - అదీ ఆహారంతో కలుస్తుంది. ఈ 3 రసాలు చేరడమువల్ల యిక్కడ ఆహారద్రవంలోని క్రొవ్వు పదార్థాలు అరుగుతవి.

అంతేగాక ఆహారద్రవంలో శరీరానికి అవసరమై యింకా రూపాంతంపొందని పిండిపదార్థాలు, మాంసపోషక పదార్థాలు రక్తంలో సులభంగా కలియడానికి తగ్గ పద్ధతిలో మార్పుజెందుతాయి.

ఇంత కర్మకాండా మనకు తెలియకుండా కడుపులోని యంత్రాల్లో జరిగిందీ అంటే, ఆ తిన్న ఆహారం యిన్నిమార్పులు పొందిందీ అంటే అది జీర్ణం అయిందన్నమాట! అంటే మనం తిన్న ఆహారం ఆయా రూపాలుపొంది రక్తంలో కలిసి శరీరయంత్రం అంతా వ్యాపించి మనకు శక్తి, పుష్టి యిచ్చిందన్నమాట. ఇప్పుడు అర్థం అయిందా మీకు జీర్ణం అంటే యేమిటో? (రేడియో ప్రసంగము)

పిన్ని ఉత్తరాలు

తెనుగు దేశం

సర్వమంగళా,

ఈమధ్య మీ చిన్ననాన్న, వాళ్ళ ఆఫీసుస్నేహితులతోకలిసి హంపీ క్షేత్రాన్ని చూడడానికి వెళ్లేరు. తిరిగివచ్చి, అక్కడి చిత్రాలన్నీ వర్ణించి చెబుతోంటే "నే కూడావెళ్లి ఉంటే బాగుండి పోనుకదా!" అనిపించింది నాకు. మనమంతా వెళ్లి చూద్దాం ఎప్పుడైనా. ఏం?

'హంపి' అనేది ఎక్కడుందో తెలుసా? మన తెనుగుదేశంలోనే. ఆ భాగాన్ని దత్తమండలం అంటారు. అంటే 'ఇచ్చివేసిన మండలం' అన్నమాట. హైదరాబాదు నవాబు ఈ మండలాన్ని ఇప్పుడు రాజ్యంచేస్తోన్న తెల్లవాళ్లకి ఇచ్చేశాడు.

ఈ హంపి అనేచోట పూర్వం విద్యానగరం అని ఓ గొప్పపట్టణం ఉండేది. ఆ పట్టణంలో చాలా అందంగా ఉండే భవనాలూ, ఇంకా అనేకరకాల కట్టడాలు ఉండేవి. వీటినన్నింటినీ కట్టించిన రాజు పేరు శ్రీ కృష్ణదేవరాయలు. ఆయనకి లలితకళలంటే చాలాసరదా. ఎంతోడబ్బు ఖర్చుపెట్టి దేశదేశాలనుంచి పనివాళ్ళను రప్పించి, ఆయన ఆ నగరం కట్టించాడు. ఆ కట్టడాలన్నీ ఇప్పుడు ముక్కముక్కలైపోయి ఉన్నాయి. ఆ ముక్కలమీద ఉన్న చెక్కడపుపనిచూసినవాళ్లకి ఆశ్చర్యంకలిగి "ఆ నగరం నాశనంకాక పూర్వం ఎంత కన్నులపండువగా ఉండేదో" అనిపిస్తుందిట. ఆ నగరాన్ని నాశనంచేస్తె తురకలు. ఆ నగ

బులకీ విజయనగరరాజులకీ ఎప్పుడూ యుద్ధమే. ఆయుద్ధంలో చాలామాట్లు నవాబులు ఓడిపోయారు. ఆఖరికి ఓమాటు నెగ్గేరు. ఆ అదును చూసుకుని నవాబులు రాజులమీద ఉన్నకసి కొద్దీ విజయనగరంలో ఉన్న అందమైన కట్టడాలను అన్నింటినీ గొడ్డళ్లతో బద్దలు గొట్టించేశారు!

కృష్ణదేవరాయలుకు తెనుగుపద్యాలంటే చాలాసరదా. ఆయన బాగా చదువుకున్నవాడు. ఆయనే స్వంతంగా ఓపెద్దపద్యాల పుస్తకంరాశాడు. చాలామంది గొప్ప కవీశ్వర్లచేత మంచిమంచి పుస్తకాలు రాయించాడు. మన తెనుగుదేశాన్ని పూర్వంఏలిన గొప్పరాజులు, ఇంకా చాలామంది ఉన్నారు. ప్రతాపరుద్రుడు, రాజరాజనరేంద్రుడు - ఈపేర్లువిన్నావా నువ్వు? రెడ్లుకూడా రాజ్యంచేశారు మనదేశంలో. నువ్వు బొబ్బిలిపాట విన్నావుకాదూ? బొబ్బిలిలో రాజ్యంచేసినవారు వెలమదొరలు. తెలుగురాజులందరికీ మనభాషఅంటే ఇష్టమే. అందుచేత వీళ్లంతా కవీశ్వర్లచేత ఎన్నో పుస్తకాలురాయించారు. నువ్వు పెద్దదానివయాక ఈ పుస్తకాలన్నీచదివి ఆనందించాలి.

అటు విశాఖపట్నం మొదలు ఇటు చెన్నపట్టణందాకా ఉన్నదేశంకూడా తెలుగువాళ్లదే. ఇది కొండలకీ సముద్రానికీమధ్య చీలికలాఉంది. ఈ కొండల్ని "తూర్పు కనుమ"లంటారు. సింహాద్రప్పన్న, అన్నారం సత్యనారాయణమూర్తి, బెజవాడ కనకదుర్గా, తిరుపతి వెంకటేశ్వర్లూ_ ఈ దేవుళ్లంతా ఈ కొండలమీదే ఉంట. ఈ చీలికలోనే మనఊరు ఉంది. ఇది చాలా సారవంతమైనదేశం. అంటే ఇక్కడ పంటలు బాగా పండుతాయి. పంటలు పండాలంటే పొలాలకి నీరుకావాలికదా! కావలసినంత నీరూ ఇవ్వడానికి మనకి గోదావరీ, కృష్ణానదులున్నాయి. ఈ నదులు ఎక్కడో వందలకొద్దిమైళ్ళ దూరాన్ని పుట్టి, అడవులూ, కొండలూ దాటుకుంటూవచ్చి అక్కడుండే మంచి ఒండ్రుమట్టి అంతా తెచ్చి మన భూమిమీద పెడుతున్నాయి.

ఈ నదులనీరంతా వృథాగా సముద్రంలోకిపోకుండా వీటికి ఆనకట్టలు కట్టేశారు. "ఆనకట్ట" అంటే నదికి అడ్డంగా, కట్టేసిన ఓ పెద్దగోడ. ఈగోడ అడ్డంగా ఉండడంచేత నీరు నిలిచిపోతుంది. ఈ నీటిని పెద్దపెద్దకాలవలుతవ్వి ఏపక్కకి కావాలంటే ఆపక్కకి తీసుకుపోతారు. ఆ పెద్దకాలవల్లూ, ఆ పిల్ల కాలవల్లోంచి మళ్లీ బోదికాలవలూతవ్వి నీటిని పొలాల్లోకిరప్పించి పంటలు పండించుకుంటారు. మీతోట ప్రక్కనుంచి వెళ్లే బోదికాల్వలో ఉన్ననీరు గోదావరిలోంచి ఇలా కాలవలగుండా వచ్చిందే!

అమ్మడూ, మనం తెనుగువాళ్లంగనక తెనుగుదేశం అంటే మనకి ప్రేమ ఉండాలి. మనభాషను ఎంతో శ్రద్ధతో నేర్చుకోవాలి మనం. తోటి తెనుగువాళ్ల బాగుకోసం మనం పాటుపడాలి. పరాయివాళ్లకి లోకువ ఐపోకుండా కట్టుగా ఉండాలి.

మీ ఊళ్లోఉన్న పెద్దవంతెన పేరేమిటో నీకు తెలుసా? "ప్రకాశం బ్రిడ్జి" "ప్రకాశంపంతులు" అని ఓ తెనుగుఆయన ఉన్నారు. ఆయన చాలా గొప్పవాడు. పూర్వం ఆయన ఓ పెద్ద ప్లీడరు. చాలా డబ్బు సంపాదించాడు. దేశంకోసం అంతా వదిలేసుకొని గాంధిగారికి మల్లే ఎన్నిమాట్లో జెయిలుకు వెళ్లేడు. ఆయనమీద ఉండే గౌరవంచేత ఆ వంతెనకు ఆపేరు పెట్టేరు. ప్రకాశంగారిలాంటి దేశభక్తులు ఆంధ్రులలో చాలామంది ఉన్నారు. సాంబమూర్తిగారినీ వినే ఉంటావు. వీరేగాకుండా మనదేశంలో, సర్వేపల్లి రాధాకృష్ణయ్యగారని ఒకగొప్ప ఆయన ఉన్నారు. ఆయన బాగా ఉపన్యాసాలు ఇవ్వగలరు. అలాంటి ఆయనే కట్టమంచి రామలింగారెడ్డి అని మరొకాయనున్నారు. వీళ్లందర్నిగురించీ రాయడం మొదలెడితే చాలాఉంది. రాస్తూకూచుంటే పోస్టు తీసేవేళకూడా దాటిపోయేటట్లుంది. అంచేత ఇక్కడతో ముగించేస్తా.

పిన్ని.

భావతరంగిణి

“దేన్నిగాని అనువదించడానికి పూనుకొన్న కవి ఎంతసేపూ భావాన్నిపట్టి పోవలసిందేగాని మూలంలో వుండే పదాలనుబట్టి పోగూడదు. ఎవరో తెలిసీ తెలియని ఆక్షేపణలు చేస్తారని అనువాదకుడు జంకి ‘మక్కికి మక్కి’ మార్గం అవలంబించకూడదు. మూలంలోనివి అవసరమైతే కొన్ని వదులుకోనూ వచ్చును, లేనివి చేర్చుకోనూ వచ్చును.”

—శతావధాని, చెళ్లపిళ్ల వెంకటశాస్త్రి.

“10 మాసముల క్రిందట ఒకరాట్నమైనా లేనిచోట ఇప్పుడు ఇంటింటికి ఒక రాట్నముచొప్పున స్థాపించి బట్టకుగాని, తిండికిగాని, వైద్యానికిగాని మరి ఏ యితర జీవనావసరమైనవాటికిగాని గ్రామముదాటి పైకి పోనవసరములేక ఒక గ్రామాన్ని స్వయపోషకంగా తయారుచేశాము. తృప్తికి, ఆనందానికి, శాంతికి దూరములైపోయి, ప్రజల్లో బద్ధకము, పేచీకోరుతనము వృద్ధిఅయి భగ్నమైపోయిన పల్లెలను పునరుద్ధరించడమే కాంగ్రెసుయొక్క ప్రధానాశయం.”

—టంగుటూరి ప్రకాశంపంతులు.

“నాకే కనుక అధికారముంటే ప్రతిపల్లెకు ఒక ప్రాథమిక పాఠశాల, ఒక ఉచిత వైద్యాలయము, ఒక గ్రంథాలయము నెలకొల్పి, పల్లెలను ఆదర్శగ్రామాలను చేసేదానను.”

—కె. రామసుబ్బమ్మ.

“నేటి స్త్రీలలో శరీరపాటవము అంతరించింది. సుఖజీవనము, విలాసాలు, నిర్వ్యాపకము, అమిత ఖర్చు, స్త్రీ సంఘంలో కాలమహిమవల్ల మితిమీరిపోతోంది. అందువల్ల ముప్పది సంవత్సరాల పూర్వం స్వర్గధామముగా వున్న హిందూగృహం నేడు గృహలక్ష్మిలేని గృహంలాగ వెలవెలబోతూవుంది. కనుక ప్రప్రథమమున మన సాంఘికజీవితమును సంస్కరించడం మన ప్రథమ కర్తవ్యం.”

—చుండూరి రత్నమ్మ.

“హిందువులకొకవిద్య, ముస్లిములకొకవిద్య పనికిరాదు. సర్వసామాన్యంగా భారతీయుల కందరికిని పనికివచ్చేవిద్య ఒక్కటిగానేవుండాలి. దానితోటే జాత్యైక్యం ఏర్పడుతుంది. అమెరికా మొదలైన దేశాలకు మనకు వున్న తేడాయే ఇది.”

—అమ్ము స్వామినాథన్.

“అఖిలభారత మహిళాసభలో వివిధ రాజకీయ పక్షాలవారు, మతాలవారు చేరి స్త్రీలకు సంబంధించిన సమస్యలను యేకీభావంతో చర్చిస్తున్నారు. అట్లాగే భారతసమస్య విషయంలోగూడా భారతీయులు ఏకీభావంతో వుండడం కష్టమైనపనిగాదు. దీనికి ప్రభుత్వం ఎందుకు తోడ్పడగూడదు?”

—ఆచంట రుక్మిణి లక్ష్మీపతి.

కళాకలాపము

చిత్రలేఖనము

సృష్ట్యాదినుండియు మానవునకు సన్నిహితమైన యీ కళయొక్క పుట్టుక, పరిణామము

★

శ్రీ ఒంగోలు వెంకటరంగయ్య

★

భూమిమీద మానవుడేర్పడినప్పటినుండియు చిత్రలేఖన మెద్దియో యొకవిధమున యుండినది. వస్త్రములను నేయుట యెరుగని అత్యంత ప్రాచీనకాలమున శీతాతపవేదనలనుండి దేహమును కాపాడుకొనుటకై యొడలికి మెత్తని మట్టినో ఆకుల పసరులనో నలదికొనుట వాడుకయై యుండినది. కాలము గడచిన కొలదియు, నాగరకత హెచ్చిన కొలదియు ఉన్ని, దూది లోనగునవి పరిధాన పరికరములుగ యేర్పడి పైన చెప్పిన మట్టి పూతయు ఆకుల పసరు పూతయు అందముక్రిందయు, అనాది శిష్టాచారములక్రిందయు నిలిచి యుండినవి. అనగా గోడమెత్తినట్లుగాక ఈ పూతలను ఆకుల తీరుననో, తీగెల తీరుననో, పువ్వుల తీరుననో చూడ సొంపగు జింక, నెమలి తీరుననో దిద్దుకొనుచుండిరి. ఇట్లు ప్రథమస్థితిలో దేహస్వాస్థ్యమునకై యేర్పడిన మట్టిపూతలు అలంకారప్రాయములైపోయినవి. ఇట్టి అలంక్రియా విశేషములు ఈనాటికిని భస్మోద్ధూళన భస్మధారణము రూపముగను, గోపీచందన ధారణముగను, తిరుమణి కాపుగను, గంధ విలేపనముగను పరిణమించి మతసూచకములైనవి. పచ్చ పొడుచుకొనుటయు ఈ గణములో చేరినదియే. గైరికాది ధాతువులగూడ వాడుచుండిరి. సీతాదేవి చెక్కిడిలపై శ్రీరాముడు మణిశిలచుక్క బెట్టినట్లు వాల్మీకి రామాయణమున గలదు.

మనశ్శిలాయా స్తిలకో గండపార్శ్వే నివేశితః॥ (సుందరకాండ. 40 - 5.)

ఈ మహానాగరకయుగమున చిత్రలేఖనము అను పేర వర్ధిల్లుచుండు కళ కంపుర మట్లాదిగనె యుండవచ్చును. ఎంత గొప్ప చిత్రకారుడైనను ప్రపంచములో లేనట్టి వస్తువును చిత్రించినట్లెచటను అగపడదు. ఏదియో నొక పుష్పమునకో, జంతువునకో, మానవాకృతికో ప్రతిరూపము వ్రాయును. అట్లుగాక ఒక్కొకపుడు నరసింహమూర్తిగనో, గజాననుడుగనో, నాగకన్యగనో సృష్టిలో నుండువానిని రెంటిమూటి కలిపి యొక చిత్రము వ్రాయును. ఇంతకును చిత్రకళకు బీజము అనుకరణము. ఒకదాని పోలికను రంగులతోగాని వట్టి గీతలతోగాని చూపుట—

ప్రథమదశలో చిత్రలేఖకులు తమ ప్రభువులపాలనయో, లేక యుద్ధముచేయుటయో చిత్రించుచుండిరి. అవి ప్రాచీన చిత్రలేఖనములు ప్రాయికముగ నిట్లుగనె యున్నట్లు చరిత్రకారులు తెలియబరచియున్నారు. కొంతకాలము గడచినకొలదియు వారివారి మతసంబంధములగు గాథలును దేవతాలీలలును చిత్రింపబడుచు వచ్చినవి. మన భరతఖండమున హైదరాబాదు సీమలోని అజంతా గుహలలోని చిత్రవర్ణ లేఖనములు ప్రాయిక గౌతమబుద్ధుని చరిత్రాంకములుగ నున్నవి. ఈ చిత్రములు వ్రాయబడి దాదాపు రెండు వేలయేండ్లయినట్లున్నది. అందులో మాసిపోయినవియు, ఎండకు గాలికి వానకు చెడిపోయినవియు గాక నిలిచియుండునవి ఇపుడు ఈ దినము వ్రాసినట్లున్నవని గ్రంథములో గలదు. ఇవి మరికొన్ని గుహలయందును గలవు. కుంభకోణములోని శ్రీరాములవారి దేవాలయపు గోడలమీద రామాయణ కథ యంతయు చిత్రింపబడియున్నది. ఈ విధమున రాజపోషణవలనను, మతాభిమానమువలనను ఈ చిత్రకళ మన దేశమున గొప్ప వికాసమును అభివృద్ధిని పొందినది. వేదముల కాలములో ఈ కళ యెట్టి స్థితిలో యుండినదో చక్కగ తెలియరాదు. చిత్రశబ్దమును, చిత్రకర్మశబ్దమును వేదమున నగపడుచున్నవి. పౌరాణికేతిహాసముల కాలమున నీ కళ పెంపొందియుండినది. హనుమంతుడు రావణుని వేశనమును వర్ణించుటయు చిత్రశాలనుగూడ జూచినట్లు సుందరకాండ ఆరవ సర్గయందున్నది. 'లతాగృహాణి రమ్యాణి చిత్రశాలా గృహాణిచ.' భాగవతాదులయందు ఉషాపరిణయ కథయందు చిత్రరేఖయొక్క చిత్రలేఖన ప్రశంస నెరుగనివారుండరు.

ఇక కావ్యనాటకాదులలో చిత్రలేఖన ప్రస్తావములు లెక్కకు మిక్కిలిగ నున్నవి. రఘువంశమున పదియారవ సర్గయందు 16_17 శ్లోకములందు చిత్రలేఖన ప్రసక్తి కలిగియున్నది. ఉత్తరమేఘము 44 వ శ్లోకమునను గలదు. అశ్వఘోషిణి యుద్ధచరితమునందును యున్నది.

నాటకముల విషయమున భాసుని ప్రతిమా నాటకమందును (ఇమాం దశరథస్యత్వాం ప్రతిమాం కింన పృచ్ఛసి) కాళిదాసు శాకుంతలమున నారవ యంకమునను ఉత్తర రామచరిత్ర ప్రథమాంకమునను—

ఆర్య అర్జునేన చిత్రకారేణ అస్మదుపదిష్టం ఆర్యస్యచరితం అస్యాం వీథ్యాం విలిఖితం

రత్నావళి మాళవికలందును - నాగానందమునందును ఇత్యాద్యనేకముల చిత్రరచనా ప్రస్తావము కలదు. సంస్కృత కావ్యాదుల ననుకరించి తెలుగు కావ్యాములందును చిత్రలేఖన ప్రశంస చూడబడుచున్నది.

ఐరోపాఖండముననుండి రంగులు రాకమునుపు ఇచటి చిత్రకారులు నానావర్ణముల నెట్లు చేసికొనుచుండిరో చిత్రముగ నున్నది. తెలుపురంగు ఒక జాతి సీసమునుండియు, నలుపు కరిదూపము కాటుకనుండియు, ఎరుపు కావిరాయి, ఇంగిలీకము లోనగువానినుండియు, నీలము నీలిమందువలనను, ఆకుపచ్చ కొన్నిచెట్ల ఆకుపసరులనుండియు, గౌరవర్ణము పసపు, హరిదాళము లోనగువానివలనను చేసికొనుచుండినట్లు యొక ఇంగ్లీషు గ్రంథమన్నది. ఇట్టివి కొన్ని రంగులు మూలవస్తువులుగ యేర్పరచుకొని వాని సమ్మేళమున ఇతర రంగుల ఛాయలు (tints) చేసుకొనుచుండిరి. కరకకాయ, అన్నభేది, పటిక ఇవియు విశేషముగ వాడబడుచుండినవి. లక్కయు ముఖ్యముగ నుండినది.

ప్రాతకాలపువారి కుంచెలు (brushes) బహుశః పీచుతో చేయబడినట్లు కనుపడుచున్నవి. ఉడుతబొచ్చు, ఒంటె వెంట్రుకలు ఇత్యాదులతో చేయబడిన కుంచెలుండినట్లు లేదు. 'కుంచె' అను మాట 'కూర్చ' అను సంస్కృత శబ్దభవము. దర్భపోచలతో చేయబడు కూర్చలను బ్రాహ్మణులు హవ్యకవ్యములలో చూచుచుందురు. కుంచెను తూలిక యనుటయు కలదు. దీనికే 'వాగలి' యను నొక మాట గలదు. వాగలి యనగా (వ్రాయు+కఱ్ఱ) అని సీతారామాచార్యులవారు శబ్దరత్నాకరమున నిష్పత్తి వ్రాసియున్నారు.

ప్రాయికముగ చిత్రములు ఇండ్ల గోడలమీద వ్రాయబడుచుండినవి. వస్త్రములమీదను, కొయ్య పలకలమీదను, అద్దములమీదను, మృణ్మయపాత్రలమీదనుకూడ చిత్రింపబడుచుండినవి. చిత్రప్రయోగమునకు ముందు గోడను చక్కజేయవలసిన విధము భరతనాట్యశాస్త్రమున రెండవ అధ్యాయమున 84_86 శ్లోకములం దిట్లున్నది—

భిత్తిష్వపిచలిప్తాసు పరిమృష్టాసు సర్వతః। సమాసుజాతశోభాసు చిత్రకర్మ ప్రవర్తయేత్ ॥

చిత్రకర్మణి చాలేఖ్యాః పురుషా స్త్రీ జనా స్తథా। లతాబంధాశ్చకర్తవ్యాశ్చరితం చాత్మ భోగజం॥

సృష్టిలో యేవస్తువెట్లుండునో చిత్రమునకూడ నట్లే యుండవలెనను గొప్ప నియమము గలదు. విష్ణు ధర్మమున నిటులున్నది—

జంగమావా స్థావరావా యేసన్తి భువనత్రయే। తత్తత్స్వభావత స్తేషాం కరణంచిత్రముచ్యతే॥

చీమబొమ్మ వ్రాయువాడు దానికి నాలుగుకాళ్లు, సన్నని నడుము చూపవలయునే గాని ఇందుకు విరుద్ధముగ నుండగూడదని చిత్రకారుల సంప్రదాయమైయున్నది. చిత్రలేఖనము ప్రకృతిని మరిపించునట్లును ఇది యే ప్రకృతిలోని వస్తువని భ్రమించునట్లు చేయగలిగియుండవలెను. ఇట్టి యాశయమును ముందిడుకొనియె మాఘుడు (3_50) ఈ క్రింది శ్లోకమును వ్రాసియుండును.

చిత్రింసయా కృత్రిమ పత్రపఙ్క్తేః కపోతపాళీషు నికేతనానాం।

మార్జారమప్యాయదనిశ్చలాంగం యస్యాంజనః కృత్రిమమేవమేనె॥

చిత్రలేఖనమున రచింపబడిన కృత్రిమ కపోతములను నిజమయిన పావురములని పిల్లి భ్రమించి మ్రింగజూచుచున్నట్టు భ్రమ నాధారపరచుకొని ఈ మహాకవి ఆ పిల్లినికూడ కృత్రిమ పిల్లియా యని ప్రతి యోగి భావము కల్పించినాడు. ఇట్టి కథ యొక్కటి గ్రీకుదేశపు గాథలలో నున్నది.

ఇద్దరు చిత్రకారులుండిరి_వీరిద్దరిలో నిపుణవరుడెవడని పోటీకలుగగ ప్రాశ్నికులు (Umpires) వీరిని చెరియొక చిత్తరువు వ్రాయమనగ మొదటి వాడు ఒక గోడమీద ద్రాక్షతీగెలను ద్రాక్షపండ్ల గుత్తులను చిత్రించెను. ఆ చిత్రపు గుత్తులను నిజముగా ద్రాక్ష పండ్లనుకొని అనేకపిట్టలు వచ్చి వాని ముక్కులతో ముట్టి నిరాశచెంది పోవుచుండినవి. ఈ చిత్తరువు మెచ్చతగినదిగ నున్నదని ప్రాశ్నికులుజెప్పి - రెండవవాని బిలిచి అతడువ్రాసిన చిత్తరువు జూపమనిరి. అతడూరక నొకగోడమీద నొకపరదా పట్టు స్వరూపము చిత్రించెను. చూడవచ్చినవారు నీ చిత్తరువు ఎచటనున్నదని యడుగగ విశేషమేమియు చెప్పకమిూరే చూచుకొనుడనుచుండెను. వచ్చిన పెద్దలందరు ఒకరివెనుకనొకరు ఆతడుచిత్రించినపరదా నిజమగుపరదాయని దానివెనుక ఈతని చిత్రలేఖనమున్నదను భ్రమతో ఆచిత్తర్వు పరదాను ఇటునటు త్రోయ మొదలిడిరి అంతట అచటి పెద్దలు ఈ పరదా చిత్రకారుడే నిపుణతర చిత్రకారుడని తీరుమానించిరి. చిత్తర్వు ప్రవృతిని మరిపించుట యనగ నిట్లుండ వలయుగదా. ఇట్లు భావమునె కాబోలును కాళిదాసు మనసుననుంచికొని శకుంతల మన "చిత్రేనివేశ్య పరికల్పిత సత్త్వయోగా" యని శకుంతలను వర్ణింపజేసియున్నాడు. సజీవమగు స్త్రీరత్నమునే ధాతసృష్టించి ఆవెనుక దానియందెద్దియేని లోపముకనుగొని అట్లు లోపమనుసరింప వలను లేక పశ్చాత్తప్తుడు కాకుండుటకై తొలుదొల్త తన యిష్టముచొప్పున సర్వాంగ సౌష్టవముగల చిత్రప్రతిమను చేసి తృప్తివడి దానియందు సవరింపవలసిన దేమియులేదని నిర్ణయించుకొని అటుతర్వాత దానియందు సత్త్వ యోగము జేసినట్లు కవి అద్భుతకల్పన చేసియున్నాడు, ఇట్లు పరిపూర్ణతనె మనసునందుంచుకొని షేక్సుపియరు విషయాంతర ప్రసంగమున 'Hold mirror up to nature' అని యుపదేశించి యున్నాడు - కళా కౌశల మెట్లుండవలయుననగ - ప్రకృతికి అద్దము చూపినట్లుండవలయునని భావము.

(సశేషము)

★ స్త్రీ మూర్తి ★

శ్రీ అనుముల వేంకటశేషకవి

అఖిలకావ్య పురాణేతిహాసములకు మూలకందమవై, జగమ్ముల సృజించి
వృద్ధి నొనరించి, హితముఁగావింతు వీవె!— 'స్త్రీ' యనెడిపేరి సంకల్ప సిద్ధురాల!

ఎల్లలోకములకుఁ బ్రాణమేప్సితార్థ ఫలములను బంచు పుణ్యదేవత వటంచు;
నీసహస్రనామావళి నియతిఁబూని జపమొనర్చెడి నీరేడు జగము; లబల!

స్వర్గమును నీవులేక శ్మశానవాటి; నీకుఁగాని రసంబులు నీరసములు;—
పలుకు మింతింత మహిమ లేపగిది నీకుఁ బట్టువడినవొ? పురుషైక భాగ్యరాశి!

తేనియఁదీపి కమ్మవిరి తెమ్మెర లూర్పుల గుప్పి; లోక క
ళ్యాణకరంబులైన కమలాప్తుని కాంతుల మంచి ముత్తెపుం

సోనలఁ గప్పి మాటలను, జూపులఁ, జేష్టలలో సుధాంబువుల్
చానలఁ గ్రుమ్మరించెదవు, ప్రాణి శుభస్కర కామదాత్రివై.

తల్లివా? పిల్లవో? సతివా? దాదివా? సోదరివో? ప్రపంచమం
దిల్లని యున్నచోట నెది యేనొక రూపముదాల్చి, నీవు వ

ర్ధిల్లనిదేది? నీ కొఱకు దేవ, మనుష్య, పిశాచ, దైత్యరా
ట్టల్లజు లేనియుం దలలఁ దాల్పని ధర్మములున్నె? కామినీ!

ఎన్ని కలంబు లింతవర కెన్ని ప్రబంధములెల్ల దీక్షగా
నిన్ను గుఱించి కుంచియలు నీపయి వన్నెల వెన్నదిద్దె? నీ

సన్నుతి నెన్ని కీర్తనలు చక్కనివయ్యెఁ బ్రపంచ భావముల్?
బున్నియమన్న నీదెకద? పూరుష జీవిత జీవదాయినీ!

కోయిల నీదు కంఠమునఁ గూర్చొని కూయునొ? రత్ననాళముల్
తీయని వీణతంత్రులయి తిన్నగ మ్రోగునొ? యెల్లలోకపుం

సోయగమిట్టె నీతనువుఁ జొచ్చి చిగుర్చునొ? నీప్రశస్తి కిం
కే యది కారణంబొ? వచియింపుము! ప్రేమరసాధిదేవతా!

అబలవే! కావు సబలవీ వాత్మశక్తి రూపిణివియు, సత్యాగ్రహోద్దీపనమున
మహిషరూప పశుత్వంబు మ్రందఁజేయు త్రిపురసుందరివయ్యును, స్త్రీవి; దేవి!—

గర్భిణులకు మాదీఫలరసాయనము, గర్భరక్షక

KESARI'S

MADIPHALA RASAYANAM

(BILE REMOVER)

This valuable syrup of Citrus Medica or Matulunga checks vomiting and constipation, creates a good appetite and is a sure remedy for the morning sickness of pregnant women.

Directions for use:—1 to 2 teaspoonful to be taken twice or thrice a day. *Free diet.*

Price As. 12.

KESARI KUTEERAM, MADRAS

మాదీఫల రసాయనము

ఇది ముదిరిన మాదీఫలముల రసముతో తయారు చేయబడినది. గర్భిణి స్త్రీలకు కలుగు వాంతులకు (వేవిళ్లు) యిది సంజీవివంటిది. తల తిరుగుడు, వాంతులు, అరోచకము, అజీర్ణము, మలబద్ధకము, నిద్రలేమి మొదలగు జబ్బులకు వజ్రాయుధము. జ్వరవేగమును తగ్గించుటలో యీ రసాయనము పేరుపొందినది.

ఇది తేనెవలెయుండి నోటికి రుచిగను యింపుగను నుండును.

3 ఔన్సుల బుడ్డి వెల 0 12 0

గర్భరక్షక

ఈ 'గర్భరక్షక' సేవించిన గర్భస్రావము, అకాలప్రసవము, అప్పుడప్పుడు కడుపునొప్పి, నడుమునొప్పి, రక్తహీనము, శరీరమందు నీరు చేరుట, బలహీనము, అలసట, ఆయాసము, అజీర్తి, మలబద్ధకము మొదలగు జబ్బులు రాకుండుటయే గాక ప్రసవించువరకును శరీరము మంచి ఆరోగ్యస్థితి గలిగియుండి నిండుమాసములు గర్భముధరించి సుఖముగ ప్రసవించెదరు.

బుడ్డి 1-కి రు. 2 0 0

KESARI'S

GARBHARAKSHAKA

(FOR EASY DELIVERY)

This Sovereign remedy "Garbharakshaka" if administered to pregnant ladies till delivery, renders them proof against all complaints, ensures the healthy development of the foetus and easy delivery and shuts the door against all the ailments after child birth.

Directions for use:— One teaspoonful to be taken every morning, noon and evening with milk or water. The syrup possesses good taste and fine flavour. *Free diet*

Price Rs. 2.

KESARI KUTEERAM, MADRAS

KESARI'S

SREEPHALADI PANAKAM

This compound Syrup of Sriphala, Dadima and Mangusthan, etc., cures Chronic Dysentery, Diarrhoea, Apthæ, Intestinal Ulceration and Low Fever, etc.

Directions for use:—2 to 4 teaspoonsful every 4 hours with equal quantity of water. *Diet*:—Light liquid food is recommended.

Price Re. 1.

KESARI KUTEERAM, MADRAS

శ్రీఫలాదిపానకం

మేహజబ్బుల వల్లను యితర కారణములవల్లను గర్భమందును నోటిలోను పుండ్లై వాంతులు, నీళ్లవిరేచనములు, నిక్కాక కలిగియుందురు. చిరకాల గర్భవ్రణమువల్ల చీముగాని, నెత్తురులోకలిసిన చీముగాని మలమునకలిసి పడుచుండును. వీర్లకు ఈ శ్రీఫలాదిపానకము అద్భుతముగ పనిచేయును.

మరియు గ్రహణి జబ్బులు, అతిసారము, కడుపు నొప్పితోకూడిన జిగటవిరేచనములు_వీటిని యీ ఔషధము నమ్మకముగ కుదుర్చును.

3 ఔన్సుల బుడ్డి 1 కి రు. 1 0 0

కేసరికుటీరం - మద్రాసు

తెలుగుజిల్లాలకు ఏజంట్లు:

శ్రీ శీతారాం జనరల్ స్టోర్సు, బెజవాడ.

మనోహరత్వము— స్త్రీ యొక్క మొదటి వలపు

సౌందర్యమునకు ఇవ్వబడునటువంటి శ్లాఘనను ప్రతి స్త్రీ కోరును. నిజముగా అందమునకు మనోహరమైన చర్మము అత్యావశ్యకమనునది చాలజనులు మరచిపోవుదురు. శుభ్రముగా, శ్రేష్టమై మృదువుగా ఉన్న చర్మము స్నేహితులయొక్కయు, బంధువుల యొక్క శ్లాఘనను పొందును.

చర్మమువాడకుండ లేతగా నుంచుకొనుటకు ప్రతి యొక్క స్త్రీ జాగ్రత్తపడ నవసరము. వట్టి కడుగుటలో రంధ్రములలో నుండు మురికిని తొలగించ చాలదు. పాండ్స్ క్రీమ్, రంధ్రములలో దూరి, దాని నుండు ఆ అరోజు మురికిని, నూనెవిశేషమునుతీసి శుభ్రముగా నుంచును.

పాండ్స్ క్రీమ్ సీసాను కొనుడు. మీవేళ్ల చివరలతో క్రీమును, మీ చర్మముమీద రాయుడు. మృదువైన గుడ్డతో దులుపుడు. మరియు కొద్దిగా వేరే క్రీమును దేలికగాపూసి రాత్రంతయు ఆ నాణ్యమైన పొరను ఉంచుడు. ఈ మోస్తరుగా ఒక పదిహేనురోజులు రాత్రులయందు వాడుడు. అప్పుడు మీ చర్మము మృదువుగా లేతగాఅవుతున్నట్లుమీకు తెలియగలదు.

పగలు గాలి,దుమ్ము నుండి రక్షించుటలో శ్రేష్ఠమైనది పాండ్స్ వ్యానిషింగ్ క్రీమ్.

పాండ్స్ క్రీములు అన్ని గొప్ప స్టోర్సులలో దొరకును. లేక పాండ్స్ పి||బ|| బాక్సు 144 బొంబాయి వారికి వ్రాయుడు.



పాండ్స్ క్రీమ్

దమయంతి కాలంలో విడాకులు ఉండీ వుండాలి

(పాతగాథల్లో కొత్తవ్యూహాలు)

★ శ్రీ ఆచంట సూర్యనారాయణమూర్తి

"దమయంతిని వివాహమాడిన నలునియెడ నసూయజెంది కలిపురుషుడు నలుని బాధింప సమకట్టి పుష్కర మహారాజుతోడి కపట ద్యూతమున నలు నోడించి పురమునుండి వెడల నడిపించెను. నలుడు అరణ్యములయందు భార్యతో తిరిగితిరిగి యామెను పరిత్యజించి కర్కోటకునిచే గఱవబడి తన రూపమును బోగొట్టుకొని బాహుకుడను పేరుతో ఋతుపర్ణ మహారాజునింట వంటలవాడుగా కుదిరెను. దమయంతి యీ సమాచారమును గొంతవఱకు పర్ణాదుడను విప్రునివలన నెరింగి తనకు ద్వితీయ స్వయంవరమనుసాకు కల్పించి ఋతుపర్ణుతో గలసి నలుడు విదర్భకు వచ్చునట్లు జేసెను. తరువాత కేశినియను చెలికత్తెవలన నలుని చాకం బిమ్మగా నెరింగి దమయంతి యతనిని అంతఃపురమునకు రావించెను. ఒకరినొకరు గుర్తించుకొనుచు, నెత్తిపొడుచుకొనుచు, తుదకు శంకించుకొను సమయమున నఖిల భూతాంతర్గతుండైన వాయు భట్టారకుండు దమయంతి పాతివ్రత్య విషయమై గట్టిసాక్ష్యమునివ్వ నలదమయంతులు కలుసుకొనిరి. అంత పుష్పవృష్టి కురిసినది. సురదుంధిబినాదములు మ్రోగినవి. సకల భువనములు సంతసించినవి."

—ఇది పురాణాల్లో మనం చదివేకథ. ఇంతకంటే వ్రాయడం చర్విత చర్వణం. కథ చెప్పడం మన ప్రస్తుత కర్తవ్యంకాదు. ఈ కథవల్ల ఒకగొప్ప సాంఘిక ఆచారం మనదేశంలో వెనకటి రోజుల్లో ఉండేదని తెలుతోంది. స్వయంవరాచారంవలె యిదికూడా కారణాంతరాలవల్ల అడుగంటి ఉంటుంది. సురవరుల్ని మెచ్చక తన్ని వివాహమాడిన ప్రేమ స్వరూపాన్ని, నిర్దయుడై-కాదు-అప్రయోజకుడై అరణ్య మధ్యమంలో ఒంటిరిగా నిద్రపోతూన్న సమయంలో అర్ధరాత్రివేళ విడిచిపెట్టి పారిపోయిన సాటిలేనిమేటి ప్రాణేశ్వరుణ్ణి విదర్భకు రావించుకోడానికి ఉపాయంగానే దమయంతి తన ద్వితీయ స్వయంవరాన్ని ప్రకటించిం దనుకుందాం. దమయంతి పేరూఊరూలేని ఆడదికాదు కదా! విదర్భ దేశాధీశుడైన భీమసేన మహారాజు కూతురు. నిషిధాధిపతియైన నలునిభార్య. ఆమె ప్రథమ స్వయంవరానికి దేవతలు దగ్గరనుంచి వచ్చారు. సాక్షాత్తు భారతీదేవి స్వయంగావచ్చి స్వయంవరానికి వచ్చిన రారాజుల్ని గురించి దమయంతితో చెప్పింది. అలాటి దమయంతి, ఆకాలంలో స్త్రీకిగూడ ద్వితీయవివాహం ఆచారంలేనిదే, తన ద్వితీయస్వయంవరాన్ని చాటింప సాహసించదు; తండ్రివప్పుకోడు. పోనీ స్వలాభంచేత తండ్రీ, కూతురు అబద్ధం సాటింపు వేయించారుబో! నాలుగుపాదాలా ధర్మాన్ని పాటిస్తూ తమతమ రాజ్యాలలో న్యాయనిర్ణయం చేస్తూ రారాజులు అలాటి అసందర్భపు మాటవిని సహించి ఊరుకుంటారా? పై పెచ్చు దమయంతిని వివాహమాడ్డానికి మేమమ్మా తగుదుంఅంటూ పెళ్లికొడుకులుగా తయారవుతారా? వట్టిమాట! ఎప్పటికీ అలాజరిగి ఉండదు. తప్పకుండా ఆకాలంలో విడాకుల ఆచారం ఉండి ఉండాలి. దమయంతి విసిగివేసారి తిరిగి పెళ్లి చేసుకుందామని ప్రయత్నాలు చేస్తూన్న సమయంలో నలుడు తిరిగివచ్చి బ్రతిమాలుకునేనా ఉండాలి. లేదా, పాపం నిజంగా దమయంతి తాను వరించిన నలుణ్ణి తిరిగి తన దేశానికి రప్పించుకునే ఉపాయంగా ద్వితీయస్వయంవరం సాటించినా, అలాటి ఆచారం ఆరోజుల్లో ఉండి తీరాలి. ఆచారంలేనిదే దమయంతి ద్వితీయ స్వయంవరాన్ని ప్రకటించలేదు. బాగా ఆలోచిస్తే యీ రహస్యం మనకు తెలియకమానదు.

ఆంధ్రజాతిలో —

ఆత్మగౌరవం అడుగంటి పోతూవుంది
జాత్యభిమానం జీర్ణమై పోతూవుంది
స్వతంత్రశక్తి సడలిపోతూవుంది
అందుచేత 'మనది' అంటే మనకే గౌరవం
లేనప్పుడు 'మనము' అంటే ఇతరులకు గౌరవమా?

— శ్రీమతి —
బసవరాజు రాజ్యలక్ష్మమ్మ

★

సోదరీ!

నీ వుత్తరం అందినది. నేను నీకు చాలా బాకీపడ్డమాట నిజమే! మాట చెల్లించుకునే రోజులాయివి? రెండు సంవత్సరాలనుంచీ హిందీ వాతావరణంలోపడి తెలుగుబాషకి రెండువందల తొంబైమైళ్ల దూరంలో వున్నప్పటికినీ మనభాష మన సాంప్రదాయం మన ఆచారం మరచిపోలేదులే—భయపడకు.

మొన్న ఈ వూరిలో ఒక గానసభ జరిగింది కర్ణాటక సంగీతం అద్భుతంగాపాడేడు. ఈ రోజులలో కవులను, గాయకులను, పండితులను ఆదరించేవా రెవరున్నారు? ఆ గానసభకి ప్రేక్షకులు యెంతమంది వచ్చారనుకున్నావు? సరీగా లెఖ్కపెడితే పాతికమందికూడా వుండరు: అప్పుడు నాకు చాలా ఆశ్చర్యము విషాదముకూడా కలిగింది, అదే ఏ సినిమాపాటలో, సావిత్రి, చింతామణి రికార్డులో అయితే వేలకువేలు జనం మూగేవాళ్లే. ప్రతి సినిమాహాలుదగ్గరా సాయంకాలం అయిదున్నర గంటలయ్యేటప్పటికి జనం గుంపులు గుంపులుగా వుంటారే? సినిమాపాటల రికార్డు వినటానికి. కర్ణాటక సంగీతమంటే వీరి కంత యేవగింపు యెందుకనో?

మనలో సరియైన అభిరుచి నానాటికి క్షీణిస్తోంది. జనసామాన్యంలో యేది యెక్కువ ప్రచారంలో వుంటుందో దానియందే అభిరుచిగలుగుతుంది. యిప్పుడు సినిమాపాటలకున్న విలువ యే రామకృష్ణయ్యగారి పాటకో, ద్వారం వెంకటస్వామినాయుడుగారి ఫిడేలుకో, వీణ శేషన్నగారి వీణకో వున్నదా? యిప్పుడు యెక్కడచూచినా సినిమాపాటల రికార్డుతప్ప ఒక్క త్యాగరాజుకృతిగల రికార్టు వినపడుతోందా?

దక్షిణదేశంలో యెంతమంది విద్వాంసులులేరు? యెన్ని గొప్పవాద్యాలులేవు? వీణా, జలతరంగం, వేణూ, ఫిడేలు, సారంగ, సితారు, యిలాంటివెన్నో మన హృదయతంత్రులను మోగించి మనలో చైతన్యవికాసం గలిగించి మనలను హర్షాతిశయంలో పరవశులనుగాజేసి క్షణకాలం మన్ని ఈశ్వరసాన్నిధ్యంలోకి తీసుకునివెళ్లే మహా ఉత్కృష్టమైన వాద్యాలు, గాయకులు యంతమందిలేరు? కానీ? మన శాస్త్రాలుగాని మన గానముగాని ఈ ఆధునిక యుగానికి పనికిరావుగాబోలు!

ఒక్కొక్క రాగమహిమను గనక మనం తెలుసుకున్నట్టయితే ఆశ్చర్యపడతాము. అక్బర్ చక్రవర్తి దర్బారులో గాయకుడైన తాన్‌సేను రాగమహిమనుఅక్బర్ చక్రవర్తికి చూపించటంకోసం నీళ్లల్లోదిగి దీపక్ రాగము ఆలాపిస్తే నీళ్లు వేడెక్కి క్రమేణా వుడికి పొంగులొచ్చినయిట?

అటువంటి పవిత్రమైన మన సంగీతాన్ని వుత్తర హిందూస్థానపు సంగీతానికి మల్లే ఫారసీకులు, ముసల్‌మానుల సంగీతాలవల్ల కలుషితం కాకుండా శతాబ్దాలనుంచీ కాపాడుకుంటూ వచ్చారు మన దాక్షిణాత్యులు. అటువంటి దానిని పాశ్చాత్యులు కొనియాడుతున్నారు? గాని మనం దాని స్వారస్యం గ్రహించకుండా వున్నాము. మన సంగతి యేదైనా అంతే. పాశ్చాత్యుల ముద్రపడేవరకూ మనం మన గొప్పతనం

తెలుసుకోలేము. దామెర్ల రామణ్ని సీమలో మెచ్చారుగాని మనమధ్యనేవున్న చిత్రకారుణ్ని కనుక్కోగలిగేమా? మన అజంతాచిత్రాల్ని దుమ్ము ధూళిదులిపి వాటి ఫోటోగ్రాఫులు తీసుకెళ్లి లండన్ ప్రదర్శనశాలలో ప్రదర్శించేటంతవరకు అసలు అవి ఒకటివున్నవని మనకు తెలుసునా?

మన టాగూరుగారిని, మన బోసుగారిని, రాధాకృష్ణయ్యగారిని తెల్లవాళ్లు పైకి తీసుకొచ్చి చూపేటంతవరకు మనకు తెలుసునా?

మాక్సుముల్లర్ జర్మనీనుంచి వచ్చి చచ్చిచెడి సంస్కృతం నేర్చుకుని మన వేదాలను తీసుకెళ్లి జర్మనులు అచ్చుచేయించి ప్రకటించేటంతవరకూ వాటి గొప్పతనం గ్రహించగలిగామా? యేదైనా అంతే—మన విలువమనం తెలుసుకోలేము?

మన పరిశ్రమలవిషయంలోకూడా అంతే. మనపత్తి యింగ్లాండుదర్శనం చేసుకుని యే లాంకషైరులోనో మెరుగుపెట్టించుకుని బట్టరూపంతో తైయారయి యెక్కువ ధరవేసి వాళ్ల లేబిలుతో వస్తేగాని కొంటామా? అల్లాగే యిప్పుడు సినిమాపాటలకున్న విలువ మన కర్ణాటక సంగీతానికిలేదు? ఏది యెక్కువ ప్రచారంలో వుంటుందో దానియందే ఆసక్తి, అభిరుచీ ప్రబలుతుంది. నలుగురూ సినిమాపాటలు బాగున్నయ్యంటే మనమూ బాగున్నయ్యంటాము. అసలు రసం గ్రహించలేము.

నిజంగా అరవలలోవున్న ఐకమత్యము, దేశాభిమానము మనలో లేదుగదా?

ఆంధ్రులది వట్టిమాటల్లోనే? అరవలు క్రియలో చూపిస్తారు? అరవలు యే దేశంలోవున్నాసరే వాళ్ళకట్టు, వాళ్లభాష, వాళ్లదేశాభిమానం మాత్రం వదలరు? యెంత దూరదేశంలోనైనా సరే నలుగురు అరవలు చేరారంటే అక్కడ ఒక సౌత్ యిండియన్ అసోసియేషన్ దాని తరఫున ఒక గ్రంథాలయం, ఒక సంగీత సమాజం యేర్పడ్డాయన్నమాటే? ఈవిధంగా వారి జాతిగౌరవాన్ని నిలబెట్టుకుంటారు.

యికమనమో మన విలువ మనకు తెలియదు. మనలోమనకి ఐకమత్యంలేదు? మనవిలవే మనం తెలుసుకుంటే ఈనాడు కవులకు, గాయకులకు, పండితులకు స్థానంలేకుండాపోతుందా?

బొంబాయి, నాగపూర్, మైసూర్, బర్మా, మలయా, జావా, దక్షిణాఫ్రికా మొదలైన దేశాలకు వలసపోయిన మన ఆంధ్రులకు జన్మభూమియందు ఎంతప్రేమా, అభిమానంవున్నదో చూడు? మనభాషే మరచిపోయి మన ఆచారాలు మన సాంప్రదాయాలు పూర్తిగా వదిలేసి మన సంబంధాలే మానుకుని అక్కడే స్థిరనివాసం యేర్పరుచుకుని వేరొకజాతిగా తయారైనారు. పేరుకుమాత్రం ఆంధ్రులమని చెప్పుకుంటున్నారు.

దక్షిణాత్యులు నిజంగా కళారాధకులు. జాతి మతాభిమానులు. నిజం చెప్పాలిసివస్తే సంగీతవిద్వాంసులను అరవవారు ఆదరించినట్లు మనం ఆదరించటంలేదు? వారిలో సంగీతానికున్న ఆదరణా అభిరుచి మనలోలేదు? వారిలో ఆడవారుకూడా నూటికి యెనభైమంది సంగీతం చక్కగా పాడగలిగినవారే? సోదరీ! అరవవారిని తెగపొగడుతున్నానని నీకు కోపంరావచ్చును? కానీ నిజంగా ఆంధ్రదేశంలో పేరెన్నికగన్న గాయకులున్నారుగదా? వారి నాదరించేటందుకు మన తెలుగుగడ్డలో ఎక్కడైనా ఒక్క సంగీతసమాజంగాని ఒక్కసంస్థగాని వున్నదా?

మా బెజవాడలో చూడు—తమిళులంతాజేరి ఒక సంగీతసమాజం స్థాపించి దానికి చాలామంది సభ్యులను ఆంధ్రులనేచేర్పించి అధ్యక్ష, కార్యదర్శి పదవులన్నీ అరవవారేతీసుకుని వారంవారంపాటకచ్చేరీలుగాని, హరికథలుగాని, భరతనాట్యాలుగాని యేర్పాటుజేసి దక్షిణదేశంనుండి అనేకమంది విద్వాంసులను ఆహ్వానించి సత్కరిస్తూవుంటారు. ఒకసారైనా తెలుగువారి కవకాశంయివ్వరు. మన ఆంధ్రులుమాత్రం ప్రతిపాటకచ్చేరీలకువెళ్లి అరవవారితోపాటు తాముగూడా హర్షధ్వనులు చేసే ప్రతి తెలుగువారికి తెలుసుకానీ ఒక్కరైనా ఈ విషయం అడిగినవారేరీ? మన తెలుగువారి జాత్యభిమానం యిట్లావున్నది. యికశలవు. యిప్పటికే నీకు విసుకుబుట్టవచ్చును యిదంతా చదివేటప్పటికి. మళ్ళీరాస్తాను. యిఖబాకీ పడనులే.



ఇప్పుడు నీ యొక్క సొగసైన వస్తువులనన్నిటిని నీకిష్టము వచ్చినపుడెల్ల పలుమారు లక్సుతో జాగ్రతగ నుంచుకొన వచ్చును. ఎందుకనిన నీ పైకమునకు ఈ పెద్ద సైజు లక్సు ఎక్కువ సోపును ఇచ్చుచున్నది. గట్టి రంగుగల పట్టు వస్త్రములను, కంబళము మొదలైన ఉన్ని వస్త్రములను చాల జాగ్రత్తగ లక్సు ఉతుకును. చల్లని నీటిలో లక్సు నురుగును ధారాళముగ నిచ్చును. నీ మలినమైనట్టి సూక్ష్మమైన వస్త్రముల లక్సు నురుగులో జాగ్రత్తగ పులిమిన, మలినమును చెమటయు పూర్తిగ తొలగిపోవును. ఎట్టి చెరుపును కలుగనీయక బాగుగ శుభ్రపరచును. చన్నీటిలో చెరుపులేక దేనిని నీవు తడపవచ్చునో వాని నన్నిటిని లక్సులో ఎట్టి హానిలేక ఉతక వచ్చును!

క్రొత్త పెద్ద సైజు లక్సు

కొనుటచేత నీ పైకమునకు ఎక్కువ సోపును పొందెదవు

చిన్న సైజు, సాధారణ సైజు లక్సు ప్యాకెట్లు కూడను నీ పైకమునకు గొప్ప ఆదాయము నిచ్చును.

LEVER BROTHERS (INDIA) LIMITED L.X. 3-173

'ఆమె నీడ'

శ్రీ శివరాజు వెంకటసుబ్బారావు

> పురుషుడు స్త్రీలో ప్రేమించేది, ఆత్మ హృదయం, ప్రగ్న. కాదు. అతను లక్ష్యంచేసేది శరీరాన్నే. శరీరం చక్కందైతే, నీచైనా సరే అతను తృప్తిపడతాడు. శరీరంలేని ఆత్మల్ని అతడు తన నిరాదరణ, కాఠిన్యాలకి బలిగా కోరతాడు నాగరిక ప్రపంచంలో.
>
> —'బుచ్చిబాబు'

హరీంద్రనాథ్ ఛటోపాధ్యాయ జీవితనాటకాన్ని తెరవెనక నృత్యం చేసే అస్తిపంజరంకింద పోల్చాడు. ఈ వుపమానంలో ఆయన సూచించదలుచుకున్నది మానవహృదయంలో దాగివున్న అర్థంలేని భ్రాంతి-పిచ్చిని. అస్తిపంజరంయొక్క నీడల నృత్యంకింద పోల్చివుంటే దృశ్యం పూర్తిగా భయానకంగా మారివుండును. యదార్థ్య సంఘటనలు, హృదయ పరివర్తనాన్ని మార్చలేవు. కారణం? అవి యదార్థాలు గనక. ఎవ్వరికీ లభించనీ, ఎవరూ పొందకూడనీ, అగోచరమైనవాటిని ఆశించి వాటి కొరకు, వర్తమానాన్ని, ప్రస్తుత కర్తవ్యాన్ని త్యాగంచేసి, అవసరమైతే మృత్యువునికూడా ఆహ్వానించడంలో మానవహృదయం అమరత గణించుకుందని అనడం. దానికి మనం చేయగలిగిన న్యాయం.

ఆ దినానికి వుద్యోగయత్నాలు ముగించి, శివాలయానికి చేరుకున్నాడు నలినీకాంతం. అతనుచేసే ఉద్యోగయత్నాలు యితరులకోసం-భార్య, పిల్లలు, సంసారం, సంఘం వాటికోసం. అతనికి వుద్యోగం చెయ్యాలన్న కోర్కె లేదు. కాని, భోజనం, పెండ్లి, ఆచారాలు, కర్మలు, వీటిని గుర్తించినట్టే, వుద్యోగాన్నికూడా గుర్తించాడు. ఈ ప్రపంచనాటకంలో నటుడుగా వుండటంకంటె, దాన్నిచూచి ఆనందించడం అతని ఆదర్శం. కాని యీ ఆదర్శాన్ని అమల్లో పెట్టుకోడానికి చేసే యత్నాలుకూడా ఓ నటనే యనిగుర్తించలేకపోయ్యాడు. యితర 'ఆదర్శ' ఆరాధకుల మాదిరిగానే. తనకు యీ జన్మలో వుద్యోగం అవదని అతనికేదో ఓ ఆశ. తీరా ఐనా నిరాకరిస్తాడేమో కూడా. ఆ ఆలయంలో కూర్చుంటే అతని దినాలుగడిచిపోవు? వుద్యోగం యెందుకు? 'ఏమండోయ్, ఏంజేస్తున్నారంటే ఫలానాపని చేస్తున్నానని చెప్పుకోడం కోసమేగా?' కాని యింట్లో భార్యా? భార్య అమాయకురాలు. యితని వేదాంతంలో పడి యితని ఆదర్శాన్ని మెచ్చుకుని సహాయపడుతుంది. కాని అత్త, మామ, తల్లి... వీళ్లమాట? తప్పదు, నిప్పుగుండంలో దూకడం. తప్పవు యీ సంకెళ్లు. మనం చెయ్యకలిగింది యీ సంకెళ్లు శబ్దం చెయ్యకుండా చూడడం మాత్రమే.

రాత్రి తొమ్మిది కావొస్తోంది. ఆలయానికొచ్చిన జనప్రవాహం సన్నగిలింది. ఆలయం చుట్టూవున్న, నున్నటి యెత్తైన తెల్లటి గోడముందు నిలబడి శూన్యంవైపు చూస్తున్నాడు నలినీకాంతం. వెనక అమర్చపడ్డ పెద్దపెద్ద దీపాలు, కాగడాలు, నడిచిపొయ్యే వ్యక్తుల నీడలని గోడమీద పడేటట్లు చేస్తున్నాయి. ఆ నీడలు వికృతమైన భయంకరమైన ఆకారాలుదాల్చి, ఛటోపాధ్యాయ వుపమానంలోని అస్తిపంజరాలాగున నృత్యంచేస్తున్నాయి. మెల్లగా కాగడాలు, వొకటి తర్వాత వొకటి ఆరడం మొదలెట్టాయి. గోడమీది నీడలుకూడా వింత ఆకృతి దాల్చడం మాని నిశ్చలంగా కనపడడం మొదలెట్టాయి. వ్యక్తిని సంస్థ

రాగంలో క్రుంగిపోయిన ఆకాశం ముందుగా నిలబెట్టినట్లుగా వుంది ఆనీడ. అది ప్రక్కకితిరిగి నిలబడివున్న స్త్రీది. చెవికున్న లోలకుకూడా కదలడం మానింది. కాళ్లు, చేతులు, చీరా - యివన్నీ నల్లటి నీడలో కలిసిపొయ్యాయి. ఆ నీడలో ఆకర్షణీయమైన ప్రక్కవైపు ముఖము (Profib) కనిపించింది. ఆ ముక్కు నుదుటి కింద సిగ్గుచేత కాబోలు వొంగి, చివరకు లోకాన్ని యెదుర్కొనేందుకు సిద్ధమైనట్లుగా పైకి తొంగిచూచింది. ఆ పెదవుల వొంకర యెప్పుడో బైటపడపొయ్యే నవ్వుని దాచుకుంది. ఆ చిన్నిగడ్డం వ్యక్తిత్వాన్ని, ఠీవినీ సూచిస్తుంది. నళినీకాంతంలో ఆరాధన జ్యోతి వెలిగింది. ఆ నీడను చూస్తో దినాలు గడపడం -జీవితాన్ని వ్యర్ధంచెయ్యడం కాదు. అది, గుహల -చీకట్లో ప్రాణం నిలపెట్టుకోలేక తనయెదుట నీడగా మారిన అజంతా విగ్రహం. అతని భావాలు శూన్యంలోకి కదలడం ప్రారంభించాయి. నీడకూడా కదలి శూన్యంలోకి అంతర్ధానం కావడం అతను గుర్తించలేదు. ఆ నీడకు కర్త ఐన ఆమెను ఒక్కసారి చూస్తే ఆశాభంగం కాదు కద? అవదు. అది మానవనేత్రాల విమర్శనలకి అతీతం. తిరిగిచూశాడు. ఆ వ్యక్తి లేదు. చుట్టుపక్కల యెక్కడా స్త్రీలే లేరు. శూన్యంలో మెరుస్తున్న కడసారి కాగడా కాస్తా ఆరింది.

౨

ఆ రోజునుండి, నళినీకాంతం మనస్సు 'ఆమె నీడ'లో ఐక్యం అయింది. ఆ నీడనుచూచి భ్రమించడం భ్రాంతని అతనికి తెలుసు. ఈ లోకమే పెద్ద భ్రాంతైనపుడు, సౌందర్యమైన భ్రాంతిని వాంఛించడంలో దోషమేముంది? ఆమె వొక దేవకన్యకవలె తన నీడలో తన సౌందర్యాన్ని అతనిముందు ప్రదర్శించి, మళ్లా నిజరూపాన్ని చూపకుండా మాయమయి అతన్ని భగ్నహృదయునిగా చెయ్యడం విధి. అతనితో చెలగాటం ఆడడంలా తోచింది. అతన్ని నిరుద్యోగునిగా చెయ్యొచ్చు; వ్యాధిగ్రస్థునిగా చెయ్యొచ్చు; దుర్నీతిపరునిగా చెయ్యొచ్చు విధి - కాని అతనెంతో గౌరవించి ప్రేమించుకుంటున్న హృదయాన్ని వెక్కిరించి అతని వుద్రేకాలను పరిహసించడం విధికి తగనిపని. తను, ఆ స్త్రీని యెక్కడున్నాసరే చూచి తీరవలసిందే. మానవ హృదయ ఔన్నత్యాన్ని విధికి ఋజువుపరచడానికి సంకల్పించుకున్నాడు.

అనేక సాయంకాలాలు ఆ దేవాలయం గోడముందే గడిపాడు నళినీకాంతం 'ఆమె నీడ'పై అతని అంతర్నేత్రాలు మూసుకున్నాయి. కోటినీడల భేతాళనృత్యాల మధ్యలో 'ఆమె నీడ'ను పోల్చి చూపకలడన్న ధైర్యం చిక్కింది. ఆమె నీడ గోచరించలేదు. అతని హృదయం తుపాను ముగిసింతర్వాత కొండశిఖరాలమీదనుండి జారిపొయ్యే మేఘాలవలె క్రుంగిపోతోంది. వుద్యోగం లభించినా నిరాకరించే స్థితిలోకి రాబోతున్నాడు. అతని నేత్రాలలోని వెలుగు సన్నగిలడం గుర్తించలేకపోలేదతనిభార్య. అతని నవ్వులో యత్నం వినిపించిందామెకు. ఏదో కళ అతన్నివొదిలి వెళ్లిపోయింది. ఆ అధరాలలో అలసట, అరుచి, దూరం...ఇవన్నీ అతని భార్య తప్ప యింకెవ్వరు గుర్తించగలరు?

'మీరీమధ్య యెందుకండి అల్లా వున్నారు?' అందతని భార్య వాణి. వాణి నీడని ప్రదర్శించి భ్రమింపచేసేటంతటి రూపసి కాదు. ఆమెతో దగ్గర పరిచయం వున్నవాళ్లు చూడకలిగే సౌందర్యం లేకపోలేదు. ఆమె చక్కదనంలో స్ఫుటంగా కనిపించే లక్షణం సిగ్గు, బరువైన కనురెప్పలు పూర్తిగా పైకి వెళ్లలేవు. ఆ దంతాలు పెదవుల వొంకరలోనుండి పూర్తిగా లోకం చూపులో పడవు. ఆమె పలుకులో నిద్రమత్తుచే పాడలేకపొయ్యే కోకిలకంఠం వినిపిస్తుంది.

'నాతో చెప్పకూడదూ? ఉద్యోగం గురించా? ఎందుకు వెధవ ఉద్యోగంకోసం మీకింత బెంగ, మనకేం? మనకున్న పాతికెకరాలు వ్యవసాయం చేసుకుంటూ, గోదావరీ తీరాన్ని పర్ణశాల నిర్మించుకుని, సాయంత్రం పడవలో పాడుకుంటూ, నీళ్లలోపడ్డ చంద్రబింబం నీడచూచుకుంటూ........'

'నీడ' అన్న మాటదగ్గఱ వులిక్కిపడ్డాడు నళిని. 'పోనీ మీకంత కష్టంగావుంటే మాట్లాడకండి...' అని వాణి మూతి బిగించుకుంది. కాని ఇది తనుమూతి బిగించుకున్నంత మాత్రాన తేలిపోయే క్షోభ కాదని వెంటనే గ్రహించుకుంది.

'ఏమిలేదు ఊరికినే.'

'అబ్బ! చెప్పండి. చెప్పకపోతే యివాళ నే భోజనం చెయ్యను.' అని అతని ముంగురులు సవరించింది.

'ఏమీ లేదని చెప్పలా...'

'చెబుదురూ...చెపితే అక్షరానికో ముద్దు చొప్పున అర్పించుకుంటా నుంకంక్రింద...మనకి పిల్లలు లేరనా? అప్పడే పిల్లలేమిటండి!' అని సిగ్గుతోనవ్వుకుని కనురెప్పలతో అతని నుదుర్ని తాకింది.

నళినికి చెప్పనా?వొద్దా?అని యుద్ధంచేస్తున్న రెండు మనస్సులూ వొకటి అతికాయి.గా ఈవిషయం చెపితే తప్పేముంది? భార్యకి ద్రోహంచెయ్యడం లేదుగా.

'ఐతే చెప్పనా?'

'తప్పకుండా.'

'కాని నీతో చెప్పడం భయంగావుంది. ఎవరికీ చెపితే అర్థమయ్యేది కాదు.'

'అంత మాటల్తో చెప్పలేకపోతే కాగితంమీద వ్రాయండి. తీసుకురానా కలం?'

'వొద్దు. చెప్పగలను. కాని, చెపితే ఎవరూ నమ్మరు.'

'ఇంకొకళ్ల జోలెందుకు. నే నమ్ముతాగా.'

'అదికాదు. నే పిచ్చివాడినని అనుకుంటావు.'

'నాకు పిచ్చివాళ్లంటే మరీ యిష్టం. అసలు నేనే పిచ్చదాన్నని మీరనేకసార్లన్నారు. చెప్పండి.'

'ఐతే విను. నేనో స్త్రీని చూచా.' అని, వెనక్కి జార్లపడ్డాడు, భార్య ఆశ్చర్యాన్ని యెల్లా ప్రకటిస్తుందో చూద్దామని.

'అందులో నమ్మరాంది, అర్థంలేనిదీ యేముంది?'

'ఆ స్త్రీ చాలా చక్కంది.'

'అదీ విపులంగానే వుంది.'

'కాని నేనా స్త్రీని చూడలేదు.'

'అదేమిటి, యిప్పుడేగా చూచానన్నారు; పైగా చక్కందని మెచ్చుకున్నారు....'

'అల్లాగైతే చెప్పను. చెప్పలా పిచ్చవాడినను కుంటావని...'

'అవ్వై హోమ్' అను అనాథ బాలికా వసతిగృహము వార్షికోత్సవంనాటి దృశ్యం. గృహనిర్వాహకులు శ్రీమతి ముత్తులక్ష్మి రెడ్డి గారు మధ్య కూర్చున్నారు.



'అవ్వై హోమ్' అనాధ బాలికా వసతిగృహంలోని పారిశ్రామికశాఖ

'లేదు లేదు, కానీండి...కలలో చూశారా ?'

'అల్లాంటిదే, నీడ చూశాను, ఆ స్త్రీ నీడ.'

'కలలోనా, నిజంగానా ?'

'కలలో లాగే వుంటుందికాని కలగాదు. గోడమీద నీడ చూశాను. వెనక్కి తిరిగేప్పటికి మళ్లా ఆ స్త్రీ కనిపించలేదు.'

'ఏ దయ్యమేనా కాదుకద ! ఎంత కాలంక్రిందట ?'

'నాకు జ్ఞాపకంలేదు, చాలారోజులైంది.'

'అయితే యింత దిగులెందుకు ?'

'నాకు మళ్ళా కనిపించక పోవడంవల్ల నేనాదృశ్యాన్ని మరిచి పోలేను.'

వాణి నవ్వడం ప్రారంభించింది.

'నవ్వితే నాకు నొప్పికలుగుతుంది. నీ ఈర్ష్యని యీ విధంగా ప్రకటించకు. నా ఆదర్శానికి దగ్గరగా వొచ్చింది ఆమెనీడ. ఆమే, నేనూ, వొకే లోకంలో బ్రతికివున్నాంకదా అన్న భావం నాకెంతో శాంతి నిస్తుంది.'

ఈ వాక్యాలు వాణి అమాయకపునవ్వులో భూకంపం జరిగినప్పుడు వినపడే శబ్దాన్ని వినపడేటట్లు చేశాయి.

'పోనీ యీ భావాన్ని స్మరించుకుంటూ సంతోషంగా వుండరాదు ?'

'ఒకసారి ఆ వ్యక్తిని చూసి వుంటే.........' మళ్లా మౌనంలో పడింది. అతని భాష, మానవ భాషలో 'అల్లా జరిగి వుంటే' అన్నది చాలా విషాదకరమైన వాక్యం.

3

ఉద్యోగ యత్నాలు చేస్తూ యీ మహాపట్నం జేరుకున్నాడు నళిని. ఈ పట్నంలో జీవం వేగంగా కదిలిపోతుంది. వుద్యోగం యిచ్చేవ్యక్తిని కలుసుగోవడమే చాలా కష్టం. ఆ వ్యక్తిని వొంటరిగా వున్నప్పుడు కలుసుకోడంలో విజయంపొందితే ఎవరెస్టు శిఖరాన్ని జయించినట్లే. నాలుగు దినాలూ ఆ బంగళాముందు వొచ్చే పొయ్యేకార్లన్ని చూస్తూ నిలబడడంలోనే గడిచాయి. ఐదోనాడు కనబడి మూడు మాసాలు గడిచింతర్వాత మళ్లాకలుసుకో మన్నాడు వుద్యోగం యిచ్చేవ్యక్తి. అదేనా అప్పుడు కనబడితే ఆలోచిస్తా నన్నాడు. ఆఖరివిన్నపం చేసుకోడానికి బంగళాలోనికి ప్రవేశించాడు సాయంత్రం యేడు గంటలకు. లోపల దీపాలు లేవు. బైటనీ్న వూలుమొక్కలూ, యెత్తుగా నిలబెట్టపడిన ఆర్చీలమీద వింత రంగులుగల క్రీపర్లూ. లోపలిగోడకి యెదురుగా గేటుమీద పెద్ద పచ్చటి ఎలెక్ట్రిక్ దీపం. మొక్కల నీడలమధ్య ఆ గోడమీద 'ఆమెనీడ' చూశాడు నళినీ దాన్నిచూసి పోల్చుకుంటూ తనచుట్టూ మొరుగుతూ గంతులేసే కుక్కనికూడా గమనించ లేదతను. దాని నీడకూడా గోడమీదపడింది. ఆ నీడలో కుక్క తోక ఆడించి, మొరిగి మళ్లా గంతులేస్తూవెళ్లిపోయింది.

ఈనీడ ఆమెనీడేయని గుర్తుపట్టగలిగాడు. కానీవ్యక్తి తనవూరువొచ్చే అవకాశాలెక్కడున్నాయి. ఈ ధనికునిబంధువు యీ నాగరిక ప్రపంచంవొదిలి శివాలయాలచుట్టూ ప్రదక్షణాలు చెయ్యడం అసంభవం. పోనీ అడిగిచూస్తే, కోపించుకోదుకదా ? కోపించుకుంటే వొచ్చిననష్టం యేమిటి ? అతనికి వుద్యోగం రాక

పోవచ్చు పోతేం? ఈముష్టి ఏభై రూపాయలవుద్యోగం చెయ్యకపోతే దేశాని కేవిధమైన ఆపదా సంభవించదు. ప్రక్కకు తిరిగిచూశాడు. ఆస్త్రీ వొదులుగా జెడ అల్లుకుంటూ, ఎత్తు జోళ్లమీద చప్పుడు కాకుండా హంసలా నైట్ క్వీన్ చుట్టూ విహరిస్తోంది. వయస్సు పాతికేండ్లలోపు. ఆకుపచ్చ ఎనామిల్ రాళ్ల లోలకులు ఆమెనడకతో లయకల్పుతూ అల్లల్లాడుతున్నాయి. అతనివంక చూసింది. ఆ చూపులో పురుషుడు సమాధానం యివ్వలేనిప్రశ్న దాగివుంది. ఆమూతిబిగింపు, చిట్లించిన కనుబొమలు కిరీటంలాగ నుదురుమీదకదుల్తూ, ఆ దృశ్యంలో ఆహ్వానం యిమిడివుంది. ఎన్నోవిధాలు తర్కించిన అతనిమనస్సు అతన్ని కార్యానికి పురిగొల్పింది. మొదట ఖంగారుగా మాట్లాడబోయ్యాడు. కాలి బొటనవ్రేలితో నేల మీద అంకెలుగీచి, పైకి చూచేటప్పడికి, అతనిముందు నిలబడివుంది.

'ఎవరికోసం?'

తను ఫలానాపనికోసం వొచ్చాననీ, తనది ఫలానాఊరనీ చెప్పాడు. ధైర్యంచేసి, వుద్యోగాల వ్యక్తి ఆమెకు తండ్రేనా అనికూడా ప్రశ్నించాడు.

'అవును.'

ఆమెకు వివాహం అయిందాఅని అడగబొయ్యాడు. ఆప్రశ్న ప్రమాదమైంది. అసలు ముందు శివాలయంమీద నీడ ప్రసరించింది యీావిడో కాదో తెలుసుకోవాలిగా. అది నిజమనితేల్తే, ఆమె జీవిత చరిత్ర తెలుసుకోడంలో అర్థం, పరమార్థం వున్నాయి.

'మీరెప్పడేనా మావూరొచ్చారా?'

'ఏవూరు?'

మళ్లా ఫలానా ఊరనిచెప్పాడు.

'లేదు.'

'లేదూ?'

'లేదు, లేదు.'

అనుమానంలేకుండా తేలిపోయింది, యీామె కాదని. ఓవేళ మరిచిపోయి వుండకూడదూ?

'మీా కులదైవం యెవ్వరు?'

'ఎందుకు?'

'కుతూహలంవల్ల అడిగాను, క్షమించండి.'

ఈవ్యక్తి తనదైవంమీద కుతూహలంచూపడం, తనమీద కుతూహలం చూపడంలాగే భావించుకుంది.

'ఫరవాలేదు. ఇందులో క్షమించడానికేముంది. ఏమిటి మీారడిగింది'?

'మీారు, మీావారు పూజించేదైవం యెవ్వరు'?

'విష్ణువు.'

'శివుడు కాదన్నమాట'

'ఫలానాఅని గట్టిగా నాకు తెలియదు. ఏదో వూజ్జాయింపుగా చెప్పాను.'

'ఎప్పుడేనా యేవూరేనా వెళ్లినప్పుడు, శివాలయానికి వెళ్లారా'?

'లేదు. లేదు'.

'షో, ఏ ఆలయానికైనాసరే వెళ్ళారా'?

ఆస్త్రీకి నవ్వు, ఆశ్చర్యంకూడా వొచ్చాయి. గంతులేసే కుక్కపిల్లను యెత్తుకుని దాని వీపుమీద వేళ్ళతోరాస్తూ అతనివేపు కీవిగాచూస్తూ, ఆదరణచూపింది దృష్టిలో.

'నే నెప్పుడూ యేగుడికీ వెళ్ళలేదు. మీ ప్రశ్నలు చాలావింతగా వున్నాయి.'

'నాకుతెలుసు నన్ను క్షమించాలి. మీరన్యథా అనుకోకుండావుంటే నేను మీకు సమాధానం చెప్పగలను.'

'ఫరవాలేదు చెప్పండి...ఓరే 'నారీ' ఆ గేటుముయ్యి.' నారీ గేటుమూసి నిష్క్రమించాడు.

'నేను మాఊరి శివాలయంగోడమీద ఓ స్త్రీనీడ చూశాను. అదిచాలా ఆకర్షణీయమైంది. వెనక్కి తిరిగేప్పడికి ఆమెమళ్ళా కనుపించలేదు. ఆనీడని నేపోల్చగలను. ఈనాటివరకూ మళ్ళా ఆమెనికాని ఆమె నీడనికాని చూడలేకపోయాను. అదృష్టవశాత్తు యీనాడే గోడమీద మీనీడచూసి ఆమెదేనని పోల్చుకున్నా. కాని, మీరుచెప్పినదానివల్ల మీరుకాదని తెలుసుకుని నిరాశచెందా. నిరాశచెందినా, మిమ్మల్ని, చూడడం పూర్తి నిరాశకాదు.' ఈ వాక్యాలు, ముఖ్యంగా చివరివాక్యం ఆమెలోదాగివున్న స్వార్థాన్ని, 'నేను-చక్కందానినైనా-నన్నెవరూ-గమనించడంలేదు —' అన్నభావం చెలరేగి, యితనిమీద వొక చెప్పరాని స్నేహభావం యేర్పర్చుకుంది. తన నాగరికప్రపంచంఅంతా నటనతోనూ, పైపైమెరుగులతోనూ, పాశ్చాత్త్య సాంఘికాచారాలతోనూ, కపటాలతోనూ నిండివుంది. అందులో ఆమెకులోతైన జీవం కనపడలేదు. మట్టికి బంధువైన కవిత్వంలోవున్న పిచ్చి, వున్మాదాన్ని తనశరీరం తాకలేదు. ఆనాటివరకూ తన హృదయాన్నివిప్పి అరిచేతులోపెట్టిన భాషనే వినలేదు. పాడుపడి తుప్పుపట్టిన నరాలకుప్ప మధ్య అతను సౌందర్యానికి చేసిన సంబోధన మారుమ్రోగింది. నాగరికతజీర్ణించి నీరసించిన ఇంద్రియాలు చెలరేగి చిందులు తొక్కాయి.

'అల్లాగా?' అనగలిగింది ఆశ్చర్యంతో. కొంతసేపు నిశ్శబ్దం - కుక్కనాలుక బైటపడవేసి చేసే రొదమాత్రం వినిపిస్తూంది.

'నా సాహసాన్ని మన్నించాలి' అన్నాడు.

'అహ, లేదు, కాదు, - ఫరవాలేదు...నిజంగానా?'

ఈ మాటలలో అర్థంలేకపోయినా ఆతృత, నూత్నమైనప్రియత్వం వినగలిగాడు. నైట్‌క్వీన్ లోంచివొచ్చే సువాసన ఆమె ఫేస్‌పౌడర్ వాసనలోకలసి ఆతన్ని ఆవరించింది.

'పాపం, మీకానీడనుచూస్తే అంత సంతోషమే...' తరవాత మాట్లాడలేకపోయింది. కార్ హారన్ వినిపించడం గేటు తెరవబడడం జరిగాయి.

తలవని తలంపుగా అతనికి ఉద్యోగం లభించింది. దీనికి కారకురాలు, తను ఆనాడు బంగళాలో మాట్లాడిన ఉద్యోగాలాయని కూతురని అతను గ్రహించుకున్నాడు. ఈ ఏభైరూపాయల వుద్యోగానికి, వికసించే ఆత్మలని చంపుకుని, ఆత్మహత్య యత్నాలని ముగించి యెగపడేవారు, మన దేశంలో వేలకివేల మంది వున్నారు. కాని యీ దౌర్భాగ్యుడికి మాత్రం యీ వుద్యోగం సంతోషం యివ్వలేకపోయింది. నిశ్చింతగా సాగిపొయ్యే అతని జీవనానికి, అతని పిచ్చి ఆదర్శం అడ్డుతగిలి తనమీద ఆధారపడే వారి

జీవితాన్నికూడా దుర్భరంగా జేసింది. నిర్మలమైన ఆకాశంమీద, 'ఆమె నీడ' పెద్ద భయంకరమేఘంగా కప్పింది. ఆమె సౌందర్యాన్ని మెచ్చుకోడంవల్ల కదా యీ వుద్యోగం యిప్పించ గలిగింది! ఆనాడు, ఆమెను తిట్టివుంటే—నిజంగా అతను మోసపొయ్యాడని, ఆశాభంగం జరిగిందనీ చెప్పివుంటే...యెంత గౌరవంగా వుండును! ఈ ఉద్యోగం రాకపోను కదా. ఆమెకీ సంగతి చెపుతూ లేఖ వ్రాద్దామనుకున్నాడు.

'ఆదినం మీ నీడ'ని చూసి 'ఆమె నీడ'ని భ్రమించాను. ఎందుకో తెలియదు. అది పొరపాటు. ఆమె నీడకీ మీదానికి పోలికేలేదు. ఆమెనీడ చాలా అందమైనది. మిమ్మల్నిచూసి భంగపడ్డాను...! ఈ ఉత్తరం సులభంగా వ్రాయగలిగాడు; అంత సులభంగానూ చించివేశాడు.

అతనప్పుడే ఉద్యోగంలో ప్రవేశించి ఆరుమాసాలైంది. శెలవుదినాలకి యింటికొచ్చాడు. అల వాటుప్రకారం ఆరోజు సాయంత్రకూడా శివాలయానికెళ్ళాడు. మళ్లా ఆగోడముందే, ఆ దీపాలే, ఆ నీడలే—అన్నీ ఆనాటి దృశ్యమే. వైకుంఠ పాళి పటాలు అమ్మడానికి ప్రయత్నిస్తున్న వొక పిల్లాడినీడ ఆగోడమీద పడింది.

'మీకు పఠాలు కావాలా?'అని పిల్లాడు.

'వొద్దు; ఇవి ఆడాళ్లకి కాని మొగాళ్లకెందుకురా—పోయి వేరేచోట అమ్ముకో'అన్నాడు నళినీ వాడి నటన గోడమీద చూస్తూ. వాడు మళ్లా సిద్ధమయ్యాడు.

'ఇంట్లో అమ్మగారు ఆడుకుంటారు తీసికెళ్లండి.'

'పోరా వెధవా...అమ్మగారు లేదు అయ్యగారులేరు.'

'అదేంటండీ, మీరేగా అయ్యగారు. సవకండి పఠంకానీ...'

'పోతావాపోవా...ఉండు చూడనీ.'అని గోడమీద నడిచివొచ్చే స్త్రీ రూపాం చూశాడు.

'సవకండీ...'

ఆమెనీడ యీ పిల్లాడినీడలో మరుగుపడింది.

'దూరంగా నిలబడ్డా, వో కానీ యిచ్చుకుంటాను...'అన్నాడు. పాపం, ఆపిల్లాడికి యితని చిరాకుకి కారణంయేం తెలుస్తుంది?

'మీరడిగారు కాబట్టి కానీకి రెండు...' పిల్లాడు కదిలాడు చివ్వరికి, రెండుపఠాలూ అర్పించి. ఆ అల్లాడే సత్యమైన 'ఆమెనీడ'ని గోడమీద చూడగలిగాడు నళినీ. ఆముక్కు, ఆపెదవుల వొంకర, ఆ అల్లల్లాడి ఆగిపొయ్యే లోలాకులు, ఆ రాణీహోదాని సాటించే అగడ్డం,—అంతా ఆమెనీడే. నీడ నిలిచింది; నిశ్చలంగా అజంతా విగ్రహంలా గోడమీద అమర్చబడింది.

'బాబు గోరూ, యిందాకా మీ కిచ్చింది వొకటా? రెండు పఠాలాండి?' మళ్లా పిల్లాడు పిర్యాదు మయ్యాడు. 'ఎన్నోకొన్ని—వుండు చూడనీరా...' పిల్లాడు. ఆశ్చర్యంతో గోడవంకచూడడం మొద లెట్టాడు. నళినీ హృదయం సంతోషంతో పొంగి పొరలింది. ఆ పిల్లాడికి మరో కాని యిద్దామనిపించింది. వైకుంఠ పాళీని కొన్నాడు; వైకుంఠాన్ని చూడబోతున్నాడు. పక్కకి తిరిగి చూశాడు.

కళ్లు నలిపి మళ్లా జాగ్రత్తగా లేచిచూచాడు. గోడమీద మళ్లాచూసి పోల్చుకున్నాడు...మళ్లా మళ్లా చూశాడు...ఎవ్వరు? నిజమే? అవును, నిస్సందేహంగా,...అతని భార్యవాణి. అతని భార్య 'ఆమె నీడ' సృష్టికర్త నిజంగా జీవితనాటకం, తెరవెనక నాట్యమాడే అస్తిపంజరాల నీడే.

ముఖవర్చస్సు
మీకు లభింప
గలవు

మీకు దివ్యమైన అవయవ సౌష్ఠవము ఉండవచ్చును. కాని మృదుత్వము, అందమైన ముఖారవిందము లేకుండిన వీటికి ఆకర్షణ ఉండదు. మోహపరవశులనుచేయు అందమైన ముఖవర్చస్సు లభించుటకు కాంతి సబ్బు మీకు తోడ్పడును.

అత్యధిక ఉష్ణముగల దేశములకు కాంతి చాల అనుకూలమైన సబ్బు. ఎందుచేతననగా ఇది కేవలము శుద్ధమైనట్టి వనస్పతి సంబంధమైన నూనెలతో తయారుచేయబడినది. సుకుమారమైన ముఖవర్చస్సు పట్టువంటి మెత్తని చర్మము కలిగియుండుటకు ఈ నూనెలు చాల ముఖ్యము. ఇందుండు నురుగు శరీరములోని సూక్ష్మరంధ్రములలో చేరి, అందు చేరియున్న మురికిని చర్మవ్యాధులను కలిగించు మలినపదార్థములను తొలగించును.

కాంతి శుద్ధమైన సబ్బు. ఇందు జంతువుల క్రొవ్వు చేర్చలేదు. కాంతి సబ్బు క్రమముగా వాడుచుండిన కోమలమైన చర్మము ఏర్పడును. చర్మమునకు ఆకర్షణీయమైన మృదుత్వము, కళ, కాంతి ఏర్పడును. నేడే ఒక బిళ్ళను కొనుడు.

స్వస్తిక్ కాంతి సబ్బు

KANTI SOAP *FOR COMPLEXION*

SWASTIK OIL MILLS LTD., BOMBAY


K. PUSHPAVALLI
Directed by R. S. Prakash.
TARA-SASANK
ఆర్. యస్. పి. పిక్చర్సువారి
తారాశశాంక్
తారాగణం :
కె. పుష్పవల్లి, సూరిబాబు, రామకృష్ణశాస్త్రి, సుందరమ్మ, పారుపల్లి
కె. కృష్ణదాసు, యల్. యస్. నారాయణ, కె. శివరావు,
For Bookings for Andhra:—
NEW TALKIE DISTRIBUTORS,
NELLORE.
Other Particulars From:—
R. S. P. PICTURES,
9, Lady Desikachari Road, Mylapore, MADRAS.

భారతీయనారి ★

శ్రీ స్వామి వివేకానంద
అనువాదం : శ్రీ పూర్ణానంద

(సెప్టెంబరు సంచిక తరువాయి)

అందువలన, భారతీయుని సాంఘిక-ఆచారముల పునాది ఎయ్యది? ఆ మూలము వర్ణాశ్రమములు. నా జన్మ, జీవితము నేను చెందిన వర్ణమునకు. ఇచ్చట నేను స్వవిషయమును జెప్పుచుండుటలేదు. కారణము, సంన్యాసి సాంప్రదాయమున జేరుటవలన నేను వర్ణమున (జాతి) కతీతుడ నైతిని. ఎవరే వర్ణమున జన్మించుదురో వారా వర్ణముయొక్క శాసనమునకు, ఆ జీవితమున తలయొగ్గి మెలగవలెను. అనగా, మీయొక్క ఆధునిక భాషలో చెప్పవలెనన్న, పాశ్చాత్యుడు జన్మాదిగ స్వతంత్రుడు, తనకొఱకే; కాని భారతవాసి సంఘ తంత్రుడు-సంపూర్ణముగ సోషలిష్టు. (అనగా పాశ్చాత్యుని జీవితము కేవలము తనకొఱకే; హిందువుల జీవితము సంఘము కొఱకు.) అని శాస్త్రము వచించుచున్నది— నేను పురుషుని యథేచ్ఛావివాహ-స్వాతంత్ర్య మొసగిన ఫలిత మెట్లుండును? నీవు ప్రేమించితివి సరే, కాని, రమణియొక్క పిత పిచ్చవాడో లేక త్రాగుబోతోయైన చింతించువారెవరు? ఒకానొక బాలిక ఒకానొక పురుషుని రూపమునుగాంచి మోహమును గొన్నది, కాని అతని తండ్రి మద్యపాయి. ఈ విషయమున విధిఏమి? ఈ వివాహములన్నియును నిషేధనీయములు. మద్యపాయి, యక్ష్మరోగి, ఉన్మాదుల సంతానముయొక్క వివాహము లసంగతములు. పంగు, కుబ్జ, ఉన్మత్త, మూఢుల వివాహము లెన్నటికిని జరుగకూడదని శాస్త్రమతము.

ముసల్మాను లరుదెంచినారు; వారి భూమినుండి వారు అరేబియా విధులను దీసికొనివచ్చి ఆ పరుశాసనముల మా నెత్తిన రుద్దినారు. మేము జయింపబడితిమి! ఇంక మే మేమి చేయగలము? ఎంతదూర సంపర్కమేయైనను సగోత్ర వివాహము తగదని శాస్త్రము. దీనివలన శారీరిక అవనతి, వంధ్యాత్వములు అనివార్యములు. ఇయ్యది సంపూర్ణముగ అనుచితము; అందువలన మా శాస్త్రము ఈ వివాహమును నిషేధించినది. వివాహ విషయమున నాయొక్క లేక నా సోదరియొక్క మాట చెల్లదు. ఈ విషయమున వర్ణమే అందఱియొక్క నియంత. కొన్నిపట్ల శైశవముననే మా దేశమున వివాహ మొనర్పబడును—వర్ణముయొక్క నిర్దేశము ననుసరించి ఏలయన, ఇష్టానిష్టముల నపేక్షింపక వివాహము నొనర్పవలసియున్న, ప్రణయప్రవృత్తి అంకురింపకమున్నే, బాల్యకాలముననే వివాహమొనర్చుట మంచిది. చిన్నదనముననే వివాహమొనర్పక బాలబాలికల స్వతంత్రభావమున ఇంటనుంచిన, వారు వర్ణము వివాహమొనర్ప అనుమోదింపనివారిపట్ల సక్తిని గొనవచ్చును. దాన అనర్థముకలుగును. అందువలన, దానిని మొదటనే ఆపుటమంచిది. బాల్యముననే వివాహమైన బాలబాలికల ప్రేమ, రూపగుణములపై నాధారపడక స్వాభావికమగును. అయితే మీరు నుడువగలరు—"పరస్పరము ప్రేమించి స్త్రీపురుషు లే యపూర్వభావము నాస్వాదించుచున్నారో, దానియందొకింతయు వారి భాగ్యమున బడజాలదు. అభ్యాసము, సంగగుణమున నలవడు సోదరీసోదరుల ప్రేమ అత్యంతశుష్కము" హిందువుడనునది అయిన అవవచ్చును, కాని మేము సంఘ-తంత్రులము (Socialist) "ఒక యువతి లేక పురుషుని విలాసము కొఱకు వందలకొలది మనుష్యుల భుజములమీద దుఃఖభారమును దింపజాలను."

అందువలన ఇట్లు సంఘాదేశమున అల్పవయస్సుననే పరస్పర ఇష్టానిష్టముల నపేక్షింపకయే బాలబాలికలవివాహ మొనర్పబడును. భార్య పతియొక్క గృహమున కఱుదెంచినప్పుడు వారి ద్వితీయ వివాహమైనదని చెప్పబడును (పునస్సంధానము) బాల్యకాలము నందలి వివాహము ప్రథమ వివాహమందురు.

అప్పుడుబాలిక తల్లిదండ్రులతోడను, ఇంటియందలి స్త్రీలతోడనుగలసి పితృ గృహముననే యుండును. యుక్త వయస్సు వచ్చినప్పుడు ద్వితీయ వివాహ మొనర్పబడును. అనంతర మామె భర్తృ గృహమున అత్త మామల అధీనమై వారితో నివసించును. ఈ వధువు సంతాన ప్రసవానంతరము గృహిణియగును.

ఈ తడవ భారతవాసియొక్క విశేష ఆచారమును, చిరవైధవ్య వ్రతమును పేర్కొందును. ఉచ్చ వర్ణ (ద్వయ) ములమధ్య విధవా వివాహములేదు; ఇష్టమున్నను వారు ఒనర్పజాలరు. అవశ్యమిది చాల మందికి కష్టకరము. విధవ లందరును దీని నామోదింతురని చెప్పవీలుపడదు. ఏలయన, వైధవ్యమున వారు బ్రహ్మచర్యమును మన్నించి మెలగవలసియున్నది. మత్స్య, మాంస, మద్యము బ్రహ్మచారులకు నిషిద్ధములు. ధవళవస్త్రముగాక ఇతరముల ధరింపవీలుపడదు. ఇంకను ఇట్టివేయగు నియమములున్నవి. మా జాతి సన్యాసుల జాతి (వంశము) కేవలము తపస్సు ఒనర్చుటయేమాపని, దానినే ప్రేమింతుము. మాయువతులు ఎన్నడును మద్య మాంసముల సేవింపరు. విద్యార్థి దశయందు బాలకుల కీ బ్రహ్మచర్యము అత్యంత కష్టకరమే కాని, యువతులకుగాదు. మాంసభోజనము చెడుగని వారు తలంతురు. కొన్ని సాంప్రదాయముల పురుషులు కాని స్త్రీలు తినరు. అయినను, విధవను వివాహమొనర్పకుండ నుంచుట చాలమందికి కష్టకరమను మాట సత్యము. కాని, మనము మరల ఆ పూర్వవిషయమును స్మరణకు దెచ్చుకొన వలసియున్నది. హిందువులు సంపూర్ణముగ సంఘ - తంత్రులు.

ప్రతిదేశముయొక్క 'జనాభా' సంఖ్యలో కనబడునది, ఉచ్చవర్ణముల పురుషుల సంఖ్యకంటె స్త్రీలసంఖ్య ఎక్కుడు. ఉన్నతవర్ణములందలి నారులు పురుషానుక్రమముగ జీవితమును సౌఖ్యముగ గడుపుచున్నారు. ఇంక పురుషులమాట ఏమి ? వారి బ్రతుకు ఈంగలవంటిది. జనాభాలెక్కల వలన తేలునది, ఉన్నతవర్ణముల ఆడుపిల్లల సంఖ్య అతిశీఘ్రముగానే మగపిల్లల సంఖ్య నతిక్రమించుచున్నది. కేవలము వర్తమాన కాలమున. వారు మగపిల్లలవలె పరిశ్రమించుట జేసి దీనికి వ్యతిక్రమము కనబడుచున్నది. నిమ్న వర్ణములకంటె ఉచ్చవర్ణముల ఆడపిల్లల సంఖ్య చాల ఎక్కుడు. ఏలయన, నిమ్న వర్ణములస్థితి సంపూర్ణముగ విపరీతము. వారందరును కఠోరపరిశ్రమ నొనర్తురు. అదియునుగాక చాల పట్ల ఆడువారు కొంచెమెక్కుడుగ పరిశ్రమింప వలసి యుండును; గృహ - కార్యము వారి భుజములమీద. భారతదేశమున నిమ్నవర్ణముల స్త్రీలు కొంచె మెక్కుడుగ పాటుపడవలసి యున్నది. కాని పాశ్చాత్యదేశమునందలి కొన్నితావులనుండు స్త్రీలతో బోల్చిచూచిన వారి జీవితము ఆపేక్షకముగ సుఖకరము. అమెరికన్ పర్యటకుడగు మార్క్ ట్వేమెన్ యొక్క భారతభ్రమణాభిజ్ఞతనుండి వారియొక్క ఈ పరిచయము లభింపగలదు. ఆయన విలికించెను; 'పాశ్చాత్య సమాలోచకులు హిందువుల రీతినీతుల గురించి ఎట్లునుడివిన నుడువుదురుగాక, కాని, నేనెక్కడ, యూరప్‌నందలి కొన్నిదేశములవలె వారు వారి యువతులను నాగలి - ఎద్దులేక బండిలాగు కుక్కతో జోడించుట, గాంచలేదు. భారతదేశమున నేను ఏ రమణియు లేక బాలికయు కృషి కార్యము నొనర్చుట నెన్నడును జూడలేదు. రైలులైను కిరుప్రక్కల, ఎట్టఎదుట శ్యామవర్ణులగు పురుషులు బాలకులునగ్నశరీరులై కృషి నొనర్చుచుండుట కాననగును. కాని స్త్రీవ్యక్తి ఒక్కటియును కనుపించలేదు. ఈ రెండు ఘంటలలో నొక్క స్త్రీవ్యక్తిలేక బాలికగాని పని నొనర్చునట్లు కనుపింపలేదు.' భారతదేశమున నిమ్నతరజాతి స్త్రీలుగూడ ఎన్నడును మిక్కుటముగ కష్టకరమగు పరిశ్రమ నొనర్పరు. ఇతర దేశముల నిమ్న జాతులకంటె భారతమునందలి ఈ శ్రేణికిజెందిన స్త్రీల కార్య మత్యంత సహజము. కృష్యాదికము వారొప్పనే మొనర్పరు. అయినను ఉచ్చవర్ణముల స్త్రీల జీవితముకంటె వారిజీవితము కఠోరము. ఇప్పుడు గ్రహించితిరా! పూర్వోక్త కారణమున భారతమున నిమ్నశ్రేణి నారుల సంఖ్యకంటె పురుషుల సంఖ్య అధికము; తేలు ఫలితాంశము; పురుషుల సంఖ్య అధికమగుటవలన స్త్రీలు వివాహమొనర్చుకొను సుయోగమును అధికముగ పొందుదురు.

(సశేషము)

సర్వనాశనమా! — సర్వోదయమా!!

'దసరాసంచిక'లో యీ పై మకుటంతో ప్రకటింపబడిన శ్రీమతి కె. సుగుణమణిగారివ్యాసముపై నవంబరు సంచికలోని 'వసంత'గారి విమర్శన వ్యాసానికి ఇది శ్రీ సుగుణమణిగారి ప్రతివిమర్శన వ్యాసము. శ్రీమతి సుగుణమణిగారి అముద్రిత, అసంపూర్తి వ్యాసము, వారి విమర్శన వ్యాసము, రె.డూచేరి, ఇది 'సమాప్తి' వ్యాసంగా ప్రకటింపబడింది. విషయపరిశీలనకీ, వివేకవికాసానికి దోహదమునిస్తూ సుహృద్భావముతో ఇరువురు రచయితలు యీ విషయముపై విజ్ఞానచర్చ సాగించినందుకు మా కృతజ్ఞత.

సంపాదకుడు.

'...మానవుఁడు ఆధ్యాత్మికశక్తియొక్క 'ప్రియసృష్టి' అనే వూహించాలి. 'ఇది మానవునకున్న అహంకార'మని విమర్శకులంటే నే నంగీకరించను. అది అహంకారమని ఒకవేళ ఒప్పుకొన్నా - సహేతుకమైన అహంకారమేనని నేనంటాను ఆ అహంకారం వుండాలంటాను. అందులోనేవుంది మానవజన్మయొక్కఘనత. చిన్న ఉదాహరణయిస్తాను:- నేను భారతదేశంలో జన్మించేనని - హిందూ వనితనని - నేను గర్విస్తున్నా. నా ఘనతఇట్టిది, నాపూర్వమిట్టిది, నా దేశచరిత్ర ఇట్టిదని నేను సగర్వంగా, అహంభావంతోటే వచించగల ఈ అహంభావం సహేతుకమైనదంటాను. అలాగే ఒకప్పుడు జీవరహితంగానున్న పదార్థం వృక్షమై, జంతువై, మానవుడై ఇదమిర్థమని గ్రహించగల వివేకంగలిగి - తనకు, సృష్టికి, సృష్టికర్తకుగల భిన్నత్వ ఏకత్వాలను గ్రహించగలశక్తి, 'ఆత్మవత్సర్వభూతాని' అన్న అఖండసత్యం చవిచూడగల సామర్థ్యంగలిగినప్పుడు - తన చిన్నబుర్రతో అండపిండబ్రహ్మాండాలను లెక్కలుకట్టి, వాటి వాస్తవికతను గ్రహించి, వాటిని తనలో ఇముడ్చుకోగల సామర్థ్యంగలిగినప్పుడు - మానవుఁడు, 'నేను సృష్టిలో ఇంతవరకు తయారైన ఏగొప్ప నెబ్యులా (nebula) కన్నను, ఏ వస్తువుకన్నను, ఏజీవికన్నను గొప్పవాడను' అని అహంకారం పొందటంలో తప్పేమీలేదంటాను. అలా పొందకపోతే తనగొప్ప తానెరుగని పశుప్రాయుడనాలి. 'What is man but a sleeping giant' అని శ్రీ వివేకానందస్వామి, 'My Father and I are one' అని జీసస్సు, 'మానవజన్మ మహత్తర పూర్ణమైనద'ని పెద్దలు ఎందుకన్నారు? ఇంకా ప్రాజ్ఞులేమన్నారో చూడండి :—

> 'In the universe there is nothing great but man,
> In man there is nothing great but mind,
> In mind there is nothing great but grace,
> And grace is True Divinity.'

మానవులోనున్న ఆ 'అహం' ఏమిటి? జడపదార్థంగానున్న ద్రవ్యం - జీవరూపంతో ఆడి, మానవజన్మతో తన్నుతా దెలుసుకొని నిర్యాణదశ పొందుతున్నప్పుడు - 'అహం,' 'సోహం'కాక మరేమిటి? 'తన్నుదానెరిగినఁ సర్వము నెరుంగు'నన్న వేమనార్యునిపల్కుల ప్రకారం మానవునకు 'అహంకారం' (అంటే అజ్ఞానంతోగూడిందికాక, జ్ఞానయుక్తమైన అహంకారం) కలిగితే తప్పేముంది? ఈమాదిరి అహంకారం జ్ఞానయుక్తమైనదైతే వినయాన్ని వివేకాన్ని పెంపొందజేస్తుంది. తామసయుక్తం మాత్రం కాకూడదు.

అసలు యీ అనంతంగాతోచే విశ్వమేచిత్రం! దానిలో యెక్కడా పొడకట్టని 'జీవం' అనబడే అపూర్వం యీచిన్న భూగోళంమీద ఉద్భవంకావడం చిత్రంలోచిత్రం!! అలాంటి జీవులన్నింటికంటె ఉత్కృష్టమైన మానవజీవి కడకు తయారవడం అంతకన్నాచిత్రం!!! వాని చిన్నబుర్రకు (మనస్సుకు) స్థి వస్తు నిర్దేశాలుగావించి - అండపిండ బ్రహ్మాండాలన్నిటికి లెక్కలుకట్టగల సామర్థ్యం కలగడం చిత్రాతివిచిత్రమైన విషయం!!!! పాశ్చాత్త శాస్త్రజ్ఞులు యిలాంటి అఖండ ప్రజ్ఞగలవింత 'జీవం' చిత్రపు 'మనిషి'కూడ కేవలం భౌతికనియమాల ననుసరించే కలిగినట్లు చెప్పడమున్నూ, వీటి ఉద్భవం 'ప్రమాదవశంవల్ల', లే 'ప్రకృతి పదార్థాలకు యేదైనారోగం రావడంవల్లనేమో!' ననడమున్నూ చాల హాస్యాస్పదంగావుంది: ఇట్టి సజీవాలేకాకుండా చింతనా సామర్థ్యంగల వృక్షాలు, జంతువులూ, వివేకజ్ఞానంగల మానవుఁడూకూడ 'నిర్హేతుకంగా' సృష్టిలో తయారయేరంటే విశ్వజనీయంగాలేదు. నిజంగాచూస్తే - సృష్టిలోని యెంతటి గొప్ప నక్షత్రమండలంతోగాని, నెబ్యులా (Nebula) తోగాని పోల్చిచూచినా - 'మనస్సుతోగూడిన మానవశరీరం' వంటి అపూర్వసృష్టిచిత్రం మింకొకటి కానరాదనాలి. పంచేంద్రియ సమన్వితమైన శరీరాన్ని పరికరంగా చేసుకొని మనస్సు సముపార్జించిన, సముపార్జిస్తూవున్న - విషయజాలమే మనం వినేది, కనేది, ఆనందించే 'విజ్ఞానం' అనుకొనేది, విశ్వం అనుకొనేది - అంతాకూడాను!

రెండవపేరాలో విమర్శకులు 'సృష్టికర్త' (లేదా 'విశ్వమానవ వికాసాలకు హేతుభూతమైన 'శక్తి')' యొక్క యుద్దేశాన్నే ప్రశ్నిస్తున్నారు. 'యుగయుగాలుగా కృషిచేసి - శక్తిని ద్రవ్యరూపంగా మార్చి, దానికి జీవంపోసి, చివరకు చిత్రాతిచిత్ర విచిత్రమైన మానవజీవిని సృష్టించి, దానికొక అపూర్వమైన మనస్సును తోడిచ్చి, అతనిచే శరీరక మానసికకర్మలు జేయించి, వాటిఫల మనుభవింపజేసి, కట్టకడకు తన్ను దా నెరుఁగుకొనే సామర్థ్యం కలుగజేయడంలో సృష్టికర్తకుగల ఉద్దేశంఏమి? ఈ తంతులీల, లే పోవడమే వాంఛనీయముగదా?' యని అంటారు విమర్శకులు. ఇది భాగవతంలో..........'ఏకత్వమున నుండు నీశ్వరుండు భిన్నమూర్తియగుచుఁ బెక్కువిధంబుల, నేలయుండు? అతనికేమివచ్చె నుండకున్న? తాపసోత్తమ, తెలుపవే! వేడ్కన్..........' అన్న పరీక్షితుని ప్రశ్నవలె సృష్టికర్త సృష్టి హేతువునే ప్రశ్నిస్తూవుంది. దీనికి జవాబు విమర్శకులు భాగవతాధి గ్రంథాలు పరికిస్తే కానవచ్చు. మానవుఁడు తనబుద్ధి వుపయోగించి ప్రకృతి శాస్త్రాలు తయారుచేసేడు:- గురుత్వాకర్షణ నియమాన్ని (Law fo Gravitation), సాపేక్ష సిద్ధాంతాన్ని (Relativity Theory), వితంతు శబ్దవాహ కతారాయంత్రాన్ని (Wireless), టెలివిజాన్ని (Television), ఆకాశవిమానాన్ని (Aeroplane) యెన్నెన్నో కనిపెట్టేడు.

['మా పూర్వులుకూడ ఆకాశగమనం, దివ్యదృష్టి, దూరదృష్టి యిత్యాదులు సాధించేరని' భారతీయులనవచ్చు. కాని, అవి మనోసిద్ధి, వాక్సిద్ధిగల ఏ ఒకరిద్దరికో, వారి శిష్యులకో తప్ప యిప్పటివలె ఏ వెర్రివెంగళప్ప కావలిస్తే ఆ వెంగళప్ప ఉపయోగించగలిగే లాగున లబ్ధములుగాలేదని యిప్పటిశాస్త్రజ్ఞులంటారు.] పూర్వమెప్పుడో రాక్షసరాజు పంచభూతములగు నీరు, అగ్ని, వాయువు మున్నగు వాటిచేత ఊడిగాలు చేయించుకొన్నాడని విన్నాంగాని యిప్పుడు పాశ్చాత్తులు వాటిని మానవసేవ చేయమని శాసించి, నీరును, అగ్నిని రైళ్లు నడపమని, వాయువును తన్ను ఆకాశంలోనికి గాండోలాతో యెత్తమని ఆకాశాన్ని యీదర్ తరంగాలతో తనకు వార్తావాహనుని కమ్మని, ఇలా యెన్నైనా సేవలుచేయించడం ప్రత్యక్షంగా చూస్తూన్నాం. శాస్త్రజ్ఞులు యీమధ్య యింద్రజిత్తులాగ మేఘాలలోకెగిరి వర్షాలుకూడా కురిపించేరు.

సర్వనాశనమా! - సర్వోదయమా!!

అలాఅన్నారని - తనకు తెలియదని, తెలియలేదని, తెలిసినదంతా మిథ్యయని ఊరుకుంటాడా అంతటితో మానవుఁడు! అలా ఊరుకుంటే తతిమ్మా జంతువులకంటె తనకున్న ప్రజ్ఞయేదీ? ఊరుకోనక ప్రయత్నించడంలోనే మానవుని అద్భుత జిజ్ఞాస వ్యక్తమౌతుంది!

అలావూరుకోనక శాస్త్రజ్ఞులు పరిశోధనలు మొదలిడి ప్రకృతి రహస్యాలు చాలా చాలా తెలిసికొన్నారు; చాలా వింతలు సాధించేరు. కాని కష్టపడి సేకరించిన విజ్ఞానాన్ని మారణక్రియలకు వినియోగిస్తూ యెంతసద్వినియోగ పరుస్తున్నారో చూడవలెనంటే పాశ్చాత్త 'నాగరికత' దేశాలుచూచి గ్రహింపవచ్చు! అదిగాక కొన్ని కొన్ని సమగ్ర దృష్టితో వీక్షించి చెప్పలేక పోయేరు. చెప్పినవి కొన్ని అసందర్భంగాకూడ వున్నాయి. వారు ప్రతీదీప్రాపంచిక విషయాలకే అంటగట్టే క్రమంచూస్తే-'భౌతికశాస్త్రజ్ఞులు' అనేపదం సార్థక్యపరచేరా యనిపిస్తుంది. అలాంటి అసందర్భ విషయాలు రెండు యీ క్రింద పరిశీలిద్దాం.

(1) వారు సృష్టిలోని సర్వవస్తువులూ జీవరాసులతో సహా 'కొన్ని భౌతిక నియమములననుసరించి కాలగర్భంలో క్రమంగా వికాసమునందినవని' (Inorganic and Organic Evolution) వర్ణించేరు; (2) యిలా వికాసమును పొంది పొంది కడకు సర్వము_అవిలంఘనీయములగు భౌతికనియమములకు లోనైపోయి_'సర్వనాశన' మైపోతుందని జ్యోతిషం చెప్పేరు.

ప్రకృతినియమాలను తనయూహాశక్తిని ఆధారంగాజేసికొని మానవుఁడు_కోట్లకోట్ల మైళ్ల దూరాలనున్న నక్షత్రలోకాల నిర్మాణాలను బైటపెట్టేడు; వాటిశీతోష్ణ పరిస్థితులను జెప్పి వయస్సులు నిర్ణయించేడు. పరమాణు (Atom) గర్భంలోదూరి వాటిరహస్యాలు సోధించేడు. కాస్మిక్ కిరణాల (Cosmic rays) కనుకున్నాడు. అణువులుగాలించి, క్షకిరణ విసర్జనశక్తి (Radio activity) గలధాతువులను కనిపెట్టేడు. 'దానైత్తిచ్చి కరిగిపోసిని యిత్తడి బంగారుమౌనే?' అని యీ మీదట యెవరూసాహసంతో ననలేకుండా ఒక ధాతువు (Element)ను మరొకధాతువుగా మార్చవచ్చు నన్నాడు. 'ఉ' అని ఆశబ్దాన్ని చిటెకలో భూగోళం చుట్టూత్రిప్పి రప్పించి పట్టుకున్నాడు. జీవంఆనేది యెప్పుడు, యెట్లుగా వుత్పత్తిచెందినది చెప్పేడు. యుగయుగాలక్రితం బ్రతికిన ఆదిమవాసుల యెదంతం చూచినట్లే యేకరువుపెట్టి మానవజాతి వికాసాన్ని (Evolution) విమర్శించేడు. కణాంతరాల (Cells) లోని 'క్రోమోజోమ్సు' (Chromosomes) పరిశోధించి వంశలక్షణాల కాకరములైన 'జీన్సు' (Genes)ను నిర్ణయించేడు. సూక్ష్మాతి సూక్ష్మములగు సూక్ష్మజీవుల పరిశోధించి_అవితెచ్చిపెట్టే రుగ్మతల కౌషధాలు తయారుచేసేడు. మానవహృదయం మెదడు వీట్లలోని రహస్యాలు పరిశోధించి అవ్యక్తాలను వ్యక్తంచేయ ప్రయత్నించేడు. హృదయం శ్వాసకోశలు నిల్చిపోగా వాటికి తనశాస్త్ర పరికరాలు తోడిచ్చి పోయేజీవాన్ని నిల్పేడు. బుర్రలోని యూహాలనుగూడ వెలికి చూపించగల యంత్రాన్నిగాని, ఫోటోతీసే తంత్రాన్నిగాని త్వరలో కనిపెట్టే నంటాడు. శరీరాంతరాలలోని నిర్వాహిక గ్రంథులు (Ductless Endochrine glands) పసిగట్టి అవి సమకూర్చే సేంద్రియ పదార్థాలను రసాయనిక పరిశోధన శాలలో తయారుచేసేడు. గర్భస్తమైన పిండానికి లింగభేధం కల్గించే సూత్రాన్ని వెదుకుచున్నాడు. ఇప్పుడు కోడిగ్రుడ్లను కోడి అక్కరలేకుండానే యంత్రంచే పొదిగించి పిల్లలను చేయించగలిగినట్లు, గర్భధారణమైన వెంటనే అండాన్ని వెలికిదీసి పసిబిడ్డ తయారయేవరకు తనప్రయోగశాలలో రసాయనములవల్ల పోషణకల్పించి పెంచడంకూడ కనిపెట్టేడంటే శాస్త్రజ్ఞుని పుణ్యామాయని స్త్రీలోకానికి అనాదినుండి అక్రమంగా సంప్రాప్తించిన పిండభరణ, ప్రసవప్రయాస నివారణమైపోతాయి!!

ఇక వృద్ధులను యవ్వనులగను, విగతజీవులను సజీవులగను చేయగలిగేడంటే 'మానవుఁడు బ్రహ్మపుత్రుడన్న' మాట సార్థమౌతుంది.

ఇందలి విషయాలు శాస్త్రజ్ఞులు అనే కాధారములపై గనకట్టిన లెక్కలు తెల్పుతున్నాయి: భూగోళం సూర్యగోళంనుంచి ఉద్భవించి దాదాపు 2,000,000,000 సంll లే అయిందట! శాస్త్రరీత్యా ఇవన్నీ యదార్థాలే. కాని, ఈ విషయంలోనే గాక, అనేక విషయాలలో శాస్త్రజ్ఞులుదెల్పే అంకెలు, హంగామా ఏలావుంటాయంటే—శ్రీ రామకృష్ణపరమహంస చెప్పినట్లు—'ఒకపెద్ద ఫలవృక్షాన్ని చూచి దాని పుట్టు పూర్వోత్తరాలు లెక్కలుకట్టి, దాని పరిమాణం, వయసుని, (universe) దానికున్న కొమ్మలు, ఆకులు, పండ్లు లెక్కలుకడుతూ ఆలెక్కలతోటే సంతుష్టిపడి ఆనందించే గణిక శిఖామణి ఒకడట!—నేరుగపోయి ఆ పండ్లను చవిజూచి, తన్నిర్మాణకర్తయొక్క చాతుర్యాన్ని దలంచుకొని, ఆశ్చర్యానందాలతో తన్మయుడయ్యే జిజ్ఞాసాపిపాసి రెండవవాడట' మొదటివాడు పాశ్చాత్యశాస్త్రజ్ఞుడని, రెండవవాడు భారతీయుడని నేను పోల్చుకుంటుంటాను.!

భారతఋషుల ప్రతిభ, శాస్త్రజ్ఞుల సామర్థ్యం పరికిస్తే మానవుని ప్రజ్ఞకేమైనా అంతువుందా యనిపిస్తుంది. కడకు యేమి తేలేది దురూహ్యమేగాని-సృష్టికర్త సృష్టిలో మానవునివంటి అపూర్వజంతువు లేదనే ముమ్మాటికి చెప్పాలి. అత్యంత ఆశ్చర్యకరమైన యీ మన శరీరయంత్రంలో-ద్రవ్యం-ప్రాణం-మనసు (Matter, life and mind) మూడుకలిసి వ్యవహరిస్తుంటే వాట్లలో క్రమంగా అపూర్వమైన నియమాన్ని-జీవిని—వాటి శాసనకర్తను (Organisation organism and organiser)ను చూడఁగలుగుతున్నాం. ఈలాటి వన్నీ భౌతికనియమాలు 'తారుమారవడంవల్ల' 'నిర్హేతుకంగా' ద్రవ్యాన్నుంచి తయారయేయనగలమా! నిర్జీవమైన భౌతికవస్తువేదైనా సజీవాన్ని శాసిస్తుందా? భౌతిక, లేక, రసాయనికమార్పులవల్లనే అచరం చరంగా మారుతుందనగలమా? అంటే మాత్రం విశ్వాసపాత్రంగా యుంటుందా? ఈ యపూర్వ విశ్వనిర్మాణాన్నిగుర్తిస్తే-భౌతికమైనవియేగాని దానికి భిన్నమైనవి ఆధ్యాత్మికమైనవి యేమీ గోచరింపవా?

'పదార్థాలు వాటికవే కాలక్రమమున మార్పుజెంది చివరకు మనం చూస్తున్న పుస్తకంగా ప్రత్యక్షమైనవం'టే నమ్మతామా? ఇది పుస్తకరూపం తేల్చటానికి యెంతపని జరిగింది. ఒకరు వ్రాసేరు; వేరొకరు అక్షరాలను మాటలగా కూర్చేరు; మాటలు వాక్యాలుగా అతికేరు; వాక్యాలు పేరాలుగా అమర్చేరు. కాగితం యెక్కడో బోల్డంత పరిశ్రమ జరిగినవెనుక తయారయి వచ్చింది. దానిపై అచ్చువేసేరు. ఆ వెనుక కుట్టి బైండుచేసేరు, ఇన్నిఅయినవెనుక చేతిలోనికివస్తే- 'పుస్తకం తయారవటానికి ఒక సహజవికాస పద్ధతి (Evolution method) వుంద' నిన్ని 'అక్షరాలేవో కొన్నిభౌతిక నియమాలవల్ల అలాఅమర్చుకొని పుస్తకం వలె తయారైనవ' నిన్ని అనగలమా? ఒకవేళ అలాజరిగినా పుస్తకంలో ఒకక్రమం, అర్థంవుంటుందా! ఆలాగేఅవర్ణనీయమైన నియమం, అర్థంతోనున్న యీ అనంతవిశ్వశిల్పాన్ని గుర్తిస్తూ-'కాలప్రవాహంలో క్రమేణకొన్ని భౌతిక నియమాల ప్రకారం శక్తి, ద్రవ్యం - చైతన్యాన్నిపొంది-చివరకు యిలా మనిషిరూపు దాల్చి తాండవమాడుతుంద'ని శాస్త్రజ్ఞులంటే యేమంటారు? 'సృష్టికర్తను తలపెట్టకుండా సృష్టికి అర్థంచెప్ప గలుగుతాననే భౌతికశాస్త్రజ్ఞుని సిద్ధాంతం యిది' అంటారుగాని యదార్థమని స్వీకరిస్తారా?

అంతేగాకుండా 'ఎంతో శ్రమకోర్చి తయారుజేసిన పుస్తకాన్ని నామరూపం లేకుండాపూర్చిపెట్టబోతాడు' అన్నట్లుగా యుగయుగాలుగా కృషిచేసి, శక్తిని పరమాణురూపంగా అమర్చి ద్రవ్యంకల్పించి

సర్వనాశనమా ! - సర్వోదయమా !!

ఘనీభవించినశక్తి స్వరూపంగానున్న ఆ ద్రవ్యానికిజీవంపోసి (తన సృష్టికి ప్రతిసృష్టిచేయాలని తన్ను అనుక రించే) మానవుని తయారుచేసిన ఆ అఘటనఘటనా చతురుఁడగు విశ్వకార్మికుఁడు - 'దీన్ని అంతా తీసికు వెళ్లి గంగలో కలిపేస్తాడు. అంతతో సర్వశూన్యం, సర్వనాశనం అయిపోతుంది' అని రాద్ధాంత సిద్ధాంతాలు చేసే - యిలాంటి వూహాలు విశ్వసింప బడతాయా? సర్వనాశనంతప్ప గత్యంతరం వుండదనగలమా?

జిజ్ఞాస - విజ్ఞానదృష్టి మానవ సహజములైనవని, జ్ఞానార్జనయే మానవజీవితపు ముఖ్య కర్తవ్యమని గమనించి వెనుక, యీ జ్ఞానసముపార్జనకు పల్వురు పలుశతాబ్దములలో పలువిధముల గడంగిరన్న విషయం కూడ మన గుర్తించగలం. మతాలవల్ల, తపాలవల్ల, ప్రకృతిశోధనవల్ల, చివరకు లోకజీవనంవల్లకూడ కొంత కొంతజ్ఞానం లభిస్తూ వచ్చిందనాలి. 'జ్ఞాన'మంటే - సృష్టిలోని వస్తువులగూర్చి, విషయములగూర్చి మానవుఁడు తన యింద్రియములద్వారాః తదధిష్టాతయగు మనస్సుద్వారా యెరుగనయ్యే విషయసంచకమని ఒకతెగవారి అభిప్రాయం. ఈమాదిరి జ్ఞానం చాలవరకు పాశ్చాత్యశాస్త్రాలవల్ల లభిస్తుంది. 'ఇంద్రియా ధిష్టములగు భౌతికవస్తువులగూర్చియేగాక తదితరములగు సర్వ విషయములగూర్చిగూడ తెలిసికొని - ఇది మిధ్యయని నిరూపించగలిగి, యుక్తాయుక్త వివేకంతో సృష్టికి, తనకు, సృష్టికర్తకుగల భిన్నత్వ యేకత్వముల గ్రహించగలుగుట; అంతేగాక, స్వానుభవముచే నిత్యానంద, సుఖ శాంతుల చందమరయగలుగుట - ఆదిగాగలదేదైతే యున్నదో అదే -' 'నిజమగు జ్ఞాన'మని, 'విజ్ఞానం' అనీ ఆదిమవాసులైన భారతీయుల దృష్టిలో - అర్ధం. దీనిని సాధించుటకైయుండే మనోవాంఛనే 'జిజ్ఞాస'యన్నారు.

ఎవరుదేన్ని 'విజ్ఞాన'మనుకున్నా - మానవబుద్ధికి యీ సృష్టిలోని వస్తుజాలాన్నిగూర్చి తెలిసికోవాలన్న అభిలాష, సృష్టికి ఆది - క్రమం - అవధి యెరిగికోవాలన్న కుతూహలం సహజంగా ఉందనడం మాత్రం నిజం. ఆ అభిలాషయే యింతవరకు మనిషి సేకరించిపెట్టిన సర్వజ్ఞానానికి మూలమైంది. క్రమేణా వస్తుజాలంనుంచి సృష్టికర్తమీదికి - దృష్టి ప్రసరించడంగూడ సహజమేకావాలి! అలా అయిందా?— చూద్దాం.—

జ్ఞానార్జనానికియుండే మార్గాలలో శాస్త్రపరిశోధనా విధానం ఒకటి. శాస్త్రరీత్యానేగాక, జ్ఞానార్జనానికి వేరే మార్గాలున్నాయి. అవే మన పూర్వులవలంభించిన మార్గాలు. వారు - యిప్పటి దూరదర్శని యంత్రాలు, 'న్యూటను' (Newton) గారి పునాది సిద్ధాంతాలు, మరి యితర శాస్త్రపరికరాలు ఏమీ లేకుండానే గ్రహాలసంచారక్రమం, గ్రహణాల సంఘటనకాలం, వాసింతైనా తప్పిపోకుండా సరిగా లెక్కలుగట్టి చెప్పేరు. పిపీలకాది బ్రహ్మపర్యంతమువారూ పరీక్షించేరు; కాని మానసిక - జ్ఞాన - నేత్రంతోటే. పరిశీలించి ఇద మిత్థమని వ్రాసిపెట్టేరు. అవి చదివిచూస్తే మన నిగమార్థాలకు పాశ్చాత్యుల శాస్త్రార్థాలకు వుండే పూర్వాపరా సంబంధాలు గ్రహింపవచ్చు.

ఒక్కవిషయం తప్పక గుర్తింపదగ్గది:—భౌతికదృష్టితో విశ్వాన్ని పరీక్షించిన ప్రస్తుత పాశ్చాత్యులు - పారమార్థికబుద్ధితో తమ్ముతామే శోధించుకొన్న పూర్వీకులు చివరకు ఒకే అభిప్రాయం తేల్చడం ఆశ్చర్యమేను! పాశ్చాత్యంవారివి ప్రాచ్యంవారివి పద్ధతులువేరైనా - పరిశోధింపబడినవి సృష్టి మానవ ప్రకృతీని. ఒకరు చుట్టుత్రోవత్రొక్కేరు; ఇంకొకరు అడ్డుత్రోవనుచేశేరు. ఒకరు భౌతికంగా పరీక్షించడం మొదలెట్టి నీడనుండి గోడకుచూచేరు; ఇంకొకరు మానసికంగా మర్మాన్నెరిగి గోడనుండి నీడకుచూచేరు. అందుచేత వీరు చెప్పేవాట్లలో మొదట తేడాలుంటాయి - కాని చివరకు అందరుచెప్పిందీ ఒకటేకావాలి -

'సత్యం' ఒకటేగనుక. ఆ తేడాలకు కారణం తెలియాలంటే యీ క్రిందిహంశాన్ని గుర్తించాలి:—ఏదైన గూర్చి అయినా మనిషి తెలిసికొంటున్నాడంటే రెండు ముఖ్యావసరాలుగా కనబడుతున్నాయి. ఒకటి (చూడబడే) బాహ్యవస్తువున్నూ, రెండు (చూచే) మనస్సున్నూ. కొందరు బాహ్య ప్రపంచంయొక్క యునికి యదార్థం అనుకొనిదాన్ని పరిశోధించేరు. ఇదే ప్రకృతి శాస్త్రాలుచేసినపని. మరికొందరు గ్రహించే మనస్సుండుటవల్లనే బాహ్య ప్రపంచకమనేది ఒకటి తోస్తుందని, మానసేతర ప్రపంచంయునికి ఊహమాత్ర మని, మనస్సుయొక్క యునికియే వాస్తవమని నమ్మేరు. ఇది భారతీయుల వేదాంతవిధం. 'ఎంతవర్ణించి చెప్పినా ఒక్కొక్క దృక్పథంలోచూచి గ్రహించిన విషయాలేగాని, సమగ్రదృష్టితో గ్రహించినవి కావ లవు. సమగ్రంగా తెలుసుకోవడం స్వతహాగా మానవబుద్ధికి సాధ్యంకాదనితోస్తుంది' అన్నారు కొందరు 'ఎక్కడో యేమూల కొమ్మనోయున్న చిన్న పర్ణానికిగాని, పుష్పానికిగాని అనంత విస్తృతమైన వృక్షాన్ని సమూలంగా తెలిసికోవడం తరంగాద'న్నారు మరికొందరు. 'తానెవరో తానెరుగని వింతమనిషి-తనకంటె యితరమైనదేదియో యున్నదని దాన్నిగూర్చి తన శాస్త్రపరిభాషలో చెప్పబూనుట తమాషా'యని కొంద రంటారు. 'అసలు సత్యం అవాఙ్మానసగోచరమై, అగ్రాహ్యమై, అవాచ్యమై, కేవలం స్వానుభవైక గమ్యమై వుంటుంద'ని జ్ఞానులంటారు! అంటే యేమిటో!

—కె. సుగుణమణి

జ్వర విషయములు

స్వస్థత జెందుటకు ఆహారము ముఖ్యముగా తోడ్పడును. శాస్త్రపరిశోధకులు జ్వరమును గురించి నూతన విషయములను తెలియపరచినారు. అదే మనదేహ ఉష్ణము హెచ్చుట, సహించలేని తలనొప్పి వణకునంతట చలి మొదలగునవి జ్వరచిహ్నములు. జ్వరవిషయము రక్తమునందు కల నరకండరములలో ప్రవేశించి మనుష్యుని బలహీనునిగా చేయును.

పూర్తిగా స్వస్థతచెందుటకు పూర్వము అలసిన అవయవములను తిరిగి అభివృద్ధిచేయుట అత్యా వశ్యకము. అందుకుగాను గట్టిగానుండు సర్వసాధారణ ఆహారము పనికిరాదు. కారణము కడుపు నీరసముగానుండి జీర్ణశక్తి లేకపోవుటచేత.

జ్వరపీడితులకు, హార్లిక్స్ శ్రేష్టమైన ఆహారపదార్థమని ఋజువుచేయబడినది. క్లిష్టసమయము లందు హార్లిక్స్ తీసికొనుటవలన కడుపుకేవిధమైన బాధ కలుగదు. స్వస్థతపొందుటకు కావలసిన వసువులు దీనియందున్నవి. అనతికాలములో దేహారోగ్యమునిచ్చి నూతన యవ్వన వంతునిగా చేయును. సాధారణముగా అన్ని ఆస్పత్రులలోను హార్లిక్సును జ్వరబాధితులకు ఇచ్చు ఏర్పాటుచేసినారు.

'అవ్వై హోమ్' అనాథబాలికా వసతిగృహము - బాలికల తోటపని

'దాసి శీలము దాచుటకై నీవే అరుదెంచితివా కృష్ణయ్యా!'



మీరా సమయాసమయాల పాటింపకుండా కోట వెలుపలనున్న ఆలయానికి పోతూ ఉందని
ఆమె శీలాన్ని శంకించితే, నిండుదర్బార్‌లో విషం ఇప్పించారు కుంభరాణా...



గోధుమలతో తయారుచేయదగిన వివిధ పదార్థములు—5.

పాకం బూరెలు

2 వంతుల పెసరపప్పును, చిటికెడువుప్పువేసి ముద్దగా వుడికించి, చిన్నచిన్న వుండలుచేసి, 1 వంతు గోధుమపిండిని కొంచెము చిక్కగా నీటితోకలిపి, దానిలో వుండలనుముంచి మరగించిన చమురులోదేవి, 3 వంతుల పంచదార లేతపాకంపట్టి, వుండలను వేయవలెను.

మజ్జిగ వుప్మా

1 ఫలం మరగించిన చమురులో, ఆవాలు, కరివేపాకు, మినపప్పు, శనగపప్పు కొద్దికొద్దిగావేసి, 2 ఎండు మిరపకాయలను కొద్దియింగువ, చిటికెడుపసుపువేసి పోపుపెట్టి 1 గ్లాను గోధుమనూకనువేసి కొంచెము వుప్పుతో $1\frac{1}{2}$ గ్లాను చిక్కని మజ్జిగనువేసి వుడికిన తర్వాత దించవలెను.

రసగుల్లా

3 వంతుల చిక్కనిపాలను మరగుచున్నప్పుడు అరబద్ద నిమ్మరసముపిండి, విరగగొట్టవలెను. దానిని వడగట్టగా వచ్చినముద్దలో 1 వంతు గోధుమనూకను ఎర్రగావేయించి కలుపి చేతితో బాగామద్దించి నిమ్మకాయంత వుండలుచేసి ఆవిరిమీద 10 నిమిషములు వుడికించి 3 వంతుల పంచదార లేతపాకంపట్టి దానిలో వేయవలెను.

కొబ్బరిపోళీ

3 వంతుల పచ్చి కొబ్బరికోరు, 2 వంతుల బెల్లముగుండకలిపి బాణలిలో వేయించవలెను. 1 వంతు గోధుమపిండిని ముద్దగాతడిపి, అరటిఆకులో, చేతితోవత్తి దానిలో కొబ్బరివుండలనుపెట్టి బొబ్బట్లువత్తి పెనముమీద చమురురాచి ఎర్రగా కాల్చవలెను.

అరటిపండ్ల బజ్జీ

ముగ్గిన అరటిపండ్లను, చక్రములుగా తరగవలెను. పావుశేరు గోధుమపిండిలో 1/8 శేరు పంచదార వేసి నీటితో చిక్కగాకలిపి, అరటిపండ్ల ముక్కలను గోధుమపిండిలో ముంచి మరగించిన నేతిలోగాని టెంకాయనూనెలోగాని వేయించి తీయవలెను.

8

విజిటబుల్ పఫ్స్

10 ఫలముల బంగాళాదుంపలను మెత్తగా వుడికించి తోలుఒలచి 2 ఫలముల వుల్లిపాయలను 4 పచ్చిమిరపకాయలను, అల్లమును, కొతిమిరిని సన్నగాతరిగి కొద్దిగా పచ్చికొబ్బరిముక్కను 1 ఫలం జీడిపప్పును చిటికడు పసుపుగుండ 1 చంచావుప్పును వుడికించిన దుంపలలోవేసి అన్నిటిని మెత్తగా రుబ్బవలెను. రుబ్బినముద్దను కోలగా బిళ్లలుచేసి గోధుమపిండిని చిక్కగా నీటితోకలిపి బిళ్లలను పిండిలోముంచి మరిగిన చమురులో వేయించవలెను.

బరోడా వుప్మా

1 పావుశేరు శనగపిండిలో 2 ఫలముల వుల్లిపాయలను 2 పచ్చిమిరపకాయలను సన్నగాతరిగి ½ చంచావుప్పువేసి గట్టిగా కలుపవలెను. 1 ఫలం మరగిన చమురులో కొద్దిగా మినపప్పు, ఆవాలు, 2 ఎండు మిరపకాయలు, కరివేపాకు కొద్దిగా శనగపప్పు, పోపుపెట్టి, ½ శేరు గోధుమనూకనువేసి 1 చంచావుప్పును వేసి ½ శేరు నీరుపోసి వుడికినతర్వాత వేయించిన పకోడీలనువేసి బాగాకలుపవలెను.

కొబ్బరికాయ హల్వా

1 ఫలంజీడిపప్పు, 1 ఫలంద్రాక్ష నేతిలో వేయించి తీసుకోవలెను. ఆ చమురులో, ½ శేరు గోధుమ ఏలకగుండ, నూకను, ఎఱ్ఱగావేయించి, 2 కొబ్బరికాయలను చిక్కగా పాలుతీసి, పోయవలెను. ½ శేరు పంచదార, కుంకుమపువ్వు, వేయించిన జీడిపప్పు, ద్రాక్షవేసి, పాలు యినికినతర్వాత దించవలెను.

మలబారు హల్వా

3 కొబ్బరకాయలను, చిక్కగా పాలుతీసి ఎసరుపెట్టవలెను. మరిగినపిదప, 1 గ్లాసు గోధుమపిండి 1 గ్లాసు బియ్యముపిండి, 2 ఫలముల జీడిపప్పు, 7 ఫలముల బెల్లముగుండ, 1 ఫలంద్రాక్ష, ఏలకగుండవేసి ముద్దఅయేవరకు కలుపుతూ, 1 ఫలం నెయ్యివేసి దించి, పళ్లెములో ఆరపోసి, పలచగా ముక్కలు కోయవలెను

పైనాపిల్ కేకు

1 పావుశేరు గోధుమనూకను, 1 పావుశేరు శనగపిండిని, చమురువేయకుండా, వేరువేరుగా వేయించి తీయవలెను. ½ కురిడీ ఎండుకొబ్బరికోరును గోధుమనూకతోచేర్చి, మెత్తగాదంచవలయును. తర్వాత శనగ పిండిని కలిపి, 2 ఫలముల జీడిపప్పును సన్నగా ముక్కలుచేసి, ఏలకగుండవేసి దంచిననూకతో, శనగపిండిని, జీడిపప్పుముక్కలను వేసి, బాగా కలుపవలెను. 1½పావుశేరు పంచదార ముదరపాకంపట్టి, దానిలో దంచిన గుండనువేసి ¾పావుశేరు నెయ్యిపోసి, గట్టిపడినతర్వాత, ఒక పళ్లెములో ఆరపోసి, రోజు ఎసెన్సువుచ్చి, ముక్కలుకోయవలెను.

గోధుమ ఆపాలు

¼ శేరు గోధుమలను ¾ శేరు ఎసరులోపోసి, వుడికించివార్చి, మెత్తగా రుబ్బవలెను. ¾ శేరు పుల్ల పెరుగులో ¼ శేరు బియ్యంపిండినివేసి, నూరినముద్దనువేసి, 1 చంచా వుప్పువేసి, 1 చిప్ప పచ్చికొబ్బరికోరువేసి, సన్నమంటమీద, బాణలిలో చమురురాచి ఆపముపోసి, పైన సన్ననిప్పు శగనువుంచవలెను.

నూకరొట్టె

1వంతు మినపప్పును నానబెట్టి మెత్తగారుబ్బి, 1వంతు గోధుమనూకనుకలిపి, 1చిప్ప పచ్చికొబ్బెరి కోరును, 1 చంచా వుప్పుగుండను వేసి, ఒకపాత్రలో నెయ్యిరాచి, ఈపిండినిపోసి, ఆవిరిలో వుడికించవలెను.

పొట్లకాయ చిప్స్

5 ఫలముల బంగాళాదుంపలను వుడికించి, తోలువలచి, కొద్దిగా కారముపొడి, చిటికెడు పసుపు గుండ, ½ చంచా వుప్పును వేసి మెత్తగానూరవలెను. 1 పొట్లకాయను, 1 యించిపొడవున గుండ్రముగా ముక్కలుకోసి దానిలోగింజలుతీసి వుడికించిన బంగాళాదుంపముద్దను పొదిపి గోధుమపిండిని చిక్కగానీటితో కలిపి, ముక్కలను పిండిలోముంచి, మరిగిననూనెలో వేసితీయవలెను.

—ఇమ్మానేని సావిత్రీదేవి

కొబ్బరి కజ్జికాయలు

ముదురు కొబ్బరి కాయలు నాలుగుకోరి ఎఱ్ఱగావేపి ఒక పెద్ద పళ్లెములో వేయవలెను. ½-సేరు గోదుమరవ ఆలాగేవేయించి కోరుతోకలుపవలెను. సోలెడు గసగసాలు తగుమాత్రం యాలకపొడి, కిసిమిసి పళ్లు, ఒకసేరు పంచదార ఇవి అన్నియు కోరుతోవేసి కలిపిపూర్ణము తయారుచేసి, తవ్వెడు మైదాపిండి, తవ్వెడు గోదుమపిండి, చిటికెడు వుప్పు, గిద్దెడు పంచదార వేసి పూరీలుపిండివలె తడిపి నెయ్యితోమర్దించి పూరీవలె పలచగాచేసి పైపూర్ణము పెట్టి మడిచి అంచులు కజ్జికాయల చక్రముతో కోసివేయవలెను. ఇట్లు తయారుచేసిన తరువాత కళాయిలో నూనె, నెయ్యి వేసికలిపి కజ్జికాయలు దోరగా వేయించవలెను.

గోధుమ పాలముంజలు

½-సేరు చిక్కనిపాలు పొయ్యిమీదపెట్టి పొంగు వచ్చినప్పుడు ¼-సేరు గోదుమపిండి గరిటజారుగా చిటికెడు వుప్పు సోలడు పంచదార, కొంచము యాలుకలు పొడి పాలలోవేసి వుండకట్టకుండా కలిపి దించవలెను. ఒక కొబ్బరికాయ కోరు అర్ధపావు పంచదార కలిపి లేతపాకము పట్టి పళ్లెములో వేయవలెను. పైచెప్పిన పిండిముద్దచేసి, చేతికి నెయ్యిచరుముకొని నిమ్మకాయలంత వుండలుచేసి చేతితోతట్టి కొబ్బరిముద్ద పెట్టిపొదిగి అరచేతివెడల్పున తట్టి నేతిలో వేయించవలెను.

—ద్వారపు రత్నాబాయి

గులాబిజామలు

½ శేరు పాలు మరగనిచ్చి ½ శేరు పంచదారను పాలలోవేసి గరిటెతో కలుపుతూ వుండవలెను. గట్టిపడిన తరువాత దింపి దొండకాయలవలె చేసి, పావుశేరు గోధుమపిండి నీటితో కొంచం చిక్కగా కలిపి, ½ శేరు నెయ్యిని వెడల్పుపాత్రలో పోసి మరగనిచ్చి గులాబిజామలను పిండిలో ముంచి నేతిలోవేసి వేయించి తీసి, 1 శేరు పంచదార లేతపాకం పట్టి కొంచెం నిప్పులమీద వుంచి వేయించిన గులాబిజామలను పాకంలో వెయ్యవలెను.

రవచంద్రకాంతలు

పావుశేరు పెసరపప్పు నీటిలో నానబెట్టి మెత్తగా రుబ్బవలెను. దానిలో పావుశేరు గోధుమ రవను రుబ్బి కలుపవలెను. ½ శేరు పంచదార పాకంపట్టి రుబ్బిన పిండిని పాకంలోవేసి ¼ తులం ఏలకపొడివేసి కలిపి ఒక పళ్లెమునకు నెయ్యిరాచి దానిలోపోసి చాకుతో ముక్కలు కోయవలెను. ½ శేరు నెయ్యిని పొయ్యిమీద పెట్టి కోసిన ముక్కలను వేయించవలెను.

కజ్జికాయలు

¼ వీశ గోధుమపిండిని నీటితో గట్టిగ కలుపవలెను. ¼ వీశ గోధుమరవ నేతిలో ఎఱ్ఱగావేయించి, 1 కాయ కొబ్బరికోరు వేయించి కలుపవలెను. ¼ వీశ పంచదార, కొద్ది ఏలకపొడి కొంచం నెయ్యి వీటినికూర నూకలో కలుపవలెను. గోధుమపిండిని పూరీవలె వత్తి దానిలో ముందుచేసిన లస్కోరాను పెట్టి కజ్జికాయల బల్లలోపెట్టి మణచి ½ వీశ నెయ్యిని వెడల్పు పాత్రలోపోసి కాగనిచ్చి కజ్జికాయలను వేయించి తీయవలెను.

ఇడ్లీ భాత్

పావుశేరు మినప్పప్పు నీటిలో నాననిచ్చి మెత్తగ రుబ్బి పావుశేరు గోధుమరవ కలిపి ఇడ్లీ వండవలెను. ఇడ్డెనలు దింపి మెత్తగ పిసకవలెను. ఒక పాత్రను పొయ్యిమీదపెట్టి 2 తులముల నెయ్యివేసి ½ తులం మినపపప్పు, ¼ తులం ఆవాలు, కొంచం మెంతులు, కర్వేపాకు, 4 పచ్చిమిరపకాయ ముక్కలు, అల్లం ముక్కలు వీటినన్నిటిని వేయించి పైపిండిని వేసి 10 నిమిషములుంచవలెను. తరువాత దింపి 1 నిమ్మపండు రసం పిండవలెను. తగుమాత్రం వుప్పు వేయవలెను.

రవ జంతికలు

¼ వీశ వరిపిండి ⅛ వీశ శనగపిండి ¼ వీశ గోధుమరవ 1 చిటిక సోడా ½ తులం కొట్టిన వుప్పు ¼ తులం వాము ¼ శేరు నువుపప్పు వీటిని తగుమాత్రం వేసి నీరుపోసి గట్టిగ కలుపవలెను. ఒక వెడల్పుపాత్రలో నెయ్యిని కాగనిచ్చి జంతిగలు తిప్పి వేయించి తీసిపెట్టవలెను.

—సి. హెచ్. అన్నపూర్ణాబాయి

బంగారుపతకం బహుమానం

గోధుమ ధాన్యముతో చేయదగిన పలువిధములైన పదార్థములను, గత సంచికల లోని నాలుగు పట్టీలయందు ప్రకటింపబడినవి గాక, ఎక్కువ పదార్థములను వ్రాసి పంపినవారికి ఒక 'బంగారుపతకము' బహూకరింపబడును. వెనుక గృహలక్ష్మిలో ప్రకటింపబడిన వాటినిగూడ ఎత్తి వ్రాయగూడదు.

సంపాదకుడు

పుష్ప చయము * * *

హిందూ స్త్రీల ఆస్థిహక్కుల బిల్లు

హిందూ స్త్రీల ఆస్థిహక్కుల శాసనాన్ని ఇంకా సవరించడానికిగాను అఖిలచంద్ర దత్తాగారు ఢిల్లీ కేంద్రశాసనసభలో ఒక బిల్లును ప్రతిపాదించారు. ఈ బిల్లును సెలెక్టుకమిటీకి పంపాలనికూడా వారు కోరారు. హిందూ కుమార్తెకు కొత్తహక్కుల నివ్వటం యీ బిల్లు ఉద్దేశ్యంగాదు. 1938 సం॥పు హిందూ స్త్రీల ఆస్థి హక్కు ఆక్టువల్ల పోయిన హక్కులను తిరిగి సంక్రమింపజేయడమే యీ బిల్లు ఉద్దేశ్యం. ఈ సవరణ ఆక్టువల్ల కుమార్తెల హక్కులు కోడండ్రకు ఇవ్వబడింది. 1938 సం॥కు పూర్వము కుమార్తెలకున్న హక్కులు తిరిగి వారికివ్వబడతాయి. ఈ బిల్లు ప్రజాభిప్రాయానికి పంపబడింది. వచ్చిన అభిప్రాయాల్లో అధికభాగము బిల్లుకు అనుకూలంగా వున్నాయి.

ముఖ్యంగా వారసత్వపు హక్కును, తరువాత వసతి, భరణము, విడాకులు మొదలైన యితర విషయాలను చర్చించడానికి, సాధ్యమైనంత త్వరలో విచారణసంఘాన్ని నియమించడానికి ప్రభుత్వంవారు ఏర్పాట్లుచేస్తున్నారు.

ఫిలిం డైరెక్టర్లకు సలహా

రాజమండ్రి మహిళాసభవారు ఫిలిం డైరెక్టర్లకు యీలా సలహాలిచ్చారు :

తెనుగు సినీమాల్లో పాడేపాటలు హిందీపాటలవరుస ననుకరించుట పరిపాటైపోయిందనియు, ఇది ఆంధ్రులకు కళంకదాయకమనియు, తెనుగు సంగీతంలో అనేక కొత్తరాగాలు కలవనియు, కావున ఈలోటును సవరించుటకు మ్యూజిక్కు డైరెక్టరులను కోరుచు ఒక తీర్మానం గావించారు.

ప్రాచీన నాటకలక్షణాల్లో రంగస్థలమున భోజనాలు, శయ్యాగృహము, మరణము, మున్నగునవి నిషేధించిరనియు, ఆనియమాలు ఫిలిములలో పాటించనందున అనేగ అనర్థాలు వస్తున్నవనియు వీటిని సవరించమని కోరుచూ మరొకతీర్మానమును గావించారు.

ఐదుఏళ్ల తల్లి

ప్రపంచంలోకంతా గూడ చిన్న బిడ్డతల్లి పెరూదేశస్థురాలు "లినామెడీనా." ఈమె 5 సంవత్సరముల వయస్సు, ఒక గజంపొడుగుగలిగి యున్నది. ఈమెకుబుట్టిన మగబిడ్డ 6 పౌనులబరువు గల్గి యున్నాడు. ఈ సృష్టివైపరీత్యానికి డాక్టర్లు తారుమారవుతున్నారు.

లినామెడీనాకు భర్త ఎవరు? అనేదింకా తేలనేలేదు. మెడీనాతల్లి ఇలా అంటుంది: "పరిసరాల్లో "డైరణో"అనే ఒక పాముజాతివుంది. హిందూశాస్త్రప్రకారం ఆజాతిపాములు స్త్రీలకు గర్భాన్నిగల్గిస్తవి. ఒకనాడు మెడీనా ఆపాముకాటుకు గురిఅయింది. కనుకనే సంతానోత్పత్తి గల్గివుండవచ్చు." తండ్రి ఇంకోరకం కథచెప్తాడు: తాము నివసించే ప్రదేశముప్రక్కన కొండలలో ఒక చిన్నగుంట గలదనియూ, (దానిపేరు "పూల్ ఆఫ్ బర్త్") ఆ గుంటలో స్నానమాడినవారికి గర్భోత్పత్తి గల్గునని యు, మెడీనాకది అలవాటనియు, అదేఆమెకు గర్భోత్పత్తి కారణమై యుండవచ్చుననియు అంటాడు.

నిజం నిలకడమీదగానీ తెలియదు. చికాగోలోని డాక్టర్లు అంతా చాలాకాలంనుండీ వైద్య ప్రపంచాన్ని కలవరపరిచే సృష్టి రహస్యాన్ని కనుగొనుటకై తీవ్రకృషి సల్పుతున్నారు. వారి కృషిఫలితానికి లినామెడీనా కారకురాలౌతుందా?

దేవుడు నిద్రపోతున్నాడా?

పూర్వం హిందూయోధులు రణభూమికి వెళ్ళేటప్పుడు వారి తల్లులుగాని, సతులుగాని నొసట కుంకుమ పెట్టి విజయాక్షింతలు చల్లి పంపేవారట. జవహర్‌లాల్ గాంధిజీని చూడవస్తే కస్తూరిబాయి జవహర్‌ను ఒకక్షణం ఆగమని నొసట కుంకుమ తిలకం దిద్దిందట. 'ఇప్పుడీ గొడవ ఎందుకూ? అవసరంలో' దన్నాట్ట జవహర్. 'మనం మళ్లీ ఎన్నాళ్లకు కలుసుకుంటామో భగవంతుడికే తెలియాలి.' అన్నదట ఆపుణ్య తల్లి. 'లేదు లేదు. అమ్మా! దేవుడు, నిద్రపోతున్నాళ్లే!' అన్నాట్ట నెహ్రూ పండితుడు.

కల్లు సారాయీలకు బదులు 'టీ'

కాన్పూరు'లేబర్ వెల్ ఫేర్ సెంటర్సు'శాఖాధికారియొక్క యిటీవ ప్రభుత్వ ప్రచురణలోయిలా వుంది: "ఇండియన్ టీ మార్కెట్ ఎక్‌స్పాన్‌షన్ బోర్డువారిని లేబరు వెల్ ఫేర్ సెంటర్సులో ప్రతిచోట కనీసము ఒక్కొక్క 'టీ'శాలను ఏర్పాటుచేయవలసినదిగా కోరడమైనది. ఆ యాశాలలో టీ ఉచితముగా ఇచ్చుచున్న బోర్డువారు అభివందనీయులు. వారు రేడియోనుకూడ ప్రతిచోట స్థాపించుటచేత పనివారు తరుచువచ్చి వార్తావిశేషముల తెలిసికొనుటకు సౌకర్యంగా ఉంటోంది. 1939లో రోజు 1కి యీ టీశాలలలో 3,430మంది టీ పుచ్చుకుంటూ వుండేవారు. ఇప్పుడు 4,290 కప్పుల టీ వరకు ఖర్చు అవుతోంది. దీనివలన లేబరు సెంటర్సుయెడల జనులకు ఆసక్తి ఎక్కువ అవుతూ వుంది."—

కల్లు సారాయీలకుబదులు యీ టీ పానీయాన్ని ప్రవేశపెడితే బాగానేవుంటుంది. అయితే కల్లు సారాయిలు ముందుగా మాని వేసిన తర్వాతే యిది ప్రవేశపెట్టబడాలి. లేకపోతే రెండు అలవాట్లు అయిపోయి కొరివితో తలగోక్కున్నట్టవుతుంది.-

ఖమ్మం కర్మం

ఖమ్మంలో కొన్ని ఇతరప్రాంతాలవలె ఆంధ్రబాలికల విద్యావ్యవస్థలో ఇబ్బంది యేర్పడింది. బాలికలు బాలురవలె పరభాషలో విద్యాభ్యాసము చేయుటకు వీలులేదు. ఇదివరలో ప్రభుత్వమువారు తెలుగుబాలికలకొరకు పాఠశాలను స్థాపించి నడిపించుచుండిరట. "మొహితెమీంసాహెబా"గారు ఇటీవల ఖమ్మం వెళ్లినారు. బడిచూచినారు. పోయినారు. బడి బందుచేయుటకు శ్రీముఖంపంపినారు. ఆంధ్రపాఠశాల అంధపాఠశాల అయిపోయింది. ఇష్టముంటే మీ పిల్లలు ఉర్దూబడిలో ఉర్దూ చదువుకోవలె అన్నారట! జనసంఖ్యలో ఆంధ్రులెక్కువ. ఉర్దూచదువువారు తక్కువ. కాని యీ "సాహెబా"గారి తర్కం తలకిందుతర్కంగావుంది. ఈ "సాహెబా"గారి కిట్లుచేయుటకు విద్యాశాఖ వారధికారమిచ్చినారా? ఇచ్చినచో ఏనియమానుసారముగా ఇచ్చినారో? తెలియదు. అదే గ్రామస్థుల పన్నులతో ఉర్దూపాఠశాల నడుపవలెను. అదేగ్రామస్థుల చందాలతో తెలుగుపాఠశాల నడుపుకోవలెను. ఇక విద్యావ్యాప్తి యెట్లగును? ప్రభుత్వమువారు వెంటనే ఈ ఘోరమైన అన్యాయాన్ని తొలిగింపవలెను.

—గోలకొండ.

తొమ్మిదణాలకోసం ఆస్తిని వేలంవేశారు

నిరైసాహు ఒరిస్సారాష్ట్రంలోని పల్లహారా ఎస్టేటుకు చెందిన ఒక బీదరైతు. ఒకనాడు, అతడువుండే 'తాలబహాలి' గ్రామ ప్రాథమిక పాఠశాల ఇంటికప్పు నేతనేయడానికి, కూలినాలి లేకుండానే రమ్మనమని స్థానిక అధికారులు కోరారు. నిరైసాహు రానన్నాడు. అంచేత అతనికి తొమ్మిది అణాలు జుల్మానా విధించారు. అతడా జుర్మానా ఇవ్వలేదు. అంచేత అతనికున్న ఆస్తిని అధికారులు వేలంవేశారు ఆ తొమ్మిదణాలు రాబట్టుకొనేందుకు. ఇది జరుగుత ఎప్పుడో కాదు గత సెప్టెంబరు మాసంలోనే.

—స్టేటును పీపుల్.

చలనచిత్రాలు

జగదీశ్ ఫిలిమ్సువారి 'విశ్వమోహిని' వన్నెమీరిన వ్యంగ్యచిత్రం

వీరి రెండవ సాంఘిక చిత్రమైన 'విశ్వమోహిని' గతమాసంలో విడుదల అయింది.

ఆంధ్రదేశపు అన్ని కేంద్రాల్లోను అమితోత్సాహంతో సాగిపోతోంది. కథ నవీన చలనచిత్ర కళా పరిశ్రమకు చెందినదవటంచేత, దీనిలోని కథలో క్రొత్తదనం ఒకటి రూపొందింది. ఈ పరిశ్రమయొక్క లోటుపాట్లు, నటీనటులయొక్క తీరులు, డైరెక్టర్ల ప్రవర్తనలు, పెట్టుబడిదార్ల వ్యవస్థలు వ్యంగ్యముగా విమర్శింపబడుతూ, యీ పరిశ్రమ నాధారం చేసుకునేవారికి చాలావిషయాలను బోధిస్తోంది.

సుప్రసిద్ధ దర్శకుడు శ్రీ వై. వి. రావుగారు ప్రధానభూమికను చక్కగా నిర్వహించారు. కథా నాయకురాలు శ్రీమతి లలిత తనపాత్రను చక్కగా పోషించింది. సంగీతంకూడా చాలామధురంగావుంది. ఫొటోగ్రఫీ, సౌండు నిర్దుష్టంగా వున్నాయి.

సినీమాలను 'ఖులాసా కాలక్షేపం'గా చూచిరావడానికి యీ చిత్రంలో కావలిసినంత వస్తువుంది. ఒకసామాజిక వ్యవస్థను వ్యంగ్యంగా చిత్రించడానికి పూనుకొన్న యీ చిత్రం విజయవంతమయింది అని చెప్పొచ్చు.

ఫేమస్ ఫిలిమ్సువారి 'ధర్మపత్ని'

చిత్రం పూర్తిఅయి చాలాకాలమైంది. దీనిలో సంఘజీవితానికి సంబంధించిన క్రొత్తవిషయాలు బాగా చర్చించబడ్డాయి. దర్శకులు పి. పుల్లయ్యగారి దర్శక చాకచక్యం దీనిలో మూడుమూర్తులా మూర్తీభవించి, ఒక అపూర్వస్థానాన్ని సంపాదిస్తుంది.

శ్రీ వసుంధరా ఫిలిమ్సువారి 'మైసూరు దసరాచిత్రం'

శ్రీ గాలి వెంకటేశ్వరరావుగారి ఆధ్వర్యాన వెలువడబోతోంది. స్వదేశ సంస్థానాల్లో మకుటాయమానమైన మైసూరురాజ్యములోని బృందావన ఆరామాలు, శివగంగ జలపాతాలు, జంతుప్రదర్శనశాలలు శాస్త్రీకదృశ్యాలు, దసరాఉత్సవాలు, దర్బారులు మొదలైన వివిధదృశ్యాలు చక్కగా పొందుపరుప బడ్డాయి ఇందులో. వీటినిచక్కగా వివరించడానికి చక్కనిపాటలు, మాటలు కూరుస్తున్నారు. రెండుభాషల్లో అప్పుడే తయారయింది. మరిరెండు భాషల్లో తయారవుతూవుంది. మనదేశానికి సంబంధించిన ఇటువంటి రసవత్తర విషయాలను ఇటువంటి వృత్తాంత చిత్రాలుగా తయారుచేసి, ప్రజలలో విజ్ఞానాభివృద్ధికి దోహదమిచ్చే శ్రీ వెంకటేశ్వరరావుగారి ప్రయత్నం అభినందనీయం.

నవ్యకళావారి 'మీరాబాయి'

యీ పరమ భక్తురాలి దివ్యచిత్రం యీ మాసం 5-వ తారీఖున ఆంధ్ర దేశంలో విడుదల కాబోతూవుంది. దీనిలో నవ్యపోకడలు, హృదయంగమమైన గానం అమితంగా వుంటాయని తెలుస్తోంది.

గ్రంథ సమీక్ష

ప్రేంచందు అనువాదాలు

కర్త: శ్రీ నెల్లూరి కేశవస్వామిగారు. సాధనసమితి వారి రెండవ సుమం. చిరునామా, సాధన సమితి, సికిందరాబాదు, దక్కను. వెల తెలియదు—

ఇందులో ఆత్మగానం, సతి, తుదికానుక, బరాత్ అనే నాలుగు కథలున్నాయి. భిన్నభిన్న జీవ తరంగాలను కథానికల్లో చెప్పడం ప్రఖ్యాత రచయిత ప్రేంచందు అందెవేసినచేయి. యీ నాలుగు కథల్లోను యీలాటి సమస్యలు చక్కగా పొందుపరుపబడ్డాయి. - కర్త శ్రీ కేశవస్వామిగారుకూడా మూలానికి ఏ విధంగాను తీసిపోకుండా అనువదించారు. రచయితకు మంచిభావనా దృష్టి, రచనాపుష్టి వున్నదని చెప్పటానికి యీ అనువాదాలే మంచి నిదర్శనం.

సఫలత

కర్త: శ్రీ వడ్లమూడి వేంకటరత్నం. దుగ్గిరాల, గుంటూరుజిల్లా, వెల ఒక రూపాయి—

"సఫలత ఒక్క ఇహమునకుగాని, పరమునకుగాని సంబంధించినది గాదు...తత్స్వరూపమును సూచించుటకీ చిన్నగ్రంథము తోడుపడగలదు." కవిగారి యీ ఆశయం యీచిన్న గ్రంథంలో పరిపూర్తి నొందింది. వివిధమైన శీర్షికలతో సఫలతాస్వరూపము చక్కగా విమర్శింపబడింది ఇందులో. ఆముష్మిక చింతా సక్తులందరు చదవదగినది.

గాంధీబోధ

యుగప్రవక్త గాంధీమహాత్ముని ధర్మ సిద్ధాంతాలను క్రోడీకరించి సర్వత్ర వ్యాపింపచేసే ఉద్దేశ్యంతో పుస్తకరూపంగా ప్రకటింపబడింది. ప్రతివారు చదివి అనుష్ఠింపదగినది. ప్రతులు కావలసినవారికి శ్రీ ముత్తింటి గు. వె. జ. సత్యనారాయణమూర్తి, కార్యదర్శి, శ్రీ రామకృష్ణ సేవాసంఘం, కొరువ, విశాఖపట్నం జిల్లా వారికి అర్ధణాస్టాంపు పంపిస్తూజాబువ్రాస్తే ఉచితంగా పంపిస్తారు.

కేనోపనిషద్

క్రౌన్ సైజు 62పుటలు వెల 0—8—0 వ్యాఖ్యానకర్త: మువ్మన్నేని లక్ష్మీనారాయణ చౌదరి గారు, అమృతలూరు. ఆర్యసంస్కృతి క్షీణించుచున్న ఈ నవ్యయుగంబున ఈ సుప్రసిద్ధాంధ్ర పండితుడు ఆర్య విద్యకు ముఖ్యస్థానమగు నీకేనోపనిషత్తునకు తృప్తికరమగు వ్యాఖ్యానమువ్రాసి తెనుగువారి కరకమలముల కందించినారు. బ్రహ్మవిద్యాజిజ్ఞాసువు లెల్లరునుజదివి వాంఛితార్థములం బడయుదురుగాక.

ఈశోపనిషద్

భాషా సంజీవినీ సంఘ గ్రంథమాల ప్రథమకుసుమము. వ్యాఖ్యానకర్త: మువ్మన్నేని లక్ష్మీ నారాయణ చౌదరిగారు. ఈచిన్న పుస్తకమున పదునెనిమిది మంత్రములుంగలవు. పరాపర బ్రహ్మల స్వరూపమిందు చక్కగ నిరూపింపబడినది. భాషసరళమగుటచే నెల్లరకును సులభగ్రాహ్యమై యున్నది. వెల 0—4—0 మాత్రమే.

యుద్ధరంగము

★ రష్యా జర్మనీ సంప్రదింపులు

★ టర్కీ– బల్గేరియాల సందిగ్ధ స్థితి

★ తూర్పుఖండంలో జపాను ఎత్తులు

— అరుంధతి —

ఇంగ్లాండును పూర్తిగా జయించి యూరపు ఖండములో జర్మనీ అధికారాన్ని స్థిరస్థాయి చేయాలనే దురూహతో హిట్లరు ఇంగ్లాండు మీద గత నాలుగైదు మాసములనుండి జరుపుతూవచ్చిన విమానదాడి యీ మాసంలో చాలావరకు చల్లబడింది. ఇన్నాళ్లనుంచి యీ విమానదాడులవల్ల లండను నగరంలోని సెంట్ పాల్సు కేతడ్రల్ మొదలైన ప్రాచీన కట్టడాలకు హానివాటిల్లి, కొంతవరకు నష్టపరచడం తప్పితే హిట్లరు చేయిగలిగిందేమీ కనపడలేదు. అందుచేత ప్రయోజనంలేని యీ దాడులవల్ల హిట్లరు కొత్త ఎత్తులు వేసుకోవలసి వచ్చింది.

పైగా అమెరికాకు రూజువెల్టు మూడోసారి అధ్యక్షుడుగా ఎన్నుకోబడ్డాడు. అధ్యక్షుడైనప్పటినుంచి రూజువెల్టు ప్రసంగాలలో ఇంగ్లాడుకు ఎక్కువగా సహాయం చేసేసూచనలు కనబడుతున్నాయి.

ఇది ఇలా వుండగా మధ్యధరాసముద్రంలో అనుకున్నంత అధికారం లభించకుండా వుంది. ఈజిప్టుతో యుద్ధం పచ్చివెలక్కాయి గొంతుకలో పడ్డట్టయింది ముసోలినీకి. ఈజిప్టును జయించి మధ్యధరాలో అధికారాన్ని స్థాపించుకుంటేనే గాని జిబ్రాల్టరు స్వాధీనం అవదు. అందుకోసం ఇటలీ తన యుద్ధక్రమాన్ని నల్లసముద్రంవైపు త్రిప్పవలసి వచ్చింది. మధ్యధరాసముద్రంలో చాలా ఉపకరించే దీవులు, కార్ఫూదీవి, క్రీట్ దీవి - మొదలైనవి గ్రీసుకువున్నాయి. ఇవి లోబరుచుకుంటే ఈజిప్టును వోడించడం చాలా సులువౌతుంది. అందుకోసం గ్రీసును జయించాలి. కాగా ముసోలినీ గ్రీసుతో యుద్ధానికి తలపడ్డాడు.

మొదటి నుంచి గ్రీసుకు ఇంగ్లాండు సానుభూతి చూపడమే కాకుండా సహాయం చేస్తూనేవుంది. విమానబలం మూలకంగా సహాయంచేయలేక పోయినప్పటికి మధ్యధరాలో గ్రీసుదీవులకు యేలాటి అపాయమూ రాకుండా కాపాడుతోంది.

★ రష్యా జర్మనీ సంప్రదింపులు

గ్రీసు, అల్బేనియా మొదలైనవాటిని లోబరుచుకుని, అటు నల్లసముద్రంలో నౌకాబలాన్ని స్థాపించుకోవాలని జర్మనీ, ఇటలీలు ప్రయత్నిస్తున్నాయి. ఇందుకోసం రష్యా యొక్క ఉద్దేశ్యం ఏమిటో తెలుసు కుందుకు సంప్రదింపులు జరిగాయి.

తదనుగుణ్యంగా రష్యా విదేశాంగ మంత్రి మాలటావ్ బెర్లినువచ్చి హిట్లరుతో సంప్రదింపులు జరిపాడు. ఈ సంప్రదింపులు ప్రధానంగా ఆర్థిక సహాయం సంబంధమైనవేకాక, రాజకీయ సంబంధంకూడా వున్నదని అనుకుంటున్నారు.

కాని నల్లసముద్రంలో నౌకాబలాన్ని నిర్మించుకోవడానికి రష్యా ఒప్పుకోలేదు. అందుచేత సిరియా, పాలస్తైనులకు సైన్యాలను తీసుకుపోవలసి వచ్చినప్పుడు టర్కీగుండా వెళ్లాలికనుక, టర్కీ వప్పుకోకపోతే, టర్కీవప్పుకున్నా, అందుకు రష్యా అంగీకరించవలసి వుండడంకూడ యీ సంప్రదింపులలో జరిగి వుండాలి.

రష్యాను సంతృప్తి పరచడానికి అటు జపానును చైనాతో ఎక్కువ సంబంధం పెట్టుకోక ఇండో చైనా విషయం చూసుకోవలసిందని ఇటలీ జర్మనీలు జపానుకు సలహా ఇచ్చివుండవచ్చును.

అంతే కాని, రష్యా—జర్మనీ, ఇటలీ, జపానులతో పూర్తిగా ఏకీభవించి ఇంగ్లాండుతో పోరుకు తలపడుతుందనుకోవడం పొరపాటు. జర్మనీ, ఇంగ్లండులు ఒకరితో ఒకరు పోరాడి, యుద్ధంలో ఎవరు నెగ్గినా, చివరకు యిద్దరూ బలహీనులైపోయి వుండడం రష్యా అభిమతమై వుండాలి. కాని యిరువురిలో ఎవరితోనూ కలియదు. ఇది నిజం.

వివిధ విషయాలనన్నిటిని చర్చించుకొనేందుకు హిట్లరు, మొలటోవ్‌లు సంప్రదించినప్పటినుంచి హిట్లరు, యూరపులో ఉన్న రాజ్యాల యొక్క రాజుల్ని, మంత్రుల్ని అందర్నీ జర్మనీకి రప్పించి వాళ్లతో చర్చలు జరువుతున్నాడు.

రష్యా ఇంక తటస్థంగా వుంటుందని హిట్లరుకు ధీమా గలిగాక యీ చర్చలు బాగా సాగిస్తున్నాడు. వియన్నాలో స్లోవాకియా, హంగరీ, రుమేనియా, జర్మనీ, ఇటలీ, బల్గేరియా, యూగోస్లేవియా ప్రతినిధుల సమావేశమై యూరోపు ఖండం యొక్క నూతనరాజ్యాంగ విధానాన్ని స్థిరపరచ దలచుకున్నట్టు వార్తలు తెలుపుతున్నాయి.

★ టర్కీ బల్గేరియాల సందిగ్ధ స్థితి

యూరపులో ఎన్ని దేశాలు తన అధికారంక్రింద వున్నాయో యీ సమావేశంవల్ల ప్రపంచానికి చూపించి తనకు పూర్తిగా లొంగనటువంటి బల్గేరియా, గ్రీసు, టర్కీలను భయపెట్టి యుద్ధం అవసరం లేకుండానే ఆయా దేశాలను ఆక్రమించుకో దలచినట్లు తోస్తోంది.

ఈ పరిస్థితులలో బల్గేరియారాజు బోరిస్ జర్మనీకిపోయి తమవంటి చిన్న దేశాలను బాధపెట్టవద్దని వేడుకోవడం చూస్తే, రష్యా బల్గేరియాకు సహాయంచేయదని నిరూపణ అవుతోంది. ఇక టర్కీ, యూరప్‌లోని యుద్ధజ్వాలలు తనమీదికికూడా ప్రాకుతే ప్రజల ఆస్తులు, సర్వం టర్కీ మిలటరీఅధికారుల కైవశం చేయాలని వుంటుందని ప్రకటించింది. అటు గ్రీసుకు బ్రిటను సరియైన సహాయంపంపడం మానుకుంది. ఇవన్నీచూస్తే, బల్గేరియా, గ్రీసు, టర్కీలను జర్మనీఇష్టానికి వదిలేసి రష్యా తప్పుకున్నట్టు కనబడుతోంది. టర్కీ జర్మనీతో యుద్ధం తప్పించుకోవాలంటే ఇటలీ, జర్మనీ, జపానులతో ఏకీభవించి, బ్రిటనును నిరాకరించి, యూరపుఅంతా హిట్లరుదే అని ఒప్పుకోవాలి. ఇప్పుడు టర్కీ ఏంచేస్తుందో చూడవలసివుంది.

ఇటు, ఇంతకాలం నుంచీ తటస్థంగావున్న స్పెయిన్‌కూడా ఇంగ్లాడుతో యుద్ధానికి తలపడే ప్రయత్నంలోవుంది. స్పెయిన్ విదేశాంగమంత్రి సునేర్ జర్మనీవెళ్లి మంతనాలు జరపడమూ, జిబ్రాల్టరును స్పెయినునుండి వేరుచేయడానికి బ్రిటీషువారు కాలువతవ్వడమూ అన్నీచూస్తే స్పెయిన్ జర్మనీ, ఇటలీ, జపానులతో కలసి ఇంగ్లాండుతో యుద్ధానికి తలపడుతుందని స్థిరమయింది.

★ తూర్పుఖండంలో జపాను ఎత్తులు

ఇటు తూర్పుఖండంలో జపాన్ చైనాతో సంధిచేసుకునే సూచనలు కనుపిస్తున్నాయి. ఇదంతా ప్రస్తుతంలో రష్యాతో విరోధంతెచ్చుకోకుండా, దానిని తృప్తిపరచడానికేగాని వేరుగాదు. ఇందుకు జర్మనీ ఇటలీల ప్రోత్సాహమే కారణం. అంచేత జపాను ఇండోచైనాతో తలపడింది.

ఈ పరిస్థితులలో అమెరికా బ్రిటనులు సయాం, ఇండోచైనాలతో స్నేహంకుదుర్చునే ప్రయత్నలలో వున్నాయని నిందలు బయలుదేరుతున్నాయి. ఇటు చైనాతో యుద్ధంఆపి, ఇండోచైనా సయాములను ఆక్రమించుకోడానికి ప్రయత్నిస్తూ, జర్మనీ ఇటలీలతో స్నేహంగా వుంటూ, రష్యాతో తటస్థంగా వుంటూ, క్రొత్త ఎత్తులువేస్తూవున్న జపానునుచూచి అమెరికా ఇంగ్లండులు చాలా జాగ్రతగా వుండవలసివుంది. ఈ పరిస్థితులు విషమించిననాడు యుద్ధ పరిస్థితులు ఇండియానుకూడా సమీపిస్తున్నాయని అనుకోవలసి వస్తూవుంది.

మొత్తంమీద, ఆరోజుకారోజు యుద్ధక్రమం బాగా తీవ్రంఅవుతూ, క్రొత్తరూపాలను పొందుతూవుంది అనిమాత్రం చెప్పగలము.

పత్రికా పరిచయం

యువకళ

సంపాదకులు: శ్రీ పుచ్ఛేవు వెంకటభాస్కరరావుగారు. కార్యాలయం: గాంధీనగరం, వాల్తేరు R.S. సంవత్సరచందా ఒకరూపాయి. విడిపత్రిక ఒక అణా.

ప్రథమ సంపుటం, ప్రథమసంచిక మా కార్యాలయచేరింది. పత్రిక చాలా చక్కగావుంది. రచనలు చిరపరిచితులైన యువకులవవటంచేతను, ఆధునిక సామాజిక పరిస్థితులకు సంబంధించిన భావాలవటంచేతనూ మంచి హృదయంగమంగా వున్నాయి. కథలకు, నాటికలకూ 'యువకళ'లో ఎక్కువ ప్రాముఖ్యతవుంది గనక, సజీవమైనభావాలలో సజీవమైన భావాలను ప్రజానీకంలో ప్రబోధంచేసి, 'యువకళ' సార్థకత్వం సంపాదిస్తుందని విశ్వసిస్తాము.

భీమాసేవ

సంపాదకులు: శ్రీ దంతుర్తి శాంతయ్యగారు, విజయనగరంసిటీ. సంవత్సరచందా రు 2-0-0 విడిపత్రిక 3 అణాలు.

కంపెనీలకును, ప్రతినిధులకును, పట్టాదారులకునుమధ్య పరస్పర సమరసభావమును పెంపొందించడానికి, పల్లెటూరి ప్రజలలో భీమా ఉద్యమమునుగూర్చి ప్రబోధంచేయడానికి యీపత్రిక పాటుబడుతుంది. ఆర్థిక వడగాడ్పులులేక, "భీమాసేవ" పదికాలాలపాటు ప్రజాసేవచేసి, భీమావృత్తి యెడల అకారణంగా వ్యాపించివున్న దురభిప్రాయాలను పారదోలుతుందని ఆశిస్తాము.

సంపాదకీయములు

15 వ ఆంధ్రరాష్ట్ర మహిళా మహాసభ

నంద్యాలలో గతమాసము 24వ తేదీని ఆంధ్రరాష్ట్ర మహిళామహాసభ 15వసారిగా సమావేశమై అత్యంత జయప్రదముగ జరిగినది. క్లిష్ట సంకలితమైన నేటి రాజకీయ పరిస్థితులలో నిది సమావేశమై ఒకవిశిష్ట దృక్పథముతో సాగిపోయినందులకు, సమావేశకర్తలగు విదుషీమణుల నభినందించుచున్నాము.

సభాధ్యక్షతవహించిన శ్రీమతి కామేశ్వరమ్మగారి ప్రసంగము మహిళా మహాసభకు ఒక నూతన దృక్పథమును ప్రసాదించినది. ముఖ్యముగ, ఆంధ్రరాష్ట్ర మహిళా మహాసభ "దేశీయసంస్థగా మారవలెను" అను వీరి నూతన కార్యప్రబోధము ప్రస్తుత సామాజిక పరిస్థితుల కెంతయు దగియున్నది.

15 సంవత్సరములనుండియు మహిళోద్యమము అకుంఠితముగ జరుగుచున్నను, మహిళా మహాసభ చేసినకార్యము చెప్పుకోదగినదేదియు గానరాదు. ఇందుకు యీ దృక్పథములేమియే కారణమేమో!

సాంఘిక దుర్నీతులు, స్త్రీ విద్య మొదలగు వాటిని గురించి ఎవరికిదోచిన విషయములను వారుచెప్పి, తదనుగుణ్యమగు తీర్మానముల గావించుటయేదప్ప నిర్మాణమును సూచించు కార్యక్రమెద్దియు లేక, సంస్థ నిర్వ్యాపారముగ నిల్చిపోయినది.

ఏ కొలదిమందినోతప్ప ఆంధ్ర స్త్రీలోకమునంతను కూడదీసుకొన లేకపోయినదన మహిళా మహాసభయొక్క కార్యక్షేత్ర మెంత సంకుచితమైనదో మనము గ్రహింపగలము.

ఆంధ్రరాష్ట్రమహిళా మహాసభకొక కేంద్రస్థానము మున్ముందుగ స్థాపింపబడవలయును. కార్యక్రమును వివిధశాఖలుగ భాగించవలయును. యీ శాఖలకు తగిననిర్వాహకురాండ్రను (Organisers) ఏర్పాటు చేయవలయును. వీరు ఊరూరతిరిగి ప్రచారముచేసి, ప్రతిగ్రామమునందును మహిళాసంఘముల స్థాపించి కేంద్రముతో సంబంధము కలుగజేసి, కార్య ప్రణాళికతో వెంటనే ప్రబోధము చేయవలసియున్నది.

రాజకీయ సాంఘిక, ఆర్థిక, పారిశ్రామికముగా స్త్రీలలో మానసిక పరివర్తన కలిగినగాని ఇది సంపూర్తిగాదు. అప్పుడు గాని ఆంధ్రరాష్ట్ర మహిళామహాసభ "దేశీయసంస్థ"గా మారజాలదు.

శ్రీమతులు దుర్గాబాయమ్మ, కామేశ్వరమ్మ, రామసుబ్బమ్మ, రత్నమ్మ, భారతీరంగా మొదలైన విద్యావతులు- వివిధ కార్యరంగములలో కృషిచేయుచున్న విదుషీమణులు- ప్రస్తుత స్త్రీ నాయకురాండ్రు. యీ విషయమున ఏల శ్రద్ధ బూనకూడదు? అందరుచేరి మహిళామహాసభకొక విశిష్టరూపమునిచ్చి ఆంధ్రదేశ మహిళా లోకమునంతను ఏల వికాసవంతము చేయరాదు?

రాష్ట్రకార్యరంగమును తేజోవంతముజేసిన గాని అఖిలభారతరంగము వీరికి సువిశాలముకాజాలదు. అందువలననే అఖిలభారతరంగమునందు పనిచేయు స్త్రీలు మన ఆంధ్రులలో ఒక్కరైనను గానరారు.

కావుననే ఇటీవల ఏర్పడిన నేషనల్ ప్లానింగుకమిటీ స్త్రీల ఉపసంఘములో ఆంధ్రసోదరీమణి కొకరికైనా స్థానములేక పోయినది. ఇది ఆంధ్ర స్త్రీలోకమేమాత్రము ఉపేక్షింపదగిన విషయముగాదు.

ఇట్టి దేశహితములగు స్థానలబ్ధికి, మున్ముందు రాష్ట్రనాయకత్వము ప్రాతిపదిక. రాష్ట్రసంఘమును చక్కని నిర్మాణపంథలోనడిపి, ఉజ్వలమైన స్త్రీ సంఘమును నిర్మించి, మహిళామహాసభకు సార్థకత్వమును ప్రసాదించుట నేటి స్త్రీ నాయకురాంద్ర కనీసధర్మము. ప్రతి గ్రామమునందును స్త్రీ సంఘముల స్థాపించి, గృహపాలనము, జాతీయ ప్రబోధము మొదలుగాగల సాంఘికపునర్నిర్మాణము గావించి, దేశీయ దృక్పథములో నడకసాగించి, ఆంధ్రభూమియందేగాక యావద్భారతభూమియందును ఆంధ్రస్త్రీలు ప్రముఖస్థానము పొందునట్లు ఆంధ్రరాష్ట్రమహిళా మహాసభ ప్రయత్నించునని విశ్వసించుచున్నాము.

♦ ♦ ♦ ♦

ఆంధ్రయువతీమండలి - హైద్రాబాదు

ఐదు సంవత్సరములకు పూర్వము స్థాపింపబడి, యీ ఐదు సంవత్సరములుగ హైద్రాబాదు స్త్రీలోకములో విజ్ఞానాభివృద్ధికి పాటుబడి కొంత తృప్తికరముగ పనిచేసినట్లు 'ఆంధ్రయువతీమండలి'వారి ఐదవ వార్షిక నివేదికవలన స్పష్టమగుచున్నది. చిత్రకళ, సంగీతము, వ్యాయామము మొదలైన విషయములయందు ప్రబోధకరములైన ఉపన్యాసముల జరపుట, కుట్టుపని ఆదిగాగల పనులు ఉచితముగ నేర్పించుట, స్వదేశీ వస్తు ప్రదర్శనముల నిర్వహించుట, మొదలగు స్త్రీ జనోపయోగకరములైన వివిధవిషయ ప్రసక్తిని నిర్వహించిన మండలివారు ఎంతయు అభినందనీయులు.

కాని, ఇట్టి సముచితమైన కార్యకలాపము కలిగిన యీ మండలియందు నూరుమంది సభ్యులైనను లేకపోవుట ఏమాత్రము ఉత్సాహకరముగ లేదు. మండలిలో హైద్రాబాదు స్త్రీలందరు చేరినగాని మండలి తన విద్యుక్త ధర్మమును నిర్వహించలేదు. ఈ స్త్రీమండలికి స్వంతభవనము నిర్మింప దలపెట్టబడినదని, అందులకు శ్రీ గద్వాల మహారాణిగారు వేయిరూపాయలు విరాళము నిచ్చియున్నారని నివేదికలో ప్రకటింపబడినది. ఇందుకు శ్రీమంతులు, ఉదారవంతులు తోడ్పడవలసియున్నది. స్వయంసహాయము వల్లనే యీమండలి ఇట్టివిషయములయందు కృషిచేసి విజయవంతము గావలసియున్నది. హైద్రాబాదు నారీలోకముయొక్క సంపూర్ణ సహకార సానుభూతులతో యీ మండలి సర్వతోముఖముగ అభివృద్ధిజెందిన, నేడు సంస్థాన పరిపాలనయందు కొనితేబడుచున్న స్త్రీ జనహితములగు శాసనములకు అఖండమైన సహాయము నీయగలదు.

ఐదవవార్షికోత్సవ సమావేశమున కధ్యక్షత వహించిన శ్రీమతి రామసుబ్బమ్మగారి అధ్యక్షోపన్యాసములో హైద్రాబాదు నారీలోకమునకు నూతనకాంతినిచ్చు విషయములు చక్కగ విశదీకరింప బడినవి. వీరి అధ్యక్షత రాష్ట్రరాష్ట్రేతర సంబంధప్రోత్సాహమేగాక, అభిప్రాయ సమీకరణకుకూడ దోహదమొసగుచున్నది.

మహిళాప్రపంచమున కుపకరించు సర్వసమస్యల యందును చక్కని పరిశ్రమజేసి, బ్రిటిషుపాలితాంధ్రులకన్న హైద్రాబాదు ఆంధ్రులువెనుక బడియున్నారను ప్రతీతిని నామమాత్రమునుజేయ 'ఆంధ్రయువతీమండలి' పాటుబడుగాకయని కోరుచున్నాము.

Edited by Dr. K. N. Kesari, Printed and Published by Dr. S. Seshagiri Rao, at the Lodhra Press, 15, Westcott Road, Royapettah, Madras.

ఫోను 8461 :

హాఫ్‌టోన్ బ్లాకులు

లైన్ బ్లాకులు

జింకుతోకానీ రాగితోకానీ

తయారుచేయుటకు

ఉక్కు మొహర్లు, రబ్బర్ స్టాంపులు

లాంటర్న్ స్లైడ్సు.

NEWTON & CO.,

Fine Art Engravers

80, Wallajah Road, Mount Road, Madras.

చక్కని పనితనము, శీఘ్రముగా పనిచేయడము

చౌకధరలు మాలక్ష్యము.

కేసరి

కర్పూరాంజనము

సర్వవిధములైన నొప్పులకు

తలనొప్పులకు, కీళ్లనొప్పులకు,

పురుగుకాటుకు, రొమ్ముపడిశ

ముకు జలుబుకు దివ్యాంజనము.

నొప్పితీవ్రతనుబట్టి రోజుకు 3,

4, సారులు వాడవచ్చును.

బుడ్డి 1 కి-8 అణాలు

కేసరికుటీరం – మద్రాసు

కంఠాభరణము

గృహలక్ష్మియందు ప్రకటింపబడిన మనోహర త్రివర్ణ చిత్రపటములందు 46 పటములను ప్రత్యేకముగ కోర్చి రచి యొక్కొక్క చిత్తరువునుగూర్చి వివిధవిషయములలో వాడుకభాషయందు హృదయరంజకము వ్రాయబడినది. ఇందలి రసవంతమగురచన, మనోజ్ఞమగు చిత్తరువులు, ఎల్లరనాకర్షించు విషయములు గలవు.

వెల రు. 2 0 0

గృహలక్ష్మీ కార్యాలయము,

రాయపేట, మదరాసు

సరస్వతీ రామాయణము

కొల్లాపుర స్నేహలతాకవితా సంఘోపాధ్యక్షురాలైన

శ్రీమతి చేబ్రోలు సరస్వతీదేవీ

విరచితము.

గంగాప్రవంతివలె శైలి సరసమై, సౌలభ్యమై, మధురమై, మనోజ్ఞమై పద్య పద్యమునందును మకరందము చిందుచుండును. భక్తిరసప్రధానమై, శాంత శృంగార కరుణారస భావభూయిష్ఠమై, ఆంధ్రసాహిత్యమునకొక సరసభూషణమీసరస్వతీ రామాయణము.

ఆంధ్రదేశమందు పండితపామరులచే

ప్రశంసింపబడినది.

వెల ఒకరూపాయి మాత్రమే

పోస్టేజి ప్రత్యేకము (అ. 2)

ప్రతులకు :

శ్రీమతి చేబ్రోలు సరస్వతీదేవి

గృహలక్ష్మీ కార్యాలయము,

రాయపేట : : మదరాసు

M-2357

గృహలక్ష్మి

1st January
1941



GRIHALAKSHMI

PRICE AS. 4.

Vol. 13

No. 11

KING OF TONICS



నరములకు తరుగని బలమునీయగల వరము

అమృత

ఆంధ్ర కన్నడ దేశములలో అపూర్వ ప్రదర్శనములు

మిమ్మల్ని అన్నివిధాలా ఆనందింపజేసే మహోజ్వల పౌరాణిక చిత్రము

భూకైలాస్

(మండోదరీ పరిణయం) (తెలుగు)

వేనకువేలు ప్రేక్షకులు చూచి ఆనందించారు

బలిజేపల్లివారి
కవిత్వం.
స్టూడియో :
ప్రగతీ పిక్చర్సు, మద్రాసు.

సుందరరావు నడ్కర్ని గారి
దర్శకత్వం.
ఆరితేరిన
నటవర్గము.

మీరూ నేడే సకుటుంబముగా చూచి ఆనందించండి

3 వ వారము

28_12_40 మొదలు

బెజవాడ - లక్ష్మీటాకీస్

విశాఖపట్నం - పూర్ణాథియేటరు

శికింద్రాబాదు - ఇందర్ టాకీస్

బెంగుళూరు - సాగర్ టాకీస్

కర్నూలు - సాగర్ టాకీస్

2 వ వారము

20_12_40 మొదలు

మద్రాసులో ఒకేసారి

పారగన్ & క్రౌన్ టాకీస్‌లో

26_1_41 మొదలు

రాజమండ్రి - జయా టాకీస్‌లో

4_1_41 మొదలు

తెనాలి - శ్రీ వెంకటేశ్వర టాకీస్‌లో

5_1_41 మొదలు

కాకినాడ - క్రౌన్ టాకీస్‌లో

తదితర ముఖ్య కేంద్రాల్లో త్వరలోనే విడుదల

ఈ టాకీ గీతములు 'ఓడియన్ రికార్డు'లలో వినండి.

వివరములకు :—

ఫేమస్ టాకీ డిస్ట్రిబ్యూటర్సు,

మౌంట్ రోడ్ : : మద్రాసు

విషయసూచిక

1. స్వాగతము—శ్రీ ఏడిద కామేశ్వరరావు ... 669
2. మకరసంక్రాంతి ... 670
3. 'సజీవమైన వాఙ్మయం కావాలి'—శ్రీమతి వక్కలంక సుబ్బాయమ్మ ... 672
4. ఆంధ్రభూమి ! నమామి—శ్రీ ఆకుండి వెంకటేశ్వరరావు ... 673
5. నక్షత్ర ఫలితాలు—కవికలహంసి శ్రీమతి చేబ్రోలు సరస్వతీదేవి ... 674
6. స్త్రీ సాముద్రిక శాస్త్రము ,, ,, ... 675
7. చెన్నపురి ఆంధ్రమహాసభ స్త్రీలశాఖాభివృద్ధి—శ్రీమతి బాలాంత్రపు శేషమ్మ ... 676
8. రాజమకుటం—శ్రీ పురాణం కుమారరాఘవశాస్త్రి ... 677
9. పాండవులెవరు...?—శ్రీమతి అడపా సుగుణమణి ... 685
10. వింతవింతల ప్రపంచం—శ్రీమతి వారణాశి భాస్కర మహలక్ష్మి ... 689
11. పందెం—శ్రీమతి నందగిరి ఇందిరాదేవి ... 690
12. కన్నీటిచుక్క—విద్వాన్ శ్రీ పాలెపు వేంకటరత్నము ... 693
13 కళాకలాపము-చిత్రలేఖనము—శ్రీయుత ఒంగోలు వేంకటరంగయ్య ... 694
14. విరహిలేఖలు—శ్రీమతి స్థానాపతి రుక్మిణమ్మ ... 697
15. భావతరంగిణి ... 698
16. గర్భిణి స్త్రీల జాగ్రత—'సత్యంవద' ... 699
17. స్వాగతము—శ్రీమతి వట్టికొండ విశాలాక్షి ... 700
18. సుశీలకు నా ధన్యవాదాలు—శ్రీ బూ. రం. రావు, బి. యె. ... 701
19. స్త్రీ అబలయా ? మహాబలయా ?—శ్రీ తోట లక్ష్మయ్య ... 703
20. అత్తాకోడళ్ల కలహాలు—శ్రీయుత శివరాజు వేంకటసుబ్బారావు, ఎం. ఏ. 704
21. సేవకావృత్తి—శ్రీయుత అచ్యుతుని వేంకటాచలపతిరావుగారు ... 708
22. కళాపోషణ—శ్రీ ధరణికోట శ్రీ రాం ... 709
23. బాలభాగ్యోదయము బొంబాయి రాష్ట్రము—పిన్ని ఉత్తరాలు ... 713
24. గానకళ—సంగీతోపాధ్యాయ శ్రీ గాలి పెంచలనరసింహారావు ... 715
25. ఆంధ్ర రాజ్ఞీమణి రుద్రాంబ—శ్రీ ఆచంట లక్ష్మీనరసింహం ... 717
26. భారతీయనారి—శ్రీ స్వామి వివేకానంద ... 721
27. శ్రీ లక్ష్మీ గౌరుల సంవాదము—శ్రీ ఒంగోలు వేంకటరంగయ్య ... 723
28. చలనచిత్రాలు ... 724
29. పాకకళ ... 725
30. పుష్పచయము ... 727
31. గ్రంథసమీక్ష ... 729
32. పత్రికాపరిచయము ... 731
33. సంక్రాంతి—శ్రీ అయ్యగారి విశ్వేశ్వరరావు ... 732
34. యుద్ధరంగము ... 733
35. సంపాదకీయములు ... 735

వర్ణచిత్రము: ధర్మపత్ని – శాంతకుమారి

ధర్మపత్ని - శాంతకుమారి



జయజయ గృహలక్ష్మి సఖి! జయజయ లలితాంధ్ర మధుర సారస్వతమా!
జయజయ లలనారత్నమ! జయజయ విద్యాప్రబోధ! జయకల్యాణీ!

స్వాగతము

రంగవల్లులతోడ సింగారమును దీర్చి
రంగు రంగులతో గృహాంగణము దిద్ది
పచ్చతోరణాలు నిండ తోరణాలగట్టి
పసుపు కుంకాలతో గోమాత నర్చించి
క్రొత్త అల్లుళ్లు, సరిక్రొత్త ధాన్యాలు,
క్రొత్త దుస్తులు, చుట్టపక్కాలు నిండ
నెలపట్టి నేటికి నెల నిండెనమ్మ
ఎపుడెప్పుడాయని ఎదురెదురుజూచి
కాచుకొనియున్నాము నీ రాకకొరకు
స్వాగతంబిదె గొనుము సంక్రాంతి లక్ష్మి!

ప్రకృతి పోకడలో క్రొత్తెంతొ యున్న
మా భావాల, చేతలలో క్రొత్త కరవాయె
పాశ్చాత్యదేశములో యుద్ధాగ్ని జ్వాలలు
స్వదేశమున శాంతి సమర సందేశాలు
ఈ ఆటు పోటులో చీకాకు చెలరేగ
చిత్తశాంతియె లేదు భద్రతయె లేదు,
నిత్యకళ్యాణము పచ్చతోరణము
సార్థకము నీమెడ సంక్రాంతి లక్ష్మి!
మా కాత్మరక్షగా మాయందు నీవుండి
పరమకళ్యాణి, పాలించు పౌష్యలక్ష్మి!

—ఏడిద కామేశ్వరరావు.

మకర సంక్రాంతి

మకరసంక్రాంతి అనగా సూర్యభగవానుడు మకర లగ్నములో ప్రవేశించుట. ఉత్తరాయణ పుణ్యకాల ప్రారంభము. భారతీయులందరు దీనిని ముఖ్యమైన పండుగగా భావించి కోలాహలముతో కొనియాడుచుందురు. భారత హృదయము సౌందర్యమునకు కాటపట్టు. సౌందర్యమునందే ఉత్సాహానందములు వెల్లివిరియును. మానవ హృదయమున నిదురించు దివ్యశక్తులను రేగించునది ప్రకృతియనియు నాతని మహదాశయము లోకప్వర్ధ పక్షుల కిలకిలారావమందున, పిల్ల తెమ్మెరలందును, పండు వెన్నెలందును లతావితానముల యందును, చిన్ని సెలయేళ్లయందును ప్రకాశించుననియు పరమగురువు రవీంద్రుడు వచించియున్నాడు.

వసుమతినంతయు రమ్యతరప్రకృతి సౌభాగ్యముతో కన్నులపండువై యలంకరించు వాడు జగత్సాక్షియగు సూర్యభగవానుడు.

ఈ సహస్రాంశుడే మన సంక్రాంతిపండుగకు నుపాస్య దేవత. ఉపాస్యదేవత గుణముల ననుసరించియే ఉపాసకుని పూజావిధానముండును. మహత్తర దివ్య తేజములో వెలుగొందు ఉత్తమ గ్రహమగు సూర్యుడు లోకబాంధవుడుగదా! మన సంధ్యావందనములోని సావిత్రీ స్తోత్రము సూర్యపరమైనదే. 'ఆదిత్యహృదయ'మను మంత్రరాజ జపము చేతనే రామచంద్రుడును, భారత వీరలును తమతమ ఈప్సితార్థములబడసి సుఖము గాంచిరి.

రథసప్తమి, సంక్రాంతి మొదలగు పర్వదినములు సూర్యగమన సంబంధములైనవి గాన మహిమాన్వితములని గ్రహించియే మన పూర్వులు ఆయాకాలములందు సూర్య ప్రీతికరములగు వ్రతానుష్ఠానములను నిర్ణయించిరి.

సూర్యతేజోవబోధకములగు సంధ్యాకాలంబులు, స్నానపానాది విధుల ననుష్ఠించుటకును, సూర్య నమస్కారాదివ్యాయామ కర్మకలాపానుష్ఠానమునకును. యోగ్యమైనది గనుకనే ప్రాతః సాయంకాలములందు శాస్త్రచోదిత కర్మలు దేశింపబడినవి. స్త్రీల సౌభాగ్యవర్ధకములని ఆదివార నోములు ద్దేశింపబడినవి. చాందోగ్యోపనిషత్తునందు తృతీయ ఖండమున సూర్యకిరణ ధ్యానమునుగూర్చి విశేషముగా ప్రశంసింపబడియున్నది.

ఇప్పటి ఇంగ్లీషువైద్యులు సయితము సూర్యకిరణ ప్రసారముచే పలువిధములగు వ్యాధులు నిర్మూలింపబడుచున్నవని కనుగొనియున్నారు. యాజ్ఞవల్క్యుడు, వరాహమిహిరుడు సూర్యారాధనమును వివరించియున్నారు.

తంజావూరు, తక్షశిలానగరము, ముల్తాననగరము మున్నగు స్థలములలో సూర్య దేవాలయములుకూడ యున్నవని తెలియుచున్నది.

సూర్యుడు కాలమానముల కాధారభూతుడు. భూమి, సూర్యాదిగ్రహ గోళములు అన్యోన్యాకర్షణగలిగి గ్రహమండలమున తిరుగుచున్నవి. భూమియు, నవగ్రహములును సూర్యునిచుట్టు తిరుగుచున్నవి. భూమి తనచుట్టు తాను తిరుగుటవలన దివారాత్రములును, సూర్యునిచుట్టు తిరుగుటవలన సంవత్సరములును గలుచుచున్నవి. ఇట్లు తిరుగుటవలన మార్చి 22 తేది ప్రాంతమున భూమధ్యరేఖయున్న భూభాగము సూర్యుని కెదురుగను, సమీపముగను యుండుట ఏర్పడును. భూ మధ్యరేఖ కుత్తరమున 23½ డిగ్రీల దూరములో కర్కాటక రాశి లేక రేఖయున్నది. (Tropic of Cancer) భూమధ్యరేఖకు దక్షిణమున 23½ డిగ్రీలదూరమున మకరరాశి. (Tropic of capricorn) సూర్యుడు దీని కెట్టెదురైనపుడే మకరసంక్రాంతి. ఇది మహా పర్వదినమని భావింపబడుచున్నది. ఈరోజున జ్యోతిర్మయుడగు సూర్యదేవు నుద్దేశించి వ్రతములు, ఉపాసనలు జరుపుదురు. పొంగళ్లుబెట్టుదురు భూ, గో, స్వర్ణదానములు జేయుదురు. పలువురు కూష్మాండదాన మొసంగుదురు. ఈ దినమునజేయు దానములకు కోటి గుణితములగు పుణ్యఫలమని విశ్వాసము. క్రొత్తగా వివాహమైన బాలికలు బొమ్మలనోము నోచుకొందురు. పట్టణములకంటె పల్లెలలో నీ సంక్రాంతిపండుగ మహా వైభవముగను, కోలాహలముగను నుండును. దీనికి మరునాడు కనుముపండుగ—అనగా గోవులను పూజించు రోజు–మన ఆయురారోగ్య యశో బలవర్ధకమునకును, సస్యాది ఫల సమృద్ధికిని, జీవశక్తికిని సూర్యతేజస్సెంత అవసరమో గోమాతయు మనకంత యవసరమైయున్నది. గోక్షీరముకూడ ఆయురారోగ్య బలవర్ధకము. గోమూత్రము, గోమయము పరిశుభ్రకరము. గోగ్రాసప్రదానముచే స్వర్గలోక ప్రాప్తియని వ్యాసునివాక్యము.

శ్లో॥ గవాహ్నికం పరగవేదద్యాదపి తృణాదికం
అకృత్వా స్వయమాహారం స్వర్గలోకం సగచ్ఛతి॥

గోదేహంబున 33 కోట్ల దేవతలు వాసముచేయుచున్నారని పురాణప్రసిద్ధి. కావుననే సేవాగ్రామములో "ఖాదీసప్తాహ"మనుపేర గాంధి జయంతి జరిగినపుడు మహాత్ముడు గ్రామస్థులతో నిట్లు పల్కినాడు.—"మీరు గోమాతసేవ గ్రహించుట నాకు పరమానందము. గోసేవచే మనము గోమాత దివ్యాశీర్వాదమును పొందుదుము. గోవు నేత్రములలో పవిత్రప్రేమ, ఆశీర్వాదములు చిప్పిలుచుండును. బహుశః ఇది నా పూర్వసంస్కారమేమో? చిన్నతనమునుండి గోపూజ నాకు బోధించుటచే నది నా కాచారమైనది. మీరును పవిత్రప్రేమతో గోవు నారాధించిన గోనయనములందు దొలుకాడు ప్రేమరసమును గుర్తించగలరు."అని అంతేగాక 'గోవునుకాని గోసంతతినిగాని ముల్లుకర్రతో బాధించజాల'మని ఆ గ్రామస్థులచే ప్రతిజ్ఞ చేయించుకొనిరి. కావున గోప్రభావమెరింగియే మనపూర్వులు కనుమురోజున గోపూజ నిర్ణయించిరి. మనము దానిని తప్పక అంగీకరించి ఆచరింపదగియున్నది.

సారస్వత సమీక్ష

దసరాసంచిక సారస్వత హెచ్చరిక

'సజీవమైన వాఙ్మయం కావాలి'

అనే శ్రీమతి 'రోహిణి' గారి 'బహుపరాక్' పలుకులకు క్రొత్త ప్రతిధ్వనులు

'సజీవమైన వాఙ్మయ నిర్మాణం కావాలి' 'కవిత్వమున్నది కాని నిర్మాణం లేదు' అను శీర్షికలతో 'గృహలక్ష్మి దసరా సంచిక'లో శ్రీమతి 'రోహిణి' గారి వ్యాసములోని అంశములు మంచి సమయోచితముగా నున్నవి.

ఏ జాతియైనను యే యుగములోనైనను సజీవముగా నున్నదని తెల్పుటకు సాహిత్యము, చిత్రలేఖనము, శిల్పము మూలముననే స్థిరస్థాయియగుననుటకు సందేహములేదు.

ఒకనాడు ఆంధ్రజాతి ఉచ్చస్థానమలంకరించినదని సగర్వముగా చెప్పుకొనుటకు అజంతాశిల్పములు, ఎల్లోరాయందలి చెక్కడములు, లేపాక్షి దేవాలయమందలి చిత్రలేఖనములు గాక వేరు ప్రబలనిదర్శనములేమి కావలయును? అవియే లేకపోయిన ఆంధ్రజాతి కళాప్రాభవమును మనము, ఇతరజాతులు గుర్తెరుంగగలవా? ఆ యుగపునాటి తెలుగు వెలుగును వేనోళ్ల స్తుతించగలవా?—

అట్లే సాహిత్యము, వాఙ్మయ నిర్మాణముగూడ. ఈ జాతి సౌరభవములో సాహిత్యము ప్రధానస్థాన మలంకరింపగలదు. ఇది లేనినాడు శ్రీమతి 'రోహిణి' గారు చెప్పినటుల 'నిద్రాణమైన నిస్తేజమైన' యుగమువలె చరిత్రకారుడు నిర్వచింపగలడు.

నన్నెచోడుని ప్రథమ తెలుగురచననుబట్టిగదా నాటిరాజుల చరిత్ర, ప్రజల ఆచారవ్యవహారములు తేటతెల్ల మగుచున్నవి. శబ్దశాసనుడగు నన్నయ లేనిచో రాజరాజనరేంద్రుని కాలపు ఆంధ్ర సంస్కృతి తెలియదుగదా? అట్లే శ్రీనాథ, పోతన కవిచంద్రులుగూడ. ఆంధ్రభోజుడు శ్రీ కృష్ణ సార్వభౌముని కాలమున ఆంధ్రకవిత వన్నెచిన్నెలు దొడిగి, ఆదర్శప్రాయమై మనకు రచనాపుష్టి నిచ్చుచున్నది. ఇంతవరకు ఆ యీ యుగములలో ఆంధ్రజాతి ప్రతాపపటిమ, కళాకౌశలము మనకు లభ్యమగుచున్నవి.

కాని, తరువాత మనజాతి నిల్చియున్నదని చెప్పుటకు తగిన గ్రంథములుగాని మరి ఇతరముగాని మనకులేవు. దీనికి కారణమేమి? పోషించు దాత లేకపోవుటయే—దీనికితోడు స్వాతంత్ర్యము లేకపోవుట—ఈ రెంటికి దోడు మనకు, ముఖ్యముగా ఆంధ్రజాతికి దాస్య మలవడినది. దీనితో జాతి అన్నిట బలహీనము జెందినది.

లేనిచో, దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావుపంతులు తలపెట్టిన ఆంధ్రవిజ్ఞానసర్వస్వము అంతలోనే నిలిచిపోవునా? చెప్పవలెనన్న 'పుబ్బలో పుట్టి మఖలో మాడి'నవి ఎన్ని లేవు? ఇట్టివానిని గుర్తించి, తప్పిదమును తెలిసికొని, ఆంధ్రమహాశయులు తమ్మదాము ప్రశ్నించుకొనవలసిన సమయమిది.

నేటి వాఙ్మయ ప్రపంచమున ముఖ్యముగా భావకవిత్వము విచ్చలవిడిగా సంచరించుచున్నది. భావ ప్రాధాన్యమని చెప్పికొను యీ భావకవిత్వమందు భావము నూన్యమే గాక, అయోమయముగ గన్పట్టు చున్నది. కాని ఇందైనను 'నిర్మాణము' గాన్పించుటలేదు. చివరకు ఇది తెనాలి రామలింగని 'భావగుఱ్ఱము' మాదిరిగ సరివచ్చునేమో?

ఇక ప్రస్తుతకాలమున వ్యావహారిక రచన మిగుల వ్యాప్తమైయున్నది. ఇది నిజముగా ప్రబోధకతమై చక్కని విజ్ఞానసంపద కలుగజేయవలసియున్నది. కాని అదియును కాన్పించుటలేదు.

భావి చరిత్రకారుడు చెప్పికొనవలసిన విషయములలో వ్యవహారిక భాషా రచనలకు చక్కని స్థాన మీయగలడు. అందుకు ఈ భాషయందు సజీవమైన రచనలు ఉద్భవించవలసియున్నవి. దీనికి నేటి కవి మిత్రులు పూనుకొనవలయును.

'రోహిణి' గారి వ్యాసముపై విమర్శనను వ్రాసిన శ్రీమతి వట్టికొండ విశాలాక్షిగారు, నేటి కాలపు కవిపండితుల రచనలనుగురించి చెప్పక ముందుతరమువారికి విడిచి ఊరకున్నారు. కాని సుహృద్భావ ముతో నిర్మాణమునకు తగిన చర్చ ప్రమాదమనుకొనను. ఇందలి విషయమైకూడ చర్చ ముఖ్యముగా జరిగినగాని ఉత్కృష్ట రచనలు సృష్టింపబడవు.

ఆంధ్రభూమియందు శ్రీమంతులకు లోటులేదు. వీరందరును కవిపండితులను ప్రోత్సహించిన నిజముగా కవిత్వము ఆగిపోయి చక్కని రచనలు నిర్మాణము కాగలవు. రాజపోషణ కరవైన నేటికాలమున ప్రజలే పోషింపవలసియున్నది. అట్టిదానికి ఆంధ్ర సోదర సోదరీమణులు పూనుకొనవలసినదిగా ప్రార్థించు చున్నాను.

—వక్కలంక సుబ్బాయమ్మ.

ఆంధ్రభూమి! నమామి

ఆంధ్రవీరుల ఆంధ్ర తేజము,
ఆంధ్రకవితల నలరిదేలిన
ఆంధ్రభూమి నమామి ॥ఆం॥

రాజరాజ నరేంద్రులాదిగ
రాజరాజుల రాజ తేజము
దీప్తివెలిగిన దివ్యభూమి
ఆంధ్రభూమి నమామి॥

నన్నయాది మహాకవీంద్రుల
ఘంటకవనపు కావ్యకన్యలు
నాట్యమాడిన రంగభూమి,
ఆంధ్రభూమి నమామి॥

వీరబొబ్బిలి బాలచంద్రులు
వైరివీరుల వేడినెత్తుట
మునిగిపోయిన పుణ్యభూమి
ఆంధ్రభూమి నమామి॥

—ఆకుండి వెంకటేశ్వరరావు

★ నక్షత్ర ఫలితాలు

కవికలహంసి
శ్రీమతి చేబ్రోలు సరస్వతీదేవి

పుష్యమాసము

అశ్విని
విషభయం; పోట్లాట; పాపకార్యం.

భరణి
స్వజనదూషణ; గృహములో కలహము; విపత్తు

కృత్తిక
దుర్బలత్వం; రక్తవిరేచనం; మిత్ర సమాగమం.

రోహిణి
తల్లికి సౌఖ్యం; ధాన్యవృద్ధి; పైత్యరోగం.

మృగశిర
ఐశ్వర్యం; కులవృద్ధి; కీర్తి; సంగ్రామం

ఆర్ద్ర
అజీర్ణం; వృత్తిహీనత; ద్వేషం.

పునర్వసు
వ్యాపారవృద్ధి; సౌఖ్యం; సంతుష్టి.

పుష్యమి
బంధుపీడ; ప్రభుదర్శనం; శుభము చేయుట.

ఆశ్లేష
జ్వరం; దుర్వార్తాశ్రవణం; ధనప్రాప్తి.

మఖ
క్లేశం; పురాణశ్రవణం; లాభం.

పుబ్బ
గృహనిర్మాణం; వైరం; త్రిప్పటలు.

ఉత్తర
విషజ్వరం; స్థానభ్రష్టం; సంచారముతోగూడిన ఉద్యోగం.

హస్త
సద్గోష్ఠి; ధనలాభం; సుఖం; ధైర్యం.

చిత్త
వేదాంతవిచారణ; భక్తి; పుత్రసంతోషం;

స్వాతి
కుటుంబసౌఖ్యం; ధనాగమనం; ఆరోగ్యం.

విశాఖ
సంపద; భోగభాగ్యం; విద్యాగోష్ఠి.

అనూరాధ
ఉష్ణజ్వరం; ప్రయాణం; కష్టం.

జ్యేష్ఠ
నష్టం; అధికారం; ప్రజాపాలనావృత్తి.

మూల
దుర్జనసాంగత్యం; పాపకార్యములచే ధనప్రాప్తి.

పూర్వాషాఢ
మనస్తాపం; గృహమందు కల్యాణం; సద్వ్యయం.

ఉత్తరాషాఢ
క్లేశం; శస్త్రచికిత్స; ఇష్టకార్యసిద్ధి.

శ్రవణం
జ్ఞాతివైరం; బంధుసౌఖ్యం; వాతరోగం.

ధనిష్ఠ
సంసారసౌఖ్యం; ధనలాభం; రాజదర్శనం.

శతభిషం
విదేశవాసం; ఆందోళన; చిక్కులు.

పూర్వాభాద్ర
సుగంధాదిలేపనం; వస్త్రలాభం; సంగీతశ్రవణం.

ఉత్తరాభాద్ర
శిరోవ్యాధి; అకాలభోజనం; చంచలము

రేవతి
ప్రయాణమందు నష్టం; ధనహాని; కృషిహాని.

★ స్త్రీ సాముద్రిక శాస్త్రము ★

కవికలహంసి, శ్రీమతి చేబ్రోలు సరస్వతీదేవి

(గతసంచిక తరువాయి)

నడిమి వ్రేలు మొదటి కనుపునుండి రెండవ కనుపువరకూ ఒకసరళరేఖ సాగియుండిన కార్యసిద్ధిని, ఐశ్వర్యమును, మరణశాసన పూర్వకముగా లభించిన ఆస్తిని సూచించును.

ఆ సరళరేఖ మూడవ కనుపువరకు సాగియుండిన విద్వత్తు, గౌరవము, సంతుష్టి వీటిని సూచించును.

ఈ రేఖ వంకర తిరిగియుండిన యుద్ధములో మరణము.

ఈ వ్రేలి మూడవకనుపు నుండి మొదటి కనుపువరకు కొన్ని నిలువు రేఖలు సాగియుండిన ఖనిజ సంబంధమయిన వ్యాపారముండును.

దీని మూడవకనుపు లేక కన్యారాశియందు త్రికోణరేఖయుండిన అదృష్టహీనత, చెడు స్వభావము సూచించును; సిలువ గుర్తుయుండిన పుత్రహీనత; నక్షత్రగుర్తు యుండిన కీడును, అల్పాయుస్సును సూచించును.

మొదటి కనుపు లేక కటకరాశియందు నక్షత్రరేఖయుండిన మంచిదికాదు, ఆపదలు, దుఃఖము. దీనియందు నల్లనిమచ్చ యుండిన చలిజ్వరము; కష్టములు సంభవించును. దీని చివర నక్షత్ర గుఱుతుండిన ఏకార్యము ప్రారంభించినను విఘ్నములేక కొనసాగును.

ఇది మిగత రెండు కనుపులకంటె పొడవుగానుండిన, వారు సర్వదామృత్యువునే గోరుచుందురు.

రెండవకనుపు పొడవుగానుండిన వ్యవసాయమునందు అపార ప్రజ్ఞగలిగి; అనేక ఆయుధములను ఉపయోగించు వారైయుందురు.

మరియు నీ కనుపు బొద్దుగా, వెడల్పుగానుండిన గణితశాస్త్రమందు నేర్పును పురాణములందు అభిమానమును కలిగియుండును.

కన్యారాశి పొడవుగా నుండిన ఓర్వలేనితనము; దుశ్చింతనము.

ఉంగరపు వ్రేలు—

ఈ వ్రేలున కధిపతి రవి గావున దీనికి రవి వ్రేలనియు పేరు. ఇది పాండిత్యమును ఐశ్వర్యమును సూచించును.

ఇది మొనదేలియుండిన పాండిత్యము, సహజ జ్ఞానమువలనవి షయములను తెలిసికొనెడి తెలివియు నుండును. ఇది శనివ్రేలి వైపునకు వ్రాలిన డంభము, ఆడంబరము, అతివ్యయము సూచించును. చిటికెనవ్రేలి వైపునకు వ్రాలిన ధనార్జనమే ప్రధానముగా జేసుకొని విద్యాశక్తులన్నిటియందును బుద్ధిని వినియోగించును.

(సశేషము)

చెన్నపురి ఆంధ్రమహాసభ స్త్రీలశాఖాభివృద్ధి

శ్రీమతి బాలాంత్రపు శేషమ్మగారి ప్రశంస

చెన్నపురి ఆంధ్రమహాసభ స్త్రీల శాఖవారి వారాంతోపన్యాస సందర్భమున శ్రీమతి బాలాంత్రపు శేషమ్మగారు ఇట్లు ఉపన్యసించారు.

"చెన్నపురి ఆంధ్రమహాసభ స్త్రీలశాఖ శ్రీమతి దుర్గాబాయమ్మగారి ఆధ్వర్యమున విజయవంతంగా వర్ధిల్లుచుండడం చూస్తే నాకు చాలా సంతోషంగా ఉంది. ఆమె మొదలుపెట్టిన ఏ కార్యముగాని నిర్విఘ్నముగా కొనసాగవలసిందే. ఆమె దేశభక్తపరాయణ. అనేక సంవత్సరాలుగ దేశానికేగాదు, సంఘానికి, స్త్రీ విద్యాభివృద్ధికి సేవచేస్తోంది. దీనికోసం ఆమె ఎంతో త్యాగంచేసింది. కాకినాడలో ఉన్నప్పుడు మా విద్యార్థినీ సంఘానికి చాలా విషయాల్లో సహాయంగా ఉండి స్త్రీలలోవిద్య, చైతన్యం, ఉద్రేకం, ఉత్సాహం శేకత్తింపజేసిందీమె—స్వాతంత్ర్య సమరమప్పుడు జెండా బట్టుకొని దుర్గాబాయి బయలుదేరిందంటే, రెండు వీధులు తిరిగేసరికి వందలతరబడి స్త్రీ జనమంతావచ్చి గుంపులుగూడేవారు. జనుల నాకర్షించేశక్తి ఆమె కంఠస్వరములోనే ఉంది. ఈ సందర్భంలో ఆమెయందు నాకుగల మక్కువ, ఆదరాతిశయాలను దెలుపడానికి నాకు సంతోషంగా ఉంది. ఈమె B. L. పరీక్షలో కృతార్థురాలై న్యాయమూర్తిస్థానాన్ని అలంకరించి తన ప్రతిభా ప్రాభవాన్ని చాటించాలెనని నా ఆశయం. ఇటువంటి దేశభక్తులు చిరకాలం జీవించాలని మనం ప్రార్థించాలి. ఈమెవద్దనుంచి మీరందరుశిక్షణ నేర్చుకోవాలి. ఆమెచేసే ప్రతిపనులలోను మీరందరు ఏకీభవించి ఆమెకు సహాయముచేసి కార్యసాధనచేయాలి. ఒక్కవ్యక్తి ఎంత ప్రతిభాశాలియైనను లాభంలేదు. సంఘబలముండాలి, అందుకోసమే స్త్రీసమాజములు, స్త్రీసంఘాలు నిర్మించి మెంబర్లనుచేర్చి పట్టుదలతోపనిచేసి ఔన్నత్యానికి తేవాలి. జొన్నపురి నారలుకొన్నిటినిచేర్చి పేనితేగాని గట్టియైనతాడు కాదు. ఎందుకుపనికిరాని కొబ్బరినార వందలసంఖ్యగాకలిపి పేనబడినప్పుడు పెద్దపెద్ద రథములను, ఓడలను, కూడ అవలీలగా లాగేంత మోకై పరిణమిస్తుంది. అలాగే సంఘాలుగాని సమాజాలు చక్కగా పనిచేయవలనంటే శ్రద్ధగా కృషిసలిపే మెంబర్లుకావాలి.

ఈ మెంబర్లందరుకలిసి వారానికొకరోజు సమావేశమై తమతమ అభిప్రాయాలను వెలిబుచ్చుకొంటూ సభయొక్క ఆశయాలను వృద్ధిజేసే సమాలోచనలుగావించి నిర్వహించాలి. ఒట్టొట్టి కబుర్లలో కాలముగడపక అనుకున్నంతవరకు కార్యరూపంలో బెట్టాలి_ఇప్పుడీ ఆంధ్రమహాసభ స్త్రీశాఖలో, సంగీతం, నృత్యం, హిందీ, బెనారస్ మెట్రిక్ కోర్సుమొదలగు శాఖలనుబెట్టి, విద్యార్థులను తయారుచేస్తూవుండడం చూస్తే నాకెంతో ఆనందమైంది. దీనితోబాటు మన మాతృభాషయైన తెలుగుకుకూడ ఒక తరగతి ఏర్పరచి మన స్త్రీలకు మాతృభాషయందు రుచికల్పిస్తే చాలా బాగుండునని నాకోరిక-మన మెన్నిభాషలు, ఎన్ని విద్యలు నేర్చినను మాతృభాషను మరువకూడదు. ప్రతిస్త్రీకిని మన భారత, భాగవత, రామయణాదిగ్రంథములనుచదివి చక్కగా సారమెఱుంగునంతటి జ్ఞానమైనాలేకుంటే సిగ్గుగాదా! మొన్ననే శ్రీయుతులు రామలింగారెడ్డిగారు ఒకచోట మాట్లాడుతూ "భారతం చదువనిచదువు చదువేకాదు" అని చెప్పారు. కాబట్టి మాతృభాషను మరచిపోకూడదు.

ఇదిగాక కొన్ని చేతిపనులు—నూలువడుకుట, కాగితములుచేయుట, నవారునేత ఇల్లాంటివిషయాలు పెట్టించి కొంతమందిస్త్రీలను తయారుచేయించితే బాగుంటుందని నా ఉద్దేశం."

ఉపన్యాసానంతరం కార్యదర్శిని అభినందనములతో సభ ముగిసెను.

★ రాజమకుటం

రచయిత :
శ్రీ గోవింద వల్లభ పంతు

అనువాదకర్త :
శ్రీ పురాణం కుమారరాఘవశాస్త్రి

ముందు కథ

చిత్తోడు మహారాణా విక్రమసింహుడు మధుపానమత్తుడై పరిపాలనను నిర్లక్ష్యించాడు. రాణాచే అవమానితురాలైన శీతలసేని, రాణాను తొలగించి తన కుమారుడైన వనవీరునికి రాజ్యపట్టాభిషేకం చేయాలని, కుటిల సర్దారు రణజిత్తు సహాయంతో మాయపన్ని రాణాపై కత్తి కట్టించింది.

చిత్తోడేశ్వరి ఆలయంలో పన్నా ప్రార్థన చేసుకుంటూ చందన్ ఉదయులతో మాట్లాడుతూవుండగా రాణా ప్రవేశించి తనకు సర్దార్లంతా విరోధులైనారని తెలియజేసి కిరీటం పన్నా కీవబోతూవుండగా, వనవీరుడువచ్చి, సర్దార్ల సహాయంతో రాణాను బందీచేశాడు.

పాత్రలు

1. వనవీరుడు	...	శీతలసేని పుత్రుడు
2. శీతలసేని	...	వనవీరుని తల్లి
3. రణజిత్తు	...	ఒక లోభి సర్దారు
4. పన్నా	...	ఉదయుని దాది
5. విక్రముడు	...	మహారాణా
6. కర్మచందు	...	ప్రధానమంత్రి
7. ఉదయసింహుడు	...	విక్రముని తమ్ముడు

ఇక చదవండి

ప్రథమాంకము

౧. దృశ్యము

(వనవీరుని భవనం:—వనవీరుడు రాజమకుటము పుచ్చుకొని ప్రవేశిస్తాడు)

వనవీర్ :-అహో! రత్నఖచిత సువర్ణ రాజమకుటమా! ఎంత ప్రభలమైనది నీ ఆకర్షణ! నిన్ను స్పృశించినంతమాత్రాన నాలో ఎటువంటి పరివర్తన కలుగుతున్నదో చెప్పలేకపోతున్నాను. నీవు నాకు ప్రబోధించావు: ప్రపంచములో మైత్రి అనేదీ, మిత్రుడనేవాడూ పూజ్యమని. ఇంకా ఏమి ప్రబోధిస్తావో, అంతా ఆచరించటానికి సిద్ధంగా ఉన్నాను. (మకుటము తలమీద పెట్టుకుంటాడు) ఇప్పుడు రాజధానిలో ప్రతిమనుష్యుడూ నా నిశ్చయానికి తల వూపుతాడు; నా ఆజ్ఞకు వేచిఉంటాడు; నేను చాల ఉన్నత పదవికి ఎక్కివచ్చాను.

(శీతలసేని ప్రవేశిస్తుంది)

శీతలసేని :-ఇంకా మూడు మెట్లున్నై ఎక్కవలసినవి.

వనవీర్ :-ఏమిటమ్మా అవి ?

శీతలసేని :-సమయం వచ్చినప్పుడు నీవే తెలిసికొగలవు. నీ మిత్రులసంఖ్య తక్కువగా ఉంది. వనవీర్ ! నీ శత్రువుల సంఖ్యను తగ్గించేందుకు ఏమీ ఆలోచించలేదూ నీవు ?

వనవీర్ :-సర్దార్ల ప్రోత్సాహంచేత నేను బంధించిఉంచిన అతన్ని-ఇప్పుడు నీ ప్రోత్సాహంచేత - అనేనా నీవు చెప్పేది ?

శీతలసేని :-ఔనౌను, అతన్ని వధించు. పరమేశ్వరుడు వినా నిన్ను విచారణ చేయగలవాడు మరెవడూలేడు. ఆయనకు జవాబు నాకు జరిగిన అవమానమే చెబుతుంది. ఆ అగ్నిలో అనుక్షణమూ దగ్ధమౌతున్నాను. వనవీర్ ! నీకాబాధ అర్థంకాదు.

వనవీర్ :-విక్రముని హత్య ! అమ్మా ! అదినీవు నాకెన్నాళ్లనుంచో ఉద్బోధించుతున్నావు. మేమిద్దరమూ ఒక్కచోట పెరిగాం. అతనికికూడ నీవు ఉగ్గుపెట్టినదానవే కదమ్మా ! అతడు నాపెదతండ్రికొడుకు కాదూ ! అతని హత్య కాజాలదు-

శీతలసేని :-అయితే ప్రాణాలమీద ఆశ వదులుకో.

వనవీర్ :-నాకేభయములేదు. సర్దార్లు విక్రముని బంధించారు. ఇదిగో ! రాజమకుటము నావద్ద శాశ్వతంగా ఉంది. ఎవరమ్మా, నాకు శత్రువులు ?

శీతలసేని :-ఇంకొకసారి నాచేతనే చెప్పించాలెనా ?

వనవీర్ :-(కొంచెము జ్ఞాపకం తెచ్చుకుని) నీవు నాకొకప్పుడు జన్మ ప్రసాదించావు- మరొకసారి విక్రముడు పంపిన హంతకుని బారినుండి రక్షించావు. అదీ జ్ఞాపకం వచ్చింది.

శీతలసేని :-అతడే తిరిగిఎప్పుడో-మనకు తెలియదుగాని-ఏసమయానోన్నా నిన్ను వధించేప్రయత్నంచేస్తాడు తప్పక. ఈ విచారమే నన్ను ఆపాదమస్తమూ రక్కిపెడుతున్నది. కౌరవులు పాండవులకు సోదరులు కారే మిటి; న్యాయానికీ, బాంధవ్యానికీ సంబంధంలేదు. విక్రముని వధించు. వధించి, రక్తమారకుండా ఆ కటారుతోనే ఉదయు——

వనవీర్ :-[అర్థోక్తిలో] ఊరుకో, ఊరుకో, అమ్మా ! ఇదా ఉపదేశం ! తల్లిలేని బాలుడు ఉదయుణ్ణి కొన్నాళ్ళవరకూ గుండెల్లో పెట్టుకొని పోషించావు నీవు. రాజనీతి వస్త్రాచ్ఛాదనములో విక్రముని దండించుతావు. కాని, అబోధబాలకుడు ఉదయుని అపరాధ మేమున్నది ?

శీతలసేని :-అదీ ఇప్పుడే ఆలోచిద్దాం. నీవు వినలేదూ; విక్రముడు సర్దార్లతో గుప్తసంధి చేసుకో బోతున్నాడు.

వనవీర్ :-[చకితుడై] గుప్తసంధి !

శీతలసేని :-ఔను ఆవిషయమంతా తెలుసుకురమ్మని రణజిత్తును పంపాను. మరి విక్రముడు కారాగారవిముక్తి డౌతాడనుకో; ఎలాగ ?

వనవీర్ :-విక్రముని విడిపించటానికి సర్దారు లెవరు ? మహారాణాను నేను. కటారు ఇచ్చివెయ్యమ్మా !

శీతలసేని :-ఇదిగో [కటారు ఇవ్వబోతుంది]

వనవీర్ :-కొంచెమాగు. చూచివస్తాను బైట అంధకార మెంత ఉన్నదో, అందులో నేను దాగి గలనో లేదో.

[వనవీర్ నిష్క్రమిస్తాడు. రెండో వైపునుంచి రణజిత్తు గాభరాగా ప్రవేశిస్తాడు.]

శీతలసేని :-ఎందుకా గాభరా ? ఏమిటి సమాచారం ?

రణజిత్తు :-సర్దారు కర్మచందు చెబుతున్నాడుకదా; విక్రముడు గనక న్యాయపూర్వకంగా రాజ్యం చేస్తానని ప్రతిజ్ఞ చేసేట్టయితే, అతన్ని జైల్లోనుంచి విడిపించి, సింహాసనంమీద కూచోబెడతాట్ట మళ్లీను.

శీతలసేని :-అయితే వెళ్లు, వెళ్లు, రణజిత్ ! నీ విప్పుడేపోయి విక్రముని విడుదలకాకుండా యథాశక్తిని అడ్డుపుల్లలువెయ్యి. తెలిసిందా ? కర్మచందుకెట్టి యధికారమూ లేదు. మేవాడ్ మహారాణా మన వనవీర్.

రణజిత్ :-మరి మేవాడ్ ప్రధానమంత్రి ?

శీతలసేని :- నీవే ఔదువుగాని. కాని వనవీరుని మార్గం కంటకపూర్ణమై ఉన్నంతవరకూ కాలేవు. కాబట్టి విక్రముని విడుదల కానీయకు. వెళ్ళు, ఆలస్యంచేయకు.

రణజిత్ :-అలాగే. [రణజిత్ నిష్క్రమిస్తాడు]

[తెరవేపు చూస్తూ మెల్లిమెల్లిగా వనవీరుడు ప్రవేశిస్తాడు]

వనవీర్ :-అంధకారం ! అంతటా అంధకారమే. కర్మసాక్షి అపరాబ్ధిలో మునిగిపోయాడు. చంద్రుడు కృష్ణపక్షపు చాటున దాగాడు. మంచు బిందువులవంటి నక్షత్రాలన్నీ మేఘాల్లో కరగిపోయినై. గృహదీపికలుకూడ ఆరిపోయేవేళ. ఇట్టి తమోమయ శర్వరిని నీవు నాచేతిలో కటారుపెట్టి శత్రుగృహానికి దారిచూపుతున్నావా, అమ్మా ?

శీతలసేని :-బంధీకృతమై ఉన్న సింహాన్ని బోనులోనే వధించి రా.

వనవీర్ :-ఇటువంటి భీషణవధ, అనంతమైన అత్యాచారం, విరామములేని హాహాకారం—వీటిమీదనే ఆధారంగా నిల్చిఉంది రాజసింహాసనం. నేనుదాన్ని అధిష్టించగోరుతున్నాను. అమ్మా ! ఏదీ కటారు !

[కటారు తీసుకుని మోకరిల్లి]

ఆశీర్వదించు. ఇదిప్రపంచంలో అన్నిటినీ మించిన పాపకార్యమే కావచ్చు. అయినా అందులోనే ఒకపుణ్యం వుంది. ఆ పుణ్యం మాతృవాక్యపాలన—

శీతలసేని :- [ఆశీర్వదించి] శత్రువధ నిర్వర్తించి నిర్భయుడివౌతావు.

[చెరొక ప్రక్కనుంచి నిష్క్రమిస్తారు]

తెర మారుతుంది.

౫. దృశ్యము

(చీకటి జైలు. శృంఖలాబద్ధుడై విక్రముడు.)

విక్రముడు :-నేను విక్రమున్ణి, ప్రహరీ ! వింటున్నావా? నిన్నటివరకూ నీవు నాముందు చేతులు కట్టుకుని నిల్చున్నావు. ఇప్పుడు కరవాలము పట్టుకుని నిల్చున్నావు !—నేను దుర్వ్యసనాలకు క్రీతదాసుణ్ణి అయిపోయాను. అయితే ఎందుకీ సమస్త - చిత్తోడు రాజ్యానికీ ప్రభువునైనాను ?—ప్రహరీ ! వింటున్నావా ? నీవు వెళ్లి ఒకపాత్ర మద్యము నింపి పట్టుకురా. అందులో ఇంత కాలసర్పవిషం

కూడా కలుపు. ఎందుకంటే అదే నా అంతిమ పానీయం. నా జీవితమంతా యీ మద్యముతో పోరాటము సాగిస్తూవచ్చాను. ఈరాత్రి నాశత్రువు నన్నంతము చేయునుగాక! నేను నవ్వుతూ నవ్వుతూన్నే విషపానము చేస్తాను. ఏం, దానివల్ల వీరస్వర్గం ప్రాప్తించదూ—?

రాజవంశమా! నీకు భోగలాలసత తగదు. నేనొక బిచ్చగత్తె కడుపున పుడతాను.

[భోజనసామగ్రి ఉన్న పళ్లెం ఒకటి, కొన్ని దుస్తులు తీసుకుని పన్నా ప్రవేశిస్తుంది.]

ఎవరు?

పన్నా:-మహారాణా! నేనే, దాదిని, పన్నాను.

విక్రముడు:-దేనికి? ఎందుకోసం వచ్చావు?

పన్నా:-తిన్న ఉప్పును బదులు తీర్చుకోడానికి.

విక్రముడు:-ఏ విధంగా?

పన్నా:-(పళ్లెము నేలమీదఉంచి) భోజనం చేయండి. ఈ పళ్లెము పుచ్చుకుని ఈ కారాగారమునుంచి విముక్తి పొందండి. ఈ ఉంగరం ద్వారపాలకుడికి చూపించి, కోటవిడిచి వెళ్లండి.

విక్రముడు:-(ఉంగరము తీసుకునేందుకు చెయి చాపుతూ) మరి నీవు?

పన్నా:-నే నిక్కడే ఉంటాను. (విక్రముడు చెయి వెనక్కు తీసుకుంటాడు)

విక్రముడు:-దాదమ్మా! వనవీరుడు నిన్ను చంపివేస్తాడు.

పన్నా:-ఆ సంగతి నాకు బాగా తెలుసును. మహారాణా! రాజపుత్రస్త్రీ చావుకు వెరవదు.

విక్రముడు:-అయితే ఉదయుడు, చందన్—ఆ పసివాళ్లను ఎవరు పోషిస్తారు? ఈ విధంగా విముక్తుణ్ణయి, నేను మాత్రం ఎక్కడికి పోయేది?

పన్నా:-ఉదయుణ్ణి, చందన్‌నూ తీసుకుని ఈ మేవాడ్ విడిచి ఎక్కడికేనా సరే వెళ్లిపోండి. నిరాపదులై ఉండగలరు. సంగ్రామసింహుని నామమహత్యమే సైనికులందర్నీ కూడ దీస్తుంది. మీ రక్తనాళాల్లోనూ ఆ వీరకేసరి తేజమే ప్రజ్వలిస్తూవుంది. ఆసంగతి మీ రిన్నాళ్లూ మరచిపోయారు, అంతే. ఏనాడు మీ రది స్ఫురణకు తెచ్చుకుంటారో, ఆనాడు-ఒక్కడు కాదు, శతసహస్ర వనవీరులుకూడా మిమ్మెదుర్కోలేరు. తీసుకోండి ఉంగరం; త్వరగా భోజనంచేసి విముక్తి పొందండి.

విక్రముడు:-వద్దమ్మా! అలాకాదు. నే ననేక అపరాధాలుచేశాను; అందుకు శిక్ష అనుభవించవలసి ఉంటుందనే ఆలోచన నాకే క్షణానా తట్టలేదు. ఈ చీకటింటనే నన్ను బంధింపబడి ఉండనీ; ఇదే నాకు శాంతిమయంగా కనబడుతోంది. పన్నా! నే నిప్పుడు ఖైదీనే; అయితే ఏమి! నారక్తనాళాల్లో వీర శిరోమణి సంగ్రామసింహుని రక్తమే ప్రవహిలుతోంది. నేను పురుషుణ్ణి; స్త్రీ వేషమువేసి నన్ను జైలు విడిపింపచూస్తున్నావు. వద్దమ్మా! అట్టి వేషముతో నేను స్వర్గానికేనా పోనొల్లను.

(చేత దీపము పట్టుకొని ఉదయుడూ, కర్మచందు ప్రవేశిస్తారు)

ఉదయుడు:-(దీపము ఒకపక్కన ఉంచి) అన్నా! ఇదిగో పితృతుల్యుడైన సర్దారు కర్మచందుగారి సమక్షములో ప్రతిజ్ఞ చెయ్యండి. మీ రాయన ఉపదేశాన్ని మన్నించవలసిన సమయం వచ్చింది. మీకు బంధమోచన మిప్పించడానికే వచ్చారు. మీ రికనుంచి సన్మార్గవర్తు లౌతారుగాక!

శ్రీమతి రామేశ్వరీ నెహ్రూ

గత, మాసములో బెంగుళూరునందు జరిగిన
15 వ అఖిలభారత మహిళామహాసభకు
అధ్యక్షత వహించారు.



ఆంధ్రరాష్ట్ర మహిళామహాసభ - నంద్యాల

గతమాసమందు జరిగిన 15 వ ఆంధ్రరాష్ట్ర మహిళామహాసభ అధ్యక్షురాలగు శ్రీమతి పెద్దాడ కామేశ్వరమ్మ బి. ఏ. గారును (మైసూరు) ప్రారంభకురాలగు శ్రీమతి కే. రామసుబ్బమ్మ గారును (కడప) పతాకోత్సవమును నెరపిన శ్రీమతి చుండూరు రత్నమ్మ గారును (ఏలూరు) స్వదేశీ వస్తు ప్రదర్శనమును తెరచిన శ్రీమతి బత్తుల కామాక్షమ్మ గారును (రాజమండ్రి) మధ్య కూర్చొనియున్నారు.

విక్రముడు:-(కర్మచందు వేపుతిరిగి) దురభిమానమత్తుడనై నేను మీ మీద ఆనాడు నిండుసభలో కత్తిఎత్తాను. క్షమించండి. ఏకలింగస్వామి సాక్షిగా ప్రమాణం చేస్తున్నాను. ఇకనుంచి ప్రజల్ని సంతానవతుగా పాలిస్తాను.

కర్మచందు:-రవికుల భూషణులైన మీకామాటలు ఉచితముగా ఉన్నై. తిరిగి మీరు మహారాణా ఔతారు.

పన్నా:-విక్రమసింహ మహారాణాకు జయము!

కర్మచందు:-ప్రహరీ! మహారాణాను బంధనవిముక్తుణ్ణి చెయ్యి. (ప్రహరీవచ్చి విక్రముని శృంఖలాల్ని తీయబోతూండగా రణజిత్తు ప్రవేశిస్తాడు.)

రణజిత్తు:-ప్రహరీ! జాగ్రత! ఎవరి ఆజ్ఞానుసారం చేస్తున్నావాపని? (ద్వారపాలకుని చేయిపట్టి వెనక్కులాగి నిలువబెడతాడు) మంత్రి మహోదయులు మీరు! సమస్త సర్దార్ల నిమంత్రణచేత ఖైదీచేయబడ్డ ఈయన్ను, కేవలం తమ ఒక్కరి ఇచ్చానుసారం-తమ ఒక్కరి ఆజ్ఞాప్రకారం-ఇప్పుడు విముక్తుణ్ణి చేయడం ఉచితంకాదు. తమరు మా కందరికీ పూజ్యులే; మా కందరికంటే ఎక్కువ రాజ్యానుభవం కల వారే. వనవీరుడు మహారాణా అయినాడు; ఇంత శీఘ్రంగా ఆయన హృదయానికి ఆఘాతం తగల కూడదు. కలహము కాకుండునుగాక! చిత్తోడులో శాంతి నెలకొనుగాక!

కర్మచందు:-అట్లేకానీ; మహారాణా! చింతించకండి. ఇదే తమ ప్రాయశ్చిత్తానికి అంతిమరాత్రి. రేపటి ప్రభాత సమయానికే విడుదల పొందగలరు.

ఉదయుడు:-అయితే, మహారాణాను ఇప్పుడే విడిచి పెట్టరూ!

కర్మచందు:-అధైర్యపడకు, నాయనా! నీవింకా కుర్రవాడివి; ఈ విషయాలన్నీ తెలుసుకోలేవు. ఒక్కరాత్రి మాత్రమే; యుగాలు కాదుకదా!

పన్నా:-మీ రింతవరకు ఏమీ భుజించలేదు, ఎంగిలి పడండి కొంచెం.

విక్రముడు:-వద్దమ్మా! నాకేమీ తినాలనిలేదు. అది అక్కడే ఉంచి వెళ్లు; కోరిక పుట్టినప్పుడు తింటాను. మీరందరూ వెళ్లండిక. చాల పొద్దుపోయింది.

కర్మచందు:- పద, పన్నా!

పన్నా:-పదండి.

ఉదయుడు:-ఈ దీపం ఇక్కడేవుంచి వెళ్లుదాం.

(విక్రముడు తప్ప అంతా నిష్క్రమిస్తారు)

విక్రముడు:-[దీపాన్ని ఉద్దేశించి] సూర్యబింబములేని వేళల నీవే చీకటిత్రోవల్లో వెల్తురు చిమ్ముతావు; దీపమా, నీకు నమస్కారము. ఈ కారాగారాన్ని నా పూర్వులు నిర్మించారు. ఇందులో వారెన్నడూ దీపం వెలిగించలేదు; నేనూ వెలిగించలేదు. నాకోసంగా ఇప్పుడీ దీపం ఎందుకు వెలగాలి? బహుశః ఈ అంధకారంలోనే నా పాపాలు భస్మీపటల మౌతాయేమో! [దీపం ఆర్పి] బహుశః ఈ చీకటిలోనే నాకొకమార్గం కనబడుతుందేమో! నిశ్శబ్దంగా ఉంటాను.

[అతి జాగ్రతగా వనవీరుడు కటారు పట్టుకొని, నాలుగు వైపులా చూచుకుంటూ ప్రవేశిస్తాడు]

వనవీర్:-[తనలో] ఈ అంధకారంలో పాపమంతా మూర్తీభవించి ఉంది. అది రూపుమాసి పోవుగాక! దాని ఊపిరి చప్పుడుకూడా వినిపించడంలేదు.

విక్రముడు:-ఎవరివో అడుగుల చప్పుడు! ఈ అంధకారంలో స్పష్టంగా కనిపించడంలేదు, ఎవరు నువ్వు?

వనవీర్:-అడగవద్దా ప్రశ్న.

విక్రముడు:-గుర్తు పట్టాను నీ కంఠస్వరం. మిత్రుడు వనవీరుడివి.

వనవీర్:-నీ వెప్పుడూ నా మిత్రత్వం కోరుతున్నావు. నన్ను మించిన శత్రువు నీకు లేడు. విక్రమ్! నీకు తెలియలేదేమో ఇవాళ నా కటారు నీ రక్తాన్ని కోరుతోంది.

విక్రముడు:-అందుకు నేనేమీ భయపడను. నా చేతులూ, కాళ్లూ బంధింపబడి ఉన్నై; అతి సుగమంగా నీవు నన్ను వధించగలవు. కాని, కొంచెమాగు; నా అపరాధ మేమిటో తెలుసుకోనీ.

వనవీర్:-అది సరిగ్గా నాకూ తెలియదు. తెలిసిన కొంచెమూ ఇప్పుడు చెప్పటానికి సమయంకాదు.

విక్రముడు:-ఇంకొక్క మాట.

వనవీర్:-చెప్పు.

విక్రముడు:-ఈకట్లు విప్పి నన్ను విడిచిపెట్టు, వనవీర్! రాజమకుటము నీవే ఉంచుకో. నేను నీ రాజ్యపు పొలిమేరదాటి వెళ్లిపోతాను. సన్యాసినై తీర్థయాత్రలు చేసుకుంటాను.

వనవీర్:-మాట్లాడకు, విక్రమ్. నేనేమీ విననూ. నీ మాటలవల్ల నాకు మోహ ముత్పన్నమౌతోంది.

విక్రముడు:-వనవీర్! వనవీర్!

వనవీర్:-ఊహూఁ ముగిసింది...

(విక్రముని ఛాతిలో కటారు గుచ్చుతాడు)

విక్రముడు:-(భూపతితుడౌతూ) హా, భగవంతు—

వనవీర్:-(విక్రముని గుండెపై చేయి ఉంచి)

విక్రమ్! మహారాణా విక్రమ్!

(వనవీరుడు విక్రముని నాసికముందు వ్రేళ్లుంచి, మృతుడైనట్లు నిశ్చయించుకొని, ఛాతిలోనుంచి కటారు పెరికికొని, జాగరూకుడై పారిపోతాడు.

తెరపడుతుంది.

౬. దృశ్యము

(చీకటితోవ; తుపాను, మెరుపు)—(ఒంటరిగా రణజిత్తు ప్రవేశిస్తాడు)

రణజిత్:-తప్పకుండా రాజ మంత్రినౌతాను. కాని శీతలసేని మనస్సు మారిపోతే ఒకవేళ?......అయితే మాత్రం భయమేమిటి? (లోపలి జేబులోనుంచి శీతలసేని రాసియిచ్చినపత్రాన్ని బయటికితీసి) ఇది ఆవిడ దస్తూరికాదూ! ఆమె సృష్టించిన ఈ సమస్త కపటప్రపంచాన్నీ ప్రకటించే శక్తి దీని

లేదూ? ఆహా! ఏమి, ఆ అక్షరాల నీలినిగనిగ! ఇందలి శబ్దాలమధుర - అర్థ-చ్ఛాయవలె ఉంది! దీనిమీద నా ప్రధానమంత్రి ఆసనం సుస్థిరంకావాలి.

(తెర ఆవల శీతలసేనినిచూచి పత్రాన్ని జేబులో పెట్టుకుంటాడు)

ఎవరు? అవిడే!

(మెరుపు మెరుస్తుంది; శీతలసేని ప్రవేశిస్తుంది.)

శీతలసేని :_నీ విక్కడే ఉన్నావా?

రణజిత్ :_ఇక్కణ్ణించి కదలిపొమ్మని రాజమాత నన్నెప్పుడాజ్ఞాపించారూ?

శీతలసేని :_రణజిత్! ఇంతసేపయింది; ఇంకా వనవీరుడు రానేలేదు. విక్రముని చూడగానే అతని నిశ్చయం మారిపోలేదుకద!

రణజిత్ :_అలా జరగదు. ఈ త్రోవనే మహారాణావెళ్ళారు, చూచానుగా! ఆయన శరీరంలోనుంచి నిప్పురవ్వలు బయటికి చిమ్ముతున్నై; అప్పటి ఆయననడకచూస్తే తప్పకుండా శత్రువధచేసే వస్తారని నాకు నమ్మకంకలిగింది.

(వనవీరుడు ప్రవేశిస్తాడు.)

వనవీర్ :_ఎవరూ? అమ్మా! నీవు ఇక్కడ.

శీతలసేని :_ఔను, నీకు సహాయంగా——ఏమిటి సమాచారం?

వనవీర్ :_నీ అవమానాగ్ని, నా కటారు దాహం-రెండూ ఒకేసారి చల్లారినై.

శీతలసేని :_విక్రముని హత్య?

వనవీర్ :_ఔను, ముగిసింది; ఇదిగో అతనిరక్తంతోతడిసి ఉన్న ఈకటారు నీ పాదాలకు కానుక.

(కటారు శీతలసేని పాదాలముందు ఉంచుతాడు.)

శీతలసేని :_చిరంజీవ! వనవీర్! విక్రముడు మరణించాడుకదూ!

వనవీర్ :_ఆ. నేనతనిగుండెల్లో కటారుగుచ్చిన తక్షణమే భూపతితుడైనాడు. ఉచ్ఛ్వాసములులేని అతని నాసికముందు పరిశీలనకోసం వేళ్లుంచి పిల్చాను. "విక్రమ్! మహారాణా విక్రమ్" అని. నిన్ను 'దాసీ' అన్నవాడు_నా ప్రాణాలమీద దాహంగొన్నవాడు-అతని అధరోష్టాలు శాశ్వతంగా మూసుకుపోయినై.

శీతలసేని :_నాయనా! నీవు మాతృఋణవిముక్తుడివైనావు. కాని ఉదయుడు జీవించి ఉన్నంతవరకూ, విక్రముని రూపుమాపిన సంతృప్తిపొందలేవు. ఇతని రక్తంలోతడిసిన నీ చేతుల్ని అతనిరక్తంలో క్షాళనచేసుకో, ఆ తరువాత ఇంకొక్కటే రక్తపాతం. అదికూడాముగిస్తే, సింహాసనంమీద వనవీరుడు! చిత్తోడు రాజ్యంలోశాంతి!! శీఘ్రంగాకానీ; ఈ రాత్రి ఎంతో సుఖకరమైనది. రేపటి సూర్యబింబమూ, నీ సౌభాగ్యమూ - రెండూ ఒకేసారి ఉదయించునుగాక!

వనవీర్ :_చక్కగా చెప్పావు. వాడు పెద్దవాడై విక్రమునిహత్య మరచిపోడు. చేరువైంది, వాడి అంత్యము చేరువైంది.

[శీతలసేని నేలమీది కటారుయెత్తి వనవీరునికిస్తుంది. మళ్లీ మెరువుమెరుస్తుంది; ఉరుముతుంది]

శీతలసేని :_తీసుకో. వెళ్లు. ఉదయుడీ మహలులోనే నిద్రపోతున్నాడు.

వనవీర్ :_ఔను, ఎరుగుదును. [వనవీరుడు నిష్క్రమిస్తాడు]

శీతలసేని :_వనవీరుడిలో ఒకరకమైన దుర్బలత్వం ఉంది; ఒకవేళ క్షుద్రవాడైన ఉదయుణ్ణిచూచి, గుండె కరిగి, కటారు విసరిపారేస్తే?

రణజిత్ :_ఆజ్ఞాపించుదేవీ! ఓ ప్రధాన మంత్రిత్వమా! నీకోసమని రాజమాతా! చెప్పండి, భూకంపంలో చొరబడేదా? ప్రళయంలో నాట్యంచేసేదా?

శీతలసేని :_వెళ్లు వనవీరుణ్ణి అనుసరించి. అతడు ఉదయుని వధించలేకపోతే నీవే ఆపని నెరవేర్చాలి.

రణజిత్ :_అలాగే.

శీతలసేని :_తెలుసునా? ఉదయుని అస్తిత్వము నీ మంత్రిపదవీ ప్రాప్తికికూడా అంత భయంకర-ఆటంకమే.

రణజిత్ :_ఔను, ఎరుగుదును. నేనతన్ని చంపగలిగితే—అతగాడి రక్తబిందువులన్నీ మీరిచ్చిన లిఖితపత్రానికి లక్షముద్రలౌతవి. (కత్తిదూసి రణజిత్ నిష్క్రమిస్తాడు)

శీతలసేని :_వెళ్లు. ఒకవేళ నీవైనా ఆ కుఱ్ఱవాణ్ణి వధించలేకపోతే? నేనూ వస్తున్నాను; నేనతన్ని వధించగలను.

(ఒరనుండి కత్తిపెరికి శీతలసేనికూడా అటువేపే వెళ్లుతుంది)

తెర మారుతుంది.

(ఇంకా వుంది)

మలేరియా జ్వరపీడితులకు ముక్తి

జ్వరాంతర కష్టములు ఆపబడినవి.

మన దేశములో ప్రతి ఆరింటిలో నొకరు మలేరియా జ్వరముచే మృతినొందుచున్నారు. దీనిని నిలుపుటకు డాక్టర్లు ఎక్కువశ్రమను తీసుకొనుచున్నారు.

జ్వరముచే క్షీణించిన దేహమునకు తిరిగి శక్తినిచేకూర్చవలెనని వారికితెలుసును. అయితే జ్వరము జీర్ణశక్తిని తగ్గించుటచే ఏ ఘనాహారమును సహించదు.

తేలికయైనది, త్వరలో జీర్ణమగునదియునైన ఒక ఆహారపదార్థమును డాక్టర్లు కనిపెట్టి ఎందరో రోగులకిచ్చి పరీక్షించిరి. మంచి ఫలమొసగినది. ఇదియే హార్లిక్సు. దీని సేవనచే నర, స్నాయు, రక్తములకు పుష్టిలభించును. సర్వాంగములకు చైతన్యము చేకూరును. త్వరలో రోగనివారణ మగును. ప్రతి ఆస్పత్రులలోను రోగులకు హార్లిక్సునే యిచ్చుచున్నారు. రోగములనుండి నివృత్తులైన ప్రజలెందరో ఈ అద్భుత ఆహారమే తమ జీవితమునకు కారణమని కొనియాడుచున్నారు.

H. 469 B.

★ పాండవు లెవరు...? ★

హిమాలయమున కావలనున్న యొక కొండజాతివారా...?

●

శ్రీమతి అకపా సుగుణమణి

●

పాండవుల ప్రవర్తనలయందు కొన్ని అమానుష క్రియలు ప్రచురముగ నున్నవి. ఇవి పవిత్ర హిందూమతమునకే కాక, ఆదర్శులైన భారత వీర వీరాంగనలకు గూడ దోషమాపాదించు చున్నవి—
అట్లగుట వీరు హైందవేతరులా?
కాక సమర్థనీయ మెట్లు?

"భారతము బొంకు రామాయణము రంకు"ను సామెత మన హిందూదేశమున నాబాలగోపాలము మాటవరుసలలో సర్వసాధారణముగా దొర్లించుచుండుట గని, విని యున్నారము. ఈ ప్రయోగ మెవరు కూర్చినది, యెప్పుడాచరణలోకి వచ్చినది గ్రాహ్యముకాదు. కాని దీని వాడుక చిరకాలమునుండి యున్నదనుట నిర్వివాదాంశము. రామాయణ భారతములు తెనిగింపబడ్డనాటినుండియు వ్యవహరింప బడుచున్నదన నతిశయోక్తికాదని తలంచవచ్చును. 'ఈ ప్రయోగము వినినవారికి 'రంకు రామాయణముననేగాని భారతమున లేదా' యను సంశయము తోపవచ్చును. లేకేమి? సామెతకై యట్లు కూర్చి యుందురు లేదా కథావస్తువే బొంకని విశ్వసించిన పిదప 'బొంకుకు రంకును సహితమేల నాచ్ఛాదింపవలె'నని విడచియుందురు. ఏది యెట్లున్నను పంచమవేదమగు భారతము బొంకని నాడు, నేడు విశ్వసింపవలసిన విషయములు గోచరించు చున్నవి. అందు పాండవుల పుట్టుపూర్వోత్తరముల విషయము ప్రధానము. పాండవులు హిందూదేశీయులా? లేక వలస వచ్చిన తదితరదేశీయులా? యన్నప్రశ్న యొక క్లిష్ట సమస్య.

హిందూ సాంప్రదాయమునకు కొన్ని విరుద్ధములైన యాచరణలు పాండవులలో కాన్పించినవి. వీటిని కొంతవరకు మనము విమర్శింపగలిగిన నీక్లిష్ట సమస్యాపూరణము చాలవరకు సానుకూలము కాగలదు. అందు మొదటిది ద్రౌపది కల్యాణము. హిందూ సాంప్రదాయానుసారముగ పురుషుడు పెక్కు స్త్రీలను చేబట్టుట కర్హతగలదు గాని స్త్రీ యొకనికన్న నధికముగ నుద్వాహమాడరాదు. ఈ ఘట్టమున గ్రంథకర్త వేదవ్యాసుడు విమర్శనమున కవకాశమీయకుండుటకై కట్టుకథల కల్పించి సమస్య నధికముగ జిగిబిగి చేసినాడు. కాని యీ పరిణయము పాండవుల సమకాలికులకు సహితము వింతగా కాన్పించినది. విడ్డూరముగ తోచినది. ఉదాహరణమునకు యుధిష్ఠిరుడు "ఈ పెండ్లి ద్విజుల ధర్మమునకు వ్యతిరిక్త"మని నుడివెను. ద్రుపదుడు "పురుషుడు పెక్కుస్త్రీలను వివాహమాడుట కద్దుగాని స్త్రీ పెక్కురను వివాహమాడుట కని వినియుండలేదు. ఇది నీతి విరద్ధ"మని వాక్రుచ్చెను. కర్ణుడు "భగవంతుడు స్త్రీకి యొక భర్తనే విధించెను. ఈమె పెక్కురు భర్తలను చేబట్టినది. కాన నీమె గృహిణికాదు. వెలకాంత. ఈమె నేకవస్త్రముగ నున్నప్పుడేకాదు, వివస్త్రగనున్నప్పుడుకూడ సభకు తేవచ్చు"నని పలికెను. పోనిందు, వ్యాస భట్టారకుడు

చెప్పిన విధమున మాతృయాజ్ఞకు కట్టువడి పంచపాండవులు కృష్ణను పెండ్లాడు నవస్థ తటస్థించె ననుకొంద
మన్నను సందేహము వీడదు. ధర్మజుడు "ఈ సౌందర్యరాశి సోయగమునకు నా తమ్ములందరు ముగ్ధులై
నారు; వలచి వాంఛించుచున్నారు. మాలో నంతఃకలహములు, గృహ కల్లోలములు లేకుండుటకై నీమె
నందరము నేకముగ చేబట్టుటయే శ్రేయస్కర"మని యభిప్రాయమును వెల్లడించెను.

అంతటితోనైన ద్రౌపది సౌశీల్యముగాచి కాపాడబడినదా? కృష్ణుడట! రాధేయుడట!! గూని
సేవకుడట!!! ఎన్ని పుక్కిటి పురాణములు! అమంగళ మప్రతిహతమగుగాక! ఎట్లయిననేమి పంచకన్యలలో
పాంచాలి యొక తెగదా? ఇక పాండవులు సౌందర్యరాశి ద్రుపదనందనతో సంతుష్టులైనారా? ధర్మజునకు
వేదిక, భీమునకు జలంధర, అర్జునకు సుభద్ర, ఉలూపి, చిత్రాంగద, నకులునకు రేణుమతి, సహదేవునకు
విజయ- ప్రియసఖులట!

స్త్రీ యొకనికన్న నధికముగ వివాహమాడు సందర్భములు-యొక్క ద్రుపదరాజపుత్రి స్వయంవరమే
గాక మరికొన్ని నిదర్శనములున్నవని వ్యాసుడు వక్కాణించెను. అవి గౌతమున్దైన జటిలుండను ఋషి
కూతురు తపఃప్రభావంబున నేడ్వురు ఋషులకు నొక్కతె భార్యయగుట, దాక్షాయణి యను మునికన్యక
ప్రచేతసు లనంబరిగిన పదుండ్రకునొక్కతె యర్ధాంగిగానుంట, సౌసీనరపతికన్యక నజితయను నామె నితంతుండను
రాజర్షి కొడుకులు సాల్వేయ, శూరసేన, శ్రుతసేన, సీనాబిందు, సరారిసారులను నేవురపతులగొంట మున్నగు
నవి. కాని వీటియుదంతములు కృష్ణద్వైపాయనుడు ప్రమాణములతో విశదముగ నిరూపించలేదు. ఇది
కేవలము ద్రుపదుని మనోవంచనకై కల్పింపబడ్డ కట్టుకథ లేమో?...

సూక్ష్మదృష్టికలవారు పై నామములుగాక మరికొన్ని నిదర్శనములు గలవని సర్వసాధారణముగ
బేర్కొనునవి భారత ప్రయోగములు మూడు: అవి బ్రాహ్మణకన్యలు జటిల వారాక్షులు, ఉతాత్యునిభార్య
మమత, యయాతికొమరిత మాధవి. ఈ నిదర్శనత్రయమును నొక్కటైనను విమర్శనకు నెదుర్కొనలేదు.
సరికదా యాజ్ఞసేని వైవాహిక విషయమునకు కించిత్తైనను సహాయపడవు. ఈ నిదర్శనములు కేవలము నామ
మాత్రావశిష్టములగుటచే యనవసరముగ విమర్శనను పొందుపరచి వ్యాసమును విస్తరింపజేయుట నా యభి
మతముగాదు. కుతూహలము గలవారు భారతమున నాయాఘట్టములు పరికించుచో నీ నిదర్శనములు పూర్వ
పక్షమున హేతువుకు చూపింపబడినవేగాని సందర్భానుసారములు గావని తప్పక స్ఫురించును. మరి కొందరు
కౌరవులలో సహితము నియోగము ప్రబలియుండెడిది. చిత్రాంగద విచిత్రవీర్యులు సంతతిలేక గతించుటచే
విచిత్రవీర్యుని భార్యలగు అంబిక, అంబాలికలు నియోగమునకు బాల్పడిరి. ఆ ఫలితముగనే ధృతరాష్ట్ర
పాండురాజులు జన్మించిరి. గిందముడను మునిశాపవశమున పాండురాజు భార్యా సంభోగమునకు దూరుడగు
టచే నతని భార్యలు కుంతీమాద్రులు నియోగమువలననే పుత్రులను గాంచిరని రూపించుచున్నారు. నియోగ
మునకు వివాహమునకు భేదము హస్తిమశకాంతరముగలదు. నియోగమును వివాహమునకు సాటితెచ్చి
వాదింపజూచుట సమంజసముకాదు. వంశోద్ధారణకై యాచరించిన నియోగము పెక్కుసారు లవలంబించిన
పాపమని ధర్మశాస్త్రము బోధించినది. నియోగమునకు మొదటనే యజుర్వేదము యసమ్మతిని చూపినది.
దారిచూపిన 'మనువు' వెంటనే యిది పశుప్రాయమని నిరసించినది. అందువలన నీవాదన సహిత మామోదింప
దగ్గదికాదు.

పాండవు లెవరు?

పై విషయముల నవగాహముచేసికొనిన పిమ్మట ద్రౌపది వివాహము హిందూ సాంప్రదాయమునకు వ్యతిరిక్తమని నిర్ధారణ చేయవచ్చును.

భీముడు కౌరవులొనర్చిన దుండగములు సహించలేక రోషావేశంబున 'ప్రపంచములోనున్న యుద్ధవీరుల్లారా! యిదిగో, నా ప్రతిజ్ఞ వినుడు. దుర్మార్గుడైన నీ దుశ్శాసనునిగుండె చీల్చి నే నీరక్తమును ద్రావనిచో పితృలోకమునకు దూరుడనగుదు'నని గర్జించెను. ఇది వినిన సభికులందరు తామసపు పలుకులని తలపోసిరి. కాని భారత గ్రంథకర్త 'వీరక్షత్రియుడాడిన పలుకులు ప్రాణములుండువరకు నెరవేర్పబడునవేగాని యలవిగ దలంపవలనుపడ'దని రచియించెను. పోనిందు పౌరుషమునకై యాడిన పలుకులైన నెరవేర్చుకొనుటకై శత్రురుధిరమును తిలకము నిడుకొనుటో లేక నామమాత్రముగ నించుక నాలుకపై నిడుకొనుటలో జరుపవలయును గాని శత్రువును చంపి వక్షస్థలముపై కూర్చొని, చీల్చి రక్తమును దోసెళ్లతో మరలమరల ద్రావి "తల్లిపాల కన్నను రుచికరముగ నున్నది. మధువుకన్నను మధురముగ నున్నది. మధిరముకన్నను యింపుగనున్న"దని సంతోషాతిరేకమున కేకలిడుటేమి? కదనరంగముననున్న వీరులు 'ఇది మానుషకృత్యముగాదు. వీడు మానవుడు గాడు రక్కసుడైయుండనోపు'నని యాభీకరకృత్యమును చూడజాలక పెడమొగమిడి తొలంగిచనిరి. ఇందువలన పాండవ సమకాలికులకీ కృత్యము నూతనముగను, నదివరకు కనివిని యెరుంగనిదిగను తోచినదని విశదముగ తెలియుచున్నది.

హిందూవివాహ సంప్రదాయమునకు వ్యతిరిక్తముగ స్త్రీ పెక్కురను వివాహమాడు పద్ధతికలిగి, పురుషులు శత్రువులను చంపి రక్తమును త్రావు యాచారముగల నేదేని యితరదేశమునుండి పాండవులు వలస వచ్చినారేమో ఇంకను పరిశీలింతము——

పాండవుల జనన వృత్తాంతమొకవింత. పాండురాజు కుంతి, మాద్రులతో నాగశైలము, చైత్రరథము, వాసవంతము, గంధమాదనము, హంసకూటము నతిక్రమించి శతశృంగపర్వతముపై నివసించుచుండెను. పాండురాజు పాండురోగి. యాపైని ఇందముడను ముని శాపవశమున భార్యా సంభోగదూరుడు. అతడు సంతానాపేక్షతో భార్యలను నియోగమునకు పురికొల్పెను. పృథ (కుంతి) దూర్వాసుని మంత్ర ప్రభావంబున ధర్మానిలశక్రుల ప్రసాదంబున యుధిష్ఠిరభీమార్జునులను ముగ్గురుపుత్రులను యొక్కొక్కనికి వత్సర వ్యత్యాసమున బడసెను. మాద్రి కుంతియుపదేశమున మంత్రము నేర్చి యశ్వినీదేవతల వలన నకులసహదేవులను యిరువుర కవల పుత్రులను బడసెను. కొంతకాలమునకు పాండురాజు కనిష్టభార్యాలోలుడై శాపమునకు గుఱియై యసువులను బాసెను. స్వయంకృతాపరాధమునకు ప్రాయశ్చిత్తముగా మాద్రిసహగమనముచేసెను. పాండురాజు చనిపోయిన పదునేడవనాడు హిమాలయమున కావలనున్న ఋషులు కొందరు భర్తృహీన కుంతిని పుత్రపంచకమును హస్తినాపురమునకు గొనితెచ్చి భీష్మునియండ నునిచి యాశ్చర్యకరముగ నదృశ్యులైరి. పాండవులు హస్తినాపురము చేరుసరికి ధర్మజునకు పదునారు, భీమునకు పదునైదు, అర్జునునకు పదునాల్గు, నకులునకు పదమూడు సంవత్సరముల ప్రాయమని చాటుపద్యమణిమంజరి ప్రథమభాగమున పాండవవర్తనము తెలియజేయుచున్నది. భారతమున పాండవులు హస్తినాపురము చేరగనే పుత్రపంచకమును సత్యవతి, అంబికాంబాలికలు యెత్తుకొని ముద్దులిడిరని చెప్పబడియున్నది. పై నుదహరించిన ప్రాయమే నిజమైనచో యీ భారతవర్ణనకవకాశముండునో లేదో పాఠకలోకమే నిర్ణయింతురుగాక! ఈ యుదంతమువలన బహుశః పాండవులు హిమాలయమున కావలనున్న యొక కొండజాతితెగవారేమోయని సందేహింప నవకాశము గలుగుచున్నది.

ఏషియాఖండమున నుత్తరభాగమున నొక తెలివిమీరిన కొండజాతి ప్రబలియుండెడిది. డాక్టరు థామస్ (Dr. Thomas) 'సకస్థాన' మను పొత్తమున భారతకాలమున నీకొండజాతివారు ఏకాయిమొదలు సకస్థానమువరకు విస్తరించియుండిరని నుడివియున్నాడు. పాండవుల జన్మస్థానమగు శతశృంగము సహితమీ రాజ్యముననుండెడిది. వీరిలో స్త్రీలకు పురుషులతో సమముగ హక్కులుండెడివి. స్త్రీలు పెక్కుపురుషులను పెండ్లాడు యాచారముగలదు. స్త్రీ బంధుబాంధవులతో స్నేహాభివృద్ధికొరకై వ్యభిచరింపవచ్చును. పురుషుడు శత్రువును చంపి రక్తము త్రాగుయాచార మాచరణలో నుండెడిది. అందువలన హిందూ వివాహసాంప్రదాయమునకు వ్యతిరిక్తముగను, యమానుషముగను శత్రురక్తమును ద్రావి ప్రవర్తించిన పాండవులీ తెగకుచేరినవారేమో!

భారతముననున్న పాండవులవంశవృక్షమునుజూచి పాండవులుకౌరవులు అన్నదమ్ముల బిడ్డలనివిశ్వసింప నవకాశములున్నవి. కాని, పాండురాజు కురువంశజుడై యతని సంతతి కౌరవులుగాక పాండవులని ప్రత్యేకింపబడుట యాశ్చర్యకరమే. పేరులను విశ్వసించి వంశము నిరూపించుట కేవల మమాయకము. కురువంశమున ఋక్షుడు, జనమేజయుడు, పరీక్షిత్తు, ధృతరాష్ట్రుడు, పాండునామను లధమగు రెండు పర్యాయములైనను దొర్లినవి. శంతనుడు ధృతరాష్ట్రుని మనుమడు. మరల ధృతరాష్ట్రుడు శంతనుని మనుమడు. అందువలన పేరులను బట్టి వరుస నిరూపించుటకు చాల నప్రమత్తతతో నుండవలయును. డాసబ్రాహ్మణ జాతకమున నొకచోట (జాతక 413) ధనుంజయుడు కురురాజు, యుదిత్తల వంశీయుడు, ఇందపత్తమను పురమున నివసించెననియున్నది. మరియొకచోట (జాతక 515) ధనుంజయ కోరబ్యయను కురురాజు చాలధార్మికుడు. ఇతనికి యుదిత్తనామము గలదని వక్కాణింపబడినది. ఇంకొకచోట (జాతక 329) ధనుంజయుడు కాశీపట్టణపు రాజుని చెప్పబడినది. వేరొకచోట (జాతక 185) పాండవ శబ్ద మశ్వముల కుపయోగింపబడినది. మొత్తముపై జాతకములలో భారతకథ పూర్తిగలేదు. వేదమంతయు కలయవెదికినను పాండురాజు, యతని కుమారులు పంచపాండవుల విషయమై ప్రస్తావన కానరాదు. యజుర్వేదమున కౌరవపాంచాలుల నామములే గాన్పించునే గాని పాండవశబ్దములేదు. మొత్తముపై నొకచో చెప్పబడిన విషయమింకొకదానితో నన్వయించదు. ఒకటి యేటికీడ్చిన నింకొకటి కోటికీడ్చుచున్నది. అందువలన బహుశః పాండవులు ఏషియా ఉత్తరభాగమున కొండజాతివారికి జెంది, యటనుండి హిందూదేశమునకు వలసవచ్చి పాంచాలులతో స్నేహమొనర్చి కౌరవులపై కత్తిదూసి, కదనరంగమున జయించి రాజ్యమాక్రమించుకొని యుందురు. పాండవులు హిందూదేశీయులో, కాదో నిర్ణహించుటకు మనకు లభ్యమగు నిదర్శన సంగ్రహమత్యల్పము అందువలన యిదమిద్ధమని తెల్పుట కష్టసాధ్యమైనపని. కాని పాండవులితర దేశీయులేమోయను సంశయమునకు తావుమాత్రము గలదు. ఈయనుమానమును కొకటి వేళ్లతోపెకలించి పారవేయుగల బాధ్యత భారతాభిలాషులగు సోదరీమణులపై నాధారపడియున్నది.

శ్రద్ధధానశ్శుభాం విద్యామాదదీతావరాదపి,
అంత్యాదపి పరం ధర్మం స్త్రీరత్నం దుష్కులాదపి.

శ్రద్ధగలవాఁడు తనకంటెఁ దక్కువయైనవానికడనుండియైనను నుత్తమవిద్యను గ్రహింపవలయును, అంత్యజునియొద్దనుండియైనను నుత్తమధర్మమును నేర్వవలయును. తక్కువకొలమువాని కడనుండియైనను స్త్రీరత్నమును గ్రహింపవలయును.

—మనుధర్మ శాస్త్రము

వింతవింతల ప్రపంచం

15-వ శతాబ్దంలో జర్మనీలో ఒక యిల్లాలుకు 38 గురు మగపిల్లలు, 15 గురు ఆడపిల్లలు మొత్తం 53 పిల్లలు పుట్టారు. ఆమె జ్ఞాపకార్థం జర్మనీలోని వర్టెంబర్గులో 1935 సం||రంలో స్మారకచిహ్నం రాతితో నిర్మించారు. 1926 లో స్పైన్ దేశంలో ఒకస్త్రీకి 68వ యేట 29వ మగశిశువు కలిగాడు. అంటే ఆమెకు అంతకుముందు 28 గురు మగపిల్లలు జన్మించారు. లెక్కలనుబట్టి చూస్తే 3300 స్త్రీలల్లో ఒకస్త్రీకి 50 సంవత్సరాలు వయస్సు దాటిన తరువాత పిల్లలు పుట్టడం కలదు. 1928 లో ఈజిప్టులో ఒకస్త్రీకి నలుగురు ఆడపిల్లలు యిద్దరు మగపిల్లలు ఒకేసారి ఉద్భవించారు. 1934 లో డియోనీ అను కెనడాదేశపు స్త్రీకి అయిదుగురు ఆడపిల్లలు ఒక్కమారు జననమయ్యారు. ఆ అయిదుగురు తరువాత జీవించారు కూడాను.

♦ ♦ ♦ ♦

గ్రేటుబ్రిటను ఉత్తర అయిర్లండులో ప్రతిరోజూ వెయ్యికిపైగా పెళ్లిళ్లు జరుగుతూవుంటాయి. సాలుకు సగటున 375,000 పెళ్లిళ్లు జరుగుతాయి. గ్రేటుబ్రిటనులో పెళ్లిచేసుకునే మగవానిసగటు వయస్సు 29. పెళ్లికూతుళ్ల సగటు వయసు 26. భార్యపోయిన తరువాత తిరిగి వివాహం చేసుకునే మగవాని సగటు వయస్సు 50. తిరిగి వివాహము చేసుకునే వితంతువుల సగటువయసు 45. గత జనాభాలెక్క ప్రకారం ఇంగ్లీషు వారిలో నూటికి 52 మంది అవివాహితలే. 44 మంది వివాహితులు, 4 గురు భార్యపోయినవాళ్లు. ఆడాళ్లలో నూటికి 50 మంది అవివాహితలు, 41 వివాహితలు, 9 గురు వితంతువులు. రాబర్టు థీమ్ అనే ఆయన ఒకభార్య పోయిన తరువాత మళ్లీ పెళ్లి చేసుకుంటూ, అల్లాగ 15 పెళ్లిళ్లు చేసుకుని 103 వ యేట 1935 లో చనిపోయాడు.

♦ ♦ ♦ ♦

మేఘములయెత్తు వాటినిఆపే గాలియొక్క ఉష్ణతనుబట్టి మారుతూవుంటుంది. భూమధ్య రేఖవద్ద ఆరుమైళ్ళయెత్తున వుంటాయి. గ్రీన్‌లాండుదగ్గర అరమైలుకంటె యెక్కువ యెత్తునవుండవు.

♦ ♦ ♦ ♦

మనిషి ఊపిరితిత్తులు విప్పితే 156 చ|| గజములుస్థలం ఆక్రమిస్తాయి. అంటే 500 మంది జనం నుంచోడానికి తగినప్రదేశం. 60 సం||రము వయస్సుగలమనిషి తన జీవితకాలంలో 508,000,000 మార్లు గాలి పీలుస్తాడు. తద్వారా 9,600,000 ఘనపుటంగుళముల గాలి వూపిరితిత్తులలోకి వెడుతుంది.

♦ ♦ ♦ ♦

ఇండియానుంచి టిబెట్టుకు వెళ్లే గోద్డును సంరక్షించడానికి 19,500 అడుగులయెత్తున వున్న డాంకియాలా కనుమవద్ద అయిదుగురు మనుష్యులు ఒక రాతిగుడిసెలో కాపురమున్నారు. మనుష్యులు కాపురముండే యెత్తైనప్రదేశం ప్రపంచంలో కల్లా యిదే

♦ ♦ ♦ ♦

ప్రపంచంలో చాల జలమయంగావున్న భాగం పదునాలుగుకోట్ల చదరపుమైళ్లు. పసిఫిక్ మహాసముద్రము విస్తీర్ణము 6 కోట్ల 70 లక్షలు. అట్లాంటిక్ 3 కోట్ల 40 లక్షలు. ఇండియన్ మహాసముద్రము 1 కోటి 80 లక్షలు. ఆర్కిటిక్ మహాసముద్రము 54 లక్షలు. అంటార్కిటిక్ మహాసముద్రము 1 కోటి 2 లక్షలు పసిఫిక్ మహాసముద్రము కొన్నిచోట్ల 30 వేలడుగుల లోతున్నప్పటికి మనిషి యింతవరకు దిగగలిగినలోతు 3028 అడుగులు మాత్రమే.

—వారణాశి భాస్కర మహాలక్ష్మి.

పందెం ★

★ శ్రీమతి నందగిరి ఇందిరాదేవి

> చిత్తైకాగ్రత, ప్రశాంతత కలిగివున్న జైలుజీవితమంటే జలదరించిపోతారు—
>
> కాని, ఇదే - శాస్త్రపరిశోధనలకీ, నూతన గ్రంథరచనలకీ ఎంతో ఉపకరిస్తోంది—
>
> జైలుజీవితం - ఒకరికి జీవిత జ్యోతులను ప్రసాదిస్తూవుంటే, ఒకరికి జడత్వాన్ని ఆపాదిస్తూవుంది.
>
> అయితే, యీ తేడా మానవ ప్రకృతిలోనే - కాని జైలు జీవితంలో కాదు—
>
> కాగా, బందిఖానా అంటే భయమెందుకు?

ఆనాటి సాయంకాలం స్నేహితులంతా సేటు రాజారాం ఇంట్లో విందారగించి కులాసాగా కబుర్లుచెప్పుకుంటూ కూర్చున్నారు. వివిధ విషయాలను చర్చిస్తున్నారు. వాదిస్తున్నారు. ఉత్సాహంగా సేటు రాజారాం తెల్లటి ఫర్షుమీద ఉన్న పట్టుదిండ్లకొరిగి హుక్కా పీలుస్తున్నాడు అవసరమని అనుకొన్నచోట్ల తానుకూడ పాల్గొంటూ. దగ్గర నిలువబడియున్న నౌఖరు లక్ష్మన్ కాళీయైన గాజుగ్లాసుల్లో వైను నింపుతున్నాడు. స్నేహితులు సేటు బలవంతంచేయాలని బెట్టు సరిగానే కాళీచేస్తున్నారు పాత్రలు. సేటు 'లక్ష్మన్! మొన్న ప్రత్యేకంగా ఆర్డరిచ్చి తెప్పించిన సీసా తీసుకురా' అన్నాడు. లక్ష్మన్ తెచ్చి మళ్లీ గ్లాసుల్లో నింపాడు. స్నేహితులు ఒకరిముఖం ఒకరు చూసుకున్నారు. 'సేట్! వేపారం బాగా సాగుతున్నట్లుందే!' అన్నాడొక స్నేహితుడు. 'అవును మరి లేకపోతే ఇంత ఖరీదుగల వైను తెప్పించటం సామాన్యమా' అన్నాడు మరొకడు లక్ష్మన్ అందిచ్చినగ్లాసు తీసుకుంటూ. సేటుకూడ గ్లాసులోనిది కొద్దిగా చప్పరించి స్నేహితులవంకచూచి మందహాసంచేశాడు.

గ్లాసులు కాళీకావటంతో ఉత్సాహం ఇనుమడించింది అందరికీ. అంతకుముందుదాకా చర్చిస్తున్న విషయం మళ్లీ ఎత్తుకున్నారు.

'మీరు ఏమన్నా అనండి! యావజ్జీవం ఖైదుశిక్ష అనుభవించటం చాలా ఘోరం. అంతకంటే రెండు నిమిషాల్లో ప్రాణంపొయ్యేట్లు ఉరితీయటం మంచిది.' అన్నాడు రాంలాల్ పట్టుదలగా.

'బతికితే బలుసాకయినా తినొచ్చు. అసలే లేకుండా అంతమొందటం కంటె ఎట్లాగో ప్రపంచం మీద ఉండటంనయం.' అన్నాడు నరోత్తందాసు. 'ఏమీ స్వేచ్ఛలేక జీవితాంతంవరకు ఆశలన్నీ చంపుకొని బతకి బాధపడటంకంటె ఉరిశిక్ష అనుభవించటం చులకనగాదూ' అని తానుకూడా ఒక సమిధ వేశాడు సేటు.

'ఈ రెండుశిక్షలూ నాగరికతగలదేశాల్లో గర్హ్యమయినవి. నెమ్మదిగానో తొందరగానో వ్యక్తుల ప్రాణాలుతీయటమే ఈరెంటి ఉద్దేశం. కాని తప్పుచేసినవాళ్లను మంచిమార్గంలో ప్రవేశపెట్టటానికి బదులు సంఘంలోనుండి వాళ్లను పూర్తిగా అంతమొందించటం దెబ్బతగిలిన వేలును పూర్తిగా కోసివేయటం వంటిది!' అన్నాడు లలితాప్రసాదు చేతిలోనిసిగరెట్టు బూడిద దులుపుతూ. నిజమే! ఈ రెండిలో నాకయితే యావజ్జీవశిక్షే నయమనిపిస్తుంది' అన్నాడు సరోత్తందాసు. సేటువంకచూస్తే సేటు తనమాటను పడగొట్టాలని అన్నట్లుగా అనుకొని 'యావజ్జీవం ఏమిటోయి? ఒక ఐదేండ్లు ఉండలేవు! ఏకాంతంగా యావజ్జీవం

గడపాలంటే మాటలా ?' అన్నాడు సేటు పూర్తిగా వాదనలోకి జొరబడి. ఇద్దరికీ తమమాట నెగ్గాలన్న పంతం ఎక్కువయి వాదన ముదురుతోంది. స్నేహితులు వాళ్లకు పొగవేస్తున్నారు తాము తమాషా చూస్తో.

'ఐదేళ్లుకాదు పదేళ్లుంటాను నువ్వు ఎట్లా చెప్పితే అట్లా' అన్నాడు నరోత్తందాసు.

'ఆ! పందెం రెండు లక్షలు!' అన్నాడు సేటు ఉద్రేకం పట్టలేక.

'ఓ సిద్ధం! నువ్వు రెండులక్షలు గుమ్మరించాలి మరి?' అన్నాడు నరోత్తందాసు.

'తప్పకుండా?' అన్నాడు సేటు.

ఇంకేముంది? వ్యవహారం ముదిరింది. సేటు రాజారాంతోటలో పదేళ్లపాటు ఏకాంతవాసం నరోత్తందాసు అనుభవించేటట్లు తదుపరి నరోత్తందాసుకు సేటు రెండులక్షలు ఇచ్చేటట్లు ఒప్పందం చేయించారు స్నేహితులు.

సేటు అంతా అయిపొయ్యాక కళ్లుతెరిచాడు. 'ఎంతపని జరిగింది? ఎందుకు వచ్చినట్లు ఈ రెండు లక్షల దండుగ!' అన్నాడు స్నేహితులతో. స్నేహితులందరూ రెండులక్షల కొరకు వెనుకనుపొయ్యే పీనాసి అని బనాయించేరు. సేటు సిగ్గుతో మారుమాట్లాడక ఒప్పందం అంగీకరించాడు.

తోటలో ఒకగది ప్రత్యేకించారు నరోత్తందాసుకొరకు. సరిగ్గా పదేళ్లకు ఏ రెండునిమిషాలు తక్కువయినా కూడా రెండులక్షలు చెల్లించే బాధ్యత సేటుకు ఉండదు. ఖైదీకి కావలసిన వస్తువులు ఆర్డరువ్రాసి తెప్పించుకోవచ్చు. పుస్తకాలు బట్టలు భోజనం వగైరాలు అతనికి బాహ్య ప్రపంచంతో ఏమాత్రం సంబంధం ఉండకుండా ఈ వస్తువులన్నీ కిటికీ ద్వారానే వెళ్లవలసి ఉండేవి. ఖైదీ కావాలంటే ఉత్తరాలు వ్రాసుకోవచ్చు.

మొదటి సం||రమంతా చాల విసుగుగా, విచారంగా గడిపాడు ఖైదీ. ఎన్నోసార్లు ఏడవటంకూడా వినపడేది అక్కడి చౌకీదారుకి. రెండుమూడేళ్లు గడిచాక ఈ ఒంటరి జీవితానికి అలవాటుపడ్డాడు. రాత్రింబగళ్లు చదవటమే చదవటం. ఈ ఖైదీ కావలెనని వ్రాసి పంపిన పుస్తకాలు తెప్పించలేక అవస్థపడేవాడు సేటు. తన స్థితిని గురించి విచారపడటానికి సమయమే చిక్కకపోయేది ఖైదీకి.

ఒకనాడు సేటుకు ఖైదీ పదిభాషలలో ఒక ఉత్తరం వ్రాశాడు. ఆ ఉత్తరం ఆయాభాషలు వచ్చినవాళ్లకు చూపెట్టుమని తప్పులులేకుండా సరిగా ఉన్నట్లయితే తోటలో శంఖు ఊదమని వ్రాశాడు. అట్లాగే శంఖు ఊదారు.

సేటు రాజారాంకు ఇదంతా చూస్తే చాల ఆశ్చర్యమైనది. ఈ ఏకాంతవాసం పదేళ్లపాటు అనుభవించపోతాడా? నేను రెండులక్ష లియ్యబోతానా అనుకున్నాడు సేటు. మొదటి సం||రంలో నే భరించలేక ఆత్మహత్య చేసుకుంటాడని ఆశించిన సేటు చూస్తుండగానే నాలుగేళ్లు గడిచిపోవటం, అందులో ఖైదీ ఏమాత్రం ఒంటరితనం 'బాధ' అనుభవించటంలేదని తెలుసుకొని కిటకిట పడ్డాడు.

♦ ♦ ♦ ♦

'రేపు ఉదయంవరకు పదేళ్లు నిండుతాయి. మా ఒప్పందం ప్రకారం అతనికి రేపు నేను రెండు లక్షలు గుమ్మరించాలి' అనుకున్నాడు సేటు. కాలం అంతా ఒక్కతీరుగా ఉండదు. పదేళ్లకింద రోజుకు

ఐదువందలు సంపాదించే సేటుకు ఇవ్వాళ యాభైరూపాయలు రావటం కష్టంగా ఉన్నది. వ్యాపారం నష్టం వచ్చి సన్నగిల్లటం మూలానా రెండురూపాయలు రెండులక్షల సమానంగా ఖర్చుపెట్టుతున్నారు. 'రేపు ఎట్లాగూ ఇయ్యటం తప్పదు. ఇస్తే ఇంక నేను బిచ్చమెత్తుకోవాల్సిందే?' అంటూ ఎటూ తోచక పచారు చేస్తున్నాడు తనగదిలో. 'నే ననుకున్నట్లు వీడు చచ్చిపోతే ఎంత బాగుండేది! ఏ దిగులు లేకుండా!' అని గొణిగాడు మళ్లీ! ఇంతలో గడియారం రెండు కొట్టింది. కిటికీలోనుండి బయటికి చూచాడు. దట్టంగా చీకటి ఉన్నది. సన్నగా తుంపర పడుతోంది. చప్పున పెట్టెదగ్గరకు వెళ్లి ఎర్రటి మఖమలు ఒరలో మెరిసిపో తున్న చిన్న కరవాలం మొలలో దోపుకొని తాళపు చెవులగుత్తి పట్టుకొని బయలుదేరాడు. తోటలోకి వెళ్లి చేతిలోని టార్చి వెలిగించి చాకీదారును పిలిచాడు. వాడు పలకలేదు అంతరాత్రి. 'మొదలు అనుమా నం చాకీదారుమీద పడుతుంది. తరువాత ఎట్లాగయినా తప్పించుకోవచ్చు' అని మొలలోఉన్న కత్తి చూసుకున్నాడు. మెల్లిగా గదిదగ్గరకు వచ్చాడు. బల్లమీది లాంతరు వెలుగు కిటికీలోనుంచి కనబడు తున్నది. టేబిలుదగ్గర కుర్చీలో ఖైదీ కూర్చున్నాడు కిటికీవేపు వెన్నుచేసి. ఐదునిమిషాలు గడిచాయి. ఖైదీ కదలనేలేదు. 'పదేళ్లనుంచి ఇట్లా కదలకుండ కూర్చోటం అలవాటయింది కాబోలు' ననుకున్నాడు సేటు. కిటికీతలుపు చప్పుడు చేశాడు. అయినా కదల్లేదు. సేటు తలుపు తాళం వేశాడు. పదేళ్లకింద వేసిన తాళం తీస్తుంటే కిర్రుకిర్రు మన్నది. తాను తాళంతీస్తే ఎంత ఆశ్చర్యంగా చూస్తాడో లేక ఏమన్నా అంటాడేమో ననుకున్నాడు. కాని అతడు కదలనన్నా కదలలేదు. గడ్డంజుట్టు బాగా పెరిగింది. చిక్కి శల్యమయి ఉన్నది అతని శరీరం. సూర్యరశ్మి లేక ఒళ్లంతా పండుబారింది. టేబిలుమీద అన్నీ తెరిచిన పుస్తకాలు కుప్పలుగా పడిఉన్నవి. అతని ఒళ్లోకూడా ఒక పుస్తకం ఉన్నది. చదువుతూ చదువుతూ నిద్రపోయినట్లున్నది అను కున్నాడు సేటు. 'ఇప్పుడు పొడిచివేయటం చాల చులకనయినపని' అని టేబిలువంక చూడగానే ఒక కాగితముమీద ఏదో వ్రాసి ఉన్నది.

అదితీసి దీపం వెలుతురులో చదవటం మొదలుపెట్టాడు.

'నేను రేపుఉదయం బంధవిముక్తుణ్ణి అవుతాను. నాకు స్వేచ్ఛవస్తుంది. కాని నేను ఈ గది వదలి వెళ్లటానికిముందు కొన్నివిషయాలు నీకు విశదీకరించటం అవసరం.

ప్రపంచం అంతా పెద్దవాళ్లన్నట్లు మిథ్య. ఈ స్వేచ్ఛ, ఈ జీవితం బుద్బుదప్రాయాలు. ప్రపంచం పై మెరుగులతో నిండిఉన్నది. ఇట్లాంటి బూటకపు ప్రపంచంలో జీవించటం నాకిష్టంలేదు.

ఈ పదేళ్లబట్టి నేను ఐహిక సుఖాలన్నిటినీ పుస్తకాలద్వారా అనుభవించాను. తోటల్లో విహరించాను, ఆరామాల్లో విశ్రాంతితీసుకున్నాను, స్త్రీలను ప్రేమించాను, యాత్రలు సేవించాను, చూడదగినవి చూశాను, వినదగినవి విన్నాను, అంతా అనుభవమయినది నాకు.

నీపుస్తకాలవల్ల జ్ఞానం సంపాదించాను. నేను మీ అందరికంటె తెలివిగలవాడనయ్యానన నమ్మకం నాకుబాగా కుదిరింది.

కాని ఈ పుస్తకాలు ఈ జ్ఞానం అంతావ్యర్థం. ఎంతటివాడికయినా చావుతప్పదు. అందం, చందం, ధనం, ధాన్యం, తెలివి, గొప్పతనం అంతా చెల్లుదీనితో.

ప్రపంచం అబద్ధాన్ని నిజంఅంటుంది. పై మెరుగులన్ని నిజమయిన అందంఅని నమ్ముతుంది. ఇట్లాంటి లోకమే స్వర్గమని ఆనందిస్తుంది.

నాకు ప్రపంచమీద విసుగుపుట్టింది. ఇవేవి నన్నాకర్షించవు. కొన్నాళ్లక్రింద రెండులక్షల ఆస్తికోసం ఎన్నోకలలు కన్నాను. అనుభవించినట్లే ఆనందించాను. కాని నేడు నాకవి అనవసరం, కనుక నేను నిర్ణీత సమయంకంటే ముందుగావెళ్లిపోయి మన ఒప్పందం విచ్ఛేదంచేస్తున్నాను'

సేటు ఇదంతాచదివి కాగితం అక్కడపడేసి 'నూరేళ్లు జీవించు నాయనా' అని నెమ్మదిగా వెళ్లిపోయినాడు. తెల్లవారి చౌకీదారు ఖైదీ పారిపొయ్యాడని బిక్కమొహం వేసుకొనిచెప్పాడు.

రాజారాంసేటు బల్లమీదఉన్న రెండులక్షలు ఒప్పందంవ్రాసిన పత్రంవంక ఒక్కమాటుచూచి డ్రాయరులో పడేశాడు.

• కన్నీటిచుక్క •

విద్వాన్ పాలెపు వేంకటరత్నము

రైతుబిడ్డలు హేమంత రాత్రివేళ ద్వారములు మూసి శీత బాధానివార
ణార్థమై అగ్నిసవిధాన నలరుచుండ తలుపు మెల్లఁగా చేతితో తట్టి రెవరొ?
విస్మయావిష్టులై కాపుబిడ్డ లపుడు తిరిగిచూడగ, వెలుపల దీనవాక్కు
లిట్లు వినవచ్చె శక్తి విహీనమైన పేదమెలుఁగున డెందము వేదనపడ.
'తలుపు తెరువుఁడు మీయది ధర్మగృహము సగము చచ్చితి నిప్పుడే చలికి నేను
అంతులేని యీ మైదానమందు నన్ను హింసపెట్టుచు నున్నదీ యీదగాలి.
వాతరోగ సముత్సేక బాధితమగు యీ కృశాంగమునైన భరింపలేవు
కంపితములగు యీ ముదికాళ్లు; మీకు పున్నెముండును! ఉదయాన పోదునేను.
బాధపడుచుంటి వార్ధక్యబాధ యొకటి యిపుడు తలుపు తీయక ఆలసింతురేని
యీ హిమావృత మేదినియే విశాల మా సమాధి ప్రదేశమై యలరునాకు'
రైతుమేల్కాంచి యీ యార్తరావమువిని వడిగవచ్చి, తలుపుతీసి, గడగడమని
వడకుచుండెడు ముదుకని వహ్నికడకు తీసికొనిపోయి చలిబాధ తీర్చినాఁడు.
అతని బిడ్డలు ముదుకని హస్తములను ఆత్మహస్తములం జేర్చి అగ్నిచేత
కాచి కాచి హిమంబుచే గడ్డకట్టి నట్టి యవయవముల సుఖపెట్టినారు.
అతని యిల్లాలు జాగుగానీక మంచి భోజన పదార్థములు చాల పొందుపఱచి
నేదదీరిన పిదప నా బీదవాని యాత్మ సుఖియించు నట్లుగా నన్నమిడియె.
తనువు సుఖియింప నప్పుడా దైన్యజీవి వారి కభివందనంబులు వాక్కుతోడ
తెలుపఁగాలేక తనకనుఁ గొలఁకునుండి వేడికన్నీటి ముత్తెము విడిచినాఁడు.

4

కళాకలాపము

చిత్రలేఖనము

శ్రీ యుత ఒంగోలు వేంకటరంగయ్య

(గత సంచికాశేషము)

ఒక మనుష్యుని ప్రతిమ వ్రాయబూని పిల్లవాండ్రు మనుష్యాకృతిజూపు పిచ్చిగీతలుగీయుదురు. ఇందు మనుష్యాకృతి లేదనవలను కాదు గాని ఇది చెయితిరిగిన చిత్రకారుని చెయ్యంబనియెవరును జెప్పరు. రవివర్మ తీర్చిన ప్రతిమలలో "అరవ స్త్రీ" యొకటి కలదు. ఆ పటమును జూడగనె పయ్యెదనుబట్టియు, ఆభరణ విశేషములనుబట్టియు, తలకట్టునుబట్టియు ఆ రూపవతి ఆంధ్ర స్త్రీ కాదనియు ద్రావిడ స్త్రీయనియు దెలియబడుచున్నది. ఈ ప్రతిమ ఇట్టిది యని చెప్పకనె ప్రతిమయె తన యుదంతము తానే చెప్పుకొనునట్లుండ వలయును.

సంగీతమునకును, శిల్పమునకును, చిత్రలేఖనమునకును కొంత సాజాత్యమును కొందరు చెప్పుదురు. సంగీతమున స్వరభేదములబట్టి భావభేదముల దెలిసికొనునట్లు శిల్పమునను చిత్రలేఖనమునను కూడ ఉచ్చనీచాదు లనుబట్టియు నిర్మాణ సన్నివేశమునుబట్టియు భావభేదములు సూచింపబడుచున్నవని తత్తత్కళానిపుణులు చెప్పుదురు.

ఇంగ్లీషు చిత్రకళలో పెర్‌స్పెక్టివ్ (perspective) యను నొక సంకేతము కలదు. ఈ భావమునకు మనదేశ చిత్రకళయందేమి సంకేతపదమున్నదో స్పష్టముగ దెలియలేదు గాని, ఈ పెర్‌స్పెక్టివ్‌యొక్క తత్త్వమును దేశచిత్రకారులు చక్కగ గుర్తెరిగియుండిరనియు, మొగలాయి కాలపు చిత్తరువులలో నిది చక్కగ గమనింపబడినదనియు కళాకోవిదులు వ్రాసియున్నారు. ఒక పటముననో పరదామీదనో చాలదూరముపోవు పెద్ద వీధియు, దీనికిరుప్రక్కల ఇండ్లు చెట్లును చూపవలసియుండు సందర్భములో చిత్రకారుడు అట్టి దృశ్యమేర్పడుటకుగాను వీధి పోనుపోను సన్నగిలుచున్నట్లున్ను వీధి మొదటనుండు ఇండ్లయొక్కయు చెట్లయొక్కయు స్థౌల్యమును ఔన్నత్యమును తగ్గించుచు పోవును. ఒక సేన నడచిపోవుచున్నట్లుగాని లేక బహుజన మొక యుత్సవమును చూచుచున్నట్లుగాని యొక పటమున జూపవలసివచ్చినప్పుడు ఈ పెర్‌స్పెక్టివ్ విధానము ముఖ్యముగ కావలసియుండును. ఈ విధానమును మనదేశ చిత్రకారులు బాగుగ గుర్తెరింగి అనుష్ఠించుచుండిరి. వాత్స్యాయనుడు కామసూత్రములలో చిత్రకళకుపపాదించిన షడంగములలో ప్రమాణము అను అంగమున ఈ perspective భావమును చేరియున్నది. ఆ షడంగము లెవ్వియనిన (1) రూపభేదము (2) ప్రమాణము (3) భావము (4) లావణ్యయోజనము (5) సాదృశ్యము (6) వర్ణికభంగము - Light and Shade

నిమ్నోన్నతములు - తేజస్తిమిరములు - ఛాయాప్రకాశములు - ఇత్యాదులు లావణ్యయోజనమున చేరునట్లున్నది. Light and Shade అనుటకు మన చిత్రకారుల పరిభాషాపదమేదియో తెలియలేము.

ఐరోపీయ చిత్రలేఖనమునకును మనదేశపు చిత్రలేఖనమునకును గల గొప్పభేదము నొక గ్రంథకర్త యిట్లు వర్ణించియున్నాడు. ఐరోపీయ పద్ధతి స్థూలము ననుసరించియుండుననియు (mass) దేశశిల్పము రేఖను (line) అనుసరించియుండుననియు - అనగా ఐరోపీయ శిల్పిగాని చిత్రకారుడుగాని ఒక మల్లునో (wrestler) యుద్ధభటునో నిర్మించినపుడు వాని దేహపటుత్వము దెలియునటుల మాంసకండరముల వికాసమును పుష్టిని వర్తువమును జూపును. ప్రాతకాలపుదేశచిత్రములలో ఈ పద్ధతి యగుపడదు. శ్రీ కృష్ణుని ముద్దుమోము జూపవలయునన్న మన చిత్రకారుడు ఒక రేఖవలన ఆతని కన్నుల తీరు - బుగ్గల ముద్దు - చిన్న బొజ్జ ఇట్టి వన్నియు జూపును. స్త్రీ యొక్క అవయవ విన్యాసప్రదర్శనమునకును ఇట్టి రేఖనే ప్రయోగించును. ఆ రేఖ వలన భావస్ఫూర్తి కలుగుచున్నది. నవీనులు ఐరోపీయ పద్ధతినే యవలంబించుచున్నట్లున్నది.

చిత్రలేఖనమున మనదేశపు ఔన్నత్యమున కుదాహరణముగ కొందరు కొన్ని విచిత్రపు కథలు చెప్పుదురు. చిటికెనవ్రేలి గోరునుచూచి మనుష్యుని ఆకృతినంతయు యథారూపముగ చిత్రించువారుండిరట. ఒక స్త్రీని జూచి ఆమె రూపపటము వ్రాయ నాతడు ఎవ్వరికిని యగపడని ఆమెలోతొడమీద యొక పుట్టుమచ్చ యున్నట్లు వ్రాయునట. ఇట్టివి యూహాలో శాస్త్రముచే సాధ్యములో విచారింపవలసియున్నది. చిత్రలేఖనమున నిట్టివి సాధ్యములగునో కాదో గాని జంతుశాస్త్రజ్ఞులు (Naturalists) ఒక యెముకనుజూచి జంతుస్వరూపమునంతయు నిర్మింపదగియుండుట గ్రంథముల జదువుచున్నాము. ఒక ఎముకనో లేక నొక పంటినో జూచి నిశ్శేషములయిపోయిన మాస్టొడాక్, మామ్మత్ లోనగు (Mastodan, Mammoth) జంతువుల రూపము లిట్లుండునని గ్రంథములలో చూపుచున్నారు. ఇది విశ్వసనీయమగునేని అనుభవసిద్ధముగ శిల్పికిని చిత్రకారునికి ఇట్టి నేర్పరితనముండవచ్చును. రవికాంచనిది కవిగాంచునను సామెత కలదు గదా. పౌరాణిక బౌద్ధయుగముల వెనుక మనదేశమున రాజపుత్రస్థానము (Rajputana) చిత్రకళాపోషణకు ముఖ్యాలంబనమయినట్లున్నది. దేశచరిత్రలో ప్రసిద్ధులగు పృథ్వీరాజు లోనగు ప్రాచీన దేశవీరుల రూపపటముల మాతృకలాదేశమున నున్నటులున్నది. ఉత్తర హిందూదేశపు చిత్రకళా వ్యాప్తిని కొందరు మూడు ఖండములుగ విభజించిరి. (1) రాజపుత్రస్థానము (2) ఢిల్లీ ప్రాంతములు (United Provinces) (3) బంగాళాదేశము. దేశమున మహమ్మదీయ ప్రభుత్వము నాటుకొనినతరువాత మొగలాయి చిత్రలేఖనము ప్రాచుర్యము పొందియుండినది. ఆయా దేశపు చిత్రలేఖనమోడి (పద్ధతి) ఒకవిధముగ నుండెడిది. ఇట్టి భేదమును కొందరు "కలం" అందురు. చిత్తరువును చూడగనే ఇది రాజపుత్రస్థానపు మోడిలో వ్రాయబడినది, ఇది మొగలాయి మోడిలో చిత్రింపబడినది అని నిర్ణయించుటకు అనువగు కొన్నికొన్ని భేదములు కొన్నికొన్ని అభ్యాసములు (వాడుకలు) కనుపడుచుండగలవు. ఈ భేదములు వస్త్రపరిధానమునందును ఆభరణ విశేషములందును కన్నుముక్కుల కుదిరికయందును యుండును. ఒయ్యారమునందును కనుపడగలదు. సంగీతమునందును ఆయా దేశవాళీలను ఈ పాటకుని సంగీతము తంజావూరు బాణి (వాణి) యనియు ఈ పాటకునిది మైసూరుబాణి (వాణి) యనియు ఇత్యాది సంకేతములుగలవు. అటులనే చిత్రలేఖనమందును ఆయాదేశ "కలం" లేక ఖత్తు అనియు చెప్పట గలదు. "కలం" అనగ వ్రాయు సాధనము (pen or pencil) ఖత్తు అనగ అక్షరముల మోడి. ఇట్టి భేదములను ఇంగ్లీ

షులో స్కూలు (School) అనుట గలదు. "ఇటాలియన్ స్కూలు" అనుట పలుమారు వినుచుందుము. మనదేశమున తంజావూరు స్కూలు - మైసూరు స్కూలు అను భేదముగలవు.

చిత్రలేఖనమున "ఆంధ్రకలం" ఒకటి ప్రసిద్ధముగ యేర్పడియున్నదా యని విచారింపవలసి యున్నది. సర్కారులలో కొండపల్లి రంగులు ప్రసిద్ధములుగ నుండినవి. దత్తమండల ప్రాంతము నోసం (Nossam) రంగులు ప్రసిద్ధములు. కొండపల్లి బెజవాడ సమీపమున నున్నది. నోసం కర్నూలుజిల్లా కోయిలకుంట్ల తాలూకాలో నున్నది. ఐరోపీయ రంగుల ముందును, జపాను రంగుల ముందును దేశపురంగులు అడుగున పడిపోవుచున్నవి.

చిత్రలేఖనమునందు నీటిరంగులు (Water Colours) తైలపు రంగులు (Oil Colours) అని రెండు ప్రధాన భేదములు గలవు. మన పూర్వీకులు తైలవర్ణముల నేతైలముతో పక్వముజేయుచుండిరో స్పష్టముగ తెలియలేదు. మొగలాయి చక్రవర్తి జహాంగీరుకాలమున ఐరోపీయులు తైలవర్ణము గల పటము నొకదాని జూపినట్లును తైలవర్ణచిత్రము నా చక్రవర్తి ఆమోదింపలేదనియు నొక గ్రంథమున గలదు. ఇందుకు కారణ మూహింపనగును. నీటిరంగులు తైలమిశ్రిత వర్ణములకంటె ఎక్కువ కాంతిగలిగి యుంటున్నవి. తైలవర్ణములు కొంచెము మబ్బుగ నుండును. అయితే తైలవర్ణచిత్రమున్నంత దీర్ఘకాలము నీటిరంగు స్థిరముగ నిలువదందురు గాని అజంతాగుహలలోని చిత్తరువులిన్ని శతాబ్దములెట్లు నిలిచియున్నవియో!

ప్రాచీనకాలమున తెలుగునాటివారి చిత్రకళా విజ్ఞానమెట్లు విలసిల్లినదో తెలుసుకొనుటకు ఆధారములు మృగ్యములుగ నున్నవి. ఆధునికులలో చిత్రలేఖనమున మహానిపుణులు ఆంధ్రదేశమున నవతరించిరి. కీర్తిశేషులు దామెర్ల రామారావుగారి చిత్రలేఖన పాటవమూ ఆంధ్ర స్కూలును (ఆంధ్ర కలం) నెలకొల్పినదని చెప్పనొప్పును. చిరంజీవులు శ్రీ బాపిరాజుగారును ప్రఖ్యాతులుగ నున్నారు. ఈ యిద్దరును చిత్రకళాచార్యులనదగుదురు. ఇపుడిపుడు ఆంధ్ర స్త్రైణమును చిత్రకళా నైపుణ్యమును జూపుచున్నది. కొందరు స్త్రీలు వ్రాసిన చిత్ర ప్రతిమలుచిత్రములు భారతిని గృహలక్ష్మిని అపుడపుడు యలంకరించుచున్నవి. సామాన్యముగ విద్యాభివృద్ధితోపాటు కళాభివృద్ధియు కాకమానదు. అందుచేత ఆంధ్రదేశమునకీ చిత్రకళా ప్రపంచమునను అత్యంత వ్యాప్తియు అభివృద్ధియు కలుగగలదని సంతసింపనగును.

పూర్వము తెలుగునాడునందు "చాందిని" (awning or canopy) అనునది యొకటి విశేషముగ నుండినది. చాందిని యనునది ఉర్దుమాటగ నుండును. తెలుగున ఉల్లెడలేక మేలుకట్టు-సంస్కృతమున వితానము. గొప్ప వెడలుపు పొడవుగల గుడ్డలమీద భారత భాగవత రామాయణాది కథలన్నియు చిత్రవర్ణముల వ్రాయబడుచుండినవి. ఒక్కొక్క మేలుకట్టు నాలుగు అంకణములు అయిదు అంకణములకూటమునకు కట్టుటకు సరిపోవుచుండును. పెండ్లిపందిటికి ముఖ్యముగ వీని కట్టుచుండిరి. కొన్ని యిండ్లలో ఇవి తరతరములుగ భద్రము చేసియుంచబడుచున్నవి. ఇవి ముఖ్యముగ బందరులోనను, కాళహస్తిలోనను, అనంతపురంజిల్లాలోని పామిడిలోనను చేయబడుచుండినవి. ఈ కాలపు నాగరకమున కివి ముతక సొగసులక్రింద చేరుచున్నవి కాబోలు. ఇపుడు రంగు కాగితముల పేలికల నంటించుచున్నారు. ఎచ్చటనైన పురాతన సంస్థానములందుగాని ఆఢ్య కుటుంబములలోగాని ఇప్పటికిని జీర్ణశేషములుండగలవు. వానిపై ఆయా పౌరాణికాది కథలు చిత్రింపబడుటయేగాక ఆయా బొమ్మలక్రింద వాని కథయు సంక్షేపముగ వ్రాయబడియుండును. ముఖ్యముగ కృష్ణలీలలు. శ్రీరామ

పట్టాభిషేకము ఈ చాందినీలలో చిత్రింపబడుచుండినవి. ఇపుడవి యగపడడము చాల తక్కువగ నున్నది. ఆచిత్రనైపుణ్యము ఉపేక్షింపదగినది కాదు. దానిని ప్రోత్సాహముచేసి ఆకళను ఉజ్జీవింపచేయతగును. ఈ గాంధీయుగమున తిరుగ ఆ చాందిని వంటివి కొన్ని చిత్రవర్ణములద్దబడిన గుడ్డలగుపడుచున్నవి గాని ఇవి ఉత్తరీయములుగను శాలువలుగను చేయబడుచున్నవి. పూర్వపు మేలికట్లతీరులేదు. ఆంధ్రులీకళ నభివృద్ధి జేయదగుదురు.

మన మహిళాజనము పిండితోగాని సీమసున్నముతోగాని చుక్కలుబెట్టుకొని ఆవల ఆ చుక్కలను గీతలతో కలిపి విచిత్రరూపములగు ముగ్గుల నమర్తురు. చిత్రకళకుగూడ ఇట్టి సాధనోపాయముండినట్లు కొన్ని గ్రంథములవలన దెలియుచున్నది. మొదట ఒకగీత (రేఖ) గీచుకొనుటయు దానినుండి ఇన్ని అంగుళముల ఏటవాలుగనో వక్రముగనో కొన్ని రేఖల గీచి వీనినొక సుకుమార భంగురమగు గీతతో కలిపిన మొగము ముక్కు ఏర్పడునను నిత్యాదిసూత్రములున్నవి. ఇవన్నియు నిపుడేమయినవియో? అట్లు ఏర్పడిన ఆకృతిమీద చిత్రలేఖకుని ఇష్టానుసారము రంగుల వేయవచ్చును. ఇట్టి గీతల కొలతల విషయమున నింకొక వైదికోదాహరణము చూపవచ్చును. శ్రౌత ప్రక్రియలందు వపయుండు స్థానము కనుగొనుటకు శ్రౌతులకు కొన్ని యుపాయములు గలవు. యాగపశు విశసన మయినపిదప దాని నాభినుండి ఇన్ని అంగులములు నిర్దిష్టదిక్కున కొలుచుకొని అచట కాటుపెట్టినయెడల అప్రయత్నముగ వప లభింపగలదు. ఆ కొలతల వ్యత్యస్తము జేసిన చాల కష్టపడి చేతులు పశువుయొక్క పొట్టలోనికి పోనిచ్చి ఇటునటు కలియబెట్టి చీకాకుపడుదురు.

చిత్రకళనుకూడ మన పూర్వీకులు క్షేత్రగణిత (Geometrical) పరిధిలో నిమిడ్చిరి. ఇట్టివాని నిప్పటి సాయకు లుద్ధరింపదగుదురు.

గ్రంథవిస్తర భీతిచే ఈ వ్యాసమున నుదాహరింపబడిన గ్రంథములయొక్కయు గ్రంథకర్తలయొక్కయు పేళ్లన్నియు తెలుపబడలేదు. మరియు ఆయా ప్రస్తావ గత శ్లోకములను పూర్తిగ వ్రాయబడలేదు.

★ విరహి లేఖలు

శ్రీమతి స్థానాపతి రుక్మిణమ్మ

ఏ సతీపతుల యెడంద లేపుమీఱు
ప్రణయబంధమ్ము లేనాఁడు రాచినానొ!
మధురభావాల వెలయు హేమంత వేళ
లాఘల ననుభవింపఁగానయ్యెఁ జెలియ!
రేల నాహార మొనరించువేళఁ దుమ్మి
నంత "చిరఁజీవి" యంచేమొ - కొంతనవ్వి
యూరు, దైవమ్ము పేరులఁ బేరుకొనుఁడు
జీవితస్వామి! అందువే! యేది నేడు?
ప్రణయ మాధుర్య మెఱిఁగిన ప్రణయజీవి
పాడులోకమ్ముఁ గాంచదు ప్రణయ మనిన
నమల మద్వైత భావమ్మెయగును; తాయి
ప్రళయమరయ మాటల బాట పలుకవలదు.
మాసములు నాల్గు నందొక్క మాసమరిగె
నారు పక్షాలు కలవింక నంచుఁ గనుల
నీరు నిండఁగ నిట్టూర్చి నిలిచి నాదు
రాకకై జూచు ప్రియురాల! నీకుశుభము.
చైత్రరథ, నందనమ్ములు సాటురాని
యీ మహారాష్ట్ర యారామసీమ వికచ
పరిమళోదార పుష్పమంజరులు వెలయు
నందు మన్మనోహరమైన యలరు కలదె?

భావతరంగిణి ★ ★ ★

"ఎదటివాణ్ణి చంపకుండా తాను చనిపోగల ధైర్యం మా ప్రజల మనస్సుల్లో నేను పాదుకొల్ప గలిగినట్టయితే, హింసతో పనిలేకుండా మా దేశస్వాతంత్ర్యాన్ని మేం గడించటమే కాక, ఇటువైన యుద్ధాలు చేయవలసిన అవసరం లేని తరణోపాయాన్ని ప్రపంచానికి చూపెట్టగలుగుతాము."

—మహాత్మ గాంధీ

♦ ♦ ♦ ♦

"భారత రమణీమణి గృహనిర్వహణము, లలితకళాది సముపార్జనము మొదలైన వాటిల్లోనే శ్రద్ధ పుచ్చకుండా అవసరమైనప్పుడు రాజ్యాంగ పరిపాలనాదక్షతయందు సహా దీక్షాయత్తయై వుండాలి. ఇది మగువల మానస వికాసానికేకాక దేశ వికాసానికి కూడా దోహదమిస్తుంది."

— కె. రామసుబ్బమ్మ

♦ ♦ ♦ ♦

"భారతమాత శరీరంలోనుంచి ఆత్మ ఇంకా వెళ్లిపోలేదు. భారతమాత సజీవంగానే ఉంది అని ప్రారంభమైన సత్యాగ్రహంవల్ల మళ్లీ స్పష్టమైంది. స్వరాజ్య తపోవనంలో హోమగుండంలో అగ్నిని ప్రతిష్టించారు. వీతిహోత్రుడు జ్వాలామాలాలంకృతుడై ప్రకాశిస్తున్నాడు. ఈ సవనాగ్ని స్వరాజ్యం వచ్చే వరకు అవిచ్ఛిన్నంగా ప్రజ్వరిల్లుతూనే ఉంటుంది."

—భూలాభాయి దేశాయి

♦ ♦ ♦ ♦

"అనుక్షణము మారుచున్న ప్రపంచములో స్త్రీలు గృహరాణులై మతములను, విజ్ఞానములను రక్షించడమే క్షేమకరము. అవసరమువల్ల స్త్రీలు ఏ ఉద్యోగాలకు పోయినను ఇల్లు దిద్దుకొనుటయే తమ ముఖ్యవిధియను సంగతి మరువరాదు. ఎప్పుడూ యింటినే కనిపెట్టుకొని ఉండు పద్ధతిని విసిగికొనుచు ఆందోళనచేయువారు కొంత మెత్తపడి యీ అంశమును గమనించడం మంచిది."

—బేగం మెహిదియార్ జంగు

♦ ♦ ♦ ♦

"ఏ రంగమునందు స్త్రీలు ప్రవేశించిననూ, గృహరంగమువారి సొత్తే. ఇతర మార్గముల దేశసేవ చేసిననూ గృహిణిలుగను, తల్లులుగను, గృహపాలనము, బిడ్డలపెంపును వారు చేయవలసినదే. మన పిల్లల విద్యావస్థయందు యీ సంగతిని మరువరాదు. వీటియందు ప్రవీణులైన వారికే పట్టమునిచ్చు ఏర్పాటుగూడ నుండవలెను."

—న్యా॥ వెంకటరమణరావు

♦ ♦ ♦ ♦

"శిశువు మాటిమాటికి ఆహారమునకై గోలపెట్టుచుండును. తల్లిదండ్రులు శిశువు గోలపెట్టుచున్న దని దానికి కావలసిన ఆహారమొసంగి పెంచవలసియున్నది. శిశువు పెద్దదైనప్పుడు స్వహస్తములపై నాధార పడును. బాల్యమునందున్న ఆంధ్రవిశ్వవిద్యాలయము వారి కోర్కెల విషయమై మీరు దురభిప్రాయ పడకుందురుగాక...... ఆంధ్ర విశ్వవిద్యాలయాభివృద్ధి నాకు ప్రియతమమైనది. ప్రాణతుల్యమైనది. నేను దీనికొరకే జీవించియున్నాను."

—డా॥ కట్టమంచి రామలింగారెడ్డి



బృందావనపుర మహిళా సేవామండలి

అక్టోబరు 2 వ తేదీనుండి 10 వ తేదీవరకు పట్టణమంతటను విరివిగా ఖద్దరు నమ్మియు, సభ్యులందరు నూలువడికి లక్ష గజములు కానుక సమర్పించియు, యీ వత్సరం గాంధీ జయంతిని వైభవముతో జరిపిరి.

ప్రత్యేకించి ఒకరోజున, సభ్యులలో వడుకు పోటీ నేర్పరచిరి. చిత్రములోనివారందరును పోటీలో పాల్గొన్న సభ్యులు. కూర్చున్న వారిలో కుడిప్రక్కనున్న శ్రీ పోతరాజు సత్యవతమ్మగారు ప్రథమ బహూకరణను, రెండవ వారగు శ్రీ కృత్తివెంటి రాజ్యలక్ష్మమ్మగారు ద్వితీయ బహుమతిని పొందిరి.

ఆ. ల. న.



నెల్లూరులో ఆంధ్రరాష్ట్ర హరిజనసేవక సంఘమువారిచే నడుపబడుచున్న
వసతిగృహమందలి బాలికలు

★ గర్భిణి స్త్రీల జాగ్రత ★

"సత్యంవద"

అమ్మకు నమస్కారములు

నీవు వ్రాసిన వుత్తరం అందింది. నాకు గర్భిణీ అని తెలిసి నీవు కంగారుపడుతూ నాన్నగారిని పంపుతానన్నావు. అక్కడకువస్తే మీరు సరీగ్గా ఆరోగ్యపద్ధతుల ననుసరించి పురుడుపోయరు. ఇక్కడ నేను మొన్ననే జరిగిన ఆరోగ్యవారంలో చూశాను. నిజంగా ఆ పురిటిగదికి రెండుకిటికీలూ, రెండు ద్వారాలూ ఉండాలి. బాగా పరిశుభ్రమైనగాలీ, చక్కని వెలుతురూ లోపలికి వస్తోవుండాలి. తల్లికో మంచం, పిల్లకో వుయ్యాలమంచం; బాలెంతరాలు బయటికివస్తే వెళ్లుటకూ, మొఖం కడుక్కొనుటకూ పింగాణీతొట్టె; పిల్ల వాడికి నీళ్లు పోయడానికి ఒకపెద్దతొట్టె; ఆముదం, నూనీ వగైరాలు ఒక పరిశుభ్రమైవ స్థలంలో ఉంచడం— ఇవన్నీచూస్తే నాకు చాలా ఆశ్చర్యంవేసింది. మనవాళ్లు యింటి మధ్యలోనూ, కిటికీలులేకుండా ఉండే గదిలోనూ, చీకటిగా ఉండేచోటనూ పురుడుపోస్తారు. ఆగదిని అదివరకు ఏకొట్టుగదివలెనో ఉపయోగిస్తో వుంటారు. ఒకటే నులకమంచం, తాత ముత్తాతలనాటిది. సాంప్రదాయసిద్ధమైనదని ఎప్పుడో మూటకట్టి వుంచిన పాతగుడ్డలు పక్కవెయ్యడానికి వుపయోగించడం. మండు వేసవి కాలమయినా కుంపటి తప్పదు. కుళ్లు బట్టలతోటీ, కుళ్లు చేతులతోటీ ఏమీతెలవని పల్లెటూరు మంత్రసాని యొక్కసేవ. ఇవన్నీ యెంతో అసహ్యంగా తోస్తున్నాయి నాకు.

అయ్యో, క్రితంమాటు చేతులారా పిల్లను చంపుకున్నాము అని అనిపించుతోందికూడా నాకు. ఎందు చేతంటే, పిల్లల మరణ సంఖ్య మన దేశంలో ఉన్నంత యింకెక్కడా లేదు. దీనికి ముఖ్యకారణం చక్కని ఆరోగ్య పద్ధతులతో పురుడు పోసుకొనుట తెలియక పోవడమే. ఇతర దేశాలలోనూ, ఆరోగ్య పద్ధతులు తెలిసిన చోట్ల మనదేశంలోకూడానూ, పుట్టిన పిల్లలు చక్కగా గుమ్మటాల్లాగ పెరిగి ముద్దువస్తూవుంటారు. ఇల్లాగంటే, "ఆ? మన లోపమేముంది. వాళ్ల కర్మం అల్లా కాలింది. ఉప్పరాళ్ల పిల్లలకు ఏమి ఆరోగ్య పద్ధతులు జరుగుతాయి. వాళ్లు రాళ్లల్లాపుట్టి పెరగడంలేదా?" అని మీరందరూ నోరు చప్పరిస్తారు. కాని అది నీరసస్థుల వేదాంతం తప్ప, ధైర్యవంతుల కార్య శూరత్వంకాదు. అందుచేత ఆ మాటలలో ఏమంత అర్థం వుందనుకోను నేను.

ఈ విశాఖపట్నం పెద్దాసుపత్రిలో పురుళ్లు చూస్తే నాకు చాలా ఆనందంగా ఉంటుంది. చూడు, ఇక్కడ ఏ 'యెన్నెమ్మ' వచ్చింది? అన్ని కిటికీలూ తెరిచి వున్నాయి. ఆ సముద్రం మీదనుంచి వచ్చేచల్లని గాలిలోని ప్రతీ అణువూ ఈ బిడ్డలకూ తల్లులకూ యినుమడించే ప్రాణశక్తి నిస్తుంది. 'యెన్నెమ్మ' వచ్చి యీ పిల్లల గొంతుక నొక్కలేదే! మీరు అన్ని తలుపులూ వేసి వుంచినా కాని, అప్పుడు నా పసిపిల్లకు ఎందుకు సంధికొట్టింది? ఆరోగ్యంగా గది వుండకపోతేనే అల్లాంటివి సంభవిస్తాయి. నిక్షేపంలాటి బిడ్డలు నోరూ వాయీ లేకుండా నశిస్తారు. తల్లులుకూడా క్రూర రోగాలపాలవుతారు.

పైగా, పురిటి గదిలోకి ఎక్కువగాలి వస్తే, బాలెంతరాలికి వాతం చేస్తుందంటారు. ఇది ఎప్పటికీ నిజంకాదు. ఎంచేతంటే శరీరానికి పరిశుభ్రమైన గాలి నిరంతరం అవసరం; అనారోగ్యంగా వుండేవారికి మరీ అవసరం. ఏ వర్షాకాలంలోనైనా, చలికాలంలోనైనా ఎక్కువ చలిగాలి వస్తుందని తోస్తే బాలెంతరాలి దుస్తులలో మార్పుచేసి, ఆమె శరీరమును వెచ్చగా ఉండేటట్టు చెయ్యాలి. అంతేకాని అసలు గాలినే 'రావద్దు, పొమ్మ' ని తోసెయ్యకూడదు.

బాలెంతరాలంటే ఆపరేషను చేయించుకొన్న రోగి కంటె ప్రమాదకర మైన పరిస్థితిలో పచ్చిగా ఉన్న రోగి అన్నమాట. ఆపరేషను చేసిన వారికి ఎక్కడ పుండు ఉంటుందో అక్కడే పచ్చిగా ఉంటుంది కాని, బాలింతరాలికి ప్రతీ అంగం పుండై బహు ప్రమాదకరమైన పరిస్థితిలో ఉంటుంది.

ఇంకో విషయం; పురుడంటే ఒక ముట్టువంటిదని మీ ఊహ. పురిటింట్లోకి ముట్టువాళ్లూ, మైలవాళ్లూ తండోప తండాలుగావచ్చి చూసి పోతూవుంటారు. ఇదెంత అనారోగ్యమో తెలుసా? అసలు బాలెంతరాలిని ఒక మడితో ఉన్న స్త్రీని చూచినట్లు చూడాలి. మనమడి అంతా ఆరోగ్యము కొరకే కదా.

బిడ్డ గొడవ సరిగ్గా చూడరు. పుట్టగానే బోరిక్ పౌడరుతో కళ్లు కడిగితే కళ్లకేమీ ప్రమాదం ఉండదు. ఇల్లా చెయ్యకపోవడం వల్లనే బిడ్డలు పుట్టు గ్రుడ్డివాళ్లవుతో వుంటారు. దీనికిమీరు కర్మ సిద్ధాంతంతో కారణాలు చెప్పి సరిపెట్టుకుంటారు. నేననేదేమిటంటే 'ఈ మంచిపని కాస్తాచేశాక 'కర్మం' అని అనుకోరాదా అని. బొడ్డుకోసే కత్తినికూడా మీరుశుభ్రంగా ఉంచరు. ఒక కత్తెరను కాగే నీళ్లలోవుంచి, బొడ్డుకోసే సమయాన్ని దాన్నితీసి వుపయోగించాలిట. బొడ్డుకు కట్టే తాడు కూడా మరిగే నీళ్లలోనే ఉంచాలి.

ఇల్లాంటివన్ని తలచుకుంటే మంచి పరిస్థితు లేర్పడే వరకూ అక్కడకు వచ్చి పురుడు పోసుకోడానికి నాకు మనస్కరించడంలేదు. అందుచేత మీరు నేను చెప్పినప్రకారం ఆరోగ్యమైన పద్ధతులలో పురుడు పోస్తానంటే అక్కడకు వస్తాను. లేకపోతే ఇక్కడనే పెద్ద ఆసుపత్రిలో క్షేమంగా పురుడు పోయించుకొంటాను. ఇల్లా వ్రాశానని కోపంవద్దు. ఇంట్లోపనులు చేసుకుంటున్నాను. కులాసాగా వున్నాము.

స్వాగతము

శ్రీమతి వట్టికొండ విశాలాక్షి

కవిగేయముల్ వినుచు
కవిపద్దెముల్ వినుచు
కవి జీవితేశ్వరిగ
కలకాలముండుచూ

కవయిత్రి మాటయే మరచావా?
కవి కవుంగిలి లీనమైనావా?
ఆలింగనము వీడి రాలేవా?
అచటనే సుఖియింప జూచావా?

తేట తేనియకన్న
తీయందనము గల్గు
కవి కల్పితంబైన
కవితామృతంబిచ్చి

తనవశమ్మొనరించు కొన్నాడా!
తనకు తానే మురియుచున్నాడా!
స్త్రీలకడ కేగవలదన్నాడా!
చెంతనే కూర్చుండు మన్నాడా!

కవిబోధలే వినుచు
కవి పక్షపాతివై
స్త్రీవయ్యునీ మాదు
చెంతకే రాకుండ

అచటనే వసియింప దలచావా?
అదియె నీ ధర్మమని యెంచావా?
స్త్రీ కులోద్ధరణకై నను రావా?
స్త్రీలన్న అభిమానమే లేదా?

పరమాద్భుతంబైన
ప్రకృతి వైచిత్ర్యముల్
దర్శింప జేసినీ
ధన్యురాలిగ జేతు

వేగమే రావమ్మ, ఓ కవితా!
స్వాగతంబిస్తాము మృదుకవితా!
నీరాజనంబిదుగో, ఓ కవితా!
నిన్నుపూజిస్తాము నవకవితా!

బహుభార్యాత్వాన్ని పూర్తిగా తరిమివేయాలని పట్టుపట్టింది

★ సుశీలకు నా ధన్యవాదాలు

——బూ॰ రం॰ రావు బి. ఏ.——

మానవ జీవితం ఒక రైలు ప్రయాణంలాంటిది; అందులో ముఖ్యంగా దాంపత్య జీవితం. ఈ పందొమ్మిదివందల నలభైలోగూడా, హిందూ సమాజంలో ఇంకా ఆకస్మికమైన, నిర్హేతుకమైన వివాహాలు జరుగుతున్నాయి. శుభాంతంగా పరిణమించేవి చాలా అరుదు. అంతం ఎలాగున్నా బ్రతికి ఉన్నన్ని రోజులు భార్యా భర్తలు అనుకూలంగా గడపడంకూడా గొప్ప భాగ్యమే. అసమ వివాహాలు ఒక్కొక్కప్పుడు అసమంగానే ఉంటాయి. కొన్ని దారుణంగా పరిణమిస్తాయి...

మా దాంపత్యంకూడా దారుణం కాకపోయినా అనుచితమైంది. ప్రభ రూపసి. స్కూల్ ఫైనల్ ప్యాసయింది. నామీద ప్రేమలేదని చెప్పటానికి వీలులేదు. ముఖంమీద ఎప్పుడూ అజ్ఞానం కనపడుతూ ఉంటుంది. పల్లెతనం తాండవిస్తూ ఉంటుంది. వయసు పద్దెనిమిదేండ్లు. పొట్టిగా బక్కగా ఉంటుంది. నాకూ మొదట ప్రభమీద వ్యామోహం ఉంది చెప్పొద్దూ,...కాని......

మొట్టమొదట ప్రభ ముఖంమీద కనుపడిన అజ్ఞానం ఇప్పుడు మూర్ఖత్వంగా మారింది నాకళ్లకు. ఆమె మితభాషణ, శుశ్రూష, నామీది భక్తిశ్రద్ధలు, ప్రేమ మొదట ప్రణయోన్మత్తుణ్ణి చేసేవి. ఇప్పుడు ఉన్మాదుణ్ణిగా చేస్తున్నాయి.

ఎంత చదువుకున్నా ఆదేమిటో ఆమెలో మూర్ఖత్వం మూర్తీభవించింది. ఆ ఎఱ్ఱని పెదిమలలో ఆనందం కనబడదు. తీర్చిన కనుబొమ్మల్లో, విశాల నేత్రాల్లో ఆకర్షణశక్తిలేదు. ఇప్పటికీ ఆమెను ఎంతో మంది అందగత్తె అంటారు. నేను అదృష్టవంతుణ్ణని కొందరు 'చాటుకూ నేటుకూ' అసూయపడతారు. నా అసంతృప్తి వాళ్లకి తెలిస్తేగా!

బెంగాలీవాళ్లను, హైందవసభ్యతా స్వీకృతులైన ఆంగ్లో ఇండియన్లను, పార్సీ పడుచువాళ్లను చూస్తే నాహృదయం తరుక్కుపొయ్యేది. పొడుగ్గా, సన్నంగా, నాజుగ్గా పాలప్రవాహాల్లాంటి చేతులు, చాకచక్యాన్నంతా ప్రతిఫలింపజేసే వాళ్లకళ్లు చూస్తే నా గుండెలవిసిపొయ్యేవి... 'నాకీ నిర్భాగ్యదేవత ఎందుకు లభించిందా? ఎంత పాపంచేశానో' అనిపించేది. ఇంక ఇతర కారణా లేవీ లేవు. ప్రభ పొడుగ్గా లేకపోవడం, ఉత్సాహంగా ఒత్తుకు తిరగడం (pushing nature) చాతగాకపోవడమే నా కామెమీద అయిష్టం కలిగించాయి. ఆ అయిష్టాన్ని నెమరువేసి నెమరువేసి ...అసహ్యంకిందికి దిగింది. ఎలా ప్రభను వదిలించుకోవడం? ఎలా ఆమెమీద, ఆమె వాళ్ళమీద నాపగ తీర్చుకోవడం?...పునర్వివాహానికి పూనుకోవటం అతి సులంభం, అత్యుత్తమంగా తోచింది...

పునర్వివాహ ప్రయత్నం చేశాను. చాలామంది తమ అమ్మాయిలను ఇస్తామన్నారు. కాని 'తుంటెవిడిచి మొద్దును కట్టుకోగూడద'ని, నా ఆశయాలప్రకారం తగిన వధువు కష్టంమీద దొరికింది. ఇంగ్లీషుమాత్రం రాదు. అందంగా పొడుగ్గా చాలాకీగానే ఉన్నది. సంగీతం బాగావచ్చు. ఆ అమ్మాయికి పన్నెండేళ్ళకే తెలుగులో మంచి పాండిత్యం వచ్చిందంటే ఇహ ఇంగ్లీషు ఒక సంవత్సరంలో బాహాటంగా నేర్చుకోవచ్చునుకుని ఆమెను పెళ్లి చేసేసుకున్నాను.

ఎలాగైతేనేం సుశీల మా ఇంటి కొచ్చేసింది........ఓపికతో నాలుగేళ్లు పట్నంలో మహిళా విద్యాలయంలో వుంచి చదువుచెప్పించాను. ఈ నాలుగేళ్లలో సుశీల బాగా ఇంగ్లీషు నేర్చుకుంది. నా అదృష్టవశాత్తు పాశ్చాత్య దుర్గుణాలామెకు అలవాటుపడలేదు. సత్సాంగత్యంవల్ల ఇంగ్లీషు చదువున్న ఆమెదృష్టి విశాలమైపోయింది. సంఘసంస్కరణమీద ఆమెహృదయం లగ్నమైంది. స్త్రీ జనాభ్యుదయం కోసం ఆమె సర్వశక్తులూ ప్రవాహాలవలె పొంగి పొయ్యాయి. శ్రీమతులు సరోజినినాయుడు, కమలా నేహ్రూ, విజయలక్ష్మీపండిట్, దుర్గాబాయమ్మ ఆత్మతేజ మీమెలోగూడా ప్రకాశించిది.

అందం, జాగ్రత్త, తెలివితేటలూ, అన్నీ నాకుకావలసినవే దొరికాయి.-కాని నాకు శాంతిలేదు, తృప్తిలేదు. కారణం? నేను ముఖ్యంగా నా మనస్ఫూర్తిగాకోరింది - నిజంచెప్పవలసివస్తే - ఇంగ్లీషు విద్య వల్ల వచ్చే నాగరికత, ఫాషన్, ఒత్తుకు తిరగడం, నిర్లక్ష్యం, ఒకముక్కలో పాశ్చాత్య వ్యామోహం... నాకు కావలసిఉంది. సభలో ఉపన్యాసాలివ్వడమే గాని తత్ప్రకారంచేతామనే పట్టుదలగాదు. ఇలాగే అంతే. (Shyprocrisy, Superficiality Vanity) చెప్పేదొకటి చేసేదొకటి, బుడ బుడక్కల వేషాలు, స్వాతిశయం...ఇలాంటివి. ఈ దుర్గుణ పుంజాన్ని కడుపునపెట్టుక, మీదికిమాత్రం టాయిలెటు వాసనలు ఘుమ ఘుమా యిస్తుంటే, పెదవులమీదలేని చిరునవ్వు తొణుకాడు తూండగా గోముఖవ్యాఘ్రంవలె ఉండాలని... ఇలాటివి ప్రభలోలేవనే, సుశీలను చేసుగున్నాను ...

కాని సుశీల సుశీలయే అయ్యింది. ఎంత ఆధునిక సభ్యతా సంపర్కమున్నా ఆమెమాత్రం క్రియలో, అనుష్ఠానంలో నిజంగా హైందవనారీమతల్లుల పవిత్రాత్మశక్తిని జొప్పించింది. ఈ శక్తి ఏకముఖమై ప్రప్రథమంలో నాపైన్నే ప్రయోగించింది. నేను తననెందుకు పెళ్లాడానో తెలుసుకుంది. నా అవివేకానికి నొచ్చుకుంది. బహుభార్యాత్వము మొదట తన ఇంటినుండి తరిమవేసి తరువాత పొరుగిళ్లనుండి, దేశాన్నుంచి తరిమేయాలని పట్టుపట్టింది.

శలవులిచ్చారు. మా ఇంటికివచ్చింది సుశీల. మా ఇంట్లో నేనూ ప్రభ ఉన్నాం. సుశీల తీరాచదువై వచ్చిందాకా ప్రభతోఉండి తరువాత ఆమెను పంపివెయ్యాలనుకున్నాను.......సుశీలకు ఎప్పుడెలా మాట్లాడాలో బాగాతెలుసు. అంచేత ఒకరోజు అవకాశంచూసి, ఉన్నట్టు ఉండే 'మీరు మాఇద్దర్లో ఎవ్వరినో ఒక్కర్నిమాత్రమే పెళ్లాడాలె. అన్నివిధాలా మీకు ప్రభే తగింది. మొదలు ఆమెను పెళ్లిచేసుకున్నారు. ఇవ్వడామెనే ఉంటే బావుంటుంది. కచ్చితంగా చెప్పండి' అంది రోషం కళ్లలో ప్రతిఫలిస్తూండగా. నేను నిలువునా నీరైపోయాను. వెంటనే అందుకున్నది 'మీకు ప్రభ ఇష్టంలేకపోతే, ఆమెకునేను పునర్వివాహం చేస్తాను. ప్రభ ఒప్పుకుంది'. చాటున ప్రభకు ఏం చెప్పి వప్పించిందో ఇద్దరు ఏం మాట్లాడుకున్నారో? ప్రభకోసం సుశీల తాను త్యాగంచేయాలనుకుంది. ప్రభను నాకు విడిచిపెట్టే దౌర్జన్యంచేసి ఆమెమీద ఈపగ ఆపగ సాధిస్తానని తానే నన్ను పెళ్లాడవచ్చునన్నది. మన సంఘంలోని దురాచారాలను గురించి, నాలాటి స్వార్థపరుల గూర్చి ఒకపెద్ద ఉపన్యాసం విసిరింది ఎంతో చాకచక్యంతో, ఉద్రేకంతో. నా కళ్లలోనుంచి పటపట నీళ్లు దూకాయి. అజ్ఞాన తమోజీమూతాలు పటాపంచలయ్యాయి. ఆ పశ్చాత్తాపపు అశ్రుపాతంతో నా వ్యామోహం, నా మౌఢ్యం, నా పాపం అంతా, సుశీల పవిత్ర తేజంలో దగ్ధమైపోయాయి. సుశీలకు నేను తగకపోగా ఆమెనాకు దేవతలా కనపడింది. ఇహ ఆమెతో దాంపత్యంపొసగదు. ప్రభ అనుమతిమీద, నేను ప్రభనే ఇప్పుడు పవిత్రవివాహం చేసుకున్నాను.

సుశీలకు నా మనః పూర్వకమైన ధన్యవాదాలు.

స్త్రీ అబలయా? మహాబలయా?

ఏదేశమైనను పాలకులయొక్క ఆదర్శములపైన, వాటి నాచరణయందు పెట్టు విధానముపైనను ఆధారపడి అభివృద్ధి జెందును. ఈ నియంతల నీతుల పరికింపుడు—

"నాజీసిద్ధాంతము ప్రకారము స్త్రీలు, భార్యలుగను, తల్లులుగను తయారైయుండవలెను. కాన వారికి గృహకార్యనిర్వహణమందు మాత్రమే తగు తరిబీయతు నీయవలెను."

—హిట్లరు.

"ఆకర్షణీయముగ నుండి, పిల్లలను గనుటయే స్త్రీల పని. ఇప్పటివారనుకొనునంతటి మొరటుగాను, పురాతనాచారముగా నుండదది. ఆడుపిట్టలు మగవాటికొఱకు తయారుగానుండి గ్రుడ్లనుపొదిగి పెట్టును. అందుకు ప్రతిఫలముగ మగపక్షులు వాటిని శత్రువుల నుండి రక్షించును."

—జోసెఫ్ గోయబిల్సు,

"భగవంతుడు స్త్రీని ప్రేమకొఱకును యింటి చాకిరీ చేయుటకును సృష్టించి యున్నాడు."

—బవేరియన్ నాజీ మెంబరు.

"ప్రభుత్వములోనూ, పరిపాలనలోనూ గూడ పురుషులకువలెనే స్త్రీలకును సమానముగ హక్కులుండితీరవలెను. వంటచేతనైనవారికందఱకును, పరిపాలించుటగూడ దెలిసియుండవలెను. కోట్లకొలదిగానున్న స్త్రీలను మినహాయించుచో, మనము కార్మిక కర్షకవర్గముయొక్కయు, సామ్యవాదముయొక్కయు నియంతృత్వమును బడయజాలము.

స్త్రీలు కుటుంబజీవనమనుపేర, వేయివిధములుగా బలియీయబడుచున్నారు. ఈ పురాతన కుటుంబ పద్ధతితో అంతర్లీనమైన పురుషుడే యధికుడను అభిప్రాయమే బలీయమొనర్ప బడుచున్నది. స్త్రీలలో, మనము చేయు రాజకీయప్రచారమును, పురుషులకు తగు విజ్ఞానమొసంగుటతో, స్త్రీల హక్కును గుర్తించుటకై మేళవింపవలెను. మన పార్టీయందును, కార్మిక కర్షక వర్గములందునుగూడ పురుషుడే ప్రభువును, యజమానియు నను భావము కూకటివ్రేళ్లతో పెల్లగించవలెను."

—లెనిన్.

"ఆర్థికముగను, రాజకీయముగను, భౌతికముగను, ఆధ్యాత్మికముగను అవి యివి అన నేల అన్ని విషయములందును పురుషునకు స్త్రీ అత్యంత సహాయకారిగ నుండవలయును."

—స్టాలిన్.

"స్త్రీలుగూడ, సంపూర్ణ స్వాతంత్ర్యము నాదర్శముగాగొని తమ, మన, దాశ్యవిముక్తికై విశాలదృష్టి గలిగి పాటుబడుట వాంఛనీయము."

—జవహర్‌లాల్ నెహ్రూ.

ఆయాదేశముల ప్రస్తుతాభివృద్ధిని గాంచినచో ఇందేది ఆచరణీయమో సులభగ్రాహ్యమగును. రష్యా స్త్రీలు నేడు ఉన్నతినందిరనిన వారి యాదర్శములే కారణము కాదా?

—శ్రీ తోట లక్ష్మయ్య.

అత్తాకోడళ్ల కలహాలు

(సైకాలజీననుసరించిన కొన్ని కారణాలు)

అత్తలకునీతులైనా కోడళ్లకు కూడా అన్వయిస్తాయి.

ఇనప్పెట్టె తాళం అత్తగారికీ యివ్వాలి; ప్రతి స్వల్ప విషయానికీ, అత్తగార్ల సలహా పుచ్చుకోవాలి. తమకింట్లో ప్రాముఖ్యతలేనట్లు నటించాలి. నటిస్తేచాలు, నిజంగా ప్రాముఖ్యత వాళ్లే వుంచుకున్నా. సంసారంలో చాలావరకు నటన అవసరం; అని.

— శ్రీయుత —
శివరాజు వేంకటసుబ్బారావు,
ఎం. ఏ. (బుచ్చిబాబు)

అత్తాకోడళ్ల కలహాలకి కారణం యేమిటి? ఈ ప్రశ్న అందర్నీ యెప్పుడో అప్పుడు బాధించితీరుతుంది. ఆలోచిస్తే పైకి కనిపించే కారణాలు ప్రతివాడికీ తెలుస్తూనే వుంటాయి—స్త్రీలు చదువుకోక పోవడంవల్ల అని. చదువులోపడగానే, క్రొత్త అభిరుచులు, నూత్నభావాలు హృదయాన్ని వంటింటినుంచిమరల్చి, విశాలపరుస్తాయని దీని తాత్పర్యం. ఇక్కడ మరో ప్రశ్న ఎదుర్కొంటుంది. చదువంటే ఇంగ్లీషు చదువా? ఇంగ్లీషైతే కాలేజీలకెళ్లాలా? గృహాన్నిగురించిన శాస్త్రం తెలుసుకుంటే చాలునని కొందరి మతం. కుట్టుపని, అల్లిక, పిల్లలపోషణ, ఇంటి అలంకారం, వ్యవహారాల్లో భర్తకు సహాయపడేటందుకు సరిపడ్డ లోకజ్ఞానం- యిది Domestic Science.

రెండోరకం, ఇంగ్లీషు చదవాలనీ; పత్రికలు, గ్రంథాలుచదివి కొత్త విషయాలు తెలుసుకుని, లోకవిజ్ఞానానికి తోడ్పడాలనీ; ఇవిరెండు భర్తయిష్టాయిష్టాలమీద ఆధారపడి వుంటాయి.

కాని కోడళ్లు చదువుకున్నంత మాత్రాన, కలహాలు తగ్గుతాయనుకోవడం వెర్రి. అత్తాకోడళ్లలో వొకరుమాత్రం చదువుకున్నవారైతే, కలహాలు మరింత ఎక్కువవుతాయని వేరే చెప్పక్కర్లేదు. పోనీ యిద్దరూ చదువుకున్నవాళ్లే ఐతే? చెప్పలేం. కాని యిట్లాంటి కలయిక బహుఅరుదు. అందరూ చదువుకున్న గృహాలలోకూడా అత్తాకోడళ్ల కలహాలు యింకా సాగుతూవుండడంవల్ల, వీటికి ముఖ్యకారణం, పాశ్చాత్యవిద్య లేకకాదని తేలుతుంది.

వీటికి కొన్ని మానసిక కారణాలున్నాయని నా నమ్మకం. వీటినిపూర్తిగా రూపుమాపలేకపోయినా, వీటి తీవ్రత తగ్గించే అవకాశాలు స్త్రీల సైకాలజీ తెలుసుకున్నవాళ్లు కల్పించగలరనీ నమ్ముతూ, కొన్ని సైకాలజీ సిద్ధాంతాలు యిక్కడ క్లుప్తంగా వ్రాస్తున్నా.

ఆధునిక శాస్త్రాలలో సైకాలజీ చాలావున్నత స్థానం ఆక్రమిస్తుంది. ఈశాస్త్రానికి పితామహుడు సిగ్మండ్ ఫ్రాయిడ్. (Sigmund Freud.)

కలహ కారణాలని విమర్శించేముందు, మొదట్లో కొన్ని వూహించుకోవాలి. మొదటిది, చాలా కలహాలు అత్తల మూలంగానే నని. అత్తలు రెండురకాలు- భర్తలుకలవాళ్లు, విధవలు. ఈ యిద్దరి

లోనూ భర్తలుకలవాళ్లే, చులకనగానూ, బలంగానూ దెబ్బలాడగలరు. కోడలు కాపరానికి రాగానే, వీళ్లు తమకి తెలియకుండానే, అసూయా భావంవల్ల బాధపడతారు. ఈ అసూయ పైకి కనిపించదు. పైపెచ్చు, అపారమైన ప్రేమగా కూడా పరిణమించొచ్చు. అసహజమైన ప్రేమకూడా ప్రమాదకరమైందే.

ఉదాహరణకు—దార్లో పోయే బట్టలవాణ్ణి అత్తగారు కేకేస్తుంది, కోడలికి చీరకొంటానని. లోపల తనే చీర కొనుక్కోవాలనుంటుంది; ఇది కనిపించని వాంఛ (Unconscious desire) కోడలి-చీరకోసం కేకేసింది. తీరా బట్టలవాడు రాగానే, "నీకు చీర కావాలా?" అని ఆ కోడల్ని అడగడం యెందుకు? కొడుకు భార్యకి యేమన్నా తీసుకొస్తే, తనకికూడా తేలేదని భర్తతో తగవు; కొడుకుమీదకోపం. కోడలు యవ్వనంలోవుంది. తను అనుభవించలేని వెన్నెల, సౌందర్యం, శృగారం, యీ కొత్తపిల్ల అనుభవిస్తోందే! ఇవన్నీ కూతురనుభవిస్తే కోపంవుండదు. కారణం? కూతురనుభవిస్తే తననుభవించినట్లే. ఫ్రాయిడ్ సిద్ధాంతాలప్రకారం, యీఅసూయకి కారణం, బాల్యంలోనూ, యవ్వనంలోనూ, తీరని వాంఛలని తేల్తుంది. అత్త, తన యవ్వనం, అత్తారింట్లో గడపడం మూలాన, తనుస్వేచ్ఛగా, మానసికంగానూ, భౌతికంగానూ అనుభవించే అవకాశాలు లేక పొయ్యాయి. తను దార్జన్యంచేసి, యెదిరించి, కోరినవాటిని పొందలేక పొయ్యింది. నీతి, కుటుంబ గౌరవం, సంఘమర్యాద, లా కోర్టులు, తనవిరుద్ధ విప్లవభావాలను అణిచి, నొక్కిపెట్టినవి. కాని, ఆవాంఛలన్నీ పూర్తిగా నశింపురావు. అవి తాత్కాలికంగా అణిగివున్నా, యెంత తీవ్రంగా అణిచిపెడితే, అంతతీవ్రంగానూ కొంతకాలానికి బైటపడి, చెలరేగుతాయి. నిద్రసమయంలో, పై చెప్పిన ఆటంకాలు లేకపోవడంవల్ల మనస్సు, శరీరం స్వేచ్ఛపొంది, కలలమూలంగా బైటపడతాయి. ఆ కలల్ని శోధిస్తే, వాటిమూలాలు, గడిచిపోయిన యవ్వనంలో భాధించిన తీరని వాంఛలేనని తేల్తుంది. ఫ్రాయిడ్ యింకా ఘోరమైన సంగతులు వ్రాస్తాడు. ప్రతితల్లికి పుత్రుడుమీద కూడా, తెలియని భౌతిక వాంఛవుంటుందట. పుత్రుడికి భార్యరాగానే, అతన్ని తనకులేకుండా పరాయిపిల్ల తనవశం చేసుకుంటుందని, వొక చెప్పరాని అసూయట—దీన్ని ఇడిపస్ కాంప్లెక్స అంటాడు. (Oedipus Complex) అందుకనే యీ కోడల్ని హింసించడంలో అంతవుత్సాహం చూపుతుందని తేల్తుంది. అంచేతే, కొడుకు భార్యనికాని, భార్యపుట్టింటార్నికాని దెప్పిపొడుస్తే, అత్తకు ఎంతోసరదా. తిట్టి, హింసించడానికి కోడల్లో యేలోటూ కనిపించకపోతే కోడలి పుట్టింటారిమీద పడడం, మనం చాలామార్లు చూస్తూనేవుంటాం. మళ్లాకోడలేకనక, తన కొడుకుని దెప్పిపొడిస్తే, పరిహాసానికైనాసరే, విరుచుకుపడుతుంది. "మావాడి కాలి గోరుకి పోలవు" అంటుంది. తన కొడుకు యెంతో అవస్థపడి, పెళ్లాన్ని పిల్లల్నిపోషించి కృశించి పోతున్నాడని, దానికంతాకారణం కోడలేనని, పెద్దతెలియని అనుమానం.

రెండోది, తన తీరనివాంఛలను, అణుచుకోడానికి అలవాటుపడినయిల్లాలు, కొత్తకోడలు, అవన్నీ అనుభవించడం చూచేటప్పుడు, తన మనస్సునిజీవితాన్ని తారుమారు చేసుకుంటుంది. సదా ఆచారా

'సైకాలజీ'కి సంబంధించిన హంశాలు సమాజానికి కావలసిన సమయమిది. రచయిత పరిశ్రమలో రమణీలోక రత్నాలు పండించాలి.

లకిలొంగి, నీతిగా కాలం గడపడానికి అలవాటుపడ్డ అత్తకి, కోడలి అనుభవం అవనీతిగా తోస్తుంది. దీన్ని ఫ్రాయిడ్ స్థిరపడిన ఆంతరంగికం అంటాడు. (Conditioned Reflex) దీనికి మందేమిటంటే, ఆంత రంగికం స్థిరపడకుండా చేసుకోవాలి. కొత్త వ్యక్తులకి గౌరవంయిచ్చి, తన స్వార్థాన్ని నిలబెట్టుకోవాలి. కోడలిస్వార్థాన్ని గుర్తించాలి. కోడలు అత్తగారిస్వార్థాన్ని పొగడుతూ, దాన్ని అమలులోపెట్టే యత్నాలు చెయ్యాలి.

"ఇంతప్రొద్దెక్కా పక్కమీంచిలేవడం?" అంటుందనుకోండి అత్తగారు.

"అబ్బే లేదండి - ఒళ్లు నెప్పులుగావుందండి—మీరుకూడా అంత తెల్లారగట్ల లేవడంమూలాన్నే, మీకా మెడనెప్పులు..." అని సమాధానంచెప్పాలి. ఈ స్వార్థాన్ని, తీరని వాంఛలనీ, మెల్లగా బైటపడే టట్లు చెయ్యాలి, కొడుకు కోడలూకలిసి.

"మేం సినిమాకు వెడుతున్నాం,"

"వెళ్ళండి, నేరాను" అత్తగారంటుంది.

"మీరు రాకపోతే నేవెళ్లను - మీరుంటేనే సరదా" అనాలి. అల్లాఅని, అత్తగార్ని తీసుకెళ్లక పోయినా యేమీ అనుకోదు.

ఈ పైచెప్పిన సిద్ధాంతాలన్నీ, భర్తలున్న అత్తగార్లకే కాకుండా, భర్తలు పోయినవాళ్ళకుకూడా చాలాభాగం అనువర్తిస్తాయి. సైకాలజీలో, ఫ్రాయిడ్ తరవాత పెద్దచెయ్యి, ఆల్‌ఫ్రెడ్ ఆడ్లర్ (Alfred Adler) ఇతని సిద్ధాంతాలు, విధవ అత్తగార్లకు అన్వయిస్తాయని తలుస్తా కాబట్టి, అవిక్కడ పొందుపరుస్తా.

ఈయనప్రకారం, పురుషులకేకాకుండా, స్త్రీలకికూడా 'అధికారం'మీద మోజు చాలా వుంటుం దని. పురుషుడికి, యితరులమీద 'అధికారం' చెలాయించాలని వుండడమే వాళ్లుచేసే యత్నాలకీ, కార్యాలకీ కారణం అని తేల్తుంది. కథలువ్రాసినా, ఉద్యోగంచేసినా, నటించినా, సంగీతంపాడినా, ఉప న్యాసాలిచ్చినా, రాజకీయంలోదిగినా, శరీరంపెంచినా—వీటిల్లో యేదిచేసినా, ముఖ్యమైనకోరిక అధికార వాంఛ. చెయ్యలేనివాడు కోతలుకొయ్యడం అందుకే. అదీ చేతకానివాడు, వ్యాధిగ్రస్థుడైనప్పుడు, జబ్బునే ఆధారంగాచేసుకుని, యింట్లో వాళ్ళమీద అధికారం చెలాయిస్తాడు. అంచేతే, "జరుగుబాటుంటే జబ్బంత సుఖంలేద"న్న సామెత.

అల్లాగే స్త్రీలకీ అధికారవాంఛ వుంటుంది. అత్తలకు, చదువులు, ఉద్యోగాలు, పోటీపడే అవ కాశాలు లేకపోడంమూలాన, అధికారం యెవ్వరిమీదా చెలాయించలేరు. కొందరు అక్కడికీ తెగించి భర్త మీద అధికారం చెలాయిస్తారు, గయ్యాళీగంపలని పేరుపడ్డాసరే. "లోకం పురుషుడికి చెందుతుంది; కాని, పురుషుడు, స్త్రీకి చెందుతాడు" అంటాడు బొక్కేషియో (Boccaccio) భర్తమీద చెలాయించే అధికారం, పిల్లలు పెద్దవగానే, భర్తమీదినుంచి, పిల్లలమీదకు మరల్తుంది. పిల్లలుకూడా పెద్దవాళ్లయిం తర్వాత, వాళ్లమీదకూడా దౌర్జన్యంచేసే అవకాశాలు లేక, చివరికి కోడళ్లమీద పడతారు. ఇదీ వాళ్లసైకాలజీ.

స్త్రీలో సహజావుద్రేకం చాలా తీవ్రంగావుంటుంది. ఆడ్లర్ ప్రకారం, వుద్రేకాలన్నింటిలో ప్రధానమైంది అధికారవాంఛ. ఇది బైటపడే అవకాశాలులేక, సమయం చిక్కగానే, భయంకరమైన తీవ్రతతో కోడళ్లమీద చెలరేగుతుంది.

అత్తాకోడళ్ల కలహాలు

కోడలు హద్దుల్లోవుండాలి; భార్యని యింకా యెక్కడ హడలకొడుతుందోనని కొడుకుకూడా హద్దుల్లోవుండాలి; కూతుర్ని యెక్కడ హింసిస్తారోనన్న భయంవల్ల కోడలి పుట్టింటారుకూడా హద్దుల్లో వుంటారు. బామ్మ, తల్లినేమంటుందోనని భయపడి మనమలు హద్దుల్లోంటారు. కోడలుంటే అధికారం ఛలాయించేందుకు, అన్ని అవకాశాలున్నాయి అత్తగారికి.

భర్త గతించగానే, విచారంవల్ల మూలపడిన అధికారవాంఛ, కొంతకాలానికి మరీ పేట్రేగి పోతుంది. కొడుకుని కని, పెంచి, పెద్దవాణ్ణి చేసిందికాబట్టి, తనకి అతని నిత్యకృత్యాలలో కలగజేసుకు నేందుకు సర్వహక్కులూ వున్నాయని భ్రాంతి. కేకలెయ్యడానికి భర్త లేకపోవడంవల్ల, విధవ అత్తగార్ల అధికారవాంఛ కోడళ్లమీద మాత్రమే కాకుండా, యిరుగు పొరుగువాళ్ళమీద, కూరలవాళ్ళమీద, నౌకర్లమీద చెలరేగి, అందరి ఆత్మగౌరవాల్ని ధ్వంసంచేసి, తనోచిన్న 'చివర రోజులలోని విక్టోరియా'లాగా, వొక రాజ్యానికి రాణీలాగా ప్రవర్తిస్తుంది.

ఈ వాంచని తగ్గించే మార్గం కనపడదు. పైగా యీవాంఛలు మానవులకి ప్రాకృతికాలు. ఇవి మనుష్యులకు, మృగాలకు, ప్రకృతికివున్న దగ్గిర బంధుత్వం తెల్పుతాయి. వీటిల్లో నైతికంగా ఆక్షేపించ వలసిందిలేదు. ఆమాటకొస్తే, స్వార్థాన్ని చంపుకొని, వ్యక్తిత్వాన్ని నిర్మూలంచేసుకుని, సన్యాసిలా జీవించడం, సృష్టికి వ్యతిరేకంగా బ్రతకడం అన్నమాట. కాని, నీళ్లు చెయ్యగలిగిందేమిటంటే, యీ అధికార వాంఛ బైటపడేందుకు, నెమ్మదైనమార్గం తెలుసుకోవాలి. అక్కడికి కొందరు విధవత్తగార్లు, దినంలో సగం కాలం బైటికివెళ్లి పురాణంచెబుతూ, కొందరి శిష్యురాండ్రను పోగుచేసుకుని, తమ అధికారవాంఛ ఆధ్యాత్మికంగా ఛలాయించుకుంటారు. కొందరు, తీరుబడిగావుంటే జైళ్లకెడతారు; కొందరు వుపన్యాసాలకి అధ్యక్షత వహిస్తారు. ఇల్లాగ కొత్తమార్గాలు తెలుసుకుని, నూతన కుతూహలం కలగచేసుకుంటే, కోడళ్లని మానసికంగా సంతోషపెట్టిన వాళ్ళవుతారు. అల్లాగే కొత్తసంగతులలో సరదాకలిగేటట్లు చెయ్యాలి. ఇనప్పెట్టె తాళం అత్తగారికీ యివ్వాలి; ప్రతి స్వల్పవిషయానికీ, అత్తగార్లసలహా పుచ్చుకోవాలి. తమకింట్లో ప్రాముఖ్యతలేనట్లు నటించాలి. నటిస్తేచాలు, నిజంగా ప్రాముఖ్యతవాళ్లే వుంచుకున్నా. ఎందుకంటే, కాలంగడచిన స్త్రీ హృదయం నటనకి, యదార్థానికిభేదం తెలుసుకోలేదు. మంచిగా వుండటంకంటె, మంచిగావున్నట్లు నటించడం సులభం. సంసారంలో చాలావరకు నటన అవసరం; అని నా గట్టినమ్మకం.

ఈవ్యాసం యింతటితో ముగిస్తున్నా. పైచెప్పిన సిద్ధాంతాలవల్లతేలిన ముఖ్యవిషయం వొకటే వుంది. పురుషుడికిమల్లేనే స్త్రీ హృదయంలోకూడా, తీరని వాంఛలనే మృగాలుంటాయి. అవి భయం వల్ల బైటపడవు. అక్కడికీ రాత్రిసమయంలో కలలమూలంగా దర్శనం యిస్తూంటాయి. పగలు అవి బైటకిరాకుండా 'తప్పు'అనే తాళంవేస్తాం. అప్పటికికూడా అవిచేసే గర్జనలు పగటిపూటకూడా వినిపిస్తూంటాయి. తెలియకుండా అవిచేసేగర్జనలే కలహాలకికారణం. అవి ఎట్లాంటి క్రూరమృగాలో పరీక్షించి వాటినోరు నొక్కాలి. మరో చిన్నసలహా, కోడళ్లు, అత్తగార్లకంటె మంచివాళ్లని అనిపించుకోడానికి యత్నించకూడదు. మానవహృదయం, యితరుల భాగ్యసంపదవిని యెల్లా నిరసిస్తుందో, యితరుల మంచితనాన్నీ అల్లాగే నిరస్తుంది. "ఇతరులకంటెకూడా ఎక్కువ మంచిగా వుండటానికి యత్నించిన వ్యక్తి చెడ్డవాడు" అంటాడు బ్రాడ్లే. (F. H. Bradley.)

కలహాలకికారణం అత్తలే అన్నానని, యిది చదువుకున్న అత్తగార్లు నన్ను తిట్టనక్కర్లేదు. ఎందుకంటే, వాళ్ళకోడళ్లుకూడా కొంతకాలానికి అత్తలు కాబోతున్నారు కాబట్టి, నే చెప్పినవన్నీ వాళ్ళకికూడా సమానంగా అన్వయిస్తాయి. మరోసారి, కోడళ్ళ సైకాలజీ వ్రాయగలనని నమ్ముతున్నాను, అంతే.

ఇంగ్లీషు తెలిసినవారు, యీ విషయాన్నిగురించి యింకా తెలుసుకోవాలనివుంటే, వాళ్లకి ఉపకరించే ముఖ్యమైన గ్రంథాలజాబితా యిక్కడ వ్రాస్తున్నాను. ఈ వ్యాసంలోనిదోషాలు నావికావు, యీ దిగువ గ్రంథాల రచయితలవి కావు.

(1) The under world of the Subconscious. (Sigmund Freud)
(2) Fantasia of the unconscious. (D. H. Lawrence)
(3) Ego and the Love of power in woman. (Adler)
(4) Psychology of the Old maid. (jung & Medowgall)

సేవకావృత్తి

శ్రీయుత అచ్యుతుని వేంకటాచలపతిరావు

సీ. సోచ్ఛ్వాస నిశ్వాస శోభితంబేగాని మరణంబుకంటె దుర్భరము సేవ
తగులఁబెట్టెడు నిప్పు లగపడవేకాని కార్చిచ్చు నడిమంటకాల్పు సేవ
పంకిలవస్తు సంస్పర్శ హీనమెకాని భయదమాలిన్య సంప్రాప్తి సేవ
కాల్సేతి సంకెలల్ ఘల్లుమనవే కాని కానరానిది బంధిఖాన సేవ

గీ. నరకమున కేగకుండ నీ ధరణిమీఁద ననుభవంబగు ఘోర యాతనమె సేవ
కడకుఁ బంచపాతకములఁ బొడిచి గెల్చు పాడుసేవ యాఱవ మహాపాతకంబు.

ఉ. ఈవిధి దేహమమ్ముకొను చెంతయు గాసిలి వాసివీసముల్
బోవిడిపొట్ట కక్కుఱితిఁ బ్రొద్దుటినుండియుఁ జెప్పుదెబ్బలన్
వావిరిగా గడించి తలవాచియు వైతరణీ నదీ పరి
ప్లావితులట్లు కొట్టుకొను పావులు దాస్యనికృష్ట జీవనుల్.

గీ. తన శరీరము తనకు సాధనము కాదు తన ఘడియలెల్లఁ దనచేత మనుటలేదు
తన ప్రచారమ్ము తనయిచ్ఛఁ గొనుచురాదు దాస్య మనఁగశ్వవృత్తి యదార్థమయ్యె.

గీ. ఏనాఁ డెవ్వరు పలికిరో యీ నీచపు దాస్యమున శ్వవృత్తియనుచు హా
యీనాఁడు శ్వవృత్తియె మేలై నెగడెన్ గుక్కకింత హైన్యము గలదే?

మ. తిరుగున్ గోరికతీర వీధి ననురక్తిన్ దోక జాడించుచున్
విరివిన్ విస్తరియాకులన్ నెమకి శీవిన్ గాకికిన్ బెట్టకే
వరుసన్ సర్వము నాకివేయు బిరుదంబా గ్రామ సింహంబహో
సరిరానేర్తురె? సేవకుల్ శునకహర్షంబన్న సామాన్యమే?

గీ. ఒక్క పూటనిఁ దినుఁగాక యొదవదేని యాకులలములు దినుగాక యబ్బదేని
బిచ్చమెత్తుగాకి కుక్క వృత్తియనుచుఁ బిలువఁబడు సేవకావృత్తి వలదు వలదు.

కళాపోషణ

శ్రీ ధరణికోట శ్రీరాం

"నరసింహారావుగారు! యీదినం తమపాత్ర నిర్వహణం మహా అద్భుతంగావుంది. మీబోటి నటులుండబట్టే యింకా నాటకరంగం సజీవంగావుంది. లేకపోతే యీసరికి సినీమాలదాడితో నాటక కళ పూర్తిగా అంతరించేదే."

నిజంగా నరసింహారావు కళోపాసకుడు. జీవరహితంగా, గ్రంథాల అట్టలమధ్య తలదాచుకొని వున్న పాత్రలకు ప్రాణంపోసి అద్భుతవ్యక్తులుగా తయారుచేసే చాకచక్యం వున్నదాయనకు. ఆ దినం ధరించింది నలపాత్ర. వేలవర్షాలక్రిందట రాజ్యాన్ని, భార్యను, సంపదను, సౌఖ్యాన్ని పోగొట్టుకొని కలిదేవత పైశాచకనృత్య సంరంభ భయంకర పాదాలక్రింది నలిగి, కలిగి, వికృతరూపంతో, చివరకి కాలవైపరీత్యాన్నో, కవి చాతుర్యంచేతనో తన పూర్వసామ్రాజ్య వైభవాన్ని, యిల్లాలి ఆలింగనా సౌఖ్యాన్ని పొందిన నలచక్రవర్తి నిజంగా తల్లికడుపున వుద్భవించి భూముఖంచూచాడో, లేక కవి వూహాప్రపంచంలోనే పుట్టి, పెరిగి, పెద్దయై, ఆ మహాసామ్రాజ్యంలోనే అంతరించాడో మనకు తెలీదు. కాని నరసింహారావు ఆ చక్రవర్తి వేషాన్నిధరించి రంగంలో అడుగుపెట్టాడంటే మాత్రం, సజీవ నిషధేశ్వరుడు, తన పూర్వ సుఖదుఃఖాతిశయాలతో ప్రేక్షకుల ముందగిపించేవాడు. దమయంతి ప్రేమబంధాల్లో ఆయన్ని కీలించి, లాలిస్తుంటే అందరి మనస్సు పులకరించేది. అడవుల్లో క్షుద్బాధకు కుమిలిపోతూ, శనిప్రేరితంతో భార్య అర్ధవసనాన్ని సంగ్రహించి, యిల్లాలిని, వనవృక్షాలకు, భయంకర జంతుజాలానికి, సూర్యచంద్రాదులకు అప్పగించి, విచ్ఛిన్నమైపోతుండే హృదయాన్ని రెండుచేతుల బిగియపట్టుకొని ఒక్కపరుగున భార్య పొంతనుండి పరిగెత్తిన సమయంలో చూచే వారిహృదయాలు, కరిగి కండ్లలోంచి ధారాపాతంగా ప్రవహించేవి.

"తమ ప్రశంసకు నా నమస్కారాలు. నేను నిజంగా ప్రశంసార్హుణ్ణి గానేమో" నన్నాడు. నరసింహారావు జమీందారుగా రందిచ్చిన చేతి నందుకుంటూ.

ఆయన తరువాత ప్రేక్షకులలోనుండిన అధికారులు, యితర పురప్రముఖులు నరసింహంచుట్టూ మూగారు. ఒక ఉత్సాహపురుషుడు, దమయంతి స్వయంవర సమయంలో వుపయోగించిన పుష్పమాలను తెచ్చి నరసింహం మెడలోవేశాడు. అందరు కరతాళాలు మ్రోగించారు.

ఆ గుంపును త్రోసుకొని ఒకచిన్నపిల్లాడు నరసింహంవైపు పోయినాడు. వాడికండ్లలోంచి కన్నీళ్లు కారుతున్నై—పెదవు లదురుతున్నాయి. "బాబాయ్! అమ్మకు చాలా కష్టంగావుంది. శాస్త్రుల్లగారు నిన్ను పిలుచుకొని రమ్మన్నారు." అన్నాడు గోపాలు డాయన మొఖంవైపు చూస్తూ.

◆ ◆ ◆ ◆

మూడుదినాలనుంచి పద్మావతమ్మకు సరిగాలేదు. ఎప్పుడూవచ్చే జ్వరంలాంటిదే కదా అని మొదటి రెండుదినాలు గంజిపత్యంతో యింట్లోవుండే జ్వరంమాత్రలు వాడారు. ప్రయోజనం లేకపోయింది. మూడో రోజు వుదయం నూటనాలుగు డిగ్రీలవరకు పొంగింది జ్వరం. చిరపరిచితులైన నారాయణ శాస్త్రుల్లగారిని పిలుచుకొనివచ్చి చూపించాడు నరసింహం.

“అయ్యో! నాయనా! మొన్ననే నాకు కబురంపగూడదటోయ్. వ్యాధి ముదిరిన లక్షణాలు కనపడుతున్నా”యన్నారు శాస్త్రిగారు. నరసింహం హృదయంలో ఒక్క పిడుగు పడినట్లైంది. భార్య వైపుచూచి ‘పద్మా’అని పిలిచాడు. ఆమె పెదిమెలు కదపలేకపోయింది. గుండ్రని ఆమె కన్నులనిండా కన్నీళ్లు తిరిగాయి. మంచానానుకొని తనవైపుచూస్తున్న గోపాలుడివైపుచూచి మరల నరసింహంవైపు చూచింది. అర్థంగ్రహించి నరసింహం మొహానికి గుడ్డ అడ్డంపెట్టుకొని బుడబుడ దుఃఖించాడు.

“దుఃఖిస్తే అవుతుందా నాయనా! అమ్మాయికేమి ఫరవాలేదు. నీవిలా కన్నీళ్లు కారుస్తుంటే రోగికి గుండె చెదిరిపోదూ! గోపాలు చూడూ యెంత బెంగపోయినాడో!” అన్నారు శాస్త్రిగారు

నరసింహం “శాస్త్రులుగారు! పద్మకు జ్వరం నెమ్మదిస్తుందా? నా సర్వస్వాన్ని మీ చేతుల్లో వుంచుతున్నాను. పద్మను మఱల అనుగ్రహించాలి నాకు” అన్నాడు.

సాయంకాలానికి జ్వరతీక్ష్ణత కొంచెం తగ్గింది. రోగి నిద్రపోతోంది. శాస్త్రిగారికి ఫరవాలే దన్నారు. ఆరున్నరకు ఒక పిల్లవాడు సుబ్బారావుగారి దగ్గరనుంచి ఒకచీటి తెచ్చిచ్చాడు నరసింహానికి. అంతవఱకు ఆనాటినాటకం విషయమే మరిచిపోయినాడు యిల్లాలి బెంగలోపడి. ఈ పరిస్థితుల్లో యేం చేయాలో తెలిసిందిగాదు. ముక్కుమీదికి వచ్చివుండే భార్యను విడిచిపెట్టి వెళ్లడమా? లేక తనకు సర్వస్వమూ అయిన కళాదేవి ఆరాధనను విసర్జించడమా?

పద్మను హృదయపూర్వకంగా ప్రేమించి వివాహం చేసుకున్నాడు. తొలుత ఆమె మురిపాలు గురిపిస్తుండే రూపానికి లొంగిపోయాడు. సంసారంలో ప్రవేశించి, అనంత్యమైన ఆమె కోమల మనోద్యానంలో, సుగంధాలీనుతుండే పుష్పాల నేరుకుంటూ ముగ్ధుడైపోయినాడు. తన్ను కాల్చేయాలని ప్రయత్నించే సంఘాన్ని క్షమించాడు, ఆ సౌఖ్యపు మత్తులో.

పిత్రార్జితమంతా క్షీణించి, సంపాదన సంకుచితమై, కడుపునిండటమే మహా కష్టంగావుండే ఆ కాలంలో తనపద్మను, పద్మా ప్రసాదుడైన గోపాలుణ్ణి చూచుకుంటూ కాలక్షేపం చేశాడు. తనకు పద్మను మించినవా రెవరున్నారీ ప్రపంచంలో!

అయితే కళాదేవి? చిన్ననాటినుంచి తానాదేవతారాధన యేమరకుండా చేస్తున్నాడు. పద్మ బాహుబంధనా సౌఖ్యమెరుగకముందే యీ కళాదేవి మాతృప్రేమను రుచిచూచాడు. తొలినాడే తన జీవిత సర్వస్వాన్ని ఆపె పాదాలముందర నైవేద్యం చేశాడు. ఆదేవి దీవనాఫలితమే పద్మ, గోపాలురని నమ్మాడు. వారి పోషణలో ఆమెకుమాత్రం బాధ్యతలేదు.

నరసింహం మనస్సును ధృఢం చేసుకున్నాడు. కళారాధన నిలువదు.....

♦ ♦ ♦ ♦

నరసింహం, గోపాలుడితోగూడ యింటికొచ్చేసరికి పద్మావతమ్మ పరిస్థితి చాలా క్లిష్టంగానే వుంది. ఉచ్ఛ్వాస నిశ్వాసాలు బహు కష్టంగా జరుగుతున్నాయి. శాస్త్రిగారు పడకప్రక్కన్నే కుర్చీమీద కూర్చొనున్నారు. తనతల్లి, మంచంప్రక్కన మందులునూరుతూ కూర్చొని, నరసింహాన్ని చూడగానే గొల్లుమని యేడ్చింది. పద్మ కన్నులు తెరిచింది. గోపాలుడు పెద్దపెట్టున ‘అమ్మా’అని యేడ్చాడు. మంచంలో కూర్చొని పద్మ కండ్లనుండి కారుతుండే ఉష్ణభాష్పాలను తుడిచాడు నరసింహం. కాళ్లుచేతులు పట్టుకొని

చూచాడు. మంచుగడ్డను మల్లే చల్లగావుందిదేహం. దీపం ఆరిపోతున్నదని గ్రహించాడు. 'పద్మా! పద్మా!' అని దీనంగా పిలిచాడు. కన్నులు తెరిచి గోపాలుణ్ణి ప్రక్కన కూర్చోపెట్టమని సంజ్ఞచేసింది, మహా ప్రయాసతో. గోపాలుడి చేయిపట్టుకొని, నరసింహంచేతిలోపెట్టి కన్నీరు కార్చింది. ఆ దుఃఖాశ్రువుల్లోంచి మొలక నవ్వొకటి కనిపించింది. స్వర్గద్వారం ఆపెదృష్టి కందిందేమో! అంతటితో స్మృతితప్పి కండ్లు మూసింది. అందరూ గొల్లుమన్నారు. సూర్యోదయం కావస్తున్నది. సూర్యదర్శనంతో పద్మ తొడిమను వీడి, రాలిపోతుందా?

శాస్త్రుల్గారు చేయిచూచి యేడువ వద్దన్నారు. ఇంకా అంతా పూర్తికాలేదు.

"నరసింహం! నాచేత సైనమట్టును పద్మకు చికిత్సలుచేశాను. ఇంక నీ అదృష్టం. జిల్లా డాక్టరుగారు చాలా తెలివిగలవారంటూరు. ఒకమా రెలాగైనా ఆయన్ను పిలుచుకొనొచ్చావంటే, నీ అదృష్టం, గోపాలుడి నుదటిరేఖ బాగుంటే, యిప్పటికి ఆయనను మించిపోదనుకుంటాను."

పెద్ద డాక్టరును పిలుచుకొని రావాలని నరసింహం అంతకు ముందటిదినమే అనుకున్నాడు. కాని ఆయన పూరకనే వస్తాడా. ఆయన ఫీజు కివ్వాలనినడబ్బు! మందుఖర్చులు!! తన్ను ప్రశంసిస్తుండే ధనాఢ్యులు, తనకేలాటి సహాయముచేయరని అతనికి పూర్వానుభవంవల్ల చక్కగాతెలుసు. తన జీవితాన్ని ధారపోసి పద్మప్రాణాన్ని దక్కించుకోటానికి నరసింహం సంకోచించడు. అయితే పైక మేలా సంపాదించగలడు. దేవుడికృప చల్లగావుంటే పద్మ కులాసాగా వుండకపోతుందా అనుకున్నాడు. శాస్త్రిగారిసలహా మలిల అవే వూహలను రేపాయి. గట్టిప్రయత్నం చేయాలని నిర్ధారణచేసుకొని ప్రక్కనుండే తుండుగుడ్డ మీద వేసుకుని బైలుదేరాడు.

అప్పుడప్పుడే జనసంచారం సాగుతూవుంది. బాణంలాగ రివ్వుమని ఒకమోటారు అతనిప్రక్కనుంచే పోయింది. దానిలో యెవరో ఆడవాళ్లు కిలకిల నవ్వుతూ కూర్చున్నారు. మోటారు వెంటనే లేచిన దుమ్ము నరసింహం ముఖంనిండా కప్పేసింది. పక్షులు నూతనోత్సాహంతో పరుగులు వారుతున్నాయి. ప్రక్కనేవుండే మంగలివీధినుంచి, సన్నాయి మనోహరంగా వాయిస్తున్నాడో సాధకుడు.

పాండురంగంగారి బంగళా మైలుదూరంలో వుంది. వకీలుగారప్పుడే పండ్లుతోముకుంటూ తోటలో కూర్చొని తోటమాలి భార్యకేవో కబుర్లు చెబుతూ నవ్విస్తూ తనూ నవ్వుతూన్నారు. నరసింహాన్ని చూచి మరోకుర్చీ తెప్పించే మిషతో దాన్ని తరిమేశారు.

"ఏమోయ్! నరసింహం! అలావున్నావు. రాత్రి రావటానికి వీల్లేకపోయింది. సుబ్బారావుగారు డోనార్సు టిక్కెట్టు పంపించారుకూడాను! (నిజంలో ఆ టిక్కెట్టునిచ్చి కొడుకును పంపించారు నాటకానికి) ఏలావుంది నాటకం?"

నాటకవిషయం రెండుముక్కల్లో చెప్పి, తను వచ్చినపని చెప్పాడు నరసింహం. డబ్బుమాట ప్రస్తావన రాగానే పాండురంగంగారి వైఖరి మారింది.

'క్షమించాలి, నరసింహం. ఈదినం వుదయం మావాడు గుంటూరు పోతున్నాడు. పరీక్షకు పైకం చెల్లించాలట. వాడి చదువుతో నా సంసారమంతా గుల్ల అయ్యేలాగుంది. ఈ కష్టకాలంలో అప్పు......'

ఇహ వుపయోగంలేదనుకొని నరసింహం లేచిపోయినాడు.

♦ ♦ ♦ ♦

'జమీందారుగారు, యింట్లో లేరని చెప్పమన్నారు. నన్నేంచేయమంటారు నరసింహంగారు, యీయనమూలాన్ని ప్రొద్దునలేచినప్పటినుంచి యింటికిపోయేంతవఱకు అబద్ధాలు చెప్పాలిసొస్తున్నది.'

'పైకమా! గవర్నమెంటు నౌకరి చేసే మాబోటివాండ్లదగ్గిర రెండవతేది తెల్లవారేటప్పటికి రూక వుండదని తెలియదటోయ్!'

♦ ♦ ♦ ♦

'అదుగో! అక్కడ నిలుచోనున్నాడే ఆయనే నరసింహారావు. ఈ సమయం తప్పితే మరి మనక్కు దొరకడాయన. వెంటనే పట్టుకోవాలె' నన్నాడు బంగారుశెట్టి, అమీనాగారి కోటులాగి, ఆయన భుజం మీదుగా నరసింహంవైపు చూపిస్తూ.

'మీరేనాండి నరసింహారావుగారు. మీరు బంగారుశెట్టికివ్వాలిసిన ఆరునూర్ల ముప్ఫై ఐదు రూపాయల ఆరణాలకు మిమ్మలిని అరెస్టుచేస్తున్నాను. ఇదుగో యిక్కడ కొంచెం సంతకం చేయండి.'

'అరెస్టా? నన్నా? బంగారుశెట్టిగారు! నా భార్యకు చాలా జబ్బుగావుంది. ఈదినం నన్ను క్షమించారంటే...'

'నీబోటివాండ్లను చాలామందిని చూచాను. ఇంతకాలంనుంచికూడా, యేదో పెద్దమనిషివికదా అనుకున్నాను. అమీనాగారు! మీపని మీరు చేయండి.'

♦ ♦ ♦ ♦

జైలు గడియారం తొమ్మిది కొట్టింది. దేహస్మృతిలేని నరసింహారావును లోపలవేసి యినుప తలుపులు బిగించారు.

సాయంకాలం నాలుగుగంటలు. జైలు బైట కుక్కలు మొరిగిన శబ్దం. నరసింహానికి స్మృతివచ్చింది వున్నట్లుండి. యెవరో వెక్కి వెక్కి యేడుస్తున్నారు. కండ్లుతెరిచి చూచాడు గోపాలుడు తలుపుకమ్ములను పట్టుకొని రాళ్ల మెట్టుమీద కూర్చొని తనకేసి చూస్తూ యేడుస్తున్నారు. నరసింహం లేచి కూర్చొని, తలుపు కమ్మల సందునుంచి గోపాలుణ్ణి తన చేతుల్లోకి తీసుకున్నాడు.

'బా...బా...య్! అమ్మను ఎ...త్తి...కెళ్లారు. నీ...వు యిం...టికి...రావూ?' అన్నాడు వెక్కి వెక్కి యేడుస్తూ గోపాలం.

'ఆ! పద్మనా! గోపాలూ మీ అ...మ్మ...ను ప...ద్మా! ప...ద్మా!!.'

ఈ పాపభూయిష్టమైన ప్రపంచంలో నరసింహం ఉచ్ఛరించిన తుదిశబ్దాలవి. ఉదయాన్నుంచి క్షణక్షణం బిగుసుకుంటూవుండే అతని హృదయతంత్రులు వొక్కపెట్టున పెళ్లుమని తెగిపోయినాయి. కొట్టిన ప్రాణల్లే విరగబడ్డాడు. మరుక్షణమే, గోపాలుడు అనాధశిశువైనాడు. మాంసాన్ని కొరుక్కుతినే నరహంతకులతో నిండిన ప్రపంచముందు, ముక్కుపచ్చలారని గోపాలుడున్నాడు!

♦ ♦ ♦ ♦

మరుసటిదినం పత్రికల్లో యీలా ప్రకటించారు. 'ఆంధ్రనటచక్రవర్తి నరసింహారావుగారు నిర్యాణమందారు. ఆంధ్రనాటకరంగానికి నూతనశోభతెచ్చిన మేటి. చిన్ననాడే నాటకరంగంలో ప్రవేశించి తన జీవితాన్ని, తన ప్రేయసి జీవితాన్ని, యీ దేవీపీఠంముందర బలియిచ్చిన త్యాగి. యెనిమిదేండ్ల కుమారుణ్ణి మాత్రం ప్రపంచానికప్పచెప్పి ప్రపంచనాటకరంగంనుంచి నిష్క్రమించారు! ఆ దంపతుల ఆత్మకు శాంతి గలుగుగాక! తల్లిదండ్రులులేని అనాధశిశువును దైవము పోషించుగాక.'

♦ ♦ ♦ ♦

ఆంధ్రలోకం, నరసింహం చేసిన సేవకు తగిన సత్కారం చేశాముగదా అని చిరునవ్వు నవ్వి, ఆ కళారాధకుణ్ణి మరిచిపోయింది—

ధర్మపత్నిలో

పెద్దాపురం రాజు - బేబీ లక్ష్మి

ఆంధ్రయువతీ మండలి - హైద్రాబాదు .

ఇటీవల జరిగిన 5 వ వార్షికోత్సవానికి కడప జిల్లాబోర్డు అధ్యక్షు రాలు శ్రీమతి కె. రామసుబ్బమ్మగారు అధ్యక్షతవహించారు.



పిన్ని ఉత్తరాలు

బొంబాయి రాష్ట్రము

సర్వమంగళా,

మొన్న మాయింటికి ఓ అమ్మాయి వచ్చింది. ఆ పిల్లకి మనమాట అర్థంకాదు. అరవంకూడా తెలీదు. వాళ్లు మహారాష్ట్రులుట. వాళ్లు మాట్లాడేభాష 'మరాటీ' అంటారు. వాళ్లఊరు పూనాకి దగ్గిరగా ఉందిట.

పూనా అనేది ఓపెద్ద పట్టణం. ఇదెక్కడుందో తెలుసా? బొంబాయిరాష్ట్రంలో ఉంది. మన దేశంలో పడమటగాఉంది ఈరాష్ట్రం. ఇది రెండు భాగాలుగా ఉంది. ఉత్తరభాగం, దక్షిణభాగమున్నూ. దక్షిణభాగంలోఉన్న వాళ్లంతా మహారాష్ట్రులు.

ఈ మహారాష్ట్రులలో చాలాగొప్పవాళ్లు పుట్టేరు. శివాజీ అనే ఓ రాజు పుడత ఈ దేశంలోనే. ఆయన ఓ మహావీరుడు. మన మతంఅన్నా దేశంఅన్నా చాలా అభిమానం ఆయనకి. ఇతర మతాల వాళ్లొచ్చి మనదేశాన్ని ఆక్రమించుకుని రాజ్యం చెయ్యడం ప్రారంభించడంచేత మన హిందూమతం పాడైపోతోందనీ, మన స్వతంత్రం నశించిపోతోందనీ శివాజీ విచారించి, వీటిని బాగుచెయ్యడంకోసం పెద్ద సైన్యాన్ని పోగు చేసుకుని శత్రువులతో పోరాడేడు. ఓ పెద్ద సామ్రాజ్యాన్ని స్థాపించాడు. ఈయనకు చిన్నప్పటినుంచీ దేశంమీదా, మతంమీదా అభిమానం పుట్టించినది ఈయనతల్లి. ఆవిడ పేరు జిజీబాయి.

ఈ మహారాష్ట్రంలోనే అహల్యాబాయి అనే ఓ రాణీ రాజ్యం చేసింది. ఆడదైనా మగవాళ్లకంటే ఎక్కువశక్తి సామర్థ్యాలతోటీ ధైర్యసాహసాలతోటీ రాజ్యం చెయ్య గలిగిందిట అహల్యాబాయి.

మా యింట్లో దేశనాయకుల ఫోటోలున్నాయి చూడు. అందులో గోపాలకృష్ణ గోఖలే, బాల గంగాధరతిలక్ అనే ఇద్దరి పటాలున్నాయి. వీరిద్దరూ కూడా మహారాష్ట్రులే.

బొంబాయి రాష్ట్రంలో ఉత్తరభాగంలో ఉన్నవాళ్లు గుజరాతీభాష మాట్లాడతారు. గాంధీగారు గుజరాతులోనే పుడత. ఎక్కడ పుడితేనేమి? ఆయనపేరు ప్రపంచమంతా వ్యాపించి పోయింది! అంత గొప్పవాడాయన! అందుకే ఆయనను 'మహాత్ముడ'నడం.

బొంబాయిరాష్ట్రానికి ముఖ్యమైన నగరం బొంబాయే. ఈ నగరం చాలా పెద్దది. చెన్నపట్టణానికీ బొంబాయికీ ఎంతో తేడా ఉంది. చెన్నపట్టణంలో మేడలకి మూడు అంతస్థులకంటే ఎక్కువలేవు. బొంబాయిలోనో! ఆరేసి అంతస్థులు! ప్రతీ అంతస్థుకీ ఎన్నోగదులు. ప్రతీ గదిలోనూ ఎంతోమంది మనుష్యులు. తేనెపట్టులో ఈగలకి మల్లే ప్రతీమేడలోనూ కిటకిటలాడుతూ మనుషులుంటారు. ఏంచేస్తారు, ఉండక? ఆనగరంలో మనుష్యులెక్కువా, చోటు తక్కువాను. ఇన్ని అంతస్థులుంటే వాళ్లకి ఎక్కడం దిగడం కష్టంకాదూ మరి? ఈ శ్రమలేకుండా, మనుష్యుల్ని అంతస్థుల మీదకి తీసుకెళ్లడానికి, క్రిందికి దింపడానికి ఓ యంత్రం ఉంది. అది ఓ గదికి మల్లేనే ఉంటుంది. అందులోకెళ్లి నిలబడి మీటు నొక్కితే ఏ అంతస్థు మీదకి పోవాలంటే అక్కడకు పోవచ్చు. ఇలాంటివి చెన్నపట్టణంలో కూడా అక్కడక్కడ కొద్దిగా ఉన్నాయి.

ఈ అంతస్థులుండడం ఒక్క మేడలకే అనుకున్నావేమో! బస్సులకీ, ట్రాములకూ కూడా అంతస్థులే! వాటినిండా జనమే.

ఇన్నేసి అంతస్థుల మేడలున్నా బొంబాయిలో ఉద్యోగాలు చేసేవాళ్లందరికీ ఆ నగరంలో చోటు లేక చాలామంది ఆ చుట్టుపక్కల ఊళ్లల్లోఉండి రోజూ బొంబాయికి రైళ్లల్లో వచ్చి వెడుతోంటారు.

ఇంతమందికి ఉద్యోగాలుండడానికి ఈ నగరంలో ఏముందంటావేమో; పెద్ద పెద్ద ఆఫీసులు చాలా ఉన్నాయి ఈ నగరంలో. బ్యాంకులూ, కంపెనీలూ, షాపులూ ఉన్నాయి. అంతేకాదు; బట్టలు తయారు చేసే యంత్రశాలలున్నా యెన్నో. బొంబాయి ఓడలరేవు కూడాను. తెల్లవాళ్ల దేశాలకు వెళ్లాలంటే బొంబాయిలోనే ఓడఎక్కి వెళ్లడం.

బొంబాయిలో మహారాష్ట్రులూ, గుజరాతీలే గాకుండా ఇంకోతెగవాళ్లు కనబడతారు. వాళ్లని 'పార్సీలు' అంటారు. వాళ్లమతం హిందూమతంకాదు. వాళ్లు అగ్నిని కొలుస్తారు.

'సక్కూబాయి' సినిమా చూశావుకదూ నువ్వు? సక్కూబాయీ, యింకాభక్తులూ భజనచేసుకుంటూ, పాండురంగ విఠల్ దేవుడుకోసమని పండరీపురం యాత్ర కెడతారు. ఈ పండరీపురం ఎక్కడుందో తెలుసా? బొంబాయి రాష్ట్రంలోనే.

అమ్మాయీ, మన తెనుగుదేశానికీ బొంబాయిరాష్ట్రానికీ ఓ చుట్టరికం ఉంది. ఏమిటో చెప్పనా? బొంబాయిరాష్ట్రమేమో మన గోదావరితల్లి పుట్టినచోటు. ఈ ప్రదేశం మనఊరికి ఎంతదూరమో తెలుసా? తొమ్మిదివందలమైళ్లు! ఎన్నివందల మైళ్లవుతేనేమి? ఆడజన్మ ఎత్తేక భర్తతో కాపరంచెయ్యడానికి ఎన్ని వందల మైళ్లదూరమైనా వెనకతియ్యక, పోవలసిందే. నేను పుట్టిల్లు వదిలేసి నాలుగొందల మైళ్లు రాలేదూ? అలాగే గోదావరీని. ఆడవాళ్లు పుట్టి పెరిగి, అక్కడిదంతా సారెక్రిందా, కట్నంకిందా తెచ్చి అత్తింటికి చేరుస్తారు. గోదావరికూడా అంతేకదూ చేస్తోంట? తాను పుట్టిపెరిగిన చోట్లలోంచి, ఒండ్రుమట్టీ, నీరూ అంతా తెచ్చి, సముద్రం దగ్గరున్న మనకిపెడుతోంది!

మీ అమ్మనీ, అందర్నీ అడిగేనని చెప్పు. నువ్వు బాగా శ్రద్ధగా చదువుకోవాలి సుమా.

చెన్నపట్నం,
1—1—1941 }

పిన్ని.

గానకళ ★

సంగీతోపాధ్యాయ
శ్రీ గాలి పెంచలనరసింహారావు

కానడరాగము — ఆదితాళము

ఆరోహణ : సరిగమదనిస
అవరోహణ : సనిపమపదనిదపమగామరిస

షాడవ వక్రమరాగము

22 వ మేళకర్తయగు "ఖరహరప్రియ" యందు జన్యము.

ప్రేలికి నాలుగు అక్షరముల చొప్పున ఘాతనుండి పాడుకొనవలయును

పల్లవి : రామా ! రఘుకుల సుధామ ! శ్రీ॥ రామా॥

అనుపల్లవి : సామాన్యపు మానవునకుయిల
నీమహిమ తెలియగ నేమిజెప్పినఫలమే॥ రామా॥

చరణము : నీ నామస్మరణము ధ్యానంబు జేయుటకు
క్ష్మానాధనాధుడేమి దీనాతి దీనుడేమి
పోనాడక మానసమున నిను
పూనికతో సేవించేటి పుణ్యపురుషులెందరో॥ రామా॥

పల్లవి : రీ ,, - ,, మా గామా మగమా	రీసా - రిసనీ	,, దా - నీసా
రా ,, - ,, మాఆఆరఅఘు	కుల - సుఉధా	,, మ శ్రీఈ
రీ ,, - ,, నిప మగమా మగమా	రీసా - రిసనీ	,, దా - నీసా
రా ,, - ,, అఅమఅఆరఅఘు	కుల - సుఉధా	,, మ - శ్రీఈ
రీ ,, - , సరిమ గామా మగపమ	మరిరిస - రిససని	నీదా - నీసా
రా ,, - , ఆఅఅమాఆరఅఘుఉ	కుఉలఅ - సుఉధఅ	ఆమ - శ్రీఈ
నిసరిమప నినిప - మగమా మగమా	మరిరిస - రిససని	నీదా - , నిసా
రఅఅఆఅఅ - మఅఆరఅఘు	కుఉలఅ - సుఉధఅ	ఆమ - , శ్రీఈ
సరిమపదని పమగమా, మగమా	మరిరిస - రిససని	నీదా - , నిసా

రఅఅఅఅఅఅమఅ, రఅఘు | కుఉలఅ - సుఉధఅ | ఆమ - , శ్రీకు
సరిమప దనీప మగమ గామనిప | మగమా - రిసనని | రిసని దానిసా
రఅఅఅఅఆఅమఅఅఆఅరఘు | కుఉల - సుఉధఅ | అఅఅమాఅశ్రీ||

అనుపల్లవి: పా ,, - ,, మపనీ దానీ మాపా | ,, పసా సనీ | రీసా - సారీ
సా ,, - ,, మఅఅఆఅన్యపు | ,, మఅనవు | నకు - యిల
నిపా , - ,, మపనీ దానీ మాపా | ,, మపనిస - రిమగామరీస | సాసా - సనిరీ
సఅ , - ,, మఅఅఆఅన్యపు | ,, మఅఅఅఅఅఆఅనవు | నకు - యిఇల
సనిపా ,, - ,, మపనీ దానీ మాపా | ,, పసా సనీ | రీసా - సాసా
సఅఆ ,, - ,, మఅఅఆఅన్యపు | ,, మఅనవు | -నకు - యిల
పరిరీ - రీసా - సనిరిస - నిపపా | మాదని - సనిపా | మగమా - రీసా
నిఇమ - హిమ - తెఎలిఇయఅగ | నేమిఇజెఎప్పి | నఅఫ - లమె
పరిరీ - రీసా - సనిరిస - నిపపా | పదదని - రిసనిప | మగమా రీసా
-నిఇమ - హిమతెఎలిఇ - యఅగ | నెఎమిఇ - జెఎప్పిఇ | నఅఫ - లమె

చరణము: రిమమా - ,, మా మామా మగమా | మపా , - పదనీ పా | మగమా - రీసా
నిఇనా - ,, మస్మరణఅము | ధ్యాఆ , నంంబు | జెఎయు - టకు
రిమమా - ,, మా మామా మరిమా | సరిగమ - దనిపా | మగమా - రీసా
నిఇనా - ,, మస్మర - ణఅము | ధ్యాఅనంంంబు | జెఎయు - టకు
రిమారీ , సా - సనిరిస - నీదా | సరీరీ , రీ | సరిమగమా - రీసా
త్మఆనాథ - నఅధుఉడేమీ | దిఈనా , తీ | దిఇనుఉఉడేమి
రిమారీ , సా - సని నిరిసారిస - నీ , ద | సరీరీ , రీ | సరి పమగమ రీ , స
త్మఆనా , ధనఅధుఉఉఉఉడే, మి | దిఇనా , తీ | దిఇనుఉఉఉడే, మి
పా ,, - ,, మపనీ దానీమాపా | ,, పసాసనీ | రీసా - సారీ
పో ,, - ,, నఅఆఆఆడక | ,, మఅనస | మున - నిను
నిపా , - ,, మపనీ దానీమాపా | ,, మపనిస - రిమగామరీస | సాసా - సనిరీ
పాఓ , - ,, నఅఆఆఆడక | ,, మఅఅఅఅఅఆఅనస | మున నిఇను
సనిపా ,, - ,, మపనీ దానీమాపా | ,, పసా సనీ | రీసా - సాసా
పాఓఓ ,, - ,, నఅఆఆఆడక | ,, మఅనస | మున - నిను
పరిరీ - రీసా - సనిరిస - నిపపా | మాదని - సనిపా | మగమా - రీసా
పుఉనీ - కతో - సెఎవించెఎటి | పుణ్యాఅ - పుఉరు | షుఉలెందారో
పరిరీ - రీసా - సనిరిస - నిపపా | పదదని - రిసనిప | మగమా - రీసా
పుఉనీకతో - సెఎవిం - చెఎటి | పుఉణ్యాఅ - పుఉరుఉ | షుఉలెం-దారో|| రా||

చిట్టస్వరము.

రీ , రిమదనిస నిదనిపామగమ | రీస నిరిస నిస | పా , దానిసరి
గామరీస - రిమదాని - మదనిసరి | గామరీస సా | స పాపా సాస

రామా ! రఘుకులసుధామ ! శ్రీరామా !

ఆకర్షవంతమైన చర్మసౌందర్యము

ఏ స్త్రీ చర్మమైతే ఆరోగ్యముగాను, శుభ్రముగాను పుష్పదళ మృదుత్వమును పోలియున్నదో, ఆమెను ఒక రహస్యమైన మనోహరత్వము ఆవరించి యుండును. ఏ సొమ్ములుగాని, పట్టు వస్త్రములుగాని, శ్రేష్టమైన ఒల్లు గగుర్పాటు వొనర్చు మృదువైన చర్మముతో సమానము కానేరదు. గాలి ఎండలచే దెబ్బతిన్న చర్మము ఆకర్షకముగా ఉండనేరదు. ఎందుకన చర్మముయొక్క రంధ్రములు పొత్తిగా శుభ్రపరచక పోవుటచేత.

చర్మము వాడకుండ, లేతగా నుంచుకొనుటకు ప్రతి ఒక స్త్రీ జాగ్రత్తపడ నవసరము. పాండ్స్ క్రీమ్ సీసాను కొనుడు.

మీ వేళ్ల చివరలతో క్రీమును, మీ చర్మముమీద రాయుడు. మృదువైన గుడ్డతో దులుపుడు. మరియు కొద్దిగా వేరే క్రీమును తేలికగాపూసి రాత్రంతయు ఆ నాణ్యమైన పొరను ఉంచుడు. ఈ మోస్తరుగా ఒక పదిహేనురోజులు రాత్రులయందు వాడుడు. అప్పుడు మీ చర్మము మృదువుగా లేతగా ఉన్నట్లు మీకు తెలియగలదు.

పగలు, గాలి, దుమ్మునుండి రక్షించుటలో శ్రేష్టమైనది పాండ్స్ వ్యానిషింగ్ క్రీమ్.

పాండ్స్ క్రీములు అన్ని గొప్పస్టోర్సులలో దొరకును, లేక పాండ్స్, పి॥బ॥ బాక్సు 144 బొంబాయివారికి వ్రాయుడు.

పాండ్స్ క్రీమ్



రాజా స్నో

మొటిమలను పోనిచ్చి
సౌందర్యమును హెచ్చించును

వెల 0—8—0 అణాలు

"రాజా స్నో" వారివల్ల
రాజా స్నో హేరాయిలు
రాజా స్నో కస్తూరి సోపుకూడ
తయారగుచున్నది

ఇవి మంచి సువాసనగలవి.

Manufacturers:

MANYAM & CO.,

MADRAS & BANGALORE.

Ba-Ba Water

The Elixir for Infants

మీ బిడ్డలకు నిత్యారోగ్యమునకు

బా-బా వాటర్ [రిజిష్టర్]

ఉపయోగించుడు

బిడ్డలకు పండ్లువచ్చు సమయమునకలుగు విరేచనములు, గ్రహిణి, వాంతులు, అజీర్ణము, లివర్ ఉబ్బరము మొదలైన సమస్త వ్యాధులను ఆమోఘముగకుదిర్చి, బక్కచిక్కిన కాలు చేతులను బలిష్ఠమొనర్చి, పండ్లను సరిగ వృద్ధిచేసి, పిల్లలను ఎప్పుడును ఆరోగ్యవంతులుగా నుంచును.

అన్ని ఔషధశాలలయందు దొరుకును



బా-బా వాటర్
మ్యానుఫేక్చరింగ్ కంపెనీ

ఏజంట్లు:—జి. రోహిత్ బ్రదర్స్, సుల్తాన్ బజారు, హైద్రాబాదు, దక్కన్.

ఆంధ్ర రాజ్ఞీమణి

★ రుద్రాంబ

శ్రీ ఆచంట లక్ష్మీనరసింహం

కాకతీయవంశ పారావారమున నపర లక్ష్మివోలె నవతరించి, గణపతిదేవుని యల్లారు ముద్దుబిడ్డయై పెరిగి, వీరోచిత క్షాత్ర విద్యలనెల్లనేర్చి, పితృదేవుని యనంతరము సువిశాల ఆంధ్రసామ్రాజ్య సింహపీఠి నధిష్టించి, నిజపరాక్రమాజ్ఞానులై యెదురు తిరిగిన సామంతులను, శత్రురాజులను, వారి ప్రచండ సైన్యములను, అపర దుర్గావతారమో యనున ట్లెదిరిచ్చి, యాంధ్రనిర్వక్ర పరాక్రమమును రుచిజూపి, శత్రువాహినుల బలాయితులచేసి, వారిచే నరికప్పములగొని, విజయ స్తంభమును నాటి మరలి "సర్వోర్వీశ కిరీటకుట్టిమతటీ విన్యస్త పాదాంబుజయై" యనేకదాన ధర్మములతో, సత్కార్యములతో శాంతిని సుఖసంపత్తులను సమకూర్చి జనుల నానందాబ్ధిదేల్చి జగదంబయై, విదేశీయులు సైతము మెచ్చుకొనునట్లాంధ్ర సామ్రాజ్యమును 38 సంవత్సరముల కాలము శాసించి, భారత మహిళాలోకమునకును, విశేషించి యాంధ్ర నారీలోకమునకును, ధ్రువతారయై, యఖండ యశస్సును సంపాదించిన పావనమూర్తి, రుద్రమదేవి.

★ జన్మము, బాల్య శిక్షణ ★

ఈమె జనకుడు గణపతిదేవ మహారాజు. తల్లి సోమాదేవి. మహారాజున కీమె యేకమాత్ర పుత్రి యని కొందరును, యీమెకు గణపాంబయను సోదరి యుండెనని మరి కొందరును దెలుపుచున్నారు. క్రీ. శ. 1220-25 సంవత్సరముల నడుమ నీమె జన్మించినదని చరిత్రకారుల యభిప్రాయము.

ఈయమ సురూపయనియు, బాల్యమునుండియు బరమ గంభీరురాలనియు శాసనములు వగైరా యాధారములవల్ల దెలియుచున్నది.

ప్రఖ్యాతుడగు విశ్వేశ్వర శివదేశికుడను శైవాచార్యునికడ నీమె విద్యనేర్చెను.

మగసంతతిలేమి, గణపతిదేవు డీమె దన యనంతరము దగిన యారసురాలు గావలెనని, రాజకుమారోచిత విద్యలన్నిటిని, విశేషించి, క్షాత్రవిద్యలను గారవమున నేర్పించెను.

ఈమె రుద్రమదేవుడను నామమున పురుషరూపిణియై, యశ్వమునధిష్టించి, యనుదినమును తండ్రి సభకేగి రాజకార్యములలో పాల్గొనెడిదనియు, యాయనజీవితకాలమున నీమెయనేక యుద్ధములలో బోరాడెననియు, 1245 నుండి 1258 వరకును దండ్రికూతుండ్రిరువురును గలసి పాలించిరనియు దెలియుచున్నది.

ఈమె భర్తనుగూర్చి హెచ్చువివరములు దెలియకపోవుట విచారకరము. ఈయన చాళుక్యవంశీయుడగు నిందుశేఖరుని పుత్రుడనియు, పేరు వీరభద్రేశ్వరుడనియు, నీయన యొక సామంతుడనియు మాత్రమే దెలియుచున్నది.

ఈయన యిల్లరికముండెననియు ముమ్మడమ్మ యుమ్మక్కలను నిరువురు కుమార్తెలు జన్మించిన యనంతరమీయన యౌవనముననే మరణించెననియు నాంధ్రచరిత్రకారులు నిర్ణయించిరి.

★ రాజ్యారోహణము – సామంతుల తిరుగుబాటు ★

గణపతిదేవుడు స్వర్గస్థుడు కాగానే, ఆయనయిచ్ఛానుసారము రుద్రమదేవి, రుద్రదేవ మహారాజను నామాంతరముతో సింహాసన మధిష్టించి, రాజ్యచక్రము నడుపజొచ్చెను.

ఆంధ్ర సామ్రాజ్య భాగ్యచక్రమును నొకరమణీమణి నడుపుటయు, తామామె పాదములకు తలలొగ్గుటయు, నుద్ధతులగు సామంతులకు కంటకమయ్యెను. కాన తమస్వాతంత్ర్యమును బ్రకటించుటకును, పిన్నచో నాంధ్రసామ్రాజ్యమును చేతసైనంతవరకు చేజిక్కించుకొనుటకును నిది మంచియదనని, వారుభావించి, నలువైపులనుండియు నొక్కుమ్మడి దిరుగుబాటొనర్చిరి. వీరిలో మూడవ కులోత్తుంగుడు, సిద్ధదేవచోడుడు, కేశవదేవుడు, సోమిదేవుడు, అల్లుగంగు, మల్లిఖార్జున దామోదరుడు మొదలగువారు ముఖ్యులు.

ఈ బెదరింపులకు ధీరయగు రుద్రమదేవి యావంతయు నధైర్యపడలేదు. స్వామిభక్తపరాయణులును, నవక్ర విక్రమధుర్యులునగు నన్నమదేవుడు, త్రిపురాంతకుడు నను సేనానుల తోడ్పాటున శత్రువులపైబడి, వారి సైన్యములను చించి, చెండాడి పరాజితుల నొనర్చెను. శత్రువులు దిక్కునకొకరుగా బరువెత్తి, శాంతినెలకొనలేదు. మరొక దిక్కునుండి దేవగిరి రాజగు మహాదేవరాజు 3 లక్షల యోధులతో తరలివచ్చి యోరుగల్లు దుర్గమును ముట్టడించి, 15. దినములు ఘోరయుద్ధమొనర్చెను.

రుద్రమదేవి మొక్కవోని ధైర్యసాహసములతో యపూర్వోత్సాహముతో, విక్రమోపేతులగు దనసేనానులయు, సామంతులయు, సహాయసంపత్తితో బోరును దీవ్రముగ సాగించెను. మంత్రకౌశలమున, వారిని బురిగొల్పుటతో దృప్తినొందక, స్వయముగ సర్వసైన్యాధిపత్యమును వహించి, శ్వేతాశ్వరూఢయై, ఆయుధధారిణియై, రణరంగమునకురికి, తండోపతండములుగా శత్రువులను నేలగూల్చి దిగ్భ్రమకలిగించెను.

వీరవిహారము సల్పుచున్న యామెయొక్కయును, నామెసైన్యముల యొక్కయు ధాటికాగజాలక, యాదవసైన్యములు పలాయనములయ్యెను.

తేజోమూర్తియైన రుద్రమదేవి, లభించిన విజయముతో తృప్తినంధక మున్ముందుసైత మేరును నాంధ్ర సామ్రాజ్యము వంక దేరి చూడకుండ, గుణపాఠము గరపుటకుగాను, శత్రుసైన్యములను దేవగిరివరకు వెనుదరిమెను. అంతట మహాదేవ రాజీమెను శరణుజొచ్చి కోటిద్రవ్యము నపరాధముగా జెల్లించెను. దేవగిరి రాజ్యపు సరిహద్దున నీమె దన విజయగాథను దెలుపుచు నొక విజయస్తంభమును, శిలాశాసనమును నాటి, ఆంధ్రజోదుల జేజేధ్వనులతో రాజధానిని బ్రవేశించెను. ఈమెయందు రాజతంత్రజ్ఞతతోబాటు, అకుంఠితములగు ధైర్యసాహసములును, యుద్ధ నైపుణ్యమును నిమిడియుండుట తెలుగుతల్లి భాగ్యము.

ఈ విజయముతో నిక సామంతుల పటాటోపము, ఔద్ధత్యము బూర్తిగా నణగిపోయెను. ఒకసారి మహారాజ్ఞి కూతురగు ముమ్మడమ్మ సంతాన కాంక్షియై వడ్డెపల్లి వినాయకుని గొలువనరిగి, యచట గొన్ని దినములుండి దిరిగివచ్చుసరికి, సవతికొడుకులగు మురారిదేవుడు, హరిహరుడును దుర్గమాక్రమింప, స్వామిభక్తులగు సేనానులు, సైనికుల సహాయ్యమున వారి నశ్రమమున నోడించెను.

★ నాటిరాజ్య వ్యవస్థ ★

శత్రువుల యుపద్రవ మడగినంతనే, యీమె చల్లని పాలనమున సామ్రాజ్యమంతటను శాంతి యోలలాడ దొడగెను.

తన రాజధాని శత్రువుల కభేద్యముగానుండు నట్లీమె యోరుగల్లు దుర్గమును బాగుచేయించెను. దుర్గమును విస్తరించి, చుట్టును భూమికోటను గట్టించెను. దానిచుట్టును లోతైన యగడ్తను ద్రవ్వించెను. పుట్టకోటకు, రాతికోటకు నెన్నియో బురుజులు, గౌనులు, దిడ్లు గట్టించెను. శత్రువులు ముట్టడించినప్పుడు లోనివారు సులభముగా పైకెక్క గలుగుటకుగాను, రాతిగోడకు లోభాగమున మెట్లు గట్టించెను.

దుర్గ రక్షణమునకుగాను, కొమ్మకు యిద్దరు, బురుజుకు ఏబదిమందియు, దిడ్డికి నూర్గురును, గౌనుకు అయిదువందలమంది వంతున, రక్షణభటు లేమరక గాచుచుండిరి.

సామ్రాజ్య రక్షణమునకీమె నవలక్ష ధనుర్ధరులను బోషించెడిదని ప్రతీతి. తెలుగుల స్వేచ్ఛా పతాక మాకసమంటిన రోజులవి!

★ రాజ్యపాలనము ★

రాజనీతిజ్ఞులు, శౌర్యధుర్యులునగు మంత్రి, సేనాధ్యక్షులు రాజకార్యములు నిర్వహింపుచుండ, ప్రీతి పురస్సరులగు ప్రజలు దోడ్పడుచుండ, నీ మహారాజ్ఞి తన కాలమునంతను ప్రజాక్షేమమునకు వినియోగించ జొచ్చెను. లెక్కలేనన్ని సత్కార్యముల నొనర్చుచుండెను.

ఈమె యొసగిన దానములకు, నిర్మించిన యగ్రహార వాపీకూపాదులకు లెక్కలేదు. స్వయముగా నిర్మించిన వానినేగాక పితృదేవుడు నిర్మించిన తటాకాదులనైత మీమె శ్రద్ధతో బోషించుచుండెను.

ఈ సందర్భమున నీమె యొనర్చిన నొక యత్యంత ముఖ్యమగు ధర్మమునుగూర్చి చెప్పవలసియున్నది. ఈమె శైవాచార్యుల కొసంగిన యగ్రహారమునందొక ధర్మ ప్రసూతిశాలను నిర్మించెనని, అదియే భారతదేశపు మొట్టమొదటి ప్రసూతిశాలయనియు తెలిసికొనుటకు, ఆంధ్రులు సకారణముగా గర్వించవచ్చును. మరియు నచటగల యన్న సత్రమునందు పంచములకు సైతమన్నదాన మొనర్చెడి వారన్నసంగతికూడ యంతటి ఆనంద దాయకమే.

నాటి కాకతీయ సామ్రాజ్యము పాలేరు గోదావరులమధ్యను, పడమటి కనుమలవరకు వ్యాపించి యుండెను. (మరి కొందరు కాకతీయుల సరిహద్దులు ప్రస్తుత ఆంధ్రజిల్లాలన్నిటికి కడపటనుండెనని వ్రాసి యున్నారు. ఇట్టి సామ్రాజ్యము నీమె "ఖలవర్జితముగాను, చాతుర్వర్ణములస్థితి దప్పకుండను" రక్షించెను.

కాకతీయ సామ్రాజ్యమును, ఓరుగల్లు, నగరమును స్వయముగాదర్శించిన ఇటలీ యాత్రికుడు మార్కో పోలో యీమె రాజ్యపాలనము నిట్లు ప్రశంసించియున్నాడు.

"ఈమె తన పూర్వులవలెనే ధర్మమును, నీతిని కాపాడి, దేశమునకు శాంతినిగల్పించి, తనప్రజలచే మిక్కిలి భక్తిపూర్వకముగా గొలువబడి, ప్రేమించబడుచు, చిరకాలము పరిపాలనమొనర్చెను. ఈమె కాలము నందంతకు బూర్వములేని వ్యవస్థలు సైతమేర్పాటు చేయబడెను."

శిల్పము, చేతిపనులు, చిత్రలేఖనము మిగుల నభివృద్ధిలో నుండెను. కవులకు రాజాశ్రయము విస్తారముగా నుండెను. రంగనాథ రామాయణ మీ కాలముననే రచింపబడెను. జనులెల్లరీమె "నంబా"యని పిలుచుచు, తమ కృతజ్ఞత దెలుపుట కీమెపేర రుద్రవరములు, నంబాల యగ్రహారములు పెక్కులు నిర్మించిరి. దేశము పెక్కుభాగముల నీ నామములు నేటికిని నమలులోనుండి, నీయంబ యమరకీర్తిని చాటుచున్నవి.

ఈ విధముగా నీమె పాలనము శత్రుభయంకరమై, జనరంజకమై, జగద్విఖ్యాత మయ్యెను. అశేషభారత వర్షమందైనను, అన్ని విధముల నీమెతో బోల్చదగినవారు రాణీ యహల్యాబాయి తక్క యొరులు లేరు.

★ ఆకాలపు ఆంధ్రదేశ వ్యాపారము ★

ఇందును గూర్చి పైన పేర్కొనబడిన మార్కో పోలో యిట్లు వ్రాయుచున్నాడు.

"ఈ రాజ్యమున శ్రేష్టమై, సన్ననైన వస్త్రములు వడికి, నేయబడుచున్నవి. వీని విలువ చాల యధికము. నిజముగా నీ బట్టలు సాలెపురుగు జాలెవలె నుండును. వీనిని ధరించ ముచ్చటపడని రాజుగాని, రాణిగాని ప్రపంచములో లేరు. మచిలీపట్టణము, పరిసరములును మస్లిన్ బట్టలకు, రంగు చీటీలకు బహు కాలమునుండి ప్రసిద్ధిగాంచినవి. ఓరుగల్లు జిల్లా కోనసముద్రమను గ్రామమున, శతాబ్దములనుండి ప్రసిద్ధి వహించిన డెమస్కస్ కత్తుల కవసరమగు యినుము లభించుచున్నది."

మచిలీపట్టణము, మోటుపల్లి రేవులద్వారా విదేశములలో హెచ్చుగా వ్యాపారము జరుగుచుండెను. దిగుమతులపై వివిధములగు సుంకములు విధించబడుచుండెను.

★ చరమదశ ★

వైభవోపేతమగు నీమె పాలనము కీ. శ. 1258 నుండి 1296 వరకు 38 దీర్ఘ వత్సరములు సాగెను. (37 సంవత్సరములని డాక్టరు హేగుగారి మతము.)

ఈమె తండ్రియభిమతము ప్రకారము, మనుమడగు ప్రతాపరుద్రుని దత్తతచేసికొని, క్రీ. శ. 1290 నుండియు నాతని రాజ్యకార్యములలో ప్రవేశపెట్టి, తాను ధార్మిక చింతాపరయైయుండి, క్రీ. శ. 1296 సంవత్సరమున శివసాయుజ్యమందెను. (ఈమె 80 సంవత్సరములు జీవించెనని ప్రాచీనగాథల మతము)

చరిత్రకాలమున, భారతవర్షమందు రాజ్యపాలన మొనర్చిన మహిళామణులలో నీమెయే యగ్రేసర. విదుషియై, నిష్కలంక చరిత్రయై, పరిపాలనాకాలము దీర్ఘమై, యవసానము శుభోదంతమై యుండుటయు నీరాజ్ఞమణి జీవితమునకు శోభగూర్చుచున్నవి.

స్త్రీజాతి కలంకారప్రాయమైన యీమెనుగూర్చి విద్యానాథ మహాకవి యమృతవాక్కులను శ్రీ పాటిబండ మాధవశర్మగారి యుత్తేజితమగు నొక పద్యమును యిట నుదహరించి, యీ వ్యాసమును ముగించుచున్నాను.

శ్లో. యోరుద్రోరజతాచలేస్థితి మగా దర్ధాంగనారిః పురా సోయం సంప్రతి కాకతీశ్వరకులే సర్వాంగనారీ స్థితం ।

(కైలాసమునందు అర్ధనారీశ్వరుడైన రుద్రుడు కాకతివంశమున పూర్తిగా స్త్రీయైయవతరించినాడు)

సీ. కట్టించితివి వరంగలుచుట్టు చుట్టిరా మృత్తికామయ మైనభిత్తి యొకడు
త్వవ్వించితివి మహోత్తాల తాలకురుట్సి ఖాదఘ్నమైన యగడ్త యొకడు
ఉద్ధరించితి విభ్రంశోన్ముఖంబైన స్త్రీజాతి నిర్మలయశః కేతనంబు
గారవించితి కవీద్గందేభముల దానధారచెక్కుల జిడ్డు దేరునట్లు

ప్రజల బాలించితివి రామరాజ్యమునకు
సాటియని చెప్పకోదగ్గ శాంతిగూర్చి
సలిపితివి నిశ్చలము బ్రహ్మచర్యదీక్ష
రుచిర సద్గుణనికురుంబ । రుద్రమాంబ ।



శాశ్వతం? – అశాశ్వతం?

శ్రీమతి వి. రత్నావళి

ఇటీవల జరిగిన హిందీప్రచార పట్ట ప్రదానోత్సవ సభలో ఈమె విశారద పట్టము ఒసంగ బడినది. ఆంధ్ర మహిళామణు లలో ఇట్టి పట్టము పొందు టకు ఈమెయే ప్రథమురాలు.

దేశసేవకుడు

ప్రచారానికి బయలుదేరుతున్నాడు

భారతీయనారి ★

శ్రీ స్వామి వివేకానంద
అనువాదం : శ్రీ పూర్ణానంద

(గతసంచిక తరువాయి)

విధవావివాహము లేకుండు విషయమును జింతింప బూనుకొనిన, ప్రథమ వర్ణవ్యయమున స్త్రీల సంఖ్య పురుషులకంటె నత్యధికము. ఒక వైపున పురుషుల సంఖ్య తక్కువగుటవలన విధవ-వివాహము కొఱకు భర్త దొఱకుట కష్టము; అందువలన విధవకు కష్టము-ఇంకొకవైపున కుమారి (అవివాహిత) భర్తృ-సమస్య. ఇప్పుడు మీ ముందఱ విధవావివాహము లేక కుమారీ వివాహము అను సమస్యలలో నొక్కటి వచ్చి పడి తీరును. ఇప్పుడు మరల ఆ పూర్వ విషయమును మరల స్మరింపుము, భారతీయుని మనస్సు సంఘ-తాంత్రికము వారనునది, 'చూడుడు, కుమారీ సమస్యతో తులజూచిన విధవా_సమస్యగౌణము.'_ఏమి? ఏలయన వారొకపరి ఈ సుయోగమును బొందియుండిరి. వారు వివాహమాడిరి. భర్తృవియోగమున వారీ సుయోగమును బొందియు పోగొట్టుకొనిరే. కాని ఒకసారి స్థిరభావమున కుమారికల విషయమును జింతింపుము. వారు వివాహయోగము నొక్కసారియును బడయలేదు. ఒకనాటి సంగతి నా మనస్సున నున్నది. ఆక్స్ఫర్డు స్ట్రీటున పదియైన తరువాత వేలకొలది యువతులు జజారునకు అరుగుటగాంచి ఒక అమెరికన్ వచించెను. 'వీరికి వరులెట్లు లభింతురాయని భావించుచున్నాడను.' అందువలన భారతీయులు విధవలకు జెప్పునది. "మీరొకసారి సుయోగమును బొందితిరి. మీకు సంభవించిన ఈ ఆకస్మిక దుర్ఘటనకు మేము వాస్తవముగ వ్యథితులము. కాని, ఉపాయ మేమియును లేదు. ఇప్పుడు అన్యకుమారికలు వివాహ సుయోగమును ప్రతీక్షించుచున్నారు."

ఈ విషయమున ధర్మమేమి చెప్పునో, చూతము. ధర్మ మరుదెంచినది సాంత్వనమును గొని. ఒక విషయమును మీరు గుర్తించుకొనవలెను. మా ధర్మ మొసగు ఉపదేశము, వివాహము మంచిదికాదు. అది కేవలము దుర్బలుల కొఱకు. యదార్థధార్మికు లెన్నడును వివాహమొనర్చుకొనరు. వారు పురుషులేయగుదురు గాక లేక స్త్రీలే కానీ ధార్మికులగు స్త్రీలు వచించునది, 'భగవంతుడు మాకు దానికంటె సమున్నతమగు సుయోగము నొసగినాడు, వివాహ మొనర్చుకొననేల? భగవంతుని పూజార్చనల సల్పుదును, మనుష్యుని కామింపనేల?' అవశ్యమందఱును భగవంతునికి మనస్సును సమర్పింపజాలరు. కొందరిటిపట్ల ఇయ్యది సంపూర్ణముగ అసంభవము; అందువలన వారు కష్టము ననుభవింతురు. కాని, తక్కినవారు వీరి కొఱకు ఆవయనేల? ఇప్పుడు మీరు విచారింపుడు. కాని, భారతవర్షముయొక్క అభిప్రాయ మియ్యది.

ఇప్పుడు మేము నారియొక్క కన్యావస్థను గుఱించి ఆలోచింతుము. హిందువుల సంసారమున కన్యను గుఱించియే అన్ని ఇబ్బందులు కన్యా, వర్ణము-ఈ రెండును హిందువుల సర్వనాశన మొనర్చును. ఏమన, వారి కొకే వర్ణమున, మరల నందు ఉపయుక్తశాఖతో వైవాహిక సంబంధ మొనర్పవలసియుండును. అందువలన, ఆడపిల్ల వివాహమొనర్ప తండ్రి అనేక సమయముల 'బికారి'యగును. వరుని తండ్రి వీలును గ్రహించి, వధువుయొక్క తండ్రి సమకూర్ప, అంతయును కోలుపోవునంత, కట్నము నడుగును. హిందువుని జీవితమున కన్యను గుఱించియే సమస్యలన్నియు. ఇంకొక విషయమును మీరు లక్షింపుడు. సంస్కృతమున ఆడపిల్లను 'దుహిత'యందురు. శబ్దముయొక్క వుత్పత్తి ఇయ్యది పురాణకాలమున పరివారమున ఆడపిల్లయే గోదోహన మొనర్చెడిది. అందువలన, దోహార్థకమగు 'దుహ్' ధాతువునుండియే దుహితృ శబ్దము వచ్చినది. దుహితృశబ్దము ప్రకృత పక్షమున గోదోహన కారిణినే తెల్పును. కాని తరువాత గోదోహనకారిణి

దుహితృ శబ్దమునకు నూతన అర్థము సృజింపబడెను. దాని ద్వితీయ అర్థము, సంసారమునందలి సారపదార్థ మును దోహన మొనర్చునదని.

సంఘమున ఇయ్యవి భారతీయనారియొక్క విభిన్న సంపర్కములు. మాతయొక్క స్థానము సర్వోన్నతము, తరువాత భార్యది, పిదప దుహిత అని నేను మీకు చెప్పియే యుంటిని. ఈ విభాగములన్ని యును కడుంగడు జటిలములు, దుర్బోధ్యములు. చాల ఏండ్లు ఆ దేశమున వసించినను విదేశీయుల కయ్యవి బోధపడుట చాల కష్టము.

మేము గురుజనుల సమక్షమున భార్యతో మాట్లాడము. కేవలము చిన్నవారి ఎదుటను ఏకాంత మునను సంభాషింప జెల్లును. నేను వివాహితుడైన కేవలము చెల్లెలు తత్సంతానము ముందరనే భార్యతో సంభాషించెదువాడను. సోదరితో ఆపె భర్తను గుఱించి ఏమియు మాట్లాడ చెల్లదు. సంగతి ఇయ్యది. మేము సన్యాసులజాతియను అభిప్రాయము నిరంతరము సమస్త సంఘముయొక్క ఎట్టఎదుట కనంబడు చున్నది. వివాహ మొకింత అపవిత్రము, ఒకింత నికృష్టము అని జనుల అభిప్రాయము. అందువలన ప్రణయ విషయముల గుఱించి ఏవిధముగనైన సంభాషింపగూడదు. మా జ్యేష్ఠ-సోదరీసోదరులు, మాత లేక తదితర గురుజనుల ముందర ఏదైన ఒక నవలనుగూడ చదవగూడదు; వారెవరైన ఎదుటకు వచ్చిన దానిని మూసి వేయవలెను.

అన్నపానముల విషయముగూడ ఇట్లే; గురుజనుల ముందు మేము తినము. స్త్రీలుగూడ పిల్లలు లేక సంపర్కమున తమకంటె చిన్నవారి ముందుగాక, తదితర పురుషుల ముందు తినరు. స్త్రీలు నుడువుదురు, 'భర్త ఎదుట కరకర నమిలి మ్రింగుటకంటె, మరణము మంచిది.' కొన్నిపట్ల సోదరీసోదరులు కలసి భుజింపవచ్చును. నేనును నా సోదరియును భుజించుచుంటి మనుకొనుడు. అప్పుడు హఠాత్తుగ ఆపె భర్త ద్వారమున నిలబడిన, వెంటనే ఆపె భోజనమును నిల్పును, భర్తగూడ తొందరగ అటనుండి వెడలిపోవును.

ఈ ఆశ్చర్యాతి ఆశ్చర్యకరములగు ఆచారములన్నియు, ఆదేశపువి; వీటియందు కొన్నిటిని నే నవివాహితుడనగుటవలన స్త్రీ విషయకములగు విషయముల సంపూర్ణముగ నెఱుంగను. మాత, సోదరీవిషయ ముల నెఱుగుదును. ఇతరుల భార్యల విషయము కొంచెము చూచితిని; దీనినుండియే నేను గ్రహించిన విషయముల నన్నిటిని మీకు జెప్పుచున్నాడను.

విద్యాసంస్కృతులు సంపూర్ణముగ పురుషునిమీద నే నిర్భరపడుచున్నవి. అనగా, పురుషులు ఉన్నత విద్యను బడసినచోట స్త్రీలుగూడ బడయుచున్నారు. పైగా, పురుషులు విద్యను బడయనిచో, స్త్రీలుగూడ బడయరు. హిందువుల ప్రాచీనరీతి ననుసరించి పూర్వమునుండియు, భూమి సాధారణ - సంపత్తిగ పరిగణింప బడుచున్నది; మీ భాషలో నయ్యది సర్కారువారిది. భూమిమీద ఎవ్వఱికిని వ్యక్తిగతమగు హక్కు లేదు. భారతమున భూమిపన్నే రాజస్వము. అక్కడ ప్రతివ్యక్తియు సర్కారువారినుండి భూమిని బొందును. భూమిమీద ఎవ్వఱికిని వ్యక్తిగతమగు హక్కు లేదు......

మీలో హెర్బర్టు స్పెన్సర్ పుస్తకముల జదివినవారు మఠ—శిక్ష (Monastery systen & Education) అననేమో ఎఱుంగుదురు. ఇది ఒకప్పుడు యూరప్‌న బరీక్షింపబడినది; కొన్నితావుల దీనివలన సుఫలమే ఫలించినది. ఈరీతి ననుసరించి ఒక పండితుని ఆధీనమున ఒకస్కూలు ఉండును. గ్రామవాసులు దాని ఖర్చును భరింతురు. ఈ పాఠశాలలు ప్రాథమిక శిక్ష నొసగును. మా విద్యా—ఉపాయములన్నియును అత్యంత సరళములు. ప్రతి విద్యార్థియు కూర్చుండుటకు ఒక చిఱుచాపను దీసికొనిపోవును. మొదట లేఖన పత్రములు తాటియాకులు. ఏమన, కాగితములు, వారి పక్షమున, అధికమూల్యములు. ప్రతి విద్యార్థియును పాఠశాలలో చాపనుబరచి కూర్చొని, తన సిరాబుడ్డిని, పుస్తకమును వెలికిదీసి, వ్రాయుట నారంభించును. (సశేషము)
లెక్కలు, కొంచెము సంస్కృత వ్యాకరణము, సామాన్యభాష చెప్పబడును.

పాత పాటలు

[ప్రాచీనుల పాండిత్య ప్రతిభ, కవిత్వనైపుణి ప్రబంధాది రచనలలోనే గాక, పల్లె పాటలు, పద్యములలోకూడా అమితముగా నున్నది. ప్రబంధ రచనలవలె నివి గ్రంధస్థములుగా లేని కారణముచేతను, వాడుకలో మాత్రమే నిలిచియుండుటచేతను, యివి నశించిపోకుండ సేకరించుట ఎంతయు మన ధర్మము. ఇట్టి వాటిని సంపాదించి పంపిన కృతజ్ఞతతో 'గృహలక్ష్మి' ప్రకటింపగలదు.]

శ్రీ లక్ష్మిగౌరుల సంవాదము

గౌరిదేవి నీ శంభునిగళమున నలుపేమమ్మా
నారీమణి విష్ణుదేవుడు నలుపుగాడటె యెకొమ్మా ॥ ౧ ॥

పంకజాక్షినీ శంకరు కరమున జింకలున్న వేమమ్మా
శంకలేక నీ వనమాలి జింకనేసెనె యోకొమ్మా ॥ ౨ ॥

ఇందువదన నీ వల్లభునికి సగమాడరూప మేమమ్మా
ముద్దుగొమ్మనీ పెన్మిటి మును మోహినిగాడటెయో కొమ్మా ॥ ౩ ॥

పార్వతిదేవి నీ విభునిపై పాములున్న వేమమ్మా
క్షేత్రతనయనీ మురహరి మానుగాడటెయో కొమ్మా ॥ ౪ ॥

ఎగ్గులేక నీకాంతుడు జగమున భిక్షమెత్తుటేమమ్మా
పంతముతో బలిచక్రవర్తి నడుగలేదటెయో కొమ్మా ॥ ౫ ॥

సిగ్గులేక నీ పెనిమిటి ముసలెద్దు నెక్కుటేమమ్మా
పన్నగశాయి రేపల్లెవాడలో పశువులగాయడె యోకొమ్మా ॥ ౬ ॥

పార్వతి లక్ష్మీదేవుల వాదులు పలుకులయినవేమమ్మా
విన్నవారికి విష్ణులోక కైలాసమ్ము లబ్బునె యోకొమ్మా ॥ ౭ ॥

—ఒంగోలు వేంకటరంగయ్య

చలన చిత్రాలు

నవ్యకళ కాంతులకీ, నవనవోజ్వల భావరూపానికి ఆటపట్టు నవ్యకళావారి 'మీరాబాయి'

విడుదలయై ఆంధ్రదేశమునందలి ముఖ్యపట్టణాలలో ప్రదర్శింపబడుతూ వుంది. దర్శకులు శ్రీ శ్రీప వరపు నరశింహారావుగారి కళారాధన కిది బాహ్యరూపం.

చిత్రము ప్రతి అంగుళంలోనూ కళాప్రాభవం ఉట్టిపడుతోంది. హృదయాన్ని భక్తిరసంలో తన్మయత్వం చెందించే గానం, నాటికాల పరిస్థితులకు రూపుపెట్టిన శిల్పము యీ చిత్రంలో సృష్టింపబడినంత నిర్దుష్టంగా మరి ఏ చిత్రంలోను లేదంటే అతిశయోక్తిగాదు.

నటీనటకులందరు చక్కగా నటించడంచేత, చక్కని నడకలో చిత్రాన్ని నడిపిన దర్శకత్వంచేత 'మీరాబాయి' తెలుగు సినీమా పరిశ్రమలో నూత్న శకారంభాన్ని చూపించింది.

ఫేమస్ టాకీసువారి 'భూకైలాస్'

గత 14 వ తేదీని విడుదలయై ఆంధ్రదేశమంతటా విజయయాత్రలు చేస్తూవుంది. అనేక సాంఘిక చిత్రాల మధ్యలో యీ పౌరాణిక చిత్రం రావటంవల్ల, కథ సర్వజనవిదితమైనదైనందువల్ల విశేష జనాదరణ పొందుతూవుంది. నటీనటులు క్రొత్తవారైనా చక్కగా నటించారు. ఆంధ్ర కర్ణాటక దేశాలలో ఒకేసారి విడుదలై ఆదరింపబడుతూ వుంది.

ఫేమస్ ఫిలిమ్సువారి 'ధర్మపత్ని'

ప్రాతివ్రత్యమహిమను వేనోళ్లచాటే చక్కని సామాజిక గాధ దీనికి ఇతివృత్తం. సిద్ధహస్తులు శ్రీ పి. పుల్లయ్యగారి దర్శకత్వంలో తయారైంది. యీ మాసంలో విడుదల ఔతుంది. శ్రీమతి శాంతకుమారి, భానుమతిగార్ల గానమాధుర్యం దీనిలో వెల్లివిరిసింది అనివార్తలు.

రోహిణి పిక్చర్సువారి 'తెనాలి రామకృష్ణ'

శ్రీ కృష్ణదేవరాయల ఆస్థానకవిచంద్రుడైన తెనాలి రామకృష్ణుని చరిత్ర క్రొత్త పక్కీలో సృష్టింపబడుతూ వుంది. కేవలం అల్లరి చిల్లరి పనులుచేసే ఒక ఆకతాయిగా నిర్వచింపబడే రామలింగణ్ణి, ఒక సంఘ సంస్కర్తగాను, పేదలపాలిట పెన్నిధిగాను సృష్టిస్తున్నారు శ్రీ హెచ్. ఎం. రెడ్డిగారు—ఓవైపు షూటింగు, ఓవైపు ఎడిటింగుకూడా అతిశీఘ్రంగా జరుగుతున్నాయి. యీ మాసాంతంలోగా విడుదలౌతుంది.

శ్రీ వసుంధరా ఫిలిమ్సువారి 'మైసూరు దసరా'

ఈ వార్తాచిత్రానికి ముందుగా తమిళనాడులో విడుదలయ్యే ఏర్పాట్లు జరిగినవి. యీ మాసాంతంలోగా విడుదల ఔతుంది. తెలుగులోను, తదితరభాషల్లోను కూడా తయారయి సిద్ధంగా వుంది. దర్శకులు శ్రీ గాలి వెంకటేశ్వరరావుగారు దీని వెనువెంటనే మరికొన్ని వార్తాచిత్రాలను, ఒక సాంఘిక, పౌరాణిక సమ్మేళన చిత్రాన్ని తీయబోతున్నారు. దానికి సంబంధించిన వ్యవహారమంతా చురుగ్గా జరుగుతూవుంది.

ఆర్. యస్. పి. పిక్చర్సువారి 'తారాశశాంకం'

షూటింగు పూర్తిగా అయిపోయింది. ఎడిటింగు జరుగుతూవుంది. పుష్పవల్లియొక్క పాపశిశాల నటనాకౌశలానికి యీ చిత్రం చూచితీరాలి.



" మోహన్
అశుభ్రముగా ఉన్నాడో
చూడు ... "
బట్టలు ఎప్పుడూ శుభ్రముగా ఉన్నట్టే కనబడవు. నన్ను చూచినప్పుడల్లా మోహన్ తండ్రి విసుక్కుంటూనే ఉంటాడు. వాళ్ళ బట్టలే కాదు, వాళ్ళ ఇల్లుకూడా పరిశుభ్రముగా ఉండదు. ఏం చెయ్యాలో నాకేమీ తోచటం లేదు."
"మునుపు మేముకూడా అట్లాగే ఉండేవాళ్ళం కాని మా భర్తగారు ఒక సినిమా చూపిన తరువాత మా జీవితం మారిపోయింది....
...ఆ సినిమా సన్‌లైట్ సబ్బులో ఉండే మహాత్యం చూపించింది. ఈ సబ్బు మురికికి, అసహ్యానికి జన్మ విరోధి. ఈ సబ్బు మురికిని పోగొట్టి క్రొత్త బట్టలవలె చేస్తుంది. దీని నురుగు ఎంత లేత చర్మమునకైనా హాని కలిగించదు. మంచి సువాసన కలది. పైగా డబ్బు ఖర్చుకూడా తగ్గించును."
"లక్ష్మీ బహెన్ సన్‌లైట్ ఎంత అద్భుతమైనదో చెప్పింది. మనకు కూడా ఒక సబ్బు తీసుకొనిరండి. ఉపయోగిస్తాను."
కొన్నాళ్ళ తరువాత
" ఇంత కొద్ది కాలములో మన జీవితములో ఎంత మార్పు కనిపించింది! మన మందరము ఇప్పుడు ఎంతో ఆరోగ్యముగాను, సుఖముగాను ఉన్నాము. ఇప్పుడు మనయిల్లు ఎంతో ఆనందముగాను, పరిశుభ్రముగాను ఉంది."
నాకు పని చాలా తగ్గింది ఇదంతా సన్‌లైటు సబ్బు మహత్యమే."
ఎప్పటికి బట్టలకు ఉపయో గించుటకు శ్రేష్ఠమైనది
సన్‌లైట్ సబ్బు
SUNLIGHT SOAP
S. 24-511 TL
LEVER BROTHERS (INDIA) LIMITED

నిత్యావసరములలో ఒకటి



మీ భర్త పనినుండి, మీ పిల్లలు బడినుండి, యింటికి రాగానే వారికి టీ తయారుచేసి యిచ్చుట మీ విధి. కాబట్టి ప్రతి రోజు మీ యింట్లో టీ పార్టీ అన్నమాట—సంసారఆనందమునకు ముఖ్య మిదియే. మీ యింటిలో వలెనే అనేక యిండ్లలోకూడా అదే విధముగా యిదే సమయమున యీలాటి సంతోషకర విషయమే జరుగుచున్నదని నమ్ముడు!

మనము ఇండియా టీ నేత్రాగుదము

తేనీరు తయారుచేయు విధం—మంచినీటిని మరుగ కాచవలయును. పరిశుభ్రమైన పాత్రను కొద్దిగా వెచ్చజేయుడు, మనిషికొక చెమిచా చొప్పున, ఎంతమందికి తేనీరు కావలయునో అన్నిచెమిచాల తేయాకుతో, మరొక చెమిచా తేయాకు ఎక్కువగా చేర్చి ఆ పాత్రలో వేయుడు. కాగుతున్న నీరు సలసల మరుగగానే ఆ నీటిని ఆ తేయాకు పాత్రలో పోయుడు, అయిదు నిమిషములు అట్లుండనిచ్చి, ఆ తేనీరును కప్పులలోపోసి, పాలను పంచదారను కలిపి సేవించుడు.

IK 116

ఇండియన్ టీ మార్కెట్ ఎక్స్‌పాన్షన్ బోర్డువారిచే ప్రకటించబడింది



గోధుమలుతో తయారుచేయదగిన వివిధ పదార్థములు—6.

బొంబాయి చట్నీ

అరపడి పెరుగులో ½ తులం మిరపకాయలు ¼ తులం ఆవాలు కొంచం మెంతులు శెనగగింజంత ఇంగువ 6 పచ్చిమిరపకాయలు తరిగి, కొంచం కర్వేపాకు 2 తులముల జీడిపప్పు నేతిలో వేయించి వెయ్యవలెను. 2 ఆళాకుల గోధుమరవ నేతితో ఎర్రగా వేయించి పెరుగులో కలుపవలెను. 4 తులముల కొబ్బరి వేయించి కలుపవలెను.

బెంగుళూరు బోండా

ఒక పాత్రలో కొంత నెయ్యివేసి 2 ఎండు మిరపకాయ ముక్కలు, 4 పచ్చిమిరపకాయ ముక్కలు, చంచా ఆవాలు, 2 చంచాల మినపపప్పు, 1 చంచా శనగపప్పు, కర్వేపాకు, వుల్లిపాయ ముక్కలు వీటిని అన్నింటిని వేయించి 2 ఆళాకుల నీరుపోసి కాగినతరువాత 1 ఆళాకున్నర నూకనువేసి కలియపెట్టి గోధుమనూక వుడికినతరువాత దింపి 4 తులముల నెయ్యివేసి చిన్నవుండలు చేయవలెను. ఒక ఆళాకు గోధుమ పిండి, అర ఆళాకు శనగపిండి కొంచం కొట్టిన కారం, వుప్పునీటితో చిక్కగ కలిపి వుండలు పిండిలోముంచి మరగిన నేతిలోవేసి వేయించి తీయవలెను.

దోస అట్లు

ఒక దోసకాయను తరిగి గింజలుతీసి చిన్నముక్కలు చేయవలెను. ఒక ఆళాకు గోధుమరవ దోస ముక్కలతో 2 గంటలు తడిపివుంచి, తరువాత మెత్తగా రుబ్బి, 2 పచ్చిమిరపకాయలు, కొంచం అల్లం, కొంచం వుప్పు కొట్టి పిండిలో కలిపి అట్లు పోయవలెను.

పాలకోవా

1 శేరు పాలు 2 గంటలు మరగనిచ్చి ½ శేరు పంచదార, ¼ శేరు గోధుమపిండివేసి గట్టిపడేవరకు కలుపవలెను. తరువాత దింపి పళ్లెంలో పెట్టవలెను.

వెన్న ద్రాక్షపళ్లు

¼ శేరు గోధుమపిండి 4 తులములవెన్న ¼ శేరు పంచదార చిన్నచంచా ఏలకపొడి వీటినిబాగా కలిపి ద్రాక్షపళ్లవలెచేసి నేతిలో వేయించవలెను.

గోధుమ చౌచౌ

½ శేరు గోధుమలు వేయించి విసిరి ఒక కొబ్బరికాయ కోరి వేయించి, ½ శేరు పంచదార ½ తులం ఏలకపొడి, 4 తులముల జీడిపప్పు వేయించి, 1 ఫలం కిస్‌మిస్ 1 ఫలం బాదంపప్పు, 4 తులముల నెయ్యికాచి మొత్తం అన్నీ కలుపవలెను.

గోధుమ వడలు

¼ శేరు శనగపప్పు నానినతరువాత రుబ్బవలెను. దానిలో 1 అళాకు గోధుమరవకలిపి 4 తులముల వుల్లిపాయముక్కలు, 6 పచ్చిమిరపకాయ ముక్కలు, వుప్పు, జీడిపప్పు అన్నికలిపి బిళ్లలుచేసి కాగినచమురులో వేసి వేయించితీయవలెను.

సొజ్జి బూర్లు

1 అళాకు గోధుమరవ 3 అళాకుల పాలలో వేసి వుడకపెట్టవలెను. దానిలో 1 అళాకు పంచదార ఏలకపొడివేసి, దింపి వుండలుచేసి వుంచవలెను. 1 అళాకు గోధుమపిండి అరఅళాకు వరిపిండి, కొంచంవుప్పు నీటితో చక్కగాకలిపి ఒక పాత్రలో నెయ్యివేసి మరగించి పై వుండను పిండిలోముంచి నేతిలోవేయించి తీయవలెను.

రవ కమలాలు

1 అళాకు గోధుమరవ ½ అళాకు పంచదార తగుపాలతో గట్టిగకలిపి 1 గంట నాననిచ్చి రోటిలో వేసి మెత్తగకొట్టవలెను. దానిని వుండలుచేసి పూరీవలె వత్తి ఒకపాత్రలో నెయ్యిపోసి మరగించి పూరీ వేయించవలెను.

బెంగాలి ఫ్రూట్స్

పావుశేరు పెసరపప్పు నాననిచ్చి కొంచం మెత్తగ రుబ్బి ఇడ్లీ వండవలెను, వుడికినతరువాత దింపి పిసకవలెను. 1 కొబ్బరికాయ కోరి నేతిలో వేయించి కొంచం ఏలకపొడి, అర్ధశేరు పంచదార వీటిని ఇడ్లీ పిండిలో కలిపి పొయ్యిమీదపెట్టి కలియపెట్టవలెను. 10 నిమిషములకు దింపి గచ్చకాయంత వుండలు చేయవలెను. పావుశేరు గోధుమపిండి పావుశేరు వరిపిండి చిటిక కొట్టినవుప్పు నీటితో పెరుగువలెకలిపి, ఒకవెడల్పు పాత్రలో ½ శేరు నెయ్యిని మరగనిచ్చి వుండలను పిండిలోముంచి నేతిలో వేయించి తీయవలెను.

—సి. హెచ్. అన్నపూర్ణాబాయి

బంగారుపతకం బహుమానం

గోధుమ ధాన్యముతో చేయదగిన పలువిధములైన పదార్థములను, గత సంచికల లోని అయిదు పట్టీలయందు ప్రకటింపబడినవి గాక, ఎక్కువ పదార్థములను వ్రాసి పంపినవారికి ఒక 'బంగారుపతకము' బహూకరింపబడును. వెనుక గృహలక్ష్మిలో ప్రకటింపబడిన వాటినిగూడ ఎత్తి వ్రాయగూడదు.

సంపాదకుడు.

పుష్ప చయము * * *

స్వాతంత్ర్యం ప్రధానంగాని, వారసత్వ, విడాకుల హక్కులుగాదు

శ్రీమతి క్రాంతిదేవి ఇటీవల గ్వాలియర్‌లో ఒక మహిళాసభకు అధ్యక్షతవహించి, మహిళా సంఘాలచర్యలు సత్యమునకు దూరములై పోతూ వున్నాయని, దూరదృష్టి రాహిత్యములవుతున్నాయని, మహిళోద్యమాలను గురించి ఒక చిన్న హెచ్చరిక గావించారు. ఆమె చెప్పిన విషయాలనుగురించి మహిళాసంఘాల్లో తీవ్రమైన అలజడికలిగి, అనేకమైన విమర్శనలు బయలుదేరాయి. ఆ విమర్శనలన్నిటికి సమాధానంగా శ్రీమతి క్రాంతీదేవి యీవిధంగా సమాధానం ఇచ్చారు:

"నేటికాలపు కాలేజి విద్యావిధానం ఒక క్రొత్తరకపు యువతులను తయారుచేస్తూవుంది. యీ తరగతికిజెందిన యువతీలోకం పురుషులతోడి సహకారాన్ని తృణీకరిస్తూ, కొంతమంది ధనికులాంధ్ర చేతుల్లో మెలుగుతూ, పాశ్చాత్యపద్ధతులను గ్రుడ్డిగా అనుసరిస్తూ, స్వదేశ స్వాతంత్రోద్యమంలో పాల్గొనడానికి నిరాకరిస్తున్నారు.

స్త్రీ జనోద్యమము, దాని నిజమైన ఆకారంలో, మానవసంఘానికంతకు చెందినదైవుండాలి. ఇది ఎంతసేపూ స్త్రీ పురుషులయొక్క రాజకీయ, ఆర్థిక, సాంఘిక పురోభివృద్ధికి దోహదమిచ్చునదిగానే వుండాలి. స్త్రీ నాయకురాండ్రు సాధారణ తరగతికిచెందిన స్త్రీలయొక్క నిజమైన ప్రతినిధులుగావుండాలి. అదే సాధారణ స్త్రీలకొరకై సాధారణ స్త్రీలచే నడపబడు సవ్యమైన సాధారణస్త్రీ జనోద్యమము కాగలదు.

నేటి మహిళోద్యమము "భారతదేశ స్వాతంత్ర్యమే ప్రధానాశయం"అనే విప్లవవంతమైన పట్టుదలతో నడపబడుతూ వుందా? కాక బాధ్యతారహితమైన కులాసాలకోసం సంస్కరణల తీసుకురావాలనే స్త్రీ నాయకురాండ్రయొక్క తత్వాలకిది ప్రత్యక్షమైన బాహ్యారూపమా?

స్త్రీలజాతీయోప సంఘంవారు ఇటీవల శాసన సంబంధమైనవాటిలో, సంస్కరణలు కావాలని తీర్మానాలుచేశారు. కాని, మనదేశ పరిపాలన పరాయత్తమై వున్నంతకాలము అటువంటి తీర్మానాలు కేవలము మన అభివృద్ధి నిరోధకాలనివారు ఆలోచించలేదు.

ప్రస్తుత కాల పరిస్థితుల్లో, మహిళోద్యమము నిజమైన, తీవ్రతరమైన ఉద్యమంగా మారాలంటే, యీ ఉద్యమంయొక్క దృక్పథం రాజకీయంగా మారిపోవాలి. కాక, కేవలము ఆచరణ రహితమైన (పుట్టిన మరుక్షణంలోనే చచ్చేవి) తీర్మానాలను తీర్మానించుటలో నమ్మకమున్నంతకాలము నేటి మితవాదపక్షంవలెనే, మహిళోద్యమంకూడా మృతినొందిన దానితోటే సమానమౌతుంది.

మధ్యతరగతి మహిళామణులు, కార్మిక కర్షక స్త్రీలు ధనముగాని, సౌఖ్యముగాని, చివరకు తీరుబాటుగాని లేకుండా కాలం వెళ్లబుచ్చుతున్నారు. కనుక ప్రకృతిసిద్ధంగా వారికి వారసత్వపు హక్కుయందుగాని, భర్తలను విడాకులిచ్చుటయందుగాని, భోగలాలసత్వ సంబంధమైన కోరికలుగాని కలుగవు. ప్రతిదినమూ రెండు పూటలా భోజనం సంపాదించుకోవడమూ, చలి, ఎండ బాధలనుండి కాపాడుకోవడానికి బట్ట సంపాదించుకోవడము—వారిని ఎల్లప్పుడు ఎదుర్కొనే సమస్యలు.

ఇక, సహజంగా భోగలాలసులైన ఐశ్వర్యవంతురాండ్ర దృష్టిలో సాధారణ స్త్రీలయొక్క కష్టనిష్ఠురాలు అత్యల్పమూ, అనవసరమే కాక, వారి ఆలోచనలకు అందవు కూడాను."

నంద్యాలలో వితంతుశరణాలయ నిర్మాణ ప్రయత్నాలు

నంద్యాల వైశ్య మహిళా సంఘంవారు శ్రీమతి ఎలకూరు సుబ్బరత్నమ్మగారి అధ్యక్షతను సమావేశమై వితంతు శరణాలయము నొకదానిని నంద్యాలలో స్థాపించునట్లుగా తీర్మానం గావించారు.

తల్లిపాలయొక్క శ్రేష్టము

శిశువులకు తల్లిపాలవంటి శ్రేష్టమైన పాలు ఇంకొకటిలేవు. తల్లిపాలమీద పెరిగిన శిశువు వర్ధిల్లినట్లు పోతపాలు త్రాగిన శిశువులు వర్ధిల్లరు. తల్లిపాలు పిల్లలకు స్వభావసిద్ధమైన ఆహారము. సాధువులగు ఆవు, మేక మొదలగు జంతువులును, క్రూరములగు పులి, సింహము మొదలగు మృగములలో తల్లులు పిల్లలకు పాలుగుడిపియే పెంచుతున్నాయి—ఇదియే మాతృధర్మం.

కొన్ని కారణములచేత తల్లికి పాలు లేకపోవచ్చును. అలాంటప్పుడు తల్లికి పాలుపడడానికి తగిన సదుపాయాలు చేయవలయునేగాని పిల్లలకు పోతపాలు అలవాటు చేయరాదు.

తల్లికి పాలుపడేందుకు కొన్ని సదుపాయాలు

(1) బార్లినీళ్లు కొద్దిగా పంచదారవేసి మితముగా పుచ్చుకుంటే పాలు వృద్ధియగును.
(2) శుభ్రమైన ఆవుపాలు జీర్ణంపదగినంత పుచ్చుకొనవచ్చును.
(3) నీళ్లలో నానబెట్టిన పచ్చిశనగలు తగుమాత్రం తినవచ్చును.
(4) కర్బూజాపండు తినడంవల్ల—
(5) వెల్లుల్లి పాలలో ఉడికించి తినడంవల్ల—
(6) ముల్లతోటకూర, పప్పువేసివండి తినడంవల్లను పాలుపడతవి.

మరియు తల్లికి పాలపుష్టి అధికమై దాన్ని జీర్ణించుకోలేని శిశువులుకూడ ఉంటారు. అలాంటప్పుడు కూడ పిల్లలకు పోతపాలు అలవాటు చేయకూడదు. ఆతల్లిపాలు సులభంగా జీర్ణంచేసే మార్గమునే చూడాలి. తల్లి పాలుగుడుపుటకు ముందు 3 లేక నాలుగు చమిచాలు గోరువెచ్చని నీటిని శిశువునకు త్రాగించి తరువాత తల్లిపాలిస్తే త్వరలో జీర్ణమగును.

స్త్రీ విద్యలో అభివృద్ధి సూచన

మద్రాసు రాజధానిలో స్త్రీల విద్యాభివృద్ధి సంబంధించిన కొన్ని అంకెలను గమనిస్తే, వెనుకటికంటె ఇప్పుడు స్త్రీలలో విద్యాసక్తి ఎక్కువగా కలుగుతూవుందని చెప్పవచ్చు. ఆంధ్రరాష్ట్ర హరిజనసేవక సంఘ ప్రధానకార్యదర్శి శ్రీ మాగంటి బాపినీడుగారు ఇటీవల తయారుచేసిన యిట్టిపట్టికను బట్టి చూస్తే—5 సంవత్సరములు నిండిన బాలురలో నూటికి ముగ్గురు వున్నట్టయితే బాలికలలో 2½ వరకు వున్నారు. క్రైస్తవులలో మాత్రము 14 గురువరకు వున్నారు.

ఇవిగాక, నిమ్నజాతి బాలికలు మద్రాసు రాజధానియందున్న అన్ని స్కూళ్లలోను చదువుచున్నవారు 75,935 వరకు వున్నారు. మొత్తముపైన విద్యావతులు 962,437 వరకువున్నారు. ఇవి గడచిన సంవత్సరములలో కంటె చాలా అభివృద్దిలోవుంది. దీనిని ఇంకా వృద్ధిచేయాలని ప్రబల ప్రయత్నాలు జరుగుతున్నాయి. హరిజనబాలికలలో ఉన్నతవిద్యాభివృద్ధికొరకు ఆసక్తి ఎక్కువగా వున్నదని, వారికి వస్తూవున్న అర్జీలన్నిటిని తీసుకొనలేక పోతున్నామని కార్యదర్శిగారు తెలియజేస్తున్నారు. హరిజనులలో విద్యాభివృద్ధికోసం యీ సంవత్సరం బిర్లా కోటీశ్వరుడు ఒకలక్ష రూపాయలను విరాళంగా ఇచ్చారు. ప్రజానీకంకూడా కొంచెం శ్రద్ధవహిస్తే ముఖ్యంగా స్త్రీలలో ఆవిద్యను రూపుమాపవచ్చును.

గ్రంథ సమీక్ష

సరస్వతీ రామాయణము

శ్రీ సరస్వతీ రామాయణమునంతయు పూర్తిగ నవధానముతో జదివితిని. శైలియు, పదముల కూర్పును బహు మనోహరముగనున్నవి. చదువుచుండగ నెచ్చటను కొంతుకుబడలేదు. కొన్నిపుటలుచదివి ఆనాటి కక్కడకి నిలుపుటకు బుద్ధియొప్పక కాండాంతమువరకైన చదువ ప్రేరేపించుచుండినది. గట్టిపడిన ఇనుపకమ్ముల రైలుమార్గమున మెయిలు ట్రెయినుపరుగిడినట్లు గ్రంథము నడచినది.

గుణదోషవిచారము జేయ నేనధికారినిగాను. నాకుతోచిన కొన్నికొన్ని విషయముల గ్రంథముననె యందంద ఆమె ఘట్టనులలో పైనక్రింద ప్రక్కన వ్రాసియుంచితి. నాదురూహలను దుష్టటిప్పణములను శ్రీమతిగారికి కనుపరచి దిద్దించుకొను ఆశకలదు నా పుస్తకము తిరుగ నాకు జేరగలుగునేని దాని తమ సమక్షమునకు బంప కోరికగలదు.

శ్రీరామకథ నాలంబనముజేసికొని ఈ గొప్ప కవయిత్రి అష్టాదశవర్ణనలతోటి గొప్ప కావ్యమును నిర్మించినది. ప్రబంధలక్షణములన్నియు నిందున్నవి. ఉత్తరకాండమును సాధారణముగ ననేకులు చదువరు. వనవిహార జలక్రీడాది శృంగారవర్ణనలతో దాని నీకవి రమ్యతమము జేసినది. శ్రీరామకథ శుభాంతముగాక పోవుటకీయమ యుత్తరవాదిగాదు. "రామోరామోరామ ఇతి ప్రజానామభవన్ కథాః। రామభూతం జగదభూద్రామేరాజ్యం ప్రశాసతి"యను యుద్ధకాండాంత శ్లోకముతో వాల్మీకి సంహిత ముగిసినదని కొందరి యభిప్రాయమైయున్నది.

ఈ యమనడపిన విధానముజూడగ కేవలముగ శ్రీ వాల్మీకి ప్రోక్తమునే యాశ్రయించినటుల లేదు - భేదము లనేకములగుపడుచున్నవి. నాకుతోచినవరకు నా పుస్తకమున వ్రాసితి. కొన్నిటి నిందు విన్నవించెద :—

1. రామలక్ష్మణ భరతశత్రుఘ్నులు నలుగురును ఒకేలగ్నమునబుట్టినట్లు సరస్వతీ రామాయణమను వదించుచున్నది. (బాలకాండ 21 పుట-ఈ వచనము) ప్రాచేతసుడు శ్రీరామునికి కర్కాటలగ్నమును భరతునికి మీనలగ్నమును లక్ష్మణశత్రుఘ్నులకు కుళీరమును జెప్పుచున్నారు (బాలకాండసర్గ 18). మొల్లయు నీమె వ్రాసినట్లే చెప్పినది.

2. శ్రీరామాదుల జననము ఆదివారముననని యీమె జెప్పినది. వారమును వాల్మీకి జెప్పలేదు. మొల్ల భానువారమనినది.

3. హనుమంతుడు లంకయందు రెండురాత్రులుగడపినట్లు ఈమె గ్రంథమున స్ఫురించుచున్నది. (సుందరకాండ 93 లేక 94 పుటలును) వాల్మీకి రామాయణమునుబట్టి యొక్క రాత్రియని తోచుచున్నది.

4. శుక్రాచారి ప్రశంస వాల్మీకి యుద్ధకాండమునలేదు. ఈమె యుద్ధముననున్నది (ఇదియు మొల్ల రామాయణముననున్నది) (పుట 184) ఇత్యాదులు.

అయోధ్యాపురవర్ణనము జేయుటలో నీమె బ్రహ్మ క్షత్రియ వైశ్యులమాత్రము బేర్కొని మిగిలిన వర్గమును సామాన్యముగ ప్రజాశబ్దమున జేర్చినది ఏలనో? (బాలకాండ పుట 121)

వాల్మీకి నారదమహర్షి వలన శ్రీ రామాయణకథను వినినట్లు ఆమె కాండాంతములందును ఆయా కాండల ప్రారంభముననుగలదు. అరణ్యకాండ కడభాగమున (పుట 71) 'నారదుండటమీఁది వృత్తాంతము వినఁగోరిన'యను మాటలవలన వినగోరినది నారదుడని సంశయమున కవకాశమగునట్లున్నది. ఇది యచ్చుతప్పు పొరపాటుగ నుండునేమో? మొల్లరామాయణమునకన్న నిది పెద్ద గ్రంథముగనున్నది:—

	మొల్లరామాయణము			సరస్వతీ రామాయణము
బాలకాండ	125	గద్యపద్యము		137
అయోధ్యా	40			61
అరణ్య	72			78
కిష్కింధా	35			49
సుందర	248			225
యుద్ధ ఆశ్వాసము (1)	122		యుద్ధ పూర్వభాగము	173
,, (2)	92		ఉత్తరభాగము	165
,, (3)	136			
ఉత్తర కాండ	లేదు			190
	870			1078

ఏలకో మొల్ల యుద్ధకాండమును మాత్రము మూడాశ్వాసములు జేసినది. శ్రీమతి చేబ్రోలు సరస్వతీదేవి రెండు భాగములుగా విభజించినది.

పాటలు యక్షగానములుగాక కావ్యరూపమున ముగ్గురు స్త్రీలు శ్రీరామకథను జెప్పినట్లున్నది. మొదటిది మొల్ల - ఇక మనకాలమున శ్రీమతి గుడిపూడి ఇందుమతీదేవిగారి వచనరూపమునను శ్రీమతి చేబ్రోలు సరస్వతీదేవిగారు గద్య పద్యాత్మకముగను వ్రాసిరి. మూడు గ్రంథములును ముచ్చట గొల్పుచున్నవి. వాల్మీకి రామాయణమునంతయు మనకాలమున ముగ్గురు ప్రత్యేక ప్రత్యేకముగ ఆంధ్రీకరించిరి - (1) బ్రహ్మశ్రీ గోపీనాథం వెంకటకవిగారు (2) బ్రహ్మశ్రీ ఆంధ్రవాల్మీకి వా. సు. దాసుగారు. బ్రహ్మశ్రీ కావ్యతీర్థ జనమంచి శేషాద్రిశర్మ కళాప్రపూర్ణులు. ఇట్టి రచనలుజూడ నాటికిని నేటికిని లోకప్రియుడగు మహాపురుషుడు శ్రీరాముడుగనే యున్నాడు. ఇట్టి యుత్తమపురుషుని చరిత్రమును వ్రాసి శ్రీమతి చేబ్రోలు సరస్వతీదేవి కీర్తి వహించినది. స్త్రీల విద్యాభివృద్ధికిని చాల ప్రోత్సాహకరముగ నుండగలదని సంతసించెద.

—ఒంగోలు వెంకటరంగయ్య

కమలాకరము

కర్తలు: శ్రీ వారణాసి వెంకటేశ్వరులు, శ్రీ చివుకుల ఆదినారాయణగార్లు. సాహిత్యకుటీ ప్రచురణ. సభ్యులకు పావలా, ఇతరులకు ఆరు అణాలు: చిరునామా: గొట్టిపాడు, చిలకలూరుపేటపోస్టు.

ఇందులో ఇరువురిచేత రచింపబడిన నాటికలు, పద్యాలువున్నాయి. ఇదివరలో 'గృహలక్ష్మి' మొదలైన పత్రికల్లో ప్రకటింపబడ్డవాటిని సంపుటీకరించి కమలాకరమనేపేరుతో ప్రకటింపబడ్డాయి. రచయితల రచనలలో స్వతంత్రభావాలు, సంఘంలోని తెలివితక్కువల్ని చక్కగా విమర్శించేశక్తి బాగా ప్రస్ఫుటమౌతూ వున్నాయి. ఇటువంటి గ్రంథాలే యీ గ్రంథమాలనుండి ఇంకావిరివిగా వెలువడుతాయని ఆశిస్తాము.

తిలోత్తమ

కర్త: శ్రీ చిలకమర్తి లక్ష్మీ నరశింహంగారు, రాజమండ్రి. ప్రకాశకులు: ది మాడరన్ పబ్లిషింగ్ హౌసు, మెయిన్‌రోడ్డు రాజమండ్రి. వెల రు. 0-12-0.

ఇది ఐదంకముల నాటకము, శ్రీ లక్ష్మీనరసింహంగారి కవితా నైపుణినిగురించి మేమిప్పుడు క్రొత్తగా తెలుపనక్కరలేదు. ఈ పౌరాణికనాటకంలో శ్రీ వారి రచనాప్రాభవం ఇతోధికమైంది.

ఇవేకాక, శ్రీ లక్ష్మీనరశింహంగారు మరికొన్ని సాంఘిక నాటకాలనువ్రాసి నేటి సమాజ పురోభివృద్ధికి దోహదమును కల్పిస్తారని ఆశిస్తాము.

మణిహారము

ఇది స్నేహలతాకవితాసంఘపు 66వ పువ్వు. గ్రంథకర్త: గంధం వెంకటనరసింహాచార్యులుగారు, కొల్లాపురము. ఈ కవి అందంబులగు కందంబులతో నీ మణిహారమునుగూర్చి జటప్రోలు సంస్థానము యువరాజులగు శ్రీ శ్రీ జగన్నాధరావు బహద్దరుగారికి సమర్పించి ధన్యుడైనాడు.

యోగరత్నాకరము 1, 2, భాగములు

కర్త: ఆయుర్వేదభూషణ, పండిత శ్రీ యేటూరు శ్రీనివాసాచార్యులుగారు. నెల్లూరు. ఒక్కొక్క భాగము వెల రు. 4—8—0.

సంస్కృత యోగరత్నాకరమునకు ఇది అమృతకర వ్యాఖ్యానము. సంస్కృతములోనున్న యీ గ్రంధము విద్యాధికులకేగాని ఉపయోగపడదు. కాని శ్రీ ఆచార్యులవారి యీ కృషిఫలితముగ యీ తెలుగు వ్యాఖ్యానము అందరి యొక్క అందుబాటులోనుండగలదు. ఆయుర్వేదము అంతయు సంస్కృత భాషలో నుండుటవలన అది అందరికి తెలియక, సరిగ ఉపయోగకారికాక నిల్చిపోయినది. కాని ఇటు వంటి వ్యాఖ్యానము ఆయుర్వేదవైద్యాభివృద్ధికి ఎంతయు సహకారికాగలదు. ఇందుకు ఆచార్యులవారు ఎంతయు అభినందనీయులు. రెండు భాగములనుకలిసి సుమారు వేయిపుటలకుమించిన యీ గ్రంధము ప్రతివైద్యునివద్దను యుండదగినది.

ప త్రి కా ప రి చ యం

మాతృభూమి (సచిత్ర మాసపత్రిక)

సంపాదకులు క. సుబ్బారావుగారు, 143 వెంకటాచల మొదలివీధి, రాయపేట, మదరాసు. విడిసంచిక ఒకఅణా.

పత్రికచాలా అందంగావుంది. వివిధములైన వ్యాసాలతోటి, చక్కని కథలతోటి చూడ ముచ్చటగా వుంది. ముఖ్యముగా 'బట్టలు కట్టుకోవడం మానవజాతికి నేర్పినదెవరు' 'మనదేశంలో ఎక్కువగా పండే పత్తి పేరేమిటి' మొదలైన విజ్ఞాన ప్రబోధకరమైన విషయాలు దీనిలో చాలావున్నాయి. ఎక్కువపేజీలు కలిగిన యీ పత్రిక విడి ప్రతి అణాగా నిర్ణయించి, అందరికి అందుబాటుగా వుండేటట్టు చేసిన సంపాదకుల ప్రయత్నం ప్రశంసార్హము.

నాట్యకళ

సంపాదకులు శ్రీ కొత్తపల్లి లక్ష్మయ్యగారు. వి. పి. హాలు, మద్రాసు. సాలుచందా సర్వకర్చ రుసుముతో సహా రు. 3. విడి సంచిక పావలా. పోస్టేజీ అణాన్నర ప్రత్యేకం.

వెనుక 3, 4 సంచికల వరకువచ్చి ఆగిపోయి, యిప్పుడు పునరుద్ధరింపబడింది. జీవస్ఫులింగాలు గోల్పోతూవున్న ఆంధ్ర నాట్యరంగాన్ని సంస్కరించి జాత్యౌన్నత్యానికి పాటుపడాలంటే యీ పత్రికను పోషించడం ఎంతయో అవసరము. వెనుకటివలెనే ఆంధ్ర మహాశయులు తమతమ ఆదరణను విరివిగా అందిస్తారని ఆశిస్తాము. విఖ్యాత రచనలతోటి, చక్కని చిత్రాలతోటి పత్రిక చాలా అందంగావుంది.

చిత్రాంగి—క్రిస్మస్ సంచిక

ప్రఖ్యాత పత్రికా నిర్వాహకులు శ్రీ యస్. జి. ఆచార్యగారి సంపాదకత్వాన విజయయాత్ర చేస్తూవున్న సచిత్ర మాసపత్రిక 'చిత్రాంగి' క్రిస్మస్ 'వేడుకల వారం'లో ఆంధ్ర మహాశయులకు వేడుక గూర్చడానికిగాను ప్రత్యేక సంచికగా వెలువడింది. మామూలు ఆకారంలో అత్యధికమైన పుటలతో, చక్కని ముఖచిత్రంతో 'చిత్రాంగి' చిత్రవిచిత్రంగా వుంది.

చిత్రాంగి పత్రిక పుటలను, ఎవరెవరిమీద వ్యంగ్యవిమర్శన విసురులున్నాయో అనే గుండె దడతోటే తిరగవేస్తారు. అయితే ఆభయం, అభిమాన పురస్సరమైన భక్తితోటేవుంటుంది గనుక, చిత్రాంగి పాఠకుల హృదయాలలో స్థిరస్థానం సంపాదించుకుంది.

ఈ సంచికలో వ్యంగ్య శీర్షికలు, చిత్రాలు, వ్యాసాలు ఇంకా ఎక్కువగా వుండడంవల్ల యీ అభిమానం ఇతోధికమై కావలసినంత ఉత్సాహాన్ని రేకెత్తిస్తుంది.

వన్నె విన్నాణాలతో ఇంత చక్కగా అలంకరించి చిత్రాంగిని కిస్మస్ వేడుక ఉపాయనంగా అణాఖరీదుకే సమర్పించిన శ్రీ ఆచార్యగారు అభినందనీయులు. చెల్లిలి పండుగ ముస్తాబు చూచి మురిసి, 'గృహలక్ష్మి' ఆశీర్వాదాల్ని అందజేస్తూవుంది.

సంక్రాంతి

శ్రీ అయ్యగారి విశ్వేశ్వరరావు

పచ్చపచ్చని తోరణపంక్తు లెన్నో ద్వార బంధాలవెంట సొంపలరనుండ
రంగవల్లికలెల్ల హరింగునాప వచ్చె సంక్రాంతి, ప్రమదమ్ము పంచిపెట్ట!

ప్రణయపూజలనందు దేవాలయమ్ము వసుధనల్లుండ్ర పాలిటి భాగ్యరాశి
'వలపు' పాఠముబోధించు పంతులమ్మ ప్రేమజీవుల గాంచెడి ప్రియవచస్వి!

ముద్దరాలైన నెచ్చెలి, మోమువంచి 'సిగ్గు' సింహాసనాన నాసీనగాగ
అత్తమామల కానందమతిశయిల్ల అల్లుడయ్యను దెచ్చు, నీయాప్తురాలు!

బావగారిని పరిహాస వాక్యతతికి గురిగజేసిన మఱదళ్ల గొప్పతనము
వరునిజూడఁగ వధువులు పడెడిపాట్లు ముద్దుసంక్రాంతియేగదా! మూటగట్టు!

యుద్ధరంగము

★ ఫ్రాన్సు వ్యతిరేకము ★ హిట్లరు విషమస్థితి

★ అమెరికా పాల్గొనునా? ★ జపాన్ బెదరింపు

— అరుంధతి —

మధ్యధరా సముద్రాధిపత్యముకొరకై ముసోలిని గావించుచున్న ద్వంధయుద్ధములో గత మాసమునందు సంపూర్ణ పరాజితుడు గావలసివచ్చినది. గ్రీసు యుద్ధములో ఇటాలియను సైన్యములు తరుమబడుటయేగాని ఆక్రమించిన దింతవరకును ఏమియు లేదు. ఇటు ఈజిప్టురంగమున గ్రేజియానీ నాయకత్వముక్రింద ఇటలీ సైన్యములు 60 మైళ్లు లిబియా సరిహద్దులదాటి ముందుకు చొరుచుకొనిపోయి సిడిబరానీని ఆక్రమించినవి. కాని బ్రిటిషు సైన్యములు ఆకస్మికముగ పైబడి 50 వేల ఇటాలియను సైన్యములను ఖైదీలుగా గొనుటయేగాక వారి ఆయుధ పరికరములన్నిటిని చేజిక్కించుకొన్నవి.

ఆ యీ పరాజయములవలన ఇటలీ ప్రజలలో తీవ్ర అలజడికలిగి ప్రభుత్వముపై తిరుగుబాటు కలుగు సూచనలు గాన్పించుటచే ప్రధానసేనాని బడాగ్లియోను తొలగించి, గ్రేజియానీని నియమింపవలసివచ్చెను. ఈ మార్పు జరిగినను పరాజయములు ప్రబలముగ నుండుటచే జర్మనీ ఇటలీకి సహాయపడవలసివచ్చుట తప్పని సరియైనది.

★ ఫ్రాన్సు వ్యతిరేకము

ఫ్రాన్సునందుగూడ హిట్లరు కనుకూలమగు పరిస్థితులు కన్పించుటలేదు. వీలైనచో పెటియన్ ప్రభుత్వమును ఇంగ్లండుపై యుద్ధమునకు దింపుటకుగాని, లేనిచో ఫ్రెంచి నౌకాబలమును తనవశ మొనర్చుకొనుటకుగాని హిట్లరు ప్రయత్నించుచున్నాడు. ఇందుకు వ్యతిరేకమగుటచే లావల్‌ను పదవినుండి పెటియిన్ సేనాని తొలగించుటయేగాక అతనిని అరెస్టుగూడ చేయించెను. కాని జర్మను రాయబారివలన అతడు విడుదల చేయబడినాడు. లావెల్ స్థానమున క్రొత్తగ నియమింపబడిన ఫ్లాండెన్‌కూడ జర్మనీకి అనుకూలుడు. ఈయదనునుగైకొని ఫ్రెంచి యుద్ధ నౌకాదళమును, వర్తకనావలను, ట్రూలన్ మొదలగు మధ్యధరా రేవులను జర్మనీ స్వాధీన మొనర్పవలసినదిగా పెటియను ప్రభుత్వమునకు జర్మనీ షరతులను పంపెను. దానిపై రెండురోజులు తీవ్ర చర్చలు సాగించి, పెటియను ప్రభుత్వము జర్మనీకోర్కెలను మన్నింప నసాధ్యమని తెలియజేసినది. దీనిపై జర్మనీ ఫ్రాన్సుతో ఎట్టిచర్యకు దిగునో చూడవలసియున్నది.

★ అమెరికా పాల్గొనునా ?

ఇది ఇటులుండ అమెరికాకు రూజువెల్టు అధ్యక్షుడుగ ఎన్నుకొనబడిన తర్వాత అమెరికా ఇంగ్లండు వ్యవహారములలో అమితమైన మార్పుకలిగినది. వెనుకటి యుద్ధమువలెనే అప్పుగా గాక—బ్రిటనుకు ఆయుధములను, నౌకాబలమును ఎరువుగా ఇచ్చుటకును, యుద్ధానంతరము వాటిని తిరిగి అమెరికాకు ఇచ్చివేయునట్లును, యుద్ధములో శిథిలమైనవాటి ఖరీదు చెల్లించుటకును అమెరికా నిశ్చయించినది. అదియునుగాక, అమెరికా రేవులలో పరాజిత, ఆక్సిసురాజ్యముల నౌకాబలమునుగూడ స్వాధీనముజేసికొని వాటినిగూడ బ్రిటనుకు

ఇచ్చునట్లుగూడ రూజువెల్టు సభాపతి ప్రకటించినాడు. ఇది జనవరి 3వ తారీఖున సమావేశముకానున్న యునైటెడ్ స్టేట్సు కాంగ్రెసువారు ఆమోదించవలసియున్నది.

ఇది జర్మనీ-ఇటలీ-జపాన్ (ఆక్సిసు రాజ్యములు)లకు అమిత ఆగ్రహమును కలుగజేసినది. కారణము: తటస్థరాజ్యములు యే రాజ్యమునకైనను ఆయుధములను విక్రయించవచ్చును. కాని అమెరికాయొక్క యీ పద్ధతి అట్లుకాదు. ఎరువు ఇచ్చుటవలన-ప్రత్యక్షముగ సైన్యముతో గాకపోయినను, ఆయుధముల రూపముననైనను బ్రిటనువైపు చేరుచున్నట్లు కన్పించుచున్నది—అదియునుగాక, ఆక్సిసు రాజ్యముల నౌకలను, ఆక్రమిత రాజ్యముల నౌకలను స్వాధీనపరచుకొని బ్రిటనుకు ఇచ్చుటవలన, బ్రిటనుతో అమెరికాచేరినట్లుగనే భావించి ఆక్సిసురాజ్యములు ప్రతిక్రియ చేయుటకు ప్రయత్నించును.

ఇది ఇట్లుండ అమెరికా బ్రిటను తరఫున కాకపోయినను, ఆత్మరక్షణ నిమిత్తమైనను యుద్ధములో దిగక తప్పదు. బ్రిటను ఓడిపోయిన ఆక్సిసు రాజ్యముల పలుకుబడి హెచ్చిపోవును. అప్పుడు ఆక్సిసు రాజ్యములు దక్షిణ అమెరికాపై బయలుదేరును. హిట్లరుయొక్క నూతన రాజ్యవ్యవస్థ ప్రకారము జర్మన్ రిక్, మార్కులతోను, బార్టరు పద్ధతితోను వాణిజ్య వ్యాపారము జరుగును. అప్పుడు అమెరికా ఇంతకాలము నుండియు వాణిజ్యములో ఆక్రమించుకొనిన ప్రధానస్థానము పోవుటయే గాక, తాను ఇంతకాలమునుండియు కూడబెట్టిన బంగారుయొక్క విలువగూడ యుండదు. అందుకొరకై యూరప్ ఖండములో పెద్దరాజ్యమైన ఇంగ్లండుయొక్క రక్షణమే అమెరికాయొక్క బలము. ఇది తారుమారు కాకుండుటకై అమెరికా యుద్ధములో దిగవలసివచ్చును.

★ హిట్లరు విషమస్థితి

కాని అమెరికా యుద్ధమున ప్రవేశింపకమునుపే యుద్ధమును పూర్తిచేయవలెనని ఆశించిన హిట్లరు అమెరికాయొక్క వైఖరినిగూర్చి విషమపరిస్థితిలో దగుల్కొన్నాడు. ఇటు మధ్యధరాసముద్రమును ఇటలీకి వదలి, బ్రిటనుపై దాడులు సల్పుచు, యూరపుఖండములో తన పలుకుబడిని వృద్ధిచేసికొనదలచినాడు. కాని ఇటలీయొక్క పరాజయములు హిట్లరు ఆశలను కృంగదీసినవి. ఇటలీని పరాజయ పరంపరనుండి తప్పించుటకు గాను హిట్లరు జర్మను సైన్యములను ఇటలీకి సహాయార్థము పంపెనని వార్తలు దెల్పుచున్నవి. కాని యీ సైన్యములు అల్బేనియా రంగమునుగాని, లిబియా రంగమునుగాని ఇంకను చేరినట్లు గాన్పింపదు. ఒకవేళ చేరినను పరిస్థితులను అనుకూలమొనర్చుకొనుటకు చాలకాలము పట్టును.

జర్మను సైన్యము లిట్లు ఇటలీ సహాయార్థ మేగియున్న బ్రిటనుపై జర్మనుదాడి కొంతవరకు నిలుపబడినదని చెప్పవచ్చును. కాని బ్రిటను యీ వార్తలను విశ్వసించుటలేదు. అందులకే మొన్న చర్చిల్ ప్రధాని దాడి భయము తీరెనని అప్రమత్తతో నుండరాదని హెచ్చరించియున్నాడు. ఇప్పుడు హిట్లరు వైఖరి ఎట్లు మారునో దురవగాహముగ నున్నది.

★ జపాన్ బెదరింపు

యూరోపా రాజకీయములలో కాన్పించుచున్న సందిగ్ధస్థితియే ఇటు దూరప్రాచ్యములోకూడ కన్పించుచున్నది. జపాను విదేశాంగమంత్రి మట్సు-ఓ-కా అమెరికా జర్మనీతో యుద్ధమునకు తలపడినయడల జపాను జర్మనీ తరపున దిగవలసివచ్చునని బహిరంగముగా తెల్పియున్నాడు. సోవియట్ రష్యాతో జపాను వ్యవహారములు చక్కబడలేదు. అట్టి తరుణములో ఇంతకాలమునుండియు సహాయము చేయుచు, జంగ్-కై-షేక్ ప్రభుత్వమును జపానుకు వదిలివేసి, అమెరికా, రష్యా, ఇంగ్లండులు ఊరకొనవలసిన అవసరము లేదు. అమెరికా గాని, ఇంగ్లండుగాని జపాను బెదరింపులకు లొంగి చైనాను వదిలివేయునను మాట కలలోని వార్త.

(28.12.40)

సంపాదకీయములు

నైజాములో బాల్యవివాహ శాసనము

నైజాము సంస్థానమందు అతి బాల్య వివాహముల నిరోధించుటకై సంస్థాన శాసనసభయందు కొనితేబడిన బిల్లు త్రోసివేయబడినది—

బ్రిటిషు భారతదేశమందు అమలులోనున్న శారదాచట్టమువలెనే—అట్టి పద్ధతుల మీదనే—యీ బిల్లు మొట్టమొదట ప్రవేశపెట్టబడినది. కాని ప్రజాభిప్రాయమునకై యీ బిల్లును ప్రకటించి, తదనంతరము, చర్చకు లోనైన తర్వాత, ప్రజాభిప్రాయము యిందుకు వ్యతిరేకముగ నున్నట్లు ప్రకటింపబడినది.

బిల్లును ప్రతిపాదించిన శ్రీ నరసింగరావుగారు, బాలికల వయస్సు 11గను బాలుర వయస్సు 16గను నిర్ణయించుట కంగీకరించినను ప్రయోజనము లేకపోయినది. హిందూసంఘము నుండియే అత్యధికమగు అసమ్మతి వచ్చినటుల ప్రకటింప బడినది. ఇది మొదటినుండియు తలచబడినదైనను శాసనసభలో అత్యధిక సంఖ్యాకుల సానుభూతిని పొందగలదని యాశించితిమి. కాని శెలక్టు కమిటీలోని ముగ్గురు మహమ్మదీయ సభ్యులు యిందుకు వ్యతిరేకముగ నుండుటవలన బిల్లు ఆదరణ నొందజాలక పోయినది.

మత సంబంధమైన వ్యవహారములయందు ప్రజానుమతికి వ్యతిరేకముగ ప్రభుత్వము వ్యవహరింప జాలదు. ఇది సర్వజన సమ్మతమగు విషయమే. ఐనను యీ బిల్లు విషయమున—ఇది కేవలము హిందూసంఘము లోని ప్రబల దురాచారమును మాన్పుటకు హిందువుల కొక్కరికొరకే నిర్దేశింపబడినప్పుడు—మహమ్మదీయ సభ్యులు సుముఖులుగ లేకపోవుట ఆశ్చర్యకరముగ నున్నది.

శారదాచట్టమువలె వివాహితులగు బాలబాలికల వయస్సు ఎక్కువగగాక 16, 11 సంవత్సరములు తక్కువగ నంగీకరించియున్నప్పటికిని యీ చట్టము శాసనసభామోదమును పొందజాలక పోయినది. ఇంతటి వ్యతిరేకాభిప్రాయము హిందూ సంఘమునందున్నప్పుడు ఈ బిల్లు ప్రభుత్వముచే నామోదింపబడినను ప్రయోజనకారి కాజాలదు.

నిర్బంధ చట్ట ప్రయోగమువలన నైతిక పరివర్తనము కలుగదు. నైజ భక్తి ప్రేమలులేని సంస్కరణ సఫలత నొందనేరదు—

ఇందుకొరకై శ్రీ నరసింగరావు ప్రభృతులు తీవ్ర ప్రచారము మండలముయందు జరుపవలసియున్నది. ప్రజలు యీ యాచారమువలన కలుగుచున్న యనర్థములను తెలిసికొని వారిలో పరివర్తన ముదయించునట్లు జేసిన యీ శాసనము మరియొక పర్యాయమైనను ఆమోదింపబడగలదు.

సాంఘిక సంస్కరణలలో ప్రప్రథమమగు నిది భారతదేశమంతటను, ప్రతి సంస్థానమునందును అంగీకరింపబడుచున్నది. ఇదియేగాక, బ్రిటిషు భారతదేశముకంటె ఎన్నియో సంస్కరణలు స్వదేశ సంస్థానముల

యందు జరుగుచున్నవి. ఇట్టి విషయములయందు వెనుకబడియున్నదనెడి కొచ్చిన్ సంస్థానమునందు యీ బాల్యవివాహ నిషేధ శాసనము ఇటీవలనే అంగీకరింపబడిన దన, భారతదేశము సంస్కరణోద్యమమునకు ఎంత సుముఖమైయున్నదో వేరుగ జెప్ప నవసరములేదు.

అట్టి పరిస్థితులయందు, స్వదేశ సంస్థానములలోకెల్ల పెద్దదియైన నైజాము సంస్థానము యీ విషయమందు చిన్నది కాగలుగుట హర్షింపదగిన విషయముగాదు.

ఈ విషయముపై ఇకనైనను ప్రజలును, ప్రభుత్వమును తీవ్ర ప్రయత్నము లొనర్తురుగాక యని యాసించెదము.

◆ ◆ ◆ ◆

మహాత్ముని ధర్మయుద్ధము

క్రిస్టమస్ పర్వదినములలో సత్యాగ్రహసమరమును నిలుపవలసినదిగా వివిధకాంగ్రెసు సంఘములకు మహాత్ముని యాదేశమైనది.

శాంతియుతముగా సాగిపోవుచున్న యీ సత్యాగ్రహమును అవుచేయుటయందలి పవిత్రాశయ మొకసారి ప్రపంచమునకు వెల్లడియైనది.

ఇది సత్యసమరము. దీనికి ప్రేమ ప్రధానము. శాంతి ఆశయము. అహింస ఆయుధము. విశ్వమానవ సౌభ్రాతృత్వమే దీని లక్ష్యము. దౌర్జన్యరహిత సూత్రము నాధారముచేసికొనిన దగుటచే దీనికి త్యాగమవసరమై యున్నది.

ఏసు ప్రవక్త జీవితాశయములుకూడ నివియే— ఈ ఆశయముల పరిపూర్తికొరకే ఆయన ఆత్మార్పణ చేసియున్నాడు. మహాత్ముడు జన్మచే హైందవుడయ్యును, సర్వమతములయందలి సారమును సంగ్రహించిన సర్వజ్ఞుడు. ఆయన మతములకును, మానవులకును అతీతుడు. అజాతశత్రుడు, అహింసానిరతుడు. విశ్వమానవ సౌభ్రాతృత్వమును స్థాపించు ఆతని శాంతి సమరములో, విశ్వమానవ సౌభ్రాతృత్వముకొరకై యాత్మబలిదాన మొనగిన క్రైస్తుదేవుని సంస్మరణముకొరకై యీ పర్వదినములలో సమరము నాపుట పవిత్ర ధర్మమైయున్నది.

బ్రిటనుపై తన కేమాత్రము ద్వేషభావము లేదనియు, ప్రస్తుత యుద్ధదావానలమున దగుల్కొని స్వాతంత్ర్య జపముచేయుచున్న ఇంగ్లండుకు ఎట్టి చిక్కును గల్పించుట తన యభిమతముగాదనియు మహాత్ముడు ఎన్నియో సారులు తెల్పియున్నాడు.

ఈ పవిత్రభావమును సర్వ ప్రపంచమున చాటుటకే మహాత్ముడీ నిర్ణయమును చేసియున్నాడు. ప్రాచ్య, పాశ్చాత్యదేశములు, అందును క్రైస్తవ ప్రపంచము మహాత్ముని యీ ధర్మసూత్రమును యీ సరికి గ్రహించి యుండును.

క్రైస్తవ ధర్మరక్షణకొరకై యుద్ధ మొనర్చుచున్న బ్రిటిషురాజ్యాంగవేత్తలు ధర్మయుద్ధగామియైన భారతదేశమునెడల తమ దృష్టి యిప్పటికైన మార్చుకొందురా?

Edited by Dr. K. N. Kesari, Printed and Published by Dr. S. Seshagiri Rao, at the Lodhra Press, 15, Westcott Road, Royapettah, Madras.

విక్రమనామ సంవత్సర — పుష్య - మాఘమాసములు

1941-వ సం॥ ఫిబ్రవరి నెల

1	శ	పం రా 10.33 ఉభా సా 4.56 తె వ 6.27 ల
2	ఆ	ష రా 1.13 రేవ రా 7.57 శేవ 8.15 క
3	సో	స రా 3.55 అశ్వి రా 11.4 సా వ 6.33 ల 8.21 క రథసప్తమి
4	మం	అ తె 6.24 భర రా 2.4 ప వ 9.52 ల 11.40 క
5	బు	న 24.0 కృ తె 4.37 ప వ 3.21 ల 5.7 క వైధృతపాత సా 4.1 ల తె 4.59 క
6	గు	న ప 8.25 రో 24.0 రా వ 9.55 ల 11.39 క
7	శు	ద ప 9.46 రో ఉ 6.34 ప వ 12.28 ల 2.9 క
8	శ	ఏ ప 10.24 మృ ప 7.51 సా వ 4.26 ల 6.4 క మత్రయ 11 శీ భీష్మ 11 శీ
9	ఆ	ద్వా ప 10.15 ఆర్ద్రి ప 8.22 రా వ 8.16 ల 9.51 క
10	సో	త్ర ప 9.23 పున ప 8.11 ప వ 3.55 ల 5.28 క
11	మం	చతు ప7.54 ○ పూర్ణి తె5.53 పుష్య ఉ7.23 ఆశ్రే తె6.4 రా వ 7.29 ల 9.0క
12	బు	పా రా3.31 మఘ తె4.23 సా వ 5.14 ల 6.43క కుంభసంక్రమణ ప్ర॥ ప 8.22
13	గు	వి రా 12.55 పూఫ రా 2.31 ప వ 11.45 ల 1.13 క
14	శు	త రా 10.15 ఉఫ రా 12.33 ప వ 9.7 ల 10.35 క
15	శ	చ రా 7.35 హ రా 10.37 ప వ 8.16 ల 10.40 క తె వ 6.1 ల
16	ఆ	పం సా 5.1 చిత్త రా 8.48 శేవ 7.30క రా వ 2.2 ల 3.32 క పంచమి తిథి
17	సో	ష ప 2.41 స్వా సా 7.12 రా వ 12.29 ల 2.0 క తిథిద్వయం
18	మం	స 12.33 విశా సా 5.51 రా వ 9.41 ల 11.13 క అష్టమితిథి
19	బు	అ 10.45 అనూ సా 4.49 రా వ 10.15 ల 11.48 క
20	గు	న ప 9.15 జ్యే ప 4.5 రా వ 11.58 ల 1.32 క
21	శు	ద ప 8.8 మూ ప 3.43 ప వ 2.9 ల 3.43 రా వ 1.20 ల 2.56 క
22	శ	ఏ ఉ 7.22 పూషా ప 3.44 రా వ 11.52 ల 1.30 క మత్రయ 11 శీ
23	ఆ	ద్వా ఉ 7.0 ఉషా ప 4.8 రా వ 8.16 ల 9.55 క
24	సో	త్ర ఉ 7.3 శ్ర సా 4.57 రా వ 9.9 ల 10.56 క మహాశివరాత్రి
25	మం	చతు ఉ 7.33 ధని సా 6.13 రా వ 1.56 ల 3.39 క
26	బు	● అమా ఉ 8.33 శత రా 7.58 రా వ 2.57 ల 4.42 క
27	గు	పా ప 10.2 పూభా రా 10.8 వర్జ్యము లేదు
28	శు	వి ప 11.55 ఉభా రా 12.45 ప వ 8.47 ల 10.33 క తదియ తిథి

ముఖ్య పండుగలు

3. రథసప్తమి. 8. భీష్మఏకాదశి. 11. మహామాఘము. 24. మహాశివరాత్రి.

విషయసూచిక

1. మధుపాత్ర—శ్రీమతి స్థానపతి రుక్మిణమ్మ ... 737
2. తెలుగు వెలుగు—కవికలహంసి శ్రీమతి చేబ్రోలు సరస్వతీదేవి ... 738
3. నక్షత్ర ఫలితాలు " " ... 741
4. స్త్రీ సాముద్రిక శాస్త్రము " " ... 742
5. చెన్నపురి ఆంధ్రమహాసభ - స్త్రీలశాఖ—సంక్రాంతి మహోత్సవములు 743
6. ప్రావృట్కన్య—శ్రీ యార్లగడ్డ వేంకటసుబ్బారావు ... 744
7. రాజమకుటం—శ్రీ పురాణం కుమారరాఘవశాస్త్రి ... 745
8. చెల్లికి—శ్రీ కర్లపాలెం కృష్ణారావు ... 752
9. హిందూమతం - అహింస—శ్రీ ఆకుండి వెంకటేశ్వరరావు ... 753
10. వింతవింతల ప్రపంచం ... 759
11. దైవసంఘటన—శ్రీమతి వెలిదండ చూడికుడుతమ్మ ... 760
12. కళాకలాపము-కళవల్ల ప్రయోజనం—శ్రీమతి కొమ్మూరి పద్మావతీదేవి 765
13. తిక్కనా!—శ్రీ ఆ. సీతారాముడు ... 766
14. భావతరంగిణి ... 767
15. నా సీత—శ్రీ "పంతుల" ... 768
16 దేవదాసి—శ్రీ ఎచ్చెర్ల జయప్రసాదరావు ... 770
17. కఠిన హృదయాలు—శ్రీ వై. రామమూర్తి ... 772
18. బాలభాగ్యోదయము—ఆర్యావర్తము—పిన్ని ఉత్తరాలు ... 773
19. గృహలక్ష్మి తొక్కు పల్కులు—శ్రీమతి పిళ్లా పాపమ్మ ... 774
20. మానవతి—శ్రీమతి పులిపాక బాలాత్రిపురసుందరమ్మ ... 775
21. భారతీయనారి—శ్రీ స్వామి వివేకానంద ... 778
22. మనదేశం—శ్రీ పిల్లలమర్రి వేంకట హనుమంతరావు ... 780
23. గొప్పింటి బిడ్డ—శ్రీ నెల్లూరి కేశవస్వామి ... 781
24. పల్లెటూళ్లు-వాటి ప్రస్తుత దౌర్భాగ్యస్థితి—శ్రీమతి గోపరాజు సీతాదేవి ... 786
25. సీత మహాసాధ్వి—శ్రీమతి ఆచంట సత్యవతమ్మ ... 787
26. —శ్రీ నాదెళ్ళ రామకృష్ణశాస్త్రి ... 790
27. చలనచిత్రాలు ... 791
28. పుష్పచయము ... 794
29. పాకకళ ... 796
30. గ్రంథసమీక్ష ... 798
31. యుద్ధరంగము 'అరుంధతి' ... 800
32. పత్రికాపరిచయము ... 801
33. సంపాదకీయములు

త్రివర్ణచిత్రము: శ్రీమతి కుమారి

గృహలక్ష్మి

జయంతి మహోత్సవము

గృహలక్ష్మి స్వర్ణకంకణ బహూకరణోత్సవము

“సంఘసేవాధురీణ” బిరుదాంకితురాలును, రాజమండ్రి ఆంధ్రయువతీ సంస్కృత కళాశాల ప్రిన్సిపాలును అయిన ‘ఉభయభాషాప్రవీణ’ శ్రీమతి బత్తుల కామాక్షమ్మగారి పేరు ఆంధ్రదేశ విఖ్యాతము. దేశ, సంఘసేవలయందే గాక, ప్రత్యేకముగ స్త్రీ లోకమున కీయమ చేయుచున్న అపార మగు సేవ కీమెను సత్కరించుట ఆంధ్రుల ధర్మమని యెంచి, యీ సంవత్సరము వీరికి ‘గృహలక్ష్మి స్వర్ణ కంకణము’ను సమర్పింపదలచితిమి.

ఈ కంకణ బహూకరణోత్సవము మదరాసు, రాయపేట యందున్న గృహలక్ష్మి స్వగృహమగు కేసరికుటీర మందు మార్చి 1 తేది 1941, శనివారము రోజున, గృహలక్ష్మి జయంతి మహోత్సవ సందర్భమున జరుపదలచితిమి. ఈ కంకణము గృహలక్ష్మి పాఠకుల తరఫున సమర్పింప బడును గాన పాఠకులు, అభిమానులెల్లరు విచ్చేసి, ఈ మహోత్సవమును జయప్రదమొనర్ప ప్రార్థితులు.

ఇట్లు

కె. యన్. కేసరి,

‘గృహలక్ష్మి’ సంపాదకుడు.

కార్యక్రమము

1. గ్రూప్ ఫోటో
2. ప్రార్థన
3. ప్రారంభోపన్యాసము, కంకణ గ్రహీతను సభకు పరిచయపరచుట:

   శ్రీమతి దుర్గాబాయమ్మగారు
4. అధ్యక్షోపన్యాసము
5. ఉపన్యాసములు
6. సందేశములు
7. కంకణ ప్రదానము
8. కంకణగ్రహీత కృతజ్ఞత
9. సంగీతము, నృత్యము:

   చెన్నపురి ఆంధ్ర మహాసభ – స్త్రీలశాఖ బాలికలు
10. మంగళము



శ్రీమతి కుమారి ★ వాహినీవారి "సుమంగళి"లో నాగరీకవనిత సరస్వతిగా నటించిన యీమె వాహినీవారి మూడవ చిత్రము "దేవత"లో పల్లెటూరి పడుచు లక్ష్మిగా నటిస్తూ ఉంది. ఈ చిత్రములో ఈమె నటనాప్రౌఢి తారాపథాన్ని అందుకొంటుందని ఆశిస్తున్నారు.

జయజయ గృహలక్ష్మి సఖి! జయజయ లలితాంధ్ర మధుర సారస్వతమా!
జయజయ 'లలనారత్నమ! జయజయ విద్యాప్రబోధ! జయకల్యాణీ!

మధుపాత్ర

మహిత హేమంతశర్వరీ మధ్య జగతి, నిబిడ నిద్రాభి ముద్రిత నేత్రమయ్యె
మందుఁడై యేగుచున్నాఁడు చందమామ, అరయుమో ప్రియా! జ్యోత్స్నవిహాయసమ్ము

*　　*　　*　　*

పసిడి జిలుగుల రతనాల పాత్రనిండ, బోసితే తెమ్ము మధుర ద్రాక్షాసవమ్ము
రాలిపోవును ఈ శరీరాల మరచి, తనివితీరంగ నేకమై త్రాగుదాము—
త్రాగి - ప్రణయరాహస్య గీతాల వలపు, తేటవెన్నెల జీవంపు బాటనిలిచి
చలువతెమ్మెర కెరటాలఁ గళము కలిపి, పాడిపోదము భువనముల్ పల్లవింప.

—స్థానాపతి రుక్మిణమ్మ.

తెలుగు వెలుగు

శ్రీమతి చేబ్రోలు సరస్వతీదేవి

మన హిందూ మతాచారానుసారముగా మాతృస్థాన మతియుత్కృష్టమైనది. భారత, భాగవత, రామాయణాది గ్రంథములందును మాతృస్థానముయొక్క గొప్ప వేయివిధముల వాకొనబడియె.

ఇట్టి సర్వోత్కృష్టమగు మాతృదేవతకు తర్వాత మన మాతృభాష. మన తల్లియందెట్టి ప్రేమభక్తి ఆదరములు గలవో మనకు మన తల్లిభాషయందును అట్టిదే యుండితీరవలె. మన ఆంధ్రులలో స్వభాషయనుటతోడనే 'తన పెరటి చెట్టుమందు' వలె చులకనగా చూచేవారిక్కాలమున పెక్కుమందియున్నారు. స్వభాషను నిరసించినవారు దిక్కులేని యనాథపిల్లల కెట్లు విలువయుండదో ఆలాగే వారివారి స్వధర్మములను తిరస్కరించువారు ఇతరుల తిరస్కారములకు పాత్రులగుచుందురు.

వారి నెవ్వరు లక్ష్యపెట్టరు. అట్టివారికొక నియమమనేది యుండదు. వారెల్లప్పుడు ఇతర భాషల మీది భ్రమచేత అంధులై స్వభాషలోనున్న స్వారస్యమును, లాలిత్యమును కనుగొనలేరు. నిజము చెప్పవలెనంటే మాతృభాషలో కృషిసల్పినవారు ఇతర భాషలలోగల గొప్పతనమును, అందచందములను సులభముగా తెలిసికోగలరు. ఒక్కభాషలో పాండిత్యము సంపాదించినయెడల చాలా భాషల్లో విజ్ఞానము సంపాదించగలరు. ఆంధ్రుడై పుట్టినతరువాత ఆంధ్రభాషలోని గురుగౌరవములను తరచి దాని సౌరభమును ఆఘ్రాణించు శక్తిని బడయని అదృష్టహీనులనేమని చెప్పవలయునో తెలియకున్నది.

స్వతస్సిద్ధమైన మాధుర్యాతిరేకముగల ప్రపంచభాషలో మన తెలుగొకటి. ఆర్యసంపర్కముగాని సంస్కృతసంపర్కముగాని యెరుంగక పూర్వమే ఆంధ్రము ద్రవిడభాషలలో ఒక్కటియై తనరారినది. ఆంధ్రవాణి అన్యభాషలనుకూడ తనలో నిముడ్చుకొన్నది. మన తెలుగుభాష పైశాచిక భాషలోనుంచి పుట్టినదని మన భాషాచరిత్ర దెలుపుచున్నది.

అందచందములకుగాని, హావభావములకుగాని, సుధామాధుర్యములకుగాని, వన్నెచిన్నెలకుగాని ద్రవిడభాషలలో దేనికిగాని మన తెలుగువాణి తీసిపోని ఒయ్యారముతో నిగ్గులు గూర్చుచున్నది. కావుననే "దేశభాషలందు తెలుగులెస్స" అని కృష్ణదేవరాయలు వచించినాడు. 'Telugu is the Italian of the East' అని పాశ్చాత్యులే మన తెనుగువాణిని ప్రశంసించియున్నారంటే దాని తియ్యందనమును వేరే చెప్పవలయునా?

అదేమి ప్రారబ్దమోగాని మన ఆంధ్రులు తమకున్న గౌరవశక్తి సామర్థ్యములను ఇతరులు కనిపెట్టి చూపించేదాక గుర్తించలేరు. అది మనకొక పెద్దలోపము. అందుచేతనే మనలో ఎన్నిసంస్థలు పుట్టినను నామమాత్రావశిష్టములై పోవుచున్నవి.

అరవలలో చూడండి! వారి తల్లిభాష కెంత గౌరవమిచ్చి ఆదరించుచున్నారో! వారెన్ని దేశములు తిరిగినను, ఎన్నెన్నిభాషలు నేర్చుకొన్నను తమ తల్లిభాషను మరచిపోరు. అంతేకాదు వారువెళ్ళిన స్థలములలో వారి మాతృభాషను వ్యాపింపజేయడమేగాక అక్కడక్కడ "దక్షిణ ఇండియా సంఘ"మని ఒక సంఘమును స్థాపించి తమ ప్రతిభాప్రాభవములను నిలబెట్టుకొనుచున్నారు.

కాబట్టియేగదా హిందీ రాష్ట్రభాషగా చేయవలెనంటే ఇయ్యకొనక వారి మాతృభాషకు ముప్పు వాటిల్లునేమో యని శంకించి హిందీ ప్రచారముతో పెడబొబ్బలు సాగించిరి.

వీరేగాదు పాశ్చాత్యులలోకూడ ఏ దేశమువారు ఆదేశపు భాషనే వాడుచుందురు. వారి కితర భాషలతో పరిచయమున్నను స్వభాషను విడచి అన్యభాషలకై ప్రాకులాడరు. వారి దేశభక్తి, జాతీయత ఎన్నదగినది.

మన యాంధ్రులలో నది సున్న. పాశ్చాత్యులకడనుండి అంధానుకరణముతో అయినవి, కానివి అన్నియు నేర్చుకొనుచున్నారేగాని ఇట్టి ఉత్తమోత్తమ గుణములను నేర్చుకొనుటకు ప్రయత్నింపరు.

మూడు ముక్కలు ఇంగ్లీషు నేర్చుకొనినంతనే ఇంటిలోగాని, వెలుపలగాని, మిత్రులతోను, చుట్టములతోను ఇంగ్లీషులోనే మాటలు మొదలు పెట్టెదరు. ఉత్తరములు సయితము ఇంగ్లీషులోనే నడుపవలసినదే. ఇదేటి అంధానుకరణమో చెప్పలేము.

అందుకని ఇంగ్లీషుగాని, హిందీగాని నేర్చుకోరాదని కాదు నా మతము - మన మాతృభాష, మన తెలుగుభాషను పునాదిగా నుంచుకొని, దానిపై యెన్ని మేడలు కట్టినను బాధకరము గానేరదు. పునాదిలేని మేడలు నిరాధారములై త్వరలో కూలిపోవును. మాతృభాషా పునాదిపై విశ్వవిద్యాలయ పట్టము లెన్నిబడసిన అన్నియు అలంకారములై మన భాషకు మరింత వన్నెగూర్చును. సౌరభము హెచ్చును. జాతీయత ప్రబలును. భాషకు కూడ నూత్నభూషణములను ,జేకూర్చు వార మగుదుము.

ఒక్కొక్క భాషలోను ఒక్కొక్క సౌందర్యము, గాంభీర్యము, చమత్కారము చిందులాడు చుండును. మన తెలుగుభాషలో చూడండి. "మన" శబ్దము ఎంత రమణీయముగా నున్నదో! మనవాడు, మనదేశము, మన ఇల్లు, అనునప్పుడు దానిలో ఎంత ప్రేమ, ఎంత విశ్వమానవ సౌభ్రాతృత్వము, ఎంత వాత్సల్యం, ఎంతచనువు, ఎంత సంఘీభావం, ఎంత జాతీయత తొలుకాడు చున్నది. మన శబ్దములోని రసము నిజముగా గ్రహించినవారికి గుండె నీరు గాకమానదు. ఇట్టి పదలాలిత్యములు, సోయగములు అన్ని భాషలలోను ఉన్నది. దేనిఅందము దానిదే. దేనికదే ప్రమాణము. కావుననే అనేక భాషల్లో ప్రావీణ్యము నందు కొలదిని మానవుని మేధాశక్తి, హృదయశక్తి విశాలమయి విజ్ఞాన జ్యోతుల వెలిగించును.

ఆంధ్రులు భారతసామ్రాజ్య చక్రవర్తులై యున్నకాలమున తెలుగు వెలుగు సర్వతోముఖముగా విజృంభించినది. ఆంధ్ర వీరావతంసుల యాదరాభిమానముల నందిన శుభదినములలో ఆంధ్రప్రతిభ పదునారు కళలతో ప్రకాశించు రాకాచంద్రునివలె తనరారినది.

అప్పటి తెలుగుభాషయొక్క ఔన్నత్యమునుగూర్చి మరొకసారి తెలుపుకొందును.

ప్రస్తుతం దాని ఔన్నత్యము చెడి నిర్మాణములేక సవతితల్లి పోషణలోనున్న బిడ్డవలె నీరసముగా నున్నది. నిర్మాణము లేని భాషకు విలువయుండదు. కావున మన తెలుగుభాషకు పూర్వపు ఔన్నత్యము కావలెనంటే చక్కని నిర్మాణము కావలయును.

అది యువతుల బాధ్యతపై నాధారపడియున్నది. ఏలననగా స్త్రీలే సంఘమునకు పునాదివంటివారు. సత్య, నీతి, ధర్మములకు పట్టుకొమ్మలు, భవిష్యత్సంతానోద్ధారకులు. భావి భారత భాగ్యోదయ కర్తలగు

సత్సంతానమును వీరపురుషులుగను, విద్వన్మణులుగను, విజ్ఞాననిధులుగను, విమర్శకాగ్రేసరులుగను చేయు నధికారము, అవకాశము తల్లులకేగలదు. శిశువుల పోషణ, శిక్షణా బాధ్యత తల్లికిగాక మరెవ్వరికి? ఉగ్గుపాల నాటనుండి తల్లియొక్క యాచారవ్యవహారములు, శిశువు నేర్చుకొనుచుండును. చంటిపిల్లలకు మొదటినుంచి ఇంగ్లీషుమాటలు నేర్పితే అదియే పట్టుపడుచున్నది. తెనుగుమాటలు నేర్పితే దానినే నేర్చుకొనుచున్నారు. చిన్నతనమునందు పిల్లలకు అనుకరణశక్తిమాత్రమే ఎక్కువై యుండును. అందులోను ముఖ్యముగా తల్లినే యనుకరింపజూతురు. చక్కగా సంగీతము పాడేతల్లియైతే పిల్లలకుకూడ మంచి రాగజ్ఞానమే అలవడుచున్నది.

పూర్వ జన్మప్రయత్నమువలన నైతేనేమి, వంశసంప్రదాయ మూలమననైతేనేమి, చుట్టుపట్ల వాతావరణముచే నైతేనేమి, సాంగత్యమువల్లనైతేనేమి పిన్నతనము నుండియే ఒకని హృదయము ఒకరకమైన విద్యాశాఖపట్ల ప్రత్యేకాభిమానమును చూపుచుండును.

రవీంద్రుని కుటుంబము లలితకళలకు నాటపట్టు. చిత్రలేఖనం, కవిత్వము వారి వంశీయులు ఉగ్గుబాలతో పెట్టి పెంపొందింపజేసిరి. దీనికాధారము వారి మాతృదేవతలనియే చెప్పవలసియున్నది.

కావున మన తెలుగు వెలుగును నిలబెట్టవలెనంటే ఇప్పటి తెలుగు యువతులు కంకణము కట్టుకొనవలయును. హిందీ, ఇంగ్లీషు, సంగీతములతోబాటు మన తెలుగులోను శ్రద్ధబూని పాండిత్యము సంపాదించవలె.

హిందీ, ఇంగ్లీషులు చదివి పట్టభద్రులైతే ఉద్యోగములు వచ్చును. జీవనోపాయ మేర్పడును. తెలుగువలన అట్టి యార్థికలాభ మేదియని ప్రశ్నించెదరేమో?

మనయొక్క కళనుగాని, భాషనుగాని నేర్చుకొనునపుడు దానివలన ఉద్యోగములు వచ్చునా? డబ్బు గడించవచ్చునా? యను భ్రమ పెట్టుకొనకూడదు. 'కళా సౌందర్యము కొఱకే కళ-భాషా సౌందర్యము కొఱకే భాష'ను నేర్వవలయును. అంటే జ్ఞానసముపార్జనమునకే యని అన్ని విద్యలను నేర్వవలయును. అట్టి యోగ్యతగలవారికి ఉద్యోగములు తమంతట తామే వెదకివచ్చును. సానలుదీర్చిన రత్నమొకచోట యున్నదంటే దాని ప్రభావ మెఱిగినవారు వెదకివచ్చి కొనకమానరు. పుష్పం వికసించగానే దాని మధువును గ్రోలుటకై మధుపములను పిలువ నక్కరలేదు. కాబట్టి మన మాతృభాషోన్నతికై పాటుపడడమే మనవంతుగాని దానివలన గలుగు లాభలోభములు ఈశ్వరాధీనం. శ్రద్ధాభక్తులతో సల్పినకృషి యెన్నటికిని నిష్ఫలముగానేరదు. కావున తెలుగుయువతులు తెలుగువాణిని యుపేక్షింపక శ్రద్ధబూని అభ్యసించవలయునని నామనవి.

ఉపాధ్యాయాన్ దశాచార్య ఆచార్యాణాం శతం పితా,
సహస్రంతు పితౄన్మాతా గౌరవేణాతిరిచ్యతే.

నూఱుపురు ఉపాధ్యాయులకంటె నొకయాచార్యుఁడు, నూఱుపురాచార్యులకంటె నొక తండ్రియు, నూఱుపురు తండ్రులకంటె నొకతల్లియు గౌరవమున నెక్కుడని చెప్పఁబడినది.

—మనుధర్మశాస్త్రము.



యోగిగాయకుడు శ్రీ త్యాగయ్య

పుష్యబహుళ పంచమి (17 జనవరి 1941) నాడు తంజావూరువద్ద నున్న తిరువాడి గ్రామమున శ్రీ స్వామివారికి ఆరాధన మహోత్సవములు బ్రహ్మాండముగ జరిగినవి.

"తల్లి ప్రేమ" లో
శ్రీమతి కన్నాంబ

★ నక్షత్ర ఫలితాలు

కవికలహంసి
శ్రీమతి చేబ్రోలు సరస్వతీదేవి

● మాఘమాసము ●

అశ్విని
పుత్రపీడ; అతివ్యయం; గమనం

భరణి
శత్రువృద్ధి; కార్యనాశనం; భోజనహాని

కృత్తిక
కార్యసిద్ధి; ధర్మకార్యముల మూలమున ధనవ్యయం; మహాసౌఖ్యం

రోహిణి
వ్యధ; పుత్రులచే కష్టము; నీచసేవ

మృగశిర
ద్వేషము; శస్త్రములచే గాయము; సోదరవిరోధము

ఆర్ద్ర
జ్ఞాతివైర్యము; నూతనవిద్య; దారిద్ర్యము

పునర్వసు
ఉద్యోగములో మార్పు; తలచినకార్యము సిద్ధించుట; ప్రభుదర్శనము

పుష్యమి
అవమానము; చాంచల్యము; దేహారోగ్యము; సౌఖ్యము

ఆశ్లేష
వాణిజ్య భంగము; విలాసము; విద్యాగోష్ఠి

మఖ
క్రోధము; ఉష్ణజ్వరము; పాపకార్యము చేయుట

పుబ్బ
అధికారము; బంధుమిత్ర సమాగమం

ఉత్తర
విషభయము; మనోరథసిద్ధి; దైవారాధన

హస్త
కృషివిఘ్నం? స్వేచ్ఛా విహారము; వస్త్రలాభము

చిత్త
విచారము; మూలశంఖ; అగ్నిభయము

స్వాతి
సత్సహవాసము; సుఖజీవనము; మనోరథ సిద్ధి

విశాఖ
పుత్రసంతోషము; అలంకారప్రాప్తి; ఆధ్యాత్మ విచారణ

అనూరాధ
మాతృపీడ; ధాన్యవృత్తి; నూతన ప్రయత్నము

జ్యేష్ఠ
సంగీతవిద్యా వినోదము: గృహమందు శుభము; స్వజన సమాగమము

మూల
వ్యాధి; ప్రభువుల విరోధము; సంచారము?

పూర్వాషాఢ
సువార్తా శ్రవణము; ప్రయాణం; ఐశ్వర్యము

ఉత్తరాషాఢ
వేదాంతవిచారము; అర్థలాభము; సౌఖ్యము

శ్రవణం
ఋణబాధ; కలహము; రాజకీయ వ్యవహారములు

ధనిష్ఠ
తాపజ్వరము; రాజస్నేహము; సంచారము

శతభిషం
వాహనలాభం; విద్యాగోష్ఠి; వ్యాపారలాభం

పూర్వాభాద్ర
విద్యాభివృద్ధి; సంతానసౌఖ్యం; ధవళ వస్తులాభం

ఉత్తరాభాద్ర
కుటుంబసౌఖ్యము; యశస్సు; మృష్టాన్న భోజనము

రేవతి
ప్రయాస; అకస్మాత్ ధనం; పశులాభము

★ స్త్రీ సాముద్రిక శాస్త్రము ★

కవికలహంసి, శ్రీమతి చేబ్రోలు సరస్వతీదేవి

(గతసంచిక తరువాయి)

ఉంగరపు వ్రేలు చూపుడు వ్రేలుకన్న పొడవైనయెడల దురాశ, గ్రహణశక్తిలేకపోవుటను సూచించును. మధ్య వ్రేలికన్న చాలా పొడవైన మొండిపొగరు, సాహసకృత్యములను సూచించును. చిటికిన వ్రేలును కొంచెము మించియున్న కళలయందభిలాషను, జయమును తెలుపును. చిటికిన వ్రేలితో సమానముగా నున్న వివిధవిషయ జ్ఞానము, తర్క నైపుణ్యమును సూచించును.

దీని మొదటి కనుపునకు తులారాశియనియు 2వ కనుపునకు వృశ్చికరాశియనియు 3వ కనుపునకు ధనూరాశియనియు పేర్లు.

ఉంగరపు వ్రేలియొక్క మొదటి కనుపు విద్యాసక్తిని సూచించును. రెండవకనుపు హేతువాదమును, మూడవకనుపు ఆడంబరమును సూచించును.

మొదటికనుపు లేక తులారాశి పొడవై యుండిన లలితకళలయందు ఆసక్తిని నేర్పును సూచించును. వృశ్చికరాశి పొడవైయుండిన మట్టి పాత్రలు, పోర్సులైన్ పాత్రలుమున్నగు వాటిని చేయుటయందు నేర్పుండును. మొదటికనుపు వెడల్పుగలిగి పొరవలెనుండిన తర్కము, నాట్యకళ వీటియందు నేర్పుగలిగి మంచి వాచాలురై యుందురు.

ఈ వ్రేలియొక్క మొదటికనుపునుండి మూడవ కనుపువరకు ఒక సరళరేఖ సాగియుండిన గొప్ప ధనాఢ్యతను తెలుపును. పెక్కు రేఖలు సాగియుండిన దుర్వ్యయము హెచ్చుగా నుండును.

మూడవకనుపుమీద మాత్రము కొన్ని సరళరేఖలు సాగియుండిన విద్య, సంపత్తి, సౌఖ్యముగలిగి నిశ్చింతగా నుండును.

మరియు నీ కనుపుమీద ఒక్కరేఖ మాత్రమే యుండి, అది ఒకప్రక్కగా సాగిపోయిన మంచిపేరు, కీర్తి గలిగి గొప్పవారై యుందురు.

ఈ రేఖ చివరి పర్వమువరకు క్రిందుగా సాగియుండిన వ్యర్థులై యుందురు గాని మాటల నేర్పువలన ద్రవ్యార్జనము చేయగలుగుదురు.

మూడవ కనుపునుండి రెండవ కనుపువరకు నొక రేఖ సాగిన సత్స్వభావము గలిగి శక్తి సామర్థ్యములచే ధనము గడించువారై యుందురు.

ఈ మూడవ కనుపుమీద ఒక వంకరరేఖయుండిన గొప్ప ఆపత్తులు సంభవించునుగాని సూక్ష్మముగా తప్పించుకొనును. దీనియందు చంద్రవంక గుఱుతుండిన దురదృష్టము. శిలువగుఱుతుండిన అతి ఖర్చులుండును.

ఈ వ్రేలి మొదటికనుపు లేక తులారాశియందు శిలువగుఱుతుండిన మహాపతివ్రత. ఈ కనుపు చివరను నక్షత్రగురుతుండిన ఏ కార్యము మొదలిడినను సానుకూలమై చక్కని అదృష్టము గ్గియుండును.

(సశేషము)

చెన్నపురి ఆంధ్రమహాసభ - స్త్రీలశాఖ

సంక్రాంతి మహోత్సవములు

పవిత్ర సంక్రాంతి పండుగుదినాల్లో చెన్నపురి ఆంధ్రమహాసభ - స్త్రీలశాఖకూడా పండుగ వేడుకలు జరుపుకుంది. మహదానందంతో పండుగ మూడుదినాలూ సభ్యురాండ్రంతా కలిసి వేడుకల్లో పాల్గొన్నారు.—

పెదపండుగునాడు పెద్ద సభ, సంగీత నృత్యప్రదర్శనాలూ జరిగాయి. నాటిసభకు సుప్రసిద్ధ సంఘ సేవకురాలు శ్రీమతి ముత్తులక్ష్మి రెడ్డిగారు అధ్యక్షత వహించారు.

ప్రప్రథమంలో శ్రీమతి దుర్గాబాయమ్మగారు, చెన్నపురి ఆంధ్రమహాసభాధ్యక్షులైన త్యాగమూర్తి సాంబమూర్తిగారు ప్రభుత్వ బందీగా వున్నందువల్ల సభయొక్క కార్యనిర్వహణం అంతా లోటుగావుందని, వారు త్వరలో విడుదల ఔతారని భగవంతుని ప్రార్థిస్తున్నానని చెప్పారు.

మహాసభోపాధ్యక్షులు శ్రీ మంత్రిప్రగడ నరసింహంపంతులుగారు, ముత్తులక్ష్మి రెడ్డిగారి సంఘ సేవాసక్తినిగురించి ముచ్చటించారు.

శ్రీమతి ముత్తులక్ష్మి రెడ్డిగారు అధ్యక్షత వహించి మనదేశంలోని స్త్రీల స్థితినిగురించి, శ్రీమతి దుర్గాబాయమ్మగారి కార్యనిర్వహణా ధురీణతనుగురించి విపులంగా ప్రసంగించారు.

తదనంతరం—బాలికలు నృత్యప్రదర్శనాలు కావించారు.

ప్రథమంలో శ్రీ శ్రీనివాస కుల్‌కర్ణిగారిచే నేర్పబడిన క్రొత్తరకపు అభినయం ముగ్గురు బాలికలచే కావింపబడింది. ఈ నృత్యం ప్రత్యేకంగా ఉత్తమతరగతికి చెందిన హావభావాలతో రాణకెందింది.

తదుపరి, శ్రీమతి డి. హేమలతాదేవి, వరలక్ష్మి, విమలకుమారిగార్లయొక్క గాత్రపాట, జంత్ర వాద్యములు, నృత్యములతో కార్యక్రమం అత్యంత జయప్రదంగా, మానసోల్లాసంగా ముగిసింది.

సంక్రాంతి వేడుకలతోపాటు బొమ్మలకొలువుకూడా ప్రతిష్ఠించారు యీసారికూడా—వేడుకలంతా ఒక ఎత్తు, యీ ప్రదర్శనము అంతా ఒక ఎత్తుగాను అమిరాయి.

అయితే యీ బొమ్మలకొలువు మామూలు జపాన్ బొమ్మల అలంకరణ, లేకపోతే కొండపల్లి రంగుబొమ్మల అమర్పూ—ఉత్సవ విగ్రహాల్లా నించోపెట్టినదిమాత్రం కాదు.

ఈ బొమ్మలకొలువులోకూడా మనం నేర్చుకోవలసినవి చాలావున్నాయి. ఒకవైపున 'ఆదర్శ గ్రామము' (Model Village) దానిప్రక్కన భారతదేశము—వీటిచుట్టూ యితరములైన బొమ్మలు, పూలతోట్లు మొదలైనవి వున్నాయి. ముఖ్యంగా 'ఆదర్శగ్రామం' ఆదర్శవంతంగానే నిర్మింపబడింది. ఇళ్లు, రోడ్లు, నూతులు, బహిర్ ప్రదేశాలు మొదలైనవి ఆరోగ్యపద్ధతులలో ఎలా నిర్మించాలో యీ బజారు బొమ్మలతో కట్టబడిన యీ గ్రామం కన్నులకు కట్టినట్లు చూపెడుతోంది.

భాషాప్రయుక్తంగా భారతదేశం ఎలా భాగింపబడాలో చక్కగా చూపెట్టబడింది నేలమీద మట్టితో అమర్చబడిన హిందూదేశంలో. ఎక్కడెక్కడ ఏయే పంటలు పండుతాయో, ఏయే నదులు ఎల్లా పారుతాయో కూడా చక్కగా అమర్చారు దీనిలో.

ఇటువంటి యీ బొమ్మలకొలువు బుద్ధికి పనిచెప్పేదిగా, ప్రబోధకరంగా తయారుచేయబడింది. ఇది కేవలం ఒక ప్రత్యేకతను కలిగివుంది యీ వేడుకల్లో.

ప్రబోధకరంగానూ, విజ్ఞానప్రదాయినిగానూ, మానసోల్లాసకరంగానూ యీ స్త్రీలశాఖా నిర్వహణాన్ని నిర్వహిస్తూవున్న దుర్గాబాయమ్మగారి చతురత వేనోళ్ల చాటడానికి, యిదే ప్రబలనిదర్శనం.

అందుచేతనే యీ సంవత్సరం అదనం నూరుమంది సభ్యులు చేరినారట—వేడుకలతో విజ్ఞానం లభిస్తూవుంది. చేరినారంటే ఆశ్చర్యం ఎందుకూ?

ఈ అభివృద్ధినిచూచి శ్రీమతి ముత్తులక్ష్మిరెడ్డిగారు పరమానందపడుతూ, దుర్గాబాయమ్మగారి సేవాశక్తినిగురించి ప్రస్తుతించారు—ఆశీర్వదించారు. దీనికి శ్రీమతి దుర్గాబాయమ్మగారు చాలా సిగ్గు పడ్డారు—వారికి పొగడ్తలు భారంగా తోచాయి గాబోలు! ఆమె సిగ్గుపడితే పడ్డారు—మనంమాత్రం ఆమెనుగురించి చెప్పుకోకుండా, ఇటువంటి కార్యధురీణను మనం కలిగి వున్నందుకు గర్వించకుండా ఎలా వుండగలం?

అత్యానందంతో ఎప్పుడూ ఆమెయొక్క సంఘసేవా కార్యక్రమాలకు హారతులు పడుతూనే వుంటాము—అదే పదివేలు.

—"గృహలక్ష్మి" ప్రతినిధి.

ప్రావృట్కన్య

శ్రీ యార్లగడ్డ వేంకటసుబ్బారావు

(దౌత్యము)

మెఱుపు చూపులెకాని
అఱుపు మాటలెకాని
నిజమైన నీ ప్రేమ
నిండదేమే? కోర్కె
పండదేమే చెలీ!

....

మసిపూసి మారేడు
కాయచేస్తావేమొ
దానికీ మాఱేడు
మోసపోడే చెలీ!

....

నిండి నా బంగారు
కొండవే నీవంచు
పండినా దానిమ్మ
పండువే నీవంచు
మొండియాసలబోవునే?
నారాజు
కండ్లు మూసుకుపోవునే

....

నీతోటిదే లోక
మేతోడు లేదంచు
నీతోడు నాఱేడు
నాతోటిబల్కేడు
వేతోడి తెమ్మంచు

....

నాఱేని కృషియందు
నారేని పోయవో
వేరేది గతిలేదు
నీరేని పోయవో
కోరేది నీప్రేమ
చేరేది నీయండ
వేరుగా దలపోతువో
ఓ చెలీ!
మారుమాటే యాడవే!

★ రా జ మ కు టం

రచయిత :

శ్రీ గోవింద వల్లభ పంతు

అనువాదకర్త :

శ్రీ పురాణం కుమారరాఘవశాస్త్రి

—————ముందు కథ—————

చిత్తోడు మహారాణా విక్రమసింహుని పదచ్యుతునిచేసి, తన కుమారుడైన వనవీరుని సింహాసనాసీనుని చేయాలనే దురూహతో కుటిల సర్దారు రణజిత్తుతో కలిసి మాయలుపన్ని, శీతలసేని, రాణాను బందీచేసింది. ఖైదులో వున్న రాణాదగ్గర, ఉదయుణ్ణి, చందన్‌ను తాను కాపాడుతానని, పన్నా ప్రతిజ్ఞ పట్టింది. రాణాను బంధవిముక్తుణ్ణి చేయాలనే మహామంత్రి కర్మచందు ప్రయత్నం విఫలమైంది. శీతలసేని ఆరాత్రి వనవీరుణ్ణి ప్రోత్సహించి రాణాను హత్యచేయించింది. సింహాసనమును సురక్షితం చేసుకోనేందుకు ఉదయుణ్ణికూడా హత్య కావించడానికి ప్రోత్సహితుడై ముందు వనవీరుడు, వెనుక శీతలసేని, ఉదయుని గదివైపు వెళ్లారు.

పాత్రలు

1. పన్నా	...	ఉదయుని దాది
2. ఉదయసింహుడు	...	విక్రముని తమ్ముడు
3. కర్మచందు	...	ప్రధానమంత్రి
4. బారీ	...	ఒక సేవకుడు
5. శీతలసేని	...	వనవీరుని తల్లి
6. వనవీరుడు	...	శీతలసేని పుత్రుడు
7. రణజిత్తు	...	ఒక లోభి సర్దారు
8. సన్యాసి	...	......

—————ఇక చదవండి—————

ప్రథమాంకము

౧. దృశ్యము

[ఉదయుని శయనాగారము — సెజ్జమీద ఉదయుడు నిద్రపోతుంటాడు. తలగడవేపు దీపం ఉంది. కాళ్లకట్టవేపు నేలమీద పన్నా కూర్చుంది. ఆమె తొడమీద తలఉంచి పడుకుని చందన్ నిద్రపోతుంటాడు. తడవ తడవకూ ఉదయుడు కించిత్తు వ్యాకులత ప్రకటిస్తూంటాడు. అది పన్నా విచార దృష్టితో పరికిస్తూంటుంది. తిరిగి చందన్ కేసి చూచి అతనిమీద దుప్పటి కప్పుతుంది.]

ఉదయుడు :–(మేల్కొని) అమ్మా! దాదమ్మా! ఒకవేళ విక్రమసింహ మహారాణాను సర్దార్లు రేపటి ఉదయానికల్లా విడుదలచేయరేమో— ఎల్లాగు?

పన్నా :–ఏమిటి, నీ వింతవరకూ నిద్రపోనేలేదా? విచారమేమీ పెట్టుకోక మనస్సులో, తప్పకుండా రాణా రేపువిడుదల ఔతాడు. రాత్రిళ్లు ఇంత పొద్దుపోయేవరకూ మేల్కొని ఉంటే జబ్బు చేయదు తండ్రీ!

ఉదయుడు :–నీవూ మేల్కొనే ఉన్నావుగా! నువ్వు చారణులదగ్గర నేర్చుకున్న ఆ పాటపాడితే, వింటూ నిద్ర పట్టించుకుంటాను.

పన్నా :–ఆపాటా! నీవు చాలాసార్లు విన్నావు.

(పాడుతుంది)

సింధు కాఫీ — త్రితాళం.

హే మేవాడధరిత్రీ । నీస్తుతి
గానము సేతురుగా సురనరతతి ।

౧

అహో ప్రకృతి ఎంత అందముగనో
నిర్మించెను నానా నగములనూ
వనోపవన నదీఝురంబులనూ
పై నీలితారకా కాశమునూ

౨

కుంభ - ఖుమాన - సమానవీరులను
బప్పా - సాంగా - ముఖనరవరులను
కన్నావమ్మా! జగ ముప్పొంగెను
జయము సూర్యకుల జలధి చంద్రులకు.

(ఉదయుడు గీతికవింటూ నిద్రిస్తాడు.)

౩

అబలలుకూడా ఇట అసి తాలిచి
మహాభయద రణకేళిక సలిపిరి,
అమరయశశ్చంద్రిక లార్జించిరి,
ఆ వీరసతీమణులకిదే నతి.

౪

ఇంటింటా ప్రాకెను నీ కీరితి;
నీ ప్రచండతర రణతాండవ గతి
విని గడగడ వడకిరి శాత్రవతతి,
నీ చరితము కన్నది లోకోన్నతి!

పన్నా:-(గీతికముగించి) నిద్రపోయాడు.

(హఠాత్తుగా తెర ఆవల రోదనధ్వని)

ఈ ఆక్రందనం మహలులోనేనే!

(ఒకబుట్టలో ఎంగిలాకులు, చీపురు పెట్టుకొని బారీ ప్రవేశిస్తాడు)

బారీ:-పన్నా! సర్వనాశనం! (బుట్ట దించుకుంటాడు)

పన్నా:-(తొడమీది చందనునితల నేలకుదించి గాభరాగా లేచి) ఏమిటిబారీ! ఏమి జరిగింది?

బారీ:-వనవీరుడు జైల్లో ఉన్న విక్రమసింహ మహారాణాను చంపేశాడు.

పన్నా:-హా! భగవంతుడా! (ఏడుస్తుంది)

బారీ:-దుఃఖపడి లాభంలేదు. ఏడుపుకిది సమయంకాదు. అతడిప్పుడు ఉదయుని వధించటానికి ఇక్కడికి కూడా వస్తాడు.

పన్నా:-మరి ఉదయుని రక్షించే ఉపాయం ఏమిటంటావు?

బారీ:-నా మనస్సుకేమీ తోచటంలేదు.

పన్నా:-ఆశ వదలుకోవలసిందే?

బారీ:-ఆ ఘాతుకుడికి దయగలిగితే తప్ప.

పన్నా:-ఆ పాషాణం కరగదు. ఏ విధంగానైనాసరే నీవు ఉదయునికోట ఆవలకు తీసుకుపో.

బారీ:-ఉదయుడిక్కడ కనిపించకపోతే వనవీరుడు నిన్ను చంపేస్తాడు. నీవులేక ఉదయుడు జీవించటం కష్టం. అతన్ని ఎవరురక్షిస్తారు?

పన్నా :-(భావ పరివర్తన కనబరచి) అయితే ఉదయుని ఇక్కడే ఉండనీ. (ఉత్తేజితయై) నే నతనిమార్గం నిరోధిస్తాను. అతని చేయి విదళించి కత్తి లాక్కుంటాను. ముక్కలు ముక్కలయ్యేలాగు కత్తిని నేలకు విసిరి కొడతాను. సావిత్రి మృత్యుదేవత పంజానుండి తనభర్తను విడిపించుకుంది. ఒక మానవుని చేతి పట్టునుండి నా ప్రభుకుమారుని విడిపించుకోలేనూ? తప్పకుండా విడిపిస్తాను. వనవీరుడి హృదయంలో దయ ఉంది. అతనికి నేనంటే ఆదరభావమే.

బారీ :-కాదమ్మా కాదు. రాజమకుటం ధరించిన తర్వాత అతడు వనవీరుడుకాదు.

పన్నా :-భగవంతుడా! చిత్తోడు రాజవంశ మీరీతిని నిర్మూలము కావలసినదేనా?...మేవాడ్ రక్షక దేవతలు! మీరైనా ఒక ఉపాయం చెప్పండి. ఈ దీనురాలు, అబల, బలియిచ్చుకొనియైనా స్వామి క్షేమమే కోరుతోంది. (కొన్ని క్షణాలు విచారమగ్నయై, నిస్తబ్ధయైనిల్చి, క్రమేణస్వరము హెచ్చించి) మత్-శిశు-రక్త-పిపాసీ! చిత్తోడేశ్వరీ! ఆ మార్గమే చూపెడుతున్నావు? అట్లే కాగాక!—బారీ! ఆ బుట్టలో నిద్రించుతోన్న ఉదయుని ఉంచుతాను; నీవు జాగ్రత్తగా కోట వెలుపలికి తీసుకుపో. వేరిస్ నదియొడ్డున స్మశానంలో నాకోసం కాచుకుని ఉండు.

బారీ :-అయితే మళ్ళీ మొదటికే వచ్చావన్నమాట. వనవీరుని కేమి జవాబు చెబుతావు?

పన్నా :-అతనికన్నుల్లో దుమ్ము కొడతాను.

బారీ :-ఎలాగ?

పన్నా :-ఉదయుని పక్కలో ఇంకొకణ్ణి పడుకోబెట్టి.

బారీ :-ఎవర్ని పడుకోబెట్టి?

పన్నా :-చూడు, చూడు, బారీ! నాగుండె వనవీరుని గుండెకంటే కఠోర కర్కశమైపోయింది.

బారీ :-రాక్షసతల్లీ! ఎవర్ని పడుకోబెట్టుతావు?

పన్నా :-చందన్‌ను,...నా బిడ్డను—

బారీ : దయా, ప్రేమా లేని మృత్యువు ఒడిలోనా? స్వామిరుణం ఈవిధంగా తీర్చుకుంటావా? ప్రొద్దున్నే లేచి దణ్ణం పెట్టాలిసిన తల్లివమ్మా దేవీ!

పన్నా :-కాదు, నేను దయ్యాన్ని, రాక్షసిని. కసాయివానికత్తికి నా శిశువు నొప్పజెపుతున్నాను—బారీ! ఆలస్యంచేయకు. ఉదయుని రక్షించాలి. అతన్ని తీసుకువెళ్ళు. (బుట్టలోనుంచి ఎంగిలాకులు తీసి వేసి, అందులో ఒకగుడ్డ పరుస్తుంది పన్నా. దానిలో ఉదయుని పడుకోబెట్టి చిచ్చికొడుతుంది; మీదను వలిపెము కప్పుతుంది. పైని మళ్ళీ ఎంగిలాకులుంచుతుంది)

బారీ :-సరే, తీసుకువెళుతున్నాను.

పన్నా :-మంచిది, తొందరగా—నా నిశ్చయం మారకముందే—వనవీరుడు రాక పూర్వమే.

బారీ :-పరమేశ్వరుడు నిన్ను రక్షించునుగాక! (పన్నాసహాయంతో బుట్ట ఎత్తుకుని బారీ నిష్క్రమిస్తాడు)

పన్నా :-(చందన్‌ను ఉద్దేశించి) అభాగ్య-పితృహీన బాలకుడు! నిద్రపోతున్నాడు. బిడ్డా! ఈ కఠోర భూమి—ఇదే నీకు చివరసారి తల్లియొడి!—నేను సర్పిణిని. నా బిడ్డను పదకొండు సంవత్సరాలు పెంచి తినేశాను. వెళ్ళు, నాయనా! ప్రభువుకోసం ప్రాణాలర్పించే ధీరులకులభించే స్వర్గవాటికలో నీది అగ్రస్థానమాగాక! పుత్రహత్యగావించుకునే పాపికికలిగే రౌరవములో నాది అధోగతియాగాక!

(మెల్లగా చందన్‌ను లేవనెత్తి సెజ్జమీద పడుకోబెడుతుంది) ఈ సెజ్జమీద నీవెన్నడూ నిద్రించ లేదు. ఇవాళ మెలకువ లేని గాఢనిద్రపో. మేలుకుంటివా రహస్యం బయటపడుతుంది సుమా! (ముసుగు కప్పుతుంది. కాని, ముఖంమీది ఆవరణ తొలగించి) అది నా భర్త తాయత్తు. అదే ఇక నాకు నిన్నుకూడా జ్ఞాపకంచేస్తూండగల చిహ్నం. తీసుకుంటాను. (తాయిత్తుతీసుకుని ముఖంమీద ముసుగు కప్పుతుంది) ఇప్పుడప్పుడే ఎందుకు ముసుగు? అతడు రావటానికి ఇంకా ఆలస్యం ఉంది. (ముఖంమీది ముసుగు మళ్ళీతీస్తుంది) అంతవరకూ బిడ్డ మొగము చూచుకుంటూ ఉంటాను. (ముద్దు పెట్టుకోవాలనుకుంటుంది) వద్దు, వద్దు, మేలుకుంటాడేమో, ఇప్పుడు కాదు. ఎంత అందమైనముఖం! దేవతలే అందుకుసాక్ష్యం. కొంచెం ఆగి ముద్దుపెట్టుకుంటాను. వద్దు, వద్దు. అవిగో అతని యడుగుల చప్పుడు. (చందన్ ముఖంమీద ముసుగేస్తుంది)

(రక్తసిక్తమైన కటారుతో వనవీర్ ప్రవేశిస్తాడు)

వనవీర్ :-పన్నా!

పన్నా :-ఎవరు? వనవీర్! చేతిలో కటారు! దానిపై విక్రమునిరక్తం!

వనవీర్ :-ఔనౌను. చెప్పు, ఉదయుడెక్కడ?

పన్నా ;-(వనవీరుని పాదాలమీదవాలి) మరచిపోకు, వనవీర్! నీవు ఉదయుడి సంరక్షకుడివి. పాపపుణ్య విచారణచేసుకో.

వనవీర్ :-శత్రువధ క్షత్రియధర్మంకాదూ? మాతృవాక్యపాలన పుత్రుడికి పుణ్యవిధికాదూ?

పన్నా :-(లేచి వనవీరు నెదుర్కొని) మదోన్మత్తుడా! నీవు ధర్మభ్రష్టుడివైనావు. నిన్నడ్డగించి తీరుతాను.

వనవీర్ :-పన్నా! అటునిల్చి ఉండు. లేదా, నీవుకూడ బలియైపోతావు. (సెజ్జవేపుచూచి) అదిగో అక్కడే ఉన్నాడు. (సెజ్జవేపు నడుస్తాడు. పన్నా అతన్ని వెనక్కులాగుతూంటుంది. వనవీరుడు మంచం సమీపించి బాలుణ్ణి వధించేందుకు కత్తియెత్తినప్పుడు)

పన్నా :-ఆగు! అంధ ఘాతుకుడా! ఇక్కడైనా చెవియొగ్గి నీకటారుచేస్తోన్న ప్రబోధం గ్రహించు. అది అంత యెత్తునుంచి చెబుతోంది. 'భయపడు' (ఆకాశంకేసి వేలుచూపెడుతూ) 'అతనికి భయపడు' అని.

వనవీర్ :-అదికాదు కటారుచేస్తోన్న ప్రబోధం. 'ఉన్నతి పొందటానికి ఇదేమార్గం' అంటోంది. (ఉదయుడే అనే భ్రమలో చందన్‌ను వధిస్తాడు)

పన్నా :-హా! హా! రాక్షసుడా!

(వనవీరుడు నెమ్మదినెమ్మదిగా చందన్ వక్షంనుండి రక్తప్లుతమైన కటారును వెలకిలాగుతాడు. ఒకవేపునుంచి శీతలసేని, మరొకవేపునుంచి రణజిత్, ప్రవేశిస్తారు.)

వనవీర్ :-నీవూ ఇక్కడికే వచ్చేశావా? అమ్మా! ఇదిగో తీసుకో. నీయాజ్ఞ చివరవరకూ నిర్వర్తించాను. (శీతలసేనికి కటారు ఇస్తాడు)

శీతలసేని :-తే, తే, శత్రురక్తంతో నీకు రాజతిలకం దిద్దుతాను.

రణజిత్ :-మహారాణా వనవీర్‌కూ జై.

(మధ్యన వనవీరుడు; ఒకవేపున శీతలసేని నిల్చి కటారుమీది రక్తంతో అతనికి తిలకం దిద్దుతూంటుంది. రెండవవేపున కరవాలపుఛాయ ఇస్తుంటాడు రణజిత్. పన్నా మూర్ఛిల్లిపడి ఉంటుంది)

స్తబ్ధదృశ్యము.

"సంఘసేవాధురీణ" శ్రీమతి బత్తుల కామాక్షమ్మగారు

1941 సంవత్సరమునకు గృహలక్ష్మి స్వర్ణకంకణ మీ సంఘసేవా ధురీణకు బహూకరింప నిశ్చయింప బడినది

'కవికలహంసి' శ్రీమతి చేబ్రోలు సరస్వతీదేవిగారు
స్వర్ణకంకణ సన్మానసభకు అధ్యక్షత వహింతురు.

ద్వితీయాంకము

౧. దృశ్యము

[వేరిస్ నది యొడ్డున స్మశానభూమిలో. రేవులో పడవ కెరటాల తాకిడికి ఊగు తూంటుంది. బారీ ప్రవేశించి బుట్ట దించుకుంటాడు. ఉదయుడు మేల్కొని, లేచి నిల్చుని, చకితుడై]

ఉదయుడు :- బారీ! నిజం చెప్పు. ఎందుకు నన్నీ భయంకర స్మశానభూమికి తీసుకొచ్చావు? బుట్టలో పెట్టు కుని మోసుకొచ్చావే! అది మరీ సందేహాస్పదంగా ఉంది. నీ ఉద్దేశం నిర్దుష్టమైనట్లు తోచటంలేదు.

బారీ :- నాకేమీ తెలీదు బాబూ! దాది పన్నా ఆజ్ఞాపించినట్టు చేశాను, అంతే.

ఉద :- నీవేమీ అబద్ధం చెప్పటం లేదుకద! నీలో కుటిలవంచన ఏమీ లేదుకద! నా యీ వస్త్రభూషణాల కోసం ఈ ఏకాంతప్రదేశంలో నన్ను హత్య చేయవుకద!

బారీ :- హంతకుని బారినుండి మిమ్మల్ని రక్షించి తెచ్చాను.

ఉద :- (కంపితుడై) బారీ! నీవేదో ఒక భయంకర ఘటనాన్ని సూచనగా తెలుపుతున్నావే! విక్రమసింహ మహారాణా ఈ ఉదయం విముక్తుడౌతాడు, చూద్దామనుకున్నాను; కాని నీవు చెబుతున్న దేమిటి?

బారీ :- పన్నా మనల్ని ఈ స్మశానంలోనే కలసికొంటానని చెప్పింది. ఈపాటి కామె వస్తూండాలి; రాగానే నీకంతా తెలుస్తుంది.

ఉద :- నీవు మంచివాడివే నని విశ్వాసం కలిగినప్పటికీ, నా హృదయం ఊరికే కంపించుతోంది. పద, ఆ యిసుకతిన్నెమీద కూచుని దాదమ్మకోసం ఎదురుచూస్తూ ఉందాం. (ఇద్దరూ నిష్క్రమిస్తారు)

[తల విరబోసికొని మతిస్థిరంగాలేక, కొడుకు శవం మోస్తూ, పాడుతూ, పన్నా ప్రవేశిస్తుంది.]

కాలింగడా - త్రితాళం

పన్నా :-

మేల్కొరా తండ్రి! రాత్రి గడచెన్;
జీవము లిచ్చి జీవింతువురా,
నే విషమే త్రాగి బ్రతికియుంటిన్.

౧

ప్రేమామర లహరీజల మింకెఁ,
హృదయము వజ్ర, మొడిశూన్యమయ్యెన్.

౨

సుతసంహారిణి ఢాకిని నైతిన్,
ఇది విషసంఘటనమురా జగతిన్.

(పాట ముగించి) మాట్లాడవేం తండ్రీ! సూర్యోదయమయింది చూడు. ఇంకా నిద్రపోతు న్నావా? లే, లే, నా ఆజ్ఞానుసర్తివి కదమ్మా నీవు. సోమరివి కాదే! (కొంచెం స్మృతి వచ్చి) ఇదేమిటి,

ఇక్కడికొచ్చాను? (అటునిటు పరికించి) ఇది స్మశానభూమి! వీడి ఛాతిమీద రక్తం ఉంది. వీణ్ణి వనవీరుడు చంపాడు. మేవాడ్ సింహాసనంతో మావాడికేమీ సంబంధంలేదే! మరి వీడి అపరాధమేమిటి? వనవీరుడు కాదు వీణ్ణి చంపింది. నేనే, నేనే హంతకిని. (ఏడుస్తుంది)

[ఒక సన్యాసి ప్రవేశిస్తాడు]

సన్యాసి :- అంత దీనంగా విలపిస్తున్నావు ఎవరమ్మా నీవు? వచ్చినవాడు పోక తప్పుతుందా? ఈ నిశ్చల సత్యాన్ని నీ వెరగవూ?

పన్నా :- మహాత్మా! ఎరుగుదును. కాని మరి ఈ కన్నీళ్ల ప్రయోజనమూ కొంత ఉండాలి కదా?

సన్యాసి :- అవి యిప్పుడు దాచుకో. వాటిని సుఖసమయాల్లో ప్రసరింపగలిగితివా, దుఃఖమనేది నీకో హాస్యరేఖగా వికసిస్తుంది.

పన్నా :- సన్యాసీ! నీ హృదయం వట్టి మరుభూమి. మాతృప్రేమ నీవెరగవు. చూడు, ఈ సుందరవదనబింబ మింత శీఘ్రకాలంలో వాడిపోతగిందేనా?

సన్యాసి :- మృత్యువుముందు తర్కము పరాజితమే ఔతుంది. ఫలానివాడు ఎందుకు మరణించాడూ అంటే చెప్పలేం. చితి ఒకటి పేర్చు. నేనూ తోడ్పడతాను. ఆ శవంతోపాటు నీ మోహాన్నికూడ తగుల పెట్టుకుని వెళ్లిపో.

పన్నా :- వీణ్ణి తగులపెట్టనా? ఊహుఁ. తగులపెట్టను. వనపర్వతాలనుంచి వీడికోసం సంజీవని వెదకితెస్తాను. పోయి నిర్ఝరుల నడుగుతాను ఈ పసివాడికోసం జీవనభిక్ష. (సన్యాసిని నఖశిఖపర్యంతమూ అవలోకించి) ఎంత పరిపూర్ణతేజోమయరూపము నీది! నీవు తప్పక ఒక సిద్ధుడివి. మహాత్మా! నా కొడుకును బ్రతికించవూ? (చందన్ శవాన్ని సన్యాసి చరణాలముందు ఉందుతుంది)

సన్యాసి :- పరమేశ్వరుని యిచ్ఛను ఏ సిద్ధుడూ ప్రతిఘటించలేడు. ప్రాణికోటికి మృత్యువు తప్పదు. ఉదయమైనవాడు అవశ్యం అస్తమించవలసినదే.

పన్నా :- (ఉదయశబ్దం వినగానే రాజకుమారుడు ఉదయుడు జ్ఞాపకంవచ్చి, భావపరివర్తన ప్రకటిస్తుంది) ఆ! ఉదయ - అస్తమయమా! కాదు, మహాత్మా! కాజాలదు. తత్‌రక్షణకోసమే యీ బలి యిచ్చుకున్నాను.

సన్యాసి :- (ఏమీ అర్థంకాక) ఏమిటి అంటున్నావు?

పన్నా :- ఏమీలేదు. మహాత్మా! మాట్లాడనులెండి. మీరే ఆజ్ఞ యివ్వండి. వీణ్ణి (చందన్‌ను చూపుతూ) విడిచిపెట్టి తత్పాలన చేస్తాను.

సన్యాసి :- అయితే వెళ్లు. ఆ సమీపంలో అగ్నిగుండం ఒకటి ఉంది; అందులోనుంచి ఇంత నిప్పు పట్టుకురా నేనిక్కడ చితి పేరుస్తూంటాను.

[పన్నా నిష్క్రమిస్తుంది. సన్యాసి చితిపేర్చి దానిమీద శవాన్ని ఉంచుతాడు.
పన్నా నిప్పుపట్టుకుని ప్రవేశిస్తుంది. ఆగిపోతుంది]

పన్నా :-పట్టుకొచ్చాను నిప్పు.

సన్యాసి :-చితి అంటించు; నేను పోయివస్తాను. నీకు శుభం.

[మళ్ళీ పన్నా చితి అంటిస్తుంది. సన్యాసి నిష్క్రమిస్తాడు. చితి మండుతూంటుంది]

పన్నా :-వెళ్ళిపో, బిడ్డా! వెళ్ళు, దేశ, కాల, పరిమితి విముక్తమైన - తల్లులకు కడుపు దుఃఖమంటూ ఉండని—సనాతనలోకానికి. చందన్! కాదు, కాదు, ఉదయ్!

[బారీ, ఉదయుడు ప్రవేశిస్తారు]

ఉద :-అమ్మా! అమ్మా! నీకోసమే ఇంతసేపునుంచీ ఎదురుచూస్తున్నాం. బారీ చెబుతున్నాడు: మహా రాణాను వనవీరుడు హత్యచేశాడని, నిజమేనా?

పన్నా :-ఔను. నిజమే.

ఉద :-చందన్ ఏడీ?

పన్నా :-చందన్! (చితివేపుచూచి, మళ్లీ ఉదయునికేసి తిరిగి) చందన్ నీవే. (మళ్లీ చితివేపు చూస్తుంది)

ఉద :-ఆ యగ్నిజ్వాలల్లో అంత ధ్యానపూర్వకంగా ఎవర్ని చూస్తున్నావు? నాకు బారీ అంతా చేప్పాడులే. పద. నేనా పాపిష్టి వనవీరుని తగినట్టు దండిస్తాను.

పన్నా :-వద్దు, వద్దు. ఈనాడు మేవాడ్‌లో ప్రతియణువూ నీకు శత్రురూపమే. మనం దేవలరాజును దర్శించి ఆయన శరణు వేడుకుందాం. నీ తండ్రిగారు ఆయనకు ఎన్నో ఉపకారాలు చేశారు. ఆయన నిన్నిప్పు డవశ్యం రక్షిస్తాడు. ఇదిగో యీ తాయత్తు చందన్ మెడలోనుంచి తీశాను; నీవు ధరించుకో. నీ నిజ స్థితి యెవరికీ చెప్పొద్దు. ఎవరేనా అడిగితే నీపేరు చందన్ అనీ, నేను నీ తల్లిననీ చెప్పు. (ఉదయుని కంఠాన తాయిత్తు కడుతుంది)

ఉద :-అలాగే నమ్మా!

పన్నా :-బారీ! నువ్వు చేసిన సహాయానికి ఎంతో రుణపడియున్నాను. ఈ రహస్యం ప్రకటము కాకూడదు సుమా!

బారీ :-కాదమ్మా; కాదు.

పన్నా :-పద, ఉదయ్! - కాదు, కాదు, చందన్! అదృష్టవశాత్తు ఇక్కడ పడవ సిద్ధంగానే ఉంది. ఇందులో యెక్కి ఆవలియొడ్డు చేరుకుందాం. బారీ! మన ఉదయుణ్ణి తగినరక్షణలో వొప్పజెప్పి, శీఘ్రకాలంలోనే చిత్తోడుకు తిరిగివస్తాను. నీవుపోయి అక్కడ పన్నా ఉదయుని అంతిమసంస్కారం నిర్వర్తించి చందన్‌ను తీసుకుని తన పుట్టింటికి వెళ్లిందని చెప్పు.

బారీ :-అలాగే. భగవంతుడు మిమ్మల్ని కాపాడుగాక! (బారీ సహాయంతో ఉదయుడు, పన్నా పడవెక్కు తారు. ఆవలియొడ్డు చేరుతారు. రెండోవేపునుంచి బారీ నిష్క్రమిస్తాడు)

(తెరపడుతుంది.)

★ చెల్లికి ★

శ్రీ కర్లపాలెం కృష్ణారావు

చెల్లి! వినవేమి! రావమ్మ! పిల్ల నిన్ను కోపగింపను, నగలిత్తు కోరినన్ని,
అడ్డుజెప్పను పాటల కాటలకును, ఒక్క మాటను వినిపొమ్మ చక్కనమ్మ!

చదువుకొనవచ్చు విద్యలు చాలినన్ని అభ్యసింపుము కళలనెన్నైనగాని,
రాజకీయార్థ శాస్త్రాల రసముపిండి, మేటి యనిపించుకొనుము నీ సాటిలేక.

కాని,

మహిమాస్పదంబగు మంగళ కరమైన తిలకంబుతీరుగా దిద్దవేల?
జగముల శాసించి సంపదలనుబెంచు కాటుక కనులకు గలుగదేమి?
శోభాయమానమై శుభచిహ్నమైనట్టి పారాణిలేదేమి పాదములకు
ఘల్లుఘల్లురటంచు కాంతులనెగజిమ్ము గాజులేలేవేమి కరములకును?

ఏమిచిత్రము! పడమటి పాడుగాలి కెంతకృత్రిమమైతివో మెరుగలేవె?
అందమానందమునుగూడ అంతరింప జేయువేషము మనకేల చెప్పవమ్మ!

దేశమతగౌరవంబుల దెలుసుకొనుము! కులముగోత్రము మనమున నిలుపుకొనుము
తొంటి సాధ్వీమతల్లుల త్రోవలెటిగి నవ్యమార్గానువర్తివై నడువుమమ్మ!

భావిభారత సౌభాగ్యపటిమ నీదు చేతలందును పూసెడు పూతలందు
నిలిచియున్నది—జాగ్రత! నేర్చుకొనుము పరులు నినుజూచి నేర్చెదు పద్ధతులను.

హిందూమతం - అహింస

వేదకాలమునుంచి అహింసయొక్క ఉత్కృష్టత, పరిణామము.

●

శ్రీ ఆకుండి వెంకటేశ్వరరావు

●

మహాత్ముడు 'అహింస'ను ఆరాధిస్తున్నాడు; అనుష్ఠిస్తున్నాడు; అఖిల ప్రపంచాన్ని తనను అనుకరించమని ఆదేశిస్తున్నాడు—
అయితే ఈ 'అహింస' హిందూమత సాంప్రదాయానికి ఎంతవరకు తోడు వస్తుంది?—
మహాత్ముని ఆశయానికి పూర్వాపర మీమాంస—

హిందూమత ధర్మాల్లో అహింస సర్వోత్కృష్టమైనది. పంచమవేదమైన భారతంలోకూడా, అహింస సకల ధర్మాల్లోకీ శ్రేష్టమైనదనీ, మిగిలిన ధర్మాలన్నీ అహింసారూపాలే అని చెప్పబడింది.

"ధర్మ కోటులన్నియు లోనగు నిద్ధగుణ యహింస కింతనిజము"

ఆ॥ దానమును, దపంబు, ధర్మంబు యజ్ఞంబు
శౌచమంత్రతంత్ర సత్యములును
బుధులహింస రూపములుగాఁ జెప్పుట
నెల్లకల్మి నమ్మహింసకలిమి.

శ్రుతులుంకూడా "అహింసా పరమోధర్మః" అని చెపుతున్నాయి. సకల ప్రాణికోటులూ శాంతిభద్రతలతో జీవితయాత్ర సాగించుకోటాని కీసూత్రమే మూలాధారం. కాని తరువాత బయలుదేరిన బౌద్ధమతమే యీ అహింసా సిద్ధాంతాలను సృష్టించి, పోషించినదనీ, ఆ తరువాతనే హిందూమతం ఆ సిద్ధాంతాలను గ్రహించినదనీ కొందరి యభిప్రాయం. * బౌద్ధమతంలో జంతువులను చంపకూడదు గాని మాంసభక్షణ చేయవచ్చునని, బుద్ధుడుకూడా మాంసభక్షణ చేసినట్లు కొన్ని బౌద్ధ గ్రంథాల్లోవుంది.

కాని బౌద్ధయుగానికి ముందనేక సంవత్సరాలకి పూర్వమే (బుద్ధునిజననం-క్రీ-పూ. 624) హిందూమతంలో కేవలం మాంసభక్షణ నాపుటకేకాక, అనేక ఉత్కృష్టాశయములతో అహింసా సిద్ధాంతములను బోధించి, ప్రజా ప్రబోధనకు అనేక మార్గాలవలంబించారు. ముఖ్యమైనది ధర్మశాస్త్రాల్లో వాటి కెక్కువ ప్రాధాన్యం ఇవ్వడం. మన మతధర్మశాస్త్రాల్లో మనుస్మృతి ప్రధానమైనది. దానిలో జీవహింస చేయకూడదని అనేక విధాలుగా శాసించబడివుంది.

* బౌద్ధసూత్తములు. మహాపరినిబ్బన సూత్తము పే 72.

"స్వమాంసం పరమాంసేన యోవర్ధయితు మిచ్ఛతి
అనభ్యర్చ్య పితౄన్దేవాం స్తతోఽన్యో నాస్త్యపుణ్యకృత్.
యావన్తిపశురోమాణి తావత్కృత్వోహమారణం
వృధాపశుఘ్నః ప్రాప్నోతి ప్రేత్యజన్మని జన్మని."

శాస్త్రవిహిత కర్మలకుకాక, జంతువులనుచంపి మాంసభక్షణచేసిన వాడు పాపాత్ముడు. అతడు చంపిన జంతువున కెన్నిరోమాలుంటే అన్ని జన్మలలో ఘోరమరణం పొందుతుంటాడు. ♦ సాధుజంతువులను మాంసభక్షణకొరకు చంపినవాని కిహపరములందుకూడా సౌఖ్యముండదు. జంతువు నేవిధంగాను హింసించకుండా, మాంసభక్షణ అసంభవం కనుక, ఆసంగతి తెలిసికొని మాంసభక్షణ మానవలెను. వీనివలన మాంసభక్షణ, దానికి మూలమైన జీవహింస మానవలసిందని, శాస్త్రం బోధిస్తోంది. కాని సృష్టిలోనే జీవంమీద, జీవం ఆధారపడి వుండడంచేత, ఎన్నిశాసనాలు చేసినా పూర్తిగా జీవహింస మాన్పించలేరు. అందుచేత యజ్ఞయాగాదుల్లో బ్రాహ్మణులు, వేటలో క్షత్రియులు తప్ప యితరత్రా జీవహింస చేయకూడదని శాసించారు.

గృహేగురావరణ్యేవా నివసన్నాత్మవాన్ద్విజః
నావేదవిహితాం హింసా మాపద్యపిసమాచరేత్॥

గృహస్థాశ్రమంలోగాని, బ్రహ్మచర్యాశ్రమంలోగాని, వాన ప్రస్థాశ్రమంలోగాని, ఆపత్కాలమందుకూడా వేదవిహితముకాని హింస చేయకూడదు. † వేదవిహితంగాచేసిన హింస అహింసగానే భావింపబడుతుందని స్మృతులు చెపుతున్నాయి.

ఏష్వర్థేషు పశూన్హింసన్వేద తత్వార్థవిద్ద్విజః
ఆత్మానంచ పశుంచైవ గమయత్యుత్తమాంగతిమ్.

వేదవిహితకర్మలలో బ్రాహ్మణులచే వధింపబడిన పశువులు, కర్తలుకూడా ఉత్తమగతి పొందుతారు. ‡ ఔషధముకొరకు, యజ్ఞయాగాదులకు చంపబడిన పశుపక్ష్యాదులకు మంచి పునర్జన్మ లభిస్తుంది.

మధుపర్కేచ యజ్ఞేచ పితృదైవత కర్మణి
అత్రైవపశవో హింస్యానాన్యత్రేత్య బ్రవీన్మనుః.

మధుపర్కమునకు (వివాహకాలమందు "నామాంసోమధుపర్కః") యజ్ఞయాగాది పితృదైవత కార్యములకు తప్ప మరెప్పుడు పశుహత్య చెయ్యకూడదని మనువు శాసిస్తున్నాడు.

ఇటువంటి యజ్ఞయాగాది కర్మలలోనైనా జీవహింస, మాంసభక్షణ చెయ్యవచ్చునన్నారు కనుక రోజూ ఆకర్మలు చేయకూడదా అని శంకించవచ్చు. * యజ్ఞయాగాదులు చేసేవాడు కొన్ని ప్రత్యేకాచా

♦ మనుస్మృతి 5 వ అధ్యా. శ్లో. 45,48,49,. † 44, శ్లో. ‡ 40 శ్లో.

* వేదా స్త్యాగశ్చనియమాశ్చతపాంసి చ
నవిప్రదుష్ట భావస్యసిద్ధింగచ్ఛన్తి కర్హించిత్.

ఠలు కలిగివుండాలి. "భోగాదివిషయ సేవాసంకల్పశీలురు" కానివారు వేదనియుక్తమైన విధివిధానం ప్రకారం యజ్ఞయాగాదులు చెయ్యాలి. అల్లాచేసేవారు అప్పుడే బహుస్వల్పంగా వుండేవారు. ఇప్పుడటు వంటివారు నూటికొక్కరైనా వుంటారో వుండరో అనుమానమే. ప్రజలుకూడా అప్పుడు పాపభీతికలిగి ధర్మశాస్త్రములను శిరసావహించి, వేదోక్తకర్మల నాచరిస్తూ ప్రవర్తించేవారు. ఏకారణంచేతనైనా ధర్మశాస్త్రానికి వ్యతిరేకంగా నడిచినట్లైతే రాజులు దండనీతి ననుసరించి శిక్షించటమే కాకుండా, శాస్త్రోక్తప్రాయశ్చిత్తం చేసుకుంటేగాని సంఘంలో వారికి స్థానంలేకపోయేది. జీవహింస కెంతో కఠినశిక్షలు, ప్రాయశ్చిత్తాలు విధించారు శాస్త్రకారులు.

మనుస్మృతి అధ్యా. 11 శ్లో: 108, 109, 110, 111, 112, 113, 114, 115,
అనేన విధినాయస్తు గోఘ్నోగామను గచ్ఛతి
సగోహత్యాకృతం పాపం త్రిభిర్మాసైర్వ్యపోహతి.
116, 131, 132, 133, 134, 135, 136, 137, 156 శ్లో॥

కనుక ఇటువంటి కఠినశిక్ష లేర్పాటుచేసి వుండటంచేతను, ప్రజలు ఆయా నియమాలను శిరసావహించి, శాస్త్రాలకిలొంగి చరించేవారగవడంచేతను, ఆకాలంలో జీవహింస యజ్ఞయాగాది కర్మలలో తప్ప వుండేదికాదని వూహించవచ్చు. పూర్వం జనసామాన్యానికంతకీ పాపపుణ్యాలంటే నమ్మిక, భయభక్తులు వుండటంచేత పెద్దలు ప్రతీకార్యానికీ పాపపుణ్యాలతో సంబంధం పెట్టేవారు. అందుచేత పాపానికి భయపడి అశాస్త్రీయాచారాలు చేయకుండా పుణ్యసంపాదనకోసం శాస్త్రీయాచారాల నాచరిస్తూ శాస్త్రదూష్య జంతుహింసమాని జంతువుల నతిప్రేమతో సంరక్షించేవారు.

అదిగాక అర్థశాస్త్రరీత్యాకూడా జంతు సంరక్షణ, అహింసావ్రతం చాలా అవసరమని గ్రహించారు పూర్వులు. అందుచేతనే కౌటిల్యుని అర్థశాస్త్రంలో జంతు సంరక్షణ విషయంలో చాలాశ్రద్ధ తీసుకోవాలని బోధించుతూ తదనుగుణ్యంగా అనేక సూత్రాలను, నియమాలను, శాసించాడు. ♦ అన్ని విధములైన జంతువులను పక్షులను ఏయేవిధంగా రక్షించాలో దీనివలన ఎంతెంత ఉపయోగాలున్నాయో వివరింపబడిన సూత్రాలనేకం దానిలోవున్నాయి. జంతు సంరక్షణ ఎంతముఖ్యమో అరణ్యరక్షణకూడా అంతముఖ్యమని జంతురక్షణకు "అభయారణ్యాలు"ని (Reserved Forests) కొన్ని అరణ్యాలను ప్రత్యేకించాలనీ వాటినేకారణంచేతనూ నిర్మూలించకూడదని శాసించబడివుంది. వీటిలో అనేక రకాలైన జంతువులు ప్రభుత్వ సంరక్షణలో వుంటాయి. ఈ అభయారణ్యాలలో క్రూర జంతువుల్నికూడా ఎవ్వరూ పట్టుకోకూడదు చంపకూడదు. † ఏనుగులు మొదలైన జంతువుల విషయంలో ఆరోగ్యాదివిషయములను వయోభేదములను బట్టి ఆహారాది విషయములను, సాలల నిర్మాణము, రక్షకులు, వారి విధులనుగూర్చి అనేకవిషయాలు రచింపబడి వున్నాయి. ‡ జబ్బుజంతువులు, చూడు జంతువులు మొదలైనవి హద్దుమీరినడిచినా వాటిని సాధుమార్గంగా బయటికి పంపివెయ్యాలిగాని ఏవిధంగాను శిక్షించకూడదు. జంతువులను బాధించిన వారికి నేరాన్ని బట్టి శిక్షలు విధింపబడతాయి. * జంతువుల జాతిభేదములనుబట్టి హింసావిధానమునుబట్టి ప్రత్యేక జరిమానాలు శిక్షలు వున్నాయి. † ఏనుగులకు గుఱ్ఱములకు ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలని అర్థశాస్త్రంలో చెప్పబడివుంది.

♦ II అధ్యా 17,26. † II 29, 32. ‡ III అధ్యా. 10.

* III 19. † II 2.

ఏనుగును చంపినవానికి ఉరిశిక్ష విధిస్తారు కాని సహజంగా మరణించిన ఏనుగుదంతం తెచ్చినవారికి బహుమతి యిస్తారు. ‡ గుఱ్ఱములను రెండురోజుల కొకమారు కడిగి గంధంపూసి పూలమాలలతో అలంకరిస్తారు. ప్రతీ అమావాస్య, పౌర్ణమిలకి యుద్ధపు గుఱ్ఱాలకి యుద్ధానికి వెళ్లేటప్పుడు; వచ్చిన తరువాత, జబ్బుసమయాల్లోను పురోహితుడు మంత్రయుక్తంగా హారతులివ్వాలి.

యుద్ధ సమయాల్లో ఏనుగులు, గుఱ్ఱములు రాజ్యరక్షణకి చాలా వుపయోగపడతాయనే వాటికంత ప్రత్యేకశ్రద్ధ తీసుకుంటారు. ఇటువంటి అర్థశాస్త్రసూత్రాలనుబట్టి చూస్తే జంతువులయందింత శ్రద్ధ తీసుకుని సంరక్షిస్తూ జంతు హింసలకు కఠినశిక్షలు ప్రాయశ్చిత్తములు విధించటానికి అహింసా సిద్ధాంతాలయందు పాప పుణ్యాలమీద భక్తి శ్రద్ధలమాట యెలావున్నా మానవునకు వాటివలని లాభమేకారణం అని తెలుస్తుంది. ఆవులు, మేకలు మొదలైన సాధుజంతువులయందున్న శ్రద్ధ మిగిలిన జంతువులయందు లేదు. క్రూరమృగము లను వేటరూపంలో చంపటానికి శాస్త్రం సమ్మతిస్తుంది. § అర్థశాస్త్రరీత్యా ఏ విషయానికీకూడ ఆవును, దూడలను, పాలిచ్చే జంతువులను, పనుల కుపయోగించే ఎద్దులు మొదలైన వానిని చంపకూడదు. గోవువల్ల నున్న ఉపయోగాన్నిబట్టే దానికి బ్రాహ్మణునికంటె ఎక్కువ గౌరవం ఇచ్చి (గోబ్రాహ్మణేభ్యో శుభమస్తు నిత్యం) పూజిస్తారు.

యజ్ఞయాగ పితృకర్మల్లో తప్పకుండా గోవధ చెయ్యాలని స్మృతులు చెప్తున్నాయి. అతిధికి ఆవు మాంసంతో భోజనం పెట్టాలని కొన్ని గ్రంథాలు చెప్తున్నాయి. అందుకనే అతిధికి "గోఘ్నం" అని సార్థకనామంగా వాడబడుతోంది. తన యాశ్రమానికి వసిష్టుడు వచ్చినప్పుడు విశ్వామిత్రుడు ఆవుమాంసంతో అతిధి సత్కారంచేసినట్లు ఉత్తరరామ చరిత్రలో వుంది.

తరువాత రచింపబడిన కావ్యాదుల్లోకూడా, ఋషులు ఋష్యాశ్రమాలు ఈ అహింసా సిద్ధాంతాలను పూర్తిగా ఆచరించి జంతువులపై తమప్రేమ వాత్సల్యములను ప్రత్యక్షరూపాలతో ప్రజలకు బోధించినట్లు, కొందరు మహానుభావులు అల్పప్రాణి రక్షణార్థం స్వప్రాణాల్ని కూడా అర్పించి అహింసా సిద్ధాంతాల నధికభక్తితో ఆచరించినట్లు రచింపబడివున్నాయి. మహారణ్య మధ్యవున్న ఋష్యాశ్రమాల్లో అన్ని జంతువులు నిర్భయవిహారం చేస్తుంటాయి. రాజులు వేటకుపోయినా, అనేకనియమాలకు కట్టుబడి వర్తించాలి. ఆశ్రమ మృగాలను, సాధుజంతువులను చంపకూడదు. కాళిదాసు శాకుంతలంలో ప్రథమాంకంలో ఈ విషయం చక్కగా బోధపడుతుంది. మృగయా విహారంచేస్తూన్న దుష్యంతుడు కణ్వాశ్రమంలోని ఒక మృగాన్ని చంపబోతుంటే ఋషికుమారుడు చూచి 'వజ్రకఠినమైన నీబాణము నీ మృగ పుష్ప మృదుశరీరముపై, ప్రయోగింప వలదు వలదు'ని వారిస్తాడు.

నఖలు నఖలు బాణస్సన్ని పాత్యోయ మస్మి
న్మృదుని మృగశరీరే పుష్పరాశా వివాగ్నిః
క్వబత హరిణకానాం జీవితం చాతిలోలం
క్వచ నిశితనిపాతాస్సార పుంఖాశ్శరా స్తే.

దుష్యంతుడు తక్షణం తన బాణాన్ని ఉపసంహరించుకొని ఋషికుమారునికి నమస్కరించి అతని ఆజ్ఞ శిరసావహించి వెళ్లిపోతాడు. తరువాత కొంతదూరాన్నున్న ఒక దృశ్యమును తన మాతలికి చూపుతూ

‡ II 30, 32. § II 26.

రోహిణి పిక్చర్సువారి 'తెనాలి రామకృష్ణ'లో పుష్పం భూమిక - చంద్రిక

బొంబాయిలో హిందీ ప్రచార సభవారి యాజమాన్యమున జరిగిన కోవిద, రాష్ట్ర భాషా
పట్ట ప్రదానోత్సవములో, పట్టముల స్వీకరించిన యువతీ మణులు

దుష్యంతుడిలా వర్ణిస్తాడు. "చిలుకలు మొదలైన పక్షులు చెట్లక్రింద చల్లబడిన వరిధాన్యమును నిర్భయంగా ఏరుకుని గూండ్లలోవున్న తమ పిల్లలకు పెడుతున్నాయట. చిన్ని లేడిపిల్లలు మనుష్యులవలని భయంలేదని సంపూర్ణ విశ్వాసంతో, స్వేచ్ఛగా ఆడుకొంటున్నాయట."

నీవారాశ్శుకగర్భకోటరముఖభ్రష్టా స్తరూణామధః
ప్రస్నిగ్ధాః క్వచిదింగుదీఫలభిదస్సూచ్యంత ఏవోపలాం
విశ్వాసోపగమాదభిన్నగతయశ్శబ్దం సహంతేమృగా
స్తోయాధారపథాశ్చవల్కలశిఖా నిష్యంద రేఖాంకితాః.

దీనినిబట్టి ఆశ్రమవాసులచ్చటి పశు పక్ష్యాదుల నెంత ప్రేమవాత్సల్యాలతో సంరక్షిస్తుంటారో గ్రహించవచ్చు. వారచ్చటి పశుపక్ష్యాదులను తమ పుత్రుల విధంగా భావించి సహజపుత్ర వాత్సల్యతతో ఆదరిస్తారన్న సంగతి శకుంతల వచనాన్నిబట్టి స్పష్టపడుతుంది. శకుంతల దుష్యంతుని గృహానికి వెళుతూ తన ఆశ్రమ మృగాలనిగూర్చి విచారిస్తుంది. లేడిపిల్లలకు కాళ్లలో దర్భలు, కుశలు మొదలైనవి గ్రుచ్చుకుంటే వాటినితీసి, నూనె మొదలైనవి రాసి పరిచర్యచేసి సంరక్షించేదట శకుంతల.

ఉద్గళిత దర్భకబళా మృగాః పరిత్యక్త నర్తనమయూరాః
అపసృత పాండుపత్రాః ముంచంత్యశ్రూణీవలతాః.
యస్యత్వయా వ్రణవిరోపణమింగుదీనాం
తైలం న్యషిచ్యత ముఖేకుశసూచివిద్ధే
శ్యామాకముష్టి పరివర్ధిత కోజహాతి సోయం
నపుత్ర కృతకః పదవీం మృగస్తే.

బాలబాలికలకు సులభంగా బోధపడేలాగు, ఈ అహింసావ్రతాన్ని శిరసావహించి ఆచరించే ఆదర్శపురుషుల జీవిత చరిత్రలనేకం భారతంలో రచింపబడి వున్నాయి. శిబి చక్రవర్తి ఒకచిన్న పావుర ప్రాణ రక్షణార్థం తన శరీరాన్ని కోసి అర్పించాడు. జీమూతవాహనుడు విషసర్పాన్ని గరుడుడునుండి రక్షించటానికి తన ప్రాణాన్నే అర్పించాడు.

ఆ యీ విషయాలన్నింటినీ బట్టి హిందూమతంలో అహింసావ్రతం ఆదినుంచీ చాల ఉత్కృష్ట స్థానం అలంకరించి ప్రధాన మతసూత్రాల్లో ఒకటిగావుండి ప్రజాబాహుళ్యం అందరిచేతను అనువర్తింప బడినట్లు గ్రహింపవచ్చును. మన ప్రాచీన విజ్ఞాన సర్వస్వానికీ మూలాధారమలైన ఋష్యాశ్రమాలే ఈ అహింసా వ్రతబోధనకి కూడా ముఖ్యాంగాలుగా వుండేవని కణ్వాశ్రమ చరిత్రని బట్టి తెలుస్తోంది. కాని యీ నాడు మన భారతదేశంలో కూడా అన్ని జాతులలోనూ జీవహింస, మాంసభక్షణ చాలా ఎక్కువగా వుంది. ఈ రెండూ శాస్త్ర సమ్మతాలే అని, పూర్వపు యజ్ఞయాగాదులను ఉదాహరణగా చెప్తారువీరు. శాస్త్రంలో 'ప్రోక్షితం భక్షయేన్మాంసం' అని మంత్రయుక్తమైన మాంసమునుతినవచ్చునని వుంది. ఆ ప్రకారం సకల మంత్రప్రభావ సంపన్నులైన వారప్పుడు, వేదోక్త మంత్రయుక్త కర్మలాచరించి, నాటికో, కోటికో ఒకనాడు మాంసం తిన్నారని, మనం ఇప్పుడు ప్రతిదినం మాంస భక్షణచేయడం ధర్మంకాదు. ఒకప్పుడు వ్యాసులవారు కల్లు త్రాగారని శిష్యులుకూడా త్రాగడం ప్రారంభించారట. అదిచూచి వ్యాసుల

వారు శిష్యులంతా చూస్తూండగా, సలసలకాగుతున్న సీసం గడగడ త్రాగి, శిష్యులనుకూడా త్రాగమన్నారట. ఒక్కొక్కడు చేస్తే అంతాచేయడానికి వీల్లేదు. పైగా అటువంటి కర్మలీ కలియుగంలో చేయకూడదని శాస్త్రం శాసిస్తోంది. 'అశ్వాలంబం, గవాలంబం పలపైతృకం, దేవదార సుతోత్పత్తిః, కలౌపంచ వివర్జయేత్'. * యుగాన్నిబట్టి కూడా ధర్మాలు మారుతుంటాయి. కలియుగంలో (దానమేకం కలౌయుగే) దానధర్మాలే ముక్తికీ మోక్షానికీ మార్గం అని శాస్త్రంలోవున్నది కనుక సదాచారసంపన్ను లెవరైనావున్నా పుణ్యంకోసం గోహత్యలుచేసి యాగాలుచేయ నవసరంలేదు.

"తపఃపరం కృతయుగే త్రేతాయాం జ్ఞానముచ్యతే।

ద్వాపరే యజ్ఞయేవాహు ర్దానమేకం కలౌయుగే" (మను.)

దానధర్మాలే ముక్తికీ మోక్షానికీ మార్గం అని శాస్త్రంలో వున్నది కనుక, సదాచార సంపన్ను లెవరైనా వున్నా పుణ్యంకోసం గోహత్యలుచేసి యాగాలుచేయ నవసరంలేదు. భారతంలోకూడా

వాజిమేధంబు కంటెను బూజనీయకర్మ
మందురు మాంస భక్షణము విడుపు
వినుము చంపుటయును చంప బనుచుటయును
గల్మషంబుల కెల్ల నగ్గలములధిప!

అనివుంది. కాని భారతంలో వేరొకచోట † జీవహింస, మాంసభక్షణ తప్పుకాదనికూడా వుంది. మనుధర్మశాస్త్రంలోను, అర్థశాస్త్రంలోను, జీవహింస చేయకూడదని బోధించినా, రెండిండికి మతాల్లో తేడావుంది. ఇటువంటి ధర్మ వైరుధ్యా లన్నిటిలోను వున్నాయని పెద్దలే అన్నారు.

వ. ధర్మంబు బహుప్రకారంబై యుండుఁదదీయ సూక్ష్మగతి దురవ బోధంబు.

శ్రుతయశ్చభిన్నాః స్మృతయశ్చభిన్నాః మహామునీ నాంమతయశ్చభిన్నాః
ధర్మస్య తత్వం విహితం గుహాయాం మహాజనో యేనగతః సపంథాః.'

కనుక ధర్మాధర్మాలు, శాస్త్రాలు ఎలావున్నా, కాలాన్నిబట్టి ఉచితానుచితములను గ్రహించి, ప్రస్తుతం యావద్భారతదేశానికి దైవసముడు, గురువు, ఆదర్శపురుషుడుగావున్న గాంధీ మహాత్ముని యుపదేశాల ననుసరించుట మనవిధి. జీవహింసవలన దేశానికీ, దేహానికీ ఎంతో నష్టం కలుగుతోందని అనేక వ్యాసాల్లో మహాత్ముడు బోధించాడు. అసలిటువంటి దురాచారాలు ప్రబలటానికి, మతధర్మాలు తారుమారవటానికి, మన మతగురువులు, మత ప్రవక్తలు, తమ విద్యుక్త ధర్మాలను మరచి, తమ బాధ్యతను గుర్తించక ప్రవర్తించటమే కారణం. అందుకనే, There are 1½ millions of Sadhus and if every Sadhu did his duty, India could achieve much. Jagatguru Sankaracharya does not deserve that appelation, because he has no more force in him. అన్నాడు గాంధి. కనుక జీవహింసను మాని, అహింసావ్రత దీక్షవహించి, దేశసౌభాగ్యాన్ని పెంపొందింప వలసిన బాధ్యత, మతాధికారులది — ప్రతి భారతీయునిదీని.

* 'తపఃపరం కృతయుగే త్రేతాయాం జ్ఞానముచ్యతా

† అరణ్యపర్వం. అశ్వా. 5

వింత వింతల ప్రపంచం

ప్రాణంపోవడాన్ని గురించి ఇటీవల అనేకమైన పరిశోధనలు జరుగుతూవచ్చాయి. ఈ పరిశోధనల ఫలితంగా గుండెకాయ కొట్టుకోవడం ఆగిపోయినతర్వాత కూడా శరీరంలోని కొన్ని అవయవాలు వాటి పని అవి చేస్తూవుంటాయని, అందువల్ల ఏ అవయవమైనా పని చేస్తూవున్నదంటే దానినిబట్టి మిగతా అవయవాలచేత తిరిగి పనిచేయించవచ్చుననిన్ని తేలింది. అంటే, చనిపోతే తిరిగి బ్రతికించ వచ్చునని తేల్చారు. అలా బ్రతికించడానికి ఏం చేయాలి అనేదిమాత్రం ఇంకా తేలలేదు. ఈ పరిశోధనల మూలకంగా తేలినదేమిటంటే—గుండె ఆగిపోయిన 10 నిమిషాలవరకు మెదడు పనిచేస్తుందని, గుండెకాయ యొక్క కండరాలు 20 నిమిషాలవరకు జీవించి వుంటాయని, కళ్లు 30 నిమిషాలవరకు, చెవులు ఒకగంటకాలము వరకు, కాళ్లు చేతులయొక్క కండరాలు 4 గంటలవరకు, రక్తనాళాలు, ధాతువులు 18 గంటలవరకు, ఎముకలు 3 రోజులవరకు, చర్మము 5 రోజులవరకు జీవించివుంటాయని తేలింది. ఈ సంబంధమైన పరిశోధనలు ఇంకా జరుగుతున్నాయి.

♦ ♦ ♦ ♦

యూరోప్‌లోకల్లా స్త్రీలలో ఎక్కువ వయస్సువచ్చినవాళ్లలో మాగ్డాలిలా నిడ్జిస్‌వెక్ అనే ఆమె. ఆమె ప్రస్తుతం వయస్సు 105-సంవత్సరాలు. ఆమె యిటీవలనే పెళ్లిచేసుకుంది, 60 ఏళ్ల అబ్బాయిని. ఆమెకు ఇదివరలో 4 వివాహాలు అయినాయి. ఆ నలుగురు చనిపోయిన తర్వాతనే యిప్పుడీ వివాహం చేసుకుంది.

♦ ♦ ♦ ♦

హార్వే హెమిల్టైన్ అను ఒక యువతి విడాకులివ్వడంలోనూ, పుచ్చుకోవడంలోనూకూడా చాలా ప్రావీణ్యత సంపాదించింది.

1903లో సండర్‌లాండులో ఎర్నెస్టు హార్వే అనునతణ్ణి పెళ్లిచేసుకుంది. రెండు సంవత్సరాలు తరువాత అతడికి విడాకులిచ్చి బక్లె అనునతణ్ణి వివాహమాడింది. మళ్లీ అతడికి విడాకులిచ్చి మొదటిభర్తను వివాహంచేసుకుంది. ఈ ప్రకారంగా 9 పర్యాయాలు యీ వివాహాలు, విడాకులు జరిగాయి. 9 వివాహములు జరిగినా అయిద్దరు భర్తలతోటే. కాని 1938లో మళ్లీ విడాకులివ్వడంకోసం కోర్టులో పిటీషను పెట్టుకుంటే జడ్జీ వప్పుకున్నాడుగాదు. పైగా అయిద్దరు భర్తలను కాక, ఇంకొకణ్ణిపెళ్లాడితే పిటీషన్ను మన్నిస్తానన్నాడు. దానికామెఇష్టపడక పిటీషను తీసివేసుకుంది.

♦ ♦ ♦ ♦

ఈజిప్టుదేశీయులైన ఒకయువతి యువకుడు విమానంలో పెళ్లిచేసుకున్నారు. ఆ పెళ్లికిరావలసిన బంధువర్గమంతా ఆ విమానంలోనే కూడా వెళ్లారు. పెళ్లితతంగం అంతా జరుగుతున్నంత సేపూ ఆ విమానం అలా గాలిలో ఎగురుతూనేవుంది. వధువుయొక్క యీకోర్కె నెరవేరడంకోసరమే మొదటి భర్తను వదిలివేసి యిప్పుడీ భర్తను వివాహమాడింది. విమానంలో ఆకాశాన తిరుగుతూ పెళ్లిచేసుకుంది, మనుసు తీర్చుకుంది-అయితే, క్రిందటి సంవత్సరం దీన్నిమించినది ఇంకొక వివాహం జరిగింది.

విమానంలో వివాహమాడేందుకు ఆమె మనసుపడితే, గాలిలో ఎగిరే పారచూట్లలో ఎగురుతూ వివాహమాడడానికి ఇంకొకామె మనసుపడింది. ఆమె కోరికప్రకారం ఆమె బంధువులంతా అలా గాలిలో ఎగురుతూ వివాహ తతంగంలో పాల్గొనడానికి అంగీకరించారు. అలాగే వివాహమూ జరిగింది. న్యూయార్కు పట్టణంలో—

దైవసంఘటన

శ్రీమతి వెలిదండ చూడికుడుత్తమ్మ

"నేను ఆరేళ్లపిల్లనుగా ఉన్నప్పుడే మాతల్లి ఇంకొకకానుపుకని తాను ఆబిడ్డ-నన్నువిడిచి పరలోకగతులైనారు. నా మేనత్త యమున మా ఇంటికివచ్చి కార్యాలు అయింతరువాత తాను ప్రయాణమగుచుండగా మాతండ్రి ఆమెనుచూచి కన్నీరువిడుస్తూ నన్ను తనఒడిలో కూర్చోబెట్టుకుని "యమునా? నీవీ బిడ్డను తీసుకొనివెళ్లి సంరక్షిస్తావని నిన్ను బ్రతిమాలుతున్నాను. ఇది పుట్టినప్పటినుంచి నీకడుపులో వేయవలెననియే మనమందరమూ అనుకుంటూ ఉండేవాళ్లము. తల్లి చేతితో నీ కప్పగింపబడే భాగ్యము ఈ చిన్నబిడ్డ నోచుకొనలేదు. భగవంతుడు ఇలాగ సంకల్పించగా అన్యథా ఏలాగు జరుగుతుంది?" అని వెక్కివెక్కి ఏడవడం మొదలుపెట్టాడు. మామేనత్త కన్నీరుకారుస్తూ అన్నగారినిఓదార్చి రెండుమూడు రోజులకు నన్ను తీసికొని తనభర్త ఉద్యోగపుటూరగు కటకమునకు ప్రయాణమయింది.

మేమక్కడికి 7-40 నిమిషములకు చేరాము. మా బావ శంకరరావు రైలుకువచ్చాడు. పరీక్షలు ముందరని ఈమారు మా అత్త మాబావను ఇంటివద్దవదలి వచ్చేసింది గాని పండక్కు మా ఇంటికి వచ్చినప్పుడల్లా మా బావనుకూడా తీసుకువస్తూనే వుండేది. అప్పుడు మాఅత్త మా అమ్మకూడా మమ్మల్నిద్దరినీ బొమ్మలల్లే ఆడిస్తూ సంతోషించేవారు. మేమిద్దరంకూడా 'బావా' అంటే 'సావిత్రీ'అని పిల్చుకుంటూ ఎంతో సంతోషంగా ఆడుకునేవాళ్లము. అందుకని నన్ను చూడ్డంతోటే ఒక్కగంతున రైల్లోకివచ్చి నన్ను చెయ్యిబట్టుకుని దింపాడు. అరగంటలో మేమందరమూ ఇంట్లోచేరాము. మాఅత్త ఇంట్లో ఉన్నవీ లేనివీ చూసుకుంటూ భోజనపుటేర్పాటుకు వంటఇంట్లో ప్రవేశించింది. మా మామయ్య బజారుకువెళ్లారు. ఇక ఇంటంతటికీ చిక్కింది మే మిద్దరమూను. మా వదిన చిన్నపిల్ల. నేనీవరకెప్పుడూ వాళ్ల ఇంటికి వెళ్లలేదు. మా బావ నాచేయి పట్టుకుని తాను చదువుకునేగది, తాను కుట్టించుకున్న కొత్తరకపు దుస్తులూ, అప్పుడప్పుడూ తినటానికని కొనుక్కొని దాచుకున్న బిస్కెత్తు డబ్బాలుచూపిస్తూ నాకొనాల్గు బిస్కెత్తులు ఇచ్చి తనచెల్లికి రెండిచ్చి తానూ ఇన్నితిన్నాడు. నాకుకూడా మాబావచూపించే చనవూ సరదావల్ల కొత్తఇల్లనే జంకు, మా అమ్మ పోయిందనే వెలితి కనబడకుండా పోయింది.

ఈలాగే కులాసాగా రోజులు గడిచిపోతూఉన్నాయి. మా ఇద్దరిమధ్య అమితమైనప్రేమ వాత్సల్యాలు వృద్ధిపొందుతూ ఉండేవి. ఒక్కనిముషమైనా ఒకరినివిడిచి ఇంకొకరం ఉండేవాళ్లంకాము. అన్నం తింటూ ఉన్నప్పుడు, తోటలో దొంగాటలాడుతూ ఉన్నప్పుడు, వీధిలో షికారువెళ్లుతూ ఉన్నప్పుడు ఎప్పుడూ నేనూ కూడానేఉండేదాన్ని. మా అత్తయ్యకూడా నన్ను ఎంతోముద్దుగా చూస్తూ ఉండేది.

క్రమంగా నాకూ మా బావకూ యుక్తవయస్సులు వచ్చాయి. మునుపటంత ధారాళంగా నేను మాబావ దగ్గరకు వెళ్లలేకపోయేదాన్ని. మా బావమాత్రం తన స్వభావాన్ని వదలిపెట్టకపోవడమే కాకుండా తన కవసరమైన పనులన్నీకూడా నాచేత దండించైనా చేయించుకునితీరేవాడు. నేనుకూడా సిగ్గు అన్నది నన్ను అడ్డకుంటే అంతకంటే ఎక్కువ ఉత్సాహంగాచేయుటకు సిద్ధపడేదాన్ని. ఇవన్నీ ఒకకంట కనిపెడుతూఉన్న మా అత్తమామలిద్దరూ ఆలోచించి బావ బి. ఏ. పరీక్షకాగానే మా ఇద్దరికీ వివాహమును త్వరలో జరిగించటానికి ఏర్పాటు చేసుకున్నారు.

మాకు వివాహమైన కొద్దిరోజులకి మా తండ్రిగారున్నూ చనిపోయినారు.

కొద్దిరోజులలోనే నా భర్తకు కలకత్తా రైల్వేకంపెనీలో 150 రూ|| జీతమై మేమిద్దరమూ వేరింటి కాపురము చేయవలసివచ్చింది. మా అత్త సంరక్షణక్రింద హాయిగా ఏపూచీలేకుండా కాలంగడపిన నాకు ఈ కలకత్తాప్రయాణము కొంచము కష్టమే అనిపించింది. ఆర్డరు వచ్చీ రావటంతోటే ఎక్కువ సంతోషంతో నా భర్తగారు నాదగ్గరకువచ్చి "సావిత్రీ! రేపే మన ఇద్దరిప్రయాణము. అక్కడకూడా మన మిద్దరమే ఉండాలిసుమా. అక్కడ చూడవలసినవి, అనుభవించవలసినవి కావలసినన్ని ఉన్నవి. నా బట్టలు నా సామాను, నీబట్టలు నీసామాను జాగ్రత్తగా సర్దుకోవాలి రా" అని అంటూ నాతోకూడా సామాను సర్దేందుకు మొదలుపెట్టారు.

కలకత్తాలో మా కాపురము మూడు సంవత్సరములు హాయిగా గడిచిపోయాయి. మా కుటుంబానికి తీరని కష్టములు సంభవించాయి. అకస్మాత్తుగా మా అత్తమామలు మా ఆడబడుచుగారి పెనిమిటి ముగ్గురు కొన్ని నెలలు హెచ్చు తగ్గువగా కాలధర్మమందేరు. మా ఆడబడుచు పెనిమిటిపోగానే ఆమెను మా ఇంటికి తేవలసివచ్చింది. ఆమె చిన్నప్పుడు ముద్దుచేతనైతేనేమి, పెంకితనము చేతనైతేనేమి, చదువుకోవటానికిగాని అదుపాజ్ఞల్లో ఉండటానికిగాని అలవాటుపడిన మనిషికాదు. మొత్తంమీద కొంటెతనంమాత్రం ఎక్కువ. ఆమె మావద్దకు వచ్చినప్పటినుండి నన్నుచూస్తే కొఱకొఱలాడుతూ ఉండేది. పాపము చిన్నతనాన ఈ దురవస్థవచ్చిందిగదా అని నే నేచీరకొనుక్కున్నా, ఏవింతవస్తువు కొనుక్కున్నా, ఎక్కడికివెళ్లినా ఆమె సంగతినే ముందుచూసి మరీ నా సంగతిని చూచుకునేదాన్ని. ఒక్కొక్కప్పుడు ఆమె అన్నగారే ఆమె వేషభాషలకు, అసూయా స్వభావానికి, విసుక్కుంటూ మందలింపబోయేవారు. గాని నేను ఆయనకు సర్దిచెబుతూ నామీద ఆమె మరీ దుఃఖపడునని బ్రతిమలాడేదాన్ని. నేను సర్దుకుంటూ తిరుగుతున్న కొద్దీ ఆమె శ్వేచ్ఛావిహారం హద్దు దాటుతూవచ్చింది.

ఒకరోజు సాయంకాలం 7 గంటలకు మామూలుగా నేను వంటలోఉన్నాను. మావారు 8½ అవుతేనేగాని ఇంటికివచ్చే అలవాటులేదు. ఆనాడు మాచాకలి 'ఏదో పనిఉంది, బాబుగారు వచ్చునప్పటికి వస్తాను' అనిచెప్పి వెళ్లిపోయినాడు. నాకు దొడ్డివైపున ఉన్నగదిలో ఏదోసందడి అవుతూఉన్నట్టు, ఏదో రహస్యంగా మాటాడుతున్నట్టు చిన్న అనుమానంకలిగింది. మా ఆడబడుచు కొన్నిదినములనుండి మా ఇంటి కెదురుగా కొత్తగా దిగిన ఒక నాయుడి కుటుంబముతో స్నేహంగా తిరగటం, అరమరభ్యంతరాలు లేకుండా హాస్యాలు ఆడుకోవటం నేను కనిపెట్టుతూనే ఉన్నాను. అందుకని నే నెరగనట్టే ఆవైపైనా వెళ్లకుండా తప్పించుకున్నాను. కాని దైవఘటన వేరుగాఉన్నది. నా భర్తగారు రావలసినవేళకంటె చాల ముందుగా వచ్చారు. నాకాళ్లు గడగడలాడాయి. ఆమెకు అన్నగారు వచ్చారని తెలియపర్చాలి. తెలిపితే ముప్పు, తెలుపకుంటేముప్పు ఏం చేయటానికి తోచలేదు. చివరకు తెగించి ఏదోపని ఉన్నట్టుగా ఆ వైపులకువెళ్లి "కామేశ్వరీ! మీ అన్నగారు పిలుస్తున్నారు" అని ప్రాణం ఉగ్గబట్టుకొని పిల్చాను.

వెంటనే కామేశ్వరి ఒళ్లు సవరించుకుంటూ ఏమీ ఎరగనట్టు ఇవతలికిరావటం, ఆ నాయుడు గోడదూకి పారిపోవటం ఒక్కసారి సంభవించింది. గాని నేను వాళ్లవ్యాపారాన్ని కనిపెట్టానని బాగా వాళ్లకు నమ్మకం కుదిరింది. ఆమె మనస్సులో నామీద ధూమానలం బయలుదేరింది. ఏవిధంగానైనా నామీద నాభర్తకుండే అనురాగలతను సమూలంగాతెంచి నన్ను పాడుచేయాలని గట్టిపట్టుపట్టింది.

ఆ నాయుడిభార్య ఒకమోస్తరు అందగత్తె. తరుచు ఆమె మా కామేశ్వరివద్దకురావటం, నాభర్త గారు హాల్లోకూర్చుని ఉంటూఉంటే ఆ యిద్దరు ఆ ఎదుటిగదిలోనే ఏదో నెపంపెట్టుకుని కాలక్షేపం చేస్తూ ఉండేవారు. నా అదృష్టంకొద్దీ నాకూ ఆ రోజుల్లోనే నలతప్రారంభించింది. అందువల్ల అన్నిపనులూ కామేశ్వరే జరుపవలసివచ్చేది. నా కంతకంతకూ జ్వరముహెచ్చి మేడ దిగలేనిస్థితిలోనికి వచ్చాను. డాక్టరు వచ్చిచూచి పోతూఉన్నాడు. ఒకరోజు నా భర్తగారు రోజూ వస్తూఉన్నట్టుగా వంటరిగారాక ఆనాయుడితో ఏదో మాట్లాడుతూ నా దగ్గిరకువచ్చారు. నా కతనిని చూడంగానే ఒకవిధమైన భయోత్పాతమైంది. నాభర్త ఇది ఏదీ కనిపెట్టనేలేదు. అతనిని కొంచందూరంలో కూర్చోబెట్టి ఆయన నామంచంమీద కూర్చుని "ఏమి సావిత్రీ! ఎలాగున్నది? నేనీ వంటరితనాన్ని భరించలేకుండా ఉన్నాను. ఇంటికివస్తే నాతో చనువుగా మాటాడేవాళ్లు లేకపోతే నాకుతోచదు. దేవుడు నాకీలాంటి స్వభావంపెట్టడం ఒక దురదృష్టమే." అని విచారంగా పలికారు. నేనూ సవిమర్శంగా ఆయనవైపుచూస్తూ "ఇందులో నాలోపమేమున్నది. భగవత్సంకల్పం నాయడల ఈలాగుంటూంటే ఎదురీదటానికి నావల్లనవునా? అయినా ఇప్పుడు కొంచము నయంగానే ఉంటున్నదిగదా! మీరు ధైర్యముతెచ్చుకొని నాకు ధైర్యమీయవలెనుగాని మీరే తొందరపడిన ఇంక నేనేమిచెప్పను" అని అంటూ ఆ నాయడ్నిచూచి "ఆయనెవరు?" అని అడిగాను. ఆ ప్రశ్నకు సరియైన జవాబీయుటకు దొంగతనం చేస్తూఉన్నట్టు కనబడ్డారు. మును పెప్పుడూ ఇటువంటి స్వభావం ఆయనలో లేకపోవడంవల్ల నేనూ ఇక ముదరికించకుండా ఊరకున్నాను. ఇంకా ఏవేవో రెండుమాడు ఊసుపోని సంగతులుమాట్లాడి క్రిందికి అతనితో దిగిపోయినారు.

నేను పూర్తిగా మంచం దిగటానికి సుమారు 3 నెలలుపట్టింది. మొదట్లో ప్రతి నిమిష నిమిషానికి వచ్చి నా యోగక్షేమం కనుక్కుంటూ ఉండేవారు. అంతకంతకూ ఆయనదర్శనమే నాకు అపురూపమైపోయింది. మామూలుగా ఇచ్చేజీతము నాచేతికిరావటం ఆగిపోయింది. సంగతి సందర్భాలు పూర్తిగా నాకు బోధపడినవి. నా ఆడబడుచు పట్టినపట్టు నెరవేర్చుకుంది. నాకొంపకు చిచ్చుముట్టించింది. నాభర్తను మందలించుదామని ఎన్నిసార్లు నేను ప్రయత్నించినా ఆయనదర్శనమూ దుర్లభమైంది. నాకూ సాహసము లేకపోయింది. ఎందుకంటె మొదటినుంచీ ఆయన స్వభావము నేనెరుగుదును. ఆయన తన ఇష్టానుసారము పోవలసినవారేగాని అంతు కనుక్కునేవరకు వెనక్కుతిరిగేవారుకారు. ఒకరోజు మేడమీద ఆయన వంటరిగా కూర్చుని ఏదో ఆలోచిస్తూ ఉన్నారు. అదేసమయమనుకుని తెగించి నేనువెళ్లి నిల్చున్నాను. నన్నుచూచి చిరునవ్వునవ్వారు. నాకుమాత్రం పట్టలేని దుఃఖంవచ్చింది. ఆయన నాముఖం ఎత్తి కన్నీరుతుడుస్తూ "ఎందుకీలాగు వెఱ్ఱిదానిలాగు ఏడుస్తున్నావు! నీకు జరిగిన లోపమేమిటి? నేను మునుపట్లాగ కనబడటంలేదనేనా? నీవందుకు విచారించకూడదు. ఒక్కొక్క సమయంలో ఒక్కొక్కవిధంగా వ్యక్తి మారుతాడనే ప్రకృతి రహస్యం తెలుసుకొని నిదానించాలి." అని నన్ను ఓదార్చారు. ఆమాటలు శూలములవలె నాటాయి. ప్రత్యక్షంగా తనమార్పును సమర్థించుకుంటూ ఉన్నమనిషితో నేనేం మాట్లాడగలను? నేనేం వ్యతిరేకంగా మాటాడిన ఈమాత్రం సానుభూతీ దొరకదని నాకు బాగాతెలుసు. కాని కంటి నీరాగలేదు; ఆలాగేనిల్చుని నేను "మీవంటివారుకూడా ఇంతత్వరలో నిష్కారణంగా మన ఇద్దరి చిన్నప్పటినుంచీ మనతోకూడా అవిచ్ఛిన్నంగా వృద్ధిపొందుతూవున్న మన శాశ్వతాను రాగలతను నూలుపోచకన్న కనికష్టంగా త్రెంపుకుపదుకు సాహసిస్తారని నేను కల్లోకూడా ఊహించలేదు. స్ఫటికమువలెనున్న మీ పవిత్రహృదయం ఇట్టి పరి

ణామన్ని పొందటం నా దురదృష్టమే అని భావించి ఊరుకోవలసినదేకదా." ఇంక నేను ఒక్కమాటను కూడా పలకలేకపోయాను. ఆయన ఇంకా ఏమీ ఎక్కువమాటాడక "మరేం భయంలేదు. నీకోరిక నేను కనబడటమేకదా? సరేలే. నాకుపని ఉన్నది" అని అంటూ నావైపుచూడనైన చూడకుండా క్రిందికిదిగి వెళ్లిపోయినారు. నేనలాగే స్థాణువునైపోయినాను. నాకేమీ చేయుటకుతోచలేదు. ఆలాగే ఆ మంచంమీద ఏడుస్తూ ఎంతసేపున్నానో ఆ పరమాత్మునికేతెలుసు.

ఈవిధంగా మరో ఆరునెలలు గడిచాయి. నా దౌర్భాగ్యదేవతయే నాల్గువైపులా కనిపిస్తున్నది. ఇంట్లో విలువైన సామానులన్నీ నాయుడు ఇంట్లోకి వెళ్లినవి. చివరకు పండుకొను మంచాలు కూర్చున్న కుర్చీలు సహా నడచినవి. నా వంటిమీద అలంకారములు అప్పులకని, నా మందులకనీ చెప్పి ఆవరకే పూర్తి చేసేరు. ఒకరోజున నా రోజుల దీనతను విచారిస్తూ సావిట్లో కూచున్నాను. నా భర్త జోగుతూ ఇంట్లోకివచ్చి పడ్డారు. నేను దగ్గిరకువెళ్లి మీద చెయివేసి 'ఏమిలాగున్నారు?' అని అడిగాను. నావైపు వెట్టిచూపు చూస్తూ 'నీవద్ద ఏమైన సొమ్మున్నదా' అని ఆజ్ఞగా అడిగారు. 'మీరెరుగనివి నావద్ద నేమున్నదని' నేను బదులీయగా 'నీ మెడలో ఏబదిరూపాయల విలువగల ఆ మంగళసూత్రమిమ్మని' చేయిజాపారు. ఆ క్షణమందున్న నా మనఃస్థితిని నేనేలాగు చెప్పవలెనో నాకు తెలియదు. నా యావచ్ఛరీరంలోకి ఒక విద్యుచ్ఛక్తి వ్యాపించినట్లైంది. ఏమి బదులివ్వటానికి తోచక కొయ్యబారి నిలబడ్డాను. ఆ ఆలస్యమునకు ఆయన సహించలేక గర్జిస్తూ, 'ఏమీ ఈయదల్చుకోలేదా?' అని తిరిగి అడగ్గా నేను ఏడుస్తూ కాళ్లమీదపడి ఈ పని కూడదని బ్రతిమాలాను. నన్ను ఈ తృప్తితోనైనా ఉండనీయుడని వేడుకున్నాను. మన ఆ జన్మాంత బంధనమును త్రెంపజూచుట చాల పాతకమని వెక్కి వెక్కి ఏడ్చాను. ఏమనినను లాభము లేకపోవటం సరిగదా— 'ఛీ దుర్మార్గురాలా! నామాటకు బదులాడుతావా? ఈ పీడ ఎప్పుడు వదుల్తుందని చూస్తున్నాను. నీ వికమీద నా కంటికగపడకూడదు అవతలికి పో' అని నా మెడలోని పవిత్రమాంగల్యమును తీసికొని నన్నవతలికి త్రోసి తలుపువేసుకుని ఎక్కడికో వెళ్లిపోయారు.

నన్ను తల్లిలాగు మేమాఊరు వెళ్లినప్పటినుండీ కనిపెటుతూఉన్న మీనాక్షమ్మగారిది మా పొరిగిల్లే. మా సంభాషణ, నన్ను వీధిలోనికి త్రోయడం, నేను గుమ్మములో చతికిలబడి ఏడవడం ఆమె కనిపెట్టింది. నా భర్తగారు గుమ్మముదిగి వెళ్ళగానే 'అబ్బా! ఆ నరపశువు ఎంత పనిచేశాడు' అని అంటూ నావద్దకు వచ్చి 'అమ్మా! సావిత్రీ! దుఃఖపడకు మా కమలతో నీవుకూడా ఒక బిడ్డవని అనుకుంటాను. ఆ దుర్మార్గుడు నీవంటి ఉత్తమురాలియెడ ఇంత నీచంగా ప్రవర్తిస్తాడని నేనింతవరకూ అనుకోలేదు. ఎప్పటికైనా నీ సత్స్వభావమువల్ల అతడు మామూలుస్థితిలోనికి రాక మానుతాడా అని ఆశించాను. వానికేదో మూడబట్టే ఇంత దౌర్జన్యానికి తెగించాడు. ఇంక లే.' అని అంటూ నాచేతిని పట్టుకుని లేవనెత్తుతూ కన్నీరొత్త మొదలిడింది.

మీనాక్షమ్మగారి ఆదరణను నేను మరువలేను. నా భర్తగారు నేను వారింటిలో ఉన్నానని ఆ ఇంటినే వదిలివేశారు. ఎన్ని ఇక్కట్లువచ్చినా భగవంతునికి ఎప్పటికైనా దయరాదా అనే విశ్వాసము నన్ను కొన్నిదినములు జీవితాశలో ఉంచినది. వారింట్లోనే వారి బిడ్డవలె కొంతకాలం గడిపాను. నా భర్తగారి ఆచూకి మీనాక్షమ్మగారికి తెలియచున్నప్పటికీ నాకు విచారముగా ఉండునని కాబోలు నాతో

ఆ ప్రసంగము ఎత్తేవారు కారు. ఇలాగు సుమారు ఒక సంవత్సరం గడచింది. ఒకరోజు సాయంకాలం నాపేర ఒక కవరు వచ్చింది. విలాసముయొక్క దస్తూరి నా భర్తగారిది. నా వళ్లు వణకింది. ఈశ్వరునకు నామీద అనుగ్రహము కల్గినదని ఆయనకు ధన్యవాదము లర్పించాను. నా చేతులు ఆ జాబును విప్పలేకపోయినవి. నా స్థితినిచూచి మీనాక్షమ్మగారు జాలిపడుతూ తన కూతురగు కమలను చదువమన్నది. ఆమె విప్పి ఈవిధంగా చదివింది.

చి॥ సౌ॥ సావిత్రికి ఆశీర్వచనములు.

నిన్ను స్మరించుటకునైన అర్హతలేని నీ భర్త తన దీనదశయందు పంపిన ఆఖరు సందేశమును తెలుసుకుని సాహసముచేయక ఇంతవరకు నీవు చూపించిన ఓర్పుతోనే జీవితవిశేషమును గడుపుదువని నమ్ముచున్నాను. నేను నీయడల ఘోరకరమైన అన్యాయమును, దౌర్జన్యమును చూపించి పశువుకన్న హీనముగా ప్రవర్తించిన నన్ను క్షమింప వేడుచున్నాను. నా పాపమునకు తగిన ప్రాయశ్చిత్తమైనది. నావంటి క్రూరునకు ఈ ప్రపంచమందు తావులేదు. నా తరువాతి చరిత్ర నీకుచెప్పి నా జీవితమును ఈ హుగ్లీనదీ గర్భమున విడువ దలచితిని. ఆవిధముగా నిన్ను అవమానించి నేను తిన్నగా ఆ రాక్షసింటికి వెళ్లితిని. ఆమె నన్ను లాలిస్తూ అప్పటికి నేను కోరుతూఉన్న ఇంకో బ్రాందిబుడ్డిని నాకందించినది. నేను పరమానందంగా పశుస్వభావంతో విహరించితిని. ఆ సమయంలో నాచేత నా ప్రావిడెంటు ఫండు నాల్గువేలు వ్రాయించుకున్నది. ఇంకొక వారమునకల్లా నా అధికారిమీద నేను చూపించిన అమర్యాదకు నన్ను పనిలోనుండి తొలగించినట్లు ఒకజాబు వచ్చినది. ఈ సంగతి ఆ రాక్షసికి తెలిసే ముందుగా నాచేత వ్రాయించుకునియుండును. ఆమె ఏదో పని ఉందని బొంకి అక్కడనుండి రాజమండ్రికి వెళ్లిపోయినది. ఆమె వారమురోజులలో తిరిగి వస్తానన్న మనిషి నెలకూ రాలేదు. నాచేత ఒక్క కానీ లేదు. నా స్థితినిచూచి ఒక స్నేహితుడు ప్యాసు ఈయగా నేను రాజమండ్రికి వెళ్లేను. ఆ క్రూరురాలి బస కనుక్కొని లోపలికి వెళ్లాను. నన్ను చూచీ చూడ్డంతోనే ఆమె ప్రవర్తించిన ప్రవర్తన నాకు తగినదే అని నేనిప్పుడు తెలుసుకున్నాను. ఒక జమానును పిలిచి ఈ ఒళ్లుతెలియని పశువును లోపలికెందుకు ప్రవేశపెట్టావని గద్దించినది. నేను గిఱ్ఱుమని తిరిగి వీధిలోనికి వచ్చాను. ఆహా! దైవమన్నవాడు ఉన్నాడు. పాపమునకు శిక్ష కలదు. నిన్నెట్టిస్థితిలో నేను దించానో నాకట్టి స్థితియే, అంతకంటె హీనమైన స్థితియే ప్రాప్తించినది. కాని ఏంచేయగలను. అదే బండిలో తిరిగి ఈఊరికి వచ్చాను. అధికారికి క్షమాపణ చెప్పుకున్నాను. లాభములేకపోయినది. నిన్నుచూచి నీ కాళ్లమీద పడవలెనని అనుకున్నాను. నా స్పర్శ నిన్ను మలినపరుచునని మనస్సును మళ్లించుకుని తిన్నగా నదికే వెళ్లిపోవుచున్నాను. ఈ దుర్మార్గుడిని ఈ కృతఘ్నుడిని మరచిపో. నీవెప్పుడూ నమ్మి కొలుస్తూఉన్న ఆ ఈశ్వరుడే నీకు శరణ్యుడు. ఈ లోకములో ఇదే ఆఖరు శెలవు—

అనే జాబును కమలం చదివి ఊరుకున్నది. ఒక పిడుగడచినట్టు వెఱ్ఱిదాననైనాను. ఎంతమంది వద్దంటున్నను నా మేనమామల ఇంటికని ఈ రాజమండ్రికి వచ్చాను. ఆ రాక్షసిని చూచి నా బాధ తీర శపించవలెనని అనుకున్నాను. మళ్లీ తమాయించుకుని ఎందుకూ పనికిరాని ఈ జీవితమెందుకనే తెగువ నన్నీ గోదావరిలోనికి ఈడ్చుకొనిపోయినది”



పారచూట్‌ల (గాలిబుట్టలు) సహాయముతో విమానముల నుండి క్రిందకు దిగుటకు,
యుద్ధ తరిఫీదులు పొందుచున్న రష్యా వనితలు

చెన్నపురి ఆంధ్రమహాసభ – స్త్రీలశాఖ

సంక్రాంతి మహోత్సవములు



బాలికల భరతనాట్యం

కళాకలాపము

కళవల్ల ప్రయోజనం

శ్రీమతి కొమ్మూరి పద్మావతీదేవి

చెన్నపురి ఆంధ్రమహాసభ - స్త్రీలశాఖవారి అధ్వర్యాన్ని జరిగిన వారాంతోపన్యాస సందర్భంలో శ్రీమతి కొమ్మూరి పద్మావతీదేవిగారు కళయొక్క ప్రాముఖ్యతని గురించి ఉపన్యాసించారు. వారి ఉపన్యాసములో ఇవి కొన్ని ముఖ్య విషయాలు—

కళ సామాన్యమయినది కాదు. కళాప్రబోధమువల్ల మనము ఎంతైనా ప్రచారం చేయవచ్చును. విద్యాసంస్కారము ఉత్సాహము కలిగినవారు ముందుకువచ్చి కళకుతగిన ప్రోత్సాహము కలుగచేస్తే చాలా వున్నతస్థానమునకు రాగలదు. దీనికి అందరి సహకారం అవసరము. ఒక్కరివల్ల కాదు. వుత్సాహంకల అందరూ ముందడుగువేయాలి. ఇదివరలాగు కాకుండా ప్రస్తుత పరిస్థితులనుబట్టి పిల్లలు చాలా వుత్సాహంతో నేర్చుకోవాలనే ఆశతో ముందంజవేస్తున్నారు. తగిన ప్రోత్సాహము వారికి లేక యింకా వెనకగానే వున్నారు. దానికై అందరం పాటుపడాలి. అప్పుడుగాని కళ రాణించదు.

కళయొక్క ప్రయోజనము ఆత్మవికాసము కలిగించడమే గాని వినోదము కలిగించుట కాదు. పూర్వపురోజుల్లో మనదేశంలో కళకి యెంతో ప్రాముఖ్యత వుండేది. ఈ రోజుల్లో పరప్రభుత్వము వారికి మన దేశములలోని కళ బోధపడదు. అందువల్ల ముందుకి రాలేదు. ప్రజాప్రభుత్వం ఏర్పడితేనేగాని మన కళలు ఉన్నతంగా ప్రకాశించవు. రష్యాదేశము కొద్దికాలంకింద ఎంతో వెనుకపడివుండేది. అక్కడ ప్రజాప్రభుత్వము ఏర్పడిన తర్వాత ప్రభుత్వంవారు సినీమాలు, నాటకాలు తమ పోషణక్రింద పెట్టుకుని వాటిద్వారా ప్రజలకి ప్రబోధము అతిత్వరగా చేశారు. పాఠశాలలలో ఒక సంవత్సరములో చేయగల జ్ఞానబోధ ఒక్కసినీమాద్వారాగాని, నృత్యంద్వారాగాని చేయవచ్చును. కళ ప్రతీ వారిలోనూ ప్రతీ అడుగులోనూ ప్రతి విషయములోనూ ప్రతిధ్వనిస్తూనే వుంటుంది.

ఒక్కొక్కరికి ఒక్కొక్క కళయందు అభిరుచి వుంటుంది. ఒకరికి గానమందు, యింకొకరికి నృత్యమందు, మరొకరికి నటనయందు, వేరొకరికి చిత్రకళయందు అభిరుచులు వుంటాయి. అందరూ ఏకమైతే కళాప్రబోధము ఎంతైనా చేయవచ్చును.

చిన్నపిల్లలకి స్కూళ్లలో 'గొంతెమ్మ కోరికలు' అనేపాట ఏడాది నేర్పుతారు. మనంకూడా మన చిన్నతనంలో భట్టీ పెట్టేవున్నాము. యిదేనీతిని వుదయశంకరుని నృత్యంలో ప్రదర్శించారు. మీరూ చూసేవుంటారు. నిద్రలో కల...అప్సరసలు వచ్చినట్టూ, ఆకాశవీధులలో సంచరించినట్టూ, సింహాసనమూ,

రాజులూ, యింకా, యిలాటి గాలిమేడలలో వుర్రూతలూగి చివరకి అంతాపోయి మిగిలింది ఎడారిమాత్రమే. పుస్తకంలో భట్టీ పట్టడంకన్నా కళ్లకికట్టినట్లుగా ప్రత్యక్షంగా ఆ నృత్యం చూస్తూవుంటే అంతా మాయకదా అనే వేదాంతంకూడా మనకి స్ఫురిస్తుంది.

'స్త్రీ' అని యీమధ్యనే హిందీ సినీమా వచ్చింది. మీలో కొంతమంది చూసేవుంటారు. 'తల్లిదండ్రులమాట వినాలి' అని పద్యాలద్వారా పాటలద్వారా బోధించే నీతి యీ సినీమాలో చూపించారు. తల్లిమాటవినని పిల్లలగతి ఎంత హీనస్థితికి వస్తుందో, ఏస్థితిలో వాళ్లు వుంటారో, ఎంత కష్టపడతారో చూపించారు.

యిలాగే నాటకాలద్వారాగూడా ప్రబోధం చేయవచ్చును. యిలా ప్రచారంచేసే నాటకాలు ప్రస్తుతం లేవనే అనాలి. తగినసహాయంలేక యింతవరకూ ప్రచారంచేసేవి ఏవీ మనదేశంలో రాలేదనే చెప్పాలిసివస్తుంది. ఇప్పుడిప్పుడు అతి వుత్సాహంతో అందరూ ముందుకువస్తున్నారు. పిల్లలకి ఏ కళలయందు అభిరుచులు వున్నాయో మనం తెలుసుకునీ వారికి తగిన ప్రోత్సాహము యిచ్చి, వాళ్ళ ద్వారా మనము యికనైనా ఎంతో కళాసేవ చేయవచ్చును. దీనికి ముఖ్యంగా విద్య, సంస్కారము కలిగివుండాలి. తగిన వాతావరణము వుండితీరాలి. తగిన విద్యాబుద్ధులు లేకుండా పిల్లల్ని సినీమాలలోగాని, నాటకాలలోగాని, నృత్యాలలోగాని దింపకూడదు. కేవలము నృత్యమువల్లగాని, నటనవల్లగాని కళాసేవ చేయలేము. అభిరుచులు గల అందరూ కలిసి ఒకరికి యింకొకరు తోడ్పడి ఒక సంస్థగా ఏర్పడి యింకముందైనా ఏడాదికి ఒకసారి చాలు ప్రదర్శనాలద్వారా ఎంతో జ్ఞానబోధ చేయవచ్చును. మనం అందరం ఏకమైతే తప్పక మనకి ప్రభుత్వ సహకారంకూడా లభిస్తుందని తలుస్తాను.

తిక్కనా!

తే. గీ. పూజ్యమగు గౌతమీ గర్భమున జనించి
ఆమహర్షి ఆశీస్సుధ నారగ్రోలి
వ్రతములెన్ని సల్పితో! కవిబ్రహ్మ కొలకు
అదిగో! నీ ప్రేమమూర్తి ప్రత్యక్షమాయె!
చిరతపశ్శుచియగు నొక్క స్నిగ్ధ హృదిని
ఎవ్వడు నిరాకరించునే ఋషి కుమారి!
ఆత్మ నర్పించుకోవమ్మ ఆంధ్రవాణి!

ఉ. తాలుకటుంగగా విమలరాగము లాలపనంబు సేయుగో
పాలుడవీవు; నీ అమృత వాహినిలోని తరంగ బాలికల్
పూలకు ప్రేమనేర్పినవి; భూమివడంకిన దోయి తిక్కనా!
కాలము దాటనిమ్ము నినుగాదని ఎవ్వరికిత్తు మొక్కులన్.

—ఆ. సీతారామయ్య

భావతరంగిణి ★ ★ ★

"నిర్మాణ కార్యక్రమమును బాగుగా నాచరించుచో మనము గమ్యస్థానము చేరుదుము. మనకు కావలసినది సంఖ్యకాదు. కొద్దిమంది యున్నను వారు నికరమైనవారుగా నుండవలెను. గుణముగలవారనేకులున్నచో మరింత సంతోషము."

—మహాత్మ గాంధి

♦ ♦ ♦ ♦

"విదేశబట్ట, విదేశభాష మనకు భారమైనవి. మన ఖద్దరు మనస్వతంత్ర చిహ్నమెట్లో హిందీ అభ్యసనము మన నూతన వ్యవస్థకు సూచన అగుచున్నది. విదేశ భాషను నేను ద్వేషించుటలేదు. బలవంతముగ మనపై త్రోయబడినపుడు అది మనకు బాధయగుచున్నది. ఖద్దరు ధరించుట ఎట్లు అలవరచుకొనుచున్నామో, హిందీ మనోభావమును అట్లే నలవరచుకొనవలెను. ఖద్దరు మనగ్రామ పరిశ్రమ పునరుద్ధరణ కెట్లు తోడ్పడునో మన హిందీ మనోవృత్తిగూడా మన విజ్ఞానఖనిజముల బయటబెట్టగలదు. ఖద్దరు కట్టిన దేశభక్తునికి హిందీరానిచో ఎంత అవమానముగ నుండునో, హిందీవచ్చినవానికి ఖద్దరు కట్టనిచో అంత సిగ్గుగ నుండును. హిందీ, ఖద్దరు విడదీయరానివి. అట్లే అవి మద్యపాన నిషేధముతోనూ, అస్పృశ్యతా నివారణతోనూ, హిందూముస్లిం ఐక్యతతోనూ అవిభాజ్యమైనవి. ఇవి అన్నియుకలసి ఒక పరిపూర్ణ స్వరూపము గలవగును. అనగా నిర్మాణకార్యక్రమమునందు మీరు మునిగి తేలవలసియున్నది."

—డా॥ భోగరాజు పట్టాభి సీతారామయ్య

♦ ♦ ♦ ♦

"నిజంగా విజ్ఞానం అలవర్చుకోటానికి భారతం తప్పకుండా తెలుసుకోవాలి. భారత రామాయణాలు చదువని చదువు, చదువుకాదని నా నమ్మకము. దానికి మించిన జ్ఞానాభివద్ధి మరిలేదు. మీరు కుట్టుపనులు, ఆటపనులు మున్నగువాటిలో ఎంత అభిరుచి కన్పరుస్తున్నారో అట్టి ఉత్సాహమే భారతపఠనములో కూడ చూపి విజ్ఞానమలవరుచుకోవాలి. మనహిందూజాతిలో ఎందరెందరు ఎన్ని సిద్ధాంతాలు చెప్పారో అన్నీ భారతములో ఉన్నాయి. సుమారు 4 వేల యేండ్లనుంచి వేయి సంవత్సరముల పర్యంతము చేసిన పనులూ, ఆధ్యాత్మిక విషయాలూ, వాళ్ల ప్రతిభా విశేషాలూ అన్నీ మిళితమయినయి భారతంలో. ఇంకా మనుష్యునికి ప్రయత్నాల్లో ఉత్సాహమూ కలిగేటట్జూ, ఆపదలలో ఉపశమనము కలిగేటట్టుకూడా చిత్రించేది భారతం! దాన్ని మీరంతా వచనంలోనైనా తప్పక చదివి విజ్ఞానాభివృద్ధి చేసుకోవాలి"

—డా॥ కట్టమంచి రామలింగా రెడ్డి

♦ ♦ ♦ ♦

"పురుషులు తమ హక్కులను తొలగించిరి, అణచియుంచిరని ఫిర్యాదుచేసి లాభములేదు. మనమే వారి ఆధిక్యత నంగీకరించి తలయొగ్గియున్నాము. నైతికాధ్యాత్మికశక్తి మనలో గలదు. మనం తలచుకుంటే యీ ప్రపంచాన్ని ద్వేషం దౌర్జన్యంనుండి బయటకు తీయగలం. యుద్ధాలవలన ద్వేషం వినాశం తొలగదు. ప్రపంచంలో దౌర్జన్యాన్ని సహించి మనం ఆత్మలను పోగొట్టుకొనుచున్నాము. దేవుడు మనకు గాంధిమహాత్ముని ప్రసాదించాడు. భారత స్త్రీ లందరు తమ శక్తినంతను వినియోగించి, వారికి మనఃస్ఫూర్తిగ తోడ్పడి అస్పృశ్యత తొలగించుటకును, శాంతి నెలకొల్పుటకును పాటుపడవలెను."

—రాజకుమారి అమృతకౌర్

నా సీత

"పంతుల"

సీతాదేవి ఓ మధుర విపంచి; తీయని భావంగల దివ్యసుందరి. ఆకాశంమీద తోచే మబ్బుతునకల్లోని గరగరలూ, వానకారులో వొచ్చే విద్యుల్లతల జిగజిగలూ, ప్రశాంతమైన, గంభీరమైన కొలనినీటిలో నిగనిగలు, వనగర్భంలో జాలుగా పూచే సన్నజాజిపూవుల ఘుమఘుమలూ, తళతళలు ఆమెలో ధన్యత్వం పొందాయి. ఆమె పువ్వుల నవ్వులో వెన్నెల్లు ఒలుకుతాయి. ఆమె చూపులో సుధాచంద్రికలు ప్రసరిస్తాయి—

ఈ లోకంలో సీతాదేవి మహతీగానం లేతవయసులో మూకపోయినా, ఫలవంతం పొంది, మరపురాకుండా నేటికీ - ఏనాటికీ - వినిపిస్తూంది; వినిపించాగలదు. ఆ గానము పరిమళాన్ని గంధవాహం తనలో విలీనం చేసుకొంది. తొలిపూతలోనే మాలతీలత విలయాతపానికి లొంగిపోయింది. మొదటి పంటతోనే దానిమ్మ ఝంఝూమారుతానికి ఆహుతయిపోయింది. ఝురీకుమారి తొలకరి వాగుకే నిప్పులుకురిసే నిదాఘానికి నిలువు నిపాతం మోడిపోయింది.

సీతాదేవి, మూన్నాళ్లముచ్చటగా అన్ని పాటలూ పాడి, అన్ని ఆటలూ ఆడి, కాలం పొత్తిళ్లలో సుఖంగా, ఆనందంగా, హాయిగా నిద్రపోయింది. ఆమె జీవితరజనికి అపరిమిత వ్యాధి ఓ కోడికూత. సీతాదేవిని తీయని పూవుల్తో పూజించే పెనిమిటి మెత్తని చిత్తంలో ఆరనికొలిమి జొనిపింది పాడుకాలం.

తడియారని నాలుకతో యిలా జీవితంలోని వివిధ సంఘటల్నీ తలచుకొని, విషాదంగా విలాపిస్తున్నాడు భర్త.—

ఇదీ కథావస్తువు. నేటికి కథే. ఆనాటికి నిజం, అనుభవమున్నూ—

నా సీత

నాసీత ;—బంగారు నాడెంపు బొమ్మ;
నా జీవ సంజీవి, నా చైత్ర లక్ష్మి,
జపము, జీవము నాకు సంధించు శక్తి,
మన్మనోసామ్రాజ్య మహనీయరాజ్ఞి,
నవ్యశోభాత్తమా నా కళావాణి,
నాకీర్తి, నాయెద, నాప్రేమ పేటి,
నా నిండుగర్వమ్ము, నాకంటివిందు,
కష్టభాజనమైన కారుచీకట్ల
కిరవైన నాదీన హృదయవాటికను
కలకల మనిపించు గాటంపువెలుగు—
నాసీత—

ఆమె

కన్నెగులాబీల కన్నక్రొంజాయ,
మేలు మంకెన నేలు మెత్తందనమ్ము
నాసీత జిగిమోవి—నాముద్దు దీవి;
మల్లెమొగ్గల కూర్పు, చల్లందనంబు
తరళహారము, చిన్ని దంతాలవరుస;
పాలబుగ్గను దోచు పవడంపులొత్తె
మోమునకొకయందమునుసంఘటింప,
లోలనీలాలక మావికారుచిర
ఫాలభాగాన సుభ్రప్రదమ్మైన
కుంకుమాంకము క్రొత్త పొంకమ్ము గొలుప,
తీర్చి, దిద్దినయట్టి తీరైన బొమలు,
నిడుదలై, సోగలై, కడుముచ్చటైన

కాటుక కండ్లకు నీటు సంధింప,
మురువు ముంజెవులను ముద్దులోలకులు
వ్రేలాడి, తొట్రిలి, చాలాకి నిడగ,
నవ్వుల పువ్వులో—నగవు వెన్నెలలో
కుమ్మరించును మోముదమ్మియెల్లపుడు;
సీతవేనలికారు చీకట్ల గుంపు,
ఘనఘనాఘనములో గల కప్పునిగ్గు;
సీతగిరుక్కున చీకట్లు చెదరి
తనుకాంతి పుంజాన దల్లడిలిపోవు;
కుసుమజాలముకన్న కోమలత్వమ్ము,
మెఱపు దీవియెకన్న మెఱుగుందనమ్ము
సాంద్ర చంద్రికకన్న చక్కందనమ్ము
లావు సన్నముగాక లావణ్యగరిమ,
పొడవు పొట్టియు లేక ముద్దారులీల,
కనుపండువొనరింపగలదామె తనువు;
ప్రాభాతవాయువు, పరమశుద్ధాత్మ
మంచి ముత్తెపుపూస మంచుక్రొంజినుకు,
తొలివాననెత్తావి కొలనికెందమ్మి
ఆ లోలపుష్పిత మాలతీలతిక,
నవకంపు నునుమిన్కు పవడాలరాసి,
ఆమంజువిగ్రహం బాదివ్యమూర్తి;
ఆ సుధామధురోక్తు లాకప్రభావ
మా నిరాడంబరమైన వర్తనము
చెలువంపు దొడవులై విలువ గల్గించు;
సీత రూపమ్ము నాచేతోముదమ్ము
సీత-మేనొందిన జిలుగు చిత్తరువు,
సీత, సీతాశోక చిన్నారిచిలుక.

ఆ నాడు

ఆనాడు నాజన్మ కేనాడురాదు;
మరువలే నానాటి మహనీయదశను.
ఆనాడు శుభలగ్నమా మందిరాన
జరుగును నాసీత పరిణయోత్సవము.
ముంగిట చప్పరమును తోరణాలు,
పసుపు కుంకుమతోటి వన్నెగుమ్మములు,
ముత్తెంపుముగ్గుల మురుపువాకిళ్లు
కన్నుల పున్నెంపుగాటంపు పంట_
ఆనాడు నాజన్మ కేనాడురాదు;
మరువలే నానాటి మహనీయదశను.
ఆ బాలగోపాల మానందపూర్ణ
హృదయ పద్మాలతో నెన్నెన్నొగతుల,
విసుగైననొందక, వేసటేగనక,
స్వైర విహారమ్ము సలుపునాయింట;
ఆనాడు నా జన్మ కేనాడురాదు;
మరువలే నానాటి మహనీయదశను.
సర్వతోముఖ నవ్య సంతోషరాగ
కళలతో నాబాల - కళ్యాణ చిహ్న
భాసమానలలాట ఫలకార్ధచంద్ర_
తెలియని నునుసిగ్గు తెరలకందోయి
అద్దాల చెక్కిలి నంగారుచుక్క_
దోబూచులాడుచు తొణకు చిర్నగవు
పసుపుపూసిన మేల్మి బంగారుతనువు
చిట్టిపోకల యెదంజిలుగు పయ్యెంట
పారాణికై సేయబడియున్న, రత్న
మంజీరభూషిత మంజుపాదములు,
బంధుజాలము మెప్పుబడసి, చెన్నార
ఒకవింత, ఒకశోభ, ఒక విలాసమ్ము
గొలుపుచు, తనచుట్టు గుమిగూడి పెద్ద
ముత్తైదువలు హర్షమున దేలియాడ,
అల్లన నాచెంత నాసీనయగుచు
ప్రేమతో మనసార ప్రేమవరించె,
ప్రేమైకజీవిని, ప్రేమస్వరూపి,
ఆనాడు నాజన్మ కేనాడురాదు;
మరువలే నానాటి మహనీయదశను.

(ఇంకా "నాసీత")

దేవదాసి

శ్రీ ఎచ్చెర్ల జయప్రసాదరావు

● వ్యభిచార నిర్మూలనము, అనాథ స్త్రీ, శిశుసంరక్షణలకు శాసన సహకారమును నిర్మించవలసిన ఆవశ్యకత ●

దేవ అనగా దైవమనియు, దాసి అనగా సేవచేయునది అనియు, కరుణాకరుని సాన్నిధ్యమున కుంభారతులిచ్చే కళావతి దేవదాసి యని మనపూర్వులు చెప్పుట వాడుక. కాని రానురాను దేవదాసి ధ్వంస దేశిగా మారి, దుర్నయము అమలులోపెట్టి, దుష్ప్రవర్తనములకు కంకణముకట్టి కండ్లార కావించుకొన్న కళ్యాణములను కూకటివ్రేళ్లతో పెకలింపచేస్తూ, భార్యాభర్తలకు వియోగము కల్గించుచున్నది. ఎంతమందియో దుర్వ్యసనములకు పాల్పడి, త్రాగుడు మొదలగు దుర్వ్యసనములకు లోనై కండ్లుకానక, అగ్నిదేవతసాక్షిగా భార్యమెడలో కట్టిన పుస్తెలను సయితము అమ్మి, భార్యను భిక్షుకురాలుగా చేసి, బిడ్డలను అనాథలుగాచేసి, ఉద్యోగములకు ఉద్వాసనములిచ్చి కడకు కూటికిలేక, బట్టకులేక బైరాగులైపోవుచున్నారు.

నిజముగా యీ సంఘముయొక్క స్థితి చాలా దుస్థితిలో నున్నదనుటకు ఏ సందేహము లేదు. అంట రాని అధములు మాలలని కొంతమంది పెద్దలు వాదింతురు గాని మాలలకన్న నీచులు దేవదాసీలని నిశ్చయముగా చెప్పవచ్చును. దేవదాసీలే గాదు. ఎవరు వ్యభిచారిణిగా వ్యవహరింతురో వారు ముమ్మాటికి మాలల కన్న నీచులు. మాలలు మర్యాదగా కాయకష్టముల కోర్చి, కష్టపడి సంసారికముగా కొంతమంది జీవనము చేయుచున్నారు. గాంధీమహాత్ముని అస్పృశ్యతానివారణోద్యమముచే హరిజనులకు అన్ని ఆఫీసులలోను ఉద్యోగములిచ్చుచున్నారు. ఎన్నో వేల సంవత్సరములనుండి మాల మాదిగలకు తెరువని దేవాలయములు నేడు నిరాటంకముగా, నిర్భయముగా తెరువగలిగినారు. యీ సామర్థ్యము, యీ శక్తి, యీ కళావంతుల సంఘములలో ఎందులకుండగూడదు ?

వీరి మానసమర్యాదలుగూర్చి, స్వాతంత్రములగూర్చి, సంఘాభివృద్ధులగూర్చి, విద్యాభివృద్ధులగూర్చి వృద్ధాప్యములోగూడ రాత్రి, పగలు చలించుచున్న డా॥ శ్రీమతి ముత్తులక్ష్మమ్మ సతిగారికి, హీనమగు వ్యభిచారమును విసర్జించి, సంఘాభివృద్ధికై సహకారమును ఇచ్చుట కళావంతుల ముఖ్యధర్మము.

ఈ వ్యభిచారము దేవదాసీ సంఘీయులలోనే గాక, ప్రతి జాతిలోను, ప్రతి సంఘములోను ప్రబలుచున్నదనుటకు సందేహములేదు. సిగ్గుచే చింతిల్లుచున్న ఒక స్త్రీయొక్క 'అవస్థ' ఆ దేశములో నున్న ప్రతి మానవునియొక్క 'అమర్యాద' యనుట అతిశయోక్తి కాదు.

ప్రపంచమంతటిలో పాతివ్రత్యమునకు ప్రఖ్యాతిగాంచిన యీ హైందవ సామ్రాజ్యము నేడు గావింపబడుచున్న యీ వ్యభిచారము మూలమున నీచస్థితిలో నున్నదనుటకు ఏ సందేహము లేదు.

దేవదాసీలు హీనమగు వ్యభిచారముకొరకే పుట్టినారనియు, యీ సంఘమువారు తమ యావజ్జీవము, మానము విక్రయించి, వినోదస్థులతో విహారము సల్పుదురనియు వాదించుట ముమ్మాటికి పొరపాటు.

మన సంఘీయులలో ఒక్క పరపురుషుడు ఆడువారిని ఏమైన వినోదముగా ప్రశ్నించిన మనకు కోపమువచ్చుటలేదా! ఆ రీతిగానే ప్రతి భారతీయ సోదరుడు గ్రహించి, హిందూధర్మ మవలంబించి, యీ దేవదాసీ సంఘీయులలో నున్న దాసీలకు సంసారికమైన ఒక నూతనమార్గము ఏర్పరుపవలసియున్నది.

ఇంగ్లాండు దేశములో బాస్టర్డు చట్టము ప్రకారము, అనాథయైన బిడ్డల తల్లికి కొంతడబ్బు, బిడ్డల చదువుగూర్చి తండ్రి యివ్వవలసినదని తెల్పుచున్నది. కొన్ని దేశములలో యీ అనాథ బిడ్డలగూర్చి గవర్న మెంటువారు ముఖ్యమైన జాగ్రత్త తీసుకున్నారు. యింకా కొన్ని దేశములలో వ్యభిచారిణి, వ్యభిచారము అన్నమాట చట్టము మూలముగా రద్దుచేయబడ్డది. జర్మనీలోను, ఇటలీలోను యీ బిడ్డలను తల్లితండ్రియొక్క జాగ్రత్తలో నుంచక, 'వెల్ ఫేరు బోర్డ్సు' వారి కట్టుదిట్టములలో నుండుటకు చట్టము అమలులో నుంచ బడినది. యింకా జర్మనీలో బిడ్డలయొక్క తండ్రులను కనుగొనుటకు రక్తపరీక్షలుకూడా నడుచుచున్నవి.

సర్వదేశములు సభ్యతతో క్రొత్త సోయగములీనుచున్న యీ యిరువదవ శతాబ్దములోగూడ మన భారతభూమి యందిట్టి నీచాచారములుండుట సిగ్గుచేటు.

కొన్నికొన్నిచోట్ల యీ కళావంతుల సంఘములలో కొన్ని కట్టుదిట్టములు సమకూర్చబడినను, యింకను కొన్నిచోట్ల యిది విపరీత వ్యాప్తిలో నుండుట శోచనీయము.

దీనికి సాంఘిక సేవాపరులు వెంటనే పూనుకొని, పరదేశములయందున్న చట్టముల నమలులోనికి తీసుకవచ్చినగాని, మనము సభ్యతాప్రపంచమున స్థానమును పొందజాలము.

కడుపులో బొత్తిగా ఆహారము లేనప్పుడుకూడా రోగి ఆహారము వద్దనును

మలేరియా జ్వరపీడితుడు ఏ ఘన ఆహారము తీసుకోలేకపోవడమే ప్రమాదమునకు కారణము. జ్వరపు విషముచే నిర్బలమైన నరస్నాయువులకు తిరిగి శక్తిని చేకూర్చుటకు పుష్టికర ఆహారము అత్యావశ్యకము. ఆహారము అగత్యమైనప్పుడు కడుపు బలహీనముగా నుండుటచే ఆహారము జీర్ణమవదు.

ఇట్టి స్థితిలో డాక్టర్లు హార్లిక్స్‌ను సిఫారసు చేయుదురు. ఇది వందకువంద పుష్టి నిచ్చునది. జీర్ణశక్తికి ఏలాటి హాని కలుగజేయక సులభముగా జీర్ణమైన రసస్నాయువులకు పూర్వపు పటుత్వము కలుగజేయును. తేర్గడ కాలమందు ఇతర రోగాదులు రాకుండ రక్షించును.

మలేరియా మృత్యువునుండి తప్పించుకొన్న వేలకొలది జనులు హార్లిక్స్ సేవనచే స్వల్పకాలము లోనే దేహదారుఢ్యమును పొందియున్నారు.

478-C.

కఠిన హృదయాలు

— శ్రీ —
వై. రామమూర్తి

అది సాయం సమయం. హిందూస్థానీ స్త్రీ పురుషులిద్దరు ఒక హైరోడ్డు ప్రక్కను కూర్చుని హార్మోనియంతో పాటలుపాడుతూ భిక్ష మెత్తుకుంటున్నారు. సమీపములో ఆ హైరోడ్డు ప్రక్కనేవుంది రెండంతస్తుల భవనం. ఆమేడ మొదటి యంతస్తు వీధివైపు వరండాలో తిరుగుతూ, ఏడుస్తూవున్న చంటిబిడ్డను బుజ్జగిస్తూ వున్నదా గృహిణి. ఈమె వైపు బడింది ఆ అనాధుల దృష్టి.

గేటుదాటి లోనికి ప్రవేసింపగానే హార్మోనియంవేయటం మొదలు పెట్టాడు. దానితోపాటు గొంతుక కలుపుచూ, వినసొంపుగా బంగాలిస్టైల్లో పాడుతూవుంది అతను వెంటనున్న యువతి. త్రోవపోయేవారు అందరూ ఆగేటుదగ్గరనే ఆగిపోయారు ఆకోకిల గానం వింటూను. పైనుండి తల్లి పిల్లాడు నిచ్చేష్టులై వింటూవున్నారా పాటలు.

ఇంతకుముందే ఆమెభర్త డ్యూటీనుండి కారులోవచ్చిన డాక్టరు సూటు, బూటు, హేటు దీసి అటుపెట్టి మిద్దెమీద వీధి వరండాలోనికి వచ్చినాడు జోరుగ. "యేం అలానిలబడ్డావ్? వాళ్లని పొమ్మని చెప్పకూడదు?" అన్నాడు భార్యతో. వాళ్లను అంతకుముందే వెళ్లిపొమ్మని చెప్పదామనుకుంది కాని, ఆపాటలు వినసొంపుగా వుండటంచేత పొమ్మనటానికి నోరు వచ్చిందికాదామెకు. చివరకు అతడె "ఘొ-ఘొ" అని రెండుసార్లు తలవిసురుతు కోపంతో అన్నాడు,

తల్లిదగ్గిరున్నా పిల్లాడు తాను తింటూవున్న చేతిలోని బిసకత్తు ముక్కను ఆబిక్కముఖం వేసుకొని చూస్తూవున్న అనాధుల వైపు విసిరాడు జాలి చూడ్కులతో. "ఆలాగే చూస్తున్నావేం వాళ్లవంక, రా-పద" అంటూ అక్కడనే నిలబడివున్న భార్యను చెయిపట్టి లోనికి లాక్కుపోయాడు డాక్టరు. పిల్లాడు విసిరేసిన ఆ బిసకత్తుముక్క క్రిందపడకుండగా ఆతురతతో అమృతంలాగందుకున్నారా అభాగ్యులు—యిదే ఆ కఠిన హృదయాల కనికర ప్రసాదమని యెంచి—దాంతో తృప్తిపడుతూ—



చిన్ని ఉత్తరాలు

ఆర్యావర్తము

సర్వమంగళా,

మైసూరు రాజ్యాన్నిగురించి నీకు ఓ ఉత్తరం రాశా. అప్పుడు మైసూరు, పీఠభూమిలో ఉందని చెప్పేను. ఈ మైసూరుకు ఉత్తరంగా ఉన్న దత్తమండలాలు, వాటికి ఉత్తరంగాఉన్న హైదరాబాదు సంస్థానం, అదికూడా దాటి ఇంకా ఉత్తరంగాపోతే వచ్చు మధ్య పరగణాలూ-ఇవన్నీకూడా పీఠభూమి లోవే.

ఈ పీఠభూమికి 'దక్కన్' పీఠభూమి అని పేరుపెట్టేరు. 'దక్కన్' అంటే 'దక్షిణం' అన్న మాట. హిందూదేశాన్ని ఉత్తరభాగమనీ, దక్షిణభాగమనీ రెండుగా విభజనచేసి చూస్తే, ఆదక్షిణభాగంలో ఉంది ఈ పీఠభూమి. ఈ పీఠభూమీ, దీనికి తూర్పున ఉన్న తెనుగు, తమిళ ప్రాంతాలూ, పడమటగా ఉన్న మళయాళం, బొంబాయి ప్రదేశాలూ-వీటి నన్నింటినీ కలిపి 'దక్షిణాపథం' అంటారు. గోదావరి, కృష్ణా, కావేరి మొదలైన నదులూ, 'తూర్పుకనుమలూ పడమటి కనుమలూ'అని పిలవబడే కొండలూ-ఇవన్నీ 'దక్షిణాపథం'లోవే.

మనదేశంలో ఉత్తరభాగాన్ని 'ఆర్యావర్తం'అని పిలుస్తారు. దక్షిణాపథంకంటే, ఆర్యావర్తం చాలా సారవంతమైన ప్రదేశం. అక్కడ, ఇక్కడకుమల్లే పీఠభూమిలేకుండా నేలంతా సమతలంగా ఉంటుంది. దక్షిణాన్ని ఉన్న నదులకంటే చాలా పొడుగైన గొప్ప నదులున్నాయి, ఆర్యావర్తంలో. సింధునది, గంగానది, బ్రహ్మపుత్రానది-ఇవన్నీ ఆర్యావర్తంలోవే. ఈ నదులన్నీ హిమవత్పర్వతాల్లో పుట్టి అక్కడి మంచి ఒండ్రుమట్టిఅంతా తెచ్చి ఈ సమతలంలో పరుస్తున్నాయి. అందుచేతనే ఈ ప్రదేశంలో పంటలు బాగా పండుతాయి. తినడానికి సమృద్ధిగా పండుతుంది గనకనే ఈ సమతలంలో జనంకూడా చాలా ఎక్కువగా ఉంటారు. బెల్లమున్నచోటికి చీమలు చేరతాయి చూడు. అలాగే మనుషులూను!

ఆర్యావర్తం చాలా సారవంతమైన దేశం గనకనే, ఇతర దేశాలవాళ్లు ఎంతోమంది ఈ దేశానికి దండెత్తి వచ్చారు. మహమ్మదీయులు మనదేశానికి ఇలావచ్చినవాళ్లే. మహమ్మదీయ నవాబులూ, అంతకు ముందు రాజ్యంచేసిన హిందూరాజులూ ఈ దేశంలో అన్నిచోట్లా పెద్దపెద్ద పట్టణాలు నిర్మించారు. లాహోరు, ఢిల్లీ, అలహాబాదు, కాశీ, లక్నో పాటలీపుత్రం—ఈ పట్టణాలన్నీ మనం ఎప్పుడో వెళ్లి చూడాలి. కలకత్తానగరంకూడా ఉత్తరదేశంలోదే. ఈ నగరం కడత, ప్రస్తుతం పాలిస్తోన్న తెల్లవాళ్లు

వచ్చిన దరిమిలానే. ఈ నగరాలన్నింటిలోనూ గొప్పగొప్పభవనాలు, రాచనగళ్లూ, కోటలూ, స్థూపాలూ, మసీదులూ, ఒకటేమిటి, చూడదగినవి ఎన్నో ఉన్నాయి. ఒక్కొక్కదాన్నిగురించీ ముందుముందు ఉత్తరాల్లో రాస్తా.

ఉత్తరదేశంలో ఉన్న నదులన్నీ హిమవత్పర్వతాల్లో పుట్టేయని కదూ చెప్పేను? ఈ హిమవత్పర్వతం చాలా ఎత్తైన పర్వతం. దీని శిఖరాలన్నీ మంచుతో నిండి ఉంటాయి. 'హిమం' అంటే 'మంచు'అన్న మాట. 'హిమవత్పర్వతం' అంటే 'మంచుకొండ'అని అర్థం. ఈ పర్వతాలలోనే పార్వతీదేవి పుట్టింది. పర్వతరాజు కూతురు గనకనే ఆవిడకు 'పార్వతి'అని పేరొస్త. ఈశ్వరుడు తపస్సు చేసుకున్న కైలాసపర్వతం ఈ హిమవత్పర్వతాలలోదే. ఆయన అక్కడ తపస్సు చేసుకుంటూంటే పార్వతీదేవి రోజూ ఆయనకు పూజకోసం పువ్వులూ అవీ తెచ్చి పెడుతోండడం, ఆవిడ భక్తికిమెచ్చి ఈశ్వరుడామెను పెళ్లి చేసుకోడం, ఈ కథంతా నీకు తెలుసు కదూ?

ఆర్యావర్తం చాలా పుణ్యభూమి. మన పురాణాల్లోవచ్చే ఋషులంతా ఇక్కడే పుట్టేరు. రామాయణంలోవచ్చే దశరథుడూ, రాముడూ-వీళ్లందరూ ఆర్యావర్తంలో వాళ్లే. శ్రీ కృష్ణుడూ, పాండవులూ—వీళ్లంతాకూడా ఇక్కడివాళ్లే. హర్షుడూ, చంద్రగుప్తుడు, అశోకుడు మొదలైన హిందూ చక్రవర్తులు, తర్వాతవచ్చిన అక్బరు మొదలైన మొగలాయి చక్రవర్తులూ, గౌతమబుద్ధుడులాంటి మహాపురుషులూ, ఎంతో మంది ఆర్యావర్తంలో జన్మించారు. కనుక మనదేశంయొక్క చరిత్ర అంతా ఈ భాగంలోనే ప్రారంభమైందన్నమాట.

'దక్షిణాపథం'లో మైసూరు, హైదరాబాదులాంటి స్వతంత్ర రాజ్యాలున్నాయని ఓమాటు రాశాను. ఇలాంటి స్వతంత్రరాజ్యాలు ఆర్యావర్తంలోకూడా ఉన్నాయి. ఇవి మినహాయించగా మిగిలిన ప్రదేశాన్ని అంతనూ ప్రస్తుతం తెల్లవాళ్లే పాలిస్తున్నారు. దేశాన్ని రాష్ట్రాలుగా భాగించి ఒక్కొక్క రాష్ట్రానికి ఒక్కొక్క గవర్నరునుపెట్టి రాజ్యం చేస్తున్నారు తెల్లవాళ్లు. ఈ రాష్ట్రాలలో ఒకటి వంగదేశం. మళ్లీ ఉత్తరంలో నీకు వంగరాష్ట్రాన్ని గురించిరాస్తా.

చెన్నపట్నం,
1—2—1941

పిన్ని.

గృహలక్ష్మి త్రొక్కుడు పలుకులు

పళ్లోపళ్లు
ఏం! పళ్లు?
మిరపపళ్లు
ఏం! మిరప?
అడవి మిరప,
ఏం! అడవి?
కారుఅడవి!
ఏం! కారు?
క్రొత్తకారు!
ఏం! క్రొత్త!

మాట క్రొత్త
ఏం! మాట?
మంచి మాట!
ఏం! మంచి?
నడక మంచి!
ఏం! నడక?
హంస నడక
ఏం! హంస?
రాజహంస
ఏమి రాజు?

మృగరాజు!
ఏం! మృగము?
పచ్చ మృగము
ఏం! పచ్చ?
పసుపు పచ్చ
ఏం! పసుపు?
కొమ్ము పసుపు!
ఏం! కొమ్ము?
దూడకొమ్ము!
ఏం! దూడ?

ఆవుదూడ;
ఏం! ఆవు?
తెల్ల ఆవు;
ఏం! తెల్ల?
మోము తెల్ల?
ఏం! మోము
లక్ష్మి మోము
ఏం! లక్ష్మి
గృహలక్ష్మి.

—పిల్లా పాపమ్మ.

★ మానవతి

● శ్రీమతి పులిపాక బాలాత్రిపురసుందరమ్మ

రామారావుగారి కాపురం బెజవాడ. ఎక్కువ గొప్పవారు కాకపోయినప్పటికి సామాన్యులలో స్థితిపరులు. రామారావుగారికి బెజవాడకోర్టులో నెలకు నలభైరూపాయల ఉద్యోగం. వీరికి ఏడుగురు కొమార్తెలు ముగ్గురు కొమాళ్లు. పెద్దకొమార్తె రాజేశ్వరి. రామారావుగారిభార్య సీతమ్మ. అల్లుండ్ల రాకపోకల ముచ్చటలు తీర్చుకొనవలెననే కోరికతో శారదాబిల్లు హడావుడిలో తమ ఇంటివెనుక మాధవరావుగారి కొమారుడికిచ్చి పెండ్లిచేశారు రాజేశ్వరికి. వారు సామాన్యస్థితిపరులే. పిల్లవాడు ఏదో చిన్నచదువు చదువుతున్నాడు. పెండ్లి అయినదిమొదలు ఏదో పేచిపెట్టడమేగాని ఒక్క పండుగకైన అత్తవారింటికి వచ్చి ఎఱుగడు రాఘవరావు. తరువాత సంవత్సరములోపల తీసుగరావలెనని పెండ్లికిచేసినంత ప్రయత్నముచేసి బంధువులను పిలచి అల్లుడిని రమ్మనిపిలిస్తే రానని అలిగాడు. కారణం అడిగితే. మోటారుసైకిలిస్తేగాని రానని కబురు. వీరికి వక్క అల్లుడుకాడు అడిగినదల్లాయివ్వడానికి. ఇవ్వలేక ఊరుకున్నారు. తరువాత మళ్లీ పండుగలకు పిలచినా కార్యకరామతులకు పిలచినా గుమ్మంలోకివచ్చి ఎఱుగడు. అల్లుడురాకుండా బెట్టుచేస్తే అడిగినదల్లా ఇస్తారనికాబోలు అతని అభిప్రాయం.

◆ ◆ ◆ ◆

రాజేశ్వరి పెద్దదైన రెండునెలల తరువాతనుంచి పంపమని మొదలుపెట్టారు అత్తవారు. ఏలాగో విశ్వప్రయత్నముమీద తరువాత ఆరునెలలు గడచినాయి. ఒకరోజు అల్లుడు కబురుచేశాడు 'ఈరోజు పిల్లను పంపితే సరే—లేకపోతె నేను రెండోపెండ్లి చేసుగుంటాను' అని.

రామారావుగారు చాలా మరియాదగలవాడు, గుణవంతుడు, బంధుప్రియుడు, జాలిహృదయుడు. ఈ కబురువినగానే హడలిపోయి పంపేశాడు.

◆ ◆ ◆ ◆

రాజేశ్వరి పదునాల్గేండ్లపిల్ల. పచ్చని పసిమిచాయ కన్నుముక్కు తీరుగలది. సామాన్యమైన తలకట్టు. పొట్టిగకురుచగా సామాన్యమైనపిల్ల. సంగీతము, కుట్లు, అల్లికలుఅన్నీ నేర్చుకున్నది. చాలానిదానం. మిక్కిలి ఓర్పుకలది. పదిమాటలకు వక్కజవాబుకూడా చెప్పదు. సద్గుణములరాసి అని చెప్పాలి ఆపిల్లను. రాజేశ్వరి అత్తవారింటికివెళ్లి సంవత్సరమైంది. పంపమని ఎన్నితఫాలు అడిగినా పంపరు. ఇక రాజేశ్వరి దినచర్య స్థితి రోజు తలదువ్వుకోకూడదు, పువ్వులుపెట్టుకోకూడదు. పువ్వులుపెట్టుకుంటే భోగంవాళ్లతోసమానం. చెల్లెండ్రు ఎప్పుడైనా వస్తే అందరి ఎదుటమాట్లాడి పంపవలసిందేగాని ఏకాంతముగా మాట్లాడకూడదు. ఇంట్లో చదువుకొనుటగాని, అల్లుకొనుటగాని, పాడుకొనుటగాని అసలే పనికిరావు.

◆ ◆ ◆ ◆

సంక్రాంతి పండుగవస్తున్నది. పిల్లలంతా బొమ్మలు పెట్టుకుంటామంటున్నారు. రాజేశ్వరినికూడా తీసుకురావలెనని రామారావువెళ్లి పిన్నపెద్దల చేత చెప్పించి పండుగరోజు పంపుతాము అని వప్పించుకుని

వచ్చారు. తెల్లవారింది, ఆగోజె పండుగ. తొలకరి మెరపులాగ దొడ్డిగుమ్మంలో మెరసింది రాజేశ్వరి. తల్లీ అమ్మమ్మా పరమసంతోష భరితులైనారు. చెల్లెండ్రువచ్చి కౌగలించుకున్నారు 'సుశీలా! ఎందుకిల్లా నన్ను చుట్టుకుంటారు? నేనుండేది కొన్నిగంటలే కదా?' అని ముఖం చిన్నపుచ్చుకున్నది రాజేశ్వరి. అందరు తలంట్లు పోసుకున్నారు. అమ్మమ్మ వంటచేసింది. తరువాత కొంచంసేపటికి టైముచూచి అమ్మమ్మా నేను వెళ్లుతాను అన్నంపెట్టు అన్నది. 'మీ నాన్నగారు ఇంటికొచ్చి చూచిందాకా నైనా ఉండవా? రాజేశ్వరీ! చెల్లెండ్రు బొమ్మలుపెట్టుకున్నారు సాయంకాలం పేరంటంచేసి వెళ్లుదుగాని' అని తల్లి దీనాలాపములుచేస్తున్నది. గాని ఏంలాభం? రాజేశ్వరి కంచంతెచ్చి పెట్టుకున్నది. 'అన్నంపెడితే నేను వెళ్లుతాను' అనిఅంటూ. భర్తఇచ్చినటైము అయిపోతున్నది. రాజేశ్వరి గుండె దడదడ కొట్టుకుంటున్నది. అమ్మమ్మ కంచంలో అన్నంపెట్టింది. పెట్టేదే తడవుగా కలుపుకుని తింటున్నది రాజేశ్వరి. 'నెయ్యి, వెయ్యనీయవే అమ్మా ఇదెక్కడ అత్తవారిల్లే తల్లీ' అని కండ్లుతుడుచుకుంటూ ఆవతలికి వెళ్లింది అమ్మమ్మ. ఇంతలో తండ్రి వస్తూ అంతదూరంనుంచే చూచి 'మాతల్లి వచ్చిందే మా రాజేశ్వరి; ఎప్పుడొచ్చావు తల్లీ! నేనుకూడా నీతో అన్నంతింటా. ఉండమ్మా ఎన్నాళ్లైంది మనం అందరం అన్నంతిని; లే సీతా! అన్నం తిందాం' అని చొక్కా వంకెకు తగిలించి పట్టుపంచ కట్టుకుంటున్నాడు రామారావు. సీత లేవలేదు, అక్కడే గోడకు చేరబడి కూర్చున్నది. 'ఎందుకల్లా కూర్చున్నావు? అమ్మాయికూడా వచ్చిందిగా' అన్నాడు సంతోషంగా రామారావు. 'వస్తేయేం? మళ్లీ వెళుతున్నది. అందుకే తొందరగా అన్నంతింటున్నది' అన్నది సీత దీనంగా. 'అదేమిటి? ఇప్పుడేవెళుతుందా? ఏం రాజేశ్వరి! ఇప్పుడే వెళుతావా?' 'వెళుతా నాన్నగారు ఇంట్లో పనిఉన్నది వెళ్లాలి.' అని అమ్మమ్మను మజ్జిగ పోయమన్నది. 'నిన్ను మరీ నోరులేందాన్నిచేసి వాళ్లు బాగా ఆడిస్తున్నారు. పంపారుగా సాయంకాలందాకా ఉండరాదు?' అని మజ్జిగపోసింది అమ్మమ్మ. 'మీరు ఇల్లా అంటారు వాళ్లు అల్లా అంటారు ఇద్దరిసందునా నలిగిపోతున్నాను' అని గద్గదకంఠంతో జవాబుచెప్పి అన్నంలోచేయి కడుక్కునిలేచింది. ఇంతలో రాజేశ్వరిని పిలుచుకురమ్మన్నారు అని కబురు. వస్తున్నాను అని వెనక్కుతిరిగైన చూడకుండా కండ్లు తుడుచుగుంటూ వెళ్లింది రాజేశ్వరి. పట్టుపంచతో అల్లాగే కుర్చీలో కూలబడ్డాడు రామారావు. ఇల్లాగంటి సంబంధం నీవేచేశావని తన తల్లిమీద విసుక్కున్నది సీత ఏమితోచక.

♦ ♦ ♦ ♦

రామారావుగారి నాల్గవకొమార్తె వివాహం. బంధువులందరువచ్చారు. ఇళ్లూవాకళ్లు అన్నీ పచ్చతోరణములతో, ముత్యములతోరణములతో, రంగురంగుల విద్యుద్దీపముల తోరణములతో అలంకరింపబడి దేవేంద్రభవనంగా ఉన్నది ఇల్లు. పందిరిలో పంచవిధములైన మేళములు; ఎటుచూచినా ప్రతిబింబములు కనిపించు నిలువుటద్దములు, పండితులకు వకవైపునా, చూడవచ్చిన ప్రేక్షకులకు వకవైపునా, పెండ్లివారికి ఒకవైపునా, బంధువులకు వకవైపున వేరు ఏర్పాట్లుచేసి ఉన్నది పెండ్లిపందిరి. గాని సీతా, రామారావులకు ఏదో కొరత కనిపిస్తున్నది. అది రాజేశ్వరి రానికొరత వక్కటే. ఇక రాత్రికిపెండ్లి. అప్పుడువచ్చిన బంధువులలో ఒకపెద్దను పిలుచుగుని రామారావువెళ్లి బ్రతిమాలి రాజేశ్వరిని పసిబిడ్డను పిలుచుగుని అల్లుడిని వియ్యాలవారినికూడా వచ్చే ఏర్పాటుచేసుగుని వచ్చారు. ఆప్రొద్దున్న పలహారానికి మధ్యాహ్నము రాత్రి భోజనానికివచ్చాడు అల్లుడు. రాత్రి పదిగంటలైంది జయప్రదంగా కల్యాణం జరుగుతున్నది. ఆడవాళ్లల్లో

రాజేశ్వరి కూర్చున్నది. మగవాళ్లల్లో రాఘవరావు కూర్చున్నాడు. ఇక్కడ రాజేశ్వరి హడలిపోతూనే ఉన్నది. తలంబ్రాలు అయినాయి. చివాల్న లేచి లోపలిహాల్లోకివెళ్లి పక్కపాడి ఏది అంటూ రాజేశ్వరి వంకచూచి తలవిసరాడు రాఘవరావు. ఎందుకు? అని లోపలికివెళ్లింది రాజేశ్వరి. నెమ్మదిగా ఏదో ఒక మాటచెప్పి 'నేను వెళ్లుతున్నాను; నీవు ప్రొద్దున్నే రా' అని దొడ్డిదార్నె వెళ్ళాడు రాఘవరావు.

తెల్లవారింది. అందరు ముఖార్చనలు చేస్తున్నారు. రాజేశ్వరి ఇంకా నిద్రలేవలేదు. అప్పుడే కబురు రాజేశ్వరిని పిలుచుకురమ్మన్నారు అని. సరే లేచివెళ్లింది పిల్లను మంచముమీదనే ఒదిలేసి. రాఘవరావు గదిలో కుర్చీలోకూర్చుని కాఫీ త్రాగుతున్నాడు. అక్కడే గోడకు చేరబడి నుంచున్నది రాజేశ్వరి నిర్జీవంగా.

'ఇప్పుడు కొత్తఅల్లునితోపాటు ఐదువందలు నాకుఇస్తే నువ్వు అక్కడుండు నేనువస్తాను. లేకపోతె ఈరోజుతో నీకూనాకు తీరిపోయింది. పో మీవాళ్లింటికి ఫో; లేచిపో' అని రెండుతన్నులు తన్నాడు గాఢంగా. నుంచునిఉన్న రాజేశ్వరి కూలబడి వెక్కివెక్కి ఏడుస్తున్నది. ఇంతలో పిల్ల ఏడుస్తున్నదని అమ్మమ్మ కేకవేసింది. ఆకేకవిని కళ్లుతుడుచుకుని ముంగురులు సవరించుకొంటూ వచ్చింది రాజేశ్వరి. ఈ వైఖరి అంతా చూచి ఏదో జరిగిందనుకున్నారు అందరు. ఎవరో రహస్యముగా అడిగితే చెప్పింది ఉన్న యథార్థమంతా. ఆరోజు మొదలు రాజేశ్వరి లేవటంలేదు తల దువ్వుకొనుట అన్నము తినుటకూడా లేదు. కొంచము జ్వరము కూడా తగిలింది. అల్లాగె ఒక గదిలో పడుకుంటున్నది. పిల్లను ఎవరో చూస్తూన్నారు.

◆ ◆ ◆ ◆

పెండ్లి నాల్గవనాటి రాత్రి తొమ్మిదిగంటలైంది గుమ్మమునకు ఎదురుగా ఆగింది పువ్వులపల్లకి ఊరేగింపుకు రానున్నవారందరు డ్రస్సు మార్చుకొనుట తాంబూలములు వేసుకొనుట ఇండ్లు సవరించుకొనుట ఎవరిపనిలోవారు నిమగ్నులైఉన్నారు ఇంట్లోవారు. ముందువైపు గదిలో మంచంవేసి పిల్లను నిద్రపుచ్చి తాను కూడా ఆమంచంమీదనే నిద్రపోయింది రాజేశ్వరి. ఈ సమయంలో రాజేశ్వరి మంచందగ్గిర రాఘవరావు ప్రత్యక్షమయ్యాడు. ఎవరోచూచి రామారావుకు చెప్పారు పెద్దల్లుడొచ్చాడని. ఇంతలో పసిపిల్లను భుజమున పడుకోపెట్టుకుని రాజేశ్వరిచేయిపట్టుకుని 'రాజేశ్వరీ! నేను కావాలంటే ఇప్పుడు ఇంటికిరా. లేకపోతే ఇక్కడే ఉండు' అంటున్నాడు. ఇంతలో రామారావు వెళ్లి అల్లుడిచేయి పట్టుకుని 'రాఘవరావు తొందరపడకు ఇంట్లో ఇంత వైభవంగా పెండ్లి జరుగుతూంటే ఆపిల్ల లేవకపోయె, నీవూ రాకపోతివి, సరే కదా. ఇప్పుడు ఈచీకట్లో తీసుకెళ్లటమేమిటి?' అన్నాడు దీనంగా. 'చాలుచాలు ఊరుకోండి. మీ మరియాద తెలిసిపోయింది. మీరూ ఒకపెద్ద మనిషి ననుకుంటున్నారు కాబోలు. నోరుమూసుకుని అవతలికి పదండి.' అని చేయి విదలించి పారేశాడు అల్లుడు. 'నీ మరియాద నాకు తెలియదనుకుంటున్నావు కాబోలు నీ దుండగములన్నీ వింటూ చూస్తూ ఊరుకోడం నాచేతగాక కాదు నీవు చిన్నవాడవని తెలియదని ఆలోచించి ఊరుకుంటున్నాను. నీవు కొట్టే దెబ్బలకి మీ అమ్మ తిట్టేతిట్లకి నోరులేనిపిల్ల గనుక పడి ఉంటున్నది. ఛీ దుర్మార్గుడా. ఇంక ఏం చేద్దామని వచ్చావు అర్ధరాత్రి' అని దగ్గిరికి వెళ్లాడు మామగారు. 'నోరుమూయి బుద్ధితక్కువ పెద్దమనిషి' అని చేయిఎత్తాడు అల్లుడు. చప్పున రాజేశ్వరిలేచి 'నాన్నగారు మీకు నమస్కారం చేస్తా ఊరుకోండి!' అని తండ్రి నోటికి చేయి అడ్డంపెట్టి భర్తకాళ్లు పట్టుకుని 'నేను వస్తా పదండి మనం వెళదాము' అని ఇద్దరిమధ్యా వొంగింది రాజేశ్వరి. ఆ కరుణామయదృశ్యం చూచేటప్పటికి ఆ ఊరేగింపు నిమిత్తం వచ్చియున్న స్త్రీ పురుషులెల్లరి మనస్సులు గభీర దుఃఖపూరితములైనాయి—

భారతీయనారి

★

శ్రీ స్వామి వివేకానంద

అనువాదం : శ్రీ పూర్ణానంద

(గతసంచిక తరువాయి)

ఒకవృద్ధ లేఖకుని నీతిశిక్షను మేము వల్లించెడువారము. దీనియందలి కొంత భావార్థము నా గుర్తుకు తగులుచున్నది—

గ్రామముయొక్క మంచి కొఱకు ఒక కుటుంబమును త్యజింపుము. దేశముయొక్క మంచి కొఱకొక గ్రామమును పరిత్యజింపుము. మనుష్యుని మంచికొఱకు దేశమును త్యజింపుము. విశ్వ కల్యాణార్థము సర్వ స్వము త్యజింపుము.

ఆ పుస్తకముల ఇట్టి శ్లోకము లుండును, వాటిని మేము వల్లింపవలెను. గురుశిష్యులు ఇర్వురును వీటికి వ్యాఖ్య యొనర్తురు. బాలబాలికలు వీటిని ఒకేతడవ నేర్చుకొనెదరు; తరువాత విద్యావిధానము వేరు పడును. ప్రాచీన సంస్కృత విద్యాలయములు ముఖ్యముగ బాలకులతోడనే నిండియుండెడివి. బాలికలు కాదాచిత్కముగ ఆ విద్యాలయముల కఱిగెడువారు. అయితే, ఒకటి రెండు వ్యతిక్రమములుగూడ ఉండెడివి.

ప్రస్తుతము భారతదేశమున పాశ్చాత్యరీతిని విద్యనేర్వ ఉత్సాహమెక్కుడు; స్త్రీలకుగూడ ఈ ఉన్నతవిద్యను బడయ పట్టుదల ఎక్కువ. దీనిని గోఱనివారుగూడ కొందఱున్నారు. కాని, కోఱువారే జయించుచున్నారు. నేడుగూడ స్త్రీలు ఆక్స్‌ఫర్డ్, కేమ్‌బ్రిడ్జి విశ్వవిద్యాలయముల ప్రవేశింపజాలకుండుట ఆశ్చర్యకరము. హర్డ్‌వర్డ్, ఇయెల్ విశ్వవిద్యాలయములగూడ నింతే. కాని ఇరువది వత్సరముల క్రిందటనే కలకత్తా విశ్వవిద్యాలయద్వారము స్త్రీలకు దెరువబడినది. నేను బి. ఏ. పరీక్ష కృతార్థుడనైన వత్సరమున చాలమంది బాలికలుగూడ ఉత్తీర్ణలైన విషయము నాకు గుర్తుననున్నది. వారి పాఠ్యపుస్తకములు, తదితర విషయములు బాలురకున్నట్లే ఉండెను. ఒకేవిధమగు వ్యుత్పత్తిని వారుగూడ బడయవలసి యుండిరి. వారు మంచి కృతిత్వమును జూపిరి. మా ధర్మము స్త్రీవిద్య నాటంకపరచదు. 'కన్యాప్యేవం పాలనీయా శిక్షణీయాతియత్నతః' సరిగా ఈ విధముననే బాలికలుగూడ పాలింపబడి, శిక్షను బడయవలెను. ప్రాచీన శాస్త్రముల బాలబాలికలు పూర్వ మొకేవిధమగు విద్యనుబడయు ఏర్పాటు ఉండెను. కాని, తరువాత సమస్త జాతియొక్క విద్య ఉపేక్షింపబడెను. విదేశశాసనమున ఇంతకంటె ఎక్కుడేమి ఆశింపగలము? విదేశ శాసకులు కోఱునది డబ్బు. మా మంచికొఱకు వారు రాలేదు. పదిరెండేండ్లు నేను కఠోర పరిశ్రమనొనర్చి కలకత్తా—విశ్వవిద్యాలయపు గ్రాడ్యుయేటునైతిని. కాని, నేను మా దేశమున ఇరువది రూప్యములగూడ మాసమునకు సంపాదింపజాలను. ఈ విషయమును మీరు విశ్వసింపగలరా? కాని ఇయ్యది వాస్తవ విషయము. విదేశీయ ప్రతిష్ఠానములు అల్పధనమున అధిక కార్యము నొనర్పగల బానిసల కొందఱిని సృష్టించుచున్నవి—గుమాస్తా, పోష్టుమాష్టర్, టెలిగ్రాఫ్ మాష్టర్ ఇత్యాదిగ—ఇది అచ్చటస్థితి.

ఫలితముగ బాలబాలికలవిద్య సంపూర్ణముగ నుపేక్షింపబడినది. ఆదేశమున చేయవలసినది చాలగ నున్నది. మీ సామెత ననుసరించియే మీకీ విషయమునుదెలుప గోరుచున్నందులకు నన్ను క్షమింతురుగాక—'హంసికి సుఖాద్యమైనది. హంసకుగూడ సుఖాద్యము.' విదేశమహిళలు భారతీయ స్త్రీల కష్టమునుగాంచి

చీత్కార మొనర్చుచున్నారు, కాని వారు పురుషులమాటను దలపెట్టనే దలపెట్టరు. వారు కేవలము బాలికల కొఱకు శోకాశ్రుపాత మొనర్తురు, కాని బాలికల వివాహ మొనర్చుకొనున దెవ్వరు? హిందూ బాలికల వివాహము వృద్ధులతోనగునని ఒకరికి చెప్పబడెను. అప్పుడాయన ప్రశ్నించినది. "అగుచో యువకులేమి యొనర్తురు? బాలికలు కేవలము వృద్ధులనే వివాహమాడుదురన్నమాట సరియా?" మేము ఆ జన్మవృద్ధులము—ఆ దేశమునందు అందఱును ముసలివారైపోయినారు!

భారతముయొక్క ఆదర్శము ఆత్మముక్తి. ఈ జగత్తు ఏమియునుకాదు—ఒక కల్పన, ఒక స్వప్నము. మన వర్తమాన జన్మ ఏతదనురూపమగు లక్షలక్ష జన్మలలో నొక్కటి. ఈ సమస్త ప్రకృతియు ఒకమాయ, ఒక ప్రహేళిక—ఒకానొక భ్రాంతి—వ్యాధియొక్క ఆకారము. ఇయ్యది మా దర్శనము. బాలకులే జీవితమునుగాంచి హసింతురు. ఇది ఎంత సుందరము? మంగళమయమని తలపోతురు. కాని, కొన్ని సంవత్సరములు గడచినపిమ్మట వారి సుఖస్వప్నము భంగమగును. వారు రోదించుచు అరుదెంచిరి, మరల రోదించుచునే అరుగుచున్నారు. ఒకజాతి తన యౌవనోచ్ఛ్వాసమున తాను దలపెట్టున దంతయు ఒనర్పగలనని భావించును. అది యనుకొనునుకదా, "మేము పృథివియందలి దేవతలము, మేము చిహ్నితులము. సర్వశక్తిమంతుడగు భగవంతుడు వారికి జగత్తునుశాసించు అధికారము నొసంగినాడు. ఈశ్వరుని అభిప్రాయమువారు పూరించుచున్నారు. వారెద్దానిని ఇచ్ఛించిన అద్దానిని ఒనర్పగలరు. జగత్తును తల్లక్రిందులు చేయగలమని వారు భావింతురు. లూట్, హత్య, ధ్వంసము ఒనర్చు అధికారము వారికున్నది. వారు భగవంతునికడ అధికారమును బడసిరి—వారు బాలకు లగుటవలననే ఇట్లు భావింతురు. ఎన్ని సామ్రాజ్యములు ఒకదాని తరువాత మరొకటిగ ఉత్థితమై ఉజ్వలములును, మహిమాన్వితములును అయినవి? తరువాత అవి ఎచ్చట కలసిపోయినవో ఎవరెరుంగుదురు? ఒక విశాలమగు ధ్వంసస్తూపము కేవలము మిగులుపడినది.

'నళినీ దళగత జలమతితరళమ్
తద్వజ్జీవన మతిశయ చపలమ్'

పద్మ పత్రమునందలి నీరు ఏ నిముషమునైన పడిపోవునట్లు—ఈ మర్త్య జీవనముగూడ. ఏ వైపునజూచినను ధ్వంసస్తూపమే. నేడు అరణ్య మగుపించుచోట, కొంతకాలము క్రిందట నగర నగరీశోభితమగు మహా సామ్రాజ్యముండెను. ఇయ్యది భారతీయ చింతయొక్క విశిష్టభావధార ప్రకృతి. నేడు పాశ్చాత్యునినాడుల యౌవన రక్త ప్రవాహము ప్రవహించుచున్నదని మే మెఱుంగుదుము. మనుష్యునికివలెనే జాతికిగూడ ఒక దినమున్నదని మే మెఱుంగుదుము. ఇప్పుడు గ్రీస్ ఎక్కడ? రోమ్ ఎక్కడ? శక్తిశాలియగు స్పెయిన్ ఎక్కడ? ఈ స్థితినుండియే మరల భారతదేశ మేమగునది ఎవ రెరుంగుదురు? జాతి ఇట్లే జన్మించి, మరణించుచున్నది—ఇట్లే దాని ఉత్థానపతనములు. ఏ మొగల్ వాహినిని ప్రతిరోధించుశక్తి జగత్తున లేకుండెనో, ఎవరు మీ భాషయందు భయంకరమగు 'తార్తార్' శబ్దమును నుంచిపోయినారో, హిందువులు వారి ఆక్రమణమును శైశవకాలమునుండియే ఎఱుగుదురు. హిందువునకు చాలినంత అభిజ్ఞత యున్నది. అతడు ఇప్పటి బాలకులవలె ఎగుడుదిగుడుపలుకుల పల్కజాలడు. పాశ్చాత్యులారా! మీ మనస్సు గోరునట్లు పల్కుడు. ఇవి మీ అదృష్టపుదినములు. మాకు చాలినంతగ అభిజ్ఞతయున్నది—అందువలన మేము మౌనముగనుంటిమి. నేడు మీకొకింత ఐశ్వర్యము వచ్చినదని మమ్ము ఏవగించుకొనుచున్నారు. ఇవి మీ రోజులు. 'నోటికి వచ్చినట్లు పలుకుడు'—ఇది హిందువుల మనోభావము.

నాయమాత్మా ప్రవచనేనలభ్యోనమేధయా న బహునా శ్రుతేన.

◆ ◆ ◆ ◆

నావిరతో దుశ్చరితాత్ నాశాంతో నా సమాహితః నాశాంతమనసో వాఽపి ప్రజ్ఞానే నైనమాప్నుయాత్.

వ్యర్థవాక్సమూహమువలన ప్రభువు దొరకడు. ధీశక్తివలన నతనిని బొందజాలము. ఏ వ్యక్తి విశ్వముయొక్క మూలరహస్యము నెఱుగునో, తద్భిన్నము సకలము క్షణస్థాయియని గ్రహించునో, అతని కడకే ప్రభువరుదెంచును, అన్యత్రకాదు. యుగయుగాంతరముల అభిజ్ఞతనుగడచి హిందువుడు తన శిక్షను సమాప్తమొనర్చి ప్రస్తుతము భగవంతునిమోమును వీక్షించుచున్నాడు. అవశ్యమాత డనేకముగ తప్పుల నొనర్చినాడు, బుంగలకొలది ఆవర్జన అతని నెత్తిపైననున్నది. అయిన నేమి? దుమ్ము. పట్టణముల శుభ్రముగ నుంచుట—వీట నేమియున్నది? అవి జీవితము నొసగగలవా? ఏజాతియందు సుందరములగు ప్రతిష్ఠానము లున్నవో, అయ్యదిగూడ మృత్యుకబళితమగుచున్నది. అగుచో, చంచలమును, క్షణభంగురమునగు ఈ పాశ్చాత్య సభ్యతనుగుఱించి ఏమి చెప్పను? ఐదు రోజులలోతయారై, ఆరవరోజున సమయుచున్నది. ఈ జాతులలో నొక్కటియు ఒక్కపెట్టున రెండువందల ఏండ్లు బ్రతుకజాలవు. కాని, మా జాతీయరీతి నీతులు శతాబ్దములుగ పరీక్షకు నిలిచినవి. హిందువులనునది, మేము పృథివియందలి వృద్ధజాతుల నన్నిటిని సమాహిత మొనర్చితిమి. నూతనజాతుల సమాహితమొనర్ప ఇంకను నిలచియున్నారము. ఏలయన, మా ఆదర్శము ఈ జగత్తుకాదు, జగదతీతము. 'ఎవని ఆదర్శ మెట్లుండునో అతడట్లేయగును'—నీ ఆదర్శము మర్త్యమయిన, పార్థివమయిన నీవును అట్లేయగుదువు. నీ ఆదర్శము జడమైన, నీవును జడమేయగుదువు. మా ఆదర్శము ఆత్మయని గుర్తించుకొనుము. అతడొక్కడే అవినాశి—మరి దేనియొక్కయు అస్తిత్వము లేదు—అతనివలెనే మేము అమృతులము.

సంపూర్ణము

మన దేశం

(నాడు - నేడు)

తోటి సోదరులంత
తప్పుత్రోవల ద్రొక్క
అజ్ఞాన తిమిరాన్ని
అనలాన వేసింది!

సామ్యవాదము నేర్పి
హింసమార్గము మాన్పి
వేదగ్రంథాల్నన్ని
వేనోళ్ల పలికింది!

మతము పేరట నెపుడు
హితపు బోధలజేసి
వేదాంత జ్యోతినీ
వెలిగించి చూపింది!

నాల్గుముక్కల తోడ
'నాయంత లేర' నీ
పాశ్చాత్య వ్యాహిహా
పంకాన కూలింది!

ధనికవాదలు హెచ్చ
హింసయే ప్రబలగా
శాంతి భద్రతలన్ని
బూదిలో గలిపింది!

మతపు దుస్తులతోడ
మచ్చుచల్లుచు నేడు
మనలోన మనలకే
మచ్చు రాల్పించింది!

—పిల్లలమఱ్ఱి వేంకట హనుమంతరావు.

గొప్పింటి బిడ్డ

★

రచయిత :

శ్రీ ప్రేమచందు

●

'గొప్పింటి బిడ్డలంటే ఇల్లానే వుంటారు, చెడిపోతూన్న పనిని సంభాళించుకుంటారు.'

●

అనువాదం.

శ్రీ నెల్లూరి - కేశవస్వామి

★

బీనీ మాధవసింగ్ గౌరీపురం జమీందారు. ఒకప్పుడు అతని పూర్వులు చాలాధనవంతులు. చెరువూ మఠమూ వారి జ్ఞాపక చిహ్నాలే. అప్పుడు వారింటిముందు ఏనుగులు నిలిచివుండేవని వినికిడి. అయితే ప్రస్తుతం వాటన్నిటికీ బదులు ఒక ముసలిబఱ్ఱెమాత్రం కట్టి వుంటుంది. వంట్లో మాంసముక్కే లేకపోయినా పాలుమాత్రం చాలా ఇచ్చేట్టుంది. బీనీ మాధవసింగ్ తన ఆస్తిలో సగంవరకు వక్కీళ్లకు అర్పించుకున్నాడు. ఇక ఇప్పుడు అతని ఆదాయం ఏటా ఒకవేయి రూపాయలకి మించదు.

ఠాకూర్జీ సంతానమంతా ఇద్దరు కొడుకులు. పెద్దవాడిపేరు శ్రీకంఠ్ సింగ్ కష్టపడి కష్టపడి బి. యే. డిగ్రీ సంపాదించాడు. ప్రస్తుతం ఏదో ఆఫీసులో పనికూడా చేస్తున్నాడు. చిన్నకొడుకు లాల్ బెహారీసింగ్. ఉత్త పల్లెటూరిమనిషి. మాంచి కండలు తేరిన దేహం. యౌవనం తొలకాడే నిండుమొగం. విశాల వక్షస్థలం. శ్రీకంఠుడు తమ్మునికి పూర్తిగాభిన్నం. దేహారోగ్యమంతా రెండక్షరాలు 'బి. యే.'కు బలిఇచ్చాడు. ఈ రెండక్షరాలే అతని ఛాతీ వైశాల్యమూ, ఎత్తుపొడుగూ, ముఖవర్చస్సూ అన్నీ సంగ్రహించాయి. ఇక ఇప్పుడీ మహాశయుడు తన తీరికవేళంతా వైద్యగ్రంథ పఠనలో గడుపుతూంటాడు. ఆయుర్వేదవైద్యంలో నమ్మకమెక్కువ. రాత్రింబవళ్ళు అతనిగదిలోంచి కల్వపోప్పెట్ల మృదుమధురరావాలు వినిపిస్తూనే వుంటాయి.

శ్రీ కంఠుడు ఇంగ్లీషుపట్టం పొందినా ఇంగ్లీషు సాంప్రదాయాలంటే అతనికట్టే నచ్చేవికావు. పైగా ఒక్కొక్కప్పుడు వాటిని తీవ్రంగా ఖండించేవాడుకూడాను. వూళ్ళో అతనికెంతో గౌరవం. దసరారోజుల్లో అతనెంతో ఉత్సాహంతో 'రాంలీలా'లో పాల్గొనడం; రోజూ ఏదో వొక వేషంకూడా వేయడమూను. ఇతని వల్లనే గౌరీపురంలో 'రాంలీలా' జన్మ ఎత్తింది. పురాతనమత సాంప్రదాయాల్ని బలపర్చటంలో ఇతనితర్వాతే అని చెప్పాలి. ముఖ్యంగా సమిష్టి సంసారాలపద్ధతి (Joint Family System) అంటే ఇతనికి పంచప్రాణాలు. ఈనాటికోడళ్లు తమ కుటుంబాలతో కలసీ మెలసీ వుండటానికి మూతివిరచటం దేశ దౌర్భాగ్యానికొక చిహ్నంగా ఎంచేవాడు. ఇందువల్లే ఊళ్లోని కోడళ్లదృష్టిలో అతనికట్టే మంచి స్థానం చిక్కకపోయింది.

ఆనంది ఒక గొప్పింటిబిడ్డ. ఆమె తండ్రి ఒక చిన్న ఎస్టేటుకు తాలూకుదారు. ఒక గొప్పభవనం, ఏనుగులూ, గుఱ్ఱాలూ, సిపాయీలూ, గుఱ్ఱపు బగ్గీలూ, వేటకుక్కలూ, రకరకాల పక్షులూ, ఆనరరీ మేజిస్ట్రేటుపదవీ, పైగా అల్లాంటి గొప్పవారికి తగ్గ అప్పు—ఇవన్నీ అతనిహయాంలోవున్న సౌకర్యాలు. పేరు భూప్‌సింగ్. విశాలహృదయం మంచి స్వభావంకల మనిషి. కాని కర్మవశాత్తు అతని కొక్కకొడుకైనా లేడు. ఏడుగురూ కూతుళ్లే. పుట్టినవాళ్లు పుట్టినట్టుగా చల్లగా వుండిపోయారు. తమతో సమానమైనా లేక మించిన కుటుంబాలతో సంబంధాలు చేయటం ఎస్టేటునుమట్టిలో కలపటమన్న మాట. ముందుముందు ఉత్సాహం కొద్దీ ముగ్గురిపెళ్లిళ్లు మహా వైభవంగాచేసివేసాడు. కాని పదిహేను ఇరవై వేల అప్పు అవగానే తనస్థితి తెలుసుకున్నాడు. ధర్మహస్తం ముడుచుకుపోయింది. ఆనంది నాలుగో అమ్మాయి. అక్కచెల్లెళ్లందరిలోనూ ఈమె ఎక్కువ అందకత్తె, గుణవంతురాలున్నూ. భూప్‌సింగ్‌కు ఆనందిపైన చాలా ఆపేక్ష. ఇక ఆనంది పెళ్లివిషయాల్లో ఏమీతోచక బాధపడ్తున్నాడు భూప్‌సింగ్. ఒకరోజు శ్రీకంఠడు వాళ్ళింటికి ఏదో చందాకోసమని—వెళ్ళాడు. భూప్‌సింగ్ అతని బుద్ధికుశలతా, వినయవిధేయతాచూచి ముగ్ధుడైపోయాడు. వెంటనే జన్మపత్రాలూ, పంచాంగాలు తిరగేసారు. పెళ్ళికూడా హాయిగా జరిగిపోయింది.

ఆనందిదేవి తన నూతనగృహంలో అడుగుపెట్టగానే తెలుసుకుంది, ఇక్కడిరంగే వేరని. ఏఏ భోగభాగ్యాలు, ఏఏ సౌఖ్యాలు ఆమెకు పుట్టుకతోనే అలవడ్డాయో అవిక్కడ మచ్చుకైనాలేవు. ఏనుగులూ, గుఱ్ఱాల మాటల్లావుంచి, ఒక మంచి అందమైన గద్దైనా లేదు. కేవలం అదొక సాధారణ పల్లెటూరిగృహం మాత్రమే! కాని కొద్దిరోజుల్లోనే ఆనంది తానిదివరకెన్నడూ సౌఖ్యాలంటే ఏవిటో ఎరగనట్టుగా కొత్తమార్పుల్లో లీనమైపోయింది.

♦ ♦ ♦ ♦

ఒకరోజు పగలు రెండుఝాములవేళ, బెహరీ భోజనానికికూర్చుంటే పప్పులోకి నెయ్యిలేకపోయింది. అడిగాడు, "పప్పులోకి నేచ్చుక్కేదీ?"

"ఇవ్వాళే కొంచెంవుంటే అది కూరలోవేసేసాను."

వదినెమాటకు మాట అనటం లాల్‌బెహారీ సహించలేకపోయాడు. మొహం చిట్లించుకుంటూ అన్నాడు, "పుట్టింట్లో నేతికాలవలు పారుతాయిగాబోలు "అని.

స్త్రీ తిట్లు సహిస్తుంది. కొట్లు సహిస్తుంది, కాని పుట్టింటి నిందనుమాత్రం సహించలేదు. ఆనంది మొహం త్రిప్పుకుని అంది, "చింత చచ్చినా పులుపువిరగలేదు! అక్కడైతే ఇంతనెయ్యి పనివాళ్ళు తినిపోతారు."

ఇహ ఆమోటుమనిషికి వళ్లు తెలియనంతటికోపం వచ్చింది. ప్రక్కనున్న పాంకోడు అందుకుని ఆనందివేపు విసిరికొడ్తూ అన్నాడు, "నీ పొగరూ అణిచేస్తాను జాగ్రత్త."

ఆనంది పాంకోడ్ని తనచేతో ఆపింది. తలతప్పిపోయింది, కాని వేలుకుమాత్రం దెబ్బఘాటుగా తగిలింది. గాలిలో ఆకులా కోపంతో వణికిపోతూ తనగదిలోకొచ్చి నిలుచుంది. స్త్రీ ధైర్యసాహసాలూ, మానవగౌరవాలన్నీ ఆమె భర్తపైన ఆధారపడివుంటాయి. అతనిబలంపైనే, అతనిధైర్యంపైనే గర్విస్తుంది, పొంగిపోతుంది. ఆనంది కోపమంతా రెండు కన్నీటిబిందువుల్లో ఇమిడిపోయింది.

♦ ♦ ♦ ♦

శ్రీకంఠ్‌సింగ్ ప్రతిశనివారం ఇంటికొచ్చేవాడు. గురువారం ఈ సంగతి జరిగింది. ఈ రెండు రోజులూ ఆనంది అన్నం నీళ్లుమానేసి భర్తరాక కెదురుచూస్తూ కూర్చుంది. ఆఖరికి యథావిధంగా శనివారం

సాయంత్రం అతనొచ్చాడు. "అన్నయ్యా! కాస్త ఇంట్లో చెప్పేసేయి నాలుకపట్టివాడమని. లేకుంటే ఒకరోజు అనవసరంగా నెత్తురు కళ్ళజూడాలిసి వస్తుంది."

బీనీ మాధవసింగ్ కూడా సాక్ష్యమిచ్చాడు, "కోడలు పిల్లలకిల్లాంటి అలవాటు పనికిరాదు. మొగాళ్లనోటికి తగులొక్కటం బుద్ధిమంతులలక్షణంకాదు."

లాల్ :—తానో గొప్పింటిబిడ్డతే అయింది, కాని మేమేమి కూలికుంకలంకామే.

శ్రీ :—ఇంతకూ సంగతేవిఁటి?

లాల్ :—ఏమీ లేదు. వూరికేనే ఎగిరిపడ్డది. పుట్టింటి ముందు మమ్మల్ని లెక్కచేయదు.

భోంచేసిం తర్వాత శ్రీకంఠుడు ఆనంది దగ్గరకెళ్ళాడు. ఆమె మొహం పెంచుక్కూర్చుంది. ఇతనుకూడా కాస్త కోపంతోనేవున్నాడు.

ఆనంది అడిగింది, "వళ్లు కులాసాగా వుందా?"

శ్రీ :—ఆఁ బాగానేవుంది... కాని ఇదేవిఁటి ఈరోజుల్లో ఇట్లా మొదలెట్టావు? ఇంట్లో ఈ గందరగోళమంతా ఏవిఁటి?

ఆనంది జరిగిన సంగతంతా పూసగ్రుచ్చినట్లు చెప్పింది.

శ్రీకంఠుని కళ్ళెఱ్ఱబడ్డాయి. ఇంతవరకొచ్చిందీ? ఈ కుంక పట్టి పోకిరీ అయిపోతున్నాడే! అని లేచి తండ్రి దగ్గరకెళ్లి అన్నాడు, "నాన్నా నేనిక ఈ ఇంట్లోవుండడం సరిపడదు."

ఈ వాక్యాలే నాలుకపైకి తెచ్చినందుకు శ్రీకంఠుడు ఇదివరకెన్నోసార్లు తనతోటివాళ్ల నెందరినో చెడ చీవాట్లుపెట్టాడు. ఏ స్నేహితుడేనా తనతో ఈ మాటలంటే చాలు వాడిని గేలిపట్టించి వదిలిపెట్టేవాడు. 'మీరంతా వృత్తభార్యా విధేయులోయ్, వాళ్లను మీచెప్పు చేతుల్లోవుంచుకోటం తెలియక వాళ్లకు అడుగులకు మడుగులొత్తే వాజమ్మలు' అని హిందూసమ్మేళన కుటుంబవిధానాన్ని ఇంత తీవ్రంగా బలపరచే శ్రీకంఠుడే ఈరోజు తండ్రితో అంటున్నాడు, 'నాన్నా! నేనీ ఇంట్లో వుండటానికి వీల్లేదు.' అని శ్రీవాళ్ల శ్రీరంగనీతులన్ని దూరమున్నంతమట్టుకే, పరీక్షసమయమొస్తే ఓపికా, ఓర్పూ అన్నీ శలవు తీసుకుంటాయి.

బీనీ మాధవసింగ్ ఆదుర్దాతో లేచి కూర్చున్నాడు. "ఎందుకూ?"

శ్రీ :—నాకూ కాస్తోకూస్తో గౌరవమనేదివుంటుందా? ఇహ ఈ ఇంట్లో పెంకితనం ఎక్కువై పోతోంది. ఎవరికైతే పెద్దాచిన్నా అనే తారతమ్యముండాలో వారే నెత్తినెక్కి కూర్చుంటున్నారు. ఎంతైనా నేనొకరి నౌఖరునేకదా, ఎప్పుడూ ఇంట్లోనే వుండటానికి వీల్లేదాయను. ఇక నావీపు వెనకాలనా స్త్రీపైన చెప్పులవర్షం కురుస్తుంటూంది. ఏదో ఒకటి రెండుమాట లనుకున్నారంటే ఫరవాలేదు. అంతమట్టుకు వోర్చుకోగలను. కాని ఆపైని తన్నులూ గుద్దులూకూడా పడ్తూంటే నోరు మెదల్చకుండా ఎట్లా వూరుకోను?

బీనీ మాధవసింగ్ ఈరోజు అతని ముఖలక్షణాలు ఇట్లా మారిపోవటం చూచి ఇంతమాత్రం అనగలిగాడు, 'నాయనా! నువ్వు బుద్ధిమంతుడివైకూడా ఇల్లా మాట్లాడొచ్చా? స్త్రీలు కుటుంబనాశనం

చేసేదిల్లాగే. వాళ్ళను అట్టే ప్రోత్సాహించటం మంచిదికాదు. లాల్ బెహారీ నీ తమ్ముడు. వాడిచేతనేదైనా తప్పిదమైతే వాడి చెవిపట్టుకో, కాని...'

శ్రీ:-లాల్ బెహారీని ఇక నా తమ్ముడిలా తలచను.

మాధవ:-స్త్రీ కొరకా?

శ్రీ:-కాదు, వాడి పొగరుమోత్తనం, కఠినత్వం కొరకు. వాడి ఈ చర్యను నేనెప్పటికీ క్షమించలేను. వాడేనా ఈ ఇంట్లో వుండాలి, లేదా నేనేనా వుండాలి. మీకు వాడిపైన ఎక్కువ ప్రేమ వుంటే నాకు శెలవిప్పించండి; నా భారమేదీటో నా తలపైనే పెట్టుకుంటాను. లేదా నేనే వుండాలని వుంటే వాడిని తక్షణమే ఎక్కడికేనా వెళ్లిపొమ్మని చెప్పండి. ఇది నా ఆఖరి తీర్పు.

ఇంతసేపూ లాల్ బెహారీ తలుపుచాటున మౌనంగా నిలుచుని అన్నమాటలు వింటున్నాడు. అన్నంటే ఎంతో భయం, భక్తి. ఎన్నడుకూడా శ్రీకంఠుని యెదుట మంచంపైన కూర్చోటానికిగానీ, బీడా వేసుకోటానికిగానీ సాహసించలేదు. తండ్రియెడలకూడా ఇంత భక్తి శ్రద్ధలు చూపకపోయేవాడు. శ్రీకంఠునిక్కూడా తమ్మునిపైన చాలా ప్రేమ. అతనికి జ్ఞాపకమున్నంతమట్టుకు ఎన్నడూ తమ్మునిపై గుడ్లెఱ్ఱజేసైనా ఎరగడు.

అన్ననోటినుంచే ఈరోజు శూలపోట్లలాంటి మాటలు రావటం విని లాల్ బెహారీ మనస్సు చివుక్కుమంది. అతనికోపం రాలేదు. వెక్కివెక్కి ఏడవట మారంభించాడు. తాను చేసిన పనికి విచారిస్తున్నాడనటంలో సందేహమేమీ లేదు.

ఏడుస్తూ ఇంట్లోకెళ్లి తనగదిలో బట్టలేసుకున్నాడు. ఏడుస్తున్నాడని ఎవరేనా అనుమానించకుండా కళ్లు తుడుచుకున్నాడు. ఆనందిదేవి గదిదగ్గరకెళ్లి అన్నాడు, 'వదినా! నాతో ఇంట్లో వుండకూడదని అన్నయ్య నిశ్చయంచేసుకున్నాడు. ఇక నా మొహమే చూడదలచుకోలేదు. అంచేత నేనే వెళ్లిపోతున్నాను. నా మొహం ఇక చూపించను. నాలో ఏదేనా దోషముంటే క్షమించాలి.' లాల్ బెహారీ కంఠం రుద్ధపడిపోయింది.

♦ ♦ ♦ ♦

లాల్ బెహారీ తలవంచుకుని ఆనందీ గదిముందు నిలుచునివున్న సమయానికి శ్రీకంఠుడు కోపంతో ఆవలినుంచి వచ్చాడు. తమ్ముణ్ణి చూచి అసహ్యాభావంతో మొహం త్రిప్పేసుకున్నాడు. అతని నీడ సోకటం కూడా ఇష్టంలేనట్టుగా ప్రక్కనుండి తప్పుకుని వెళ్లాడు.

ఆనంది లాల్ బెహారీ గురించి భర్తతో ఫిర్యాదయితే చేసింది, కాని ఇప్పుడు మనసులో విచారిస్తోంది. ఆమె వస్తుతః చాలా ఉత్తమస్వభావంకల మనిషి. ఈ విషయం ఇంత పెరిగిపోతుందన్న సంగతి ఆమె వూహాలోకికూడా రాలేదు. వున్నకోపం కాస్తా కరిగి నీరైపోయింది. తానూ ఏడవట మారంభించింది. హృదయమాలిన్యాన్ని కడిగివేయటానికి కన్నీటికంటె ఉపయుక్తమైన వస్తువు మరొకటి లేదు.

శ్రీకంఠుణ్ణి చూసి ఆనంది అన్నది, 'లాలా ఆవల నిలుచుని ఏడుస్తూన్నాడు.'

శ్రీ :-అయితే నేనేంచేయనూ ?

ఆనంది :-లోపలికి పిలవండి......నా నాలుక్కాలిపోను, నేనెక్కడినుంచి తెచ్చిపెట్టానమ్మా ఈ పాడు గోల !

శ్రీ :-నేను పిలవను.

ఆనంది :-పిలవండి. తర్వాత మీరే విచారిస్తారు...పాపం ! చాలా చింతిస్తున్నాడు. ఎక్కడికేనా లేచిపోతాడేమో...

శ్రీకంఠుడు లేవలేదు. ఇంతలో లాల్ బెహారీ మళ్లీ అన్నాడు, 'వదినా! అన్నయ్యకు నా నమస్కారమని చెప్పు. నా మొహం చూడదలచలేదు గనక వెళ్లిపోతున్నాను.' లాల్ బెహారీ ఇంతమాత్రం అని గిరుక్కున తిరిగి ద్వారంవైపుకు తొందరగా పోసాగాడు. ఏకాయకిని ఆనంది తన గదిలోంచి ఈవలికొచ్చి అతనిచేయి పట్టుకుంది. లాల్ బెహారీ వెనక్కుతిరిగి చూశాడు. గుడ్లల్లో నీళ్లు గుక్కుకుంటూ అన్నాడు, 'నన్ను వెళ్లనీయి.'

ఆనంది :-ఎక్కడికి ?

లాల్ :-నా మొహమెవరూ చూడని చోటికి.

ఆనంది :-ఊహుఁ నేను వెళ్లనివ్వను.

లాల్ :-నేను మీతో వుండటానికి అర్హుణ్ణి కాను.

ఆనంది :-ఒక్కడుగు ముందుకు వేశావంటె నాపై వొట్టు.

లాల్ :-నా విషయమై అన్నయ్య మనసులో ఏమీలేదని తెలిసేదాకా నేనింట్లో వుండను.

ఆనంది :-దైవసాక్షిగా చెబుతున్నాను, లాలా, నీగురించి నామనసులో ఏమీలేదు.

ఇక శ్రీకంఠుని హృదయంకూడా కరిగింది. గదీవలికొచ్చి తమ్ముణ్ణి కౌగలించుకున్నాడు. అన్నదమ్ములిద్దరూ హృదయభారం తగ్గేట్టు ఏడ్చారు. లాల్ బెహారీ వెక్కి వెక్కి ఏడుస్తూ అన్నాడు, 'అన్నయ్యా! ఇక మరెప్పుడూ నా మొహం చూడనని అనకు. దీనికి మినహా నువ్వే శిక్ష విధించినా సంతోషంతో స్వీకరిస్తాను.'

శ్రీకంఠుడు వడికే కంఠంతో అన్నాడు, 'లల్లూ! ఆ మాటలన్నీ మరిచిపో. దేవుని చూపు చల్లగా వుంటే మరెప్పుడూ అల్లాంటి సమయం రాదు.'

బేనీ మాధవసింగ్ ఆవలనుంచి వస్తూ అన్నదమ్ములు కౌగలించుకోవటం చూసి సంతోషంతో పుష్పొంగిపోతూ అన్నాడు, 'గొప్పింటి బిడ్డలంటే ఇల్లానే వుంటారు, చెడిపోతూన్న పనిని సంభాళించుకుంటారు.'

వూళ్లో ఈ సంగతి విన్నవాళ్లంతా ఆనందిదేవి ఉదారస్వభావాన్ని ఈలా పొగిడారు, 'గొప్పింటి బిడ్డలు ఈలా వుంటారు.'

పల్లెటూళ్లు - వాటి ప్రస్తుత దౌర్భాగ్యస్థితి

★ శ్రీమతి .గోపరాజు సీతాదేవి ★

గ్రామములని చెప్పబడు పల్లెటూళ్ల దీన స్తితినివర్ణించలేము. 'పునరుద్ధరింపబడాలి' అని ప్రబోధము చేయు 'మహాత్మాగాంధి' యుగములోనే కొండాడ సీమనూతుల్లో నీళ్లులాగ చాలా అడుగున వున్నాయి.

విద్య

పల్లెలలో పెద్దవారికి చాకలి పద్దువ్రాయనేర్చిన చదువు వచ్చునోరాదో, కాని వచ్చునని మాత్రము ధీమాగా చెప్పలేము. వచ్చినా ఏపేపరైనా, ఏపుస్తకమైనా, చదివినా అందలి సంగతులు అర్థం కావు. నూటికి ఏ ఇద్దరో ముగ్గురో తప్ప, అక్షరజ్ఞానముకూడా తెలియనివారు గలరంటే అందులోని నిజము తెలుస్తుంది. ఇపుడు చదువుతూవున్న పిల్లల భావిస్తితి అగమ్యగోచరంగా వుంటుంది. విద్యావిధానం సరిలేదు. దానికి తగ్గట్టుగా ఉపాధ్యాయుల అశ్రద్ధ. వారు విధి తీర్చుకోవడమే కాని, కొత్తపద్ధతులు నేర్పుటకాని, వారిని అభివృద్దిలోనికి తీసుకురావడము కాని, వారికి తెలియదు. పల్లెటూళ్లు అభివృద్ధి పొందాలంటే వయోజనవిద్య కావాలి. ప్రాథమిక విద్యావిధానం సంస్కరింపబడాలి.

మహిళా సంఘములు

ప్రతి పల్లెలోనూ ఒక మహిళాసంఘము స్తాపింపబడాలి. ఇందుకు పట్టణములోని మహిళా సంఘము, సోదరీ ప్రతినిధుల సహాయము, ప్రచారము ముఖ్యావసరం. దేశహితార్థము పాటుబడు సోదరీమణులు పల్లెటూళ్ళలోకూడా ప్రచారము సాగించి, అక్కడవుండే స్త్రీలనుకూడా విజ్ఞానవంతులనుచేయు భారమువహించాలి. ముఖ్యముగా దేశము వృద్ధిలోకి రావాలంటే పల్లెలను మేలు కొలపాలి. పట్టుదల, ధైర్యము, వుత్సాహము, కార్యదీక్ష, ఆరోగ్యము వీరికి పెట్టని భూషణములు. కాని వీరి సుగుణములు మంచిలో వుపయోగించని కారణమున ప్రయోజనం లేకపోవుచున్నవి.

ఆర్థికదుస్థితి

పల్లె సోదరీమణులు ఆర్థికంగా చాలా ఇబ్బంది పడతారు. అందరూ వ్యవసాయ పరిశ్రమ మూలమున ఒక సంవత్సరము పండి, ఒక సంవత్సరము పండక, పన్నులు చెల్లింప తప్పక పురుషులే ఇబ్బందికి లోనవుతారు. ఇంక స్త్రీల సంగతి చెప్పనే అవసరములేదు. ఆర్థిక యిబ్బంది మూలముననూ, అజ్ఞానమువల్లను తమ భర్తలు తెచ్చిన సరకులను యితరులకు స్వల్పధరలకు చాటుగ ఒకరికి తెలియకుండా ఒకరు విక్రయిస్తూవుంటారు. దీని మూలమున గృహకలహములే కాక సంసారములు హీనస్థితికివచ్చి అనేక కుటుంబములు చెడిపోవుచున్నవి.

పఠన మందిరములు

వీరికిగల అజ్ఞానము, సోమరితనము, అవిద్య, అసత్యము, మూఢ నమ్మకములు, తగవులాటలు, ఒకరిని చూచి పరిహసించడము, వృథాకాలక్షేపము పోవలెనంటే ప్రతి పల్లెటూరులోనూ స్త్రీలకు చెందిన పఠనమందిరములు వుండవలెను. ఆయా గ్రామములకు చెందిన తాలూకాలనుంచి సంఘ ప్రతినిధులువచ్చి నెలకొకసారి ఐననూ ఉపన్యాసములు ఇస్తూ వుండిన అచిరకాలములోనే ఉన్నతస్థితి పొందగలవు.

— సీత మహాసాధ్వి —

'గృహలక్ష్మి' 1940 నవంబరు, డిశంబరు సంచికలలో శ్రీయుత ఆచంట సూర్యనారాయణమూర్తి, బి. ఎ. బి. యల్. గారి "సీత శాపము", "దమయంతికాలంలో విడాకులు వుండివుండాలి" అనే వ్యాసములపై విమర్శనలు.

"...సీతయొక్క సతీత్వము, పవిత్రత నిరూపించుటకయే అన్నివేల శ్లోకములుగల రామాయణ మహాగ్రంధము వ్రాయబడినది. కాని, పదునాల్గు సంవత్సరాలు మగనితో అరణ్యవాస మొనరించి, అష్ట కష్టముల కోర్చికొని, సహధర్మచారిణిగా మగనిని అనుసరించి మెలగిన సీతా మహాసాధ్వి, రావణుని తన శాపానలంబున శలభము మాడ్కి తలచుకొనినచో నశింపజేయగల వాక్శుద్ధిగల సతీలలామ, పతిబల వీర్యత్వములకే ప్రాముఖ్య మివ్వదలచి, హనుమంతునంతటి భక్తుడు కోరినను రానని, వీరావతంసుడగు శ్రీరాముడు రావణ సంహారణార్థమైపుట్టెనని నాతని కార్యనిర్వహణమునకు విఘ్న మాపాదింపని సీతామతల్లి, పతివ్రతలలో మొదటిమణి, కొలికపూస అనతగ్గ జానకి, శాంతమున, ఓర్పున భూమికెనవచ్చు భూమిజ, తనశీలాన్ని అగ్నిపరీక్షలో గెల్చి, ముల్లోకముల భళీ భళీ యనిపించిన పరమ పవిత్ర, లోకమాత, శాంతమతి, దాంతమతి, తన్ను భర్త తిరిగి శీలపరీక్ష కోరగా, "ఆత్మ విశ్వాసంలేని రాజని" పతినింద జేయునట్టి, అవివేకిని క్రిందను, అహంకార తామసి క్రిందనుకట్టి వ్రాయుట, వ్రాయువారి అపచారములు కావా! అంత తామసాహంకారిణియే యైతే తన్నాలంకకు తీసుకువెళ్లకుండగా, రావణునినే శపించియుండలేదా? పోనీ, మొదటిలోనే తొందరెందుకని, మగడుబెట్టే బాధలుపడి పడి, విసుగెత్తి పెట్టిందనుకుంటే విసుగు కోపముగల నారి, లోకాదర్శరమణి కానేరదు. కష్టపరం పరలలోనే మనుజుల మహత్యములు నిలబడి లోకాదర్శములగును కాని, శాపకారులు ఎన్నికలోనికి రారు. విజ్ఞానిక కవిత్వంలో దోషారోపణకు, ఎరగనివాళ్ల కేరువులు పెట్టుటకు తావుండకూడదు.

శ్రీరామచంద్రుని సుగుణములకు, పితృవిధేయతకు ముల్లోకములు తలలాడించినవి. లోకమంతా మొగ్గినది. కొడుకు విధేయతకు, పితృభక్తికి సంతసించి దశరధుఁడు ఏమని దీవించాడు—

"పది కొంపలును లేని పల్లెనైనను, రామభజన మందిర మొండు వరలుగాత.
ఎట్టి వ్రాతయు శ్రీరామచుట్టబడక, వ్రాయబడకుండు గావుత
రామవాక్యమనిన; దిరుగనిదని యర్థమగును. గాత!" (పానుగంటివారి పాదుకలోనిది)

అట్టి శ్రీరాముణ్ణి, తన్నే గాని కలనైన పరభామనుతలంచి యెరుగని మహానుభావుణ్ణి, పతియే దైవమని నిరూపించి చూపించిన సీత విసుగెత్తి 'ఆత్మవిశ్వాసంలేని రాజని, అతన్ని నమ్మికొలిచే మూఢప్రజలు స్వాతంత్ర్యంలేక నశించిపోతారు' అని శపించిందని క్రొత్తపూతలు. ఆహా! అందుకే మనకి స్వతంత్రత నశించిందికాబోలు. ఇట్టి వార్తలు విని నమ్మినవాళ్లకు మాత్రం, నిజంగా, సీతాశాపం తగులుతుంది. రామపతాలు, రామభజనలు, రామకీర్తనలు, నశించిపోయి, అపహాస్యమగుటకే యిట్టి నవయువక కవిత్వాలుద్భవిల్లాయి. శ్రీరాముడే పరమాత్మని హనుమంతునికి నచ్చచెప్పిన, సీతా అధ్యాత్మ రామాయణ ఘట్టము, శివుడు మనకుచెప్పిన పరమకీలకం రామమంత్ర మహిమ. రామనామాక్షరద్వయ మహిమాతిశయమెరిగిన పరమశివుడు రామాయణ గ్రంధమంతయు మహాఋషులకు పంచియిచ్చి, రామ అన్న రెండక్షరముల కీలకమే తను గ్రహించినట్లు పెద్దలుచెప్పిరి. అట్టి శ్రీరామచంద్రుడు, సాక్షాత్తు ఆదివిష్ణువు రామునిగాను, శ్రీలక్ష్మి సీతగాను యుద్భవించిన వారికా, పామరనరులము, పతితులమగు మనము మెరుగుపూతలు పూయుట!

దమయంతీ విడాకులు కూడా పైవ్రాతల్లాంటివే. విసిగిన దమయంతియైతే, తిన్నగా పుట్టింటికే పోవును. ఒప్పుకున్నట్లే చరిత్రలో వుంది? నలోపాఖ్యానంలోనా? చిత్రనళీయ నాటకంలోనా? దేనిలోను లేదు.

నలునిరూపముమారి, బాహుకనామంతో ఋతుపర్ణ మహారాజువద్ద యున్న ట్లెరిగిన సుదేవుడెంతయో నలుని విదర్భకు రప్పింప పన్నిన మాయాస్వయంవర మని గ్రంథమే చెప్పుచున్నది. పరాశరస్మృతిలోని, శ్లోక మెత్తి ద్వితీయ వివాహానికి హక్కుందని చూపించాడు.

"నష్టే, మృతే, ప్రవ్రజితే, క్లీబే చ పతితేపతౌ। పంచస్వాపత్సు నారీణాం, పతిరన్యోవిధీయతే" అని ప్రస్తుతము డైవోర్సుచట్టం కోరేవారుకూడా సూత్రాలు చూపిస్తున్నారు. అదిసాకుగా, మహా పతివ్రతయైన దమయంతియే ఒప్పుకుందని నిర్ధారణయా! మారుమనువుండి, చేసుకున్న హిందువులలో హీనజాతులవారు, పాశ్చాత్యులుకూడా, భారతీయ పతివ్రతాధర్మమే మంచిదని, తమదారికి దరిగానకవిచారించి, మన మహిళా మణులుకోరి సభలుచేయునప్పుడే బోధించుచుండగా, అట్టి ద్వితీయ స్వయంవరము (భర్తగలదానికి) చేసి కొనుటకెట్టి ఆక్షేపణలేదని, నిదర్శనపూర్వకంగా నిర్ధారణచేసి, ప్రేరేపించుటకిట్టి వ్రాతలువ్రాయు పిచ్చి తలంపు లికనైన మానుటుత్తమము.

రారాజులందరు ఎందుకొచ్చారన్నారీ సూర్యనారాయణమూర్తిగారు. ఏ రాజులొచ్చారు? ఏం చేశారు. ఒక్క ఋతుపర్ణుడేవచ్చి, ఎవరూలేరని, అలంకారాలులేవని, తన్నవమానించుటకీ పన్నాగమని విచారించాడే! అసలు మొదటనే దమయంతి సుదేవునితో:

"దైవంబుగానెంచు ధవునెడ మరిమది
చేడియకీ ద్రోహచింతదగునె
ధర్మంబు నశియించు దలగు పుణ్యము
పరి తాపముద్భవమొందు బాపమడరు,
నగుబాటు వొడము మానకయుండు నపకీర్తి
మరిమరి జనియించు మానహాని
......ఉండెలేకుండె నానాథు నొనరజూచు
భాగ్యము సుదేవ యీభంగి వలదునాకు॥

అన్నట్లు, చిత్రనళీయ నాటకంలో (ధర్మవరం కృష్ణమాచార్యులుగారు) వ్రాసియున్నారు.

"అనఘుడింద్రుడెవచ్చి, తనపాణి వేడిన। కనకాంగి వినదయ్యె ననుచువింటి" అని శ్రీ అయోధ్యా పురాధీశ్వర మహారాజు ఋతుపర్ణుడుకూడా, తన్నాహ్వానించిన సమయంలో, దమయంతీ పాణిగ్రహణోత్స వానికి బదులు విచారించాడు.

అట్టి మహాపతివ్రత, దేవేంద్రాదుల ధిక్కరించి, నలునేకోరి, ఏకాకారులై భంగపరచవచ్చిన, అష్ట దిక్పాలుల తన సతీత్వముచేమెప్పించి, భారతదేవిచే ఎలుకచేయబడి వివాహమాడి సకలకష్టముల నతిసహన ముతో భరించి కిరాతుని తన శాపానలమున దగ్ధమొనరించిన పవిత్ర భారతసతికా యిట్టి తలవంపుపూతలు..."

—ఆచంట సత్యవతమ్మ.

* * * *

"...నిషధాధిపతియైన నలుడు జూదములో రాజ్యమును కోల్పోవటము-విపినముల పాలుగావటము. నిద్రావస్థలో నున్నపుడు భార్య తనతోగూడ అవస్థలపాలు సేయుట కిష్టములేక వదలివేయటము - కర్కో టకునిచే వికృతరూపమునుబొంది, ఋతుపర్ణునివద్ద నుండటము - దమయంతి అవస్థలుపడుతూ విదర్భకు చేరటము. అందరు ఎరిగినసంగతే. విదర్భకేగిన తరువాత దమయంతి అవస్థ నెట్లున్నదో చూడుడు.

★

గుంటూరు శ్రీ శారదా నికేతనము వార్షికోత్సవము శ్రీయుత మంత్రిప్రగడ నరసింహం పంతులుగారి అధ్యక్షతను జయప్రదముగా జరిగినది.

★



వార్షికోత్సవ సందర్భమున జరిగిన నికేతన బాలికల
నూలు వడుకు పోటీ.

సీత మహాసాధ్వి

ఉ. "భామ విదర్భకేగి తనబంధుజనంబులయొద్ద నుండియుం
కోమలి దేహస్వామ్యములకున్ వెలియై మలినార్ధవస్త్రమున్
భూమిరజంబునంగమున బాల్పగుచుండగ నుండెజీవిత
స్వామినిజేశు జూచుదివసంబులు గోరుచు సువ్రతంబుతోన్"

ఈ విధంబుగా కాలము గడుపుచుండగా తన భర్త నన్వేషించుటకై, ప్రతిదేశమును గూఢచారు
లను పంపుచు వారలతో ఈ విధంగా జెప్పినది. 'సత్యనిరతుడవు సతినింతి వర్జించి దాని వస్త్రార్ధంబుదరిగి
నీవు..........................రాని నాడు రండెరింగి" (భారతము, ఆరణ్య 2 ఆ. 157) వారు
దేశములు తిరిగి, తిరిగి తుదకు ఋతుపర్ణునా స్థానములో దమయంతి యను మన్నమాటల నుచ్చరింపగా వానికి
సమాధానము వచ్చెను. అపుడా గూఢచారు లతనే నలుండైయుండ నోపని ఎరింగి, ఆ సంగతి దమయంతితో
వచ్చి చ్ఛెపిరి. దమయంతి సంతసించి సుదేవుడను బ్రాహ్మణుని ఋతుపర్ణునివద్ద కంపి "రేపు దమయంతీ
స్వయంవరము-మీరు రావలె"నని కబురంపెను. ప్రథమ స్వయంవరము చాటింపు వేసినట్లు చాటింపు వేయ
లేదు. ఋతుపర్ణునివద్ద నలుడున్నాడని గ్రహించి ఆతని విదర్భకు రావించుటకై ఋతుపర్ణునకు స్వయంవర
మని కబురంపినఎడల ఋతుపర్ణుడు నలునిరథచోదకునిగా నుంచుకొని ఒక్కరోజులోనే రాగలడు గనుకను,
నలుడే రథచోదకుడుగానుండిన ఎడలనే ఒకరోజులో రాగలరు గనుకను, మరొకరు రథచోదకులుగా నున్న
ఎడల ఒక్కరోజులో రాలేరు గనుకను ఒకరోజు గడువుపుండగా కబురంపింది. తండ్రికీ సంగతెంతమాత్రము
తెలియదు. తెలియదనటానికి నిదర్శనము భారతము కాస్తచూస్తే తెలుస్తుంది (ఆరణ్య ఏకోనసప్తతిత
మోధ్యము 14-వ శ్లోకం "అయమర్ధోన సంవేద్యోభీమేమాత: కదాచన త్వత్సన్నిధేనియోష్యాహం సుదేవం
ద్విజసత్తమమ్") స్వలాభంచేత తండ్రి, కూతురు స్వలాభంచేత అబద్ధంసాటింపు వేయేలేదు. సాటింపు
సంగతే (కబురంపటమే) తండ్రికి తెలియనపుడు ఇతర రాజులకేం తెలుస్తుంది. దమయంతిని పెళ్లాట్టానికి
మేమమ్మాతగుదుమంటూ పెళ్లికొడుకులు తయారవనేలేదు. ఇదంతా వట్టి భ్రమ. శ్రీ సూర్యనారాయణ
మూర్తిగారి స్వకపోల కల్పన. స్వయంవరానికి ఋతుపర్ణునితోసహా నలుడొస్తాడు. అపుడు దమయంతి
కొడుకును, కూతుని నలునివద్దకు పంపుతుంది. వారలనుచూచి దుఃఖించి ముద్దిడుకుంటాడు. ఈ సంగతంతా
కేశినిద్వారా దమయంతి తెలిసికుంటుంది. ఆతడే తన భర్తయైయుంటాడని కృతనిశ్చయురాలై నలునివద్ద
కేతెంచి కన్నీరుమున్నీరుగా దుఃఖిస్తుంది. అపుడు నలుడు దమయంతితో నేనే నలుడని తెల్పుతూ అన్నమాటను
చూడండి "స్వైరవృత్తా యథాకామమను రూపమి వాత్మనః శ్రుత్వైవచైనం త్వరితో భాంగాసురిరుపస్థితః"
దీన్నిబట్టి కులస్త్రీలలో పునర్వివాహమనేది లేదనీ, స్వైరిణీజాతి స్త్రీలలో గలదనీ స్పష్టమగుచుండగా
శ్రీ సూర్యనారాయణమూర్తిగారిట్టి వ్రాతకు గడంగుట మిక్కిలి శోచనీయము..."

—నాదెళ్ళ రామకృష్ణశాస్త్రి.

శ్రద్దధానశ్శుభాం విద్యామాదదీతావరాదపి
అంత్యాదపి పరం ధర్మం స్త్రీరత్నం దుష్కులాదపి.

శ్రద్ధగలవాఁడు తనకంటెఁ దక్కువవాఁడైనవానికడనుండియైనను నుత్తమవిద్యను గ్రహింపవలయును.
అంత్యజునియొద్దనుండియైనను నుత్తమధర్మమును నేర్వవలయును. తక్కువకొలమువాని కడనుండియైనను స్త్రీ
రత్నమును గ్రహింపవలయును.

—మనుధర్మశాస్త్రము.

చలన చిత్రాలు

ఫేమస్ ఫిలిమ్సువారి "ధర్మపత్ని"

విడుదలయై ఆంధ్రదేశపు ముఖ్య కేంద్రాల్లో అఖండమైన విజయయాత్రలు చేస్తూవుంది.

సుప్రసిద్ద దర్శకులు శ్రీ పి. పుల్లయ్యాగారి దర్శకత్వంలో రాణజెందిన యీ చిత్రం కళావైద గ్ధ్యాన్ని వేనోళ్ల చాటుతోంది—చక్కని కథ, కథకు పుష్టినిచ్చే సన్నివేశాలు, తగుమైన సంగీతం చిత్రానికి ప్రత్యేకతని సమకూర్చాయి.

శోభనపుగదిలో కథానాయకుడు తనకివ్వబడిన పాలగ్లాసులోనిపాలను పూర్తిగా త్రాగి కాళీ గ్లాసును భార్యకు యివవడంలో, కథానాయిక చెరువునుంచి వస్తూవుంటే, దారిలో క్రూరుడు ఆనందరావు రాకకుపూర్వం, త్రాచుపామును చూపించడం—మొదలైన సన్నివేశాలో దర్శకులయొక్క చాతుర్యం ఉట్టి పడుతోంది—

శ్రీమతి శాంతకుమారి, భానుమతి, పెద్దాపురం రాజుగార్లు చాలా చక్కగా నటించారు. శ్రీ కుటుంబరావుగారు సాంఘిక చిత్రాల్లో "విలన్"భూమికను నిర్వహించడానికి క్రొత్తదారులు చూపించారు.

మొత్తంమీద చిత్రం ఉత్తమశ్రేణికి చెందుతూ, శ్రీ పుల్లయ్యాగారి ప్రతిభకు ప్రబల నిదర్శనంగా వుంది.—

కస్తూరి ఫిలిమ్సువారి "అపవాదు"

గతమాసం 17వ తేదీనాడు కోయంబత్తూరు కస్తూరీ ఫిలిమ్సువారి "అపవాదు" చిత్రంయొక్క ప్రారంభోత్సవం జరిపారు. దర్శకులు శ్రీ రామబ్రహ్మంగారు, తమ శరీరాస్వస్థత మూలంగా చిత్ర నిర్మాణానికి వెంటనే పూనుకోడం జరగలేదని, రిహార్సల్సు పూర్తి చేసుకుని కోయంబత్తూరు వెళ్లనున్నామని, సుప్రసిద్ధ సంగీత దర్శకులు శ్రీ భీమవరపు నరసింహారావుగారు సంగీత దర్శకులుగా తిరిగి సహకారాన్నిస్తూ వున్నందుకు చాలా ఆనందిస్తున్నానని ముక్తసరిగా ప్రసంగించారు—యీ చిత్రంలో శ్రీమతి రాజ్యం, వరలక్ష్మి, శ్రీ రాఘవన్, రఘురామయ్యాగార్లు పాల్గొంటున్నారు. వచ్చిన అతిథులకు కాఫీ తాంబూల సత్కారాలతో నాటి ఉత్సవం మంగళప్రదంగా ముగిసింది.

◆ ◆ ◆ ◆

ఆర్. యన్. పి. పిచ్చర్సువారి తారాశశాంక్ చిత్రం షూటింగు పూర్తయి ఎడిటింగులోవుంది.

◆ ◆ ◆ ◆

జయా ఫిలిమ్సువారి "దక్షయజ్ఞము" షూటింగు చాలా చురుగ్గా జరుగుతోంది. దర్శకులు శ్రీ చిత్రపు నారాయణమూర్తిగారు. కవి శ్రీ బి. టి. నరసింహాచార్యులుగారు.

◆ ◆ ◆ ◆

రాజరాజేశ్వరీ ఫిలిమ్సువారి "తల్లిప్రేమ" షూటింగు చాలావరకు అయినట్లే—

పుష్ప చయము * * *

★ విషవాక్యములు

సామాన్యముగా స్త్రీలుగాని పురుషులుగాని తీరికసమయములలో ఏవో గప్పాలుకొట్టడమో, కబుర్లు చెప్పుకోవడమో, ఇతరులను దూషించడమో, లేక కొందరిమీద అపనిందలు మోపడమే అన్ని దేశముల లోను అన్ని తెగలలోను జరుగుతూనేవుంది. కాని ఇది స్త్రీలలో విశేషముగా కనుపడుతుంది. దీని వలన ఇరుగుపొరుగువారితోను, పురజనులతోను పొరపొచ్చములు ఎక్కువయి మనస్పర్ధలు, విరోధములు పుట్టి, చివరకి ప్రాణాంతకముగా పరిణమిస్తుంది. దంపతులలో లేనిపోని సందేహములుగలిగి ఎడబాట్లో లేక ఒకరికొకరు విడిచిబెట్టుకోవడమో అవుతుంది.

పూర్వపు స్త్రీలకు గృహకృత్యములు తప్ప వేరే వ్యాసంగముండేదిగాదు. కనుక ఉబుసుపోకకు నలుగురూ కలిసి ఏ యమ్మలనో ఆడిపోసుకోవడమూ వారిసంగతి వీరికి, వీరిసంగతి వారికి చెప్పి కలహములు పుట్టించడమూ, వీటిచే కొంత సంతోషించడమూను జరిగేది. ఇప్పటి స్త్రీలకు నిర్వహించవలసిన బాధ్యత, పనులు ఎన్నియో ఉన్నవిగదా! పురుషులతోపాటు అన్ని విషయములలో మేమూ సమానమని గర్వించుచుండే ఈ నవనాగరిక కాలములలోకూడ ఇట్టి అనవసరమగు లోకాభిరామాయణముతో కాలమునువ్యర్థపుచ్చుచూ, వ్యర్థపుచ్చుటయే గాక మానవులకుండవలసిన స్నేహానురాగము, ఐకమత్యము, గౌరవములను కూకటి వేళ్ళతో బెరికివేయుచుండుటెంత విచారకరము? తమ సంగతినిగుఱించి ఇతరులు తూలనాడుచుండిన తమకెంత అసహ్యముగా నుండునో అంతే ఒకరినని ఎందుకు తలంపరో?

ప్రపంచమున స్వాతంత్ర్యము, స్నేహము, శాంతి, ప్రేమ నెలకొల్పవలెనన్న బాధ్యత ఇప్పుడు స్త్రీల మీదనే ఆధారపడివుండనేది అన్నిదేశములవారును ఒప్పుకొంటున్నారు. ఎందుకంటే పురుషులలో ఐకమత్యము సున్న, సరళహృదయము లేదు, స్నేహానురాగం శూన్యం. ఇప్పుడు పాశ్చాత్యదేశములో స్త్రీలున్ను కఠినహృదయులై, మాత్సర్యముగలిగి పురుషులతోపాటు ఎంతయో క్రౌర్యమునకును సాహసించుచున్నారు.

ఇదెంతమాత్రమును దాస్యవిముక్తికి మూలముకాదు. అశాంతి వాతావరణములో జీవనజ్యోతి ప్రకాశింపదు. స్త్రీలయొక్క సహజకోమలహృదయములందు ప్రేమ, దయ, అనురాగం, వాత్సల్యం, భక్తి మొదలగు సుగుణములు తొలుకాడునప్పుడే ప్రపంచము మానవత్వముతో నిండియుండును. ప్రస్తుతమిట్టి విప్లవ వాతావరణమునకు కారణమేమి? పరస్పర వైషమ్యము, ద్వేషము, ఈర్ష్య ఇవన్నియు బాగా వృద్ధిజెంది ఆయా వ్యక్తులకే గాక, దేశదేశమునకే వ్యాప్తిజెంది లక్షలకొలది జనులను ఆహుతిజేయుచున్నది.

ఈ విప్లవముపశమించి శాంతి వాతావరణము కావలెనన్న సహజమానవకల్యాణగుణములగు శాంతము, దయ, పరార్థబుద్ధి, క్షమ, సత్యము, సంతృప్తి మున్నగు సద్గుణములు ప్రబలి చిరస్థాయిగా నుండవలెను.

—శ్రీమతి కృష్ణహాతిసింగు.

★ సంసార సౌఖ్యము

మన పెద్దలలో చాలామందికి యౌవనుల నవీన భావాలు, నూతనాశయాలూ పట్టి ఊసుపోని కబుర్లలాగా కల్లల్లాగా కనపడతాయి. తమ తరువాతి తరంవారంతా ఏదో బ్రహ్మాండమైన వినాశనానికి దారి తీస్తున్నారని వాళ్ల ఊహ. ప్రాచీన నవీనభావ ఘర్షణకి వాళ్లు తట్టుకోలేరు. ఇంక పిన్నలు, తమ దృక్పథాన్ని తమ పెద్దలకు నచ్చజెప్పలేక తమ దారిని తాము పోతారు. ప్రపంచజ్ఞానం వుంటే సులువుగా దాటగలిగే ఆపత్తులుకూడా పెంకితనంచేత తెచ్చుకుంటూ వుంటారు.

తల్లులు కూతుళ్లను అర్ధం చేసుకోలేరు. తండ్రులు కొడుకులని అర్థం చేసుకోలేరు. సరే, అత్తాకోడళ్ల సమస్య అనాదిగావున్న బ్రహ్మాండమైన సమస్యే. ఎవళ్లో ఒకళ్లు ఓ మెట్టుదిగి రెండోవాళ్ల ఉద్దేశం యేమిటో తెలుసుకోడానికి ప్రయత్నిస్తే బాగుండును.

పెద్దవాళ్లు తరుచుగా వాళ్లు తమ చిన్నతనంలో తమ అత్తగారివల్లగాని ఓ పినతల్లివల్లగాని లేదా ఇంట్లోవుండివున్న యే ముసలమ్మవల్లగాని తాను అనుభవించిన కష్టపరంపరలు ఏకరువు పెడుతూ వుంటారు. కాని మళ్లీ తన పిల్లలనీ కోడళ్లనీ తాను పడిన కష్టాలలాంటి వాటికే పాలుచేస్తూ తనతోడి వాళ్లతోటి వాళ్లమీద నేరాలు చెబుతారు.

ముఖ్యంగా మనదేశంలో యీ బాధలన్నిటికీ ప్రధానకారణం తమ సంసారం తప్ప బాహ్యప్రపంచంతోటి యే విధమైన సంబంధంలేక స్త్రీల జీవితాలు నిజంగా శుష్కప్రాయాలు అయిపోవడమే. తన కుమారుడి వద్దవున్న తల్లి ఆ సంసారంలో తన కోడలికంటే తనకే యెక్కువ అధికారంవుండాలనుకుంటుంది. నవమాసాలు మోసి కష్టపడికని, మలమూత్రాలకి రోతపడకుండా నానాబాధలుపడి, వాళ్లని పెంచినందుకు పిల్లలు తనకి ఋణపడివున్నారనీ, కృతజ్ఞులై వుండాలనీ నమ్ముతుంది. ఇది కేవలం హాస్యాస్పదం. మన పిల్లలు మనకేమీ ఋణపడిలేరు. పిల్లల కోరికమీద మనం వాళ్లని కనడంలేదు. ఇంక వాళ్లు మనకెందుకు కృతజ్ఞులైవుండాలి? యెందుకు ఋణపడివుండాలి? వాళ్లనీ ప్రపంచంలో పడేసినందుకు వాళ్లని జాగ్రత్తగా కాపాడి వాళ్ల యోగక్షేమాలు విచారించడం మనవిధి. పశువులు కూడా తమ శిశువులని ప్రేమిస్తాయి, జాగ్రత్తగా కాపాడుతాయి, పోషిస్తాయి. కాని అవి పెద్దవై తమ పొట్ట తాము పోసుకోగలిగినప్పుడు దేనిదారి దానిదే. ప్రకృతి కల్పించిన విధానం యిది. మానవులకి పశువులకంటె ప్రేమ పాశాలు గట్టివి. అంత సులభంగా తెగిపోవు. అల్లా తెగిపోడం కూడదు కూడాను. అంతమాత్రంచేత పిల్లలు పెరిగి పెద్దవాళ్లయి ప్రత్యేకంగా జీవించడానికి హక్కు కలిగినప్పుడు అది అసహజమైనట్టుగా దానికి ఆటంకాలు యెందుకు కల్పించాలి?

ఏతల్లీ తనకూతురు సంసారంలో కలగజేసుకోవాలని కల్లోకూడ అనుకోదు. అల్లాంటప్పుడు తన కొడుకు సంసారంలో కలగజేసుకోవాలని యెందుకు కాంక్ష? ఇక, తనకొడుకు నిత్యజీవనంలో యే తల్లీ వేలుపెట్టదు. కాని కూతురుచేసే ప్రతిపనికీ ముందుగా తల్లి సెలవుపొందాలి. ఇక కోడలే అయితే చెప్పనే అక్కరలేదు. స్వతంత్రించి యేపనిచేసినా క్షమించరు. ప్రతి స్త్రీకీ తనసంసారం తాను చక్కపెట్టుకోడానికితగ్గ హక్కు, స్వతంత్రం వుండాలి.



తారలు ఏమిచెప్పెదరు

హిందూదేశ సినీమా తారలలో ఉత్తమ శ్రేణికిచెందిన న్యూ థియేటర్సు వారి తారయైన **జమునాదేవి*** ఒక కప్పు టీ వలె సేద దీర్చ గలిగినదీ, ఆనందపర్చ గలిగినదీ, మరొకటి లేదు* అని చెప్పుచున్నది. జమునా దేవి తనఉత్సాహ శక్తుల కాపాడుకొనుటకు యీ పానీయమందలి అమోఘ గుణమైన "సేద దీర్చగల" దను పదమును గూర్చి నొక్కి చెప్పుట గుర్తించ తగియుంది. మీ ప్రియమైన తారననుసరించి ఇండియా టీ ని త్రాగుము.

తారలందరు వాడుచున్నది ఇండియన్ టీ

ఇండియన్ టీ మార్కెట్ ఎక్స్‌పాన్షన్ బోర్డువారిచే ప్రకటించబడింది

I. K. 127 J

రాజా స్నో

మొటిమలను పోనిచ్చి

సౌందర్యమును హెచ్చించును

వెల 0—8—0 అణాలు

"రాజా స్నో" వారివల్ల

రాజా స్నో హేరాయిలు

రాజా స్నో కస్తూరి సోపుకూడ

తయారగుచున్నది

ఇవి మంచి సువాసనగలవి.

Manufacturers:

MANYAM & CO.,

MADRAS & BANGALORE.

గృహలక్ష్మి

ఒక్కొక్క సంవత్సరపు పండ్రెండు సంచికలు కలిపి బైండుచేసిన సంపుటములు. కాలికోబైండు. దిట్టమైన అట్ట. గ్రంథ భాండాగారములకు అలంకారములు. ఒక్కొక్క సంపుటములు కొద్ది కాపీలు మాత్రమే ఉన్నవి. కావున త్వరపడి ఆర్డరు చేయవలెను. ఆలసించిన దొరకనేరవు. తిరిగి అచ్చుపడనేరవు.

వెల సంపుటము ఒక్కటికి రు. 5—0—0 మాత్రము

రైల్వే పార్సెలుగా తెప్పించుకొనుట మంచిది.

గృహలక్ష్మి కార్యాలయము

పోస్టుబాక్సు నెం. 655, రాయపేట, మద్రాసు.

సాధారణంగా పెద్దవాళ్లు ముసలితనం మీద పడిపోతూందని తమ అధైర్యాన్ని వెళ్లబోస్తూవుంటారు. కాలూ, చెయ్యీ్యావంగితే యింక తమకి తిండైనాపెట్టరని వాపోతూవుంటారు. ఉన్నదున్నట్టు గ్రహించాలికాని అల్లా జరిగితే యేమవుతుందో అని ముందే వైమనస్యాలు హెచ్చించడం తగదు.

ఒకప్పుడు తల్లిదండ్రులు కూతురుదగ్గరో, కొడుకుదగ్గరో వుండవలసిన పరిస్థితులు వస్తూవుంటాయి. అప్పుడు ఇతరులు తన్ను నిర్లక్ష్యంచేస్తున్నారనీ, సరిగ్గా చూడడంలేదనీ అనుకోడంవల్లనే యెక్కువ బాధలు కలుగుతుంటాయి. పెద్దవాళ్లు సంసారపుగొడవలు వదిలేసి సంఘసేవకాని మరో కాలక్షేపం కాని పెట్టుకొంటే చాలా సమస్యలు పరిష్కారం అయిపోతాయి. చేసేవాళ్లుంటే ఇంకా బోలెడంత వుంది సంఘసేవా క్షేత్రంలో. సంసారంలో సుఖ శాంతులు తాండవించడానికి యిదే సూత్రం.

"మన హాయామ వెళ్లిపోయాక మనపిల్లల హయామువస్తుంది. ప్రతివాళ్లూకూడా తమ జీవితంలో ఒకమాటు కొంతకాలం స్వేచ్ఛానందాలు అనుభవించాలి. మనకి వాళ్లజీవితంలో వేలు పెట్టడానికి అధికారంలేదు" అనేభావాన్ని పెంపొందించుకుంటే సంసారం తప్పకుండా యింకా ఎంతో సుఖతరంగా వుంటుంది. మనమే ఎప్పుడూ అగ్రేసరులమై వుండాలంటే యెవరికీ సాధ్యంకాదు.

—శ్రీమతి కృష్ణహాతిసింగు, (అనువాదం: వినోది.)

★ మన కర్తవ్యము

ఇప్పుడు మనముకూడిన పఠనమందిరమున ముఖ్యముగ మనము నేర్చుకొనవలసినది భాషాజ్ఞానము ప్రపంచజ్ఞానము మాత్రమేగాక సహనము, శాంతి, ఓర్పు సంఘీభావములు అయివున్నవి. రెండు కొప్పులుకూడుచోట కలహప్రియుడు తాండవమాడుచూ అసూయాద్వేషములను పురిగొల్పునను పురుషులలో గల నిరసనభావమును నిర్మూలింపజేయు బాధ్యత మనయందున్నది. స్త్రీ సరస్వతి, పూజ్యరాలు స్త్రీసంకల్పము సహాయములేనిది పురుషుడు వ్యర్థుడు అను విశాలభావములను మనదేశమున స్థాపితము చేయుటకొరకు మనమే కర్తలము కావలయును. స్త్రీ పురుషునిపై ఆధారపడవలసిన బొమ్మయని, నిరాధారియని చిన్నపుడు తల్లితండ్రులవలన, సోదరులవలన, ఆదరిమిలా భర్తవలన మనము పోషింపబడి వారి ఆధారముపైననే వుండవలసిన వ్యక్తియని చెప్పు సాహసపు మాటలను నిరాధారములని చూపవలసిన బాధ్యత స్త్రీలయందుగలదు. తన్నుతాను అభివృద్ధిపరచుకొన సాహసింపక మరియొకరిపై ఆధారపడవలసి ఉండు కర్మము తనదని స్త్రీ తలచునంతకాలము ఆమెకు కర్మవిముక్తిలేదు. నేనే సరస్వతిని, నేనే ధీశాలిని, నేనే వీరమాతను, నేనే మహాకాళిని, నేనే సర్వమంగళను, ఆదిస్వరూపిణిని; సృష్టికర్తను అని స్త్రీ తలంచుచో ఆమెకు ఏదియూ అడ్డురాజాలదు. అందుకనే రాట్నచక్రము చేధరించిన దేశవిముక్తికి లోకకల్యాణమునకు ఆటంకములుండజాలవని శ్రీ గాంధిమహాత్ములవారు భేరీ మ్రోగించుచూ శంఖారావము చేయుచున్నారు. ఈ పురుషోత్తముని మహత్తరవాక్కుకు చెవియొగ్గి రాట్నపూజ చేయుభారము వహింప యీ పఠనమందిర సభ్యురాండ్రను వేడుచున్నాను.

—శ్రీమతి తుర్లపాటి రాజేశ్వరమ్మగారు,

శ్రీ మహాలక్ష్మీ పఠనమందిర అష్టమ వార్షికోత్సవంలో.



గోధుమలతో తయారుచేయదగిన వివిధ పదార్థములు—7.

గోధుమ అప్పడములు

$\frac{1}{2}$ వీశ గోధుమపిండిలో $\frac{1}{2}$ తులం కారం కొంచం వుప్పు, ఇంగువ వేసి నీటితో గట్టిగ కలుపవలెను. 2 గంటలు నాననిచ్చి వుండలుచేసి అప్పడాలు వత్తి ఎండపెట్టి నేతిలో వేయించవలెను.

పూనాఘవర్స

$\frac{1}{4}$ వీశ గోధుమపిండి నీటితో గట్టిగకలిపి 1 తులం నెయ్యివేసి బాగా మర్దించి చిన్నవుండలుచేసి దళసరిగా వత్తి నేతిలో వేయించుకొనవలెను. పంచదార లేతపాకంపట్టి ఒక కొబ్బరికాయ కోరివేయించి, ఏలకపొడి, 4 ఫలముల జీడిపప్పు నేతితోవేయించి పాకంలోవేసి, వేగిన బిళ్లలుకూడ వేసి కలుపవలెను.

గోధుమ సున్ని

అరపడి గోధుమలు వేయించి కొంచం మెత్తగ విసరవలెను. 1 ఆశాను శనగపప్పు వేయించి మెత్తగ విసిరి గోధుమపిండిలో కలుపవలెను. అరపడి పంచదార పిండిలో పోసి 3 ఆశానుల నెయ్యి సలసల కాచి పోసి అన్నికలిపి వుండలు చేయవలెను.

వినోదాలు

ఒక కొబ్బరికాయ కోరి $\frac{1}{2}$ శేరు బెల్లంవేసి పొయిమీద 15 నిమిషములు కలుపుతూ వుంచి దింపి వుండలు చేయవలెను. 1 ఆశాను గోధుమపిండి, $\frac{1}{2}$ ఆశాను శనగపిండి నీటితో చిక్కగ కలపి వుండలుచేసి పిండిలోముంచి చమురులో వేసి వేయించి తీయవలెను.

కొబ్బరి హల్వా

$\frac{1}{2}$ శేరు పాలు మరగనిచ్చి 1 ఆశాను రవవేయించి వేయవలెను. దానిలో 2 ఫలములు జీడిపప్పు 1 ఫలం బాదంపప్పు 1 ఆశాను పంచదార 1 ఆశాను నెయ్యి ఏలకపొడివేసి బాగా కలిపి పళ్లెంలో పోయవలెను, 1 కొబ్బరిచిప్ప కోరి వేయించి పైన చల్లవలెను.

రవకంకణములు

½ శేరు నీరు సలసలకాగిన తరువాత ¼ శేరు గోధుమపిండి ¼ తులం వుప్పు 1 ఆళాకు రవ ½ ఆళాకు పెసరపప్పు వేసి 10 నిమిషములు పొయిమీదవుంచి దింపవలెను. 1 స్పూన్ జీలకఱ్ఱవేసి కలిపి, పీటమీద కంకణములు చేసి వెడల్పు పాత్రలో నెయ్యి మరగించి కంకణములు వేయించి తీయవలెను.

రవమిఠాయి

¼ శేరు గోధుమరవ నేతితో వేయించి, 1 కొబ్బరికాయ కోరివేయించి, 1 పంపు జీడిపప్పు, ½ పంపు కిస్‌మిస్, ఏలకపొడి కొంచెం, 1 శేరు పంచదార పాకంపట్టి దానిలో వేసి, 1 పంపు నెయ్యికాచి పోసి వుండలు చేయవలెను.

గోధుమ వడలు

పావు శేరు శనగపప్పు నాననిచ్చి రుబ్బి 1 పంపు గోధుమపిండి, 2 ఫలముల నీరుల్లి ముక్కలు, 1 తులం అల్లంముక్కలు ½ తులం పచ్చిమిరప ముక్కలు 1 తులం ఉప్పు అన్నిటిని కలిపి బిళ్లలుచేసి నూనెలో వేయించవలెను.

తైర్ వడ

1 శేరు పెరుగులో తగినవుప్పు, పసుపువేసి 1 కొబ్బరిచిప్పకోరి కలిపి, ఆవాలు మెంతులు ఇంగువ, కర్వేపాకు, అల్లం పచ్చిమిరప ముక్కలు, ఎండు మిరపముక్కలు వేయించి పెరుగులో కలుపవలెను. ½ శేరు మినపపప్పు నాననిచ్చి రుబ్బి, 1 తులం వుప్పు, 1 పంపు గోధుమరవకలిపి వడలుచేసి నూనిలో వేయించి పెరుగులో వేయవలెను.

బీరకాయి బజ్జీ

పంపు గోధుమపిండి, ½ పంపు శనగపిండి తగువుప్పు, కారం, జీలకఱ్ఱ, కొంచెంసోడావేసి, చిక్కగ కలపి బీరకాయి పల్చగాతరిగి పిండిలోముంచి చమురులో వేయించి తీయవలెను.

గోధుమ పాలకాయిలు

పావు శేరు గోధుమపిండి, పావు శేరు వరిపిండి, అరతులం ఉప్పు, ¼ తులం వాము వేసి నీటితో గట్టిగ కలిపి చిన్న వుండలు చేసి నేతిలో వేయించవలెను.

—సి. హెచ్. అన్నపూర్ణాబాయి.

బంగారుపతకం బహుమానం

గోధుమ ధాన్యముతో చేయదగిన పలువిధములైన పదార్థములను, గత సంచికల లోని ఆరు పట్టీలయందు ప్రకటింపబడినవి గాక, ఎక్కువ పదార్థములను వ్రాసి పంపినవారికి ఒక 'బంగారుపతకము' బహూకరింపబడును. వెనుక గృహలక్ష్మిలో ప్రకటింపబడిన వాటినిగూడ ఎత్తివ్రాయగూడదు.

సంపాదకుడు.

గ్రంథ సమీక్ష

అణా గ్రంథమాలవారి ప్రచురణములు

చిరునామా :—3691 బి. తూర్పుబజారు, హైద్రాబాదు, దక్కను.

హైద్రాబాదు రాజ్యాంగ సంస్కరణలు, అణాకథలు, స్వామి దయానంద సరస్వతి, వినాయక్ దామోదర్ సావర్కర్, కాంగ్రెసు చరిత్ర-ఒకటిరెండు భాగములు, జాగీరులు, పండిత జవహర్లాలు నెహ్రూ.

సుమారు 40 పేజీలు కలిగిన ఒక్కొక్కపుస్తకం ఒక్కొక్క విశిష్ఠతకలిగి వుంది. ప్రసిద్ధ రచయితలు శ్రీయుతులు వెల్లుర్తి మాణిక్యరావు, కాలోజీ నారాయణరావు, యన్. కె. రావు, కె. రంగదాసు, జానపాటి సత్యనారాయణ, ఉమ్మెంతల కేశవరావు, సురవరం ప్రతాపరెడ్డిగార్ల రచనలు యీ ప్రచురణలలోవున్నాయి. విజ్ఞాన ప్రభోధానికి ఉత్కృష్ట విషయాలను క్లుప్తంగా రచించి, పండిత పామరులందరికి అందుబాటులో వుండేటట్టు అణా ఖరీదుకే అందజేస్తూవున్న యీ గ్రంథమాలదారి ప్రయత్నం సంస్తవనీయంగా వుంది. హైద్రాబాదు ఆంధ్రసోదరులలో యీ ప్రచురణలు విరివిగా ఆదరణను పొందుతాయనడం అతిశయోక్తికాదు.

రెండో ప్రపంచ యుద్ధమా? (రెండవ భాగము)

ఆంధ్రకేసరి గ్రంథమాలవారి మూడవ ప్రచురణము. వెల ఆరు అణాలు. చిరునామా: 178, సుల్తాన్‌బజారు, హైద్రాబాదు, (ద)

మొదటి భాగంలో సమాప్తి చెందిన మ్యూనిక్ పాక్టు తర్వాత చరిత్ర, జర్మనీ ఫ్రాన్సు నాక్రమించడం వరకు యీ భాగంలోవుంది. రచనమాంచి బిగువుగా, సులభమైన శైలిలో మొదటి దానివలెనే చక్కగావుంది. ప్రస్తుతం సర్వప్రపంచాన్ని తల్లడిల్లజేస్తూవున్న నేటి యుద్ధ పరిస్థితులు తెలుసుకోవడానికి యీ రెండుభాగాలు తప్పక చదివితీరాలి. పుస్తకంలోని విషయాలను వివరించే 'మేపులు' కూడా కొన్నివుంటే ఇంకా చక్కగా వుండేది. అత్యంతోపయుక్తమైన యీ రెండు భాగాలను చక్కని శైలిలో రచించిన గ్రంధకర్త నామము ప్రకటింపకపోవడం శోచినీయంగావుంది—

అంజలి

సాధనసమితివారి 'ప్రత్యూష' ప్రచురణము. చిరునామా: సాధనసమితి, సికింద్రాబాదు, దక్కను. వెల తెలియదు—

శ్రీయుతులు బూర్గుల రంగనాధరావు, పిల్లలమర్రి వేంకట హనుమంతరావు, భాగి నారాయణమూర్తి మొదలగు సుప్రసిద్ధ రచయితలయొక్క గేయాలు "నా రాణి", 'దివ్యగీతి' మొదలైన మకుటా

లలో యిందులో వున్నాయి. భావబంధురమై, భావవీధుల్లో విహరింపజేసే చక్కని గీతికలుకలిగిన యీ సంపుటి సమితి సభ్యులయొక్క నవ్యకళోపాసనకి ప్రబల నిదర్శనంగావుంది.

పరీక్షచదువు

కర్త: శ్రీ భాగి నారాయణమూర్తి ఇదీ "ప్రత్యూష" ప్రచురణమే. వెల పావలా.

"పరీక్షచదువు", "పరీక్షలపుడు", "పరీక్షల తరవాత"అనే మూడు భాగాలుగా రచింపబడ్డ నాటికల సంపుటి ఇది. విద్యార్థులయొక్క మనో ప్రవృత్తులను వ్యంగ్యంగా చిత్రించారు కవిగారు. ప్రతీ విద్యార్థి చదవ తగ్గది.

గాంధి మహాత్ముడు (మొదటి, రెండవ భాగములు)

కర్త: "విష్ణుచక్రం". శ్రీ దేశోద్ధారక గ్రంథమాల, హైద్రాబాదువారి 9, 10-వ ప్రచురణములు. వెల ఒక్కొక్కటి ఆరు అణాలు.

ఈ రెండు పుస్తకాల్లోనూ మహాత్మునియొక్క జీవితచరిత్రకంటె ఆయన సిద్ధాంతములయొక్క వివరణకే ఎక్కువ ప్రాధాన్యత ఈయబడింది. యుగపురుషుడైన మహాత్ముని ఆశయ, సిద్ధాంతాలను గురించి ఎంత చర్చించినా వెలితివుంటూనే వుంటుంది. అయినా గ్రంథకర్తగారు వారి ప్రయత్నంలో జయం పొందారనే చెప్పవచ్చు.

తెనుగుతల్లి

కర్త: శ్రీ వేదాంతం వేంకట సుబ్రహ్మణ్యశాస్త్రి. చిరునామా మహారాజశ్రీ బుక్ సెల్లర్సు, గవర్నరుపేట, బెజవాడ. వెల రూపాయి.

ఇది ఒక నూత్న సాంఘిక నాటకము. నాటకంలో కథావస్తువు చాలా పేలవంగావుంది. ఎవరెవరో ప్రత్యేక వ్యక్తులను దృష్టిలో పెట్టుకుని వ్రాసినట్టు ఆమూలాంతం కనపడుతుంది. ఇంతకన్న చక్కని కథావస్తువు తీసుకొని రచనసాగిస్తే కవిగారు మంచి నాటకాలు ప్రసాదించగలరు.

సూర్యసాముద్రికము

గ్రంథకర్త: జ్యోతుల సూర్యనారాయణమూర్తిగారు, కాకినాడ. 1/8 డెమ్మిసైజు 325 పుటలు. చక్కనిబైండు - వెల 3—0—0

గ్రంథకర్తగారు పెక్కు హైందవ, పాశ్చాత్యగ్రంథములలోని విషయములను ఒక్కటిగాచేర్చి 550 చిత్ర పటములతో పఠించువారికి గ్రాహ్యమగునటుల సులభశైలిలో నీ గ్రంథము వ్రాసియున్నారు. కాని వారి అనుభవ విషయములనుకూడ నిందులో చేర్చియుండిన మరింత వన్నెతెచ్చియుండును. హస్త సాష్టవ భాగము, హస్త రేఖాభాగమని రెండు భాగములుగా నీ గ్రంథము విభజింపబడి యున్నవి. మొదటిభాగము నందు హస్తపరిణామము, హస్తపరిమాణము, అరచేయి, గోళ్లు, వేళ్లు, గ్రహములు, త్రిభుజము, చతుష్కోణము వర్ణింపబడినది. రెండవభాగమునందు ప్రధానరేఖలు, వైవాహికరేఖ, సంతానరేఖ, శుక్రచాపము మణిబంధ రేఖలు, చిహ్నములు చక్కగా వర్ణింపబడినది గావున సాముద్రిక శాస్త్రమును నేర్చుకొనువారికిని నేర్చుకొనిన వారికిని మిక్కిలి ఉపయోగకారిగా నుండును. ఆంధ్రములో నిట్టి పెద్దగ్రంథము లేని లోటును పోగొట్టి గ్రంథకర్తగారు ఆంధ్రులమన్ననలకు పాత్రులైనారు.

యుద్ధరంగము

- మధ్యధరాలో యుద్ధము
- గ్రీసులో జర్మనీ ప్రవేశమా?
- అమెరికా నిశ్చయము
- జపాన్ బెదరింపు

— అరుంధతి —

అమెరికా సంయుక్తరాష్ట్రములు బ్రిటనుకు ఆయుధసంపత్తి నిచ్చి, బ్రిటనుకు సహాయముచేయుటకు నిశ్చయించుకొనినప్పటినుండియు, ఆక్సిసు రాజ్యములు జర్మనీ - ఇటలీ - జపాన్‌లు ఈ యుపద్రవము తీవ్రముకాకపూర్వమే యుద్ధమును కొంతవర కనుకూలమొనర్చుటకు పటుప్రయత్నములను కావించుచున్నవి. తదనుగుణ్యముగ పెటియన్ సేనాని ప్రతికూలవైఖరి మాని, అనుకూలుడగుట వీరికి చింత దక్కి బలము సమకూడినది. పెటియన్ తాను పదచ్యుతుని కావించిన లావెల్‌ను తిరిగి విచీ మంత్రివర్గమున చేర్చుకొనబోవుచున్నాడు. జర్మను పక్షపాతియైన లావల్ విచీ మంత్రివర్గమందున్నంతవరకు జర్మనీకి ఎట్టి భయమును కలుగదు. అందువలన భవిషత్కార్యక్రమ నిర్ణయమునకై హిట్లరు - ముసోలినీలు సమావేశమైనారు. వారేమి నిర్ణయించుకొనినదియును ఇంతవరకు తెలియలేదు. కాని భవిష్యత్ సంఘటనలబట్టి ఇది చాలవరకు తెలియబడగలదు.

మధ్యధరా సముద్రములో యుద్ధము

ఇటు మధ్యధరాప్రాంత రంగములలో పరాజయ పరంపరల నందుచున్న ఇటలీకి సహాయపడుటకై జర్మను సేనలు విరివిగ వచ్చి సిసిలీద్వీపము నాక్రమించినవి. ఇదియేగాక సిసిలీ జలసంధికి తూర్పువైపున నున్న పంటకేరియా ద్వీపమందుకూడ జర్మను బలములు ప్రవేశించి విమానాశ్రయములను, రేవులను ఆయత్తపరచుచున్నవి.

గ్రీసుకు బ్రిటను సహాయార్థమై పంపు ఆయుధసామగ్రి యంతయు యీ సిసిలీ జలసంధిగుండా పోవలసియున్నది. ఇంతకుపూర్వము ఇటలీ ఎన్నడును అట్టి బ్రిటిషు నావలను ఎదుర్కొనియుండలేదు. కాని జర్మను రాకతో ఇదియంతయు తారుమారైనది. బ్రిటనునుండి గ్రీసు రంగమునకు ఆయుధములు కొనిపోవు నౌకలపై, సిసిలీనుండి జర్మను-ఇటాలియను విమానములు వచ్చి తీవ్రముగ ఎదిర్చినవి. జర్మను - ఇటాలియను విమానములు 12 పడగొట్టబడినను, ఆయుధనౌకలు తప్పించుకొని పోగలిగినను "సౌథాంప్టన్" అను బ్రిటిషు యుద్ధనౌక, "ఇలస్ట్రియస్" అను విమాన యుద్ధనౌకయు చాలవరకు శిథిలమైనవి. కొన్నిమాత్రము మాల్టా రేవునకు చేరినవి గాని అచ్చటకుకూడ జర్మను విమానములు వచ్చి బాంబులు వేసినవి.

దీనివలన మధ్యధరాసముద్రములో బ్రిటిషు నౌకలు పూర్వమువలె నిరపాయముగ ప్రయాణము చేయ వీలులేదని స్పష్టమైనది.

ఇటలీ గ్రీసుపై దండెత్తినప్పటినుండియు ఇంతవరకు ఒకచోటనైనను విజయముపొంది ఎరుగదు. గ్రీసు సైన్యములు ప్రతిదినము ఒక్కొక్క క్రొత్తమార్గము నాక్రమించుచునే యున్నవి. ఈ రంగమందు ఇటలీ సర్వసేనానియైన బడొగ్లియోను తొలగించి సొడ్డూ అనునాతని నియమించగా, అతడుగూడ తన పదవికి రాజీనామా నిచ్చియున్నాడు. ఇప్పుడు ఇటాలియను ప్రధాన సేనానియైన కెబల్లెరో ఆ స్థానమున నియమింపబడినాడు. ఈ మార్పులవలన గ్రీసు రంగమందు ఇటలీవారికి ఆశావహముగ లేదని కన్పట్టుచున్నది.

● గ్రీసులో జర్మనీ ప్రవేశమా ?

ఇప్పుడు మధ్యధరాసముద్రమున బ్రిటిషు నౌకలకు జర్మను విమానములు కల్గించుచున్న అంతరాయములవలన గ్రీసు రంగంలో ఇటలీకి జయము లభింపకపోయిన, జర్మనీ ఆ రంగమున ప్రవేశింపక తప్పదు. ఇప్పుడు ఇటలీలో కేంద్రీకరింపబడిన జర్మను సైన్యమంతయును బల్గేరియామీదుగ గ్రీసు రంగమున ప్రవేశింపవచ్చును. తటస్థరాజ్యములైన, బల్గేరియా, రుమేనియా సరిహద్దులలో జర్మను సైన్యములు 2 లక్షల వరకును అప్పుడే చేరియున్నవి. బల్గేరియా, రష్యా ఏమియు చేయకుండుట జూచి తన తాటస్థ్యమును విఘ్నమొనరించుకొనినది. బల్గేరియా ప్రధానమంత్రి రిబ్బనుట్రాపుతో యీ విషయమై ఆలోచనలు జరుపుచున్నాడు.

బల్గేరియామీదుగ గాని, యుగోస్లేవియామీదుగ గాని జర్మను సైన్యములను నడిపించిన బాల్కను రాష్ట్రములన్నియు కలసి ప్రతిఘటించునని టర్కీ తెలియజేసినది. దీనిని నిరోధించుటకు బ్రిటనుతో టర్కీ రాయబారములను జరుపనున్నది. ఇది కొనసాగినచో బాల్కను రాజ్యములలోగూడ జర్మనీ చిచ్చు ముట్టించినదని చెప్పవచ్చును.

ఇటు దక్షిణమున ఆఫ్రికాలో లిబియారంగమున ఇటాలియనులకు గ్రేజియానీ నాయకత్వముక్రింద ఏవిధమైన విజయము లభించలేదు. ఈ సైన్యములకు ఇటలీనుండి ఆహారముల సప్లై కూడ వచ్చుచుండుటలేదు. టొబ్రూకు దుర్గమును బ్రిటిషు సైన్యములు శతఘ్నులతోను, బాంబులతోను శిధిలము చేయుచున్నవి. బర్డియా వలె నిదికూడ బ్రిటిషు సైన్యములకు కొలదికాలములో లొంగిపోక తప్పదు. కాని జర్మను విమానములు ఆహారమును, సైన్యమును ఇచ్చట దింపగలిగినను, ఇప్పటికి 3 లక్షలవరకు అచట చేరియున్న బ్రిటిషు సైన్యముముందు ఇది నిల్చుట అసాధ్యము.

● అమెరికా నిశ్చయము

బ్రిటనుకు ఆయుధములను సరఫరాచేసి బ్రిటను పక్షమున యుద్ధమున ప్రవేశించుటకై రూజువెల్టు సభాపతి తెచ్చిన చట్టమునకు అన్ని పార్టీలును సుముఖత్వమును జూపినవి. కాని బ్రిటనుకు సహాయము చేయుచు, తాను ఆత్మ సంరక్షణచేసికొనుచు, దక్షిణ అమెరికావద్దను, తదితరచోట్లను తనకున్న దీవులను కాపాడుకొనుటకుగాను ఆయుధములు విరివిగ కావలసియున్నవి. వీటి నన్నిటిని శీఘ్రగమనములో ఉత్పత్తి చేసుకొనినగాని అమెరికా నిరపాయగ నుండజాలదు. ఇందుకొరకు అమెరికా పూర్తిగ యుద్ధమందు కాలిడుటకు ఇంకను రెండు మూడు మాసములు పట్టును.

ఈ విషయమునే యునైటెడ్ స్టేట్సు కార్యదర్శి స్టిమ్సనుగారు 60, 90 రోజులలో ఐరోపాలో విషమస్థితి ఏర్పడుననియు, సెనెటరు వీలరుగారు ఏప్రెల్ మాసములోగా బ్రిటను తరఫున అమెరికా యుద్ధమున దిగునని అనుకొనుచున్నారనియు యిటీవల చర్చలలో తెల్పియున్నారు.

ఈ వ్యవధిలో జర్మనీకూడ ఆక్రమిత దేశములలోని ఉక్కు, బొగ్గు, ముడిపదార్థములను పోగుచేసి క్రొత్త యంత్ర నిర్మాణమునకు ఆయత్తపడుచున్నది.

● జపాన్ బెదరింపు

యునైటెడ్ స్టేట్సుయొక్క యీ ప్రవర్తనమునకు జపాన్ ప్రభుత్వము భయపడుచున్నది. అందువలన కోనోయి ప్రధాని, రాజకీయ, కార్మిక, పారిశ్రామిక వర్గముల నాయకులనందరిని సమావేశపరచి దేశములో వివిధసంఘములను రద్దుచేసి 'దేశసేవాసంఘములను' ఏర్పరచి ఆసియాఖండములో తమ ప్రాబల్య

మును స్థిరస్థాయి చేసుకొనవలయునని హెచ్చరించియున్నాడు. ఇందువలన దూర ప్రాచ్యమునగూడ త్వరలో అమెరికా, జపాన్ ఘర్షణ ప్రారంభమగునని స్పష్టమగుచున్నది.

కాని రష్యాతో నిరాక్రమణ ఒడంబడిక కుదురకుండుటవలనను, చైనాయుద్ధమందు విశ్రాంతి లభింపకుండుటవలనను జపాను ఇంకను గట్టి నిర్ణయమునకు రాజాలకున్నది.

చైనా ప్రజలలో విచ్ఛేదముల కల్గింప జపాను ఇదివరకునుండియు చేయుచున్న ప్రయత్నము కలిసివచ్చుటకే యనునట్లు చంగ్-కై-షేక్ సైన్యములలో చంగ్ సైన్యములకును, కమింగుటాంగ పక్షపువారికిని మనస్పర్ధలు ఎక్కువగుచున్నవి. కమ్యూనిస్టు సైన్యములను ఇంకొకచోటికి పంపినగాని సేనానాయకులు ఉత్తరవుల పాలించుటకు నిరాకరించిరి. అందువలన యీ విభేదముల నణచుటకు చంగ్-కై-షేక్ ఆకమ్యూనిస్టు నాయకుల నరస్టుచేయించక తప్పినదిగాదు.

ఈ విభేదములు ప్రబలముకాకున్న చైనా జపాన్‌కు లొంగిపోవుట సంశయాస్పదము. జపాన్ ముందుగ యీ విషయములను అనుకూలము చేసికొనుటకు తీవ్రప్రయత్నము చేయుచున్నది.

ఏది ఎటులున్నను యీ సంవత్సరారంభమున నూతన సంవత్సర సందేశములలో సార్వభౌముడు కొలదికాలములోనే బ్రిటన్‌కు విజయము తప్పదని చెప్పియున్నాడు. చర్చిలుప్రధాని 1943 వరకును యుద్ధము సాగవలసియుండునని తెల్పియున్నాడు. హిట్లరుగూడ తన జర్మనుప్రజలకు సందేశమొసగుచు యీసంవత్సరము తమకు సంపూర్ణ విజయము లభించునని వాగ్దానము చేసియున్నాడు. కాలగర్భమున నేమియున్నదో చెప్పజాలము గాని, యీ సంవత్సరము, పూర్వముకంటె పరిస్థితులు విషమించి దారుణముగ పరిణమించి, ప్రపంచమునకు చాల ఉపద్రవకరమగు సంఘటనల దెచ్చునని చెప్పకతప్పదు. (27-1-1941)

పత్రికా పరిచయము

వాణి - పక్షపత్రిక

సంపాదకులు శ్రీ యం. వి. నాథంగారు, లాయడ్సురోడ్డు, రాయపేట, మదరాసు. సంవత్సరం చందా రు. 1-4-0లు, విడిపత్రిక ఒకఅణా.

ప్రథమసంపుటం, ప్రథమసంచిక మాకార్యాలయంచేరింది. సుప్రసిద్ధుల వ్యాసాలతోటి, చక్కని చిత్రాలతోటి, "వాణి" ఇటీవల క్రొత్తగావెలువడిన పత్రికలలో 'రాణి' లావుంది.

శ్రీ ఆండ్ర శేషగిరిరావుగారి "ఔరంగజేబు పాదుకలకు పట్టాభిషేక ప్రాయచిత్తము", శ్రీ లింగమూర్తిగారి "తారగదిలో చంద్రుడు" మొదలైన వ్యాసాలు చాలా హృదయంగమంగా వున్నాయి. సుప్రసిద్ధ వ్యంగ్యచిత్రకారులు శ్రీ తలిసెట్టి రామారావుగారి "లోభి కారుకొంటే" అనే వ్యంగ్యచిత్రం పత్రికకు ఒకప్రత్యేకత నిచ్చింది.

ముచ్చటైన ముఖచిత్రంతో చక్కని వ్యాసములతోటి ఉత్తమతరగతికిచెందిన యీపత్రిక ఆంధ్ర మహాశయుల ఆదరాన్ని అమితంగా అందుకుంటుందని ఆశిస్తాము.

కాగడా—'జన్మదిన సంచిక'

సుప్రసిద్ధ పత్రికానిర్వాహకులు శ్రీ తాపీ ధర్మారావుగారి సంపాదకత్వంలో వెలువడుతూన్న కాగడా తన దివ్యకాంతులను దేశమంతటా దేదీప్యమానంగా ప్రసరించింది.

మొదటిసంవత్సరం పూర్తిలో వెలువడిన యీ జన్మదినసంచిక చాలా చక్కగావుంది. ప్రసిద్ధ వ్యాసాలేకాక, సుప్రసిద్ధాంధ్ర చిత్రకారులు శ్రీ చేమకూరవారి చిత్రాలు యీ సంచికకు నూత్నశోభ నిచ్చాయి. తీవ్రమైన విమర్శనలతోటి, బుద్ధికి చురుకునిచ్చే కథలతోటి, "కాగడాకు వెలుతురేగాదు, వేడికూడా వుందోయ్" అనిపిస్తోంది. అందరూ ముఖ్యంగా చదవదగ్గది—

సంపాదకీయములు

వారసత్వపు చట్టము

"హిందూస్త్రీల ఆస్థిహక్కుల"ను గురించి గత నవంబరు మాసమున జరిగిన భారత శాసనసభయందు శ్రీ అఖిలచంద్ర దత్తాగారి బిల్లు ప్రతిపాదనపై శ్రీయుతులు దేశముఖ్, గాడ్గిల్, సంతానం, ఛటోపాధ్యాయ ప్రభృతుల తీవ్రాందోళన ఫలితముగ ప్రభుత్వము ఈ బిల్లులను చర్చించుటకు ఉపసంఘమును నియమించినది. ఇది శుభసూచకము—

ఆస్థి హక్కుయందు పురుషులకే ప్రాధాన్యతగలిగి, పూర్వకాలము నుండియు వచ్చుచున్న యీ యాచారము 1937 సంవత్సరపు ప్రభుత్వచట్టముచే కొన్ని కొన్ని హక్కులు స్త్రీలకు లభ్యమైనవి. కాని వారసత్వపు హక్కు సందర్భమున యీ చట్టము స్త్రీలకు పూర్తిగ నుపకారికాజాలక పోయినది.

తిరిగి నాటినుండియు యీ చట్టమును సవరించుటకై ప్రతిపాదనలు జరుగుచునే యున్నవి. కాని మహిళా సంఘముల తీవ్రాందోళనము వలనను, శాసనసభ్యుల దీక్షవలనను నేటికిది ఒక ఆకారమును పొందనున్నది.

సమరసమైన సమాజ నిర్మాణము నేడొకక్లిష్ట సమస్యయైనది. ఇందు ఆర్థికవ్యవస్థ ప్రధానస్థానమునాక్రమించియున్నది. స్త్రీ పురుషులకు సంఘజీవనమున సమాన స్థానములు సంస్థాపన జేయవలసియున్న నేటి పరిస్థితులలో పుత్రులకును, పుత్రికలకును వ్యత్యాసమును నిర్మించు ఆచారములకు స్థానముండజాలదు.

ప్రాతపద్ధతులమాట ఎట్లున్నను నేడు తల్లిదండ్రుల దృష్టిలో స్త్రీ పురుష సంతానమునకు సమానమైన న్యాయము జరుగుటలేదు.

ఆస్థి హక్కు విషయముననే కాక విద్యావిషయమున గూడ స్త్రీలకు 'చాకలిపద్దు చదువు' మాత్రమే లభ్యమగు చున్నది.

వారసుడైన పుత్రుడు మాత్రమే సంపాదనార్హత కలుగువరకుగాని మరి ఇతర విషయముల కొరకుగాని విద్యను సంపాదించుచున్నాడు.

స్త్రీ మాత్ర మిట్లుగాక, విద్యావిహీనయై, ఆర్థిక పరాధీనయై, స్వశక్తి నిరోధయై పురుషుని దయాధర్మ వీక్షణముల కఱ్ఱుల చాచుచున్నది.

తల్లిదండ్రుల సంతానములో హెచ్చులొచ్చులులేని పక్షమున ఈ యన్యాయము ఉపేక్షణీయము గాదు. 'వారసత్వము' అను హక్కు 'తల్లిదండ్రుల ఆస్థి'కి గలదేని పురుషసంతానముకంటె, విద్యాలోపము జరిగిన స్త్రీ సంతానమునకు కొంత ఆర్థికవసతి అధికముగా తప్పక కల్గించవలసియున్నది. ఇది త్రికరణశుద్ధిగ జరుగవలసిన ధర్మము.

ఆర్థికవిషయమునకు జెందిన ఇవన్నియు, యీ వారసత్వపు చట్టమందు చర్చింపబడనుండుట సంతోషింపదగియున్నది.

JNANA SIMHASAN JNANAMANDIR
LIBRARY
Jangamawadi Math, Varanasi
Acc. No. 7699

ఇదియనుగాక 1937 వ సంవత్సరపు చట్టము ప్రకారము వితంతువులకు సంక్రమించిన హక్కులు ఇప్పుడు కూతుళ్లకు సంక్రమింపజేయుటనుగూర్చి యీ యుపసంఘము సలహా నీయబోవుట అభినందనీయమగు విషయము.

ప్రభుత్వముచే నియమింపబడిన యీ యుపసంఘమందు ఒక స్త్రీ సభ్యురాలైన లేదు. స్త్రీల విషయమై చర్చింపబడు ఇట్టి సంఘమందు ఒక స్త్రీ యున్న, ఎట్టి ఆక్షేపణలకు చోటులేని, సర్వ స్త్రీజనామోదమును పొందు ఉత్తమ సలహాలు వచ్చుట కవకాశముండెడిది. ప్రభుత్వ మీవిషయము గమనింపకుండుట శోచనీయము.

ఏది ఎట్లున్నను కలకత్తా ప్రధాన న్యాయమూర్తులైన శ్రీ బి. యన్. రావుగారి అధ్యక్షతను యీ సంఘము ఢిల్లీలో సమావేశమై చర్చించుచున్నది.

మహిళాసంఘముల తీవ్రాందోళన ఫలితముగ ఇట్టి మార్పుకలుగనుండుట సంతసింపదగిన విషయము.

◆ ◆ ◆ ◆

ఆంధ్రభీష్ముని అస్తమయము

'ఆంధ్రభీష్మ' శ్రీ న్యాపతి సుబ్బారావు పంతులుగారు పరమపదించినారు— ఆంధ్రులకు పెద్ద దిక్కు కరవై పోయినది.

ఆంధ్రాభ్యున్నతికేకాక, భారత జాతీయాభ్యున్నతికి కూడ పంతులుగారు పట్టుగొమ్మ. కాంగ్రెసుకు జనరల్ శక్రటరీగ పనిచేసి ఆసేతుశీతనగపర్యంతము సంచారముచేసి కాంగ్రెసుకు అమితముగ ధనసంపత్తిని చేకూర్చి, కాంగ్రెసును బలవంత మొనర్చిన మహానుభావుడు పంతులుగారు.

ఆంధ్రదేశమందు పుట్టి, పెరిగి, వర్ధిల్లిన ఏ యుద్యమమైనను, ఏ సంస్థయైనను వీరి దివ్యహస్తము లేనిది అరుదనిన, శ్రీ పంతులుగారి దేశసేవాసక్తి విదితమగును.

పంతులుగారికి భగవద్గీతయనిన భక్తి, ప్రేమలు మెండు. రాజమండ్రిలో హిందూ సమాజమును కట్టించి అందు గీతా పరీక్షలుపెట్టి బహుమతులిచ్చు నేర్పాటు గావించి, ఆర్యవిజ్ఞాన వ్యాప్తికి పాటుబడిన మహాపురుషుడు పంతులుగారు.

పంతులుగారి నిర్యాణమువలన ఆముష్మికులకొక వేదాంతవేత్త, జిజ్ఞాసువులకొక విజ్ఞానఖని, దేశసేవకులకొక రాజకీయవేత్త, రైతు జనులకొక దీనబాంధవుడు, యువకులకొక కార్యోత్సాహి కరవై పోయినాడు.—

పంతులుగారి స్త్రీ జనసేవ మరువరానిది. రాజమండ్రి వితంతు శరణాలయమునకు వీరొనర్చిన అఖండమైన సేవకు స్త్రీలోకము సర్వదాకృతజ్ఞులై యుందురు.

జీవితములో నిమ్నోన్నతముల నన్నిటిని అనుభవించి, పుష్కలముగ ధనమునార్జించి, చివరవరకును దేశసేవలో నిమగ్నులై ఆంధ్రులలో కార్యోత్సాహమును రగుల్కొల్పిన కర్మవీరుడు పంతులుగారు—ఈ మహామహుని జీవిత విశేషములు ఆంధ్రజాతికేగాక అఖిల భారతజాతికి గూడ వెలుగు రేఖలు—

భారత వీరవీరాంగనలకు భీష్మాచార్యునివలె, ఆంధ్ర వీరవీరాంగనలకు ఆంధ్రభీష్ముడే, ఆ గంగానందనునివలె యీ పూతచరితుడుగూడ ఉత్తరాయణ పవిత్ర దినములు ప్రవేశమైన తర్వాతనే జీవితమును చాలించినాడు—ఆంధ్ర భీష్ముడు భారతభీష్ముడు.—

పంతులుగారి పవిత్రాత్మకు చిరశాంతి కలుగుగాక!

Edited by Dr. K. N. Kesari, Printed and Published by Dr. S. Seshagiri Rao, at the Lodhra Press, 15, Westcott Road, Royapettah, Madras.

REGD. NO.
M-2357

గృహలక్ష్మి

1ST FEBRUARY
1941



GRIHALAKSHMI

VOL. 13

NO. 12

PRICE AS. 4.